శ్రీ రస్తు

# శ్రీదేవీ భాగవతము

మహాకవి దాసు శ్రీరాములు

మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి
హైదరాబాదు
1978

శ్రీరస్తు

# శ్రీ దేవీ భాగవతము

మహాకవి దాసు శ్రీరాములు

మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి
హైదరాబాదు
1978

మొదటి కూర్పు 1907
రెండవ కూర్పు 1928
మూడవ కూర్పు 1978

కాపీ రైట్

ప్రచురణ కర్తలు :
**మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి**
వాణీ సదనము 3-4-885/A బర్కత్‌పుర
హైదరాబాద్-500 027

ముద్రణ : వాణీ ప్రెస్, విజయవాడ-2

**మూల్యం రు 60-00**

# దేవీభాగవతము

చ॥ వినఁబడె ముల్గు పోతయ కవిప్రవరుం డొక వందయేండ్లకున్
మును దెలిగించె భాగవతమున్ సరసంబుగనంచు, దీని ము
ద్రణమున నాల్గు స్కంధములు దాటినవెన్కఁ: నతండు నాదు వం
దనముల కర్హుఁ డెంతయును ధన్యుఁ డతండుగదా ధరాస్థలిన్.

చ॥ తిరుపతి వేంకటేశ్వర సుధీమణుల న్గొనియాడి మ్రొక్కెదన్
సరసులు నాకు మిత్రులును సర్వజన స్తవనీయపాండితీ
భరితయశుల్ తెలుంగునను భాగవతంబు రచింపఁబూనిరం
చెరిగితి వారవల్న గణియింపరు నా యపరాధపుంజమున్.

# క్రొన్నుడి

ముక్కోటి యాంధ్రుల మన్ననల నంది నేడు ముచ్చటగా మూడవ ముద్రణ మంది పాఠకమహాశయుల హస్తముల నలకరించుచున్న దీ "శ్రీమదాంధ్ర దేవీభాగవతము".

గ్రంథకర్త శ్రీ దాసు శ్రీరాములుగారు క్రీ. శ. 19 వ శతాబ్ద్యుత్తరభాగమందును 20 వ శతాబ్ద్యారంభమునను మహాకవిగా ఖ్యాతిగన్న మహామనీషి. వా రనేక శాస్త్రములందు సిద్ధహస్తులు. ఏకసంధాగ్రాహులు. బహుముఖప్రజ్ఞావంతులు, లఘుకృతులలో పేరెన్నిక గన్న "తెలుఁగునాఁడు"నందలివియు, బృహద్గ్రంథమయిన శ్రీదేవీభాగవతములోనివియు నగు పద్యము లిప్పటి కవులకుగూడ కంఠస్తములే.

శ్రీ దాసు శ్రీరాములుగారు రచించిన పొత్తములలో కొన్ని ముద్రితములయ్యు లభ్యమగుట కడు దుస్తరముగా నున్నది. కొన్ని శిథిలము లయినవి. మఱియు కొన్ని వ్రాతప్రతులుగానే నిలిచిపోయినవి. వీరి రచనలను జిజ్ఞాసువులకు లభ్యములు కావించుటద్వారా వీరి ఖ్యాతిని పునరుద్ధరణ మొనర్చుట ముఖ్యవిధిగా నెంచి మేము 1973 వ సంవత్సరము డిసెంబరు మాసములో "మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి" ని హైదరాబాదులో స్థాపించితిమి. వారి గ్రంథములు సేకరించుట, వాని ముద్రణ యనున వీ సమితి ముఖ్యాశయములు.

వీనిని దృష్టియం దుంచుకొని ముద్రితములై యున్న గ్రంథములను కొన్నిటిని, అముద్రితములైన 1. కురంగగౌరీశంకర నాటికను, 2, లక్షణావిలాస మను యక్షగానమును ఇప్పటికి సేకరింప గల్గితిమి. శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులవారిచే "రెండవ శ్రీనాథుడు"గా నేగ్రంథము వలన శ్రీరామకవిగారు భావింపబడిరో యా "తెలుఁగునాఁడు" 6 వ కూర్పు ప్రప్రథమముగా మాచే ముద్రితమైనది. ప్రబంధలక్షణములన్నియు గలిగి, వచనములో నపూర్వకథతో నొప్పు "అభినవగద్యప్రబంధము" అటుపిమ్మట ముద్రణ నొందినది. ఆ తదుపరి వీరి జయంతి సంచిక. గ్రంథకర్తగారికి 'మహాకవి'యను బిరుదమును సమకూర్చిన ఈ దేవీభాగవతము నాల్గవది. ఈ ముద్రణమునందు వెనుకటి కూర్పులలోని దోషములు సవరింపబడినవి.


శ్రీ దాసు శ్రీరామామాత్యులవారు రచించిన యేగ్రంథమైన మా కందజేసియైనను, లేక యది లభించుతావు నెఱుకపఱచియైనను మా యత్నము సఫల మొనరింప పాఠకమహాశయులను ప్రార్థించుచున్నాము.

మా కీ గ్రంథముద్రణమున సహాయ మొనర్చిన యెల్లరకు కృతజ్ఞతలు.

మాకు చేదోడు వాదోడుగా నుండియు, నిర్మాణమునకు పెక్కువిధముల దోడ్పడియు, మాకు సమధికోత్సాహము గల్పించిన "ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి"వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.


దాసు పద్మనాభరావు,
అధ్యక్షుడు
మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి.

హైదరాబాదు
20—7—1978



శ్రీ దేవీ మహిషాసుర మర్దని

(శ్రీ కనకదుర్గ కళా సమితి సౌజన్యంతో)



మహాకవి దాసు శ్రీరాములు

# ఆంధ్రదేవీభాగవతము

## పీఠిక

అన 1900 సంవత్సరారంభమున గ్రంథకర్త దేవీభాగవతాంధ్రీకరణము నారంభించి యెమమాసములలో నాపని పూర్తిచేసి శుద్ధప్రతి నొకదానిని స్వహస్తమున వ్రాసి ముద్రణ కొసంగిరి. కాని యా సమయమున వారి స్వకీయ ముద్రాక్షరశాలలో సర్కారుపను లధికముగ నుండుటచేతను, ముద్రాయంత్ర పరికరములు మితముగ నుండుటచేతను, నీగ్రంథము తమ ముద్రణాలయమున ముద్రించుట కవకాశము గలుగదయ్యె.

కావున నితర ముద్రణాలయములలో నీకార్యమును నిర్వహించవలసిన యావశ్యకత గలిగినది. ఆకారణముచేత నీగ్రంథము 1907 వ సంవత్సరమువరకు బయలువెడల వలను బడలేదు. అప్పటి కొక సంవత్సరమునకు ముందు గ్రంథకర్తకు శరీరమందు జాడ్యమేర్పడెను. సవరణపత్రములను మిక్కిలి జాగరూకతతో జూడ శక్తి చాలక యుండెను. వారి శరీరము నానాటికి స్వాస్థ్యము తప్పుచుండుటయు, ముద్రణ మాలస్యముగ జరుగుచుండుటయు, దెలిసి కొని వెంటనే యప్పటికి ముద్రితముగాక నిలచియున్న చివరి యైదుస్కంధములు తమ ముద్రణాలయముననే పని జరుగున ట్లేర్పాటు గావించిరి.

ఈ గ్రంథముయొక్క ముద్రణము ముగిసిన పదిమాసములలో గ్రంథకర్త మృతి జెందెను. సావధానముగ నీ గ్రంథమును తిరిగి పరిశీలించుటకుగాని ముద్రణాస్ఖాలిత్యము లను బరికించుటకుగాని తగిన యవకాశము గ్రంథకర్తగారి జీవితకాలమున వారికి జిక్కకుం టచే నిందు నచ్చటచ్చట గొన్నిలోపము లుండునేమో యని శంక పొడమెడిని. అట్టి లోపము లెచటనైన గాన్పించినచో చదువరులు వానిని మాకు దెలుప బ్రార్థితులు.

మొదటి ముద్రణ మితరస్థలములయందు జరిగిన కారణముచేతను, చిన్న యక్షరము లలో గూర్పబడి యుండుటచేతను జదువరుల కంటి కింపుగ నుండలేదు.

ఇప్పుడు పెద్దయక్షరములలో గూర్పబడి విలువగల మంచికాగితములపై ముద్రింప బడినది.

ఈ గ్రంథముయొక్క కవితారచననుగూర్చియు, కవియొక్క ప్రజ్ఞావిశేషములను గూర్చియు, నిందు ముద్రింపబడిన బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి శతావధానిగారి యుపోద్ఘాతమే చెప్పుచున్నది. కావున వేరుగ వ్రాయ నవసర ముండదు.

బెజవాడ,
1—10—1928.

దాసు కేశవరావు.

★

# ఉపోద్ఘాతము

(బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రి, శతావధాని)

దేవీభాగవతము, అను నీ మహాపురాణము నిప్పటి కాంధ్రీకరించినవారు నలువురు గన్పట్టుచున్నారు. మా యాంధ్రీకరణము నాఁటి కిది యాంధ్రీకరింపఁ బడనే లేదని మే మను కొంటిమి కావుననే—

క॥ ఎన్ని పురాణమ్ములఁ దా । మన్నియు నాంధ్రీకరించి యనుకంపఁ గా
కున్నఁ దీనిఁ విడుతురె ? । నన్నయభట్టాది కవిజనమ్ములు మాకున్॥

అని గ్రంథారంభప్రస్తావనమున వ్రాసియుంటిమి. అది యటులుండె. ప్రస్తుత మీ యుపోద్ఘాత మెవరి యాంధ్రీకరణమునకు సంబంధించినదియో యట్టి శ్రీ దాసు శ్రీరామ మహాకవిగారి యాంధ్రీకరణమునాఁటికి ములుగు పాపయారాధ్యులవారు గ్రంథకర్తగారికి గోచరించిరి. ఆ గోచరించుటకూడ గ్రంథముద్రణము కొంత జరిగిన పిమ్మటఁ దటస్థించినదని గ్రంథకర్త గారే తెల్పియున్నారు. వీరి యాంధ్రీకరణమే కాక సమకాలికులమైన మా యాంధ్రీకరణము గూడ వీరి కప్పుడే శ్రుతమైనది. కావుననే వీరు మా యుభయులను గూర్చి వ్రాసిన పద్యములు గ్రంథ పీఠికలోఁ జేరక వేఱుగా నతికింపఁ బడియున్నవి చూడుఁడు.

చ॥ వినఁబడె ములుగుపాపయకవిప్రవరుం డొక వంద యేండ్లకున్
మును దెలిఁగించె భాగవతమున్ సరసంబుగ నంచు దీని ము
ద్రణమున నాల్గు స్కంధములు దాఁటిన వెన్క; నతండు నాదు వం
దనముల కర్హుఁ డెంతయును ధన్యుఁ డతండుగదా ! ధరాస్థలిన్. ౧

చ॥ తిరుపతివేంకటేశ్వర సుధీమణులన్ గొనియాడి మ్రొక్కెదన్
సరసులు నాకు మిత్రులును సర్వజనస్తవనీయపాండితీ
భరితయశుల్ తెలుంగునను భాగవతంబు రచింపఁ బూని రం
చెఱిఁగితి వారివల్లఁ గణియింపరు నా యపరాధపుంజమున్॥ ౨

పై పద్యద్వయమువలన గ్రంథకర్తనాఁటికి దీని నాంధ్రీకరించినవా రిపువురు మాత్రమే యని తేలినను, ఈయిరువురకును మధ్య నింకొకరుగూడ నున్నారు. వారు

త్రిపురాన తమ్మనదొరగారు. ఈయనకొమరుఁడుగూడ మంచికవి. కీర్తిశేషులైన తమ తండ్రి గారి గ్రంథము నచిరకాలమున నుద్ధరించి యాంధ్రుల యభినందనములకుఁ బాత్రులు కానున్నారు. పాపయారాధ్యులవారి యాంధ్రీకరణముగూడఁ గొలఁదికాలమునఁ బ్రకటితము కావచ్చును. ఇంతకు నిప్పటి కిప్పురాణరత్నము నాంధ్రీకరించినవారు నలువు రని తేలినది. నలువురలో శ్రీరామకవిగారు తుదివారైనను ముద్రింపఁబడి యాంధ్రుల పఠనపాఠనములకు మొట్టమొదటఁ దావొసఁగినది వీరి దేవీభాగవతమే. రెండవది మాది. ఈ విలోమగతియే దీని కిఁక ముందుఁగూడ సతమగుచోఁ బదంపడి ముద్రిత మయ్యెడిది తమ్మనదొరగారి భాగవతము కావలయును. ప్రస్తుత గ్రంథకర్తగారి కులగోత్రాదులం గూర్చియు విద్యాభ్యాసాదులం గూర్చియు జీవితమునకు సంబంధించిన మఱికొన్ని ముఖ్య విషయములం గూర్చియు వీరి జ్యేష్ఠ కుమారుఁడు మ॥ రా॥ రా॥ శ్రీ కేశవరావు పంతులుగారిచే వ్రాయఁబడిన చరిత్రసంగ్రహ మిందే ముద్రింపఁబడియుంటచే నా విషయముల నిందుఁ బ్రస్తావింపక రచనా విషయమున మాత్రమే స్థాలీపులా కన్యాయమున నిందుం గొండొక వివరించుచున్నాఁడను. ఇటీవల ననఁగా, నాంగ్లప్రభుత్వ మారంభమైన పిమ్మట నుద్భవించిన కవులలో నందు నించుమించుగ మాసమ కాలికులగు కవులలోఁ బ్రాచీన సంప్రదాయముగఁ గవితాసామగ్రిని సేకరించి రచనకుఁ గడంగువారు వీరు దక్క లేరు. ఇక్కవి కవిత్వము సంప్రదాయబద్ధ మగుటయేకాక మిగుల జనరంజకమును లోకానుభవవ్యంజకమును నను నంశము.

## 'తెలుఁగునాఁడు'

అనుస్వతంత్ర రచనవలన దెలియ నయ్యెడిని.

ఉ॥ లేవరు "లెండు,లెం"డనిన లేచినవారయినన్ దటాలునన్
బోవరు, పోవుచు న్నిలిచి "పోదుము పోదుము" త్రోయకుం డటం
చీవరు సందు గేస్తు నలయింతురు పెండిలిలో సదస్యసం
భావనవేళఁ జూడవలె బాపనసాముల సాము లన్నియున్॥ ౧

ఉ॥ నమ్మిన నమ్మకున్న సది నావశమా ? జను లాడికొన్న వా
క్యమ్ములు నేను జెప్పెద భయంపడియో పడకో, నియోగిలో
క మ్మనివార్యకార్యఘటక మ్మవుఁ గాని పరోపకారశూ
న్యమ్మును స్వప్రయోజనపరాయణమున్ దలపోయ నిద్ధరన్॥ ౨

పై పద్యములవలన రసజ్ఞులగువా రిక్కవిధార యెంత మనోహరమో గుఱితింపఁ గలరు. మచ్చునకు రెండుమాత్రమే చూపితిని గాని యాపొత్తము నెఱిఁగినవారు దాని

నిందు సంపూర్ణముగా నేల యుదాహరింపలే దని నాయెడఁ గినియునంతటి స్థితిలోఁ దద్ర చన యుండు ననుట నిక్కువము. అంతదనుక నెందులకు? ఈ గ్రంథము మొట్టమొదటఁ గొన్ని సీసపద్యములు వ్రాయఁబడి యున్నవి. ఆ రచనగూడ పై సందర్భమును సమర్థించుటకు మిక్కిలి తోడ్పడఁ గలదు, తిలకింపుఁడు.

సీ॥ ఎలయెండ చెట్ల సందులనుండి గోడలఁ దవిలి తా నిలువుటద్దములు గాఁగ
గొనగొనఁ జను నింద్రగోపసంఘాతంబు పందిళ్ళలోఁ జిన్ని పగడములుగ
చూరుపట్టియలఁ బిచ్చుకదంపతులచాలు చెక్కి తీర్చినయట్టి చిత్రములుగ
దూలాలగూళ్ళ సందులనుండి వెడలి మ్రోఁగెడి తుమ్మెదల మ్రోఁత గీతములుగ

తే.గీ. కెరలి వాఁకిళ్ళఁ దూనీఁగతెరలు మూఁగి
నెర బుటేదారుఁ గెంబట్టుపొర పసందు
సన్న యుల్లడగాఁగ నాషాఢలక్ష్మి
పగిదిఁ దనరారు నల్లూరు పల్లెటూరు॥

ఇదే మకుటముగల పద్యములు మఱికొన్ని గలవు. అన్నియు రసస్ఫోరకములుగను స్వభావోక్తిపోషకములుగను నుండును. చదువరులు తిలకింపఁగలరని దిఙ్మాత్ర ముదాహరించి విడిచితిని. ఇక్కవి రచించిన కబ్బములు పెక్కులు. అన్నిటిలో నాకెక్కుడు రుచించువది తెలుఁగునాడు, రెండవది ప్రస్తుతగ్రంథము. యావద్విషయములం గాకయున్నను గవితకు సంబంధించిన కొన్ని యంశముల నియ్యలఘుఁడు రెండవ శ్రీనాథుఁడేమో యని నాకుం దోఁచెడిని. శ్రీనాథుడు

" గురుకులక్లిష్టో మురారిః కవిః "

అను తెగలోనివాఁడు, ఈయనయో? సహజపాండిత్యుఁడు. పైఁగా భాగవతము నాంధ్రీకరించిన ధన్యుఁడు. కావున మన మీకవినతంసుని శ్రీపోతరాజునకుఁ బ్రతినిధిగా సమ్మానింతము.

" ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః "

అను కాళిదాసోక్తి యిట్టి సహజపాండితీధురంధరులే లేనియెడల వ్యర్థకోశము కావలయును. ఈ శ్రీరామమంత్రి యేలూరి కోర్టులోఁ బ్రధాన న్యాయవాదిగా నుండుకాలములో మేము తాడేపల్లిగూడెము సమీపము నందలి కడియద్ద గ్రామమున బ్ర॥ శ్రీ॥ చర్ల

బ్రహ్మయ్యశాస్త్రిుల వారియొద్ద విద్యార్థులముగా నుండుటచే నప్పుడప్పుడు వీరిని సందర్శించి వీరితో విద్యాగోష్ఠిచేఁ గాలము గడపుచు వీరిగృహమునఁ గొన్నినాళ్లుండుట తటస్థించుచుండెడిది. అప్పటి యీయన వ్యాసంగముఁ దిలకించినచో నియ్యనఘునకుఁ బ్రధాన జీవనోపాధియగు లౌకికవ్యాపారముకన్నఁ గవితారచనాదీక్షయే ముఖ్యమని తెలిసికోఁ గలిగితిమి. కావున నీయన

" ఇదం బ్రాహ్మ మిదం క్షాత్ర శాపాదంపి శరాదపి "

అనుదాని కుదాహరణ మనుటకుఁగూడ, గొండొక వెనుదీయవలసినదే; విద్యా విషయముననేకాక రూపసంపదయెడలఁగూడ నిక్కవి వర్ణనీయుఁడు, ఎక్కడనో గాని యిట్టి యుభయసామానాధికరణ్యము లభింపదు. కావుననే

" విద్యారూపం విరూపాణామ్ "

అని యభియుక్తులు నొడివిరి. గ్రంథవిస్తర మెందులకు ?

శ్లో॥ వశ్యా స్సుతా విత్తకరీచ విద్యా । నిరోగతా సజ్జనసంగతిశ్చ
ఇష్టాచ భార్యా వశవర్తినీచ । దుఃఖస్య మూలోద్ధరణాని పంచ॥

అను శ్లోకమునందలి యదృష్టములెల్ల నిమ్మహాకవికి సంఘటించి నందులకు నాకు నాశ్చర్యము గలుగుచుండును. కవులును నుండవచ్చును. పండితులును నుండవచ్చును. ఐశ్వర్యవంతులును నుండవచ్చును. కాని దాను శ్రీరామకవివంటి ధన్యులు కోటి కొకరేని జేకూరుట యరుదు. కావున నీయన సర్వవిధముల ధన్యుఁడు. ఇక్కవి సహజపాండిత్య విషయముననేగాక భాగవతాంధ్రీకరణ ప్రసక్తియందుఁగూడఁ బోతరాజుగారే, ఆయన భాగవతము నెట్లు పెంచెనో యీయనగూడ నట్లే చాలచోట్ల స్వకపోలకల్పితమగు కల్పనలచే గ్రంథమును బెంచి యున్నారు. ఈ విషయము సంస్కృతాంధ్ర గ్రంథములను రెంటిని విమర్శనాబుద్ధితోఁ దిలకించువారికి సుగమ మని యెంచి గ్రంథవిస్తరభీతిచే నే నప్పనికిఁ బూనలేదు. మఱియు

ఆ॥ వె॥ భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు । శూలికైనఁ దమ్మిచూలికైన॥

అని శ్రీమద్భాగవతాంధ్రీకరణ ప్రస్తావనమందుఁ బోతరాజుగారు వాక్రుచ్చి యున్నారు. ప్రస్తుతమగు దేవీభాగవతము గూడఁ గొన్నిఘట్టములయం దాభాగవతమునకుఁ దీసిపోవు నది కాదు. ఇందు మంత్రయోగ, వేదాంతాది శాస్త్రరహస్యములు పెక్కులు గలవు.

ఇందెన్నియో చోట్ల పునరుక్తిపదాభాసములు గలవు, ఆయీ ఘట్టములయందు వ్యాఖ్యాన ముప కరించు ననుకొంద మన్నను నయ్యదిగూడఁ గొన్నిచోట్ల మూకీభావమునే వహించు చున్నది. మన ప్రస్తుత గ్రంథకర్త సర్వమును మూలముమీఁదనే యన్వయించుకొని యాంధ్రీ కరించినట్లును వ్యాఖ్యానమును బొత్తిగా మూచూడనియట్లును దెలిసికొనుటకు మన కిందుఁ గొన్ని యాధారములు కనుపట్టుచున్నవి. అందొకటిమాత్ర ముదాహరించి చర్చించి చూపు చున్నాను.

"దూఱు లేదు సతికి జారుచే ననుచును, నిప్రునకును వేదవిధులవలన"

(ప్రథమస్కంధము)

పై పద్యభాగము

శ్లో॥ న స్త్రీ దుష్యతి జారేణ న విప్రో వేదకర్మణా॥

అను నాంధ్రలిపిముద్రిత దేవీభాగవతములోని శ్లోకభాగము ననుసరించిన యాంధ్రీ కరణము. ఈ యాంధ్రీకరణమునం దెన్ని విప్రతిపత్తు లున్నవో యవి యన్నియు మూల శ్లోకమునందును గలవు. కావున నియ్యెడఁ దెలుఁగుచేసినవారి ననుటకు మన కధికారము చాలదు, కాని

"వ్యాఖ్యానతో విశేషప్రతిపత్తిః"

అనుటవలన నిట్టిపట్టుల సంశయ నివృత్తికొఱకు వ్యాఖ్యానమునుగాని సంస్కృత లిపిలో ముద్రితమగు గ్రంథమునుగాని చూడవలసి యుండును. ఆంధ్రలిపి ముద్రణగ్రంథము నకు వ్యాఖ్యానము లేదు కాని నాగరలిపిగ్రంథమునకుఁ గలదు. అందీపాఠ మిట్లుకాక వేఱొక తెరఁగున నున్నది. అది క్లిష్టముగా నుండుటచే వివరణముగూడ నున్నది. చూడుఁడు.

"న స్త్రీ దుష్యతి చారేణ న విప్రో వేదకర్మణా"

ఇందు "జారేణ", "చారేణ", గానున్నది. చారేణ అనుపదమునకు రజఃప్రస్రవణేన అని వివరణ మున్నది. ఇపు డిదివఱకుఁ జూపిన పాఠమునందుగల విప్రతిపత్తులన్నియుఁ దొలఁగి నవి. ఎట్లందురా ? ఇదివఱలో స్త్రీకి జారసాంగత్యము బ్రాహ్మణునకు వేదచోదితమగు యజ్ఞాది సత్కర్మము వంటిది యను నర్థము గోచరించుటచే నెంతో నీతి బాహ్యముగను విరుద్ధముగను గనుపట్టుచున్నది. ఇప్పుడో ? స్త్రీకి జారసాంగత్యము వలనఁ గలుగు

దోసము గర్భవతియయిన యెడలనే కాని లేనిచో నది బ్రాహ్మణుఁ డపు మొనర్చియు వేద విహితమైన ప్రాయశ్చిత్తమువలన శుద్ధుఁడైనట్లే రజః ప్రస్రవణమువలన దొలగునని సమన్వయము కలుగుచున్నది. ఈసమన్వయము

క. పరపురుషసంగమమ్మునఁ । బరిహృతయై యున్నయట్టి పడఁతి విశుద్ధిం
  బొరయు రజస్వలయై కం । చరయంగ భస్మమున శుద్ధమయిన కయివడిఁజా.

అను భారతధర్మముతో నేకీభవించుటచే నేవిధమైన విప్రతిపత్తియును లేక సహృదయ సమ్మతికిఁ బాత్ర మగుచున్నది. ఇట్టి వ్యత్యాసములు నన్నయాదుల భారతమునందే యిప్పటి విమర్శకులు చూపుచున్నారు. ఆంధ్రకవితాలత కాలవాలము లనఁదగు మహాకవులకన్న నధునాతను లెక్కువవారు కారుగదా ? ఇంతమాత్రమున వారికిఁగాని ప్రస్తుత గ్రంథకర్తగారికిఁ గాని ప్రాజ్ఞులు కళంకము నాపాదింపరని నానమ్మకము.

" ప్రమాదో ధీమతామపి "

అనుచోటంగల అపి శబ్దమేవకారార్థకమని పెద్దలు చెప్పుచున్నారు. ఇదియుమంగాక యిక్కవి దీని యాంధ్రీకరమునాఁటికి సుత్తరవయస్సులో నున్నవాఁడు. ఈయన జీవితకాలమంతయుఁ గలిసి 62 వత్సరములు. ఈ రచనకు 52 వ వత్సరమున నుపక్రమించెను. ఉపక్రమించి యతిశీఘ్రకాలములో ననగా నైదుమాసములలో నీ మహాపురాణము నాంధ్రీకరించి ముద్రణమున కొసఁగెను. ఆయీ సందర్భములు వీరికుమారుఁడు వ్రాసిన చరిత్ర సంగ్రహము నుండి కైకొంటిని. ఈ యుభయ కారణములవలన నక్కడక్కడ వ్యత్యాసములు గొన్ని దొరలినవని నా యభిప్రాయము. ఆ వ్యత్యాసము లీముద్రణమున సవరింపవలసియున్నను, ముద్రణానంతర ముపోద్ఘాతము వ్రాయునప్పు డయ్యవి కనిపెట్టఁబడియుంటచేఁ దృతీయముద్రణము వరకును నిలిచిపోవలసినవయ్యె నని చదువరులు గ్రహింతురుగాక ; మన మెందఱ మెన్నిసార్లు సంస్కరించి వడపోసినను నెఱసు లక్కడక్కడ నిలిచియే యుండును. ఈ విషయమై ప్రస్తుత గ్రంథకర్తగారు వేఁటొక పొత్తమున నిట్లు వ్రాసి యున్నారు.

శా. సర్వజ్ఞత్వము సాంబమూర్తిది మనుష్యప్రజ్ఞ యల్పంబు దు
  ర్గర్వంబుల్ కొఱగావు దూషణల మోక్షశ్రీలు చేకూర వీ
  యుర్విఁజా ఖానికుఁ డెన్ని ఱాళ్ళు వడపోయుఁజా రత్న మొక్కంటికై
  గుర్వర్థంబొకఁ డున్నఁ జాలదె ? సుధీకుంభుల్ పరీక్షించినఁజా.

మఱియు సీశ్రీరామకవిగారు కవిత్రయమువారును దదనుసారులగు పెద్దనాదులును వాడిన యతులనేకాక మఱికొన్ని యతులను మఱికొన్ని ప్రయోగములను బుద్ధిపూర్వకముగ వాడుక చేసియున్నారు. చదువరు లయ్యెడల శంకింతురని యెంచి యాయాసందర్భమును గుఱించి గ్రంథాదిని విస్తరించి చర్చించియున్నారు. కావున దానింగూర్చి యిందు వ్రాయవలసినది లేదు. మఱియుఁ బ్రథమస్కంధమునందు వ్యాసునికడకుఁ బుత్రోత్పాదనమునకై దేవతలచే ఘృతాచి పంపఁబడినది. పిదప నమ్ముని శపించునని భయపడి పలాయితురాలైనదియు ఘృతాచియే కాని వేఱొకతె కాదు. ఇందు నిష్క్రమణ మట్టునను నా ఘృతాచి యూర్వశిగా మాఱినది. ఈప్రమాదమును జదువరులు సవరించుకోఁ గోరుచున్నాఁడను. శుద్ధపత్రమును వ్రాయవలసియున్నను బ్రాజ్ఞుల కద్దానితో నంతగా నావశ్యకత యుండదని యుపేక్షించితిని. మన్నింపఁగోరుచున్నాఁడను. 19 వ శతాబ్దమున నుదయించిన యాంధ్రకవులలో నిట్టికవి మృగ్యుఁడు. ఇన్నియదృష్టములు సంఘటించినకవి లేనే లేఁడు.

శ్లో॥ వాంఛాసజ్జనసంగతౌ పరగుణే ప్రీతి ర్గురౌ నమ్రతా ।
విద్యాయాం వ్యసనం స్వయోషితి రతిర్లోకాపవాదాద్భయమ్ ।
భక్తి శ్శూలిని శక్తి రాత్మదమనే సంసర్గము క్తిః ఖలై ।
రేతే యత్ర వసంతి నిర్మలగుణా స్తేభ్యో మహద్భ్యో నమః॥

ఈభర్తృహరిశ్లోకమునకీ మన గ్రంథకర్తయే ప్రథమోదాహరణము.

"అనామికా సార్థవతీ బభూవ."

శ్లో॥ కవిః కరోతి కావ్యాని లాలయ త్యుత్తమో జనః
తరుః ప్రసూతే పుష్పాణి మరు ద్వహతి సౌరభమ్॥

కడియం,
25—9—1928.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, శతావధాని.

# LIFE OF DASU SRIRAMA PANDIT

## AUTHOR OF

## ANDHRA DEVIBHAGAVATAM

ఆంధ్ర దేవీభాగవత గ్రంథకర్తయగు

# దాసు శ్రీరామ పండితుని జీవిత చరిత్ర సంగ్రహము

ఈకవి ఆర్వేల నియోగి బ్రాహ్మణుడు. హారితసగోత్రోద్భవుడు.
తండ్రి కన్నయమంత్రి, తల్లి కామాంబ.

వీరు 1846వ సంవత్సరమున కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలో చేరిన కూరాడ యను గ్రామమందు మేనమామల యింట జనన మొంది 1908వ సంవత్సరములో గోదావరి జిల్లా ఉప్పుమేలూపలో స్వగృహమున మృతి నొందిరి. కృష్ణాజిల్లా కైకలూరు తాలూకా అల్లూరు అను గ్రామము వారి పూర్వులకు అప్పటి ప్రభువు లొసంగిన యగ్రహారమయి తలిదండ్రుల పాలనలో నుండుటచే వీరికి జీవనము సుఖముగ జరుగుచుండెను. మరియు తలిదండ్రులకు వీరొక్కరే సంతానమగుటచే జన్మాది వీరిని తలిదండ్రులు విడువక తమ యొద్దనే యుంచి మిగుల గారాబముగ పెంచుకొనుచుండిరి. బాల్యమున నాయూర లభించిన విద్యను సంపాదించిరి. పిమ్మట తొమ్మిదవయేట నాంగ్లేయ విద్యాభ్యాసముకొరకు చేరువను పెద్దపట్టణమగు మచిలీబందరునకు బంపబడిరి. అచ్చట నోబిలు పాఠశాలలో నింగ్లీషును, నింటియొద్ద పారశీభాషయు జదువుచుండ పదిమాసములు గడచెను. ఈ చిన్నవాని కుశాగ్ర బుద్ధియు, సత్ప్రవర్తనయు పాఠశాలాధ్యక్షులగు నోబిలు దొరగారి మనస్సునకు కడు సంతస మొనర్చుటచే నీ పిల్లవానిని దొరగారు తనగృహమున కప్పుడప్పుడు గొంపోయి చిన్నపుస్తకముల నిచ్చియు, ఫలాహారముల నొసంగియు కడు గారాబముతో నాదరించుచు వచ్చిరి. ఆ దినములలో గొందరు విద్యార్థులు క్రైస్తవ మతావలంబనము చేయుచుండుట తటస్థించెను. ఈ యుదంతము లన్నియు క్రమక్రమమున వారి మాతాపితలకు దెలియవచ్చినవి. వెంటనే తల్లిగారు మచిలీబందరు వచ్చి యీ చిన్నవానిని ఆకస్మికముగా స్వగ్రామమునకు మరల్చి

కొనిపోయిరి. కాని యంతటితో నీపిల్లవాని విద్యాతృష్ణ యెంతమాత్రమును తగ్గలేదు. ఆ యూరనున్న వీరి మేనత్తకుమారుడగు ఉప్పలూరి కనకరాజుగారి సహాయమున కొన్ని యాంధ్రగ్రంథములును, ఛందస్సును బఠించి కవితారచనయందు నేర్పరులైరి. జ్యోతిశ్శాస్త్ర సాంప్రదాయములను జాలవరకు గ్రహించిరి. పండ్రెండవ యేట సోమలింగేశ్వర శతకమును ప్రౌఢశైలిలో వ్రాసిరి. అష్టావధానము, వ్యస్తాక్షరి, శతఘంటాకవనము ధారాళముగ నొనర్చు కౌశల మబ్బినది.

అంతట గీర్వాణభాషాభ్యసన కుతూహలము వారి మనము నెంతయు గలగించుటచే తలిదండ్రుల యెరుక లేకుండ నొకనాటి రేయి నూరువిడచి జమీందారి సంస్థానమగు నూజవీడునకు బోయిరి. అప్పటి సంస్థాన విద్వాంసులగు శ్రీమాన్ విద్వాన్ మాడభూషి వెంకటాచార్యులుగారు ఈ పిల్లవాని విద్యాబుద్ధులను బ్రశంసించి “పదిరెండేడుల యీడునం గవిత జెప్పంజొచ్చి వ్యస్తాక్షరీ” యను బద్యమును నాశువుగా జదివి వీరి ననేక భంగుల గౌరవించి కొన్ని మాసము లచ్చట నిల్పిరి. పండిత సహవాసమువలన గీర్వాణమందు కొంచెము ప్రవేశము గలుగజేసికొనిరి. అంతట స్వస్థలమగు అల్లూరునకు దిరుగ గొంపోబడి యచట రెండు సంవత్సరము లుండిరి. ఆంధ్రగీర్వాణజ్ఞానము క్రమక్రమముగ వికసించెను. సాత్రాజితీవిలాసమను యక్షగానము రచించిరి. ఇందలి కవిత్వము మిగుల లావణ్యమును, ప్రౌఢమును నెయొప్పె. ఇప్పుడు వీరి వయస్సు పదునాల్గు వర్షములు. ఆ దినములలో వల్లూరు సంస్థానాధీశ్వరులగు రాజా నాగన్ననాయుడుగారు నవరాత్రోత్సవములు కడు వైభవముతో నొనర్చుచు, పండిత పంభావనాది సుకృతులచే విద్యలను బోషించుచుండిరి. తన్మహోత్సవ సందర్శన కుతూహలముచే నీ బాలకవి పై జెప్పబడిన సంస్థానమున కేగి, యాస్థాన పండితశిరోమణియగు శ్రీ మతుకుమల్లి నరసింహశాస్త్రిగారిచే నొసంగబడిన సమస్య నొకదాని నవలీల బూరించి యాపండితుని మనము నెంతయు సంతసింపజేసెను. అందరితోపాటు ఈ చిన్నవాడును పరీక్షింపబడి యగ్రసంభావన బడసెను. ఈ యేటనే వీరు తమ పెద్దమేనమామపుత్రిక యగు “జానకి”ని పత్నిగా గైకొని పరిణయ మొందిరి. ఆ పతివ్రతాశిరోమణి గర్భమున వరుసగా నార్వురు పుత్రులును, నొక పుత్రికయు నుదయించిరి. పిమ్మట నాలుగైదు సంవత్సరములు స్వగ్రామముననే నిలచి స్వయంకృషిచే ఆంధ్ర గీర్వాణ గ్రంథముల సాధించి విజ్ఞానమును గాంచిరి. కొన్ని గ్రంథములనుగూడ రచించిరి. పంచనృసింహక్షేత్రము, శుకరంభాసంవాదము, కృష్ణార్జున సంగరము, సారసంగ్రహ గణితము వానిలో చేరినవే.

మరల పదునెన్మిదవ యేట నింటియొద్ద నెవ్వరెరుంగకుండ నొక స్నేహితుని వెంట దోడ్కొని “గీర్వాణవిద్యాపీఠ” మని నుతికెక్కిన అగిరిపల్లికి బోయి యచట పండితసహాయమున గొన్ని సాహిత్య గ్రంథములను. సిద్ధాంతకౌముది గొంతవరకును జదివిరి. పిమ్మట గొంత కాలమునకు స్వగ్రామము జేరి సుఖముగ గాలము గడపిరి. మువ్వురు కుమాళ్లు బుట్టిరి. అంత

గొందరు స్నేహితులవలన ప్రోత్సహింపబడి తాలూకాపట్టణ మగు గుడివాడకు బోయి యచట పాఠశాలలో ప్రధానాంధ్రోపాధ్యాయులుగ జేరి యాంగ్లేయ విద్యాభ్యాసము జేసి రెండేండ్లలో మెట్రిక్యులేషను తరగతికి దగిన జ్ఞానమును సంపాదించిరి. ఇదియంతయు స్వయంకృషియే. చెన్నపురియందు ఆంధ్రులలో సుప్రసిద్ధిగాంచిన శ్రీ రెంటాల వెంకట సుబ్బారావు పంతులు గారు వీరి యాంతరంగిక శిష్యులలో ప్రథములు.

గుడివాడ పాఠశాలలో వీరు కనుపరచిన బోధనాప్రజ్ఞ కడు ప్రశంసనీయమని తోచుటచే తత్సమీపగ్రామములగు కౌతరము, దోకిపఱ్ఱు గ్రామ వాస్తవ్యులలో ప్రముఖులగు గొందరు కమ్మవారు వీరిని వారి గ్రామములకు రప్పించి పాఠశాలను స్థాపించి యనేకులు బాలురను విద్యార్థులుగ జేర్చిరి. ఆంధ్రగీర్వాణాంగ్లేయములు మూడు భాషలయందు విద్యను గఱపుచుండిరి. గవర్నమెంటువారు మొదటి సంవత్సరము రు. 500 లు, రెండవ సంవత్సరము రు. 1000 లు గ్రాంటొసంగిరి. సంవరణోపాఖ్యాన మను కావ్యమును, లక్షణావిలాస మను యక్షగానమును ఈ దినములలో రచించిరి. తెలుగుభాషలో సెకండు గ్రేడు ప్లీడరు పరీక్షకు గావలసిన గ్రంథములను జదివి దానియం దుత్తీర్ణులైరి. అంతటవీరు న్యాయవాదిగ మచిలీబందరు పోవలసివచ్చెను. అప్పు డా గ్రామనివాసులు వీరియెడల జూపిన విశ్వాసమును, గౌరవమును, అసమానములు. వెండిపూలచే బాదములను, బంగారుపూలచే శిరమును బూజించి సాష్టాంగ నమస్కారము లొనర్చి పల్లకిలో నెక్కించి ఇరుపార్శ్వములను జ్యోతులను వెలిగించి తమభుజములపై పల్లకిని మోసికొని వీధుల నూరేగించిరి. (1878 ఏప్రిలు)

వీరు దోకిపఱ్ఱులో నున్న కాలమందు జరిగిన యొక విషయముమాత్ర మీసందర్భమున నుదాహరించవలసియున్నది. దానివలన వీరి పట్టుదలయు, బరోపకారబుద్ధియు, విద్యాభిమానమును వెల్లడి యగుచున్నవి. సూరి సీతారామశాస్త్రి యను నొక పిన్నవయసుగల వైయాకరణి ధనార్థియై వీరికడకు వచ్చెను. ఆ శాస్త్రి నాయూరనే నిలిపి తాను ఆయనకు అన్నవస్త్రము లిచ్చి ఆంగ్లేయభాషను గొంతవరకు గఱపెను. మరియు తెలుగు ప్లీడరీకి గావలసిన గ్రంథములను బఠింపించెను. పిమ్మట రెండు సంవత్సరములు ఆ శాస్త్రి కృషిజేసి ప్లీడరయి గుంటూరుజిల్లా కారెంపూడిలో న్యాయవాదిగా నుండి ధనమార్జించి సుఖజీవి యయ్యెను. ఆ శాస్త్రిగారియొద్ద వీరు సిద్ధాంత కౌముది, శబ్దేందుశేఖరము మొదలగు గ్రంథములను జదువుచు వచ్చిరి. బందరులో న్యాయవాదిగనున్న కాలమున వీరి వయస్సు ముప్పది రెండు. ఆరుగురు కుమాళ్లును నొక కుమార్తెయు గల్గిరి.

వీరి యూహలును, ఆదేశములును కాలానుసారముగ మార్పుజెందుచు వచ్చెను. సంఘ సంస్కరణ విషయములో వీరు చాలకృషి చేసిరి. 1880వ సంవత్సరములో "కల్పవల్లి" యను నొక పత్రికను బ్రకటించుచు విధవావివాహము, నౌకాయానము మొదలగు విషయములను జర్చించుచు, ననేక యుపన్యాసము లొసంగిరి. అంతట మునసబుకోర్టు ప్లీడరీతో వీరికి దనివి తీరక జిల్లాకోర్టులో న్యాయవాదిగా నుండవలెనను కుతూహలము బలమై

నది. వెంటనే యింగ్లీషు జనరల్ టెస్టు పరీక్షలో గృతార్థులైరి. పిమ్మట సివిల్ హాయరు, క్రిమినల్ హాయరు పరీక్షలలో గూడ విజయమందిరి. ఇవియే జిల్లాకోర్టు వకీలునకు గావలసిన పరీక్షలు. పట్టాను పొందుటకు సిద్ధముగనున్న సమయమున దొరతనము వారు మరియొక శాసనమును బ్రకటించిరి. అందువలన నీ మూడు పరీక్షలు ప్యాసైనను, "ఫస్టుగ్రేడు ప్లీడరీ" యను నాల్గవ పరీక్షను గూడ సాధించినగాని జిల్లాకోర్టున కధికారము గలుగదు. కావున నీక్రొత్తపరీక్షకు కృషి చేయవలసివచ్చెను. దీనికి నిర్ణయింపబడిన గ్రంథములు సంఖ్య కెక్కుడును, కఠినములు నై యుండెను. 1883వ సంవత్సరములో దీనినిగూడ సాధించిరి. అప్పటికి వీరి పుత్రు లార్గురును పాఠశాలలలో జదువుచున్నారు.

వీరు ఫస్టుగ్రేడు ప్లీడరు పరీక్షకు మిక్కిలి పట్టుదలతో గృషిచేయుచున్న సమయమున వీరి సామర్థ్యమును బరీక్షింపగోరి స్నేహితు డొకడు వచ్చి "మిత్రమా! నీవు ఆంధ్ర గీర్వాణముల పరిశ్రమ వదలి కొన్నియేం డ్లయినది. ఇప్పుడు ఆంగ్లేయ గ్రంథపఠనయు, ఉద్యోగ కార్యనిర్వహణమును నీ కవశ్యక ర్తవ్యములై యున్నవి. ఇట్టి సందర్భమున నేను కటి నీ ప్రజ్ఞను బరీక్షింప వచ్చితి. నా సాహసమును మన్నింపుము, నా కోరిక దీర్పుము. ఏమన అపూర్వమైన నూతనకథ నొకదాని గల్పించి యఖిలవర్ణనముల సుందరమై పట్టపరీక్షకు జదువు విద్యార్థులకు బఠనీయమై యొప్పుదానిని గద్యమున నేడునాళ్ళలో నలువది పుటలలో ముగించుడు." మిత్రుని వచనముల కించుక యోజించి వల్లెయని యుత్తర మొసంగెను.

"కం॥ ధరణిని లేనిది యెపు డె । వ్వరివలనను వినని దఖిల వర్ణనముల సుం
దరమగు చరితము గద్యము । న రచించవె నేడునాళ్ళ నలుబది పుటలన్॥"

అట్లే యేడవనాటికి గ్రంథమును బూర్తిచేసి మిత్రుని కొసంగిరి. (అభినవ గద్య ప్రబంధము.)

1884వ సంవత్సరములో జిల్లాకోర్టు పట్టాను పొంది ఏలూరు సబార్డినేటు కోర్టులో పంద్రెండు వత్సరములు అవిచ్ఛిన్నముగ నుద్యోగమును నిర్వర్తించిరి. అప్పటి న్యాయవాదులలో గొప్ప ఖ్యాతి వహించి చాల ధన మార్జించిరి. కాని యా ధనము నంతయు ధర్మకార్యములయందే వినియోగపరచిరి. చాలవరకు వారు చేసిన దానములు గుప్తములు. సంగీతమందు వీరికి మిగుల యభిరుచి. వీరి పోషణలో గానపాఠశాల యొకటి యుండెను. పేట్రియాటిక్ మిడిల్ స్కూలు ఏలూరులో వీరిచే స్థాపింపబడి పోషింపబడియె. సామాన్యముగ సకల శాస్త్రముల యందును వీరికి బ్రవేశము గలదు. సంగీతమందుమ, అభినయమందును వీరు వ్రాసిన గ్రంథములు చాల గలవు. గాయకు లనేకులు వీరివలన సన్మానముల బడసిరి. జ్యోతిషమందు వీరికి గల జ్ఞానము అసాధారణమని యీ క్రింది విషయములనుబట్టి గ్రహింపవచ్చును. 1901వ సంవత్సరములో శ్రావణమాస మధికమా, ఆషాఢమాస

మధికమా ? యను చర్చ రాజమహేంద్రవరములో జరిగెను. దీనిని బరిష్కరించుటకు ముప్వురు తీర్మానకర లేర్పడిరి అందులో శ్రీరామపండితు లొకరు. తుదకు వీరి వాదనయే సిద్ధాంతీకరింపబడియె. తర్కశాస్త్రమందు "న్యాయబోధ"యను గ్రంథమును వ్రాసిరి.

వైశ్యధర్మములను చర్చించి ఇప్పటి వైశ్యులు ద్విజులనియు, వేదోక్త కర్మల కర్తలనియు సిద్ధాంతపరచి యనేక యుపన్యాసముల నిచ్చి తుదకు "వైశ్యధర్మదీపిక"యను గ్రంథమును వ్రాసిరి. పండిత సన్మానమందు వీరికి ఉత్సాహ మధికము. తిరుపతి వేంకటేశ్వర కవులు మొదలగు మహనీయులు గొందరు వీరివలన గొప్ప సన్మానములను బొందిరి.


సంఘసంస్కరణ, మతాచారములు, ధర్మములు, లౌకికనీతులు మొదలగు విషయములనుగూర్చి అనేక గ్రంథములను వ్రాసిరి. పత్రికలు ప్రకటించిరి. ఉపన్యాసములిచ్చిరి. (1) ఆచారనిరుక్తి (2) దురాచార పిశాచభంజని (3) పతిత సంసర్గప్రాయశ్చిత్తోపన్యాసము, (4) విగ్రహారాధన (5) వైశ్యధర్మదీపిక (6) నౌకాయానము (7) పాశ్చాత్య విద్యాప్రశంస (8) త్రిమతములు (9) పునర్వివాహ విచారణ (10) నమస్కారవిధి (11) శ్రాద్ధసంశయ విచ్ఛేది (12) ఆంధ్రవీధి (13) అభినయదర్పణము (14) కృతులు (15) స్వరజతులు (16) పదములు (17) జానకీపరిణయ నాటకము (18) మనోలక్ష్మీ విలాస నాటకము (19) అచ్చతెలుగు అభిజ్ఞాన శాకుంతల (20) రత్నావళి (21) మాళవికాగ్నిమిత్రము (22) ముద్రారాక్షసము (23) మాలతీ మాధవీయము (24) ఉత్తర రామచరిత్ర (25) మహావీర చరిత్ర (26) కురంగ గౌరీశంకర (27) మంజరీమధుకరీయము (28) సంగీత రసతరంగిణి యను బుద్ధనాటకము (29) తర్కకౌముది యను న్యాయబోధ (3 ) అభినవ గద్య ప్రబంధము (31) సాత్రాజితీవిలాసము (32) లక్షణావిలాసము (33) ఆంధ్ర దేవీభాగవతము మొదలగు గ్రంథములను రచించిరి. వీరి కుమాళ్ళలో నిరువురు హైకోర్టు వకీళ్ళయి వచ్చుటచే తమ యుద్యోగభారమును పుత్రులపై మోపి వీరు వెలికి దొలగిరి. (1895 జూలై )

వీరి సంతానములో గడగొట్టగు శ్రీమతి శారదాంబ 1899వ సంవత్సరములో మృతినొందుటచే మనమించుక కలగి వీరికి ప్రాపంచిక సుఖములందు విముఖత్వ మేర్పడెను. శారదాంబ ఆంధ్రగీర్వాణములయందును, సంగీతమందును, వీణా వాద్యమందును సమర్థురాలు. ఈమెచే రచింపబడిన "నాగ్నజితీపరిణయము" మొదలగు గ్రంథములు కొన్ని గలవు. శ్రీరామపండితులు ఆన 1900 సం॥ మార్చినెలలో దేవీభాగవ తాంధ్రీకరణము నుపక్రమించి యైదు మాసములలో బూర్తిజేసి యారవ మాసమున శుద్ధప్రతిని లిఖించి ముద్రణకొసంగిరి.

పిమ్మట స్వస్థలమగు అల్లూరునకు బోయి సోమేశ్వరస్వామికి ఆలయమును గట్టించిరి. తరువాత కొలదికాలము ఉత్తరసర్కారులయందును, నైజాము రాష్ట్రమందును పర్యటన మొనర్చి యనేక విషయములనుగూర్చి యుపన్యాసముల నిచ్చి 1908వ సంవత్సరము మే నెలలో యేలూరులో కాలధర్మము నొంది దివి కేగిరి.

బెజవాడ,
1—10—1928.

దాసు కేశవరావు.



—: శ్రీ శారదాంబాయై నమః :—

# శ్రీ దేవీభాగవతముయొక్క
# మహాపురాణత్వవిచారము

ఇప్పటివారిలో కొందరు విష్ణుభక్తిపరులు విష్ణుభాగవతమే మహాపురాణమనియు దేవీభాగవత మనునది పూర్వము లేనేలేదనియుఁ జెప్పుదురు. కొందరు శాక్తులు దేవీభాగవతమే మహాపురాణముగాని విష్ణుభాగవతము కాదనియు, విష్ణుభాగవతమును బొప్పదేవుడను వాడు కొన్నాళ్ళక్రిందట రచియించినా డనియు వ్యాసప్రోక్తము కాదనియుం జెప్పుదురు.

పురాణములు రెండువిధములనియు, అందుగొన్ని మహాపురాణములును, గొన్ని యుపపురాణములు నని జెప్పెదరు. కాని మహాపురాణములన్నియు వ్యాసప్రోక్తములే యందురు. ఉపపురాణములలో కొన్ని యితర ఋషులచేఁ జేయబడినవికూడ నున్నవి యందురు. ఈ విషయము నుభయపక్షములవారును ఒప్పుకొనుచున్నారు.

మహాపురాణములయినను ఉపపురాణము లయినను మరి యే తంత్రము లయినను ఏ శాస్త్రము లయినను వ్యాసప్రోక్తములలో మహిమయందు తారతమ్యము కలదని యే యాస్తికుడునుఁ జెప్పడు. ఇప్పటి శాక్తులును, ఇప్పటి వైష్ణవులును జెప్పు విషయములు అగ్రాహ్యములు. ఇందులో నెవ్వరు విశ్వసనీయులు, ఎవ్వ రవిశ్వసనీయులు అని విచారించుట యతిదుర్లభము. కావున భాగవతములు రెండును కల్పితములు అని చెప్పవలసివచ్చును. అస్తికుల కది క్షేమముకాదు. వారి వివాదములు పరిష్కరించ బూనుటకంటె వారి వివాదమును వినకయుండుటయే పరమశ్రేయము.

ఇకను ఏది యుపపురాణమని, ఏది మహాపురాణమని విచారించుట అనవసరము. వ్యాసప్రోక్తమనుటయే చాలును. పూర్వుల యభిప్రాయభేదములతోఁ బనిలేదు. అయినను గొన్ని వ్రాసెద.

**కూర్మపురాణము** – మహాపురాణములలో "భాగవతమే"అని చెప్పి, పిమ్మట ఉపపురాణములలో "పరాశరోక్తం ప్రవరమ్ తథా భాగవతాహ్వయమ్" అని చెప్పినాడు గాని ఇందువలన ఏది మహాపురాణమో, ఏది యుపపురాణమో తెలియదు.

గారుడపురాణమునఁ దత్వరహస్యమున ప్రథమమున మహాపురాణములలో విష్ణుభాగవతమును చెప్పి, పిదప లఘుపురాణములలో, సాత్వికములలో, "తంత్రం భాగవతమ్ దౌర్గమ్" అని దేవీభాగవతము బరిగణింపఁబడినది.

**పాద్మపురాణము** – శకునపరీక్షయందు మహాపురాణ పఠనానంతరమునందు "శైవమాది పురాణం చ దేవీభాగవతం తథా" అని యుపపురాణములలో దేవీభాగవతము పరిగణింపఁబడినది.

**శైవపురాణము – ఉత్తర ఖండము** – "యత్ర వక్తా స్వయం తంత్రే । బ్రహ్మ సాక్షా చ్చతుర్ముఖః । తస్మా ద్బ్రాహ్మం సమాఖ్యాతమ్ । పురాణం ప్రథమం మునే॥ పద్మకల్పస్య మాహాత్మ్యం । తత్ర యస్మా దుదాహృతం । తస్మాత్పాద్మమ్ సమాఖ్యాతమ్ । పురాణం చ ద్వితీయకమ్ । పరాశరకృతం యతు । పురాణం విష్ణుబోధకమ్ । తదేవ వ్యాసకథితమ్ । పుత్రపిత్రో రభేదతః॥ యత్ర పూర్వోత్తరే ఖండే । శివస్య చరితం బహు । శైవ మేత త్పురాణం హి । పురాణజ్ఞా నుదంతి చ॥ భగవత్యాశ్చ దుర్గాయా । శ్చరితం యత్ర విద్యతే తత్తు భాగవతమ్ ప్రోక్తమ్" ఇట్లని దేవీభాగవతము మహాపురాణములలో బరిగణింపబడినది.

**కాళీపురాణము** – "య దిదం కాళికాఖ్యం త । న్మూలం భాగవతం స్మృతం" ఇందువలనఁగూడను దేవీభాగవతము మహాపురాణముగా గణింపఁబడినది.

**ఆదిత్యపురాణము** – "యా జఘ్నే మహిషం దైత్యం । క్రూరం వృత్రాసురం తథా॥ సాద్యరక్తాసురం హత్వా । స్వారాజ్యం తే ప్రదాస్యతి" దీనివలన మహాపురాణత్వము దేవీభాగవతమునకే యీబడినది.

**బ్రహ్మవైవర్తము** – హయగ్రీవ బ్రహ్మవిద్యా । యత్ర వృత్ర వధ స్తథా । గాయత్ర్యా చ సమారంభ । స్తద్వై భాగవతం విదుః॥ దీనిచే దేవీభాగవతమే మహాపురాణమని యెన్నఁబడి యున్నది.

ఈ విధమున నొక పురాణమునందు నొకదానికిఁ బ్రాధాన్యమిచ్చి మరియొక పురాణమునందు మరియొక పురాణమునకు బ్రాధాన్యమీబడినట్లు గానవచ్చుచున్నది.

దీని కొక వింతయేమి ? వ్యాసుండు తా నేదేవతనుగూర్చి యేకథ సెప్పునో ఆ కథకును, ఆ దేవతకును ప్రాధాన్యమిచ్చినది యెవ్వరికి దెలియదు ? అంతమాత్రముచే నం దొకటి ముఖ్యమనియు, మరియొకటి యముఖ్యమనియుం జెప్పట యుచితమా ? 'సోర్ధ్వపుండ్రముఖం దృష్ట్వా వ్రతం చాంద్రాయణం చరేత్' అని చెప్పినచోటనే "తిర్యక్పుండ్రధరం దృష్ట్వా । చండాల మివ సంత్యజేత్" అని చెప్పలేదా ? కావున నుభయపురాణములును ముఖ్యములే అని మనము గ్రహించుట యుచితముకాకున్నది. రెంటికిని లఘుత్వము చెప్పినను చెప్పవలసి వచ్చును.

ఇంతకును వారి వారి భక్త్యతిశయముల ననుసరించి భాగవతపురాణములు రెండింటిలో నొకదానిని వారు వారు పురాణమని యనుకొందురేకాని, నా తాత్పర్యమందు రెండు, భాగవతములును పురాణములనియు, వ్యాసప్రోక్తములనియు, వఠనీయములనియు నమ్ముచున్నాఁడను.

మహాయనియు, ఉపయనియు భేదములు కల్పించుకొని ముఖ్యత్వాముఖ్యత్వములను జెప్పుట యుక్తముకాదని తలంచెదను.

ఇట్లు

దా సు శ్రీ రా ము లు.

శ్రీ శారదాంబాయై నమః

నే నీ భాగవతము రచియించుచో ననుసరించిన రచనమార్గమును దెలియఁజేయుచు, నిందు నా యసామర్థ్యంబునం బొడమిన యెల్లతప్పులనుం బ్రమాదవశంబునం బొడమిన యపరాధంబులను లేఖకాదులవలన సంభవించిన దోషంబులను లెక్కఁజేయక నన్నుం గటాక్షించి క్షమింపం బ్రార్థించుచున్నాఁడను.

ఇప్పటికవులలోఁ గొందరు ఏకైవమతావలంబు లయినవారును, బహుగ్రంథద్రష్టలు కానివారును, పరరంధ్రాన్వేషణతత్పరులును నగువారు, దంభంబుసూపుచు దమప్రావీణ్యంబు పలుకురు గొనియాడుదురో యని యడియాసంజికిఁ యాక్షేపింపం దొరంకొనువారు కలరు. కావున వారల కిందు నా మార్గం బిది యని చెప్పి నాజోలికి వచ్చుట క్షేమంబు కాదవి తొలంగించుకొనుట యుక్తంబని యెంచితి.

—: రేఫద్వయమైత్రి :—

ఈ గ్రంథమున రేఫ, శకటరేఫములకు భేద మించుకంతయిపను యతిప్రాస విషయమునఁ జేకొనలేదు.

—: అఖండవిరామసాధుత్వము :—

ఒక హల్లుమీద నచ్చాదకయుండఁగా మరియొక హల్లుమీద నచ్చాదియుండఁగా హల్లు సంగాతంబు గయికొనంబడివది.

—: మైత్రివిరామము :—

ర, ల మైత్రియు ద, డ మైత్రియు
మ, వ మైత్రియు ఙ, న మైత్రియు
ఙ, క మైత్రియు

—: ఇంచుగ్విరామములు :—

ఇంచు, ఇప్పించు వీని రెంటికిని అచ్చుతోను, హల్లుతోను నుభయంబును బొందు సూపంబడియె.

ఏతాదృశంబులగు విషయంబుల నాత్మ నుంచి యొక చిన్నహొత్తంబును
'వళిప్రాససంశయవిచ్ఛేది' యను పేరిడి
రచియించి యిందుఁ బొందుపరచెద.

శ్రీ

# దేవీభాగవతము

క. శ్రీమానినీదృగుత్పల । సోమాస్యాంబుజమరంద సుఖసంగ్రహణ
స్థేమద్విరేఫపల్లవ । రామా జనమదనశకట రక్షోదమనా.

క. శ్రీసూక్తపురుషసూక్తా । భ్యాసన్యాసాదినిపుణ యతిగణరిపుసం
త్రాసప్రాసాయితపద । భాసురనఖజాలజలజభవనాలోలా.

## —: రేఫద్వయమైత్రి :—

చ. తెలుఁగున బండిరాయనుచుఁ దెప్పరమై యొకయక్కరంబు ధీ
రుల కవితాచమత్కృతుల త్రోవలఁ దొల్లి యొకింతఁ దాకియున్
గలఁకకురాక నాటికిని నాటికిఁ గర్కశకంటకంబుగాఁ
దలపడి కావ్యవిన్మృదుపదక్రమభంగముదోపఁ బేర్చెడిన్.

చ. పరుసనినాల్కలం బడి యబద్ధపు బూమెల వీరభద్రప
శ్చైరమున నారసంబును బలెం గడువింతలుసూపు బండిరా
సరసులు మెచ్చ రజ్ఞజన సంఘము మెచ్చును రాకు బండిరా
యరియట ప్రాసమందు యతియందును హేతువు గాన మెందునన్.

ఉ. వీనులచే వినంబడునవే భువి శబ్దములండ్రు వానికిన్
గానఁగరాదు రూప మయినం బహుభాషల భిన్నరీతులన్
మానవు లక్షరంబు నయనంబులఁ జూడఁగ రేఖ లేర్పడం
గా నలవాటుబూని రది కా చొకలక్షణ మద్ది సత్యమే
యైనను భాష లన్నిఁటను నక్షరరేఖలు నొక్కటే యగున్.

ఉ. రూపముచేత లక్షణము రూఢిగఁ గా దిఁక రాకు బండిరా
కేపగిదిన్ విలక్షణత యేర్పడు లఘ్వలఘుప్రభేదమే
చూపెడి జాతి యొక్కటనుచున్ దగుజాతిని భేదమైన నే
రూపున వేరుసేయఁబడు రోయుఁడు రాయును బండిరాయునున్.

క. అరదాదిపదగతత్వము । తరుచుగ మత్యాదిపదగతత్వము ననుచున్
విరసులు పల్కరయేనిన్ । నెరయాదుల కేదిదిక్కు నేరఁ దెలియఁగన్.

క. అరయాదులు మత్యాదులు । నెరయాదులు ననుచు మూడు నియమములైనన్
నెరయాదులలోని లఘువె । యరయ నలఘువనిన వెలుఁగె యంధతమసమా.

క. నన్నప రెండేభేదము । లెన్నిన మూఁడనుచు బండి నెక్కించిరి యా
నన్నపుఁ గుకవులు మూఢత । కన్నం దగుహేతు వొండు గానము భువిలోన్.

క. ఉభయత నెరయాదులలో । నభయత నిత్యంబెయ్యైన నౌరా చిత్రం
బిభమే మహిషము మహిషం । బిభమనినం దప్పువట్ట నెవ్వం డోపున్.

క. మున్నంతస్థములన్నిటి । కెన్నగ లఘ్వలఘుభేద మిచ్చిన ఘనుఁడౌ
నన్నప యర్థము దెలియక । తన్నుకొనుచుకాక యొండు దలఁప వశంబే.

క. ఆదేశవలిపియశ్రుతి । సాదుగ లఘువులని బహువచనగత ళానుం
బ్రోదిగను ద్విత్వరేఫము । నాదిని లఘువనుచు నన్నపార్యుం డెంచెన్.

తే.గీ. దేవభాషను బొసఁగదు ద్విత్వరేఫ । మాంధ్రమునఁ బెక్కువర్ణంబు లట్టి వుండు
కావునను భిన్నరేఫముగాఁ దలంచి । నన్నప రయోస్తునిత్యమ్మటన్న దగదె.

తే.గీ. కట్టు మొదలగు పదముల గలుగు రేఫ । మాయె నుచ్చారణంబున నలఘు వట్టి
యలఘు వింకొక్కచో నాంధ్రమందయేని । సంస్కృతంబుననేమి యెచ్చటను లేదు.

క. అది గావున వ్యాఖ్యాతలు । మది దోచినయట్లు తప్పుమార్గములఁ జనన్
బదిలం బదియని కొందఱు । ముదిరించిరి పోరు రేఫముల భేదములన్.

క. యతి బెట్టవచ్చు బ్రాసము । నతికింపఁగరాదటంచు ననువారును న
'య్యతియును బ్రాసము గూడదు । గతిలేదా మీకు వేరుగా ననువారున్.

ఉ. ప్రాసములోననైన నొక పాదముమాత్రము భిన్నరేఫతో
బ్రాసములేక మైత్రి గదురం ఘటియింపగవచ్చునం చుప
న్యాసముజేయువా రుభయమైన రకార మటంచుఁ గూర్చుచున్
భాసురమైన యప్పకవి భావ మిదే యనువారునుంగదా.

క. ఆహా । యీరేఫలపై । నూహలు మెండాయెఁ బోరు లుగ్రములాయెన్
మోహము కారణమగుటన్ । సాహసములు వింతలే యసత్యంబులకున్.

తే గీ. అపురపురలోని రా యెట్టు లాయె లఘువు । కఱకులో రాకు నలఘుత గలిగె నెట్లు
తలఁచిచూచిన నిది విరుద్ధంబుగాదె । పలుకుఁబడిలో ప్రకారంబు వలసెనేని.

తే.గీ. అలఘుభావంబు జెడ్డ ళా కాయె నెట్లు । లట్టులే జెడ్డ రా కాయె నలఘుభావ
మిందు వింత యొకింతయు నెఱుకగాదు । కారణములేని భేదముల్ కానమెందు.

ఆ.వె. ప్రకృతి యరవమైన పదములలోని రా । లలఘుభావ మందు ననిన రేడు
నందు రేఫ మెట్టు లాయెనో యలఘువు । నుభయరేఫ మెందునుండి బుట్టె.

ఆ.వె. ఇరువు రేల లఘువు నిద్ద రె ట్లలఘువు । నిందు నెద్ది యరవమరదుఁ బుట్టె
గన్నడమున నెందు గాన మీభేదంబు । నెఱుకలేమి యొండు హేతువందు.

క. శకునంబు లెల్ల వారికి । బ్రకటించిన బల్లి తొట్టె బడి యీల్గిన య
ట్లకటా యప్పకవీంద్రుం । డిఁక నెఱిఁగికి ధరణిఁ బ్రాస మిదియె నదేమో.

క. నన్నయ తిక్కనముఖధిష । హోన్నతు లీ భేద మెఱుఁగ రొక్కింతయు నె
డెన్నోప్పోకల నజ్ఞులు । పన్నిరి తా మెఱిఁగినట్లు భ్రాంతియసుమ్మీ.

క. అప్పకవి తప్పుతెలియక । సెప్పిరి కొందఱు ద్విరేఫసిద్ధాంతము లా
చొప్పున గతానుగతులై । త్రిప్పి యథార్థంబు సెప్పఁ దేకువలేమిన్.

క. కవిసంశయవిచ్ఛేదము । కవిసంశయకారణంబు గాక మఱొండే
భువిలోనఁ బాపులగు మా । నవులకు పుణ్యజను లనెడి నామంబువలెన్.

తే.గీ. అక్కఱాదులలోనిది ముక్కఱనుచు । తిమ్మఁడు నిజాశయము విదితమ్ముజేసె
నప్పకవి శుద్ధ రేఫం బటంచు బల్క । తిమ్మ దప్పని నుడి సమ్మతింపఁడాయె.

రేఫ - శకటరేఫ మైత్రి లక్ష్యములు.

—: అప్పకవీయము :—

చ. లో ౧ పురిటింటపసిబిడ్డ
౨ మురువొప్పన్
౩ గుత్తెఱింగి
౪ ధరణింగూల్చిన

గీ. తేనినామమునకుఁ ।
గ్రింద వంకను మీద

—: అరణ్యపర్వము :—

సీ. లో—రేయి వచ్చెద నని తేపు వచ్చు

—: భాస్కరరామాయణము :—

తేకులన్నియు విచ్చి - దేయెండ ఱిగి నిండ
సీ. లో—రేఖలై మీదటి ఱెప్పలయొప్పున

తిక్కనసోమయాజి.

క. ఉంపిలిఁ బెట్టార్వ సింధురాజున్ దాకెన్

విక్రమార్కచరిత్రము.

తే.గీ. ఈరముల వెన్నెలలోన దూఱితూఱి

విజయవిలాసము.

ఉ. పదా । ఱ్వన్నె పసిండిమేడలకు రాఁ బనియేమి

పాండురంగమాహాత్మ్యము.

క. దుర్లలితాతనువిలసన । నిర్లజ్జాస్వాంతకాంత నేరుపు మెరయన్
జర్జాటలాడు మోహము । లేల్లయి వర్తిల్లు న మ్మహీసురుతోడన్.

సీ. ఇఱులుమించిన వీరి-కురులయందు

చంద్రభానుచరిత్రము.

మ. రవిఁ దీవ్రద్యుతి యంద్రుఁ బావకుని నేఱామంటకాఁడంద్రు

మనుచరిత్ర.

శా. శ్రేణుల్కట్టి నభోంతరాళమున బాఱెన్

సారంగధరచరిత్ర.

ఉ. ఱింగున వల్లెవాటున వ-రించి

పారిజాతాపహరణము.

ఱింగు బండిరా యనినందునకు

ఉ. ఱింగను మ్రోతఁ మ్రోగుచును తెక్కలపాములు

కవిజనాశ్రయము.

క. నెరయంగా నీ ఛందము । తెలఁ గెఱఁగక దివురు నతఁడు

హరివంశము.

ఉ. అంకెలు గర్జలై తనర రావుఁదనమ్మన

ఉత్తరహరివంశము.

క. పరుసని........

ఎఱఁగని

ఆ.వె. అప్పకవియు సూరనాఖ్యుండు తద్భవ । ములను బండిరాలు వొలయ వనిరి ।
కానిమాటలు జీలకఱ్ఱయు గుఱ్ఱంబు । మహి సొనారు నివ్వి । మరచిరొక్కొ.

వ. మరియు నప్పకవి

ద్వివిధాదిదుదేదోతోచో వక్రతమా వనుస్వారౌ క గ చ జ యు గ ట డ ణ త ద న ప బ మ య ర ల వ స హ ళంతు హల్వర్గః అనియుండగా దీనిని దిద్ది తన యప్పకవీయములో వ్రాసెను. ఇది మిక్కిలి సాహసకృత్యము. పూర్వగ్రంథము లిప్పుడు కలవు. చూడ వచ్చును.

అప్పకవి వ్రాసినదే నిజమయినయెడల రర లల యని నాలుగు వర్ణములు కావలసి వచ్చును. అప్పుడు 'లఘువోలఘువశ్చేతి ద్వేథాంతస్థా న్విదంతి శాస్త్రారః' అను సూత్రము

నకుఁ బనిలేదు. ఇదియుంగాక లఘ్వలఘుభేదముచే ద్వివిధత్వ మున్నదికదా. విడిఁగా జెప్పిన నేమిదోషమున్నదనిన అట్టి భేదమే కల యడలే విడిఁగా చెప్పఁబడు కావున చతుర్విధాంతస్థములును ఆ యా విధములలో సజాతీయములే కావున భేదము లేదు.

తక్కినది పూర్వోక్తగ్రంథంబునం దెలియందగు. ననంతరంబ

చ. అవనిఁ దెలుంగుబాస బ్రథమాక్షరమున్ వళియంచు నింక రెం
డవయది ప్రాసమంచు జరణంబులలో నియతక్రమంబునన్
గవఁగొనగా విచక్షణగణం బొనరించెను దొల్లి యందుచే
నవిరళమాధురీమహిమ మబ్బెను గబ్బములందుఁ దెల్గునన్.

తే.గీ. అర్థమే జీవము పదంబె యంగమయ్యె । నర్థగతమౌ నలంకార మది గుణంబు
పదగతము సొమ్ముగుం గావ్యభామినికిని । దీని దెలియంగవలయును ధీరవరులు.

క. వళియుం బ్రాసయు పదగత । ములయిన నగలవ్వి కావ్యముల కతిముఖ్యం
బులు గావుగాని పెద్దలు । తెలుగుంగన్నియకు నొడలఁ దీర్చిరి సొమ్ముల్,

తే.గీ. వారిపద్ధతి మన మేల వదలవలయు । నట్టివే యగుగాక యిం దకరణమునఁ
గరణమునఁ బ్రత్యవాయముల్ కానరావు । కానఁ గరణంబె సేకొనం గడుసుఖంబు.

తే.గీ. అకరణంబునఁ బ్రత్యవాయంబటన్న । సంస్కృతాదుల కవితల స్వర్గహాని
కరులె యగుఁ దెలుఁగునందుఁ నాచరణహాని । యనిన నేఋషియాచార మడఁగిపోవు.

తే.గీ. నన్నయాదులె ఋషులన్న నన్నయాదు । లందునుఁ దెనాలి రామకృష్ణాఖ్యుఁడుండఁ
దగడె యప్పకవికి మున్న ధన్యులైన । భాస్కరాదుల మతములు బ్రబలకున్నె.

తే.గీ. ప్రత్యవాయవిచార మేపగిది నున్న ।నాచరణభంగదోష మెట్లైన నాదు
మతము ప్రాసమ్ములను విరామముల వదలు । దనుట గాదుసుఁడీ వినుఁ డార్యులార.

క. మృదుమధురతాదిగుణములు । పదములకును నర్థములకు బ్రాపింపఁగ నె
య్యది సులభసాధ్య మా మత । మెదనిడి ప్రాసముల యతుల నిడుఁడు సంసతన్.

సీ. కూచిమంచిసమాఖ్యకులుడు తిమ్మన తన । సర్వలక్షణసారసంగ్రహమున
మహి నఖండవిరామ మహిమంబు నొప్పియు । లక్ష్యము ల్చూపియు లలితశాస్త్ర
పద్ధతి విడనాడి పౌనరుక్త్యంబుగా । బ్రాదినిత్యసమాస యతులు సెప్పె
నిత్యప్రభువిభాగ నియమంబులకు వేరె । కారణం బొక్కటి కానరాదు

తే.గీ. మైత్రిగల వర్ణములు విరామంబు లగును । హల్లునకుమీద నూదిన యచ్చునకును
ఇది సమమకాదె యన్నింటి కెంచిజూడ । నప్పకవియు నఖండంబు సెప్పఁడాయె.

క. భూమి నఖండయతియనుచు । నామమిడినవారు లక్షణము లక్ష్యంబున్
వేమారు సూపియుండఁగ । నేమీ యది యొప్పఁదగదె యిప్పటికవికిన్.

క. రామాయణంబు సెప్పిన । ధీమంతుఁడు భాస్కరుండు తీర్పఁడె వళిఁ దా
నేమన్నఁ గొఱతలేదను । చో మండనపదముగూర్చి సూక్తముగాఁగన్.

క. పూర్వవిచక్షణమార్గము । సర్వము విడనాడి తాన సకలవిదుఁడ నం
చుర్విన్ వర్తించి మహా । గర్వము గైకొనిన యప్పకవియే దిక్కో.

క. ఎద్దేని యొక్కలక్ష్యము । పెద్దల లక్ష్యములలోనఁ బెరసిన నదిగో
కద్దనుచు సంతసంబున । దిద్దంగారాదె కవిత ధృతినాథునకున్.

క. ఒక కవి నీవాఁడేనియు । నొక కవి నావాడుగాడె యుభయకవులలో
బ్రకటింపఁగలమె భేదం । బకటా వితలైన వెతల నందఁగనేలా.

క. అనయత ద్వివిధాదిదుదే । యనుసూత్రము దిద్ది వ్రాసి యప్పకవి ద్విరే
ఫనియతనిర్ణయపదమె । ల్లను జెడనాడ్చెను విచారరహితమనీషన్.

క. య ర ల వ స హ ళం తనుచున్ । సరసముగా నుడివినట్టి చరణము దిద్దెన్
యరయుగల యుగ యటంచును । విరసపు పాదంబు వెట్టె వేడుకనొక్కో.

క. రయుగంబే నిజమైనన్ । యయుగం బది యేలచెప్పఁ దజ్ఞుడకాన
నన్నయ లఘువని యలఘువునని । రయుమున నననేల యక్షరమె వేరైనన్.

క. ఈదాడనఁగోదాడని । వాదంబుల తాను నిలుప వలయునెఫలమే
మీ దీన మానరాదా । కాదనినను గాకదంత గణనంబెకదా ।

క. స్రోవం గవితామృతధా । రావాహిని కడ్డమైన రాయే మనకి
ష్టావాప్తి యెట్లుసేయున్ । రా వహ్నివశంబు బండిరా యెట్టిదియో.

తే.గీ. ఇంచునకు నజ్ఝులులు యతు లుంచినట్టు । యెఱ్ఱనాదులు సత్కవు లేని వేర
యెంచనేటికిఁ జాలదా మంచివారి । కంచితమ్మగుపద్ధతి యార్యసేవ.

క. అక్షీణలక్షణంబు సు । లక్షణసారంబునందు లక్ష్యగణంబుఁ
లక్షణగణమును గొనఁజను । దీక్షయొకటి చాలదే యతిప్రాసములన్.

భారతము ఆదిపర్వము.

ఉ. మహోర్వీసుఁడ సర్పయాగ ముడిగింపుము

భాస్కర రామాయణము.

ఉ. ఏ । మన్నఁ గొఱంతలేదు మణిమండనముఖ్యములైన

కవిజనాశ్రయము.

ఉ. మానుగవిశ్రమాక్షరసమన్వితమై స్వరమూదినన్ దదీ
యానుగుణాక్షరంబు గొనియైనను చెప్పగవచ్చు నెట్లనన్
భానుసమానుఁడైన వృషభాధిపుఁ డన్నటు లర్థయుక్తమై

అరణ్యపర్వము.

చ. మహోఁదరమున నుగ్రమైనవికృతాకృతి
ఉదరపదమున రెండు పదములు లేవు. గురుబాలప్రబోధిక చూడుడు.

ర ల మైత్రి

కవిజనాశ్రయము.

తే.గీ. లలితవీణారవంబుతో ఢక్కసరియె । రమ్యమణిరాజరాజితో లక్కసరియె
భరితభువనార్ణవంబుతో వంకసరియె । ననఁగ జెల్లు నభేదాఖ్యయతులు కృష్ణ.

వసుచరిత్ర.

శా. రోలంబాలకయోర్తుగ్రుంకి బిసవల్లుల్ దున్మి
సీ. రాయంచకాళ్ళఁ దౌలకయమున్న.

తిక్కనసోమయాజి భారతమున

క. తెంపును బెంపునుఁ గదురని । లింపులు వెరగందిచూడ రిపుసైన్యంబుల్
గంపింపఁ దమ బలంబులు । ఱంపిలి బెట్టార్వ సింధురాజున్ దాకెన్.

ప ఫ బ భ వ ల కు మై త్రి

సులక్షణసారము.

క. వపయోరభేదమనియెడి । నెపమున ప ఫ బ భ లు వా కు నేర్పున వళిగా
నుపమించవచ్చుఁగృతులం । దుపనిషదుచితార్థసూక్తు లొలసినచోటన్.

ప భ మ మై త్రి

పంచబాణవిలాసము.

క. చిత్తంబులు రంజిల్లుచు । ముత్తైదువు లవుడు గదిసి పూవిల్తునకున్

లక్షణసారసంగ్రహము.

క. మ్రొక్కులు గైకొనుసమస్త భువనాధీశా.
వ ప మ భ లకు మైత్రి కలిగెం గావున వ మ లకు మైత్రి వేరే చెప్పంబనిలేదు.
ప ఫ భ లు—సమానములు, అభేదము.

మ ప భ లు—సమానములు, అభేదము
కావున వ మ లు సమానములే యగును.

ఇదియుంగాక ప ఫ బ భ మ వ ఈవర్ణము లోష్ఠ్యములు కావున సమానాధికరణ్యము గలదు. సజాతీయత్వముఁగూడఁ జెప్పవచ్చును.

అనంతచ్ఛందము.

క. ధర నెక్కటి వళ్ళనదగు । ల ర మ ఱ వ లు వానితోఁ దొలంగక లాకున్
సరి ళా యని మిశ్రమవే । ళ రమాధిప రెండునుం బెరసి వర్తించుఁగా.

ఆ. వె. మరునితండ్రి లోకపాలుండు యాదవ

ణ జ్ఞ న మైత్రి

శృంగారనైషధము.

ఉ. శ్రీలలనాతనూభవ విశేషజగన్మయమూల మన్మథా
జ్ఞాలతికాలవాల రతినాథ కరాళమదాంధగంధభుం
డాలవిలోల తద్భుజకసత్కరవాల నిశాల శుభ్రవా
తూల మదీయకాంతధృతిఁ దూలఁగ నేపున వీవకుండుమీ.

అనంతచ్ఛందము.

తే.గీ. అప్రసిద్ధము జఞలు శబ్దాదియందు । జఞలు సంతతద్భవవ్యాజమునను
ణనలతో నొందు విరతి విజ్ఞప్తియనఁగ । జలరుహాక్షాశ్రితులను సుజ్ఞాను లనఁగ.

జ్ఞ క మైత్రి

అప్పకవి దీని విశేషవళి యని పేరుబెట్టి

తే.గీ. సాధుకవులును కొందరు జ్ఞ లిపులందు । జెప్పిరి కకారమును వళిఁ జేసి తొల్లి

శాంతిపర్వము.

క. జ్ఞానము కేవలకృప న । జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రకాశము సేయఁగా
ఇందున కనేక లక్ష్యంబులు గలవు. గ్రంథవిస్తరభీతిచే వ్రాయలేదు.

ఇంచుగ్విరామము

ప్రద్యుమ్నోపాఖ్యానము.

క. పంచశరుం డపు డని చా । లించి మహాప్రధనభూమి వీక్షించి

లక్షణచూడామణి.

క. ఇంచియను నచ్చుహల్లు ను । దంచితముగ సంధిగూడు నప్పుడు భిన్నం
బెంచగఁబోలు హంఁ బలి । కించెననఁగా రెండు సెల్లు నెలమిన్ గృతులఁగా.

లక్షణముక్తావళి.

క. కాంచనచేలునిఁ బ్రేమ ను । తించెఁ నుతియించెననఁగ నిల భిన్నంబౌఁ
గొంచక పోషించెఁ బో । షించె ననఁగ భిన్నవిరతి యిటుల సెలంగుఁ.

దశకుమార చరిత్రము.

కం. మించి మదించిన రిపుల హ । రించక సత్కీర్తి యీమహీతల మెల్లఁ
నించక దీనుల దయ బో । షించక ప్రఖ్యాతిగల్గునే నరనాథా.

హరివంశము.

క. ఎంచగ నొనరింపగ నుపరమింపఁగ నితఁడే

ద - ధ మైత్రికి

సులక్షణసారము.

క. ద ధ లకు భేదము లెన్నక । వడియును బ్రాసంబు లిడఁగ వచ్చును గృతులం
దది యెట్లన్నను శ్రీహరి । దొడిబడి దానవులతలలు ద్రుంచె ననంగఁ.

శ్రీనాథుని వీధినాటకము.

ఉ. కందుకకేళిసల్పెడి ప్రకారమునం పురుషాయితక్రియా
తాండవకేళి సల్పెడి విధంబునఁ బాపనభామ లేఁత నీ
రెండఁ బ్రభాతవేళ రచియించెను గుబ్బలమీద హారముల్
కుండలముల్ కురుల్ గదల గోమయపిండము లింటిముందటఁ.

మఱియు నొకానొకచో నీగ్రంథంబున వికారసంధి యుక్తాద్యక్ష సంధియు నంగీకరింపఁ
బడియె.

ఇందుకు

నరసభూపాలీయము.

సీ. చలిగాలి వేదన్న జనవిరుద్ధము

విజయవిలాసము.

ఇటుజూ పటు లటుజూ పిటు

అప్పకవీయము.

గు । త్తెరిగి గష్టంబుగ

ఇత్యాదు లనేకంబులు జూపఁబడెని.

వళిప్రాససంశయవిచ్ఛేదము

సంపూర్ణము.

# విషయసూచిక

## —: ప్రథమస్కంధము :—


| పుట. | విషయము. |
|---|---|
| 36 | శ్రీదేవీభాగవతస్కంధ సంఖ్యాది కథనము |
| 39 | పురాణసంఖ్యాది వివరము |
| 41 | శుకోత్పత్తి |
| 45 | హయగ్రీవావతారము |
| 52 | మధుకైటభోత్పత్తి |
| 55 | బ్రహ్మకృత విష్ణుయోగనిద్రాస్తుతి |
| 56 | శక్తిస్వరూప కథనము |
| 59 | మధుకైటభయుద్ధము |
| 64 | వ్యాసకృతతపశ్చర్య |
| 66 | బుధోత్పత్తి |
| 73 | సుద్యుమ్నోపాఖ్యానము |
| 79 | శుకోత్పత్తి |
| 82 | శుకకృత సంసారనింద |
| 86 | దేవీభాగవతోత్పత్తి |
| 89 | శుకుండు మిథిలాగమనంబుసేయుట |
| 93 | శుకజనక సంవాదము |
| 100 | ధృతరాష్ట్రాద్యుత్పత్తి |


## —: ద్వితీయస్కంధము :—


| పుట. | విషయము. |
|---|---|
| 105 | మత్స్యగంధ్యుత్పత్తి |
| 110 | గంగాశాపప్రాప్త్యాదికథనము |
| 112 | గాంగేయోత్పత్తి |
| 115 | సత్యవతీ శంతను సంవాదము |
| 119 | ధృతరాష్ట్రాద్యుత్పత్తి |
| 123 | యుధిష్ఠిరాది చరితము |
| 128 | ధృతరాష్ట్రాది మరణవృత్తాంతము |
| 130 | పరీక్షిచ్ఛాపనివృత్త్యుపాయచింత |
| 135 | జనమేజయ రాజ్యప్రాప్తి |
| 139 | వ్యాసజనమేజయ సంవాదము |


## —: తృతీయస్కంధము :—


| పుట. | విషయము. |
|---|---|
| 143 | జనమేజయకృత దేవీస్వరూపాది ప్రశ్న |
| 145 | దేవీభాగవతావతరణము |
| 147 | బ్రహ్మాదులకు భువనేశ్వరి దర్శనమిచ్చుట |
| 151 | విష్ణుకృత భువనేశ్వరీస్తుతి |
| 153 | శివకృత దేవీస్తవము |
| 156 | బ్రహ్మాదులకు భగవతి నిజరూపము నుపదేశించుట |
| 160 | బ్రహ్మాండోత్పత్తి |
| 163 | సత్త్వాదిగుణముల స్వరూపము |
| 166 | సత్యవ్రతోపాఖ్యానము |
| 172 | దేవీయజ్ఞవిధి |
| 176 | విష్ణుకృత దేవీయజ్ఞము |
| 179 | ధ్రువసింధూపాఖ్యానము |

పుట. విషయము.

181 యుధాజిద్వీరసేనుల యుద్ధము
185 యుధాజిత్తు భరద్వాజాశ్రమమునకు బోవుట
187 సుదర్శనునకుఁ గామబీజప్రాప్తి
191 శశికళా స్వయంవరము
218 నవరాత్ర మాహాత్మ్యము
219 శీలోపాఖ్యానము
221 శ్రీరామచరితము

—: చతుర్థస్కంధము :—

234 జనమేజయకృత కృష్ణజన్మాది కారణ ప్రశ్న
236 సకల ప్రపంచ కర్మ కారణత్వ విచారము
239 వసుదేవాద్యవతార కారణము
242 సంసార విముక్త్యుపాయము
246 ఇంద్రకృత నరనారాయణ తపోవిఘ్నము
252 ప్రహ్లాద నారాయణ సమాగమము
256 ప్రహ్లాద నారాయణ యుద్ధము
259 హరికి భృగుశాప కారణము
262 శుక్రుని గూర్చి జయంతి పోవుట
265 గురుకృతాసుర ప్రలోభనము
267 దైత్యులకు శుక్రసంప్రాప్తి
274 విష్ణుని నానావతార కథనము
276 కృష్ణావతారాది ప్రశ్న
277 కృష్ణావతార కారణము
280 విష్ణ్వాదికృత దేవీస్తుతి
283 దేవీమాహాత్మ్యాది వర్ణనము
286 కంసకృత దేవకీప్రసూతవధ
291 శ్రీకృష్ణజననము
295 శ్రీకృష్ణలీలా ప్రారంభము
300 శ్రీకృష్ణ కించిజ్ఞత్వ కారణము

—: పంచమస్కంధము :—

305 శివకృష్ణులయుత్కర్షాపకర్ష విచారము
308 మహిషాసురోత్పత్తి
316 దేవదానవ యుద్ధము
318 దేవతలు పలాయనులగుట
324 దేవీస్వరూప ప్రాదుర్భావము
325 దేవికి ఆయుధప్రాప్తి
327 దేవికిని మహిషాసురదూతకును సంవాదము
334 దేవినిగూర్చి తామ్రదూతను బంపుట
335 దేవీ తామ్రుల సంవాదము
338 బాష్కల దుర్ముఖులు దేవిపై వెడలుట
340 చిక్షుర తామ్రులు దేవిపై వెడలుట
345 అసిలోమ బిడాలురు దేవితో యుద్ధంబు సేయుట
345 మహిషాసురుఁడు దేవిపై దండెత్తుట
346 దేవీ మహిషాసురుల సంవాదము
347 మందోదరి యనుదాని కథ
350 దేవీ మహిషాసురుల యుద్ధము
354 సూర్యవంశభవుడగు శత్రుఘ్నపాలన క్రమము
354 శుంభ నిశుంభు లను రాక్షసులను దేవి జయించుట
355 రక్తబీజాసురుని మహిమ

పుట. విషయము. పుట. విషయము.

364 ధూమ్రలోచనునితో యుద్ధము
367 చండముండుల యుద్ధము
371 రక్తబీజాసురుని యుద్ధము మొదలయినవి
372 రక్తబీజ యుద్ధము
377 సురథోపాఖ్యానము


—: షష్ఠమస్కంధము :—


388-420 వృత్రాసుర చరిత్ర
నహుష చరిత్ర
యుగధర్మములు
హరిశ్చంద్ర ప్రశంస
నిమి ప్రశంస
నిమి వశిష్ఠుల పరస్పరశాపములు
విదేహ చరిత్రము.
421 హైహయుల వృత్తాంతము
422-429 హైహయకథాపూర్తి
లక్ష్మి యాడుగుఱ్ఱమగుట
429 ఏకావళీ వృత్తాంతము
434 వ్యాసుండు తన యిడుముల నుడువుట
436 నారదునకు మర్కటత్వప్రాప్తి
441 నారదునకు శాపవిముక్తి
442 నారదుని నారాయణుండు స్త్రీని జేయుట
447 నారదునకు స్త్రీత్వ నివృత్తి


—: సప్తమస్కంధము :—


452 సూర్యవంశానుక్రమము
480 హరిశ్చంద్రోపాఖ్యానము
511 శతాక్షీదేవి మహిమ
513 శతాక్షీదేవి వర్ణనము
515 గౌరీ లక్ష్మి వాణీ చరిత్రములు
524 దేవీగీతలు


—: అష్టమస్కంధము :—


545 మనువునకు దేవి వరమిచ్చుట
547 స్వాయంభువ మన్వాది కథనము
548 ప్రియవ్రతవంశ వర్ణనము
549 భూగోళవిస్తారాది వర్ణనము
550 ఇతరద్రుమాది వర్ణనము
551 మేరుపర్వత వర్ణనము
552 ఇళావృత వృత్తాంత వర్ణనము
554 వర్షాంతర్గత సేవ్యసేవక విచారము
558 ద్వీపాంతర సమాచారము
560 శిష్టద్వీప సమాచారము
561 లోకాలోక పర్వత వర్ణనము
562 రవిగమన మాంద్యాది ప్రకారము
565 చంద్రగమనాదులు
566 ధ్రువమండల సంస్థానము
667 రాహుమండల సంస్థానము
567 అతలాది లోకత్రయ వర్ణనము
569 తలాతలాది లోకచతుష్టయ వర్ణనము
571 ఆదిశేష స్తుతి – నరకాది స్తుతి
572 యాతనా నరక పాతనాదులు
576 దేవ్యారాధన క్రమము

## —: నవమస్కంధము :—


పుట. విషయము.

580 దేవీకృత ప్రకృతివిధానము

580-612 బ్రహ్మాదులయొక్కయు బ్రహ్మాండములయొక్కయు లోకముల యొక్కయు నానావిచారములు. సరస్వతీ మహిమ మొదలగు ననేక విషయములు వారాహి యగు భూదేవీ మహిమ.

612 గంగోత్పత్తి క్రమము

613 భగీరథకృత శ్రీకృష్ణ స్తవము

638 వేదవతీ తులసీ మాహాత్మ్యము

670 సావిత్ర్యుపాఖ్యానము

671-675 సుకృత దుష్కృత భేదములు, ఫలములు మొదలగునవి

పుట. విషయము

676-708 నరకకుండాదులును నరకలోకవాసమున కర్తలును ఆయాభేదములును అతివివరముగా సావిత్రికి యము డుపదేశించుట మొదలగునవి

709 మహాలక్ష్మ్యుపాఖ్యానము

712-716 ఇంద్రునకు లక్ష్మి తొలఁగుట

716 ఇంద్రాదులు బ్రహ్మలోకంబునకు బోవుట

719 శ్రీమహాలక్ష్మిపూజా మంత్రాదులు

721 స్వాహా చరిత్రము

734 మనసోపాఖ్యానము

742 సురభ్యుపాఖ్యానము

744 రాధా దుర్గా పూజావిధానము


## —: దశమస్కంధము :—


751 స్వాయంభువ మన్వాఖ్యాన వర్ణనము

752 వింధ్యాచల వృత్తాంతము

753 వింధ్యకృత భానుమార్గ నిరోధనము

755 ఇంద్రాదులు రుద్రుని స్తోత్రము చేయుట

756 రుద్రాదికృత విష్ణుస్తుతి - దశావతారస్తుతి

758 ఇంద్రాది కృతాగస్త్య ప్రార్థన

758 అగస్త్యకృత వింధ్యవృద్ధి కుంఠనము

759 స్వారోచిషాది మనుచరిత్రము

760 చాక్షుష మనూపాఖ్యానము

760 వైవస్వత మనూపాఖ్యానము


## ....: ఏకాదశస్కంధము :....


772 సదాచారవిధి క్రమః

777 స్నానవిధి

780 జపమాలావిధి

783 రుద్రాక్షమంత్రలక్షణవిన్యాసము

784 భూతశుద్ధి

785 శిరోవ్రత విధానము

786 గౌణభస్మాను వర్ణనము

789 కల్పాంతరోక్త భస్మధారణలక్షణము

| పుట. | విషయము. | పుట. | విషయము. |
|---|---|---|---|
| 790 | త్రిపుంద్రోర్ధ్వపుంద్ర మహిమ | 805 | గాయత్రీ పురశ్చరణకర్మ |
| 799 | సంధ్యాది కృత్యము | 807 | వైశ్వదేవాది విధానము |
| 801 | శ్రీదేవీపూజా విశేషము | 809 | పురశ్చర్యా నియమములు |
| 803 | మధ్యాహ్నిక సంధ్యాదిః | 812 | కామ్యకర్మాది విధి |
| 804 | బ్రహ్మయజ్ఞ విధానము | | |

—: ద్వాదశస్కంధము :—

| | | | |
|---|---|---|---|
| 818 | గాయత్రికి ఋష్యాదులు | 835 | దీక్షావిధి |
| 820 | గాయత్రియొక్క శక్తివర్ణాదులు | 842 | కేనోపనిషదర్థ వర్ణనము |
| 820 | గాయత్రీ కవచము | 846 | బ్రాహ్మణులకు గౌతమశాపము |
| 822 | గాయత్రీ హృదయము | 850 | మణిద్వీప వర్ణనము |
| 823 | గాయత్రీ స్తోత్రము | 860 | పురాణఫల ప్రదర్శనము |
| 825 | గాయత్రీ సహస్రనామములు | 862 | దేవీభాగవత మహిమ |


★

శ్రీ ర స్తు

శ్రీ శారదాంబాయై నమః

# శ్రీ దేవీ భాగవతము

## కృత్యాది దేవతా స్మరణాదికము

—: కృతిపతి దేవతా స్మరణము :—

శా. శ్రీగౌరీనయనాబ్జకజ్జలమునన్ • జిల్మారునోష్ఠంబు గం
గాగోత్రస్తనిమోవిపానకమునన్ • జొళించి తద్దత్తరే
ఖాగోపార్థము భూతిలిప్తతనుఁడై • కన్పట్టు దాక్షిణ్యవి
ద్యాగంభీరు మదిం దలంచెద సదా • యల్లూరి సోమేశ్వరున్ ॥

—: గౌరీ ప్రార్థనము :—

సీ. నల్లమబ్బులచాయ • లల్లారు తలకట్టు। సన్నజాబిలిరేఖ • సరస కౌరయ
లలితనితంబలీ•లాకలాపంబుల। పైపయిం గురువింద•పఙ్క్తి మెఱయ
పాదాగ్రములజొత్తు•పట్టెల నందంద। నఖరకాంతులు తంద•నాలు సలుప
చందనాగరు సువా•సన లీను తరులలోఁ। జిలుగారు పొగసోగ • చెలువు గులుక
తే.గీ. భూరిమహిమ మహాదేవ • భోగ్యమగుచు। దనరు కూటమ్ములు కృతార్థ•తను వహింప
దండ్రిపోలిక నౌన్నత్యం•దశను బూను। కలికి గౌరమ్మ మాపాలఁ • గలుగు మమ్మ ॥

—: శ్రీ కృష్ణ ప్రార్థనము :—

చ. పొలుపగు నల్లకానుగుల • పుంతను యామునభూమి రాత్రులన్
జెలువములీను గొండెసిగ • జెర్విన బర్హము గుల్కఁ గస్తురిన్
జిలికిన గీరునామ మిడి • చీకటితప్పుల కొప్పురీతితోఁ
జెలగి వ్రజాంగనాసుఖము • జెందిన కృష్ణుడు మమ్ము నేలుతన్ ॥

—: మహాలక్ష్మీ ప్రార్థనము :—

సీ. ఏమానినీరత్న • మెదవాయ దీఱుని। తొమ్మునందును వీక్ష•ణమ్మునందు
ఏసతీతిలకంబు • భాసిల్లె సహజయై। నాగంబునకు నిర్జ•రాగమునకు
ఏవధూమణి జగ•ద్ధితయయ్యె దేవమ•తల్లియైయును గన్న•తల్లియయ్యు
ఏస్త్రీలలామం బ•మృతవార్ధి కుదయించె। శ్రీలతో శృంగార•లీలతోడ

తే.గీ. ఏవిలాసిని సాపత్న్య • మెన్నబడియె । ధాత్రిచేతను సీలాసు•గాత్రిచేత
నట్టి యఖిలాండకోటి వే•ధోండమాత । కలిమిదేవత మాయింట • నిలుచుఁగాత ॥

—: బ్రహ్మ స్తవము :—

చ. కడుపును గద్దెయుఁగా సిరికిఁ • గాపురమై సిరి మాతృభావముఁగా
బడయఁగ వాక్సతీమణి ది•వాణము మోమయి వాక్కు భార్యగా
నడరఁగ లోకనాథ చతు•రాస్య మహాంకములంది దేవతా
వళులకుఁ బెద్దగాఁ గులుకు • బ్రహ్మ చిరాయువు మా కొసంగుతన్ ॥

—: సరస్వతీ స్తవము :—

సీ. అనయంబుఁ దలవాకి•లి నివాసముగ నిల్చి । యేవెలంది వరసా•హిత్య మెనసె
సతతంబు గణవృత్తి • సామాన్యయై యొప్పి । యేకొమ్మ సత్యమం • దిఅవుకొనియె
నిరత సురాగ తా•ళ రసప్రచారయై । యేచాన విద్యాస•మేతయయ్యె
నిత్యంబు వస్త్రభా•రత్యాగవిముఖియై । యేలలన పదార్థ • మూలయయ్యె

తే. గీ. సర్వదా నిఖిలవర్ణసం•సక్తయగుచు । నేపడంతుక శుద్ధవ•ర్ణేద్ధయయ్యె
నట్టి యద్భుతచరిత య • య్యజునిగరిత । పలుకుదేవత నానోట • నిలుచుఁగాత ॥

—: విఘ్నేశ్వర స్తుతి. :—

చ. అలవడు నెద్దు సింగమును • నంచయు నేనుఁగు మేక దున్న రా
చిలుకయు నెమ్మి వాహన వి•శేషము లొట్టొకవింతగా దటం
చెలుకహుమాయి వీపుపయి • నెక్కి సికారులు సేయునట్టి యం
కిళులనబాబు నాదుకృతి•కిం దొలగించుత నంతరాయముల్ ॥

—: శ్రీ వీరాంజనేయ స్తవము :—

సీ. పాథోధి సంసార • పాథోధితోఁగూడ । దరియించె నే వనే•చరవరుండు
రామాఖ్య లోకాభి•రామాఖ్యతోఁగూడ । గ్రహియించె నేమహా•కవివరుండు
రాగోద్యమము వీత•రాగోద్యమముతోఁడ । నలరించె నేమహా•ఫలభుజుండు
అరివర్గవధ మదా•ద్యరివర్గవధతోఁడ । నొనరించె నేమహా•వినయశాలి

తే.గీ. నట్టి మహనీయు నక్షశి•క్షాభిధేయు । సర్వదాజేయు విబుధవి•చారణీయు
భూరితత్వామరుద్రుమ • మూలనిలయు । నిత్యశుభకాయు వీరాంజ•నేయుఁగొలుతు ॥

—: ఇష్టకామేశ్వరీ స్తవము :—

చ. జలమును వేడి శంభుని ని•శాతశరంబున నుర్వినుండి వె
ల్వడఁ గని దోయిలించి పది•లంబుగఁ దాఁ బదిమార్లు గ్రోల న

గ్గడియన గౌరికిం గనులఁ • గల్గిన చల్లవితల్లి దేవతా
తిలకము కామసుందరి స•తీమణి మాయిలువేల్పు గొల్చెదన్ ॥

—: వ్యా స మ హ ర్షి స్త వ ము :—

చ. ప్రణుతకళాప్రవీణుఁ దను•భాసితపావనభూతిరేణు ని
ర్గుణపరతత్త్వబోధరస•రూఢివిచక్షణుఁ గృష్ణచర్మధా
రణుఁ గరుణాధురీణు గుణ•రత్న విభూషణు శత్రువర్గశి
క్షణు భజియించెదన్ శ్రుతివి•చారపరాయణు బాదరాయణున్ ॥

—: కృ తి క ర్తృ జ న నీ జ న క స్మ ర ణ ము :—

ఉ. ఉల్లము రంజిలంగ దయ • లుట్టి పడంగ సమస్తభంగులన్
బిల్లదనంబునందు ననుఁ • బెంచి కడున్ సుతవత్సలత్వమున్
దెల్లముసేయు కామమ స•తీమణిఁ గన్నయమంత్రిమౌళి నా
తల్లిని దండ్రినిన్ హృదయ • తామరసంబున నిల్పి కొల్చెదన్ ॥

—: కృ తి క ర్తృ కు మా రి కా స్మ ర ణ ము :—

సీ. తనతొమ్మిదవయేట ♦ ననుపమానప్రజ్ఞ । నింపుగా వీణ వా•యింప నేర్చె
తన పదియవయేట • సునిశితంబగు బుద్ధి । దాకొల్పె నేకసం•తగ్రహణము
తన చతుర్దశశర•త్తున ముద్దుముద్దుగా । నల్లిబిల్లిగఁ బద్య • మల్లనేర్చె
తనదు పదార్వ వ•త్సరమున నగ్నజి । జ్జావివాహప్రబం•ధంబు సెప్పె
తే.గీ. తనదు పందొమ్మిదవవర్ష•ముననె మర్త్య । భావమునుమాని శాశ్వత • బ్రహ్మలోక
సిద్ధిఁగనె శారదాంబ నా • చిన్నికూతు । ననుదినంబును మఱువక • యాత్మనుంతు.

—: కృ తి క ర్తృ బం ధు స్మ ర ణ ము :—

సీ. ఏవానితోఁగూడి ♦ యిసుకపై గురులఘు । ప్రస్తారపఙ్క్తులు ♦ వ్రాసినాఁడ
ఏవాని బిడ్డగా ♦ నెంచి మాతలిదండ్రు । లంచితప్రేమ బో♦షించుకొనిరి
ఏవాడు సాత్రాజి ♦ తీవిలాసముసేయు । చున్న దోడయ్యె నా ♦ పిన్ననాఁడు
ఏవాడు ననుఁబిల్చి ♦ యిదిచూడుమని గీత । గోవిందమును దెలుం♦గున రచించె
తే.గీ. నతని సుమతుని నామేన•యత్తసుతుని । ఉప్పలూరిమహాన్వవా•యోత్థితుని మ
హితుని సంతతపతితసం•హితుని ధీర । హితుని గనకాఖ్య కవిలోక•హితునిఁదలతు.

—: పూ ర్వ క వి మ హి మా భి వ ర్ణ న ము :—

సీ. పెనుపుట్టలోనుండి ♦ జననమందిననేమి । కోతి బిడ్డెయటంచు ♦ గొణగనేమి
కుష్ఠరోగముతోడఁ ♦ గూరుచుండిననేమి । మిండకాఁడని దూరు ♦ లుండనేమి

బేరాలపెద్దని • పేరుజెందిన నేమి । మినపగారెలు పెక్కు • మ్రింగనేమి
భామామణుల కొట • పాటఁజెప్పిననేమి । యలర గోవర్ధనుం • డైననేమి,

తే.గీ. కానఁబడనేమి తిక్కనా • గంగలోన । ముణుగగానేమి విసువక • పొలము దున్ని
బ్రతుకఁగానేమి జ్ఞానప్ర•భావలలిత । కలితకవిత బుధస్తోత్ర • కారణంబు.

—: ఆధునికకవి స్మరణము :—

ఉ. ఇప్పటి పండితోత్తముల • నెందఱి నే గణియింపనేర్తు నీ
చెప్పినగ్రంథమంత మఱి • చెప్పనఁ జాలదు తద్గుణావళుల్
కుప్పలు నానమస్కృతులు • కోటులు వారి కొనర్చి యీకృతిన్
దప్పులు గల్గునేని కని • తద్దయుఁ బ్రేమ క్షమింపగోరెదన్.

ఉ. ఈశ్వరభక్తియుక్తుని క్షి•తీశ్వరమాన్యుఁ బరోపకారితా
శాశ్వతకీర్తిఁ గామముఖ • శత్రువిజేత వివేకవర్ధనా
ర్థశ్వసనోపయోగమతి • రాయబహద్దరుకందుకూరి వీ
రేశ్వరు మంత్రిపుంగవుఁ గ•వీంద్రు మదిం గొనియాడఁ జెల్లదే.

—: కుకవి వందనము :—

సీ. అక్షరంబులరూపు • లవి మార్చబోయంచు । పలువిధంబులఁజాటి • పలుకుచుంద్రు
రాయంచు నిఁక బండి • రాయంచు మ ఱుభయ । రాయంచు జగడాలు • సేయుచుంద్రు
సాధుత్వసంస్కార • సరణిఁ బ్రత్యేక మ।తావలంబులము మే • మనుచునుంద్రు
శబ్దరత్నాకర•స్థములైన పదములే । పదములంచును సారె • పలుకుచుంద్రు

తే.గీ. వళులఁ బ్రాసంబులను గట్టి•వార మేమ । యప్పకవి యొప్పఁడని చాల • జెప్పుకొంద్రు
అర్థసందర్భము లెఱుంగ • కాడికొంద్రు । నలుసుగెలకు కవులకు దం•డంబులిడెద.

వ. అని యిట్లు శిష్టాచారసంప్రదాయానుసారినై నిరంతరక్షేమార్థినై యిష్టదేవతావందనం బాచరించి మఱియు

## కృతి ప్రభావము

—: శ్రీ దేవీ స్తవము. :—

శా. శ్రీదామోదరబాలు దుగ్ధనిధివీ•చీడోలికం జారుశో
భాదీవ్యద్వటపత్రచిత్రపటమున్ • బైవైచి పండింపఁ దా
బాదాబ్జంబు కరాబ్జమం దిడి ముఖా•బ్జన్యస్తముం జేయ జో
జో దూదూ యని చిచ్చిఁగొట్టెడి జగ • త్స్వామాంబ సేవించెదన్.

చ. తన సగబాలు మే నయిన ♦ దారను గిందును మీదు ప్రక్కలం
దును మునువాకిటన్ వెనుక ♦ దొడ్డిని లోపల బైల వెండియై
బొనరు గృహంబు నెన్మిదగు ♦ భూతులు శ్రీదు ధనాధినాథు మే
లనుఁగుఁ గపర్ది కిచ్చిన మ♦హాంబకు నంజలిఁజేసి మ్రొక్కెదన్.

ఉ. పాలును నీరు వేరుపఱు♦పంగల గుజ్జము ధర్మపద్ధతిన్
దాశిన నోరు మాట జవ ♦ దాటనియాలును మేల్మిబొజ్జ ల
క్ష్మీలలితాంగి యాడుకొను ♦ మేడ సుఖాసనమై తలిర్ప వా
ణీలలనేశు సత్యమున ♦ నిల్పినతల్లి ప్రసన్నయయ్యెడున్.

ఉ. విశ్వమునెల్లఁ గ్రుమ్మరుచు ♦ వేసట దప్పిగనంగఁ గాంచి యు
ఖశ్వుఁడు సాయకంబిడి ర♦యంబున దీసిన నీరు గ్రోలి య
య్యీశ్వరిగొన్న రూపముల ♦ నీక్షణసంభవయైన యిష్టకా
మేశ్వరి భక్తలోకముల ♦ నేలు గృపామయమైన దృష్టితోన్.

## —: సోమేశ్వర చరితము :—

సీ. శాలివాహనశక ♦ సంవత్సరంబులు । పదునాఱునూర్ల యెన్బ♦దియు రెండు
నగునట్టి విక్రమ ♦ హాయనంబునను పై । శాఘమాసంబున ♦ జరుగు నొక్క
నాడు దాసుకులాక్క♦రాడమాత్యుడు గృహ । నిర్మాణమునకయి ♦ నిండువేడ్క
గోడపునాదికి • గోయివెట్టింపంగ । నందులో మిలమిల • మనుచు మెఱుఁగు

తే.గీ. సూపెడి చతుర్దశాంగుళ • శోభమాన । నీలశిల యొండు గన్పట్ట • మేలటంచు
గొని నిజాంగన సుబ్బమ్మ•కును నొసంగ । ఋబ్బుఁగల్లిది మంచిదం • చుబ్బిపొగడె.

క. దానిం గైకొని యచ్చటి । మానినులకుఁజూపి రాయి • మంచి దటంచున్
దా నెత్తలేక సేవకుఁ । డైనట్టి తలారి వీరఁ • డను గొల్లనితోన్ ॥

క. ఓరి వీరా నీ విపు । డీ రాయిం గొంచునేగి • యింటికివెనుకన్
దారికడ గూటిలోపలఁ । జేరుపుమన వాఁడు నట్లు • సేయుదు ననుచున్ ॥

క. చనుచున్ నడుమను నుచ్చను । లను గ్రక్కుచుఁ బడినఁ గాంచి • లలనామణి గ్ర
క్కునఁ జైత్యమూర్ఛ యనుకొని । చనుదెంచి వచించె నితర • జనములతోడన్ ॥

ఉ. అంతట వాడు లేచి సివ • మాడుచు దేవుఁడనంచుఁ బల్మరున్
గంతులువైచ నందఱును • గన్గొని కారణ మారయంగ రా
కింతులు రాయి నొక్కమొగి • నెత్తగ లేవకయున్న మాటికిన్
గొంతుకలెత్తి స్వామి యిదిగో యిఁకలెమ్మనినంత లేచినన్ ॥

క. దానిం గొని దేవార్చన । బోనేసరముకడ నుంచి • వోయిరి మఱునా
డా నలినముఖికి సుబ్బమ । కూనెం దేహంబు దెలియ • కొకచోఁ బడియెన్॥

ఆ.వె. స్వామిస్వామియనుచు • వేమారులుచ్చరిం । చుటయకాని యొండు • చొప్పెఱుఁగమిఁ
జూచి భర్త యేమి • చోద్య మ్మటంచును । కరము వగచి యొక్క- • కర్జమరసి॥

ఆ.వె. నీవు సామివేని • నీవేడనుంటివో । కన్నులకును నెదుటఁ గానఁబడిన
సత్యమనుచు నమ్మి • సద్భక్తిఁ గొల్చెద । మనిన నట్లుకాక • యనుచు నవ్వి॥

క. స్వామీ యేమీపలుకవు । నామీదం గరుణలేదె • నమ్మితి ననుచున్
వామాక్షి పలుకఁగా శిల । గోమున నట్టింటి కపుడ • గొనగొన నడచెన్ ॥

క. అది గని యచ్చటివారలు । మది నచ్చెరువంది యోయి • మంత్రివరేణ్యా
యిది దలపఁగ శివలింగము । వదలకుము ప్రతిష్ఠఁ జేయ • వలయుంజుమ్మీ ॥

ఉ. నావుఁడు నక్కరాట్సచివ•నాథుఁడు తమ్మునిఁ గన్నయాఖ్యునిం
గేవలరాజ్యకార్యపరు • గీర్తిమయుం గని లింగసంప్రతి
ష్ఠావిధి కియ్యగొల్పి విల•సన్మతిఁ గమ్మనశోభనాద్రియన్
భూవరు వేడి మాన్యమును • బొంది ప్రతిష్ఠ యొనర్చె లింగమున్ ॥

క. అల్లూరుపురవరంబున । నుల్లసిత నివాసుడగుచు • నున్న శివునకున్
జెల్లు నుమదేవి యగు టని । యుల్లమునం దలచి యిడిరి • సోమేశాఖ్యన్ ॥

వ. నా బాల్యంబున నాకు నానావిధ సౌఖ్యంబులకును వినోదంబులకు నాటపట్టై
నన్నలరించిన యల్లూరగ్రహారంబు నభివర్ణించెద.

సీ. భాగ్యప్రకర్షంబు • భారతవర్షంబు । కలిమితొయ్యలివీడు • తెలుఁగునాఁడు
దస్తుముల్లెలబారు • ముస్తఫాన్సరుకారు । కోటీశ్వరులతల్లి • కొండపల్లి
సఫలకాండంబు కృ•ష్ణానదీఖండంబు । కొలుచుకొట్టమ విన్న•కోటసీమ
ప్రాజ్యంబు కమదన • వారి సామ్రాజ్యంబు । క్షమ నెల్ల బేబదల్ • చారుమహలు

తే.గీ. దానధర్మముగలవారు • దాసువారు । చేరిపాలింతు రల్లూరు • సిరికొతారు ।
అది నివాసంబునకు యోగ్య • మని తలంచె । సంగతసుకీర్తి సోమేశ • లింగమూర్తి॥

సీ. గుంటయొడ్డున నొంటి • గూర్చుండి మాయూరి । కలుములు గన్నమ్మ • యలుగులమ్మ
నిట్టత్రాడులలోన • నిలచి యెల్లరిక్షేమ । మరయుచుండెడియమ్మ • యలుగులమ్మ
తా శిలారూపంబు • దాల్చి మరాటీహ।యా మెఱింగినయమ్మ • యలుగులమ్మ
ఎండవానలకోర్చి • యెల్లప్డు బయలులో । నణఁగియుండినయమ్మ • యలుగులమ్మ

తే.గీ. ఆలమందలఁగాపాడు • నలుగులమ్మ । చిలిపిరోగాలఁ దొలగించు • నలుగులమ్మ
గ్రామదేవతగా నొప్పు • కనకరాశి । పగిది నలరారు నల్లూరు • పల్లెటూరు ॥

సీ. ఎలయెండ చెట్లసం•దులనుండిగోడల । దవిలి తా నిలువుట•ద్దములుగాఁగ
గొనగొనజను నింద్ర•గోపసంఘాతంబు । పందిళ్ళలోఁ జిన్ని • పగడములుగ
చూరుపట్టియలఁ బి•చ్చుకదంపతులచాలు । చెక్కఁతీర్చినయట్టి • చిత్రములుగ
దూలాలగూళ్లసం•దులనుండి వెడలి మ్రో।గెడితుమ్మెదలమ్రోఁత • గీతములుగ

తే.గీ. కెరలి వాకిళ్ల తూనీగ • తెరలు మూగి । నెర బుడేదారుగెంబట్టు • పౌరపసందు
సన్నయుల్లడగాగ నాఁ•షాఢలక్ష్మి । పగిదిఁదనరారు నల్లూరు • పల్లెటూరు ॥

సీ. ప్రాఁతగొంగడి వీపు • పైఁగప్పి బుజమున । గొంకికర్రను మోచి • కొంకినడచు
నుచ్చుఁబ్రాతలపింజ • గ్రుచ్చి మున్మొలగట్టి । మట్టాకుపొత్తి వే • మారు మడచు
కదలిపారెడి గొఱ్ఱె • గమి చేలఁబడకుండ । తాసెతాసేయంచు • దగిలిపఱచు
తోడేలు బొడఁగాంచి • జాడనే చేయెత్తి । నిక్కఁట్రూహోయని • కుక్కఁబిలచు

తే.గీ. ఆలు తలనిడికొని వచ్చు • నట్టి యటిక । నున్నచల్లయుఁ దమిదకూ • డుప్పు గల్లు
మెల్లఁగా మ్రింగు గొల్లని • బెంచుతల్లి । పగిది దనరారు నల్లూరు • పల్లెటూరు

సీ. ఇసుకబావిఁ బనంటు • లిడి ముంచుచును వంగ । తోటలకును నీళ్లఁ • దోడువారు
చిలగడంబులమళ్ళఁ • జేతులతోనిండు । బుడ్లతోదొణదొణ • బోయువారు
నిమ్మ నారింజ దా • నిమ్మచెట్ల కుదుళ్ల • నుం బేడపెంటల • నునుచువారు
ఆకుకూరలఁగల్పు • లేకుండఁ దివిచి కాఁ । దలఁబచ్చపురువుల • దులుపువారు

తే.గీ. పెద్దబెండలమోళ్ళను • బీకువారు । కాకరలకును బందిళ్ళు • కట్టువారు
మార్గశీర్షమహాలక్ష్మి • మందిరంబు । పగిది నలరారు నల్లూరు పల్లెటూరు ॥

సీ. చెలగి కళ్ళముల గిం•జలుమేసి ప్రాఁజింత • తొరడుల గుబగుబల్ • నెఱపు గువ్వ
కట్టాసఁ జని గంపె • కంకి నోటనుబెట్టి • వినువీధిఁ గిలకిల • యనెడు చిలుక
చెంగావిపెనురావి • చివురునిండుగమెక్కి । కూకూయనెడి మద • కోకిలంబు
పొదలలో మెదలు లేఁ•బురువుల సాపడి । చెట్టెక్కి గుమ్మను • జెముడుకాకి

తే.గీ. కదసి వరిచేలలో గూళ్ళు • గట్టి పెలుచ । బలిసి నటనంబుగావించు • బరతపిట్ట
గలిగి జనులకు శ్రవణసౌ•ఖ్యప్రదంబు । పగిది దనరారు నల్లూరు • పల్లెటూరు ॥

సీ. పొదలపైసీలాలు • బోలు పరింగపం । డ్లకు జేయిసొన్పు బిఁ•డ్డలనుగల్గి
పొలములో గొంతెత్తి • పొలిపొలియోయంచు । వరికుప్పనూర్చు పాఁ•లెరులుగల్గి

అరుపుబేరముల గు•జ్జరినేసి సన్నంబు । ముతకంచు నొదుగు మా•లెతలుగల్గి
కోడిపందెములకై • గుమిగూడి గొల్లున । సడిజేయు చిల్లర • జనముగల్గి
తే.గీ. దేశవాళితుపాకితో • దెబ్బలోనఁ । బిట్టలను గొట్టు ముతరాచ•పిండు గల్గి
శిశిరఋతునాప్నియైన లం•క్ష్మికిని దొడవు । పగిది నలరారు నల్లూరు • పల్లెటూరు ॥

వ. మరియు విసువక కసవులు మెసవు నాలమందలయందుండి యెదగొన్న సెలపెయ్యల కదసి కొమ్ముల గంగడోళ్లు నాకి నాకి ముట్టె లాకసంబులకెత్తి మూచూచు నాఁబోతుల అంకెల కులికి పఱువులిడు లేఁగదూడలంబట్టఁ గమకించి వెనువెంట నంటి చను గొల్ల పిల్లకాయల గవ్వలమొలనూళ్ళ నందందఁదగిల్చిన యిత్తడి చిరుమువ్వల అవళి కదరిపడి గంతులిడు తరపులకొళ్ళనుండివెడలి జుమ్మను జోరీగ పేరీగ చిట్టీగతండంబులును

ఈఁగతండంబులు మేనులంట రెండుచేతుల నిరుబరుల గోకికొనుచు గొంగళ్ల వెదకుచు వరిగడ్డి నిప్పుతొంటలపొగమఱుఁగునకుం జేరి మట్టాకు చుట్టిన పొగచుట్టల నగ్గియంటించి నోళ్ళనిడి తగుమాత్ర మెగబీల్చి దిగవిడచుచుండ నెత్తినిడితెచ్చిన చలిది కుండలదించి యుప్పుగండ్లగలుప వంగి మైజారుచెఱగులుఁ(వ్రేలాడ నూసులాడు గొల్ల పూఁబోడుల సరసంబులాడు పెద్దగొల్లల తొంట్ల వెనుక తోకలాడించుకొనుచు నొడళ్ల విరచుచు గాళ్లసాచి నిక్కి వేపి జాగిలంబులును

వేపిజాగిలంబులు మోరలెత్తి మొఱగిన విని భయభ్రాంతంబులై పఱచుచు వెను వెన్కసూచుచుఁ దోకలుమడచి పులుగుపొదలం దూరి పండికొనియున్న కుందేలు నక్క తోడేలు కొరణాసి మున్నగు జంతుసముదాయంబుల వేటాడ గమకించి పరవదోలి వల లుచ్చులు పన్ని చుట్టుతిరిగి కూకలువేయుచు జప్పళ్లజేయుచుం దిరుగు వేటకాండ్రంగాంచి తావులువెడలి తెక్కలార్చుచు నోరలోరల జెట్టుచేమలపట్టులం జూచుకొను పావురము కాకి గద్ద గువ్వ ఏండ్రింత పాలజుమ్మ చిలుకలు మొదలగు పులుగుమొత్తంబులును

చిలుకలు మున్నగు పులుగుమొత్తంబులు చవచవ నెగసివచ్చి కంకికొక్కిండుగా వ్రాలి గింజలు ముక్కులంటొడిచి తిత్తులునింపి యత్యాశావశంబున దంటుపైఁ గూర్చుండి సజ్జకంకి యూచి మొదలంట గొఱుకుచు జాగుసేయుచు నిటునటు మెడద్రిప్పి సూచుచుండ జేనినడిమి మంచెమీదనుండి కలకలంబు విని చెట్టేలుత్రాడు పలుమరు విసరియిడ్డ తాప్పను టెనుమ్రోత నులుకంజేసి మంటియుండల వడిసెల విడి త్రిప్పి యేయు కాపులును

కాపులు తమ ప్రాతరుపాహారార్థంబు లేతకంకుల కరయుచుఁ గ్రిక్కిరిసి గింజ బరువున నొరగియున్న దంటుల నిటునటు పాయంద్రోయుచుం దారివెట్టి చనుచో బుసబుస

లాడుచు మెల్లమెల్లనం బ్రాకు బెంజేరుగున్నలకు బెదరి కేకలువైవఁ జేలదాపు పుంతవెంటం బోవుచు మంచెకుం గట్టిన యంచెదుడ్ల విరగలాగి పలుదెబ్బలం జావంగొట్టి చేలగట్ల కీడ్చిన యుపకారంబునకుం బ్రత్యుపకారంబుగా నిచ్చిన కంకులం గొని నలిపి వడిగట్టి యిండ్లకుం జను బాటసారుల నయ్యా! యేమి తెచ్చితివని యొడిఁబట్టి విడలాగు పసిబిడ్డలును

పసిబిడ్డ లేపుమీరి గుంపులుఁగూడి మెట్ట పుట్ట చెట్టు చేమ లనక చిఱుగోచులు వ్రేలాడ సన్నపాటి యీటికఱ్ఱలం జిఱుతబిళ్ళలం జేతులంబూని యాటలాడఁ జొచ్చి యలసి నడిప్రొద్దుల కిసుకబొందలకుం జేరి డిగ్గి జలకంబులాడి మేనులు సూర్యాతపవశంబులు చేసియు విడువని మంటిచారికలు వీపుల గాన్పింప నిండ్లకు జేరినఁ బండ్లు గొఱుకుచు వెఱపించి కొట్టంబోవు తల్లుల కడ్డమై వంగివంగి కఱ్ఱఁబట్టుకొనుచు చిన్నబిడ్డల కేమితెలియు నూరకొమ్మని వెడవెడ ముసలిమాటలఁ గోడండ్రఁ జంకించు ముసలమ్మలును

ముసలమ్మల యొద్దంజేరి సీతు లుపన్యసించుచు కావడిపెట్టెలం గాజుకుప్పెల నించిన కాలువనీరు గంగోదకంబని నమ్మించి నెత్తిం జల్లి బొమ్మలపటంబు విప్పి యేలపాటలు పాడుచు యెలుంగెత్తి యర్థంబులు సెప్పుచు మగనిప్రక్క రామహరే యని పల్లవి నను సంధించుచుఁ బైటకొంగునం గట్టి వీపులం దగిలించుకొనిన పసిబిడ్డనుం జూపి ముద్ద యడుగు కాశికావిళ్ళ ముద్దరాండ్రకుం జేటలెత్తి కాపెత్తలు చాటుగా దివిచి యిచ్చు చోడె కొఱ్ఱ చామ సజ్జ వరిధాన్యంబులును

వరిధాన్యంబుల నూర్చి రాశిచేసి కొల్పించి సంచులం బోసి కుట్టి యెద్దు దున్న వీపునం గత్తళంబులు పన్ని గంతవైచి శెలగడంబులు బిగించి యెత్తి కబాడంపు దుడ్లు బుజాలనిడి పెరికాటంబుసేసి యిండ్లకుం గొంపోవునెడ పునాస వ్యవధి గడచిపోయినదని కాపుల నడ్డగించి కలహంబులు పెట్టుకొను పెట్టుబడి కోమటులును

కోమటియింటికిం బసుపుకొమ్మల్లిపాయ మెఱపకాయ చింతపం డుప్పుగల్లనుచు వచ్చి ధాన్యంబులుదెచ్చి క్రుమ్మరింప పెల్ల కాయ పొల్లు గుల్ల యని చెఱిగి చెఱిగి సోలం బోసి చూడు తలగీతయని కాని దుగ్గాని విలువకట్టు గట్టువాయి కోమటికొమ్మలతోఁ బలుగతులఁ బోరాటములుసేయు కాపు గొల్ల గవల యీడిగ మాల జవరాండ్రఁ దొలంగు తొలంగుమని బోకరించి గొణిగికొనుచు దారింబోవు జలాహరణపరలగు స్మార్తవితంతువులు గుడ్డ గుల్ల చిళ్ళ పెల్ల పెంకులం ద్రొక్కి వానిం దిట్టితిట్టి పునస్స్నాన ప్రయత్నంబులు సేసి నూతి కేగి తోడు ఖండశతంబునకుం బట్టు కాలంబువలన మధ్యాహ్నంబు దాటినంగని వంటలు కాలేదని కోపించి యుఱికి చీవాట్లుపెట్టు గృహమేధులును

గృహమేధులు తమతమ ముంజావడుల సీనకట్టుబద్దలు చీఱుచు మామిడి జీడి-మామిడి మఱ్ఱి జువ్వి రావి మొదలగు వృక్షంబుల పర్ణంబులం దెచ్చి భోజనభాజనంబులుగాఁ గుట్టుచుండ మడిసంచులు వీపుల వ్రేల బుడిచెంబులమూతుల కంగవస్త్రంబులు గట్టి మొలలఁ బిగించి తల నొక ప్రాతశాలువ జుట్టి యొంటిపొరయట్టచెప్పులం దొడిగి దర్భాసనంబులు వీపుల కడ్డంబుగా జొప్పడ నేతెంచి పరదేశులమని మహావినయంబుఁదోపంజెప్పి యల్లనొకచో గూర్చుండి యాశీర్వచనపనసం దొడగుకొనినం జూచి మాయింట భోజనంబు సేకూరదని యెన్నివిధంబులం జెప్పిన వినక నానాప్రకారంబులం బ్రార్థింప నెట్టకేని యంగీకరించినతోడనఁ దమ కత్తెసరని మెల్లమెల్లగా జారవిడిచి చెప్పి స్నానంబు సేసి మడికట్టుకొని సంధ్యావంద నాదికృత్యంబులు నిర్వర్తించి దేవతార్చనచేసి ప్రొయిమీదనున్న తప్పెల దింపుకొని పచ్చడి మజ్జిగలతో గడుపునిండ సాపడి యెద్దేనరుగుమీదం బండికొని గుఱువెట్టు పాంథవైదికశిఖామణులునుంగల్గి యత్యంతసౌఖ్యాస్పదంబయి నా బాల్యదశ ననేక వినోదంబు లనుభవించిన పల్లెటూరగు అల్లూరగ్రహారంబు స్మరింపక నామనం బన్యంబు గ్రహింపనేర దది యెట్లనిన,

శా. శ్రీలం జెన్నగు నాలమందలును దం•తీరంబులన్ వెన్నలన్
జాలన్ మీగడలన్ భుజించి పరమై•శ్వర్యంబు వేఱొక్క టీ
భూలోకంబున గాన కెద్దును మహా•భూతప్రభావంబులన్
లోలోనం గడు మెచ్చి రంజిలితి న•ల్లూరగ్రహారంబునన్ ॥

ఉ. పచ్చలఁబోలు పర్ణముల • పైపయి నిండుగ గాచి గొల్లుపం
డ్లొచ్చెములేక చిట్టడవి • నొక్కమొగిన్ బగడాలు విండుగా
గ్రుచ్చినయట్ల తోప నది•గోయని యెచ్చటలేని సంతసం
బచ్చుపడంగఁ గోసిన సు•ఖాతిశయంబు గణింప శక్యమే ॥

మ. అహహా నామది నేటికి న్మఱవు రాం•దాయావు లా లేగ లా
మహిషీవ్రాతము సజ్జచేల నడుమన్ • మంచెల్ దదారోహణ
స్పృహలన్ గూయనుచున్ గడున్ వడిసెలన్ • జేయార్చి యేయన్ క్రియా
మహిమం జిల్కలు లేచి కూయుచు నభో•మార్గంబునం బాఱుటల్ ॥

ఉ. వేసగి నెండతాకునకు • వేసర పీయక లేగదూడలన్
బీసగి డొంకలం దిడిన•వేళ గనుంగొని పోయి యాత్మ ను
ల్లాసముమీర నందుఁ బది•లంబుగ మేపగ లేతపచ్చికన్
గోసిన నాటి తుష్టికివి • గోటిధనంబు సమంబె యారయన్ ॥

ఉ. బాడవచెల్కఁ యొద్దులను • బట్టిన పచ్చికపట్లఁ బూరి వి
య్యాలకుబోవు గొల్లజవ•రాండ్రొఁటి విందఁగఁ గోసికోసి తా
రోదక త్రోవఁబోవుతటి • నూరిదొరన్ సగబాలు పెట్టుడం
చాడిన నట్లుసేయఁ గొని•నట్టి వినోదము విస్మరింతునే ॥

ఉ. ప్రొద్దుటిపూట చిట్టడవి • పుంతల నెయ్యురఁగూడి క్రుమ్మరన్
గ్రద్దరిసుద్దులుం జిలిపి•గంతులు గొంతుకయెత్తి యెద్దియో
పద్దెము బాడుచున్ నగుటఁ • బాపటపాకులు నూటికట్టలున్
బొద్దిచివుళ్ళనుం దునుము • పోడిమి నేడును వీడ దాత్మలోన్ ॥

ఉ. పచ్చికపట్ల మంచుబడి • ప్రాతరనేహమునందుఁ బచ్చలన్
గ్రుచ్చిన పేటముత్తెములు • కూర్చినరీతి వహింప నెంతయున్
మచ్చిక సాలెపుర్వు లిది • మాదని నిక్కుచు జిగ్గువల్వలన్
హెచ్చుగ నచ్చటం బఱచి•రే యని యెంచగనొప్పు చోటులన్
రచ్చలు సేసితిన్ సుఖత•రంబుగఁ బిన్నలగూడి వేడుకన్ ॥

చ. బలమును నింటిలో జరుగు•బాటును దల్లియుఁ దండ్రియుం దయా
కలితమనీష బెంచుటయు • గమ్మని నీరున్న గూరలాకులున్
గలమ సమృద్ధియుం జెరువు • కానయుఁ బాడియుఁ బంటయుం గడుం
గలిగిన పల్లెటూర నగు • కాపురమే సుఖమంచు నెంచెదన్ ॥

చ. తలఁచెదఁ జెట్టు లెక్కిన వి•ధానము కొమ్మచు లాడినట్టి విం
తలు గిజిగాని గూ ళ్లొడిసి • తన్నఁగ నెత్తున వ్రేల నూగు గొ
మ్మలకును గాళ్లసాచిన క్ర•మంబును మొగ్గలజగ్గు పిల్లలం
బిలుచుక గ్రక్కునం జిఱుత•బిళ్ళల నాడిన యెల్ల వేడుకల్ ॥

చ. పొలమున కేగి నాటు•పువుబోడులు గొంతుక లెత్తి తుమ్మెదా
కలకల నవ్వితా యనుచుఁ • గామమ పుట్టగఁ గర్వ వచ్చె నం
చలరఁగ బాడఁగా వినుచు • నయ్యెడ నయ్యెడ నేతికల్వ పూ
వులఁ జిదుమంగ నా చిఱుత • పూటలు మూటలు నిష్కకోటికిన్ ।

ఉ. చక్కని పెద్దచెర్వుదరి•చాయలఁ బట్టిన నాచుపట్లఁ బెం
పెక్కుచుఁ జిత్రకంబళము•పేర్మి వహింపఁగ నెట్టగల్వ పూ
లక్కడ నక్కడం బొదలు • నందము గన్గొని యాడువారితోఁ

గ్రక్కున బందెముల్ వయిచి • కాఁదలఁదున్మిన నాటి సంతసం
బెక్కడనేనియుం గలుగు•నే యిక నెన్నిటికేని ధారుణిన్ ॥

ఉ. మేకలమందలన్ బసుల • మేపుచు గొల్లలఁగూడి నల్ల రే
గాకుల చిక్కముల్ పొసఁగ • హత్తుచు వీపులకున్ దగిల్చి ని
ర్వ్యాకులులై మెడల్ దిగువ • వాంచి చనం గని మెల్లమెల్లగా
వాకు బిగించి వీపునకుఁ • బ్రాకిన కోడిగ మప్పు డెంత సౌ
ఖ్యాకర మయ్యెనో తెలియు•నా మఱియొక్కరి కీ ధరాస్థలిన్ ॥

చ. అనుదిన మొక్కరీతిఁ దగు • నా దిరిసెంబుల పూలతావు లా
యనుభవమెల్ల మావశమ • యందును జల్లని నీటిబొంద లే
మని కొనియాడ వేసఁగి న•హా మునుమాపునఁ జల్లగాలికిన్
దనువిడి సైకతస్థలుల • దద్దయు నాటలఁబుచ్చు ప్రొద్దులన్ ॥

చ. తొలకరి వానలం జలము•తోఁ దగనిండిన గుంటపట్లఁ గ
ప్పలు గరుటత్కటత్కరక • పట్కరటన్ కరటత్వనాగ న
వ్వల గడుగుంయిగుంయిగుయి • బంగుయిగుంయని యీలకోడులున్
బలువిడిఁ గూయ నద్భుతము • వాటిల [illegible]ంటిని గంటి సౌఖ్యమున్ ॥

చ. పిడుగులు పెళ్లనన్ మొఱయ • భీతిలి భీతిలి యుర్మలుర్మగా
బడబడమ్రోత కిట్టునటుఁ • బాఱి మెఱుంగులు తళుక్కుతళుక్కమం
చదరిన గన్నులార్చి కర•కావళి నచ్చెరుపాటుతోడ జే
తులనిడి వానకుం దడిసి • తొల్కరి నాటలఁబ్రొద్దు బుచ్చితిన్ ॥

చ. సరస వసంతమందును ని•శాముఖవేళలఁ జల్లగాలికిన్
బరువుగఁ బూయు నయ్యడవి•మల్లెలవాసన నాసికాపుటాం
తరములఁ జొచ్చి డెందమున • దద్దయు సౌఖ్యముఁగూర్ప వెన్నెలన్
బరపులవైచి పండుకొను • భావము నేఁ దలపోయకుందునే.

చ. సొలయక మెట్టలం దిసుక•చోటులఁ బిచ్చుకగూళ్ళుగట్టి పాం
సులత వహించివచ్చి యొక•చో దిగుబావిని జల్క మాడి పే
నుల తడియార్చి పెద్దలకు•నుం దెలియంబడునంచు మెల్లగా
నిలుసొరబోవు నా కపట•వృత్తిని నేఁ దలపోయకుందునే.

వ. అట్టి యల్లూరను పల్లెగ్రామంబున

తే.గీ. పూరియింటనె పలువర్ష•ములు వసించి । యూరికన్నమె కొన్ని నా•ళ్ళారగించి
యుప్పుపట్టల పన్నుండి • యోర్చియోర్చి । సోమలింగఁడు మాయూరె • సుఖదమనియె.

క. మతిరహితులు కొందరు శ•త్రుతఁ బూనినకతన సోమ•రుద్రుఁడు మాకు౯
బ్రతిభటుడై పోరియు స•త్కృతుల నెఱిఁగి తాన యోడి • గెలిపించె మము౯ ॥

చ. గెలిచినవెన్క సోమునకు • గీమునకుం దలపెట్టి కొన్నినా
ళులకును శాలివాహనుని•లో బదియేడయి యెన్న నొప్పు వం
దలపయి దొంబదారు సని•నం దగు శ్రీముఖయందు నోడుబి
ళ్ళలగుడిఁ గట్టె నా జనకుఁడై • తగు కన్నయమంత్రి భక్తితో౯ ॥

తే.గీ. ఓడుబిళ్ళల గుడిలోన • నుండిపేర్మి । ధ్వజములేకయ తండులో•దనము మెక్కి
యుత్సవాదుల కోరిక • యొక్కరీతి । సోమలింగఁడు మాయూరె • సుఖద మనియె ॥

ఉ. అంతటఁ గొన్నినాళ్లకు వ్య•యాబ్దమునందును రాధమాసమం
దెంతయు భక్తి మజ్జనకు • నిష్టము గాంచి ధ్వజంబు నిల్పి య
త్యంత విలాసవైఖరుల • నాదిమహోత్సవ మాచరించి ని
శ్చింతఁ దదాది వర్తిలఁగఁ ♦ జేయుచునుంటిని శక్తిచొప్పున౯ ॥

తే.గీ. వరిపసాదంబు కాల్వనీ ♦ ర్ధ్వజము మంగళోత్సవంబులు కలిగి తా ♦నురువిమాన
గోపురంబులు లేకున్నఁ♦గొఱత యనక । సోమలింగఁడు మాయూరె ♦ సుఖదమనియె ॥

చ. ఉడుగక యెండవానలకు ♦ నోర్చి కటాకటి కర్వు లెన్నియో
వెడలఁగ నెట్టి మా కలిమి ♦ వెంబడి తానును గష్టసౌఖ్యముల్
కుడుచుచు మమ్ముఁ బ్రేమఁ గనుఁ♦గొంచు సుమామణిఁ గూడి పల్లెలోఁ
బడి వసియించు సోమపద♦భవ్యుఁడు లింగఁడు మమ్ము బ్రోవుత౯ ॥

చ. వయసు పదేండ్లు సంస్కృతము♦వంకఁ గనుంగొనలేదు తెల్గులో
నయినను బెక్కుశబ్దముల • యర్థములన్ గ్రహియింపలేదు నే
జయజయ సోమలింగ యని ♦ చక్కని కీర్తన యల్లినాఁడ ని
ర్భయముగ సోమలింగని కృ♦పామహిమంబు గణింప శక్యమే ॥

చ. పదియును రెండువర్షముల ♦ ప్రాయమునందునఁ దెల్గుపద్యముల్
వదలక కొన్నికొన్ని చెలు♦వంబుగఁ గూర్చితి సోమలింగన
త్పదమును నిల్పి యట్టి కవి•తారసధన్యుని నన్నుఁ జేయు నా
సదమలచిత్తపంజరని•శాంతుఁడు నిత్యుఁడు సోమలింగఁడే ॥

చ. తిరుపతివేంకటేశ్వరుఁడు • దేవశిఖామణి నాకునుం గళా
గురుఁడగునంచు స్వప్నమునఁ • గోరి వచించినయట్టి శైవభూ
సురవరు జెప్పనౌ నిఖిల • సూరిజనస్తవనీయుఁడై కృపా
కరుఁడగు సోమలింగఁడని • కాక మఱొండు దలంప నేర్తునే ॥

క. పరశివు నుపదేశము శ్రీ । వరువిద్యాగురుత రెండు • బడసితి నాకుం
గౌరత యొకించుకఁ గలదే । మఱియుం గామేశ్వరమ్మ • మా యిలువేల్పె ॥

:— కృతికర్తృవంశవర్ణనము :—

సోమేశ్వరస్తుతి

శా. శ్రీరంజిల్లు జటాకలాపపదవీ•ఛిద్రంబులందుండి గం
గారమ్యాంబువు జారినం దడిసి దు•ర్గా దేవి మోమెత్తి యొ
ప్పారం గారణ మారయ౯ ఖచరభ•క్తానీకదత్తాభిషే
కారంభం బను వేల్పు గొల్చెద సదా • యల్లూరిసోమేశ్వరు౯ ॥

మ. నెరి నెందుం జదు వభ్యసింపకయ పం•ద్రెండేండ్ల యీడప్పు న
చ్చెరువుం బొంది బుధాళి ముక్కుపయి వ్రే•ల్చేర్వంగ సాత్రాజితీ
విరహాఖ్యంబగు యక్షగానమును గా•వింపించె నాచే మనో
హరలీల౯ భజియింతు నట్టిగురు నే • నల్లూరి సోమశ్వరు౯ ॥

మ. పొలమం దొక్కటఁజేరి బాలకుల గుం•పుల్ కోతికొమ్మచ్చులా
టలఁ జిక్కం గని యేనునుం గలసి యా•డం జింతకొమ్మెక్కవే
ళల స్వామీ ననుఁ బ్రోవరా యనుచు దా•శంబొప్పఁ బాడించి న
న్నలరంజేసిన దేవుఁ గొల్తు మదిలో • నల్లూరి సోమేశ్వరు౯ ॥

—: శ్రీవేంకటేశ్వరస్తుతి :—

చ. గురునొకనిం భజింప మదిఁ • గోరి తదేకపరత్వ మూని ని
ద్దురఁ గొన స్వప్నమందు నిశిఁ • దూర్ణధియౌ నివటూరి పట్టిసే
శ్వరుఁడను శైవుఁ డెవ్వనిని • సమ్మతి మద్గురుఁ జేసె నాతని౯
దిరుమల వేంకటేశ్వరుని • దేవశిఖామణిఁ గొల్తు నిత్యము౯ ॥

—: ప్రకృతి పురుష ప్రభృతి గోత్రఋషిపర్యంత కృతికర్తృవంశానుక్రమము :—

సీ. సచ్చిదానందవి•స్ఫారముక్తాశుక్తి । వేదవేదాంతార్థ•విత్ప్రసక్తి
భాసుర బ్రహ్మాండ•భాండసంపద్భుక్తి । విహితకృపాతృప్త • విబుధభక్తి

స్థావరజంగమా•త్మకవస్తుగుణయుక్తి । త్రైగుణ్యవిషయవి•స్తారసూక్తి
శబ్దాదితన్మాత్ర • సాకల్యసువ్యక్తి । లీలాగతానంత•కాలభక్తి

తే.గీ. జ్ఞానదీపాంకురప్రభా•వానురక్తి । ఫలిత నిజపాద సేవక • భవవిముక్తి
పరమ పురుషోపకంఠవి•భ్రాజమాన । హాసమాయామయాసక్తి • ఆదిశక్తి ॥

తే.గీ. ఆ పరమపురుషసన్నిధి • నాదిశక్తి । నుదయమైరి రజస్తమో•యుక్తి దనర
బ్రహ్మదేవుఁడు పార్వతీ•ప్రాణవిభుఁడు । సత్త్వగుణమున నుదయించె • శార్ఙ్గపాణి ॥

తే.గీ. బ్రహ్మమానసపుత్రులై • పరగి రార్వు । రందును మరీచి యనువాని•యందుఁ బొడమె
గశ్యపుఁడు వానికినిఁ బుట్టె • గమలబంధుఁ । డఖిలలోకైక భాసకుం • డగుచుఁ దొల్లి ॥

చ. విరతి యొకింత లేక విను•వీధిని రేయుఁ బవల్లు భాసిలన్
భరమన కోర్వుఁ గల్గి తన • భానుసహస్రముచే జగత్ప్రభా
కరణము సేయునట్టి యుప•కారి రుజాపరిహారి వేదమం
దిరు హరిఁ గర్మసాక్షి రవి • దివ్యహిరణ్మయమూర్తిఁ గొల్చెదన్ ॥

క. దినమణికి సంజ్ఞయందున్ । జనియించెను సకలధర్మ•శాస్త్రనిపుణుఁడై
మనుజునిగా మానవుగా । జనుఁ జేసినయట్టి మనువు • జగములు పొగడన్ ॥

క. తేవ వివస్వంతుని కొడు । కై వైవస్వతసమాఖ్య • నందె నతం డీ
వైవస్వతమన్వంతర । భావమునకుఁ గారణ ప్రభావుఁడు సుమ్మీ ॥

క. వైవస్వతమనువు కొమరుఁ । డై వెస నిక్ష్వాకుఁ డుదయ • మయ్యె వికుక్షి
క్ష్మావరుఁ డతనికిఁ గలిగెను । జూవె కకుత్స్థుండు వాని • సూనుడు వెలసెన్ ॥

మ. కలితాశీర్యదవార్యశౌర్యదవభు•గ్రప్రక్రమావక్రని
స్తులజిహ్వపటలిస్ఫుటోన్నటనస•ద్వ్యాభీతశత్రుక్షమా
తలరాడ్వీరకురంగరక్షణకలా • ధౌరంధరీపూర్ణకీ
ర్తిలతాసాంద్రుఁడుసూ కకుత్స్థుఁడను ధా•త్రీపాలచంద్రుం డిలన్ ॥

క. మును సురలు వేద రణమున।కును జని యెద్దయిన దేవ•కుంజరుని కకు
త్తున నెక్కి యసురకోటులఁ । దునుమాడఁ గకుత్స్థుఁడని జను ల్పిల్చి రొగిన్ ॥

తే.గీ. ఆ కకుత్స్థునకును గొడు•కగు సుయోధ।నుండు, ధృతరాష్ట్రభూమిపా•లుండు తనదు
పెద్దకొడుకున కీపేరె • పెట్టెజుండు । వాని కొమరుండు నళినాప్త•వంశపృథుఁడు ॥

క. వైన్యుఁడగు పృథుమహీపతి । యన్యుఁడుసుం దట్టి భాస్వం•దన్వయపృథురా
జ్ఞాన్యునకు విశ్వరంధి వ।దాన్యగుణోపేతుఁ డతఁ డుదయమై మించెన్ ॥

క. అవిశ్వరంధి కుదితుం।డై వసుధం గీర్తిఁ గాంచె • నార్ద్రికుఁడు సమ
స్తావనిఁ జంద్రాభిఖ్యన్ । బ్రోవ సమర్థుఁడయి సుగుణ•పుంజము నెఱపెన్ ॥

తే.గీ. ఆర్ద్రికునిబిడ్డ యువనాశ్వుఁ • డతని కొమరుఁడయ్యె నుశవత్తి వంశకుం • డతనిపుత్త్రుఁ
డాయన సుతుండు బృహదశ్వుఁ • డఖిలనుతుఁడు।వాఁడు లోకైకవిఖ్యాతి•వడసెమిగుల ॥

క. బృహదశ్వసూనుడై యి । మ్మహిని కువలయాశ్వనామ • మనుజపతి మహా
మహిముఁడు గలిగెన్ బలియుఁడు । బహుపోషకుఁ డార్తిలోక•బంధుఁడుసూవే ॥

తే.గీ. కువలయాశ్వమహీపాలు ♦ కొమరుడైన । దుందుమారుండు దుర్దమ♦దోర్బలుండు
ధుందువును గొట్టి యాపేరు • సెందె నతని।కొండిక దృఢాశ్వభూపసం♦జ్ఞుండునువ్వె ॥

క. ఆ దృఢతురగునిబిడ్డ ప్ర।మోదుం డనఁబరగె నతని • ముద్దు కొమరుఁడై
మేదిని హర్యశ్వుం డనఁ।గా దగు నరపాలకుండు • ఖ్యాతి వహించెన్ ॥

క. ఆ హర్యశ్వుడు గనియెన్ । సాహసధైర్యాది సుగుణ•శాలి నికుంభున్
బాహుబలశాలి యాతం । డా హరిదశ్వుని సుధామ•యాత్ముని గనియెన్ ॥

క. హరిదశ్వసుతుఁడు విశ్వం।భరలోఁ గీర్తింపఁబడియె • బహువిధముల దు
ర్భరబాహుబలము కలిమిన్ । హరిహరభక్తుండు సంహ•తాశ్వుం డనుచున్ ॥

తే.గీ. అట్టి సంహతాశ్వ • నాత్మజుండై మిఱిచె । మహి రణాశ్వుఁ డనెడి మనుజనేత
చెలఁగి యాతనికిఁ బ్ర♦సేనజిత్తను బిడ్డ । యుదయమందె నాతఁ ♦ డుర్వి నేలె ॥

తే.గీ. ఆయనకుఁ గలిగెను యువ•నాశ్వుఁ డనెడి భూమిపాలుండు వాఁడు వి•స్ఫురితకాముఁ
డగుచు బెండ్లాడె సింహమ•ధ్యాశతంబు । నొక్కతైనను గనదాయె • నొక్కబిడ్డ ॥

చ. సుతులకు నోమనైతి నని ♦ సుక్కి ఋషిప్రకరంబు వేడగా
నతితరనిష్ఠ నింద్రయజ•నాఖ్య సవం బొనరింపు మన్న స
మ్మతి నది సేయఁబూని యభి•మంత్రితకుండగతాంబు వంగనా
శతమున కం చెఱుంగక ని•శాసమయంబున గ్రోలె దప్పిచేన్ ॥

ఉ. క్రోలిన యంతనే యుదర♦కుండిక దొడ్డయి యున్నఁ గాంచి తా
జాలముమాని యాంగిరుఁడు • చయ్యన గర్భము వచ్చినం గళా
ఘూలుఁడు బాలుఁడొక్కరుఁడు ♦ పుట్టుట వచ్చటివారలెల్ల హా
హాలపితంబులం జలిపి • రంతట నింద్రుడు వచ్చె వేడుకన్ ॥

వ. యువనాశ్వుం బునరుజ్జీవితుం జేసి యమృతసిక్తాంగుళిం బాలున కందించినం।గాంచి,

క. కిం ధాస్యతి యని జను లన । మాం ధాస్యతి యనుచుఁ బలికె ♦ మఘవుఁడు దానన్
మాంధాత యనెడి పేరు వసుంధరఁ గొండికకుఁ గల్గె ♦ సువ్యక్తముగాన్ ॥

సీ. కడుపును భేదించి ♦ పుడమికి విచ్చేసి యెవ్వాఁడు కీర్తి వహించినాడు
కుడిపినంతనె వ్రేలుఁ ♦ గుడిచి యింద్రుని మెచ్చి యేవాఁడు సుధఁబట్టి ♦ త్రావినాడు
యెడలేక యొకనాడె ♦ కడగి సప్తద్వీప మెవ్వాడు తా ముట్ట♦డించినాఁడు
కడుప్రీతిఁ గొనియాడఁ♦బడి చక్రవర్తియై యేవాఁడు ధరనెల్ల ♦ నేలినాఁడు

తే.గీ. క్రతుసహస్రంబు నెవ్వాఁడు ♦ గడపినాఁడు । కోరి మాధవు నెవ్వాఁడు ♦ గొలిచినాఁడు
పూని యెవ్వాఁడు దీనులఁ ♦ బ్రోచినాఁడు । అతఁడు మాంధాతసూ యువ♦నాశ్వసుతుఁడు ॥

క. ఆ మాంధాతకు ముప్వురు । భూమీశులు కొడుకు లందుఁ ♦ బురుకుత్సుఁడు సూ
వే మొదటివాఁడు రఘుకుల । మీ మహిమోన్నతునివంశ♦మే వేయేలా ?

క. అందుఁ దృతీయుండగు ముచి । కుందుఁ డపుత్రకుఁడు నిగమ♦కోవిదుఁ డితనిన్
నందతనూజుఁడు ముక్తిం । బొందించెన్ ద్వాపరమున ♦ భూరికృపాప్తిన్ ॥

ఉ. మధ్యముఁ డంబరీషుఁ డతి♦మానుషచర్యుఁడు ద్వాదశీవ్రతా
సాధ్యమునిప్రయుక్తపటు♦శక్తినిరాసకుఁ డచ్యుతాశ్రయుం
డధ్యయనాది కర్మరతుఁ♦డాత్తసుదర్శనదర్శనుం డపాం
నిధ్యుపమానమానగణ♦నీయుఁడు మించె ధరాతలంబునన్ ॥

క. హరికృపచేఁ దేజోజిత । హరిదశ్వున కంబరీష యమివర్యునకున్
వరపుత్రుఁడుఁ గలిగె నతని । హరి మే త్యయ మని హరీతుఁ ♦ డనిరి మునీశుల్ ॥

సీ. పుట్టినాఁ డెవ్వాఁడు ♦ భూతంబు లలరంగ మాంధాతకును ముని♦మనుమఁడగుచు
పట్టినాఁ డెవ్వాఁడు ♦ బహువిధాచారనిర్ణయబోధి ధర్మశా♦స్త్రంబు చేత
కొట్టినాఁ డెవ్వాఁడు ♦ కూలంకషంబుగా కామాదిశత్రు వ♦ర్గంబు నడఁగ
పెట్టినాఁ డెవ్వాఁడు ♦ బృందారకశ్రేణి కిష్టహవ్యమ్ము బ♦హిర్వ్యాప్తులందు

తే.గీ. అతఁడు సుజ్ఞాని భక్తిమా♦ర్గానుసార । సుక్రియాతృప్తమాజాని ♦ సూరివర్గ
సమ్మత తపస్తనుగ్లాని ♦ సాధులోక । గీతగుణరత్నఖాని హ♦రీతమౌని ॥

ఉ. అంగిరసాంబరీషయువ♦నాశ్వ ఋషిత్రయితో హరీతనం
ఙ్ఞం గడు వర్ణితంబయి వె♦సంగిన గోత్రము వానిదేకదా
మంగళమ స్తటం చఖిల♦మాన్యుఁడు వాఁడు మముం దయాళుఁడై
సంగతసర్వశోభన వి♦శాలురఁ జేయుత నెల్లకాలమున్ ॥

వ. అని యిట్లు గోత్రపతివంశానుక్రమంబు దెలిపి తదీయ గోత్రోద్భవులై మహా యశంబు వహించిన యుత్తమ పురుషులఁ గొందఱం గొనియాడెద.

శ్రీహరితగోత్ర సంభూతులగు

—: శ్రీ భా ష్య కా ర రా మా ను జు ల చ రి త్ర ము :—

ఉ. అమ్మలయమ్మ యిందిర దఁయ న్నరకోటికి ముక్తిగల్గు మా
ర్గమ్మును దెల్పువాఁడొకఁడు • గల్గఁడె యీ కలిలోన నంచుఁ జి
త్తమ్మున జింత సేయఁ గని • తామరసాంబకుఁ డాత్మశయ్యయై
నమ్మతిఁగొల్చు శేషుని వెఁసం గని యిట్లని పల్కెఁ జెచ్చెరన్ ॥

క. ఆసూరి కేశవయ్యకు । భాసిలుఁ గాంతమ్మ యనెడి • భార్యామణి దా
నాసూరి సోమయాజియు । ధీసహితమ్మృగాక్షి సోమిఁదెమ్మయును జూమీ ॥

క. అతఁడు యజుశ్శాఖీయుఁడు । వితతాపస్తంబసూత్ర • విశ్రుతుఁడుండున్
హితమతి లౌకిక వైదిక । రతుఁడై తుండీరమండలగ భూతపురిన్ ॥

క. నీవు నని యతని కొమరుఁడ । వై విద్యావిశదమూర్తివై వేవేగన్
శ్రీవైష్ణవ సిద్ధాంతముఁ । గావింపు మనంగ నతఁడు • గ్రక్కున ధరకున్ ॥

క. చనుదెంచి భూతపురిలో । వనజాక్షుని యాజ్ఞ కొలది • వర్తించెడి దీ
క్షిని కేశవు మందిరమున । వనజాక్షికిఁ గాంతిమతికి • వరసుతుఁ డగుచున్ ॥

క. తొమ్మిదివందలముప్పది । తొమ్మిది శకశరతు లరుగఁ • దొడిఁ బింగళ చై
త్రమ్మాది భృగగుపంచమి । విమ్మహి నార్ద్రర్క్షమున జనించె గురుఁడు దాన్ ॥

క. శుభవేళం జనియించుట । శుభ చిహ్నం బగుట సూచి • క్షోణీసురవ
ల్లభు లాతని లక్ష్మణన । న్నిభుఁడంచును లక్ష్మణాఖ్య • నేర్పున నిడినన్ ॥

తే.గీ. కశ్యపునియందు నాది యుగంబులోన । కశ్యపాన్వయజాం డగు • ఘనహరీతు
నన్వయంబునఁ గేశవు • నందుఁ గలియు । గంబున జనించితి నటంచుఁ • గడు ముదమున॥

సీ. మును వేయినోళ్ళతోఁదను జదివిన శ్రుతి । ప్రచయంబు నొకనోటఁ • బఠన సేసె
మును కశ్యపబ్రహ్మ • చనువునఁ బెరిగిన । వాఁడు గేశవుప్రేమ • వాసిమించె
మును బ్రేమఁ గద్రువ • చనుబా ల్గుడిచి నేడు । కాంతమ్మ చనుబాలఁ • గడుపు నించె
మును రమాపతి దేహమును శయ్యయై మోచి । హరికృప నిపుడు శ్రేయంబుగాంచె

తే.గీ. భూమి దాల్చిన వేలు పీఁభూమిమీద । జనుల భవపాశమును ద్రెంపఁ • బాలుపడియె
లక్ష్మణుండయి కొన్నినాళ్ళన్న వేల్పు । తుదియుగంబున లక్ష్మణపదము వదసె ॥

తే.గీ. శేషభుజగేంద్రు నంశంబు • నెలగఁబుట్టి లక్ష్మణాఖ్య వహియించు • రామునకును
తోలువాఁడై న కతమున • భూమిజనులు । సొరిది బిల్చిరి రామాను•జుండు వనుచు ॥

క. శ్రీవైష్ణవసిద్ధాంతము । కేవల మీతండు మిగుల • కీర్తికిఁ దెచ్చెన్
వేవేలు సెప్ప నేటికి । నీ వసుమతి నంతవార • లెవ్వరు సెపుమా ॥

క. యతిరా జనియు విభూతి । ద్వితయాధిపుఁడనియు నుభయ•వేదాంత సుని
ష్ఠితుఁడనియు ననంత శ్రీ । యుతుఁ డనియును బిల్చి రతని • యోగనిరూఢిన్ ॥

ఆ.వె. చిత్తశుద్ధిపరులు • శ్రీమతేరామాను । జాయనమ యటంచు • శాంతవృత్తిఁ
జెలఁగి యాహిమాద్రి • సేతు పర్యంతంబు । మ్రొక్కు లిచ్చు గురుని • మ్రొక్కఁ దగదె॥

శ్రీహరితగోత్ర సంభూత

—: శ్రీ వత్సాంక చరిత్రము :—

క. శ్రీరామానుజ గురువరుఁ । జేరి మహార్థములు వినుచు • శ్రీవత్సాంకుం
డారూఢి నొక్క బాపఁడు । శ్రీరంగపురంబున న్వ•సించె ముదమునన్ ॥

శా. శ్రీవత్సాంకపదారవిందభజన•శ్రేయస్సమారబ్ధ సు
శ్రీవత్సాయురుపేతుఁడై పరమతా•జేయ ప్రభావాఢ్యుఁడై
శ్రీవత్సోపమవాగ్ధురీణుఁ డగుచున్ • జెల్వొందుచున్నట్టి యా
శ్రీవత్సాంకుఁడు వైష్ణవోత్తముఁడు హా•రీతుండు సామాన్యుఁడే॥

ఆ.వె. పర్ణశాలయందు • భార్యతో వసియించి । యొక్కనా డతండు • మిక్కుటమగు
గాలివానఁ దడిసి • యాలోగి బరలిన । తిండిలేక బయల • నుండవలసె॥

ఆ.వె. అప్పు డతనిభార్య • యాదిలక్ష్మ్యంబిక । కంపితాంగి యయ్యెఁ • గొంప విడిచి
రంగనాథు మంది•రంబున నారేయి । నారగింపుగంట • నాలకించి ॥

క. తివిరో దాసజనంబులు । తినలేదో యనక నీవు • తినుచున్నావా
యనుకొని యూరక యుండఁగ । మనమునఁ గరుణించి రంగ•మందిరుఁ డంతన్ ॥

క. మానిసిపలుకుల భక్తవి।తానంబున కనియె నీ ప•దార్థము నెల్లన్
బూని యరిగి శ్రీవత్సున । కీనగు నన వల్లె యనుచు • నేగిరి వేగన్ ॥

క. చని శ్రీవత్సున కిచ్చినఁ । గని కారణ మరయలేక • కాంత వడుగఁ దా
ననుకొంటి రంగనాథుఁడు । తిను దాసుల కిడక యని మ•దిన్ బ్రాణేశా ॥

క. అనవుఁడు నోసీ దీనిం । దిను మీవే యనిన మీరు • దినిన వెనుక నేఁ
దినియెద నన మూహూచియుఁ । దిను మిఁక నని యతఁడు పలికె • ధృతిమంతుండై ॥

తే.గీ. అంగనారత్న మా బువ్వ • యారగింప । గర్భవతియయ్యె దైవసం•దర్భ మెనసి
యంత నిర్వురు బాలకు • లమితతేజు । లూర్జితోదారలాంఛను • లుదయమైరి ॥

శ్రీహరితగోత్ర సంభూత

—: శ్రీ రం గ ప రా శ ర భ ట్టా ర కు లు :—

ఉ. పుట్టిన బిడ్డలన్ విడచి•పోయిరి తల్లియుఁ దండ్రియుం దయా
భ్రాట్టగు రంగఁడే మనుచు • బాలుర నంచును లక్ష్మణార్యుఁ డా
చిట్టితనంపు పట్టులను • జేరి ముదంబునఁ గొంచుపోయి చే
పట్టి సుఖంబుగాఁ బెనిచె • బాలుని నుగ్గును బెట్టి నేర్పునన్ ॥

తే.గీ. పరగఁ బ్రథమునకును బరా•శరసమాఖ్య । వెట్టెను ద్వితీయు శ్రీరాము•పేరఁ బిలిచె
వార లిరువురు వేదాంత • వార్తికముల । సేసి రచ్యుతసేవావి•శిష్టు లగుచు ॥

ఆ.వె. లక్ష్మి స్తన్యమిచ్చె • రామానుజుఁడు గురుం । డాయె మహిమ నెన్న • నలవి యగునె
శ్రీపరాశరుండు • శ్రీరామభట్టును । మనుజమాత్రు లన సం•మంజసంబె ॥

తే.గీ. అతితరప్రౌఢి విష్ణు • సహస్రనామ । భాష్య మొనరించి రిరువురు • భక్తమకుట
రత్నములుగారె శ్రీవత్స • లక్ష్మిపుత్ర । రత్నములు వారిఁ గీర్తింప•రాదె పెలుచ ॥

తే.గీ. రంగమందిరమునను బం•రాశరునకుఁ । బ్రేమ రామానుజుఁడు గురు•పీఠ మొసగె
నతని వంశంబునందు జాం•తాదికములు । రమణఁ బాటించు శ్రీరంగ•రాజు నేడు ॥

తే.గీ. కంచివరదుఁడు శ్రీవత్సు • నంచితమగు । స్తుతికి మెచ్చి తదీయ గో•త్రు లగువారు
ముక్తులని వరమిచ్చె నం•య్యుక్తిఁ జేసి । యహహ రామానుజుఁడు ముక్తుఁ•డగుచు నవియె॥

తే.గీ. గోత్రమునకెల్ల ముక్తిని • గూర్చినాఁడు । పరమగురులైన పుత్రులఁ • బడసినాఁడు
కంచివరదుని చాల • స్తుతించినాఁడు । ధరణి శ్రీవత్సుఁ బోలిన • నరుఁడు గలఁడె ॥

శ్రీహరితగోత్ర సంభూత

—: శ్రీ రా మ చం ద్ర సూ రి ప్ర భా వ ము :—

ఉ. ధారుణి నొక్క బ్రాహ్మణుఁ డు•దారగుణప్రచయుండు గౌతమీ
తీర నివాస పండితుఁడు • దివ్యవరాఢ్యుఁడు దా గలండు శ్రీ
వీరసమాఖ్యుఁ డాతనికి • వేదమయుండగు పుత్రుఁడొక్కఁ డా
భారతి సత్కృపం గలిగె • భాసుర రామపదాభిధేయుఁడై ॥

క. శ్రీరామచంద్ర నామము । తో రంజిలి కాశి కేగి • దుర్మతశిక్షా
కారణుఁడై గంగానది । తీరంబున భార్యతోడ • ధృతి నివసించెన్ ॥

సీ. జయపురాధిపుఁడైన • జయసింహ భూపతి కుష్ఠరోగముచేతఁ • గుందుచుండె
నెట్లు నివర్తించు • నీరోగమని చింతఁ గుడిచె నౌషధములు • కోటి వేరు
వెల్లంకులకు సొమ్ము • వెచ్చించె లక్షలు పాప మెట్టిదియొకో • పాయదయ్యె
వ్యాధి యొక్కింతయు • వైద్యులు పలువురు చనిరి దీనికి మందుఁ • గన మటంచు
తే.గీ. నంత నొకనాడు డెందాన • వంత మిగిలి । నిదుర వోవంగఁ గలలోన • నిరుపమాన
పురుషుఁ డొక్కండు గాన్పించి • నరవరేణ్య । యశ్వమేధంబు నొనరింపు • మని వచించె॥

ఉ. అంతట మేలుకాంచి యచలాధిపుఁ డాత్మపురోధఁ గాంచి స్వ
ప్నాంతరుదంతమెల్ల విన • నాడిన వల్లె యటంచు నాతఁ డ
శ్రాంతత యత్నముం జలుప • బ్రాహ్మణసంఘమువారు కొంద రీ
చింత వొసంగునే కలి నిషిద్ధమటంచు వచించి రెంతయున్ ॥

క. దానన్ భగ్నమనోరథుఁ । డై నరపతి కుందుచుండ • నారేయి గలన్
ధీనిపుణుఁడైన తొల్లిటి । మానవుఁడే వచ్చి పలికె • మధుమధురముగాన్ ॥

క. ఎంతయు సర్వం పాప్మా । నంతరతి యటంచు నే జనశ్రేష్ఠుఁడు ధీ
మంతుఁడు వచించు గంగా । ప్రాంతంబున వాని గనుము • వారాణసిలోన్ ॥

క. అనవుఁడు విని మేల్కని య । జ్జనపతి కాశికిని వేగఁ జని యున్మత్తుం
డునుబోలె గంగకడఁ దా । నను బాప్మానం తరతి య•టంచు నిరతమున్ ॥

ఆ.వె. ఇట్లు కొన్ని దినము • లేగంగ నాగంగ । లోన మునిగి లేచి • మేను దుడుచు
నొక్క ద్విజకులేంద్రుఁ • డెక్కటి తరతి ప । దంబు శ్రుతులఁ జొచ్చి • దాయవచ్చి॥

క. వింతగ సర్వం పాప్మా । నంతరతి శ్రుతిని జదువ • నరనాథుఁడు దా
నెంతయు సంతస మొదవ ని । జాంతికమున విప్రుఁ జూచి • యతిభక్తిమెయిన్ ॥

క. జయసింహుండను రాజను । జయపురనాథుండ నశ్వ • సవనము నాచే
దయతోఁ జేయింపంగల । భయరహితుఁడు గలఁడె యంచుఁ • బ్రార్థింపంగన్ ॥

చ. పలువురు విప్రు లొక్కమొగి • వాద వివాద వినోదులై కడున్
గలి హరిమేధముం దలపఁ • గాదనిరే నిది సేయకున్నఁ బే
శల తనుభావముం బడయఁ జాలను • నాకును స్వప్నమం దన
ర్గళమతి నొక్క భూసురుఁడు • గన్పడి చెప్పె నుపాయ మర్మిలిన్ ॥

తే.గీ. అతని వచనంబుకతన నే • నరుగుదెంచి । యున్నవాఁడ ననంగ నా • యుర్వీసురుఁడు
కరుణ వీక్షించి యోధరా•వరవరేణ్య । తురగమేధంబు సేయింతు • వెరవకు మిక ॥

క. అని భయము దీర్చి గంగను । మనమున బ్రార్థించి సవన • మార్గమ్ము క్రియా
ఫణితియుఁ గల గ్రంథమ్మును । గొని జయపురమునకు రాజ•కుంజరుతోడన్ ॥

క. చనుదెంచి విప్రసంఘం । బును వాదమునందు గెల్చి • మునివాక్యంబున్
వినిచి నిజౌద్భిజ్జత్వ । మ్మనుకూల మ్మనుచుఁ దెలిపి • యతినిపుణుండై ॥

ఆ.వె. పొట్టఁ బిగుల జీరఁ • బుట్టినవాడు మాం । ధాత కాన వాఁడు • ధరణిలోన
నుద్భవమును బట్టి • యుద్భిజ్జుఁడన నొప్పె । వినుము ధరణినాథ • విన్నవింతు॥

ఆ.వె. అతని కులమువారి • నౌద్భిజ్జు లందురు । హరితగోత్రజాతు • లట్టివారె
యెరుగుమయ్య నే హా•రీత గోత్రుండను । గలిని వాజిమేధ•కారయితను ॥

—: బ్రహ్మోత్తర ఖండము వ్యాసోక్తి :—

శ్లో॥ ఔద్భిజ్జో భవితా కశ్చిత్ । సేనానీ కాశ్యపో ద్విజః
సోశ్వమేధం కలియుగే । పునః ప్రత్యాహరిష్యతి.

వ. అను వచనంబు సదివి రాజు నొప్పించి యశ్వమేధం బతనిచే నిర్విఘ్నంబుగాఁ బరి
సమాప్తి నొందింప నా భూపాలునకుం గుష్ఠరోగంబు నివర్తించె మఱియు ॥

మ. జయసింహాం దచలాగ్ని ఘోటకధి వ•ర్షంబుల్ కలిం బోవఁగా
హయమేధం బొనరించె నెవ్వని ఘన • వ్యాపారపారీణతన్
బ్రియవాక్పాటవసిద్ధి నట్టి గురునిన్ • శ్రీరామచంద్రాఖ్యునిన్
జయ హారీతసగోత్రునిన్ దలచెదన్ • సర్వప్రమేయంబులన్ ॥

క. ఢిల్లీప్రభువగు నగ్పరు । నల్లుఁడు జయసింహరాణ్మ•హారాజు సుధీ
వల్లభుఁడు సుధారసముక్ । సల్లాపుఁడు వాఁడు లోక•సామాన్యుండే ॥

తే.గీ. రామచంద్రుని వంశ్యులు • రాణివారు । కలఁడు వైశాఖపురి నేడు • కప్రకీర్తి
శాలి యగునట్టి దైవజ్ఞ•సార్వభౌమ । చిహ్నమును బడసిన నర•సింహయజ్వ ॥

## శ్రీ హారీతగోత్ర సంభూత

### —: కమలాకర భట్టార్య ప్రభావము :—

తే.గీ. ఎల్లధర్మంబు లాసేతు • హిమనగ ప్ర । సిద్ధమైనట్టి నిర్ణయ•సింధు వనెడి
శాస్త్రసంగ్రహంబున దెల్పె • సకల ధీర । హారమణియగు నక్కమ•లాకరుండు ॥

తే.గీ. శూద్రకమలాకరం బను • సుప్రసిద్ధ । గ్రంథ మొక్కండు శాస్త్రసం•గ్రహము సేసి
యఖిలజనమాన్యుఁ డయ్యె వి•ద్యావిలాస । హారమణియగు నక్కమ•లాకరుండు ॥

తే.గీ. రెండువందల వర్షముల్ • నిండె నేటి । కతని విద్యావినోదంబు • లవనియందు
భూపతివ్రాతములచేతఁ • బూజ్యమాన । మగుచు వర్తిల్లిన దినంబు • లవనియందు

శ్రీ హరీతగోత్ర సంభూత

—: కురుగంటి వేంకటరామశాస్త్రి ప్రభావము. :—

సీ. శాలివాహనశక • సంవత్సరంబులు । పదియేడువందల • పైన నొక్క-
వర్షంబునను గోన•వారిపాలెమున నెల్లూరుసీమను సదా•చారవృత్తి
చణుఁడు రామస్వామి•శాస్త్రి యజుర్వేది । సుమహితాపస్తంబ•సూత్రయుతుఁడు
కలఁడు శాయమసాధ్వి • లలితాంగి తను గొల్వ । నన్నదానపరత్వ • మమర నతని

తే.గీ. కొమరుఁడై పుట్టెఁ దొంటి గౌ•తముఁడు తర్క- । శాస్త్ర కుత్సితహేతుప•క్ష ప్రమాద
రాజిఁ దొలఁగింప వేంకట•రామశాస్త్రి । వినుత దుర్హేతువాదవి•భేద శక్తి ॥

తే.గీ. అతఁడు హారీతకులజాతుఁ • డనుగమాఢ్య । మైన క్రోడంబు రచియించి • యధిక కీర్తిఁ
బడసె దిగ్విజయముఁ గాంచెఁ • బరులు సాటి।రారు కురుగంటి వేంకట•రామమణికి ॥

తే.గీ. కాశి గద్వాల పునహాన•గర జయపుర । నాగపుర కాశీపట్ట తం•జాపుర మిధి
లాపురానంతశయన కొ•ల్లాపుర మహి । శూర పురములఁ గురుగంటి•సూరి గెలిచె ॥

క. అనుగమ భట్టాచార్యం । డని కొందరు తర్కసింహ • మని కొందరునుం
గని యపరగౌతముండని । యును గొందరు పిల్చి రతని • నుర్వీస్థలిపై ॥

క. పదుచుఁదనముననె తనయుల్ । విడచెను దాఁ బ్రొద్దువాక • వీటను బాలుర్
విడిదిగను గైకలూరుం । బడసెను దా నంద యుండె • బహువర్షంబుల్ ॥

క. కొల్లేటి యొద్దునం గల । ఝుల్లీలోఁ గైకలూరు • చక్కని యూర్మా
యల్లూరికి గ్రోశత్రియి । నుల్లసిలుం బ్రొద్దువాక • యొక క్రోసు నుడీ ॥

కృతికర్తృ నిజవంశ వర్ణనము.

—: శ్రీమదాదివరాహస్తుతి. :—

శా. శ్రీవాల్లభ్యము కొల్లపెట్టెడి నురః•స్సీమం బ్రవేశించి యం
చా విశ్వంభర చిన్నబోవు నని తుఁల్యప్రేమ నూవఁగా వరా
హావిర్భావము పూని దంష్ట్రశిఖ నొఁయ్యందాల్చి యున్నట్టి య
ద్దేవుం డీవుత భోగభాగ్యశుభసిద్ధి న్మాకు నక్రాంతముల్ ॥

—: గురుపరంపరాస్తుతి :—

శ్లో. రఘునాథప్రధానాద్యామ్ । గంగరాణ్మంత్రి మధ్యమాం
కన్నయామాత్య పర్యంతామ్ । వందే గురుపరంపరామ్ ॥

వ. అని గురువందనము సేసి.

—: శ్రీ రఘునాథరావు ప్రభావము. :—

శా. శ్రీశ్రీశ్రీరఘునాథ భూమివిబుధా•గ్రేవర్తి సత్కీర్తియై
శ్రీశ్రీశ్రీపునహాపురీ నికటభూ•రిక్ష్మా మహారాష్ట్రి సు
శ్రీశ్రీశ్రీయగు ధారువాడనగరీ • జేగీయమానస్థితిన్
శ్రీశ్రీశ్రీయయి గోలకొండకును వి•చ్చేసెన్ రణోద్యోగియై ॥

ఉ. వచ్చి తురుష్కభూమివర • వర్గము నుగ్గొనరించి సేనలన్
జెచ్చెరఁ గొంచుపోవుతరి • సేహి సుసాహెబుఁ డొంటిఁ బట్టి తాఁ
దెచ్చెనుఁ గార కంతటను • దేవిఁ దలంచి విముక్తుఁడయ్యె వాఁ
డెచ్చటి కేగెనో యెఱుఁగ • రేరు వనస్థితి మెచ్చి యుండుఁబో ॥

చ. అకుబరు చక్రవర్తి యెపుఁ • డాతనికిన్ జయపూరుసీమ యే
లిక జయసింహుఁ డల్లుడు ల•లిన్ హయమేధము రామచంద్రయా
జకుఁ డతిమానుషం డవని•జానినిఁ దా నొనరింపఁజేసె మా
నక యపు డస్మదీయ రఘు•నాథుఁడు వచ్చెను గోలకొండకున్ ॥

—: హరిదాస్ గంగాజీ ప్రభావము. :—

ఉ. ఉండెను గోలకొండను ద•దుజ్వలమైన యశంబుతోడఁ బు
త్రుం డొకరుం డుదారగుణ•రూఢిమెయిన్ హరిదాసవృత్తి న
క్కొండిక గంగజీ యనుచుఁ • గూరిమి నెల్లరు బిల్చి రా మహా
మండలమందె భూసుర కు•మారికఁ బెండిలియాడె నాతఁడున్ ॥

—: దాసురఘునాయక ప్రభావము. :—

చ. నయమతియై యతండు రఘు•నాయకుఁ గాంచెను నాడు వాని య
న్వయమును దాసువా రనుచు • వాడిరి నాటికిఁ జక్రవర్తి వి
శ్చయముగ షాజహానుఁడు ల•సద్గుణశాలి యతండు భీతి త
క్కియ చని కాంచె నబ్బుదుత•కీసులతో బుడుతండు బందరున్ ॥

చ. బలియుఁడు గోలకొండకు న•బాబట యొక్కరుఁ డల్లిఖాను డు
జ్జ్వలమతిశాలి వానికడ • కొయ్యనఁ బంపిరి బుద్ధికీసువా
రలు పనిచెప్పి యయ్యవక•రత్నము నచ్చటఁ గార్యధుర్యతా
లలితత నొక్క భూమిసుర•రాజకుమారికఁ బెండ్లియై వెసన్ ॥

—: దాసు గంగరాజమంత్రి ప్రభావము :—

ఉ. ఆ రఘునాయకుండు పున•రాగమనం బొనరించె వేడుకన్
దూరపువార్ధితీరమునఁ • దోరపు బందరుపీటికిన్ మహో
దారుని బుద్ధిసారు నిగ•తశ్రుతిపారకుమారుఁ బాండితీ
శూరుని గంగరాట్సచివ•సూరునిఁ గాంచెను దత్పురంబునన్ ॥

ఉ. రెండవ గంగరా జతఁ డ•రిప్రవజేతృత నూజవీటికిన్
దండపతిప్రమేయపర•తం జని యా నృపవర్యుచేత మా
న్యుండయి తాన కోరెనట • యూ రట నాత్మనివాసయోగ్య మొ
క్కండట పత్రపుష్పతృణ•కాష్ఠజలాన్విత మాళ యల్పమే ॥

క. పంటం గోరడు బహుజను।లుంటం దలఁపండు పొదల • నూసదములు గో
రంటలు బాపట పచ్చిక। కుంటలనుం గంగరాజు • కోరిన యూరే ॥

—: అల్లూరుగ్రామోత్పత్తి :—

తే.గీ. గురజగ్రామము దరి నొక్క • కొంపయైన।లేని యడవి నొసంగె భూ•జాని యపుడు
పదియు రెండగు టంకముల్ • పన్నుగట్టి। యూరికరణా లగుచు మీర • లుఁడుఁ డనుచు॥

—: దాసు సుందరరామమంత్రి ప్రభావము :—

తే.గీ. అల్లిఖానుఁడు గోల్కొండ • కధిపు డగుట। పేరు బెట్టిరి దాని క•ల్లూ రటంచు
గంగరాజున కాత్మజుల్ • కలరు మువురు। మధ్యముండు సుందరరామ•మంత్రి యయ్యె॥

ఆ.వె. నూజవీటిలోని • రా జిచ్చె మాన్యంబు। వెదురుపావులూర • ముద మెలర్ప
దాని నిపుడు బంధు•ధర్మంబు పేరిమి। శంకరాన్వయులు పొం•సంగఁ దింద్రు ॥

తే.గీ అల్లినగరంబు ఖానుకొం•ల్లపుడు పుట్టె। నని తలంచెద రల్లూరి • కనతిదూర
మందు పశ్చిమభాగోర్వి • నతిశయిల్లు।చుండు వరుసను నయ్యూళ్లు • రెండు నేడు ॥

క. సుందరరాముని కొడు కతి। సుందరుఁడని యెంచి సకల • శోభనగుణముల్
గందుమని యిడిరి బుధు లా।నందంబున గంగరాజు • నామము వేడ్కన్ ॥

తే.గీ. గ్రామమున కల్లిపేరని • కడమఖాను । పేరు పుత్రున కిడనెంచి • పేర్మిమీర
కన్నయ యటంచు ముద్దుకై • కొన్నికొన్ని । కాలములఁ బిల్చె నెరజాణ • గంగరాజు ॥

ఆ.వె. అతఁడె సూవె గంగ•యామాత్యుఁడై తొల్లి । యారువేలవారి ♦ నవఁగిపెనఁగె
నాటనుండి తూర్పు • నాటను మేటి ని।యోగు లంచుఁ గీర్తి ♦ నొంది రెలమి ॥

—: ఆ ర్వే ల వా రి ప్ర భా వ ము :—

సీ. ముక్కంటిరాజన్యు • మూర్ధాభిషిక్తుఁగా వెలయించువా రారు•వేలవారు
వృషభాధిరూఢులై ♦ వేలూరుసని కీర్తి వెలయించువా రారు♦వేలవారు
రాజమాన్యాది • విభ్రాజమానాంకముల్ వెలయించు వా రారు•వేలవారు
వంశంబులకుఁ బ్రభు•వ్యవహృతి వృత్తిగా వెలయించువా రారు♦వేలవారు

తే.గీ. పేరుఁబడసినవా రారు•వేలవారు । పేదలను బ్రోచువా రారు♦వేలవారు
మేలుఁజేసెడివా రారు•వేలవారు । కేలుసాచనివా రారు•వేలవారు ॥

వ. మఱియు నా గంగరాజు

సీ. సంతతాచ్యుతభక్తి•చింతావిశేషాంతరంగస్థ యతిరాజు • గంగరాజు
భువనైకమోహనా♦ద్భుతలక్షణాశేష శృంగార రతిరాజు • గంగరాజు
వివిధ లౌక్యప్రభు•వ్యవహారనాటక రంగస్థనటరాజు • గంగరాజు
ఇంగితజ్ఞాన సా•హిత్యసంతోషిత వంగాంగ శకరాజు ♦ గంగరాజు

తే.గీ. మానితాఖండ లక్ష్మీని•ధానదాన । లింగసుగుణాంగరాజు మా • గంగరాజు
సంగతాల్లూరి గంగోత్త•మాంగ సోమ।లింగరాజౌర శ్రీదాసు • గంగరాజు ॥

తే.గీ. ఆంగిలేయుల ధాటికి • నాఁగలేక । యుద్ధత పరాసు సైన్యంబు • లోడె నెపుడు
బుస్సి హైదరాబాదుకుఁ • బోయె నెపుడు । అప్పుడే గంగరాజు స•ద్యశముఁ గాంచె ॥

తే.గీ. గంగరాజు సలాబతు•జంగురాజు । వంగి రాఁజూచి జయఘంట • టాంగనంగ
నాంగ్లరాజులు బందరు•నందు నిలచు । మంగళారంభమున నిల్వఁ • టంగిఁ దొడఁగె ॥

వ. అతఁడు

ఉ. శంకరభక్తులై పరమ • సాధువులై కడుకీర్తి దేశపాం
డ్యాంకముఁ బూనినట్టి సచి•వాగ్రణు లుండిరి నూజివీటి రా
జాంకితు రాజ్యమందు ఘను • లద్భుతచర్యులు ముస్తబాదలో
శంకరవారు వారి కుల•సంభవఁ జిన్నమ నాడెఁ బెండిలిన్ ॥

ఉ. చిన్నమ పాలవెల్లిగను • చిన్నమ నేఁ గొనియాడ నేర్తునే
చిన్నమ మేల్గొనమ్ములకుఁ • చిన్నమయేనియు నీసు లేదు రో
చిన్నమనమ్మ హొన్ను గను • జిన్నమరాళము యాన బూను ల
చ్చిన్నమ యంచనున్ నెనరు • చిన్నములం దరహాస వైఖరుల్ ॥

క. అగంగని చిన్నమ్మకు । యోగాంచితు లమితధీప్ర•యోగాద్భుతు లు
ద్యోగాశ్రితరాగాయత।భోగత్యాగాయతనులు • పుట్టిరి కొమరుల్ ॥

—: అక్కిరాజు ప్రభావము. :—

ఆ.వె. అందుబ్రథమ పుత్రుఁ • డక్కిరా జనువాడు । సంతతాన్నదాన • చతురబుద్ధి
బహు పురాణవేత్త • విహిత పంచాయత।నార్చనుండు పొగడ • నలవి యగునె ॥

సీ. కమదన శోభనా•ద్రిమహీశు నిజసీతి నెక్కు నొక్కొక్కనా • డక్కిరాజు
న్యాయహీనుల దండ•నము లెంచి కలముతో నొక్కు నొక్కొక్కనా • డక్కిరాజు
భక్తిఁదపోయుక్తి • బాహ్యమర్మ మడంగ ద్రొక్కు నొక్కొక్కనా • డక్కిరాజు
కామితార్థము లిచ్చు • సోమేశు గుడికేగి మ్రొక్కు నొక్కొక్కనా • డక్కిరాజు

తే.గీ. పెక్కుమనుజులఁబ్రోచినాఁ • డక్కిరాజు । మిక్కిలి దయారసంబువాఁ • డక్కిరాజు
నిక్కమగు లక్కిమికి నిక్క • యక్కిరాజు । చక్కదనముల చుక్క మా• యక్కిరాజు ॥

తే.గీ. పాపటాకులు గుట్టుక • పగలు రెండు । జాల గోపాయఘంటిక • నాలకించి
లేచి శివపూజలను జేసి • లేత గురుగు । కూర వరిబువ్వ భూసుర•కోటి మెక్క ॥

తే.గీ. అక్కిరాజింటఁ జేరల • నాజ్యధార । లోడ బోసేసి భూసురు•లొక్కరీతి
వాసమును జేసి రల్లూర • వనకుటీర । పంజరమ్ములఁ జిల్కల • పగిది నిలచి ॥

ఉ. అతని యన్నదానమున • నాజ్యము మెండట భూరిభూసుర
వ్రాతము తిన్న వెన్కఁ బరి•వార జనంబులు నాజ్యసిక్తధా
త్రీతలమ్మృత్తు నీళ్ళ నిడి • తీసినఁ బేరిన నెయ్యిఁ గొంచు న
త్యాతత జీవనార్థపరు • లమ్మిరటే యిక నేమి దెల్పుదున్ ॥

తే.గీ. దయఁగలిగె రాజునకును బెద్దసెల పండె । నక్కిరాణ్మంత్రి దాతయై • యలరె సుబ్బ
మాంబ వండెను వడ్డించె • నవనిసురులు । బ్రేవుమని త్రేన్పి రిందేమి • వింతగలదు ॥

క. ఆయన హయాములోనే । మాయూరను సోమలింగ • మందిర మొదవెన్
బాయని మాన్యము పుట్టెన్ । హాయిగ నూ రగ్రహార • మాయెను మాకున్ ॥

తే.గీ. అక్కిరాణ్మంత్రిభార్య సు•బ్బమ్మ పరమ । సాధ్వి యతితరపతిభక్తి•సహిత విహిత
శాంకరీవ్రతనిరుపమా•చారమహిత । పాపరహిత యుదారకృ•పాసమేత ॥

—: దాసు రఘునాయక ప్రభావము :—

తే.గీ. అతని తమ్ముఁడు రఘునాయ•కాభిధుండు। కన్నయాభిఖ్యయును దోడు•గాఁ జెలంగ
మంత్రి శేఖరుఁడయ్యెఁ గ•మదన శోభ।నాద్రినృపునకు గురజ పు•రాధిపునకు ॥

సీ. అల్లూరు సీతన•పల్లీ పురద్వయీ నాయకుం డా రఘు•నాయకుండు
కూరాడ గుడ్లవ•ల్లేరాది పురమాన్య నాయకుం డా రఘు•నాయకుండు
కమదనాన్వయ శోభ•న మహీపసభ మంత్రి నాయకుం డా రఘు•నాయకుండు
ఝల్లీ ప్రముఖ చార్మ•హాళ్ళ జమీ దండనాయకుం డా రఘు•నాయకుండు

తే.గీ. వందిత వినాయకుఁడు రఘు•నాయకుండు। నమ్రశుభదాయకుఁడు రఘు•నాయకుండు
నయకృతివిధాయకుఁడు రఘు•నాయకుండు। నవకుసుమసాయకుఁడు రఘు•నాయకుండు ॥

సీ. తన వ్రాలుతో మాన్య•ధారుణీఖండంబు లిచ్చినా డది శౌరి • మెచ్చినాఁడు
తన కీర్తి దశదిశా • ధామంబులకు వెల్లఁ బెట్టినాఁ డది రాజు • బట్టినాఁడు
తన శౌర్యమున దుష్ట•తండంబులను దూలఁ ద్రోచినాఁ డది ప్రొద్దు • సూచినాఁడు
తన గుణంబులఁ బ్రజా•తతిచేఁ బొగడ్తల మించినాఁ డది స్రష్ట • గాంచినాఁడు

తే.గీ. దాసు రఘునాయకుని చరి•త్రములు చిత్ర।చిత్రములు పండితస్తుతి•పాత్రములు ప
విత్రములు నఘవల్లీ ల•విత్రములు వి।లిఖిత బహుపత్రము లెవండు • లెక్కపెట్టు ॥

సీ. అతఁడుగాక మఱెవ్వఁ • డన్యాయవర్తియౌ • తాళూరి జోగనఁ దరిమినాఁడు
అతఁడుగాక మఱెవ్వఁ • డవ్వాడవల్లి మా•న్యంబిచ్చి భట్టుల • నంపినాఁడు
అతఁడుగాక మఱెవ్వఁ • డా కమదన శోభ•నాద్రీంద్రుఁ దోడుగా • నరసినాఁడు
అతఁడుగాక మఱెవ్వఁ•డల్లూరి సోమేశదత్తప్రసాదంబుఁ • దాల్చినాఁడు

తే.గీ. దాసు రఘునాయకునివంటి • ధైర్యశాలి। దాసు రఘునాయకునివంటి • ధార్మికుండు
దాసు రఘునాయకునివంటి • తజ్ఞమౌళి। దాసు రఘునాయకునివంటి • దాత లేఁడు ॥

తే.గీ. ఆసఁ గోరంగ నూరి మి•రాసి విన్న।కోటవారి కొసంగి శ్రీ•పాటవమున
అగ్రహారాధిపపదంబు • నందినట్టి। అక్కరాణ్మంత్రి సోదరుల్ • దల్పుఁడగునె ॥

ఉ. ఆయన భార్య యచ్చమ భ•ళా యనఁ బేరువహించి మించెఁ గా
త్యాయనిఁబోలి పుల్లజల•జాయతనం బురడించి కల్వరా
నాయనమై తలిర్చు ముని•నాయకు నంగననా నరుంధతీ
ప్రీయనఁబొల్చి యంతటి పఁతివ్రత పుట్టదు పుట్టఁబో దిలన్ ॥

—: బ్ర హ్మ య మ ం త్రి ప్ర భా వ ము. :—

క. ఇల నక్కరాజ రఘునా।థులకుం దమ్ముండు మంత్రి॰ధూర్వహుఁడు హిమా
చలమహిమాచలధైర్యు।మ్ముల కలుముల మొలక నాకు ॰ ముత్తాత సుమీ. ॥

సీ. అతఁ డగ్రగజప్రమో॰దానుకూలుఁడె గాక యతఁ డగ్రగజప్రమో॰దానుకూలు
డతఁడె మాధవభక్తి॰యుత మనీషుఁడెగాక యతఁడు మాధవభక్తి॰యుతమనీషు
డతఁడు సన్మాన్యగో॰త్రానుభూతియ గాక యతడు సన్మాన్యగో॰త్రానుభూతి
యతఁడు రుచిరమహా॰స్తతినిధానుడె గాక యతడు రుచిరమహా॰స్తతినిధాను

తే.గీ. డెన్న గాదు తరంబు వే॰యేండ్లకైన । బరమలావణ్యసహితంబు ॰ భాసురంబు
గంగరాట్చిన్నమాంబికా ॰ గర్భశుక్తి । గనిన బ్రహ్మయ్యమంత్రి ॰ ముక్తాఫలంబు ॥

సీ. తానకా వివిధసా॰ధన మనోరథక సం।తానంబులకును సం॰తానమయ్యె
తానకా బహుభూత॰తతికి మహాశేష । భోగంబులను శేష॰భోగమయ్యె
తానకా భూనాథ॰దత్త నానామాన్య । గోత్రులందును మాన్య॰గోత్రుఁడయ్యె
తానకా వ్యవహార ॰ తంత్రాషడక్షీణ । మంత్రంబులకు మూల॰మంత్రమయ్యె

తే.గీ. దానకా సాంగసాధితా॰ధ్యయన విరత।వేది కధ్యయననిరత॰వేది యయ్యె
నతని గీర్తింప నాబోంట్ల ॰ కలవి యగునె। దాసుకుల బ్రహ్మమంత్రి న ॰ దాసుకులుఁడు ॥

ఉ. అలు ప్రసిద్ధురాలు శుభు॰రాలు యశోధనురా లరుంధతిం
బోలు పతివ్రతాతిలక ॰ పూజితురాలును గృష్ణమంత్రియఁ
బాలు సుధావిశాలు గను ॰ బాలెతరాలును సుబ్బమాంబ యే
రా లగు మంగమాంబ జవ॰రాలు వరాలు సరాలుగా నిడెఁ ॥

ఉ. మంగమ భర్తృభక్తిగరి॰మం గమలాలయ బంధుకోటిఁ బ్రే
మం గమనించుబుద్ధి మహి॰మం గమలాసనురాణి తెల్గుసీ
మం గమలాక్షులెల్ల పొగడ॰మం గమనం బిడు మేల్గొనాలు క్ర
మ్మంగ మరంద ముక్తిఁ జిదు॰మం గమనీయ శుభ ప్రసంగసూ ॥

ఉ. భారతి మంగమాంబ యల ॰ బ్రహ్మయ బ్రహ్మయ దాసువంశ వి
స్తారులు వాని యంశములె ॰ సారవచోమహింబుఁ గల్గుటల్
చారుహిరణ్యగర్భపద॰సంగతిఁ గాంచుట రాజసంబునన్
జేరిన సత్యవర్తనము ॰ సేయుట సాక్ష్యముఁగాక యుండునే. ॥

—: కృష్ణయమంత్రిప్రభావము. :—

క. మంగమకును బ్రహ్మయకు నా । భంగురబలశాలి పంచ • బాణుఁడు తనకే
యంగజుఁ డనఁదగు శ్రీవర । శృంగారయుతాంగుఁడైన • కృష్ణుడు పుట్టెన్ ॥

సీ. వంశజాతుని జంప • వచ్చిన యేడ్వురు దొంగల నొకచేతఁ • దోలినాఁడు
యెద్దులఁ గొనిపోవు • నిద్దరి గండళమ్మునఁ బట్టి వీపున • మోచినాఁడు
భువనైక మోహన • మూర్తి వాటిలి యేక పత్నీవ్రతంబునఁ • బ్రబలినాఁడు
కలము కాకితముపై • నిలిపి ముక్తాఫల వ్రాతంబునా దొల్లి • వ్రాసినాఁడు

తే.గీ. కన్నబిడ్డలవలె నూరి • కాపురముల । వారి యందరి క్షేమంబుఁ • గోరినాఁడు
నవ్వులాటలకునైన యెం • న్నండు బద్దు । మాటలాడఁడు కృష్ణయ్య మంత్రివరుఁడు ॥

తే.గీ. మంత్రిమార్తాండుఁ డతఁడు స • న్మార్గవర్తి । మహితధాముఁ డఖిలలోక • మాన్యమూర్తి
కూర్మిఁ బెండ్లాడె నొకముద్దు • గుమ్మ తనకుఁ । జాయగానుండు వెంకమ్మఁ • జారువదన ॥

చ. అడవికులంబునం దుదయ • మై నికటాశ్రిత చందనంబుగా
నొడయనికిం బ్రియం బెసగ • నోపిక వేంకమ భూమిఁబుట్టు వం
గడముల నెల్ల మొల్లముగ • గంధయుతంబులు సేసె నౌర యే
యెడ నెటువంటి భూజనుల • నీమెను బ్రస్తుతిసేయఁ జెల్లదే ॥

చ. అలఘు సుభద్రపాణి విభ • వాతిశయంబునఁబట్టి సత్క్రియల్
సలిపినవాఁడు దాసుకుల • జాతుఁడు శ్రీవిజయుండు భవ్యమం
జుల గుణశాలియైన తను • జుం భువిఁ గన్నయనాఁ బ్రసిద్ధిచే
విల నలరించువాఁ డతడు • కృష్ణుఁడు కృష్ణుఁడు గృష్ణుఁడే సుమీ ॥

ఉ. మల్లయమంత్రి యాతని సు • మంగళి వేంకమనామ్ని తంద్రియుం
దల్లియుఁగాఁగ వేంకమ ని • తంబిని కృష్ణయమంత్రి భార్యయై
యల్లన గొన్నరుల్ విడచి • యల్లురువీటను బాడిపంటలన్
గొల్లలుగా భుజించెనట • గొల్లలు కాపులు కొల్వుకాండ్రుగాన్ ॥

—: అస్మజ్జనకులగు కన్నయమంత్రీంద్రు ప్రభావము :—

క. ఆయన గర్భమునందుఁ బ్రా । భాయుతులగు మువురు సుతులు • ప్రభవించిరి వా
రాయతబుద్ధులు మధ్యముఁడై । యొప్పెను గన్నయాఖ్యుఁ • డన్వయమణిగాన్ ॥

ఉ. కన్నయ కీర్తిచే బుధుని • గన్నయ సంపదచేఁ గుమారునిం
గన్నయ ధర్మయుక్తి శిబి • కన్న యశస్వి గభీరతన్ సిరిం

గన్నయ సత్కృపాప్తి మరుఁ • గన్నయ ధైర్యముచేతఁ బార్వతిన్
గన్నయ సాటి సెప్పఁగ ని•క న్నయశాలులు లేరు ధారుణిన్ ॥

సీ. సతతాన్నదాన సు•వ్రతమున బద్ధకంకణహస్తుడై కీర్తి • గాంచి మించె
అవనీశు వశమైన ♦ యగ్రహారముఁ దెచ్చె లౌకిక ప్రజ్ఞ న•గ్గడల నెఱపె
జీర్ణపర్ణాలయ•స్థితి మాని సోమేశ లింగని సద్ధామ♦సంగుఁ జేసె
లలిత నానావిధ•ఫలరమ్య తరులతో నాటించె మేలైన • తోట యొకటి

తే.గీ. అతఁడు సామాన్యుఁడే మామ♦కాన్వయాబ్ధి । కల్పభూజం బనల్పసం♦కల్పుఁ డమిత
తేజుఁ డుద్గీతకీర్తి నం•దిత బుధుండు । కన్నయామాత్య వంశసంక్రందనుండు ॥

ఉ. ఆ కరుణాళుఁడుం బరిణయంబునఁ • గైకొనెఁ గూరవాడ వం
శాకర రామచంద్ర వసు•ధామరు కూరిమిపట్టి యయ్యు న
స్తోకపతివ్రతామహిమ•తోడ నరుంధతి నుద్దిసేయఁగాఁ
దూకము మించు కామమ వ•ధూమణి సంచితపుణ్యకారిణిన్ ॥

## మా తృ దే వ తా స్తు తి

—: కా మ మ్మ ప్ర భా వ ము. :—

సీ. కలిమి కుబ్బదు భర్త • చెలిమి కుబ్బునకాని యడియాస కలికాన•కైన లేదు
మేను నమ్మదు భగ•వాను నమ్మునకాని గర్వంబు కలలోనఁ • గానరాదు
ఖ్యాతిఁగోరదు మంచి • నీతిఁగోరునకాని వెదకిచూచిన దంభ•వృత్తిలేదు
సొమ్ము మెచ్చ దుపకా•రమ్ము మెచ్చునకాని యెద నీసుఁగొనుట యొ•క్కింతలేదు

తే.గీ. పరమ మంగళగుణముల•పాలవెల్లి । యాశ్రితావళిపరితాప • మడఁచు నెల్లి
నళిననేత్రాజనమతల్లి • నాకుఁదల్లి । కామమాంబాభిధానయౌ • కల్పవల్లి ॥

సీ. పేదసాదల నెంచి • పెట్టెఁబో యన్నంబు చాలఁగా విరిగిన ♦ వ్రేలు గట్ట
చుట్టాలఁ బక్కాలఁ • జూచెఁబో దయతోడ పదుగురిలో భళా•భళ యనంగ
చాకిలేకులఁ బ్రేమ • సాకెఁబో నిరతంబు పేరు సెప్పుక దివ్వె • బెట్టి మ్రొక్క
పిన్న పెద్దలఁ గని•పెట్టెఁబో వంశాభివృద్ధిర స్తనుచు దీ•వెన లొసంగ

తే.గీ. సద్గుణప్రచయాలంబ • చారుకీర్తి । కాంతిజితచంద్రమోబింబ ♦ కలుషకుధర
పక్షకృంతనశంబ స♦ద్రక్షణావి।లంబ మాయంబ శ్రీకామ•మాంబఁ దలఁతు ॥

సీ. ఏయమ్మ రాఁ జూచి • యెలమితో దామెనల్ లాగికొంచొగి నావు•లేగ లరచు
ఏయమ్మ తనకాళ్ళ ♦ నిడిన మట్టెల మ్రోత విని పాకిరులు క్రియా•విధుల నుంద్రు

ఏయమ్మ దరహాస • మెనయగా నీక్షింప నమ్మలక్కల మన్ను • లాచరింత్రు
ఏయమ్మ కనుసన్న•చాయఁ గోడలు మన్మ•రాండ్రును బ్రాల్మాల • రన్నిపనుల

తే.గీ. పాల్పెరుగుమీగడల బువ్వఁ • గల్పిపెట్టి । పెంచె నేయమ్మ నన్ను నా•పిల్లవాండ్ర
పిల్లవాండ్రకుఁ బుట్టిన • పిన్నవాండ్ర । నట్టి మాయమ్మ కామమ్మ • నాత్మఁదలఁతు ॥

సీ. కన్నయ్య వండింపఁ • గామమ్మ వండింప లేచిన విస్తళ్లు • లెక్కలేదు
కన్నయ్య తెప్పింపఁ • గామమ్మ యిప్పింపఁ గొలచిన ధాన్యంబు • విలువలేదు
కన్నయ్య నిలిపింపఁ • గామమ్మ గొలిపింప వేల్పుగొల్పుల కొక్క • వేళలేదు
కన్నయ్య వ్రాయింప • గామమ్మ చేయింప నుపకారములకు మా•రొద్దులేదు

తే.గీ. నన్నునుం బోలె నాదు మే • నత్తకొడుకులైన కనకయ్య కృష్ణయ్య • నరసిప్రోచి
పెంచి పెద్దల గావించి • పెండ్లిచేసి(నట్టి నాతల్లిదండ్రుల • నాత్మఁదలతు ॥

సీ. ఒకవేళ తగునీతు • లుదయింప బోధించు నాడువాండ్రకు దన•యంతదాన
ఒకవేళ భారతా•దిక మహాగ్రంథముల్ చదివించి విను ధర్మ•సమితి దెలియ
ఒకవేళ పెన్మిటి•యొద్దకేగి కుటుంబ కార్యమంత్రముల జ•క్కట్లుదీర్చు
ఒకవేళ తన మన్మ•లును మన్మరాండ్రకుఁ గతలు సెప్పుచు మచ్చి•కలను దనుపు

తే.గీ. ఒక్కవేళను నను బిల్చి • యెక్కుడైన । చిక్కు విడఁద్రొక్కు బుద్ధులు • చెప్పునంపు
నొక్కవేళను వేల్పుల • ప్రక్కమ్రొక్కు । నట్టి కామేశ్వరమ్మ మా • యమ్మఁ దలతు ॥

క. ఆయన మానాయన యీ । మాయామధ్యామతల్లి • మాతల్లి శుభ
శ్రీయుతుని నన్ను గాంచిరి । పాయని నా పూర్వపుణ్య • ఫలమునఁగాదే ॥

క. వారల పదపద్మములకుఁ । జేరి నమస్కృతు లొనర్చి • సేవించి సుధీ
స్ఫారుల కరుణను గైకొని । నే రచియింపఁ దొడగితి•ని గృతిచయంబున్ ॥

క. నను రాముఁడనుచు లోకము । జనులందరుఁ బిలువ విందు • సమ్మతి సోమే
శునకు గృతియిచ్చి చెప్పెద । ఘనమగు శ్రీభాగవతము • కడఁగి తెలుగునన్ ॥

మ. అమృతానందనిధాన మాశ్రితబుధ•వ్యాపారసంస్తూయమా
నము శ్రీదేవ్యుదయాభిరామము కలా•నాధానుమోదాత్మకం
బు మణిద్వీపసువర్ణవృత్తగణమున్ • భూయోమహాభంగర
మ్యము శ్రీభాగవతాభిధేయమగు దు•గ్ధాంభోధి నోలాడెదన్ ॥

వ. మరియు మున్ను నా పిన్నతనంబునుండి పండ్రెండవయేట పింగళవత్సరంబున సోమలింగ శతకంబును ౧, పదునాల్గవయేట సిద్ధార్థివత్సరంబున సాత్రాజితీ విలాసంబును ౨, పదు

నారవయేట దుర్మతిసంవత్సరంబున కృష్ణార్జునసంగరంబును ౩, ఇరువదవయేటఁ గ్రోధన సంవత్సరంబున గొల్లపల్లి రఘునాథశతకంబును ౪, ఇరువదియొకయేట నక్షయయందు పంచనృసింహక్షేత్ర మాహాత్మ్యంబును ౫, ఇరువది రెండవయేట ప్రభవసంవత్సరంబున సారసంగ్రహ గణితంబును ౬, రచియించితిఁ బిమ్మట ముప్పది వత్సరంబులు రాజ విద్యావ్యాసంగంబుఁ గలిగి మండల న్యాయవాదినై వ్యవహారభారంబునంజేసి కృతికల్పనంబున కవకాశంబు సాలకయుంటి నట్లుండియు నొకప్పుడు లక్షణావిలాసంబును ౭, ధాతృవత్సరాంతమున రచియించితిం బిదప స్వభానుసంవత్సరం బాదిగా దుర్ముఖివత్సరాంతంబు వట్టు అభినవగద్య ప్రబంధంబును ౮, అభినవకౌముదియు ౯, వైశ్యధర్మ దీపికయు ౧౦, శ్రాద్ధసంశయవిచ్ఛేదియు ౧౧, ప్రాయశ్చిత్త నిర్ణయంబును ౧౨, సంస్కృతంబునఁ గామాక్షీశతకంబును ౧౩, ఆచారనిరుక్తియు ౧౪, దురాచారపిశాచ భంజనియు ౧౫, చక్కట్లదండయు ౧౬, తెలుగునాఁడును ౧౭, తర్కకౌముదియు ౧౮, విగ్రహారాధనతారావళియు ౧౯, దీనితో చేరిన మనోలక్ష్మీవిలాస నాటికయు ౨౦, సూర్యశతకంబును ౨౧ నౌకాయానంబును ౨౨, చిలుకలకొలికి శతకంబును ౨౩, ముద్దులగుమ్మ శతకంబును ౨౪, సీతాకల్యాణ నాటకంబును ౨౫, నమస్కారవిధి దీపికయు ౨౬, రచియించితి నంత గొన్నిదినంబులు వ్యవహారంబునుండి విశ్రాంతిఁ గైకొని హేవళంబి మొదలు శాకుంతల నాటకమును ౨౭, రత్నావళి నాటికయు ౨౮, ముద్రారాక్షస నాటకంబును ౨౯, మహావీరచరిత్ర నాటకంబును ౩౦, మాలతీమాధవీయ ప్రకరణంబును ౩౧, ఉత్తరరామచరిత్ర నాటికయు ౩౨, మంజరీ మధుకరీయ నాటికయు ౩౩, కురంగ గౌరీ శంకర నాటికయు ౩౪, నను పుస్తకంబులు రచించితి నిట్లు ముప్పదినాల్గు ప్రత్యేక గ్రంథములు సేసి కారణాంతరవశంబున దైవ ప్రేరితుండనై శ్రీదేవీభాగవతంబు దెలిఁగింపఁబూని

—: షష్ఠ్యంతములు :—

క. వృషసాదికి విషఖాదికి । సుషమాపాదికిని భాను • సుతమదసర్వం
కషవిచ్ఛేదికి విద్యా । విషయ వినోదికి శిరఃప్రభృతసురనదికిన్ ॥

క. సద్యోగమహోద్యోగల । సద్యోగయమాద్యఖండ • సంపన్మనిరా
ద్విద్యాగతముద్యోగప । దద్యోతికపర్దఘృణికి • దైవాగ్రణికిన్ ॥

క. స్థిరయశునకుఁ గరుణారస । పరవశునకు గిరీశునకునుఁ • బరమేశునకున్
గిరిజాప్రాణేశున కం।బర కేశునకున్ వినతసు•పర్వేశునకున్ ॥

క. లీలామితశీలునకుఁ గ। పాలాయతమాలునకును • బ్రప్రోషితది
క్పాలున కతివేలసుగుణ। జాలున కల్లూరినగర • జనపాలునకున్ ॥

క. సంధితపరిపంధివిధా। నాంధకనీచాంధక ప్రఁ•హరణోద్ధతికిన్
గంధాచలవింధ్యాచల। మంధాచల ధృతికి ననుపఁ•మానద్యుతికిన్ ॥

క. తరుణారుణఘృణికిన్ శశ। ధరమణికిన్ సురమణికిని • ధరజాగిరిజా
సురమణి కురగరమణభా। సురపాణికి నాశ్రితసుఖ•కరణసరణికిన్ ॥

క. భవ్యతరనిజభుజాశ। క్తివ్యాపితభరిత మరుద•ధిప ముఖ్యునకున్
శ్రావ్యపరిషేవ్యదివ్య। న్నవ్యాభిఖ్యునకు సోమ•నాథాఖ్యునకున్ ॥

క. సన్నుత దాసకులోద్భవ। కన్నయమంత్ర్యగ్రహార • ఘనపురమధ్య
ప్రోన్నతభవనునకును సం।ఛన్నగజేంద్రాజినోల్ల • సద్వసనునకున్ ॥

అంకితంబుగా నేఁ జేయంబూనిన శ్రీ భాగవత మహాపురాణంబునకుం
గథాప్రారంభము.

# శ్రీ దేవీభాగవతము

## ప్రథమ స్కంధము

శ్లో॥ సర్వచైతన్య రూపాన్తా మాద్యాం విద్యాఞ్చ ధీమహీ
బుద్ధిం యానః ప్రచోదయాత్ ॥

క. శ్రీద శ్రీద సముజ్జ్వల । పాద మహోత్పల మరందపాన మనీషా ।
మేదుర నతజనపుణ్యా । చ్ఛేదిత కలికలుషపాశ శ్రీ సోమేశా ॥

వ. అవధరింపుము. నిఖిలపురాణ సమాఖ్యాన విఖ్యాతుం డగు సూతుం గాంచి విజ్ఞాన విలసిత
సదమలచిత్తముకురఫలకుం డగు శౌనకుం డిట్లనియె ॥ ౧

సీ. సూత మహాభాగ సుగుణ శుద్ధచరిత్ర భూతదయాపర పురుషవర్య
ధన్యుండ వాగమ తత్త్వైకవేదివి నిష్కల్మషుండవు నిర్మలుండవు
వ్యాసునిచేఁ జెప్పఁ బడిన యష్టాదశ సత్పురాణంబులు చదివినాడ
వవి పంచలక్షణాభ్యంచితంబులుఁగావె యభ్యసించితి వీవు వ్యాసు వలన

గీ. మేము పూర్వభవంబుల నోమినట్టి । నోముల ఫలంబుగాఁగ దీనులము మము
సుకృతులనుఁజేయ దివ్యవిశుద్ధపాప । రహిత మీ క్షేత్రమునకు నీరాక యొప్పె ॥ ౨

క. ఓ పుణ్యచరిత సంసృతి । తాపరహిత బ్రహ్మసమ్మితమగు పురాణం
బోపికఁ దెల్పవె విన ని । చ్ఛాపరతం జిక్కె మౌనిసంఘం బిచటన్ ॥ ౩

తే.గీ. యమికులోత్తమ శ్రోత్రేంద్రియములుఁగల్గి। సత్పురాణార్థములు వినఁజాలకుంద్రు
నరులఁగొందఱు బుద్ధిహీనతన కాదె । వారు విధిచేత వంచింపఁ బడినవారు. ౪

తే.గీ. షడ్రసంబులచే జిహ్వ సాధుజనుల । వచనములచేతఁ జెవి సుఖవశతఁ బొనరు
శ్రవణరహిత సర్పము సోలు శబ్దయుక్తిఁ । జేరి వినరాని మనుజుల చెవులు చెవులె ॥ ౫

ఉ. నైమిశ కాననాంతరమునం గలిభీతిఁ దపించు సంయమి
స్తోమము తావకీయ మృదుసూక్తి సుధారసధార లాన నెం
తే మతిపూనె నిజ్జగతి నెద్దెలు దుర్వ్యసనాత్ములై దిన
గ్రామముఁ బుత్తు రార్యులు దిరంబుగ నుందురు శాస్త్రచింతనన్ ॥ ౬

చ. జగమున శాస్త్రము ల్బహుల జల్పిత వాద విచిత్ర వైఖరుల్
తగ నవి పెక్కు లందు ఘన దైవపరంబులు సాత్వికంబు లె
న్నగను గ్రియాపరంబులు కినంబడు రాజసవృత్తిమై నిజ
మ్మగ నిరు హేతువాదపదము ల్చనుఁ దామస నామకంబులై ॥ ౭

తే.గీ. బహువిధ పురాణములు నట్లు మహిఁబొసంగు । మూడుగుణముల వృత్తుల మువ్విధముల
గుణమణిగణాఢ్య పంచ లక్షణము లలర । వాని నన్నిఁటిఁ దెలిపితి వరుస మాకు ॥ ౮

ఉ. ఐదవ వేద మంచు శుభమంచు మహాద్భుత మంచు ముక్తి సం
పాదక మంచు ధర్మదము మాన్యము కామద మంచుఁ గీర్తితం
బై దురితాళి వో నడఁచు నట్టిది భాగవతంబు దాని న
త్యాదరత న్వినన్వలఁతు మందఱ మిచ్చట దానిఁ దెల్పవే ॥ ౯

చ. అమృతము గ్రోలి తృప్తులయి రా సుర లట్లన తావకీయ వా
క్యములను విన్నవారలకు నాదర మెంతయు నాలకించినన్
దెమలదు కావున న్వినిన దివ్యపురాణము లెన్ని యైననున్
సుమహితమైన భాగవత సూక్తికి వీనులు వేగిరించెడిన్ ॥ ౧౦

తే.గీ. అమృతమును గ్రోల యజ్ఞంబు లాచరించి । శాంతిఁగన రెండు నేఁజాడ స్వర్గఫలము
పున రధఃపాత హేతువు పురుషులకును । కాన సంసార దుఃఖంబుఁ గడపలేరు ॥ ౧౧

తే.గీ. లీలఁ ద్రిగుణాత్మకాఖిల కాలచక్ర । వంచితులు ముక్తులగుటకు నంచితార్థ
భవ్యవిజ్ఞానదంబైన భాగవతము । సర్వరస సంయుతం బొందె సాధనంబు ॥ ౧౨

—: శ్రీదేవీభాగవత స్కంధ సంఖ్యాది కథనము :—

క. అనవుఁడు సూతుండను నే । ననుపమ ధన్యాత్ముఁడను మహాభాగ్యుఁడ నో
మునులార వేదవిశ్రుత । మనఘంబును నగు పురాణ మడిగితి రీరల్ ॥ ౧౩

తే.గీ. అఖిల వేదార్థ సమ్మతం బాగమోత్త । మము రహస్యంబు నైనట్టి భాగవతము
చెప్పెద వినుండు సంయమి శ్రేష్ఠులార । భగవతీ నామమునఁ బేరు వడసె విద్ది ॥ ౧౪

మ. భగవత్యైనమ యంచుఁ బల్కి మిగులం భక్తిన్ దదీయేద్యపా
ద్యుగముం గొల్చి మనోహరంబు శుభదం బుల్లాసదం బార్య చి
త్తగ మబ్జోద్భవముఖ్య సేవితము సుద్యద్యోగి ముక్తిప్రదం
బగు నీ భాగవతంబుఁ దెల్పెద వినుం డత్యంత మోదాత్ములై ॥ ౧౫

తే.గీ. విద్య సర్వజ్ఞ సచ్ఛక్తి యాద్య హృద్య । దుష్టదుర్జ్ఞేయ మునిపూజ్య దోషరహిత
భవవినాశిని నిఖిల సంపత్ప్రదాత్రి । దేవి ప్రత్యక్షమై మంచి తెలివినిచ్చు ॥ ౧౬

తే.గీ. సదసదాత్మకమైన యీ జగము నెల్ల నోలిఁ బుట్టించి రక్షించి యుక్కడంచి
తన త్రిగుణశక్తిఁ గల్పవేళను నొకర్తు । నిలచు లోకైకమాతను నే స్మరింతు ॥ ౧౭

తే.గీ. అజుఁడు జగ మెల్ల సృజియించు ననుచు వేద । వేత్తలు పురాణకథల గొంతెత్తి చెప్ప
వార లా బ్రహ్మ శ్రీమహావాసుదేవు । నాభిజుం డని రస్వతంత్రతయ కాదె? ॥ ౧౮

శా. వైకుంఠుం డహిశయ్యఁ గూర్కుతరి దేవజ్యేష్ఠుఁడుం బుట్టె ని
చ్ఛాకేళిం దదుదారనాభి నఖిల వ్యావృత్తి నాధార శో
భాకల్పుండు సహస్రమౌళియ కదా ప్రాల్మాల కుద్బోధ వి
ద్యాకుం డాహరి కమ్మురారి భగవ ద్వాచ్యుండు దా నెట్లగుఁ ॥ ౧౯

తే.గీ. సలిలములు రసరూపముల్ జగతియెల్ల । నిండి యేకార్ణవంబయి యుండు నాడు
జలధికినిఁ బాత్రరూపక శక్తి యగుచు । సకల భూతంబులనుఁ గన్న జనని గొల్తు ॥ ౨౦

చ. ఉరువెలి యోగనిద్ర హరి యుండఁగ సారసమందు నున్న యం
బురుహభవుండు భక్తి మెయిఁ బూజ యొనర్చిన దేవి నా కొగిన్
శరణ మటంచు నమ్మి యనిశంబును నిర్గుణముక్తి ధాత్రి బం
ధురగుణ విశ్వమాతఁ దలఁతున్ వినుపింతుఁ బురాణ మర్మిలిన్ ॥ ౨౧

మ. మునివర్యుల్వినుఁ డీర లాదరమునఁ మున్నూటపద్దెన్మిదై
చను నధ్యాయములుఁ గణింప దినరాట్సంఖ్యాకమౌ స్కంధముల్
పౌనరఁ శ్లోకములున్ బదెన్మిదగు వేలున్ సంస్కృతం బందునున్
దనరఁ వ్యాసుఁడు చెప్పె భాగవతమున్ దాక్షిణ్య సంయుక్తుఁడై ॥ ౨౨

గీ. మొదటి స్కంధంబునను నిరుఁబదియు, రెంట । బదియు రెండును, నూటముప్పదియు నాలు
గింట నిరుబదియైదు నైదింట నెన్న । ముప్పదైదును నాఱింట ముప్పదొకటి ॥ ౨౩

తే.గీ. నలుఁబదేడింట నిరుఁబది నాలు గెనిమి । దింట, నేఁబదియగు తొమ్మిదింట, బదింటఁ
బదియుమూడగు నిక నిరుఁబదియునాల్గు । పదునొకొండింట, బదునాల్గు బదియు రెంట ॥ ౨౪

వ. ఇవ్విధంబున నిమ్మహాభాగవతంబున స్కంధాధ్యాయ శ్లోకసంఖ్యలు పరిగణింపంబడు. మఱియు సర్గంబునుఁ బ్రతిసర్గంబును మన్వంతరంబులును, వంశంబులును, వంశాను చరితంబులును నను నైదు లక్షణంబులు కలదియై మహాపురాణంబునాఁ బ్రసిద్ధిఁ గనుచుండు నదియుం గాక. ౨౫

చ. నిరవధిక ప్రపూర్ణ గణనీయము నిర్గుణ నిత్యయుఁ వికా
రరహిత యోగగమ్య శివరమ్య మహోత్తమయుం దురీయ యై
వఱలెడి శక్తి సాత్త్వికత, భార్గవి రాజసతఁ ద్రిలోక సృ
ట్పురరుహనేత్ర తామసత శాంకరియంచుఁ బ్రసిద్ధయై తగుఁ ॥

క. ఆ ముప్పురు శక్తుల కా । యై మేనుల లక్షణంబు లాఖ్యాతములై
భూమిన్ మించెను సృష్టికి । నై మానిత సర్గశాస్త్రప్రహోరుల చేతన్ ॥ ౨౭

క. ఆమీఁదట విష్ణుండు పితామహుఁడును భూతపతియుఁ దగఁ బొదముటయే
వేమఱు సృష్టి స్థితి లయ సామగ్రికినై యొగిఁ బ్రతి సర్గం బయ్యెన్ ॥ ౨౮

తే.గీ. అమృతకర భానుసంభవులైన యట్టి క్షత్రియుల వంశములు స్తుతి సలుపు టెల్ల
నల హిరణ్యకశిప్వాది కులము లెన్నఁబడుట వంశం బటందు రెప్పుడును బుధులు ॥

క. స్వాయంభువ ప్రభృతి మను । నాయక వంశప్రకీర్తనంబును గాల
వ్యాయామము లెన్నుటయును । న్యాయత మన్వంతరంబు లందురు పెద్దల్ ॥ ౩౦

క. మనువంశంబులఁ జెప్పుట । యనయము వంశానుకీర్తనాఖ్యం బయ్యెన్
వినుఁ డిట్లు పంచలక్షణ । మనఁబడియెఁ బురాణపఙ్క్తి యార్యులచేతన్ ॥ ౩౧

క. వర భారతేతిహాసము । పరఁగంగ సపాదలక్ష పద్యాన్వితమున్
విరచించె వ్యాససంయమి । ధరఁ బంచమవేద సమ్మితం బది సుండీ ॥ ౩౨

వ. అనిన నాలించి హర్షోత్కర్ష మానసుండై శౌనకుం డిట్లనియె, ౩౩

తే.గీ. ఆ పురాణోత్తమము లెవ్వి యవ్వి యెంత । సంఖ్యకలయవి తెలుపవే సంయమీంద్ర
యయ్యాది సవిస్తరంబుగ నాలకింప । శ్రవణములు గోరు రోమహర్షణతనూజ ॥ ౩౪

క. కలికాల భీతులము మే । మలఘుస్థితి నిందు నైమిశారణ్యమునన్
మెలఁగుదుము బ్రహ్మయానతిఁ । దలఁపడి నిరవధిక సౌఖ్య తంత్రజ్ఞులమై ॥ ౩౫

క. మా కిచ్చెఁ గృపామయుఁడై । లోకేశుఁడు చక్ర మొకటి లోలత నిదియే
మీకుం బావన భూమిన్ । వీఁకఁ దెలుపఁగలదు దీని వెంటం జనుఁడీ ॥ ౩౬

క. ఇది సంశీర్ణం బగు నే । పదమున నది పావనంబు పట్టదు కలి యా
పదమున నుండుండీ కలి । తుదదనుకన్ సత్యయుగము తోఁచెడి నంతన్ ॥ ౩౭

క. అని పద్మజుండు సెప్పిన । విని మే మందఱము దాని వెంటం జనఁగా
ననుపమ చక్రం బందఱు । కనుచుండఁగ శీర్ణ మయ్యెఁగద యిచ్చోటన్ ॥ ౩౮

తే.గీ. కాననే యిది నైమిశ కాననాఖ్యఁ బడసెఁ బరమ పవిత్రమై పరఁగె నిందుఁ
గలి ప్రవేశింపఁ డెపుడును గాన నేను నందఱు తపస్వులను గూడి యుంద యుందు ॥

ఆ.వె. కృతయుగంబు దనుక నేజాడ నేనియుఁ గాల మపనయింపఁ గలుగు మాకు
వేదు కలరఁగాఁ బురోడాశముఖముల । సవనములు పొసఁగు పశువులు లేక ॥ ౪౦

క. మాపుణ్యంబుననేకద । ప్రాపించితి వీవు ధన్యభావం బొదవన్
మాపాలఁ గలిగి తెలుపవె । తాపసవర! బ్రహ్మ సమ్మిత పురాణంబున్ ॥ ౪౧

క. కోరికఁ దీరిక నుంటిమి । చేరిక వినఁ దలఁతు మేకచిత్తులమగుచున్
లేరిక నీవలె వక్తలు । భూరికథాసార చారు పుణ్యవిచారా ॥ ౪౨

తే.గీ. నీవు దీర్ఘాయుఁడవుకమ్మ నిర్మలుఁడవు । తాపవర్జితుఁడవు కృపా తత్పరుఁడవు
పరమపుణ్యంబయిన యట్టి భాగవతముఁ । జెప్పవే మాకు సూత విశుద్ధచరిత ॥ ౪౩

క. ధర్మార్థకామముల విధి । మర్మంబులు దెలిపి జ్ఞానమార్గంబును నీ
కర్మిలిఁ జెప్పెను శమ దమ । వర్మఁ దగుచు మోక్షసరణి వ్యాసుఁడు ప్రీతిన్ ॥ ౪౪

తే॥గీ॥ భగవతీనామమునఁ బొల్చు భాగవతము । నాట్యముంబలెఁ జిత్రంబు నవ్యభవ్య
దివ్యగుణగణలలితంబు దీర్ఘకాము।కందమై యొప్పు నది మాకుఁ గరుణఁదెలుపు ॥ ౪౫

—: పురాణసంఖ్యాది వివరణము :—

వ. అని పల్కిన శౌనకుం గాంచి తత్రస్థులగు నెల్ల ఋషులును వినునట్లు సూతుం డిట్లనియె. ౪౬

చ. కడఁగి పురాణవైఖరుల కట్టడుల న్మునివర్యులార। సొం
పడరఁగఁ దెల్పెదన్ వినుఁడు వ్యాసుఁడు తొల్లి వచించినట్టు లే
ర్పడఁగను మద్వికంబు మఱి బ్రత్రికభద్వయకూస్వనాపముల్
తొడిఁ బ్రథమాచ్చునింకవ చతుష్టయలింగము లౌఁ బురాణముల్॥ ౪౭

సీ. పదునాల్గు తొమ్మిది పదునాలుగున్నర పదియునెన్మిది పది పదియు రెండు
నూఱునుఁ బదునెన్మి దారాధిఁ బదియేడు నెనుఁబదొక్కటియును, నిరుఁబదైదు,
నేఁబదైదు, పదాఱు, నిఁకఁ బదిఁ, ర్వదినాలుగాఱువందలు, నిర్వ దవల మూఁడు,
నిరువదినాలుగు, నిఁకఁ బదొకండును నేకోనవింశతి, యివియ వేలు

గీ. మాత్స్య మార్కండక భవిష్య భాగవతక । బ్రహ్మ బ్రహ్మాండ బ్రహ్మకైవర్త కూర్మ
స్కాంద నారద పద్మాగ్ని సత్పురాణ। చారు వామన వాయు వైష్ణవ వరాహ
లింగ గారుడములు క్రమ లీలఁ బొసఁగి ॥ ౪౮

వ. ఇవి పదునెన్మిదియు మహాపురాణంబు లనఁబడు నింక. ౪౯

సీ. క్రమత సనత్కుమారము నారసింహము నారదీయము శివ నామకంబు
లలిత దౌర్వాస కాపిల మానవౌశన సవరుణ కాళికా సాంబ నంది
సౌరంబులును బరాశరము నాదిత్యంబు వరమహేశ్వర భాగవత వశిష్ఠ ।
సంజ్ఞికంబులు వీని సద్బుధు లుపపురాణము లని పల్కుదు రమలధిషణ

తే.గీ. నివియుఁ బదునెన్మిదియ సుఁడీ, యిన్నిఁ జెప్పి భారతాఖ్యాన మతులంబు, పావనంబు
దా రచించెను వ్యాసుండు తత్వవేది యేమి సెప్పుదు నతని కృపామహిమము ॥ ౫౦

తే.గీ. ప్రకటితంబుగ మన్వంతరముల నెల్ల । ద్వాపర ద్వాపరంబున ధర్మవేది
యైన వ్యాసుండు దాఁ బురాణాగమములఁ । జెలఁగుచు యథావిధిగ జేర్చిఁ జెప్పుచుండు ॥

క. ప్రతి ద్వాపరమున విష్ణుం । డతులమతి వ్యాసరూపుఁడై పుణ్యములౌ
శ్రుతులం బహు విధములఁ దా । నతికించు న్లోకమునకు నతిహిత మొదవన్ ॥ ౨౨

క. కలియుగమున నల్పాయువు । గలవారలు నల్పమతులుగద మనుజు లటం
చలవడి పురాణసంహిత । లలరించు న్మెలెఱింగి యమిపతి కరుణన్ ॥ ౨౩

తే.గీ. పడఁతులకు శూద్రులకు ద్విజ బంధువులకు । వేదములు దూరములు కాన వెలయ వారి
క్షేమమునకుఁ బురాణము ల్చెప్ప బడియె । వ్యాసమునిచేతఁ గరుణామయాత్మచేత ॥

తే.గీ. సప్తమంబైన యీ వివస్వత్తనూజ । మనువు కాలంబునం దిర్వదెనిమిదవది
ద్వాపరము ప్రాప్తమాయెనో తపసులార । యుర్వి సత్యవతీసూనుఁ డుదితుడాయె ॥

ఉ. నాకు గురుండు ధర్మకలనంబు లెఱుంగు మహామహుండు లో
కైక హితుండు వ్యాసుఁ డిపు డారయ ద్వాపరసంఖ్యవాఁడు మున్
శ్రీకరు లిర్వదేడుగురు చెల్లిరి ముప్పది కొండు తక్కువౌ
ప్రాకటసంఖ్యవాఁ డగుచు ద్రౌణి యిఁకం బొడమున్ ధరాస్థలిన్ ॥ ౨౬

ఉ. నావుఁడు మౌను లో మునిజనప్రవరా! మును ద్వాపరంబులన్
వావిరి సత్పురాణముల వక్తలుగా నలరారి భూమి ను
ద్భవము పొందినట్టిరగు వ్యాసులఁ జెప్పు మటన్న సూతుఁడో
పావనులార । మీ చెవుల పండువుగా వినుఁడంచు నిట్లనున్ ॥ ౨౭

సీ. మొదటి ద్వాపరమిది మొనసి స్వయంభువు సరవి రెండవది ప్రజాపతియును
మూఁడవ దుశనుండు మొగి నాల్గవది బృహస్పతి యైదవది యెన్న సవిత యాఱు
వది మృత్యు వేడవయది మఘవుం డెన్మిదవది వసిష్టుండు తనరఁ దొమ్మి
దవది సారస్వతుం డవలను బదియవయది త్రిధాముఁడు మరి పదునొకొండ

తే.గీ. వదియ త్రివృషుండు పండ్రెండవది తలంప । బౌరి భరద్వాజుఁడునుఁ బదిమూఁడవయది
యంతరిక్షుండు పదునాల్గువదియు ధర్ముఁ।డంతఁ బది నేనవదియుఁ ద్రయ్యారుణియును
నియతిఁ బదునాఱవది ధనంజయుండు నైరి ॥ ౨౮

సీ. పదునేడవది ముదం బొదవ మేధాతిథి పదియునెన్మిదవది వ్రతియుఁ బదియు
తొమ్మిదవది యత్రి తొడి నిర్వదవయది గౌతముఁ డిర్వదొక్కండవయది
యుత్తముం డిర్వదియును రెండవది వేనుఁ డిర్వదిమూఁడ్వది యెనఁగ సోముఁ
డిర్వదినాల్వది తృణబిందుఁ డిర్వదియైదవయది భార్గవాఖ్యుఁ డొప్పు

తే.గీ. నిర్వదాఙవయది శక్తి యిరువదేడ్వు దెన్నఁదా జాతుకర్ణుండు నిర్వదెన్మి
దవది నేఁటిది ద్వైపాయనాఖ్యఁదగుచు। వ్యాసమూర్తులు వెలసె నిర్వ్యాజ మహిమ ॥

క. తాపసులారా। కృష్ణ। ద్వైపాయనుఁ డఖిలవేది వ్యాసుండు దయా
కూపారుం డస్మద్గురుఁ। డేపారన్ భాగవతము నేర్పడఁ జెప్పెన్ ॥ ౩౦

క. భాగవత మఘవినాశము। భాగవతము ధర్మదంబు పరమార్థదమున్
భాగవతము కామద మీ। భాగవతము మోక్షదంబు భక్తియుతులకున్ ॥ ౩౧

క. భాగవతం బెన్నఁగ స। ర్వాగమసారము ముముక్షువరసాధనమున్
భాగవతము విజ్ఞాన। ప్రాగల్భ్యముఁ గలుఁగఁజేయు బరమౌషధమున్ ॥ ౩౨

చతురవృత్తము. పరమశుభం బని భాగవతముఁ దా। నరణిని౯ బుట్టిన యాత్మసుతునకున్
గరుణ శుకర్షికిఁ గామరహిత ధీ।వరునకుఁ జెప్పెను వ్యాసముని దగన్ ॥ ౩౩

క. వ్యాసుండు సెప్పుచుండగ। నా నరసన వింటి నే యథార్థముగా న
భ్యాసవశంబున సకలము। భాసితముగ బుద్ధినిలుపఁ బడియెం జుమ్మీ॥ ౩౪

తే.గీ. అయ్యయోనిజుఁడైన శుకాఖ్యుడడుగ। పరమగుహ్యపురాణంబు భాగవతము
సెప్పె వ్యాసుండు, దాని విశేషబుద్ధిఁ। దప్పక గ్రహించితిమి మేము తపసులార

నవగీతి. శ్రీమద్భాగవతం బను కల్పక వృక్షముఁ జేరి శుకుండు సదా
కామక్రోధముఖాన్విత సంసృతి కంధిజలంబుల దాఁటుటకున్
బ్రేమన్ సర్వరసాలయ మంచు వినెన్ జెవులారఁగ వేడ్కగలా
రై మీ రిద్ది వినం గలికాలభయం బొక యింతయు నంట దిలన్॥ ౩౫

తే.గీ. అఘములొనరించి వేదధర్మాచరణము। మానియున్నట్టివాఁడైన మహినొకండు
వ్యాజముననొండె వినెనేని భాగవతము। నైహికాముష్మికఫలంబు నందునంద్రు॥ ౩౬

తే.గీ. హరిహరాదుల కందరా కఖిలలోక। మాతయై గుణమెఱుఁగక మహిమగాంచు
విద్య సచ్ఛక్తి భగవతి హృద్య నిత్య। భాగ్య యగు దేవి దీ మహాభాగవతము॥ ౩౭

క. ఏవాఁడు భాగవతమున్। భావగతము సేయు వాఁడు పరమోత్తముఁడై
శ్రీ విద్యావిలసితుఁడై। యావలను బునర్భవంబు నందఁడు సుండీ ॥ ౩౮

క. ఏవాఁడు భాగవతమున్। భావగతము సేయఁ డట్టి పామరుఁడు విధి
వ్యావంచితుండు నమ్మడు। కేవల పశు వట్టివాఁడు కీర్త్యుం డగునే॥ ౪౦

## శుకోత్పత్తి.

వ. అవిన సూతుని వచనంబుల కలరి శౌనకాది మహర్షు లిట్లని యడుగం దొడంగిరి.

ఉ. వ్యాసుని భార్య యెద్ది శుకుఁ డాతని కె ట్లుదయించె సంహితా
ఖ్యాన మయోనిజుం డయిన యాతఁడు సేసిన రీతి యెద్ది ని
స్త్రాసుఁడు వాని కె ట్లరణిజత్వము వచ్చెను శంకఁ దీర్పవే
భాసుర ధీసమేత। నిరపాయ గుణాన్విత। సూత। ప్రీతితోన్ ॥ ౪౧

వ. అనిన సూతుం డిట్లనియె. ౪౨

ఉ. మేటి సరస్వతీ నది సమీపమునందుఁ బరాశరాత్మజుం
డాటకుఁ జొచ్చు పిచ్చుకల యందపుజోటిని వాని చెంగటన్
గూటను గ్రొత్తగా ముదురు గ్రుడ్డున వెల్వడి కెంపు ముక్కు మేల్
పాటిలు వన్నె మేనుగల పక్షి కిశోరము పింఛముం గనెన్ ॥ ౪౩

క. ఆ పక్షి ద్వంద్వం బొగి। నా పిల్లకు మాటి మాటి కాహారంబున్
మేపుచు మేనను మే నిడి। పై పైఁ బొదువంగఁ గాంచి పరమ ప్రీతిన్ ॥ ౪౪

క. ఎంతయుఁ జిత్రము తిర్య। గ్జంతువులకుఁ గూడ నెనరు కలదుగదా య
త్యంతము మనుజుల కుండుట। వింతయె సేవాఫలంబు వేఁడుట కతనన్ ॥ ౪౫

క. తనరు వివాహము సుఖసాధన మగుచును రమ్యమైన దార ముఖంబున్
గనుటవలన ముసలితనంబునఁ బరిచర్య లొనరింపఁ బొసగుట వలనన్ ॥ ౪౬

ఆ.వె. పుణ్యవంతుఁడైన పుత్రుఁడు గల్గెనా। ధనము సంగ్రహించి తర్పితాత్ము
లనుగఁ జేయగలఁడు జననిని జనకుని। గాతయున్నఁ బ్రేత కార్య మొసఁగు ॥ ౪౭

క. ఆలాగునఁ గాకుండిన। నేల గయాశ్రాద్ధమైన నిడక తొలంగున్
నీలోత్సర్గం బైనను। బాలకుఁ డిడకున్నె? చటక భాగ్యం బలఁతే ॥ ౪౮

క. జగ దుపకారు లపుత్రస్య గతిర్నాస్తి యని పలికి రాగమ పఙ్క్తిన్
దగఁ ద్రిదశాలయ మబ్బునె। మగసంతతి లేక యున్న మనుజునకు భువిన్ ॥ ౪౯

క. సుఖములలో నుత్తమ మగు। సుఖ మెన్నఁగఁ గన్న కొడుకు శుభ దేహము న
న్ముఖుఁడై కౌఁగిటఁ జేర్చుట నఖిలస్థితి పూని లాలనము సేయుటయున్ ॥ ౫౦

తే.గీ. కన్న కొడుకుకంటెఁ గలదె వేఱొక్కటి। కొడుకు పాపములను గొట్టువాఁడు
పాపహాని మనకుఁ బ్రత్యక్షమా యనుమానమా? యటంచు మానరాదు ॥ ౫౧

క. స్మృతిశబ్ద మాప్తవాక్యము। క్షితినిఁ బ్రమాణంబుఁగాదె శ్రేయంబులకున్
సుతుఁ డే గతి మృతివేళను। సుతహీనుఁడు మానసమున శోకములఁ గనడే? ॥ ౫౨

చ. అమిత ధనంబు గల్గిన మహత్తర మందిర మున్న నాయకో
ద్యమము వహించువాఁడు కలఁడా యనురేగిన వెన్క వంత్యమౌ

సమయమునందు విస్తృత విషాదము తక్క మఱొందు గందుమే
క్షమ సుతు కన్న నెక్కుఁ డగు సాధన మెద్ది సుఖోపలబ్ధికిన్ ॥ ౮౪

వ. అని. ౮౫

క. ఏవంవిధ నానాచిం। తావేగ మనస్కుఁ డగుచు వ్యాసుం డపు డెం
తే వెచ్చ నూర్చి యయ్యో। యే వెఱవని యెట్టకేల కిట్లని తలఁచెన్ ॥ ౮౬

క. నా వాంఛిత మీఁ జాలిన। యే వేలుపుఁ గొల్తు హరినొ యీశునొ విధినో
యా విఘ్నపతినొ వహ్నినొ। దేవపతి స్కంద వరుణ దిననాథులనో ॥ ౮౭

ఆ.వె. అనుచుఁ దపము సేయ నమరాద్రికిం బోయి। దాని పంచనుండఁ దనకుఁ దాన
వీణ కేల గాడ్పు వీవంగ మ్రోఁగఁగా। నారదుండు వచ్చె చారులీల ॥ ౮౮

ఉ. వచ్చిన బ్రహ్మపుత్త్రుఁ గని వ్యాసుఁడు నర్ఘ్యము పాద్య మిచ్చి తా
మచ్చిక నర్హపీఠము నమర్చి శుభంబును బ్రశ్నచేసి యే
యొచ్చెము లేక యుండఁ గని యొద్దిక నారదమౌని వ్యాసుతో
నిచ్చట నీవు చింతిలఁగ నేమి కతం బెఱిఁగింపుమా యనెన్ ॥ ౮౯

ఉ. నావిని వ్యాసుఁ డిట్లనియె నారదమౌనివరేణ్య। నేను చిం
తావశత న్నెగుల్గొనఁ గతంబు సుతు ల్గతు లంద్రు నాకు లే
దా విధి నేను వేఁడఁదగు దైవమ దెద్దియొ పుత్త్రిలబ్ధి కం
చో విమలాత్మ పుత్త్రి నిడ నోపిన దైవముఁ దెల్పి ప్రోవవే ॥ ౯౦

తే.గీ. నీవు సర్వజ్ఞుఁడవు కృపా నిధివి జగము। మే లరయుచుండు వేవేళ మేటి వెల్ల
మునులకును గోరకయ వచ్చి ముందునిల్చి। యడిగితివి కారణంబు నాగొడవ కనఘ ॥

వ. అని చెప్పి సూతుండు మఱియు నిట్లనియె. ౯౨

క. అని యిట్లు వ్యాసుఁ డడిగిన। విని నారదుఁ డనియె వ్యాస। వికృతి నిరాసన్
విను నేను జెప్పెదను నీ। కనువగు మార్గంబు పుత్త్రికావాప్తికై ॥ ౯౩

తే. గీ. మున్ను నాతండ్రి పరమేష్ఠి మురవిరోధి। దేవదేవుని శ్రీనాథు దివ్యచరితుఁ
గనకచేలుఁ జతుర్భుజుఁ గౌస్తుభధరు। ధ్యానగతుఁ గాంచి యరుదంది యడిగె నిట్లు ॥

తే.గీ. భువనరక్షక దేవేశ భూతభవ్య। భవదధీశ్వర వైకుంఠభవన శౌరి
యేమి కారణమునఁ దపం బిట్లు లాచ। రించుచును ధ్యానమున నుంటి వెఱుఁగఁ దెలుపు ॥

శా. ఎంతే వింతకదా జగంబులకు నీ వీశుండ వాద్యుండ వ
త్యంత ధ్యానగతుండ వైతివి భవ న్నాభిం దగం బుట్టి య
శ్రాంతంబున్ జగమున్ సృజించెదను నే స్వామీ। భవత్సేవ్యకా
క్రాంతిం గన్న మహానుభావుఁ డొకఁ డింకం గల్గునే తెల్పుమా ॥ ౯౬

ఉ. నీవ సమస్త లోకముల నేతవు కర్తవు హర్త వౌదు నీ
సేవ యొనర్చి నే జగము సృష్టి యొనర్తు హరుండు ద్రుంచు నా
జ్ఞావిధి సూర్యుఁడుం దిరుఁగు గాడుపు వీచును వహ్ని మండు నం
భోవహపఙ్క్తియుం గురియు భూరి గుణోదయ సాధుసంశ్రయా ॥ ౯౭

క. నీకును ధ్యేయము కలదా । కాకున్నఁ దపంబు సేయఁ గారణ మేమీ
యో కరుణామయ తెలుపవె । యేకడఁ బెద్దలకుఁ గలవె యిల గోప్యంబుల్ ॥ ౯౮

క. అనిన విని విష్ణుఁ డజునకు । ననియె న్వినుమంచు నోయి యమరజ్యేష్ఠా
నను నీ వడిగిన యర్థము । వినఁ దగినద కాదె సర్వ విధముల నెన్నన్ ॥ ౯౯

తే.గీ. ఈవు సృజియింతు రక్షింతు నేను హరుఁడు । సంహరించును జగమెల్ల శక్తి యొకటి
గల్గి యున్నందుననె సుమ్ము కాకయున్న । నలఁతుల మశక్తులము దీనిఁ దెలిసికొమ్ము ॥

తే.గీ. సర్గ మీవు రజోగుణశక్తివలన । యుక్తి నేఁ బ్రోచు టది సత్త్వశక్తివలన
సంహరణ మీశ్వరుఁడు దమశ్శక్తివలన । సలుపుదుము మన యేలిక శక్తి గాదె॥ ౧౦౧

తే.గీ. శేషుఁ డాధారమై యుండఁ జెలఁగి యేను । నస్వతంత్రుండనై నిద్ర నంది యుండ
గాలవశమున మేల్కాంచి కడఁగి తపము । సలుపుచును విహరింతు శ్రీలలనఁగూడి ॥

గీ. కొన్ని యెడలను దానవకోటితోడ । సమర మొనరింతు దేహంబుఁ గుములఁజేసి
సకలలోక భయంకర ప్రకటలీల । నిల పయోమయమై నప్పు డెల్ల రెరుఁగ ॥ ౧౦౩

తే.గీ. కర్ణ మలజులయిన మధు కైటభులను । నసురవర్యుల నెదిరించి యైదువేల
హాయనమ్ములు బాహుజన్యమ్ముఁ జేసి । దేవికృప వారిఁ ద్రుంచుట యీవెఱుఁగవె॥ ౧౦౪

తే.గీ. కాన నద్దేవియే సర్వ కారణ మని । శక్తిరూపిణి యని సుఖశాలిని యని
యీవు నెఱుఁగుదు వట్లయ్యు నింక నింక । నడుఁగ నేటికి సుధ్యేయ మదియ నాకు ॥

క. ఇచ్ఛాయోగంబుననే । నచ్ఛజలధి మీనరూప మందితి మఱియున్
గచ్ఛపమ నైతిని వరా।హచ్ఛాయుఁడ నృహరి వడుగ నైతిం గంటే ॥ ౧౦౬

ఉ. ఇంపులు సొంపులుం గులుకు నిందిర పొందెడఁబాసి యెంతయుఁ
దెంపున నీచ జంతువుల దేహములం ధరియించి శయ్యయుఁ
గొంపయుఁ గాన కెవ్వఁ డరుగుఁ సమరంబులకుఁ స్వతంత్రతన్
బెంపు వహించు నేనియును వే యిక నేటికి నీ వెరుంగవే ॥ ౧౦౭

చ. నలినజ ! పూర్వకాలమున నా తల కార్ముక విస్ఫురద్గుణ
స్ఖలనముచేత వీఁడి చనగా హయశీర్షము నీవ తెచ్చి నే
ర్పలరఁగ శిల్పివర్యు పని వచ్చుగఁ గూర్చిన నే హయాననో
జ్జ్వలతఁ బ్రకీర్తితుండనయి పాటిలు టీవ యెఱుంగుదే కదా ॥ ౧౦౮

క. నే నాత్మపరుఁడనైనది । కానిది నీవే యెఱుంగఁ గలవు కదా నీ
మానసమున శక్తి స్వాధీనుఁడ గావుననే యట్టి దేవిం దలతున్ ॥ ౧౦౯

వ. ఇట్లు హరి విరించికిం దెల్పెనని చెప్పి యమ్మహర్షిశేఖరుం డగు వ్యాసునితో నారదుండు
మఱియు నిట్లనియె.

తే.గీ. అట్టుల జనార్దనుఁడు కమలాసనునకుఁ । జెప్పిన విధంబు పరమేష్ఠి చెప్పె నాకుఁ
గానఁ గల్యాణ పురుషార్థకాంక్ష దనర । నీవు భగవతి గొల్చిన బ్రోవఁగలదు ॥ ౧౧౧

## —: హయగ్రీవావతారము. :—

వ. అని మరియు శౌనకాదులకు సూతుం డిట్లనియె. ౧౧౨

క. ఈ పగిదిం గలహాశనుఁ । డేపారఁగ వ్యాసునకును నెఱింగించినఁ దా
నోపికతో వ్యాసుఁడు దేవీ పాదము లాశ్రయింప వెడలెం గిరికిన్ ॥ ౧౧౩

వ. అనిన విని శౌనకాదులు విస్మయంబుతో రౌమహర్షణి కిట్లనిరి. ౧౧౪

చ. సకల జగత్ప్రభుత్వ విలసన్మహిమాతిశయప్రవర్ణ్య రూ
పకలితుఁ డాదికారణుఁడు ప్రాపకుఁ డింద్రముఖామరాళికిన్
బ్రకటితుఁ డంచు వేదములు ప్రస్తుతిఁ జేసెడి దైత్యవైరికిన్
వెకలెను మస్తకం బనిన విస్మయ మయ్యె సుధీవతంసమా ॥ ౧౧౫

తే.గీ. మౌనివర సందియము దీర్పు మాకు నేఁడు । నిది జగద్విస్మయమునకు హేతు వయ్యె
హరి హయగ్రీవుఁ డగుటకు నతని శిరము । పోవుటయ కారణంబంటి పీవు సూత॥ ౧౧౬

క. అన విని సూతుం డనియెన్ । వినుఁ డో మునులార యిది సవిస్తరముగ మీ
రెనయ నవహితుల రగుచున్ ఘనుఁ డగు హరి హయగళుండు గావుటకతమున్ ॥

చ. నళినదళాక్షుఁ డాద్యుఁడు సనాతనుఁడైన రమావిభుండు ని
శ్చలత నొకప్డు దారుణదశన్ రణమున్ బదివేల యేండ్లు దా
నలిపిన వేసటన్ సమవిశాలభువిం గమలాసన స్థితిన్
వెలయుచు భూమిపై నిలుపు వింటిని సజ్యము నత్తిఁ దాలిచెన్ ॥ ౧౧౮

ఉ. తాలిచినట్టి వింటికొనఁ దా బరు వంతయు నిల్పి కూర్కినం
జాలఁగ దైవయోగమున స్వాపము మిక్కిలియై యటుండు న
క్కాలము నందు వాసవముఖ త్రిదివౌకసు లంబుజాతభూ
శూలులఁ గూడి యాగమును జొప్పడఁ జేయఁగ బూని వేడుకన్ ॥ ౧౧౯

క. నారాయణునిఁ గనుంగొను । కోరిక వైకుంఠ మేగి గోవిందుఁ గనన్
నేరక దివ్యజ్ఞాన వి । శారదులై చనిరి విష్ణు సన్నిధికి వెసన్ ॥ ౧౨౦

ఆ.వె. యోగనిద్ర నున్న భోగిశాయిని జూచి । విష్ణు నిదుర కదలి వింతనొంది
యచట నిలచి విధియు హరుఁడును మున్నుగా। నమరులకును శక్రుఁ డనియె నిట్లు॥౧౨౧

ఉ. ఏమి యొనర్చువార మిపు డీ హరి నిద్దుర సూడ నద్భుతం
బౌ మన మిప్డు దానికిని భంగము సేయు విధంబు సెప్పుడీ
నా మదనారి యిట్లను మనంబునఁ దాఁ బరికించి యో సుర
గ్రామపతీ హఠాత్తుగ సుఖంబగు నిద్ర నడంచు టొప్పునే ॥ ౧౨౨

వ. అనిన నంత. ౧౨౩

ఉ. జన్నము తప్ప దిప్డు సురసత్తములార వినుం డనింద్యమౌ
పన్నుఁగడన్ వచింతు నని పద్మజుఁడే నిపు డొక్క వమ్రి ను
త్పన్నము చేసి పంపినఁ బదంపడి యద్ది శరాసనాగ్రమున్
దిన్న నడంగు నప్డు హరి నిద్రఁ దొలంగు సవంబు సేకుఉన్ ॥ ౧౨౪

తే.గీ అనుచు వైశంబ పరికించి యజుఁడు వమ్రి । నొక్క దానిని సృజియించి యోసి వమ్రి
హరి శరాసాగ్రమును దిని యతని నిదుర । నడపు మని యానతిచ్చిన నాలకించి ॥

తే.గీ. నిద్దురకు భంగ మే నెట్లు నేర్తుఁ జేయ । నాదినారాయణుఁడు సూడ నఖిల గురువు
కార్యమా చూడఁ బాతిత్య కారణంబు । నన్నుఁ బంపుట కూడునా నలినగర్భ॥ ౧౨౫

తే.గీ. నిద్రకును భంగ మొనరించు నీతి రహితునకుఁ గథాచ్ఛేద పాతకం బొకటి దంప
తీప్రణయభేదనం బొండు దివిరి మాతృ । శిశు విభేదన మొక్కండు చెందకున్నె ॥ ౧౨౬

తే.గీ. ఒక్కనాటి తిండి యొక తిండిగాదుసుం । డెల్లకాలమునకు నెద్దియేని
దిండి దొరికెనేనిఁ దెగబారి చేసెద । నవిన వమ్రి గాంచి యజుఁడు పలికె॥ ౧౨౭

తే.గీ. హోమకర్మలందు నొనరంగఁ బ్రక్కల । బడిన హవిసు నీకు భాగ మిత్తు
వేగ నేగి నీవు వింటికొప్పునుఁ దిని । హరిని మేలుకొల్పు మనిన వమ్రి ॥ ౧౨౮

క. వనజభవు నానతిం గొని । చని యంత శరాసకోటిఁ జప్పగ భక్షిం
చినఁ దెగియె నారి పశ్చిమమున నుత్తరకోటి యపుడు ఘోరన నూడెన్ ॥ ౧౨౯

సీ. పటపట బ్రహ్మాండ భాండంబు క్షోభిల్లె గడగడ సాచల క్షమ వడంకె
గళగళ నంభోధి జలము లెల్లఁ గలంగె ఱివ్వుఱివ్వున గాలి తేఁగి వీఁచె
తటతటఁ బర్వతస్థల సానువులు రాలె జలజలవి మహోల్క లిలఁ దొరంగె
మలమల దెస లెల్ల మాడి ఘోరము లయ్యె మకమక సూర్యుండు మాసి క్రుంకె

తే.గీ. ఢమ్ము ఢమ్మను భయద శబ్దమ్ము పుట్టె । కుండలంబులతోడ వైకుంఠు శిరము
హేల నప్పరమునకుఁ బెల్లెగసి యెందె। పడియె వడిసెలలో ఱాయి పగిది నపుడు॥ ౧౩౧

ఉ. అంతట నంధకార విలయం బగుడున్ సుర లెల్ల విస్మిత
స్వాంతత నుత్తమాంగరహితాచ్యుతుఁ జూచి విషాద మెచ్చఁగా
నెంతయు బాష్పము ల్దొఱఁగ నేడ్చిరి బావని హా రమేశ హా
కాంత యనంతసంతతసుఖప్రద కేశవ యంచు నొక్కటన్ ॥ ౧౩౨

క. ఏ దేవు మాయయో యిది । యీ దివ్యశరీరమునకు నిది యొప్పిదమే
యో దేవదేవ నీకునుఁ బై । దైవము కలదె యిట్టి పాట్లకుఁ దగుదే ౧౩౩

తే.గీ. ఇది తలంపఁగ రాక్షస కృతము గాదు । యక్ష కృతమును గాదు దైత్యవర కృతము
గాదు దేవతలము మేమె కారణంబు । కాన నెవ్వరి దూషింపఁగలము మేము ॥ ౧౩౪

తే.గీ. ఏము పరతంత్రులము మాకు నెవ్వ డింక । శరణ మయ్యెడు నయ్యయో శిరము లేని
కమలదళనేత్రుఁ జూడంగఁ గలమె యిపుడు । కలఁగి వలవల వలపోయఁగలము గాక॥

తే.గీ. మాయ కీశ్వరుఁడైన యీ మాధవుని । గబంధమాత్రునిఁ జేసిన మాయ యెదియొ
కాదు సాత్త్వికి రాజసి కాదు కాదు । తామసి యిదేమి చిత్రమో తలఁపరాదు ॥ ౧౩౬

క. అని విలపించెడి దేవతలనుఁ గని పరమేష్ఠి యూరడం బలుకుచు శాం
తిలఁ జేసి మహామహులై । యలరెడు మీ రిట్లు శోక మందఁగ నేలా ॥ ౧౩౭

క. శోకించుటచే ఫల మే । లా కలుఁగు నిరర్థక ప్రలాపము వంకన్
బోక గతమునకు నేద్వక । పై కార్యము సూచువాఁ డుపాయజ్ఞుఁ డిలన్ ॥ ౧౩౮

క. దైవమునుఁ బురుషకారము । నే వెరవున రెండె కావె యిందును బురుష
వ్యాపృత్తి మానకుండిన । నా వెనుకం దైవమే ఫలావాప్తి యిడున్ ॥ ౧౩౯

వ. అనిన నింద్రుండు.

తే.గీ. దైవమే యెక్కుడగు వెందుఁ దలఁచి చూడఁ । బురుషకారంబునకు ఫలస్ఫూర్తి లేదు
నిర్జరులు సూచుచుండంగ నిఖిలలోక । పాలకుండగు హరికె యిప్పాటువచ్చె॥ ౧౪౧

వ. అనినం బితామహుండు. ౧౪౨

క. కాలప్రాప్తం బగు నది । వాలాయం బనుభవింప వలసినదేకా
మేలైనను గీడైనను । వీలానే యతిక్రమింప వెస దైవికమున్ ॥ ౧౪౩

క. సందియము లేదు దేహికి । నెందు సుఖము దుఃఖము భుజియింపక పోవన్
సందు గలదె నాకును మునుఁ । గందర్పహరుండు శిరము ఖండించె జుఁడీ॥ ౧౪౪

ఉ. శాపవశంబునన్ త్రిపురశాసను లింగము డుల్లె నట్టులే
శ్రీపతి మూర్ధముం దెగె శచీపతి కయ్యె సహస్రయోని తా
ప్రాపణదుఃఖముం దిగువుబాటును స్వర్గమునుండి మానస
వ్యాపిసరోజవాసమును హా యిక నేరికి లేవు దుఃఖముల్ ॥ ౧౪౫

ఉ. కాన విషాదముం దొఱఁగి కార్యము నారయుఁ డింకమీఁద వి
ద్యానిధు లీరు సర్వజగదంబ సనాతని మూలకంద వి
జ్ఞానవిశాల దేవి పరశక్తి సమస్త చరాచరంబులం
దాను భరించు నట్లగుట ధ్యానము సేయుఁడు భక్తియుక్తులై ॥ ౧౪౬

వ. అని చెప్పి సూతుం డో మహర్షులారా పద్మసంభవుండు పూర్వోక్తవిధంబునం దేవ
తల నూఱడించి తన యెదుట నిజశరీరంబులతో నిలువంబడియున్న నిగమంబులం
గని యిట్లనియె. ౧౪౭

మ. స్తుతిఁజేయుం డికఁ గార్యసాధనిని సంతుష్టాత్మభక్తవ్రజం
సతి గూఢాంగి సనాతనిం సుగుణ సచ్ఛక్తి న్మహామాయ నం
చతిభక్తిం వచియింపఁగా విని శ్రుతివ్యాహారముల్ సుందరా
కృతులై దేవిని సర్వలోకజననిం గీర్తించె సంప్రీతిమై ॥ ౧౪౮

దండకము. దేవీ సమస్త ప్రపంచాత్మవస్తు ప్రశస్తత్వ విస్తారిణీ । నిస్తులానన్త ధీస్తుత్యుదార
ప్రకార ప్రచార ప్రభాకార సంచార సంశోభినీ । నిర్గుణా । దుర్గమానర్గళా । స్వర్గదా ।
వర్గదాత్రీ । జగజ్జాల కర్త్రీ । సమ జ్జీవభర్త్రీ । ద్విషజ్జాతిహర్త్రీ । కనం, శ్రీవి నీవే
యికం ధీవి నీవే క్షమా శాంతి కాంత్యాదులు న్నీవె మేధా ధృతుల్ నీవె యుద్గీ
థమం దర్ధ మాత్రంబు నీవే నిజం బెన్న గాయత్రియు న్నీవె కీర్తి స్పృహాదుల్ జయా
దుల్ మహామాయవు న్నీవె యా సత్తునుం జిత్తు నానందము న్నీవె కా వాక్సత్రీ
హ్రీవరేణ్యాది రూపంబులం బొంది పాపంబులం జెంది కారుణ్యమూర్తిత్వముం గల్గి
బ్రహ్మాచ్యుతేశేంద్ర వాగ్వహ్ని భాస్వ ద్దిగీశాదులం దుండి శక్తి స్వరూపంబునం సర్వ
కార్యంబులం జేయు తల్లీ । సృజింపంగ బ్రహ్మం భరింపంగ విష్ణుం హరింపంగ
శంభుం బొసంగించి తీ వెవ్వఁడైనం భవత్పాదపద్మంబులం గొల్చినం వాని నిస్సార
సంసారశోకాబ్ధికి న్నావవై తేల్చి తీరంబునం జేర్తు వీవేకదా నిన్నుఁ గీర్తింప
నెవ్వాఁడు నేర్చు న్నమస్తే నమస్తే యటంచుం భవత్పాదపద్మంబులం గొల్తు శ్రీ । శ్రీ

ఉత్సాహ. నీదు రూప మెవ్వఁ డెఱుఁగు నిత్యసత్య రూపిణీ
నీదు సంజ్ఞ లెవఁడు చెప్ప నేర్చు నోర్చు నెన్నఁగం
నీదు గుణము దెలియువాఁడు నేడు నాడు లేడుగా
నీదు మహిమఁ గంటి మేము నెమ్మి నమ్మి కొల్చుచుం॥ ౧౫౦

క. దేవతలలోన భగవతి । యేవాఁ డేనియు భవన్మహిమఁ గొనియాడం
ద్రోవ యెఱుంగునె నీవే । దేవి వనుచుఁ దలఁచెదము గదే మా తల్లీ ॥ ౧౫౧

ఉ. కోరిక లేక లోకములకుం భవకారణ మైతి వీ వహో
చేరి భవ చ్చరిత్ర మతి చిత్రము దేవి యెఱుంగ శక్యమా
యేరికినేని మా మనము లెంతయు నెవ్వగఁ జిక్కి వాక్కెడిన్
నేరము మేము నీ వయిన నేరవు నీ గుణముల్ గణింపఁగన్॥ ౧౫౨

చ. భగవతి నీ వెఱుంగవా క్షపాచరవైరి శిరంబుపాటు ము
జ్జగములఁ బ్రోచుఁ దల్లి వవి సారెకు నీ పదముల్ భజించువాఁ
డగణిత పుణ్యుఁ డప్పయనుఁ డయ్యెయొ చేసిన పాప మేమొకో
తగునె యుపేక్ష నిర్జర వితానముపై నిటు లక్కఱంబుగన్॥ ౧౫౩

చ. హరి తలఁ దూలఁ జేయుట మహత్తరమైన విషాద హేతువై
పొరలితి మీవు నాటితివి భూజము దానిన నీకరంబులన్
బరువడిఁ ద్రుంప నింతవలెనా సరికాని సురారిచేతనో
దురితమువల్లనా యతని దోర్గత గర్వమువల్లనా సతీ॥ ౧౫౪

ఉ. దానవు లెవ్వరేని రణ దారుణ భూముల నోడి నీ పద
ధ్యానము సేసిరో సకల ధాత్రి మురారి శిరంబుఁ దూల్చి యెం
తేని వినోదముం గనెనో యిందిర మీదనుఁ గోపగించితో
మా నుడు లాలకించి యిఁక మానుమి కోపము మమ్ముఁ బ్రోవుమీ॥ ౧౫౫

ఉ. ఓ పరమేశ్వరీ మము నయో బహులార్తి సముద్రమగ్నులన్
బాపుల నీచలం పావని ప్రోవవె మా జనార్దనున్
లేపవె యేడ నేఁ గలదో లేదో యెఱుంగము తచ్ఛిరంబు వి
ద్యాపర యీవ తక్కొక యుపాయము మాకిక వేఱ యున్నదే॥ ౫౬౧

క. అమృతము జీవనమునకున్ । విమలోపాయ మయినట్లు విశ్వజనని లో
కము బ్రదుకఁజేయఁగ నుపాయము నీవకదా నిరంతరానందమయీ॥ ౧౫౭

వ. అని బహువిధంబులగు దీనాలాపంబులతోఁ బరమేష్ఠి మున్నగు బృందారక బృందంబుల
యనుమతి నిగమంబు లత్యంత భక్తిం గొనియాడె నని చెప్పి సూతుండు మఱియు. ౧౫౮

క. అని యిట్టులు గొనియాడిన । విని దేవి ప్రసన్న యగుచు విబుధులతోడన్
మినుద్రోవనుండి ముద్దగు । మినుకులతో నిట్టు లనియె మేలగు ననుచున్॥ ౧౫౯

తే. గీ. వెరవు దెల్పెద సురలార వెరవకుండు । వేదములు నన్ను మిక్కిలి వేడి వేడి
యలసి సొలసె మదీయాత్మ కలఘుతృప్తి । గలిగె నందియ మేమి మీ కాంక్షదీర్తు॥ ౧౬౦

క. వేదములు ననుఁ బొగడిన । యీ దివ్యస్తోత్ర మెవ్వఁడేనియు మిగులన్
మోదమునఁ జదువ విన సత్యాదరమున వాని కోర్కె లన్నియు నిత్తున్॥ ౧౬౧

క. నారాయణు మస్తము దెగి । దూరంబునఁ బడియె నొక్క దోషమువలనన్
గారణము లేక కార్యం । బేరీతినయేని బొసఁగ దెందుం జూడన్॥ ౧౬౨

క. తనయొద్ద నున్న లక్ష్మిం । గని పరిహాసంబు చేసెఁ గమలాక్షుఁడు శ్రీ
వనిత యది సూచి తనలో । ననుమానించెన్ సవత్ని యబ్బె నటంచున్॥ ౧౬౩

ఆ.వె. ఇన్నాళ్ళనుండి యేను సుందరినయి । యిపు డరూపనైతినే తలంప
సవతి యొకతె యితనిఁ దవిలియుండుంగదా । నన్నుఁజూచి నేడు నవ్వనాయె॥ ౧౬౪

ఆ.వె. అనుచుఁ గోపగించి యపుడు తామసియైన । శక్తిదాల్చి యంబుజాయిఁ జూచి
తనసుఖంబునైన దలచక స్త్రీజన । సహజబుద్ధి నిచ్చె శాప మొకటి॥ ౧౬౫

క. నా శిరముఁ జూచి నవ్వితి । వోశౌరీ నీదు మస్త మూడిపడుంగా
కీశుండవైన నేమనె । లేశంబును శమగుణంబు లే దింతి కహా॥ ౧౬౬

ఆ.వె. సవతిఁ గనుటకంటె సపతితోఁ బెన్మిటి । గలసియుండునపుడు గనుటకంటె
సవతితోడఁ బోరు సల్పుచుండుటకంటె । విధవ యగుట సరిగ వెలఁది దలచు॥ ౧౬౭

క. అనృతము సాహసమును వం । చన మూర్ఖత్వంబును గరుణాహీనత్వం
బు నశౌచం బతిలోభత । చను నెందును భామినులకు సహజగుణములై॥ ౧౬౮

వ. అది యెట్లుండె నేమి. ౧౬౯

క. మునుపటివలె దశరూపధరుని మస్తకయుతు నొనర్తు రూఢిగ నే డా
తని శిరము లవణజలధిన్ । మునిఁగెను వేరొక్క కార్యమున్ వినుఁ డింకన్॥ ౧౭౦

క. నా చెప్పెడి చొప్పుననె మ । హాచతురతతోడ మీర లందరు నన సం
కోచము లేదిఁక వేరొక । ప్రాచుర్యం బొదవు మంచి ఫలము లభించున్॥ ౧౭౧

ఆ.వె. మున్ను బాహుబల సమున్నతుం డగు హయగ్రీవుఁడనుచు దొడ్డ కీర్తి నెసగు
దానవేంద్రు డధిక దారుణవృత్తితోఁ జెలగి ఘోరతపముఁ జేయఁ దొడఁగె॥ ౧౭౨

క. వెలయఁగ నేకాక్షరమై । యల మాయాబీజకలితమై ఘనఫలమై
యలరారెడి నా మంత్రము । నలవడి జపియించి భోగ మశనము మానెన్॥ ౧౭౩

క. నా తామసశక్తిని సం । జాత మహాభక్తియుక్తి సర్వాలంకా
రాతతమూర్తిని వేయేం । డ్లాతంకములేక తపమునందుఁ దలంచెన్॥ ౧౭౪

ఉ. దానికిఁ బ్రీతచిత్తయయి తామసమూర్తివహించి వచ్చి పం
చాననవాహనంబున సుఖాసనయై దనుజేంద్ర తెల్పు మె
ద్దానిని గోరెదీ వనినఁ దా విని యా హయవక్త్రుఁ డర్మిలిన్
బూని ప్రదక్షిణంబుగను బోయి ప్రణామముచేసి యిట్లనున్॥ ౧౬౫

ఉ. దేవి జోహారు లోకముల దిద్దిన తల్లి జోహారు భక్తసం
భావన నైపుణీకలితపాద జోహారు సమస్తదుష్టవి
ద్రావణ ఘోరఘోర సమరక్రమధీర జోహారు సంతత
శ్రీవిభవప్రదానవరసిద్ధి జోహారు జోహారు నీ కగున్॥ ౧౬౬

ఉ. ఈవు ధరాజలానలసమీరణకర్త్రివి గంధమున్ రసం
బావల రూపశక్తియును నంటుట మ్రోగుట మూరుకొంటయున్
నీవ తలంపగా రసన నీ వట చక్షువు నీవ త్వక్కునున్
నీవకదమ్మ శ్రోత్రమును నీవ క్రియేంద్రియపాళి నీవకా॥ ౧౬౭

వ. అనిన విని మహేశ్వరి యగు శ్రీదేవి యిట్లనియె. ౧౬౮

ఆ.వె. ఓరి దనుజ నీదు కోరిక దెలుపుమా । యిచ్చ నీదు భక్తి మెచ్చనాయెఁ
జేరి మేటి తపము చేసితి వీవు నే । నిత్తు వరము సంశయింపవలదు॥ ౧౬౯

వ. అనిన విని భగవతిం గాంచి హయగ్రీవుండు భక్తియుక్తుండై యిట్లనియె. ౧౭౦

తే.గీ. తల్లి నేఁ గోరు కోరిక తప్పక విను । చావు లేనట్టి బ్రతుకు నా కీయవలయు
నప్పు డమరుఁడనై యోగినై యజేయమహిమతో నీ జగంబున మనగలాఁడ॥ ౧౭౧

వ. నావుఁడు విని నవ్వి యమ్మహాదేవి యతని కిట్లనియె. ౧౭౨

క. పుట్టిన జంతువులెల్లన్ । గిట్టుట సిద్ధంబ యనెడి కీ లెరుగవొకో
యిట్టుల నుండఁగ వేఱొక । యెట్టుల సమకూరు దానవేశ్వర నీకున్॥ ౧౭౩

క. ఇది నిశ్చయం బటంచున్ । మదిఁ దెలిసి మఱొక్కవరము మ మ్మడుగఁదగున్
బదపడి నే నీ కిచ్చెద । నది యని భగవతి వచింప నాతం డనియెన్॥ ౧౭౪

తే.గీ. ఎప్పుడేని హయగ్రీవుఁ డెవ్వడేనిఁ గలిగెనేనియు వానిచేఁగాక నాకు
మృత్యు వనునది లేనట్టి మేటివరము తల్లి దయచేసి రక్షింపఁదగు నటన్న॥ ౧౭౫

వ. జగదంబ యతని కిట్లనియె. ౧౭౬

ఉ. నీవు గృహంబు సేరి యపనిం బరిపాలనఁ జేసికొమ్ము సం
భావిత సౌఖ్యసంపదలవట్టయి నీకును మృత్యు వా హయ

గ్రీవుఁడ కాక వేఱొకటి గెల్వడ దెన్నఁ డటంచుఁ దెల్పి య
ద్దేవి యదృశ్య యయ్యె మదిఁ దృప్తి నతండును నేగె నింటికిన్ ॥ ౧౪౭

ఉ. వాఁడు వరంబు పేర్మిఁ గడు వర్ధిలు గర్వము పూని యజ్ఞముల్
పాడొనరించి మౌనులను బాధలఁ బెట్టుచునుండ వానికిన్
సూడొకరుండు ముజ్జగము చోటుల లే దది గాన వానికిన్
బీడ యొనర్ప మీకిపుడు ప్రీతియకా యిఁక వేయు నేటికిన్ ॥ ౧౪౮

ఆ. వె. హయముశిరము దెచ్చి యతికింపుమనుఁడు మాధవుని మొండెమునకుఁ ద్వష్టతోడ
నంత విష్ణుఁడే హయగ్రీవుడై యేగి । యా సురారి నోర్చు వద్ది మేలు ॥ ౧౪౯

వ. అని మరియు సూతుండు. ౧౫౦

క. అని యిట్లు దేవి పలికిన । విని సుర లెల్లరును దృప్తివిస్తరులై త్వ
ష్టనుఁ జూచి పల్కి రిట్లని । యనఘా నీవేగి హయము నాస్యముఁ దెమ్మి ॥ ౧౫౧

తే.గీ. తెచ్చి యదికింపు మచ్యుతు దేహమునకు । ననిన నాతండు నట్లచేసిన మురారి
హయగళుండయి దనుజుని హతునిఁజేసె । దాన దేవతలెల్ల సంతసముపడిరి ॥ ౧౫౨

క. ఈకథఁ జదివిన వినినన్ । లోకజనని తా నొసంగు లోకాతీత
ప్రాకట వైభవమేధా । శ్రీకాంతి చిరాయువులను సేమం బొదవన్ ॥ ౧౫౩

## —: మధుకైటభోత్పత్తి :—

క. అని చెప్పిన సూతమహాముని తోడను శౌనకాదిమును లందఱు ని
ట్లని రో మునిమూర్ధన్యా । యనఘా మా సంశయంబు లడఁగింపఁగదే ॥ ౧౫౪

చ. జగ మేకార్ణవమై తలిర్చునెడ భాస్వద్రూపుఁడై విష్ణుఁ డే
పగిదిం బంచసహస్రహాయనము లబ్రాశిన్ రణప్రాజ్ఞతన్
దగి యోర్చెన్ మధుకైటభాసురుల దుర్దాంతప్రతాపాఢ్యులన్
నగభేది ప్రముఖామర ప్రకర నానాదుఃఖసంపాదులన్ ॥ ౧౫౫

మ. పరమాశ్చర్యకరంబ యిచ్చరిత మొప్పం జెప్పవే సూత యీ
వరమౌనివ్రజ మెల్లఁ జేరి వినఁగా వాంఛించుచున్నారు దు
స్తర నానార్థవిదుండవై సఖుఁడవై దైవప్రసాదంబునన్
దరి కేతెంచితి వీవు నీ చెలిమిచేతల గల్గు విన్వార్థముల్ ॥ ౧౫౬

క. వెస మూర్ఖుని సహవాసము । విసమే సజ్జనుల చెలిమి వెలయంగ సుధా
రసమే యిది దెలియనిచో । పసరమకా నరుండు వేయిపలుకు లికేలా ॥ ౧౫౭

క. ఘనుల కథలు విన నొల్లని । జనుడు పశుప్రాయుఁ డనఁగ సందియమేలా
చనుఁ బశువైనను వరగా।యనగీతులఁ జొక్కు సర్వమైనను ధరణిన్ ౧౯౮

క. ఐదింద్రియములలోపల । నాదిమములు కనులు చెవులు నవి రెండేకా
మోదమున రూపదర్శన । నాదశ్రవణముల నిచ్చు నానాగతులన్ ॥ ౧౯౯

క. శ్రవణం బనునది త్రివిధం । బవు సత్త్వరజస్తమోగుణాయత్తంబై
భువి దీనిఁ దెలిసి మానవుఁ । డవిరళమతి యగుచు వినఁగ నగు సత్కథలన్ ॥ ౨౦౦

క. నిగమాగమాది సాత్త్విక । మగు సాహిత్యాది యెందు నగును రజోజం
బగు నన్యుల దోషంబులు । ప్రగణించుట గలహవార్త రహిఁ దామసమున్ ॥ ౨౦౧

తే.గీ ధరణి నుత్తమ మధ్య మాధమములగుచు । మూడువిధముల సాత్త్వికంబును బొసంగు
మోక్షమును నాకమును భోగమును క్రమంబు । గా నొసంగును దీని మార్గంబు నుండు॥

క. రాజసమునుఁ ద్రివిధం బగు । నోజం బూర్వోక్తవిధము లొంది తదీయా
వ్యాజశ్రవణ మనన్ పేర్వ । యాజారాన్యప్రసంగ మందురు పెద్దల్ ॥ ౨౦౩

క. తామసమును ద్రివిధంబగు । భూమిన్ బూర్వోక్తరీతిఁ బుణ్యరహితు ను
ద్దామవధ పగతుతో సం । గ్రామంబును నిర్నిమిత్త కలహము వరుసన్ ౨౦౪

ఉ. కావున మౌనివర్య శుభకారణమైన పురాణసంహితా
గ్రామము వీనులం జొనుపఁగావలెఁ బాపము నెట్టఁగావలెన్
ధీమహిమంబు వర్ధిలఁగ దేలవలెన్ సుఖలీల మమ్ము న
ద్భావమునన్ దలంచుచు సుధారసధారలు చిల్కఁ దెల్పవే ॥ ౨౦౫

ఉ. నావుఁడు సూతుఁ డమ్మునిజనంబులతో నను ధన్యు లీర లెం
తే విన నిచ్చయింత్రు వచియింపఁ దలంచెద నేను ధన్యుఁడన్
శ్రీవరుఁ డేకసాగరవిశిష్టము లోకము నొందినప్డు వి
ద్రావళతన్ భుజంగములరాయనిపై శయనించి యుండగన్ ॥ ౨౦౬

వ. నారాయణుని శ్రవణమలంబునుండి మధుకైటభు లుద్భవిల్లిరి. ౨౦౭

ఉ. పుట్టి క్రమక్రమంబునఁ బ్రపూర్ణతఁ జెంది మహాబ్ధి లోపలన్
దిట్ట తనంబునం బటుగతిన్ విహరించుచు నాటలాడుచున్
కట్టిడి రక్కసుల్వెన నొకానొకనాఁడు మనంబులందుఁ దా
రిట్టులు చింతకుం దొడఁగి రిద్దఱు నొద్దిక నొక్క కావునన్ ॥ ౨౦౮

క. ఆధారము లే కిల నొక । యాధేయము నిలువఁజాల దది నిక్కంబౌ
బోధపరుల చిత్తములకు । నాధారాధేయభావ మది చూపట్టున్ ॥ ౨౦౯

క. ఎవ్వఁడు సృజించె మనలన్ । నెవ్వగఁ బుట్టితిమి మన మహీనప్రౌఢిన్
నివ్వటిలె నెట్టు లీ జల । మెవ్వతె మన తల్లి, తండ్రి యెవ్వం డరయన్॥ ౨౧౦

తే.గీ. ఇట్లు తలపోసి నిశ్చయం బెఱుఁగలేక । యుండ మధుఁజూచి కైటభుం డోరి మధుఁడ
మనల మీ సర్వతోముఖమధ్యమందు । నునికికిం గారణము శక్తి యని తలంతు॥ ౨౧౧

తే.గీ. ఆ మహాశక్తి యాధార మంబురాశి । కనుచు మనలను సృజియించి నట్టి దేవి
యదియ యనుచుఁ దలంతు నే నంతకంటె । వేఱొకటి లేదు నమ్ము మీ విధము నిజము॥

క. ఈ లీలఁ జెప్పుచుండఁగ । నాలోన విచిత్ర మహిమ నాకాశమునన్
మేలైన శబ్ద మొక్కటి । యాలింపఁగ నయ్యె శ్రావ్యమై సుకరంబై॥ ౨౧౩

తే.గీ. ఆ మనోహర వాగ్బీజ మతి మనోహ రంబు నభ్యాస మొనరించి ప్రవిమలమతి
నుండఁ గనవచ్చె మెఱుపొక్క టుప్పరమువ । దానిఁ గని యెంచి రపుడు మంత్రం బటంచు॥

క. ఆ మంత్రంబుం గైకొని । భీమతపము సేయ మొదలుపెట్టి రచలము
ద్రామహితు లగుచు నిరశను । లై మించి సమాహితాత్ములై దృఢలీలన్॥ ౨౧౪

క. వేయేం డిట్లు తపంబును । జేయఁగ గని శక్తి తృప్తిఁ జెందె గగనవా
ణీయుక్తి నిట్టు లనియెన్ । బాయని ప్రేమాతిశయము బాటిల నంతన్॥ ౨౧౫

ఉ. దానవులార మీవరము తప్ప కొసంగెద నంచు నింగిపై
మానక వాక్య మొండు విని మా మరణంబులు స్వేచ్ఛఁ గల్గఁగా
దీనజనార్తినిర్దళని దేవి ప్రసాదము సేయు మన్న మీ
పూనిక యట్ల యౌత నిఁక పొందని దేవి వచింప వారలున్॥ ౨౧౬

మ. వరము ల్గాంచు సురారు లత్యధికగర్వప్రేరితౌద్ధత్య ని
ష్ఠురులై యంబుచరాళితోఁ గలసి బిట్టుం గ్రీడలం బ్రోదలై
దొరలై యొప్పుచు నొక్కవేళను సుధాంధోజ్యేష్ఠుఁ బద్మాసనాం
తరవర్తిం గని మోదమంది పటుయుద్ధప్రక్రియాకాములై॥ ౨౧౭

క. మ్మాతోడను యుద్ధమునకు । రాతప్పితివేని విడుము రాజీవంబున్
పోతీరదు నీ కిఁక నిది । కాతరుఁడవ యేని నీవి కా పీస్థలముల్॥ ౨౧౮

తే.గీ. వారి ధీరోక్తులకుఁ గడు వగచి బ్రహ్మ । యేమిచేయుదు నింక నా కేమిదిక్కు
ఎవ్వరిని వేఁడుకొందు నే నెందుఁజొత్తు । ననుచుఁ జింతాసముద్రంబునందు మునిగె॥

వ. మఱియుం బద్మజుండు దనలో నిట్లని వితర్కింపం దొడంగె. నేఁడు వీరి బలంబులు
చూడ నత్యధికంబులై యున్నయవి. వీరి నే నెట్లు శాంతులం జేయఁగల ? సామ దాన భేద

దండోపాయంబులలో దండం బజ్ఞాతబలులయెడ నవిధేయంబు. స్తుతియుఁ బొసంగ దేల యన నాయందు వీరు దుర్బలత్వంబు పెట్టుదురు, దాన భేదంబులకుం దఱికాదు కావున.

—: బ్రహ్మకృత విష్ణుయోగనిద్రాస్తుతి :—

ఉ. వెన్నుని శేషశాయిని వివేకఘనాశ్రయునిం జతుర్భుజుం
సన్నుతి సేసి మేల్కొలిపి సాగిలి మ్రొక్కెద భక్తియుక్తిమై
న న్నతఁ డేలఁగాఁగలఁడు నాదు విచారము దీర్పఁగాఁగలం
డెన్నఁగ నింతకంటెఁ గలదే మఱియొక్కటి యంచు వేడుకన్. ౨౨౨

వ. అని.

సీ. ముక్తపదగ్రస్తము :
భణనీయగుణపాలి పాలితభూచక్ర చక్రగదాభుజా చారుదండ
దండసాధనతాత తాతప్రియకుమార మారసుందర గరుత్మత్తురంగ
రంగదర్పవరాజ రాజన్మహాలయ లయకాలకీలికీలాప్రతాప
తాపససంతాన తానవార్తివిఫాల ఫాలబాలసుధాగభస్తి బింబ

తే.గీ. బింబతులితాధరా ధరాలంబమిత్ర। మిత్రమండలగతగాత్ర గాత్రదీన
దీనమచ్ఛ్రీసుఖనిదాన దానవారి। వారిజాసనకారణ కారణాత్మ॥ ౨౨౪

చ. నిరోష్ఠ్యము.
నళినదళాక్ష దీనజననాయక నీరదగాత్ర శంఖ స
ద్గళ నరసింహ దైత్యగణదారణ నారదనాదసాదరా
గళగరళార్చితా సకలకాంతశరీర ధరాధరాతిని
శ్చలనయ నిత్య సత్యకృత సాధన శార్ఙ్గ హృషీకనాయకా॥ ౨౨౫

ఉ. ఈ దనుజేంద్రు లిద్దఱు మహోగ్ర మదోద్ధతులై ననుం గడుం
బాధలు పెట్టఁబూనిరి కృపామయ మచ్ఛరణంబ వీవకా
దే దురితాత్ములం దునిమి తేకువ న న్బ్రతికింపవే యిఁకన్
సాదరవృత్తి నంచు నిటు లాతఁడు శ్రీహరి నెంతవేడినన్. ౨౨౬

తే.గీ. యోగనిద్రాగతుండయి యున్నకతన। శౌరి మేల్కొనకున్న న జ్జలజభవుఁడు
శక్తితోఁ గూడి నిద్రావశతన యుండె। నేమిసేయుదు మేల్కొల్పు టెట్టు లితని॥

ఉ. ఎక్కడఁ బోవుదుం మఱియు నెవ్వరు నన్ను భరించువార లే
దిక్కు యఖర్వగర్వ నిరతిం దనుజేంద్రులు చుట్టుముట్టిరే
స్రుక్కితి నంచుఁ దా నరసి చూచి మనంబునఁ గొంతవట్టు నా
కొక్క యుపాయ మిత్తఱి నహో। పొడకట్టె నటంచు నెంచుచున్॥ ౨౨౭

## —: శక్తిస్వరూపకథనము :—

ఉ. దేవి యొకర్తు నాభయము దీర్పఁగలద్ది తదీయశక్తినే
కా వినఁ డింత నిద్రఁబడి కాతరు మన్వుల నచ్యుతుం డటం
చావిధి సర్వలోకము లయంబగు శక్తిని యోగనిద్ర న
ద్దీవరషోషిణిం బ్రకృతి దివ్యగుణన్ బొగడె న్మనంబునన్ ॥ ౨౨౯

క. దేవీ నీవ జగత్సంభవమునకుఁ గారణమవు పరమేశ్వరివే
నీ వేదంబులవలనన్ । నీ విశ్వాతీతశక్తినిం గనుఁగొంటిన్ ॥ ౨౩౦

ఆ.వె. నీవ యోగనిద్ర నిల్పితివి విష్ణు । నంతవాని కింత లైన నితరు
లెంతవారు నీకు నిసుమంతవారకా । కెఱుఁగఁగలమె నీ యహీన లీల ॥ ౨౩౧

క. ప్రకృతి యని పురుషుఁడని నీ । కకలంకాభిఖ్య లిచ్చి యా సాంఖ్యులు ని
త్యకళాసుమహిత చైత । న్యకళారహిత మగు వస్తు వండ్రు కదంకన్ ॥ ౨౩౨

ఆ.వె నటనఁజేయు దీవు నానాగుణంబులు - గలిగి నీచరిత్రములు గణింప
నెవ్వఁడోపు సంధ్య వీ వంచుఁ దపసులు । విన్నుఁ గొల్చుచుండ్రు నిత్యశక్తి ॥ ౨౩౩

క. నీవు మతివి నీవు ధృతివి । నీవు రుచివి నీవు శుచివి నీవె శ్రద్ధా
భావంబ వీవ కీర్తివి । నీ వఖిలము సర్వలోకనేత్రివి తల్లీ ॥ ౨౩౪

క. ప్రత్యక్షము త్వత్కార్యము । సత్యము వేదములకైన శక్యంబే నిన్
స్తుత్యాదుల మెప్పింపఁగ । నత్యాదరణైకబుద్ధి నరయుము తల్లీ ॥ ౨౩౫

క. సగుణవు నిర్గుణ వతిగుణ । వగణితనిగమాగమాంచితాధారవు నీ
ధగధగిత సుప్రభావ! । జగముఁ బ్రకాశింపఁజేయు జననివి దేవీ ॥ ౨౩౬

క. నీకంటెను వేఱెవ్వరు । నాకును శ్రీకాంతునకుఁ బినాకధరునకున్
మా కౌమారీ వాణుల । కేకాకృతి వీవకావె యెపుడు నిజముగన్ ॥ ౨౩౭

క. అన్నాది సకలకోశాభిన్నా మాయామయీ గభీర శ్రీ సం
పన్నా పోషితపరమాపన్నా నన్నాదరింపఁబాడి యపర్ణా ॥ ౨౩౮

క. కలఁడే విష్ణునికంటెన్ । బలవంతుం డైనవాఁడు బంధుర నిద్రా
కలితుం జేసితివమ్మా । యలఁతు లితరు లెంతవార లహహా తలఁపన్ ॥ ౨౩౯

క. వను లోకము సృజియింపన్ । వనజాక్షుని బెంపఁ గృత్తివాసు నడంపన్
బను లిడి చేయింతువు నీ । వనఘ మహారాజయోగహారిణి వమ్మా ॥ ౨౪౦

క. జననీ పాపులఁ ద్రుంతువు । వినయపరులఁ బ్రోతు వఖిలవేదినివి కదా
నిను మాన నా విపత్తిం । దునుమాడుము దుర్జనులకు దుర్గమ వమ్మా ॥ ౨౪౧

క. నను గన్నతల్లి వని నే । చనువున మఱిమఱియు నిన్ను సంస్తుతిఁ జేయన్
వినవమ్మా విడువక సుజ్జనకల్పక చారువల్లి జగముల తల్లీ ॥ ౨౪౨

ఉ. నాటక సూత్రధారిణి వనాఁ దగు ముజ్జగమందు నీవ యే
నాఁటను దృశ్యమానవు సనాతని యీశ్వరి వాదిమూర్తి వి
చ్చాటనశీల వార్తుల భయంబులఁ దీర్చెడి పట్టున న్మణీ
పేటివి భక్తకోటికి కృపీటభవాదులు నీదు తేజముల్ ॥ ౨౪౩

ఉ. ఓ పరమేశ్వరీ విను మహో మొఱ యింతట లెమ్ము లెమ్ము నీ
రూపము సూపు మమ్మ సితరోచిమరీచిక లీను నీ ముఖం
బోపికఁ జూచి మ్రొక్కెద నయోన్నతి విష్ణుని వీడుమమ్మ నా
యాపదఁ బాపుమమ్మ నిరతాయతచిత్రవిచిత్రవర్తనీ ॥ ౨౪౪

క. అని యిట్లు బ్రహ్మ వేఁడిన । విని మాయాశక్తి హరిని విడిచి మఱొక ప్ర
క్కను నిల్చిన నక్కారణ । మున హరిఁ గని యబ్జసూతి ముదితుం డయ్యెన్ ॥ ౨౪౫

వ. అనిన విని పరమశాంతపావనులగు మునులు పరమశాంతస్వభావసమేతు సూతుం గాంచి
యిట్లనిరి. ౨౪౬

ఉ. అక్కజమయ్యె మాకు నహహా యిది విన్న మహానుభావ నీ
వక్కణముల్ సదా విబుధవర్ణితముల్ విధి విష్ణు రుద్రులన్
బెక్కుపురాణము ల్తెలుపు నిత్యులు నాద్యులు నంచు వారలే
తక్క మఱొం డజాండముల దైవము లేదని నిక్కువంబుగన్ ॥ ౨౪౭

చ. అజుఁడు సృజించు మాధవుఁ డనారతమున్ బ్రతికించు శంకరుం
డు జగముఁ దూల్చు మువ్వురుఁ గడు న్నుతిఁ గాంత్రు త్రిమూర్తు లంచు స
త్త్వజయు రజోజయున్ మఱియుఁ దామసి నాఁ జను శక్తులొందుటన్
ప్రజలకు వేఱ యెవ్వఁ డిఁక బంధుఁడు లోకమునందుఁ జూడఁగన్ ॥ ౨౪౮

ఉ. వారలలో మురారి నిరవద్యతఁ దాఁ బురుషోత్తమాఖ్యచే
మీఱి మహాప్రసిద్ధుఁ డగు మేటి జగత్పతి సర్వ కర్మలం
గారకుఁ డంతవాని నిఁకఁ గాంతుమె ? నిస్తులతేజుఁ డాతఁ డ
య్యారె । తథావిధుండె యిటు లాయెనుఁ జిక్కెను యోగనిద్రకున్ ॥ ౨౪౯

క. ఇది మాకు సవిస్తరముగ । విదితం బొనరింపుమయ్య విజ్ఞాననిధీ
యది యే శక్తియొ మొదటికి । మొదలైనది విష్ణువునకు మూలమె చెపుమా ॥ ౨౫౦

ఉ. నిఖిలముఁ బ్రోచువాఁడు గణనీయుఁడు సర్వగతుండు వేత్త చి
త్సుఖపరుఁ డీశ్వరుం డమితసుందరుఁ డున్నత తేజుఁ డిందిరా
సఖుఁడు నిరీహుఁ డుత్తముఁడు సౌమ్యుడు శాంతుఁడు యోగనిద్రచే
నఖిలమునం దపస్మృతి బయల్పడ నజ్ఞతఁ గాంచె నయ్యయో ॥ ౨౫౧

క. తప్పక సందియ మను ముడి । విప్పి యథార్థంబు చెప్పి వేవేగ మమ్ముం
దెప్పరమగు సంతసమున । దొప్పలఁ దోగించువారు దొరకుదురె యొరుల్ ॥ ౨౫౨

చ. సనకసనందన ప్రముఖసంయములుం గపిలుండు నారదుం
డనుపమ బుద్ధిశాలులు మహామహులైనను మూలశక్తి స
త్తును గన లేరు వేదములు తప్పక పల్కుచునుండు విష్ణుఁడే
ఘనుఁడు శివుండె గొప్ప విధిగణ్యుఁ డటంచు ననేక భంగులన్ ॥ ౨౫౩

వ. మఱియు. ౨౫౪

ఉ. కొందరు కేశవున్ బరమకోవిదుఁ డంచు సనాతనుం డటం
చందురు, గొంద రీశ్వరుఁ డటందురు శక్తిసమన్వితుం డని
ష్పందుఁడు భూతనాథుఁ డని పల్కుదు రింద్రుఁడు నాథుఁ డంచు నిం
కం దిననాథుఁడంచుఁ గణకం జ్వలనుం డని యంద్రు గొందరున్ ॥ ౨౫౫

ఆ.వె. ఎంద రెన్నిగతుల నేమి చెప్పిన నేమి । కార్యకారణములఁ గాంచు చోట
సత్ప్రమాణములను సాధింపఁ గావలెఁ । గాక వే రొకండు గాదుపక్కి ॥ ౨౫౬

క. మానక ప్రత్యక్షము నను।మానము శబ్దంబు నను ప్రమాణంబులు మూఁ
డౌ ననిరి కొంద ఱని రుప।మానంబును ననుపలబ్ధి మఱి కల వనుచున్ ॥ ౨౫౭

ఆ.వె. ఆగమంబు బుద్ధి యవల సద్యుక్తియుఁ । గార్యకారణ ప్రకారములకు
ననుభవంబుమీఁద నల్ల దృష్టాంతంబు । రహిని గల్పి రా పురాణవిదులు ॥ ౨౫౮

క. పండితులు సెప్పుచుందురు । దండి పురాణముల యందుఁ దా నెవ్వేళన్
నిండె జగంబుల నన్నిట । మెండుగ శక్తిస్వరూపమే యొం డనుచున్ ॥ ౨౫౯

ఆ.వె. విధికి సృజనశక్తి విష్ణుదేవునకును । పాలనైకశక్తి శూలి కెన్న
హరణశక్తి పంకజాప్తునకుం బ్రభా।శక్తి శిఖికి జ్వలనశక్తి కలవు ॥ ౨౬౦

ఆ.వె. ఎల్లయెడల శక్తియే కనవచ్చెడి । శక్తిలేని యుత్త స్థలము లేదు
సర్వగతము శక్తి శక్తి లేనప్పుడు । వస్తు వేడఁగలదు వసుధయందు ॥ ౨౬౦

క. సర్వము శక్తిమయంబగు । సర్వజనులు శక్తిలేక శత్రుజయ శ్రీ
నిర్వాహప లెల్లగుదురు । సర్వోన్నత పదవి నందు శక్తియ కాదే ॥ ౨౬౨

క. హరిహర విధి రవి శిఖి యమ । వరుణ కుబేరాదులైన వాసవుఁడైనన్
గురుఁడైనం బరుఁడైనన్ । నిరుపమశక్తిప్రయుక్తి నెరసిరి ఘనులై ॥ ౨౬౩

క. తగుశక్తి రెండు విధముల । సగుణయు నిర్గుణయు ననఁగ సగుణాభిధ రా
గిగణము గొల్చును నిర్గుణ । నగణిత వైరాగ్యమార్గు లర్చింతు రొగిన్ ॥ ౨౬౪

ఆ.వె. మును లెరుంగ లేరు మూలశక్తి నికెట్లు । మూఢజనులు నిత్యమూర్తి నెఱుఁగ
నేర్తు రదియుఁ గాక నిజ మిక్కలిం గల।వార లల్పబుద్ధులైరి కారె ॥ ౨౬౫

క. శక్తిమయము జగ మంతయు । శక్తి జగన్మయము వేఱ సందియ మేలా
శక్తిమయము గానిది ని।శ్శక్తిక మణుమాత్రమైన జగమున గలదే ॥ ౨౬౬

క. కావున నెవ్వం డేనియు । సేవింపం దగును శక్తి సమధికలీలా
వ్యావృత్తి విశ్వమంతయు । దేవియ పాలించు భగవతీనామమునన్ ౨౬౭

క. అని వ్యాసునివలనను నే । వినియుంటిని వ్యాసుఁ డిద్ది వినె నారదు చే
త నతఁడు పితామహునిచే । వినియెన్ ద్రుహిణుండు వినియె విష్ణునిచేతన్ ॥ ౨౬౮

క. నరు లెవ్వ రిందునకు వే । అరయంగారాదుసుండి యనుభవవేద్యం
బరుదార శక్తికంటెను । బరు లాద్యులు సేవ్యు లెన్నఁ బదరు బుధులచేన్ ॥ ౨౬౯

వ. అని మఱియు. ౨౭౦

చ. కరు మరుదార శ్రీవిభునికాయము లోపలి యోగనిద్ర వేఁ
బెరసి మరుత్పథస్థ యయి పేర్మి నటుండఁగ వాసుదేవుఁ డ
చ్చెరువుగ మాటిమాటికినిఁ జేతులు సాచుచు నావులింపుచున్
వెరపు మెయిన్ బురస్థుఁడయి వేఁడు ప్రజాపతిఁ గాంచి యిట్లనున్ ॥ ౨౭౧

చ. తతతపముం ద్యజించితిఁ గతం బది యే మిటు రాకకుం భయ
స్థితి నిటు లున్కిఁ గారణముఁ దెల్పుము నాఁ బరమేష్ఠి యార్తివి
స్తృతుఁడయి పల్కెనో సుజనసేవ్య భవచ్ఛ్రవ కల్మషోత్థులై
దితిజులు మీఱి రుద్ధతులు దీప్తభుజా ల్మధుకైటభాభిధుల్ ॥ ౨౭౨

—: మధుకైటభయుద్ధము :—

క. వారిరువురు ననుఁ దమతోఁ । బోరునకును ర మ్మటంచు బోరనఁ బైకిన్
జేరుచుఁ జంపెద మనుచున్ । ఘోరాకారములఁ జుట్టుకొనిరి మురారీ ॥ ౨౭౩

క. అక్షీణకృపామయుఁడవు । రక్షించుము నన్నుఁ బ్రీతి బ్రతుకు గలిగినన్
భక్షింతున్ బలుసాకున్ । రక్షోభయ ముడిగి ద్రుమవరంపరనేనిన్ ॥ ౨౭౪

క. నాపుఁడు నారాయణుఁ డను । నో వేధ కరంబు భీతి నొందకు మింకన్
వేవేగ రిపులఁ ద్రుంచెద । నీ విచ్చట నిలచి చూడు మిదిగో యనఁగన్ ॥ ౨౪౫

తే.గీ. ఆ ప్రబలులైన సోకు దయ్యాల తేండ్లు । వనజభవు నప్డ కనుఁగొని యనధికరణ
నీరములనుండి పల్కిరి నీవు వీని । మఱుగు జొచ్చితె పద్మజ మాకు నోడి ॥ ౨౪౬

తే. గీ. ఇతఁడెసూడంగ నుక్కార్త మిచటనిన్ను।బోరు మాతోడఁ గాదేని పాఱుమెందె
దానదాసుండఁ జేసితిఁ దప్పటంచుఁ । బలుక విని దానవారాతి యలుక వొడమి ॥ ౨౪౭

ఉ. గండ్రలు మీరు రండు కడకన్ సమరంబును వేఁడిరేని యే
వాండ్రిటు లన్నదే నెఱుఁగ నీతని సృష్టి విధాత మీకుఁ బె
క్కాండ్రిఁక నేల నే నొకఁడఁ గాదె వధింతు నిమేష మోర్వఁడీ
తీండ్రిల నేలఁ గండలను దీసెద గెద్దలనోట వేసెదన్ ॥ ౨౪౮

వ. అనుఁడు. ౨౪౯

క. అధికరణరహితమహితో।దధిలోఁ దిరుగాడుచును మదప్రేరితులై
విధిఁ గన్న మేటిదొరతో । మధుకైటభు లెదిరిపోర మనసిడి రంతన్ ౨౫౦

క. మధుఁ డెదిరించిన వానిన్ । మథియింపఁగఁ గైటభుండు మార్కొన వానిన్
మథియింపగ మఱలవడిన్ । మధుఁడు గవియు నిటుల వారు మఱిమఱి పోరన్ ॥ ౨౫౧

క. మల్లరణ మొక్కరీతిన్ । గల్లోలిని మీదనుండి గమలాక్షుఁడు సం
ఫుల్ల బలస్ఫూర్తి మెయిన్ । బెల్లుగ దానవులతోడ బిట్టొనరించెన్ ॥ ౨౫౨

ఆ.వె. ఐదువేల దీర్ఘహాయనంబులు మహో।గ్రత రణంబుసేసి కరము సొక్కి
మురవిరోధి బీరమున నుదగ్రోగ్రులై । దనుజు లొప్పి రవ్విధాతసూద ॥ ౨౫౩

తే.గీ. అపుడు నారాయణుండు దా నచ్చెరుపడి । యీసురారులు శ్రమనొంద రేను మిగుల
నలసటను బడినొచ్చితి నహహ దీని కారణంబేమొ యనుచు విచార మెనసి ॥ ౨౫౪

ఆ.వె. విలువఁబడిన జూచి తులువ లా యిరువురు । గర్వఫణితి ననిరి కమలనేత్ర
పోర నలసినాఁడ వూరక చనుము దా।సోహ మనుచు నెత్తి నంజలి యిడి ॥ ౨౫౫

క. కాదేని యుద్ధమున మా । మీదికి రా మగతనమున మీఱితె తగవే
నీదు మద మడఁచి నలినజు । మోది కదన విజయలక్ష్మి ముట్టెదము హరీ ॥ ౨౫౬

వ. అనిన. ౨౫౭

క. విని సామ మూని విష్ణుం । డనియెన్ దానవులతోడ నతిభీతి మెయిన్
ఘనుఁ డైన విష్ణు దేవున।కును గల్గెఁగదా ప్రతాపకుంఠన మహహా ॥ ౨౫౮

చ. అలసటఁ జెందియున్నెడ భయాతురుఁడౌ నపు డస్త్రశస్త్రసం
కలితుఁడు గానిచోఁ బడెడికాలమునం బుడుతండు దంటతోఁ
గలనకుఁ జొచ్చినం గదనకర్మవిధిజ్ఞులు శత్రు నేయఁగా
దలకొన రంచుఁ జెప్పెడి సనాతన ధర్మము మీ రెఱుంగరే ॥ ౨౮౯

క. మీరిద్దఱు సోదరులరు । కారే సంపూర్ణబలు లిఁక న్నే నొకడన్
మీఱి కడుశక్తియుక్తిం । బోరితిగా నైదువేల పూర్ణసమ లొగిన్ ॥ ౨౯౦

ఆ.వె. నడుమ నడుమ మీరు నాతోడఁ బోరుచు । నలతఁ దీర్చుకొంటి రట్ల నేను
నలఁతఁ దీర్చుకొనిన యాదట మీ తోడ । బవరమునకు జొత్తు నవితథముగ ॥ ౨౯౧

ఆ.వె. అంతదనుక నిలుఁడ టం చచ్యుతుఁడు సెప్ప । విని మహాసురులు వివేకులగుచు
గొంతదూరమున నొకింత సేపు వసింతు । మనుచు నేగఁ గాంచి యసురవైరి ॥ ౨౯౨

క. మెళకువ నిట్లని తనలోఁ । దలపోసెన్ సమర మిది వృథాసుమ్ము మహా
బలు లీయిద్దరు దేవిన్ । గొలిచి వరము లంది రెట్లు కూల్చెద వీరిన్ ॥ ౨౯౩

క. కాకున్న వీరు పైఁబడి । రాకుందురె యుద్ధమునకు రణవిజితుఁడనై
పోకుండ మార్గ మెయ్యది । నాకు న్నేడనుచుఁ జింతనం బడి తుదకున్ ॥ ౨౯౪

క. ఇదియంతయుఁ జూచుచుఁ దాఁ । జదలన్ వర్తించు పరమశక్తిం గనులన్
ముదమొదవఁజూచి యంజలిఁ । గదియించె న్శిరమునందుఁ గడుభక్తిమెయిన్ ॥ ౨౯౫

ఉ. మ్రొక్కి మురారి యద్దనుజమూర్ధవిఖండనలోలతం గడున్
గ్రుక్కలు మ్రింగుచున్ స్తవనకోవిదుడై స్తుతియించె నో సుధా
భుక్కృతదాస్యసంతత విభూతి జగజ్జనరక్షణైక స
మ్యక్కృతి హేతువాంఛిత మయప్రకృతీ సుకృతీడితాకృతీ ॥ ౨౯౬

ఉ. దేవి నమోస్తుతే యనుచు ధీరజనప్రణుతాం భజేహ మా
ద్యే వరదే పరే యనుచు దేహి ముద మ్మమ తే పదంతు వం
దే విబుధార్చితే యనుచు దివ్యశరీరిణి రక్షరక్ష వి
ద్యావతి యంచు విష్ణుఁడు వియద్గత శక్తికి మ్రొక్కె భక్తితోన్ ॥ ౨౯౭

శా. నీ రూపంబు నెఱుంగఁ జాలముకదా నీ నిర్గుణత్వంబునం
దారూఢిన్ సగుణత్వమందు భవదీయప్రక్రియాశక్తి నె
వ్వా రూహింతురు దేవి నీదగు ప్రభావం బెన్న రా దమ్మ త
ల్లీ రాజన్మణిమేఖలాకనకవల్లీ చారువీచీవలీ ॥ ౨౯౮

చ. తెలిసెను నీ మహత్వము మదిం బరికింపఁగ నిన్ను మించి వే
ల్పు లికను లేరు లేరనుచు భూరితరంబగు యోగనిద్రచే

మెళకువ మాలియుండ విధి మిక్కిలి మక్కువ నెంతలేపినన్
దెలియక మేలుకొంటి భవదీయ కృపం గని యెట్టకేలకున్ ॥ ౨౯౯

క. ఇది యెల్ల నీ ప్రభావమె । కద యీ దనుజద్వయంబు కమలజుమీఁదన్
గదనమున కేగ నాతఁడు । మది ననుఁ బ్రార్థించె నేను మార్కొంటిఁ గదా ॥ ౩౦౦

ఉ. పంచసహస్రవర్షము లభంగురసంగర మాచరించి నేఁ
గొంచక శ్రాంతిఁ దీర్చుకొనఁ గోరిన రక్కసు లుక్కుమీరి నన్
గొంచెపు మాటలాడుచును గొట్టుచు దిట్టుచు నున్నవారు నీ
యంచిత మైన సద్వరము నందికదా జననీ మహేశ్వరీ ॥ ౩౦౧

శా. ఈ వేళన్ గడు స్రుక్కి మ్రొక్కితిని దేవీ నన్ను రక్షింపవే
వేవేగం గడుపార ముజ్జగము నీవే కంటి విచ్చారతిన్
నీవే తప్ప నిఁ కెవ్వరమ్మ జననీ నిక్కంబు మా బోంట్లకున్
రావే యీశ్వరి లోకసుందరి సపర్యాకార్యకృత్ఖేచరీ ॥ ౩౦౨

చ. అన విని నవ్వి దేవి వినయానతుఁడైన మురారిఁజూచి యో
వనజదళాక్ష నీ విపుడు వారలపైఁ జను మాఱి సేయగాఁ
జెనకుచు మోహితాత్ములను జేసెద దైత్యుల నింతలోన నేఁ
బనుపడి త్రుంపఁగావలయుఁ బాపులవంచన నెట్టులేనియున్ ॥ ౩౦౩

క. నా మాయవలన దనుజులు । వ్యామోహితు లగుచు నుందు రప్పుడ నీవుం
బై బె మార్గమునం గెలువుము । కామజనక పొమ్ము పొమ్ము కడువేగమునన్ ॥ ౩౦౪

వ. ఇట్లు. ౩౦౫

క. భగవతి దయారసాన్విత । యగుచుఁ బలికినట్టి పలుకు లాలించి దృఢం
బగ ధైర్యముఁ గైకొని యా । జెగజెట్టులఁ గవిసె శౌరి సాహసవృత్తిన్ ॥ ౩౦౬

క. ఇటులఁ దమమీద గవిసిన । మొటమొటలాడుచును దనుజముఖ్యులు రారా
వటపత్రశాయి మాపై । నెటు బోకుము పోకు ముందుమెదురఁ దిరుడవై ॥ ౩౦౭

క. శ్రీవర జయాపజయములు । దైవాధీనములు నిజము దా బలి గెలుచున్
వావిరి దుర్బలుఁడైనం । జేవ చెడుఁ బరాభవమున సిద్ధమకాదే ॥ ౩౦౮

ఆ.వె. తెలియ హర్షశోకములు నిల్వ వౌకరీతి । ముందు నీవ దనుజముఖ్యులకును
హంత వైతి విప్పు డట్టివాఁడవు కావె । యీవ యోడితివి కదే రిపులకు ॥ ౩౦౯

క. అని బాహాయుద్ధమునకున్ । దనుజులు దొరకున్నఁ జూచి తామరసాక్షుం
డనవద్య విభామహిమన్ । గన నొప్పుచు సాహసమునఁ గదనోన్ముఖుడై ॥ ౩౧౦

క. పిడిగ్రుద్దులఁ బొడచుచు సిరి। యొడయఁడు మార్కొనిన నుద్ధతోద్యోగమునన్
గడువడి నెడనెడ సుడిఁబడఁ। బొడచిన యెడలేని కడఁకఁ బురుషోత్తమునిన్ ॥ ౩౧౧

క. పోటుదగిలి గోవిందుఁడు। దీటుగఁ బాటించుఁ బూర్వదేవులఁ గని ఝుం
ఝూటంబు దూలి వెల్లం। బాటొదవన్ దేవి వదనపద్మముఁ గాంచెన్ ॥ ౩౧౨

క. వెన్నుని ఖిన్నుని నత్యా। పన్నునిఁ గని దేవి కృపను బకపక నగి గ
ర్వోన్నతు లగు దనుజుల పైఁ దిన్నఁగఁ గను లెత్తిఁజేసి తిరమైనమతిన్ ॥ ౩౧౩

ఉ. పాపులవంచనన్ మునుపఁ బాడియటంచుఁ దలంచి మోహినీ
రూపముఁ దాల్చె నద్భుత నిరూఢి జగజ్జన మోహనైక వి
ద్యాపరతంత్ర యై లలిత యై నవయౌవన దర్శనీయ యై
రూపవతీవతంస మయి రుద్రవిరోధికరాగ్ర ఖడ్గమై ॥ ౩౧౪

క ముఖము ఖము మెఱపు నిందుని। సఖము సఖము కౌను మిగుల సన్నము చెలికిన్
నఖ మెన ఖగసంతతికిన్। సుఖర ముఖర శుకరవములు సుందరి పలుకుల్ ॥ ౩౧౫

క. బంగారము రుచిరాంగము। శృంగారము కృతకచేష్ట సీమంతినికిన్
బొంగార ముద్దుమోవి సుధం గార ముదంబుమీఱఁ దా వలపించెన్ ॥ ౩౧౬

క. నిందాస్పదుఁ డనుచుఁ జవితి। చందురునిం దూరు నిటలసౌందర్యము నే
మందము మందము పంకజ। మందము పదయుగళి కెనయె యా సుందరికిన్ ॥ ౩౧౭

క. అలలేవఱు లా దృష్టుల। నలలేళ్లే గెలువఁజాల వఝలు నగుఁ గ
ల్వల లేమెఱుంగులను గని। మలలే కుచములు విలాసమహిమాన్వితకున్ ॥ ౩౧౮

వ. ఇట్లు జగన్మోహినియై తమ ప్రక్క నిలువంబడియున్న పడఁతింగాంచి తదీయ కుటిల దృక్పాతంబు లమృతధారాసేకంబు లగుడుం గడుంబొంగి యా రక్కసు లిటు నటుఁ దిరుగుచు మిగుల మోహితులై యున్నతఱి వంచన కిదియె సమయంబని సురరిపులం గాంచి హరి యిట్లనియె. ౩౧౯

క. మీ వీర్యశక్తి మెచ్చితిఁ। జేవమెయి న్నన్నెదిర్చి చేసితిరి దుర
మ్మే వరముం గోరెదరో। మీ వాంఛిత మిత్తు మేలు మే లడుగుఁ డిఁకన్ ॥ ౩౨౦

తే.గీ. దానవులు దాని విని యోరి దైత్యమథన। నీవు వరమిచ్చు వాఁడవు నేఁడు మేము
యాచకులమో భళీ తగు నౌర నీవె। కోరుము వరంబు వే సమకూర్తు మనిన ॥ ౩౨౧

తే.గీ. దాని విని వెన్నుఁడలరి య ట్లె నౌనర్తు। తప్పఁగూడదు దేవవిధ్వంసులార
మోహినీ దేవి సాక్షిగా ముఖ్యమైన। యొక్క వర మిందు మిమ్ము నే నుక్కడంప ॥

వ. అనినం దనుజులు విని. ౩౨౩

క. అయ్యో యే మందము మన । దయ్యముఁ దనుఁ గట్టఁ ద్రాఁడుఁ దానిచ్చుటకై
యియ్యకొనినట్టి చందం । బయ్యెన్ మన మింక నేమి యనఁగల మనుచున్ ॥ ౩౨౪

వ. దానవులు డోలాయమానమానసులై యివ్విధంబునం గొండొకవడి చింతించి హరిం గని.

క. లోకైకవీర ముందుగ । మాకును వర మిత్తు ననుచుఁ బల్కితివికదా
శ్రీకాంత సత్యవాదివి । మా కోరిన వరము నిమ్ము మాన్యమనీషన్ ॥ ౩౨౫

ఆ.వె. జలము లేని యొక్క స్థలమున మమ్ములఁ । జొలియజేయు మనినఁ బురుషసింహుఁ
డైన యచ్యుతుం డనూనప్రభాచక్ర । మైన చక్రము హృదయమునఁ దలఁచి ॥ ౩౨౬

శా. ఓ రక్షోవిభులార రం డిఁకను మి మ్ముక్కార్తు నక్షీణ దు
ర్వారప్రౌఢిమనంచు నూరుల నకూపారోపరివ్యాప్తి మైఁ
బారంజూచి జలంబు లే దిచట నొప్పం బోరఁగా వచ్చు నాన్
వారు న్మేనులు పెంప నూరువు లతివ్యాప్తంబులం జేయుచున్ ॥ ౩౨౭

క. తన యూరువులం దిడికొని । దనుజేంద్రుల తలలు దుల్లి తటుకునఁ దూలన్
వనజాక్షుఁడు చక్రముచే । దునిమెను సుర లొంది రది కనుంగొని వేడ్కన్ ॥ ౩౨౮

తే.గీ. వారి మేదస్సుచే నిండె వారిరాశి । యదియ భువి యయ్యె మేదిని యనుచు భూమి
కభిధగల్గిన కారణం బదియ సుండు । కావుననె మృత్తికను దినఁ గాదటంద్రు ౩౩౦

క. నను నడిగిన యది దెలిపితి । మునులారా సర్వలోకములకున్ ఘనపూ
జనభాజన శక్తియకా । యనుమానము లేదు సత్య మది సత్యమగున్ ॥ ౩౩౧

వ. అనిన విని. ౩౩౨

## —: వ్యాసకృతతపశ్చర్య :—

ఆ.వె. ఋషులు సూతమౌని నీక్షించి పల్కిరి । యనఘ మున్నుమాకు నమరఁజెప్పి
యుంటి వ్యాసముని మహోత్తమంబగు భాగవతముఁ జేసె శుకుడు పాడె ననుచు ॥

క. వ్యాసుఁడు తప మేలాగునఁ । జేసెను శుకుఁ డెట్లు పుట్టెఁ జెప్పవె మాకున్
గాసంత విడువ కత్యుల్లాసంబునఁ వ్యాస వాగ్విలాసము మీఱన్ ॥ ౩౩౪

ఉ. నావుఁడు సూతుఁ డెంతయు మనంబున బొంగి మునీంద్రులార మీ
కే వినుతున్ శుకప్రభవ మిద్ధ సవిస్తరభంగిఁ దొల్లి య
ద్దేవగిరీంద్ర శృంగమున దివ్య తపః స్థితి నేకమాతృకా
దేవి వచస్సుబీజము సుదీర్ఘత వ్యాసుఁడు దా జపించినన్ ॥ ౩౩౫

ఆ.వె. నారదోక్తరీతి నమ్మి జపించెఁ బుత్రార్థియగుచు నూరు హాయనములు
శివునిఁగూడియున్న సీమంతినింగూర్చి । సాధ్విఁగూర్చి పరమశక్తిఁగూర్చి ॥ ౩౩౬

ఆ.వె. తిండి మాని పైడి కొండకూటమ్మున । నుండి చేసెఁ దపము దండిమౌని
నిండి భూతసమ్మతుండైన కొండిక । పండుఁగాకయంచుఁ బరమనిష్ఠ ॥ ౩౩౭

సీ. గంధర్వగీతికా కలనంబు లెచ్చోట నెచ్చోటఁ గిన్నరీ హితకథాళి
దేవర్షి కృత తపస్తేజంబు లెచ్చోట నెచ్చోటఁ ద్రిదశుల రచ్చపట్టు
లాదిత్య వసు మరు దశ్వుల లెచ్చోట నెచ్చోట మందార వృక్షసమితి
పదియార్వవన్నియ బంగార మెచ్చోట నెచ్చోట రతనాల విచ్చురాళ్లు

తే.గీ. నచ్చరల నాట్య మెచ్చోట నమృతరసము । పానమెచ్చోట నచ్చోటఁ బరమనియతి
దనర బహుహాయనములు దుర్దాంతలీల । సత్యవతిబిడ్డ తపము దా సలుపఁదొడగె॥ ౩౩౮

ఆ.వె. తపమువలన నద్భుతంబైన తేజంబు । విశ్వమెల్ల నిండె వింత పొసఁగె
వ్యాసు జడలు వహ్ని వర్ణంబులై మించెఁ । బాకశాసనుండు భయముపడియె ॥ ౩౩౯

క. భయవిహ్వలు నింద్రునిఁగని । నయమున రుద్రుండు వలికె నముచిద్వేషీ
భయ మేల నీకు నిప్పుడు । నియమంబులు మానుదురె మునిశ్రేష్ఠు లిలన్ ॥ ౩౪౦

ఉ. శక్తిని నన్నునుం దలఁచి సత్యవతీసుతుఁ డిప్డు దాఁ దపో
యుక్తిని మించెఁ గోప మిటు లూనఁగఁ బాడియె నావుఁడుఁ సమి
ద్ధోక్తుల నింద్రుఁడుం బరమయోగిజనార్చిత, పార్వతీప్రియా,
ముక్తినిదాన, మౌని తపముం బచరించెడి నేల తెల్పుమా ॥ ౩౪౧

వ. అనిన. ౩౪౨

క. పారాశర్యుఁడు పుత్రుం । గోరి తపము సేయుచుండె ఘోరతరముగా
నూరేండ్లు నిండె నొక్క కుమారుం దయసేయుదుఁ బ్రమాగుణధీరుఁ ॥ ౩౪౩

ఉ. నావిని యింద్రుఁడుఁ దన మనంబున సంతసిలంగ నంత గౌ
రీవిభుఁ డా మునీంద్రునకుఁ బ్రేమ మెయి న్వర మిచ్చెఁ బుత్త్రి న
ద్భావము గల్గు లెమ్మ మహితస్థితి నీ కొడు కత్యుదారతే
జోవిభవంబుచే నలరుఁ జుమ్మిక పొమ్ము మునీంద్ర నావుఁడుఁ ॥ ౩౪౪

చ. అది విని సంతసించి ముని యాశ్రమముం దగఁజేరి పుత్త్రినం
పద యిఁకఁ గల్గునంచు నెద పూనిక సారణియైన గృహ్యముఁ
గుదురుగఁ దా మథింప దొరకొంచు మదిం దలఁచెఁ మహారణిఁ
వదలని మంథనంబున భవంబు దలిర్పదె హవ్యభోజికిఁ ॥ ౩౪౫

క. అట్టులనె పుట్టరాదా । పట్టి యొకఁడు నాకు నటులు పాటిల్లదొ యీ
పట్టునఁ బుత్త్రిరణి నా । పట్టున లేదాయె నెట్లు భామ నొనర్తున్ ॥ ౩౪౬

తే.గీ. రూపుగలదాని బెనిమిటి ప్రాపుదానిఁ । గాపురముఁ జక్కనొత్తంగ నోపుదానిఁ
బాపపూఁపలఁ గనుదాని బడఁతినోర్తుఁ । గలుగఁజేసినఁ గాలి సంకిలియ కాదె ॥ ౩౪౭

ఆ.వె. జాయ దక్షయైనఁ జక్కని దైనఁ బాతివ్రతామహిమలఁ దేలియున్న
మోయరాని పెద్ద బొండకొయ్యయ కాదె । శివుఁడె యువతి వలనఁ జిక్కుచిక్కె ॥ ౩౪౮

క. అట్టి గృహాశ్రమమును నే । నెట్టులఁ గైకొందు ననుచు నెరియుచునుండన్
నెట్టన ఘృతాచి యను నొక । నట్టువగత్తియ విలోకనంబునఁ దోచెన్ ॥ ౩౪౯

చ. గగనమునందు వేలుపుల కన్నియ చిన్నియ యెంతయేని సొం
పుగఁ గనుపట్టె నందముల మూటయి నేటగు నీటుమీఱు పల్
వగలకు సూటియైన పెనుబాటయి మాటల తేటలన్ నిజం
బుగ నమృతంపు టూటయయి పోటయి చూపఱ మానసంబులన్ ॥ ౩౫౦

క. ఆ వగలాడిం గనుఁగొన నా । వలతేఁ డా పరాశరాత్మజు నేయన్
జేవచెడి యువిదపైఁ గామావేశం బొదువ నిట్టు లని చింతించెన్ ॥ ౩౫౧

ఉ. ఈ విమలాంగిఁ గొన్న సుతు నిచ్చును గామము దీర్చునంచు నే
నే విధి దీనిఁ బొందఁగల నిప్పుడ నా సరివారు నవ్వరా
భావజుబారిచే వలపు పాలయి వ్యాసుఁడు గూడె నచ్చరన్
గైవసమైన వర్షశతకవ్రతపుణ్యము ద్రోచెనం చొగిన్ ॥ ౩౫౨

క. పోనిందు పాపమైనను । నే నింతి వరింతు ననిన నీ యచ్చర సం
తానము సుఖదం బగునే । మానుగను గృహస్థ ధర్మ మార్గము బోలెన్ ॥ ౩౫౩

క. మును నారదుండు నాకున్ । వినిచెను మున్నూర్వసి యను వెలఁదుకఁ జేప
ట్టినవాఁడు పురూరవుఁ డను । జనవరుఁడు పరాభవమునఁ జనియె నటంచున్ ॥ ౩౫౪

## —: బుధోత్పత్తి :—

వ. అని పల్కిన సూతుం గాంచి మహామును లిట్లనిరి. ౩౫౫

తే.గీ. క్షితిఁబురూరవుఁడను ధరాపతి యెవండు । తెలియ నూర్వసియనునట్టి చెలియ యెవతె
యెట్టు లాబోటి నారాజుపట్టి కలసె । సకలమును దెల్పు రోమహర్షణ తనూజ ॥ ౩౫౬

చ. అమృతముకంటెఁ దియ్యనగు నయ్య భవన్మృదుసూక్తి మాకు సం
యమివర యెంత విన్నఁ దని వయ్యెడినే యన సూతుఁ డిట్లనున్

విమలమనీషులై వినుఁడు వీనులపండువుగాఁగఁ దొల్లి వి
భ్రమవతి యా బృహస్పతికి భామిని తార యనంగ నొప్పెడిన్ ॥ ౩౫౭

క. ఆ వనిత మిటారములకు । తా వని తన నేర్పుసూచి తా మెచ్చును వా
ణీ వనిత మగఁడు కొఱతలు । లేవని తరుణామృతాంశులేఖకుఁ బోలెన్ ॥ ౩౫౮

ఉ. చేరెడు చేరెడా కనులు జిప్పిలి వీనుల నంటు నక్కఱుల్
బారెడు బారెడై వెనుక ప్రక్కను బిక్కఱరాయ వ్రేలు సోం
పారెడుఁ బారెడున్ సుధలపారముగా నధరంబునుండి ము
ద్దూరెడు దూరెడు న్మొగ మహో తగు పున్నమనాఁటి చందురున్ ॥ ౩౫౯

ఉ. కారు మెఱుంగొ బంగరు చొకారమొ వెన్నెల సోగయో సుధా
ధారయొ కాక పూవిలుఁతు దారయొ నిద్దపుఁ బద్మరాగ శో
భారమణీయకందళమొ భాసుర దుగ్ధసముద్రవీచియో
నారుచిరాంగి యొప్పె మదనప్రభవ న్నవయౌవనంబునన్ ॥ ౩౬౦

మ. మదవైహ్వల్యమునన్ వరాంగి శశిధామంబుం బ్రవేశించి త
ద్వదనంబుం గని రూపయౌవనకళావర్ణ్యుండు వీఁ డంచు స
మ్మద మారం దనుఁ గూడు మన్నఁ దమినాతం డియ్య కోల్సేయ న
మ్మదన ప్రక్రియఁ గొంతకాలము రమింపం జొచ్చి రా యిర్వురున్ ॥ ౩౬౧

క. గురుఁ డత్యంత క్రోధ । స్ఫురితుండై తారఁ దేర శుశ్రూషల బా
లురఁ బంపినఁ బలుసారులు । మరల మరలఁ దిరిగి తిరిగి మానిరి వారల్ ॥ ౩౬౨

క. అందునకుం గడుఁ జింతిలి । బృందారక గురుఁడు దాన యేగెదనని యా
చందురుని గృహము సేరి య । మందక్రోధమునఁ బలికె మందా యనుచున్ ॥ ౩౬౩

తే.గీ. కర్మ ధర్మ విగర్హితక్రమము పూని । సిగ్గొకింతయు లేక నా శిష్యుఁడ వయి
నాదు చక్కని చుక్క నిన్నాళ్ళు నీవ । యతికికొంటివి యెంత సేసితివి చంద్ర ॥ ౩౬౪

క. గురుభార్యనుఁ గవయుట భూ।సురుఁ జంపుట ధనముగొనుట సురద్రావుట పెం
పరి యిట్టి వారిఁ గలయుట । యరయంగా నైదునున్ మహాపాతకముల్ ॥ ౩౬౫

క. పెదత్రోవం ద్రొక్కితి వీ।యెడ నిందార్హుఁడవ కావె యీ వోరి శశీ
విడువుము నా పెండ్లామును । గుడువఁ దగదు తగదు పరమకుత్సితమతివై ॥ ౩౬౬

క. నాచక్కని ముద్దియ నీ । వీ చక్కని విడువకున్న నేఁ బోవఁ జుమీ
నీచుఁడవు గురుద్రోహివి । యై చరియించు టిది నీకు నర్హం బగునే ॥ ౩౬౭

క. రాఁ గలవె సురల యిండ్లకు । పోఁగలవే నన్ను నాలిఁ బొందింప కిఁకన్
దేఁ గలవె కీర్తి యింటికిఁ । బైఁ గలవు కలంకములు క్షపాచర నీకున్ ॥ ౩౭౮

చ. అన విని చంద్రుఁ డిట్లనియె నంగిరుబిడ్డను జూచి యో గురూ
ఘనులుగదా ధరామరులు కాతురు శిష్యులఁ గ్రోధవర్జితుల్
వనుపడ ధర్మశాస్త్రమును బట్టుక యుందురు కొన్నినాళ్ళు నీ
వనిత మదీయ గేహమున వాసము సేయఁ గొఱంత గల్గునే ॥ ౩౭౯

ఆ.వె. ఇచ్చ మీఱ నింతి యింటికిఁ దా వచ్చె । నెలమిఁ గొంతకాల ముచటనుండి
యిచ్చమీఱ మరల వచ్చు మీ యింటికి । మచ్చెకంటి దానె మాన్యచరిత ॥ ౩౮౦

ఆ.వె. గురువరులరు మీరు కొండికలము మేము । మున్న బోధ యిచ్చి యున్నవారు
దూరు లేదు సతికి జారుచే ననుచును । విప్రునకును వేదవిధుల వలన ॥ ౩౮౧

క. అన విని గురుండు స్వగృహం।బునకుం జని యచటఁ గొన్ని ప్రొద్దులు చింతా
జనిత తను కార్శ్యయుతుఁడై । మనియెన్ బ్రియురాలి మీది మమత బలిమిచేన్ ॥ ౩౮౨

క. మరలం జందురు నింటికి । నరిగి మహోగ్రత యెసంగ నలఁగి నిషిద్ధం
బరయ ఖలు మందిరంబుం । జొరరా దని బయల నిలచి సురగురు డనియెన్ ॥ ౩౮౩

ఉ. ఓరి దురాత్మ యోరి కలుషోద్యమ యోరి విగర్హితక్రియా
చారవిచార యోరి విరసా నిలయాంతరసీమఁ బండె దీ
ద్వారము దాటి రమ్ము వడిఁ దారను నా ప్రియదార నీక యే
దారిఁ బోయె ది మ్మిఁకను దక్కిన నీ పనిఁ జూచుకొమ్మొగిన్ ॥ ౩౮౪

క. నా పాలి ముద్దులాడిని । లే పొమ్మని నాకుఁ బంప లే వేనియు నో
పాపిష్ఠ నీకు నిప్పుడె । శాపం బిడఁ దలఁచినాఁడఁ జటులోగ్రుఁడనై ॥ ౩౮౫

క. లేరా వైశంబె దురా।చారా నా దారఁ జెనకి చలమున నాతోఁ
బోరా పోరా వార్ధికు।మారా నిను దుమ్ముఁ జేసి మట్టాడెదరా ॥ ౩౮౬

క. ఈలాగునఁ బల్కిన గురు । నాలాపము లాలకించి యారాజు బహి
శ్శాలికను దాటి వెలువడి । జాలింతయు లేక పలికె సాహస మదరన్ ॥ ౩౮౭

చ. కనుఁగొని నవ్వరే జనులు గౌరవహానియుఁ గాదె కాకి ము
క్కున విడు దొండపండువలెఁ గామిని నీ కడ నిల్చె నేనియున్
విను మిఁక దీని సుందరి నవీన వయస్కను మాని నిన్నుఁ బో
లిన ముసలాపె నానవవళీ ముకుళీకృతనేత్ర గూడుమీ ॥ ౩౮౮

క. ఈ వేమి జేసినను వే । పీ వరవర్ణిని నీకు నిచ్చుటలే దిం
దీవిధులు కామతంత్ర క।ళావేదు లెఱుంగుదురు చలము మాను మిఁకన్ ॥ ౩౮౯

క. నెల పలుకులు విని యలుకన్ । బలరిపు నిలు గురుఁడు సేర బహుభంగుల న
బ్బలియుఁడు సపర్య లొనరిచి । లలి నాసన మిచ్చి గురువులార యటంచున్ ॥ ౩౮౦

చ. మునుపటియట్లు కాదు మొగముం గడువాడెను గన్నులార్తిలో
మునిఁగిన యట్టు లున్న యవి మూపును వాంచితి గొంతు బొంగు వో
యిన దిఁక మాటలం గొణుఁగు నేర్పడె నయ్యయొ చూడ వేమి మ
మ్మనఘ ముఖంబు నెత్తి కర మంగద నేడ్చెదు నేల గీయుచున్ ॥ ౩౮౧

చ. అవమతిఁ జేసె నీకు నెవఁ డాతనిఁ జెప్పుము సర్వదేవతల్
శివహరు లేను నెప్పుడును జేతులు మోడ్చుక నీకు బాసటం
దివిరి చరింపమే యిటు మదిన్ విలపింపఁగ నేల నీకు నేఁ
డవిరళశాంతమూర్తివి మహాధిషణుండవు దేవదేశికా ॥ ౩౮౨

క. అనిన విని దేవ గురుఁడి । ట్లను నో యమరేశ యెంత యని చెప్పుదు నా
మనమున దుఃఖము విను క్రొ।న్ననఁ జంద్రుఁడు తస్కరించె నా పెండ్లామున్ ॥ ౩౮౩

క. విసికితి వేసారితి నే । నసురాంతక చందమామ నడిగి యడిగి నా
మిసిమిగల ముద్దుగుమ్మను । వెసఁబంపుము పంపు మనుచు విడువఁ డతండున్ ॥ ౩౮౪

తే.గీ. ఏమిచేయుదు నేమందు నెందుఁజొత్తు । నేఁడు నా కీవ దిక్కు నీవే కదా స
హాయుఁడవు దుఃఖితాత్ముఁడ నైతి నయయొ । లెమ్ము చంద్రునిశిక్షింప రమ్మురమ్ము ॥

వ. అనిన విని యొక్కింత దడ వాలోచించి పరమతపఃప్రభావనిస్తురుం గురుం గాంచి
చంద్రుం దిట్లనియె. ౩౮౬

క. శోకము మానుము మానుము । నాకముఁ బాలించు నే సహాయుఁడఁ గాఁగా
నీ కొక్క భయము కలదా । నా కిందుం డెంతవాఁడు నాకాచార్యా ॥ ౩౮౭

వ. అని యూరడించి. ౩౮౮

ఆ.వె. ఎఱుఁగ జెప్ప నేర్పు లెఱిఁగిన దూత నొ।క్కరునిఁ బిలచి చంద్రుకడకుఁ బంపెఁ
బ్రీతిఁ జేసి గురుని నాతిఁగూడుట మంచి।రీతి కా దటంచు నీతిఁ దెలుప ॥ ౩౮౯

క. విని వాఁడు పోయి చంద్రునిఁ । గని మఘవుఁడు పుచ్చె నన్ను ఘను నిన్నుఁ గనుం
గొని యిట్లు చెప్పుమనుచున్ । వినుమా నా చేయునట్టి విన్నపము శశీ ॥ ౩౯౦

ఉ. అంబుజవైరి నీ వెఱుఁగ నట్టివి ధర్మము లెవ్వి నీతిమా
ర్గంబులు మీవి కా పరమగణ్యుఁడు నీ పిత యత్రిమౌని దో
షంబులు సేయరాదు ఫలసాధనబుద్ధులు మీరు నాదు వా
క్యంబులు నమ్ముమీ మిగుల హర్షముఁ బూనుమి యింద్రు జూడుమీ ॥ ౩౯౧

చ. జగమున జంతుసంతతికి జాయల కా పురుషార్థహేతువుల్
తగు భువి దారగోపనము తద్దయు శ్రద్ధవహింపకున్నఁ గీ
డగు నటు కాన నేరికిని నన్యులభార్యల నంటరా దటం
చగణితపక్కి శాస్త్రముల యందుఁ గనంబడు వేయునేటికిన్ ॥ ౩౯౨

క. తన భార్య నొక్కఁ డంటినఁ । దన కేగతిఁ దోచు నట్టితరు భార్యనుఁ దాఁ
గొనునపు డారయవలయున్ । దన కెట్లో యితరులకును దా నట్లనుచున్ ॥ ౩౯౩

క. పైదలులు నీకు నిఁక లే । రే దక్షుని కూఁతు లిరువ దెనమంద్రు కదే
యీ దేవగురుని భార్యన్ । నీ దాపున నేల నేల నెల నెల లెన్నే ॥ ౩౯౪

ఉ. కోరితి వేని వేల్పు వెలకోమలు లెందఱు లేరు నీకు శృం
గారవతుల్ సుధారస వికారములైన వచోరసంబులన్
గౌరవహాని దోషముల కారణమున్ జననింద యన్య సం
సారము జోలి వోవుట విచారము సేయుమి తార నంపుమీ ॥ ౩౯౫

క. మిన్నలు వోయిన దారిన్ । జిన్నలు నడిచెదరు కాన స్మృతిమార్గములన్
దిన్నఁగఁ జన నౌ నది కా । కున్నను ధర్మక్షయం బగు న్జగ మెల్లన్ ॥ ౩౯౬

క. కావున విడుము బృహస్పతి । దేవేరిని నట్టులైన దేవసమితికిన్
నీ వలనఁ గలహ మబ్బదు । వేవేగమ నాదుపలుకు వినుమా మనుమా ॥ ౩౯౭

క. జాబిల్లి దేవదూత వచోబలముం గనియు ఘన రజోగుణయుక్తిన్
రా బాటయుఁ బో బాటయుఁ । దా బుద్ధిం దలఁపలేక తటవిటపడియెన్ ॥ ౩౯౮

వ. ఇట్లుకొంతవడి తనలో విచారంబుచేసి యెట్టకేవిం గృతనిశ్చయుండై. ౩౯౯

ఆ.వె. దేవదూత నీవు దేవనాధునకు నే । నన్న యట్లు చెప్పు మధిక ధర్మ
యుతుఁడ వీవు దేవపతివి యిట్టులు చెప్పఁ।బాడి యగునె యింత పాపమున్నె ॥ ౪౦౦

క. మీ రిరువురు గురుశిష్యులు । కారే యొజ్జలను బిల్లకాయలు వోలం
దీరుపు వడయుదురు కదా । వేఱొం డిఁక నెంచ నేల విబుధశరణ్యా ॥ ౪౦౧

క. పరులకు నుపదేశంబులు । నెరపెడిచో గొప్పవారు నేర్పరులుగదా
పరికింపరు తమపనులం । గరమచ్చెరువైన దిదియకాదే జగతిన్ ॥ ౪౦౨

ఆ.వె. ధర్మశాస్త్రకర్త దైవగురుం డంచు । నతని మాట నమ్మ నర్హ మగునె
తనకుఁ దానె వలచి చనుదెంచిన వెలందిఁ।గొన్న నేమి దోష మున్నదందు ॥ ౪౦౩

క. బలవంతు లైనవారలు । తలఁప సమస్తంబునకును దారె స్వతంత్రుల్
బలహీనుల కా శాస్త్రము । విలువదుకాబోలు నహహ నీతు లికేలా ౪౦౪

ఆ.వె. గురుని మీఁద వలపు గోరంతయును లేదు । నన్ను ఖిన్నఁజేసి నాతి చనదు
దైవనాథు నాజ్ఞఁ దలఁద్రోతు నే నెట్టు । లెట్టు వచ్చినాఁడ వట్టె చనుము ॥ ౪౦౫

శా. ఆ మాట ల్విని దేవదూత హరి డాయంబోయి యో దేవ నే
నా మందాత్ముని మందలించిన నతం డాలింపఁ డాయెన్ భవ
త్సామర్థ్యం బెఱుగం డటంచుడుఁ బలుకన్ దైత్యారి చక్రేశుఁ
డ్గ్రామర్షంబున యుద్ధయాత్ర యిఁక నిక్కం బంచు నూహించుచున్ ॥ ౪౦౬

తే.గీ. గురుని యెడనున్న పెంపగుఁ గూర్మిచేత జంద్రుయుద్ధంబు చాటించె నింద్రుడపుడు
బొర సమయంబు దొరికె నా కనుచు నిక్క । శుక్రుఁ డిట్లని జాబిల్లి జూచి పలికె॥ ౪౦౭

శా. ఓయీ చంద్ర మహేంద్రు డెంత సమరంబో యుక్తమీ పట్టునం
జేయం జొత్తుము నేను రాక్షసులు నిశ్చింతన్ సహాయక్రియల్
పేయేలా యొకమాటఁ జెప్పెదను గర్విష్ఠుండు కాదే గురుం
డీయంబోకుము దార నాయెడను లేవే మంత్రశక్తుల్ కడున్ ॥ ౪౦౮

వ. అనిపలికి భార్గవుం డసురులం బురికొల్పిన. ౪౦౯

తే.గీ. యుద్ధసన్నద్ధులై సుర లుగ్రు లగుచు । నరుగు దేరంగ రక్కసు లురవడించి
మోహరించిన గదనం బమోఘమహిమ । బెక్కుహాయనములు నిండె నొక్కరీతి ॥ ౪౧౦

క. దేవాసుర యుద్ధముగని । దేవజ్యేష్ఠుండు హితమతిన్ హంసపయిన్
దా వేగ రణస్థలికిన్ । వావిరిఁ జనుదెంచి పలికె వనజరిపునితోన్ ॥ ౪౧౧

క. విడువుము గురుసతి సేమము । గుడువుము పరసతుల నిట్లు కోరుట తగునా
కడలి బుడుత కాకున్నను । జడధిశయనుఁ బిలచి నీకు క్షయ మొనరింతున్ ॥ ౪౧౨

వ. అని మఱియు శుక్రుం జూచి యిట్లనియె. ౪౧౩

క. నీ విట్లు సేయఁ దగునే । సావాసమువలన నీకు జడమతి యొదవెన్
నావిని శుక్రుడు చంద్రునిఁ । బో విడచుట మే లటంచు బుద్ధిందలచెన్ ॥ ౪౧౪

ఆ.వె. తలఁచి చంద్రుఁ జూచి దైత్యగురుండు ప్రా । లేయకిరణ గురుని జాయ నతని
కిచ్చివేయు మనుచు నిపుడ నీజనకుండు । సెప్పఁ బంపె నట్లు సేయుమనిన ॥ ౪౧౫

ఆ.వె. భృగునిమాట లెంత వింతలాయె నటంచు । నాత్మనెంచి సురవరార్యు భార్య
గర్భవతి నొసంగి కమలారి పంపిన । గురుడు చనియె భార్యఁ గూడి గృహము ॥

ఆ.వె. పరులచేత జిక్కి పలునాళ్లు తన సొగు । బడినిలేని పొలము బాగుసేసి
పరగ దున్ని విత్తి పండించి యిచ్చిన । బంటకాపుఁ బోలెఁ బాపఁడలరె॥ ౪౧౭

ఆ.వె. అంత గొంతకాల మరుగంగ నొక శుభ । వాసరమున రమ్య వదనుడైన
తనయుఁ డుద్భవించెఁ దారకు సురగురు । దార కతడు సారసారిఁ బోలె ॥ ౪౧౮

ఉ. పుట్టిన పుత్రునిం గని ప్రమోదమునం జరిగించె చేతనై
నట్టులు జాతకర్మ మొదలైనవి దానికి నోర్వ కిందుఁ డా
పట్టున కంపె నొక్క భటుఁ బట్టిని నా కిడు మంచు గట్టిగాఁ
బుట్టెను వాఁడు నా కనుచు బొంకులు కా వనుచు న్వచింపగన్ ॥ ౪౧౯

ఉ. దూత వచించు మాట విని దొంగయ తామరగొంగ వింటిరా
కూతలు నా మొగంబునకుఁ గూన మొగం బెనఁ బెట్ట నొప్పెడిన్
ప్రీతిగ జాతకర్మసముపేతుని జేసితి నేన కాదొకో
యీ తరి బిడ్డ నియ్య నగరే జను లంచు వచించి పంపినన్ ॥ ౪౨౦

ఆ.వె. మరల గ్రతుభుజులకు మాంసాశనులకును । బ్రాప్తమైన పోరు బ్రహ్మ చూచి
వచ్చి యుద్ధసీమ నచ్చెరువడి యంద । తాలకింప నిట్టు లనుచుఁ బలికె ॥ ౪౨౧

క. తారా! వదనఖనిర్జిత । తారా! సురలోకగురుని దారా! యిటకున్
రారా తెలుపుము గురుఁడా । రేరేడా వీని తండ్రి బుత మెఱుగుదకా ॥ ౪౨౨

సీ. సందడించుచు గిల్కుటందె వాదోడుగాఁ । దొడిఁబెంపుఁ జిల్కు చేదోడుగాగఁ
జక్కని మోవిపై ముక్కెర కదలఁగా । గుబ్బ కస్తురితావి గుబులుకొనఁగ
మునుసిగ్గు దలవాంచి కనులఁ బ్రక్కల దిద్ద । ముసిముసినగవు సొంపులుఘటింప
మణిముద్రికల వ్రేళ్లు మఱిపైఁట సవరింప । ముసుఁగుసరిగ జడ మొదల ముసర
తే.గీ. గునిసి కౌనాడ గదిగుమ్మమునకు వచ్చి । తలుపు నొకకొంత యోరగా మలచి నిలచి
తార ముద్దులు గార విధాత కనియె । నితడు నిజముగ నమృతాంశుసుతుఁ డటంచు ॥

ఆ.వె. వన్నెలాడి రాజు వదనంబుఁ గనుగొని । చిన్నతనముచేతఁ జేసె దప్పు
తప్పు దెలియఁ జెప్పి యొప్పించి నంతనే । మగని గలసి సుఖనిమగ్నయయ్యె ॥ ౪౨౪

వ. అని చెప్పిన సూతుండు మరియు నమ్మహనీయు లగు మునిశ్రేష్ఠుల కిట్లనియె. ౪౨౫

క. ఆ సుతునిం దాఁగొని నిజ।వాసమునకుఁ బోయి యంత వారిజరిపుఁ డు
ల్లాసమునఁ బొంగి బుధుఁ డను । భాసుర నామంబు వెట్టె బలు ప్రేమ మెయిన్ ॥ ౪౨౬

క. కమలజుఁడును సురలును దమ । తమ గృహముల కేగిరనుచుఁ దప్పక చెప్పెన్
విమల బుధోత్పత్తిక్రమ । మమిత మనోహరము కరము నద్భుతము సుమీ ॥ ౪౨౭

ఆ. వె. బుధునకు నిళయందుఁ బుట్టె ధర్మపరుండు యజ్వయగు పురూరవాఖ్య నృపతి
దానపరత నత్యుదారకీర్తి వహించి । జగము నేలుచుండు సమయమందు ॥ ౪౨౮

క. సుద్యుమ్న నామ భూపతి । ప్రద్యోతనుఁ డగుచు సత్య పరిపాలన సం
పద్యుక్తిఁ బొనరె నాతఁడు । హృద్యస్థితి సైంధవంబు నెక్కి మృగయకై ॥ ౪౨౯

క. కొంద ఱమాత్యులు తనతోఁ । బొందుగ రా శరశరాసములు పూని మహా
నందమున నరణ్యంబుల । యందు దుఱుఱును వలలు పన్ని యయ్యై యెడలన్ ॥ ౪౩౦

క. రురువులఁ గుందేళ్లను సూ । కరముల ఖడ్గములఁ బులుల గవయముల మహా
శరభంబుల మహిషంబుల । నురుతర వన కుక్కుటముల నోలి వధించెన్ ॥ ౪౩౧

వ. అంత నొక్కయెడ న మ్మహీపాలుండు. ౪౩౨

సీ. సాల తాల తమాల సాల తక్కోల రసాల తనుచ్ఛాయఁ దాళి తాళి
కుంద నాగ మధూక చంద నాగరు గంధ కంద నానాగతుల్ కడచి కడచి
మల్లికా మాలతీ వల్లికాది లతామతల్లికావళులను దాటి దాటి
శుకరాజి పలుకు హంససరాజిత పదంబు పికరాజు స్వరము కన్పెట్టి పెట్టి

తే.గీ. తుమ్మెదల రొద పొదలను దూఁటి తూఁటి । కుసుమవిసరంబు కొనగోళ్లఁ గోసి కోసి
తనర సుద్యుమ్నుఁడు కుమారవనమునందు । గుఱ్ఱ మెక్కిచరించె నెక్కుడగు ప్రీతి ॥

ఉ. గుఱ్ఱము గోడిగాయె నృపకుంజరుఁ డత్తఱిఁ నాఁడుదాయె రా
కుఱ్ఱఁడు దన్నుఁదాను గని కోమలి నైతి నిదేమి చిత్రమో
వెఱ్ఱితనాన నిట్టి యడవిం దము దూఱితి నవ్వఁబాటు నా
మొఱ్ఱల నాలకించి కతమున్ వినిపించెడివార లేరొకో ॥ ౪౩౪

వ. అనిన విని శౌనకాది మహామునులు పరమాశ్చర్యంబు నొంది యో మహానుభావా ।
సుద్యుమ్నుండు కుమారవనంబుం బ్రవేశించి నంతటన స్త్రీత్వంబు సంభవించుటకుఁ
గారణంబు సెప్పి మమ్ము ననుగ్రహింపవే యనుఁడు సూతుండిట్లనియె. ౪౩౫

—: సుద్యుమ్నోపాఖ్యానము. :—

చ. వినుఁడు మునీంద్రులార మును విన్నగదేవరఁ జూడఁ దాపసుల్
సనకసనందనాదులు ఘనద్యుతులం దిశ లెల్లఁ గప్పుచున్
జని వనినున్న యా శివుని జూడఁ గనుంగొను నప్డు గౌరి, నా
థుని తొడమీఁద నగ్నయయి తుందుడుకుల్ పచరింపుచుండఁగన్ ॥ ౪౩౬

ఉ. వారినిఁ జూచి సిగ్గుపడి వైళము యీశ్వరు నంకసీమ న
గ్గౌరి తొలంగి వస్త్రమును గట్టి వడంకుచు నిల్చిన న్మనో
జారిని మ్రొక్కి మౌనులు వెసన్ జన నాతఁడు లజ్జఁ గుందుఁ గౌ
మారినిఁ గాంచి నీకు ననుమానము లేదు సుఖంబు గూర్చెదన్ ॥ ౩౭

ఉ. చూడుము నేఁడు మున్నుగఁ గృశోదరి యీ వనమందు జొచ్చు నె
వ్వాఁడయిన న్వెలంది యగు వాఁడగఁజేసె దిఁకేల మోము నీ

వాఁడన కాఁడె యంచుఁ జెలువఁగ బలుభంగుల బుజ్జగించె నా
నాఁడు మొదల్ కుమారుని వనంబున కీ మహిమంబు వాటిలెఁగా ॥ ౪౩౮

చ. ఎఱిఁగినవారు వోరచటి కెవ్వఁడియేని యెఱుంగ కేగినన్
తెఱవతనమ్ము వచ్చు నిఁకఁ దెల్పెడిదే మది కారణంబుగా
నరపతి భామ యయ్యెను వనంబునఁ జొచ్చుటఁ జేసి మంత్రులున్
దెఱవల యైరి గుఱ్ఱమును దీటుకొనె న్వెస నాఁడుగోడిగై ॥ ౪౩౯

క. అంతట సుద్యుమ్నుఁడు దాఁ । జింతాక్రాంతుఁ డయి గృహము చేరి తదీయ
ప్రాంతమునఁ దిరుగ నపు డా । యింతి కిళానామధేయ మిడిరి జనంబుల్ ॥ ౪౪౦

క. తనతోడి వయస్యలతో । వనితామణి హావభావ వైభవరు లొప్పఁగా
వనమున విహరించుటఁ గని । ఘనుఁ డగు బుధుఁ డతివఁ జూచి కళవళ పడియెఁగా ॥

ఉ. చక్కనిచుక్క నన్ను నిది చక్కని చుక్కని మెచ్చి యాడునో
గ్రక్కున ధిక్కరించుచు నఖంబును బోలఁ డటంచు దూరునో
మిక్కలి తంద్రికీర్తి కడు మేలని చెప్పుకొనం దలంప న
మ్మక్క తదీయవక్త్రరుచి కాతఁడు చాలఁ డటంచు నెంచునో ॥ ౪౪౨

ఉ. ఈ విమలాంగి కౌనుసిరికే సరి కేసరి యీ నెలంత కె
మ్మోవి మెఱుంగు కింశుకము పూతను బూతను నేమిచెప్ప నా
హా వనజాక్షి వేణి రుచి నబ్దముఁ గా దను నీ వెలంది న
న్నేవిధినేనిఁ గూర్మియిడి యేలఁగ నేలఁగవచ్చు లోకముల్ ॥ ౪౪౩

సీ. చెలియ కంఠస్వరశ్రీ లేలఁగాఁగాదె పికసంతతులు పరభృతము లయ్యె
కలికి నెమ్మేని తళుక్కుల కోడియేకాదె సౌదామనీలత చపల యయ్యె
వెలఁది నెమ్మోని సౌరులఁ గాంచి వలపోసి రాజీవమదియు నీరజమ యయ్యె
నతివ కన్దోయి సోయగముఁ జింతించుచుఁ గొమరు లీనెడుకల్వ కుముదమయ్యె
తే.గీ. కలికి పదమార్దవంబును గొలిచి కొలిచి । పేర్మిఁ జిగురాకు పల్లవాభిఖ్య జెందె
దీని మధురాధరామృతాధీనుడ నయి ప్రధిత వైభవమున నేను బుధుఁడ నగుదు ॥ ౪౪౪

వ. ఇ ట్లభంగురానంగపరవశుండై యయ్యంగనా వయోవిలాసంబుల నంతరంగంబునఁ దలంచి వర్ణించుచు మందార తరు సందోహంబుల చాయల మరందసారణీధోరణుల దాపునం ద్రాక్షాలతాకాయమానంబుల నిలచి నిలచియున్నతఱి కన్నియయు నవ్వన్నెకానిం గాంచి పంచశరశరాస నిర్గళిత పుష్పబాణ పరంపరలు వెక్కసం బగుడుం దక్కసలాడి నిక్కినిక్కి యొక్క యారంబు చాటుననుండి యా చక్కదనాల యిక్క తనలో నిట్లని వితర్కించె. ౪౪౫

శా. ఔరా వీఁ డెవఁడో మహోన్నతభుజుం డాజానుబాహుండు శ్రృం
గారశ్రీ సుకుమారమారుఁడు కటాక్ష భ్రాంత సీమంతినీ
వారుం డింద్రకుమారుడో మఱి సుధావాసుండొ యేమందు నీ
ధీరోదాత్తుని గూడకున్నఁ దగునే స్త్రీత్వంబు నా కియ్యెడన్ ॥ ౪౪౬

వ. అని చింతించుచున్న మత్తకాశిని యెదుటికిం జనుదెంచి ధరావరుండు. ౪౪౭

క. మదిరాక్షి నీదుపే రె। య్యది నినుఁ గడుపారఁ గన్న యతఁ డెవ్వఁడు నీ
మది నేమి కోరి యిచ్చట। ముదమున విహరించెదో సమూలము సెపుమా ॥ ౪౪౮

వ. అనిన న జ్జననాథు పలుకులు విని సిగ్గున నవనతవదనయై మనంబున సందడించు మద నుండు ప్రేరేప నెట్టకేలకు ధైర్యంబుగొని యో జనవరా యిటు వినుమని నవలా యిట్లనియె. ౪౪౯

క. ఇళ యందురు న న్నీ భూ। వలయంబున మిగిలినట్టి వార్తలికేలా
కలయం గోరెద నిను నే। వలరాయని పోరు మాన్పు వసుధాధీశా ॥ ౪౫౦

వ. ఇట్లాడిన ముద్దులాడిం గని యత్యాదరంబున గాంధర్వపద్ధతి నవలంబించి మనోభవ మనోహరక్రియాకలాపంబుల నలరించిన సద్యోగర్భంబున నయ్యింతి కొౕక సుంద రుండైన నందనుం డుదయించి దినదిన ప్రవర్ధమానుండై యలరుచుండె నంత. ౪౫౧

క. వనమంద యుండి యొకనాఁ। డనఘుఁ గులాచార్యు గురువు నాత్మఁ దలంపన్
జనుదెంచి కార్యమడిగిన। ననియె నిళాకన్య యతని కతి హర్షమునన్ ॥ ౪౫౨

క. మీ దివ్యజ్ఞాన మహిమ। నాదు విచారంబుఁ దెలియ నాధులకారే
సాదరత నడిగితిరిగా। కేదని సుద్యుమ్నవిభుఁడ నిళనైతిఁగథా ॥ ౪౫౩

క. అది విని యంత బృహస్పతి। మది నంతయుఁ దెలిసి త్రిపురమర్దనుఁ జర్మ
చ్ఛదు శంకరు గిరీశుఁ బదింబది దాఁ దలపోయ నతఁడు ప్రత్యక్షగతిన్ ॥ ౪౫౪

సీ. విన్నుముట్టిన కెంపు వన్నెకపర్దంపు జడలలో నెలవంక జగ్గులీన
గౌరీపరీరంభ కరముద్రికలఁ గాలకూటనీలచ్ఛాయ కొమరు మిగుల
భూతిభూషితకరాంబుజముల మణికట్ల భుజగఫణామణు ల్వొలుపుమీఱ
శారదాభ్రముఁబోని చరమగాత్రమునంటి పులితోలు దుశ్శాలు చెలువుగులుక

తే.గీ. తనువు వామార్ధమున దక్షతనయ దనర। మూఁడుకన్నులుసొబగు మోమున నెనంగ
సలలితస్థితి గంగ యౌఁదలను బొంగ। నంగజారాతి ప్రత్యక్ష మయ్యె నపుడు ॥ ౪౫౫

వ. ఇట్లు ప్రత్యక్షంబై. ౪౫౬

ఆ.వె. విన్నవింపు వాంఛ విబుధలోకాచార్య। యన్ననతఁడు నలరి యభవ నాదు
శిష్యుఁ బురుషుఁ జేసి స్త్రీత్వమ్ముఁ దొలఁగింపుమనిన గిరిశుఁ డిట్టు లనియె నపుడు॥ ౪౫౭

క. తన తొల్లిఁటి శాపము తప్పనిదికదా యనుచు నెంచి పలికెన్ మాసం
బునఁ బురుషుఁడు మఱుమాసంబునఁ స్త్రీ యగు నితఁడు మేలుబొనఁగూడు ననెన్॥ ౪౫౮

క. ఆ మాటవలనఁ బురుషుం । డై మించి నరేంద్రుఁ డింటి కరిగి మహా శ్రీ
ఘనుఁడై మాసము రాజ్యం।బును మాసము హర్మ్యవాసమును గావించెన్ ॥ ౪౫౯

క. జను లాతని రాచరికం । బునఁ దృప్తులు గాకయున్న భూపాలకుఁడున్
దనదు కుమారుని నవయౌ।వనశాలి న్నిలిపె రాజ్యభరము వహింపన్ ॥ ౪౬౦

వ. ఇట్లు పురూరవునకుం బట్టాభిషేకంబుసేసి సుద్యుమ్నుండు దపఃకాంక్ష నరణ్యంబునకుం జని నారదువలన నవాక్షరంబైన దేవీమంత్రంబు గ్రహించి నిరంతర ధ్యానపరాయణుండై తపంబు సేయుచుండ. ౪౬౧

సీ. అరచెనా భయదఘోరారావమున ధరా । దర గుహావళులు బ్రద్దలయి కూల
తెరచెనా నోరు వార్ధి నదీ గిరులతోడ । భూగోళ మొక చర్విముద్దగాఁగ
ఉరికెనా యమితశౌర్యోదీర్ణపద్ధతి । సప్తసీరధు లొక్క చంగుగాఁగ
కొరికెనా కకుభాంత కుంభికుంభాంతర । పిశితంబు లొక కోఱఁ బెల్లగిలఁగఁ

తే.గీ. దేజరిల్లెడి సింగంపు తేజి నెక్కి । మధుర మదిరా రసాస్వాద మహిమఁజేసి
యతిమనోహరలీల మదాలసయయి । యంబ సుగుణకదంబ ప్రత్యక్షమయ్యె ॥ ౪౬౨

వ. ఇట్లు ప్రత్యక్షమైన దేవిం గాంచి సుద్యుమ్నుండు. ౪౬౩

ఉ. దేవి భవత్స్వరూపము నిదే కనుగొంటిని దివ్యసుందరీ
సేవితపావనాంఘ్రి సరసీరుహము ల్భజియించి మ్రొక్కెదన్
కావలె నన్ను సర్వమును గాచెడి నీ కొక భార మైతినే
నీవకదమ్మ నావ భవనీరధికిం గరుణారసాంబుధీ ॥ ౪౬౪

ఉ. నిన్ను నుతింప నే మునులు నేర్తురు మర్త్యు లిఁకెంతవారు నీ
మన్నన గాదె దేవతలు మర్త్యులు భూతిసమేతు లౌట నీ
యున్నతి నీదయోదయము నూర్జితశక్తి యుదారధర్మసం
పన్నత కన్నతల్లి నిజభక్తసురద్రుమవల్లి సాధ్యమే ॥ ౪౬౫

ఉ. వెన్నుఁడు దమ్మిచూలియును వెన్నెలరాయనికూనతాలుపున్
బన్నగరాజు నగ్ని రవి పంకజవైరి సురేంద్రుఁ డాదిగాయున్
మున్నగు దేవతానికరము ల్గణియింపఁగలేరు నీ ప్రభా
వోన్నతి నెవ్వరే యితరు లోపుదురో జగదంబ తెల్పుమా ॥ ౪౬౬

ఉ. ఓ జగదంబ నిన్ను సుగుణోజ్వలుఁడైన మురారి తొమ్మునన్
దేజరిలంగ దాల్చి నియతిన్ భజయించుఁగదమ్మ నీపదాం

భోజము నమ్మికాదె జగముల్ బరిపాలనఁజేయు సంతత
శ్రీజయలబ్ధి నీవకద శ్రీ పురుసాత్త్వికి వార్యపోషిణీ ॥ ౪౬౭

ఉ. ఓ సకలేశ్వరీ జలరుహోద్భవుఁ డెంతయు భక్తి వక్త్రమున్
వాసముగా నొసంగి నిరవద్యగతిన్ నినుఁ గొల్చికాదె సం
భాసితుఁ డయ్యె సంతతము మానుగ విష్టపసృష్టికర్తయై
నీసరి యెవ్వరమ్మ రమణీయవిలాసిని రాజసీ సతీ ॥ ౪౬౮

ఉ. ఓ కరుణామయీ వృషహయుండు నిజార్ధశరీరమందు ని
ర్వీకత నిన్నుఁదాల్చి కడుఁ బ్రీతి మెయిం బరిచర్యసేయఁడే
నీకు నతండు నీవు నతనిన్ లయకర్త నొనర్చి ప్రోచె ది
వ్యాకృత పద్మజాండ విలసద్గుణ తామసి భూతపాలినీ ॥ ౪౬౯

ఉ. నే నతి నీచుఁడన్ జడుఁడ నింద్యుఁడ నజ్ఞుడ లోకపావనీ
మానవుఁ డీతఁ డెంత యని మానక నాపయి జాలిపుట్టి యెం
తే నను బ్రోవవచ్చితివి యేమనవచ్చును నన్నుఁ గన్నత
ల్లీ నతలోకసంభరణలీలవు నద్భుతశీల వెన్నఁగన్ ॥ ౪౭౦

క. ఓ శక్తి నీవకావే । యీశాదుల కిట్టి పుంస్త్వ మిచ్చితి వాణీ
శ్రీ శాంకరీ శచీముఖ । భేశాననలకును స్త్రీత్వ మిచ్చితి తల్లీ ॥ ౪౭౧

తే.గీ. నీవు పురుషుండవుం గావు స్త్రీవి కావు । రాఢి సగుణవుకావు నిర్గుణవుకావు
సత్స్వరూపిణి వాద్యవు సాధ్వి వెన్న । నట్టి నిను గొనియాడెద నఖిలజనని ॥ ౪౭౨

తే.గీ. ఇట్లు ప్రార్థించు సుద్యుమ్ను నెద దయార్ద్ర । హృదయయై దేవి సాయుజ్య మిచ్చి తనదు
రూపమునఁ జేర్చుకొనె స్ఫురద్రోచు లెసగ । నహహ మునులకు నందరా నట్టి పదవి ॥

వ. అని చెప్పి మఱియు సూతుం డిట్లనియె. ౪౭౪

ఉ. అంతఁ బురూరవుండు ప్రభువై గుణసంపద నెల్లవారు న
త్యంత ముదంబునం బొగడ నార్యులు మెచ్చగ ధర్మశీలుఁ డై
యెంతయు మంత్రగోపన మహీనతఁ జేయు చుపాయశక్తి కా
సంతయు జారనీయక రసన్ బరిపాలనఁ జేసె నర్మిలిన్ ॥ ౪౭౫

తే.గీ. అప్రతిష్ఠానపురమున నవనిభర్త । యలరి బహుదక్షిణము లైన యజ్ఞములను
జేసె బహుదానముల నతి చిత్రలీల । నొనర బాలించె నాదరం బెనయ జనుల ॥ ౪౭౬

ఉ. ఆతని రూపయౌవన గుణాతిశయంబుల నాలకించి వై
ధాతృకశాపహేతువున ధారుణి డిగ్గిన యూర్వశీ ద్యుష

త్కాతరనేత్ర తా వలచి కందువమాటలతోఁ బురూరవుణ్
బ్రీతునిఁ జేసి యిట్లనియె మెల్లనఁ జల్లనిదృష్టు లల్లుచుణ్ ॥ ౪౬౭

తే.గీ. అంగసహితుండవైన యనంగమూర్తి । వగుదు విరిసింగిణియు మకరాంక మిడిన
ననుచు నవమల్లికాప్రసూనాళిఁగోసి । చేతి కందిచ్చి మకరికల్ చెదర జూపె ॥ ౪౬౮

ఉ. అంతట రాజు న మ్మృగుద నప్పుడ తెప్పునఁ గౌఁగిలించి యా
కంతుఁ గృతార్థుఁజేయ సమకట్టుచుఁ జేరఁగ రాఁగఁ జూచి యొ
క్కింత తొలంగి యో మనుజకేసరి కక్కురి తింత యేల నీ
యంతటివాని కొక్క సమయంబున కీ వొడఁబాటు సేయుమా ॥ ౪౬౯

వ. ఆసమయం బెద్ది యనిన నీ యురణకంబుల రెంటిని నీవు రక్షించుటయు ఘృతము తక్క
నే నితరాహారంబు కైకొనకుండుటయు మైధునకాలంబునందు కాని యితర వేళల
వివస్త్రుండ వైన నిన్ను నేను జూడకుండుటయు నను నీమూడు కట్టుబాటులకు నీ
వొడంబడుము. ఎన్నఁడు నీ పొరపాటున నీసమయంబు తప్పి చను నాఁడ నిన్ను నే
విడిచి పోఁగలదాన ననిన విని పురూరవుం డందున కియ్యకొని కొంతకాలంబు యథేచ్ఛణ్
మదనకళాకుశలుండై యూర్వశిం గూడియుండె. ౪౭౦

చ. ఘనుఁడగు పాకశాసనుఁ డొకానొకనాఁ డల యూర్వశిణ్ మనం
బునఁ దలపోసి యయ్యలరుబోడి సుధర్మను లేమి యొప్ప దం
చని సురగాయకాగ్రణుల కయ్యతివం గొనితేర భూమి కిం
కనుఁ జనుఁ డందు ము న్నురణకంబుల దొంగిలుఁ డంచుఁ బల్కినణ్ ॥ ౪౭౧

క. విని పిమ్మట విశ్వావసుఁ । డును మఱికొందఱును జని కడుం జీఁకటివే
ళను దారురణకముల వే । కొని పాఱిరి రాజు పడఁతిఁ గూడెడి వేళణ్ ॥ ౪౭౨

క. ఉరణకములు పెల్లఱచిన । రమణీమణి యాలకించి రాజన్యునితో
నరవర సమయము దప్పితి । వరుగు మురణకములఁ బట్టు మతిరయముననాణ్ ॥ ౪౭౩

తే.గీ. జనవిభుం డప్డు తన వివస్త్రత నెఱుంగ । లేక వేగము చనుచుండ నాకవాసు
లరిది మెఱుపులు మెఱయున ట్లాచరింప । వెలుఁగులో నగ్ను భూపతి న్వెలఁది కాంచె॥

ఉ. చూచి లతాంగి నా కిదియ సూ సమయం బని యెంచి దిగ్గరన్
లేచి చనెణ్ నృపాగ్రణి కడింది మెయిం దముఁ జేరఁ బిక్కనే
కాచుకయున్న వా రురణకంబులఁ ద్రోచి చనంగఁ దెచ్చి ప్రే
మోచిత వృత్తిఁ జేరియుఁ దలోదరిఁ గానక దుఃఖితాత్ముడై ॥ ౪౭౫

తే.గీ. దేశ దేశంబులను దిమ్మఁదిరుగ దిరిగి । యెక్కడికిఁ బోతివో యంచు నేడ్చి యేడ్చి
యడవిలో నున్న బ్రామ్మఁకుల నడిగియడిగి । యెందునుం గాన కాత్మలోఁ గుందికుంది ॥

క. తుదకుఁ గురుక్షేత్రంబున । సుదతీమణి దిరుగుచుండఁ జూచి నృపతి స
మ్మదమున నోసీ యూర్వసి । యిది తగునా నన్ను విడిచి యిటు చనుదేరన్ ॥ ౪౮౭

మత్తకోకిల. ఓసియోసి పిసాసి యూర్వసి । యుండు ముండుము న న్నిటుల్
బాసి వచ్చితి వేమిచేసితిఁ బాప మెంతటి దానవే
యాసచే జగమంతయున్ దిరుగాడితిన్ నినుఁ గాంచితిన్
భాసురాంగి ననుం గృపారసవార్ధిఁ దేలిచి యేలవే ॥ ౪౮౮

వ. అనిన విని యూర్వసి యిట్లనియె. ౪౮౯

ఉ. వెంగలి వైతి వేమి పృథివీవర చంద్రమ । నీ యుదారధీ
సంగతి గోతఁ గూలెనె విచారవిహీనుఁడవై కళింగ వం
గాంగకురుప్రదేశముల నారట న న్నరయంగ వచ్చితే
యంగన దొంగ నమ్మఁదగదంచు దలంపుము పొమ్ము వీటికిన్ ॥ ౪౯౦

వ. అనవుఁడు ౪౯౧

తే.గీ. అహహ స్వైరిణి స్నేహమిం తాయె ననుచు । నరవరుండేగె నాత్మీయ నగరమునకు
వని శ్రుతు ల్పలుక్క నిది సంగ్రహంబుచేసి । చెప్పితినటంచు సూతుండు చెప్పె మఱియు॥

## —: శుకోత్పత్తి. :—

సీ. మునులార వినుఁ డిట్లు మును వ్యాసుఁ డాఘృతాచినిఁ గూడుట యయుక్త మనుచుఁ గొంత
వడి చింతపడి తొట్రుపడి క్రిందఁబడి ఱిచ్చపడి లేచి పలుపాట్లు బడఁగమౌని
యకట శపించునో యని భయభ్రాంతయై ముగుద రాచిల్క రూపునను వెడలి
పాఱంగఁ జూచి య ప్పారాశరి యనంగరంగుఁడై మైఁగ్రొత్త రంగు పుట్ట

తే.గీ. మనసు గుబ్బంబు కళ్లెంబు మఱియు మఱియు । నెంతలాగిన నిలువక గంతులిడిన
నగ్నికై మంథనముసేయు సరణియందు । నా తపసిరాయనికి శుక్రపాత మయ్యె ॥ ౪౯౨

వ. అనవుడు. ౪౯౩

సీ. భవము దుఃఖైకహేతువటంచుఁ జాటెడి । గతిఁ జిట్టి రొదఁ గావు కావుమనుచు
కల్ల సంసారంబు నొల్ల నొల్ల న టన్న । కరణిఁ గా ల్సేతులు కదపికొనుచు
నిరత తపో ధ్యాన నిష్ఠ నిల్పెద నన్న । మేల్మి మూసిన ఱెప్ప మెఱమికొనుచు
భూతంబు లూడిగంబులుసేయుఁ దనకన్న । పరుసున నేలపైఁ బొరలికొనుచు

తే.గీ. వ్యాసుఁబోలినవాఁడు పావనుఁడు దివ్య । మూర్తిగలవాఁడు చిక్కని మోమువాడు
భవ్యతేజంబువాఁడు పాపరహితుండు । ముద్దుబాలుం డొకండు సముద్భవించె ॥ ౪౯౪

క. బుడుతం గని ముని యచ్చెరు।వడి యిది యేమనుచుఁ గొంత పరికించి పదం
పడి గంగాజలములఁ గడు।వడి జలకముఁ దీర్చి పుత్త్రి వాత్సల్యమునన్ ॥ ౯౫

తే.గీ. జాతకర్మంబు మొదలుగా జరిపి మౌని । శివుని వరమునఁబుట్టిన చిన్నబిడ్డ
డంచు గారాముసేయుచు మించెనంత । సురలు దివి పుష్పవర్షముల్ కురిసి రోలి॥ ౯౬

ఉ. నారద తుంబురుల్ మధుర నాదముల న్మృదుగానవైఖరీ
ధీరతఁ బాడి రచ్చరలు తెత్తెయియంచు నటించి రంతటన్
జారెను మింటనుండి యజినంబు గమండలు వొక్క దండమున్
బాలులరేని కుఱ్ఱనికిఁ బాయని కానుక లై ధరాస్థలిన్ ॥ ౯౭

తే.గీ. అరణి మథియింపఁబుట్టిన యమ్మునీంద్ర । బాలునకును శుకీరూప మోలిదాల్చి
యున్న యూర్వసి యమ్మౌని యునికిఁగానఁ । బడినకతమున శుకనామ మిడిరి ద్విజులు॥

వ. అంత శుకుండు దినదినప్రవర్ధమానుండై యతిలోక చతురతాసంపన్నుం డై యెప్పుడుం
గని సాత్యవతేయుండు బృహస్పతిచే బ్రహ్మచర్యవ్రతంబు నెరపించి వేదవేదాంగంబు
లధ్యయనంబు సేయించి నిండుపేదుక నొక్కనాఁడు కొండికా యిటు రమ్మని తొడ
చక్కం గూర్చుండ నిడి చుబుకంబు పుణికి శిరంబు మూర్కొని నాయనా నీవు సకల వేద
వేదాంగంబులు సదివితివి గురుదక్షిణ యిచ్చి సమావర్తనంబుఁ గడపితివి. యిట మీఁద.

ఆ.వె. పట్టి పెక్కునాళ్ళఁ బట్టి పట్టిన నోము । గట్టితనముచేత గట్టుపట్టి
చెట్టఁ బట్టినట్టిదిట్ట వరమ్మున । బుట్టితివి వరాలపుట్టి వగుచు ॥ ౧౦౧

క. దేవ పితృదేవ ఋణములు వేవేగమ తీర్చివేయ వే యజనములన్
నీ విఁక గార్హస్థ్యము స। ద్భావమునకుఁ దగిన మంచి భార్యంగొనుమీ ॥ ౧౦౨

క. సుతులఁ గనని వారలకున్ । గతులే లేవంద్రు స్వర్గ కాంక్ష హానిక్కే
యతులమతిని సతినొక్కతె । నతికించుక యుండు మీ గృహాశ్రమ మందున్ ॥ ౧౦౩

వ. ఇవ్విధంబునం బలుకు నతిరక్తుం డగు వ్యాసునకు నతివిరక్తుం డైన శుకుం డిట్లనియె.

తే.గీ. తండ్రి తత్త్వంబెఱింగి యే దారి నాకు । మంచిదని నీవుతెల్పెదో మాన దాని
చెప్పు మెయ్యది సౌఖ్యసంసిద్ధిమూల । మెందు దుఃఖంబు సొరకట్ట దింతయేని ॥ ౧౦౪

తే.గీ. అనిన విని వ్యాసుఁ డనుప్రియతనుజ వినుము । శివునివరమునకా నీవు సేకురితివి
భూపతిని గొల్చి విత్తంబు పొందుపఱచి । యిచ్చెదను సౌఖ్యమునకు నీ కేమిగొదువ ॥

వ. అనిన విని సవినయంబుగా మెల్లమెల్లన శుకుం డిట్లనియె. ౧౦౬

ఉ. అయ్య మనుష్యలోకము నిరామయమై సుఖసాధనంబునై
తియ్యముసేయునే వనట దీరునె ప్రాజ్ఞులు దాని మెత్తురే
తొయ్యలి నొక్కదాని మెడ దుంగను గట్టుక తద్వశుండ నై
కయ్యను బడ్డ దున్నవలె కా ల్గదలింపఁగనేర నయ్యయో ॥ ౫౦౮

ఉ. సంకిలిఁ బడ్డవాని కొకసారి విముక్తి ఘటించుఁగాని బి
ట్టంకిలి నీషణత్రయమునందుఁ దగుల్కొనినట్టివానికిన్
శంకరుఁడైన ముక్తి నిడఁజాలఁడు భామలపొందు చెల్లునే
సంకట మంచుఁ బ్రాజ్ఞు లనిశంబును దానిఁ ద్యజింతు రుర్విపైన్ ॥ ౫౦౯

ఆ.వె. ఏ నయోనిజుండ నెట్లుగా యౌనే య । సుఖముఁగోరువాఁడ సూరివంద్య
భయముదోఁచు మూత్రమయము విణ్మయమునౌ।నంగసంగ సుఖము నందఁదగునె ॥

ఆ.వె. ఆత్మసుఖము మాని యానందమునుఁ ద్రోచి । జ్ఞానమెల్ల మంటఁగలిపి మాయ
లోనఁ జిక్కి విడ్వలోలకీటంబనై । యెట్లు బ్రతుకువాఁడ నీ జగమున ॥ ౫౧౧

క. చదివించె నన్ను వేదము । త్రిదశగురుం డతఁడు సూవె స్త్రీలోలుఁడు నా
కొదవించునె సుజ్ఞానము । వదలక రోగికిని రోగి వైద్యుం డాయెన్ ॥ ౫౧౨

ఆ.వె. చెప్పి చెప్పి విసికెఁ జెప్పిన దంతయుఁ । బుట్టిపుట్టి మరల పుట్టునట్టి
చెట్టహింసలకును బట్టైన కర్మముల్ । గట్టిసేయు మనుచుఁగాదె తండ్రి ॥ ౫౧౩

క. ఈ సంసారము నా కే । లా ? సారెకు సారె దిరిగినట్లే తిరుగన్
వేసారుటకే యీ యాయాసము పడనోప నోపనయ్య మహాత్మా ॥ ౫౧౪

ఉ. వేదము లెల్లనుం జదివి వెంగలియై సురతాశఁ గామినీ
పాదము లాశ్రయించుఁ గులపాంసుఁడు గణ్యుఁడె పండితుండె యే
భేదము తుక్కకుం జెవులపిల్లికిఁ బందికి జ్ఞానిగాని యా
వైదిక పండితాగ్రణికి వైశమ తెల్పుము సంయమీశ్వరా ॥ ౫౧౫

క. మానవజన్మము దుర్లభ । మైనదనుచు నెఱిఁగి యందు నత్యాదరమున్
బూనక సంసారి యయిన । మానవునకు ముక్తిగలదె మహిలో నెన్నన్ ॥ ౫౧౬

క. మాయాగుణమగు సంసా । రాయాసము లేనివాఁడె యాత్మజుఁడున్ వి
ద్యాయుతుఁడు శాస్త్రపారగుఁ । డేయెడ నీ బాధ్యు డాతఁ డీశ్వరుఁడుసుమీ ॥ ౫౧౭

క. కంకణము గట్టి వేదము । శంక యొకింతయును లేక చదివి చదివి మీ
నాంకుని వలఁబడు భూదే । వాంకితులకుఁ గట్టు వడలు టది యెట్టులొకో ॥ ౫౧౮

వ. అనిన విని పరాశరతనూజుండు నిజతనూజున కిట్లనియె ॥ ౫౧౯

క. వనితయుఁగా దీఁక మందిర । మునుగాదు మనంబె బంధమునకున్ మోక్షం
బునకుం గారణ మిది తెలి । సి నటింపందగునుసూవె చిన్నికుమారా ॥ ౨౦

క. న్యాయార్జిత విత్తమ్ముమ్మ స । హాయత మనుచుండు శ్రుతిచయంబులవలనన్
బాయని ధర్మము లెఱుగును । ద్రోయఁడు సత్యంబు ముక్తి రోసినయేనిన్ ॥ ౨౧

ఆ.వె. బ్రహ్మచారియైన వనవాసియైనను । యతికులేంద్రుఁడైన నతిథి యగుచు
గృహుల నాశ్రయింప కెట్లు జీవింతురు । గృహమె యాశ్రమములకెల్లఁ బెద్ద ॥ ౨౨

తే.గీ. శ్రద్ధతో నన్నదానంబు సలుపవలయు । సూనృతము నొక్కయపుడేని మానరాదు
చేరి ప్రజలకు నుపకృతి సేయవలయు । నవనిలోనను గృహమేధియైనవాడు ॥ ౨౩

తే.గీ. ఆలయాశ్రమమునకంటె నధికమైన । యాశ్రమము లేదుసూ వసిష్ఠాదులైన
జ్ఞానవంతులు దాపసుల్ దాని నాశ్రయించి రిది వేదవిదులు మన్నించిరనుచు ॥ ౨౪

తే.గీ. శ్రుతిహితంబుగఁ గర్మసంతతియొనర్చు।జనులకును స్వర్గమోక్షము ల్సాధ్యములగు
కాంక్షితంబులు సేకూరుఁ గార్హ్యమైన।యాశ్రమంబునఁ గలుగనియట్టి దున్నె ॥ ౨౫

తే.గీ. ఆశ్రమమునుండి యాశ్రమం బందవలయు । నని మహాత్ములు దెల్పుదు రదియు గాన
నగ్ని నర్చింపు మీఁకను యథార్థలీల । సర్వమును నందయున్నది సత్యమరయ ॥ ౨౬

క. గృహియై యాఁదట వనమున । బహులవ్రతశీలుఁ డగుచు వసియించి తుదిన్
మహితమగు పరివ్రజ్యా । సహితుండగు టొప్పు వేదసమ్మత మిదియే ॥ ౨౭

ఆ.వె. భార్య లేనినాడు భరములై యింద్రియ । ములు గలంచు మనసు బలిమిఁజేసి
వాని గెలుచుకొరకు వసుధపై మనుజుడు । దారసంగ్రహింపఁ దగునటంద్రు ॥ ౨౮

సీ. ఘనుడు విశ్వామిత్రు డను రాజఋషి తొల్లి యత్యుగ్రమగు దపం బాచరించి
మూఁడువే లేండ్లు నిర్మోహుఁడై యింద్రియముల గెల్చి నిష్ఠమై నిలచియుండ
దేవతాసటి మేనకావధూటినిఁ గాంచి తమిఁ జెంది కామతంత్రములజిక్కి
తతకీర్తియగు శకుంతల యను నొక యాఁడుబిడ్డను గనియె నీ పృథివి నింక

ఆ.వె. దాశకన్యయైన తాలిని వలచి క్ర । న్నన పరాశరుండు నన్ను గాంచె
నజుఁడు స్వసుతఁగూడె నది కాన నీవును । బ్రీతిఁ గులజ నొకతెఁ బెండ్లిగొనుము ॥ ౨౯

వ. అనిన విని నిసర్గ విరీహుండైన శుకుం డిట్లనియె ॥ ౩౦

—: శుకకృత సంసారనింద :—

ఉ. పట్టగు వాగురాసదృశ బంధన మెల్లరకుం గృహంబు నే
గట్టిగ నొల్ల నొల్లను సుఖప్రతిబంధక మింతె కాదు స్వా
రాట్టయినం ధనాశను దిరంబుగ దుఃఖము బొందుఁ దృప్తుఁడౌ
నట్టిడు భిక్షుకుండు సుఖ మందును నిస్పృహుఁజేసి ధీనిధీ ॥ ౩౧

చ. యముల్ దపంబు సేయుటకు నాత్మ సహింపఁగలేక యింద్రుఁడు
ద్యమ మొనరించు దద్విధుల కంకిలిసేతకు బ్రహ్మ భారతీ
ప్రమదనుగూడి ఖేదముల పాలయి నిందలఁ జిక్కె మాధవుం
డమరవిరోధితండముల యల్లడులం బహువారము ల్పడెన్ ॥ ౫౩౨

ఉ. శంకరుఁ డెంతవాఁ డతఁడు శాంకరిగూడి యనేకథా సుఖా
తంకములం గనండె ధనదాతయు లోలుపుఁడై చెడండె మీ
నాంకకళాప్రవీణులమటంచు జగంబున గర్వయుక్తులై
పొంకముమాని ఖిన్నులయిపోరె గృహాశ్రమవాసు లెయ్యెడన్॥ ౫౩౩

క. జననమునఁ బాలకొాఱ కేడ్చును జరలోఁ జావునకును శోకిలు గర్భం
బున విష్ఠామూత్రములందును బడి మానవుడు మిగుల దుఃఖించుఁజుమీ ॥ ౫౩౪

తే.గీ. అంతకంటెను దుఃఖదం బందుఁ దృష్ణ। యాచనాదుఃఖ మనునది యవని నెన్న
చావుకంటెను నెక్కుడు శాంతి దాంతి। కలదె సంసారమున నెట్టి ఘనునకైన ॥ ౫౩౫

క. పుడమి ప్రతిగ్రహమును జే। సెడి విప్రులు బుద్ధిబలముచేఁ గాదుసుమీ
విడిముడి వడయుట గావునఁ। గడునీచము దానికంటెఁ గలదే యెన్నన్ ॥ ౫౩౬

క. వేదములన్నియు సాంగము। గాఁ దొడిఁ బఠియించి నీతిఁ గానక స్తుతిపా
ఠాదుల ఘనులై ధనసం। పాదనకై నీచసేవఁ బాటింపరొకో ॥ ౫౩౭

క. ఏకాకియైనవానికి। శోకం బది యెంతగలదు చూడంగను దా
నాకులయినఁ గాయలయిన। నాఁకటివడి మ్రింగి బ్రతుకు నధికంబేలా ॥ ౫౩౮

క. ఆలుం బుత్త్రులు పౌత్త్రులు। నోలిఁ గుటుంబంబుగాఁగ నుదరంబులు సం
బాళింప నెంతదుఃఖము। లోలోనం బొగులు నింటిలో సుఖమున్నే ॥ ౫౩౯

తే.గీ. నాయనా కర్మమార్గంబు నాకు వలదు।వలదు పెండ్లాము నాకేల వలదు పెండ్లి
యోగశాస్త్రంబు జ్ఞానప్రయోగకరము।కర్మనాశక మది నాకు గావలయును ॥ ౫౪౦

తే.గీ. పెండ్లివలదయ్య పెండ్లాము పెద్దజెలగ। యొడలినెత్తురు మెత్తగా నొత్తిపీల్చి
మగువ వగలనుఁదగిలి కామమునఁజిక్కి। యెద్దెలగుమానవు లెఱుంగ రెరుక తెరవు॥

క. కూటమిచే వీర్యము వగ। మాటలచే సర్వధనము మానిని లాగున్
పాటింప రిద్ది మూర్ఖులు। చేటే వగలాడితోడి స్నేహము తండ్రీ ॥ ౫౪౨

ఆ.వె. నిద్రసెడుటకొఱకె నెలతను గూడుట। మూర్ఖజనుడు కుందు ముదిమిదనుక
బ్రహ్మదేవుఁ డతని పాలింటి పెనుముల్లె। యెంతదుఃఖ మిందు నేది సుఖము ॥ ౫౪౩

వ. ఇట్లు పలికిన శుకుని పలుకులు విని సాత్యవతేయుం డత్యంత చింతాక్రాంతుండై
యేమియుం దోఁపక ౫౪౪

తే.గీ. అయ్యయో యేమిసేయుదు నాత్మభాగులు । నయ్యవారినిఁజేయఁబో నాయెఁ గోతి
కర్మధర్మంబులను గోరి కన్నకొడుకు । కర్మవశమున బైరాగి కాఁదలంచె ॥ ౫౪౫

వ. అప్పుడు వ్యాసుండు ౫౪౬

తే.గీ. గడగడవడంకెఁ గడు తనుగ్లాని వొడమెఁ। చూపుభ్రమాన్పడె గొంతెండె స్రుక్కెమోము
మాట బొంగురువోయె నమ్మౌనివర్యుఁ । డావురనియేడ్చె గన్నీళ్లు బావివిండె ॥ ౫౪౭

తే.గీ. దాని కచ్చెరుపడి మునికూన యాత్మ । లోనఁ దలపోసె నౌర యీ మౌని కింక
మోహపాశంబు విడదాయె మూర్ఛనట్లు । చింతనొందెడి నేమందు వింతయనుచు ॥ ౫౪౮

వ. ఒక్కింత దడవు విచారించి సకరుణంబులగు వచనంబుల శుకుండు దండ్రిం జూచి. ౫౪౯

క. వేదాంతకర్తయు నిఖిల । వేదియు వేదసము డితఁడు వెంగలియై సా
రోదారజ్ఞానము చెడి । ఖేదించెడి నహహ మాయ గెంటవశంబే ॥ ౫౫౦

ఉ. ఎంతటి మాయయో యెరుగ నెంతటిదుఃఖము దీనిగెల్వ ధీ
మంతులు పండితోత్తములు మాన్యులు నేరరు వ్యాసుఁ డీతఁ డా
వంతయు ధైర్యమూనకయ వంతలపాలయి యున్నవాఁడు వి
భ్రాంతిఁ గనండు భారతము సర్వపురాణములున్ రచించియున్ ॥ ౫౫౧

ఆ.వె. బ్రహ్మ విష్ణు హరుల బహుభంగులను మోహ । పాశములను గట్టెఁ బరమశక్తి
యితరులైనవారి నేటికి స్మరియింప । నట్టి దేవిఁ ద్రిజగదంబఁ గొలుతు ॥ ౫౫౨

తే.గీ. మాయలోఁ జిక్కి సౌక్కని మనుజుఁ డెవఁడు । విష్ణు నంశంబున జనించి విశ్వవిదితు
డైన వ్యాసుండె మునిఁగె మోహార్ణవమున।పుట్టిమునిఁగిన బిట్టేడ్చు సెట్టిఁబోలె ॥ ౫౫౩

క. ఇతఁడెవ్వఁడు నేనెవ్వఁడ । మతిభ్రాంతియెకాక నిత్యమా యీ దేహం
బతుకఁబడెఁ బంచభూత । ప్రతతిం గణియింప దుఃఖభాజన మిదియే ॥ ౫౫౪

వ. అని ౫౫౫

ఉ. దేవికి మ్రొక్కి యో జనని దివ్యమహేశ్వరి నన్ను సత్కృపన్
బ్రోవుమటంచుఁ బల్కి తనముందట నేడ్చుచుఁ గూరుచున్న చిం
తావశు వ్యాసమౌనిఁ గని తాత సమస్తము నీ వెఱుంగవే
యీవిధిఁ గుంద నేమిటికి నెక్కడి మోహము నీకుఁ బాల్పడెన్ ॥ ౫౫౬

ఆ.వె. పూర్వజన్మమందుఁ బుత్రుండనా నీకు । భావిజన్మ మెట్లుపోవునొక్కొ
నేఁడు నన్నుఁ బుత్త్రునింగా దలంచుట । యెంతవింత దీని కేమిసెప్ప ॥ ౫౫౭

ఆ.వె. దుఃఖ మేల తండ్రి తుడిచెదఁ గన్నీళ్లు । మాను మాను మింత మమత తగదు
జగము మాయగాని సత్యంబుకాదుసూ । మాయ నమ్మగాదు మానవులకు ॥ ౫౫౮

ఆ.వె. తిండి యబ్బెనేనిఁ దీఱు నాఁకలి యెందు । నీరుగల్గఁ దీఱు నీరువట్టు
కొడుకుఁ బిల్చి ముద్దుఁగొని చెక్కిలిని దువ్వి । చేరియున్నమాత్రఁ దీరునొక్కొ ॥

ఉ. వాసనచేత ముక్కు సుఖవాసనఁ గైకొను మంచి గీతిచే
వీసులు వీను చల్లనగు వాయువుచేఁ దనియుఁన్ శరీర ము
ల్లాసము నొందుఁ దియ్యని ఫలంబుల నాలుక కన్ను లొందు ని
చ్చాసమవాప్తి రూపమున సౌఖ్యము పుత్రునివల్లఁ గల్గెనే ॥ ౫౬౦

క. విలువఁగొని యజీగర్తుం । డెలమి హరిశ్చంద్రమానవేశున కీఁడే
తలఁపునఁ గరుణ యొకింతయుఁ । గలుగక దా యజ్ఞపశువుగాఁ దనకొమరున్ ॥ ౫౬౧

క. మనమున నిహపరసుఖతన్ । దనరితి వేనియును నీవు ధన మార్జింపన్
బనిబూనుము వెతమానుము । తనయుఁడ నావలన నేమి ధన్యత గలుగున్ ॥ ౫౬౨

ఆ.వె. జన్మరహితమైన సాధనంబును జెప్పి । గర్భనరకభయముఁ గడవఁజేసి
జ్ఞానమిచ్చి మాయ కట్టిన ముడి విప్పి । తండ్రి నన్నుఁ బ్రోవఁదలఁపుమయ్య ॥ ౫౬౩

మానిని. జానుగ మానవజన్మ మసాధ్యము సంయమినాయక యెందుఁ గనన్
భూనుతమై తగు భూసురజన్మముఁ బొందుట దుర్లభ మందును స
న్మానితవంశ సమంచితవృత్తిని మర్త్యభవంబ దశక్యమగున్
గాన మహోత్తమ కార్యము జ్ఞానము గట్టిగఁ జెప్పుము జ్ఞాననిధీ ॥ ౫౬౪

వ. బహువిధంబులం బరమహంసాశ్రమంబుం గొనియాడు తనయుని శాంతరస సమావేశ
కలిత సుఖంబైన ముఖంబు జూచి తలయూచి వ్యాసుం డిట్లనియె. ౫౬౫

క. ఓ ముద్దుల తనయుండా । నీ మాటలు బ్రహ్మమార్గనిష్ఠల కోటల్
కామమును జెరుగు చేటలు । మోము నెదుటి ముక్తిధనము మూటలుగావే ॥ ౫౬౬

వ. అయినను. ౫౬౭

సీ. వినుము బాలక నేను విస్తరించి రచించి ప్రకటించియున్నట్టి భాగవతము
అది నాతివిస్తీర్ణ మది బ్రహ్మసమ్మతంబును సమస్తపురాణ భూషణంబు
అది జ్ఞానదము శ్రావ్య మత్యంత శుభదంబు పఠియింపు మద్దానిఁ బరమనిష్ఠ
పాలపాపనిరూపుఁ బాటింప వటపత్రశయనుఁడైన సరోజనయనుఁడాత్మ

తే.గీ. నెట్టు లే బాలభావంబు నెనసి యిచట । నేవిధంబునఁ బుట్టితి నేది ద్రవ్య
మెఱుఁగనని చింతిలం జూచి పరమశక్తి । సర్వ మే నితరములేదు సత్యమిద్ది ॥ ౫౬౮

వ. అనిన ౫౬౯

క. పలుకు విని విష్ణుదేవుఁడు । పలికినవా రెవ్వరంచు బహుభంగులఁ దాఁ
దలఁచి తలఁచి వలపోయఁగ । నెలఁతపలెన్ దేవి యెదుట నిలిచెన్ గరుణన్ ॥ ౫౭౦

ఆ.వె. ముద్దుమోముతోడ మురిపెంపు నగలతో । వన్నెచీరెఁగట్టి కన్నులార్చి
నగలనిండఁదాల్చి మగువలతో మహా । లక్ష్మి చిఱుతనగవు లగ్గుసూపి ॥ ౫౪౧

వ. ఇట్లు తనయెదుట మహాలక్ష్మీరూపంబున విభ్రమంబులు సూపుచు నిలచియున్న దేవిం గాంచి యవ్వటపత్రశాయియగు నారాయణబాలకుం డచ్చరువడి యవ్వర వర్ణిని కనుంగులైతోడఁ జనుదెంచిన శ్రద్ధను, మేధను, రతిని, భూతిని, బుద్ధిని, మతినిఁ, గీర్తిని, స్మృతిని, ధృతిని, స్వధను, స్వాహను, క్షుధను, నిద్రను, దయను, తుష్టిని, పుష్టిని, క్షమను, లజ్జను, జృంభను, తంద్రను, సాయుధల సాభరణల ముక్తామాలికావిరాజితలం గనుఁగొని యీ యేకార్ణవంబున నిట్టివా రెట్లు లుద్భ విల్లిరో నిరాధారులై యెట్లు నిలచిరో యని విస్మయావిష్టహృదయుండై. ౫౪౨

క. ఏ నెట్టుల వటపత్రశ । యానుఁడనై యుంటి నిచట నతివలు వీరల్
రా నెరెట్టులో తెలియదు । నేనూరక యుందుఁగాక నీటఁ దిరుఁగనై ॥ ౫౪౩

వ. అని మఱియు వ్యాసుండు. ౫౪౪

—: దేవీభాగవతోత్పత్తి :—

ఆ.వె. అట్టి విష్ణుఁజూచి యా మహాలక్ష్మి దా । నిట్టులనియె మిగులఁ గృపఁదలంచి
వెఱ్ఱితన మిదేల మఱ్ఱాకుపై నున్న । కుఱ్ఱ జగము జీవగఱ్ఱ దేవి॥ ౫౪౫

క. ఆ శక్తిప్రభావంబున । లేశంబును నన్నెఱుంగలేవైతి జగ
న్నాశముల మరల మరల మ । హేశుఁడవై బహుభవంబు లెత్తుటకతనన్. ౫౪౬

తే.గీ. శక్తి నిర్గుణ లేదందు సందియంబు । మనము సగుణుల మాశక్తి తనదు సత్త్వ
గుణముచే నన్నుఁ బుట్టించెఁ గూర్మి బ్రహ్మ । బుట్టు నీపొక్కిటను జగంబులు సృజింప॥

తే.గీ. అతఁడు రాజసుఁ డతని క్రోధాగ్నివలన । బొమలనడుమను బుట్టు నప్పురహరుండు
తామసినిగూడి లోకప్రతాన మడఁచుఁ । గాన నేవచ్చితిని నిన్నుఁ గలయుటకును ॥

తే.గీ. సమ్మదమ్మున నిమ్మ నీ తొమ్మునాకు । నిమ్మసేసుక యుందు నీ సొమ్మయగుచు
కమ్మవిలుకానికిని జననమ్ముగలుగు । నమ్మ నామాట లివియు నిక్కమ్ములనుచు ॥

వ. అనిన విని ముదితాంతరంగుండై గరుడతురంగుండు, ౫౫౦

తే.గీ. వింటి శ్లోకార్థమొక్కటి విస్ఫుటముగ । నోవరారోహ యెవ్వరి యుక్తియొక్కొ
యారహస్యంబు పరమాద్భుతావహంబు । తెలియఁజెప్పుము నాకు సందియముదీఱ ॥

చ. అది విని లక్ష్మి యిట్లనుఁ బ్రియంబుగ మోమున మొల్కనవ్వు సొం
పొదవఁగ నోచతుర్భుజ । మదుక్తియ యయ్యది వేఱుగాదు మో

క్షద మగునట్టి భాగవతసారము దానిని విస్మరింపఁ గూ
డదు మది రక్షణీయము స్ఫుటంబగు వేదమువంటి దయ్యదే ॥ ౫౮౩

ఉ. నావిని వాసుదేవుఁడు సనాతని నమ్మహనీయలక్ష్మి ని
చ్ఛావశుఁడై యురంబున నజస్రము నిల్వ వరించి మంత్రముల్
భావనఁ బూనియున్నఁ గ్రమభంగి నొకప్పుడు శౌరిపొక్కిటన్
భూవిదితుండు పద్మజుడు పుట్టి సురారుల కాత్మ జంకుచున్॥ ౫౮౪

తే.గీ. హరినిఁ బ్రార్థింప తపము దా నాచరించి । మధుని కైటభుఁ దునుమాడి మాధవుండు
నాత్మ జపియింపఁదొడగె శ్లోకార్థమపుడు । వనజభవుఁ డది జూచి యిట్లనియె హరికి ॥

క. నారాయణ నీకంటెను । వేఱుగ నింకొకడు గలఁడె విశ్వంబున నె
వ్వారిని జపియించెద వీ । వారూఢ దయారసుండవై తెలుపు మిఁకన్ ॥ ౫౮౫

వ. అనిన విని హరి యప్పద్మసూతి కిట్లనియె. ౫౮౬

క. కృతికారణలక్షణసం । గతి నతిమాత్ర మతిశక్తి గలదది మన కు
న్నత మన మామెకుఁ దలపఁగ । నతులము సుతులము హిత ప్రణతులమునుమ్మీ ॥

శా. ఆసర్వేశ్వరి లోకమాతయుఁ ద్రయీవ్యాహారనిర్మాత్రి వి
ద్యాసంశోభిని ముక్తిహేతువు నిరస్తత్రస్తదోషాళి న
న్నీ సర్వంసహ నేలుమంచు నిటఁ గల్పించెన్ విరించీ ! దయన్
జేసెన్ మంత్రము నాకు నిచ్చె నిది నే సేవింపఁగా జెల్లదే. ౫౮౮

వ. అని మధుసూదనుండు సల్కినవిధంబు సెప్పి వ్యాసుఁడు పదంపడి యిట్లనియె ॥ ౫౮౯

క. ఆమంత్రమె భాగవతము । ప్రేమను నే ద్వాపరాది బెరిగించితి ము
న్నా మురమర్దను డజునకుఁ । గామిత మలరంగ జెప్పె గరుణాయుతుడై ॥ ౫౯౦

క. కమలజుడు నారదునకున్ । గ్రమముగ దా బలికె నంతఁ గలహభుజుడు నా
కమితముదంబున దెల్పెన్ । రమణన్ శ్రీభాగవతపురాణోత్తమమున్ ॥ ౫౯౧

ఉ. ఓయి కుమార ! భాగవత మూర్జితపుణ్యము పంచలక్షణం
బాయతనిష్ఠమై జదువుమయ్య సమంచితరీతి జ్ఞానసం
ధాయక మింతకంటెఁ గలదా పదునెన్మిదివేల శ్లోకముల్
నీ యురుబుద్ధి కిద్ది పఠనీయముకాదె తలంచిచూచినన్ ॥ ౫౯౨

సీ. అజ్ఞానమునడంచు నాయువు నెగడించు బ్రజ్ఞానమును బెంచు భాగవతము
పుత్త్రపౌత్త్రులనిచ్చు భూతి వర్ధిలఁజేయు బహుశుభంబుల దెచ్చు భాగవతము
శాంతిదాంతులొసంగు సౌఖ్యదంబై మించు పాపంబుల నడంచు భాగవతము
తేజంబు గల్గించు దివ్యకీర్తి ఘటించు ప్రతిభను గావించు భాగవతము

తే.గీ. పతితపావనచరిత మీ భాగవతము । పరమవైదికమార్గ మీ భాగవతము
పాశములనెల్ల ఖండించు భాగవతము । పఠనచే మోక్షమునొసంగు భాగవతము ॥ ౫౯౩

తే.గీ. సాటి శిష్యుండు లోమహర్షణసుతుండు । వీఁడు నీవునుఁ జదువుండు కూడి మిగుల
వేడుకలరంగ నే జెప్పు విధము దెలిసి । పంచలక్షణమైన యీ భాగవతము ॥ ౫౯౪

వ. అని చెప్పి సూతుండు శౌనకాది మహామునులకు మఱియు నిట్లనియె. ౫౯౫

క. నేనును శుకుడును మహితా । నూననియమముల వహించి యొప్పగ నమిత
జ్ఞానదమగు భాగవతము । పూని పఠించితిమి సర్వమును మునులారా ! ॥ ౫౯౬

ఆ.వె. చదివి చదివి శుకుడు సంగవాంఛ నడంచి । కర్మధర్మములను గలయబోక
బ్రహ్మకొడుకుఁబోలె బాహ్యాంతరమ్ముల । మఱచి వ్యాసు నాశ్రమమున నుండె ॥ ౫౯౭

క. తినఁ డెక్కువ యుపవాసం । బును జేయం డింద్రియముల మోసమెఱిగి యి
చ్చను బోనీఁ డాత్మజ్ఞత । ఘనుడై గణనీయ యోగికరణిం దిరుగున్ ॥ ౫౯౮

వ. ఇట్లత్యంత చింతాభరంబునం దిరుగు శుకునింగాంచి వ్యాసుం డిట్లనియె. ౫౯౯

మత్తకోకిల. ఇంతచింత మనంబునందు వహింపనేటికి బాలకా
సంతసంబుననుండి జ్ఞానవిచారమేటికిఁ జేయ నీ
వంతఁ గుందెద వెప్పు సూచిన వద్దు వద్దు బుణవ్యధా
వంతు రీతిని నిన్నుఁ జూచినవారు జాలిని దూలగన్ ॥ ౬౦౦

తే.గీ. నేను చెప్పిన మాటల నీకు శాంతి । గలుగదేనియు మిధిలా నగరమునందు
జనకరాజర్షి గలఁడు వే చనుము పుత్త్రి । ధర్మపరుఁ డాతఁ డెఱిగించుఁ తత్త్వమెల్ల ॥

ఉ. ఆ జనకుండు యోగరతుఁ డద్భుతతత్త్వవివేకశాలి యే
యోజఁ దలంచినం బ్రతికియుండియు ముక్తుఁడు నీకుఁ దెల్పు న
వ్యాజకృపామతిన్ సకలవర్ణవిభాగము లాశ్రమస్థితుల్
వేఁ జనుమంచుఁ బల్కి విని విస్మయమంది శుకుండు దానమున్ ॥ ౬౦౨

తే.గీ. తండ్రి వింతాయె నాకు నింతయును విన్న। జనకరాజర్షి రాజ్యంబు సల్పుచుండె
జ్ఞానియై ముక్తుఁడై యుండగలఁడె వాని । మహిమ మరయంగ నాకును మనసుపుట్టు ॥

క. తినినది తిననిది యెట్లగు । వినినది విననిదగు నెట్లు వేడుకతోడన్
గనినది కననిది యెట్లగు । ననినది ననవిదియు నెట్టులగు నా తండ్రీ ।

క. తల్లియనియుఁ గొడుకనియును। బిల్లయనియుఁ దమ్ములనియుఁ బెండ్లామనియున్
జెల్లెలనియుఁ గులటయనియు । జెల్లునె భేదములు జ్ఞానశీలుర కెందున్ ॥ ౬౦౪

క. వగరవియుఁ గారమనియును । దగమధురంబనియుఁ దీక్ష్ణ తాగం బనియుఙ్
మిగులంగాఁ జేదనియును । వగనుప్పనియును దెలియక వర్తిల వశమే ॥ ౨౦౭

క. ఇది చల్లని దిది వేఁడిది । యిది మంచిది యిదియుఁ జెడ్డ దిది కూడదటం
చద నెఱుఁగక సంసారము । కుదురుగ నెట్టంగఁ గలదె కోవిదుఁడగుచున్ ॥ ౨౦౮

తే.గీ. వీఁడు మిత్రుండు వీఁడు నా ద్వేషి వీనిఁ । బ్రోవఁదగు వీని శిక్షింపఁ బోలు ననెడి
మది యొకింతయు లేక యెమ్మాడ్కినతఁడు।రాజ్యమొనరించునొక్కొ యబ్రంబు కాదె ॥

తే.గీ. సర్వసమదర్శనుండగు జాడయెట్లు । వీఁడు చోరుండు వీఁడు పవిత్రమౌని
యనుచుఁ బరికింప కెట్లు పాలన మొనర్చు।ముక్తుఁడగుటకు సంసారి శక్తుడగునె ॥ ౨౦౯

వ. అని శుకుండు మిథిలా ప్రయాణంబు సేసెనని చెప్పి సూతుండు శౌనకాదుల కిట్లనియె.

తే.గీ. అని వచించి శుకుండప్డు వ్యాసమౌని । యంఘ్రులకును నమస్కార మాచరించి
కేలు మోడిచి గురుభక్తి గీలుకొనఁగ । నిట్టులని పల్కె సంతసం బుట్టిపడఁగ ॥ ౨౧౧

—: శుకుండు మిథిలాగమనంబు సేయుట :—

చ. జనకమహర్షి యేలుబడి చాలఁ బ్రసిద్ధి వహించి మించి మేల్
గను మిథిలా పురంబునకుఁ గ్రచ్చఱ నేగెద నీ యనుజ్ఞ గై
కొని యది చిత్రమయ్యె జనకుండును దండము లేక భూతలం
బు నెటులు బ్రోచునో నయము పోవదె దండము లేక యుండినఙ్ ॥ ౨౧౨

ఆ.వె. ధర్మకారణంబు దండంబయనుచు మ । న్వాదులైన ధర్మ వేదులనిరి
జనకుఁ డెట్టి మహిమఁ గొని చేయునో భూమి । పాలనంబు తెలియఁజాలఁ దండ్రి ॥

క. తనుఁ గన్న తల్లి గొడ్రాలనినట్లే యున్న దిది మహాద్భుత మయ్యెఙ్
గనఁ దలతు జనక భూజా । నిని ననుఁ బంపుము మునీంద్ర నియమాతంద్రా ॥ ౨౧౪

ఉ. నావిని వ్యాసమౌని కుల నాథుఁడు బిడ్డనుఁ గౌగలించి నే
దీవన లిత్తు నీకనుచు దివ్యవచోవిభవంబునం జిరం
జీవ సుఖీభవ ప్రశమ చింతన హే శుక యంచుఁ బల్కుచుఙ్
నీ విఁకఁ బొమ్ము పోయెదవు నీవు సరే యొక బాస గోరెదఙ్ ॥ ౨౧౫

క. అబాస యేది యనినఙ్ । బాబూ నీ వచటనుండి పరభూములకుఙ్
బోఁబోకుము మరలం గా । రాబమున మదాశ్రమము నొరఙ్ వలయుఁజూమీ ॥ ౨౧౬

ఆ.వె. చిన్న బిడ్డ నీదు చిన్నారి నెమ్మోము । కన్నులారఁ జూచు కొన్నఁజాలు
నిన్నుఁ జూడకున్న నిల్చునే ప్రాణముల్। తన్నుకొనవె మిన్ను మన్నుఁగనక ॥ ౨౧౭

ఆ.వె. నన్నుఁ ద్వద్వియోగ ఖిన్నుఁజూడుము నాకు । పన్నెవాసిఁ దెచ్చు వాఁడవైన
నెన్నటికిని భేద మొన్నంగఁబోకు నా । యన్న వేదపఠన మున్నదికద ॥ ౨౧౮

క. అని పలికిన తండ్రికి వం । దనమును గావించి మఱి ప్రదక్షిణముగఁ దాఁ
జని చనియెన్ విలువిడిచిన । సునిసితబాణంబు వోలె శుకుఁడు మిథిలకున్ ॥ ౨౧౯

చ. చని చని మౌనిబిడ్డ తరుజాలవిశాలవనప్రదేశముల్
కనికని తప్యమానముని గమ్య గుహావళి విశ్రమస్థితుల్
గొనికొని యాజకప్రతతి క్రుమ్మఱుచోటుల వేదనాదముల్
వినివిని యచ్చటచ్చటను వింతమతంబులవారి నవ్వుచున్ ॥ ౨౨౦

తే.గీ. ఆ మహామతి వర్షద్వయమున మేరు । వవల హాయనమునకు హిమాచలంబు
దాటి మిధిలాపురంబు మధ్యంబు సేర । నచటఁ గావలియున్న వాండ్రడ్డగించి ॥ ౨౨౧

వ. ద్వారపాలకు లెదుర్కొని నీవెవ్వండవు నీ వేల వచ్చితివి? ౨౨౨

క. అను పల్కును విని శుకుఁ । డత్యనఘుఁడు నగరంబుద్వార మవ్వలదరి నే
మనక మఱుమాట సెప్పక । పనిఁ గొని తనలోన తాన పకపక నగియెన్ ॥ ౨౨౩

వ. అది కని ప్రతీహారుండు. ౨౨౪

తే.గీ. మూఁగవా మాటలాడవు మునికిశోర । యూరకే రారు మీవంటి వారలెందు
నరపతి యనుజ్ఞలేనిదీ నగరుసొరఁగఁ । జాల రజ్ఞాత కులధర్మ శీలురనఘ ॥ ౨౨౫

తే.గీ. భాసమానముఖప్రభా పటలికేక।వెట్టు బ్రాహ్మణుఁడవు వేద విత్తముఁడవు
నీవనుచుఁ గులకార్యంబు లేవిధములొ।తెలుపుమీ శంకలేదు యథేచ్ఛఁజనుమి ॥ ౨౨౬

వ. అనిన. ౨౨౭

తే.గీ. ఓయి ప్రతిహార! నీ మాట యొకటెచాలు । వాకిటనె నమకూఱె నే వచ్చినపని
యేమని వచించెదో విను మీ విదేహ । పత్తనము సొచ్చుటది దుర్లభంబ యంటి ॥ ౨౨౮

వ. అని శుకుండు తనలో ౨౨౯

శా. ఆహా యెంతటి వెఱ్ఱినైతి సురశైలాయామముం గొల్చి శీ
తాహార్యంబును దాటి కాల్నడ విదేహద్వారముం జేరితిన్
మోహావేశము తండ్రిమాటవలనన్ ముంచెంగదా నన్ను వి
ద్రోహిస్వాంతతమండనైతి నెవనిం దూషింతు నాకర్మమే ॥ ౨౩౦

చ. ధనమును గోరి లోకమునఁ దాఁ దిరుగుం బురుషుండు నాకు లే
దనయము నట్టి యాశ నది యట్లయినం భ్రమ మావహించి యిం
దున కరుదేరనయ్యెఁ గడు దూరమునుండియు మేరువేడ యా
జనకుని మేడ యేడ ఫల సంగతి యేమి హుళిక్కి యింతయున్ ॥ ౨౩౧

క. ప్రారబ్ధమైనకర్మం । బెరికి శుభమేని నశుభమేని కుడువకే
తీఱునె పౌరుష మది యే । దారి నడచు నరుఁడు నట్టి దారిన పోవున్ ॥ ౬౩౨

తే.గీ. పుణ్యమా పురుషార్థమా భూరితీర్థ । వాసమా యేలవచ్చితి మోసమాయె
మీఁదుమిక్కిలి నృపతియై మిథిలనేలు । స్వామిదర్శనమే నా కసాధ్యమాయె ॥ ౬౩౩

వ. అని శుకుండు మాటలాడకయున్నం గాంచి ప్రతీహారుం డతఁ డతిమాత్రజ్ఞాన శీలుండని యెఱింగి సామవచనంబుల నిట్లనియె. ౬౩౪

క. నీ పని గల్గినచోటికిఁ । బాపరహితశాంతచిత్త పావనమూర్తీ
పోఁబొమ్మిఁక నాపై మది । గోపింపకు మయ్య కరుణ గోరెదనయ్యా ॥ ౬౩౫

వ. అనుఁడు శుకుండు ౬౩౬

మ. నిను దూషింపఁగ నేమిచేసితి వయో నింద్యంబు రాజాజ్ఞఁ గై
కొని వర్తింపఁగ భృత్యధర్మమకదా కూర్మి న్ననుం గాంచి తీ
వును నిచ్చోట నృపాజ్ఞఁజేసి యతఁడున్ బూజ్యుండగున్ నేను చే
సినదే దోషము లాఁతివారిగృహముల్ సేరంగ నింద్యంబకా ॥ ౬౩౭

వ. అనుడుం బ్రతీహారుండు. ౬౩౮

క. పొనరెడి సుఖమును దుఃఖము । నన నెవ్వి సుఖంబుకొఱకునై నరుఁ డేయే
పను లొనరింపంగావలె । ననఘా ! హితుఁ డెవ్వఁ డింక నహితుండెవఁడో ॥ ౬౩౯

వ. అనిన విని యత్యహర్ష సమేతుండై శుకమహర్షి యిట్లనియె. ౬౪౦

సీ. సర్వలోకములందు జనులెల్ల రెండు విధాలవారని యాత్మఁ దలపవలయు
నందుఁ గొందఱు రాగు లన్యులును విరాగులై యుందు రెప్పుడు నందు రాగి
మూర్ఖచతురభేదముల ద్వివిధుండగు చతురుండు ద్వివిధుండు శాస్త్రమతుల
విను విరాగియును ద్రివిధుఁడు జ్ఞాతాజ్ఞాత మధ్యమభేద విమర్శనమున

తే.గీ. మతిజచాతుర్యమది రెండు మార్గములగు।యుత్తము నయుత్తమునునన నుర్వియందు
దీనిఁ దెలియుము విశ్చలజ్ఞానమహిమఁ।జెప్పితిని నీకు నాకు దోఁచిన విధమున ॥ ౬౪౧

వ. అనినం బ్రతీహారుం డయ్యా మీరు సెప్పిన యది నాకు బుద్ధిగోచరంబు కాకున్న యది వివరించి విశదీకరింపవే నావుఁడు విని శుకుండు మఱియు నిట్లనియె. ౬౪౨

క. రాగమనఁగ సంసారపు । భోగమునం దిచ్ఛ దానిఁ బొందిన నరునిన్
గ్రాగించు దుఃఖసంతతి । సాగరమునఁ బడినవాని చందంబ యగున్ ॥ ౬౪౩

ఆ.వె. ధనము గలుగకున్న దారిద్ర్యదుఃఖంబు । ధనము గలిగెనేని దాచవగపు
దారలేకయున్న దర్పక దుఃఖంబు । దారగలిగియున్నఁ దనుపనేడ్పు ॥ ౬౪౪

తే.గీ. రాగులందునుఁ జతురుండు బాగునొందు । మూర్ఖుఁడగుమానవుండెప్డు మోహమందు
సుఖము దోపించు మిత్రుండు సుఖమునకును । విఘ్న మొనరించు శత్రుండు వినుము దీని॥

వ. విరక్తునకు సుఖం బేకాంత సేవనంబును, ఆత్మాను చింతనంబును, వేదాంత విచారంబును
నని యందురు సంసార కథనాదికంబు విరక్తులపాలిటి దుఃఖంబయగు జ్ఞానులగువారికి
శత్రువు లనేకులు వారెవ్వరనిన. ౬౪౭

క. కామము క్రోధము లోభం । బామోహము మొదలుగాగ నరులగుదురు వా
రే మెయి నర్హులకారే । భూమిసుఖముఁ గోరునట్టి మునివర్యులకున్ ॥ ౬౪౮

తే.గీ. అనినవిని శుకుజ్ఞానిగా నాత్మఁదఁలచి । విడిచె నా కక్ష్యనుండి వివేక ఘనుని
విదప నభ్యంతరము సేరి సదమలాయ । తోన్నతంబైన నగరంబు నొప్పసూచి॥ ౬౪౯

సీ. నానాజనప్రీణ నానాదరణహీన వానాద జనవితానంబుసూచి
భోగాతురాశ్రయా భోగాలయలసన్న భోగామి సౌధాగ్రములను జూచి
ఆశాపిశాచమా యాశాలి దృష్టసర్వాశావిశేష రథ్యలను జూచి
వారాంగనాజన వారాంగగణవాను వారాంగి మదనభావములుసూచి

తే.గీ. చనిచని శుకుండు లోపలి సదనమునకుఁ । జేరియచ్చటి ప్రతిహారుచే నివారి
తుండగుచు మోక్ష చింతతో నుండె నొదలు । మఱచి స్థాణువువలె నొక్కమాట లేక॥

క. అంతట జనకమహీశ్వరు । మంతిరి దావచ్చి మంచి మాటలనో ధీ
మంతుఁడ రమ్మని పలికిన । సంతసమున శుకుఁడు రాజసదనము సొచ్చెన్ ॥ ౬౫౦

వ. ఆ దివ్యతపోనిధికి నమ్మంత్రిచంద్రుండు రాజసదన సమీప విష్కుటంబుంజూపి యతిథి
సత్కారంబు లొనరించి రాజదర్శనంబునకై కొంపోవుచుండ. ౬౫౧

సీ. వాలారుచూపుల వగలువడ్డికిఁబార శుకముఖంబులు చెక్కులకు నమర్చి
కదలు వాతెఱకెంపు కాంతి గంతులు పైన షడ్జాదికముగాఁగ స్వరముఁ బాడి
గిలుకు టందియ గజ్జె యులిపువాదోడుగా ధ్రువముఖంబులను బల్లవులమర్చి
యడుగుఁదమ్ము సొంపుఁ బెడఁగులలొదలునింద మెల్లమెల్లన జతుల్ మేళగించి

తే.గీ. పసదనంబుల శృంగార రసములొలుక । సరిగకుచ్చెళ్లు మీఁగాళ్ళ సరిదికొనఁగ
భావరాగాధిగతతాళ పక్కినెఱిఁగి । వెలవెలందులు నటనముల్ సలిపిరచట॥ ౬౫౨

చ. శుకబుషి సేవసల్పమనసుల్కల యవ్వెలయాంద్రఁ గాంచి వే
డుక నృపమంత్రి మౌనికిఁ గడుఁజ భ్రమదంబు ఘటింపఁ డంచు వా
రికి సెలవిచ్చి తాఁ జనియెఁ బ్రీతి మెయిఁజ సుదతు ల్సత్రా ర్తలై
తకధెయి యండు నాడిరి విదారితకాముక హృత్కవాటలై ॥ ౬౫౩

సీ. మదనార్తలము మేము మన్నించుమని పల్క తనలోనను శివోహ మనుచుఁ బలుకు
నీగుణంబులు మమ్మ నిలువనీవనిపల్క నిర్గుణోహమ్మని నియతిఁ బలుకుఁ
ద్వద్ధీర మా సహవాస మభ్రమటన్న విని యద్వితీయోహ మనుచుఁ బలుకు
నీఠీవి మైఁజూచి యెట్లు తాళెదమన్న బ్రహ్మహమస్మియఁజా పలుకుఁ బలుకు
తే.గీ. నెద్దెమనఁ దెద్దెమనినట్టు లివ్విధాన। దారువోయినదారిని వారు దాను
బోవుమార్గంబునను దాను బోవఁదొడగె। వికటముగవ్యాసమునికుమారకుఁడు శుకుఁడు ॥
మ. మహితజ్ఞానమయుండు వ్యాసుకొడు కాత్మారాముఁ డీతండు ని
ర్వహణం బింతయుఁ గల్గునే మదనదేవప్రక్రియాకృష్టికొ
నహహా యంచును విస్మయంపడుచు వా రాంభోజనేత్రల్ చనఁ
విహితాంఘ్రిద్వయ శౌచుఁడై కుశలు పాణింబూని వార్చెఁజా వెసఁజా ॥ ౬౫౫
వ. శుకుండు. ౬౫౬
తే.గీ. ధ్యాన మొకజాము గావించి తపసిబిడ్డ। రెండుజాములు నిదురలో నుండి పిదప
జాము జపియించి తెలవారు జాలలేచి। కాల్యములు దీర్చికొని నిర్వికారలీల ॥ ౬౫౭
వ. సమాహితచిత్తుండై యుండ ౬౫౮
తే.గీ. శుకునిరాకను జనకరాజు విని మిగుల। శుచిగలిగి మంత్రులంగూడి శుభకరునిఁ బు
రోహితుని ముందు నిడుకొని రూఢి నెదురు। వచ్చి తోడ్కొని చని పీఠమిచ్చి పిదప ॥
తే.గీ. కుశలమడిగి పయస్విని గోవునిచ్చి। చక్కఁగూర్చుండఁజేసిన నెక్కుడైన
ప్రీతి జనకుని క్షేమంబు పేర్మినడిగి। యున్న శుకుఁ జూచి పలికె రాజోత్తముండు ॥
ఆ.వె. ఓ మహానుభావ యోమునికులచంద్ర। నిస్పృహుండవనుచు నినుఁ దలంతు
నన్నుఁ జూడనేల నాపీడు సొరనేల। కార్యమేమి నీకుఁ గలదు చెపుమ ॥ ౬౬౧

## —: శుకజనక సంవాదము :—

వ. అని విని జనకధరాజానికి మునిబాలకుం డిట్లనియె. ౬౬౨
క. మాతండ్రి నాకుఁ జెప్పిన। నీతులు నేనన్నవిధము నీ కెఱిఁగింతుఁజా
జేతోముదమున వినుమీ। యేతీరునమందు నేను గృతకృత్యుఁడనై ॥ ౬౬౩
ఆ.వె. అన్ని యాశ్రమంబులందు గృహస్థాశ్ర। మంబు మంచిదది సమంచితంబు
విడియమేల బిడ్డ పెండ్లాడు పెండ్లాడు। తడయవలదటంచు నుడివె దండ్రి ॥ ౬౬౪
ఆ.వె. నాకు వలదు పెండ్లి నాయనా పెండ్లాము। మెడకు గట్టునట్టి పెద్దబండ
కొట్టి కొట్ట నేల కాలి సంకిలి నాకు। ననుచుఁ బలుకఁ దండ్రి యనియె నిట్లు ॥ ౬౬౫

చ. చనుము విదేహు నొద్దకు విచారపరుం డఖిలైకవేది యా
జనవరుఁ డాత్మబోధమునఁ జాలిన వాఁడు నిరర్గళ స్థితిన్
మనుచు భువిన్ సజీవుఁడయి మానిత ముక్తినిఁ గన్నవాఁడు నీ
కనుపమ వృత్తిఁ జూపునతఁ డానతి యిచ్చిన త్రోవఁ బోఁదగున్ ॥ ౬౬౭

క. అనిన విని విస్మితుఁడనై । చనుదెంచిన వాఁడ నిటకు జననాయక నా
కును దెల్పు మోక్షమార్గం । బనినన్ జనకుండు శుకున కనియెన్ బ్రీతిన్ ॥ ౬౬౮

సీ. విను మునిబాలక విప్రుండు మోక్షార్థి యగునేని బ్రహ్మచర్యాశ్రమమ్ము
నందుండి వేదవేదాంతము ల్పఠియించి గురుదక్షిణ నొసంగి పరమనిష్ఠ
నమరి సమావర్తనము చేసుకొని పెండ్లియాడి చక్కని భార్యఁ గూడి న్యాయ
వృత్తిని బ్రతుకుచు వీతిహోత్రుని మెప్పు సలిపి దయా సత్య శౌచములను

తే.గీ. విడక పుత్త్రులఁ బౌత్త్రులఁ బడసి పిదప । కాననం బాశ్రయించి నిష్కాముఁడగుచు
వెనుకఁ దనయాత్మయం దగ్నులను వహించి । పుణ్యసన్న్యాసి భావంబు పూనవలయు ॥

క. వైరాగ్యము లేకుండిన । వారలు సన్న్యాసులమని వర్తించినచోఁ
బేరునకె గాక మోక్ష వి । చారమునకుఁ గాదు సుమ్ము సంయమిచంద్రా ॥ ౬౬౯

తే.గీ. వేదములయందుఁ జెప్పిన విధులఁబట్టి । నలుఁబదెన్మిది సంస్కారములు గదయ్య
యందు నలుఁబది యొప్పు గృహస్థునకును । నెందుజూచిన సన్న్యాసి కెనిమిదయ్యె ॥

తే.గీ. శమదమాదులయవిసుమ్ము జగమునందు । నాశ్రమమునుండి యాశ్రమం బందవలయు
దీనిఁ దెలసిన మోక్షంబు మానకబ్బు । సంయమికుమార యొందు విచార మేల ॥ ౬౭౧

వ. అనిన విని యొక్కింత దడవు తనలో విచారించి పరమవైరాగ్యశీలుండైన మునిబాలుండు
జనక భూపాలున కిట్లనియె. ౬౭౨

తే.గీ. హృదయసీమను వైరాగ్య మిమిడినపుడు । జ్ఞానమనునది చక్కఁగా గలిగినపుడు
శమదమాదులు క్రమలీల జరుగునపుడు । పృథివిలోఁ దప్పదో పెండ్లి పెద్దగొండ్లి ॥ ౬౭౩

వ. అనిన జనకుండిట్లనియె. ఓ మునికుమారా! యింద్రియంబులు బలిష్ఠంబులు, వాని లోఁబరచుకొనుట కష్టసాధ్యంబు. అపక్వంబులై యవి యనేక వికారంబులు సేయుచుండు నవి యెట్టివియన భోజనేచ్ఛయు, సుఖేచ్ఛయుఁ, బుత్రేచ్ఛ మొదలగునవియ యని యెఱుంగుము. అవి యతికిం గలిగెనేని యెట్లు సమకూరు? సమకూరకున్న గాంక్షశాంతి యెట్లు? కావున నింద్రియేచ్ఛా శమనంబునకుంగాఁ గ్రమ క్రమంబుగ నాశ్రమంబునుండి యాశ్రమంబున కెక్కవలయు నెట్లనిన, పిపీలికావృక్ష శాఖారోహణన్యాయంబు నవలంబింపందగు లేకున్న భ్రాంతి వాటిల్లు, మనుజుని మనంబు దొంగగొడ్డు వంటిది. సులభంబుగ వశంబుగాదు. క్రమాభ్యాసంబున వశంబుఁజేసుకొనుట పరమోపాయంబు.

నరుఁడు గృహస్థుండై యుండియు శాంతుండై నిస్పృహుండై శీతోష్ణంబుల నేకరీతి సహించుచు నిజకర్మోపాత్తలాభంబునకుఁ దృప్తుండగుచు నాశాపిశాచంబుపాలుగాక మెలఁగెనేని వాఁడె జీవన్ముక్తుండగు నిందున కేన యుదాహరణభూతుండ. మరియు విను మో బ్రాహ్మణకుమారోత్తమా సుఖదుఃఖంబులకుం గారణంబైనది మనంబకదా మనంబు నడంపంగలుగు వాఁడె ముక్తుం డింతియె గాక. ౬౪౪

క. సందేహమేల యోముని । బందవ బంధనము మోక్షణంబునుఁ జూడన్
డెందము వలనన కలుగున్ । డెందము వడియడగ నలజడింబడ డెందున్ ॥ ౬౪౫

క. మనసే సుఖముల జేయున్ మనసే దుఃఖములఁ జేయు మనుజులకెల్లన్
మనసే బంధముసుమ్మీ । మనసే మోక్షంబునకును మార్గము తలఁపన్ ॥ ౬౪౬

ఆ.వె. వీఁడు శత్రుఁడంచు వీఁడు మిత్రుండంచు । దలచుటెల్ల మనసు వలనగాదె
ద్వైతబుద్ధి భిన్నధర్మంబు చూపు న । ద్వైతబుద్ధి భేద వార్తఁగనదు ॥ ౬౪౭

సీ. ఆత్మజ్ఞ యేకమేవాద్వితీయంబ్రహ్మ యను తత్త్వమెరిగి నే ననుసరింతు
సంసారమున భేద సంఖ్య లేర్పడఁజూచునంతకాలము బంధ మమరియుండు
భేదమెచ్చటలేదు లేదు లేదనునాడు బంధవిచ్ఛేదంబు బడయవచ్చు
నొరది భేదములేనిచో బంధమునులేదు నెరినెండ లేకున్న నీడయున్నె

తే.గీ. పురుష దజ్ఞానమును బోవమొత్తెనేని । సహజసుజ్ఞానమున మనశ్శాంతిఁగలిగి
సకలమును బ్రహ్మమని చూచి చలుడుగాక । పూనిసంసారియయ్యును ముక్తిబడయు ॥ ౬౪౮

తే.గీ. వేదవిహితక్రియాదులు వివిధ ధర్మ । వృత్తులవి మానరాదన్య వృత్తిబూన
రాదు లోకార్థమెందు కీబాధయనినఁ । బరమ పాషండునకు ముక్తిపథమునున్న ॥ ౬౪౯

వ. అనిన విని శుకుం డిట్లనియె. ౬౫౦

తే.గీ. అయ్యయో వేదములు హింసకాదికారణములు మోక్షంబు నీనమర్థములె చెపుమ
కన ననాచార భూయిష్ఠ మనగ నొప్పు। సోమపానంబు దలపవచ్చునె మునీంద్ర ॥ ౬౫౧

తే.గీ. పశువుఁగోయుట మాంసంబు భక్షణంబు । సేయుట సురనుఁ ద్రావుట హేయమైన
జూదమాడుట గూడునంచును వచించు । నట్టి సౌత్రామణివి నమ్మనర్హ మగునె ॥ ౬౫౨

క. మును శశిబిందుండనియెడి । జననాథుఁ దనేక యజనశాలి యగుచు ధ
ర్మనిరతి ననేక దక్షిణ । లను భూసురులకు నొసంగె లలితవిభూతిన్ ॥ ౬౫౩

తే.గీ. చర్మములు పేరి పర్వత సమములయ్యె । నమితమేధోదకప్లావనమునఁజేసి
యొనరఁ జర్మణ్వతీనది యుదితమయ్యెఁ । బేరువహించె భువి శశిబిందు దనవు ॥ ౬౫౪

తే.గీ. అంతవాఁడును స్వర్గంబు నందయుండె । భూమి నాతని పేరు విస్ఫూర్తిగాంచె
ముక్తి లేదాయె ఫలమేమి భూమహేంద్ర । వేదములు భేదములు నేను వినను వినను ॥

వ. అనిన విని జనకుండు. ౬౨౬

తే.గీ. యజ్ఞములయందు హింస ప్రత్యక్షమరయ । నదివిచారించిచూడ నుపాధియోగ
మహిమనే నిరుపాధిక మతిఁ బొసంగ । హింసగాదుసుమీ ముని హంసవర్య ॥ ౬౨౭

క. తడిగలకట్టియ లిడినన్ । వెడలుం బొగ యగ్నియందు వివరింపగ న
త్తడికట్టెదివిచిన దిగం । బడు హింసకు రాగమే యుపాధి తలంపఁగా ॥ ౬౨౮

ఉ. రాగముతోడఁ గర్మమొనరంగ నొనర్చిన హింసయేయగుఁగా
రాగములేక చేసినఁ దిరంబుగ నయ్యది హింసగాదుసూ
త్యాగమటంద్రు భోగమున కందదు ముక్తికి హేతు విద్ది యే
రాగము లేనివాఁడు మహి రాజ్యముఁ జేసిన నేమి తాపసా ॥ ౬౨౯

వ. అనిన విని పరమాశ్చర్యమునొంది సందేహంబు విడక శుకుండు మెల్లమెల్లన నన్నర
పాలున కిట్లనియె. ౬౩౦

సీ. భూనాథ నామనంబున సందియముఁదోచె మాయలో నిస్పృహ మహిమయెట్లు
జనపాల తా నెన్ని శాస్త్రము ల్చదివిన మోహంబులో నెట్లు మోక్షమబ్బు
క్ష్మాజాని యెట్టి యాగములు గావించిన తమములో నెట్లు జ్ఞానముఘటించు
ద్రోహచింతనలకుఁ దొలఁగవలయుఁగదా సదనంబులో నెట్లు శాంతిగలుగు

తే.గీ. ఈషణంబులచేతఁ దా నీడ్వఁబడుచు । బంధములు లేక భూమిపై బ్రతుకుటెట్లు
కాంక్ష లొగిఁగయ్యమునకునుఁ గాలుద్రువ్వ । మించియెదిరించిమనసు జయించుటెట్లు॥

ఉ. దొంగను వీఁడు దొంగయని దూరెదు తాపసుఁ దాపసుండటం
చుం గడుఁ గారవించెదవు చూడఁగ నీకును భేదబుద్ధి దా
చంగులు దాటుచున్నయది సర్వము బ్రహ్మమటంచు నెంచి ము
క్తిం గనలేనివాఁడవు విదేహుఁడ వెట్లయితో వచింపుమీ ॥ ౬౩౨

తే.గీ. నిద్ర జాగ్రత్తు స్వప్నంబు నీకుఁగలవు । సుగుణమణిభూషణ తురీయ మగు నవస్థ
నీకునేగతిఁ బ్రాపించు నిక్కువముగ । నాకు నెఱిఁగింపుమయ్య యానంద మొదవ ॥

చ. కలవు మహాగజంబులని కొల్పలము గ్గలవంచు గుఱ్ఱముల్
కలవని తేరులుం గలవు కాంచనముం గల దింతు లెంద రేఁ
గలరు తనూజవర్గమునుఁ గాంచితి భూమికి స్వామినైతి నం
చలరెడి నీకు శాంతికలదా యిఁక ముక్తికి హేతువేదొకో ॥ ౬౩౪

తే.గీ. ధనము లెక్కించుకొను నీకు । జనవరేణ్య యిటికపెల్లను బైడి నొక్కటిగఁ జూచు
నట్టి సమదర్శనం బెట్టు లబ్బునొక్కొ । వింటి నే నిప్పు డొక గొప్ప వింతకాక ॥ ౨౯౨

వ. అని మఱియు శుకుండు జనకజనవరేణ్యా । నామనం బొక్కింతయు గృహదారాదుల
యందుఁ బ్రీతియిడదు నిస్పృహుండనై యేకాకినై నిస్సంగుడనై యహంకార మమకార
రహితుండనై నిర్ద్వంద్వుండనై నిష్పరిగ్రహుండనై ప్రవర్తింప నిచ్ఛయింతు నని పలికి
వెండియు. ౨౯౩

క. బైరాగిననుచుఁ జిత్తవి।కారంబులఁ బడని నాకుఁ గడుసుందరియౌ
నారీరత్నంబేటికి । నూరేటికి విత్తమేటి కుర్వీనాథా ॥ ౨౯౪

శా. నానారాగసమాకులంబయిన చింతావార్ధిలో మున్గి భా
షానైపుణ్యము నాదయంచు సకలాశాపాలనై కాశతో
మానక్రోధమదాదులం గలసి యిమ్మాడ్కిన్ విదేహుండ నం
చీ వీ దంభము కానవచ్చె నిజమా యీ వింతలం గంటిమా ॥ ౨౯౫

క. పగతురు దండెత్తిరనుచు । బొగిలెదు విత్తంబులేదు బొక్కసమున నం
చుఁ గడుం జింతించెదు నీ । కగునే నిశ్చింతతావహము భూనాథా ॥ ౨౯౬

ఆ.వె. జగ మసత్యమనుచు సర్వదా తెలిసియు । బెట్టనోము లెల్ల పట్టి నోమి
తిండి మాని యడవిఁ దిరిగి వైఖానసుల్ । గడవలేరు మోహజలధి జనక ॥ ౩౦౦

క. భూతలనాథ భవత్కుల।జాతులను విదేహులంద్రు జను లది మృతకో
శాతకి వంటిది సుమ్మని । నీతి దెలియవలయుఁగాక నిక్కముకలదే ॥ ౩౦౧

సీ. విద్యాధరాభిఖ్య వెలయడే మూర్ఖుండు పేర లక్ష్మీశుండు పేదగాడె
యల దివాకరుఁడు జన్మాంధుండు లేడొక్కొ నీ వంశమున దొంటి నృపతు లెల్ల
మహిని విదేహనామము గలవారంచు వినుచుంటిఁ గాక సద్వృత్తి వలన
బేరుఁ గాంచినవారు కారుసుమా నీవు మది భ్రాంతిపడనేల మనుజనాథ

తే.గీ. మున్ను మీవంశకర్తయైయున్న నిమిమ।హీశ్వరుఁడు యజ్ఞమును జేయ నెదదలంచి
యా వశిష్ఠు నిమంత్రణం బాచరింప । నతఁడు సురపతిచే నిమంత్రితుఁడనైతి ॥ ౩౦౨

వ. అని పలికి తాను దేవేంద్రుని మఖంబు పూర్ణంబైన పిమ్మట నీ యజ్ఞంబునకు వచ్చెద
నంతవట్టు మెల్లమెల్లన యజ్ఞార్థసంభారంబులు సంపాదించుకొనుచుండుమని చనిన నా రాజ
శేఖరుం డింకొక్కరు నిమంత్రణంబు సేసికొని యాగంబు జేసినం గోపించి యవ్వసిష్ఠుండు
నీ శరీరంబు పడిపోవుంగాక యని శపించిన నిమి కోపించి యవ్వసిష్ఠునకు నట్టిదయగు
శాపంబొసంగె నదికారణంబున నాటంగోలె నిమికుల సంభవులకు విదేహు లను పేరు
వచ్చెనని వింటి. ౩౦౩

క. మనుజేంద్ర విదేహుండగు । జనవరు డాచార్యు నెట్లు శపియించునొకో
కన గన నిదియు వినోదం । బని నే డెందమున దలతు నహహా వింతల్ ॥ ౪౦౪

వ. అనిన విని జనకుండిట్లనియె. ౪౦౫

ఉ. సత్యము సెప్పితీవు విరసంబని నేఁ దలపోయ నిందులో
వ్యత్యయ మింతలే దిదియయైనను నావచనంబు తాపసా
సత్యమ పథ్యమంచు నిరపాయత నెంచిన నీకు క్షేమమౌ
కృత్యము లిట్టివంచుఁ బరికింపకు చిత్తము గట్టిచేసినన్ ॥ ౪౦౬

ఆ.వె. కన్నతండ్రి పొందు కడఁద్రోచి యడవుల । కేగువాఁడనంచు నెంచితీవు
చింతసేయుమయ్య చిత్తంబునను దండ్రి । పొందు మేలొ పులుల పొందు మేలొ ॥

సీ. దినదినగండముల్ దెయ్యాలతోఁ బోరు నిశ్చింతత పొసంగు నీకు నెట్లు
కడుపులోమంట యాకలి యెక్కుడగుతంట నిశ్చింతత పొసంగు నీకు నెట్లు
కంటినల్పొకవంత కాలిముల్లొకవంత నిశ్చింతతపొసంగు నీకు నెట్లు
చేతికట్టకుఁ జింత చెం బేడ నను చింత నిశ్చింతత పొసంగు నీకునెట్లు

తే.గీ. చింతలకు నేమి నా రాజ్యచింతవలెనె । కలవుచింతలు నీకును గాననమున
నొగి వికల్పోపహతుడవై యుందు వడవి । నిర్వికల్పుడనై యుందు నేఁ బురమున ॥

తే.గీ. కడగి నిదురింపనగు నాకుఁ గనులనిండ । గరిమ బోసేయనగు నాకుఁ గడుపునిండ
బద్ధుడ నటంచు నెన్నడు బుద్ధిగనక । హాయిగా గృహమున ప్రొద్దు లపనయింతు॥ ౪౦౭

తే.గీ. నీవు దుఃఖవిబద్ధుండ నేనటంచు । శంకితస్వాంతుఁడవు కాక సౌఖ్యరసము
ననుభవింపుము నామాట వినుము మనుము । ముక్తిమార్గంబు మనకిదే మునికుమార ॥

క. అనిజనకుఁడు పలుకగ విని । మునిబిడ్డం డతనిమాట మ్రొచి మహాప్రీ
తిని వ్యాసాశ్రమమునకుం । జనిన నతడు గౌగిలించి సంతసపడియెన్ ॥ ౪౧౧

క. ఆ యాశ్రమమున శుకుండు వి । రాయాసంబున జరించె నధ్యయనపరుం
డై యోగమతత్త్వైక క । లాయుతుడై శమదమాది లక్షణములతోన్ ॥ ౪౧౨

క. పితృదేవతలకుమారిక । మతిమతి పీవరివి గాంతిమతి బెండ్లాడెన్
సుతులు నలుగు రొక కూతురు । వితతగుణోపేతు లుద్భవిలి రాబిడకున్ ॥ ౪౧౩

వ. క్రమంబుగా కృష్ణుండును, గౌరప్రభుండును, భూరియు, దేవశ్రుతుండును ననువారు పుత్త్రులు. కీర్తి యనునది కూతురు. ఇందు వందవిన్ విభ్రాజపుత్త్రుండగు నణుహాన కిచ్చి వివాహంబు సేసిన దానియం దణుహానకు బ్రహ్మదత్తుండను కొడుకు పుట్టె నతండు బ్రహ్మజ్ఞుండై రాజర్షియై పృథివీపాలనంబు సేసె నంత గొంత కాలంబునకు శుకుండు.

కం. నారదు నుపదేశంబున । ధీరమ్ముం దతఁడు జ్ఞాన దీప్తిం గవి సం
సారంబు విడిచి ముక్తివి । చారంబున రజతగిరికి జయ్యన నేగెన్ ॥ ౨౯౬

ఉత్సాహ. వెండికొండ శిఖరమందు విడిసి ధ్యాననిష్ఠమై
నుండి సిద్ధిఁ బడసి పడియె బండజారినట్లుగా
విండు వెలుఁగు మీర వింగి నిలచి వేత్తా కర్కుఁడీ
తం దవంగ మిగులఁ జెలగె దైవభక్తి యుక్తుఁడై ॥ ౨౯౭

చ. సుతవిరహాకులుండగుచు శోకమునం గడు దీనుడై యెదన్
ధృతిచెడి వ్యాసుఁ డోరి కులదీపక యేర యొహో కుమార నాఁ
బ్రతివచనంబు భూతములె పల్కెను రాజతశైలకూట మం
దతిమధురంబుగాఁగ మును లందఱు నచ్చెరువంది చూడఁగన్ ॥ ౨౯౮

వ. అని యిట్లు విలపింప. ౨౯౯

ఉ. అంతట శూలి పుత్త్రవిరహానల బాధితు వ్యాసుఁజూచి ధీ
మంతుఁడు నీ కుమారుఁడు సమంచితయోగవిదుండు సుమ్మి బ
ల్వంతలఁ గుందనేటికి భవప్రభవానలదూరుఁడయ్యె దు
ర్దాంతత నుత్తమోత్తమపథమ్మున నుండె నటంచుఁ బల్కెనన్ ॥ ౩౦౦

తే.గీ. దుఃఖమెటులఁ దీరునో తోఁప డిపుడు । కనులు దనియవు పుత్త్రలాలనమునందు
ననిన వ్యాసునిఁగనుఁగొని యభవుఁడు నగి । ప్రక్క శుకునీడఁ గనుఁగొంచు బ్రతుకుమనిన

ఆ.వె. తనదుప్రక్కఁదోఁచు దనయుని నీడను । మిగుల వెలుఁగు గలిగి మెఱయు దానిఁ
జూచి సంతసింప శూలధరుఁడు తన వగపుదీర్చి చవిన వ్యాసుఁ డరిగె ॥ ౩౦౧

వ. అని సూతుండు పరమానందసమేతుండై వచియించిన యుదంతంబంతయు విని విస్మి
తులై శౌనకాది మహర్షు లిట్లనిరి. ౩౦౨

మాలిని. శుకుఁడు పరమసిద్ధిన్ జొప్పడన్ నిత్యచింతా
వికలమయిన చిత్తోద్వృత్తి వ్యాసుండు దానె
ట్లకట బ్రతుకఁ గల్గెన్ హా యతం డేమిసేసెన్
సకలమును వచింపన్ జాలు దీ వంచుఁ బల్కెన్ ॥ ౩౦౩

వ. సూతుండు విని తదనంతరంబ వ్యాసువృత్తాంతంబు సెప్పెద వినుండు. వ్యాసునొద్ద వేద
వేదాంగంబు లధ్యయనంబు సేయుచున్న శిష్యులు అసితుండును, దేవలుండును, వైశం
పాయనుండును, జైమినియు, సుమన్తుండును విద్యాతపోనిధులై వ్యాసు ననుజ్ఞవడసి
యంతకమున్న దేశాంతరగతులై యుంటంబట్టి చింతాక్రాంతచిత్తుండై తాను దేశాట
నోన్ముఖుండై. ౩౦౪

క. దాశసుతామాణిక్యం । బాశావృతకీర్తి సజ్జనామోదక వి
ద్యాశీల సత్యవతిఁ గను । నాశఁగా బర్వతము విడచి వ్యాసుఁడు నడచెన్ ॥ ౩౨౫

—: ధృతరాష్ట్రాద్యుత్పత్తి :—

ఆ.వె. జన్మభూమి సౌఖ్య సంపద యెట్టిదో । పుట్టి పెరిగి కొన్ని ప్రొద్దులున్న
యట్టి ప్రేమ వ్యాసుఁ డరిగెఁ దా దీవికిఁ । గలదె జన్మభూమి కంటె సుఖము ॥ ౩౨౬

వ. వ్యాసుం డిట్లు జన్మద్వీపంబు ప్రవేశించి యచ్చటి నిషాదులం గాంచి యిట్లనియె. ౩౨౭

ఆ.వె. దాశులార నన్ను దయ నెత్తుకొని ముద్దులాడి బువ్వఁ బెట్టి యాడనేర్పి
బూదివెట్టి నిదురఁ బుచ్చి మచ్చికఁ గన్న । యమ్మ యేది చూపుడనిన వారు ॥ ౩౨౮

తే.గీ. కన్య నీతల్లి నొక భూమికాంతునకును । ముదమునం బెండ్లిచేసిరి సదమలాత్మ
యని చనిరి దాశరాజు దా వ్యాసురాక । విని యెదుర్కొని యర్చించి వినయఫణితి ॥

క. నాజన్మ సఫలమాయెను । నాజీవిత మిపుడు పావనం బాయెఁ గులం
బోజఁ బవిత్రం బాయెను । ధీజితబృందారకార్య దీపితచర్యా ॥ ౩౩౦

తే.గీ. దేవతల కబ్బనే నీదు దివ్యదర్శనంబు మునినాథ నీ రాక నాకు మేలు
నీవు గోరినయది యెద్ది నెమ్మిఁ దెలుపు । నాది కా దీ సమస్తంబు నీదిసుమ్ము ॥ ౩౩౧

వ. అనిన విని సంతసించి సాత్యవతేయుం డచ్చటనుండి సరస్వతీతీరంబున నాశ్రమం
బేర్పఱచుకొని తపంబు సేయుచుండె. ౩౩౨

ఉ. శంతనునందు సాధ్వియగు సత్యవతీసతి కుద్భవిల్లి ర
త్యంత కలాసమేతులగు నట్టి సుతుల్ పటుధైర్యశాలులై
సంతత ధర్మకర్మలయి శాంతియుఁ గల్గి నిర్మల
స్వాంతత వ్యాసమౌని కనుజన్ములునాఁ దగు నిర్వు రుర్వరన్ ॥ ౩౩౩

తే.గీ. చెలఁగి చిత్రాంగదుండు విచిత్రవీర్యుఁ। డనుచు లోక ప్రసిద్ధులై రదియుఁగాక
గంగయం దొక్కపుత్రునిఁ గాంచె నృపుఁడు । భీష్ముఁ డాతఁడు శత్రువిభేదిగాడె ॥ ౩౩౪

ఉ. అంతటఁ గొంతకాలమున కా మనుజేశ్వరుఁడైన శంతనుం
డంతము నొందె భీష్ముఁడు మహామతిఁ బ్రేతవిధుల్ నొనర్చె న
త్యంత ముదంబునన్ మహీ సురావళికిం బహుదానముల్ దయా
వంతుఁ డటంచు వారలు స్తవంబులు సేయ నొనర్చె భక్తితోన్ ॥ ౩౩౫

క. చిత్రాంగదభూపతి రాజ్యత్రాణమునందు నిలిపి యతఁడును బూజా
పాత్రుఁడయి యూరకుండెన్ । చిత్రము దేవవ్రత ప్రసిద్ధి వహించెన్ ॥ ౩౩౬

శా. ఆ చిత్రాంగదుఁ డాత్తవీర్యమదుఁడై యత్యంతమై యొప్పు బా
హా చాతుర్యము సూపె నాదట నొక ప్డారాజు పై వ్యోద్ధత
ప్రాచుర్యంబున వేటకేగి యచటం బల్పంగులన్ శాతనా
రావక్రీడల వ్యాఘ్ర భల్లుక కిటి గ్రామంబులన్ గూల్పఁగన్ ॥ ౪౩౭

సీ. అదియు జిత్రాంగదుం డనియెడి గంధర్వుఁ । డొక్కఁడు సూచి తాఁ గ్రక్కున నృపు
నెదిరించి పోరాడె నెలమిని మూఁడువత్సరము లాబవరాన జచ్చెరాజు
భీష్ముఁ డావార్తను విని వాని యౌర్ధ్వదైహికములు కావించి ప్రకటనీతి
దొల్లింటివలెనుండి దొరతనం బొనరింప । నుర్వి విచిత్రవీర్యునకు నిచ్చె
నదివిని సంతోషమందె సత్యవతీ సతీమణి తన సుతుండే మహీశుఁ
తే.గీ. డాయెనంచును వ్యాసుండు హర్షమందె । భ్రాత రాజాయెనంచు నభ్రాంతవృత్తి
జెలగి భీష్ముండు దలచె విచిత్రవీర్యునకు వివాహంబుసేయుట న్యాయమనుచు ॥ ౪౩౮

వ. ఆ సమయంబున ౪౩౯

తే.గీ. కలరుముప్వురు కూతులు కాశినేలు । రాజున కతండుచాటించె రాజముఖులు
పూని తారు స్వయంవరంబున వరింతు । రంచు నది విని రాజన్య లరిగిరందు ॥ ౪౪౦

క. దేవవ్రతుఁడును గాశికి । దా వేగం జని నృపాలతండంబుల వి
ద్రావణము సేసి కన్యల । భావజు బాణముల రథముపై నిడికొనియెన్ ॥ ౪౪౧

ఉ. ఇంటికిఁదెచ్చి లోన విడియించి సమస్తము గూర్చి యిచ్చి యా
దంట స్వమాతలం గనిన దారిని వారిని గాంచె నౌర యే
వెంట గనుంగొనంగలము వీనిని బోలినవాని నంచు నే
యింటను విన్న విందుము మహింగల పల్లెలఁ బత్తనంబులన్ ॥ ౪౪౨

ఆ.వె. తల్లి సత్యవతికి ధరణీసురలకును । విన్నవించె నతఁడు గన్నియలను
జిన్నతమ్మునకు విచిత్రవీర్యునకును । గూర్పఁ దలచినాడ గూర్మిననుచు ॥ ౪౪౩

వ. శుభముహూర్తంబడిగి వివాహయత్నంబు సేయించి కన్నియలం దోడ్కొని వచ్చియున్న
సమయంబున. ౪౪౪

సీ. తల రాగిడీబిళ్ళ తళుకు క్రేవలఁ గ్రమ్మ వింతగా శిరము నొక్కింతవాంచి
రవల దుద్దులు మిఠారములు చెక్కులదాట నెడనెడ నొక్కింత మెడగదల్చి
చిరునవ్వు వెన్నెలల్ సెలవులెక్కుచు గ్రాల వనవంటివాతెర నమలినమలి
ముద్రికామణిఘృణుల్ మురిసి చిందులుద్రొక్క వెనవ్రేళ్ళఁ బైటకొంగు నవరించి
తే.గీ. దేవనది ముద్దుబిడ్డని క్రేవవిలచి । సిగ్గునం గన్నులరమోడ్చి పెశెదుడిచి
యాచి తలయూచి యొక్కొక్క యక్షరముగ । మాటలాడెఁ బ్రథమకన్య శేటమీం ॥

ఉ. చెప్పెద నొక్కమాట వలెఁ జిక్కినదాన ని కెందుఁబోవుదున్
ముప్పిరిగొన్న ప్రేమమున మున్నె వరించితి మానసంబునన్
దప్పక సాళ్వభూవిభుని దైవము నీచెయిఁ జిక్కఁజేసె నే
నిప్పుడు చేయఁగాఁదగిన దెద్దియొ చెప్పుము బ్రహ్మవిద్వరా ॥ ౪౪౬

వ. అని పల్కిన యక్కన్యారత్నంబు వచనంబులు విని గాంగేయుఁడు వృద్ధబ్రాహ్మణుల యానతిం బడసి తల్లికిం జెప్పి మంత్రులతో నాలోచించి ధర్మంబు విచారించి, యో కన్యకామణీ! నీవు నీయిష్టునియం దిదివరక మనంబు నిల్పియుంటివి నిన్ను మేము పరిగ్రహించుట ధర్మంబుగాదు కావున నీ యిష్టంబు వచ్చినయట్ల చనుమనిన నది యట్ల చేసి సాళ్వుం జేరి యిట్లనియె. ౪౪౭

చ. సరసవరేణ్య పుణ్యమతి సాళ్వనృపాలక నిన్ను నే స్వయం
వరమున నల్లమందిడితి వాంఛ యెలర్పఁగ నంచుఁ దెల్పినన్
బరమనయజ్ఞుడై పలికెఁ బావనచర్యుఁడు భీష్ముఁ డోధరా
వరసుత పొమ్ము నీమనసు వచ్చినచోటికి నంచుఁ బల్కినన్ ॥ ౪౪౮

వ. ఇటకు వచ్చితి మఱియు. ౪౪౯

ఆ.వె. నెమ్మనమ్మునందు నిన్ను నే వలచితి । తగిన ధర్మపత్ని నగుదు నీకు
నన్ను నీవు నట్ల కన్నువైచి వరించి । యున్నవాఁడవైతి విన్నియేల ॥ ౪౫౦

వ. అనిన విని సాళ్వుండు. ౪౫౧

మ. విను నేనెట్లు గ్రహింతు నిత్తఱి నయో నిన్నప్డు భీష్ముండు గై
కొనియెన్ నేనును జూచితిన్ రథముపైఁ గూర్చుండఁగాఁజేసె నో
వనితా యొంగిలిదాన నీ విపుడు కావా పోవె నీవెట్టి నే
నినుఁ బెండ్లాడఁ దలంపు లేదు మదిలో నీ కేటికిం జింతిలన్ ॥ ౪౫౨

వ. అనవుఁడు. ౪౫౩

తే.గీ. అయ్యయో యెంత విలపింపనయ్యె నాకు । నేమి సేయుదు ననుచు నయ్యింతి మఱల
భీష్ముకడఁజేరి యో ధర్మవిద్వరేణ్య । వినుము నా యంగలారుపు విన్నవింతు ॥ ౪౫౪

చ. సుజనవరేణ్య యేను బవి చూచితి సాళ్వునిఁ గాముబారిచే
గిజగిజలైతి వేఁడికొని కేలు మొగిడ్చితి గుస్తరించితిన్
విజమును జెప్పితిన్ వినక విన్నితరుండు గ్రహించెఁ బొమ్ము భూ
ప్రజలు హసింతు రట్టి వినుఁ బత్నిఁగఁగొన్న నమందుఁ గ్రమ్మఱన్ ॥ ౪౫౫

క. వచ్చితి నీవే గతి యని । యచ్చుగ నన్నిపుడ పెండ్లియాడుము కలదే
మచ్చిక యటు గాకున్నను । జచ్చెద నీయెదుట నిపుడు సాధుచరిత్రా ॥ ౪౫౬

వ. అనిన విని భీష్ముం డిట్లనియె. ౭౫౭

క. ఇతరుని పైఁ జిత్తంబిడి । బ్రతిమాలిన యాఁడుదాని పాణిం బట్టన్
మతిమంతు లిచ్ఛయింపరు । సత మిది నీ తండ్రికడకు జనుమీ వేగన్ ॥ ౭౫౮

క. నావుఁడు భీష్ముని పలుకులు । దా విని వనమునకుఁజేరి తప మొనరించెన్
బావనతీర్థమునన్ విజ।నావని నొకచోట నాకు లశనముగాఁగన్ ॥ ౭౫౯

వ. అది యట్లుండ మిగిలిన యంబాలికయు నంబికయును నను నిరువురు కన్యలును విచిత్ర
వీర్యునిభార్యలై పరమపతివ్రతామహిమంబు తమదకా రూపలావణ్యవిభ్రమంబుల
ననదృశలై భర్తకుఁ బరిచరించుచుండఁ గొన్నివర్షంబులకు రాజయక్ష్మమయపీడితుండై
భూపతి పంచత్వంబునొందె నంతట నత్యంతదుఃఖితయై సత్యవతి ప్రేతకృత్యంబులు
నిర్వర్తింపంజేసి పెండియు నేకాంతమున గాంగేయుంబిల్చి యిట్లనియె. ౭౬౦

ఆ.వె. ఓయి భీష్మ ప్రోయు మూర్వీభారము నీవు । నట్ల యనుజభార్య లందుఁ బ్రేమ
సుతులఁ బడసి వంశ మతిశయిల్లఁగజేసి । ఘనయయాతికులము గావుమనిన ॥ ౭౬౧

క. తల్లీ నీవెఱుఁగుద కా । తెల్లముగా మున్నె నా ప్రతిజ్ఞమ రాజ్యం
బొల్లను సతి నొల్లననుచుఁ । జెల్లింపకయున్న నది నిషిద్ధముకాదే ॥ ౭౬౨

క. అనిన విని సత్యవతి దా । మనమునఁ జింతించె నయయొ మహనీయకులం
బున కిద తుదకాఁబోలున్ । మునుకొని యిందున కుపాయమును గన మనుచున్ ॥

క. అది జూచి భీష్ముఁ డెంతయు । మదిలోఁ దలపోసి తల్లి మానుము దుఃఖం
బొదవింపుము క్షేత్రజసుతు । విదితుని స్మృతిచే విచిత్రవీర్యున కనినన్ ॥ ౭౬౪

క. కులవంతుండగు ద్విజుని౦ । బిలిపించి విచిత్రవీర్యు పెండ్లామునకున్
గలిగింపుము సాంగత్యము । కలుగు సుతుఁడు శాస్త్ర మొప్పఁ గామఁగులంబున్ ॥ ౭౬౫

తే.గీ. ఇట్లు పౌత్త్రుండు పుట్టిన యేని వాని । కిచ్చి వేయుము రాజ్యంబు నేను వాని
శాసనంబునఁ బాలింతు సకలభూమి । సౌఖ్య మింపొందు నీకు నిశ్చయమటన్న ॥ ౭౬౬

క. తన కానీనతనూజున్ । ఘను వ్యాసుఁ దలంచె వేడ్కఁ గామిని యంతన్
జనుదెంచి యతఁడు మ్రొక్కుచుఁ । గనుఁగొని యెదుట నిలువఁబడినఁ గమఁగొని ప్రేమన్ ॥

ఉ. ఓయి కుమార శంతనుని యుత్తమవంశము నిల్పఁ గోరి ని
న్నీయదనం దలంచితిని నీవును వేడ్క విచిత్రవీర్యు న
ద్మాయతనేత్రఁ గూడి యొక యాత్మజు నొందుము క్షేత్రజుండుగా
నాయెద సంతసిల్ల ననినన్ విని సమ్మతమంచుఁ బల్కుచున్ ॥ ౭౬౮

వ. వ్యాసుండు ఋతుకాలంబునకు నిరీక్షించి యథాశాస్త్రంబుగా నంబాలికం గూడిన నామె

గర్భవతియై జాత్యంధుండగు నొక్క సుతుం గాంచె నందునకుఁ జింతిల్లి సత్యవతి వ్యాసుంగాంచి యంబికం గలయఁ గోరిన నతం డట్లు సేయఁ బాండురోగపీడితుండగు నొక పుత్త్రుండు పుట్టె నది సూచి మిక్కుటంబగు వనటం గుంది సత్యవతి మరల నంబికం గూడుమని వ్యాసుతోఁ జెప్పిన నతం డొడంబడి శయనాగారంబున నెంత నిరీక్షించినఁ దా రాక ప్రేష్యం బంపిన దానితో వ్యాసుండు సంగమింప నది గర్భవతియై సుపుత్రుం గాంచె. ౪౩౯

క. అంబిక కొమరుఁడు దాఁ బిలువంబడె ధృతరాష్ట్రుఁడనుచు నంబాలిక పా
లంబడినవాఁడు పాండుఁ డనంబడె నితరుండు విదురనామము గాంచెన్ ॥ ౪౪౦

వ. ఇది ధృతరాష్ట్ర పాండురాజ విదురుల జన్మక్రమంబని చెప్పిన విని శౌనకాది మహామునులు నంతసించి.

—: స్కంధాంత కృతిపతి సంబోధనము :—

శా. దీర్ఘ గ్రంథకృదుత్తమోత్తమకథా దివ్యాంశసారత్రయీ
నిర్ఘోషాంచితభూమిదేవ పరిష న్నిత్యాభిషేకోత్సవాం
తర్ఘర్మేతర వారిపూర పరిపూర్ణప్రాంత పద్మాకరా
వర్ఘార్చావిధపూతభక్తి వినరా, యల్లూరి సోమేశ్వరా ॥ ౪౪౧

స్రగ్విణీవృత్తము. శ్రీకరా, భీకరారిప్రణాశంకరా । స్తోకరాజన్మహాశోక, రాధావరానేక రాజీవపూజైకవిస్తార, సుశ్లోకమందార, యల్లూరిసోమేశ్వరా.

గద్య. ఇది శ్రీమదిష్ట కామేశ్వరీపాదారవింద మకరందతుందిలమానసేందిందిర, దాసు వంశ పయఃపారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరిత గోత్రాలంకార కృష్ణామండల మండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీవీరప్రతాప కోర్కొండహంవీర రామచంద్ర భూమీశ్వరదత్త గోదావరీమండల స్థిత, సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదక నియోగభారవ్యవహార, శ్రీ వేంకటేశ్వర వరప్రసాదసంభూతకవిత్వ విద్యావిశేష బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేకగ్రంథ మతిసార, వివిధ జనకరుణాసంపాదితోభయభాషా పరిచిత ప్రచారవిత్వ, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీ దేవీభాగవతం బను మహా పురాణంబునం బ్రథమస్కంధము.

ప్రథమస్కంధము సంపూర్ణము.

శ్రీ ర స్తు.

శ్రీ శా ర దాం బా యై న మః

# శ్రీ దేవీ భాగవతము

## ద్వితీయ స్కంధము

శ్రీ వనమృదుదళపూజా । సేవనపావన నతాళి చేతోవాంఛా
భావన సస్యప్రావృ । డ్జీవన ధర సంప్రవేశ శ్రీ సోమేశా॥ ౧

వ. అవధరింపుము సూతుం జూచి ఋషు లిట్లనిరి. ౨

### —: మత్స్యగంధ్యుత్పత్తి :—

తే.గీ. గర్భహేతుక మాశ్చర్యకరమునైన । నీవు సెప్పినకథ మాకు నిక్కవముగ
నమృతమునుబోలె మధురమై యతిశయిల్లెఁ । గాని సందియములు మాకుఁ గలవు కొన్ని॥ 3

క. ఆ సత్యవతిని శంతను । డాసం బెండ్లాడి సుతుల నందెనని యుప
న్యాసము సేసితివికదా । వ్యాసుం డెపు డుదయమందె నది యెట్లాదవెళా॥ ౪

క. వ్యాసుఁడు పుట్టినపిమ్మట । నాసతికిం బెండ్లి యెట్టులయ్యెను శత్రు
త్రాసియగు శంతనునితో । నో సుగుణగణాఢ్య చెప్పు మోపికమీరన్ ॥ ౫

వ. అనిన సూతుండు. ౬

సీ. ఏదేవినామంబు విచ్చతో నుచ్చరించినమాత్ర సంకల్పసిద్ధి యొదవు
ఏపుణ్యవతి కాళ్ళ కెరగినంతనె చతుర్వర్గము ప్రొసగు ననర్గళముగ
ఏయమ్మ వాగ్బీజ మెనసి స్మరించినప్పుడే సర్వకామముల్ పూర్తములగు
ఏశక్తిచారిత్ర మెఱిఁగి పఠించిననాఁడె సంసరణార్తి నాశమందు

తే.గీ. నట్టి సర్వేశ్వరికి జగదాదిమూల । జననకారణమూర్తికి జ్ఞానమయికి
సకలసంపత్ప్రదాత్రికిఁ బ్రకృతిభూతి । కేను మ్రొక్కెదఁ జెప్పెద విటు వినుండు॥ ౭

చ. ఉపరిచరాఖ్యుఁడైన వసు వుత్తముఁ డింద్రుని వేఁడి స్ఫాటికం
బపరిమిత ద్యుతిప్రకటమైన రథంబు గ్రహించి దానిపై

సుపరిగతిం జరించుచు మహోజ్జ్వలుఁడై కడు ధర్మశాలియై
కృపణుఁడుగాక వర్తిలుచుఁ గీర్తివహించె ధరాతలంబునన్ ॥ ౮

ఆ.వె. అతనిభార్య గిరిక యా సుందరికి నేగు । రాత్మజులు జనించి రతనివలన
మహిని వేఱువేఱు మాగాణములకును । పతులఁ జేసెఁ దనదు సుతుల నతఁడు ॥ ౯

క. గిరిక ఋతుస్నాతయగుచు । వరునకుఁ దన వలపుఁ దెలిపి వర్తిల నపుడే
నరపతినిఁ బితరులుం గో । రిరి మృగముల బట్టి సంహరింపు మటంచున్ ॥ ౧౦

ఆ.వె. ఇంతిమాటకేమి సంతోషమందింతుఁ । బితల ననుచు నంత వేటకేగెఁ
జిత్తమెల్ల గిరిక చిన్నారి వగలపై । బత్తి పితరులందుఁ బట్టి యతఁడు ॥ ౧౧

ఆ.వె. ఎంత యడచుకొనిన నింతిమీదఁ వలపు । గంతులిడుచు వచ్చి గొంతు బట్టి
పంతమెసఁగ భూమికాంతుని రేతస్సు । వింతమీఱఁ గ్రింద విడువఁజేసె॥ ౧౨

సీ. అంతట రాజన్యుఁ డావీర్యమునుజూచి యిది వృథాభూతమై యిచటఁ బడియె
నయ్యయో ప్రేయసి కంపిన బాగంచు మదినెంచి మఱ్ఱాకు మడఁచి కుట్టి
యందుంచి వెంటనే యచటఁ దాఁ గాంచిన డేగను బిల్చి యో డేగ నీవు
వేగమ చని నాదు వెలదికి నిది యిమ్మటంచు దెల్పిన డేగ యమ్మహీశు

తే.గీ. వచనమును విని పుట్టికను పట్టి ముక్కు । నందు గట్టిగఁ బొసఁగించి యరుగుచుండ
ఖగమొకటి దాకి పోరుచో గ్రమవర్ణ । పుటిక యమునానదిం గూలి బుటుకుమనియె॥ ౧౩

సీ. ఆవేళ నద్రికయను నొక్క యచ్చర యమునలో నొక్క ధరామరుండు
సంధ్యవార్వగజూచి స్మరబాణవిద్ధయై జలకేళిలోనుండి సరగవచ్చి
బ్రాహ్మణుపాదంబు బట్ట నాతడు సూచి కోపించి పోపొమ్ము కోమలాంగి
ఆడుచేపవు గమ్మటంచు శపించిన నట్లయి నీరంబులందు నుండి

తే.గీ. వసువు వీర్యంబు మ్రింగి తా వర్తిలంగ । బల్లెవాఁ డొక్కడాచేప బట్టి కోట్ట
చింపినం బుట్టి రిరువురు చిన్నబిడ్డ । లొకటి మగవాఁడు మఱియొక్క టువిదయయ్యె॥ ౧౪

క. అది సూచి మత్స్యజీవియు । మది నాశ్చర్యంబు నొంది మనుజేశున కి
చ్చెదనంచు దాశనృపతికి । నెదుట విడిన నతఁడు మెచ్చి యింటం బెనిచెన్ ॥ ౧౫

క. మగవానికి మత్స్యండనఁ । దగు నామమువిచ్చె వాఁడు ధర్మపరుండై
జగమున వసుతుల్యుండై । నెగడెను రాజగుచు సౌఖ్యనిరతి నతండున్ ॥ ౧౬

ఉ. ఆఁదట మత్స్యగంధియను నాఖ్యను గంధముచేత బూనె మ
త్స్యోదరియంచు జన్మమున నొప్పె వసుందును గాళికాఖ్య సు
శ్రీదముగాఁగ వేగ జలజీవికి నిచ్చుట గాళిపేరు సం
పాదితమయ్యె నిట్లు వివిరపాయతఁ గన్యయుఁ బెంపగాబడెన్ ॥ ౧౭

వ. అని సూతుండు చెప్పిన విని యాశ్చర్యమగ్నులై శౌనకాదు లిట్లనిరి. ౧౮

తే.గీ. అచ్చరవెలంది మునిశాపమంది యాఁడు । చేపయై మత్స్యజీవనుచేతఁ జచ్చె
ననుచు జెప్పితి వద్ది యేమాయెఁ బిదప । స్వర్గమునకేగెనా ? శాపశాంతి గలిగి ॥ ౧౯

వ. అని యడిగిన విని సూతుం డిట్లనియె. ౨౦

క. శాపానంతరమున న । చ్చేపపడఁతి మునిని వేఁడ శీతలుఁడై యో
చేపా ! మానవు లిరువురు । నీపొట్టం బుట్టఁ గలుగు నిజరూపమొగిన్ ॥ ౨౧

వ. అని యానతిచ్చిన మునివాక్యంబు క్రమంబున పుత్రీపుత్ర జననానంతరం బది మరల నచ్చరయై స్వర్గంబునం బ్రవేశించెనని చెప్పి మఱియు. ౨౨

అ.వె. మత్స్యగంధి పాల్యమానయై యా దాశ । రాజుగేహమందు రమ్యరూప
గుణగణాఢ్యయగుచు మణిబోలె నాదర । ణీయయయ్యె నెల్ల నియతులందు ॥ ౨౩

సుగంధి. ధీరుఁడై పరాశరుండు తీర్థయాత్రఁ బోవుచో
సూరజానదీతటంబు జూచి యందునిల్చి తాఁ
జేరియప్డు భోజనంబుసేయు దాశభూపతిన్
గోరెఁ దన్ను నన్యపారగు న్పొనర్పుమం చొగిన్ ॥ ౨౪

వ. అనిన విని తాను భోజనంబుసేయు కతంబున. ౨౫

క. దాశపతి హర్షమొనయ బ । రాశరమునిఁ దెప్పవిడి కరము వేడుక ఛా
యేశసుతం దాటింపు ని । శేశానన యంచు నానతిచ్చెను సుతకున్ ॥ ౨౬

తే.గీ. తండ్రిమాటనుఁ దలఁమోచి దాశకన్య । యమికులోడుపు నుడుపంబునందు నిడుక
యమున దాటింపుచుండంగ నతివయొడలి । కాంతిఁ గనుగొని దైవయోగమున నతఁడు ॥ ౨౭

సీ. పూతమంకెనమొగ్గ పోలికనున్నదీ మోవి నే కలువాయి ముద్దులిడునొ
తెల్లఁదామరతూండ్ల తీరుననున్న యీ చేతు లేమలినాంగు చెట్టబడునొ
పలుచని యపరంజి పసిడిరేకులవంటి చెక్కు లేవలుగాకి నొక్కగలఁడొ
చిన్నారి యెలమావి చిగురాకువంటి యీ యడుగు లేమ్రుక్కఁడి యంటగలఁడొ

తే.గీ. చక్కదనమెంత హొయలెంత జగ్గులెంత । జాణతనమెంత యీ కన్నెపాటి యున్నె
యేఱగానను గాన నీయోజ గాన । దీని నంపెద ననుచు నుద్రేకియగుచు ॥ ౨౮

క. వలపులఁ తేఁడు పరాశరు । తలపు తలపుఁ బగులనేయఁ దనువునఁ బులకల్
మొలవఁగఁ దన వలచేతన్ । వెలఁదుక వలవలికరంబు విడువక పట్టెన్ ॥ ౨౯

వ. అంత ౩౦

ఉ. గడ్డము సూచియో జడలు గన్గొనియో నిడుగాళ్ల సూచియో
దొడ్డవిభూతిపూత పులిత్రోళ్ళను జూచియొ పట్టియున్న మేల్
బుడ్డిని గట్టనుం గనియొ పూవిలుకానికి లోఁగి పల్లెరా
బిడ్డ యొకింత సిగ్గుపడి మెల్లన నవ్వుచు ముద్దుముద్దుగాన్ ॥

సుగంధి. దొడ్డజాతి సుశ్రుతవ్రతుండ వీవు సూడగా
నడ్డుగాన వవ్వసిష్ఠు నన్వయంబు నీదకా
మడ్డిమేను చేపకంపు మంచిదంచు నెంచితే
యెడ్డెదాన నన్నుఁబట్ట నేఁటికిం బరాశరా ॥ ౩౨

తే.గీ. బ్రాహ్మణకులంబు నీది నేఁ బల్లెదాన । వేదవిదుఁడవు శాస్త్రార్థవేత్త వీవు
తప్పుతడక ల్లిబిల్లి యీ తెప్పపాట । లాలకింపఁగ మనసాయెనా ? మునీంద్ర ॥ ౩౩

క. ఎన్నఁడు నిటువంటిది నేఁ । గన్నది విన్నదియు గాదు కడునీచము నా
యున్నయునికి బ్రాహ్మణుఁడవు । నన్ను స్పృశించెద విది తగునా నీకిచటన్ ॥ ౩౪

వ. అనియిట్లు పలుకుచున్న యమ్మిటారిపలుకులు విని యంతకంతకు మోహంబగ్గలంబై యమ్మునికులసార్వభౌముండు చేతోజాతయాతనాతిభీతిం బరవశుండై యన్నాతి కరంబు విడువకయ తటుక్కునం బడిన నదీజలంబుల మునుంగుదుమో యని బెదరి యదరిపడి యద్దాశమదవతి గడగడ వడంకుచు నతనితో నిట్లనియె. ౩౫

మ. సరియే మంచిది నీ ప్రయత్నమునకున్ శంకింతు నామేని కం
పరియా నిందున కేమిసేయగలవో యన్న న్మునీంద్రుండు వి
స్ఫురణంబైన నిజప్రభావమున గర్పూరంపుఁదావుల్ దిశల్
గరవ న్యోజనగంధిఁ జేసె నపుడే కళ్యాణియున్ రంజిలెన్ ॥ ౩౬

క. వనితారత్నంబును యో । జనగంధిజేసి దాని శయమును మరలం
దనచేతఁ బట్టి పలికెన్ । వనజేక్షణ నీవు సత్యవతి వీఁక వంచున్ ॥ ౩౭

క. ఇదకా సమయంబని తా । మదిఁ దత్తరపడుచున్న మౌనిని గని యా
ముదిత పలికె నోబ్రాహ్మణ । యదనా యిది పగలు చూతు రప్పయు వితరుల్ ॥ ౩౮

ఉ. రాతిరివచ్చుదాఁక మునిరాజ తొలంగుము పాశవక్రియల్
చేత యధర్మమౌ తగదు చీకటి మే లిది నమ్ముమన్న న
త్యాతురుఁడైన బాపఁడు రయంబున మంచును గల్గజేసి యో
నాతి యిఁకేల జాల మన నవ్వి పరాశరుఁ జూచి యిట్లనెన్ ॥ ౩౯

ఉ. మంచిది తాపసేంద్ర యొక మాటను జెప్పెద నాలకింపు మీ
మంచున నన్నుఁగూడి నిజమార్గము పట్టుదు రీరు మీ రమో

ఘాంచితవీర్యు లట్లగుట నా(డట గర్భము( దాల్తు నేను నే
మంచు వచింతు దం(డ్రికి నయ(ప్రణయ ప్రియ దారి చూపుమా ॥ ౪౦

వ. అనిన పరాశరుండు. ౪౧

ఆ.వె. నన్నుగూడినందున నన్యకౌత్వంబు । నీకు బోవదింక నీకు వలయు
వరము గోరు మదియు సరగున నిచ్చెద । ననిన సత్యవతియు ననుమతించి ॥ ౪౨

క. తలిదం(డ్రులు కన్నెననుచు । దల(పవలయు నిన్నుబోలు తనయుండును గా
వలయును మేన సుగంధము । విలువవలయు జవ్వనము గునియవలయుసుమీ ॥ ౪౩

వ. అనిన సంతసించి పరాశరుండు. ౪౪

క. నారాయణు నంశంబున । ధీరుండగు కొడుకు బుట్టు తెలవా నీకున్
వేఱొకటి చింతసేయకు । మారయుమీ నీకుమారు ననఘమతివిగాన్ ॥ ౪౫

తే.గీ. కన్నె యేనా(డు నెఱుగని కామమొదవె । నాకు నీమీ(ద నచ్చరనాతి గాంచి
కో(తిగా నెంచితిని మున్ను కుసుమశరు(డు । నే(డు నామీద దండెత్తె నిన్నుగూర్ప॥ ౪౬

క. నీకుం గలిగెడి కొమరు(డు । లోకైకనుతుండు నిశ్చలు(డుసుమ్మి సువి
ఖ్యాతు(డు వేదవిభాగ ని । రాకులు(డు పురాణకర్త యగు నో ముగుదా॥ ౪౭

క. ఆ నెల(త నూరడించి య । నూనామోదమున యమున యుదకంబుల దా
స్నానంబు సేసి చనియెన్ । మౌనీం(ద్రు(డు గర్భమపుడు మానిని కయ్యెన్ ॥ ౪౮

ఆ.వె. గర్భమైన యే(డు గడియలలోననే । కొడుకు పుట్టె మన్మథు(డొ యనంగ
పుట్టినపుడె తల్లిమొగ మట్టె తా( గని । యిట్టులనియె( దేనె లుట్టిపడ(గ ॥ ౪౯

చ. తపమున కేను( బోయెదను తల్లి సుఖంబున నింద యుండుమీ
కపటు(డగాను నీకు నొక కార్యము గల్గిన నన్ దలంపుమీ
యపుడె విరాన వచ్చెద నటంచు( జనెన్ దదనంతరంబ యా
త్మపితృగృహంబు సేరె వనితామణి నిర్మలమానసంబుతోన్ ॥ ౫౦

ఆ.వె. ద్వీపమందు( బడుట ద్వైపాయనుండయ్యె । కృష్ణకళను బుట్టి కృష్ణు(డయ్యె
నందువలన(గాదె నత( డెల్ల(దీర్థముల్ । శ్రమమే చరించె( జేసె( దపము ॥ ౫౧

క. ఈమాడ్కిని సత్యవతీ । భామామణికిని జనించి వ్యాసుండు కలి
వ్యామోహితులం (బోవ ద । యామయు(డై సంహితల నయంబుగ( జేసెన్ ॥ ౫౨

క. భారతము( జేసి శిష్యుల । కారూఢిం (గ్రమముదప్ప కధ్యయనము విం
పార(గ జేయించెను సువి । శారదుడై (శ్రుతివిభాగసరణి( దలిర్చెన్ ॥ ౫౩

వ. మఱియు వ్యాసునొద్ద నధ్యయనంబు సేసినవారిలో ముఖ్యులయినవారు సుమంతుండును, జైమినియును, పైలుండును, వైశంపాయనుండును, నసితుండును, దేవలుండును, నిజకుమారుండగు శుకుండును నై యుండిరని సూతుండు మఱియు ఋషుల కిట్లనియె. ౫౪

సీ. వ్యాసుండు దా సత్యవతికి జన్మించిన విధమెల్ల మీరలు వింటిరికద
సంభవంబును మీరు సంశయింపఁగరాదు గొప్పవారలయందు గుణము లెన్న
వలయును దోషముల్ వర్ణించుట యఘంబు మొదల పరాశరు ముట్టినట్టి
బోఁటి శంతనుభార్య యౌటను ధర్మంబుకానట్లు తోఁచినగాని దైవ

తే.గీ. యోగమందదుగా మన యూహలకును । కాన నీ పుణ్యచరితంబు పూని విన్న
సకలపాపంబులు దొలంగు సౌఖ్యమొదవు । దుర్గతులుదూలుఁ బుణ్యంబు తోడదిరుగు ॥ ౫౫

## —: గంగాశాపప్రాప్త్యాది కథనము. :—

వ. అని చెప్పిన సూతుం గాంచి ఋషు లిట్లనిరి. ౫౬

ఆ.వె. అమితతేజుడైన వ్యాసుని పుట్టువు । సత్యవతి చరిత్ర సత్యఫణితి
వింటి మేము మిగుల వీనులు దనియఁగా । నయిన నొక్క సందియంబు గలదు ॥ ౫౭

వ. అది యెద్ది యనిన. ౫౮

క. ఏపేరుగలది సత్యవ । తీ పుణ్యవతికిని దల్లి తెలుపు మెటుల న
య్యాపగ శంతనుఁ గూడెఁ । బాపరహిత భీష్ము డెట్లు వసుసుతుఁ డాయెన్ ॥ ౫౯

క. శంతనుని మొదటఁ గలసిన । కాంత యెవతె భీష్ముఁ డేల కాంక్షలుడిగె భూ
కాంతలపై జ్యేష్ఠుండై । సంతతసముదారకీర్తిశాలియు నయ్యెన్ ॥ ౬౦

క. మృతుఁడగు విచిత్రవీర్యుని । సతి ధర్మవిదుండు వేదసారజ్ఞుడు స
న్మతి యెట్టులఁగూడెన్ ఫ । ల్గుత నెట్టులఁ గుంద గోళకులఁ గల్గించెన్ ॥ ౬౧

తే.గీ. తెలుపు మిదియెల్ల మునినాథ తేటపడఁగ । ననిన విని సూతుఁ డిట్లను నయ్యలార
కలఁడు తొల్లి మహాభిషుం డలఘుకీర్తి । పరమధర్మాత్ముఁ డిక్ష్వాకువంశజుండు ॥ ౬౨

క. వేయశ్వమేధములు సు । మ్మీ యాతఁడు నూరు వాజపేయంబులు సు
మ్మీ యొనరించెను సురగణ । నాయకు నలరించి యేగె నాకంబునకున్ ॥ ౬౩

క. ప్రకటయశుండగు నాతం । డొకనాడు వెసం బితామహుని పురికేగెన్
సకల సురవరులు తత్సే । వకుఁ జని రత్తరిని గంగ వచ్చె నచటికిన్ ॥ ౬౪

తే.గీ. ప్రబలవాతంబు పొదమి యా బ్రహ్మయిల్లు దూగియాత్తంగ విబుధు లధోముఖులయి
యుండ విశ్శంకత మహాభిషుండు గంగ । వలచె గంగయు నాతని వలచి చూచె ॥ ౬౫

తే.గీ. బ్రహ్మ వారల యిరవుర పాటు చూచి । మిగులఁగోపించి పుట్టుండు మీరు భువిని
పుణ్యవశమున దివికి రాఁ బొసఁగు మీకుఁ । బొందుపొందవి శపియింపఁ బొక్కిపొక్కి ॥

క. మనసులు చెడి బ్రహ్మాంతిక । ముసు విడిచిరి వారు రాజ పుణ్యులు రిపుసూ
దనులయిన నృపులఁ బురుకుల । జుని దన పితయొఁ బ్రతీపుఁ జొప్పడఁ దలచెన్ ॥ ౩౭

క. ఆసమయంబున నిజభా । ర్యాసహితులగుచును వసువు లతిమోదమునన్
భాసిలిరి వసిష్ఠాశ్రమ । వాసులగుచు నిజమనోభివాంఛలకొలదిన్ ॥ ౩౮

సీ. వారిలో ద్యౌర్నామ వసువు నతనిభార్య । ప్రేమ వీక్షించి యో ప్రియుఁడ చూడు
మా ధేను వెవ్వరి దది మనోహరరూప । ముస నొప్పు చెప్పవే యనిన నతఁడు
వనితరో యిది వసిష్ఠునియావు దీనిపాల్ । చవిగొన్న పురుషులు సతులును నయు
తాయువులగుచు నిరంతర యౌవనాం । గు లగుదురని చెప్పఁ గోమలాంగి

తే.గీ. ధరణియందు నుశీనరు తరుణి నాకు । సఖి యది శుభాంగి కావున సరగ నీవు
దూడతోఁగూడ ధేనువుఁ దూర్ణలీలఁ । గొంచురమ్మిక నా చెలికొఱకు ననిన ॥ ౩౯

వ. పరమతపోనిధియును శాంతుఁడు నగు వసిష్ఠుని నందినీధేనువు నపహరించి పృథ్వాది వసువులంగూడి ద్యౌర్నామవసువు చనిన నప్పరమతపస్వి యాశ్రమంబునకు వచ్చి ధేనువుం గానక చింతిల్లి యనేక దుర్గమారణ్యంబులు వెదకి వెదకి వేసారి దివ్యజ్ఞానంబున వసువు లపహరించిరని యెఱింగి కోపించి మీరు మానవజన్మంబు లెత్తుదురుగాత యని శపించిన నది విని వసువులు వసిష్ఠుకడకుం జని శరణుఁజొచ్చి శాపమోక్షంబు వేడిన నతండు దయార్ద్రహృదయుండై మీలోఁ బృథ్వాదులగు నేడ్వురును గ్రమక్రమంబున నొక్కొక్కవత్సరంబున నొక్కరుగా నేడువత్సరంబులలో శాపంబుఁ దొలంగిన వారగుదురు. నందినిం జేతులార దొంగిలించిన ద్యౌర్నాముండు దీర్ఘకాలంబు మానుష దేహంబున నుండునని నుడివిన విని పృథ్వాదులగు వసువులు మార్గంబునం బోవుచుండ నంతకుమున్న బ్రహ్మచే శప్తయై దుఃఖంబున భూలోకంబున కరుగుచున్న గంగం గాంచి తారును దీనాననులయి యిట్లనిరి. ౪౦

ఉ. గంగ దయారసంబు సెలగంగను మమ్ముల మానుషత్వమే
గంగ నుపాయమొండు కలుగంగ దలంచితి మీవు భూమికే
గం గని శంతనుర గలయగం గని పుట్టుదు మేము నీకు వే
గం గడుపానఁ బుచ్చి తొలగంగ జలంబుల ద్రోయుమీ మమున్ ॥ ౪౧

క. అందున మేము కృతార్థత । నొంది సురాలయము మరల నొందుదు మనినన్
మందాకిని యందునకు న । మందానందంబుఁ బొందె మరలిరి వారల్ ॥ ౪౨

ఆ.వె. మున్ను బ్రహ్మశాపమున మహాభిషుడు దాఁ । బుట్టెనొగిఁ బ్రతీప భూమిపతికి
శంతనుండటంచు జనులెల్లఁ బిలువంగ । నధిక ధర్మశాలి యయ్యె నతఁడు ॥ ౪౩

క. తివిరి ప్రతీప మహీపతి । రవి కర్ఘ్యం బిచ్చునపుడు రమణి యొకతె యం
బువులందు జనించి నిజో । రువునం గూర్చుండ నతఁ డురుభ్రాంతి మెయిన్ ॥ ౪౪

తే.గీ. ఓసి యెక్కడిదాన వీ వొక్కనాడు । నెరుగనైతివి యిట్లు నా కెరుకసేయ
కేల తొడకెక్కితివి చూడ వింత వింత । గలదె యింతులచేష్ట లిక్కరణినుండు ॥ ౪౫

క. అనినంవిని యవ్విలాసిని । జనానాథా యింతి యూరుసంస్థిత యగుచే
పని కనుగొంటివి వలచితి । ననుకొనుమా యేల నీకు ననుమాన మిఁకన్ ॥ ౪౬

వ. అనిన రా జిట్లనియె. ౪౭

చ. విను మిటు సుందరీ యితరభీరువులం గొననొల్ల నేను నీ
వును గుడియూరువుం దొలఁగ వొప్పనుఁ గోడలు బిడ్డ లెంతయున్
జనువునసుండుచో టదియ చాన మదీయసుతుండు నీకునుం
బెనిమిటి గాఁగలండు చనుమీ యన గంగయు నేగె నాదటన్ ॥ ౪౮

ఆ.వె. కొంతకాలమునకుఁ గొమరుండు శంతనుం।డుక్కుమై వయోమహోజ్జ్వలుండు
గాఁగఁ జూచి రాజు కడువేడ్కఁ దాఁ దపం । బునకుఁ బోవఁదలఁచి పుత్త్రుఁజూచి ॥ ౪౯

క. మునుపటి గంగాగమనం । బు నుదంతంబెల్లఁ జెప్పి పుత్త్రక నీవా
వనజాక్షిని నీవెవ్వతె । వని యడుగక నిన్నుఁ జేరినంతన కొనుమీ ॥ ౫౦

ఆ.వె. దాని ధర్మపత్నిగా నేలి సుఖియింపు।మనుచుఁ జెప్పి యడవి కరిగి యతఁడు
ధృతిని బరమశక్తి దివ్యకారుణ్యంబు । వలన స్వర్గసుఖము వడసె నంత ॥ ౫౧

క. శంతనుఁడును రాజ్యం బ । త్యంత నయోన్నతినిఁ జేయు చఖిల జగద్వి
శ్రాంతయశుండై మించెన్ । సంతతభాస్వత్ప్రతాపశాలిత్వమునన్ ॥ ౫౨

—: గాంగేయోత్పత్తి :—

వ. అని మఱియు సూతుం డిట్లనియె. ౫౩

ద్విపద. ఆ ప్రతీపుఁడు దివం బందినవెనుక, స్వప్రతాపము పేర్మి శంతను నృపతి
దివిజ గంగానదీ తీరంబునందు, గవయ గండకమృగాకలితమై యొప్పు
నడవికి వేటకై యరిగి యందుండి విడువక తనతండ్రి వివరించినట్టి
రూపయౌవనముల రూఢిఁ జెన్నొందు, నాపె సాక్షల్లక్ష్మి యనఁగఁ జూపట్టె ॥ ౫౪

వ. చూచి ౫౫

మ. మెఱుపా యేమిది ! కాదు కాదు చదల న్మేఘంబులే లేవు; బం
గరుసీరా యిది ! కాదు కాదు కొలముల్ కాఱుల్ కనన్ రావు; చం
దురురేకా యిది ! కాదు కాదు దిననాథుం డెక్కె నట్టాకసం
బెఱుగంజాలకయుంటిఁగాక నవలాయే సందియం బేటికిన్ ॥ ౧౬

శా. ఔరా దీని యొయారమేమి వగలే మాహా సుధాంధోజగ
న్నారీరత్నమొ కిన్నరీమణియొ గంధర్వాంగనారత్నమో
యేరీ మధ్యమలోకమందు సరివా రీకన్నెకుం గల్గిరో
లేరో భోగవతీపురంబునఁ గన ల్లీలాకలాపంబులన్ ॥ ౧౭

క. ఎవ్వతెయో యిది యీయెల ! జవ్వనమే మిట్టు లొంటి సాహసమునఁ దా
నివ్వనిఁ జొఱఁగతమేమో ! నవ్విన గలగలని జారు నవరత్నంబుల్॥ ౧౮

చ. అడిగెదఁగాక దీని నని యంగము గంపిల నోట నాల్కయుం
దడబడ గ్రుక్క మ్రింగుచుఁ బదంపడి మ్రాన్పడి చూచిచూచి యా
యొడయఁడు న త్తిన త్తి నరియో నరికాదొ యటంచు నెంచుచుం
వెడవెడబాస సీనినిని వెవ్వవవ త్తెవటంచుఁ బల్కుచుం ॥ ౧౯

క. నీముద్దునగవు సూచిన ! నామీదను బ్రీతిగల్గు నటనయ తోచెం
లేమా నను బెండ్లాడుము ! లేమా యిలుసొఱుము విలుపలే మాన లిఁకం ॥ ౨౦

వ. ఇట్లు పలికెనవి చెప్పి సూతుండు. ౨౧

క. అది గంగ యనుచు భూపతి ! మది నెరుగడుగాని యెఱుఁగు మానిని యీతం
డదిర మహాభిషుఁ డీగతి ! నుదయించెం శంతనుఁడయి యుర్వి నటంచుం॥ ౨౨

వ. ఇట్లెరింగి. ౨౩

చ. మదవతి రాజుఁజూచి మధుమాధురి దోపగ నల్లనవ్వుచుం
బెదవిఁ గదల్పుచుం దనదు ప్రేమ బయల్పడఁజేయుచు న్పదిం
బదిగ విజాంగకంబులను భావము లుప్పతిలంగఁ బల్కె సొం
పొదవెడి విన్ప్రితీపతనయుండ వటంచు నెఱుంగుదుం నృపా ! ౨౪

క. నవమన్మథ నిను గని యే ! నవలా మదనాశుగముల నలిబిలిగా దీ
భువిలోన నేనునట్లయి ! వివరించెద నాదు నియమవృత్తులు నృపతీ ॥ ౨౫

తే.గీ. నేనుజెప్పినవని యెపుడు నీవుసేయ ! వపుడు నే నిన్ను విడిచెద నృవవరేణ్య!
ఇదియె నానమయము దీని కియ్యకొనిన ! నేను నీదాన నిఁక తమమానమేల ॥ ౨౬

వ. ఇట్లు పలికి వసువులకోరికయుం దనలోఁ దలపోసి తనసమయంబునకు రాజు నియ్య కోలుం దెలిసి మనుష్యరూపంబున రాజుం బతింజేసికొని గంగ నిజమందిరంబునకుఁ బ్రవేశించెనంత. ౯౪

క. నారాయణరమలును బృందారక విభుడును బులోమతనయయుబలె నా
భూరమణుండును రమణియు । మారక్రీడలను మరులు మఱిఁగిరి ప్రీతిన్ ॥ ౯౭

ఆ.వె. కడుపుదాల్చి గంగ కడు నిర్దయాపర । యగుచు గన్నబిడ్డ నంబువులను
మునిచె నిట్టు లేడ్వురను జేసె వసువులే । వారు కాన పూర్వవరమువలన ॥ ౯౮

తే.గీ. ఇట్లుచేసిన వగచి మహీశ్వరుండు । బిడ్డలేడ్వురు చని రీ వివేకహీన
క్రూరకృత్యంబువలన నా కులము నిలుచు । దారి యిఁక నేది యెవ్వరి దూరువాడ॥ ౧౦౦

తే.గీ. ఎనిమిదవగర్భ మిప్పు డీ యింతి దాల్చె । నెట్టులైనను గానిమ్ము గట్టువాయి
యేమిచేసిన చేయని మ్మెదుటనిలిచి । పట్టి బ్రతికింతు సతినొక్క నెట్టునెట్టి ॥ ౧౦౧

క. అని డెందము దిట్టపఱచి । మనుజేశుం డుండె నంత మానిని గర్భం
బున బుట్టె వసిష్ఠుని గో । వును బ్రుచ్చిలినట్టి వసువు బుద్ధుతం డగుచున్ ॥ ౧౦౨

ఆ.వె. పుట్టినట్టి సుతునిఁ బురిటింటిలోఁజూచి । పాపురాలు వీనిఁ బట్టి చంపు
నకట యనుచు భార్య యడుగులపైబడి । వగపుమీర దీనవచనములను ॥ ౧౦౩

మత్తకోకిల. నీలకుంతల నీకు దాసుఁడ నేడు దోసిలియొగ్గితిన్
జాలిలేక జలంబులో సుత సప్తకంబును ద్రోచితీ
వేల కూల్చెద వష్టమార్భకు నింత నిర్దయురాలవై
పాలపాపఁడు వీఁడు చేసిన పాపమేమి వచింపుమా ॥ ౧౦౪

క. అని పలుకుచున్న రాజు వచనములు విన కతివ బిడ్డఁ జంక నిడి వెసన్
గొనిపోవుచుండగ నెదురొ్కని నరవరు డనియె మిగులఁ గుపితుం డగుచున్ ॥ ౧౦౫

తే.గీ ఓసి పాపిష్ఠురాల నీ యుల్లమునకు । నల్లతాయియె సరిపోల్పఁ జెల్లఁగాక
కులమునిలిపెడి నాముద్దు కొమరు నిచట । వైచి నీ యిచ్చకొలఁదిని లేచిపొమ్ము॥ ౧౦౬

వ. అనిన నయ్యువతి రాజుంజూచి యో సర్వంసహావల్లభా నేను గంగను. దేవకార్యార్థంబు మనుష్యశరీరంబుతో వచ్చి భూలోకంబున నిన్నుఁ గలిసితి, నాకు జన్మించిన వారు వశిష్ఠశప్తులగు వసువులు; అందేడ్వురు మత్కృతంబగు జలపాతంబునం జేసి, ముక్తులయిరి; యీతండు నీకుం గొడుకు గాఁగలవాడని జెప్పి మఱియు.

ఆ.వె. తల్లి పెనుపవలయుఁ బిల్లల నదిగాన । విమలవృత్తితోడ వీని బెంచి
చదువు గఱపఁజేసి సాముసు జెప్పించి । యౌవనమున నీకు నప్పగింతు ॥ ౧౦౭

క. మనమునఁ గోపింపకు నేఁ । బనివినియెద ననుచు సమయభక్తినిఁ జనఁగా
మనుజేశుఁడు దుఃఖితుఁడయి । చని రాజ్యము సేయుచుండె జగము పొగడఁగన్॥ ౧౦౯

ఆ.వె. అంతఁ గొంతకాల మరుగంగ నొకనాడు । వేటతమక మాత్మ వేగిరింప
విబుధనది తటమున విపినంబులోఁ జేరి । స్తోకజలను గంగ జూచి యపుడు॥ ౧౧౦

క. వింతపడియుండఁగా నా చెంతను శరములును విల్లు చేఁబూని పటు
స్వాంతుఁడయి యాడు నొక ధీమంతునిఁ గని కొడుకటంచు మది నెఱుఁగ కొగిన్ ॥

ఆ.వె. ఓమహాకుమార యో మన్మథాకార । శరశరాసనప్రచారధీర
చిన్నబిడ్డ నిన్ను గన్నవా రెవ్వరో । తెలుపుమయ్య ప్రీతిఁ గొలుపుమయ్య॥ ౧౧౨

వ. అనిన విని యబ్బాలుం డేమియుం బలుకక శరశరాసనంబు లచ్చటన విడచి సాంద్ర
తర వృక్షపఙ్క్తివలన మరగి చనియె నంత రాజును మిగుల చింతాక్రాంతుండై
యుండం జూచి దివ్యనది తొల్లింటి మానుషవేషంబున జనపాలు నెదుటం బడినం
జూచి గంగయని యెఱింగి యీబిడ్డఁ డెవం డిక్కడనుండఁ గతంబేమి యని యడిగిన
గంగాదేవి యిట్లనియె. ౧౧౩

క. ఈబిడ్డడు నీబిడ్డడు । నేఁ బట్టిననాడు పుట్టె నేసీతని గా
రాబమునఁ బెంచితిని విద్యాబుద్ధులు వీని కొదవె నార్యులవలనన్ ॥ ౧౧౪

క. నీ సుతునిం గొనిపొమ్ము మహాసుఖముననుండు మింక ననిపల్కఁగ నా
రాసుతుఁడు హస్తిపురికిం । జేసెఁ బ్రయాణంబు సుతునిఁ జేకొని కడఁకన్ ॥ ౧౧౫

చ. గజపురికేగి శంతనుడు కార్యమెఱింగి ధరాసురోత్తమ
వ్రజమును బిల్వనంపి శుభవాసరలగ్నము లొప్పఁ జూచి భూ
ప్రజలు నుతింప దివ్యనదిపాపని కిచ్చెను యౌవరాజ్యమున్
గజిబిజిలేక యేలెను జగంబును ధర్మముఁ దప్ప కెంతయున్ ॥ ౧౧౬

వ. అని చెప్పి మఱియు సూతుండు మునులారా ! గాంగేయోత్పత్తియు గంగావతరణం
బును వసుసంభవంబును వ్యాసునివలన విన్న తెఱంగున మీకు వివరించితినని చెప్పిన
విని శౌనకాదులు సూతుంగాంచి, యయ్యా మావేడినకొలంది నెల్లయుదంతంబులు
సవిస్తరంబుగా నొసఁగిచ్చితిరి. యోజనగంధి శంతనున కెట్లు ప్రాప్తించెనో వినవలఁతు
మనిన సూతుం డిట్లనియె. ౧౧౭

## —: సత్యవతీ శంతను సంవాదము. :—

ఉ. ధర్మపరుండు శంతనుఁడు దా మృగయార్థ మరణ్యభూమికిన్
దుర్మద భల్లుకేభకిటి ధూనన కృత్యమునం బ్రజావళి

శర్మకరుండనౌదునని చారుశరాసశరాశితో లస
ద్వర్మము దాల్చి యేగెఁ బరివారముఁగూడి పటుప్రతాపుఁడై ॥ ౧౧౮

క. రురుకరి భల్లుకగండక । హరికిరిశార్దూల వృకహయారిముఖపరం
పరఁ దునుముచుఁ గాళిందీ । వరతటముంజేరి యచట వసియింపంగన్॥ ౧౧౯

చ. గమగమఁ జుట్టుప్రక్కలను గమ్మనితావులు గ్రమ్మి నాసికా
గ్రమునకువచ్చి తోన వివరంబులఁజొచ్చి నిమేషవృత్తి డెం
దమునకుఁ బ్రీతినిచ్చిన వతండు వితాకున నెల్ల దిక్కులన్
నెమకుచుఁ దద్గుణిన్ దెలియ నేరక యెంతయు భ్రాంతచిత్తుఁడై ॥ ౧౨౦

సీ. కస్తూరి గంధంబు కాఁబోలునందమా గంబూరవాసన గలదు కొంత
కలువపూవుల తావి కాఁబోలునందమా కమలంబుల వలపు కలదు కొంత
కనకంపు గమగమల్ కాఁబోలునందమా కల్పంబు ఘుమఘుమల్ కలవు కొంత
ఘనసాంకవము గబ్బు కాఁబోలునందమా లలిచందనపుఁగంపు కలదు కొంత

తే.గీ. ఎయ్యది దలంప నయ్యదే యిందుఁ దోచు । నరయ సద్గంధ సర్వస్వహారియైన
వస్తువెయ్యెడఁ గాన నీ వసుధలోనఁ । గలదవి గణింప నది యెంత వెలదియొక్కొ॥ ౧౨౧

తే.గీ. అనుచుఁ జనిచని ముందట నవనివిభుఁడు । రమ్యతరగాత్రి శృంగారరసవిధాత్రి
లోచనానందకర్త్రి శోభాచమత్క్రియాదిభర్త్రి నొకర్తుక నతఁడుగాంచె ॥ ౧౨౨

తే.గీ. కాంచియచ్చెరువంది భూకాంతుడపుడు స్తంభమునుఁబోలె నొక్కింతఁ దడవు కదల
మెదలఁ జాలకయుండంగ మెయిచెమర్చె । గగురుపాటును దడబాటు గలిగెనంత॥ ౧౨౩

తే.గీ. పదములఁ బదేపదేసూచి పైనఁ బైన । నూరువుల నూరువలనులఁ గోరిచూచి
కాంచి గాంచి కుచద్వయి కడలఁ జూపు । లిరుకునందునఁ గదలలే కీడిగిల్లె॥ ౧౨౪

క. రెప్పార్పక జననాధుం । డొప్పుల కుప్ప యొరపైన హొయలుంగని తాఁ
దెప్పిరిలె నెట్టకేలకు । నప్పా కాముకుల భావ మట్టిదియకదా॥ ౧౨౫

క ఆగంధము దానిదకా । సాగరవసనావిభుండు సరగున నెఱిఁగెన్
లోఁ గొన్నవలపు బలిమిన్ । దాఁగన్నియఁజూచి పలికెఁ దత్తరపడుచున్ ॥ ౧౨౬

క. వినుమా యిటుల భవాదృశ । వనజాక్షిప్రాగ భావవతియగు ధరణిన్
విను నేఁ దత్ప్రతియోగిని । వనుచున్ దలపోయుచుంటి ననుమానమునన్ ॥ ౧౨౭

తే.గీ. సారవాసనలెల్ల నీ చక్కినిలచెఁ । గలిగెనిది పూర్వభవవాసనలమబట్టి
యెపుడు సంసారవాసన లెఱుఁగనట్టు । లున్నదానవు పరికింపఁ జిన్నదాన ॥ ౧౨౮

ఉ. ఎవ్వతెవీవు నీ వెవని యింట జనించితి వేది కారణం
బివ్వని సంచరింపఁ జెలు లెవ్వరు గానఁగరాని హేతు వే
మవ్వ యెవర్తె తండ్రి యెవఁ డాయెనొ లేదొ వివాహమింతయున్
జివ్వనఁ దెల్పి నామనసు చిక్కను విప్పుము మ్రొక్కెదం జెలీ॥ ౧౨౯

ఉ. నావిని నవ్వి సిగ్గుఁబడి నాతియొకించుక దవ్వునందు దా
భూవిభుమోముఁ జూచి యొక పోలిక వాల్గనులార్చి దేవ దా
శావనిభర్తకూతురఁ దదాజ్ఞ జరించెదఁ గన్య ధర్మ స
ద్భావతఁ దెప్ప లాగెదను దండ్రి గృహంబున కేగెఁ గావునన్॥ ౧౩౦

వ. అని విరమించినఁ గాంతామణిం గాంచి కురువీరుండు మనోభవుని బారింబడి నిలువలేక యిట్లనియె. ౧౩౧

క. ననుఁ గురువీరుని నీభ । ర్తనుగా గైకోలుసేసి దర్పక శరబా
ధను దీర్పుము దాసుఁడ నే । ననుకొనుమీ ధర్మపత్ని వగుమీ నాకున్॥ ౧౩౨

క. మును నాకుఁ గల దొకర్తుక । చనియెం నను విడిచి పిదప సతి వేఱొకతెం
గనుఁ గొనలేదో ముద్దియ । నినుఁగాంచితి వలపు నిలుపనేరను జుమ్మీ॥ ౧౩౩

ఉ. నావిని కన్యకామణి ఘనంబగు సాత్వికభావవైఖరుల్
త్రోవనె రా నెదుర్కొనినఁ దోచియుఁ దోచని యట్లు కొంతసే
పేవిధిఁ బల్కనో యనుచు నెంచి ధృతిం దగఁ గీలుకొల్పి యో
భూవర తండ్రిచాటు పువుబోణిని న న్నడుగంగఁ బాడియే॥ ౧౩౪

ఉ. ఎల్లిదమైతిగాక నృప యెన్నదెఱుంగవె లోకవార్త నా
యుల్లమునందుఁ గోరిక లెటుండిన నేమి వివాహమైనచో
నల్లుఁడ వంచు మా జనకుఁ డంపిన నీకును ధర్మపత్నిగాఁ
జెల్లునుగాక వేఱొకటి చేసినచో నగుబాటుగాదొకో॥ ౧౩౫

ఉ. నీవును సార్వభౌముఁడవు నీకును నన్నొదఁగూర్ప కింక దా
నే వరు గొప్పవాని గణియించి ననుం బిత ధారవోయునో
భావజసన్నిభాంగ। మన పాలిటి దైవము మంచిదైనచో
ధీవరుదైన దాశనృపతిం మనవానిన చేయు నమ్ముమీ॥ ౧౩౬

ఉ. సిగ్గగుచున్నదో మనుజసింహ నినుం గని నప్పుడే యొదల్
గగ్గురుపాటెఁ జెమ్మటలు గ్రమ్మె నయో మదనార్తి కెంతయుం
గ్రగ్గినదాన వెక్కనపు మోహమిదెక్కడ దాపురించె నా
యగ్గలమైనదప్పి కధరామృతధార లొసంగి బ్రోవవే॥ ౧౩౭

క. మాతండ్రి సమ్మతించినఁ । బ్రీతిఁ గళ్యాణమొదవు పిత యొప్పనిచో
భూతలనాథ స్వయంవర । భాతిన్ సమకూర్చుకొనుము పాణిగ్రహమున్ ॥ ౧౩౮

క. విని రాజు దాశునింటికిఁ । జనిన నతఁడు మ్రొక్కిపలికె జననాయక దా
సుని నన్ను ధన్యుఁజేయఁగఁ । జనుదెంచితి వేది సెలవు సరగఁ దెలుపుమీ ॥ ౧౩౯

వ. అనిన జనవల్లభుండు. ౧౪౦

ఆ.వె. దాశవర్య నీదు తనయను నే ధర్మ । పత్నిఁ జేసికొనఁ బ్రయత్నపడితి
నందు కియ్యకొను మనం దాశుఁ డారాజుఁ । జూచి యిట్టు లను నయోచితముగ॥ ౧౪౧

ఆ.వె. చేయఁ దగిన పనిన చేయవలయుఁ గాక । చేయరానిదెట్లు చేయవచ్చు
నొక్కమాటయున్న దొప్పెదవా నీకుఁ । గూతు నిచ్చుటకును కొఱతలేదు ॥ ౧౪౨

వ. అది యెద్దియనిన. ౧౪౩

క. ఈరమణికి జనియించు కు।మారునకున్ రాజ్యమిచ్చి మన్నింపఁ దగున్
వేఱొక్క కుమారకునకు । నీరా దీ సత్యమునకు నియ్యకొనియెదో ॥ ౧౪౪

వ. అనిన విని రాజు గాంగేయు మనంబునం దలంచుకొని యిదియెట్లు సిద్ధింపఁ గలదని
చింతాక్రాంతుఁడై గృహంబునకుఁజని నిద్రాహారస్నానపానాదులు వర్జించి కుందు
చున్న నది యెఱింగి గాంగేయుండు తండ్రికడ కరిగి. ౧౪౫

ఆ.వె. నిదురలేక కుంద నీకేల నాతండ్రి । ప్రబలుఁడైన యొక్క పగతుచేత
గెలువఁ బడితె వేగఁ దెలుపు మే నిపుడేగి । గడియలోన వాని గర్వమడఁతు॥ ౧౪౬

క. తనయుఁడు పుట్టుట తండ్రిం । దనియించుట కొఱకుగాదె ధర్మజ్ఞులు చె
ప్పినదది తప్పదు ప్రాగ్భవమునఁజేసిన ఋణముఁ దీర్ప బుత్రుఁడుపుట్టున్ ॥ ౧౪౭

సీ. తండ్రివాక్యమును సత్యముసేయనేకాదె రాముండు సనియె నరణ్యములకు
తండ్రివాక్యమును దాఁ దలమోచియేకాదె పరశురాముఁడు తల్లి నఱికివైచె
తండ్రివాక్యము యథార్థముసేయనేకాదె పృథివి రోహితుఁడు దాఁ గ్రీతుఁడయ్యె
తండ్రిమాటనుదప్ప దగదనికా శునశ్శేపుండు యూపంబు సేరఁబోయె

తే.గీ. నాదికా దీ శరీరంబు నీద సుమ్ము । ఎందుఁ బంచినఁ బోయెద నేదిసేయు
మనినఁ జేసెదనింక నీ మనమునందుఁ దాపమేటికి శోకింప దగదు తండ్రి ॥ ౧౪౮

ఆ.వె. దేహమస్థిరంబు దేహి దాఁజేసిన । పనులు నిలిచియుండు జనవరేణ్య
చింతఁ దెలుపుమయ్య చేత విల్లమ్ములు । పూని విర్వహింతు భూమిమెచ్చ ॥ ౧౪౯

వ. అని పలికిన కొడుకుమాటలు విని రాజు లజ్జపడి నాయనా నే నేమనిచెప్పెద నాకు
నీవొక్కరుండవ కుమారుండవై తివి నా జీవితంబు వ్యర్థంబుగదా నీకుఁ గీడుకల్గెనేని

నాకుం గతియెద్దియని పగచుచుంటి నా కొండొకచింత గలదని నేను నీయెదుట నెట్లు వచింతునని తలవాంచి యూరకున్నంగని దేవవ్రతుండు వృద్ధబ్రాహ్మణులం బిలిపించి తండ్రియున్న విధంబును దన కతండు లజ్జచేఁ జింతాకారణంబుఁ దెలుపకుండుటయుం జెప్పిన వార లరిగి భూనాయకు నడిగివచ్చి యథార్థంబు తేటపడం దెలిపిన విని గాంగే యుండు. ౧౫౦

క. భూసురులఁగూడి దివిజన।దీసుతుఁ డద్దాశుఁజేరి తేటపలుకులన్
నీసుత మాతండ్రికి ని । మ్మీ సతిగా ననుచు నడుగ మేలని యతఁడున్ ॥ ౧౫౧

క. నాసుతను నీవ కొనినన్ । భాసురముగ దానికొడుకు ప్రభువై ప్రబలున్
వాసిగలిగి నీవుండగ । గాసిగదా రాజునకును గన్నె నొసగినన్॥ ౧౫౨

వ. అనిన గాంగేయుండు. ౧౫౩

మ. వినుమా దాశవరేణ్య నీతనయ పృథ్వీనాథు పేవించినన్
జనదే నాకును దల్లియై పిదపఁ దజ్జాతుల్ సుతుల్ రాజ్యమున్
గొనగా నేర్తురు నేను రాజ్యమును గైకోల్పేయకుండం దలం
చినవాడ న్మది నమ్ము మేటి కిఁక నీ చింతల్ దయం ద్రోవుమీ॥ ౧౫౪

క. అనిన విని దాశుఁ డిట్లను । ననుమానములేదు సత్య మావల నీకున్
దనయుండు గలిగి బలిమిం । గొనలేడా రాజ్యమెల్లఁ గుటిలుం డగుచున్ ॥ ౧౫౫

క. నావుడు భీష్ముం డిట్లను । నో వివిధవిధిజ్ఞ పెండ్లి నొల్లక ధృతిమై
గావించెద భీష్మవ్రత । మీ వింకం జింతనొంద నేటికిఁ జెపుమా॥ ౧౫౬

క. విని యంత పల్లెదొర దాఁ । దన తనయన్ శంతనునకుఁ దగ నొసఁగి సుశో
భనముగ బెండిలిఁ జేసెం । జనవిభుఁ డెఱుగండు వ్యాసు జన్మముసుండీ ౧౫౭

## — : ధృతరాష్ట్రిద్యుత్పత్తి. : —

సీ. మునులార యివ్విధంబున సత్యవతి శంత।నుని బెండ్లియాడిన వెనుక వాపె
యిరువురు తనయుల నెనసె వారలు పోయి । రవల దద్భార్యలయందు వ్యాసు
వీర్యంబునను బుట్టె వింటిరకా ధృత।రాష్ట్రుండు గ్రుడ్డియై రాజ్యమునకుఁ
బాత్రుండు గాడాయెఁ బాండురాజును బుట్టె । విదురుండు దాసియం దుదయమయ్యె

తే.గీ. ప్రథమ కన్నులుమాయుటఁ బట్టి కొడుకు । చీకువాడాయెను ద్వితీయ చేరి తెల్ల
బోయె తందుత శ్వేతరూపుడు జనించె । మూడవది సంతసిలి కాంచె ముద్దుకొమరు ॥ ౧౫౮

సీ. అంతట భీష్ముని యనుమతిఁ బాండురా । జేలె రాష్ట్రంబు విరీతికముగ
విదుడు మేధావియౌ విదురుండు మంత్రిత్వ । మెనసి మంత్రము నిర్వహించుచుండె
ధృతరాష్ట్రుఁడనువాని కిద్దరు భార్యలు । గాంధారి సౌబలి క్రమముమీర
భామ రెండవయది కోమటి చిన్నది । గార్హస్థ్యధర్మముల్ గడుపుచుండె

తే.గీ. పాండునకు భార్యలిరువురు పరగఁ గుంతి । మాద్రియు ననంగ గాంధారి మహితులైన
సుతుల నూర్వుర గనె యుయుత్సుండనంగ । గడుపు పంటాయెఁ గోమటిపడుచునకును ॥

ఆ.వె. పెండ్లిగాకమున్నె పితృగేహమున గుంతి । సూర్యవంశమెనయ సుతునిగాంచె,
బిడ్డ కర్ణుఁడనుచు బిలిచిరి భూప్రజల్ పిదపఁ బాండురాజుఁ బెండిలాడె ॥ ౧౬౦

వ. అవిన విని ఋషులు సూతున కిట్లనిరి. ౧౬౧

క. భువిపైఁ గుంతికి దివిపై । రవికిన్ సంయోగమెట్లు రహి గర్ణుని సం
భవమెట్లు కన్యయై యెటు । ప్రవిమలతం దండ్రి యింట బాల వసించెన్ ॥ ౧౬౨

వ. మహానుభావుండవైన నీకుం దెలియనిది లే దిది మాకుం దెలిపి కటాక్షించవే యనిన
సూతుండిట్లనియె. ౧౬౩

ఆ.వె. శూరసేనరాజుసుతఁ గుంతిఁ; గుంతిభో।జుండు పెంచుచుండి సుకృతులయిన
వారిఁబూజసేయఁ బంచిన నట్ల తా । వించుచుండెఁ గన్య విధులెఱింగి ॥ ౧౬౪

క. ఈసరణి నుండఁగా దుర్వాసుండను జటిల విభుఁడు వచ్చినఁ గని పూ
జాసామర్థ్యము జూపిన । దా సంతోషించి మిగుల దయదైవారన్ ॥ ౧౬౫

క. కన్నియ నీకొకమంత్రము । చెన్నుగఁ జెప్పెదను దానిఁ జేకొని జపమున్
గ్రన్నన జేసిన నీకుఁ బ్రసన్నుండగుఁ గాంక్షితార్థచరుఁడని పలికెన్ ॥ ౧౬౬

చ. అతఁ డది సెప్పి యేగిన యనంతర మా కలవాణి మంత్రశు
ద్ధతఁ గనుగొందువంచు నొక దైవము నారసి యప్పుడే ప్రపూ
ర్ణత నుదయించియున్న దిననాథుఁ దలంచి జపింప మానుషా
కృతి రవి భూమికిం దిగియె రివ్వునఁ గన్యకయున్నచోటికిన్ ॥ ౧౬౭

తే.గీ. ఆ మహోవిధి వీక్షించి యబలమిగుల । సిగ్గుపడి యొక్క టనలేక చెదరిబెదరి
మూలమూలల కొదుగుచు ముఖమువాంచి । యెట్టకేలకు ధృతిబూని యిట్లులనియె ॥ ౧౬౮

ఆ.వె. మానకేను మంత్రమహిమంబు పరికింప । నిను జపించినంత నీవు గరుణఁ
జేసి తింతెచాలు నా సేయు పుణ్యంబు । సఫలమాయె ఘొమ్ము సత్యచరిత॥ ౧౬౯

వ. అనిన విని దివాకరుఁడు. ౧౭౦

క. క్రన్నన మంత్రముచేతన్ । వన్నెతికిఁ గోరితివు వనజదళాక్షి
విమ్నం గలయఁగఁ గోరిక । యున్నది తీర్చెదవా లేదొ యువిదా చెపుమా ॥ ౧౭౧

క. అయ్యయ్యో నేఁ గన్యక । నయ్యు గృహంబుననె యుంటి నార్యులు నగరా
వెయ్యారులుగా మ్రొక్కెద । నయ్యా పోవయ్య నాకు నారడు లేలా ॥ ౧౪౨

క. అనుడు దిననాథు డిట్లను । వనితా నే నిన్ను జూడవచ్చియు వృథగా
జనిన ననుఁజూచి నగరే । వినుమా యిది వినకయుందువే కీడౌదవున్ ॥ ౧౪౩

తే.గీ. మంత్రమును నీకొసంగిన మౌనిపనియు । నీపనియుఁ జూడుమిక నేను శాప మిత్తు
జెప్పినట్లొనరించినఁ జెలియ నీకు ధర్మమెరియదు నావంటి తనయుఁ డౌదవు॥ ౧౪౪

ఆ.వె. పిలువగానె వచ్చి ప్రియురాలవగుమని । తేటలైన మంచిమాటలాడ
గన్నెపడుచ ననినఁ గనులెఱ్ఱఁగాఁజేయఁ । బొంచి పొంచి ప్రొద్దుఁ బొలతిఁ గలసె॥ ౧౪౫

క. చెన్నుడు గలసిన గడియన । కన్నియ గర్భంబుదాల్చె గర్భంబై తా
నున్న క్షణంబుననే యొక । చిన్నకొడుకుఁ గనియె నిది విచిత్రముగాదే ॥ ౧౪౬

ఆ.వె దాది యొకతెదక్క దక్కనవా రేరు । నెఱుగ రిద్ది పిదప నిద్దమూర్తి
యైన బాలుఁ జూచి రా యిర్వురును దమ । కన్నులార నొక్క గడియసేపు॥ ౧౪౭

ఆ.వె. కవచకుండలములు గడుసొంపుమీరంగ । భువిని బొడుచు సూర్యుపోల్కి నపర
శక్తిధరునిచాయ జను బాలకుని దాది । కరములందు నిడుక కన్య కనియె ॥ ౧౪౮

క. ఎందుకుఁ జింతించెద వో । మందగమన వీని నొక్క మందసమందుం
బొందింపుమమ్మ విడిచెద । నెందేనిం బోవుఁ బిదప నెట్లగునొక్కో॥ ౧౪౯

వ. అనిన. ౧౫౦

తే.గీ. ఏమిసేయుదునమ్మ నే నిపుడు దాది । యింతముద్దులబిడ్డ నే నెట్లువిడుతు
దైవగతి యిట్టులాయె నెద్దారి నాకు । బిడ్డ బిడ్డా యనుచు విలపించెఁ గుంతి॥ ౧౫౧

వసంతతిలక. రక్షించుమమ్మ శ్రుతిపారగ కామదాత్రీ
రక్షాకరీ జగదుదారపురాణకీర్తి
ప్రేక్షావశీలలితమూర్తి సమస్తధాత్రీ
పక్షీంద్రవాహన శివాబ్జకుమారకీర్తి ॥ ౧౫౨

క. అమ్మా ముజ్జగముల గ । న్నమ్మా యీచిన్నబిడ్డ దాకలిఁగొనుఁ బా
లిమ్మా నమ్మితినమ్మా ముమ్మాటికి నీదుపాదములె దిక్కమ్మా॥ ౧౫౩

తే.గీ. విజనవనమందు బిడ్డని విడువనాయె । నయ్యయో యెంతదౌర్భాగ్యురాలనైతి
నెంతపాపము వచ్చె నా కేదిగతియొ । యనుచు మందసమునఁ బాలు నునిచి యంత॥ ౧౫౪

ఆ.వె. దాదిచేతికిచ్చి యోదేవి రక్షింపు మనుచుఁ గొంతసేపు వనటఁగుందెఁ
బిదప దాది చిన్న బిడ్డనిఁ జాటుగా । గొని చనంగ మార్గమున నెదిర్చి॥ ౧౫౫

క. సూతునివెలఁదుక రాధ మ । హాతతమతి దాదిఁ జూచి యది యెద్దియనం
బ్రీతిమెయి నిజముసెప్పగ । నాతనయుని జేసికొందు నా కిమ్మనినన్॥ ౧౮౬

తే.గీ. రాధ దాఁ బెంచెఁ గర్ణుని రహి నతండు । సూతునింటను బెరిగి విఖ్యాతుఁడయ్యె
నతిబలుండని జగమెల్ల నభినుతింప । నతని మహిమంబుఁ దెలియు భారతమునందు॥ ౧౮౭

తే.గీ. పిదపఁ బాండుని వరియించె భీతహరిణ । నేత్ర కుంతి స్వయంవర నిపుణయగుచు
మద్రరాజు కుమారిక మాద్రియనెడు । భామినియుఁ బాండు రెండవ భార్యయయ్యె॥ ౧౮౮

తే.గీ. వేటకని పాండురాజు దా విపినమునకుఁ । బోయి మృగరూపు నొకముని నేయ నతఁడు
శాపమిచ్చెను నీకు స్త్రీ సంగమంబు । గలిగినప్పుడె మరణంబు గలుగునంచు॥ ౧౮౯

క. అది విని శోకాతురుఁడై । వదలెను రాజ్యం బరణ్యవాసము సేసెన్
మదవతు లిద్దరు దనకున్ । ముదమునఁ బరిచర్యసేయ మునుకొని యచటన్॥ ౧౯౦

సీ. మందాకినీ తీరమందు ఋష్యాశ్రమంబులనుండి తపమును సలుపుకొనుచు
మునిముఖ్యులు పురాణములు ధర్మశాస్త్రముల్ చదువంగఁ జెవులొగ్గి చాలవినుచు
సుతులు లేకున్నను గతులు లేవను నట్టివాక్యమొక్కటి విని వనటఁ బొగిలి
అంశజుండును మహితాత్మజుండును క్షేత్రజుండును మరి గోళకుండు కుండుఁ

తే.గీ. డును సహోఢుండు కానీనుఁడును దలంపఁ । గ్రీతుఁడును బ్రాప్తుఁడును బరికింప దత్తు
డనెడువా రుత్తరోత్తర మల్పతరులు । ననుచుఁ దా నెంచి కుంతితో ననియె నిట్లు॥ ౧౯౧

క. నాయాజ్ఞను గైకొని యో । ప్రేయసి తాపసునిఁగూడి ప్రియపుత్రుని స
న్న్యాయమున గనుము నా విని । యాయమ యిట్లనియె సర్వరాధీశునకున్॥ ౧౯౨

తే.గీ. తొల్లి దుర్వాసుఁ డధికసంతోషమునను । నాకొసఁగె మంత్రమొక్కటి నాథదాని
వలనఁ గోరిన దేవుండు వచ్చి యిచ్చు । వరమనుచుఁజెప్పి పతియాజ్ఞ వడసి పిదప॥ ౧౯౩

సీ. ధర్ముని జపియించి తద్వరంబునఁ జేసి శ్రీమంతుఁడగు యుధిష్ఠిరునిఁ గనియె
వాయువుఁ బ్రార్థించి వానివరము గాంచి పృథుబలుండైనట్టి భీముఁ గనియె
నమరేంద్రుఁబ్రార్థించి యతని వరంబున సుప్రభుండైన యర్జునునిఁ గనియె
వర్షవర్షంబున వరుసగా మువ్వుర సుతులను బడసి యా సుదతి యలరె

తే.గీ. నంత మాద్రియు మదిని బుత్త్రాభిలాషఁ । బతినిఁ బ్రార్థించి యానతిం బడసి కుంతి
వదిగి మంత్రంబుగైకొని యశ్వినులనుదలఁచి నకులుని సహదేవు దాను గనియె. ౧౯౪

తే.గీ. ఇట్టు లా కావనంబున బుట్టి తిరుగు । చుండ నొకనాడు మాద్రిని పాండురాజు
వలదు వలదన్న వినక దా వలపుదగిలి । కూడె నంతట ధరణిపై గూలె నతడు॥ ౧౯౫

వ. ఇట్లు విగతాసుండైన పాండుభూపతిం గాంచి కుంతియు మాద్రియు శోకాకులలయి
యుండం గాంచి యచ్చటి ఋషులు వారి నూరడించి యుత్తరక్రియలు యథావిధి
జరిపి మాద్రి యనుగమనం బపేక్షింప నట్లకావిమ్మని యామె బిడ్డలం బోషింపఁ
గుంతికి నియోగించిహస్తిపురంబునకుం బంచిన వచ్చి పురంబున ప్రవేశించినం గని. ౧౯౬

క. త్రిదశనదీతనయుండును । విదురుఁడు ధృతరాష్ట్రుఁ డఖిల విద్వజ్జనులుం
గదియం జని యా కుంతిని । మృదువుగ నడిగిరి కుమారు లెవ్వ రటంచున్ ॥ ౧౯౭

వ. అది విని. ౧౯౮

క. సురల ప్రసాదంబున బు । ట్టిరి కురుకుల ముద్ధరించుచే పనిగా నీ
చిఱుత లల సురలమంత్రము । వరశక్తిం బిలువ వారు వచ్చి ముదమునన్ ॥ ౧౯౯

తే.గీ. వీరు మాబిడ్డ లిది సత్య మీరు నమ్ము । డనుచు వచియించి చనిన సురాపగాసు
తుండు మున్నగువారు సంతోషమంది । రాజగృహముల కంపి రవ్యాజలీల ॥ ౨౦౦

వ. అని చెప్పి సూతుండు మరియు ౨౦౧

-: యుధిష్ఠిరాది చరితము. :-

క. ఆ పాండవు లయిదుగురికి । ద్రౌపది సతియై పతివ్రతామహిమంబున్
జూపెన్ నరునకుఁ దాదశ । రూపధరానుజ సుభద్ర ప్రోయాలయ్యెన్ ॥ ౨౦౨

తే.గీ. ఆ సుభద్రకు నభిమన్యు డాయెఁ గొడుకు । ద్రౌపదేయులు వారును దరలి రాజి
నతని భామిని యుత్తర యాపె గర్భవతియగుచునుండె నభిమన్యు మృతికిమున్న॥ ౨౦౩

మ. శ్రమమింతేనియు లేక క్రోధమున నశ్వత్థాముఁ డత్యుగ్ర బా
ణము నేయన్ శిశు వేడ్చె గర్భమున న న్నారీవతంసంబు దుః
ఖముతోఁ గృష్ణుని వేడినం గరుణమై గాచెం బరిక్షీణభా
వము నొందం గులముద్ధరించుటను బే ర్వచ్చె న్పరీక్షిత్తునాన్ ॥ ౨౦౪

తే.గీ. సౌరిది దుర్యోధనాదులౌ సుతులు వారి । సుతులునందఱు వోవంగ శోకవార్ధి
బడిన ధృతరాష్ట్రు గాంధారి పరిచరణము । చేసి కాపాడె రే బగల్ సేతులార ॥ ౨౦౫

క. ధర్మజ్ఞుఁడైన విదురుఁడు । నిర్మలమతి నతనియొద్దనే యుండి సదా
శర్మదమగు ప్రజ్ఞానము । నర్మిలి బోధించె ధర్మజానుమతిఁ గదున్ ॥ ౨౦౬

తే.గీ. ధర్మజుండును ధృతరాష్ట్రు కర్మగతికిఁ । గడువగచి వాని పరిచర్య నుడుగకుండె
పొరలికొనువచ్చు దుఃఖాంబుపూరములను । దుడిచె నప్పప్ప యతఁ డెంతదొడ్డవాడు ౨౦౭

ఉ. గుడ్డివికావె పిండమునకుం బడియుంటివి యింట నీవు ము
న్నడ్డితివేమొ నీకొడుకులందఱు దుర్మతు లెన్నిపాట్లు మా
కొడ్డిరి మేలు మేలనుచు నూరకయుంటివి చాలు గొంగడీ
గుడ్డయుఁ గట్టియుం దమిదకూ డిపు డో ధృతరాష్ట్ర నీకునున్ ॥ ౨౦౮

ఉ. తోచెనె మేలు ధర్మజుని దొడ్డతనంబు గ్రహింపలేక యా
నీచులు నీకుమారులు వని న్మము ద్రోచిననాడు, నేడు నీ
వాచవి దీర్ప రాజనపువడ్లను దంపిన బియ్యమేసుమా
చూచితివొక్కొ ధర్మజుని శుద్ధమతిన్ ధృతరాష్ట్ర చెప్పుమా ॥ ౨౦౯

చ. అలిగిననేమి యెత్తిపొడుపంచు దలంచిన నేమి దెప్పలన్
వలచితి వీవు ము న్నిటుల వచ్చునొకో యని యెంచకుంటివే
తలఁగక దుస్ససేనుఁ డటు ద్రౌపది కొప్పునుఁబట్టి లాగిన
ప్డలఘుఁడు ధర్మజుండె గతి యాయెనుగా ధృతరాష్ట్ర నేటికిన్ ॥ ౨౧౦

ఉ. కాకికి వేయలేదె కణ కాండము కుక్కకుఁ బోయలేదె గం
జీకుడు పొక్క గౌరవమె యెక్కడికేగితివయ్య లక్కయి
ల్లో కురువంశవర్ధన మహోగ్రహుతాశనుపాలుచేసిన
ప్డీకడఁ బొట్టనిండ భుజియించెదె పప్పును గూడు నేయియున్. ౨౧౧

వ. ఇవ్విధంబున భీముండు నిష్ఠురంబులాడుచుండ వినుచు ధృతరాష్ట్రుండు పదునెనిమిది
వత్సరంబులుండి యొక్కనాడు ధర్మజుంగాంచి యిట్లనియె. ౨౧౨

ఉ. అన్న సమస్త మీవెఱుఁగు దందఱు వోయిరి మీరె దిక్కు నే
నున్నవిధంబు సూచితి వయో వనభూములకేగి మౌనివృ
త్తి న్నిరపాయమార్గము మతిం దలపోయఁ దలంపు పుట్టె నన్
మన్నన చేసి పంపుము శ్రమంబని యెంచక ధర్మపుత్రకా ॥ ౨౧౩

తే.గీ. అందఱికి వాయుజుఁడొసంగె నౌర్ధ్వదైహి । కములు నాబిడ్డలకునివ్వఁ డమితమైన
క్రోధమునఁజేసి కావునఁ గొడుకులకును । నౌర్ధ్వదైహికము లొనర్తు నచొటువోయి ॥

క. మనమున నలుగక చాలిన । ధన మిప్పింపుమని యడుగ ధర్మజుఁడు మనం
బున నొడఁబడి తనవారల । ననుమతికై యడుగ భీముఁ డతి కుపితుండై. ౨౧౫

శా. ఏమీ యీయఁగవచ్చు బొక్కసమునం దెంతేని మూల్గిన్ ధనం
బామిత్రుండు సుయోధనుండు మన కత్యంతంబు మేల్సేసెఁ దే

లేమా యొక్కన ముత్తదైన బవరా ల్చేయంగలేమా చనన్
లేమా దేశము లెన్ని సంచులు వడిఁగా లెక్కింపు డెక్కింపుడీ. ౨౧౬

సీ. పాంచాలి సిగఁబట్టి పడలాగినందుకా గ్రుడ్డివానికి సొమ్ము కొల్లయిడుట
అఖిలంబు గొని యరణ్యము నంపినందుకా గ్రుడ్డివానికి సొమ్ము కొల్లయిడుట
పోరి భాగ మడిగిన బొమ్మనినందుకా గ్రుడ్డివానికి సొమ్ము కొల్లయిడుట
పడరానిపాట్లన్ని పడనేసినందుకా గ్రుడ్డివానికి సొమ్ము కొల్లయిడుట

తే.గీ. నీవు కంకుడవైనందుకా వలలుఁడ । నేనయినయందుకా కన్నె నెఱిబృహన్న
లయినసైనందుకా కవల్ హయసురభుల । గాచినందునకా సొమ్ము దోచునితడు ॥ ౨౧౭

క. అని ధనము నీను పో పొ । మ్మని భీముడు ననిన ముప్వు రనుజుల యొడబా
టెనసి యుధిష్ఠిరుఁ డిచ్చెను । ధనమును ధృతరాష్ట్రునకును ధర్మజ్ఞుండై. ౨౧౮

క. అది గొని ధృతరాష్ట్రుఁడు తన । మదవతియుం దాను నుచితమార్గంబున నా
ప్పిద మొదవ నౌర్ధ్వదైహిక । సదమలకర్మములు పుత్రసమితికిఁ జేసెఁ ॥ ౨౧౯

తే.గీ. విపినమున కేగ సమకట్ట విదురుఁ డొకఁడు । కుంతియొక్కతె దమవెంటఁ గూడివత్తు
మనిన వారలతోఁగూడి యతిరయమున । బోయి రడవికి వైరాగ్యపూర్ణులగుచు ౨౨౦

క. వలదని కొడుకులు సెప్పిన పలుకులు విన కేగెఁ గుంతి వారలతోడఁ
వెలువడిరి ధర్మతనయా । దులు పౌరులఁగూడి కొంతదూరము దనుకఁ ॥ ౨౨౧

తే.గీ. సురనదీతీరవసుమతివరకుఁ బంపి । మరలివచ్చిరి హస్తినాపురికిఁ బ్రీతి
నంత విదురాదులు శతయూపాశ్రమంబు । పట్టి తృణములతో నిండ్లు గట్టుకొనిరి. ౨౨౨

క. వినుఁ డాఱువత్సరంబులు । చనె నిట్టుల నొక్కనాడు సామజపురిలో
ఘనుఁడు యుధిష్ఠిరుఁ డొక కలఁ । గనియెం దుర్బలను గుంతిఁ గాంచినయటులఁ॥ ౨౨౩

వ. అట్లు కలగని లేచి యుధిష్ఠిరుండు తన స్వప్నంబుభంగిఁ దమ్ములకుం దెలిపి కుంతీ విదుర ధృతరాష్ట్రులంజూడఁ గోరిక వొడముచున్నదనిచెప్పి మీకిష్టంబయేని యట్ల చేయుదమని తమ్ముల నొప్పించి భీమార్జున నకుల సహదేవులును సుభద్రా ద్రౌపద్యుత్తరలును బౌరజనంబులును వెంటరా బయనంబై శతయూపాశ్రమంబుఁ బ్రవేశించి యచట నందఱిం దర్శించి విదురుం గానక ధర్మజుం డాంబికేయున కిట్లనియె. ౨౨౪

తే.గీ. అంబికాపుత్ర యనఘుఁడై నట్టి విదురుఁ । డెంతసూచినఁ గానరా డేడనున్న
వాఁడనిన నాతఁ డిట్లని పలికి ధర్మ । తనయ యతఁడు విరక్తుఁడై యునికిఁ జేసెఁ ౨౨౫

శా. ఏకాంతంబున విస్పృహుండగుచు నెందేపోయి బ్రహ్మహమం
చేకోహమ్మనుచున్నవాడనిన భూమీశుండు దా నంత నా
కాకోవాహినిచెంతఁ బోవునెడ నొయ్యంజూచె క్షామాంగు న
స్తోకానందమయాత్మునిగా విదురునిన్ శుద్ధాద్వితీయస్థితున్ ॥ ౨౨౬

మ. అనఘాయాద్వయరూపిణే విదురనామ్నేపాయజేత్రే నమో
స్తనుచు న్మొక్కిన వీనులం బడియు వి న్నట్లింతయుం గానరా
కనివార్యస్థితి నూరకుండఁగఁ దదీయాస్యంబునందుండి గొ
బ్బునఁ దేజం బొక టుద్భవిల్లి కలసెగా భూనాథు నాస్యంబునన్ ॥ ౨౨౭

ఆ.వె. ధర్మతేజమపుడు ధర్మాంశజునియందుఁ బడినయపుడ విదురు పాటు సూచి
శుద్ధమూర్తి ధర్మజుండు శోకాకుల । చిత్తుఁడగుచుఁ గొంతసేపు చూచి ॥ ౨౨౮

ఆ.వె. విదురదేహదాహ విధికినై తలపోయు । చుండ నాకసమున నొక్కపలుకు
వీనులంబె నితఁడు వినుము విరక్తుండు । దాహవిధులు సేయఁదగ దటంచు ॥ ౨౨౯

క. విని గంగాజలమున నా । తని దేహమువైచి పెద్దతండ్రికి విజ్ఞా
పనచేసి వారలందరు । వనముననే యుండఁ గొన్ని వాసరములకున్ ॥ ౨౩౦

వ. బ్రహ్మపుత్త్రుండును దపోనిధియు నగు నారదుండును ధర్మకోవిదుండును, నిఖిల తత్త్వైకవేత్తయు నగు వ్యాసుండును, మరికొందఱు తాపసులును గూడి యవ్వనంబున వాసంబుసేయు యుధిష్ఠిరాదులం జూడ విచ్చేసినం గాంచి ధర్మజుండు వారల యథోచితంబుగాఁ బూజించి కూర్చుండ నియోగించియున్న సమయంబున వ్యాసుం గాంచి కుంతి యిట్లనియె. ౨౩౧

ఆ.వె. కన్ననాడు నేను కర్ణునిఁ జూచితి । వాని మొగము చూడవలయునంచు
మనము మిగులఁ దప్యమానమౌచున్నది । చూపుమయ్య నాకు శుభచరిత్ర ॥ ౨౩౨

వ. అంతట గాంధారియు నిట్లనియె. ౨౩౩

ఆ.వె. సమరమునకుఁ బోవు సమయంబునందు నా । సుతు సుయోధనాఖ్యుఁ జూడనైతిఁ
జూపుమయ్య వారి సోదరిఁ దమ్ములతోడ । మునివరేణ్యాగణ్య భూరిపుణ్య ॥ ౨౩౪

వ. సుభద్రయు నిట్లనియె. ౨౩౫

తే.గీ. ప్రాణములకంటెఁ బ్రియుఁడయి పరగినాడు । వీరులందెల్ల గణ్యుఁడై వెలసినాడు
సూను నభిమన్యు నొక్కింత చూపుమయ్య । దివ్యగుణగేయ సాత్యవతేయ నీవు ॥ ౨౩౬

క. అవిన విని వ్యాసముని దా । మనమున దేవిం దలంచి ప్రాణాయామం
బును పట్టి యుధిష్ఠిరుఁడున్ । మునుగాఁగల వారినెల్ల ముదమొందింపన్ ॥ ౨౩౭

క. ముని సంధ్యాకాలము రాఁ। గని వారలఁ దోడికొనుచు గంగకుఁ జని యం
దున స్నాతుండై దేవి। న్మనమున ధ్యానించె నిట్లు మఱి మఱి భక్తిన్॥ ౨౩౮

ఉత్సాహ. ప్రకృతివీవ పురుషుఁడీవ పాంచభౌతికప్రపం
చకమునీవ సకలమీవ చంద్రుఁడీవ తిగ్మరో
చికుఁడవీవ నభమునీవ క్షితివినీవ నేరమెం
చకుము నన్ను బ్రోవుమమ్మ శక్తిదేవి భగవతీ॥ ౨౩౯

ఉత్సాహ. అజుఁడవీవ శివుఁడవీవ హరివినీవ యాహవి
ర్భుజుఁడవీవ పాశివీవ పుణ్యమీవ యాజక
వ్రజమునీవ యాజివీవ వాయువీవ కశ్యప
ప్రజవునీవ బ్రోవుమమ్మ భగవతీ మహామతీ॥ ౨౪౦

కురంగప్రయాతము. మణిద్వీపనేత్రీ మహామంత్రశక్తీ
గుణోపేతగాత్రీ గురుశ్రీకమూర్తీ
ఘృణాశాలినీ నీ కిదే మ్రొక్కినాడన్
బ్రణామంబు లాదారశక్తీ సుయుక్తీ॥ ౨౪౧

భుజంగప్రయాతము. సమస్తంబు నీయందు సంభూతమయ్యెన్
సమస్తంబు నీయందు సంపుష్టమయ్యెన్
సమస్తంబు నీయందు సల్లీనమయ్యెన్
మముం బ్రోవ నీవే యుమాశక్తి రావే॥ ౨౪౨

క. మృతులం జూపుమనుచు ని। య్యతివలు ప్రార్థించి రెట్టులగు నాచేతన్
గతి నీవే యని నమ్మితి చతు। రతఁ జూపింపుమమ్మ చయ్యనఁ దల్లీ॥ ౨౪౩

తే.గీ. ఇట్లు వ్యాసుండు ప్రార్థింప నిద్ధచరిత। యాశ్వరేశ్వరి భగవతి కృపదలంచి
స్వర్గముననుండి కోరిన జనులఁ బిలచి। చేర రప్పించి చూపించెఁ బేరువరుస. ౨౪౪

తే.గీ. కుంతి సంతోషమందెను గొడుకుఁజూచి। చెలగె గాంధారిబిడ్డలఁ జేరి కాంచి
యలరెనుసుభద్రతనయునొయ్యఁదిలకించి।దేవిమాహాత్మ్యమును వ్యాసుతెలివి గనుఁడి॥

తే.గీ. మౌనిప్రార్థింప భగవతి మహిమఁజేసి। యింద్రజాలంబుజూపిన ట్లెల్లవారు
మరిగి రొక్కొక్క రమరేంద్రపురికి నంత।బనివినిరి మునివరులును బాండవులును॥

వ. తదనంతరంబ వ్యాసమహిమ లుగ్గడింపుచు ధర్మజుండు హస్తిపురంబు బ్రవేశించె
నని చెప్పి సూతుండు వెండియు నిట్లనియె. ౨౪౭

### —: ధృతరాష్ట్రాది మరణవృత్తాంతము :—

క. తరువాత మూడునాళ్లకు । నరిగిరి సురపురికి దవహుతాశనకీలా
పరివృతులయి ధృతరాష్ట్రుఁడు । మఱి గాంధారియును గుంతి క్రమగ్గుచు నొకటఁ. ౨౪౮

ఉ. అంతకుమున్న సంజయుడు యాత్రకుఁబోయినవాఁడు గాన దా
నింతయు బ్రహ్మసూతి వచియింప నెరింగి యుధిష్ఠిరుండు బల్
చింతవహించె నప్పటికి జేరెను ముప్పదియారు వర్షముల్
వంతల గౌరవుల్ యముని వాసముచేరిన దాది సేయఁగఁ. ౨౪౯

వ. అది యట్లుండ బ్రభాసతీర్థంబున విప్రశాపంబునం జేసి యాదవులు క్షయించిరి. బలభద్రుండును నిర్యాణంబు నొందె. వ్యాధబాణహతుండై కృష్ణుండు దేహంబు విడిచె. నరణ్యంబున వసుదేవుండు గాయత్యాగంబుచేసె. నంతట బార్థుండు ప్రభాస తీర్థంబునకుంబోయి శోకాకులుండగుచు యథావిధి నెల్లరకు సంస్కారంబులుచేసి కృష్ణుని దేహంబుతోడ రుక్మిణి మున్నగు నెనమండ్రు భార్యలం జేర్చి దాహకృత్యంబు నెరపి రేవతితో బలభద్ర దేహసంస్కారంబుఁ గావించి ద్వారక కరుదెంచి యందున్న జనుల బహిర్నిష్క్రమణంబు చేయించె. నంత ద్వారక సముద్రంబున మునింగెఁ దదనంతరం బర్జునుం డింద్రప్రస్థపురంబు బ్రవేశించి యదురాజ్యంబునకు ననిరుద్ధకుమారు వజ్రు నధిపతింజేసి యది వ్యాసునకెరింగించిన నతండు వజ్రుంగాంచి తొల్లి శ్రీకృష్ణుండెట్టుల నట్టుల నీవుగ్రతేజుండవు కాగలవని చెప్పి చనియెఁ బిమ్మట సుభద్రాప్రియుండు హస్తిపురంబు ప్రవేశించి ధర్మరాజునకు యాదవకులక్షయంబు క్రమంబుగాఁ జెప్పి శ్రీకృష్ణుండు దేహంబు చాలించెనని చెప్పిన నతం డతిదుఃఖితుండై నిజరాజ్యంబునకు నుత్తరాకుమారుం బ్రభువుంజేసి తాను రాజ్యంబు సేయనారంభించె నది మొదలు ముప్పదియారవ వత్సరంబుతుద హిమాచల సమీపారణ్యభూములకు ద్రోవదియుం దమ్ములుం దోడరాఁ బయనంబుచేసి చని వనంబులం బ్రవేశించి యచట నందఱు ప్రాణంబులం ద్యజియించిరి. ఇచట ధార్మికుండైన పరీక్షిన్నరేంద్రుం డతంద్రితుండై యఱువదియేండ్లు ప్రజాపాలనంబుఁ జేసె నంత. ౨౫౦

తే.గీ. వేటవేడుక నుత్తరబిడ్డ విపిన భూములకు విల్లునమ్ములు పూనియేగి
మృగములవధించి యెండలో మిగులదప్పి । గొని యొకమునీంద్రు నాశ్రమంబునకుబోయి॥

తే.గీ. చని యచట ధ్యానమందున్న మునిని జూచి । జలము నడిగిన ముని మాఱుపలుకకున్న
గనలి మృతసర్పమును వింటికొనను(బట్టి । యతని మెడ నిడెఁ గలిజితప్రతిభుఁడగుచు॥

క. ఆముని ధ్యానపరుండై । యేమియు నెరుగండుగాన నింతట ఘనతే
జోమూర్తి దాంతచిత్తుఁడు । ధీమహితుఁడు మిత్రసంగతిం దిరుగునెడన్॥ ౨౫౩

వ. అమ్మునికుమారుండు. ౨౫౪

క. తనదండ్రి కంఠసీమను । జననాథుం డొకఁడు సర్పశవ మిడెనని చె
ప్పిన మిత్రుల మాటలు విని । చనుదెంచి కనంగ నద్ది సత్యంబాయెన్. ౨౫౫

తే.గీ. కనలి యంజలిజలమిడి కణకణయని । కనులు నిప్పులురాలంగ జనుడెవండు
తండ్రిమెడ సర్పశవమిడెఁ దప్పకతఁడు । సప్తదినములఁ జచ్చు దక్షకునిచేత. ౨౫౬

క. అని శపించిన వార్తను । మునిశిష్యుం డొకడు వోయి భూపతికి వివే
దనసేయఁగ విని యాతఁడు । మనమును దుఃఖాంబురాశి మగ్నముసేసెన్. ౨౫౭

తే.గీ. అయ్యయో యనివార్య మీ యమికుమారు । శాప మిదియేమిపాపంబు సంభవించె
ననుచు మంత్రులఁ బిల్పించి యడిగె నేయుపాయ మీశాపముక్తికి ననుచు నతఁడు. ౨౫౮

చ. వినుఁడు వచింతు నిందునకు వేఱొకవీలు ఘటింపఁనేర దే
మనిన నుపాయమార్గమున నౌరగహాలహల ప్రతిక్రియన్
గననగుఁ దొల్లి యొక్క మునికాంత భుజంగమదష్టయయ్యె దా
మనియె నటంచుఁ బల్కుదురు మానవయత్నము కొంత కాఁదగున్. ౨౫౯

తే.గీ. మనుజయత్నంబులేక యేపనియుఁ గాదు । ఇలవిరక్తుండయేని దా నింటనింట
దిరుగఁదగు భిక్షకొరకునై తిరుగ కొక్క । చోటఁ గూర్చున్న బోనంబు నోటబడునె.

వ. అనిన మంత్రులు ౨౬౧

క. ఆముని యెవ్వం డాతని । కామినిపేరేమి యెట్లు గరచెను సర్పం
బామీద నేమిజరిగెను । భూమీశ్వర తెలుపుమయ్య పూర్తిగ ననినన్. ౨౬౨

సీ. భృగుపులోమలు గన్న బిడ్డండు చ్యవనుండు పెండ్లాడె శర్యాతి ప్రియతనూజఁ
గన్య సుకన్యనా కాంతయుఁ బ్రమతిని గనియె నాతడు ప్రతాపిని వరించి
ప్రేమమీరఁగ దానిఁ బెండ్లాడె నంతట నది రురువును గాంచె నప్పుడొక్క
స్థూలకేశుఁడను దొడ్డతపసి సత్యశీలుఁడై వర్తిల్లె నోలి నప్పు

తే.గీ. డచ్చరవెలంది మేనక యనెడి దొక్క । యాపగాతీరమున గ్రీడ లాచరించి
పరగ విశ్వావసునిచేతఁ బ్రాప్తమైన । గర్భముమదాల్చి యొకవింతకళలఁ దవరి. ౨౬౩

సీ. తొయ్యలిమేనక స్థూలకేశుని యాశ్రమమునకుఁ బోయి సమ్మద మెలర్ప
మూడులోకములందు నీడుగానని యొక్క ముద్దుబాలిక నతిమోహనాంగి
గని యచ్చటనె డించి చన ముని దానిగై కొని గృహమును జేర్చి యనుపమమగు
ప్రేమతోఁజూచుచుఁ బెంచి ప్రమద్వరా నామంబు నునిచె నందఱును మెచ్చ

తే.గీ. నంత నయ్యింతి నవయౌవనాంగి యగుచు। వింతవింతహొయల్ మేన వి స్తరిల్ల
నప్పుడప్పుడు పూఁదోటలందుఁజూచి। రురుఁడు సుమశర శరపరంపరల మునిగె. ౨౩౪

—: పరీక్షి చ్ఛాపనివృత్త్యుపాయచింత :—

వ. ఇట్లు కామార్తుండై రురుం డింటికిం బోయి నిద్రాహారంబులు మాని కృశించుటంగాంచి
యతని తండ్రి నాయనా యిది యేమి యని యడిగిన నతండు తండ్రి కిట్లనియె. ౨౩౫

శా. తండ్రీ। యేమని చెప్పుదున్ మదన సంతాపంబు లోలోనఁ దా
వేంద్రంబై నది స్థూలకేశునిసుతన్ వీక్షించితి న్వేల్పు ప్రో
యాంద్రన్ గూఢపదాంగనాజనమునం దానొంపు నే గాన నా
తీంద్రింపు ల్కడముట్టు ముద్దియను బ్రీతి న్ముద్దులాడంగదా. ౨౩౬

ఉ. అంతట నేగి యాప్రమతి యత్యధికంబగు భక్తిమీర న
భ్రాంతత స్థూలకేశు పదపద్మములంటి నమస్కరించి యో
శాంతమనస్క। నీతనయ సాధ్విఁ బ్రమద్వర నిమ్ము పెండ్లిగా
వింతము నాసుతున్ రురువుఁ బ్రీతిమెయిం బ్రతికింపు నావుడున్. ౨౩౭

తే.గీ. ప్రమతి దా స్థూలకేశు సంబంధమునకుఁ। గడునలరి పెండ్లియత్నముల్ నడుపుచుండ
వనములో నొక్కసర్పంబు వనితపాద। మంటఁగఱచినఁ బడి సచ్చె నప్పుడచట. ౨౩౮

క. పడినప్రమద్వరఁ గనుగొని। గడగడ వడకిరి సమస్త కాంతలు పురుషుల్
గడు హెచ్చెను హాహారవ। మడలెను జడదారిపల్లె యాసమయమునన్. ౨౩౯

క. రురుడుం జాటుగ మాటుగ। నరిగి విరహవేదనాగ్ని యందుంబడి తాఁ
బొరిపొరి నేడువసాగెన్। బరిణయకాలమున నిట్టి పాటొదవుటకై. ౨౪౦

తే.గీ. దైవమా। యేదనుండి యీ త్రాచువచ్చె। వచ్చెబో యేటికీ ముద్దువనితఁగఱచె
నేమిచేయుదు నిది దుఃఖహేతువయ్యె। నెందుఁజొచ్చెదఁ బ్రాణంబు లెందుకింక. ౨౪౧

సీ. అయ్యయో మదిలోన యాశలెల్లను దీర నెనసి ముద్దియఁ గౌగలించనైతి
దేవుడా పెండిలితిన్నెపైఁ గూర్చుండి పాణినైనను నేను బట్టనైతి
వగలాడితో హుతవహునిలోపల లాజహోమమ్మైనను జేయ నోమనైతి
గొనగొన నేఁబోయి గుంద్రాతికడ ఫిల్చి చక్కఁగాఁ బదమైనఁ ద్రొక్కనైతి

తే.గీ. చెట్టనోములునోచిన యట్టి నాకు । నెట్టుల సుఖంబులబ్బు నీ పట్టునందు
నూయియో గోయియో చిచ్చొ రాయొ యురియొ।విషమొ ప్రాణంబు లిప్పుడె విడుచుటకును.
వ. అని వెండియుఁ దనలో నిట్లని వితర్కించె. ౨౪౩
క. మృతిచే ఫలమున్నదె దుః । ఖితు లగుదురు తల్లిదండ్రి కేవల మది దు
ర్గతిహేతువు మృతయగు ని । య్యతివకు మేలేమి దీన నగుఁ దలపోయన్. ౨౪౪
చ. అని తలపోసి స్నాతుడయి యంజలినంబువులూవి యేను జే
సిన దివిజార్చనాదికముచేఁ గలదేని యొకింత పుణ్య మా
త్మను గురుభక్తియుం జప హుతాశ విధానమునుం దపంబు సం
ధ్య నిగమపాఠముం గలదయైన మనుం జెలియంచుఁ బల్కుచున్. ౨౪౫
క. అని తోయము భువివిడిచెఁగ । మునిసుతుఁ డంత సురదూత ముఖ్యుఁ డొకడు
దా గనులకు నెదురై మునినం । దన చాకుము సాహసంబు తగునే నీకున్. ౨౪౬
క. చచ్చినదెటనైన మరలి । వచ్చునె యిది వింతగాదె వనితారత్నం
బచ్చర కూతురు ననియెన్ । జెచ్చెర వేఱొక్కదానిఁ జేకొను మింకన్. ౨౪౭
క. అనవుడు విని మునిపుత్త్రుం । డనిమిషభట కొనగ నొల్ల నన్యల నిది దా
మనిన మనుగాక మనకు । న్నను మానెనుగాక మృతియ నాకును నిజమౌ. ౨౪౮
క. అనిన విని వీఁడు సాహస । మును జేయక మానఁడనుచు మునితనయా నీ
కు నొక యుపాయము చెప్పెద । వినుమా కృతకృత్యులైరి విబుధులె దానన్. ౨౪౯
క. నీయాయువునందును సగ । మీయఁగఁదగు నట్లు చేసితేనియుఁ బ్రియురా
లీయెడ మరల బ్రతికి నిను । బాయక వర్తిల్లుననినఁ బరమప్రీతిన్. ౨౫౦
క. నాయాయువునం దర్ధం । బీయెడ నీ నిమిషమునన యిచ్చెదఁ దడవే
లా యువతిం బ్రతికింపుము । నాయన నీపాదములకు నతియొనరింతున్. ౨౫౧
వ. అనిన నంతఁ దనసుతమరణంబు విని స్వర్గంబునుండి విశ్వావసుండును వచ్చినం గాంచి
దేవీభటుం డతనింగూడి యముని సమీపంబునకుం జని. ౨౫౨
తే గీ. రవితనూజాత పరమధర్మస్వరూప । వినుము విశ్వావసుని బిడ్డ బృథివి రురుఁడు
వలచెఁ గన్యఁ బ్రమద్వరఁ మనమునందుఁ।బాముగఱచినఁ జచ్చె నప్పడఁతి దలఁచి. ౨౫౩
తే.గీ. స్రుక్కి ప్రాణంబువిడువంగఁ జూచుచున్న । వాఁడు రురుఁ డతఁడెంతయు వగచి యాయు
వందు సగమిత్తుఁ బ్రతికింపు మనుచుఁ బలికె । వలపులట్టివ యెంతటివారికేని. ౨౫౪
క. కావున దానికిఁ బ్రాణం । బీవలయునటన్న దూత నెఱిఁగి యముం డ
ట్లావనిత బ్రతుకుఁ బొమ్మన । వేవేగను వచ్చి దూత వెలఁది న్మనిచెన్. ౨౫౫

తే.గీ. ఇట్లు బ్రతికించి రురునకు నిచ్చె దూత । వెండియమ్మునిపుత్త్రుండు పెండిలికిని
శుభదినము సూచి శోభన శోభఁదనరె । నప్పుడాబాపని వినోద మడుగనేల. ౨౭౬

వ. అట్లా మునికుమారుండు ప్రమద్వరం బాణిగ్రహణంబు చేసికొని సుఖంబుండెం గావున నుపాయంబునఁ బ్రాణంబులు రక్షించుకొనవలయునని చెప్పి. ౨౭౭

క. ఏడంతస్తులుగల యొక । మేడను గట్టించి దానిమీదను దానుఁ
దోడుగ మఱికొందఱునుం । గూడి వసించుచును మిగుల గూఢస్థితుఁడై. ౨౭౮

క. మణిమంత్రధరుల నిజర । క్షణమునకుం గాపువెట్టె సముచితగతి బ్రా
హ్మణులను జపముల నిడి గజ । గణములతో మంత్రి పుత్త్రిఁ గాపుంచెఁ దగన్. ౨౭౯

తే.గీ. అలఁతి యీగకుఁ జొరరాని యట్లు లోని । మేడపై మిద్దెగదిఁ గత్తి మెట్లగద్దె
నీటెఁగమ్మి యకటకటా నిరుకుచోటఁ । జాటుగాఁ గూరుచుండె భూజానియపుడు. ౨౮౦

తే.గీ. స్నానమచ్చట ముత్తరి । సంధ్యలచట । భక్ష్యభోజ్యాదులచ్చటఁ బానమచట
వంటలచ్చటఁ గథలను వింట యచట । గాఁగ భూపతి యతిరక్ష గలిగియుండె. ౨౮౧

వ. ఇట్లు బహువిధంబుల రక్షితుండై పరీక్షిన్నరేంద్రుండు దినంబుల లెక్కపెట్టుకొనుచుండ నొక్కనాడు ధనార్థియై కశ్యపుండను విప్రశ్రేష్ఠుండు తన గృహంబు వెడలి మార్గంబున వచ్చుచుండ నంతకుమున్న విప్రశాపంబు యథార్థంబు సేయ నిశ్చయించి తక్షకుండను సర్పశ్రేష్ఠుండు వృద్ధబ్రాహ్మణ రూపంబు దాల్చి యతిరయంబున నిజవాసంబు విడచి చనుచు మధ్యేమార్గమున మంత్రవాదియగు కశ్యపుం జూచి యీ వెవ్వండ వతిత్వరితగతిం బోవుచున్నవాఁడ వేమి కార్యం బెక్కడికని యడిగిన విని కశ్యపుండు. ౨౮౨

క. తక్షకుఁడు గఱచువాడు ప । రిక్షిద్భూవరుని వానిఁ బృథు మంత్రబల
ప్రక్షేపంబున మనుతు ని । రాక్షేపణగా నటంచు నరిగెద ననినన్. ౨౮౩

క. నేనే తక్షకనాముఁడ । నేనే భూనేతఁ గఱవ నేగెదఁ దరమౌ
నే నే గఱచినవారల । నేనేర్పున మనుతు వింటి కేగుము మరలన్. ౨౮౪

వ. అనిన బ్రాహ్మణుండు. ౨౮౫

క. పోరా పన్నగ! నాతోఁ । బోరా! నామంత్రశక్తి పోడిమి బ్రతుకన్
బో రాజు; నీవిషము చెడి । పోరాదను ఖ్యాతిమొకటి పుట్టెనె యనినన్. ౨౮౬

వ. తక్షకుండు. ౨౮౭

క. వెఱ్ఱివికావో చూచెదఁ । జుఱ్ఱిన నేఁ బోయి కోఱ సుదలను విషముల్
బిఱ్ఱున నోరఁగ నిపు డీ । మఱ్ఱినిఁ గరచెదను దీని మనుతువె కడిమిన్. ౨౮౮

తే.గీ. అనిన బ్రాహ్మణుఁ దట్లకాకనుచుఁ బలుక, । దక్షకుఁడువోయి న్యగ్రోధతరువుగఱవ
భగ్గుమనిమండి యప్పుడే భస్మమాయె । నది కనుంగొని బ్రాహ్మణుఁ డట్టె లేచి.

ఉ. దిగ్గనఁ బోయి చేరువను డిగ్గియు నీళులు గొంచువచ్చి చెం
బొగ్గి జలంబులం బురిసె దొప్పుగ దోయిటఁ బట్టి మంత్రముల్
బిగ్గరగాక లోగొణిగి నేర్పున ధూయని యూదియూది తా
దగ్గఱబూదిఁ జిల్కిన వటత్వము నొందె నదెప్పటట్లుగన్. ౩౦౦

క. అది గని యచ్చెరుపడి యా । ముదిబాపండైన పాము మోసమువచ్చెం
గద యంచుఁ గశ్యపుం గని । సదయాంతఃకరణ నీదు శక్తిన్ గంటిన్. ౩౦౧

తే.గీ. ఎందుకీశ్రమ పాఱుల చందమామ । కోరితేనియు లక్షలకొలఁది నిత్తు
నీకుఁగలవాంఛ సెలవిమ్ము నిక్కమిపుడు । నా విని ధరాసురుండు మనమ్మునందు. ౩౦౨

తే.గీ. ధనముగైకొని వచ్చినదారినేగ । లోభమునఁ గీర్తిచెడిపోదె లోకమందు
నృపతి బ్రతికించి యొసెంత నిపుణుఁడనెడి।యశమునుం బుణ్యమును గాంచి యరుగజనదె.

తే.గీ. అల హరిశ్చంద్ర కర్ణాదు లైనవారు । కీర్తికొరకెంతలేసి సత్క్రియలొనర్చి
రవని నేలెడివాడు విషాగ్నిమగ్నుఁ । జూచు చేగుట ధర్మంబె సుజనునకును. ౩౦౪

తే.గీ. రాజునే బ్రతికించిన రాణిబ్రతుకుఁ । బ్రజలు జీవింతు రింతయు భయములేక
రాజు పోయినయేని యరాజకంబు । వచ్చు నాకును బాపంబు వచ్చుఁగాదె. ౩౦౫

వ. అని బహువిధంబుల వితర్కించి యెట్టులేనియు మునిశాపంబు తప్పనట్టులున్న యది యని నిశ్చయించి తాఁ గోరినట్లు ధనంబు తక్షకునివలన సంగ్రహించి కశ్యపుండు గృహంబునకు బోయె నంత. ౩౦౬

ఆ.వె. కట్టుబోతు జన్నిగట్టును బంపితి । గుట్టుసెడకయుండఁ గట్టిచేసి
యెట్టులైన రాజు పట్టణంబున కేగి । పట్టి కఱతుఁ దపసి తిట్టుకలిమి. ౩౦౭

వ. అని నిశ్చయించి తక్షకుండు. ౩౦౮

శా. ఏడంతస్తులమేడపైఁ బటుతరాహీనోగ్రమంత్రక్రియల్
తోడౌ బ్రాహ్మణకోటికాపనుచు సందుల్ గొందులం దెల్లవా
రాడం దా విని తక్షకుం డిపుడు పోరాదందు నిందుండి వె
న్నాడం గూడ దికేమిసేయుదునటం చాత్మన్ వితర్కింపుచున్. ౩౦౯

క. బాపనిశాపము భూపతి । రూపడపకయుండఁజనదు రూఢిగ నాకుం
బాపములే దొక మోసపు । రూపునఁ జనిఁ కఱతు నీతిద్రోచుట చనునే. ౩౧౦

వ. అని కృతనిశ్చయుండై తనతోడి సర్పశ్రేష్ఠుల మునులంజేసి వారలచేఁ గొన్ని ఫలంబు లిచ్చి తా నొక కీటంబై యందొక ఫలంబునం బ్రవేశించి. ३११

క. అది సప్తమదినమగుట । న్మదిఁ దలపోయుచును దంభమౌనులు ఫలముల్
వదలక చేతులయందిడి । కదలిరి రాజగృహమునకు గడునిశ్చలులై. ३१२

క. చని రాజగృహద్వారము । గని యచ్చట నెడములేక గాచెడివారిన్
మునులము మేము నృపాలకుఁ । గనవచ్చితి మెపుడులేని కట్టడి చనునే. ३१३

శా. మామంత్రంబులచేత రాజు బ్రతికింపన్ వచ్చియున్నార మెం
దే మాయోగము వీటిపోవదు విప దీప్తిం దొలంగించి భూ
స్వామి న్నంతసపెట్టి యేగెద మనిర్వార్యంబుగా మేడపై
నేముం బోవగ నిచ్ఛయించెదము పోనిం డింక నా వారలున్. ३१४

వ. ఈనాడు రాజసందర్శనంబు మీకుం బొసంగ దెల్లిరందు విప్రశాపభయంబున తేఁడు మీది మేడనున్నవాఁడు మేము పోయి వరవరునకు మీరాక విన్నవించెదమని వారట్లు చేసిన జన పాలుండు ద్వారపాలుర కిట్లనియె. ३१५

క. ఈరలు దెచ్చిన ఫలములు నీరును । దుంపలును మాకు నిండుముదమునన్
వీరలచేఁ బంపు డిపుడు । తీరదు రే పిచటి కరుగుదేరుడు మీరల్. ३१६

క. అనిచెప్పి పనుప వారలు । చని తెలిపిన వార లట్ల సలిపిరి యంతన్
మనుజేంద్రుఁడు ఫలములుఁ గొని।మనమున సందియములేక మంత్రుల కనియెన్. ३१७

క. మునులిచ్చిన యీ ఫలములఁ । దినుడీ మీరెల్ల నేనుఁ దినియెద నిది యం
చును బెద్దపండు నొకదా । నిని గొని యిది మంచిదనుచు నృపమణి కోయన్. ३१८

క. పుఱుగొకటి ఫలములోపల । నిఱికినఁ దాఁ గాంచి కంటిరే చిన్నది యీ
పుఱుగు నలుపైన కన్నులు । నెఱుపు నెరపు నొడలు నిఱికె నీఫలమందున్. ३१९

వ. అని పెండియు నామహీపాలుండు నాడు సూర్యుం డస్తమించె నింకఁ దనకు శాప భయంబు తొలఁగెనకా యెంచి యిట్లనియె. ३२०

క. మునికులవర్యుని శాపం । బునకుం గొఱరాకయుండ మునుకొని కీటం
బును మెడ నుంచెద ననుచున్ । జననాథుఁడు పురువు మెడను జయ్యన దాల్చెన్. ३२१

ఆ.వె. తక్షణంబ పుఱువు తక్షకుండై కాల । రూపుఁ డగుచు భీతిదోప నదరి
నృపతియొడలుసుట్టి కృపలేక కోఱల । నంటబట్టి కఱచె మంటలెక్క. ३२२

తే.గీ. మంత్రివరు లప్డు విస్మయోన్మాదగరిమఁ । గడఁగి యేడ్చుచుఁ బాఱిరి కదలకొదిగి
రక్షకులు దుఃఖవివశులై యక్షులందు । బాష్పములు జార హాహారవంబు లిడిరి. ३२३

తే.గీ. త్రాచునోటను మంట లుద్ధతినిఁ బుట్టె । నుత్తరాసూను డవనికి నొత్తిగిల్లి
గడచె భువి మాని దివికి నొక్కనిమిషమున । గొట్టిపై వంగ బడి సచ్చు చెట్టువోలె. ౩౨౪

—: జనమేజయరాజ్యప్రాప్తి :—

వ. అంత సకలజనంబులు చింతాక్రాంతులయిరనిచెప్పి తదనంతరంబ సూతుండు మునీంద్రులారా ! పరీక్షన్మరణానంతర మతని కొండికం గని మంత్రివర్గంబు కడు దుఃఖించి భూపతి దగ్ధదేహంబు భస్మప్రాయంబై యున్నం గని చందనకాష్ఠాగరు గంధంబులం గప్పి గంగాతీరంబున సంస్కరించి దుర్మరణంబునొందిన యతని కౌర్ధ్వదైహికము పురోహితుని వలనఁ గడతేర్పించి విప్రవర్గంబులకు గో హిరణ్యాది దానంబు లమితంబుగా జేయించి యన్నదానంబులు సేయించి యొక్క సుముహూర్తంబునఁ బ్రజాప్రీతినిమిత్తకంబుగా నతని కొమరు సర్వలక్షణసంపన్ను బాలున్ నృపతిగా సింహాసనస్థుం జేసి రంత. ౩౨౫

చ. దినదినవర్ధమానుఁడయి దివ్యతరాకృతినొప్పె ధాత్రి దా
ననుపమ రాజచిహ్నముల నారయ రాజులమేటిగాఁ దలి
ర్చినఁ గని తత్పురోహితుఁడు సెప్పిన విద్య గ్రహించి యర్జునుం
దనఁగ ధనుష్కళం గఱచె నప్రతిమానత బాలు డెంతయున్. ౩౨౬

చ. తివిరి మహీశుబిడ్డ దురతిక్రమలీలల ధర్మశాస్త్రముల్
ప్రవిమలబుద్ధితోఁ జదివి పాలనజేసెఁ బ్రజన్ యమాత్మజుం
డవిరళరీతి నెట్టు లటులందరు దన్గొనియాడ నీతిమై
భువికి నిరీతిక ప్రకటభూతినొసంగి మహావిభూతితోన్. ౩౨౭

ఉ. దక్షతఁ గాశికిం బ్రభుత దాల్చిన యేలిక దా సువర్ణ వ
ర్మాక్షుఁడు కూతునిచ్చిన రయంబునఁ బెండిలియై నరుండు ప
ద్మాక్షుని చెల్లెలై పరగుదాని సుభద్రనుగొన్నయట్లు ప్ర
త్యక్ష వినోదశాలియయి యా జనమేజయుఁ డొప్పె భూస్థలిన్. ౩౨౮

క. చపలాక్షిఁ గూడి వనముల । నుపవనముల సౌఖ్యలీల నొప్పుచు నాతం
డపరిమితానందంబునఁ । గృపణతలే కేలె జగము గీతచరితుఁడై. ౩౨౯

ఆ.వె. చతురులయినమంత్రు లతనికార్యంబుల । బహువిధముల రాజభక్తి చూపి
మెలగుచుండి రిట్లు మేదినీవిభుఁడు రా । జ్యంబుసేయునట్టి సమయమందు. ౩౩౦

క. ఉత్తంక నామకుఁడు ముని । సత్తముఁ డొకరుండు దుర్దశతఁ దక్షకనా
గోత్తంసువలనఁ గలిగిన । తత్తరమున వచ్చె రాజు దర్శనమునకున్. ౩౩౧

వ. వచ్చి యుత్తంకుండు రాజు నధిక్షేపించుచుఁ దన యిష్టంబు కొనసాగించుకొను తలంపున
భూపతిం జూచి యిట్లనియె. ౩౩౨

క. కీలెఱుఁగని రాచరికం । బేలా సమయంబెఱింగి యెయ్యది సేయం
బోలు నది సేయఁడే భూ । పాలకుఁడా కాడు ధేనుపాలకుఁడుజుమీ. ౩౩౩

తే.గీ. ఐనవారల కాకున గానివార । లకును గంచానఁ గుడుపుదేలా నృపాల
మిత్రుఁ డెవ్వాఁడొ తనకును శత్రుఁ డెవఁడొ । కనవు లబలబ దిబదిబల్ కావె తుదకు.

క. గ్రుడ్డెద్దు చేనఁబడిన । ట్లడ్డంబెద్దములఁపోవు నతనికి నేలా
గొడ్డాసయు బిడ్డాసయు । దొడ్డదొరవు కలరె నీకుఁ ద్రోవలుచెప్పఁగా. ౩౩౫

క. పగఁదీర్చుకొననివానిది । మగతనమా యాడుదానిమాడ్కిని గాజుల్
తగఁదొడిగించుక ప్రొయికడఁ । బొగకోరిచి వంటఁజేయ బోలదె నృపతీ. ౩౩౬

వ. అనిన రా జొక్కింతదడవు మారుపలుక కూరకుండి బ్రాహ్మణువచనంబులకుం గతంబు
పరికింపనేరక సందిగ్ధమానసుండై యతనిం జూచి వినయపూర్వకంబుగా మెల్లన
నిట్లనియె. ౩౩౭

తే.గీ. ఈ యధిక్షేపమునకు నీ వేది కార । ణంబుగాఁ గొంటివో కాక నాకు నెఱుక
లే దెవఁడు శత్రుఁ డే జేయలేదు ప్రతివి । ధానమెచ్చోటఁ దెలుపుమీ దానిఁగృపను.

తే.గీ. అనుఁడు నుత్తంకు డిట్లను నవనినాథ । తెలిసికొను మింక మంత్రులఁ బిలిచి వారె
చెప్పఁగల రీవు కోరిన దొప్పమీరఁ । దక్షకునిచేత నీతండ్రి దష్టుడయ్యె. ౩౩౯

ఉ. అంతట వారలం బిలచి యా నృపచంద్రుఁడు పృచ్ఛసేయఁగా
నంతయు నిక్కమే యనిన నాతఁడు బ్రాహ్మణుఁజూచి యందునఁ
జింతలులేవు తక్షకుఁడు విప్రువిశాపముఁబట్టి వచ్చినా
డింతట వాని తప్పుగల దేనియుఁ జెప్పి యనుగ్రహింపుమా. ౩౪౦

సీ. వినుమయ్య రాజేంద్ర విప్రముఖ్యుడు కస్య । పుడు నిన్నుఁ బ్రతికింప బూనివచ్చు
చుండంగఁగని తక్షకుండు వానికి నర్థ । మిచ్చిపంపెను నేర మేలకాదు
మఱియు రురుండను మౌనికుమారుండు । పెండ్లాడదలచినఁ బ్రియవధూటి
పాముచేఁ గరువంగ బడియీల్గ నాతండు । బ్రతికించుకొనియె నప్పడతి దనదు

తే.గీ. తపముపేరిమి వెండి యతండుపేసెఁ । బ్రతిన జూచిన పామును బట్టి చావ
గొట్టెదనటంచు నీరీతిఁ గొంతకాల । మరుగ నొకనాడు శప్రియై యతడు దిరుగ. ౩౪౧

చ. వనమున నొక్క డుండుభము వాడు గనుంగొని కొట్టఁబోవగా
వినయముమీర నిట్లనియె విప్రకుమారక తప్పు లేని న
న్నును వధియింపనేటికి ఘనుండవు నీవన నాతడిట్లనున్
నను వరియించియున్న యొక నాతిని సర్పముముట్టెగావునన్. ౩౮౨

క. అగపడినపాములను నే । దెగవైచెదననుచుఁ బ్రతిన దీర్చితిననఁ దా
వగచుచు నే నెవ్వారినిఁ । బగకొని కఱువంగలేదు పాములుకఱుచున్. ౩౮౩

ఆ.వె. కాళ్లలేనిమాత్రఁ గాను నే భుజగంబ । నేల నన్నుఁ జంపె దేగుమనియె
ననుచుఁ జెప్పి మరియు ననియె నుత్తంకుండు । విపులబుద్ధియైన నృపునిజూచి. ౩౮౪

ఆ.వె. అపుడు రురుఁడు డుండుభాలాపములు । విని యెవఁడవీవు నీకు నిట్టిరూప
మెట్లు గల్గెననిన నేను బూర్వము శాంతి । నమరియున్న యుర్వరామరుఁడను. ౩౮౫

ఆ.వె. కడఁగి మిత్రుఁడైన ఖగమాభిధుం డగ్ని । హోత్రగృహమునందు నుండఁజూచి
గడ్డిగట్టి పాముగాఁజేసి యతనిపై । వైవ భీతిజెంది వడకికొనుచు. ౩౮౬

క. ననుజూచి కనలి శపియిం । చెను సర్పమవగుమటంచుఁ జెచ్చెర నే నా
తనికాళ్ళ కెరగినన్ నను । గనుగొని యిట్లనుచుఁ బలికెఁ గారుణ్యమునన్. ౩౮౭

క. ప్రమతికొడుకు రురునాముఁడు । విమలమతిని నిన్ను మరల విప్రునిజేయుం
బ్రమదంబు బొందుమనె ద । త్క్రమమున నిట్లైతి విప్ర ధన్యచరిత్రా. ౩౮౮

క. ఆ విప్రుఁడ నేను రురుఁడ । వీ వా శాపంబువలన నే నిటులైతిన్
బ్రోవుము నన్ను నహింసయె । యీ వసుమతి ధర్మములకు నెల్ల మొదలగున్. ౩౮౯

క. దయయే సత్యవ్రతమగు । దయయే దానములపెద్ద తథ్యము వినుమా
దయయే శౌచము ధర్మము । దయకెక్కుడు లేదు లేదు తలఁపగ నెందున్. ౩౯౦

క. అన విని రురుఁడుం బ్రాహ్మణుఁ । గని శాపం బిపుడ విడుచుగావుత మనినన్
దనరె నతఁడు తత్క్షణమే । మనుజుండై పిదప రురుఁడు మానెను హింసన్. ౩౯౧

చ. చెలగి రురుండు కోమలిని జీవితజేసిఁ వివాహమయ్యె న
య్యలఘుఁడు సర్పతండములయం దతివైరము పూనె నీవు దు
ర్బలువలెఁ దండ్రికిం బరమ బాధకవృత్తి నటించినట్టి పా
ములపయిఁ గ్రోధమింతయునుఁ బూనవు నీకిది చెల్లునే నృపా. ౩౯౨

మ. పితృవైరంబు దలంప విద్ది తగునే పృథ్వీశ పితృక్షోభులన్
హతి గావింపనివాడు జీవసహితుండై యుండఁగా నేమి దా
మృతుఁడే యండ్రదిగాక తద్రిపువులన్ హింసింపకున్నేని పు
త్రతయున్లేదు తదీయదుర్గతులు దూరంబౌనె యెందేనియున్. ౩౯౩

శా. దేవీయజ్ఞమటంచు నొక్కమఖ మెంతేనిం బ్రయత్నింపుమా
త్రోవంబన్నఁ సర్పయాగము నన న్దుఃఖాంబు పూరంబు కన్
గ్రేవల్ గ్రమ్మఁగ నయ్యయో జడుఁడనై కృత్యం బుపేక్షించితిన్
జేవం దండ్రికి వైరులైన భుజగశ్రేణుల్ దయార్హంబులే. ౩౫౪

తే.గీ. నేడయజ్ఞంబు మొదలిడి నేనొనర్తు । భుజగములనెల్ల నగ్నిలోఁ బొరలఁగాల్తు
ననుచు మంత్రులఁ బిలిచి య య్యవనినాథుఁ । డనియె నిట్లని తనలోని యలుకపేర్మి.

క. జన్నము గావించెద నే । సన్నయమార్గమున మంత్రిసత్తములారా
పన్నింపుఁ డన్ని విధములఁ । జెన్నుగ సంభారములను శీఘ్రమె మీరల్. ౩౫౬

సీ. మందాకినీతీరమందు శుభంబైన భువి జూఁడుమనుఁ డెల్ల భూసురులను
సలలితంబుగ నూఱు స్తంభముల్ గల మండపమును గట్టింపు డేపర్పాటుచేసి
నేనును ధర్మపత్నినిఁగూడి కూర్చుండ నమరింపుడీ మంచి యజ్ఞవేది
పరగహుతాశన ప్రబలకాకరముకా హోమగుండముద్రవ్వఁ డొప్పుమీర

తే.గీ. దక్షకుఁడు యజ్ఞపశువుగాఁ దలపుఁడింక । హోత యుత్తంక భూసురుం డుండుగాక
విప్రవర్యుల వేదార్థ విదుల నిఖిల । మంత్రవేత్తలఁ బిలువుండు మంత్రులార. ౩౫౭

తే.గీ. మంత్రు లట్లనకావింప మహిపుఁ డలరి । యజ్ఞమును సేయఁ దొడఁగిన యపుడు సర్ప
తండములు పడెఁ దద్ధోమగుండమునను । తక్షకుఁడు భీతి నింద్రుని దాపు జేరి. ౩౫౮

క. మొరవెట్టిన నింద్రుఁడు దాఁ । గరుణన్భయముడిపి తనదు గద్దియమీదన్
శరణమొసఁగె నది మదిలో । నెఱుఁగుచు నుత్తంకుఁ డహిని పేంద్రునిఁ బిలచెన్. ౩౫౯

తే.గీ. అపుడు తక్షకుఁ డదలి నిజాప్తుడైన యట్టి యాస్తీకు మౌనికులాగ్రగణ్యుఁ
దలఁపగా జనమేజయు దరిసి యతఁడు । దీవనలొసంగఁ గోరిక దెలుపుమనుచు. ౩౬౦

క. నృపుఁడడిగిన విప్రుఁడు దాఁ । గృపతో యజ్ఞంబు విడువ నేఁగోరెద నా
నపుడే సత్యము తప్పని । నిపుణత యజ్ఞంబుమాని నిశ్చలబుద్ధిన్. ౩౬౧

క. ఘనుఁడగు వైశంపాయన । ముని దా విన్పింప వినియె ముదమున సర్వం
బును భారతమందును దన । మనమునకు న్శాంతిలేక మానవపతి దాన్. ౩౬౨

ఉ. వ్యాసమహర్షి గాంచి నృప వర్యుఁడు నామదిశాంతి యెట్లగున్
త్రాసము దోచెడిం బలువిధంబుల పీరులు స్వర్గలోకసం
వాసము గోరినం దనువుఁ బాయుట మేలు రణంబులో నిజా
వాసములో భుజంగవిష బాధను దండ్రి గతించె నయ్యయో. ౩౬౩

తే.గీ. మనముదహియించుచున్నది మౌనివర్య । యేమిసేయుదు సదుపాయ మెద్దినాకు
దెలిపి రక్షింపవే శాంతి గలుగఁజేసి । తండ్రిదుర్గతిఁ దొలఁగెడి దారిఁజెప్పి. ౩౬౪

## —: వ్యాసజనమేజయ సంవాదము :—

వ. అనిన విని సకలవేదవిభాగ వివిధవిన్యాసుండగు వ్యాసుండు నిఖిలశత్రుంజయుండైన
జనమేజయున కిట్లనియె. ౩౬౫

సీ. రాజేంద్ర వినుము సర్వపురాణములలోనఁ బరమోత్తమంబైన భాగవతము
విన్పించెదను నీవు విను మిది మున్ను నా సుతుఁడై యెసఁగుచున్న శుకమునికిని
దగఁ జెప్పితిని దీన ధర్మంబు నర్థంబు కామంబు మోక్షంబు గలుగు సకల
శుభముల నొసఁగును సుఖదంబు సర్వాగమసముద్ధృతంబు నిర్మల మనఘము

తే.గీ. నావుడు నరేంద్రు డిట్లను నమ్రుఁడగుచు । యజ్ఞ విఘ్నార్థ మాస్తీకుఁ డతిరయమున
రాఁ గతంబేమి గూఢపాద్రక్షణమున । నతని కేమిప్రయోజనం బనఘ చెపుమ. ౩౬౬

క. అతిమాత్రయోగమహిమా । న్వితభాగవతంబు వినఁగ వేడుకవొడముఁ
దతలీల దానిఁ దెల్పుము । శతథాకిల్బిషములెల్ల సమయఁగఁ గృపతో. ౩౬౭

వ. ఇట్లు దీనాననుండై వినయపూర్వకంబుగా నడిగిన జనమేజయు పలుకు లాలించి
వ్యాసుండు ఓ జనవరా! తొల్లి జరత్కారుండను ముని గృహస్థాశ్రమంబొల్లక తిరుగు
చుండ నొక యరణ్యంబున గర్తప్రదేశంబుల స్తంభంబుఁ బట్టుకొని వ్రేలాడు తన
పెతరులం గాంచి, యయ్యలారా! మీరిట్లిచ్చటనుండఁ గతంబేమియని యడిగిన
నోయీ! నీవు దారసంగ్రహంబుచేసినంగాని మేము తృప్తులముగాము స్వర్గప్రాప్తికి
హేతువుగా మా చెప్పిన విధంబున నీవు సదాచారపరుండవు గమ్మనిన నతండు. ౩౬౮

తే.గీ. సమసమాఖ్యయు వశగ యేచాననేని । నాకు లభియించెనేనియు నమ్మఁడిద్ది
దానిఁ బెండ్లాడఁ దలచితిఁ దథ్యముగ న । టంచు పనివినెఁ దా దీర్ఘ యాత్రకపుడు. ౩౬౯

తే.గీ. పన్నగంబుల నగ్నిలోఁ బడుడటంచుఁ । దల్లి శపియించెఁ గనలి యత్తరిని సుమ్ము
దత్కథను దెల్పెదను వసుధాతలేశ । వినుమనుచుఁ బల్కె మౌని సవిస్తరముగ. ౩౭౦

సీ. మునినాథుఁడగు కశ్యపునిభార్య లిరువురు వెలఁయఁ గద్రువయును వినతయు నన
వారు చూచిరి సూర్యు వారువంబొకదానిఁ జూచి కద్రువ తల యూచి వినత
కనియె నీసూర్యుని యశ్వ మేవర్ణంబు గలదని యది విని కలికి బలికె
తెల్లని దిదియంచుఁ దేటమీరఁగ నంతఁ గాదు నల్లనిదని కద్రువ యన

తే.గీ. పంతములుబట్టి రొగిఁ బరస్పరము వార । లపుడె కద్రువ వినతతో ననియె రేపు
వచ్చిచూతము చూచిన వన్నెయేరి । ధామెకును దాసిగాఁదగు నన్యయనుచు. ౩౭౧

సీ. ఆదటఁ గద్రువ యాత్మజులనుగాంచి తారుసూచిన హరిదశ్వునశ్వ
మును నల్లనిదిసేయుఁ డనిన వారలఁ గొంద ఱొల్లమి శపియించె నుక్కుదరిగి
యారలు జనమేజయేలావిభునియాగమున నగ్నిలోఁ బడుదనుచుఁ గొంద
ఱంబపంపునఁజేసి రంత గద్రువయును వినతయుఁ జని యశ్వమును గనంగ

తే.గీ. నల్లనిదియైన వినత దా డిల్లపోయి । తనకుమారుని గరుడుని గనిన నాత
డేకతంబునఁ దల్లి నీ కిట్టి దీన । భావమొదవె ననంగ నా భామ పలికె. ౩౮౨

క. గరుడా నేఁ గద్రువకుం । బరిచర్యలు సేయవలసె బహునీచగతుల్
పరమేష్ఠి గలుగఁజేసెన్ గొఱమాలినదాన నైతిఁ గొడుకా యనుచున్. ౩౮౩

ప. విలపించి సవతికిం దనకును జరిగిన పంతంబుల యుదంతంబంతయుం దెలిపి పంతం
బీడేరక తాఁదాసిగావలసివచ్చిన విధంబుఁ దెలిపి తా తక్షణంబ తనుఁ జంక నెక్కించు
కొని మ్రోయుమనుచుఁ గద్రువ బాధించుచున్నయది నే నేమిసేయుదుఁ దండ్రీ యని
విలపించు తల్లిం గాంచి మంచివచనంబుల నామె ననునయించి నీ వేలచింతిల్లెదవు
కద్రువ కోరినయట్ల నేన చేసెద నని యేగి కద్రువం గాంచి నమస్కరించి యమ్మా
నిన్ను మ్రోయవచ్చితి నని పల్కి యక్కుటిలఁ జేతులపై నెత్తుకొని సముద్రతీరంబుచేరి
యచ్చట డించి తల్లీ నాయమ్మ దాసీభావంబునుడుపం గోరెద ననిన నాకద్రువ దేవ
లోకంబునుండి యమృతభాండంబు గొనివచ్చి నా కిచ్చిననాడు నీతల్లి దాసీభావంబు
విడుచు ననిన నామె పలుకులు విని తార్క్ష్యుండు తన మనంబున సంతసిల్లి ౩౮౪

మ. బలవంతుండగు వైనతేయుఁడు మరుత్వన్ముఖ్యదేవవ్రజం
బుల నోడించి వడిన్ సుధాకలశమున్ బొల్పారఁ దాఁ దెచ్చి ని
శ్చలతం గద్రువ కిచ్చినం గని మహాశ్చర్యంబుతోఁ దల్లికిం
గల దాస్యంబును బోయె బొమ్మన విహంగస్వామి సంతుష్టుఁడై. ౩౮౫

క. చనినవెనుక నమృతంబును । గొను తలఁపున భుజగవరులు గొబ్బున నీటన్
మునుగంబోయిన సమయం । బున నింద్రుఁడు దాని గొనుచుఁ బోయెం దివికిన్. ౩౮౬

క. తరువాత నాగవరులం । దరు నమృతముగాన కార్తిఁ దడబడి దర్భా
స్తరణము నాకిన నాలుక । లిరియంగ ద్విజిహ్వులై రిలేశ్వర వారల్. ౩౮౭

ఆ.వె. తల్లిచేత శాప తప్తులై వాసుకి । ప్రముఖు లేడ్చికొనుచు బ్రహ్మకడకు
బోయి మొరలిడంగ నాయజుం డతిదయా । పరత నిట్టులనుచుఁ బలికె నపుడు ౩౮౮

క. కలఁడు జరత్కారుండన । నలరెడు ముని వానికి స్నియం బెనగఁగ బెం
డిలిసేయుఁడు వాసుకి చెలియలిని సనామకను; బుట్టుఁ నాస్తీకుఁ డనన్. ౩౮౯

తే.గీ. వారల కతండు మీకగువాడుసుమ్ము । దారుణంబైన శాపంబు దలగజేయ
ననిన విధిమాటలకుఁ గడు నాత్మ నలరి । వాసుకియు మునిగ వనముజేరి. ౩౮౦

క. భగిని సనామక నిచ్చెదఁ । దగఁ బెండిలిసేసికొనుము దయతోనని వే
దగ ముని నా కప్రియమును । మగువ యెపుడు సేయు నపుడు మానెదసుమ్మీ ౩౮౧

క. ఆమాట కొడంబడినన్ । నే మానిని బుచ్చికొందు నెమ్మి భుజంగ
స్వామీ యటు సేయుమనిన । నా ముగుద నొసంగి చనియె నహిపతి వేడ్కన్. ౩౮౨

ఉ. ఆ రమణీమణిం గలసి యాకులపాక వసించి యా జర
త్కారుడు భార్యఁ జూచి వనితా నను లేపకు నిద్రవోయెదన్
నా రుచిరాంగి యట్లయని నాథుని లేపకయుండె నంతలో
సూరుడు పశ్చిమాంబుధినిఁ జొచ్చిన జూచి వెలంది యాత్మలోన్. ౩౮౩

ఉ. లేపకయున్న సంధ్య చెడు లేపిన నాకు నపాయమౌ గదా
యేపనిఁ జేయవచ్చునని యెంతయుఁ గుందుచు నెట్టకేలకున్
లేపిన మేలు ధర్మ మొక లేశము నాశముగాదు నాకునున్
లేపకయున్నఁ గీ డదియు లెక్కగొనం బనిలేదు చూడఁగన్. ౩౮౪

ఆ.వె. సంజయయ్యె వేగ సామి లే లెమ్మని । పిలువ నతఁడు లేచి చెలియ యేను
బోవువాడ నీవు పుట్టంటికేగుమ । టంచుఁ బలుక భీతి నార్తయగుచు. ౩౮౫

ఆ.వె. ప్రాణనాథ నీకు భ్రాత నన్నిచ్చిన । యర్థ మెట్లు పొసగు ననిన మౌని
యస్తియనుచుఁ బలికి యరిగె గానలకును । నాతి నొచ్చెనంత భ్రాతయిల్లు. ౩౮౬

సీ. వచ్చిన చెలియలి వగపు దాఁ గనుగొని వాసుకి యడిగిన వనితసెప్పె
జరిగినపనియును వరుఁ దరణ్యములకు బోవుచో మాయన్న పూని నన్ను
నీకిచ్చుకోరిక చేకూరువిధమెట్టు లనిన నస్తియటంచు నతఁడు ననిన
విధమును నది దాను విని సంతసించి వాసుకి యుండె నింతలో సకియ గనియె

తే.గీ. మగశిశువు వాని నామంబు జగతియందుఁ బరగె నస్తీకుఁడంచు నా బాలకుండె
యజ్ఞమందును నీకడ కరుగుదెంచి । మాతృపక్షంపు భౌజగజాతిఁ బ్రోచె. ౩౮౭

వ. రాజేంద్రా! నీవలన సన్మానింపంబడిన యస్తీకుండు చేసిన పని కీర్తనీయంబయగు. నీవును భారతంబు సర్వంబును వింటివి. నీకు మేలగుఁగావుత. నీవు చేసిన పుణ్యాంబునంబట్టి నీజనకుండు సుగతిం జెందె నీకుఁ గొరఁత యేమున్నది. మహాదేవి కాయతనం బమర్చి భక్తితో సేవింపుము. నీకు సకలంబును సిద్ధించునని చెప్పి మరియు. ౩౮౮

తే.గీ. భూమినాయక వినుము దేవీముఖంబు । నీవొనర్చుము నిఖిలంబు నీదసుమ్ము
పరమపావనమైనట్టి భాగవతము । వినుము విన్పింతు నేను సవిస్తరముగ. ౩౭౯

తే.గీ. పరమపావనమైనది భాగవతము । రాగలోభాదుల నడంచు భాగవతము
భవభయంబులఁ దొలగించు భాగవతము । భగవతీభక్తిఫలదంబు భాగవతము. ౩౮౦

క. దేవీపాదాబ్జంబులు । సేవించినవారు సుఖముఁ జెందుదురు ధరం
దేవీపాదాబ్జంబులు । సేవింపనివార లఘముఁ జెందుదురు నృపా। ౩౮౧

చ. భగవతి విష్ణుదేవునకు భాగవతంబును జెప్పెఁ గావునన్
దగ నిదతక్క నన్యమగు దారిని బోయిన మోక్షమబ్బునేఁ
జగతి నరాధముల్ తెలియఁజాలరుగాక నరేంద్ర నీకు నే
భగవతిఁ గొల్చి చెప్పెదను భాగవతం బిది చిత్తశాంతికిన్. ౩౮౨

— : స్కంధాంత కృతిపతి సంబోధనము : —

శా. తాళక్ష్మాజశతార్చుదోపమకరోద్దండోగ్రవేదండర
క్షోలక్ష్యేక్షిమహోశుశుక్షణిసుతేజోమాలికాపాలికా
లీలాశాలిశిలీముఖప్రకరకేలీలోలజేగీయమా
నాలీఢాజగవప్రచారసమరా యల్లూరి సోమేశ్వరా. ౩౮౩

స్రగ్విణి. సోమలేఖాజటాజూటసంభారశో
భామహోదారతా పాలితద్యోపురా
రామవిస్ఫారకల్ప ప్రసూనోత్కరా
వ్యోమగంగాధ రాల్లూరి సోమేశ్వరా। ౩౮౪

గద్య. ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసువంశ పయఃపారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరిత గోత్రాలంకార కృష్ణామండల మండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జితధరావిరాజమాన, శ్రీవీరప్రతాప కోర్కొండహంవీర రామచంద్ర భూమీశ్వరదత్త గోదావరీ మండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయ సభావాదక నియోగభారవ్యవహార, శ్రీ వేంకటేశ్వరవరప్రసాదసంభూత కవిత్వ విద్యా విశేషబాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేక గ్రంథ మతిసార, విబుధజనకరుణాసంపాదితో భయభాషాపరిచిత ప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణంబునం ద్వితీయస్కంధము.

ద్వితీయస్కంధము సమాప్తము.

శ్రీ ర స్తు.

శ్రీ శా ర దాం బా యై న మః

# శ్రీ దేవీ భాగవతము

## తృతీయ స్కంధము

క. శ్రీద్వీబుధ జ్యేష్ఠ స్వా। రాద్వైశ్వానరపరేతరాడ్రక్షోంభో
రాడ్వాయుధనదలసదవి। సృడ్వైభవ సంప్రకాశ శ్రీసోమేశా. ౧

వ. అవధరింపుము భగవంతుండైన సాత్యవతేయుం జూచి జనమేజయుం డిట్లనియె. ౨

—: జనమేజయకృత దేవీస్వరూపాది ప్రశ్న :—

సీ. అయ్య సాత్యవతేయ యంబామఖంబని యీవు సెప్పిన యజ్ఞమెట్టిదొక్కొ
యెట్లది పుట్టెనో యెక్కడనో కతంబేమియో తద్గుణం బేమియొక్కొ
యేస్వరూపమొ విధులెవ్వియో సర్వజ్ఞ దీనదయాపర తెలుపుమయ్య
బ్రహ్మాండ మెట్టుల ప్రభవించెనో సవిస్తరముగఁ జెప్పుమా ధర్మచరిత

తే.గీ. బ్రహ్మయును విష్ణువును శూలపాణి మువురు। దేవతలు సృష్టి సంరక్షణావసాన
కర్తలును సగుణులు నండ్రు కడఁగి వార। లొగిస్వతంత్రులొ తెలుపుమా యోగివర్య. ౩

తే.గీ. మృత్యువున్నదొ వారికి నిత్యులో య। నిత్యులో సచ్చిదానంద నిరతులో స
మస్తదుఃఖాధిభౌతికమగ్నులో య। శనిధరాదులు కాలవశగులొ కారొ. ౪

క. దివిజులపుట్టువు లెట్టివొ। పవిధరముఖులకును శోకభయములు కలవో
తవులునొ నిద్రాలస్యము। లవి వారికి ధాతుమయములౌనో తనువుల్. ౫

తే.గీ. ఏద్రవంబుల దేహంబులేర్పడినవొ। యేగుణంబుల నెసఁగెనొ యింద్రియములు
వారిభోగంబు లెట్టివో వారియాయు। వెంత కాపురమెక్కడ బుభువులకును. ౬

వ. అనిన వ్యాసుండు. ౭

సీ. సర్వంసహాధీశ చతురుండవగుదువు దుర్గమంబగు ప్రశ్న తోచె నీకు
బ్రహ్మాదులెట్టుల ప్రభవించి రంటివి యిది మున్ను నారదు నేనడిగితి
అడిగిన నారదుం డంతయు వివరించె నది యెట్టులనిన నే నతిముదమున
నొకనాడు నారదుండున్న గంగాతీరమున కేగి నారదమునినిఁ గాంచి

తే.గీ. యడుగులకు మ్రొక్కి తదనుజ్ఞ నతనియొద్ద । నాసనంబునఁ గూర్చుండ నబ్జభవుని
కొడుకు మున్మున్న ప్రేమతో కుశలమడిగి।ప్రశ్న సేసితి బ్రహ్మాండభవముఁగూర్చి. ౯

ఉ. ఎక్కడనుండి పుట్టినది యీ ద్రుహిణాండ మిదేకకర్తృకం
బొక్కొ ద్వికర్తృకంబొకొ బహూగ్రహకర్తృకమో యకర్తృకం
బొక్కొ యకర్తృకం బొకటియుఁ గన మెందునుఁ గార్యసంతతిన్
జిక్కు విరోధ మట్లనిన శేముషిఁ జూడఁగ సందియంబగున్.

సీ. శంకరుఁ బరమేశు శైలాధివాసుని శంభుని భూతైక సార్వభౌము
కారణకారణు గజచర్మపరిధాను గిరిజాకళత్రు సద్గీతచరితు
సుభగు నాత్మారాము సురలోకవందితు నుగ్రు శర్వుఁ గపర్ది నురగభూషు
కాలకాలుని మహాకాలు మహానటు భీము మహాదేవు గామదమను

తే.గీ. శూలపాణిని లలితార్ధసోమమకుటు । నీశ్వరు మహేశు నీశాను సిద్ధచరితు
నభవు భవు నాపగాధరు నభినుతింత్రు । కడగిఁ బ్రహ్మాండములకెల్లఁ గర్త యనుచు. ౧౦

సీ. విష్ణు లక్ష్మీశు నుర్వీశు నారాయణు వైకుంఠు దైత్యారి వాసుదేవు
కేశవు గోవిందు నీశు హృషీకేశు మధుసూదనునిఁ గృష్ణు మాధవు హరి
నచ్యుతుఁ బద్మాక్షు నగధారి శ్రీధరు స్వభుఁ ద్రివిక్రము మురశాసి జిష్ణు
దామోదరునిఁ బరంధాముఁ దార్క్ష్యధ్వజు శేషశాయిని స్వర్ణచేలు మహితు

తే.గీ. శార్ఙ్గిఁ జక్రి ననంతు నిశ్చలు దయాళుఁ గృష్ణు దామోదరుని గుడాకేశమిత్రు
శౌరి దశరూపధరు దేవుఁ జాటుచుంద్రు।కడఁగి బ్రహ్మాండములకెల్లఁ గర్త యనుచు. ౧౧

సీ. అమృతాశనజ్యేష్ఠు నంభోజగర్భు సరస్వతీ మదవతీ ప్రాణనాథు
స్రష్టనుఁ బరమేష్ఠి సకలలోకేశుఁ బితామహు నజుని విధాత ధాత
విధి విశ్వకర్తను వేదనిర్మాతను హంసాధిరూఢు నిత్యప్రకాశు
చతురాననుని బ్రహ్మ సౌవర్ణగర్భు ద్రుహిణు స్వయంభువు చారుగుణగణాఢ్యు

తే.గీ. నతులమతిమంతునిం బ్రజాపతిని సత్య । లోకవాసుని హరిసూను శోకరహితు
బరము భూతప్రవర్తకుఁ బలుకుచుంద్రు । కడఁగి కొందరు బ్రహ్మాండకర్త యనుచు. ౧౨

తే.గీ. లోకదీపకు రవి నతిలోకతేజు । మిత్రు నర్యముఁ బరమపవిత్రు బూషు సూ
ర్య సంజ్ఞేశ్వరు నుషేశుఁ జూపుచుంద్రు।కడఁగి కొందరు బ్రహ్మాండకర్త యనుచు. ౧౩

క. ధరఁ గొంద ఱింద్రు డందురు । మఱికొందరు వరుణు డంద్రు మానక యితరుల్
కరివదనుఁ డంద్రు కొందరు । మరు డందు రజాండకర్త మతిమంతు లొగిన్. ౧౪

తే.గీ. వనజరిపుఁ డంద్రు కొందరు వహ్నియంద్రు । కొందరు కుబేరుడందురు కొందఱు యము
డందు రీరీతినుండగ నాత్మవిదులు । భగవతి నజాండకర్త్రిగాఁ బలుకుచుంద్రు. ౧౫

వ. మఱియు నద్దేవి యీశ్వరి యనియు, నిర్గుణ యనియు, సగుణ యనియు, వైష్ణవి యనియు, శాంకరి యనియు, బ్రాహ్మి యనియు, వాసవి యనియు, వారుణి యనియు, వారాహి యనియు, నారసింహి యనియు, మహాలక్ష్మి యనియు, వేదమాత యనియు, నేక యనియు, విద్య యనియు, స్థిర యనియు నానావిధంబులగు నామములం గొనియాడఁబడుచు, భక్తులకోరికల సమకూర్చుచు, మోక్షార్థులకుం బునర్భవభయంబు లడంచుచు, ఫలార్థులకు ఫలంబు లిచ్చుచు, నిర్గుణయయ్యు సగుణయై, నిర్వికల్పయై, నిత్యప్రకాశినియై, త్రిగుణాతీతయై, మాయకు లోఁబడక నిరంజన నిర్వికారాది తత్వంబుల నుల్లసిల్లి, యరూపమై, నిర్లేపమై యొప్పు బ్రహ్మ తానయై ప్రకాశించునని పెద్దలు సెప్పుదు రదియుంగాక సహస్ర శీర్షుండై సహస్రాక్షుండై సహస్రకరుండై సహస్రకర్ణుండై సహస్రముఖుండై యలరు విరాట్టును దానయై యుండునని బ్రహ్మవిదులు కొందఱు పలుకుదురు. మరికొందరు నిరీశ్వరవాదులు జగంబునకుం గర్తకావలసినది లేదందురు. ఇఁకఁ గొందఱు స్వభావంబె కారణం బందురు. ప్రకృతి యనియుఁ బ్రధాన మనియు సాంఖ్యులు సెప్పుదురు. కావున నాహృదయంబు నానావిధ సందేహంబులకు నిలువై మిగుల బాధనొందుచున్నయది. నేనేమిసేయుదు. ధర్మాధర్మంబులు రెండును నా కొక్కరూపుగాఁ దోచుచున్నయవి. ధర్మాధర్మంబులు వేరుసేయు లక్షణంబులు ప్రత్యక్షంబునఁ గానరాకయున్నయవి. సత్వాది గుణంబుల నిలచి సత్వగుణంబులం దేజరిల్లు దేవతలకు దానవులచే నానావిధసుఖ ప్రతిబంధంబులు ప్రాపించుచున్నయవి ధర్మమందు నిలిచి సదాచారపరులగు పాండవులకు బహువిధ దుఃఖంబులు సంభవించుట యెరుంగమె. అదికతంబునం జేసి నా సంశయంబులు నివారింప నీవుతక్క నన్యుఁ డోపుఁవాడులేడు. జ్ఞానంబను మంచియోడపై నెక్కించి సంసారంబను సముద్రంబు దాటునట్లుచేసి నన్నుం గటాక్షింపవే యనుఁడుఁ గరుణార్ద్ర హృదయుండై నారదుండు నాకుం జెప్పె నెట్లనిన. ౧౬

—: దేవీభాగవతావతరణము :—

తే.గీ. వ్యాసః మును నాకు నీసందియంబ కల్గి । జనకుఁడగు ధాతఁ జేరంగఁజని యడిగితి
నాయనా జగ మేరీతి నాయె మొదలఁ । గర్త పీహా కపర్దియో గరుడహయుఁడొ. ౧౭

క. ఆరాధనీయుఁ డెవ్వం । డీరేడు జగంబులందు నెవ్వఁడు సర్వా
ధారములకు నాధారో । దారమహిముఁ డతనిఁ దెల్పు దయతో నాకున్. ౧౮

క. సందియము విడువ కుల్లం । బొందోళితమయ్యె నెట్టు లాత్మను శాంతిం
బొందింతు నెవనిఁ గొలుతుఁ । వందనమిదె ప్రోవు మనిన వనజజుఁ డనియెన్. ౧౯

క. అతిదుర్బోధము ప్రశ్నం । బతులిత మిది నీకుఁ దెలియు నా విష్ణునకే
మతి నూహింపగఁ దుస్తర । మితరుల కేమందుఁ బుత్ర యెక్కుడిమాటల్. ౨౦

క. ఏగతి యత్నముసేసిన । రాగులకుం దెలియ దిది విరాగులు తెలియం
గాఁగలరు వినుము చెప్పెద । సాగరమయమయ్యె మున్ను సకలము పుత్రా. ౨౧

తే.గీ. భూతపంచకమాత్రము పుట్టియుండు । నాడు నే జనియించితి నళినమందు
సూర్యుఁ జూడనుఁ జంద్రునిఁ జూడ వృక్షములనుఁ జూడనుఁ బర్వతంబులనుఁ జూడ.

ఉ. తామరపూవుమిద్దెపయి తప్పకయుండి మహార్ణవంబునం
దేమహిమం జనించితినొ యేను ననుం గని ప్రోచువాఁడు లేఁ
డో మఱి యెందునేని గలఁడో జల మెట్టుల నెందు నిల్చెనో
భూమియొకందు కాననగుఁ బోలునటంచునుఁ జింతసేసితిన్. ౨౩

తే.గీ. వేయిహాయనములదాక వెదకి వెదకి । వేసరితిఁ గానలేనైతి వేఱుమన్ను
సరగఁ దపఁ దప యను నొక్కశబ్దమపుడు । చదలనుండి వినంబడె శ్రవణములకు. ౨౪

తే.గీ. అంత వేయేండ్లు తపము నే నాచరింప । సృజ సృజ యటంచు నొకసద్దు చెవులబడియె
నంత నెయ్యది సృజియింతు ననుచుఁ బొగిలి । తెల్లమొగమయి కూర్చుంటి డిల్లపోయి.

తే.గీ. అంత మధుకైటభాఖ్యులౌ నసురు లిరువు । రాజిఁ గోరిన భయమంది యబ్జనాళ
మార్గమున డిగ్గి జూచితి మహితపురుషు । స్వప్రకాశైకశోభితు నప్రమేయు. ౨౬

సీ. మణిదీపకాంతి గ్రమ్మఁగ వేయిపడగల పాముపై హాయిగా బండినాఁడు
నెఱుపులొప్పెడి తొలుకరిమబ్బు సరి మేనఁ గనకంపుఁబట్టంబు గట్టినాఁడు
అజానుదీర్ఘంబులగు చతుర్భుజములఁ బంచాయుధంబులఁ బట్టినాఁడు
ఉరమున శ్రీదేవి కుయ్యేలచేరునాఁ దనరెడి వనమాలఁ దాల్చినాఁడు

తే.గీ. నగుమొగమువాఁడు జగములేలఁగలవాఁడు । నిరుపమానందకరుడయి నెగడువాఁడు
యోగ నిద్రనుఁ గూర్కుచు నున్నవాఁడు । కదలకున్నాఁడు పురుషుఁ డొక్కరుఁడు ఘనుఁడు.

వ. అట్టి దివ్యపురుషుండు నా కన్నులయెదుట. ౨౮

తే.గీ. కానవచ్చిన నేమందుఁ గన్నబిడ్డ । యతితరంబగు నచ్చెరువాయె నాకు
నంత నిద్రాస్వరూపంబు నందియున్న । దేవి స్తుతియించితిని భక్తిభావగరిమ. ౨౯

తే.గీ. తత్క్షణంబున దేవి తత్తనువునుండి । లేచి గగనంబునందుండె లీల దివ్య
భూషణాంచితయై యంతఁ బుండరీక । లోచనుండును నిదుర చాలునని లేచి. ౩౦

తే.గీ. మధువుతోఁ గైటభునితోడ మాధవుండు । గదనమొనరించి తొడలపై గదియఁబట్టి
రక్కసుల యుక్కసులఁ బాపి యుక్కడంచె । రుద్రుఁ డేతెంచె లీలావినిద్రుఁ డగుచు.

సీ. దివ్యరూపముతోడ దేవి తాఁ బొడగట్టె ముగురము సూడంగ గగనమందు
చూచి యేము స్తుతింపఁ జూపుల దయగుల్క నా మహాదేవి యిట్లనుచు బల్కెఁ
గాజేశులార మీ రోజఁ జనుండిఁక మీ మీ పనులమీద మెళకువడర
రక్కసుల్వచ్చిరి నిక్కంబు మీకొక్క భయములేదిఁకఁ బొందు భవనములను

తే.గీ. దగినచోటులఁ బొసగించి జగము నాల్గు । విధములగు సృష్టి సలుపుండు వేగ ననిన
భగవతీవాక్యమును విని భక్తిమీర । నివ్విధంబునఁ బల్కితి మృదుతరముగ. ౩౨

తే.గీ. కావలసినంత మన్నది కన్నతల్లి । యేడజూచిన జలమాయె నేడ నిప్పు
మొదలుగాఁగల వింద్రియమ్ములును లేవు । తెలియఁ దన్మాత్రలులేవు దిక్కులేదు. ౩౩

క. ఏలాగు సృష్టిసేయం । జాలుదు మో యమ్మ యనిన శక్తి సరగునన్
లీలావిమాన మిదిగో । మేలైనది రండు దీనిమీది కనంగన్. ౩౪

క. రతనాల విమానం బ । ప్రతిమంబునుఁ జూచి యందఱము నెక్కితి మ
ద్భుత కింకిణీనినాదాం । చితము క్తాదామ సువిలసితమై యొప్పెన్. ౩౫

వ. దానిపై నుండి. ౩౬

—: బ్రహ్మాదులకు భువనేశ్వరి దర్శనమిచ్చుట :—

క. పోతిమి పోతిమి యెక్కడి । కో తెలియ దదెట్టకేలకును మము నిలిపెన్
భీతాత్ముల మగు మాకున్ । జేతోమోదంబు గలుఁగఁజేసెడి భువిలోన్. ౩౭

సీ. పచ్చపచ్చనిరంగు పచ్చిక ల్గలచోట్లు ఫలరమ్యవృక్షముల్ కలుగుచోట్లు
కొదమ కోయలగుంపు కూఁతలు కలచోట్లు వివిధ పర్వతరాజి వెలయుచోట్లు
మగవారు నాడువా రొగిఁ జరించెడిచోట్లు పశువులమందలు పరగుచోట్లు
వరసరిదంభఃప్రవాహముల్గలచోట్లు వాపులఁ గూపముల్ వరలుచోట్లు

తే.గీ. కనుచుఁ జనఁ జన నెదుట ప్రాకారరమ్య । మనుపమానమహాహర్మ్యమైనయట్టి
పురము గనవచ్చె నది సూచి సురలప్రోలు । గాఁదగును దీని నెవ్వరు కట్టినారొ. ౩౮

క. అని యచ్చెరుపడి మఱియున్ । జని చని కాంచితిమి దేహకాంతులు దెసలం
దునుఁ గ్రమ్మ వేటకై వ । చ్చిన భూవరు నొకని నచట భూరివిలాసున్ ౩౯

క. తడయక క్షణమాత్రంబున । గడపె విమానంబు దేవి గగనమునం దా
విడమాయ యెట్టిదో యయ్యెడ మఱియొక దేశమునకు నేగితిమి వెనన్. ౪౦

సీ. కల్పకంబులనీడఁ గామధేనువు దూడ కడ సితేభము జూడఁగాచి కాచి
మేనకాదులు క్రీడమెలసి నాట్యములాడ గంధర్వులను బాడఁ గాంచి కాంచి
మందారములవాడఁ బృందారకులతోడఁ దనరు బంగరుమేడ దాటి దాటి
గరుడపచ్చలగోడ కలచోట శచిఁ గూడఁ దెరగంటి దొరజాడఁ దెలసి తెలసి

తే.గీ. స్వర్గమిదియని యమితవిస్మయమునొంది యచటఁ గనుఁగొంటిమి కుబేరు నంబుపతిని
సూర్యదేవు విభావసు సురలనెల్ల । యహహ యప్పురిసిరి నెన్న నలవియగునె. ౪౧

గీ. అదియు దాటించె క్షణములోనంబ తనదు।మహిమ వెండియుఁగంటిమి ద్రుహిణపురము
పురమునం దొక్క ద్రుహిణుండు బుధులు గొల్వ।నదరఁగా జూచి హరిహరులబ్రపడిరి.

తే.గీ. అతని సభయందు వేదవేదాంగములును । సాగరంబులు నదులును శైలములును
భుజగములు నిజరూపముల్ వొందియుండ।హరిహరులు నన్నుఁజూచి యిట్లనిరి పుత్ర।

క. ఈతం డెవ్వఁడొ యెఱుఁగుదె । నీతీరున నున్నవాడు నిక్కమనిన నేఁ
జేతమునం దలపోసియు । నీతఁ డెవఁడొ నే నెవఁడనొ యెఱుఁగ నటంటిన్. ౪౪

క. అంతట విమాన మెంతయు । వింతగ మఱియొక్కచోట విడిసిన మేమున్
మంతనములాడికొనుచున్ । సంతసమున దానిఁ జూచి సంభ్రమమొదవన్. ౪౫

క. చిలుకలు గిలకిలఁ గూయఁగఁ । గులుకుచుఁ గోయిలలు మిగులఁ గూకూయన పీ
ణలు మ్రోయఁగ మద్దెలధ్వను । లలర మునులుపాడఁ జెలియలాడఁగ నెంతే. ౪౬

క. వరమై సుఖకరమై సుం । దరమై పరమైందవామృతరసోపమభా
సురమై కైలాసధరా । ధరమై కనుపట్టె నున్నతశుభ శిఖరమై. ౪౭

వ. అందు. ౪౮

సీ. ఖిణిఖిణిల్లనుచు ఱంకియలార్చు నున్నని యాబెకొమ్ముల యెద్దు నెక్కినాఁడు
పిష్టామృతహవిస్సు లిష్టాప్తి లోఁగొను మూడుకన్నులతోడ మురిసినాఁడు
కలువకన్నియచెక్కు గిలిగింతఁ గొల్పించు దంట యొదలపూవుఁ దాల్చినాఁడు
చాఱచాఱలకోఱ జంతువుచర్మంబు కటినిండ వలువఁగాఁ గట్టినాఁడు

గీ. వెలయ వెనకయ్య వెనకయ్య వెనుకటయ్య । యుభయపార్శ్వంబులందుండి యొప్పినాఁడు
విందువేడుక వరుగుచు నిలచి యేము । సూచి తలఁచితి మాతండు శూలిగాఁగ. ౪౯

తే.గీ. అచటఁ దల్లులతో నేను నాడుచుంటి । నన్నునేనను శూలియుఁ దన్నుదాను
జూచుకొని యద్భుతరసాబ్ధిఁ జొక్కి చిక్కి।యుండఁగ విమాన మింకొక్క యునికి బట్టె.

సీ. కస్తూరికలయంపి గమగమల్వాకిళ్ళఁ గమ్మగంబురపొళ్ళ తావినోళ్ళ
జాజిమల్లియమొల్ల సంపంగి పందిళ్ళ నునుజవాజికరుళ్ళఁ జెనకుగోళ్ళ
మంచిగంధపుపూఁత మించుమేలియొడళ్ళ నెసకంపుఁ బుప్పొళ్ళ విసరుఁ గేళ్ళ
కొప్పులసిరిమించుఁ గొమరైన కురువేళ్ళ గడఁగిమర్వపుమళ్ళఁ గట్టునీళ్ళ
తే.గీ. వలపులుబయిళ్ళకెక్కి దిక్కులకుపెళ్ళ । మూకుముక్కోళ్ళలోనికిఁ బ్రాకిత్రుళ్ల
వింటిమచ్యుతుపేళ్ళ నవ్విభునికాళ్ళ । కెరఁగి స్మరియింపఁ జప్పుళ్ళ నెత్తుగుళ్ళ. ౫౧

క. ఏమందు మాపురంబున । కే మందఱ మేగి వింటి మిది వైకుంఠం
బేమందిరంబు హరికని । ప్రేమం దగఁ జూచి చూచి వేడుకనుండన్. ౫౨

సీ. నల్లకుగ్గస్తి క్రొన్ననవంటి యందంబు పూను చామనిచాయ మేనివాఁడు
విరిసిన పసపంగి విరివంటి బలుహొయల్ గలుగు దుప్పటి మేనఁ గప్పువాఁడు
నింద్రుకత్తికి నొక్క యీక నిచ్చినవాని వీపుమీదను బీట వెట్టువాఁడు
మంగళదేవతా మహితహస్తంబుల విసరు వీవనగాలిఁ గొసరువాఁడు
తే.గీ. చక్రమును శంఖమును మహాశార్ఙ్గ ఖడ్గ । గదలు నాలుగుభుజములఁగల్గువాడు
దివ్యపురుషుఁడొకం డందుఁ దేజరిల్లఁ । జేరినప్పటి మాయునికిఁ జెప్పవశమె. ౫౩

ఉ. అంతట దేవి దివ్యరథ మచ్చట నుంచక పాలసంద్రపుం
బ్రాంతము సేర్చె నందు నొక బంధురసుందరదేశ మొప్పె న
వ్వింతలు సూచి చూచి తని వింతయుఁదీరక యొక్కరొక్క రిం
తింతనరాని సంతసపుటేట మునింగితి మేమిచెప్పదున్. ౫౪

మధురగతిరగడ

మందారంబులు పారిజాతములు । కుందంబులు మఱి కోవిదారములు
చందనములు సురసాల సాలములు । పొందుగ నందపుఁ బూవుఁదోటలును
నిందును నందును నెందుఁజూచినను । నందందే కడు నానందంబగు
బృందము లగుచు మిళిందము లాడఁగఁ । జిందులతో మకరందము గ్రోలఁగ
కోయెల చివుళుల కొమ్మల మేయఁగఁ । గూయుచుఁ జిలుకల గుంపులు గదలఁగ
దేజరిల్లు నొక ద్వీపముఁ గంటిమి । రాజమణివిభా రాజితమైతగు
పర్యంకంబునఁ బరిమండితమగు । నర్యము వెలుఁగుల యాస్తరణంబుల
నింద్రచాపముచు లెల్లెడఁ గ్రమ్మఁగ । సాంద్రమహిమఁదగుఁ జక్కనిగద్దియ
యొఱ్ఱవిదండలు నెఱ్ఱనిచీరియ । యెఱ్ఱనిగంధము నెఱ్ఱనికన్నులు
చక్కనిమోమును నవరని వాతెర । లెక్కింపందగు లిబ్బిచెలియ లొక

కోటియైన చిఱుఁ గోటికి సరియే । సాటిచెలువ నిజ్జగమునఁ గానము
రవిబింబంబన రహిభాసిల్లుచు । నవనవయౌవన నానాగుణగతి
వరపాశాంకుశ వరదా భయముల । ధరియించి మహోదరముఖములరఁగ
హ్రీంకారజపం బింపుగఁజేయు ని । రంకుశపక్షిగణార్చిత యగుచును
హాొయలుగఁ జిఱునగ వొద్దిగ సూపుచు । శయములఁ గంకణ చకచకలూరఁగ
జెవులను దుద్దులు చెలువలరంగా । రవలకమ్మలొగి రాణఁదలిర్పఁగ
నంగదకేయూరాదులు గుల్కఁగఁ । బంగరుమురుగులు పాణులమెరయఁగఁ
బట్టెడ మెడలోఁ బరిఢవిల్లఁగను । బెట్టినసొమ్ముల పేళ్లే తెలియవు
నడుమున నొడ్డాణము మురవందఁగ । నడుగులనందెలు బెడఁగు లడరఁగను
హ్రుల్లేఖయు భువనేశియుఁ గొల్వఁగఁ । జల్లగఁను మహేశ్వరి పొగడంగను
అయ్యంగన కుసుమాదులుచుట్టును । నొయ్యారంబుగ నూడిగమియ్యఁగ
నారుకోణముల యంత్రమునడుమను । దేరిచూచితిమి దేవిని భగవతి. ౩౫

ఉ. చూచి విరాకుఁ జెంది యిది సుందరి యెందునుఁ జూడ మిట్టి శో
భాచయ మీసహస్రకర భాసుర యీ సుగహోస్రపత్త్రి స
ల్లోచన రమ్యకాంతియుత లోకవినోదిని యౌర యచ్చరల్
నీచలుగారె దీనియెడ నేర్తుమె మెచ్చ నటంచు నుండఁగన్. ౩౬

సీ. అప్పుడు మాతోడ హరి తన తెలివిచేఁ బరికించి యిట్లని పలికెఁ బుత్ర
యీ విశ్వమోహిని యీశ్వరి భగవతి దేవి మహాశక్తి దివ్యమూర్తి
సకలకారణమును సర్వలోకాధారయును మహావిద్య మహోన్నతగుణ
పూర్ణమహామాయ భూతధాత్రి ప్రకృతి యవ్యయ దుర్జేయ యచ్యుతఘన

తే.గీ. శివ దురారాధ్య కల్యాణి శ్రీ యచింత్య । యిది సృజించును రక్షించు నేపుమాపు
పార్శ్వమునఁ గోటిభూతులు పరగుచుండు । ధన్యులము చేసితిమి దీని దర్శనంబు. ౩౭

తే.గీ. ఎన్నిపుణ్యము లొనరించియున్నవారు । ఎన్నిదానంబులను జేసి యున్నవారు
ఎన్నితపములు గావించియున్నవారు । దీనిఁ జూడంగఁ గల రిది తెలియఁ డింక. ౩౮

క. రాగులకుఁ గాన రా దీ । యోగీశ విరాగులకును నొగిఁ గనవచ్చున్
భోగించుఁ బురుషసంగతి । నీ గరితయ ప్రకృతిపేర నెసఁగునుఁజూండీ. ౩౯

క. నీవెక్కడ నేనెక్కడ । దేవతలెక్కడ రమా సుధృగ్వాణీ గౌ
రీ వనితలెక్కడ నయో । యీ వెలఁదుక పాదధూళి కెనయుదుమెకోట్. ౪౦

తే.గీ. నేను వటపత్రశాయినై నీరనిధినిఁ । బదము బొటిమనఁ గుడుచుచుఁ బండియుండ
జెలఁగి జోలలుబాడుచుఁ జిచ్చిగొట్టి । చాల నీతల్లి నన్ను నుయ్యాలనూచు. ౬౧

తే.గీ. అనుభవము నాకు నిది చిన్నతనమునాడు । తథ్య మీదేవియే నాకుఁదల్లిసుండు
తెలిసినది చెప్పితిని మీకుఁ దేటపడఁగ । దీనిఁ జూచినమాత్రనే తెలివి పొసఁగె. ౬౨

—: విష్ణుకృత భువనేశ్వరీ స్తుతి :—

క. అని భగవంతుఁడు విష్ణుఁడు । ఘనుఁడు జనార్దనుఁడు పలికి కడఁగి మరల ని
ట్లను దేవి పార్శ్వమునకుం । జని ప్రణమిల్లుదము రండు చయ్యనమీరల్. ౬౩

క. ఈమెకు మ్రొక్కితిమా మన । కేమేలై నను నొసంగు నేర్పడ నచటం
గామితముఁ దెలుపుకొందము । క్షేమద కొసఁగుదము వేయి చేతుల మోడ్పుల్. ౬౪

తే.గీ. ద్వారపాలకు లెదిరిన వారితోడ । మమ్ము రక్షింపుఁ డీవేళ మాన్యులార
భగవతీస్తుతి సేయంగ వచ్చినార । మంద మామీద వారి చిత్తానుగులము. ౬౫

క. అని చెప్పిన హరిమాటలు । విని యెక్కుడుసంతసమున వేగమ ద్వారం
బునకేగి యచట నిలచినఁ । గని భగవతి యల్లనవ్వి కరుణామయియై. ౬౬

క. ద్వారస్థలైన వెలఁదుల । వారంబుల జూచి యచటి వారలతోడన్
రా రండని పలికిన య । న్నారులు మముఁ గొనుచు నేగి నయమెనయంగన్. ౬౭

వ. అచట నిల్పిన. ౬౮

క. మేమందఱమును యువతుల । మై మించితి మచట నేమనందునుఁ గొడుకా
మామేనుల మారూపుల । మామొగముల మేమె చూడ మనసాయెఁగదా. ౬౯

క. స్త్రీరూపధారిణులమై । చారువిభూషణవిభ ద్దిశల్గ్రిమ్మఁగ నం
బా రత్నఖచితపీఠము । చేరువఁ జని మ్రొక్కి వింతఁ జెందితిమి సుతా. ౭౦

తే.గీ. ఆమహాదేవి రచ్చలో నందరును వె । లందు లేమందు నందులోఁ గొందఱు సిత
చేల లొకకొందరును నీలచేల లింక । గొందఱునుఁ బీతచేలలు కొల్చుచుండ్రు. ౭౧

క. వారందఱును సుధాంధులు । నారీరూపముల నా సనాతనసభలో
నారద వీణాగానము । లేరీతింబాడి రహహ యెన్నఁ దరంబే. ౭౨

సీ. వినుము నారద నీకు విన్పింతు నేమెల్ల నచ్చోటఁ గనుఁగొన్న యట్టివింత
దేవీ పదనఖంబుఁ దేరి చూచితి మొక్కరొక్కరు లోలోన నుబ్బికొనుచు
నది మహాదర్పణంబై మాకుఁ జూపట్టె నందులో బ్రహ్మాండ మమరియుండె
స్థావరంబులు చూచి జంగమంబులు నూచి ననుఁ జూచుకొని జనార్దనునిఁ జూచి

తే.గీ. రుద్రు జూచి రవినిఁ జూచి రూఢి వాయుఁ జూచి యింద్రునిఁ జూచియు సోము జూచి
వరుణుఁ జూచి ధనదుఁ జూచి త్వష్టఁ జూచి గిరి నదీ వార్ధి గంధర్వ వరులఁ జూచి. ౪౩

సీ. అచ్చరలనుఁజూచి యాత్మజ నినుఁజూచి తుంబురుఁజూచి సాధ్యులనుజూచి
వెలయ హాహాహూహూవులఁ జూచి విశ్వావసునిజూచి చిత్రకేతునొగిజూచి
చిత్రాంగదునిఁజూచి సిద్ధులఁజూచి యశ్వినులనుజూచి యా శేషుఁజూచి
కిన్నరులనుఁజూచి పన్నగులనుఁజూచి దితిబిడ్డలనుజూచి పితలజూచి

తే.గీ. నాపురము విష్ణుపురము పినాకిపురము। శేషశాయిని విష్ణుని శేషశాయి
నాభికమలంబునను నన్ను నాముఖమున। శూలిఁజూచి మఱెన్నియో చూచిచూచి. ౪౪

ఉ. నేనును విష్ణుఁడుఞ్ హరుఁడు నిక్కుచునిక్కుచు ఱెప్పవార్ప కెం
తేనియు వింతఁజెంది యిది యే మిదియేమని మెల్లమెల్లఁగా
లోనసె లోననే గొణుఁగులోఁబడియుంటిమిగాని సత్యముఞ్
గానగఁ జాలమైతిమి యెగాదిగఁగన్గొను వేదురెత్తుటఞ్. ౪౫

ఆ.వె. ఆడువారిపోల్కి నమరి చీరెలుకట్ట। రవికముల్ధరించి రవణములిడఁ
గ్రుక్కిళించుకొనుచుఁ జక్కఁగా మాటాడ। నంతలోనె నేర్పు లబ్బె మాకు. ౪౬

క. చనుదోయి కొప్పు పిఱుఁదుల। కెనసిన బరువునను మాకు నేమన జడతల్
కనుపట్టె నడతలందుఞ్ వినుమా మాకప్పుడున్న వే యీనడుముల్. ౪౭

వ. ఇట్లు స్త్రీత్వంబునొంది యా మహాదేవి కూడిగంపుఁ గత్తెలమై యంద యుండ
నూరుహాయనంబులు గడచె నంత మురాంతకుండు భగవతిం బహుభంగుల స్తుతి
యింపందొడంగె. ౪౮

దండకము. జోహారమ్మదేవీ, జోహారమ్మధాత్రీ, జోహారమ్మకర్త్రీ, జోహారమ్మభర్త్రీ
జోహారమ్మనేత్రీ, జోహారమ్మదాత్రీ, జోహారమ్మభోక్త్రీ జోహారమ్మ కల్యాణి
నీకుం జోహారుల్, జగంబెల్ల సంసారచక్రంబునం ద్రిప్పుచుఞ్ జంతుకోటిం
భ్రమింపంగ నీవిట్లుసేయంగ లోకంబులెల్లం దగం బంతులై వింతగా డొల్లు
చుండంగఁ గూటస్థవై శక్తివై యుందు హృల్లేఖవుఞ్ నీవ నీకుఞ్ జోహారుల్
తలంపంగ సర్వంబునందుండు నీవేయటంచుఞ్ సదాకారమున్నీవకావే చిదాకారము
న్నీవకావే మహానందమున్నీవకావే యసద్రూపమున్నీవకావే మహాపూరుషున్వశ్యఁ
గావించుకొన్నావు కల్పంబునందీవ యేకాంతభావంబునుం బొందియున్నావు, ధాత్రుం
డెరుంగండు శర్వుండెఱుంగండు నేనుం జడుండఞ్ జగానన్ మఱేరింకజ్ఞానుల్
భవచ్ఛక్తి నెన్నంగలారీశ్వరీ నిన్ను యాచింతు నీపాదసేవ ల్సదాసేయుదుం జిత్త

మందుండవూ నీపదాంభోజయుగ్మంబు నిత్యంబు నేదర్శనం బాచరింతుఁ జగత్స్వామివీ
నీదయాపూరమేకాదె నాకుఁ సురజ్యేష్ఠ రుద్రాది దేవాళికిం దిక్కు నీవల్లనే నేను
లోకంబు రక్షింతు ధాతృండు పుట్టించు నీశుండు గిట్టించు సూర్యుండు చంద్రుండు
వెల్గించు నిత్యత్వమెన్నంగ నీదేకదా మాకులేదద్ది జ్ఞాతంబసూ కీర్తియుఁ గాంతియుఁ
శాంతియుఁ దాంతియుఁ బుద్ధియుఁ వృద్ధియుఁ రక్తియుఁ ముక్తియుఁ
శక్తియున్నీవ, పూర్ణాంబురాశిం దరంగంబులట్లీ సమస్తామరుల్నీకు నంశంబులై
యుందురమ్మా ననుంబ్రోవుమమ్మా కృపంజూడవమ్మా మొరాలించవమ్మా పరా
కేలనమ్మా భవాబ్ధిందరింపంగ బోతంబవై యుండవమ్మా నినున్నమ్మినానమ్మ
నీవాఁడనమ్మా మహాపత్తులం దోడునీవై ననుంగాచి జ్ఞానంబు నాకిచ్చిమన్నించుమమ్మా
నమోస్తంచుఁ బ్రార్థింతు శ్రీశ్రీ, శివశ్రీ, జయశ్రీ. ౪౯

క. అని విష్ణుఁడు విరమించిన । మనసిజసూదనుఁడు భక్తిమహితుం డగుచుఁ
గొనియాడఁదొడగె నీశ్వరి । ననుపమకారుణ్యవతి ననఘను భగవతిఁ. ౫౦

— : శివకృతదేవీస్తవము : —

ఉత్సాహ. నీవు సర్వలోకములకు నేత్రివై రహింప శ్రీ
మావరుండు నీకుఁగల్గె మహిమఁ జెంది వాగ్వధూ
టీవరుండు నీకుఁగల్గె శీకమీఱ నేనుగౌ
రీవరుండఁ గల్గితిన్ భరింపవమ్మ భగవతీ. ౫౧

ఉత్సాహ. నీవె భూమి నీవె నీరు నీవె గాలి నీవె ని
ప్పీవె నింగి యీవె గంధ మీవె రసము నీవె సో
కీవె రూప మీవె శబ్ద మీవె ఘ్రాణ మీవె నా
లీక్కవె త్వక్కు నీవె కన్ను లీవె వీను భగవతీ. ౫౨

ఉత్సాహ. ని న్నెఱుంగనట్టివారు నేరకంద్రు వేఱుగా
నన్ను బ్రహ్మఁ జక్రపాణి నాథులంచు మూఢులై
చెన్నుమీఱ నీవ మమ్ము చేసినావు తల్లివై
పన్నుగా నజాండభాండ పఙ్క్తివేను భగవతీ. ౫౩

ఉత్సాహ. తల్లి యీప్రపంచమెల్ల ధాత్రిచేతఁ గల్గునే
నీళ్లచేతఁగల్గునేని నిప్పుచేతఁ గల్గునే
మొల్లమౌ నణుప్రకాండము ల్స్ఫుటంబు లెట్టులోఁ
జెల్లియుండు నీ కళావిశేషమొండు భగవతీ. ౫౪

ఉత్సాహ. అమ్మ నీవె సర్వ మీ చరాచరమ్ము నమ్ము మా
యమ్మ నీవెసుమ్మ బమ్మ వచ్యుతుండ నీవె నా
యమ్మ నీవె యెందరమ్మలైన సమ్ముఖమ్మునన్
బొమ్మలాటలోనివారె పొ మ్మనాది భగవతీ. ౮౫

ఉత్సాహ. నీపదంబు లాశ్రయించి నేను శౌరి బ్రహ్మయున్
రూపునీజగంబులకును రూఢినిచ్చువేళలన్
కాపునీవకాదె మాకుఁ గామదాత్రివై సదా
చూపులం గృపారసంబు చూపుమమ్మ భగవతీ. ౮౬

ఉత్సాహ. నీ దయారసంబుచేతనే విరించి దా రజం
బూదెనమ్మ శౌరి సత్త్వమూనె నేను నత్తమం
బాదుకొంటినమ్మ పద్మజాండకర్త్రి భర్త్రి నీ
వాదిశక్తివమ్మ బ్రోవవమ్మ మమ్ము భగవతీ. ౮౭

ఉత్సాహ. రాజటంచు నొక్కరుండు రాజునొద్ద బంటుగాఁ
దేజరిల్లు నొక్కరుండు దీనుఁ డొక్కరుండుగా
నోజ భాగ్యవంతుఁడొక్కఁ డుండునట్లు వింతగా
నీజగంబుఁ జేసితీ విదేమి తల్లి భగవతీ. ౮౮

క. అమ్మా నీగుణములు మూ । డిమ్మాడ్కిఁ బ్రపంచమెల్ల సృజియింపంగా
నిమ్ముగఁ బ్రోవఁగఁ ద్రుంపఁగ । మమ్మేటికిఁ జెప్పుకొంద్రు మాయాగుణమే. ౮౯

క. అమ్మ విమానముమీఁదన్ । మమ్మెక్కించుకొనివచ్చు మార్గమ్మున నూ
త్నమ్ములగు విష్టపమ్ములు । సమ్మతిఁ గనుఁగొంటి మెవరు సలిపిరి తల్లీ. ౯౦

క. పుట్టింతువు గిట్టింతువు । నెట్టన జగమెల్ల నీకు నీవే కావే
దిట్టయగు స్వపతిఁ బురుషున్ । గుట్టెఱిఁగి వరించు పరమ కోవిద వీవే. ౯౧

క. మము భాగవతులఁ జేయుము । విమల భవత్పాదరజము వేడుకమ్రోయన్
రమణీరూపములను విడ । చి మతేమి యిఁక నిట మేము చేయుదుము సతీ. ౯౨

క. ఈ మేనుల మాకుఁ గొఱం । తేమున్నది నిన్ను విడచి యేగు తలంపుల్
మామనసులకుం బొడమవు । మామీఁద దయార్ద్రదృష్టి మానకు తల్లీ. ౯౩

క. భువి విభవము పరిభవమే । భవదంఘ్రిసరోజసేవ బాటిలెనేనిన్
వివిధంబులైన సుఖముల । నెవఁ డాసించినను బుద్ధిహీనుఁడు వాఁడే. ౯౪

క. మునియై తపములు సేసిన । వినుఁ గాంచుటకేగదా సునీతిపరుండ
య్యును లోకమేలఁ గాంక్షలఁ గనుటయు నీపాదసేవ కలుగుటకెగదా. ౯౫

క. సంసార మసార మఖిల । హింసాకర మేల మాకు నీశ్వరి నీప
త్పాంసువులం దలమోచుచు । నోం సత్యమ్మనుచు నిచట నుండెదమమ్మా. ౯౬

క. నాకున్ నీమంత్రంబే । యేకంబగు గతి యటంచు నెప్పుడు దలఁతున్
జోక నవాక్షరమంత్రము । కైకొంటిం బూర్వభవము కాలమునందున్. ౯౭

క. కొడుకా నారదుఁ డా శం । భుఁడు దా నీరీతి వేఁడ భువనేశ్వరి యె
క్కుఁడు దయ నుపదేశించెన్ । గడఁగి నవాక్షరసమాఖ్య ఘనమంత్రంబున్. ౯౮

శా. ఆ మంత్రంబును నేర్చి శంభుఁడు దదీ యాంఘ్రిద్వయిన్ భక్తితోన్
వేమాఱుం బ్రణమిల్లి తజ్జపముఁ గావించెన్ శుభోచ్చారణ
శ్రీమీఱన్ గమనీయబీజయుత మక్షీణంబు మోక్షాస్పదం
బీమంత్రంబని సంతసించుచును నే నెంతేని యుత్కంఠతోన్. ౯౯

వ. అమ్మహాదేవి పాదంబుల కెఱఁగి యిట్లని స్తుతించితి. ౧౦౦

శా. దేవీ వేదములెన్నలేని మహిమన్ దీపించె దీవెంతయున్
నీ వీ లోకవిధాత్రివం చెఱుఁగుదున్ నీవేడ నేనేడ నే
నీ విశ్వంబు సృజించు స్రష్టననుచున్ హేయంబుగా గర్వ స
ద్భావం బందితి నేఁడు నాకుఁ దెలసెన్ దథ్యంబు లోకేశ్వరీ. ౧౦౧

చ. కొలిచెద మోహపాశములఁ గోయుము సంసృతివార్ధి దాటఁగన్
గలమవుగావె నీచరణకంజములం గనుగొంటి నేఁటికిన్
గలిగెను నీదు సేవనము గర్వము సర్వము దూలె వైశమే
చిలుకుము నీ దయారసము సేవకభావము నిల్పు మీశ్వరీ. ౧౦౨

చ. తెలియనివారు నన్ను నొక దేవుఁ డటందురు స్రష్టయంచునుం
బలుకుదు రద్ది కల్లసుమి భక్తుఁడ నీకు దయామయీ నిరా
కులతఁ ద్వదీయనామమును గోరి జపించుచు సర్వకాలమున్
వెలయఁగఁ జేయుమమ్మ మనవి న్వినుమమ్మ సతీ దయావతీ. ౧౦౩

ఉ. నీజపమాచరించుటకు నేరక యోగమటంచు యాగమం
చీజగతిన్ విమూఢమతు లెందఱు చింతిలుచున్న వారు నా
నాజగదాదికారణఘనప్రభ నొప్పెడి నిన్నుఁ గొల్చినన్
దేజముగల్గి ముక్తిఁ గడతేరుదు రీశ్వరి వేయునేటికిన్. ౧౦౪

ఉ. చూచినయప్పుడే జగము శోభిలు నీదు వినోదమాత్రమై
తోఁచును భూతసృష్టి దయతో ననుఁ బ్రోవుము వేఱ నాకు నా
లోచనలేదు సంసృతివిలోలత మాన్పి భవద్విచార వి
ద్యాచతురుండఁగా నొసఁగుమా వర మీశ్వరి దివ్యసుందరీ. ౧౦౫

ఉ. హరిహృదయంబునం దుదయమైతిని నేను గపాలమాలికా
ధరుఁడు మదీయవక్త్రమునఁ దానుదయించెను మాస్వతంత్రతల్
తిరములె నీవు తల్లివయి త్రిప్పుచునుంటివి మమ్ముఁ గార్యబం
ధురమహిమంబు లిచ్చి దయతో నిరతంబును విశ్వపాలినీ. ౧౦౬

చ. పురుషుఁడు నీవినోదమును బొందును నీవు ప్రధానవై భరిశ్
బొరసితి వింతకంటె నుతిఁ బొందుఁ ద్వితీయములేదు చూడఁగాఁ
బరమవిలాసచేష్టిత విభావవిధానములెన్నియేనియుఞ్
నెరపెదవీశ్వరత్వమున నిండినవానిని మాయఁగొల్పుచుఞ్. ౧౦౭

సీ. అరయంగ నేకమేవాద్వితీయం బ్రహ్మ యనునట్టి వేదవాక్యంబునకును
సత్యత్వమేరీతి సమకూరుఁ బ్రకృతియుఁ బురుషుండు నిరువురు బొసగుచుండ
సంశయగ్రంథి నిశ్చయముగా నాహృదయము బట్టియున్నది యనవరతము
కారణంబొక్కటా కడఁగిరెండా యనునట్టి విచార మోయంబ నీవు

తే.గీ. తెలుపఁగలదాన విది నాకుఁ దెల్పి సంశ । యంబనెడి ముడి విప్పు సిద్ధాంతసరణి
మఱియు నీవంగనవొ లేక పురుషుఁడవొకొ । తెలియకుంటిని చెప్పుమాదేవి నాకు. ౧౦౮

క. అని నే నడిగిన దయతో । విని నా వినయంబు సూచి వివిధగతుల న
న్నును దృప్తిజేయ నీశ్వరి । వనజాసన, వినుమటంచు వచియించెఁ దగఞ్. ౧౦౯

—: బ్రహ్మాదులకు భగవతి నిజరూపము నుపదేశించుట :—

తే.గీ. పురుషునకు నాకు భేదంబు పొఱయదెందు । నరయ నేకత్వమునకును హానిలేదు
వాఁడె నే నేనెవాఁ డనువాఁ డొకండె । ముక్తుఁ డట్టులఁ గాకున్న మూఢుఁడతఁడె. ౧౧౦

తే.గీ. ఆత్మ నిరుపాధికంబయి యలరునేని । అప్పు డద్వైతభావంబు తప్పకొందు
పరగ సోపాధికంబయి పరలునాఁడు । ద్వైతభావంబుతోఁపక తప్పదెన్న. ౧౧౧

తే.గీ. భేదముత్పత్తికాలంబుఁ బెనగియుండుఁ । పేర్మి నుత్పత్తి లేనప్డ భేదమగును
భేద మది కల్పితంబు నిర్వాదలీల । సత్యమేకంబు బ్రహ్మ దానిత్యమరయ. ౧౧౨

తే.గీ. ఒక్కదీపంబె రెండయి యొప్పినట్లు । నీడయొక్కటి యద్దాన తోడుగాఁగఁ
దోఁచినట్టు లుపాధిచేఁ జూడఁబడును । భేదమనునది సృష్టికై పేర్మిగాంచు. ౧౧౩

సీ. శ్రీనేను ధీనేను ధృతినేను స్మృతినేను కృతినేను దయనేను గీర్తి నేను
శ్రుతినేను క్షుధనేను మతినేను గతినేను శ్రద్ధనునేను తృష్ణ నౌగి నేను
విద్యనునేను నిద్రాద్యనునేను పిపాసనునేను విభాతినేను
గాంతిని నే నింక శాంతిని నేను రజసునేను స్పృహనేను రక్తి నేను
తే.గీ. నేనజర నేనవిద్యను నేనుశక్తి । నేనశక్తిని మజ్జను నేను ద్వక్కు
నేను దృష్టిని బుష్టిని నేను సృష్టి । నేను బశ్యంతి నేమధ్య నేను బరను ౧౧౪
సీ. బ్రాహ్మియు గౌరియు రౌద్రియు వారాహి వైష్ణవి కౌబేరి వారుణియును
నారసింహియు నను నామముల్కలవారు నారూపములెసుమ్మ నమ్మమింత
అందఱిఁబుట్టించి యయ్యాయికార్యంబులందుంచి నే వారియందు నిలచి
వొసగింతుఁ గార్యముల్ వొరి నీట శైత్యంబు నగ్ని నుష్ణిమ జ్యోతి యబ్జునందు
తే గీ. హిమమునై యుంటి నెందును నేకొఱంత । లేకయుండంగ ననువైన జోకనొప్పి
నేన సర్వంబుసేయుదు నేర్పుమీర । నిందఱును భేదమందుందు రే నొకర్త. ౧౧౫
సీ. శక్తియొకటిగల్గ శక్తుండు శంభుండు సకలజగంబులు సంహరింప
శక్తియొకటిగల్గ శక్తుండు విష్ణుండు సకలజగంబుల సాకినిలుప
శక్తియొకటిగల్గ శక్తుండపీవును సకలజగత్సృష్టి సలుపుటకును
శక్తియొకటిగల్గ శక్తుండు సూర్యుండు సకలజగత్ప్రకాశకుఁడుగాఁగ
తే.గీ. శక్తియొక్కటిగల్గగా శక్తుడింద్రుఁ । డంబుదంబులఁబంచి తోయంబులిడఁగ
శక్తిలేకున్న వీర లశక్తులగుచు । నోరుదెఱచుక పడియుంద్రు పేరులేక. ౧౧౬
ఆ.వె. శక్తిలేనియది యశక్తంబు శక్తి । ని నేను దెలియు మీ విధానమెల్ల
నాదకాక యొండు లేదులే దిదిసత్య । మిదియసత్యమనుచు నెంచుమిఁకను. ౧౧౭
సీ. ద్రవ్యంబులందెల్ల తతశక్తినిత్యంబు సత్యంబు సత్యంబు సత్యమిదియ
అరసిచూడంగఁ బదార్థంబులందును బరఁగునభావంబు ఫక్కివినుము
ప్రాగభావంబును బ్రధ్వంసకాభావ మననొప్పునట్టి వభావములగు
శక్త్యభావములేదు జగదభావమెకాని జగదభావముసెప్పు సరణివినుము
తే.గీ. లలినిమృత్పిండములఁ గపాలంబులందు । నెన్నిచూడ ఘటాభావ మెట్లుకలదొ
యట్టులనె యదియేమన నందు నామ । రూపములుమాత్రము హాశిక్కి రూఢిఁ దెలియ.
సీ. భూమిలేకుండిన భూపరమాణువుల్ లేకుండనే యతీంద్రియములైన
పృథివిలేదనుచుఁ జెప్పినమాట పరమాణ్వభావంబునం జెప్పఁబడదుసుమ్మ
శాశ్వతంబనియును క్షణికంబనియు శూన్యమనియు నిత్యంబనియును ననిత్య
మనియు సకర్తృకం బనియు నహంకార మనియును భేదంబు లయ్యె నేఁడు

తే.గీ. కన మహత్తత్త్వమున నహంకారమొదవు । నందు భూతంబులుదయించు నదియుగానఁ
గొనుమహత్తత్త్వమిప్పుడే వనజగర్భ । జగము సృజియింపు మిదిపూని శక్తికొలది.

తే.గీ. ఇంక నీకొక్కశక్తిని నేనొసఁగెద । దీనిసాంగత్యముననీకుఁ దెలివిపుట్టు
చారుహాసిని యిది సరస్వతి సురూప । మంచిదిది నీకుఁ దగిన సామగ్రిఁగూర్చు. ౧౨౦

ఉ. తెల్లనిజీర చూడు మిది దివ్యసుమా ధరియించియున్న యీ
మొల్లపు సొమ్ములం గనుము మూర్తిని జూచితె ముద్దులొడు నీ
పుల్లసరోజలోచనను బొందుము సత్యజగంబు జేరుమీ
వెల్లపను ల్బిరాననె గ్రహించెద వేటికి సంశయింపఁగన్. ౧౨౧

క. లింగాంగంబులు జీవము । లుం గర్మలతోడ వర్తిలున్ వానిని బల్
రంగుగఁ జేయుము మునుపటి । యంగెఱుగుదుగాదె వారిజాసన పేర్మిన్. ౧౨౨

తే.గీ. కాలకర్మస్వభావముల్ కారణములు । వానిఁగైకొనిచేయుము పూనిజగము
పుండరీకదళాక్షుండు పూజనీయు । డతఁడు సత్త్వగుణోపేతుఁ డగుటఁజేసి. ౧౨౩

తే.గీ. ఎప్పుడెప్పుడు నీమది నొప్పిదోఁచు । నప్పుడప్పుడు జలశాయి యవతరణము
లెత్తి నీబాధ వారించు మత్తులైన । రక్కసులనెల్లఁ జిటికలో నుక్కడంచు. ౧౨౪

క. శివుఁడును నీకు సహాయుం । డవు నితఁడు మహాబలుండు వ్యాపకుడుసుమీ
దివిజుల సృజియింపుము భూ । దివిజనృపోరుభవసృష్టి ధృతిఁజేయు మిఁకన్. ౧౨౫

వ. మఱియు సర్వమఖంబుల హవిర్భాగంబులు గొంచు బృందారకులు తృప్తులగుదురుగాత, తమోగుణప్రధానుండై పరఁగు శివుండు మాననీయుండు సర్వప్రయత్నంబుల సవనంబులయం దతండు పూజింపంబడుంగాత, దైత్యులదాడి మీప్రయత్నంబులం దీరదేని వారాహీ, వైష్ణవీ, నారసింహీ, గౌరీ, శివాది నామంబులుగల నానారూపశక్తు లుత్పన్నంబులై రాక్షసుల శిక్షింతురుకావుత, బీజధ్యాన సంయుతంబును నవాక్షరంబును నగు నొక మంత్రరాజంబు నీకొసంగెద, దీనిం జపియించుచు నీవెల్లకార్యంబులు సంఘటింప శక్తుండవగుదువు. దీని సప్తకోటి మహామంత్రంబులలో నుత్తమంబగు దానిఁగా నెఱుంగుము, నీయిష్టార్థసిద్ధి కిదియే పరమసాధనంబుగా గ్రహించి నిరంతర జపపరాయణుండవు కమ్మని, అని చెప్పి జగన్మాత చిఱునవ్వు నవ్వుచు నారాయణుం దిలకించి యిట్లనియె. ౧౨౬

సీ. వినుము నారాయణ వినుమోయి కేశవ వినుమయ్య మాధవ వినుము నృహరి
వినుము దామోదర వినుమయ్య వైకుంఠ వినుము పంకజనాభ వినుము శార్ఙ్గి
వినుము దైత్యాంతక వినుమయ్య యచ్యుత వినుమయ్య దశరూప వినుము శౌరి
వినుము పద్మదళాక్ష వినుమీ యధోక్షజ వినుమయ్య వామన వినుము విష్ణు
తే.గీ. సాత్త్వికుఁడవీవు నీవెల్ల జగములకును । బోషకుండవుగమ్ము నీపొందుగలయ
నీడుజోడుగ నీలక్ష్మి నిచ్చుదాన । వనితతొమ్మున నెక్కించుకొనుము చనుము. ౧౨౭

క. దేవతలకు సవనంబులు । జీవనములు సేసియుంటిఁ జెచ్చెఱ శివుఁడున్
నీవును బ్రహ్మయు నైక్యం । బావహిలంగూడియుండు దన్నిపనులలోన్. ౧౨౮

మ. శివుఁడే విష్ణుఁడు విష్ణుడే శివుఁడు చర్చింపంగ నీయిర్వురన్
దవులంబో దొక భేద మెన్నఁడును దత్యంబెన్నఁ బూజ్యాల్కాదా
వివిధాచారములందు నిట్లనుచు నే విద్వాంసుఁ డూహించు వాఁ
డవిషాదుండగు ముక్తినొందు నితరుం డందున్ మహాదుఃఖముల్. ౧౨౯

చ. ద్రుహిణుఁడు నట్టివాఁడయగుఁ దోయజలోచన యొక్క భేద మా
వహిలెడు దానిఁ దెల్పెదను వాసిగ సత్త్వము ముఖ్యమెన్నఁగా
మహిమ రజోగుణంబును దమంబును గౌణములై తలిర్చు నీ
కహివరతల్పః పూనుము మహామహవాచ్యుత రాజసంబునన్. ౧౩౦

సీ. వైకుంఠ నీకిదే వాగ్బీజమును గామరాజంబును దృతీయ బీజమగుచుఁ
దనరు మాయాఖ్యంబుఁ బొనరిన మంత్రంబు నిచ్చెద కైకొను మిది సమస్త
వాంఛితంబులనిచ్చు వారక యిది జపించుచు యథేష్టంబుగ సుఖముగనుము
నీకు మృత్యుభయంబు లేకుండఁ జేసితి కాని యీజగము నొక్కటిహరించు
తే.గీ. నపుడు లీనుండవగుదు నాయందు నీవు । మఱువకుము మంత్రరాజంబు స్మరణసేయు
కామదము మోక్షదంబును గలిత లలిత । మతి వికాసదమై నిన్ను మనుచుగాత. ౧౩౧

క. సద్గీతచరితుఁడవు నీ వుద్గీథముతోడఁగూడి యొనరింపుము సం
పద్గరిమను వైకుంఠము । తద్గతుఁడవుగమ్ము నన్నుఁ దలఁపు మనయమున్. ౧౩౨

వ. ఇట్లు దేవి నారాయణునకుం జెప్పి శంకరుంజూచి యిట్లనియె. ౧౩౩

ఉ. శంకర నీకు నిచ్చెదను సర్వగుణంబులనాద్యయైన యీ
పంకజనేత్ర గౌరి యిది భాసుర దివ్యచరిత్ర దీనితోఁ
బొంకముగా సుఖంబులను బొంది రజస్తమము ల్పొసంగఁగా
శంక యొకింతలేక సువిచారుడవై రజతాద్రినుండుమీ. ౧౩౪

ఉ. నీవు తపంబుసేయునెడ నీకును సత్త్వగుణంబుగల్గు నా
నావిధ సంసృతిక్రియల నమ్మము మూఁడుగుణంబు లేర్పడున్
వావిరి వస్తువుల్ త్రిగుణవంతములౌ గుణహీనముల్ సదా
లేవగుణంబొకండ లలిం దలఁపం బరమాత్మ శంకరా ౧౩౫

క. కలుగదు కలుగంబో దుజ్జ్వలదృశ్యము నిర్గుణంబు శంకర విను నా
విలసనము సగుణ నిర్గుణ । కలనం బిది నీకుఁ జెప్పఁగావలసెఁ జుమీ. ౧౩౬

ఆ.వె. కారణంబకాని కార్యంబ నేఁగాను । గాన నేను సగుణఁ గావలయును
బురుషునొద్ద నేను బూని నిర్గుణనౌదు । శశికళావతంస సత్యమిదియ. ౧౩౭

తే.గీ. మహదహంకారతత్త్వముల్ మానితములు । శబ్దముఖములు గుణములు జనితములగు
కార్యకారణరూప సంగతులచేత । జరుగుచుండును జగము నా శక్తివలన. ౧౩౮

ఆ.వె. సతిని నేను నన్నె సత్తంత్రుఁ డాయం దహంకృతియును బుట్టె నందువలన
నేనె కారణంబ నీ యజాండములకు । మూఁడుగుణములందు మొనసియుందు. ౧౩౯

తే.గీ. అ యహంకృతియందు మహత్తునింక । పంచతన్మాత్రలును భూతపంచకంబు
జ్ఞానకర్మేంద్రియమనోనికాయ మొదవె । పురుషుఁడనువాఁడు నారూపె పరుఁడుకాఁడు.

తే.గీ. సంగ్రహంబుగఁజెప్పితి జగమువిధము । పనులుగలవిఁకఁబొందు మీ మనసులందు
నన్నుమఱువక స్మరియింపు డన్నియెడల।ననుచు వీడ్కొల్పె మముదేవి యతిముదమున.

కం. అయెడ నేమనిచెప్పుదు । మాయాంద్రును మేము నొక్క మాదిరిరూపుల్
పాయకయుంటిమి యచ్చెరు । వాయెను మాపొందులెట్టులగునోయనుచున్. ౧౪౨

కం. ఆయెడఁ గదలితి మందఱ । మాయమ వీడ్కొల్పఁ బిదప నన్యస్థలికిన్
బ్రోయాంద్రము చన నందున్ । మాయగ నడచితిమి మేము మగరూపులతోన్. ౧౪౩

వ. ఇట్లు విమానంబుననుండి భార్యాసహితులమై మేము మువ్వురము చనిచని తొ
ల్లింటి పంకజంబున్నచోటుం బ్రవేశించితిమని చెప్పి విరించి మఱియు నిట్లనియె. ౧౪౪

—: బ్రహ్మాండోత్పత్తి :—

మాలినీవృత్తము.

ఈవిధినొప్పు మహేశ్వరిఁ గంటిమి యేనును విష్ణుఁడు శంకరుడున్
నా విని పల్కెను నారదుఁ డప్పుడు నాయన చెప్పుము నాకు వెసన్
దేవునిఁ బూర్ణుని నిర్గుణు నాద్యుని నిశ్చలు నవ్యయుఁ జూచితిరా?
భావమకో యదభావమకో మదిఁ బాయుదు సంశయ మిప్పఁటికిన్.

తే.గీ. త్రిగుణయగు శక్తి నీక్షించితిరికదయ్య । యెసఁగ నిర్గుణ యనునది యెట్టులుండు
పురుష నీక్షించుటకు బుద్ధిపుట్టి దొడ్డ । తపము చేసితిఁ జేసితిఁ దండ్రి నేను. ౧౪౬

ఆ.వె. ఎంతతపము చేసి యేమిఫలముగంటి । నాత్మపరితపింప నాయెఁగాక
యేడ గోచరుండు కాడాయెఁ బరమాత్మ । యీరు కంటిరనుచు నెంతుఁ జెపుమ. ౧౪౭

క. కంటిరి శక్తిని సగుణను । జంటన్ నిర్గుణత నొప్పు శక్తియుఁ బురుషుం
డంటి యెటులుండుదురు మీ । కంటికిఁ గన్పడిరె వారు కాంచనగర్భా! ౧౪౮

క. అని నారదుఁ డడిగిన న । వ్వనజాసనుఁ డిట్టులనియె వదనంబున లే
తనగవు దోపఁగ నిర్గుణ । మున రూపములేదు నయనముల కగపడునే? ౧౪౯

క. కనపడునది నశ్వరమగు । గనపడని దనశ్వరంబు కాదే బ్రహ్మం
బనుమానంబునఁ దెలియును । ఘనశబ్దమువలన మనము కందుము పుత్రా. ౧౫౦

చ. మునులకు జ్ఞానగమ్యులును బూజ్యు లనాదులు వేదవాక్కున
మ్మినను సుగమ్యులౌదురుసుమీ యది నమ్మకయుంటిమేనియున్
మనకు నగమ్యులే నిజము మానక వెల్గు సమస్తమందు నే
యనువుననుండెనో యటులు నాపురుషుండును శక్తియున్ సుతా. ౧౫౧

క. ఆపురుషుండును శక్తియు । వ్యాపకులని యెఱుఁగు జగమునందంతట నే
రూపములేకయయుందురు । రూపింపఁగవార లేకరూపులుసుమ్మీ. ౧౫౨

క. పరమాత్మయుఁ బరశక్తియు । నరయంగా నొకటయంచు నాత్మఁదలఁపు మం
తరమేమియులేదుసుమీ । యిరుపురకును నిట్టితత్త్వ మెఱుఁగరు రాగుల్. ౧౫౩

క. సగుణులకు నిర్గుణుడుఁ గా । నఁగవచ్చుట యెట్లు నందనా పైత్యమునన్
బొగిలెడి రసజ్ఞ కనునా। వగరుం గారమునుఁ జేదు వైఖరి నెన్నన్? ౧౫౪

క. మనసు సగుణంబుగాఁగాఁ । గనుటెట్టుల నిర్గుణంబు గతివిపరింపన్
వినుమదియు నహంకారం । బననే జనియించెఁగాదె మునువింటివకా. ౧౫౫

క. ఎన్నాళ్లు గుణము విడిపో । దన్నాళ్లను నిర్గుణంబు నాలోకింపం
దన్నుకొనినఁ గాదుసుమా । యన్నా నిర్గుణము సాధ్యమా యెఱుఁగంగన్. ౧౫౬

చ. అనవుఁడు నారదుండు కమలాసన సత్త్వరజస్తమంబులం
చను త్రిగుణంబులంటివి మనోమతులంటివి తద్భవంబులే
యని యిఁక నయ్యహంకృతి తదాత్మకమంటి సవిస్తరంబుగా
వినవలఁతున్ వచింపగదె విస్ఫుటలీల సరస్వతీవరా. ౧౫౭

వ. అని నారదుండడిగినం గమలగర్భుండు పుత్త్రికా! గుణంబులకును మూఁడుశక్తులు కలవు. సాత్త్వికంబున జ్ఞానశక్తియు, రాజసంబునకుం గ్రియాశక్తియుఁ, దమోగుణంబునకుం ద్రవ్యశక్తియుఁ గలిగియుండు. నందుఁ దామసంబునందలి ద్రవ్యశక్తివలన శబ్దస్పర్శరూపరసగంధంబులను నయిదుతన్మాత్రంబులు పొడమె. శబ్దమను నొక్కగుణముమాత్ర మాకాశంబునకుం గలదు. వాయువునకు స్పర్శగుణంబును, నగ్నికి రూపగుణంబును, జలంబునకు రసగుణంబునుఁ, బృథివికి గంధగుణంబునుఁ బొసంగియు భూతపంచకంబును దన్మాత్రంబులుం గలసి యీపదియును ద్రవ్యశక్తులై తామసంబైన యహంకారంబునం బుట్టినయవి. రాజసంబగు క్రియాశక్తికిఁ ద్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులను నైదు జ్ఞానేంద్రియంబులును, వాక్పాణిపాదపాయూపస్థలను నైదు కర్మేంద్రియంబులు నుత్పన్నంబులయ్యె. మరియు బ్రాణాపానవ్యానోదానసమానంబులను నైదు ప్రాణంబులు నుం బుట్టె. నీ పదియేను రాజససర్గంబనంబడు. ఇవియ క్రియాశక్తిమయంబులగు సాధనంబులు. వీని కుపాదానంబు చిత్తనాబడు జ్ఞానశక్తి. సత్త్వంబునం దిశలును, వాయువును, సూర్యుండును, వరుణుండును, నశ్వినులును జ్ఞానేంద్రియాధిష్ఠాన దేవతలై ప్రవర్తిల్లిరి. బుద్ధ్యాద్యంతఃకరణ చతుష్టయంబున కధిష్ఠానదేవతలై చంద్రుండును బ్రహ్మయు రుద్రుండును విరాజిల్లెదరు. ఇవి మనస్సుతోఁగూడి పదియేనును సాత్త్వికసర్గంబునాఁబడు. స్థూలసూక్ష్మభేదంబులచేఁ బరమాత్మకు రెండుభేదంబులుండు. జ్ఞానరూపముమాత్రము నిరాకారమును గారణమాత్రము నైయుండు. ధ్యానాదులయందు సాధకంబైనది స్థూలరూపంబగు. మహాపురుషుని శరీరంబు సూక్ష్మంబగు. నిది వింటివికదా సూత్రరూపంబునం బరఁగు మదీయ శరీర క్రమంబును వివరించెద వినుము. ౧౫౮

సీ. ఐదుభూతంబులు నైదు తన్మాత్రము లైదగు జ్ఞానేంద్రియములు మఱియు
నైదగు కర్మేంద్రియము లైదుప్రాణము లీరీతినుండుట యిదియసూడ
బంచీకరణ మొనరించినఁ దెలియును దత్త్వంబులెల్లను దనయ నీకు
మొట్టమొదట రసమునుగొని మనసుతో నమరించి యుదకమ ట్లాత్మనెంచి

తే.గీ. వేఱువేఱుగ నందులో వివిధభూత । ములను బదనించి చైతన్యమునుగలిపిన
నేనగుదు సంశయములేదు దీనినమ్ము । తెలియుమిదిచక్కఁగా నెమ్మదిని గుమార!

తే.గీ. మఱియు నిందువిశేషాభిమానమహిమ । నాదినారాయణుఁడు విష్ణుఁడాయె జూఁమ్ము
భూతతన్మాత్రయోగంబు పొరసికాదె । యీ యజాండంబులును జనియించి మించె. ౧౬౦

వ. పుత్త్రికా వెండియుం జెప్పెద వినుము. ఆకాశంబునకు శబ్దంబొక్కటియు, శబ్దస్పర్శంబులు వాయువునకును, శబ్దస్పర్శరూపంబు లగ్నికిని, శబ్దస్పర్శరూపరసంబులు జలంబునకును, శబ్దస్పర్శరూపరసగంధంబులు పృథివికిని గుణంబులై సకల బ్రహ్మాండోత్పత్తి యగునని యెఱుంగునది. తత్తదంశభేదంబులం జేసి యెనుబది నాలుగుకోట్ల జీవరాసు లుద్భవిల్లె. నిదియె సర్గక్రమంబని చెప్పి మఱియు. ౧౬౧

—: సత్త్వాది గుణముల స్వరూపము. :—

ఉ. సత్త్వ రజ స్తమోగుణ విచారము సేసెద నాలకింపు మీ
సత్త్వము ప్రీతిరూపమగు సౌఖ్యమునం జనియించుఁ బ్రీతి దా
సత్త్వమనంగ నార్జవము సత్యము శౌచము శ్రద్ధయుఁ క్షమా
వత్త్వము శాంతియుఁ ధృతి కృపామతి లజ్జయుఁ దుష్టి లోనుగాఁ. ౧౬౨

క. సచ్ఛ్రద్ధను బుట్టించు న। సచ్ఛ్రద్ధను బోవనడఁచు సర్వము దీనిఁ
ద్వచ్ఛ్రవణ గోచర సము। ద్యచ్ఛ్రేయోగరిమగలుగ నాలింపు సుతా. ౧౬౩

వ. సత్త్వము శ్వేతవర్ణంబు వెండియు. ౧౬౪

తే.గీ. శ్రద్ధ మూఁడుగుణంబుల సంభవించు। నందు సాత్త్వికిఁ జెప్పితి నాలకింపు
మవల రాజసి రక్తవర్ణాంచితయగు దెలియ నప్రీతిజనకంబు దీని కెపుడు. ౧౬౫

క. పగయును జేటును మచ్చర। మగచాటులు నిద్ర తమము నభిమానంబుఁ
దెగనీలుగు నుత్కంఠయు। నగుబాటును రాజసంబునం గలవుసుమీ. ౧౬౬

క. నల్లనిది తమము మోహము। పెల్లంగద తడవు జడత పేదరికము క
న్నీళ్ళు భయము కృపణత మే। లొల్లమి నాస్తిక్య మగడు నుడుగునుసుమ్మీ. ౧౬౭

క. నిలువవలె సత్త్వగుణమునఁ। బలువిధముల నడఁచిపట్టవలయు రజంబుఁ
దొలగింపవలయుఁ దమముఁ। సలలితముగ శుభము వాంఛ సలిపినవారల్. ౧౬౮

క. ఒకదానికొకటి గిట్టదు। ప్రకటిత మిది గుణములందుఁ బరికింపఁగఁ దా
రొకదాని నొకటి విడువవు। తికమకలై కూడియుండుఁ దెలియుము పుత్రా. ౧౬౯

వ. అది గావున నారదా చెప్పెద వినుము. జ్ఞాతంబైన క్రియయందు శ్రద్ధఫలానుభూతి దనుకం బ్రవర్తించెనేని యది పరిజ్ఞాతంబగు. శ్రవణదర్శనాదులవలన మాత్రము పరిజ్ఞాతంబనఁబడదు. అది యెట్లంటివేని యొకఁ డొక పవిత్రంబగు క్షేత్రంబునుం గూర్చి విని యది సేవింపవలయునని రాజసంబగు శ్రద్ధపుట్టి తాను విన్న క్రమంబునం దత్తీర్థంబున కేగి స్నాతుండై షోడశ మహాదానంబులంజేసి యచ్చట రజోగుణంబు విడువక కొంతకాలం బుండి రాగద్వేషాదులవలన విడువంబడక కామక్రోధంబులు వెంబడింప మరలం గృహంబుం బ్రవేశించి యున్నంత మాత్రంబున శ్రుతం బనుభూతంబుగాక ఫలంబనుభవింపనేరఁడు. కృషి కన్నంబు ఫలంబైనయట్లు తీర్థసేవనంబునకు నిష్కల్మషత్వంబు ఫలంబై యుండు. నట్టి ఫలంబతనికి సంభవింప నేర దెందుచేతననినఁ గామక్రోధలోభాదులును దృష్టాదులును రాగద్వేషాదులును దేహి నెంతదనుకఁ బట్టికొని యుండు నంతదనుక నతనికి నిష్కల్మషత్వంబు సంభవింపనేరదుగదా? అది యెట్లన

దృష్టాంతరూపంబున వివరించెద; నొకానొక కర్షకుండు గట్టి రేగడినేలను దున్నిదున్ని
విత్తనంబులఁ జల్లి పలుపాటులంబడి యహోరాత్రంబు దేహక్లేశంబున కోర్చి యెప్పుడు
పండునాయని యడియాసలం జిక్కియు గొంతకాలంబున కమ్మెఖుఁకువలమాని సోమరి
తనంబునం బైరు కాపు దిగనాడెనేని గిరికీటపక్షిజాతంబులచే నానావిధ బాధాపరంపరలకు
లోనై చెడిపోయి తుదకు ఫలంబందమి కతం డెట్లు దుఃఖించునో యట్లన యగు. సత్త్వ
గుణంబు శాస్త్రదర్శనాదులచేఁ బ్రవర్ధమానంబై వైరాగ్యంబు బుట్టించునది. రజస్త
మంబులవలనం బరాభూతంబగు రజంబు లోభయోగంబునం బ్రవృద్ధంబగు నిదియు
నన్యగుణ సాంగత్యంబునం బరాభూతంబగు. తమంబు మోహంబునం బెరిగియు లాతి
గొనంబుంగూడెనేని బరాభూతంబగు. సత్త్వంబు ప్రవృద్ధంబైనతఱి బుద్ధి ధర్మంబునం
బ్రవేశించు. రజస్సత్త్వతమస్సముద్భూతంబులగు బాహ్యార్థంబులం గైకొనకుండు.
యదృచ్ఛాలాభంబును యజ్ఞాది క్రియలునుం గోరుచుండు. ముందు రజంబునుం బిదపఁ
దమంబును గ్రమంబుగా విడనాడునప్పుడు నిర్మలంబగు సత్త్వంబు నిలుచు. రజంబు
ప్రవృద్ధంబైనపుడు సనాతనధర్మంబుల విడనాడి యధర్మంబులందు శ్రద్ధప్రవేశించు.
దమంబు ప్రవృద్ధంబైనతఱి వేదశాస్త్రంబులందు విశ్వాసంబుడిగి దుష్కర్మంబులవలన
ధనంబార్జింపంగోరు. మఱియు శాంతిలేక ద్రోహచింతన పొడుగై నానాటికి రజ
స్సత్త్వంబులు తగ్గిపోవును; గామచోరభావంబుల కిఱవై యుండు; నెప్పుడును రజస్సత్త్వ
తమో గుణంబులు ప్రత్యేకంబు ప్రవర్తింపవు. గుణంబు లన్యోన్యాశ్రితంబులు, నన్యోన్య
జనకంబులై యుండు. నొకానొకప్పుడు సత్త్వంబు రజస్తమంబుల బుట్టించు, మఱి
యొకప్పుడు రజంబు తమస్సత్త్వంబులం గలుగజేయు, నొకప్పుడు తమంబు రజస్స
త్త్వంబులకు జనకంబగు; నిట్లు మృత్పిండంబు ఘటంబునకుంబోలెం గారణంబులగు బుద్ధి
స్థంబులై గుణంబులు పరస్పర కామోద్బోధకంబులగు. లోకంబున స్త్రీ పురుషులవలె
గుణంబులు పరస్పర మిధునభావంబులం బొందుచుండు. సత్త్వంబునకు రజంబుగాని
తమంబుగాని మిధునధర్మంబు సమకూర్చు, నిట్లు రజస్తమంబులకును మిధునధర్మంబులు
ప్రాప్తించుచుండునని చెప్పిన విని నారదుండు బ్రహ్మంజూచి యిట్లనియె. ౧౩౦

ఆ.వె. వనజగర్భ నీదు వచనామృతంబును । గ్రోలి తృప్తిఁజెందు బేలఁగలఁడె
గుణములెట్లు తెలిసికొనవచ్చునో చెప్పి । నన్ను ధన్యుఁజేయు మన్ననతఁడు. ౧౩౧

ఉ. ఏనును నేర దీని గణియించి వచింప యథామతిన్ సతిన్
ధ్యానముచేసి చెప్పెదను నారద। కేవల సత్త్వమెచ్చటన్
గానఁగరాదు మిశ్రములు గమ్యము లెట్లన సాధ్విభార్య యెం
దేనియు భర్తకూర్మి గదియించు సపత్నికిఁ బ్రీతిఁజేయునే. ౧౩౨

ఆ.వె. నైజగుణము సత్త్వ నైర్మల్యమునుఁబొంద । రజము దమము మిఱికి రాచి కలఁచు
రజము దమము కలుషరాహిత్యమునుబొందు । సత్త్వమచటఁజేరి చక్కఁజేయు. ౧౬౩

సీ. ఒకరూపవతియైన యువతి సొమ్ములు దాల్చి । మధురభాషల మంచి సుధలుగుఱియ
వినయంబుగల్గి సిగ్గునుగల్గి ధర్మంబు । లెఱిఁగి పాతివ్రత్య మెఱిఁగి మగని
సేవించి రంజిల్లఁ జేయుచునుండఁగా । సవతు లేడ్చుచునుండ్రు సంతతంబు
రాజసైన్యంబు చోరజనంబులకు దుఃఖ । కరము సాధువునకుఁ గడుసుఖదము

తే.గీ. పెద్ద జడివాన కర్షక ప్రీతికరము । కప్పుబోయిన యిండ్లలోఁ గాపురములు
సేయువారికి దుఃఖంబు జేయుచుండు । కోరి పుత్త్రిక విను మింక గుణగతములు. ౧౬౪

సీ. సతత లఘుప్రకాశత నిర్మలత విశదత్వంబు నివి సత్త్వ తత్త్వములగుఁ
దేలికగాఁ జూచుఁ దేలికగాలేచుఁ దేలికగాఁ బోవుఁ దెలియుమిద్ది
మనసు నిర్మలమయి కనుపట్టునత్తఱి సత్వముత్కటమంచు సాధుఁడెఱుఁగు
గరిమదించిన జృంభికాస్తంభ చలనముల్ తొట్రుపాటును మఱి తొందరయును

తే.గీ. గలుగుఁ దమమెక్కుఁడగునేనిఁ గలినినెమకు । జిత్తముచలింప దుష్టుల పొత్తురోయు
తల బరువుదోఁచును వివాద కెలమినుఱుకు । నింద్రియంబులు చెడు మన సిఱియుఁబుత్త్రి

వ. అనిన నారదుండు. ౧౬౫

తే.గీ. పంకరుహగర్భ విను పరస్పరవిరుద్ధ । ధర్మములుగల గుణములు తాముకూడి
కార్యములుసేయునంటివి కరముచిత్ర । మియ్యది సవిస్తరంబుగా నెఱుంగఁబలుకు. ౧౬౬

తే.గీ. వినుము నారద తెలిపెద వీని తెఱఁగు । వత్తి చమురులొగి విరుద్ధ వృత్తులయ్యు
వాని కలయిక దీపంబు వస్తువులను । గానఁగాజేయు దృష్టాంత గతి నెఱుగుము. ౧౬౭

వ. అని యిట్లు బ్రహ్మవలనఁ దా నెఱింగిన విధంబు సెప్పి మఱియు నారదుండు సాత్య
వతేయుఁ గాంచి. ౧౬౮

తే.గీ. వ్యాస యీరీతి మును నాకు వనజభవుఁడు । చెప్పె నీకది యిప్పుడు చెప్పినాఁడ
శక్తికొలదిని నే విన్న సరణిఁ దెలసి । శంక లేదింక నీకేల సంశయంబు. ౧౭౦

క. అని యిట్లు నారదుఁడు నా । కును జెప్పెను ధర్మపుత్త్రి గుణలక్షణముల్
ఘనమతి సృష్టిక్రమమును । గనుగొనుమా పరమశక్తి కారణ మనుచున్. ౧౭౧

క. సత్తగునప్పురుషుండీ । షత్తైనను జేయఁడెపుడు సత్యుఁడు నిత్యుం
డిత్తెఱఁగుఁ దెలియవలయు న । సత్తగు మాయయె రచించు సకలజగంబున్. ౧౭౨

సీ. బ్రహ్మయు విష్ణుండు భవుఁడు సూర్యుండును । నెలయు నింద్రుం డశ్వినులు వసువులు
త్వష్ట కుబేరుండు వాఃపతి వహ్నియు । గాలియుఁ బూషుండు క్రౌంచభేది
గణపతియును దక్కఁగల దేవతలు శక్తియుక్తులై చేయంగ శక్తులైరి
శక్తిలేకున్న నశక్తులై యుందురు । శక్తి కారణమగు జగమునకును
తే.గీ. శక్తినర్చించు మీ శక్తి సవనమునకుఁ । బూన్కి వహియింపుమీ భక్తి పూర్తినెలయ
నాదిశక్తిని బూజింప నందరాని । యర్థమెద్దియు లేదు ధరాధినాథ. ౧౮౩

సీ. జననాథ. విను మహాశక్తి మహాకాళి యది మహాలక్ష్మి మహాగుణాఢ్య
యాదిసరస్వతి యాదిదేవి యచింత్య యవ్యక్త యీశ్వరి యఖిలవంద్య
యఖిలార్థదాత్రి సర్వాధారరూపిణి వేదవేద్య మహావినోదిని సతి
యఖిలవర్గద పురుషార్థ ప్రదాయిని బ్రహ్మ విష్ణు మహేశ్వరప్రపూజ్య
తే.గీ. యైన భగవతి తన నామ మన్యవృత్తిఁ । దగు ప్రసంగంబునందైనఁ దలచెనేని
సర్వవాంఛితములనిచ్చి శాశ్వతమగు । తనదు లోకంబు దయచేసి దయను బ్రోచు.

క. పులి వెంబడించి వగఁ గం । పిలి దేవినిఁ దలఁచెనేని బిందురహితముగ
బలికినను వాంఛితార్థము । కలుగంగాఁ జేయు దేవి కరుణాన్వితయై. ౧౮౪

వ. ఇందునకుం బ్రత్యక్షోదాహరణం బొక్కటి కలదు. నేనును సర్వమునులును విని యుంటిమి. మున్ను నిరక్షరుండును మహామూర్ఖుండునునగు సత్యవ్రతుండను బ్రాహ్మణుండు కలఁడు. అతండు శరపీడితంబగు కోలముం గని ఐకారంబును బునఃపునరుచ్చరితంబుగాఁ బలుకంజొచ్చె నది బిందురహితంబైనను నిజమంత్రోచ్చారణంబున కలరి పరమేశ్వరి దయార్ద్రహృదయయై యతనిక మహావిచక్షణుం గావించెనని వ్యాసుండు సెప్పిన విని జనమేజయుండు. ౧౮౬

క. మునివర సత్యవ్రతుఁడనఁ । జనువాఁ డెవ్వండు వాని జన్మమెచటఁ దా
వినియె నెటుల నేశబ్దము । విని యే మొనరించెఁ దెలుపవే దయతోడన్. ౧౮౭

క. దేవి యెటులు ప్రత్యక్షం । బై వెలసెన్ సిద్ధి యెట్టులాయె నతనికిన్
వేవేగ సవిస్తరముగ । నావీనులు దనియఁ దెలుపు నయగుణధుర్యా ! ౧౮౮

—: సత్యవ్రతోపాఖ్యానము. :—

క. అనఁడు విని వ్యాసముని యను । నవఘా నే దేశములకు నటనముసేయన్
జనునప్పుడు నైమిశమను । వనమును బావనముఁ గంటి వసుమతి నొకఁటన్. ౧౮౯

క. కని యందలి మునులకు నే । వినతుఁడనై మ్రొక్కి చూడ విధిపుత్రు లటన్
గొనగొని జీవన్ముక్తత । నసువుగ నం దుండిరయ్య యవనీనాథా. ౧౯౦

వ. వారిం జూచి ౧౯౧

చ. అలరి కథాప్రసంగముల నందఱు మందు వసింపఁగా వ్రతో
ద్బలుఁడయి యొప్పునట్టి జమదగ్ని మునీంద్రుని జూచి యిట్లనున్
గలిగెను సందియం బొకటి నామది దానిని దీర్ప నీసభన్
గల మునులే సమర్థులని నాకును దోఁచెను శంకఁ దీర్పుఁడీ. ౧౯౨

వ. అది యెద్ది యనిన. ౧౯౩

ఉ. వెన్నుడు బ్రహ్మ శూలి హరి విష్ణువుఁ డగ్ని భగుండు నశ్వినుల్
వెన్నెలరేఁడు సూర్యుఁడు కుబేరుఁడు శక్తిధరుండు త్వష్టయుం
చు న్నిఖిలామరు ల్గలరు చూడఁగ వీరలలోన నెవ్వఁ డ
త్యున్నతుఁ డీప్సితార్థముల నోలి నొసంగు నెరుంగ జెప్పుఁడీ. ౧౯౪

చ. అనవుఁడు లోమశుండను మహాముని యా జమదగ్నిజూచి యో
మునికులభూష సేవ్యతము ముఖ్యశుభంబులఁ గోరువారి క
య్యనఘ సమస్తలోకనివహాదిమకారణ మూలశక్తియుం
చును మది నెంచుమా నిజమును మ్మితిహాస మొకొండు సెప్పెదన్. ౧౯౫

వ. అం దక్షరోచ్చారణఫలంబు తెల్లంబగు. ౧౯౬

చ. వసుమతి దేవదత్తుఁడనువాఁ డొకపారుఁడు గౌసలుండు దా
వెస ననపత్యుడై ద్విజుల వేదులఁ గైకొని పుత్రకాముఁడై
మసలక యిష్టిఁజేసె గరిమన్ దమసానదియొడ్డునన్ విధా
వసులను నిల్పి యెంతయును వాసిగ వేది నమర్చి పొంగుచున్. ౧౯౭

మ. తనరన్ బ్రహ్మనుగా సుహోత్రుని సదధ్వర్యున్ దగన్ యాజ్ఞవ
ల్క్యునిగా హోత బృహస్పతిన్ మఱియుఁ బైలుం బేర్మిఁ బ్రస్తోత నా
ప్తనయ ప్రౌఢిమ గోబిలాఖ్యముని నుద్గాతన్ దగం జేసి వ
చ్చిన యన్యర్షులు సభ్యులై యెసఁగఁగాఁ జేసెన్ మహాయజ్ఞమున్. ౧౯౮

ఉ. సామగుడైనగాత స్వర సప్తకయుక్త రథన్తరంబు నా
త్మామితశక్తిఁ బాడునపు డచ్చట నచ్చట శ్వాసమిచ్చుచోఁ
బ్రాముకవోయి కొంత స్వరభంగము గల్గిన దేవదత్తు డా
భూమిసురేంద్రుపై నలిఁగి మూర్ఖ సుతార్థసవం బెఱుంగవే. ౧౯౯

ఉ. అంతట గోభిలుండు కడు నల్గి యనక్షరుఁడైన మూర్ఖుఁ డౌ
క్కింతయు బుద్ధిలేని సుతుఁడే జనియించును నీకుఁ బొమ్మనన్
గంతులుమాని గోభిలుని కాళ్ళకు మ్రొక్కుచు ముట్టువెట్టుచున్
జింతిలఁజొచ్చెఁ గట్టెదుటఁ జేతులుమోడిచి దేవదత్తుడున్. ౨౦౦

ఉ. ఎందుకుఁ గోప మోమునికులేంద్ర దయం గనవైతి శాపమున్
బొందఁగఁజేసి నాబ్రతుకుఁ బూర్వమునట్ల యొనర్చితీవిఁకన్
మందుఁడు పుత్త్రుఁడై జననమందిన నేమిఫలంబు బ్రాహ్మణుం
డందురె యెందునేనియు నిరక్షరకుక్షిని వేదహీనునిన్. ౨౦౧

ఉ. ముక్కడియైన పాఱుఁడు సముండగు శూద్రునకున్ విగర్హితుం
డెక్కడనేనిఁ బూజ్యుఁడగునే తగునే మునినాథ యిట్లు నా
ప్రక్క దయావిసర్జనము పల్కుల వేఁడెద నాదరింపుమీ
యక్కట యేమిసేయుదు నహా మతిమాలినబిడ్డ యేటికిన్. ౨౦౨

సీ. హవ్యకవ్యంబులం దాసనంబీరాదు వేదంబుసదువని విప్రునకును
ధాత్రి హిరణ్యాది దానంబు లీరాదు వేదంబుసదువని విప్రునకును
దగియున్న సభలోనఁ దాంబూలమీరాదు వేదంబు సదువని విప్రునకును
బదిమంది పంక్తిలోఁ బైపీట యీరాదు వేదంబు సదువని విప్రునకును

తే.గీ. కుశచటంబుననె నిరంకుశముగాఁగ । శ్రాద్ధములుసేయవచ్చు నిస్సంశయముగ
వేదపాఠంబెరుంగని విప్రువెదకి పిలిచి । శ్రాద్ధంబు పెట్టిన బితలు దినరు. ౨౦౩

క. ఏదేశంబునఁ జక్కగ । వేదంబులు సదువనట్టి విప్రులుగలరో
యా దేశంబున జ్ఞానులు । పాదుకొనుట చనదు విడిచి పాఱఁగ వలయున్. ౨౦౪

క. చదువని బ్రాహ్మణు భూపతి । నదలింపఁగవలయు దౌలఁ బంపవలయుఁజుం
డిది తథ్యంబనుచుం జె । ప్పెదరు మహామతులు దీని భూసుర వింటే. ౨౦౫

తే.గీ. వేపచెట్టెన్ని ఫలముల విస్తరిల్లి । యేమిఫల మట్ల చదువని భూమిసురుఁడు
కడఁగి మూర్ఖుండయినపుత్త్రుఁ గనుటకంటె । మరణమేమేలు సూడంగ మానవునకు.

క. కృపఁజేయుము నామీఁదను । శపనమ్ము విముక్తిఁజేసి సన్మునిచంద్రా
యపరిమిత దయాపరుఁడవు । త్రప నాకుం బాపు పరమ తత్త్వజ్ఞవరా. ౨౦౭

క. అని పాదములకు నతుఁడై । వనటంబడు దేవదత్తు వగపుంగని య
మ్ముని కరుణారసయుతుఁడై । యనియె న్నీసుతుఁడు పిదప నగుఁ గవి యనుచున్.

ఉ. అంతియ చాలునంచుఁ దన యాత్మను బొంగుచు యజ్ఞమంతయున్
సాంతముచేసి భూసురుల నంపి సుఖంబుగ నింటనుండఁగా
వింతగ విప్రరాడ్గృహిణి వేవిళులం గడునొక్కి నొక్కి తా
నంతకు నంతకుం దెలియనయ్యెను గర్భిణిగా జనాళికిన్. ౨౦౯

ఉ. చిట్టుము లోకిరింతలును జీదరయు న్వరకాన ప్రక్క లోఁ
దట్టులఁ గల్కు నుల్కు వెలిదాళువు మైకము పాలుమాలికల్
పట్టులు నిద్రనోకు పనిపాటుల కోర్వమి యెన్నియెన్నియో
చుట్టుకొనెం బయింబయిని సూడిదబుట్టలు విప్రభార్యకున్. ౨౧౦

సీ. అబలవే నీవు నే దది నిక్కమేకాని ప్రమదవుకావని పలికె నొకతె
మందయానవె తథ్యమందుఁగాని మృగేంద్రమధ్యవుకావని పలికె నొకతె
చంద్రాస్యవే నీవు సత్యమెకాని బింబఫలోష్ఠికావని పలికె నొకతె
గురుకుచవే నీవు తిరమెకాని తరంగవళివి కావనుచును బలికె నొకతె

తే.గీ. తోడిచెలియలు తనయొద్దఁ గూడినపుడు । పలువితాలను నవుటాలు పలుకుచుండ
దేవదత్తుని గృహిణి దా తెల్లబోవు । సిగ్గుపడి తన గర్భంపు చిహ్నములకు. ౨౧౧

క. ఒకటై రెండై మూఁడై ప్రకటితముగ నాలుగగుచుఁ బైనైదై యె
న్నిక నారై మఱి యేడై । యింక నెన్మిది తొమ్మిదాయె నింతికిని నెలల్. ౨౧౨

క. ఆరోహిణికిని సమయగు । నారోహిణి కపుడు భర్త యాత్మ ముదము పెం
పారగఁ బుంసవనంబున్ । వారక సీమంతమును బ్రవర్తింపించెన్. ౨౧౩

క. దినమును లగ్నము శుభగతి । ననువొందగఁ బుత్రుఁ డుదయమయ్యె నతనికిన్
మనమలర జాతకర్మం । బును బుత్త్రాలోకనంబు బొరిఁ బొనరించెన్. ౨౧౪

తే.గీ. పేరిమి నుతథ్యుఁడను పేరు బెట్టిపిలిచె । నెనిమిదవవర్షమున మంచిదినము చూచి
యతని నుపనీతుఁ గావించి యధ్యయనము।నొనరఁ జెప్పంగ రాదాయె నొక్కముక్క. ౨౧౫

క. ఓయనినం బోయనె న । టాయవనీసురుని కొమరుఁ డతిమూఢుండై
వేయావిధములగు గురు । నాయాసమెకాని విద్య యంటకపోయెన్. ౨౧౬

తే.గీ. పదియు రెండేండ్లు గడచిన బాలుఁడయ్యు । సంధ్యలోఁ గేశవా యనజాలఁడాయె
గొనలుసాగె నతనివార్త జనపదములఁ బట్టణంబుల వ్యర్థుండు బండ యనుచు. ౨౧౭

క. కొందరు మూర్ఖుం డనుచున్ । గొందరు జడుఁడనుచు నింద గొలుపుచునుండన్
నిందకుఁ దాళక ధరణీ । బృందారక సుతుఁడు సనియె విపినంబునకున్. ౨౧౮

క. మానక సత్యము పలుకుచుఁ । గానం గంగదరి గుడిసెఁ గట్టుకొని సదా
మౌనాది నియమములతోఁ । దా నివసించెను ద్విజుండు తాపసుఁడువలెన్. ౨౦౯

సీ. అధ్యయనము లేదు ధ్యానంబులేదు జపములేదు దేవార్చనమునులేదు
ఆసనాదులును బ్రాణాయామమునులేదు సరళిఁ బ్రత్యాహార సరణిలేదు
మంత్రకీలకముల మాటయన్నదిలేదు గాయత్రియనెడి సంగతియెలేదు
స్నానంబులేదు శౌచములేదు సంధ్యయులేదు హోమములేదు లేదతిథియు

తే.గీ. గంగలో నాడి శూద్రునికరణి దంత । ధావనము సేసి యెద్దేని తరువునుండి
ఫలములను గోసి భక్షించి బ్రతుకు ద్విజుఁడు । మాటసత్యం బదొక్కటి మానడయ్యె.

తే.గీ. ఇంతమూర్ఖుఁడనైన నాకేలబ్రతుకు । మృతియు రాకుండె నయ్యయో గతి దలంచి
బొగులు చెల్లోర్తు నిట్లు నా పూర్వజన్మ । కర్మ ఫలమాయె దైవ మిక్కరణిఁజేసె. ౨౧౧

తే గీ. ఉత్తమకులంబునందు నే నుదయమయ్యు । పరమమూర్ఖుండనైతి సుందరియు సుగుణ
యైన కామిని వంధ్యయైనట్లు నాదు । జన్మమెల్ల వృథాయయ్యె జగమునందు. ౨౧౨

తే.గీ. చేరి ము న్నేఁకికిని విద్య చెప్పనైతిఁ । బోలుఁ దత్ఫలమిప్పుడు పూని కట్టి
కుడుపుచున్నది ద్విజు డనుకొనఁగ నొక్క । లక్షణంబైనఁ గాన నేలా సహింతు. ౨౧౩

తే.గీ. సాటిమునిబాలకులు శ్రుతుల్ చదివి లోక । మాన్యులైయుండ జూచుచు మౌర్ఖ్యమెనసి
సకలనింద్యుండనై యుంటి నకట నేను । జేయ నెద్దియుఁ బొడకట్టదాయె మదికి. ౨౧౪

క. పురుషుని యత్నము వ్యర్థము । ధర సార్థకమగుచు వెలయు దైవమెకానన్
బరికింప ఫలముగలదే । కొరకొఱయేకాదె నాదు గొంతెమకోర్కెన్. ౨౧౫

క. హరివిధిరుద్రేంద్రాదులు । కరము వశగులయిరకాదె కాలంబునకున్
దురతిక్రమ మక్కాలము । నరులు గిరులు నెంతవారు నటనయకాదే. ౨౧౬

ఆ.వె. ఇట్లు రేయుఁబగలు నెగవోత దిగవోత । లుగఁ దలంపులిడుక పొగిలి పొగిలి
విజనవనమునందు విప్రబాలుఁడు విరా । గతను విడిసె విపుల వినయుఁడగుచు. ౨౧౭

క. సత్యము పలికెడివాఁడని । యత్యంతము కీర్తి లోకమం దింతేనిన్
వ్యత్యయము లేకయుండుట । సత్యవ్రతుఁ డనెడి పేరు జను లిడిరి వెసన్. ౨౧౮

ఉ. అంతట నొక్కనాఁడు మృగయాపరుఁడైన నిషాదుఁ డొక్కఁ డా
చెంతకు విల్లునమ్ములను జేతులఁదాల్చి యరణ్యభూములం
దంతట సంచరించుచు నిజాశుగనై పుణి నొక్క కోలమున్
గంతుగొనంగ నేయ వడిగా నది బెగ్గిలి పాఱఁబొచ్చినన్. ౨౧౯

క. భయవిహ్వలమగు కిటి దా । రయమున మునిదాపునకును రా గని యెంతే
దయదై వారెడి శబ్దము । నయముగ వాగ్బీజమును ఘనంబుగఁ బలికెన్. ౨౩౦

క. ఇది యిట్టిదనుచు నెఱుఁగఁడు । మదిలోఁ గరుణార్ద్రుఁడగుచు మఱిమఱిఁ బలికెన్
విదితమది దైవయోగము । రొద దుఃఖావేశముననె రూఢిగ నొదవెన్. ౨౩౧

ఆ.వె. పంది వచ్చి యిట్లు బ్రాహ్మణుఁడున్నట్టి । యెదను గుబురుగొన్న యీరమందు
నిఱవుజేసి మఱఁగె నెఱుకవాఁడును దాని । వెదకికొనుచు వచ్చె వేగ నటకు. ౨౩౨

ఆ.వె. కుశలచాపమీఁదఁ గూర్చుండియున్నట్టి । మునినిఁ జూచి యెఱుక మ్రొక్కి పలికె
పంది యేడఁబోయె బాపనయ్యా। నీవు । బద్దులాడవను పసిద్ధి గద్దు. ౨౩౩

ఉత్సాహ. మంచి బాపనయ్యవయ్య మాకుఁ దిండిఁ బెట్టుమీ
పంచ నేడ దాగియుండెఁ బందిపిల్ల జెప్పు వో
షించలేను గాపురంబు చివ్వలెక్కె మెకము త
ప్పించుకొన్నదయ్య నన్ను బిచ్చగానిఁ బ్రోవుమీ. ౨౩౪

విచిత్రమానిని. గంపెడు పిల్లలు కావలె మూఁడుమెకా లొకనాటికిఁ గాపురమా
కొంపకుఁబోయిన గొళ్ళనిపిల్లలు కూటికినేడ్తురు కోపముతో
సంపును బెండ్లము నడఁచఁగ లేనిఁక నొకలిఁ దీర్పుము బాపఁడ మ
న్నింపుము మా కుల మిట్టిది యీశ్వరుఁ డిట్టుగ మా బ్రతు కేర్పరచెన్. ౨౩౫

ఆ.వె. అనిన యెఱుక దైన్య మాలించి విప్రుండు । మనము కడువిచారమగ్నమైన
దలఁచె నిట్టు లయయొ తథ్యంబుసెప్పెద । ననిన హింససేయు నది ఘటించు. ౨౩౬

ఆ.వె. పందిఁ జంపినట్టి పాపంబయేనియు । బద్దులాడినట్టి పాపమేని
వ్రాసె రెంట నొకటి యేసదుపాయంబుఁ । జేసి యిపుడు దొసఁగు నెందకుందు. ౨౩౭

క. కిరికిని హితంబుసేసిన । నెఱుకకు నహితుండనగుదు నెఱుకకు హితమున్
బొరి నొనరించితినేనియుఁ । గిరి కహితుఁడ నగుదు నేది కృత్యమొ యెఱుఁగన్. ౨౩౮

వ. ఇట్లు వితర్కింపుచు బాడబకుమారుం డేమియుఁ బలుకనేరక యున్నతఱి నంతకుమున్న శరావిద్ధంబై చను కిటింగాంచి దయార్ద్రహృదయుండై పలికిన వాగ్బీజమహిమంబునం జేసి దేవి ప్రసన్నయై జ్ఞానంబొసంగినఁ దత్క్షణంబ తొల్లింటి వాల్మీకింబోలెం గవియై యా శబరుం జూచి యిట్లనియె. ౨౩౯

సంస్కృ. శ్లో॥ యా పశ్యతి న సా బ్రూతే యా బ్రూతే సా నపశ్యతి
అహో వ్యాధ స్వకార్యార్థిన్ కిం పృచ్ఛసి పునః పునః.

పై శ్లోకమునకు అర్థము.

క. కనినది యన దనినది తాఁ । గన: దయయో వాంఛిత స్వకార్యధురీణా
నను నీరీతిని మఱిమఱి । యును నీ వడుగంగనేల నోరీ శబరా! ౨౪౦

క. అనిన విని శబరుఁ డూఱక । చనియెఁ ముని యింటికఱిగి సత్యవ్రతుఁడం
చును దను లోకము పిలువఁగ । ఘనుఁడగు వాల్మీకిఁబోలెఁ గవియై తనరెఁ. ౨౪౧

సీ. వాగ్బీజమంత్రంబు వారక జపియించి విద్వాంసుఁడై లోకవినుతిగాంచె
సత్యవ్రతద్విజు చరితంబు ప్రతిపర్వములఁ బాడికొని విప్రముఖ్యులధిక
సంతోషముననుండ్రు సకలదేశంబుల నంతట నా ద్విజుం దరిగెఁ దొల్లి
వదలివచ్చిన నిజావాసంబునకుఁ దల్లిదండ్రులు మిగుల సంతసముపడిరి.

తే.గీ. కాన రాజేంద్ర భగవతికరుణగలుగ । నేదిదుర్లభమగుఁ జేయు మీశ్వరీ మ
హామఖంబింకఁ గామదంబగుట యదుదె । నిక్కమిది నిక్కమిది నమ్ము నీవు నృపతి ౨౪౨

వ. అని చెప్పి వెండియు నోజనమేజయా, భగవతీ స్మరణంబును, భగవతీ ధ్యానంబును భగవతీ పూజనంబును, భగవతీ కీర్తనంబును, భగవతీనామోచ్చారణంబును, సర్వవాంఛిత ప్రదాయకంబులని తెలియుము. మఱియు రోగులు, క్షుధితులు, నిర్ధనులు, శఠులు, మూర్ఖులు, క్షుద్రులు, వికలాంగులు, మొదలగు దుర్లక్షణ లక్షితులు దేవీకటాక్షంబు బడయనివారలంగా నెఱుంగుము. తద్వ్యతిరిక్త లక్షణంబులుగలవారలఁ దేవీకటాక్ష సంపన్నులంగా నెఱుంగుము. సత్యవ్రత చరిత్రంబు బ్రాహ్మణసన్నిధానంబున లోమశు వలన మున్ను నే విన్నవిధంబునఁ దెలిపితి నది కావున దేవీయజ్ఞంబు చేయుమని చెప్పిన విని జనమేజయుం డిట్లనియె. ౨౪౩

—: దేవీయజ్ఞ విధి :—

క. దేవీ యజ్ఞవిధానం । బో విమలగుణాఢ్య తెలుపు మోపికమీరఁ
గావింతు శక్తికొలఁదిని । నీవచనామృతము చెవుల నిండంజనదే. ౨౪౪

క. పూజావిధానమెయ్యది । యోజ సమ్మంత్రంబులెవ్వి హోమద్రవ్యం
బేజాడ విప్రులెందఱు । నా జనపతి కవియె జటిలనాథుఁడు ప్రీతిఁ. ౨౪౫

క. దేవీయజ్ఞవిధానము । నే వినిపించెదను వినుము నృపతీ మదిలో
భావింపుము త్రివిధంబని । యై వర్తిలుననుచు వాంఛితార్థదమనుచుఁ. ౨౪౬

తే.గీ. సాత్త్వికంబనియును రాజసంబనియును । దామసంబనియును నందుఁ దనరు సాత్త్వి
కము మునీంద్రులచేఁ జేయఁగాఁబడు మఱి। రాజసము తామసము నృప రాక్షసులకు. ౨౪౭

తే.గీ. సరవితో నొప్పు దీనిని జ్ఞానులైన । వా రొనర్తురు బాహ్యార్థవాంఛలుడిగి
వస్తుసంభారములు మాని ప్రవిమలాంత । రంగమున నిశ్చలానందసంగులగుచు. ౨౪౮

వ. మఱియు దేశమును గాలమును ద్రవ్యమును మంత్రంబులను బ్రాహ్మణులను సాత్త్వికి యగు శ్రద్ధయు నెచ్చటనుండు నది సాత్త్వికంబైన దేవీయజ్ఞంబగు. నిర్దేశకాల ద్రవ్యాదులకు శుద్ధిసంపూర్ణంబై యుండెనేని సంపూర్ణఫలదంబగు. రాజేంద్రా యిటు విను మొక యుదాహరణంబు సెప్పెద. నన్యాయార్జితంబులగు ద్రవ్యంబులవలన యజ్ఞంబుసేసిన నైహికాముష్మికంబులు సమకూడవు. చూచితివకా పాండవులు రాజసూయంబను యజ్ఞం బపరిమితదక్షిణలతోఁ జేసిరికదా । సాక్షాన్నారాయణుండైన శ్రీకృష్ణుండు వారి కెల్ల విధంబుల బంధుండై హితుండై సహాయుండై యుండియు భారద్వాజాది విప్రులు పరిపూర్ణ విద్యావంతులై యుండియు వారికి సంప్రాప్తంబులైన దుఃఖంబు లిన్నియని వచింపఁదరము కాదు. ఘోరంబైన యరణ్యవాసంబును, బాంచాలీ పీడనంబును, విరటునియొద్ద దాసత్వంబును, గీచకునివలనఁ బాంచాలికిం గ్లేశంబును సంభవించె. యజ్ఞకాలంబునందు బ్రాహ్మణుల వలని యాశీర్వాదంబులను శ్రీకృష్ణుని తోడ్పాటును నీషన్మాత్రంబైనం గార్యకారులు కాకపోయె. నిచట నేమి విచారింపదగియున్నయది ? ధర్మవైగుణ్యమే యందునకుం గారణంబని చెప్పకతప్పదుకదా. కావున న్యాయార్జిత విత్తంబువలన ధర్మంబు సేయుట యుచితంబని చెప్పి మఱియు. ౨౪౯

క. కానున్నది కాకెట్టుల । యౌననినన్ వేదసమితి వ్యర్థముకాదే
మౌనుల తపములు జ్ఞానుల । జ్ఞానము వ్యర్థంబకాదె జనలోకమణీ. ౨౫౦

సీ. మనము చేసెడికర్మ మంచిదియగునేని దైవంబు తోడగుఁ దథ్యమిదియ
మనము చేసెడికర్మ మంచిదికాదేని దైవంబు కీడగుఁ దప్పదిద్ది
కావున సద్గతి గల్గినప్పుడు మన కర్మశుద్ధియై దాని కారణమగు
ఫలము కీడగునేనిఁ దలఁపంగవలె మన కర్మవైగుణ్యమే కారణమని

తే.గీ. కర్తగుణములుకొన్నింట కారణములు । మంత్రగుణములు కొన్నింట మరియు ద్రవ్య
గుణము లొకకొన్నియెడలఁ గారణములగును । వెలయ ఫలభేదములకు సుర్వీతలేంద్ర.

క. హరిహయుఁడు విశ్వరూపుని । గురువుం గావించుకొని యకుంఠితలీలన్
జరిపెను జన్నము తల్లికి । నురుసుఖములుగోరి యందు నుద్యమమలరన్. ౨౫౨

క. దానవులకు దేవతలకు । మానుగ స్వస్తియని పలికి మఖ మొనరింపన్
దానవులు మాతృపక్షము । పూనుక తద్రక్షణంబు వొందుగఁ జేయన్. ౨౫౩

క. సంపుష్టులైన యసురుల । పెంపుంగని హరిహయుండు పెదవిఁ గఱచి ని
ష్కంపనవృత్తిం మదిఁ గో । పంపడి పవిఁ దచ్చిరములు పగులఁగనేసెన్. ౩౫౮

క. ధరణీఁ క్రియావైగుణ్యం । బరయం గారణము దీని కది యట్లుండన్
నరవర మును బాంచాలుఁడు । వరపుత్రునిఁ బడయుటకు సవన మొనరించెన్. ౩౫౯

వ. అట్లుచేసిన యజ్ఞంబువలన దృష్టద్యుమ్నుండను కుమారుండును వేదీమధ్యంబున ద్రౌపది యుం బొడమిరి. మరియు దశరథుండు పుత్రార్థియై యిష్టిఁగావించి రామాదుల నలువుర పుత్రులం బడసె. నది కతంబున నెచ్చటం గ్రియాశుద్ధి కల దచ్చట ఫలంబు మేలగు. నెచ్చటఁ గ్రియావైగుణ్యంబు కల దచ్చట ఫలంబు కీడగు. ధర్మపుత్రుండు సత్యవాదియయ్యుఁ ద్రౌపది పరమసాధ్వియయ్యు భీమార్జునాద్యనుజులు మహాపుణ్యులయ్యుఁ గుత్సిత ద్రవ్య యోగంబునం గ్రియావైగుణ్యంబు గలుగుట నొండె, సాభిమానులై చేయుటంబట్టి క్రియా వైగుణ్యంబు ప్రాప్తించి యొండె నశుభఫలంబులకుం గారణంబయ్యెనని చెప్పి మఱియు.

సీ. జగతీశ సాత్త్వికమగు యజ్ఞమది దుర్లభముసుమ్ము వైఖానసమును లిట్టి
జన్నం బొనర్తురు సాత్వికంబగు భోజనము నిత్యము నొనర్తు రమితశాంతి
న్యాయార్జితంబు వన్యంబు ఋష్యము సుసంస్కృతమునై భక్త మప్రతిమమందు
మంత్రంబుగలదు యూపములేదు మఱి పురోడాశంబు నిత్యంబు నధికమైన

తే గీ. శ్రద్ధగలదిది పరికింప సాత్త్వికంబు । రాజసం బిఁక పర్ణింతు రాజులకును
వైశ్యులకు నది సేయంగ వలసినట్టి । యజ్ఞమని చెప్పుదురు జ్ఞానులైనవారు. ౩౫౪

తే.గీ. రాజసము ద్రవ్యబహుళమై రాజిలెడి సు । సంస్కృతంబులగు దాని సాభిమాన
వృత్తులగు రాజులును వైశ్యు లెలమిజేఁయు।చుందు రిఁకఁ దామసము విను మో మహీశ.

చ. మదమునఁ బేర్మిఁజెంది యభిమానము క్రోధము మెండుగాఁగఁ గ్రూ
రదశల నొప్పి చేయుదురు రాక్షసు లా మఖ మెందునేనియున్
సదమలసాధనక్రియల సాధువులై తగు మోక్షకాము లిం
పొదవఁగ సర్వదా శుభము లుల్లమునం దిడి చేయుచుండ్రొగిన్. ౩౫౭

వ. మునులు చేయు దేవీయజ్ఞంబు మానవయాగంబని పెద్దలు వక్కాణించెద రది విశేషంబని తెలియుము. అది సేయువిధం బెట్టిదనినఁ జెప్పెద సావధానంబుగా వినుమని యిట్లనియె.

సీ. గుణముల నణఁచి యెక్కుడు శుద్ధిఁదనరార నింపుగా మనసు శోధింపవలయు
దేందంబు పరిశుద్ధిఁ బొందుటకై బాహ్యకాయంబు పరిశుద్ధిఁ జేయవలయు
యజ్ఞంబుచేయుట కపు డధికారియై యింద్రియార్థము త్యజియింపవలయు
బహుయోజనాయతిన్ బరగు స్తంభములతో నెద మండపంబు నూహింపవలయు

తే.గీ. విశదమగు వేది నాత్మలో వేయవలయు । నట్టులనె యగ్నులం దగఁ బెట్టవలయు
కొమరుగా నల్లె ద్విజాలను గోరవలయు । నాంతరంగిక యజ్ఞంబునందు భూప. ౨౬౧

సీ. ప్రాణపంచకమె య య్యజ్ఞంబునందును బావకులగుదురు భావనమునఁ
బ్రాణమెన్నఁగ గార్హపత్యం బపాన మాహవనీయ మా వ్యాన మదియ దక్షి
ణాగ్నిగాఁగ నుదాన మది సభ్యకోటిగా జను సమానం బవసథ్యకముగ
నిర్గుణమును నతినిర్మలంబును నగు దలఁపుచే ద్రవ్యంబు దగ నమర్చి

తే.గీ. మనసెహోతనుగా యజమానుఁడుగను । దెలియ నిర్గుణమగుబ్రహ్మ యలరుచుండఁ
బరమశివదేవి భగవతి ఫలదగాఁగ । నాంతరంగికయాగంబు లలరుచుండు. ౨౬౨

సీ. అయ్యయిద్రవ్యంబు లాప్రాణముఖపావకులయందు వేల్చంగవలెనుజుమ్మ
కుండలిదారిని గొని శాశ్వతంబగు బ్రహ్మమం దది వేల్చి భక్తిమిగుల
స్వానుభూతియు స్వయంసాక్షిన్మహేశ్వరి మించిన ప్రీతి ధ్యానించి పిదప
సర్వభూతాత్మను సర్వభూతంబులఁ గారణశక్తిగాఁ గనఁగవలయు

తే.గీ. నంతటనె మాయదగ్ధమై యఖిలకర్మ । బంధములు వీడుఁ బ్రారబ్ధమాత్రముండుఁ
బ్రతికియుండియు ముక్తుండు వాడె సుమ్ము । మానవేశ్వర జగదంబమహిమ వింటె. ౨౬౩

క. మానస యజ్ఞము ముక్తిని । దానము తదితర మఖప్రతానము లిచ్చు
దాన చతురములు క్షయమున్ । బూనుఁగదా కొంతకాలమున కాఫలముల్. ౨౬౪

శా. జ్యోతిష్టోమము స్వర్గకాములకు నంచుం బల్కు వేదంబు లా
చాతుర్యం బది నిక్కమైన విను తజ్జంబైన పుణ్యంబు ని
ర్యాతంబౌనెడ మర్త్యలోకమున కొయ్యం ద్రొత్తురంచుకా సుధీ
వ్రాతంబుల్ వచియింప వింటిమికదా రాజేంద్ర వేయేటికిన్. ౨౬౫

తే.గీ. జయమపేక్షించు రా జిది సలుపరాదు । ముక్తిఁగోరెడివానికే ముఖ్యబుద్ధి
మానవేశ్వర మున్ను తామసము నీవు । సలిపినాడవు సర్పయజ్ఞంబటంచు. ౨౬౬

క. ఆయాగంబున రిపుజయ । మాయెన్ సర్పశతకోటు లగ్నింబడియెన్
జేయుము దేవీయజ్ఞము । మీయయ్యకు ముక్తిగలుగు మేలిది నృపతీ । ౨౬౭

క. లిబ్బుల వెలఁదుక మగఁ డిది । యబ్బురముగ నాచరించె నా సృష్ట్యాదిన్
బ్రబ్బిన వేడుక నీవును । గొబ్బునఁ జేయు మిది మేలుకోరి నృపాలా । ౨౬౮

క. దేవీయజ్ఞవిధావిదు । లౌనాథలు మంత్రవేదులౌవారలు వి
ప్రావళులు కలరు ద్యూజను । లై విలసిల్లుదురు నీకు నవనీనాథా। ౨౬౯

క. ఆయాగము గావించి మ । హాయుక్తిగ ఫలము గాంచి యని నీ పిత కి
మ్మా యయ్యె నుద్ధరింపుము । పాయక నరకంబునుండి పార్థివముఖ్యా. ౨౪౦

క. శాపంబున నీతండ్రికిఁ । బాపము ప్రాపించె సర్పబాధితుఁడై కా
టోపక జచ్చెను నింగిని । భూపాలక యతఁడు నరకమునఁ బడియెఁ జుమీ. ౨౪౧

సీ. భూపాల నీతండ్రి పోవునప్పుడు సర్పభీతిమై దేహంబుమీది ప్రేమ
విడలేక తడబాటుపడి యెల్లవిధముల మృతి మాన్పికొనునట్టి మతి పొసంగి
మేడలు గట్టించి మేడపై నివసించి వివిధరక్షణమార్గ వితతిఁగూర్చి
మంత్రౌషధవితాన తంత్రంబులకుఁ జాల వివిధయత్నంబులు వెల్లికొలిపి

తే.గీ. సోహమనఁడాయె విజ్ఞాన శూన్యుఁడాయెఁ । దత్త్వమసి యను పలుకైనఁ దలఁపడాయె
నెలమి బ్రహ్మహ మని మది నెంచఁడాయె।జెలఁగి దేవీస్మరణమేని జేయడాయె. ౨౪౨

క. భూశయనము లేనట్టి వి । నాశము నీతండ్రి కబ్బె నరకములోనం
బాశములఁ గట్టువడియెగ । దా శాపము ఫలమునంది ధరణీనాథా. ౨౪౩

క అనిన విని దుఃఖితుండై । జననాథుఁడు గొంత సేపు సాశ్రునయనతన్
మునినాథునితో నేమియు । ననఁజాలక యూఱకుండి యతిదైన్యముతోన్. ౨౪౪

క. మునినాథ తండ్రిదుర్గతి । వినిన విషాదంబు వొడమె వేగమ యతనిన్
ఘనముగ స్వర్గప్రాపుగ । బొనరించు నుపాయ మిపుడ పూని యొనర్తున్. ౨౪౫

—— : విష్ణుకృత దేవీయజ్ఞము : ——

వ. అని మరియు నిట్లనియె. ౨౪౬

క. మిత్రుఁడు జగములకెల్ల ప । విత్రుఁడు పాపప్రతతి లవిత్రుఁడు పూజా
పాత్రుఁడు వికచాంబుజదళ । నేత్రుడు జన్నంబు నిటుల నెరవేర్చెఁ దమిన్. ౨౪౭

క. వానికి సహాయులెవ్వరు । పూనిక వహియించినట్టి భూసురు లెవ్వరే
మౌనులు బుత్విజులైరి వి । ధానమునుం దెలుపుమయ్య తాత యనవుఁడున్. ౨౪౮

చ. వినుము ధరాతలేంద్ర యతివిస్మయ మాభగవంతుడైన ప
ద్మనయనుఁ డీమఖంబు విధిమార్గము తప్పక తా నొనర్చె ము
న్ననఘులు బ్రహ్మ విష్ణు శివు లంబికవల్లను శక్తిమూర్తులన్
గొని పిదపన్ విమానము నకుంఠత నెక్కి మహాబ్ధి జేరఁగన్. ౨౪౯

చ. గృహములఁ గట్టికోఁదలఁచి కృత్యము లెంచి నివాసభూమి ని
ర్వహణము గోర దేవి కృప రాగిల మేదముపూని మేదినిన్
విహితముచేసె భూభృ దటవీ ప్రముఖంబులతోడ నందుఁ దా
రు హితవిలాస విస్తృతి నిరూఢి వసించిరి సంతసంబునన్. ౨౮౦

ఉ. మానవనాథ! కైటభము మాధవమై తగు మేదమొందుటన్
జానుగ భూమి మేదిని యనంబడె ధారణవాచ్యసంగతిన్
బూని ధరాసమాఖ్య నొగిఁ బొందె మహీయముగాగ నెందునన్
దాను మహీమహాభిధఁ గనందగె శేషుఁడు మ్రోయు ధారుణిన్. ౨౮౧

తే.గీ. ఇనుపసీలలవలె ధరాభృత్తు లలరెఁ । దానజేసికదా ధరాధరములయ్యె
రత్నమయశృంగములు గల్గి రత్నసాను । వచ్చెరువుమీఱఁ గావించెఁ నంబ కృపను.

వ. మఱియు మరీచియు నారదుండును అత్రియుఁ బులస్త్యుండును బులహుండును గ్రతువును దక్షుండును వసిష్ఠుండును నను వీరు బ్రహ్మకుం గొడుకులై పుట్టిరి. మరీచికిం గశ్యపుఁడుదయించె. దక్షునకుఁ బదమువ్వురు కూఁతు లుదయించిరి. వారియందుఁ గశ్యపుండు నిఖిలదేవతలను రాక్షసులను మనుష్య పశు పక్ష్యాదులం గనియె. నిదియ కాశ్యపియను సృష్టి. పితామహుని యర్ధశరీరంబున స్వాయంభువను మనువు పుట్టె. వామశరీరంబున శతరూపయను కన్య యుద్భవించె. నయ్యిరువురివలనం బ్రియవ్రతోత్తానపాదులనువారు సంభవించిరి. మఱియు ముప్వు రతిరమణీయలైన కూఁతులుదయించి రిట్టు భగవంతుడైన త్రిదశజ్యేష్ఠుండు జగన్నిర్మాణంబు గావించి మేరుశృంగంబునం బ్రహ్మలోకంబు నేర్పరచికొని నివసించె. విష్ణుం డెల్లలోకంబుల కుపరిభాగంబున వైకుంఠంబు నిర్మించికొని కాపురంబు చేయుచుండె. శివుఁడతిరమ్యంబైన కైలాసంబు నిరవుచేసుకొనియుండె. నానా రత్నసంశోభితంబైన మేరుశిఖరంబున స్వర్గంబు గావించుకొని యింద్రుండుండె. సముద్ర మథనంబునం గామధేనువును, నుచ్చైశ్రవంబను నశ్వంబును, నైరావతంబను గజంబును, రంభాదులగు నప్సరఃస్త్రీలను సముత్పాదితంబులు గావించుకొనియె. మరియు నా సముద్రంబున ధన్వంతరియను వైద్యుండును జంద్రుడును నుదయించిరి. క్రమక్రమంబున నండజ స్వేదజాదులు పుట్టె. దేవతిర్యఙ్మనుష్యాది భేదంబుల నానావిధంబగు సృష్టి యిది యకా యెఱుంగుము. ఇట్లు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు జగదండ నిర్మాణంబు చేసికొని యథేచ్ఛం బ్రవర్తించుచుండ నారాయణుండు మహాలక్ష్మింగూడి నిజభువనంబునం గ్రీడించుచు నొక్కనాఁడు. ౨౮౨

ఆ.వె. పాలవెల్లిఁదలచి పాలవెల్లిని రత । నాలదీవిదలచి మేలగు రత
నాలదీవిలోని నయసత్యగుణ నిక । రుంబ నంబ శ్రీధరుండు దలచె. ౨౮౩

ఆ.వె. అంబపేర జన్న మాచరించెదనని । పూని దిగ్గె తనదు పురమునుండి
దిగ్గివచ్చిరి శంభు దేవతాజ్యేష్ఠుని । వరుణు ధనదు నింద్రు బావకు యము. ౨౮౫

ఆ.వె. దైవగురు వసిష్ఠు దక్షుని వామదే । వుని బిలచి సమస్తమును గొఱంత
లేకయుండఁజేసి లోకంబు గొనియాడ । సత్త్వయజ్ఞకర్మ సలుపబూనె. ౨౮౬

సీ. చెలువుగా శిల్పులఁ బిలిపించి వితతమండపమును గావించి డంబుగుల్క
నిరువదియేడ్వుర ఋత్విజుల వరించి చితులు వేదికలును జెన్నుమీర
నొనరించి చేయంగ నుర్వరాదేవతల్ సరగ దేవీబీజ సంయుతముగ
మంత్రముల్ చెప్పిరి మరి విధివత్తుగా హోమములేర్పొల్పించుచున్నతరిని

తే.గీ. మధురమధురాక్షరంబు సుస్వరమునగుచు । వరలునశరీరవాణి య వ్యాసుదేవు
శ్రవణయుగ్మంబునకును గోచరముగాఁగ । నిట్లువచియించెనతఁడాత్మ నెలమినెనగ. ౨౮౭

సీ. దామోదరా । నీవు ధన్యుండవైతివి సురలలో నీవు శ్రేష్ఠుడవుగమ్మ
బ్రహ్మాదులును నిన్ను బ్రథమగణ్యుడవుగా నెంచిపూజించెద రెల్లయెడల
భక్తితో మానవు ల్బూజియించెదరు నిన్ను యజ్ఞేశ్వరుఁడవు నీ వగుము పేర్మి
ని న్నాశ్రయింతురు నిరతంబు నెల్లరు వరములిచ్చుచు గీర్తి వడయుమింక

తే.గీ. ధర్మమెప్పుడు చెడిచను ధరణియందు । నప్పుడీవవతరింపు మత్యాదరమున
శిష్టరక్షణమునుజేసి దుష్టశిక్ష । నొనరఁగావింపుచుండుము దనుజదమన. ౨౮౮

క. నీ యవతారంబులు నా । నాయోనులయందు నొదవు నమ్ముము నీవే
వేయివిధములను దేవని । కాయార్చ్యుఁడవగుము నా సహాయతవలనన్. ౨౮౯

క. శ్రీ నీసహచారిణియగు । నేనే నాయంశమునను నిర్మించెద న
మ్మానవతి నీకుఁదోడుగ । నానాకాయములయందు నంటైయుండన్. ౨౯౦

క. చక్రాదులాయుధంబు ల । వక్రగతిన్ నీకుఁ గలుగు వానిం గొని యా
శక్రాదుల రక్షింపుము । సుక్రమముగ వారియందుఁ జూపుము కరుణన్. ౨౯౧

ఉ. కోపము గర్వమున్ వలదు గోచరు లాదరణీయు లెప్పుడున్
బాపము చేయువారలను బట్టి వధింపుము విగ్రహార్చన
వ్యాపితలీల శక్తులొగి భారతవర్షమునందుఁ బూజ్యులై
కాపురముంద్రు వేగిరమ కల్గును నీకు యశంబు మాధవా. ౨౯౨

క. నినుఁ బూజించిన మనుజులు । ఘనులగుదురు కీర్తిపదులుగా నుందురు నం
దనులం గందురు మధుసూదన యిఁక । నినుబోలునట్టి దైవము గలదే. ౨౯౩

వ. అని కరుణార్ద్రహృదయయై దేవియిచ్చినవరంబులంది నారాయణుండు యజ్ఞసమాప్తిఁజేసి కశ్యపాదులను వీడ్కొని గరుడునిపై నెక్కి వైకుంఠంబు ప్రవేశించి తాను దేవి యనుగ్రహంబునం బడసినవరంబుల దెల్పిన నెల్లదేవతలును బ్రముదితాత్ములై యందరును దేవిం బూజింపదొడంగిరి. దేవియు వారికి వాంఛితార్థప్రదాయినియై యుండె నని చెప్పిన విని జనమేజయుం డిట్లనియె. ౨౯౪

క. హరి దేవి యజ్ఞంబును । గరమరుదుగఁ జేసి శుభము గన్నవిధము వి
స్తరముగ వింటిని మఱియును । మఱియును వినవలఁతు దేవి మహిమము లనినన్.

వ. వ్యాసుండు. ౨౯౬

## —: ధ్రువసింధూపాఖ్యానము. :—

ఆ.వె. దేవదేవదేవ దేవిచరిత్రంబు । వినఁగవినఁగ బెఱుఁగు వినెడిబుద్ధి
మేలుమేలు నాకు మేలుగా మునిముఖ్య । తెలుపు తెలుపు మమృతమొలికి కులుక. ౨౯౭

ఉ. మాన్యచరిత్ర దేవి మహిమం బితిహాసమొకొండు సెప్పె నే
ధన్యుఁడనౌదుఁ గోసలపథంబుల నర్యమవంశజుండు సౌ
జన్యగుణుం డుదారుఁడు లసద్ధ్రువసింధుసమాఖ్యుఁడొప్పు రా
జన్యవరేణ్యుఁ డత్యధిక శౌర్యపరాజితశత్రుసైన్యుఁడై. ౨౯౮

చ. భువి నిరవద్య హృద్య ఘనభూతిఁ దలిర్చి ధరావరుండు మా
నవ పరిరక్షణక్రమమునం గులధర్మములోలి నెప్పుడున్
లవమును బీరువోనిడక లగ్గుల యెగ్గుల నిగ్గులోపికన్
బ్రవిమలబుద్ధి నారయుచుఁ బాలన జేసె నయోధ్య నర్మిలిన్. ౨౯౯

ఉ. ఆ విభు భార్య లిర్వురిఁక నందు మనోరమ ధర్మపత్ని లీ
లావతియున్ ద్వితీయ గుణలక్షణ మాన్యల వారిఁ గూడి యి
చ్ఛావిధి సౌధభాగములఁ జారుతరోపవనంబులందు నా
నావిధకేళికావిలసనంబులఁ గ్రీడలుసల్పె వేడుకన్. ౩౦౦

చ. తనర మనోరమాభిధ సుదర్శను గాంచెను దివ్యరాజ్యలాం
ఛనయుతు సుందరున్ బరమసాధువు రెండవశోభనాంగి దా
జనవర కాంచె నొక్కసుతు శత్రుజిదాఖ్యుని రాజు వారలన్
గనియె నభేదబుద్ధిని జగంబును రంజిలెఁ బ్రీతి నెంతయున్. ౩౦౧

పంచచామరము. సుదర్శనుండు మంజువాక్య శోభియై విరాజిలెన్
సదా చరించె శత్రుజిత్తు చాటువాక్యశాలియై
యుదారుడైన రాజు ప్రీతి కొప్పెనా సుదర్శనుం
డు దా సమస్తమంత్రివర్యులుం జగంబు మెచ్చఁగన్. ౩౦౨

ఉ. ఆఁదట నొక్కనాఁడు మృగయార్థము భూతలనాథుఁ డేగి స
మ్మోద మెలర్ప దుష్టమృగపుంజముల న్నిజబాణనైపుణిన్
మోదుచుఁ బోయి పోయి తనముం దొక యీరమునందు భీతికృ
న్నాదము చేయుచున్న మృగనాయకమున్ గని క్రోధచిత్తుడై. ౩౦౩

ఉ. పంచముఖంబు దన్నుఁ బసిపట్టి యెగాదిగఁజూచి తోక జా
డించుట కల్గి భూవిభుఁ డహీనశరాసమునందుఁ దూపు సం
ధించి తటుక్కున న్విడువఁ దీవ్రగతిం జెడలార్చి గాండ్రు గాం
డ్రంచుఁ బయిం బయిం దుముక నాతఁడు గైకొనె వాలుఁ బల్కయున్. ౩౦౪

తే.గీ. పైకి వచ్చిన మృగరాజు పట్టెరాజుఁ । బట్టినను రాజు గత్తితోఁగొట్టెఁదాని
నిట్టు నట్టునుఁ బొరలాడి యెట్టులేని । రాజు సచ్చె నపుడె మృగరాజు సచ్చె. ౩౦౫

క. దీనాననులై భూపతి । సేనలవారెల్లఁబోయి చెప్పఁగ మంత్రుల్
మానక యుత్తర విధులన్ । బూని యొనర్పించిరంతఁ బుత్రులచేతన్. ౩౦౬

తే.గీ. ప్రకృతిజనులు వసిష్ఠుండు బహువిధముల । పూని యాలోచనముజేసి పుత్రులందు
చెలువుగ సుదర్శనుని రాజు జేయఁదలఁచి । చేరియుండంగ నయ్యుధాజిత్తు వచ్చె. ౩౦౭

క. లీలావతి తండ్రి యతఁడు । పాలించెడి యుజ్జయినిని మంత్రిసహితుఁడై
యాలించి వచ్చినను విని । యాలోనన్ వీరసేనుఁ డరుదెంచె వడిన్. ౩౦౮

క. ఈతఁడు కళింగ భూపతి । తాత సుదర్శనున కిట్లు తతసైన్యగణో
పేతులయివచ్చి యిరువురు । వ్రాతలఁ గూతలను మిగుల వాదించి రాగిన్. ౩౦౯

క. ఇద్దరిలోపల జ్యేష్ఠుఁడు । దద్దయు నా శత్రుజిత్తు తానే రాజం
చుద్దవిడి న్వాదించును । బెద్దతనము చిన్నతనము పెరిమెలవలనన్. ౩౧౦

క. ఇద్దఱు భార్యలలోనన్ । బెద్దదియగు ధర్మపత్ని బిడ్డఁడు కానన్
ముద్దు సుదర్శను రాజని । గద్దించుఁ గళింగరాజు కడువాదమునన్. ౩౧౧

క. మనముల నెటు సెప్పుటకును । వనుమానించియు సుదర్శనాఖ్యుని సింహా
సనమున నుంచఁగఁ దలఁపె । ట్టినను యుధాజితు రుషార్భటి న్పచివులతోన్. ౩౧౨

ఉ. పొట్టలు నించుకోమఱఁగి భూరిధనంబులు గొంచు మేదలన్
గట్టి మదించి పెద్దల ముఖమ్మున ధర్మము లొక్కనాఁడునుం
గట్టిగ విన్న మానిసులు కారు ప్రధానులు మీరు లంచముల్
పట్టి సుదర్శను న్నృపతి పట్టసమేతు నొనర్పఁ జెల్లునే. ౩౧౩

ఆ.వె. నేను బ్రతికియుండఁగా నెవ్వఁ డీ చిన్న । వాని రాజుఁజేయఁ బూనఁగలఁడు
సబలుఁడై నవాఁడు శత్రుజిత్తనుకొండు । కాలు దువ్వువాఁడు కదనమునకు. ౩౧౪

వ. అనిన వీరసేనుండు. ౩౧౫

ఆ.వె. అకట న్యాయమరయ కాదెదేటికి యుధాజిత్త వినుము శత్రుజిత్తు తాత
తాళ్ళఁదన్నె నేనిఁ దా సుదర్శనుతాత । తాళ్ళఁదన్నువారి తలలఁదన్ను. ౩౧౬

—: యుధాజిద్వీరసేనుల యుద్ధము :—

వ. ఇట్లు యుధాజిద్వీరసేనులకుఁ బరస్పర వివాదంబులు ప్రబలంబైన గని యఖిల ప్రజలును మునులును మనంబుల నత్యంత చింతావేశంబులఁ దత్తరిల్లిరి. శృంగబేరపుర వాసులగు నిషాదులు రాజవంశంబునం గలహంబులు పొసంగెనని విని రాజద్రవ్యంబు లపహరింప దేశదేశంబుల విచ్చలవిడి దోపిడులఁ జేయందొడంగిరి. యుధాజిద్వీరసేనులు యుద్ధప్రయత్నంబులు సేయుచుండి రిట్టి సమయంబున. ౩౧౭

సీ. సమరసన్నద్ధులై చతురంగబలములఁ జేర్చి యుధాజిత్తు పేర్చినిలచె
వీరసేనుఁడు మహావీరాగ్రణులతోడ నెదురుగాఁ దా మోహరించినిలచె
మొనసి యా రణరంగమున యుధాజిత్తుపై గిరిమీఁద వర్షంబు గురిసినట్లు
వీరసేనుఁడు ఘోరనారాచముల నేయ నుజ్జయినీశుండు నురువడించి

తే.గీ. నిజనిశితబాణపుంజంబు నెఱసి యతని । యాశుగంబులఁ దెగటార్చి యార్చినిలువ
నంతటఁ గళింగభూపతి పంతగించి । మఱలనేయంగ నతఁడును మఱలనేసె. ౩౧౮

క. గజముగజము హయముహయము । బుజాగతిరథమును రథంబు నెల్లెడలఁ బదా
తిజనముఁ బదాతిజనముం । గజిబిజియై పోర మెదడు గ్రద్దలు తినియెన్. ౩౧౯

సీ. గజఘటాకుంభనిర్గతమైన రక్తంబు కంఖాణకంఠనిర్గత రుధిరము
రథిక యోధాగ్రేసరక్షతజాతంబు కాల్బలంబు నొడళ్ళ గాఱునెత్రు
సెలయేళ్లుగాఁబారి గలసి మహానదీ వితతప్రవాహంబుగతి వహించి
వరమస్తములతిట్ట లరిది సైకతతతి శైవాలభంగిఁ గేశములు తనర

తే.గీ. కరిశవంబులు తిములుగాఁ గానుపింప । వీరకాయంబు లొగి మత్స్యవితతిఁ బోల
నేమని వచింప రణరంగభూమిఁ దొంగి । చూచువారలకును భీతిదోచె మిగుల. ౩౨౦

తే.గీ. కదనమున సీల్గి యొకఁడు నాకమునకేగి । యచ్చరనుగూడి దివ్యరథాధిరూఢు
దగుచు దివినుండి యవనిపై నవిసిపడిన । తనశరీరంబు సూపు నవ్వనజముఖికి. ౩౨౧

తే.గీ. మరియొకడు దేవతాకాంత మఱఁగి దేవ । రథముపైనుండి యాహవరంగమందు
ననుగమన మాచరించిన వనితవచ్చి । తన్నుఁగలసిన స్వీయను దవిలికులికె. ౩౨౨

వ. ఇట్లు దేవాంగనలు రణంబునహతులైన వీరులంగూడి యంతరిక్షంబుననుండి చూచుచుండఁ జతురంగంబుల పాదఘట్టనంబున భూమినుండి లేచిన రజోవితానంబు దిశలం బ్రాకి చిమ్మచీకట్లు గ్రమ్మంజేయ నతిఘోరంబుగాఁ జూపట్టు నవసరంబున యుధాజిత్తు నిజధనుర్విద్యానైపుణిం బ్రకటించి వీరసేనుమస్తకం బూడనేసిన నతండు నేలం దొఱఁగిన నతని బలంబులు చెల్లాచెదరై నలుదెసలం బాఱిపోవ్చి రంత మనోరమ తనతండ్రిపాటు విని తనకుమారుండు యుధాజిత్తుం జయించుమార్గంబు పలువిధంబులం దలపోసియు, నెట్లుం దోచక చింతాక్రాంతయై యయ్యయో లోభంబునకంటెం బాపంబులేదు. నే నేమిచేయుదు. లోభావిష్టుండగు పార్థివుండు సేయని పాపంబుగలదే యని వితర్కించుచుఁ దనలో మఱియు నిట్లనియె. ౩౨౩

క. తల్లినిఁ దండ్రిని భ్రాతల । నల్లుండ్రను గురుల హితుల నాత్మజుల ధరన్
డొల్లింతు రాసచేతను । కల్లగునా యాశ దుఃఖకరి యనుట యిలన్. ౩౨౪

క. చేయు నగమ్యాగమనము । పాయక సలిపెడు నభక్ష్య భక్షణ మిఁకఁ దా
నేయది యాశాబద్ధుఁడు । సేయఁడు లోకమున నాస చీచీ తగునా. ౩౨౫

శా. ఆశారాక్షసి కుక్షిదొడ్డది సురాహార్యంబునున్ సప్తవా
రాసుల్ నాకము నాగలోకమును దా రక్షోతలంబున్ భవా
నీశస్థానము విష్ణులోకమును లోనిడ్డన్ క్షుధాశాంతి దా
లేశంబున్ గనరాదు పిష్టఘుటికాలీలన్ వడిన్మ్రింగెడిన్. ౩౨౬

మ. అకటా లోభము లోభమే వితత మాయామోహినీ దేహవా
హక మత్తేభమకాక దానిఁ గడద్రోయన్ లేక సన్న్యాసులై
వికటారణ్యవిహారులై జపతపోవిస్తారులై కేళ్ళఁ గుం
డికలుం గోలలుఁబట్టి యట్టె చనరే డీకోఁ దరంబేరికిన్. ౩౨౭

ఉ. తండ్రియుఁబోయెఁ బెన్మిటియుఁ దాఁ జను బుత్రుఁడు బాలుఁడయ్యయో
గండ్రయుధాజి తెట్లు బ్రతుకంగల మేము సపత్ని జొన్నపిం
డుండ్రమునైనఁ బెట్టునె నయోచితమార్గము లెందునేనిఁ బ్రో
యాండ్రకుఁ గల్గనే సచివు లయ్యమపక్షము పూనకుండురే. ౩౨౮

ఆ.వె. సవతితల్లిగర్భ మవియంగఁ దద్గత । శిశువుఁ గోసికోసి చెఱచె నింద్రుఁ
డలుక గర్భనాశనార్థంబు సవతికి । నొగివిషంబువెట్ట సగరుఁడొదవె. ౩౨౯

ఆ.వె. కానలకును పంపెఁ గైకేయి సవతికు । మారు రాము నీతిమాలి యందు
వలనఁగాదె యీల్గెఁ బంక్తిరథుండు దా । సవతి యీసునకును సవతు గలదె. ౩౩౦

క. నాకొమరుని భూపతిగాఁ । గైకొనగఁ దలంచినట్టి ఘనమంత్రులు దా
రీకాలమునఁ దదీయులు । గాకుందురె యేమిసేయఁగల నిపు డయయో ౩౩౧

తే.గీ. కాఁదలచిఁనట్టిపని యెద్ద కాకపోదు । యత్నమొకటి చేసిన నవల దైవ
మెట్లుగానుండునో దోషమేమి యిందు । ననుచు మనమున నొక యూహగని వెలంది.

తే.గీ. సకలకార్యంబులందు విశారదుఁడగు । మానిసి విదల్లు నొక్కని మగువ వేగ
బిలచి యేకాంతమునఁ దన బెడదలెల్లఁ । జెప్పికొని యేడ్చెఁ గన్నీటఁ జేలదడియ. ౩౩౩

వ. మఱియు. ౩౩౪

తే.గీ. నాయనా తండ్రి కడచెను నాదుబిడ్డ । చిన్నవాఁ డా యుధాజిత్తు చెడ్డవాఁడు
బ్రతుకుమార్గంబు నాకేది ప్రకృతమరసి । వక్కణింపుము కాళ్ళకు మ్రొక్కుదాన. ౩౩౫

వ. నావుఁడు విని విదల్లుండు. ౩౩౬

క. నీ విచ్చట నివ్వేళం । దావొనరింపంగరాదు త్వరగా నేనుఁ
నీవును బాలునిఁ గైగొని । యా వారాణసికిఁ బోయి యప్పురమందుఁ. ౩౩౭

క. నామేనమామ గలఁ డా । శ్రీమంతుఁడు మంచివాఁడు చేయంగలవాఁ
డామేటి సుబాహుండను నామముగలవాఁడు మేటి నయ మేదేనిఁ. ౩౩౮

క. అనిన విని మనోరమ దా । ఘనమైన యుపాయమనుచుఁ గడునలరి తదీ
య నయంబుం గొనియాడుచుఁ । జనియెదఁ బుట్టింటికనుచు సవతికిఁ దెల్పెఁ. ౩౩౯

వ. ఇట్లుచెప్పి రహస్యముగా నొక రథంబెక్కి తానును సుదర్శనుండును నొకసైరంధ్రియు విదల్లుం దోడ్కొని పట్టణబహిఃప్రదేశంబునకుం జని రణంబునం గూలియున్న తండ్రికి సంస్కారంబులుచేసి రెండుదినంబులలో బాగీరథీతటంబు సేరిన నచ్చటి నిషాదులు సర్వ ధనంబునుం గొనిపోవ వగచి భయాకులయయ్యు విదల్లుండు సెప్పిన నీతివాక్యంబులచే ధైర్యం బవలంబించి తెప్పయెక్కి జాహ్నవిం దాటి భారద్వాజాశ్రమంబు ప్రవేశించి యచ్చటి తాపసులంజూచి నిర్భయయై వసియించి యున్నతఱి మునీంద్రుం డా యంగనం గాంచి యిట్లనియె. ౩౪౦

ఉ. ఎవ్వతెవీవు నీవెవని యింతివి కష్టము జెందినట్లు నీ
నెవ్వగ తెల్పుచున్నయది నీవు సురాంగనవో వరాంగి నీ
మవ్వమునుం గనుంగొనఁగ మానవినీవంచుఁ దలంపనేర
కివ్విధి యెందువల్ల లభియించె వచించుమటంచుఁ బల్కినన్. ౩౪౧

చ. నెగులుననేమియుం బలుకనేరక కన్నుల న వ్విదల్లునిన్
దగఁ గనుగొన్న నాతఁడు మనంబునఁ జింతిలి యో మునీంద్ర యీ
మగువ మనోరమాఖ్య వినుమా ధ్రువసింధుని ధర్మపత్ని భ
వ్యగుణగణాఢ్య యమ్మనుజభర్త మృగేంద్రముచేత నీలిగెన్. ౩౪౨

క. ఈ కొండిక యా శైలకు । చాకాంతుని కొడుకు సుగుణసంపన్నుఁడు వి
ఠీకుఁడగు వీరసేనుం । డీకాంతకుఁ దండ్రి యాతఁ డీల్గె రణమునన్. ౩౪౩

క. లీలావతి యీమెసవతి । యాలలనకుఁ దండ్రియగుచు నలరు యుధాజి
ద్భూలోలుఁడు తన మనుమని । బాలుని శత్రుజితు భూమిపాలునిఁ జేయన్. ౩౪౪

ఆ.వె. పూని వీరసేనుఁ బొడిచి రాజ్యంబున । విడిసియున్నవాఁడు వెఱవులేక
త్రాత యెందులేక యీతరుణీమణి । యిట్లువచ్చె నీవ యింక దిక్కు. ౩౪౫

ఆ.వె. యజ్ఞశతకమైన నార్తరక్షణమును । దొఱయ దట్లుకానఁ బరమదీన
మానవేంద్రు చాన మన్నించి యీబిడ్డఁ । బ్రీతిఁ బ్రోవుమయ్య పృథుగుణాఢ్య. ౩౪౬

క. నా విని మునివరుఁ డిట్లను । నో వనితా నీదు కొమరు నోఁపికమీఱన్.
బ్రోవుము వెఱవకయుండుము । భూవిభుఁడై వీఁడె సుఖము పొందగలఁడుసూ. ౩౪౭

చ. అన విని సంతసించి జటిలాగ్రణి యిచ్చిన గద్దికొంపలోఁ
దనయుని బ్రోచుచుంచెను విదల్లుఁడు నూడిగపుం బడంతియున్
తన కుపచారము ల్నడప దైవమునే మది నమ్మి యెంతయున్
మునివరు సంతికంబునకుఁ బోవుచు వచ్చును నూరడిల్లుచున్. ౩౪౮

వ. అంత యుధాజిత్తు సంగ్రామంబునుండి వెడలి యయోధ్యకుం బ్రవేశించి సుదర్శను వధించు తలంపుతో మనోరమం బిలువ ననేక సేవకులం బంపిన నాపె గనరామి నొక సుముహూర్తంబునఁ దనమనుమఁడగు శత్రుజిత్తునలంకరింపించి వసిష్ఠాదులును నిఖిల మంత్రివర్గంబులును విచ్చేసియుండ నభిషిక్తుం గావించి భేరీశంఖకాహళాదితూర్యధ్వనులు దెసలు నిండ విప్రవేదపాఠంబులును వంది స్తవంబులును జెలంగ జయజయాది మంగళ వినాదంబులతో నుత్సవంబుజేసి పరమసంతోషముతో నుండి. ౩౪౯

క. ఎక్కడికిఁ బోయినది యా । ముక్కడిదియయిన ధ్రువసింధు ముదిత పురమునన్
జిక్కనని తలఁచితిని నే । డిక్కడ లేదాయె కొడుకు నెచ్చట నిడెనో. ౩౧౦

—: యుధాజిత్తు భరద్వాజాశ్రమమునకుఁ బోవుట :—

వ. అని వితర్కించి యుధాజిత్తు తన మనుమనికి రాజ్యం బిచ్చి మంత్రులం భూపాలనంబునం బరామరిక కలిగియుండ నియమించి తా నా రాజ్యంబు వదలి సుదర్శన వధార్థియై యతండు ఋష్యాశ్రమంబున నుండె నని విని. ౩౧౧

తే.గీ. శృంగబేరపురీశుఁడై యెసఁగునట్టి । యెఱుకు దుర్దర్శుఁడనువా దహీనబలుఁడు
దనకుఁ దోడయి చనుదేరఁ దడవులేక । చిత్రకూటంబునకు యుధాజిత్తు సేర. ౩౧౨

వ. మనోరమ విని దుఃఖించుచు. ౩౧౩

తే.గీ. ఏమిచేయుదు మునులారా యెందుఁజొత్తు । నయ్యుధాజిత్తు నాశత్రుఁ డా నిషాద
విభుని సేనలతోఁగూడి విడిసె నిందు । నితనివలననె నాతండ్రి యీల్గెసుండు. ౩౧౪

క. మును పా పాండవులు వనం । బున ద్రౌపదిఁగూడియుండ మునుకొని యా రా
ట్తనయులు మృగయలఁ దిరుగఁగ । మునులే రక్షించిరనుచు మును వింటిగదా. ౩౧౫

వ. మునీంద్రా! య య్యాశ్రమంబున నున్న ఋషులు ధౌమ్యుండును అత్రియు గాలవుండును పైలుండును జాబాలియు గౌతముండును భృగుండును చ్యవనుండును గణ్వుండును జితుండును గ్రతుండును వీతిహోత్రుండును సుమంతుండును యజ్ఞదత్తుండును వత్సలుండును రాశాసనుండును గహోడుండును నవక్రియు యజ్ఞదత్తుండును మొదలుగాగలవా రింకను భారద్వాజాదులుం గలరు. మునీంద్రులారా! యచ్చటం గొందఱు దాసీజనంబులతో యాజ్ఞసేని నిర్భయురాలై నివసించియుండె. నంత నొకనాఁడు పాండవులు వేట తమకంబున న య్యాశ్రమంబువిడచి యొక కాననంబునుండి మఱియొక కాననంబునకుం జనుచుం దడవుసేసియున్న సమయంబున న య్యాశ్రమభాగంబున సైంధవుండను రాజు నిగమధ్యానంబులు విని యందుం బ్రవేశించి భృత్యద్వయసమేతుండై వేదంబులు పఠించు మునులయొద్దికి వచ్చి వారలకు నమస్కరించినం గని వా రాదరించి కుశాసనంబున నుప విష్టుం జేయఁ గూర్చుండియున్న సమయంబునం దత్రత్యులగు నారీమణు లంతటంతట రాజుం జూచుచున్న సమయంబున వారలలో నున్న ద్రౌపదిం జూచి జయద్రధుండు ధౌమ్యునితో నిట్లనియె. ౩౧౬

సీ. ఎవ్వతె యీశ్యామ యిందుబింబానన మత్తకుంజరయాన మంజువాణి
రతియొ భారతియొ శ్రీసతియొ సురేంద్రుని యువతియో పేరేమి యునికి యేడ
ఎవ్వని కూఁతురో యెవ్వని భార్యయో రాజవల్లభభంగిఁ దేజరిల్లు
బర్పూరములను లవంగతీఁవెయుఁబోలె రక్కసులందున రంభవోలె

తే.గీ. నీయరణ్యంబులకు నిది యేలవచ్చె । నింతచక్కఁదనంబు నే నెందుఁజూడ
నహహ చెల్లునె దీనికి యంగలార్పు । తెలుపగదవయ్య ద్విజవర్య దీని తెఱఁగు. ౩౫౭

వ. అనిన ధౌమ్యుం డిట్లనియె. ౩౫౮

తే.గీ. పాండవులభార్య పాంచాలి పార్థివేంద్ర । యీ యరణ్యంబునను వసియించియుండు
ననినఁ బాండవు లెచ్చటి కరిగి రిపుడు । వారలు మహాబలులు నంచితోరుమతులు. ౩౫౯

ఉ. నావుఁడు ధౌమ్యుఁ డిట్లను ఘనప్రతిభుల్ కురువంశమండనుల్
దేవసమానులందరును దేరులనెక్కి యరణ్యభూమికిన్
వావిరి వేటకై చనిరి వచ్చెద రింటికి రెండుజాలకున్
నా వసుధావిభుండు మది నాటిన బాళిని నిల్పనేరమిన్. ౩౬౦

వ. సైంధవుండు మెల్లమెల్లన దారి నేర్పుమీర ద్రౌపదిం జేరి యిట్లనియె. ౩౬౧

ఉ. ద్రౌపది! క్షేమమా? కొనుము దాసునిదండము మంచిదేఁ సరే
నీ పతు లేడఁబోయిరి వనిం గడచెం బదునొక్కొఁడేండ్లు మీ
కాపద లిట్లు వచ్చెనన, నంగన నీకును స్వస్తి రాజ యీ
చాపపయిన్ వసింపు మొకజామున భర్తలు వత్తు రింటికిన్. ౩౬౨

తే.గీ. అనిన ద్రౌపదిమాటల నాలకించి । యంతలో దాని బలిమిఁ దా నపహరించె
మునివరుల నుగ్రమూర్తుల ఘనులనైనఁ జూడఁడాయెను నమ్మవచ్చునె కుజనుల. ౩౬౩

వ. దీనికిం దృష్టాంతంబు కలదు. ౩౬౪

క. బలిచక్రవర్తి జన్నము । నలరం దాఁజేయుచుండ నబ్జాక్షుఁడు దా
నల వామనరూపముతో । నెలమిం జని దానమడిగి యేమియొనర్చెన్. ౩౬౫

క. యోగులకు సేవ్యుఁడైతగు । భోగిశయానుండు సేసె మోసము ధరణిన్
రాగులు లోభులు సేయరె । వేగమె కనుఁగొనకయున్న విమలవిచారుల్. ౩౬౬

క. లోభులు మోసముచేయుచు । లాభంబులు పొందుదురు బళా వారలకున్
ప్రాభవము పాపకర్మమె । యేభయము పరమ్మునందు నిహమే చాలున్. ౩౬౭

క. మనసునఁ గ్రియలన్ వాక్కుల । ననుమానములేక పరుల యర్థమ్ము లొగిన్
గొనియెదరు చెలిమి బలిమిని । గన లోభమకాదె దీని కారణము భువిన్. ౩౬౮

తే.గీ. పరులయర్థంబు రాఁగోరు పాపకర్మ । కొడఁబడుచు నుందు రీభువి నున్నవారు
నమ్మికయనంగ నెయ్యదో నమ్మవచ్చు । వాఁ డెవండో కనుంగొన వశముగాదు. ౩౬౯

తే.గీ. అవని లోభంబు పాపంబు యగునుజూడ । లోభులగువార లాగంగలో మునిఁగినఁ
గాశికేగినఁ దలయెత్తు కనకమిచ్చిన । స్వర్గ మేరీతిఁ గలుగు నత్పాపులకును. ౩౭౦

తే.గీ. ధాన్యవస్త్రాదులను గొనఁ దలఁచినపుడు । వెలలుతగ్గంగగోరను బేరి యమ్మ
గోరినప్పుడు హెచ్చంగఁ గోరుచుండు । హెచ్చుతగ్గులలో మోసమింతగాదు. ౩౪౧

క. కాన మునీశ్వర సుతుతో । జానకి వాల్మీకియింట సంరక్షితయై
మానితయై నట్లుండెద । వీనిం బొమ్మనుము తనదు వీటికి వేగన్. ౩౪౨

క. అనిన ముని యుధాజిత్తుం । గని నీ విపు డిచటనుండి కదలుము స్వగృహం
బున కేగు మీ మనోరమ । కును దుఃఖము వొడమఁజేయఁగూడునె యనినన్. ౩౪౩

క. విని యయ్యుధాజిత్తనియెన్ । మునివర యీముగుద నిపుడు మున్యాశ్రమమం
దుననుండి విడిచివేయుము । చన నటుగాకయున్న సైన్యయుతుండన్. ౩౪౪

వ. అనిన. ౩౪౫

క. నాపలుకులు వినవేనిన్ । నీపనిఁగను మ వ్వసిష్ఠనియమి కుశికజున్
ద్రోపించినట్ల చేసెద । భూపాలక మాటలేల పొమ్మీ వేగన్. ౩౪౬

—: సుదర్శనునకుఁ గామబీజ ప్రాప్తి :—

క. అనిన మునిపలుకు విని బల్ । కినుకం దలయూచి యూచి లేచి యుధాజి
జ్జనఁపాఁలుడు వృద్ధసచివు । దనయొద్దికిఁ జేరఁ బిలిచి తంత్రం బడిగెన్. ౩౪౭

వ. ఇట్లాలోచించి మఱియు. ౩౪౮

ఆ.వె. శత్రు దల్పుడంచు జనుఁ డుపేక్షించిన । రాజయక్ష్మబోలె రానురాను
దుదకు మృత్యుహేతు వది కాకయుండునే । పగఱనదఁపవలయుఁ బ్రథమమంద. ౩౪౯

ఆ.వె. కాన నిపుడు చేయు గార్యంబు పరికింప । తనయుతో మనోరమను బలిమిని
బట్టితెచ్చువాఁడ బరులెవ్వ రెదిరింపఁ । గలరు యోధులేరి బలగమేది. ౩౫౦

ఆ.వె. బలిమిఁబట్టి బాలు బ్రతుకార్చి నిష్కంట । కంబు సేయువాడఁ గడగిరాజ్య
మందుమీఁద భీతి యెందునులేక ర । క్షణము సేయువాఁడు శత్రుజిత్తు. ౩౫౧

వ. అని పలికిన యుధాజిత్తు పలుకులు విని ప్రధానుం డిట్లనియె. ౩౫౨

క. మునిమాటలు విని సాహస । మును జేయకుమయ్య దృష్టమును జూపె నతం
డును విశ్వామిత్రునిఁ దా । విను మాకథ చెప్పెదను సవిస్తర ఫణితిన్. ౩౫౩

క. మును విశ్వామిత్రుండను । ముని దేశాటనముమీఁదఁ బోవుచును వసి
ష్ఠుని యాశ్రమంబునకుఁ దగఁ । జవినం బూజించి దర్పవాప నతఁ డిడన్. ౩౫౪

క. ఉపవిష్టుండై యుండఁగ । నపరిమితానందమున మహాముని నిలిపెన్
నృపతిని భోజనమునకై । సపృతనుడై కౌశికుండచట భుజియించెన్. ౩౫౫

క. సుందరమై కనులకు నా । నందంబై యొప్పుచున్న నందిని యను గో
వుం దివ్యభక్ష్యభోజ్యము । లందీయఁగఁజూచి దాని నడిగిన మునియున్. ౩౭౬

తే.గీ. హోమధేనువు దీని నే నొసఁగననిన । పాడి మొదవుల నొకవేయి పరగ నీకు
నిత్తు నిమ్మన నేది నీ విత్తుగాక । దీని నే నీకు నీనని మౌని పలికె. ౩౭౭

తే.గీ. బలిమిఁ గొనిపోవఁగలను నే పార్థివుండ । సైన్యయుక్తుండఁ జూడుము చాలకున్న
లక్షలకొలంది ధేనువు లక్కలవు నాకు । నీకు నిచ్చెదఁ గోరితేని మునివర్య. ౩౭౮

వ. అనిన నమ్మునీంద్రుండు. ౩౭౯

తే.గీ. బలిమి ధేనువు గైకొన్న బలగములను । గూర్చికొనివచ్చినను నేను గోవు నొసగ
నేమిచేసినఁ జేయుమీ యిచ్చకొలఁది । ననినఁ గోపించి కౌశికుం డతిరయమున. ౩౮౦

క. పట్టుఁడు పట్టుఁడు నందిని । నట్టిట్టుం బోవనీక యనిన ననుచరుల్
పట్టికొన నాక్రమించిరి । పుట్టెను గంపంబు మేన ముని కవ్వేళన్. ౩౮౧

ఆ.వె. ఏమిచేయువాఁడ నిదె నిన్నుఁ గొనిపోవు । చున్నవాఁడు బలిమి నుర్వరేశుఁ
డేయుపాయమైన జేయుమీ యనుచును । గోవుఁ జేరి తనదు గొడవఁ దెలుప. ౩౮౨

క. శంభునముడైన మౌని య । దంభోక్తుల నాలకించి యావుం గినుకన్
హుంభారవ మొనరించుచు । సంభూత మొనర్చె దితిజ సైన్యము మేనన్. ౩౮౩

తే.గీ. నందినీనందనులు సాధనములుపూని । పోకుఁడదె నిలువుండని పొడిచి పొడిచి
కౌశికునిసేనఁ ద్రుంప నిరాశుఁడగుచు । నేగి యేకాకియై యిట్టు లేడ్వఁదొడగె. ౩౮౪

తే.గీ. అయ్యయో పాపియీమౌని యవనిపాలు । తేజు బ్రాహ్మణుతేజుతో దీటుకొనునె
యనుచు నిందించు నేఁ దపమాచరించి । బ్రాహ్మణుఁడనౌదు నని పంతపట్టిపూని ౩౮౫

తే.గీ. తపము గావించి తాపసత్వము వహించె । కాన రాజన్య నీవిట్లు కదనసేదేల
సాహసంబునఁ దాపసుల్ శాపశరులు । కూడదీబుద్ధి మానుము గోత్రహావి. ౩౮౬

క. మునివరునికడకు నేగుము । జనవర సాధూక్తినతఁడు శాంతిల్లంగా
నొనరించి సుదర్శను ని । వ్వనమునసే యుండనిమ్ము వగపేటికిఁకన్. ౩౮౭

క. ఒకచెంపఁ గొట్టినను బా । లొక చెంపను నెత్రు బాలుఁ దోఁపఁగలఁడె పీ
కొక యపకారము చేయఁగఁ । గృపతో రక్షింపుమయ్య క్షితితలనాథా. ౩౮౮

క. రంజిల్లఁగ దయయే చే । యంజనుఁ గావలసినది యది యగుఁ గాకేలా
నెంజలి నృప దైవాధీ । నం జగదఖిలమ్మనన్ వినంబడదొక్కో. ౩౮౯

క. ఎందే వజ్రము తృణమగు । నందే తృణలవము వజ్రమగు దైవగతిఁ
గుందేలు పులినిఁ బఱఁగఁగు । చుం దోమయె గజముఁ గూల్చు శూరత్వమునన్. ౪౦౦

వ. అనిన విని యుధాజిత్తు మునివరు సన్నిధానంబున కరిగి యతని పాదంబుల కెఱఁగి యో యయ్యా భవదాజ్ఞానుసారినై చనియెదనని యతని వీడ్కొని నిజనివాసంబునకుం బనివినియె. నంత మనోరమయు సుదర్శను బాలించుచు నయ్యాశ్రమంబునన యుండె. అంత నొక్క నాఁడచ్చటి మునిబాలకుం డొకండు విదల్లుం జూచి క్లీబా యని పిల్చిన విని సుదర్శనుం డందలి ప్రథమాక్షరంబు బిందుయుతంబుగాఁ గొని పునఃపునస్స్మరణంబు సేయుచుండె. నప్పటికతం డైదేండ్ల బాలుండుగనుండి పిదప పదునొకండవ వత్సరంబు ప్రాప్తంబైనం గని యచ్చటి మునివరు లుపనీతుం జేసి వేదాధ్యయనంబు సేయించి వెంట వెంట ధనుర్వేదంబు సాంగంబు సేయించి నీతిశాస్త్రంబు గఱపినం గుమారుండు సకలవిద్యా పరిపూర్ణుండై యుండె నంత. ౪౦౧

ఆ.వె. శక్తి కామబీజ శక్తిచే నొకనాఁడు । రక్తభూషణములు రహివహింప
రక్తవసనయగుచు రక్తవర్ణముతోడ । శక్తి వైష్ణవియె ప్రసన్నయయ్యె. ౪౦౨

ఆ.వె. గరుడవాహనమునఁ గదలక కూర్చున్న । వైష్ణవినిఁ బ్రసన్నవదనఁ జూచి
యలరు బాలుఁ గాంచి యచటనే నిల్పి య । య్యంబ ప్రోల్లసద్దయారసమున. ౪౦౩

తే.గీ. వాడిగల్గిన యమ్ములతోడ । విల్లు గత్తళంబును బొదియును గడకనిచ్చి
జయము పొమ్మనిపల్కె నా శక్తి దాని । విని ముదమ్మునఁ గైకొని వేడ్కనుండె. ౪౦౪

వ. ఇది యిట్లుండ. ౪౦౫

మ. కలఁ డాశాదశకాంత కాంత విమలఖ్యాచంద్రికాసాంద్రుఁ ద
త్యలఘూగ్రోరు మహో మహా శిఖిశిఖావ్యాపాదితారాతి రా
డ్బలని స్తంద్రుఁడు వైభవేంద్రుఁడు మహీభారక్రియాశక్తి భా
సిల సద్బాహుయుగోరగేంద్రుఁడగు కాశీ రాజచంద్రుం డిలన్. ౪౦౬

ఉ. ఆ ధరణీతలేంద్రునకు నాత్మజ సుందరి మందయాన బిం
బాధర చారుగంధి సుగుణాఢ్య వలాహకవేణి యామినీ
నాథసమాస్య నిమ్నతరనాభి తలోదరి కంబుకంఠి వి
ద్యాధరనారి నా శశికలాభిధ యొప్పె విలాస సంపదన్. ౪౦౭

ఉ. వందిజనంబు లప్పుడు వచ్చి సుదర్శను పేరు తీరు సౌ
రుం దగఁ జెప్పఁగా వినుచు దర్పకుఁ డేయఁగ నోర్వలేక యే
చందమునం దదీయముఖచంద్రునియం దమృతాంశుబృందమున్
గందు నటించుఁ గోరికలు కట్టలుకాగక పొర్లి పారినన్. ౪౦౮

ఉ. అంతట నొక్కనాఁడు జగదంబ నిశాంతరవేళ వచ్చి సీ
మంతిని స్వప్నమందనియె మానిని! నీకు వరం బొసంగెదన్
భ్రాంతివహింప కిష్టడుగుమా యనఁ జూచి ముదంబుమీఱ న
త్యంతము సిగ్గునన్ శశికళాభిధ పల్కక యూరకుండినన్. ౪౦౯

తే.గీ. తరుణి నీదు తలంపు సుదర్శనుండు । వరుడు గావలెననియె నే నెఱుఁగనొక్క-
వాడు నాభక్తుఁ డతడె నీ వరుఁడుసుమ్ము । మనమునం దిట్లు చింతిల్ల మానుమింక. ౪౧౦

క. అని పల్కిన దేవీ వా । క్కున సంతసమంది లేచి కోమలి తనలో
నను గిలకిల నగికొనుచు । న్నను దల్లి యదెల్లగాంచి నవ్వుచు ననియెన్. ౪౧౧

తే.గీ. ఏమి నాతల్లి మున్ను నీ కింతమొగము । లేదు వికసించినది నేడు లేఁతఁదమ్మి
సూర్యదర్శనమునఁబోలె జూడ దీని । కొక్కకారణ మెద్దని యుండుఁ జెపుమ. ౪౧౨

క. అనఁ దలవాంచుక యేమియు । ననజాలక వెనుకఁదిరిగి యనుగు జెలియతోన్
దన స్వప్నక్రమమెల్లను । వినిపించెను జెవిని పెదవివెట్టి గుసగుసన్. ౪౧౩

క. తల్లియుఁ జెలులున్ మిక్కిలి । యుల్లసిలిరి యట్టులుండ నొకనాఁ డా సం
ఫుల్లసరోజేక్షణ దాఁ । దల్లికి నిట్లనియె మృదుసుధామధురోక్తిన్. ౪౧౪

క. ఈనాఁ డుపవనభూమికి । నేనును జెలికత్తియలును నేగెదమమ్మా
మానక సెలవిమ్మనినన్ । మానిని లగ్గనిన నేగె మంజులవనికిన్. ౪౧౫

క. మొల్లలు జాజులు పొగడలు । మల్లెలు సంపంగిపూలు మఱి విరజాజుల్
కొల్లలుగఁ గోసికొనుచున్ । ఫుల్లసరోజాక్షి సూచె భూసురు నొకటన్. ౪౧౬

వ. చూచి. ౪౧౭

ఉ. ఎచ్చటనుండి యెచ్చటికి నేగెదు బ్రాహ్మణ నా నమస్కృతుల్
బుచ్చికొనుం డనంగ విని భూసురుఁ డో విమలాంగి నీకు నే
నిచ్చెద దీవన త్తడయ దింతయు నీకు వివాహసిద్ధియౌ
నచ్చుగ నీవిభుండు సుగుణాఢ్యుఁడు నయ్యెడునంచుఁ బల్కినన్. ౪౧౮

క. విని నవ్వి య త్తలోదరి । వినయాన్వితయగుచుఁ బలికె విప్రవరా యెం
దుననుండి వచ్చెదవు నా । ఘన భారద్వాజపల్లెకడనుండి యనన్. ౪౧౯

క. ఆ యాశ్రమమున నద్భుత । మేయది కలదనుచుఁ బంచలేక్షణ యడుగన్
దోయజలోచన వినుమా । తోయ మొకటి యచటఁ గలదు స్తుతిపాత్రముసూ. ౪౨౦

తే.గీ. కొమరుగలవాఁడు ధ్రువసింధు కొడుకు వాని । నామము సుదర్శనుం డెలనాగ యతని
పేరు సార్థకమేకాని వేఱుకాదు । పొడవులై యొప్పు బాహువుల్ వెడదఱొమ్ము. ౪౨౧

తే.గీ. అతనిఁ జూడనివారల యక్షులక్షు । లా సమస్తగుణంబు లయ్యా జుఁడుగూర్చి
చేసెఁగాఁబోలు నని జను లెప్పుకొండ్రు । అమ్మ యేమందు నామాట నమ్ముమింక. ౪౨౨

క. అతఁడా నీకేతగు నీ । పతనికినే తగినదాన వబ్జజుఁడును ని
మ్మతికించెనేని రత్నము । నతికించుటకాదె కనకమందు వరాంగీ. ౪౨౩

వ. అని చెప్పి వ్యాసుండు వెండియు జనమేజయున కిట్లనియె. ౪౨౪

—: శశికళా స్వయంవరము. :—

తే.గీ. బ్రాహ్మణుం డట్లు చెప్పి రాఁ బనివినియెను । ముద్దులాడియు నిజగృహమునకుఁబోయి
మరునితూపులు మఱిమఱి మఱియుఁదాక । దక్షణమ చెలికత్తియ దాపుసేరి. ౪౨౫

తరువోజ. చెలియరో నేనేమి చేయుదునమ్మ । వలరేడు నామీఁద వైరంబుబూని
యలరుఁదూపులనేసె నంగముల్వడఁకు । నిలచినచోటను నిలువంగఁజాల
వెలఁదులతో నాడ విసుగాయెనమ్మ । యలసుదర్శను విధం బవనీసురుండు
తెలిపినప్పటినుండి ధృతిదూలె నాకు । కలలోనఁజూచిన కంతుడే వాఁడు. ౪౨౬

ఉ. ఆకలి లేదు నిద్దురయు నట్టిదయయ్యెను శారికా శుకీ
కోకిలలం గనుంగొనఁగ గోరదు నెమ్మన మేమి చెప్పెదన్
గేకులు చెంతచెంతలకుఁ గేరుచు వచ్చెడి నేలరొప్పు మీ
కూఁకలు వీనులం బడినఁ గుట్టిన సూదులవోలెఁ దోఁచెడిన్. ౪౨౭

క. ఒయ్యారంబుగ నంచలు । బయ్యెద చెఱఁగంటి తిరుగు వనితా యివియే
దెయ్యాలై తోఁచును నా । కయ్యో దూరముగఁ దోలుమమ్మా వీనిన్. ౪౨౮

ఆ.వె. విన్నరేయినుండి నెలఁతరో నావంత । యెంతయని వచింతు నెరుఁగ నెప్ప
డిట్టిపాటు లిపుడు పట్టె నే నేమందు । మందు దెలసెనేని మగువ చెపుమ. ౪౨౯

ఆ.వె. చందమామఁజూచి సామిమోమనుకొందు । మరియు బయలకేగి మండుచున్న
పెద్దయెఱగలంచు బెగ్గిలి పయ్యెదఁ । జాటుజేసికొందుఁ జంద్రవదన. ౪౩౦

ఉ. తల్లికిఁజెప్ప సిగ్గు మరి తండ్రికిఁ జెప్పఁగ నంతకంటెనున్
బెల్లగు సిగ్గు నా యునికి భీతమృగేక్షణ యేరితోడ నేఁ
బల్లగదల్చి చెప్పెదను బాయక నాయెడ ప్రేమతోడ రం
జిల్లెద వీవయంచు నిటు చెప్పితి నాగతి యాలకించుమీ. ౪౩౧

శా. అయ్యో పూవులదండయంచు నిడితే యార్తిన్ మహాసర్పమే
యయ్యో గంధమటంచలందితివి కాదమ్మా విషం బిద్ది యే
నయ్యో నాకిఁక మేడలేల కలవాణు ల్వీణలేలా లస
చ్ఛయ్యాసౌఖ్యము లేల నన్ విడువుమీ చానా సరోజాననా. ౪౩౨

క. జనవరబాలునిఁ జూచిన । దనుకన్ నే నిలువఁజాల తరుణీ నే నా
తని వలఁచి వేరొకఁడగు । మనుజవరునిఁ దలఁపఁజాల మనమునఁ జెలియా. ౪౩౩

ఆ.వె. జనకుఁ డిపుడు పెండ్లి సలుపండ యేనియు । నేమిసేయుదాన నేన సాహ
సించి రాజపుత్రుఁ జేరి వరించెద । ననిన నవ్వయస్య యది యెఱింగి. ౪౩౪

తే.గీ. నెచ్చెలీ చింత నీకేల నీజనకుఁడె । యాసుదర్శను నినుఁ గూర్చునట్టివాఁడు
వేగిరంబేల యని చెప్పి వేదురుడిపి । యతివ పరితాప మొక్కింత యడఁచె జెలియ. ౪౩౫

వ. అని చెప్పి వ్యాసుండు. ౪౩౬

క. ఒంటరి ధనహీనుండున్ । బంటొక్కఁడు లేదు విపినవాసంబు దినన్
వంటకములు ఫలములు నిటు । వంటి మగనిఁగోరె నహహ వనితామణి తాన్. ౪౩౭

క. అతివకు వాగ్బీజంబే । గతియై యుండంగ నేమికావలె దేవిన్
సతతంబును జపియించున్ । వితతఫలము లొసఁగుచుండు విశ్వాంబ దయన్. ౪౩౮

తే.గీ. ఆ సుదర్శను గన నిషాదాధిపుఁడును । శృంగబేరపురమునుండి చేరి నాల్గు
గుఱ్ఱములతేరి నొకదానిఁ గూర్చి తెచ్చి । సకలసాధనములతో నొసంగెఁ బ్రీతి. ౪౩౯

క. ఎఱుకు సుదర్శనుఁ జెలిమికి । మఱిమఱి ప్రార్థించి యతని మర్యాదలకున్
గర మరుదందుచుఁ జనియెన్ । ఋరమునకును నంత రాజపుత్త్రుఁ గని మునుల్. ౪౪౦

ఆ.వె. రాజపుత్త్ర! నీకు రాజ్యంబు సేకురు । కొన్నినాళ్ళలోనఁ గొఱఁతలేక
యీవు దేవికరుణ నెంతయు ధన్యుండ । వైతివంబయే సహాయ నీకు. ౪౪౧

క. అని యాత్మనిఁ గొనియాడుచు । జననికడకుఁబోయి నీదు సత్పుత్త్రుం డో
వనజేక్షణ భూపాలుం । డనుకొనుమా చింత మానుమమ్మా యనినన్. ౪౪౨

ఆ.వె. మీరమోఘవాక్ప్రసారులు మీమాట । తప్ప దదియుఁగాక తపసులార
వీఁడు మీకు దాసుఁ డీడెవ్వఁ డితనికి । నైన మదిని సంశయంబు గలదు. ౪౪౩

క. నాకొడుకు భూమిపాలుం । డేకరణిం గాఁగలండొ యెఱుఁగను సైన్యం
బా । కోశంబా । గుఱ్ఱాలా । కరులా । సచివులా । సహాయనృపతులా । ౪౪౪

క. అయినను మీదీవనలే । జయములు నిశ్చయముసుండు సర్వముఁగూర్చున్
భయమేమి మీరలుండఁగ । దయతో మముఁ బ్రోతురనుచుఁ దలఁచెద నెపుడున్. ౪౪౫

వ. అని పలికి వ్యాసుండు జనమేజయుంజూచి నృపాలవర్యా! యా సుదర్శనుఁడు నిషాద దత్త రథంబు నెక్కిన నక్షౌహిణీ సమావృతుండై నట్ల మహాతేజంబుతో నుల్లసిల్లువాఁడు. మంత్రంబు కలిమి దేవిప్రసన్నయై కామంబులం గొనసాగఁజేయుచుండు. జగదంబాను గ్రహంబు గలవారికి నసాధ్యంబులున్నె యని చెప్పి మఱియు. ౪౪౬

క. దేవినిఁ జిత్తంబున నిడి । యేవెంగళి తలఁప దట్టిఁడే దుర్భాగ్యుం
డై కడువంతలఁ జిక్కున్ । చీ కనరా దట్టివాఁడె చేటుల నొందున్. ౪౪౭

క. ధృతియుం గీర్తియు లక్ష్మియు । నతితరశక్తియును సర్వ మంబయకాదే
వితత ప్రపంచమునకున్ । గతియును మతియు నని నమ్మి గట్టిగ మదిలోన్. ౪౪౮

క. హరి హర విధి శిఖి రవి శశి । సురవర మరు దాదితేయ సూర్యజ ధనరా
ద్వరుణాదులు భగవతిఁ గొ । ల్తురు నరులు మనమున దేవిఁ గొలువం దగదే. ౪౪౯

క. పరమాత్మ నెవఁడు దెలియున్ । బరికింపఁగ దేవి కరుణ వడయకయున్నన్
సరసీజభవాండంబుల । విరచించిన తల్లియొకతె వేఱే కలదే. ౪౫౦

చ. తరుణుఁడు రాజపుత్త్రుఁడు సుదర్శనుఁ డచ్చట దేవిఁ గొల్చుచున్
ధరణికి రేఁడనై యెపుడు దాల్చెద పట్టమటంచు నుండఁగాఁ
దరుణి సుబాహుకూఁతురు సుదర్శను నెప్పుడు సూతునంచుఁ దా
మరిమరిఁ జింతిలం దొడఁగె మన్మథుబాధల కోర్వశక్యమే. ౪౫౧

ఉ. అంత సుబాహుఁ డాత్మభవ యాంతరముం గ్రహియించి యెంతయున్
స్వాంతమునందుఁ గొంతవడి యారసి వేగ స్వయంవరంబు సా
టింతునటంచు శాస్త్రము పఠించినవారలఁ బిల్వనంపి
యత్యంత ముదంబునన్ విధుల నారసి యిట్లను నాత్మలోపలన్. ౪౫౨

వ. స్వయంవరంబులు మూఁడు. అందు మొదటిది యిచ్ఛాస్వయంవరము, రెండవది పణ స్వయంవరము, మూడవది శౌర్యశుల్క స్వయంవరము. ఇం దిచ్ఛాస్వయంవరం బుత్త మంబుగావున నట్లు సేసెద నని యూహించి శిల్పులం బిల్పించి మంచంబులు, నాస్తరణంబు లును సభ్యమండపంబులును నేర్పరపించి నానావిధంబులగు వివాహసంభారంబులు సమ కూర్చి స్వయంవర మహోత్సవంబునకు నెల్లయెడలఁ బరామరిక కల్గి యున్నతఱి శశికళ తన ప్రాణసఖిం బిల్చి రహస్యంబున నిట్లనియె. ౪౫౩

తే.గీ. కలికి నీకంటె నేకాంతకార్యములకు । నేరు గల రదికావున నిపుడ నీవు
పోయి మాయమ్మతోఁడ నైపుణ్యమెరయ । నిట్లని వచింపఁగదవమ్మ మృదుపదముల.

క. నేను సుదర్శనుఁడనెడి మ । హీనాయకసుతునిఁదక్క యితరుని మదిలోఁ
బూని వరియింపననుమీ । మానిని యాతండె నాకు మగఁడని యనుమీ. ౪౫౫

క. అనినన్ విని చెలియ సుబా । హుని నెలఁత విజనవితర్ది నుండం గని యో
వనజాక్షి నీతనయ నీ । కునుఁ జెప్పుమటంచుఁ దెలిపెఁ గొన్నిపలుకులన్. ౪౫౬

క. భారద్వాజాశ్రమమున । వీరుండు సుదర్శనుండు విడిసె నతండే
నా రమణుఁడు వరియింపను । వేఱొక్కని నంచుఁ జెప్పె విను మిది నెమ్మిన్. ౪౫౭

తే.గీ. అనుచుఁ జెప్పిన చెలిపల్కు లాలకించి । పెనిమి టింటికిరాఁగానె వినయగరిమఁ
గూతుమాటలు విన్పింప నాతఁ డధిక । విస్మయంబంది ముక్కుపై వ్రేలిడికొని. ౪౫౮

తే.గీ. వింటె వైదర్భి యారాచగుంటఁ డడవి । నొంటి నిర్ధనుఁడై తేజముడిగి రాజ్య
పదము వోఁగొట్టుకొని యుండె వాఁడు నీకు।దగఁడు స్థితిమంతులగు భూమిధవులు లేరె.

క అని శశికళకుం జెప్పుము । వినునట్టులు బోధజేసి పిన్నతనము నీ
కును మేలుగోరి చెప్పితి । ననుము సుదర్శనునిమీది యాస లుడుగుమీ. ౪౬౦

వ అని కాశీరాజు సుబాహుఁడు తన భార్యయగు వైదర్భితోఁడ నీ కుమారికయగు శశికళకుం
జెప్పుమని పలికె నని చెప్పి వ్యాసుండు జనమేజయునితో నిట్లనియె. ౪౬౧

క. పెనిమిటి జెప్పిన రీతిన్ । దనయం దగఁ జేరి ప్రేమ దయివారంగా
నను నా సుదర్శనుడు నీ । మనమునఁ గోరంగరాని మనుజుఁడు వింటే. ౪౬౨

క. హితమెరుగక నన్నును నీ । పితనున్ వగఁ గుందఁజేయఁ బ్రీతియె నీకున్
మతిఁ దెలియక నిర్ధను వన । గతుఁ గోరితినంచుఁ దెలుపఁగాఁదగునె సుతా. ౪౬౩

తే.గీ రాజ్యమా పోయె దౌర్భాగ్యరాశి యతఁడు । ఆశ్రయము లేదు ధనము లే దన్నిగతుల
బేదయై బాంధవులనెల్ల విడిచి యాకు । లలములం దిఁచుఁ దల్లితో నడవి నుండె ౪౬౪

ఉ. ఎందఱు రాజపుత్రులు సమిద్ధచరిత్రులు చారుగాత్రు ల
స్పందగుణాంచిత స్తవనపాత్రులు సజ్జనమిత్రు లున్నవా
రం దొక సుందరుం గొనఁగ హర్షము మాకగు నీజగంబులో
నందఱు మెత్తు రియ్యది యథార్థము మానుము భీ సుదర్శనున్. ౪౬౫

చ. యువతి సుదర్శనాఖ్యునకు నొక్కఁడు భ్రాత గలండు వాఁడపో
యవనికి రాజు వింటె మఱి యాతనిఁ జంప యుధాజిదాఖ్య భూ
ధవుఁ డెపు డెప్పు డెప్పుడని తాఁ గనిపెట్టుకయుండె వాఁడె యా
హవమున వీరసేను నుసు రార్చెను మంత్రుల లోఁగొనెన్ వెసన్. ౪౬౬

వ. అనినఁ దల్లిమాటలు విని కొండొకవడి చింతించి తలపంకించి మనంబు గట్టిపరచుకొని శశికళ తన తల్లితో మెల్లన నిట్లనియె. నోతల్లీ! సుదర్శనుం డెంతనిర్ధనుండైనను వనవాసియైనను నతని నామనం బిదివరకె వరియించియున్నయది. శర్యాతివచనంబునం జేసి సుకన్య చ్యవనుని వరియించి పతిశుశ్రూషాపరయై ప్రవర్తించినట్లు యేనును భగవతీ సమాధిష్టక్రమంబు విడువక సుదర్శనుం భర్త గావించుకొనియెదనకాని యితరులం గోర నొల్లనని చెప్పి తల్లి కనేక నిదర్శనంబులు సూపిన నాపె తనయ నొడంబరపంజాలక యాపె దృఢనిశ్చయంబు తనపెనిమిటి కెఱింగించె నంత. ౪౬౭

క. సరసిరుహనయన శశికళ। వరుఁడైన సుదర్శనునకు వార్తఁ దెలుప భూ
సురు బుద్ధికుశలు నొక్కని। దరికిం బిల్పించి మ్రొక్కి తా నిట్లనియెన్. ౪౬౮

ఉ. భూసురవర్య కన్నియను భూవరవంశముదాన నీకు నా
యాసము నిచ్చుదాన వినుమయ్య సుదర్శనుఁడున్న యాశ్రమా
వాసముసేరి వేళఁగని వారలు వీరలెఱుంగకుండ నా
కోసరమై వచింపు మొక కొన్ని రహస్యము లేను చెప్పెదన్. ౪౬౯

ఉ. నాకు స్వయంవరమ్మనుచు నాయన దాఁ బ్రకటించె వత్తు రీ
లోకమునందునున్న జనలోకపతుల్ ననుఁ జూడవత్తు రే
నీకయియున్నదానఁ బరమేశ్వరి వాక్యముబట్టి కాన నీ
రాకనుగోరియుంటిని ధరావర రమ్ము నినున్ వరించెదన్. ౪౭౦

ఉ. ఈవటురాకయున్న విషమే గతియో యుఱిత్రాఁడె ప్రాప్యమో
పావకుఁడే యుపాయమొకొ బావియె మృగ్యమొ మండలాగ్రమే
పావనమైన మార్గమొ కృపాకర యట్టిదకాక యన్యగో
త్రావరుల న్వరింప నిది తథ్యము నావచనంబు నమ్ముమీ. ౪౭౧

చ. మనసున వాక్కునం గ్రియను మానవనాయక నిన్వరించితిన్
వినుమికఁ దల్లిదండ్రుల ప్రవేశము నావరణంబునందు లే
దని మదినెంచుమా త్రిజగదాదిమశక్తియ నీకు నాకు బో
ధనమొనరించెఁ దప్పదది తప్పదు మేలగుఁ బ్రాణనాయకా! ౪౭౨

వ. అని యిట్లు విన్నవించుమని బ్రాహ్మణునకుం జెప్పి దక్షిణయిచ్చి పంపిన నతఁడు
భారద్వాజాశ్రమంబు ప్రవేశించి సుదర్శనున కేకాంతంబున శశికళాసందేశంబు సెప్పిన
నతం డలరె. నంత బ్రాహ్మణుండు తిరిగివచ్చి శశికళకావృత్తాంతంబు దెలిపి యింటికిం
జనియె నపుడు. ౪౬౩

క. శశికళ స్వయంవరమునఁ । గుశలత జూడఁ సుదర్శనుఁడు పూని నిరం
కుశుఁడగు ముని యానతిగొని । విశదస్థితినున్న తల్లి విని యిట్లనియెఁ. ౪౬౪

క. కొండికపు నీవు బాసట । యొండుం గనరాదు నీవు నొంటి మనుజరా
ణ్మండలి నుండఁగలవె నీ । కండయు దండయును నెవ్వరయ్యా తండ్రీ. ౪౬౫

తే.గీ. ఆ యుధాజిత్తు నిను గూల్ప నన్నిగతులఁ । జూచుచున్నాఁడు ని న్నాడఁ జూచెనేని
ఊఱకుండెడివాఁడు కా డొక్కనిన్నుఁ । గన్నదానను నను జూడుమన్నయిపుడు. ౪౬౬

తే.గీ. శశికళ నినుఁ వరించెనే సమయమిదియె । తనయ నీకిప్డు పెండ్లేల తనువునందు
బ్రాణములు నిల్చియుండెనా బలుసుకూరఁ । దినియయిన బ్రతుకగవచ్చు వినుము మనుము.

వ. అనిన విని సుదర్శనుండు. ౪౬౮

ఉ. రాచకులంబుగాదె నగరా ననుఁ గాంచి స్వయంవరంబు దాఁ
జూచుటకైన రాదనుచుఁ జూడుము నాదు మగంటిమిఁ భువిఁ
గోచనుగాను గన్నియనుగొం చరుదెంచెద లోకమాత నఁ
బ్రోచెదనంచుఁ గంకణము పూనెను నాకు జయంబు గల్గెడుఁ. ౪౬౯

ఉ. తల్లి భయంబుమానుము యుధాజితు నే నొక లెక్కజేయ నీ
యుల్లము చల్లఁగాఁ బగఱ నోర్చి సుబాహునికూతుఁ దెచ్చి నే
దల్లుఁడనౌదు ముద్దు వగలాడిని గోడలిఁ జేసికొమ్ము నేఁ
గల్లలుపల్క దేవి ననుఁ గాచు సదా కరుణార్ద్రచిత్తయై. ౪౭౦

చ. అని రథమెక్కి యేగునెడ నాత్మజుఁగాంచి మనోరమాఖ్య దీ
వన లొసగెఁ బదింపదిగ వారక కంటిరె యీ జగంబునఁ
జననినిఁబోలు చుట్టమును శక్తినిబోలిన దైవ మెందునుం
గనముకదా నిజప్రజ సుఖంబును గోరుచునుండు రెప్పుడుఁ. ౪౭౧

సీ. అగ్రమందును నిన్ను నంబిక రక్షించుఁ బార్వతి వెనుకఁ గాపాడుచుండు
విషమపథశ్రాంతి విడిపించు వారాహి దుర్గంబులందును దుర్గ బ్రోచు
గలహమందును నిన్నుఁ గాళిక యప్పరమేశ్వరి దేవి పాలించుచుండు
మండలంబున నిన్ను మాతంగి గనిపట్టు సత్స్వయంవరమున సౌమ్య మనుచు

తే.గీ. భూపమధ్యంబున భవాని పుష్టిఁజేయు । గిరుల గిరిరాట్కుమారిక యరయు నిన్ను
చత్వరంబులఁ జాముండ జాలిదలఁచు । కాననంబులఁ గామగ పూను గరుణ
విను వివాదంబులను వైష్ణవియు భరించు. ౪౮౨

క. అని దీవనలిచ్చియుఁ దా । మనమునఁ గంపిల్లి పుత్ర మానక యేనుఁ
నిను వెంబడించివచ్చెద । నిను నే నెడఁబాసి యొక్క నిమిషము నోర్వఁ. ౪౮౩

క. అని యాకెయు ధాత్రేయియుఁ । బనివడి రథముపయినెక్కి బ్రాహ్మణులొగి దీ
వన లొసఁగ బయలువెడలిరి । ఘనవారాణసికి శీఘ్రగమనమున నృపా. ౪౮౪

తే.గీ. కాశిఁ జేరి సుబాహుచేఁ గాంచి రర్హ । పూజనంబుల విడిదిని బోనకాంద్ర
సకల పరిచర్యలనుజేయ జాకి లేకి । నెల్ల సమకూర్చె వారి కుర్వీశుఁ డెలమి. ౪౮౫

క. తన దౌహిత్రునితోడను । ఘనుఁడు యుధాజిత్తు వచ్చె గర్వోద్ధతుఁ డా
తని రాక విని సుదర్శనుఁ । డనుమానములేక దేవి నర్చించె నొగిఁ. ౪౮౬

వ. మఱియు నచటికి శశికళాస్వయంవరంబునం జయంబు గాంక్షించి కరూషాధిపతియు మద్రభూపాలుండును సింధుదేశ పాలకుండును మహిష్మతీ భూవల్లభుండును బాంచాల దేశపతియుఁ గర్ణాట మహీవల్లభుండును జోళ ధరాకాంతుండును వైదర్భుండును మొదలగువా రిఱువదిమూ డక్షౌహిణుల సేనలతోఁ గాశికాపురంబు నిండంజేసి రదియుం గాక స్వయంవరదర్శన కుతూహలమానసులై వచ్చినవా రసంఖ్యాకులై పట్టణంబున నందంద విడిసి రంత నా రాజపుత్త్రిలలోఁ గొందఱు తమలో దాము వినోదార్థంబులగు సంభాషణంబుల నిట్లని చెప్పికొనం దొడంగిరి. ౪౮౭

తే.గీ. భయములేక సుదర్శన బాలుఁ డిచట । కరుగుదెంచినవాఁడు స్వయంవరమ్మ
నందు జయమందునో లేక యన్యులవలె నోరుదెఱచుక వింతఁ గన్గొన దలచియొ. ౪౮౮

తే.గీ. మ్రింగ మెదుకులేదు మీసాలరాయ సం । పంగినూనెయన్న భంగిదోచు
నడవిఁ గాయ లాకు లారగించెడి నిరు । పేద కాశిరాజు బిడ్డగోరె. ౪౮౯

క. ఏకాకియగుచు వచ్చెను । గాకుత్స్థుఁడు దల్లిఁగూడి కాల్బలమైనఁ
లేక రథమెక్కి యిచ్చటి । కేకారణమొక్కొ కన్నె యితనిం గనునే. ౪౯౦

క. ఎంతెంతలేసిరాజులు । పంతంబులతోడ నిందు వచ్చిరి సేనా
సంతతులతోడ వారల । నింతి వరింపక వరించునే యీ పేదఁ. ౪౯౧

ఉ. మాటలలోనఁ దాను నొక మాటయటంచు యుధాజి దంతలో
నేటికిఁ జూడుఁడీ కొమరు నేనకదా వధియించువాఁడ ము
మ్మాటికిఁ గన్నియం బరులమానినిఁ జేయుదునే కనుండు నా
ధాటి యెరుంగ రీరలు సుదర్శనుఁ డుండునె యెల్లి యిచ్చటఁ. ౪౯౨

చ. అన విని కేరళాధిపుఁడు హా । తగునా యిటులాడ బాలునిన్
హననమొనర్తు యుద్ధముననం చిది యట్టి స్వయంవరమ్ముకా
దని వినలేదె కన్య తన యాత్మను మెచ్చినవానిఁ గోరుటే
పని మఱియొండులేదు చలపట్టిన నేమి ప్రయోజనమ్మగున్. ౪౯౩

తే.గీ. కోసలాధిపుకొడుకు గాకుత్స్థుఁ డతఁడు । వాఁడు మనయందఱికి సాటివాఁడకాడె
న్యాయమునుమాని రాజ్యంబు బాయఁజేసి । మరలఁ జంపెదనందువా మదముకొలఁది. ౪౯౪

ఆ.వె. తప్పులేనివాని దండింతుననువాఁడు । నీతిమాలినట్టి నీచుఁడందు
దానిఫలము వాఁడు తప్పక బొందఁడే । దైవమొకటిలేదె ధర్మమరయ. ౪౯౫

క. ధర్మంబే జయమొందు న । ధర్మము జయమందదెందుఁ దలఁపఁగ సత్యం
బర్మిలి జయించు నన్నృతము । శర్మద మొన్నఁడునుగాదు జనవర వింటే. ౪౯౬

క. పాపమతివిడిచి బ్రతుకుము । నీపాటిడుకాఁడె వాఁడు నీచులకెందున్
కోపంబు గర్వము దయా । లోపము నాశాపిశాచ లోలత గుణముల్. ౪౯౭

క. నీకును దౌహిత్రుఁడయని । యాకొమరునిఁ జూడు మింక నతఁ డిటువచ్చెన్
నీకును సంతోషమకా । యాకన్నియ వానిభార్య నగుదు నటన్నన్. ౪౯౮

క. ఎందఱు వచ్చిరి భూపతు । లందఱిలోఁ గొఱఁతయేమి యతనికి వినుమా
యందమె లేదో క్షత్రియ । నందనుఁడే కాడొ చెప్పు నరలోకపతీ. ౪౯౯

క. ఒకవేళ కన్య వీనిన్ । బ్రకటించి వరించెనేని మనమానసముల్
వికలంబులు కానేలా । బెకబెకలాడంగనేల భేకములవలెన్. ౫౦౦

ఆ.వె. వధువు మనసువచ్చు వరుని వరించును । నీవు నేను గూడి నీల్గులాడ
నలుగు రవల నివల నవ్వుకొనుటకాక । ఫలములేదు విడుము పాపబుద్ధి. ౫౦౧

క. అను కేరళనాథుని నీ । తిని వినియును గనలి దుర్మతియగు యుధాజి
త్తను నోయి కేరళేశ్వర । విను నీనీతులివి పంద వినవలయుఁ జుమీ. ౫౦౨

క. మానవనాథులసభలో । నీనీతులు పనికిరావు నిజ మిటు వినుమా
మానితులగు నృపులుండం । గా నీచునిఁ గన్నెఁ గోరఁగా నర్హంబే. ౫౦౩

క. నీకే మనమునఁ దోచెన్ । గా కీ నీతివినువాఁడు కలఁడే సింగం
బాకటఁ గొనఁబోవునెఱన్ । గో కోయని కొంకనక్క కొనినట్లయగున్. ౫౦౪

క బలమగు వేదము ద్విజునకు । బలమగు సింగాణి మనుజపతులకు నా మా
టలలోన ధర్మ మణువుం । గలదే వినవేర్చువాఁడు గలఁడే విచటన్. ౫౦౫

క. బలముగలవాఁడె కన్నియ । బలిమిం గొనిపోవుగాక బలహీనులకుఀ
ఫలమేమి కుల్కు మీ నృప । కులమునకుఀ బలమెకాదె కుంభిని నెందుఀ. ౫౦౬

శా. రాజన్యుండు బణస్వయంవరము విభ్రాజద్గతిం బన్న కీ
యోజం బూనుట రాజధర్మమగునే యుద్ధమ్ము గావింప కే
రాజేగుం దన తొంటిదారిని వృథా ప్రాగల్భ్యము ల్మానుమీ
రాజై పుట్టుట వీరధర్మములు పోరం జూపఁగాదే నృపా. ౫౦౭

వ. ఇట్లు స్వయంవరంబుకై వచ్చిన రాజులలోఁ బరస్పరవివాదంబులు పుట్టెనని విని సుబాహుండు మంత్రిముఖంబుల నెల్లరాజుల సభామధ్యంబునకు రండని వర్తమానంబు పంపిన వారలందరు రచ్చకు విచ్చేసియున్న సమయంబున వారణాశీ విభుంగాంచి తత్త్వదర్శులగు కొందఱు, మానవేంద్రా! భవత్కుమారీరత్నంబు నెవ్వని కీఁదలంచితివి? నీయభిప్రాయంబు విన్నవింపుమనిన వారలంజూచి వినయపూర్వకంబుగా సుబాహుం డిట్లనియె. ౫౦౮

తే.గీ. తనయ మనమున నా సుదర్శను వరించె । నెంతఁజెప్పిన వినదు నాకేమిబుద్ధి
కన్యవశవర్తినియుఁగాదు కన్యకోరి । యున్న యాతఁడు దాని కర్హుండుకాడు. ౫౦౯

తే.గీ. అంత సంపన్న భూభుజు లతనిఁజేరఁ । బిల్చిన సుదర్శనుఁడు మతి భీతిలేక
శాంతి నేకాకియై వచ్చి సరసనిలువ । జనవరులు పల్కి రా సుదర్శనునితోడ. ౫౧౦

చ. పిలువని పేఱటంబనక భీతిల కీ విటువచ్చి తేరు నిఀ
బిలిచిరి యొంటివయ్యు భటబృందము లేక సహాయసంపదల్
వెలయక వచ్చి నీవు తలపెట్టినదెయ్యది సేయ భూపతు
ల్బలములతోడ వచ్చిరికదా రణరంగమునందుఁ బోరఁగఀ. ౫౧౧

ఉ. వచ్చెను నీదు భ్రాత బలవంతుఁడు పోరున గెల్చువాఁడయై
మెచ్చెలు నయ్యుధాజితు విశేషసహాయుఁడు వానిఁ జూచితే
వచ్చితిపో సరే మరలి వచ్చినదారిన పోవువాఁడవా
క్రచ్చుల నిచ్చట న్నిలచి వ్రాఁతకొలంది నటింపఁ జూతువా. ౫౧౨

వ. అనిన విని సుదర్శనుండు. ౫౧౩

చ. బలగము లేదు చుట్టములు పక్కములేరును లేరు భూపతు
ల్కలరు సహాయులంచుఁ బలుకఀ బనిలేదు ధనంబు లేశముఀ
దలఁపఁగరాదు కాశిపతినందని కిప్డు స్వయంవరమ్మటం
చలరుచు వచ్చినాఁడఁ దగనా పగనా తెగనాడనేటికిఀ. ౫౧౪

వ. అది యట్లుండనిండు. ౫౧౫

క. జగదీశ్వరి స్వప్నంబున । నగపడి ప్రేరేప నిచటి కరుదెంచితి నేఁ
దగ దేవికరుణ యుదయిం । పఁగ నవ్విన నాఁపచేలు పండకయున్నే. ౫౧౬

తే.గీ. కుడువఁబోయెడి కూర సౌం పడుగనేల । నేమి కానున్నదో చూత మిందఱమును
దేవి నాపాలఁ గల్గెనే వేవు రవని । పాలకులు వచ్చియును నన్నుఁ బట్టలేరు. ౫౧౭

క. దైవాధీనుఁడనై నే । నీ విధమున నున్నవాఁడ నేమైననుఁగా
నీ వచ్చునదియ వచ్చుఁ గా । బోవునదియ పోవు రిత్తఁబోవఁగ నొల్లఁ గా. ౫౧౮

వ. ఇట్లు చెప్పిన సుదర్శను మాటలు వినిన యజ్ఞులగు కొందరు అబ్బా! యిబ్బాలున కెంత నిబ్బరంబని యబ్బురంపడి యిట్లనిరి. ౫౧౯

తే.గీ. నీవు చెప్పినయదియసూ నిక్కువంబు । అయిన నుజ్జయినీనాథుఁ డదరి చంపఁ
గాచుకొనియున్నవాఁడు నీ కాపుగోరి । చెప్పితిమి యిచ్చవెంబడిఁ జేయు మవల. ౫౨౦

ఉ. సత్యము మీరు స్నేహమునఁ జక్కటిసెప్పుట యుక్తమేకదా
వ్యత్యయమేమియున్నదని యాడెద లోకమునందు మృత్యురా
హిత్యము నొందువారు కలరే యెపు డెవ్వనిచేత నెవ్వఁడే
కృత్యమున న్నశించు నది యెల్లను జేయును గాలకర్మముల్. ౫౨౧

క. సంచితమును బ్రారబ్ధం । బంచును నాగామియంచు నాత్మవిదులు దా
రెంచిరి త్రివిధముగా న । య్యంచిత కర్మమును మానవాధిపులారా. ౫౨౨

తే.గీ కాలకర్మస్వభావసంగతుల జగము । వితతమాయెను మానుషకృతము నడుఁప
దైవమేనియు నేరఁడు దానికొఱకు । నేర్పడిన కాల మది సంభవించుదనుక. ౫౨౩

క. పడె సింగముచే జనకుఁడు । మడిసె యుధాజిత్తుచేత మాతామహుఁడుఁ గా
వడిఁజచ్చు రక్షితుఁడు భువి । విడిసి యరక్షితుఁడు బ్రతుకు వేయేండ్లు దగఁ గా. ౫౨౪

సీ. పూర్వార్జితంబది పుణ్యమో పాపమో భోగింప కూఱకేపోదుసుండు
తాను జేసినదానిఁ దాన భోగింపుచు దుఃఖింప నందేమి దొరుకు వృథయ
తన కర్మఫలయోగమునఁ గీడువాటిల్లఁ బరులతో నల్పుండు పగవహించు
వైరంబు శోకంబు భయమే నెఱుంగక చనుదెంచినాఁడ నిశ్శంకమతిని

తే.గీ. నాకు భయమేమి యిప్పు డేకాకిననుచు । నెందఱెందరు పలుగాకు లిందు మాల
కాకులై యవివేకులై కడకుఁ గాంది । శీకు లయ్యెదరో దేవిచేత బిదప. ౫౨౫

తే.గీ. ఆ యుధాజిత్తుపై నాకు నలుకలేదు । చెలఁగి నామీద నయ్యుధాజిత్తునకును
నలుకయేటికి నూఱకే కలిగెనేని । ఫలమనుభవింప కంతంతఁ బారఁదరమె. ౫౨౬

క. అని యిట్లు బాలుఁ డాడిన । విని రాజులు సంతసించి విడుదులకుం బో
యిన మరునా డందఱకుఁ । జనపతి శుభవార్తలంపఁ జనుదెంచి రొగిన్. ౨౨౪

సీ. భేరీపటహకాహళారావములు దిశాసమదేభకర్ణరంధ్రములఁ గలఁప
నకలంకమణివితర్దికలపైఁ జిత్రాసనముల రంగులు లోచనములఁ దనుప
మనుజేంద్ర ధృతపుష్పమాలికాగంధ మంతఃపురనాసాగ్రతతులఁ దూర
క్రముముక్తాఫలా కరకాయమానంబు లెల్లవారి యొడళ్లఁ జల్లఁ జేయ
తే.గీ. సరసతరసుఫలాహార సమితి నొంపు । మీఱి తత్రత్యజనజిహ్వ లూఱఁజేయ
నదరి నిఖిలేంద్రియముల కాహ్లాదమొసఁగెనౌ సుబాహునిసభ యా స్వయంవరమున. ౨౨౫

సీ. పద్మరాగవిదూర భవజ ఛటాచ్ఛటా విలసత్కిరీటము ల్తలలఁదాల్చి
తప్తకాంచన ధగద్ధగితాంగదాది భూషాస్తోమము లొడళ్ళ సరిది సరిది
బంగారు సరిగెల పట్టంచు దోవతుల్ చెంగులు జీరుకాడంగఁ గట్టి
కచ్చోరములఁ గాచి కమ్మ సంపఁగి నూనె సవరఁగా రాచి మీసాలు దువ్వి
తే.గీ. మోములందెల్ల నెలనవ్వు మొలకలొలయ । నించుకించుకఁ జేతు లాడించుకొనుచు
చూచియును జూడనట్లుగాఁ జూచుకొనుచు । మనుజపతి సభ కా రాచమంద చనియె. ౨౨౯

క. చని యర్హాసనములపై । ననువుగఁ గూర్చుండి యెప్పు డా కన్నియ వ
చ్చునో యెపుడు వచ్చునో యనుచును నువ్విళులూరు చెదురుసూచుచునుండన్. ౨౩౦

సీ. సరిగకినేరా పసందుగా మీఁగాళ్ళఁ జీఱాడ నునుఁబట్టుచీరె గట్టి
బారి బనారసు పచ్చాకుడా ల్బుటేదారీల పైఠిణీఁ దగ ధరించి
చిన్నారి రవబిళ్ళ చేమంతిపూవు రంగులుగుల్క జడఁజుట్టి కొప్పువెట్టి
కురువిందమణిదీప్తిఁ గుందనంపు పనిం గులాయించు ముక్కుబులాకిఁ బెట్టి
తే.గీ. గుండ్లకంటెయు మిరియాలగుండ్లు చంద్ర । హారమును ముఱుఁగులు మొదలైన నగల
లంకరించుక శశికళ యల్ల నగుచు । నడ జడిమదోపఁ దాఁ దంద్రికడకు వచ్చె. ౨౩౧
తే.గీ. వచ్చి నిలచిన తన కూతు వదన మట్టె కాంచి యలరుచు నాతల్లి కాన నీ స్వ
యంవరమ్మది చూచితే యమితతేజు । లైన రాజులు వచ్చి రత్యాదరమున. ౨౩౨
క. కొనుమీ మధూకమాలికఁ । జనుమీ రాజన్యపంక్తి సరసకు సరిగాఁ
గనుమీ యుత్తము నొక్కనిఁ । గొనుమీ యాదంద వాని కుత్తుక నిడుమీ. ౨౩౩
క. అని పలికి యూరకుండిన । జనకునిమాటలను విని నిశాకరముఖి దా
ననువునఁ జనువున నా దొక । మనవనుచున్ వినయ నయగమ్యంబుగఁ బల్కెన్. ౨౩౪

క. నాతండ్రి యేను భూప । వ్రాతంబుల దృష్టియెదుట బడనొల్లను వా
రాతత కాముకతా సము । పేతులు పరకీయ కులటలే చూడఁదగుఁగా. ౫౩౫

క. పలుకుదురు మిమ్ముఁబోలిన । యలఘుమతులు కులవధూటి కధిపుఁ డొకఁడె య
న్యులఁ జూచెనేనిఁ బుణ్యము । తొలఁగుఁగా మగనాలితనము దూలు నటంచుఁగా. ౫౩౬

క. బాజారులందుఁ దిరుగుచు । నా జారులకడకు నేగి యందఱికిని నె
మ్మైఁ జారుతఁ జూపుకొనుచు । బేజారై తుదకుఁ జెడెడి వేశ్యనె చెపుమా. ౫౩౭

క. కులవృద్ధులాచరించిన । యలఘుపథంబిదియయైన నది నే నొల్లఁగా
నలలిత పతివ్రతమే । నలిపెదఁగా కిందు నందు సౌఖ్యము గలుగఁగా. ౫౩౮

క. జోడొక సుదర్శనుఁడె నీ । తోడుసుమా పరుఁడు దొడ్డదొరయైనను మా
టాడను జూడను గూడను । వేడననుచు మున్నె యొట్టుబెట్టితిఁ దండ్రీ. ౫౩౯

తే గీ. తడ వికేటికిఁ జేసెదు తండ్రి మంచి । లగ్నమున నిమ్ము నీవు నన్నగ్నిసాక్షి
కంబుగాఁ బెండ్లియాడంగఁ గడఁగి యిందు । జేరెడు సుదర్శనుండను చిన్నవాడు. ౫౪౦

ఉ. అంచు వచించు కూతు పలుకా నృపచంద్రముఁ డాలకించి యో
మంచిది దీనిమాట యనుమాన మొకింతయు లేదుగాని నా
సంచిత మెట్టులున్నదొకొ సర్వనృపాలురు వచ్చియుండి రీ
మంచెలమీద నేమనుచుఁ బంపెద వీరలు కోపగింతురో. ౫౪౧

ఉ. సేనలు మెండులేవు పరసేనలు లక్షలు కోటులంచునుం
బూని గణింపరా దిపుడు భూపతులందరు చుట్టుముట్టినఁగా
దీనుగుబెంటఁయొఁ బురము పెండిలి యెట్లగు నేమిసేయుదుఁగా
దాను నిరర్థకుండగు సుదర్శనుఁ డొంటరి యేమిచేసెడిన్. ౫౪౨

వ. అని మనంబునం గొండొకదడవు చింతించి నృపసభామధ్యంబు ప్రవేశించి చేతులుజోడించి
ఫాలప్రదేశంబున నిడికొని సవినయుండై దీనాననుండై యిట్లనియె. ౫౪౩

సీ. ఏమిసేయుదు ధరాధీశులార కృపారసాంభోధి నను ముంచుఁ డయ్యలార
చెప్పించితినిఁ దల్లిచేతను నేనును చెవిసిల్లుగట్టుక చెప్పినాడ
నెన్నిఁజెప్పిన విన దీ కన్య యా సుదర్శను వరియించితి ననుచుఁకాని
పాదాంబుజంబుల పైబడి మ్రొక్కెదఁ గొమరైన మకుటంబు గోళ్ళకంట

తే.గీ. మీకు దాసానుదాసుండ మిమ్ము వస్తు । గజ తురగ రత్నచయములఁ గాన్కలిచ్చి
పూజగావింతు భయభక్తిపూర్వకముగ । వొందు నాయనలార మీ భూములకును. ౫౪౪

క. నాకూతురుగాదిదిసుడి । మీకూతురుగాఁగఁ దలచి మృదుహృదయులరై
యీకన్నియపై గోపము । లేక చనుడు నేను భయములేక నటింతుఁన్. ౫౪౫

వ. అనిన విని గొందరు మహీపాలు రేమియుం బలుకక యూరకున్నం గన్నులు చింత
కొలవులు చేసికొని తటుకున మంచంబునుండి లేచి నిప్పులు ద్రొక్కిన క్రోఁతివలెఁ
గంపిల్లుచు యుధాజిత్తు బిగ్గన నిట్లనియె. ౫౪౬

శా. ఓరీ రాజకులాధమా తగునె నీ కుర్వీశలోకంబు నా
నారాజ్యంబులు బాసి వచ్చి రిటకున్ గన్యావివాహార్థులై
వీరెల్లన్ సభదీరి కన్యకొఱకై వీక్షింపఁ గన్నీళ్లమైఁ
బారన్ మ్రొక్కుచు నక్కసైచ్యములు సూపన్ వచ్చి తీపట్టునన్. ౫౪౭

క. చేతనయినట్లు తానును । మాతయుఁ జెప్పిరట యెన్నిమాటలకైనన్
గూతురు విన్నదికాదట । యీతరి మ మ్మారక కంపు నితఁడట యహహా. ౫౪౮

క. మొదల నెటుల నీకూతురి । మది దెలియగ నడుగ కిట్లు మమ్ములనెల్లన్
గదలించితి పనిపాటులు । వదలుక వచ్చితిమి కదలువారమె వృధగాన్. ౫౪౯

క. పోనిమ్ము దానికేమి య । యో నరపతిఁ గరుణఁజూచు టొప్పుననిన ని
మ్మానిని సుదర్శనాఖ్యున । కే నిచ్చెదననుచుఁ బల్కెదే పాపాత్మా. ౫౫౦

క. కానిమ్ము చూడు నీపని । యే నిన్ను న్మొదల నీల్గ నేసెద మఱి పం
తాన సుదర్శను గూల్చి య । నూనత నా మనుమనికిని యువతి న్గూర్తున్. ౫౫౧

క. ఏనుండఁగ నాయెదుటన్ । నేనని యెదిరించువాఁడు నేలంగలఁడే
కోనుక్వాస్తేమమతుస । మానోయని చాటు వీరమాన్యుఁడగానే. ౫౫౨

తే.గీ. ఈ సుదర్శను డెంత నా యెదుట నల్ల । చీమయో దోమయో వీడు చెడెడికాల
మిప్పు డాసన్నమైనది ముప్పు మున్ను । తప్పినది యాశ్రమమునందుఁ దపసులకృప.

క. కోచవయి బుద్ధిదెలియక । నీదాశ్రయమేల కోర నీకు మనమునన్
దోచదె మహదాశ్రయమున్ । ధీచతురుఁడు గోరుననుచు స్థిరచిత్తుండై. ౫౫౪

ఉ. మాటలువేయునేల జనమాన్యుఁడు నా మనుమండు వీనికిన్
బోటిని బెండ్లిసేసి సువిభూతిని నెయ్యము వియ్యమందుమీ
యేటికి నీ సుదర్శనున కిచ్చెద వీతని కిల్లొ వాకిలో
కోటలొ పేటలో ధనమొ గొంతునుగోసెదవేల చూచుచున్. ౫౫౫

ఆ.వె. రాచవారిలోని యాచారమెంచితే । మండపమ్మునకును మగువదెమ్ము
ధాని యిచ్చవచ్చు వానిన వరియించుఁ । ద్యాబ్యాఁ దొక్కఁ దా సుదర్శనుండు. ౫౫౬

ఆ.వె. నాకు హితుఁడవగుట నీకు క్షేమముగాన । ద్యాజ్యుఁడయ్యె నా సుదర్శనుండు
భాగ్యవంతులైన పరులలోఁ గోరిన । నాకు సమ్మతంబు నరవరేణ్య. ౫౫౭

క. అలాగునఁ గాకుండిన । బాలామణి నిపుడ బలిమిఁ బట్టెద నతితో
నాలోచింపుము పొమ్మిక । నాలస్యంబేల యనిన నతఁడు గుములుచుణా. ౫౫౮

తే.గీ. చని నిజాంగన కది చెప్పి చాన నీవు । మందలించుము శశికళ నెందు కిట్టి
గొదవపాట్లేసెదవు నీవు విడువు మీ సు । దర్శనునిమీది వలపని తగినరీతి. ౫౫౯

క. అది విని నరపాలునిసతి । యెదఁ గుందుచుఁ గూతుకడకు నేగి యయో నీ
మదిని సుదర్శనుపై తమి । వదలుము లేకున్న లోకవైరము పొసగుణా. ౫౬౦

తే.గీ. నీవు కారణమైతివి నిఖిలరాజ । లోకవైరమ్మునకు నాత్మలోన మిగులఁ
గుములుచున్నాఁడు నీతండ్రి కూఁతురా సు । దర్శనుం డెట్టులాయె సుదర్శనుండు. ౫౬౧

చ. విడువుము వానిపై వలపు వీరుఁడుగాఁడె యుధాజి తెంతయుం
గుడువఁగ విచ్చునే కుదిరి కూడిక నయ్యయొ యా సుదర్శనుం
బొడువకయున్నె యప్పు డెటుబోయెదు నీవు ద్వితీయు గోర కె
ట్లుడిగెదు చెప్పుమా నృపతి నుత్తము నింకొకనిణా వరింపుమీ. ౫౬౨

వ. అని యట్లు తల్లియుం బలువిధంబులం జెప్పిన వినక నిరాకరించినణా పై దర్పి భర్త కది చెప్పి యిరువురును వచ్చి నానాగతుల దీనత్వంబుదోప మందలించిన విని య య్యేలనాగ వారి కిట్లనియె. ౫౬౩

తే.గీ. తథ్యములు నీదుమాటలు తండ్రి వినుము । కాని నేను సుదర్శనుఁగాని యితర
రాజుఁ గనుగొననని యొక్క వ్రతము పట్టి । యున్నదాననకాక వేరొండు లేదు. ౫౬౪

తే.గీ. నృపతిమండలమును జూచి నీకు భయము । దోచెనేనియు నేయు మాలోచనంబు
నేను చెప్పినత్రోవ నదేమియనిన । నిప్పుడు సుదర్శనునకు నన్నిచ్చి యూరు
బయల కంపుము మీద దైవంబె కలదు. ౫౬౫

వ. అనిన విని చింతాక్రాంతచేతస్కుండై యొక్కింతదడవు బాష్పంబులు విడిచి యయ్యో యెంత మూర్ఖురా లీబాల యని నిట్టూర్పు నిగుడించి యెట్టకేలకుం దనపట్టి గెడ్డంబు పట్టుకొని యిట్లనియె. ౫౬౬

క. తెగదెంపులు పేయంగాఁ । దగదమ్మా జగము పగ యిదిగదమ్మా బా
దగదమ్మా మమ్మల పా । దఁగదమ్మా యింత మొఱయుదనమేమమ్మా. ౫౬౭

తే.గీ. జనకజననాయకుడు దొల్లి జానకీ స్వ । యంవరమ్ముఁ గావించె నట్ల యేను
వనితకుఁ బణస్వయంవరమ్మని తెలిపెద । నందుకొను నిన్ను బలవంతు డందుఁ గెలచి.

తే.గీ. అప్పుడు సుదర్శనుఁడు దా నధికబలుఁడ । యేనిఁ గెల్చును వాఁడె నీ కేలికయగు
నృపతుల వివాదములు దీరు నేను సకల । విధముల సుఖింతు నిది నీవు వినుము తల్లి.

వ. అనిన విని కన్య యిట్లనియె. ౫౪౦

తే.గీ. నేను జేసిన తప్పేమి మానవేంద్ర । మనసున సుదర్శనుని మున్నె మగనిఁజేసి
యుంటి బుణ్యంబొ పాపంబొ యుల్లమెరుగు । నొక లొకటి గోరునే యుల్ల మొకటి గోర.

తే.గీ. నాయనా యట్లకాని పణస్వయంవ । రమున నల్గురు వీరులు సమబలులయి
నప్పు డా నల్వురునిఁ గోరనా మరందు । నెవ్వరిని వరించెదను దెల్పుమీ నరేంద్ర. ౫౪౨

తే.గీ. ఏల వగచెదు వేగ నన్నిచ్చి యా సు । దర్శనునకు వివాహంబు దగనొనర్చ
మాదిశక్తి దయామయి యన్నియెడల । నిన్నుఁ గాపాడు నిది నమ్ము నిక్కువముగ.

క. దేవినిఁ దలచుము ముం దా । భూవరులనుఁ జూచి చెప్పుము కృతాంజలివై
వేవేగ రేపు రండని । వారిరి వా రేగుదురు నివాసంబులకున్. ౫౪౪

క. మోదమ్మున నీరాతిరి । వేదోక్తముగా వివాహవిధి నడుపుము మ
మ్మాదట విడువుము బోయెద । మేదరికో పారిబర్హ మిమ్ము కడువడిన్. ౫౪౫

ఉ. అంతయు నైనమీదట ధరాధిపు లెందరు గూడివచ్చినం
బంతముతోడఁ బోరినను బాకులు దూసిన నేమి చేసినన్
వంత యొకింతఁ జెందకుము వారలనెల్ల వధించు దేవి నా
కాంతు దొకండె చాలుఁ గడఁకన్ బదికోటులఁ గూలనేయఁగన్. ౫౪౬

తే.గీ. ఈవు సుఖముననుండు మింతేల చింత । యనిన సుతమాటలను విని యవనినాథు
డట్లకావింతునని లేచి యందరికిని । రేపు రండన నేగిరి నృపతులెల్ల. ౫౪౭

వ. అంత సుబాహుండు తన పురోహితుల నార్యవర్గంబులం బిల్పించి వివాహముహూర్తంబు సమీపించుటయుం దన కుమారికం బిల్పించి రహస్యంబుగా మంగళస్నాన నానావిధాలంకారంబులం గై సేసియున్న కన్నియం గళ్యాణవేదికకు రప్పించి సుదర్శనుని యథావిధి నర్చించి వస్త్రాలంకారంబు లిచ్చి కన్యా దానంబు చేసిన నతం డత్యానంద నిమగ్నుండై గ్రహించె. నంత విధ్యుక్తక్రమంబున స్థాలీపాక లాజహోమాదికంబులు నెరపి హుతాశన ప్రదక్షిణం బాచరింపఁజేసి కులాచారమార్గంబు దప్పక వేడుకలన్నియుఁ జరపి గుఱ్ఱంబులతోడ రెండు మాఱులు రథంబులను బారిబర్హంబుగా నొసంగె మరియు నూటయిరు

వదియైదు మదపుటేనుగులను నూఱు కరేణుకలను నూఱుగురు దాసీజనంబులను
వేగురు దాసులను అమితంబులగు రత్నంబులను వస్త్రంబులను రెండువేల సైంధవంబు
లను మూడువేల క్రమేళకంబులను రెండునూఱుల యుత్తమశకటంబులను నిచ్చి
సుదర్శనుమాత యగు మనోరమం గాంచి నీయిష్టం బేమి యని యడిగిన మనోరమ సుబా
హునిం జూచి యిట్లనియె. ౫౪౮

తే.గీ. స్వస్తి నీ కగుఁగాత నో జనవరేణ్య । పద్మరాగంబువంటి నీ పడుచు నిచ్చి
నన్ను మన్నించితివి యింతకన్న నాకు । నెక్కుడేమి పసిడికొండ నెక్కితిఁగద. ౫౪౯

తే.గీ. భ్రష్టరాజ్యుండు కాననవాసి తండ్రి । లేనివాఁడును నిర్ధనుండైనవాఁడు
ననక యిచ్చితి గూతురి నఖిలరాజ । కోటి విడనాడి నాకింకఁ గొఱతగలదె. ౫౫౦

చ. పొగడదరంబె నీదు గుణపుంజము దుర్దములైన భూపతుల్
పగఁగొని పైబడం దుమికి వచ్చెదమంచు వచింపుచుండఁగా
సొగసులమూట నాత్మజను జోగివలెన్ వనభూములందు నొం
టిగ విహరించుఁ బేదకు ఘటించితి బెండిలి మానవేశ్వరా. ౫౫౧

తే.గీ. అనిన విని సంతసంపడి జనవిభుండు । కేలుమోడ్చి పలికె నాకు మేలుగాదె
నీకు వియ్యంకుడను నైతి నేను నాదు । రాజ్యమంతయు నీ కుమారకుని సొత్తు. ౫౫౨

తే.గీ. అట్లుగాకున్న నారాజ్యమందు సగము । గొని కొడుకుతోడ నది యేలుకొనుము నృపులు
వైరమున వచ్చిరేనియు వారిమొదల । సాంత్వనంబులఁ బ్రార్థించి చక్కబఱుతు. ౫౫౩

క. అట్టులఁ గాకుండిన నేఁ । గట్టిగ నెదిరించి పోరఁగలను జయం బీ
పట్టునఁ గల్గినఁ గల్గును । నెట్టన ధర్మంబు గెలువనేరకయున్నె. ౫౫౪

క. తనకు హితమైన వాక్యము । మనుజవిభుఁడు పలుక విని సమంచిత ధిషణా
సుమహితుఁడ వీవు నీరాజ్యము నీవే యేలుకొమ్ము సౌఖ్యమువొదలన్. ౫౫౫

శా. సాకేతాఖ్యపురంబుఁ జేరి విలసత్సామ్రాజ్యముం బొంది య
స్తోకప్రాభవుఁడౌ సుదర్శనుఁడు దా దోశ్శక్తిఁ గొన్నాళ్ళకున్
నీకుం జింతిలఁ గారణంబు గలదే నిక్కంబు శ్రీదేవి దా
మాకుం దోడగు నమ్ముమీ నృపతి సమ్మర్దంబు దీరున్ వెసన్. ౫౫౬

వ. ఇట్లా వియ్యపురాలును వియ్యంకుడును బరస్పర సంతోషవచనంబుల నాతేఱు గడపి
రంత నగరబాహ్యంబున నుండి రాజతండంబులు గుంపులుగూడి యొండొరులతో నోయీ

వింటివా యీరేయి శశికళావివాహంబు యథావిధి బరిపూర్తింజెందెనట, మన మేమిచేయుద మింతయన్యాయం బీరాజునకు గూడదనువారును, కన్య సుదర్శనువరించి నేవితరులఁజూడనని పట్టుపట్టిన నతం దేమియు సేయనేరక యిట్లు గావించెనని కొందరును బలుకుచుండ నప్పుడు వారణాశీవిభుండు తన సుహృదులతో రాజవర్గంబు నిమంత్రింపుఁడని పంపినం గాంచి భూపాలురలో నొక్కరుండైన మాటాడక మౌనంబు పూనియుండ రాజు తనంతఁ దా బయలువెడలి మనుజపతి సంఘంబులకు నమస్కరించి చేతులు జోడించుకొని నిలువంబడి యిట్లనియె. ౫౭౮

క. నాయింటికి భోజనమున । కీ యవనీనాథ బృంద మెల్లసురండీ
రేయిం బెండిలి యాయెను । నా యాత్మజ గట్టిపట్టునంజేసిచుడీ. ౫౭౯

ఉ. మీరు దయాళువుల్ మనసు మెత్తనజేయుడు మీకు మ్రొక్కెదన్
నా రుషబూని యద్ధరణినాథులు మేము భుజించినార మె
వ్వారిటవచ్చువారు పిలువంబనియేమి స్వపట్టణంబులన్
జేరెదరంచు బల్క విని శీఘ్రము యింటికిఁ బోయె శంకతోన్. ౫౮౦

ఉ. అతఁడు వోవఁగానె విపులాధిపు లాత్మల నీర్ష్య యెంతయున్
గోతలు గోయ నీ నృపునిఁ గొట్టి సుదర్శను నేసి ప్రీతితో
నాతిని బల్మిఁ గొందమనినన్ విని కొందరు కాదు కూడ దీ
పాతకమేల కౌతుకము బాగుగఁజూచి చనంగ నొప్పదే. ౫౮౧

క. అని యిట్లొండొరు దమ తమ । మనములకున్ దోఁచినట్లు మాటలలోనన్
మునిగి సకల భూపావళి । యును మార్గములాక్రమించియుండిరి పెలుచన్. ౫౮౨

వ. అంత సుబాహుండు శశికళావివాహంబు సర్వంబునుం బరిసమాప్తంబు గావించి మంత్రి పురోహితాది హితవర్గంబుల యెదుట పారిబర్హంబు సమర్పించియున్న సమయంబున.

ఉ. దూతలవల్ల నప్పరమ దుష్టమతుల్ ధరణీపతుల్ పథ
వ్రాతము నడ్డకట్టి నిలువంబడిరంచు జెవింబడంగ న
త్యాతత భీతితో విమనుఁడై నృపుఁ డుండ సుదర్శనుండు మా
మా తడవేలఁ బంపుము మదాశ్రమవాటికి మమ్ము వేగమే. ౫౮౩

చ. అదియునుఁగాక నాదట విజార్థజయంబున కే యుపాయమో
మది బరికించి చేయఁదగు మానుము నీమది నిమ్మహీపతుల్
కదసిరటంచు నెవ్వగ జగజ్జనయిత్రియె విన్ను నమ్మనున్
వదలక బ్రోచు విక్రముగ నమ్ముమనంగ నతండు సమ్మతిన్. ౫౮౪

ఉ. లగ్గని పీడుకొల్ప నబలాయుతుఁడై రథమెక్కి పోవుచో
నెగ్గుదలంచియున్న నృపులెల్ల రెదిర్చిన నిర్భయాత్ముఁడై
తగ్గక డెందమందు జగదండవిధాత్రిఁ దలంచి భక్తిస
మ్యగ్గరిమంబునం గొనె మహామనురాజము కామబీజమున్. ౫౯౫

ఉ. పూచిన మాధవీలతికఁ బొందిన తిన్నని పొన్నగున్ననాఁ
దోచుచుఁ బెండ్లికూతుఁ దన తోడయియుండ రథంబుమీది యా
రాచవలంతిఁ జూచి యదిరా యిపుడే సమయంబటంచు న
నీ్చులు గుంపుగుంపులయి నిండిరి చుట్టును ముట్టి దిట్టలై. ౫౯౬

క. ఆ కోలాహలములు విని । తేకువఁ గాశీవిభుండు ధృతి నిలువబడెన్
రాకొమరుని బాసటయై । భూకాంతులఁ బారఁదరిమి పోయెద ననుచున్. ౫౯౭

వ. అదిచూచి సుదర్శనుండు. ౫౯౮

తే.గీ. అంతశ్రమ మీకునేల వల్దయ్య మామ । యేను జాలనె శత్రుల నీల్గజేయ
ననిన నాతండు ప్రక్కనే యరదమునను । నిలచి చూచుచునుండె నిర్నిద్రుడగుచు. ౫౯౯

క. ఇరుప్రక్కల సైన్యంబుల । దరచుగ దుందుభులు బెట్టిదంబుగ మొరసెన్
వరభేరీకాహళ శం । ఖరవంబుల్ పెల్లుమ్రోగెఁ గదనోన్ముఖతన్. ౬౦౦

ఉ. అంత యుధాజిదాఖ్యుఁడు సహాయుఁడుగాఁ దనయొద్దఁ దా రథా
భ్యంతరమందునుండగ ననాకులచిత్తత శత్రుజిత్తు నీ
వింతభయంబులేక తరళేక్షణతోఁ జనఁజూచె దౌర నీ
యంతిదె యెందుఁబోయెద వటంచు సుదర్శనుమీద మార్కొనెన్. ౬౦౧

తే.గీ. శరపరంపర నొక్కరొక్కరు గడంగి । మచ్చరంబున బోరిరి మానవేంద్రు
లెల్లజూడంగ నద్భుతాహీనశస్త్ర । శాస్త్రకౌశలి యొప్పార జంకులేక. ౬౦౨

వ. అప్పుడు, ౬౦౩

సీ. మందారతరు పుష్పమాలికల్ ధరియించి వివిధభూషల నంగవితతిఁ దాల్చి
క్రూరనారాచవిస్ఫారనానాయుధ చాపాది సాధనసమితిఁ బూని
లలిత దివ్యాంబరాలంకృతయై మించి యుద్యత్పరీధాన మొప్ప గప్పి
మణిగణాంచితమైన మకుటంబు తలఁబెట్టి తతలీల వీరగంధంబు పూసి

తే.గీ. ప్రౌఢయయి సింహవాహనారూఢ యగుచు । భద్రనిర్నిద్రరౌద్రనముద్రమనగ
నొకప్రక్కను గరుణారసోదధియన నొక్కయెడఁ దోప దేవి దానొప్పె నపుడు. ౬౦౪

క. ఈగతి వచ్చిన దేవిం । బాగుగ గని విస్మయంబు పడి యెవ్వతె యీ
లాగున నున్నది సింగము । పై గూరుచున్నయది యేమిపనియో యనుచున్. ౬౦౫

వ. అట్లు వచ్చిన దేవిం గాంచి సుదర్శనుండు సుబాహున కిట్లని వచియింపందొడంగె. ౬౦౬

ఉ. చూడుము మామ దేవి దయచొప్పడ దర్శనమిచ్చె నిప్డు న
న్నోడకుమంచు దెల్పుటక యుద్ధితయయ్యె భయంబులేక యు
న్నాడనటంచుఁ దెల్పి కడు నమ్రత దాను సుబాహుడున్ దయన్
వేడుచు మ్రొక్కి నిల్వఁ బరవీరులు కంపిల సింహ మార్చినన్. ౬౦౭

చ. రిపుగజబృందముల్ భయము ప్రేగయి కంపిలి కూలఁజొచ్చె స
త్రపులయి రాజలోకము వితాకున గిందురుపోయి నిల్చె ని
శ్చపలత నా సుదర్శనుఁడు సైన్యపతిం గని నీవు సేనతో
నృపులనుఁ జుట్టుముట్టి తగ నిల్వుము భీతి యొకింత లేదిఁకన్. ౬౦౮

తే.గీ. ఏమిసేయుదు రీ రాజు లెంతవారు । రక్షణార్థంబ దేవి ప్రత్యక్షయయ్యెఁ
దడవుసేయకు మిఁక నిరాతంకవృత్తి । ననినఁ బడవాలు వినుఁచు దా నట్ల చేసె. ౬౦౯

తే.గీ. అంతట యుధాజి తెంతయు నాత్మనలిగి । రాజబృందంబు గనుఁగొని రాజులార
యాజు లెరుగరో మీరు నిస్తేజులొక్కొ । గాజు లేటికిఁదొడగరు కరములందు. ౬౧౦

ఆ.వె. పిల్లదొక్కరుండు భీతి లేశములేక । జెల్లియున్న నన్నుఁ జెనకువాఁడు
కిల్లయంచు నడరి కన్యకఁ గైకొని । మెల్లఁ బోవ సిగ్గు మీకు లేదె. ౬౧౧

తే.గీ. దెయ్యమొక్కటి యుద్ధంబు దేరిచూడ । వచ్చినంతనె భయమందువాడు మగఁడె
పట్టుడీ కన్యమ్రుచ్చును గొట్టుడింక । నక్క సింగంబునెదుటను నిక్కె మనునె. ౬౧౨

వ. అనుచు నత్యంత క్రోధావేశమానసుండై యుధాజిత్తు శత్రుజిత్సహితుండై ధనువార్షించి
సుదర్శనుపై బుంఖానుపుంఖంబులుగా ఘోరనారాచపరంపరలు గురియించ నతం డలిగి
నిజధనుర్విద్యాకౌశలంబు నెరపి వాని నన్నింటి నడుమనె తుత్తుమురై ధరం గూలనేసి
యేచి యార్చి శంఖనాదంబుపట్టి నిలచె నింతలోన. ౬౧౩

చ. భువనములన్నియుం దనదు పొట్టనె కాంచినతల్లి దుష్టమా
నవులకు శిక్ష యీఁదలచి నమ్మినవారలు సంతసింప ను
ద్దవిడిఁ దనంతఁ దానయి యుధాజితు శత్రుజితున్ వధించి సాం
కవ మదగంధలిప్తకర కాంతి దలిర్పఁగ నొక్కతూపునన్. ౬౧౪

ఉ. అంత హతావశిష్టనృపు లట్టిటు బెగ్గిలి పారి రప్డు దా
నెంతప్రమోదమందెనొ వచింపఁ దరంబె సుబాహుఁ డంత దు
ర్దాంతత నిర్భయుండయి సుదర్శను డుండెను బెండ్లికూతు ర
త్యంత ముదంబునన్ వికసితాననయై చెలరేగెఁజూ నృపా. ౬౧

వ. సుబాహుండు చేతులు జోడించి ఫాలతలంబున నిడికొని. ౬౨

వినోదినీవృత్తము. జయజయ విష్టపజాలవినోదిని జయజయ సద్గుణచారుఖనీ
జయజయ దుర్మదజంతువినాశిని జయజయ సేవకసౌరవనీ
జయజయ ధర్మవిచారణశాలిని జయజయ సారసజాండజనీ
జయజయ దుష్కృత శాంతివిధాయిని సత్వరజస్తమసాం జననీ. ౬౩

క. దుర్గే ఘోషిత తాపస । వర్గే మాం పాహి పాహి భక్తజనేభ్యో
నర్గళకృపయా దత్త । స్వర్గే కృతసకలలోకసమ్యక్సర్గే. ౬౪

వ. అని మరియు. ౬౫

సీ. వాగ్దేవతవు నీవు వారాహి వీవు వైష్ణవి వీవు సచ్చిదానంద వీవు
ధృతి వీవు గతి వీవు మతి వీవు కృతి వీవు శ్రుతివీవు సుగుణసంతతివి వీవు
బ్రహ్మయు విష్ణుండు భవుఁడు సమస్తదేవతలు నిన్ బొగడికా బ్రతుకుచుంద్రు
నీ గుణంబులనెన్న నేరకయుండిరి వారలే నే నెంతవాఁడ దల్లి

తే.గీ. యల్లుఁ డీతఁడుగాబట్టి యఖిలమాత । పైన నీ దర్శనంబు నా కాయెఁగాక
కలఁగునే వేయివర్షముల్ ఘనతపంబు । జేసినను నాదు పుణ్యంబుఁ జెప్ప దరమె. ౭౦

క. ఎక్కడ మందమతిని నే । నెక్కడ లోకైకమాత వీగతి నెదుట
న్నెక్కొనఁగ దయాపూరిత । దృక్కమనీయవయి నిలచితివి మాతల్లీ. ౭౧

శా. అమ్మా నీదయ యీ సుదర్శనునిపై నత్యంతమైయుండఁగాఁ
జూమ్మీ యీ రిపుకోటి రూపడగె నిచ్చోటం జయశ్రీలతో
సమ్మోదమ్మున నేము నిల్చితిమి నీ సామర్థ్యమేకాదె యా
బమ్మన్ వెన్నుని మూడుకన్నులదొరన్ పల్మారు రక్షించెడిన్. ౭౨

తే.గీ. ఇట్టి నిన్నుఁ గనుంగొంటి నెంతవాడ । నైతి నాభాగ్య మేమందు నఖిలవాంఛి
తార్థములు దీరెనమ్మ మా యమ్మ నీ ప । దాంబుజంబుల దాసానుదాసుడజుమి. ౭౩

వ. అనిన సుబాహుని స్తవంబునకు మెచ్చి భగవతి ప్రసన్న వదనయై వరంబు వేడుమని
సంతసించి పలికిన యతం డిట్లనియె. ౭౪

క. సురరాజ్యము నరరాజ్యము । పరువడి నొకదెసను నీ కృపావేశంబున్
మరియొకదెస నిడి తూచినఁ । గరుణదెస న్మొల్లుసూపు గౌరవముకదుఁగా. ౬౨౫

క. నేను కృతార్థుడనైతి భ । వానీ నీదర్శనమున వరములు వేరే
నే నేమికోరఁదగు నిక । నీ నామస్మరణ మొకటి నెమ్మి వరింతున్. ౬౨౬

ఆ.వె. పిలిచినట్టివారి పెరటికల్పకమవు । కొలచినట్టివారి కొంగుపసిడి
తలచినట్టివారి తంగేటిజున్నువు । నిన్ను జూడగల్గె నేడు నాకు. ౬౨౭

సీ. నిన్ను దర్శించితి నేను ధన్యుఁడనైతి వినుము నా కోరికల్ విశదలీల
నీపాదపద్మముల్ నిరతంబు సేవింప భక్తి నా కిమ్మది ప్రథమవరము
నెనసి దుర్గానామమున నాపురంబున నుండు మీవరము దా రెండవయది
యెందాఁక నిప్పుర మిలనుండు నందాఁక నెలమిఁ బ్రోవుము దీని నీవరంబు

తే.గీ. మూడవది నీదయ నభీష్టములు ఘటిల్లు । భగవతీ శత్రుభయమెల్లఁ బాయు సకల
సంపదలుగల్గు తామరతంపరగుచుఁ । గులమువర్ధిల్లు నిం కేమికోరవలయు. ౬౨౮

వ. అనిన విని దుర్గాదేవి యిట్లనియె. ౬౨౯

ఆ.వె. నేను ముక్తిపురిని నివసింతు నెల్లప్డు । సకలలోకరక్ష సలుపుచుండ
ననుచు జెప్ప వినుచు నాసుదర్శనబాలు । దంటఁజేరవచ్చి యనియె నిట్లు. ౬౩౦

ఉ. నమ్మితినమ్మ సర్వభువనమ్ములయమ్మ కుమారునమ్మ ప
ల్కమ్మ సిరమ్మ నీకుఁ గలకాలము మ్రొక్కుదురమ్మ బమ్మనుం
గుమ్మరిఁ జేసి ముజ్జగము కుండలు వానఁగఁ బెట్టి తీవు మా
యమ్మ భవత్కృపారసమయమ్మెు జయ మ్మెటు లెంచి చూచినన్. ౬౩౧

తే.గీ. ఏమిపని యింక నేజేయ నేర్పరించి । యున్నదానవొ సెలవిమ్ము కన్నతల్లి
నీదు పంపొనరింపుచు నీకు సేవ । కుండనై యుందు నా విని చండి పలికె. ౬౩౨

ఉ. వేగ నయోధ్యకుం జనుము విస్తృత రాజ్యభరంబుపూని యి
చ్ఛాగతి నేలుకొ మ్మఖిల సౌఖ్యములం బొసగించి నిన్ను నే
బాగొనరింతు నాభజనఁ బాయకు మష్టమినిం జతుర్దశిన్
భోగదయైన య న్నవమిపూటలఁ దప్పక గొల్వుమీ ననున్. ౬౩౩

క. అర్చాగృహంబు నాకు న । మర్చి భవత్పురమునందు మానక నను నీ
వర్చింపుము నీకు మహిత । వర్చోబలకీర్తివంశవర్ధనము లగున్. ౬౩౪

క. నవరాత్రి విధుల మరువకు । మవిరళముగఁ జైత్రమందు నాశ్వయుజమునన్
ప్రవిలసిత భక్తితోడన్ । సవిధంబున నుందు నెల్లసమయములందున్. ౬౩౫

వ. ఇట్లు పలికి మహాదేవి యంతర్హితయైనం జూచుచు సుదర్శనుండును, సుబాహుండును భక్తివినయంబులు పెనంగొన దదీయధ్యానపరాయణులై యుండుట యెల్లంజూచి విస్మయంబంది రాజలోకంబు వారిని సమీపించి యందు సుదర్శనుం బహువిధంబుల గొనియాడుచు సహహా సకలభువనేశ్వరి నీకుం దోడు నీడై యుండునది మే మెరుంగక మోసపోతిమి. మానేరంబు మన్నించి మమ్ముం గటాక్షింపుము. నీవు సర్వజ్ఞుండవు. శక్తిమహిమంబు నీవలనగాక మరి యేరు మాకుం దనివిదీర విన్పింపగలరు. నీ వయోధ్యకు వేగిరంబ చని నాయకుండవు గమ్ము. మేము నీపంపు సేయుచుందుమని పల్కిన విని సుదర్శనుం డిట్లనియె. ౬౩౬

శా. ఆ దివ్యాంబచరిత్రమున్ గణనసేయన్ శక్యమే నాకు బ్ర
హ్మాదుల్ మూఢు లనంతవేదములచే నాడిన్ జతుర్జిహ్వలన్
దాఁ దెల్పం బనిపూనియున్ దుదకు నెన్నండాయె లక్షాంశమున్
యాదోరాశిని సీకరంబు లయిదా రన్నట్లుగా నెన్నె బో. ౬౩౭

సీ. ఈమె మహాలక్ష్మి యీమె వరేణ్య యుత్తమశక్తి సాత్వికి దా సమస్త
లోకపాలనకళాలోల యీ శక్తియ రాజసంబునను సర్గంబు సేయు
తామసంబున లోకతతిని మాయము సేయు పరగ నిర్గుణయగుఁ బరమశక్తి
యాదికారణమగు నజుఁడును విష్ణుండు పరమేశ్వరుఁడు నీమె పంపు సేయు

తే.గీ. చుంద్రు నిర్గుణ దా నొక్క యోగులకునె । కాక రాగుల కెన్నఁడుఁ గానరాదు
జ్ఞానగోచర యది రూపు గనదుసుండు । సగుణ సేవింపఁబడు రాగిజనముచేత. ౬౩౮

వ. అనిన రాజులు. ౬౩౯

ఉ. బాలుఁడవయ్యు నట్లు వనవాసమునం బడియుండి యెట్లుగాఁ
గాశిపఁ గొల్చు మార్గమును గాంచితి కాంచితివో వడిం దయా
శాలిని నీకు నెట్టులఁ బ్రసన్నత దర్శనమిచ్చె నెట్టు లీ
వీలువ దోడునీడయయి వే చనుదెంచి జయం బొసంగెనో. ౬౪౦

ఉ. నా విని యా సుదర్శనుఁడు నవ్వి నృపాలకులార చిన్ననా
డే వెసఁ గామబీజమును నే స్మరియించుట కభ్యసించితిన్
దేవి ప్రసన్నయయ్యె నిది దెల్పితి నిక్కము నా నృపాలకుల్
భూవరబాలకుం బొగడి పొందిరి స్వస్వనివాసభూములన్. ౬౪౧

తే.గీ. ఆ సుబాహుఁడు కాశికి నరిగె నంత । నా సుదర్శనుఁ డపు డయోధ్యాపురంబు
జేరియుండంగ శత్రుజిన్మరణైక । కారణుం గన మంత్రులు గదలివచ్చి ౬౪౨

తే.గీ. మరియు ద్విజులును వణిజులు బలిజ పంట । కాపు లరుదెంచి యిచ్చిరి కట్నములును,
గానుకలు కుప్పతెప్పలు గాఁగ నిండె । నహహ దైవంబు మంచిదైనపుడు జూడు. ౬౪౩

తే.గీ. పురముకాంతలు పేలాలు పూలు గురియ । వందిమాగధు లెంతేస్తవంబు సేయ
నలరి మంత్రిజనంబు జోహారులిడగ । తనదు భవనంబు జేరె సుదర్శనుండు. ౬౪౪

తే.గీ. అట్లయోధ్యఁ బ్రవేశించి యా సుదర్శ । నుఁడు సవతితల్లి శోకంబు నుడుపదలచి
యామెకడ కేగి మ్రొక్కి యో యమ్మ నేను । గాను నీపుత్రు వధియించెఁ గాశిసుమ్ము. ౬౪౫

తే.గీ. ఆ యుధాజిత్తు తండ్రిగాఁడమ్మ నీకు । శత్రుఁడని యెంచుకొను మందు శంకలేదు
ధర్మమెప్పుడు జయమొందుఁ దథ్యమరయ । తల్లిరో నీదు జనకు డధర్మపరుడు. ౬౪౬

తే.గీ. దైవగతిచేత నయ్యెడుదానికెపుడు । లేదుగాదె ప్రతీకార మేదియు భువి
శోకమేటికి మానుము సుఖము కష్ట । మనుభవింపక దీరనియవియ కావె. ౬౪౭

క. కర్మంబె జననహేతువు । కర్మంబే ప్రోచు తుదకుఁ గర్మమె చెరుచున్
గర్మవశగుండు జీవుఁడు । కర్మమె సుఖదంబు దుఃఖకారణమమ్మా. ౬౪౮

తే.గీ. చేసుకొనినది తానెబో సేయవలయు । మంచిదో చెడ్డదో కర్మ మంచు బుధులు
సెప్పుదురు తప్పునే యది జీవులకును । కర్మబద్ధంబులయ్యె జగంబులెల్ల. ౬౪౯

తే.గీ. ఆ మనోరమ యెట్టుల నట్టు లీవు । నాకుఁ దల్లివి నీకుఁ నే దనయుడను బ
దారవిందములకు నమస్సాచరింతు । దాసు నను దయఁజూచి చింత విడుము ౬౫౦

శా. అమ్మా దుఃఖము గల్గిన న్నధికదుఃఖాక్రాంతులం జూడుమా
యమ్మా సౌఖ్యము గల్గిన న్నధికసౌఖ్యాయత్తులం జూడుమా
యమ్మా శత్రువులట్లు దుఃఖమును సౌఖ్యంబున్ మనీషన్ గనుం
గొమ్మా వానికి లోబడందగదు నీకున్ క్షేమమౌ నాదటన్. ౬౫౧

మత్తకోకిల. నాటకంబునఁ గొయ్యబొమ్మలు నర్తనంబులు సేయవే
బూటకంబులుసుమ్ము మేనులు పుట్టుఁ జచ్చునుఁ బల్మరున్
నీటిబుగ్గలు కర్మజంబులు నిక్కువంబిది నమ్ముమా
యేటికీ పరితాప మీ జగమెల్ల నిత్యమె చెప్పుమా. ౬౫౨

సీ. వినుమమ్మతల్లి నా జనకుండు సింగంబుచేత జచ్చినవెన్క మాతతండ్రి
నీతండ్రి తెగటార్ప మాతయు నేనును వనభూములను జేర వాంఛజేసి
యచటకున బోవంగఁ బలువురు బోయలు మ మ్మెదిరించి మా సొమ్ముదోచి
కొని పోవ జింతిల్లి తిన నన్నకబళంబు గనరాక ఋషులసంగతి వసించి

తే.గీ. కాయ లాకులు నివ్వారిగంజి మెతుకు । నొక్కపూటనె భుజియించి పెక్కునాళ్లు
బ్రతికితిమి నాడు నా కొక్క భయము గలదె । పగయు మచ్చర మనునవి యగపడినవె?

క. నీవారిబియ్యపన్నం । బేవారికి నేని సుఖద మీ రాజ్యపద
శ్రీవిభవము నరకమునకుఁ । ద్రోవసుమీ యింతకంటె దోషము గలదే. ౬౫౪

ఉ. ధర్మము నిత్య మయ్యది సదా శుభదాయక మట్లుగాన స
త్కర్మలు నిర్జితేంద్రియు లుదారమతుల్ నరకంబు సేర రీ
వర్మముబూని యీ భరతవర్షమునన్ మనుజత్వ మూనుటల్
ధర్మము సేయఁగాదె యటు దప్పిన స్వర్గము గల్గనేర్చునే? ౬౫౫

క. అన విని లీలావతి దా । మనమున సిగ్గుపడి పుత్రమరణజదుఃఖం
బును మాని యిట్టు లనియెన్ । గనుగొనలం బాష్పవారికణములు దొరుగన్. ౬౫౬

తే.గీ. తప్పు జేసితి నేను నా తండ్రిమాట । నాత్మ నవలంబనముచేసి యనపరాధు
డైన నీతాత మడియించె నతఁడు నీకు । రాజ్యమీయక తరిమె నరణ్యములకు. ౬౫౭

తే గీ అపుడు నాతండ్రిమాటకు నడుగుదాట । లేక నా కర్మవశమునఁ బోక తప్ప
దాయె నాయన్న నానేర మందులేదు । కరుణయుంచుము నీవెరుంగనిది లేదు. ౬౫౮

వ. కుమారకా యుధాజి చ్ఛత్రుజిత్తు లధర్మపరులై చేసిన దోషంబు వా రనుభవింప వలవదె? వారి మరణంబులకు నేను శోకింప; వారి దుష్ప్రవర్తనంబునకు శోకించుచున్నదాన. గతంబునకు దుఃఖించుటయు కృతంబును స్మరించుటయు వెఱ్ఱితనంబులుగాని మరియొండు గావు. సకల కల్యాణగుణసంపన్నుండవైన నీవ నా పుత్రుండవు. మనోరమయె నా తోఁ బుట్టువు. నే నిఁక జింతింప నేమిపని యున్నది? నీవు రాజ్యంబు గైకొని మహావిభవంబునం బాలనంబు సేయుము. జగదీశ్వరి నిష్కంటకంబుగా నీరాజ్యంబు నీకొసంగె. దడవు సేయ వలదని చెప్పిన విని రాజనందనుండు లీలావతికి వినయపూర్వకంబుగా నమస్కరించి నిజభవనంబునకుం జని యనంతరంబ. ౬౫౯

ఉ. మంత్రులఁబిల్చి యా నృపకుమారుఁడు నిస్తులసింహపీఠ సం
గంత్రనుకూలలగ్నము నొకండు సుఖప్రద మారయుండు స
ద్యంత్రవిధానసైపుణుల హైమము రత్నమయంబు గద్దియన్
దంత్రవిదగ్రగణ్యులగు ధన్యులతోఁ గొనిరండు కామరా
ణ్మంత్రము బూనుచున్ భువనమాత నధిష్ఠితఁజేసి కొల్చెదన్. ౬౬౦

చ. తిరమగు గద్దియన్ భగవతిం దగ నిల్పి తదంఘ్రిభక్తిత
త్పరతనుఁ దొల్లి రాముఁడుగ దా యెటు లట్టుల రాజ్యభారమున్
గరమరుదారఁ దాలిచి సుఖస్థితిఁ బాలన మాచరింతు నా
గరికులకెల్లఁ బూజ్యయయి కామదయై జగదంబ యొప్పెడిన్. ౬౬౧

ఉ. నా విని మంత్రు ల య్యవనినాయకు నానతివెంట సర్వమున్
వే విరచింపఁజేయ గని వింతదలిర్చెడి యొక్క మేడలో
దేవిని గాంచనప్రతిమఁ దీరిచి జోశ్యుల బిల్చి మంగళా
రావము బోరుకల్గ శుభలగ్నమునం దిడె సింహపీఠికన్. ౬౬౨

ఉ. వారవధూటు లాడ శుభవందిజనంబులు బాడఁ దూర్యముల్
మీర మహారవంబుల సమృద్ధిగఁ గూడఁగ బాడబోత్తముల్
దారఘనశ్రుతుల్ శ్రుతివితానముగాడ మహోత్సవంబునం
బౌరజనాళి జానపదపంక్తియు వాడల గుంపుగూడఁగన్. ౬౬౩

చ. వినుము నరేంద్ర యా సకలవేదిని దేవిని సింహపీఠిపై
నునిచి విధానవైఖరుల నోపికఁ బూజలొనర్చి సంతసం
బునఁ దన పూర్వరాజ్యమును బూని సుఖించెనుఁ దొల్లి రాఘవుం
డనుపమ ధర్మయుక్తి నెటు లట్లు ప్రజల్ దను మెచ్చుచుండగన్. ౬౬౪

ఉ. ధర్మము నాల్గుపాదములఁ దా నడచెన్ భువి నెందునేని దు
ష్కర్మము లేనెలేదు ప్రతి గ్రామమునందునుఁ గోవెలల్ కన
ద్భర్మమయంబులైన ప్రతిమల్ పొలుపారగ దేవి గొల్వఁగా
శర్మదయై సమస్తవిధ సంపద లిచ్చి భరించు నిచ్చలున్. ౬౬౫

తే.గీ. అచట నానందకాననాభ్యంతరమున । ధృతి సుబాహుండు దుర్గాప్రతిష్ఠ జేసి
మహిమ విశ్వేశ్వరునితో సమంబుగాఁగఁ । బూజగావించు నిరతంబు భూరిభక్తి. ౬౬౬

ఆ.వె. నాటనుండి యెల్ల నాడులవారును । గాశి జేరి దుర్గఁ గాంచి పూజ
లాచరించి కోర్కె లందుచునుండిరి । దేవిఁ గొల్చువాఁడె ధీరు డరయ. ౬౬౭

వ. అని పల్కిన జనమేజయుండు పరమానందమగ్నుండై మునీంద్రా ద్విజుం డగువాఁడు నవరాత్రంబు నెట్లు గావింపందగు తద్విధానం బెట్లు శరత్కాలంబున విశేషంబుగా నాచరింపవలయునది యెద్ది వినుపింపవే యనిన నతండు మానవేంద్రా శరత్కాలంబున విశేషంబుగా విధివిధానంబులం దేవీపూజ సలుపవలయు వసంతంబునందును భక్తిపూర్వకంబుగా దేవీపూజనంబు సేయవలయు. ప్రాణులకు శరద్వసంతంబులె కావె

దుర్గమంబులు; వానిని యమదంష్ట్రింబులని పేరిడి జనులు బిల్చెద, రది నిక్కమేః యని జననాశకరంబులును రాగప్రదంబులు నై యుండు కావున నయ్యే సమయంబులం జండికాపూజనం బవశ్యకర్తవ్యంబని యెరుంగుము. చైత్రాశ్వయుజంబులు దేవీవ్రతంబునకు ముఖ్యంబులు. పూర్వమాసామావాస్య మొదలు సంభార సంగ్రహంబు నెరవేర్చి హవిష్య మశనంబుగా నేకభుక్తవ్రతంబు పట్టి సమంబై యోగ్యంబగు ప్రదేశంబున మండపం బేర్పరపించి దాని షోడశహస్త ప్రమాణంబును స్తంభ ధ్వజ సమన్వితంబునుం జేసి గోమయంబును గౌరమృత్తికయుం గల్పి చక్కఁగా నల్కించి యా మధ్యంబున సమకోణభుజంబగు వేదిక చతుర్హస్త ప్రమాణంబును హస్త ప్రమాణోన్నతంబునుగా నిర్మించి యందుమీఁద నలంకృతంబగు పీఠంబిడి వివిధంబులగు తోరణంబులునుం గాయమానంబునుం గట్టించి పూర్వరాత్రంబుననె దేవీమంత్రవిశారదులును, వేదవేదాంగపారంగతులును, సదాచారపరులు నగు ద్విజుల నామంత్రణంబు జేసి పాడ్యమినాఁడు వేకువన లేచి స్నానసంధ్యాదులు యథావిధి జరిగించుకొని ద్విజవరణంబు చేసి మధుపూర్వకంబుగా నర్ఘ్యపాద్యాది విధులం బూజించి శక్తికొలఁది వస్త్రాలంకరణాదులు సమర్పించి విత్తశాఠ్యంబు సేయక బ్రాహ్మణులం దృప్తి నొందించి తొమ్మండ్రుగుఱుగాని, యైదుగురుగాని, తుద కొక్కఁడుగాని దేవీజపంబు జరిపించునట్లు బ్రాహ్మణులం బ్రార్థించి దేవీ మనుపారాయణార్థం బొక శాంతుండగు విప్రశేఖరు నేర్పరిచి వేద మంత్రంబులతో స్వస్తివాచకంబు సెప్పించి తొంటివేదికపై సింహాసనం బమర్చి యొక్క దివ్యంబగు క్షౌమవస్త్రంబు నాస్తరణంబు జేసి యందు నాలుగు హస్తంబులు గలదియు ముక్తాహారాది రత్నభూషితయు, దివ్యాంబరధరయు, సర్వసౌమ్యలక్షణసంపన్నయు, శంఖచక్రగదాద్యాయుధసమేతయు, సింహవాహనాధిష్ఠితయుంగా నొనర్చి దేవిం బ్రతిష్ఠింపవలయు. అష్టాదశభుజాసమేతముగా జేయుటయుం గలదు. అర్చాభావంబున నవాక్షర యుతంబగు మంత్రంబుతో దేవిని స్థాపించి పీఠపూజార్థంబు కలశస్థాపనం బాచరించి పార్శ్వంబుననుంచి పంచపల్లవంబులంగూర్చి వేదమంత్రంబులతో సుసంస్కృతంబు చేసి జలంబునిచి హేమరత్నాదు లందులోవైచి తత్పార్శ్వంబునం బూజాద్రవ్యంబు లిడి గీత వాద్యాదులవలన మంగళారావంబులు సెలంగఁ బ్రథమదివసంబున దేవీపూజ నారంభించి నియమంబుతో దేవీపూజ సేయుచు నుపవాసవ్రతంబుననేని నక్తంభుక్తివ్రతంబుననేని యేకభుక్తవ్రతంబుననేని దేవీవ్రతంబు నడుపవలయు. మరియు, ౨౨౭

క. నీయుత్తమవ్రతంబుఁ । జేయుదు నవరాత్రమందు సేవకునకు నీ
వేయెడ సాహాయ్యంబుం । జేయుము మాయమ్మ దేవి శ్రీమతి యనుచున్. ౨౨౮

క. విధిపూర్వకముగ వ్రతమున । నధికంబగు భక్తితోడ నంబనుఁ గొలువన్
దృఢతర సంపద లొదవెడి । సధనులకును శక్తి కొలఁది నగు ధరణీశా. ౭౪౦

వ. మరియు చందనాగరుకర్పూరంబులచేతను, మందారకరజాశోకచంపక కరవీర మాలతీ బ్రహ్మకాకుసుమంబులచేతను, బిల్వదళంబులచేతను జగదంబం బూజించి ధూపంబులిచ్చి నానావిధఫలోపహారంబులుగా నారికేళ మాతులుంగ దాడిమీ కదళీ నారంగ పనసాది ఫలంబు లిచ్చి పిదప యథావిధిగా నన్నదానంబు సేయవలయు. వింతియకాక మాంసాశనంబు సేయు కులంబులవారు పశుహింసనంబు సేయవచ్చు. మహిషాజవరాహంబు లమ్మవారి వేటలకు నర్హంబు లది దేవీవిషయకంబై హింసనాఁబడదు. దేవతార్థహింసనంబువం బశువునకు స్వర్గంబు వచ్చునని శాస్త్రంబులు సెప్పుచుండు. నటుపిమ్మట హోమార్థంబు త్రికోణకుండంబును త్రికోణస్థండిలంబును జేసి హోమంబులు నెఱపుచు నానావిధ మనోహర ద్రవ్యంబులచేఁ ద్రికాలపూజ సేయుచు గీతవాద్యనృత్యాది నానావిధవినోదంబుల మహోత్సవంబు సేయుచు నిత్యంబును భూతలశయనం బొనరించుచుం గన్యాపూజనంబు సేయవలయు. నది యెట్లనిన నేకసంఖ్యమొదలు నవసంఖ్యవరకు శక్త్యనుసారంబునం గన్యకల నియమించి విత్తశాఠ్యం బొనర్పక వస్త్రాలంకారాదుల నలంకరించి పూజింప వలయు. నిక్కన్యాపూజయం దేకవర్ష నిషిద్ధ యగు. ద్వివర్ష కుమారిక యనియుఁ ద్రివర్ష త్రిమూర్తి యనియుఁ జతుర్వర్ష కల్యాణి యనియుఁ బంచవర్ష రోహిణి యనియు షడ్వర్ష కాళిక యనియు సప్తవర్ష చండిక యనియు నష్టవర్ష శాంభవి యనియు నవవర్ష దుర్గ యనియు దశవర్ష సుభద్ర యనియుం బిలువంబడుదురు. పదివత్సరంబులకు మిగిలిన వయస్సుగల కన్యలు కుమారీపూజయందుఁ జెప్పబడరు. నయ్యేసంఖ్య కనుకూలంబగు నామం బుక్త విధంబున నెఱింగి యాపేరిటం బూజించుచుండవలయు. వెండియు నయ్యయి ఫలంబుల వివరించెద వినుము. కుమారీ పూజనంబున దుఃఖదారిద్ర్యనాశంబును, శత్రుజయంబును, ధనంబును, నాయుష్యంబునుం గలుగు; త్రిమూర్తిపూజనంబునం ద్రివర్గఫలంబును ధనధాన్యాగమమును బుత్రపౌత్రాభివృద్ధియుం గలుగుఁ; గల్యాణీపూజనంబున విద్యయు విజయంబును రాజ్యంబును సుఖంబునుం గలుగు; కాళికాపూజనంబున శత్రునాశంబు గలుగుఁ; జండికాపూజనంబున నైశ్వర్యధనంబులు గలుగు; శాంభవీ పూజనంబున నృపసమ్మోహనంబును దుఃఖదారిద్ర్యనాశంబును శత్రుజయంబునుం గలుగు; దుర్గాపూజనంబున శత్రువినాశంబుగ్రవిధానంబునం గలుగుఁ; బరలోక సుఖంబు సౌమ్య విధానంబునం గలుగు; రోహిణీపూజనంబున రోగవినాశంబగు; సుభద్రా పూజనంబున వాంఛితార్థసిద్ధియగు. శ్రీయుక్త మంత్రంబులచేఁగాని బీజాక్షరసంయుతంబులగు మంత్రంబులచేగాని భగవతీపూజనంబు భక్తితో నాచరింపవలయు. విదియుంగాక; ౭౪౧

క. హరిహరహిరణ్యగర్భుల । నరుదార సృజించి జగములన్నియుఁ గలుగన్
బరిరక్షింపం ద్రుంపన్ । బరికించిన యంబయౌఁ గుమారిం గొల్తున్. ౬౪౨

క. మూఁడుగుణంబులతోడన్ । గూడుచుఁ గాలములమూట గొనకొని జగముల్
మూడింటిలోన శక్తులు । మూఁడు గలిగి తిరుగు నా త్రిమూర్తిన్ గొల్తున్ ॥ ౬౪౩

క. కళ్యాణంబుల నిడి సా । కల్యంబుగ భక్తజనులఁ గడువడిఁ గరుణా
కుల్యల ముంచెడి దేవినిఁ । గల్యాణిం గొలుతుఁ బూర్ణకామద యనుచున్ ॥ ౬౪౪

క. తొలిపుట్టువు కర్మంబుల । ఫలములలో విత్తులేరి ప్రజలజగములన్
మొలిపించు లోకమునఁ బై । రులవలె నే తల్లి యట్టి రోహిణిఁ గొల్తున్ ॥ ౬౪౫

క. లయమున స్థావరజంగమ । మయమగు బ్రహ్మాండమెల్ల మట్టాడుచుఁ దా
భయదోగ్రఘోరరూపిణి । యయి యొప్పెడి కాళిఁ గొల్తు ననవరతంబున్ ॥ ౬౪౬

క. చండోరుముండశీర్షవి । ఖండనకృద్దండచండశాసనలీలా
మండితయై నిజభక్తుల । చండతరాఘంబు లడఁచుఁ జండిం గొల్తున్ ॥ ౬౪౭

క. కారణము లేనిదయి తాఁ । గారణమై జగములెల్లఁ గల్గించుచు నా
ధారము తానై సుఖవి । స్తారము గావించునట్టి శాంభవిఁ గొల్తున్ ॥ ౬౪౮

క. దుర్గమ్యుం జేయు భక్తుని । దుర్గతులం బారఁదోలు దుఃఖములడఁచున్
దుర్గమ్య దేవదానవ । వర్గంబుల కట్టి దుర్గ భక్తిం గొల్తున్. ౬౪౯

క. భద్రములు భక్తులకు నిరు । పద్రవముగ నొసఁగి కరుణఁ బాలించుచుఁ దా
ఛిద్రంబును గలుగని సం । పద్రాజి బొసంగు నా సుభద్రం గొల్తున్ ॥ ౬౫౦

వ. అయ్యైదేవి నయ్యైవిధంబునం బూజింపవలయునని వక్కాణించి వ్యాసుండు తదనంతరంబ.

## నవరాత్రమాహాత్మ్యము.

సీ. ఒడలునఁ గురుపుల పడఁతియుఁ గుష్ఠరోగార్తయు హీనాంగి యంధ బధిర
బహురోమశయుఁ గులభ్రష్టయుఁ గేకరకాణి కురూప దుర్గంధసహిత
యెట్టినిమచ్చల యింతి గోలక జామ కన్యకాసంభూత కాంతిరహిత
కన్యకాపూజకుఁ గై కొనరాదని పటుశాస్త్రవేత్తలు పలుకుచుండ్రు
తే.గీ. తెవులులేనిది సుందరి గవులులేని । దవ్రణ కులోద్భ సమవిభక్తాంగి సుగుణ
కన్యకాపూజనమున ముఖ్యులుగఁగొండ్రు । దీని దెలియంగదగుఁ జుమ్మ మానవేంద్ర.

సీ. బ్రాహ్మణి సర్వకార్యంబులఁ బొసగించు రాజభవంశజ జయార్థంబు పుత్తుమ్మ
లాభార్థమై వైశ్య లలనయేనియుఁ బాదభవనారి యేనియుఁ బవిత్రపత్ను

బ్రాహ్మణు లనిశంబు బ్రాహ్మణిఁగొల్తురు రాజులకును బూజ్య బ్రాహ్మణియగు
వైశ్యులలో మూఁడువర్ణంబుల సుకన్యలనుఁ బూజసేయుట పొనరునండ్రు
నాల్గువర్ణములందు నారులఁ బూజింపవచ్చు శూద్రకులంబువారు వరుస

తే.గీ. కారువులు మొదలగునట్టివారు స్వస్వ । కులజలగుఁ గన్యకల నెప్డు గొలువవచ్చు
జెలఁగి తొమ్మిదిరాత్రులు చేయలేని । వార లష్టమి మొదలిడవచ్చు ననఘ. ౭౮౩

తే.గీ. తొమ్మి దుపవాసములకు శక్తిలోగిఁగాక । యశకువా రుపవాసత్రయంబు సప్త
మిని మహాష్టమి నవమిని మేలుగోరి । సేయవచ్చును వాంఛితసిద్ధికలుగు. ౭౮౪

క. పూజయు హోమము కన్యా । పూజయు భూదేవపంక్తిభోజనములు నీ
యోజం జరిగినయేని మ । హాజననీవ్రతవిధాసమాప్తి యగు నృపా. ౭౮౫

సీ. నరనాథ వినుమయ్య నవరాత్రములనోము పట్టినవారికి భాగ్యమబ్బు
నాయురారోగ్యమైశ్వర్యములు కల్గు ధనధాన్యభూషణతతులు గలుగు
స్వర్గంబుగల్గు మోక్షముగల్గు సుఖమును జయమును సంపదల్ చాలగలుఁగు
బుత్త్రులగోరినఁ బుత్త్రుల విద్యను గోరిన విద్యను గొనఁగవచ్చు

తే.గీ. రాజ్యముననుండి భ్రష్టుఁడౌ రాజునకును । రాజ్యములభించు నాపదల్ రావుసుమ్ము
పూర్వభవమున భగవతిఁ బూజచేసి । నట్టివారలె రాజులై పుట్టుచుండ్రు. ౭౮౬

క. దేవిన్ నవరాత్రంబున । భావించి తలంచు నా శ్వపచుఁడేనియు ని
చ్చావిధి స్వర్గము చని సం । భావింపంబడుఁగదా నృపాలకచంద్రా. ౭౮౭

వ. ఇందున కొక యితిహాసంబు గలదు, చెప్పెద విను, తొల్లి. ౭౮౮

శీలోపాఖ్యానము.

చ. కలఁడు పురాయుగంబున నొకండు వణిగ్జనుఁ డుత్తమోత్తముం
డలఘు కుటుంబశాలి యతఁ డార్జవముం గలవాఁడు గోసల
స్థలి బహుపుత్త్రికుండయి నిశాముఖమందు భుజించు బిడ్డలన్
గలసి యొకింత కూరడవిఁ గోసినపండును క్షున్నివృత్తికిన్. ౭౮౯

ఉ. ధర్మపరుం డతం డమిత ధైర్యుఁడు శాంతుడు సత్యవాది స
త్కర్మరతుం డభీకుడు సదా మదలోభవిహీను డెంతయున్
నిర్మలుడై యవింధ్యుడయి నీతిమయుండయి దేవతార్చనన్
గూర్మి నొనర్చుచున్ మహి జను ల్దను శీలుఁడటంచు బిల్వఁగన్. ౭౯౦

ఉ. అంతట నొక్కనాఁడు విపులామరు నొక్కని గాంచి శీలు ద
త్యంతబుభుక్షఁ బీదపడి యయ్య। ధరాసురవర్య మ్రొక్కెదన్
స్వాంతమునం దయారసము చాలుకొనం దెలుపంగదయ్య ని
శ్చింతత లేమివోనడఁచు జెల్వపు మార్గ మొకండు కల్గినన్. ౫౧

ఉ. ఏను ధనాశచే నడుగ నియ్యది బిడ్డలు కూడులేక యెం
తేనియుఁ గార్శ్యయుక్తిఁ గడుదీనతఁ జిక్కిరి కూఁతుబిడ్డ తా
మానక కూటికేడ్చిన భ్రమంబున నే నొకగ్రుద్దు గ్రుద్దితిన్
దాన గృహంబు వెల్వడి పదంపడి యెక్కడఁబోయెనో కనన్. ౫౨

తే.గీ. పెండ్లి కెదిగిన యొక కూఁతు పెండ్లి యెట్లు। సేయుదును బెండ్లి యీయేడు సేయకున్న
పదునొకండేండ్లు వచ్చు నా పడుచునకును। దానయోగ్యత సెడునంచుఁ దలచి యేడ్చు. ౫౩

తే.గీ. కాన విప్రేంద్ర నామీఁదఁ గరుణయుంచి। తపమొ దానంబొ వ్రతమొకో జపమొ ఏదొ
దేనివలనను నాలేమి దీరు దానిఁ। జెప్పుము కుటుంబరక్షణఁ జేసికొందు. ౫౪

తే.గీ అన్నవస్త్రంబు లొగి మాకు నందఁజేకిని। నతిథి విప్రులకును గల్గు నంతవట్టు
భాగ్యమబ్బినఁ జాలును పైన నేను। కోరనెట్లైన నీవు నా గోడు దీర్చు. ౫౫

ఉ. నా విని విప్రవర్యుడు సనాతని దేవినిఁ బూజసేయుమీ
నీవును భక్తితోడ జననీనవరాత్రము వచ్చునంత నే
ప్రోవయొకింతలేక ద్విజభోజనముల్ హవనంబు నర్చయుల్
వావిరి వేదపాఠమును వాసి నెసంగఁగ శక్తిచొప్పునన్. ౫౬

క. నవరాత్రవ్రతమున మా। నవులకు శుభమబ్బు శత్రు నాశనమగు వై
భవమును గలుగును జ్ఞానము। తవులు నోక్షంబుగల్గుఁ తథ్యముసుమ్మీ. ౫౭

వ. తొల్లి దశరథతనూజుండగు శ్రీరాముండు సీతావియోగశోకాకులుండై తెరవేది కిష్కింధా నగరంబుననుండుసెడ నవరాత్రవ్రతంబు యథావిధిగా నెరవేర్చి తత్ఫలంబునంగాదె వార్ధిబంధించి రావణ కుంభకర్ణాదులం జయించి విభీషణుని లంకారాజ్యంబున కధిపతిం జేసి, అయోధ్యకరుదెంచి నిష్కంటకంబుగా రాజ్యంబు పాలించెనని చెప్పిన విప్రవాక్యంబులు విని యాతనిం గురువుగా నియమించుకొని మాయాబీజ మంత్రంబు గ్రహించి జపించి నవరాత్ర వ్రతంబు యథావిధిని నాచరించుచుఁ దొమ్మిది సంవత్సరములు గడపిన నవమ వత్సరంబున నవరాత్రంబుల నొక్కనాఁ డర్ధరాత్రంబునం దేవి ప్రత్యక్షంబుగా దర్శనంబిచ్చి నానావిధవరంబు లిచ్చి ధన్యుంజేసెననిన విని జనమేజయుండు సాత్యవతేయునకిట్లనియె.

తే.గీ. రాఘవుండైన దశరథరామభద్రుఁ। డేవిధంబున గావించె దేవివ్రతము
నేల నాతండు రాజ్యంబు గోలుపోయె। సీత యపహృతయెట్లయ్యె జెప్పుమయ్య. ౫౮

## శ్రీరామ చరితము

చ. అని విని వ్యాసుఁ డో జనవరా విను కోసలమం దయోధ్యనాఁ
జను పురమేలు సూర్యకులసంభవుఁ డుత్తముఁ డూర్జితక్రియా
ధనుఁడు కలండు తొల్లి గుణధన్యుఁడు పఙ్క్తిరథుండు వానికిన్
దనయులు లోకరక్షకవిధానులు నల్వురు గల్గి రుర్వరన్. ౭౦౦

సీ. విశ్వంభరాధీశ విను రామ లక్ష్మణ భరత శత్రుఘ్నాఖ్యు లరయ వార
సదృశులు గుణ రూప సంపదలందును పితృతోషణైకమానితులు నుతులు
కౌసల్యయందును ఘనుడు రాముడు పుట్టె భరతుండు కైకగర్భమున బొడమె
లక్ష్మణశత్రుఘ్న లాంఛితులు సుమిత్ర కుదయించి రిల సద్గుణోజ్వలులయి
తే.గీ. చిన్నతనమునఁ జేతుల సింగిణీలు । నమ్ములును దాల్చి విలువిద్య నభ్యసించి
బుద్ధికుశలతఁ గాన్పించి పోల్చియున్నఁ । గౌశికుండను ముని నృపుకడకు వచ్చి. ౭౦౧

క. పదియాఱేడులవయసునఁ । బొదలెడు శ్రీరాము యజ్ఞమునుఁ గాపాడన్
ముదమునఁ బంపుమనిన రా । జిది విని లక్ష్మణునితోడ నాతనిఁ బంపెన్. ౭౦౨

ఉ. ఆ మునితోడఁ బోవుచు మహామతి రాముఁడు దానవచ్ఛటా
భీముఁడుగాఁ దలిర్చి మునిఁబృందనిరోధినిఁ దాటకన్ బలో
ద్దామత నొక్కతూపున హతంబొనరించి సుబాహుఁ గూల్చి ది
వ్యామితతేజుఁడై విలచె యజ్ఞముఁ గాచుచు భూమిపాలకా. ౭౦౩

శా. మారీచుండు రఘూద్వహోగ్రశరసమ్మర్దంబునన్ దాన కూ
పారప్రాంతజలంబులోఁ బడి మృతప్రాయుండుగా నొప్పె వి
ప్రారెన్ మోములు దాపసోత్తములకున్ హాయంచు గాధేయుఁ డా
వీరున్ లక్ష్మణుతోడ నమ్మిథిలకున్ వేవేగఁ గొంచుం జనెన్. ౭౦౪

ఉ. రాముఁడు దారిలోన నొక రాతిని నాతినిఁ జేసె గౌతమ
స్త్రీ మహనీయ యయ్యువతి చెల్వుని శాపమువల్ల రాతిరూ
పై మహినుండెజుమ్ము ముని వారలఁ దోడ్కొనిపోవ రాముఁ డా
భీముని విల్లు దా విఱచెఁ బెండిలిపందెము గెల్చెఁ జెచ్చెరన్. ౭౦౫

చ. రమకళయైన జానకిని రాముఁడు బెండిలియాడె నూర్మిళా
ప్రమదను లక్ష్మణుండు చెయిపట్టెఁ గుశధ్వజు కూఁతులిర్వు రా
యమలనుఁ దక్కువారిరువు రాడిరి బిడ్డలు నల్వు రిట్లు తే
జములఁ బొసంగఁ గాంచి మదిఁ జాలఁ బ్రమోదముమీరఁ దండ్రియున్. ౭౦౬

ఉ. రాముఁడు రాజయోగ్యుఁడయి రాజిలెనంచుఁ దలంచి పట్టము
గ్రామహితుం బొనర్చుటకుఁ దా జతనంబులు సేయుచుండఁగాఁ
దామసవృత్తిఁ గైక మును దత్తములైన వరంబులున్నవో
భూమిప నేఁడు కోరెదను బొంకక నిమ్మనివేఁడె నెట్లనన్. ౭౦౭

తే.గీ. భరతునకు రాజ్యమిచ్చుట ప్రథమవరము । రాముఁ బదునాలుగేడు లరణ్యవాసి
జేయుటయ రెండవ వరమ్ము చెలఁగి యిమ్ము । నాగ దశరథరాజు చింతగొనఁజూచి. ౭౦౮

క. పితృవచనపాలనం బ । ప్రతిమంబగు ధర్మమనుచు రాముఁడు సనియెన్
సతితో లక్ష్మణుతోఁ గూ । డి తపోవనములకుఁ గడువడిన్ మనుజేంద్రా. ౭౦౯

సీ. చని దండకారణ్యముననుండఁగ నయోధ్యనుండి కుమారవియోగదుఃఖ
మునఁ బఙ్క్తిరథుఁడు బోరున నేడ్చి యేడ్చి సన్మనిశాపనిహతిఁ దోరినయనంత
రంబ కైకయిబిడ్డ రాజుపా టిది తనతల్లి సేసినదని తలఁచి తలఁచి
భ్రాతృ ప్రియచికీర్ష రాజ్యంబు నొల్లక యతని దర్శించి తదాజ్ఞగాంచి

తే.గీ. భూమియేలుచునుండంగ భూసుతాస । మేతుఁడై లక్ష్మణునితోడ నినకులుండు
పంచవటిఁ జుప్పనాతినిఁ బట్టి ముక్కు।చెవులు కోయించెఁ గామార్తి చిక్కుతొలఁగ.

ఉ. ముక్కిడియైన శూర్పణఖ మోము గనుంగొని దానిబంధువుల్
రక్కసిమంద లొక్కమొగి రాఁ గని రాఘవుఁ డా ఖరాదులన్
జక్కడఁచెన్ మహావిపుల సంగరభూమిని మౌనిబృందముల్
రెక్కొని యౌర యౌర భళిరే భళిరే యని చిందులాడుచున్. ౭౧౧

ఉ. కోఁతలఁ జిక్కి శూర్పణఖ గొబ్బున లంకకుఁబోయి రావణా
నీ తల లిన్నియేల ధరణీతలనాథుని రాము నోర్చెదే
మోఁతలకేమి చూడుమని ముక్కు సెవుల్వెసఁజూప హుమ్మటం
చీతలమ్రోఁతలం దితిసుతేశుఁడు రావణుఁ డార్చె గ్రుద్ధుడై. ౭౧౨

ఉ. అట్టి మహోగ్రమూర్తి నసురాధిపునిం గని సుప్పనాతి నీ
వెట్టిడవో ఖరాదుల వధించిన రాముని పేరు సెప్పినన్
జట్టును బ్రక్కలందు దనుజు ల్మొగమెత్తఁగఁజాలకుండి రీ
పట్టున నీకునుం గలవు పాటులు సూడుము నేడొ యెల్లియో. ౭౧౩

ఉ. నా విని రావణుండును మనంబున మచ్చరమూని యేగె నా
నావిటపిప్రతానకలనంబగు గానకుఁ దాటకేయు మా
యావినిఁ గాంచె నచ్చట ననంతర మాతనిఁజూచి మిత్ర నీ
వేవిధినైన సీతను గ్రహింపుము తెమ్మన వల్లెయంచొగిన్. ౭౧౪

ఆ.వె. మాయలేడియగుచు మారీచుఁ డవనిజ । సూచునట్లు తిరుగ సుముఖి రాముఁ
గాంచి రాఘవేంద్ర కన్నుల కింపుఁగా । బరచుచున్న దదిగొ పైడిలేడి. ౪౧౫

ఆ.వె. దానిఁ దెచ్చి నాకు దయసేయు మీవేళ । ననిన నెంతపని యటంచు నాతఁ
డనుజుఁ బర్ణశాలయందు సీతను । గావనునిచి విలు నమ్ములను గ్రహించి. ౪౧౬

ఆ.వె. పోయి వనమునందు మాయలేడినిఁ జూచి । యదిగొ పోయెపోయె ననుచు బాణ
మేయఁ గానరాక యేది యేది యటంచు । పొదలువిఱుగఁదిరిగె భూవిభుండు. ౪౧౭

ఆ.వె. ఇట్టునట్టుఁదిరిగి యెట్టకేలకు రాముఁ । డట్టెసూచి యేసె దిట్టమెకము
కొట్టుదగిలి కూలి బిట్టేడ్చె హా లక్ష్మ । ణా యటంచు దాని నవనిజ విని. ౪౧౮

క. తన మఱఁదిఁ జూచి యోయీ । యనఘా హా లక్ష్మణా యటంచొక శబ్దం
బును వింటి వింటె నీవును । కనుఁగొనుమా పోయి భూమికాంతునివేగన్. ౪౧౯

శా. ఈ దీనధ్వనిఁ జూడ రామునకు నెద్దేఁ గీడు వాటించెఁబో
హా దైవంబెటులున్నదో చనుము సాహాయ్యంబు సేకూరెడిన్
నాఁ దల్లీ నినుఁ గాచియుండుమనియె న్నాయన్న నిన్నొంటిఁ గ్ర
వ్యాదప్రావృతమైన కాన నిడిపోవం బాడియే చెప్పుమా. ౪౨౦

క. ఏది యెటులైనఁగాని । మ్మోదేవీ నిన్నువిడిచి యొకయడుగైనం
బోఁదలఁచినాఁడఁగాను సు । మీ దైవము నమ్మమెందు మేలగుసుమ్మీ. ౪౨౧

క. రాముఁ బడనేయ శక్తుఁడు । భూమింగలఁడనుచుఁ దలఁపఁబోకుము నే నా
రాము మదల మీరననెడి । నోమును విడువంగనేర నూరార్లైనన్. ౪౨౨

తరువోజ. అనవుడు విని సీత యత్యంతదుఃఖ । మున బిగ్గనేడ్చుచు మూర్ఖాగ్రగణ్య
నినుఁ దలంచెద విప్డు నీవు నామీఁద । కనుపైచినావు నిక్కము భరతుండు
నినుఁ బంపియుండును నీవెంతయానఁ । గొనియున్న నేనట్టి కులటనుగాను
జననాథుఁడీల్గిన సరగ నీవెంట । జనుదేర ననుకొమ్మ సచ్చెదగాని. ౪౨౩

తే.గీ. అన్న లక్ష్మణ నీవేగి యవనినాథుఁ । గాంచివచ్చెడిదనుక నా కంఠమందుఁ
బ్రాణముండునుఁ దడవేల భ్రాతతోడ । తొంటిస్నేహంబు మరచితే ధూర్తవృత్తి. ౪౨౪

క. అక్కటినోక్తికి మనసు చి । వుక్కుమనం గనులవెంటఁ బొటబొటఁ గారెన్
వెక్కసపు వెసరు నీ రా । చక్కని లక్ష్మణున కహహ చానల తెగువల్. ౪౨౫

తే.గీ. ఎంతమాటాడితివి సీత యింత వాడి । పలుకు కొలిఁన పెనుసూడిపగిది నంటె
చెవుల నిత్తఱి నే నేమిసేయువాఁడ । బోయెదను నీదుకర్మంబు పొమ్ము పిదప. ౪౨౬

క. అని లక్ష్మణుండు జనకసు । తను విడిచి యరణ్యమునకుఁ దాఁ బోవఁగ య
ద్దనుజేశుం డిదె సమయం । బని భిక్షుకవేషధారియై చనుదెంచెన్. ౪౨౮

ఆ.వె. వచ్చి పర్ణశాలవాకిఁట నిలిచి యం । దున్న యువతిఁ జూచి యుర్వితనయ
యిది యటంచు చెలిఁగి యెగదిగఁ జూడంగ । నామె యతి యితం డటంచుఁ దలఁచె.

ఆ.వె. తలఁచి భిక్షదెచ్చి తా నిడఁబోవంగ । మిగుల నమ్రుఁడగుచు మిట్టి మిట్టి
చూచి చూచి నక్క నైచకంబులుగాఁగ । మెల్లమెల్లననియె మెలఁత కిట్లు. ౪౨౯

ఉ. ఎవ్వతెవీవు పంకజదళేక్షణ యొంటి నిటుండనేల నీ
యవ్వ యెవర్తె తండ్రి యెవఁ డన్నలు దమ్ములు నున్నవారె నీ
మొవ్వపు మోము చూచినను ముద్దులుగుల్కెడి మేడమీఁద పాల్
బువ్వయు నారగింప కిటు పోడును గాడును బట్టనేటికిన్. ౪౩౦

క. అతని నిజముగ యతియని । సీత యతిప్రవర వినుము చెప్పెదఁ గలఁ డీ
భూతలమునఁ బంక్తిరథ । క్ష్మాతలనాథుండు సత్య సంకల్పుఁ డిలన్. ౪౩౧

క. పుడమియొడయనికి నలుగురు । కొడుకులు జ్యేష్ఠునకు నేను గోమలినై తిన్
వడి సవతితల్లి కైకయి । యడిగిన నా విభుఁడు వచ్చె నడవికి ననఘా. ౪౩౨

క. పదునాలుగేడు లడవుల । మెదలంగావలయు నేను మిధిలేశసుతన్
గద సీతను శ్రీరాముఁడు । మొదల న్శివచాపభంగమున నసుఁ గొనియెన్. ౪౩౩

క. రాముని బాహుబలంబున । మే మిచ్చట భీతిలేక మెలఁగెదముసుమీ
రాముం డిప్పుడె నాపైఁ । బ్రేమం బంగారులేఁడి వెనువెంటఁ జనెన్. ౪౩౪

క. దీనధ్వని యొక్కటి విని । మానక సౌమిత్రి యతని మార్గమునఁ జనెన్
భూనుతచరిత్రు లిరువురు । కానలలో నన్నుఁ గడఁకఁ గాచెదరు మునీ. ౪౩౫

క. యతి విష్ణురూపుఁడనుచున్ । మతిఁ దలఁచి మహానుభావ మర్యాద యొన
ర్చితి నతిఘోరం బీవని । బ్రతుకఁగనీ రెల్లయెడల రాక్షసులుకదా. ౪౩౬

క. ఏరో మీరు త్రిదండులు । ధీరులు చెప్పుడనినం దితిప్రభవేశుం
డారమణింగని వినుమా । యే రాక్షసవిభుఁడ లంకనేలెడివాఁడన్. ౪౩౭

క. మందోదరీవిభుండన్ । సుందరి నీకొఱకు నిట్టి జోగినయితి నా
కుం దెల్పె భగిని రాక్షస । బృందవధయు నిజవిరూపకృతియు వగపుతోన్. ౪౩౮

ఉ. మానవుఁడేల నీ కిఁక నమానుషచర్యుఁడ మానవాళనా
ధీనుఁడ నీ మగం డడవిద్రిమ్మరి రాజ్యము గోలుపోయె నిం
కానకునైన లేదు గతి, నాకుమఁ బట్టపుదేవివౌచు లం
కావగరంబు నేలుము సుఖస్థితి నందుము నీకు దాసుఁడన్. ౪౩౯

ఉ. డంబుగ లోకపాలమకుటంబుల రత్నము లంటునట్టి పా
దంబులు గల్గువాఁడ నివె దాసుఁడనై భవదీయపాదప
ద్మంబులమీఁద వ్రాలితిని దద్దయు వేడుకఁ జేయువట్టుమీ
యంబుజనేత్ర, జానకి, ప్రియా, సుముఖీ, జగదేకమోహినీ. ౪౪౦

క. నిను నా కిమ్మని మును నీ । జనకునిఁ గోరితి నతండు శైవధనుర్భం
జనపణము పెట్టినందున । మనమున శివభక్తి చేత మానితిఁ జూవే. ౪౪౧

క. అప్పటినుండియు నా వెత । సెప్పఁ దరముకాదు నిన్ను సేవించుటకై
ఇప్పు డిచట నుంటివి యని । చెప్పఁగ విని వచ్చినాడ జేకొను మబలా. ౪౪౨

వ. అని యిట్లు పలికిన. ౩౪౩

ఆ. వె. రాక్షసేంద్రుపలుకు రమణి విన్నంతనే । పెళపెళమని పడెడి పిడుగుబోలె
మదిఁ గలంపఁ దూలి । మ్రాన్పడి గడగడ । వడఁకికొనుచు నుడుగు తడఁబడంగ. ౪౪౪

తే. గీ. ఆ పులస్త్యుని యింట నీ వవతరించి । యీ యసద్వాక్య మాడ నో రెట్టులాడె
చెడిపె ననుకొంటివా ? చాలు ఛీ! విదేహ । రాజకూతుర దశరథరాముభార్య. ౪౪౫

తే. గీ. ఓరి పోఁగదరా లంక కుగ్రమూర్తి । యగుచు దివ్యాస్త్రసమితిచేఁ దెగ వధించు
నీ పదితలలు రామావనీవిభుండు । నీ మృతికి హేతువుమ నేన నిజము నమ్ము. ౪౪౬

క. పో పో నీ మొగము గనిన । పాపంబని గొణిగికొంచు భయవిహ్వలయై
వాపోవు సీత కప్పుడు । సూపె న్నిజఘోరమూర్తి సువ్యక్తముగన్. ౪౪౭

వ. అట్లు పదితలలును, నిరువది చేతులునుం గల తన యుగ్రాకారంబు సూపి రావణుండు
బలిమిం బట్టుకొని రథంబుపైఁ బెట్టుకొని కొంపోవుతఱి జానకి యిట్లని రోదనంబు సేసె.

క. హా రామా హా రామా । హా రామా లక్ష్మణాగ్రజా రఘువంశో
ద్ధారా మారాకారా । యీ రావణుచేతఁ జిక్కి యే నేమౌదున్. ౪౪౮

క. రక్షింపుము రక్షింపుము । రక్షింపుము లక్ష్మణా నిరపరాధిని ని
న్నాక్షేపించితిఁ దప్పల । మీక్షణమునఁ జూడు మనుభవింపగవలసెన్. ౪౫౦

వ. అని విలపించుచు గగనంబున బోవు సమయంబున. ౪౫౧

చ. అరుణుని పుత్త్రుఁడై తగు జటాయువు రౌద్రరసంబుపూని య
య్యరదము నిల్పనం గని పలాశనుఁ డాజి యొనర్చి యార్చి య
వ్వరవిహగంబు గూల్చి పటువై ఖరి లంక నశోకవాటికన్
బిరబిరఁ జేర్చి రక్కసుల వేవురఁ గాపిడి యుంచె జానకిన్. ౫—

వ. అంత నచ్చట రాఘవుండు మాయామృగరూపధారియగు మారీచుం జంపి వచ్చుచుండ
మార్గంబున నెదుర్పడిన సౌమిత్రిం గాంచి 'తమ్ముఁడా! సీత నొక్కదానినిఁ బర్ణశాలనునిచి
నీ విట్లు రాఁ గతంబేమి?' యని యడిగిన నతండు సవిస్తరంబుగా సీత దన్నుం బంపిన
విధంబునుం జెప్పుడుం జింతిల్లుచు నిరువురుఁ బర్ణశాలకు వచ్చి చూచిన జానకి కానరామికి
వగచి వెదుకంబూని మధ్యేమార్గంబున జటాయువుం జూచి యతనివలన మార్గంబు నెఱింగి
యతని సంస్కరించి దారి నడ్డగించిన కబంధు హతుంజేసి వానిని శాపంబువలన తప్పించి
ఋశ్యమూకంబునకు వచ్చి సుగ్రీవుతో స్నేహమువాటించి వాలిని వధించి కిష్కింధాపురాధి
పత్యంబు సుగ్రీవున కొసంగి యప్పుడు వర్షకాలంబగుఁడు సలక్ష్మణుండై రాముం డచ్చటన
యున్న సమయంబున సీతావిరహదుఃఖభరంబున లక్ష్మణుఁ జూచి యిట్లనియె. ౨౫౩

తే. గీ. తమ్ముఁడా లక్ష్మణా సవతమ్మ కైక కోరికలు పండె జనకునికూతు రిందు
గానరాదాయె బ్రతుకంగలే నయోధ్య । కవనిజారహితుండనై యరుగఁగలనె? ౨౫౪

ఉ. పోయెను రాజ్య మీ విపినభూమి నివాసము వచ్చెఁ దండ్రియున్
బోయెను దైవ మెంతవెతఁబొందగఁ జేయఁగలండొ కట్టిడై
జ్ఞేయముకాదు ప్రాణులకుఁ గీడును మేలును మున్నుమున్నుగా
హా! యెటులోర్తు నేమిగతి హా జనకాత్మజ! యెందుబోయితే. ౨౫౫

ఉ. ఓయీ తమ్ముఁడ యెంతపాపమిది యయ్యో పూర్వజన్మంబులం
దే యే దుష్కృతు లాచరించితిమొకో యీ దుఃఖము ల్కానలోఁ
గాయ ల్కూరలు మెక్కుచుం బ్రతుకఁగాఁ గల్గెన్ మహేక్ష్వాకువం
శీయప్రాభవరాజపుత్త్రిమహిమల్ సీ! చెట్లపాలాయెఁగా. ౨౫౬

ఉ. భోగములెల్లఁ బోవిడిచి పూనితి నాయెడఁ గూర్మి తమ్ముడా
సేగియుఁ జెట్టయుం బెలుచఁ జెందుట కీవును గూడివచ్చితే
హా। గుణధుర్య పూర్వజననార్జితకర్మఫలంబె నీవునుం
భోగమొనర్చుచుంటి వది పోవునె యూరక యెంతయేడ్చినన్. ౨౫౭

ఉ. నే నొనరించు పాపమున నేను విపత్తులఁ బొందుచుండి యె
వ్వానిపయిం గడున్ గినుక వాటిలజేయుదుఁ జేత నొక్క కా
సైనను లేదు మేను వఱుగై బలమెల్లను దూలె వీరవి
ద్యానిపుణత్వ మేగెను సహాయుఁడ వీ వొకరుండవేకదా! ౨౫౮

క. విభవోజ్జ్వల సూర్యకుల । ప్రభువులలోఁ నెవ్వడేని పార్థివుడు విషా
దభయార్తుండు నభూతో । నభవిష్యతి మత్సమోస్తు నాఁదగు ననుజా. ౨౫౯

తే. గీ. ఏమిచేయుదు సౌమిత్రి । యింతదుఃఖసాగరంబునుఁ దాటింపఁజాలునట్టి
గట్టి పెనోడ్డ యేడ నేఁ గాంచువాఁడ । నీడ కిప్పుడు ననుఁ బిల్చువాఁ డెవండొ. ౨౬౦

తే. గీ. తమ్ముఁడా చూడు నాఁడు హస్తగతమైన । స్వర్గలోకంబువంటి రాజ్యంబు వోయె
భయదమౌ వనవాసంబు ప్రాప్తమాయె । నహహ విధినిర్మితము తెలియంగ వశమె. ౭౬౧

తే. గీ. చిన్నతనమౌటఁ దెలియక చెలియ సీత । నన్ను విడువక యీ యరణ్యములఁ జేరె
దైవగతి నురుదుఃఖ దుర్దశలఁ జిక్కి । దుష్టరాక్షసుపాలాయెఁ గష్ట మకట. ౭౬౨

శా. ఆ నా ముద్దులమూట య య్యబల లంకాధీశుగేహంబునన్
దా నెట్లోర్చి వసించు దుఃఖభరమున్ దైన్యంబుతో నయ్యయో
ఆ నమ్రత్వము భర్తృభక్తియు సుశీలాధిక్య మా నీతి యెం
దేనిం గంటిమె నాయెడం గలుగు ప్రీతిన్ జెప్పఁగా శక్యమే. ౭౬౩

తే. గీ. లక్ష్మణా విను జానకిలక్షణములు । నీ వెఱుంగవె రావణు కైవసంబు
కాదుసుమి జనకరాజన్యకన్య నన్నుఁ । జెట్టఁబట్టెను గాదది చెనఁటి కులట. ౭౬౪

క. తన తారహార మురిగాఁ । గొనియైనన్ రవనుగొట్టికొనియైనం జ
చ్చునుగాని రావణుఁడు బల్మినిఁ బూనఁగ వశగయగునె మెలఁత తనంతన్. ౭౬౫

ఉ. జానకి సచ్చువార్త విని సచ్చెద నేనును దానిఁ బాసి యీ
మే నిఁక నాకు నేల విలపించుచు నన్నము మాని పానమున్
మాని కృశించి నిద్రయును మాని యరణ్యములందుఁ జింతతో
హా నలినాయతాక్షి! జనకాత్మజ! యంచుఁ జరింప శక్యమే. ౭౬౬

క. అని యేడ్చుచున్న యన్ననుఁ । గనుఁగొని యకటా! యితండు ఘనదుఃఖాబ్ధిన్
మునిఁగె ననుచు నూరార్చుట । పనియని సౌమిత్రి యిట్లు పలికె మృదువుగన్. ౭౬౭

ఉ. పూనుము ధైర్య మీయెడను బొందకుమీ భయమింతయేనియున్
నే నొకరుండ పోయి యవినీతుని రావణుఁ జంపి యా దివౌ
కోనగరంబునం దమృతకుండిక నింద్రునిఁ గెల్చి యా గరు
త్మానుఁడు దెచ్చినట్లు గుణధన్యను సీతను దెచ్చియిచ్చెదన్. ౭౬౮

తే. గీ. వసుధ ధీరుల కాపద వచ్చినపుడు । సంపదలు వచ్చినప్పుడు సమమనీష
ననుభవింతుర సంపద కలరుచుందు । రాపదలకును దుఃఖింతు రల్పమతులు. ౭౬౯

క. ఇమ్మహి నెన్నఁగ దైవవశమ్ములెకా కొండుగలదె సంయోగ వియో
గమ్ములు శోకము దేహము । సొమ్మా మఱి కాక యాత్మ సొమ్మా చెపుమా. ౭౭౦

క. ఏగతి రాజ్యమువోయె మ । ఱేగతి వనవాసమబ్బె నేగతిఁ జనె సీ
తాగుణవతి సంయోగము । నాగతియగు మంచికాల మరుదెంచెడిచో. ౭౭౧

క. మానవుఁడు సుఖము దుఃఖము । పూని యనుభవింపకున్నఁ బోవదుసుమ్మీ
జానకిమాత్రము వేరని । నే నెంచను శోకమేల నిలుపుము ధృతిచేన్. ౭౭౨

క. వానరులు గలరు కోటులు । నానాదిశలరిగి జనకనందని వెద్దిన్
వీనుల విని వేగమ వా । ర్తానయన మొనర్పఁగలరు తత్తరమేలా. ౨౨౩

క. చొచ్చెద లంకాపురమును । వ్రచ్చెద విక్రమమునూపి పాపులనెల్లన్
దెచ్చెద సీతను సుఖముగ । వచ్చెద నీకిచ్చెద ననుఁ బంపుమి యన్నా ! ౨౨౪

ఆ. వె. అన్న మన యయోధ్యనున్న సైన్యమును శ । త్రుఘ్ను భరతుఁ దెచ్చి త్రుటినిఁ జంపి
నీకుఁ బ్రియముసేయ నేనుండఁగా నింత శోకమేల యయయొ ! చూడజాల. ౨౨౫

తే. గీ. ఏకరథుఁడైన రఘుఁడు మున్నెల్లదిశల । నోర్చి జయలక్ష్మిఁ గైకొనియుండలేదె
వానివంశంబున జనించి వాసిమీఱి । నట్టివాఁడవు దుఃఖింపనగునె నీకు. ౨౨౬

క. దేవతలను రాక్షసులను । బ్రోవిడి యమలోకమునకుఁ బుచ్చఁగలుగు నే
నీవైపున నుండంగా । రావణుఁడును గీవణుండు లక్ష్యమె చెపుమా. ౨౨౭

క. మనసాహాయ్యమునకునై । జనకునిఁ జేర్చికొనియైనఁ జయ్యనఁ గులపాం
సను సురకంటకు రావణుఁ । దునిమెదఁగా కన్న యేల దుఃఖము నీకున్. ౨౨౮

క తివిరి సుఖమబ్బి దుఃఖము । తవులుం దుఃఖంబుపోయి తత సుఖమగు రా
ఘవ ! యిటు సుఖదుఃఖంబులు । భువిఁ జక్రము పొరలినట్లు పొరలుచునుండున్. ౨౨౯

క. దేవతలకెల్లప్రభువగు । దేవేంద్రుడు దుఃఖమంది దీనుఁడుగాఁడే
వావిరి నహుషుఁడు రాజై । ప్రోవఁడె త్రిదివంబు దేవపూజితుఁ డగుచున్. ౨౩౦

ఆ. వె. నిజపదంబు విడిచి భజియించె నింద్రుండు । పద్మమధ్యమెనయ బహుశరత్తు
లధికభీతితోడ నఖిలంబు విడిచి య । జ్ఞాతవాసమునను భూతలేంద్ర ! ౨౩౧

ఆ. వె. తిరిగి మంచికాల మరుదెంచినంతనే । నహుషుఁ డార్యశాప మహిమఁజేసి
కొండచిలువయగుచుఁ గుంభినిఁ గూలిన । నింద్రుఁడేలె స్వర్గ మెప్పటట్లు. ౨౩౨

క. పౌలోమినిఁ గామించెను । లోలత నహుషుం డగస్త్యుఁడు శపింపంగాఁ
గూలె నతఁ డజగరంబై । భూలోకమునందు వినుము పూర్వయుగమునన్. ౨౩౩

క. శోకంబు గలిగినప్పుడు । వ్యాకులతంబడక యుద్యమాన్వితుఁడై య
స్తోకంబగు ధైర్యంబును గైకొని నిల్చిన నరుండె ఘనుఁడండ్రు బుధుల్. ౨౩౪

తే. గీ. నీకుఁ జెప్పెడివాఁడనా నేను నీకుఁ । దెలియనిది యున్నదే దివ్యదేవ ! నీ స
మర్థత యెఱుంగనే యుల్లమందు నింత । వంత యేటికిఁ బ్రాకృతువలె మహీశ ! ౨౩౫

వ, ఇట్లు లక్ష్మణుని యుపశమనవచనంబు లాలించి రఘునందనుండు దుఃఖంబు మాని
నిష్కలంకుండై యున్నతఱి. ౨౩౬

సీ. షడ్జవైఖరి బర్హిసంఘంబు గమిఁగట్టఁ బంచమాధ్వతిఁ బైకపంక్తి సేర
తారకంబున దేవతాస్త్రీలు తను మెచ్చ శ్రీరాగమున మోళ్ళు చిగురుబట్ట
సారంగమేళంబు సడి లేళ్ళు బరువెత్తఁ గలిత వరాళి భృంగములఁ బిలువ
శ్రుతిహితాలాపసంగతిఁ గన్ను లరప్రాల దాళానుసరణి హస్తములు నిలువ
తే గీ. సారెసారె బృహద్రథసామములను । వేడుకలరంగ సింపుగాఁ బాడికొనుచు
ననిలహతి మహతియు మ్రోయ నంబరంబు । నుండి డిగ్గెనుఁ గలహాశనుండు ప్రీతి. ౨౪౭

వ. ఇట్లు వచ్చిన దేవమునిం జూచి వినయభక్తిపూర్వకంబుగా రఘునందనుండు దిగ్గున
లేచి యెదురుసని యర్ఘ్యపాద్యాదులం బూజించి యాసనంబిచ్చి చేతులు జోడించి
తానును నుపవిష్టుండైన సానుజుం దాశరథిం గాంచి యత్యంతశోకాకులుండై యున్న
విధంబు ముఖచిహ్నంబులం గ్రహించి దేవఋషి యిట్లనియె. ౨౪౮

ఉ. ఏటికి దుఃఖమూనెదు దినేశకులోత్తమ ప్రాకృతుంబలెన్
బోటిని జానకిం బిశితభోజనుఁడైన దశాననుండు నీ
ధాటి యెఱుంగ కెత్తుకొని తాఁ జనెనంచు నెఱుంగుదున్ ద్యుష
త్కోటికి వాఁడు శత్రుఁడు సఖుండవు నీవుసుమా రఘూద్వహా. ౨౪౯

క. నే నింద్రుసభకు నేగితి । జానకివృత్తాంతమెల్ల శచిపతి సెప్పెన్
మానవచంద్రమః రావణుఁ । బూని వధించుటకె నీవు పుట్టితివిసుమా. ౨౫౦

క. జానకి నెత్తుకుపోయినఁ । గాని భవత్కోదవృత్తి గవలుకొనదు నీ
వా నయవిహీనుఁ జంపుట । కే నీ కతఁ డిట్లు సేసె నిది నిక్కమగున్. ౨౫౧

ఉ. జానకి తొల్లి యొక్క మునిచంద్రునికూఁతురు కాననంబునన్
బూని తపంబు సేయునెడఁ బోరున రావణుఁ డాపెఁ జూచి యో
మానిని నాకు భార్యవగుమా యనఁ గోపముతోడఁ జీ యనన్
మానక దాని కొప్పు పదమా యని బల్మినిఁబట్టి లాగినన్. ౨౫౨

ఉ. తాపసి వాని దుష్కృతము తాను సహింపక యోరి పాపుడా
నాపయిఁ జేయువైచెదె వినాశము నీకగు నిన్నుఁ జంపఁగా
నోపిక నేన పుట్టెద నయోనిజనై భువి నంచు నెంతయున్
గోపముతోడ శాపమిడి కోమలి నేఁడు జనించె సీతయై.

౨౫౩

ఉ. జానకి యిందిరాంశమున సంభవమైనది రావణుండు దా
మానవకాంత యిద్ధి తన మాటకుఁ జిక్కదె యంచు నజ్ఞతం
దానినిఁ గొంచుపోయెఁజుమి త్రాచునుఁ జూచి మతిభ్రమంబునం
బూనెను బూలదండ యని బొల్లున రాక్షసవంశ మార్పదే. ౨౯౪

తే. గీ. కామధేనువుపాలు బంగారుగిన్నె ప్రతికి యింద్రుండు ధారుణీసుతకుఁ బంపె
గుక్షినిండగ సీత దాఁ గుడిచెఁ బాలు నాఁకలియు దప్పికయును లే దాపె కిపుడు. ౨౯౫

క. కాకుత్థ్సా నీపుట్టువు నీకే మరుపాయె హరివి నీవు సురారిం
బోకార్ప సురలు కోర నరాకృతి జన్మించితివి మహార్కకులమునన్. ౨౯౬

తే. గీ. రావణాసురువధియింపఁ ద్రోవ యొకటి కలదు సెప్పెద వినుమి నిక్కమ్ముసుమ్ము
నాశ్వయుజమాసమున భక్తినాచరింపు। మఖిలజగదంబ వ్రతము జయార్థివగుచు. ౨౯౭

వ. రాఘవేంద్రా! దేవీనవరాత్రోపవాసంబునాఁబడు నేతద్వ్రతంబు సకలసంపత్ప్రదంబు. జప హోమ విధానంబులు యథావిధి నడపి మేధ్యంబులగు పశువుల బలియిచ్చి దశాంశంబు హవనంబు సేసితివేని నీ కిష్టార్థసిద్ధి యగు. నీవ్రతంబుం దొల్లి విష్ణుండును, శంకరుండును, బ్రహ్మయు, నింద్రుండును గావించి వాంఛితార్థంబులం బడసిరి. నీ వీ వ్రతము తప్పక యాచరింపుము. విపత్కాలంబున నెవ్వఁడేని దీని నాచరించిన శుభంబగు. విశ్వామిత్రుండును, భృగుండును, వసిష్ఠుండునుఁ, గస్త్యపుండును దేవీ వ్రతం బాచరించిరి. మరియుం దొల్లి బృహస్పతి పరాపహృతదారుండై యీవ్రతంబు సేసి మేలుజెందెఁ గావునఁ గాకుత్థ్సవంశోద్ధారకా రావణవధార్థివై నీ వీ వ్రతంబు సేయుము. వృత్రనాశనార్థియై ఇంద్రుండునుఁ ద్రిపురసంహారంబుకొఱకు శివుండనుఁ, మధుకైటభ సంహారంబునకై నారాయణుండును విధివత్తుగా నీవ్రతం బాచరించిరని చెప్పిన విని శ్రీరాముండు బ్రహ్మపుత్రా! యీ వ్రతంబునకు దైవంబెద్ది, దాని మహిమాదు లెట్టివి, యది యెట్లాచరింపవలయు, నీవు సర్వజ్ఞుడవు తెలుపవే యనిన నారదుండు దాశరథింజూచి యిట్లనియె. ౨౯౮

సీ. వినుమయ్య దశరథతనయాగ్రగణ్య నిత్యయు నాద్య కామద ధర్మమూర్తి
కారణం బెల్లలోకములకుఁ గల్యాణి బ్రహ్మాదివందిత పాపరహిత
ఆ దేవి శక్తి లేనప్పుడు పూరియుఁ గదలింప శక్తుండుగా డొకండు
నాతండ్రికిని సర్గనైపుణి నారాయణునకుఁ బాలనశక్తి త్రిణయనునకు
తే. గీ. సంహరణ కౌశలియు దాని శక్తివలన। నెచ్చటెచ్చట నెయ్యది యేమిసేయఁ
గల డొకం డొకశక్తిచేఁ దలప దేవి। శక్తియేసుమ్ము వేరొక్కజాడ లేదు. ౨౯౯

సీ. బ్రహ్మయు విష్ణుండు పరమేశ్వరుండును సూర్యుండు చంద్రుండు సురలు మునులు
నెవ్వరు లేనప్పు డీశ్వరి ప్రకృతియై పూర్ణయై తా నాదిపురుషుఁ గూడి
విహరించును యుగాది విగుణయై తర్వాత సగుణయై చేయు ముజ్జగము సృష్టి
మునుమున్ను బ్రహ్మాది ముఖ్యులకును శక్తులిచ్చును శక్తిచే నేదియేనిఁ
తే. గీ. జేయఁగ సమర్థతలఁ గల్గి శ్రీసమేతు । లగుచు సర్వంబునకును దా రధిపతులయి
గురుగణంబులతోడను గూడి పెలుచ వర్తిలుదు రిది నిక్కంబు వసుమతీశ! ౨౦౦

క. భగవతిని గొల్చువారికి । భగవతి స్మరియించునట్టి పావనులకు నా
భగవతి నమ్మినవారికి । భగవతి కరుణించి యిచ్చు భాగ్యములెల్లన్ ౨౦౧

వ. మఱియు వినుము దేవినామంబు లసంఖ్యేయంబులు; అకారాది క్షకారాంతంబు లగునెల్ల
వర్ణంబులును దేవీవాచకంబులై సంయోగక్రమంబునంజేసి నానా నామంబులగుననిన
విని రాఘవుండు నారదున కిట్లనియె. ౨౦౨

క. వినిపింపుము నారద దే । వినిఁ గొల్చెడివిధము నీవు విపులమతిని నే
ను సపుడు శ్రీదేవీపూ । జన మొనరించెదను భక్తి శ్రద్ధయు గుదురన్. ౨౦౩

వ. అనిన నారదుండు రాఘవేంద్రా! పీఠంబున జగదంబాప్రతిమను స్థాపించి విధాన
క్రమంబునఁ దొమ్మిదుపవాసంబులు సేయుము. దేవకార్యార్థినై నీకుం బ్రోత్సాహంబు
పుట్టించుచు నాచార్యుండనై వ్రతంబు సేయింతు ననిన విని రామభద్రుండు సత్యమ్మగు
నట్ల కావించెద నని దివ్యంబగు పీఠంబున దేవిని స్థాపించి యాశ్వయుజమాసంబున యథా
క్రమంబుగా వ్రతం బాచరింప, అష్టమినాటిరేయి నిశీథంబున సింహవాహనారూఢయై దేవి
గిరిశృంగంబుననుండి సానుజుఁడైన శ్రీరాముండు విన మేఘగంభీరభాషణంబుల
నో కాకుత్థ్సా! నీ భక్తిభావంబునకు సంతసించితి నని చెప్పి యిట్లనియె. ౨౦౪

క. నారాయణు నంశంబున । భూరిగుణా మనుకులమునఁ బుట్టితివి దురా
చారుఁడగు రావణుని సం । హారం బొనరించి దేవతావళి బ్రోవన్. ౨౦౫

చ. నిగమములన్ హరించి చని నీరజగర్భుని శోకవార్ధిలో
బగఁగొని ముంచి తస్కరునిభంగి మహార్ణవనిమ్ననీరమ
ధ్యగుఁడయి డాగియున్న యసురాధమునిం ఝషరూపధారివై
తెగఁ దలద్రుంచి వేదములు తెచ్చినవాఁడవు నీవె రాఘవా! ౨౦౬

మ. గిరి మంథానముగా నొనర్చి వరభోగీం ద్రాడు గావించి యా
సురలుం దానవు లబ్ధిఁ ద్రచ్చునెడ సంక్షోభంబుగా నుర్వరా
ధర మల్లాడఁగ దానిక్రిందఁ గుమరై తాబేటిరూపంబు భా
సురలీలన్ వహియించి మించిన మహాశూరుండ వో రాఘవా! ౮౦౭

మ. కనకాక్షుం డమరేంద్రు నగ్ని యము రక్షస్స్వామి నబ్ధీశు వా
యు నిధీశున్ శివుఁ గ్రౌంచభేదనుని దా నోడించి నిన్నుం మథిం
ప ననంతావలయంబుఁ జాపవలె నొప్పం జుట్టినన్ శిష్టపా
వన బుద్ధిం గిటివై ఖలుం దునిమి చేవం బేర్చవే రాఘవా! ౮౦౮

పంచచామరము : హిరణ్యకస్యపుండు జ్ఞానహీనుఁడై నిజాత్మజుం
కరంబు బాధఁబెట్టఁ జూచి కంబమందుఁ బుట్టి యా
సురారి బట్టి కొట్టి వాని సూనుఁ బ్రోవ నారసిం
హరూపధారివైతి వీవ యాదిదేవ రాఘవా! ౮౦౯

పంచచామరము : పటుక్రియం సురాళినెల్ల బాధఁబెట్టు దుర్మదో
త్కటుం బలిం బదత్రయంబు దానమిమ్మటంచు స
ద్వటుండవై త్రివిక్రమ ప్రభావమెల్ల జూపి తం
తటం రసాతలంబు వట్టె దానవుండు రాఘవా! ౮౧౦

మాలిని : భువి ద్విజకులమందుం బుట్టి ముయ్యేడుమాఱుల్
దవులుచుఁ బరశూద్ధ్యద్ధార రాజన్యకోటిన్
దివిరి సురపురంబున్ జేర్చితీ విద్ధకీర్తి
ప్రవిమల రఘురామా రాఘవా దైత్యభీమా! ౮౧౧

ఉ. ఇత్తరి రాఘవుండవయి యీ వుదయించితి వార్తి దేవతా
సత్తములెల్ల వేడఁ గపిసైన్యములెల్లను దేవతాంశజుల్
మత్తత శక్తి యుక్తి గరిమన్ బలవత్తరులైరి శేషుఁ డీ
యుత్తముఁడైన లక్ష్మణుఁడ యోర్చు నితం డిఁక రావణాత్మజున్. ౮౧౨

ఉ. నీకు జయంబగున్ వినుము నీరజలోచన సందియంబు లే
దాకడ నవ్వసంతమున నర్చనసేయుము నన్ను శ్రద్ధతోఁ
దేకువ రావణుం దునిమి ధీరమతిం పదొకండువేల యేం
డ్లేకవిధంబుగా ధరణి నేలుము పిమ్మట నేగు మింటికిన్. ౮౧౩

వ. ఇట్లు ప్రసన్నయై పల్కిన దేవి వాక్యంబులు విని సంతుష్టాంతరంగుండై వ్రతసమాప్తిం గావించి దశమిపూటం బయనంబై విజయా పూజనం బొనర్చి దానంబు లిచ్చి సుగ్రీవ ప్రముఖ వానరబలంబులతో సానుజుండై రామభద్రుండు సముద్రతటంబున విడిసి సముద్రంబుఁ గట్టి లంకం జేరి రావణాద రాక్షసులం జంపి జయంబు గాంచెనని చెప్పిన విని జనమేజయుండు. ౮౧౪

## —: కృతిపతి సంబోధనము :—

శా. ఫుల్లస్ఫార జటామరద్రుమలతాభూర్యట్టహాసస్ఫుర
త్కల్లోలారవజాలఫాలతలవీక్షామూలికాబాడబో
ద్యల్లీలాసురవాహినీ సుగతచూడాచంద్రరేఖాంశుమా
కల్లోలామృతవార్ధిరాణ్ణటన యల్లూరీశ సోమేశ్వరా! ౮౧౫

స్రగ్విణి. చిత్తనైశ్చల్యవ త్సేవనప్రక్రియా । యత్తభక్తీభవ ద్ధర్యబుద్ధ్యూతభా
స్వత్తనూజాతరక్షఃపయోనాధవా । యూత్తరేశేశ్వరాల్లూరి సోమేశ్వరా. ౮౧౬

గద్య. ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసు వంశపయః పారావారరాకాసుధాకర, కామాంబా కన్నయమంత్రీంద్రకుమార, పవిత్రహరిత గోత్రాలంకార కృష్ణా మండలమండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జితధరావిరాజమాన శ్రీవీరప్రతాప కోర్కొండహంవీర రామచంద్రభూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదక, నియోగభారవ్యవహార, శ్రీ వేంకటేశ్వర వరప్రసాదసంభూత కవిత్వ విద్యావిశేష, బాల్యాదిరచిత త్రింశత్ప్రిత్యేక గ్రంథ మతిసార, విబుధజనకరుణాసంపాదితోభయ భాషాపరిచిత ప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణంబునం దృతీయస్కంధము.

తృతీయస్కంధము సమాప్తము.

శ్రీ

# దేవీభాగవతము

## చతుర్థస్కంధము

క. శ్రీవనితామణిమాలా । శ్రీవత్సకవత్సదంభరేఖామహిత
శ్రీవేషకమనసు మన । శ్శీవిమలరసాభివేశ శ్రీసోమేశా. ౧

వ. అవధరింపు మనంతరంబ. ౨

### —: జనమేజయకృత కృష్ణజన్మాదికారణ ప్రశ్న :—

ఆ. వె. వ్యాసమునివరేణ్య వాసవేయానఘ । జ్ఞాననిధివి నీవకావె మాకు
వంశవర్ధనుఁడవు ప్రశ్నచేసెద నొక్క । చరితఁ జెప్పుమయ్య కరుణతోడ. ౩

ఆ. వె. శూరసేనరాజసుతుఁడగు వసుదేవు । తనయుఁ డగుచు శౌరి దా జనించె
ననుచు వింటిఁ బూజ్యుఁ డానకదుందుభిఁ । జేరి కంసుఁ డెట్లు చెరను బెట్టె ? ౪

క. దేవకియును వసుదేవుఁడు । పావనులుగదయ్య యేమిపాపమునం గా
రావిష్టులైరి ? యెందుకు । జావంగా మొత్తె శిశుకషట్కము నతఁడున్ ? ౫

క. కారాగారమునందున్ । ధీరుం డేలీల వాసుదేవుఁడు పుట్టెన్
బోరునఁ గోకులమున కతఁ । డేరీతిం జేరె జగదధీశుం డనఘా ! ౬

క. మాతయుఁ దండ్రియుఁ జెరలో । పాతంకతనుండ ముక్తి సలుపగ యేలా
యాతఁడు జన్మాంతరగతుఁ । డై తనరెన్ జగదధీశుఁ డగు దేవుండై. ౭

ఆ. వె. సకలకర్త గర్భసంవాసియైయుండఁ । దల్లిదండ్రులకును దప్పదాయెఁ
బూర్వవిహితకర్మమునఁ గాళ్ళసంకెళ్ళు । తెలియ దేరికేని దేవిమహిమ. ౮

తే. గీ. వాసుదేవుండు పుట్టిన భవనమందు । గంసుచే నీల్గి రార్వురు కందు లెవరు ?
తుదకుఁ గంసావనీశుచేఁ ద్రోయబడిన కాంత యెవ్వతె ? యెందుకుఁ గలిగె నచట ? ౯

ఆ. వె. జాతిమీదనుండి యా తన్వి యాకాశ । మునకు నెగసి యష్టభుజములలరఁ
గానుపించె నెట్లు ? గార్హస్థ్య మేలీల । నడపె బహుసతీయుతుఁడు మురారి ? ౧౦

ఆ. వె. అచ్యుతుని చరిత్ర మానోట నానోట । వినుటెకాని యది సవిస్తరముగ
వినుచుమయ్య యెట్లు విడిచె దేహ మతండు జగమునందు నతని చర్య లేమి. ౧౧

ఆ. వె. బదరికాశ్రమమున బహువర్షములు ధర్మ । జులు పురాణమునులు సూరినుతులు
నయవిశాలురు నర నారాయణాఖ్యులు । నిరశనవ్రతంబు నియతి నెరపి. ౧౨

ఆ. వె. తపముఁజేసి రోలి ద్వైత్యారికళలచే వారి యంశములనె వాసవియును
హరియు నుద్భవించెనని వింటి నెట్టులఁ బూర్వకాయములను బోవిడిచిరి. ౧౩

తే. గీ. భవవిముక్తి నిఁగోరి తపంబుజేసి । యెట్లు మానవులై పుట్టి రిద్ధచరితు
లైనమునులు నరుండు నారాయణుండు । సకలలోకైకవర్ణ్య లక్షణులు ఘనులు. ౧౪

ఉ. శూద్రుఁడు ధర్మము న్నెరపి శుద్ధత రాజయి పుట్టవాఁడు దా
నద్రతి ధర్మము న్నెరపి సౌమ్యత బ్రాహ్మణజన్మమెత్తు న
చ్ఛిద్రత బ్రాహ్మణుండు భవసింధువు దాటునటంద్రు పెద్ద లీ
మూద్రికి వ్యత్యయం బడరె మాధవ పార్థుల జన్మవృత్తముల్. ౧౫

ఉ. కాయలు గూర లాకులు దగం భుజియించి యరణ్యమందు నా
రాయణుఁడు న్నరుండు దిరులై దపముం బొనరించి సంసృతిం
బాయని రాజదేహముల పాలగుటేలనొ వారు జన్మిగ
ల్లై యవనీపతిప్రభవ మందఁగ నేటికి తాపసోత్తమా! ౧౬

తే. గీ. బ్రహ్మశాపంబు యాదవప్రతతి కాయె । కృష్ణు గాంధారి శపియించెఁ గినుక వంశ
నాశమగునని ప్రద్యుమ్నునాము నేల । శంబరుండు హరించెను జటిలవర్య ! ౧౭

ఉ. ద్వారక దుర్గమంబు హరి దా జగదీశుఁడు సూతికాగృహ
ద్వారము దుర్ఘటంబు నళినాక్షుఁ డెఱుంగడె దివ్యదర్శనుం
డారయ సందియంబు విడదయ్యెఁ గృపన్ వివరింపుమయ్య నీ
కూరిమిఁ బల్కుదేనియలు గ్రోలక చిత్తము శాంతిఁజెందునే. ౧౮

సీ. భూభారము నడంపఁ బుట్టిన విష్ణువు మధురలో వసియింప మానెనేల
భూభారము హరింపఁ బుట్టిన విష్ణువు పడఁతుల బోయలు బట్టిరేల

భూభారము హరింపఁ బుట్టిన విష్ణువు ద్వారకఁ జేరె నేకారణమున
భూభారము హరింపఁ బుట్టిన విష్ణువు చోరుల వధియింప నేరదేల
యనుచు డోలాయమానమై యంతరంగ । మెంతయును జిక్కువడియున్న దిపుడు నాకు
విన్నవింపుము గృపతోడ విని యనాకు । లాంతరంగుఁడ నయ్యెద ననఘచరిత. ౧౯

క. భద్రాత్ములైన యా భీష్మద్రోణుల వధయు, భూమిభర మణఁపఁగ న
క్షుద్రులె వారలు సజ్జన విద్రావణ మెట్టులొప్పె విష్ణున కనఘా! ౨౦

వ. మఱియు మహాత్ములును ధర్మతత్పరులును గృష్ణభక్తులును నగు పాండవు లుత్తమ యజ్ఞంబైన రాజసూయంబుఁ జేసి బ్రాహ్మణులకు షోడశమహాదానంబు లొనరించి వివిధ దక్షిణలం దృప్తులం జేసి దేవతాంశసంభూతులని కొనియాడంబడియుఁ బలు విధంబులగు కష్టంబులపాలైరికదా? వారు చేసిన పుణ్యం బెచ్చట డాగె? వారు పడిన కష్టంబులకు హేతువుగా వారు చేసిన ఘోరపాపంబులేమి? అదియుంగాక రమాంశంబునం బరమపావనియై వేదిమధ్యంబునం బుట్టిన యయోనిజయు, సాధ్వియు, శ్రీకృష్ణభక్తియుక్తయు నగు ద్రౌపదికి ఘోరదుఃఖంబులు ప్రాపింపఁ గారణం బేమి? దుశ్శాసనుండు కొప్పుఁబట్టి యీడ్చి రజస్వలయై, యేకవస్త్రయై యున్నదాని సభకుం గొనివచ్చె. విరటునింట దాసియై కొలిచె, కీచకునిచే భర్జింపఁబడి దుఃఖించె, సైంధవునిచే హరింపంబడి దురపిల్లె, నా మహాపతివ్రత కీ ఘోరంబులు వచ్చుటకుం బూర్వజన్మంబున నేమిపాపంబు సేసె? మా కులవృద్ధులు మహాపుణ్యఫలదంబైన రాజసూయంబుసేసి యమితదుఃఖంబు లనుభవించిరి. ఏతాదృశంబులగు నానా విధంబులగు సందేహంబులపాలై యున్న నన్నుం గరుణింపవే యన విని సాత్యవతేయుండు జనమేజయున కిట్లనియె. ౨౧

## —॰ సకలప్రపంచ కర్మ కారణత్వ విచారము ॰—

చ. తెలియఁగరాదు కర్మగతి దేవత లజ్ఞులు మానవాళి కె
ట్లలవియగున్ నరేంద్ర జగదండములం ద్రిగుణాత్మకంబులన్
జెలువుగఁ గర్మమే మొదల సృష్టియొనర్చును సంశయంబు లే
దలుఘు వనాదికర్మము మహత్సహకారియు జీవబీజమున్. ౨౨

క. పుట్టుదురు వివిధయోనుల । గిట్టుదు రిటు మఱల మఱల గిరగిరఁ బృథివిన్
నెట్టనఁ గర్మరహితమై । పుట్టదు దేహంబు నిజము భూతలనాథా. ౨౩

క. ఘను లా కర్మము త్రివిధం । బని పల్కిరి పుణ్యకర్మ మనియుం బాపం
బనియున్ మిశ్రంబనియున్ । విను మదియే మఱల మూఁడు విధము లటంచున్. ౨౪

క. సంచితమును ప్రారబ్ధము । నంచును నాగామియనుచు నక్కర్మంబే
మించి సకలజంతువులకు । బంచున్ సుఖదుఃఖములను బడిబడి నధిపా. ౨౫

తే. గీ. బ్రహ్మదేవుండె తాఁ గర్మబద్ధుఁడయ్యె । సుఖము దుఃఖంబు జరయును శోక హర్ష
మృత్యువులు శత్రుషడ్వర్గ మెల్లదేహ । గతగుణంబుల మూలంబు కర్మమండ్రు.

సీ. కర్మ సంబంధముల్ కావె వైరములఁ జెల్మి కర్మ సంబంధంబ కాదె పుట్టు
కర్మసంబంధంబ కాదె సూర్యునిక్రాంతి కర్మసంబంధంబ గాదె జగము
కర్మసంబంధంబ కాదె చంద్రునిక్షతి కర్మసంబంధంబ కాదె చదువు
కర్మసంబంధంబ కాదె యీశ్వరుభిక్ష కర్మసంబంధంబ కాదె మేను

తే. గీ. కర్మ మది నిత్యమో యట్లు కాదొ యనుచు
మునులు మీమాంసములలోన మునిఁగి రింతె
కాని తెలియ రనాదియై కానుపించు
మాయ జగమెల్ల నిత్యంబు బాయఁద్రోచు. ౨౭

శా. నానాధర్మమయంబులై తనరు నానాయోనులన్ జన్మముల్
పూనున్ విష్ణుఁడు స్వేచ్ఛచే యుగయుగంబున్ దాని భూవాసమున్
మానుం బల్గతుల న్సుఖం బనుభవింపంజొచ్చు నేకారణం
బో నిత్యోన్నతసౌఖ్యవంతులకు విణ్మూత్రస్థితుల్ గిట్టునే. ౨౮

తే. గీ పూలపందిళ్ళలో జలపూర్ణములగు । కొలఁకులందును జలకేళి సలుపుచును సు
ఖంబు నొందెడివారికి గర్భగోళ । మందును జరాయువుననుండ మది బొసఁగునె. ౨౯

తే. గీ తప్తకాంచనమయములై తనరి చారుతరములగు హంసతూలికా తల్పములను
బండికొని సుఖియించెడి భాగ్యనిధులు । తొడరి పన్నుండఁగలరె యధోముఖముగ. ౩౦

తే. గీ. ఆతుర సుఖప్రదంబులౌ గీతనృత్య । వాద్యము ల్వించు సుఖియించువారలకును
గర్భనరకంబు విణ్మూత్రకలిత। మెందు । నేని సుఖకారియై యొప్పునే మునీంద్ర ! ౩౧

తే. గీ. ఆ మహాకమలాలయ హావభావ । నిర్మలానందమునఁ జొక్కు నీరజాక్షుఁ
డెట్లు విడిచెను వైకుంఠ మిందు గర్భ । వాస విణ్మూత్రమయకోశ మానఁజేసి. ౩౨

సీ. ఏదిలేకుండఁగా నిచ్ఛయించి మునీంద్రు లతిఘోరతపముల నాచరింత్రు
ఏదిలేకుండఁగా నిచ్ఛయించి మహాత్ము లఖిలయాగంబుల నాచరింత్రు
ఏదిలేకుండఁగా నిచ్ఛయించి ప్రబుద్ధు లెల్లదానంబుల నిచ్చుచుంద్రు

ఏదిలేకుండఁగా నిశ్చయించియు జ్ఞాను । లదరి సంసారము ల్విడుచుచుంద్రు
అస్థి దుర్గంధసంకులం బగ్నియుతము । క్రూరము వసాన్వితంబును గ్రిమిసహితము
హేయ మలమూత్రసంయుతం బిదియసుమ్ము । గర్భనరకంబు హరి యెట్లు కాంక్షజేసె.

సీ. మావితిత్రినిఁబడి మఱిమఱిదొరలుచు మూత్రంబుఁ ద్రావుచు మురికిలోన
నెమకుచు మలభక్షణమును గావించుచుఁ బురుగులు గరువఁగా నొరగి యొరగి
జఠరాగ్ని కొకకొంత సంతాపమునుబొంది సుఖముగాఁ జెరలాడ జోటులేక
గడియ యుగంబుగా గడుపుచుఁ బదినెలల్ వివిధబాధలఁ జిక్కి చివర కొక్క

తే. గీ. సమయమున నింటరంబైన సన్నపాటి । యోనియంత్రంబు వెడలఁగా నోప కాత్మ
గంది యిలఁబడి వెంటనే కావు కావు । మనుచు విలపించు గర్భార్తి యల్పమగునె ?

సీ. బాలభావంబున బధిరు నంధుని మాడ్కి యుక్తం బయుక్తంబు నొగినెఱుఁగక
క్షుద్రుఁ డావేదనల్ సుడివెట్ట నేడ్చుచుఁ గన్నతల్లిని విసుగంగఁజేసి
పరతంత్రుఁడై యొండు పలుకనేరక యొడల్ మలినమై దుర్గంధకలన నెసఁగ
లజ్జలే కుగ్గుబాలను ద్రావుచును గ్రుక్కవెట్టుచు నిట్టట్టు గొట్టుకొనుచు

తే. గీ. ఘోరబాలగ్రహంబుల బారిఁబడుచు । నొప్పుదప్పులు పరులతోఁ జెప్పలేక
పొత్తులందుండి మంచానఁ బొరలికొనుచు । బాధపడు జన్మమేలనో ప్రాజ్ఞులకును ౩౫

క. హరి విధి రుద్రులు సైతము । విరచిత కర్మపరిపాకవిధి సుఖ దుఃఖ
స్ఫురితులుగారే తలఁపన్ । బురుషుల కియ్యది యవస్యభోక్తవ్యమగున్. ౩౬

క. యాగములు చేసి తపములు । బాగుగ నొనరించి యింద్రపద మంది తుదిన్
భోగమునఁ బుణ్య మడఁగన్ । వేగమె య య్యింద్రుఁడైనఁ బృథివిం బడఁడే ! ౩౭

క. రామావతారయోగము । చే మరుతులు కోతులైరి శ్రీకృష్ణసహా
యామరులు యాదవులుగా । భూమిన్ జనియించి రిట్లపో యుగయుగమున్. ౩౮

క. యుగయుగమున నారాయణుఁ । డగణితముగ నెత్తుచుండు నవతారంబుల్
భగవంతుఁడు ధర్మము ని । ల్పఁగ దుష్టుల నడప భూమిభారము వాపన్. ౩౯

ఆ. వె. కానఁ గృష్ణజన్మ కథఁ జెప్పెదను విను । మాదివిష్ణుఁ డట్లు యదుకులమున
నవతరించెఁ గస్యపావతారమె వసు । దేవుఁ డతఁడె కృష్ణదేవు తండ్రి. ౪౦

ఆ. వె. యదుకులంబు శప్తమయ్యెను గోవృత్తి । పాలుపడియె మఱియుఁ బరమధన్యుఁ
డైన కశ్యపుండు నవనిపై జనియించె । నదియు నతఁడు శాపమందికాదె. ౪౧

తే. గీ. అదితి దేవకియను నొక్క ముదిత యయ్యె । సురస రోహిణియైపుట్టె ధరణి వరుణ
శాపమున నని వింటిని జనవరేణ్య । యనిన జనమేజయుం డిట్టు లనియె మునికి. ౪౨

తే. గీ. పరమఋషి కశ్యపుఁడు జేయు పాపమేమి । తోయజేక్షణ లిరువురితోడగూడ
శాప మతనికి నెట్లుగా సంభవించె । దయగలిగి తెల్పఁగదవయ్య తాపసేంద్ర! ౪౩

క. వైకుంఠపురమునందున్ । శ్రీ కమలాసహితుఁడగుచుఁ జెలఁగెడి విష్ణుం
డేకారణమునఁ బుట్టెను । గోకులమునఁ దెలుపుమయ్య గుణరత్ననిధీ. ౪౪

సీ. భగవంతుఁడు ఘనుండు ప్రభు వవ్యయుండు సర్వాధారమూర్తి నారాయణుండు
కర్మవంతుఁడుఁబోలె గడఁగి వైకుంఠంబు విడిచి నరాకృతిఁ బడసె నెట్లు
భావంబులెన్న నానావిధంబులుగానఁ గామ మాత్సర్య శోక సుఖ దుఃఖ
క్రోధ వైరార్జవ కుటిలతా ప్రీతి దుష్కృత సుకృత విమోహ వితత లోభ

తే. గీ. భయము లందంగ నేమిలాభము ధరిత్రి । మానుషంబున దుఃఖముల్ పూనియనుభ
వింపకుండంగ నలవియే విష్ణు విట్టు । లాచరించుట కెవ్వని యాజ్ఞ చెపుమ. ౪౫

సీ. బ్రహ్మకుఁ దండ్రియై పరఁగిన విష్ణుండు రామావతారంబు రహి వహించి
ఘనతరం బైనట్టి వనవాసదుఃఖంబు సీతావియోగ సంజాతభీతి
సారెకు సారెకు సంగ్రామశోకంబు దారపరిత్యాగ దారుణార్తిఁ
బొందె శ్రీకృష్ణుండు పుట్టెను జెఱసాల గోకులంబున కేగెగొల్లఁగాసె

తే. గీ. గష్టమునఁ గంసు వధియించె దుష్టవధల । నొచ్చె సంసారివలె నెల్ల యొచ్చెములను
గారణంబేమి జేసిన కర్మమేమి । తెలుపుము సవిస్తరముగ సుధీవరేణ్య. ౪౬

వ. అనిన విని వ్యాసుండు జనమేజయున కిట్లనియె. ౪౭

## — వసుదేవాద్యవతార కారణము —

క. నారాయణు నవతరణము । కారణములు పెక్కులెన్నఁ గల వట్లనె బృం
దారక జననంబులకును । వారక చెప్పెదను వినుము వసుదేవు కథన్. ౪౮

వ. నరేంద్రా! తొల్లి కశ్యపుండు యజ్ఞంబు సేయం బూని తన్నిమిత్తంబుగా లోకపాలుర ధేనువుల
నపహరించిన వరుణుండు వచ్చి కశ్యపునకు నమస్కరించి దీనాననుండయి దుఃఖించి
అయ్యా! నేనేమి చేయుదు? నా యావును దయ సేయుం డనిన నతం డట్లు సేయమి కల్గి నీవు ధేను
పాలకుండవై పృథివిం బుట్టుమని శపించినఁ గన్నీళ్లు పెట్టుచుఁ జెనిమిటి యొద్దనున్న
యిరువురు భార్యలం గాంచి వారల నట్లు కండనియుఁ గారాగార నివాసంబు గలుగుననియు
నచ్చట మాతృహీనములగు వత్సంబు లేడ్చుటం బట్టి యదితి మృతవత్స యగుం గావుత
మనియు శపించిన నది పద్మసంభవుండు విని కశ్యపుం బిల్చి యతనితో నిట్లనియె. ౪౯

చ. తెలివిగలాఁడవయ్యు దిగధీశుల గోవుల నేల నీవు ద్రు
చ్చిలితివి క్రమ్మఱ న్విడుపు సేయ వదేటికి న్యాయమా యయో
తెలియఁగ లోభమెట్టిదియొ ధీరులు పాపము సేయఁ బూని ర
జ్ఞులవలె లోభ మెన్నఁడును గూడదు కూడదు కూడ దేరికిన్. ౫౦

శా. ధీరుల్ శాంతమతుల్ జితేంద్రియులు సందీప్తోరువై ఖానసా
చారుల్ ధన్యులుగారె లోభరహితాచ్ఛ్రశీలఁ జెన్నొంది సం
సారం బెన్నఁగ ఘోరశత్రు విడియే సత్యంబు సుమ్మీ దురా
చారుండయ్యెను గశ్యపుండు పరమాశాపాశబంధంబులన్. ౫౧

క. పరమేష్ఠియు మర్యాదన్ । భరియింప శపించెఁ గశ్యపముని మనుమనిన్
ధరణిని యదుకులజుఁడవై । పరఁగుము నీ సతులతోడఁ బాయక యనుచున్. ౫౨

వ. ఇట్లు వరుణ సురజ్యేష్ఠుల శాపంబులవలనఁ గశ్యపుండు తన యంశంబుచే భూలోకం
బున వసుదేవుండై పుట్టె. మఱియు, శోకసంతప్తయగు దితిచే నదితి శపింపఁబడె నని
చెప్పిన విని జనమేజయుం డక్కథ సెప్పవే యనుఁడు వ్యాసుండు. ౫౩

సీ. ధరణీశ దక్షుని తనయలు దితియును నదితియు ననువార లందు నదితి
యం దింద్రుఁ డుదయించె నధికబలుండయి యప్పుడు దితియుఁ గశ్యపునిఁ జేరి
యింద్రునంతటివాని నిద్ధధర్ముని వీర్యవినుతుఁ బుత్త్రి నొసఁగు మనిన మౌని
కమలాక్షి స్వస్థవు గమ్ము నేఁ జెప్పిన వ్రతము సేయుము దాని ఫలముగాఁగ
నాకపతివంటి పుత్త్రిండు నీకుఁ గల్గు । ననిన విని యట్లు కావింప నంతఁ గశ్య
పుఁడు నిషేకం బొనర్పంగఁ బొలుపుమీఱ । వనజదళనేత్ర చూలాలితనము మోచె.

క. ఆ తరుణి వ్రతపరాయణ । యై తప్పక నియమ మెడప కతినిశ్చలతన్
భూతలమునందుఁ బ్రాత । శ్శీతోదస్నాన మొప్పఁ జేసెనుజుండీ. ౫౪

క. ఈతీరున నత్యంత । ప్రీతిన్ వ్రతమూని దితి ధరించెను గర్భం
బాతఱి నదితి సహింపక శీతకరాననను జూచి చింతిలెఁ బెలుచన్. ౪౬

ఉ. ఇంద్రునివంటిపుత్త్రుఁ డుదయించు మహాబలుఁ డీపడంతికిన్
ఇంద్రుని తేజమెల్లఁ బరిహీణముగాదె యటంచుఁ జింతతో
ఇంద్రునిపాలి కయ్యదితి యేగి యయో మఘవా మహామహ
స్సాంద్రుఁడు పుట్టు నద్దితికి శత్రుఁడు నీ కతఁ డయ్యెడుంజుమీ. ౪౭

ఉ. పుట్టిన పిమ్మటన్ రిపునిఁ బోనడపం దరమౌనె కావునం
బుట్టకయున్న యర్భకుని మొత్తుట మంచిది యయ్యుపాయముం
గట్టిగఁ జేయుమీ తనయ నాకు మనోవ్యథ రాజయక్ష్మయై
పట్టెను వృద్ధిఁబొందె రిపుపాతమునం గడు సంతసించెదన్. ౪౮

గీ. సవతియుత్కర్ష పటులోహశంకువగుచు । గర్భమున నాటె నది పెరుకంగ నిప్పు
డొక యుపాయంబు సేయుమా యొప్పుగలిగి । సామదానాదులను సురస్వామి యనిన. ౪౯

తే. గీ. తల్లిమాటలు విని దేవవల్లభుండు సవతితల్లికడకు నేగి సవినయముగ
నంజలియొనర్చి పాదంబులందు వ్రాలి యంగిట విషంబు మున్నాల్క నమృత మిడుక
పలికె నిట్లని పాపమం దళుకులేక ౫౦

శా. అమ్మా నీవు వ్రతమ్ముచే నలసి దేహస్వాస్థ్య మింతేని లే
కిమ్మాడ్కన్ గృశియించియుంటి విదిగో నే నీకు సేవార్థమై
సుమ్మీ వచ్చితి పెట్టుమీ పనులు నా చోటన్ గృపాయుక్తవై
యిమ్మీ పాదమువట్టి యొత్తెదను నే నిందుండి నీ బిడ్డనై. ౫౧

క. నీవును నదితియు నొక్కటి । యై వర్తిల్లుదువుగదమ్మ యమ్మా యనుచున్
వేవేగఁ బదములొత్తుచు సేవ యొనర్పంగఁ దొడఁగె సీమంతినికిన్. ౫౨

తే గీ. అడుగులొత్తంగ సుఖనిద్ర నాపె యున్న । తఱి విలోకించి యతిసూక్ష్మతనువు దాల్చి
దితి కడుపుసొచ్చె దేవతాధీశుఁ డపుడు । తడవు సేయంగరాదిదే తఱి యటంచు. ౫౩

చ. కడుపుననున్న బాలకుని గట్టిగఁబట్టి నిజాయుధంబుచే
గడువడి నేఁడు ఖండములుగాఁ దెగఁగోసిన బాలుఁ డేడ్చినన్
బడిబడి "మా రుదేతి"యని పల్కుచు నొక్కొకఖండ మేడుగా
విడ నరికెన్ సురేంద్రుఁ డవి భేదిలి నల్బదితొమ్మిదై తగెన్. ౫౪

చ. అంతట మేలుకాంచి వనజానన గర్భగతార్భకాంగమున్
గృంతన మాచరించెనని యింద్రునిపైఁ గడుఁగోపగించి దు
శ్చింతనతో సపత్ని యిది చేసె నటంచు నెఱింగి యింద్రునిం
బంతముతోడ నయ్యదితిఁ బట్టి శపించెదనంచు నుగ్రయై. ౬౫

తే. గీ. ఎట్లు నాగర్భమునుగోసె నింద్రుఁ డట్లు । వాని రాజ్యంబు పోవు సపత్ని యింత
గుప్తపాపంబు చేసెను ఘోరబుద్ధిఁ। జెఱనువడి పుత్రశోకంబుఁ జెందు నదియు. ౬౬

ఆ. వె. అని శపించి యేడ్చు నద్దితిఁ గనుఁగొని । కోపమేల నీకు గోమలాంగి
మరుతులగుచు నీ కొమరులు వర్తింత్రు । బలపరాక్రమములఁ బ్రౌఢులగుచు. ౬౭

తే. గీ. అదితికిని శాపమిచ్చితి వదియు నిర్వ । దెన్మిదవ ద్వాపరంబున నెనసి మనుజ
రూపమునఁ బుట్టి భుజియించు శాపఫలము । వరుణుఁడు శపించియుండె నివ్వనితఁ దొల్లి.

క. అని యి ట్లాశ్వాసించిన విని యదితియు సంతసించె విప్రియమింతే
మనమునఁ దలఁపక నుడువక కన నది తన పూర్వజన్మకర్మం బనుచున్. ౬౯

క. ఆ యదితియె దేవకియై । యీయవని న్సంభవించె నృపసత్తమ క
ర్మాయత్తులగుచు దేవత । లే యావిధమైరి మనుజు లెట్టిరు తలఁపన్. ౭౦

వ. అనిన విని జనమేజయుండు భగవంతుఁడగు వ్యాసుం గాంచి యో మహాభాగా నీవు వక్కా
ణించిన యీ యాఖ్యానంబు విని విస్మితుండనైతి. పాపరూపంబయిన యీ సంసార
బంధంబు విడిపించుకొను నుపాయం బెద్దియేని సెలవిమ్మని మరియు నిట్లనియె. ౭౧

## —* సంసార విముక్త్యుపాయము *—

తే. గీ. అయ్యయో కశ్యపునికొడు కఖిలలోక । విభవసంపన్నుఁడయినట్టి విబుధనేత
చేసెను జుగుప్సితంబైన చెడ్డచేత నింక నేమానవుం డాచరింపకుండు. ౭౨

చ. కడుపునఁ జొచ్చి బాలకునిఁ గట్టిగ దారుణ వజ్రఘాతముల్
వడినిడి చెక్కెనే యనృతభాషణముల్ పచరించి దేవనా
థుఁడు పరమాద్భుతంబు విబుధుల్ సుకృతైకపరాయణత్వమున్
విడిచిరి కర్మయోగమున వెంగలి మానవు లెంతవారిలన్. ౭౩

శా. నా తాతల్ కురుభూమి ఘోరతరజన్యంబున్ దురుద్యోగులై
యాతంకంబులు లేక భీష్ముఁడు కృపుం డా ద్రోణుఁడుం గన్యకా
జాతుండున్ యమనందనుండును మనశ్చాపల్యముం బూనిరే
గోతం ద్రోచిరె శాంతభావమును వైకుంఠుండు ప్రేరేపఁగన్. ౬౪

క. ఈ సంసార మసారం బాసింపఁగరాదు దీని నని యెఱిఁగిన స్వా
ర్వాసుల యంశములయ్యున్ । జేసిరి పాపములు పాండునృపతికుమారుల్. ౬౫

తే. గీ. మహితధర్మంబునకును ప్రమాణమేది । నిక్కువమెఱుంగ కెంతేని చిక్కువుట్టు
నీవు చెప్పిన కథ విని నేడు మిగుల । గాతరత జలచిత్తుండ నైతిసుమ్ము. ౬౬

క. ధర నాప్తవాక్య మెందును । నరయఁ బ్రమాణంబటంచు నాత్మఁదలంపన్
బురుషుండు రాగసహితుడు బరమాప్తుం డెట్టులగుఁ గృపామతి సెపుమా. ౬౭

తే. గీ. అర్థనాశభయంబున నదరి పుట్టు । రాగమును ద్వేషమును ద్వేషరంజవమున
స్వార్థసిద్ధికి సత్యంబు సమసిపోవు । రాగులగువార లాప్తులేలాగు చెపుమ. ౬౮

తే. గీ. అల జరాసంధు వధియింప నచ్యుతుండు । కృతకసర్వంసహామరాకృతి వహించె
నతనిసంగతి కట్టి దా యజ్ఞకార్య । మందుఁ జేసిన పనులు సహ్యములె చెపుమ. ౬౯

తే. గీ. ఎందు కెటువంటి దా యజ్ఞ మెంచిచూడ । శమవిహీనంబు పరలోకసాధనంబొ
యహహ యసహించుకొను మహాయశముకొఱకొ । కాక మరియొందు పుణ్యంబు
గాంచనొక్కొ. ౭౦

సీ. ధర్మంబు ప్రథమ పాదము సత్యమందురు శౌచంబు రెండవ చరణమండ్రు
దయయుఁ దృతీయ పాద మటండ్రు దానంబు నలరఁ బెద్దలు జతుర్థాంఘ్రియండ్రు
ధర్మహీనంబైన కర్మంబు సుఫలప్రదం బెట్టులగును ధర్మంబులేక
బలిని వంచింపంగఁ బద్మనాభుఁడు పొట్టివడుగయి ధర్మాత్ము నడఁగఁద్రొక్కె.

తే. గీ. నీ త్రివిక్రమ బలులలో నెవడు గెలిచె । సర్వసముఁడవు ధర్మవిశారదుఁడవు
ఘనుఁడవు పురాణకర్తవు కలితబుద్ధి । వాప్తుఁడవు చెప్పుమయ్య నన్నాదరించి. ౭౧

వ. అనిన విని వ్యాసుండు నవ్వి మేనుజనాయకా త్రివిక్రమమూర్తికి నెల్లజగంబులు దానంబు సేసి సత్యవాక్యంబునం బ్రసిద్ధివడసిన బలిచక్రవర్తిదే జయము. విష్ణుండు త్రివిక్రముఁడయ్యు వామనునామంబునం బ్రసిద్ధుండయ్యె. నింతియకాక నారాయణుండు ద్వారపాలకుండై

వర్తించె. ధర్మంబులకెల్ల మూలంబు సత్యంబుకాదే ! సత్యంబు దుస్సాధ్యంబు. త్రిగుణియై బలవత్తరయైన మాయ బహురూపిణియగు మాయవలననే ప్రపంచం బుత్పన్నంబయ్యె. కావున మాయామోహితులకు సత్యం బెట్లుసిద్ధించు, వనవాసులగు వైఖానసులు నిస్సంగులై నిష్ప్రతిగ్రహులై రాగద్వేషాదిరహితులై సత్యంబు పలుకుచు, సత్యవాది, సత్యవాదిత్వ నిదర్శనరూపులై ప్రవర్తింతురు. బ్రహ్మాది స్తంబ పర్యంతంబగు జగదండంబు సర్వంబును మాయామయంబు. సగుణ రచితంబులగు శ్రుతి స్మృతి పురాణేతిహాసంబులు సగుణంబులేకాని యన్యంబులుకావు. నిర్గుణంబ కర్తయు నకారయితయు నని తెలియుము. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యంబు లను శత్రుపరంపరచే సంబద్ధుండైన జీవుండు సత్యవాది యెట్లగు? విభవం బహంకారంబుఁ బుట్టించు. నహంకారంబు మోహంబు గల్గించు, మోహంబున మరణంబు గలుగు. నందు బహువిధంబులగు సంకల్ప వికల్పంబు లుద్భవిల్లు. నీర్ష్యయు, నసూయయు, ద్వేషంబును, ఆశయు, దృష్ణయు ధర్మంబునుం బొడము. రాగలోభాదులవలనం జేయఁబడు కర్మంబులు నింద్యంబులై పరిశుద్ధంబులుకావు. అన్నిఁటికిని మూలంబు ద్రవ్యశుద్ధి. అట్టి ద్రవ్యశుద్ధి న్యాయార్జిత ద్రవ్యంబువలనఁ జేయబడు కర్మంబు సత్ఫలంబు నిచ్చు. అన్యాయార్జితంబగు ద్రవ్యంబువలనఁ జేసిన కర్మంబు దుఃఖఫలదంబ యగు. మనశ్శుద్ధి ద్వితీయం బది లేనినాడు సర్వంబును నిష్ఫలంబ యగు. ఆచార్య ఋత్విగాదులు పరిశుద్ధులైన సర్వకర్మంబులు సత్ఫలదంబులగు. కావున దేశ కాల క్రియా ద్రవ్య కర్తృ శుద్ధులు ముఖ్యంబులు. శుద్ధంబులగు మంత్రంబులు శత్రునాశాది ఫలంబులు, యథార్థ ఫలదంబు లగు. ౮౨

తే. గీ. పాపమిది పుణ్యమిది యని పాటిసేయ । స్వార్థసక్తులు నేరరు సకలసురలు
నసురులును స్వార్థపరులు నన్యోన్యశత్రు । భావములు గల్గియుండ్రు సంపదల గోరి. ౮౩

తే. గీ. సురలు సత్త్వోద్భవులు మనుజులు దలంప । రజమువలన జనించిరి రహి దమస్సు
వలనఁ దిర్యక్కు లుదయించె వానిలోన । సురలకే వైరములు గల్గ నరుల లేరె. ౮౪

క. మును లాచరించు తపములకును విఘ్నము లెసఁగఁజేయఁ గోరుదురు సురల్
మనుజేంద్ర జాతివైరములను మృగములు పూని వర్తిలం జిత్రంబే. ౮౫

క. సంతుష్టి లే దొకింతయుఁ । బంతంబుల నొండొరులకుఁ బగయును మాయా
చింతనలును సంసృతి య । త్యంతాహంకారజనిత మవనీనాథా. ౮౬

సీ. వేయిమాటలకేమి వినుము ధరాధీశ సంసార మిది ద్రోహ సంగతంబు
వితతరాగద్వేషయుతచరాచరమగు గృతయుగం బిఁకఁ గలి నెన్ననేల
ద్యుచరు లీర్ష్యాభలద్రోహపరాయణుల్ తిర్యఙ్నరుల నింకఁ దెలుపనేల

ద్రోహి ద్రోహిసముద్ర ద్రోహికి ద్వేషంబు సలుపుట యదిసూడ కలతయంద్రు
జపపరాయణు శాంతు జటిలుఁ దపోవిఘ్నకృతిఁ గలంచుచునుండు శతమఘుండు.

గీ. యోగ్యులగువారికిని సత్యయుగముసుమ్ము । యోగ్యులగువారికిని గలియుగము మఱియు
మధ్యమంబగు మధ్యమ మానవులకు । యుగము లెన్నంగఁబడుఁ గ్రియాయోగములన.

ఉ. వాసనకారణం బవనిపాలక యెల్లెడ ధర్మసంస్థితిన్
వాసన దూషితంబగుచు వర్తిల ధర్మము దూషితంబగున్
వాసన కల్మషంబయిన నాశమువచ్చును సత్యమెందునున్
భాసురవిశ్వసృడ్హృదయ పంకజపుత్త్రుఁడు ధర్ముఁ డెన్నఁగన్. ౮౮

తే. గీ. దక్షకూతుంద్రఁ బమగుర ధర్ముఁడాడెఁ । బెండ్లి వారలయందు జన్మించి రవని
హరియుఁ గృష్ణుండు నరుఁడు నారాయణుండు నరుఁడు నారాయణుఁడు హిమగిరికి జనిరి.

చ. హిమగిరియం దుదారగుణులిద్దరు సత్యపరాయణు ల్మహో
ద్యము లఖిలోత్తముల్ బదరికాశ్రమసీమను గంగయొడ్డునన్
విమలతపంబుఁజేసి రొకవేయి సమల్ జగమెల్లఁ దత్తప
స్సముధితవహ్నివేగఁ గని శక్రుఁడు గొందలమంది యాత్మలోన్. ౯౦

క. ఈ ధర్మపుత్త్రు లిరువురు । బోధాత్ములు ధ్యానపరులు పూర్ణులు వీరిం
బాధింపవచ్చునే యిఁక । సాధనమెయ్యదియొ తెలియఁజాల నటంచున్. ౯౧

క. అని కామంబును క్రోధం । బును లోభము ననెడువానిఁ బుట్టించుక యో
జనవర యైరావతగజ । మును నారోహించి చనియె మునులను జూడన్. ౯౨

తే. గీ. గంధమాదనమున కేగి కడఁగి యందు । బ్రహ్మ పష్ణువుఁబోలెఁ బ్రభాసమృద్ధిఁ
దపముసేయుచున్నట్టి ధర్మజులను । మహితతేజులఁ జూచి విస్మయము నొంది. ౯౩

క. ధర్మునికొడుకులువీ రే । కర్మంబున నేమిఫలముఁ గాంక్షించెదరో
యర్మిలి నడిగెద ననుచుం । గూర్మియెసఁగ వాలఁరగసుఁగొని యిట్లనియెన్ ౯౪

తే. గీ. ఏమిగోరి తపంబు మీరిట్లుచేసె । దరు మహాత్ములు చెప్పుఁడి త్తఱి నవేయఁ
దగనిదైన నొసంగెద ధర్మపుత్త్రులార యని పలువిధముల నడిగికొనినన్. ౯౫

క. ఆ మునులు తపోధ్యానమ । హామహిమం బలుకకున్న నమరేంద్రుఁడు మా
యామోహిని వృక శార్దూ । లామిత సింహములతోడ నపు డొదవించెన్. ౯౬

ఆ. వె. వాన గాలి నిప్పు వడివేగ నొనరించె । భీతులగుచు మునులు లేతురంచు
ధర్మసుతులు ధ్యానతత్పరులగుచును । గదలరై రొకింత మెదలరై రి. ౯౭

సీ. పుట్టించి పంపితి మోహిని నొకదాని కఠినవ్రతు ల్మును ల్కదలరైరి
వ్యాఘ్రసింహాదులఁ బరపి వేసారితిఁ దాపసుల్ నిజనిష్ఠఁ దలఁగరైరి
వర్షంబు వాతంబు వడిఁ గల్గఁజేసితి జడదారులొక్కింత జడియరైరి
దావానలంబుల దరిఁ గొల్పి చూచితి ఋషు లొకింతయును జలింపరైరి
ధ్యానభంగంబుసేయంగఁ దగినవాఁడు । గలఁడె వీరికి వరలోభకలన లేదు
భయమొకింతయుఁ గనరాదు పరమనిశ్చలాశయులటంచు నరిగె నయ్యమరవిభుఁడు.

వ. ఇట్లు సురవిభుండు నిరాశుండై గృహంబునకుం జని దుఃఖించుచు అయ్యో నేనేమి సేయుదు ? వీరు సనాతనియు, మహాదేవియు, సర్వలోకేశ్వరియుం బ్రకృతియునగు మహావిద్యం ధ్యానించుచున్నారు. ఆ మహాశక్తివలన సకలదేవత లుద్భవిల్లిరి. కావున వీరు దేవతలచే బాధింపబడరు. వాగ్బీజ కామబీజ మాయాబీజంబు లెవ్వని హృదయంబున వర్తిల్లు వాని నోర్చువాఁడు ముజ్జగంబులం గలఁడే యని చింతించి మాయామోహితుండై శక్రుండు కామ వసంతులం బిలిచి యిట్లనియె. ౯౯

## — ఇంద్రకృత నరనారాయణ తపోవిఘ్నము —

సీ. కంతుఁడా నీ వీవసంతునితోఁగూడి సతియైన నీభార్య రతినిఁగూడి
అప్సరస్త్రీసమూహమునెల్ల గైకొని గంధమాదనగిరికడకు నేగి
బదరికాశ్రమమునఁ బరమతపోనిష్ఠఁ గదలకున్న మునియుగంబు సేరి
మోహనోచ్చాటనమ్ముల ముంచి నీ యైదుమార్గణంబుల బహు మార్గములను
వారిచిత్తములఁ గలంచవలయునుమ్ము । నీదు బాణమ్ము దగిలియు నిలిచియుండు
వాఁడు గలడె సురాసురవర్యులందు । విధియు విష్ణుండు జితులయిరి వీరలెంత ౧౦౦

క. వారాంగనలును నీవును । జేరినచో నచటి సొగసుఁ జెప్పంపరమే
నారాయణుండు నరుఁడును । మీరి చనంగలరె పడరె మీ వలలోనన్. ౧౦౧

తే. గీ. రంభ యొక్కతె చాలదే రాతినైనఁ । గోతిఁగావించి యాడించు నాతిలోత్త
మాఖ్య యంతటిదేసుమీ యదియు నీకుఁ । దోడుగా వచ్చుఁ గొదవేమి నేడ చనుము. ౧౦౨

క. మునులార కామితార్థము । లను నే నిచ్చెదనటంచు నతి వినయమునం
బనిఁబూని వేడుకొనినన్ । మునులు కదలరైరి ధ్యానమున మునిఁగి తగన్. ౧౦౩

క. మాయలొనరించి చూచితి । భీయుక్తులుగారు వారు భీకరమృగరా
డ్వాయుజలదాగ్నిముఖములఁ । గాయంబులనొంచినాఁడ, గదలరు వారల్ ౧౦౪

ఉ. నావుడు మన్మథుండు సురనాథునిఁ గాంచి తథైవ యంచు నే
డే వెడలంగ శంకగలదే హరినేని గిరీశునేని వా
ణీవరునేని యవ్వరుణునేని దివాకరునేని నొంచెదన్
దేవినిఁ గొల్చువారలను దేరి కనుంగొననోప వాసవా. ౧౦౫

ఆ. వె. కామరాజబీజ కలితులై వర్తిల్లి । వారు దేవిగొల్చువారలేని
సురవరేణ్య నాదు శరముల వారలఁ గాడలేవు తేరి చూడలేవు. ౧౦౬

చ. అన విని యింద్రుఁ డో మదన యచ్చటికిం బద మింక వీరలం
గొని నను దుఃఖితుం గనుము కోరితి నిన్నును నా కసాధ్యమౌ
పనియని నీవెరుంగని యుపాయము లేదు సమస్తభంగులన్
మునుల తపంబులం జెఱిచి మోద మొసంగుము నాకు నావుడున్. ౧౦౭

క. విని వారందరు గమియై । చని మునియుగమున్న వనము చక్కటి నంతం
తనయంద వసంతుఁడు దా । మునుకొని నిజచేష్టితముల ముంచెన్ జగమున్. ౧౦౮

సీ. చిన్నమామిడికొమ్మ చెంగావిపైఠిణి సవరించె ననగ లే జివురులొప్పె
మోదుగ లతకూన ముద్దులకెంబట్టు వలువగట్టె ననంగ నలరులొప్పె
రాగంబుగల రంభ రహి బద్మరాగభూషలు దాల్చెడి ననంగ ఫలములొప్పె
నెరి మధూక నగస్తనీజాతకుచకుంకుమ స్వేదజల మన మధువులొప్పె
నెచటఁ జూచిన రక్తిమైఁ బృథివి యునుని । తో వసంతంబులాడుచు ఠీవిమెఱయఁ
గోకిలాకాకలీకల కూజితములఁ । గొసరు ననఁగ వసంత మకొ్కన నడరె. ౧౦౯

మ. మలయాశీకుచళిప్తచందనపరామర్శక్రియాలోలుఁడై
వలపెక్కం ద్రవిడీముఖస్ఫురితభవ్యద్రవ్యతాంబూలగం
ధిలుఁడై యాంధ్రకుటుంబినీకచభరానేకప్రసగానందియై
కలయం గ్రుమ్మరు దక్షిణానిలుఁడు చక్కం బెట్టునో యవ్వనిన్. ౧౧౦

సీ. అలరుదేనియసోన నందిచ్చు మగతేఁటి భృంగికి వలపురా బెదవులంటి
చిగురాకు బువ్వమ్మ మగకోయి లందిచ్చుఁ గోకిలకును ముక్కు కొనను నాకి
తియ్యమామిడిపండు నొయ్యన మగచిల్క యందిచ్చు శుకికి నోరానికొనుచు
నునుదామరలతూండ్లు గొనివచ్చి మగయంచ హంసి కందిచ్చు ముద్దానికొనుచు
సరసు దాపున రంభ యిచ్చలు మెలంగెఁ । బ్రసవసమయంబు గావున మల్లి తనదు
నడుము ప్రక్కలు కొమ్మలందందఁ బట్ట । వెల్లబోయెడిని వసంత వేళలందు. ౧౧౧

క. మగవారికి మగువలపై । మగువలకును మగలమీఁది మమతలు హెచ్చెన్
జగమున వసంతుఁ బోలిన । ప్రగడ గలఁడె చాతురాయబారంబులకున్. ౧౧౨

క. కమ్మని చల్లని మెల్లని । తెమ్మెరలును చందమామ తేటలు తేటుల్
గ్రమ్మిన కోయిలకూతల్ । సమ్మిశ్రములయ్యె నవ్వసంతమునందున్. ౧౧౩

సీ. పరిజనులై భృంగపఙ్క్తి ఝుమ్మని మ్రోయఁ బాఠకులై పికప్రతతి బాడ
ధవళాతపత్రమై కువలయాప్తుఁడు మీఁద వెలఁదుల కొనులు విప్పగాఁగ

జలజేక్షణాపాంగములు శరంబులుగాఁగఁ దెమ్మెరకూన దా తేరుగాఁగ
మధుర గీతాదులు మంగళధ్వనులుగా మధుమహారాజు సారథియుఁగాఁగ
మొసలిటెక్కెంబుఁ దాల్చి యీ మూఁడులోక । ముల జయింపఁగఁజాలిన వలతి మదనుఁ
డువిద రతిగూడి రంభా తిలోత్తమాదు । లంటి రాఁజేరెను బదరి కాశ్రమంబు. ౧౧౪

సీ. సరిగమపదనిస స్వరజాతి మూర్ఛనాగ్రామకంపనముల గతు లెఱింగి
శృంగారతానప్రసంగశోభితకళామహిత మధ్యమకాల మార్గ మెఱిఁగి
గౌళ కేదార హిందోళ కాంభోజీ వరాళీ ప్రముఖ రాగ రక్తి దెలసి
ధ్రువ వినాయక రూప క్రైకాట ఝంపాది తాళవిన్యాసవిధాన మెఱిఁగి
మృగఖగోరగసంతతు ల్మేతలుడిగి కదగిఁ విన మోళ్ళు జిగిరింప గగనచారి
వారకాంతలుపాడి రవ్వనమునందు । ప్రకటరసయుక్తి లోకరంజకముగాగ ౧౧౫

క. ఆ గానము వినువారికి । మాగాణములేల దీర్ఘ మౌనము లేలా
రాగము యోగము భోగము । త్యాగము పూర్ణముగ సకల మందే కలుఁగున్ ౧౧౬

సీ. పాటీరసాంకవ పన్నీరగంధముల్ తొడరి ముక్కోఁళ్ళలోఁ దూటి తూటి
భామినీసంగీత పరభృతకాకలీశ్రుతుల రంధ్రంబులఁ జొచ్చిచొచ్చి
వలినాలి తెమ్మెరల్ వలరేని పూఁదూపు లల్లనల్లన మేన నంటియంటి
పొలుపుగాఁ బిండారబోసిన ట్లల్లెడ ముదురువెన్నెల కనుల్ ముట్టిముట్టి
మధురమధుసీకరము మంద మారుతపు వశమున రసనల కంతంత జారిజారి
ధ్యానములు మాని నరుఁడు నారాయణుండు కాంచి రగ్రవనస్థలిఁ గనులు విప్పి. ౧౧౭

వ. ఇట్లు చూచి. ౧౧౮

తే. గీ. ఈ యకాలవసంత మిదేమి చెట్ల ననలు గొనలెత్తె హిమకరాననలు జనులు
ననవిలుతు బారి జొక్కి రెన్న నలువతును । నలవిగానట్టిగతి దోఁచె నౌర యిపుడు. ౧౧౯

వ. అందు నరునిఁ జూచి నారాయణుఁడు విస్మయోత్ఫుల్లనయనుండై యిట్లనియె. ౧౨౦

ఉ. చూడుము తమ్ముఁడా వనము సొంపు ప్రసూనమయమ్ము కోకిలల్
పాడెడి యింపుఁ బ్రస్ఫురిత పంచమనాదమయమ్ము తుమ్మెదల్
కూడిన పెంపు ఝంకృతి విలోలనినాదమయమ్ము నేడుగా
వేడుకలయ్యెడున్ మదనవీరుని పండుగ లేమి చెప్పుదున్. ౧౨౧

ఆ. వె. ఈ వసంత సింహ మేపుమీఱఁగ వచ్చి । మోదుగ విరిగోళ్ల మొత్తిమొత్తి
శిశిరభీమగజము జీరి కోరాడెఁగా యహహ దీనిమహిమ మద్భుతంబు. ౧౨౨

సీ. అమలారుణాశోక హస్తయై చెలువొంది లలితకింశుకపాద కలితయగుచుఁ
గ్రమనీలాశోక కబరియై పొలుపొంది యతిమనోహర కమలాస్యయగుచు

నవనవేందీవరనయనయై తనరారి రాజిత శ్రీఫలోరోజ యగుచు
రమణీయతర కుందరదనయై కొమరొందె బంధుజీవకరదావరణ యగుచుఁ
బరభృతస్వరయును గదంబ వసనయును । బర్హిబర్హకలాపయు బహుళసార
సస్వనాంచిత నూపురశాలి యగుచు । బదరికాశ్రమవనలక్ష్మి పరిఢవిల్లె. ౧౨౩

వ. ఇది యకాలంబునం బ్రాప్తంబయిన వసంతంబు తపోవిఘ్నకరంబని దీని నెఱుంగుము. ధ్యానవినాశకంబయిన యచ్చరలగానం బదియె వినంబడుచున్నయది. దేవనాథుండు మన దపంబులకు భంగంబుసేయ నియ్యుపాయంబు వన్నె నని తలంపుము. లేకున్న వసంతం బిట్టి సమయంబునం బొడసూపం గతంబేమి యని పలుకుచున్నతరి మన్మథప్రముఖులగు నెల్లవారలుం గన్నులకెదుటఁ గానవచ్చి రందు మన్మథుండును, మేనకయు, రంభయుఁ, దిలోత్తమయుఁ, బుష్పగంధియు, సుకేశియు, మహాశ్వేతయుఁ, బ్రమద్వరయు, ఘృతాచియుఁ, జారుహాసినియుఁ, చంద్రప్రభయు, విద్యున్మాలయుఁ, గాంచనమాలినియు, పుంజికయుం దక్కు సౌరవారాంగనలును బదియాఱువేల యేబది సంఖ్యగల సైన్యంబు వారలయెదుట దండప్రణామంబు లాచరించి కృతాంజలులై నిలఁబడియున్న సమయంబున మన్మథవివర్ధనంబులగు నానావిధ సాహిత్యరసోదీర్ణంబులగు శృంగారప్రబంధంబులు చెవుల పండువులుగా సురాంగనలు పాడిన విని నారాయణుం డతిప్రీతి నిట్లనియె. ౧౨౪

తే. గీ. ఇంద నివసింపఁ డాతిథ్య మిత్తు మీకు । స్వర్గముననుండి యతిథులై వచ్చినారు
మీర లూరకపోవుట మేలుగాద । టంచు పలికించి హరిగర్వ మడఁపఁదలఁచి. ౧౨౫

క. తనచేతిగోళ్ళతోడం । దనయూరువుఁ బగులఁజీరి తతవిస్మయముం
బొనరించి యెల్లవారును । గనుఁగొనఁగా నొక్క యందకత్తెం గనియెన్. ౧౨౬

సీ. అపరంజిరేకుల ట్లలరారు చెక్కిళ్ళు నునుగెంపు వాతెర కనుఁగులయ్యె
నిండుజాబిల్లి పన్నియనొప్పు నెమ్మొము కలువకన్నులతోడఁ జెలిమిసూపెఁ
దమ్మిమొగ్గలవంటి స్తనములు చిన్నారి కేలుదూండ్లకు సౌరు గీలుకొల్పె
రమణీయనీలాహి సమమైన నూగారు పొక్కిలిపుట్ట కొప్పులుఘటించె
ననుచు నందఱు విస్మయం బందిచూడఁ । జూచి పరవశులై యాత్మ సోలి సొక్కి
సొక్కి యక్కజమనగ వక్కణింప । నొక్క చక్కనిచుక్క దా నుద్భవిల్లె. ౧౨౭

తే. గీ. దాని కుపచారములు సేయఁ దగినయట్టి । సుందరుల నచ్చరవెలందు లెంద ఱంద
ఱను సృజించెను బూన్కి నారాయణుండు । నిమిషమున నేమిచెప్ప సంయమి మహిమము.

క. నారాయణమునిచంద్రుని । యూరువునం బుట్టెఁగాన నూర్వశి యయ్యెన్
గారణమూర్తికి మ్రొక్కుచు । నారీమణి పాడె మధుర నాదాన్వితయై. ౧౨౮

క. ఈమాడ్కి నూర్వశీముఖ । భామామణులెల్ల పాటఁ బాడుచు వేడ్కన్
ధీమంతులైన మునులు మ । హామహిమం బొగడఁజొచ్చి రతి భక్తి మెయిన్. ౧౩౦

ఉ. అంతట దేవకాంత లరుదంది మునిద్వయిఁ జేరిఁ మ్రొక్కి య
త్యంత ముదంబున న్వికసితాననలై పులకాంకురోద్గమా
క్రాంతశరీరవల్లులయి కంతుని పూవులబంతులో యనన్
వింత నెసంగి భాసుర వివేకులు మిమ్ముల నెన్న శక్యమే. ౧౩౧

సీ. వినుఁడు మాచూపులు విషసంయుతములైన తూపు లెవ్వనిమీఁద నేపుమిగుల
దగులు నాతఁడు మనస్స్థైర్యంబు ధైర్యంబు నొనగూడి నిలుచు నోహో విచిత్ర
మహిములు మీరు సామాన్యులే నారాయణాంశంబుచే జన్మ మందినారు
శమ దమ ప్రముఖ నిశాంతులు హరిహయుపంపున నిన్ను సేవింపవచ్చి
నార మిచ్చటికిని మౌనులార మిమ్ముఁ । గనులఁ గంటిమి మాదు భాగ్యంబు లెన్న
దరమె ధన్యులమైతిమి తప్పులెన్న । కేలుకొనరయ్య మమ్ముల జాలిదలఁచి. ౧౩౨

వ. అనిన విని జితకామలోభులును, ధర్మతనయులును, దపోరుచిరశోభితాంగులునునగు నరనారాయణులు సుప్రీతులును, సుప్రసన్న వదనలునై వినయానతలైన విబుధ కామినీబృందంబుల నీక్షించి యిట్లనిరి. ౧౩౩

క. అడుగుండు వాంఛితమ్ముల । నడువుం డూర్వశినిఁ గొంచు నాకంబునకున్
నుడుగుం డింద్రునితో మే । ముడుగర లిచ్చితిమి వారయువతుల ననుచున్. ౧౩౪

వ. అన విని దేవాంగనలు. ౧౩౫

ఉ. ఎక్కడబోవువారము సమిద్ధభవచ్చరణారవిందముల్
దక్కెను మాకు నీవరముదక్క మఱొక్కటి యెంతయెక్కుడే
నక్కఱలేదు కోరుఁడని యానతియిచ్చితి రంతెచాలు బల్
చొక్కపు వక్కలాకులను జుట్టి నినుం గొలువంగఁ జేయుమా. ౧౩౬

క. నారాయణ మధుసూదన । సారసదళనేత్ర నీదు సానులమై మే
మీరేడుజగములందుం । బేరెక్కుటకంటె నింక వేఱొకటున్నే ? ౧౩౭

క. ఈ యూర్వశి మొదలగు న । బ్జాయతలోచనలు పోయి యమరేంద్రుపురిన్
జేయుదురుగాక మమ్ములఁ । బాయక రక్షించు మిచటఁ బరమదయాళూ ! ౧౩౮

క. పదియాఱువేలపై యే । బదిమందిమి మేము నీకు భార్యల మగుచున్
ముదమున నుపచారక్రియ । లొదవించెదమయ్య తాపసోత్తమ నీకున్. ౧౩౯

ఆ. వె. మాట నిలుపుకొనుము మావాంఛితంబిమ్ము । వలచి వచ్చినట్టి యలరుబోండ్ల

వలపుఁదీర్పకుంట వారలఁ జంపుటే । కాన హింసనంబు గాదు సేయ. ౧౪

వ. అనిన విని నారాయణుండు. ౧౪౧

క. వేయేండ్లు నిండెఁ దపమున । నీయెడఁ జెలులార నిర్జితేంద్రియవృత్తిన్
జేయఁగలనె భంగము కా । మాయత్తత సుఖవినాశ యనుచుఁ దెలిసియున్. ౧౪౨

వ. అనిన విని యచ్చరలు. ౧౪౩

చ. పొలుపగు గమ్మకస్తురియుఁ బున్గు జవాదియు మంచిగంధమున్
గలిపినతావిసీ రగరు గ్రప్రము గుంకుమరేఖ లొప్పఁగా
విలసిలు మా కుచద్వితయవేదికలందును మేను దార్చినం
గలుగు సుఖంబు జూడఁగ సుఖంబెకదా వరణీయ మేరికిన్ ? ౧౪౪

క. ఆనందో బ్రహ్మ యనం । గా నీవెఱుగఁనిదె మమ్ముఁ గలసి సుఖింపం
గా నాక మొక్కటి వలయు । నానియమీ గంధమాదనం బెక్కుడగున్. ౧౪౫

వ. అనిన విని ధర్మపుత్త్రుండగు నారాయణుండు కొండొకతడవు డెందంబున నాలో
చించి యిప్పుడు నాకుఁ గర్తవ్యం బెయ్యదియో యని సందిగ్ధహృదయుండై. ౧౪౬

క. ఈ దుఃఖ మహంకారో । త్పాదిత మిది నాకు నిదియె ధర్మముఁ జెరచుం
బాడగు భవవిటపికి ను । న్మాదంబున మౌనముద్ర మానితి నయయో ! ౧౪౭

క. వారాంగనల జూచితి । నారీబృందంబుఁ గల్పనముఁజేసి తపో
భూరిమహిమఁ జెడనాడితి । పారములేనట్టి గొడవపాలైతి నయో ! ౧౪౮

చ. వలపున నన్నుబట్టి తమవాఁడవు గమ్మని రేమిసేయుదున్
సలిపితి నూర్ణనాభివలె జాలము జాలములోనఁ జిక్కి నే
వెలువడనేరనైతి సురభీరువులం ద్యజియింతునంచు నేఁ
దలఁచితినేని తక్షణమ తప్పక నన్ను శపించి పోవరే. ౧౪౯

క. వీరలు విడిచినఁ జాలుం । బో రూఢిగఁ గానఁ గ్రోధరూక్షాక్షుఁడనై
పారఁగఁ ద్రోలెద ననుచుం । బ్రారంభము బూని మఱల నాలోచించెన్. ౧౫౦

ఆ వె. సుఖము బడయగోరి సుఖశత్రువైనట్టి । క్రోధ మొకటి మఱల గొంటినేని
కామ లోభ గతులకంటె దుఃఖదమగు । దానివలన హింస తప్పకొదవు. ౧౫౧

క. గాత్రమునబుట్టు క్రోధము । గాత్రంబు దహించు వృక్షకాండజనిత దా
రిత్రుండై దహనుడు దా । జిత్రంబుగ వృక్షములనె చెడగాల్చుక్రియన్. ౧౫౨

వ. అని యిట్లు బహువిధంబుల నాలోచించుచుం జింతాపరుండై దీనమానసుండై యున్న
యన్నం జూచి నరుం డిట్లనియె. ౧౫౩

ఉ. కోపము గూడదెన్నఁడును కోవిద కోపము తాపహేతువౌ
పాపము వచ్చుగాన శమభావము బూనుము తొల్లి కోపమే
చూపి సహస్రవర్షములు స్రుక్కి హిరణ్యజుతోడ బోరి సం
తాపము నొందినారముగదయ్య యహంకృతి మాను మియ్యెడన్. ౧౩౪

వ. అనిన విని నారాయణుండు క్రోధంబు మాని శాంతివహించెనని చెప్పిన వ్యాసుంజూచి జనమేజయుం డిట్లనియె. ౧౩౫

క. హరిభక్తుఁడు శమదమత । త్పరుడు మహాభాగు డట్టి ప్రహ్లాదునితో
నర నారాయణులకు సం । గర మెట్టులగలిగె వింతగాదే వినగన్. ౧౩౬

ఆ. వె. దనుజపుత్రుతోడ ధర్మపుత్రులకు స । మాగమం బదెట్టులయ్యె నతడు
వీరితోడ బోర గారణం బెయ్యది । కోప మెట్లుబుట్టె గోవిదులకు ? ౧౩౭

ఆ. వె. తపము లేడబోయె జపము లెక్కడబోయె । స్నాన మేడబోయె సంధ్య యేడ
బోయె శాంత మేడబోయెనో ధర్మంబు । గోత బూడ్చివైచికొనిరె చెపుమ. ౧౩౮

ఆ. వె. సత్యయుగమునందు శమదమాదులుగల్గి । తపములాచరించు తాపసులకు
విడువదాయె ధర్మవిచ్ఛిత్తిహేతువౌ । క్రోధ మేమిచెప్పఁ గురువరేణ్య. ౧౩౯

వ. తాపసేంద్రా! అహంకారాంకురంబులేక క్రోధాదులు పుట్టవు; అతిదారుణంబగు తపంబు వర్షసహస్రంబుజేసియును నహంకారంబునం జెడిపోవు; సూర్యుడుదయించి తమంబును విరియజేసినట్లయగు అహంకారంబుమ్రోల పుణ్యంబు నిలువదు. మహానుభావుండయిన ప్రహ్లాదుండు నారాయణునితోడ యుద్ధంబుసేసె; ఆహా! శాంతులగు నరనారాయణులు తమ తపోధర్మంబులు చెడనాడి యుద్ధంబు సేసిరి. ఇట్టివారే యహంకారాంకురంబునం జిక్కువడిరి, ఇక నాబోంట్ల చెప్పనేల ? జగత్త్రయంబునందు నహంకారరహితుండు లేడని యెంచుచున్నాడ. చరాచరంబు సమస్తం బహంకారనిబద్ధంబై యున్నయదిగదా ! విష్ఠామూత్రరూషితంబగు సంసారంబున సంభ్రమించుచు నొక్కరుండును బ్రహ్మజ్ఞానంబు బడయనేరడు. ఎంతవారికైనను గామ క్రోధాదులు మానవని చెప్పు మీమాంసకుల మతంబు తథ్యంబుగా దోచుచున్నయది. ఇక మా కలియుగ ప్రవర్తనంబు లెట్లుగానుండుననిన విని వ్యాసుండు జనమేజయుం జూచి యిట్లనియె. ౧౪౦

## — ప్రహ్లాద నారాయణ సమాగమము —

క. కారణముకంటె భిన్నం । బై రాజిలుటెట్లు గార్యమది యెట్లన్నన్
భూరిసువర్ణముకంటెన్ । వేరగునే కటకముఖ్య వివిధార్థంబుల్ ? ౧౪౧

క. జననాథ యహంకారమె జనకము బ్రహ్మాండమునకు సొలిదు బుంజం
బున నేసిన పుట్టంబున । నెనసిన పుంజంబు బోవ నెట్లది యుండున్. ౧౬౨

చ. హరియు హరుండు బ్రహ్మ యమరాధిపుడాది మునీంద్రులెల్ల సం
సరణమునందు జిక్కి పలుసారు లహంకృతి మోహితాత్ములై
తిరుగుచునుంద్రు దీన బరిదేవన యేటికి నాత్మ యొక్కడే
స్థిరమయి నిర్వికారమయి చెల్వగు చిత్సుఖముద్ర మించెడిన్. ౧౬౩

తే. గీ. సర్వతీర్థాటనము జేసి సర్వవేద । ములను బఠియించి సర్వకర్మల నొనర్చి
సర్వదానంబు లొసగిన జగతి విషయసక్తు లా ఫలమందరు సత్య మిదియ. ౧౬౪

క. కృతయుగమందలివారలె మతిసెడి సంసారవార్ధి మగ్నులుగాగా
గతియేమిక కలియుగమున । తతధర్మము నిలుచుననుట తథ్యమె చెపుమా. ౧౬౫

క. ఇటువంటిది సంసారము । కటువులు క్రోధాదికములు గతమత్సరతన్
బటుబుద్ధి జ్ఞాను లుందురు । జటులేంద్రియముల జయించి శమదమయుతులై. ౧౬౬

చ. జగతి జితేంద్రియుల్ పరమశాంతులు మోహములేనివారలై
తగిన జగత్త్రయంబు విజితంబగు వారలచేత వారలం
బొగడగ నొప్పు ధన్యులని పుణ్యనిధీ పిత పాపియైకదా
తెగియె నటంచు నా మనము దీంద్రిలుచున్నది యేమి సేయుదున్. ౧౬౭

ఆ. వె. కడగి మూఢజనుడు కల్లుద్రావునెకాని । కల్లుద్రాగి పడుట గానలేడు
జనుడు నిందితములు సలుపుచుండునెకాని । చేసిచేసి తుదకు జెడుట గనడు. ౧౬౮

క. నరనారాయణమునులకు । సురరిపుసుతుతోడ నెట్లు చొప్పడె వైరం
బరిది రణరంగ మెట్టుల । బరగించిరి తెలుపుమయ్య పరమమునీంద్రా. ౧౬౯

ఆ. వె. వైర మాడుదానివలన నైనను బుట్టు । నర్థకాంక్షవలననైన బుట్టు
నీషణములు లేని యీ నరనారాయణులకు వైరబుద్ధి దలప వశమె. ౧౭౦

వ. కావున నోమునీంద్రా నరనారాయణులకును బ్రహ్లాదునకును యుద్ధం బెట్లు సంభవించెనో సవిస్తరంబుగా నాకుం జెప్పి నన్నుం గృతార్థుజేయవే యనిన వ్యాసుం డిట్లని చెప్పం దొడంగె నని శౌనకాది మునులతో సూతుం డిట్లనియె. ౧౭౧

క. జనమేజయ భూపాలుదు । జనకుని పున్నామనరక సంస్థితి యుడుపం
గ నుపాయ మడుగుచుం గ్రమ । మున నరనారాయణ చరిత్రముం దెలుపు మనన్. ౧౭౨

వ. విని వ్యాసుండు. ౧౭౩

మ. నరసింహుండు హిరణ్యకశ్యపవధం గావించి ప్రహ్లాదునిం
దిరు గావించెను రాజ్యభారమున న ద్దేవారిసూనుండు భూ
సురులం దన్పెను యాగము ల్సలిపి యచ్చో వర్ణధర్మంబులుం
గర మొప్పారె ప్రజాసుఖంబు గలిగెం బాతాళలోకంబునన్. ౧౭౪

ఆ. వె. ఆ హిరణ్యకశిపు నాత్మజుం డతినీతి । రాజ్యమేలగా ధరాతలమున
భృగునిపుత్రుడగుచు బెంపొందు చ్యవనుండు । తీర్థసేవనమున దిరుగుచుండ. ౧౭౫

తే. గీ. వ్యాహృతీశ్వరతీర్థంబు నందు రేవ । నీట స్నానంబు గావించి నిలువ నొక్క
విషభయంకరమగు నాగు వెన్నుదన్ని । వచ్చి కఱచిన గని శ్రీనివాసుఁ దలఁచె. ౧౭౬

ఆ. వె. కఱచి యూరకొనక గదలించెఁ బాతాళ । లోకమునకు నంతలోన విష్ణు
కరుణచేతఁ దాచు కఱపు నిర్విషమయ్యె । హరిస్మరించువారి కవశ మెద్ది ! ౧౭౭

క. పా మతని విడిచి చనియె మ । హాముని శపియించు ననుచు నళుకుచు బిదపన్
ధీమంతుడు చ్యవను డురగ । భామలు పూజింప నందె వసియించి తగన్. ౧౭౮

చ. తిరుగుచు నొక్కనా డతడు దేవవిరోధుల ప్రోలుఁ జూడగా
నరిగి హిరణ్యకశ్యపుని యాత్మజునిం గనె నాత డా ముని
శ్వరునకు మ్రొక్కి యెందుకు రసాతలవాసము జేయ తత్పురం
దరు డటు బంపె నొక్కనిను దానవులందలి వైరబుద్ధిచేన్. ౧౭౯

ఉ. నా విని మౌని యోదనుజ నాయక నే సురనాధుబంటనై
యీవిధి గ్రుమ్మరంగ బని యేమదికాదు భృగూద్భవుండ నా
నావిషయంబులం గనుచు నర్మద కేగగ బా మొకండు న
న్నోవగనీక పట్టిన గుబుక్కున నిచ్చట డిగ్గి నిల్చితిన్. ౧౮౦

చ. నిలచి హరిం దలంప నహి నిర్విషమై చనె నాటనుండి ని
శ్చలమతి నింద యుంటి బెలుచన్ హరిభక్తుఁడ వీవు నిన్ను గ
న్నుల గనుగొంటి నేను మును నోచిన నోములు పండె శ్రీహరిం
దలచుట యొక్కటే తపము దానము యాగ మటంచు నెంచెదన్. ౧౮౧

వ. అనిన విని ప్రహ్లాదుండిట్లనియె. ౧౮౨

చ. తిరిగితి వీవు ముజ్జగము తీర్థము లెయ్యవి పుణ్యతీర్థముల్
సుర నర భోగి లోకముల సూనృతభూషణ చెప్పుమన్న న
ప్పరమమునీంద్రు డా దనుజపాలకుతోడను బల్కు మేను భా
సుర పరిశుద్ధతాగరిమ చొప్పడ నెల్లడ దీర్థమేకదా ? ౧౮౩

తరళ. మలినచిత్తులు మలినవాచులు మలినకాయులునైన ధరా
స్థలిని గాశికి బోయి జాహ్నవి స్నానమాడిన నెంతయున్
ఫలముతే దది సంకటంబగు పల్కనేటికి వేయికన్
దలపు పాపవివర్జితంబయి తనర నన్నియు దీర్థముల్ ౧౮౪

శా. గంగాతీరమునన్ వ్రజంబులు పురుల్ గ్రామంబులున్ ఖేటముల్
వంగుల్ హూణులు బోయలున్ మఱియు గైవర్తుల్ ఖలు మ్లేచ్ఛులున్
సంగాతంబున నుండు చోటులును విస్తారంబు తద్వాసు లా
గంగన్ మున్గుచు గంగనీరు గొనుచుం గాశిం బ్రవర్తింపరే॥ ౧౮౫

క. వారు విశుద్ధమనస్కులు । గారుగదా! తీర్థఫలము గననేర్తురె ? దే
వారివరేణ్య సమస్తము । వారక శుద్ధాత్మయందు వర్తిలుజుమ్మీ. ౧౮౬

ఉ. మోసము జేసి తీర్థముల ముక్కులు వీనులు గోసి సొమ్ములుం
గాసులు దోచు దొంగల కఘంబులు సోకక యుండునే ? సద
భ్యాసమున న్మనోవిమల భావమునందినవారు తీర్థసం
వాసులుగాకయున్న నిరవద్యత బూజ్యులుగాక యుందురే ॥ ౧౮౭

ఆ. వె. దివ్యతీర్థమందు దివిరి పాపము సేయ । దక్కచోట్లకంటె నెక్కుడయిన
దుష్టఫలమువలన గష్టమందుట కాన । బావబుద్ధిలేక బ్రతుకవలయు. ౧౮౮

వ. మరియు నింద్రవారుణంబు పక్వంబయ్యు బిష్టంబు గానట్లు భావదుష్టుండు తీర్థంబునకేగి కోటిస్నానంబులుచేసియు బరిశుద్ధుండుగాడు. మనశ్శుద్ధి ప్రధానంబు, తదనంతరంబు ద్రవ్యశుద్ధి పిమ్మట నాచారశుద్ధి, యవ్వెనుక దీర్థస్నానాదులవలనం గలుగు శుద్ధియు నని పెద్దలు చెప్పుదు రింతియకాక ౧౮౯

తే. గీ. అన్నితపములకును బెద్ద యన్నిదాన । ములకు నెక్కువ యన్నినోములకు హెచ్చు
అన్నితీర్థములకును గన్నాకు వినుము । భూతదయకంటె ధర్మంబు భూమి లేదు. ౧౯౦

క. ఐనను న న్నిటు లడిగితి । గానం జెప్పెదను వినుము క్రవ్యాదపతీ
యానైమిశతీర్థ మొకటి । గానగనయ్యెడును బ్రథమగణ్యం బగుచున్. ౧౯౧

తే.గీ. కలవు తీర్థంబు లవి లెక్క గలవికావు । పావనంబులు బహుపుణ్య ఫలదములును
నైన న చ్చక్రతీర్థమం దధికగుణము । గల దటందురు కల్యాణకశిపుతనయ॥ ౧౯౨

చ. అన విని దైత్యరాట్తనయు డంతట నైమిశ పుణ్యభూమికిన్
జన దమకంబున న్సకల దానవవీరుల గూడి పైనమై
చనియె నిజాధివాసము వెస న్విడనాడి మురారి సామజా
వన పురుషోత్తమా నృహరి వామన యంచు హరిం దలంచుచున్. ౧౯౩

క. చని నైమిశపుణ్యస్థల । మున జేరి పవిత్ర తీర్థముల దిరుగుచు నా
య్యన దా సరస్వతీజల । మున మున్గి ప్రసన్నచిత్తమున జెలువొందెన్. ౧౯౪

వ. అని చెప్పి మఱియు వ్యాసుం డిట్లనియె. ౧౯౫

## —* ప్రహ్లాద నారాయణ యుద్ధము *—

క. అచ్ఛోట తీర్థవిధులన్ । జెచ్చర గావించి మఱ్ఱిచెట్టుకడకు దా
వచ్చి కనె వివిధజాతుల । నొచ్చెమిడని గృధ్రపక్షయుత బాణములన్॥ ౧౯౬

క. కని యివి యెవ్వరివో యీ । వనము ఋషుల యాశ్రమంబు బాణధరుల్ తే
రని పరికింపుచునుండన్ । గనబడి రచ్ఛోట నరుడు నారాయణుడున్. ౧౯౭

క. ఆ యిరువుర యెదుటను మహి । మాయతి గననొప్పె శార్ఙ్గ మాజగవంబుం
బాయని యక్షయ్యేషుధి । సాయకకోవిదుల కరణ సామగ్రి దగన్. ౧౯౮

ఆ. వె. ధర్మసుతులు ధ్యాన తత్పరులై యుండ । దీవ్రకోపరక్త దృక్ప్రపాత
ములను వారిఁ జూచి జలజాక్షభక్తుండు । దనుజరాజతనయు డనియె నిట్లు. ౧౯౯

క. ఔరా ధర్మవినాశన కారణమగు దంభమునకు గడగితిర య్యా
చారము ధర్మంబె జటాధారణమున శరశరాసధారణ మున్నే. ౨౦౦

తే. గీ. కన్నదియుగాదు మున్నెప్డువిన్నదియును । గాదు తపమున సంసారకలన జేర్ప
గృతయుగంబుననే యిది కేవలము వి । రుద్ధ మీ కలి కాదె విరుద్ధ మహహ. ౨౦౧

ఆ. వె. తపము బ్రాహ్మణునకు దగినట్టి ధర్మంబు । తపములోన జాప ధారణంబు
చనునె మీకు ధర్మతనయులై ధర్మంబు । తప్పరాదు కొనుడు ధర్మపథము. ౨౦౨

క. నావుడు నరు డిట్లనియెన్ । మా విధమును జూచి నీవు మది జింతిల నే
లా వెర్రివె మనతపమును । గావింపను విల్లుబట్ట క్షములము సుమ్మీ ! ౨౦౩

తే గీ. తపము సేయంగ నేర్చి యుద్ధంబొనర్ప । జాలుదుముమేము నీకేల జాలు నింక
వదరులాడక పొమ్ము త్రోవను యథేచ్ఛ। వాదములు బ్రాహ్మణులతోడ వలదు నమ్ము. ౨౦౪

తే.గీ. బ్రహ్మతేజోనవద్యప్రభావ మీ వె । ఱుంగ కాడితిగాక యిబ్బంగి నీవు
దుఃఖహేతువు బ్రాహ్మణదూషణంబు । ప్రాణికోటికి నని బుధుల్ బల్కుచుంద్రు. ౨౦౫

వ. అనిన విని ప్రహ్లాదుండు. ౨౦౬

క, ఎగ్గులెఱుంగక స్వకృతమె । లగ్గనుచును ధర్మరీతులం ద్రోచి వృథా
వాగ్గర్వమోహితులరై । యిగ్గతి బల్కెదరొ యిచట నే నుండంగన్. ౨౦౭

వ. అని యిట్లు పలికి ప్రహ్లాదుండు యుద్ధంబున నీకుం గల సామర్థ్యంబు జూపు మనిన విని నరుండు నా సామర్థ్యంబు గనుంగొన నీకుం బుద్ధిగలదేని నాతోడ గదనంబునకు డీకొను మిప్పుడు నీశిరంబు ఖండించివైతు ననిన దనుజేంద్రనందనుం డతికుపితమానసుండై విల్లెక్కిడి జ్యానాదంబు దిశలుముట్టం జేసినం జూచి నరుండు చాపంబువట్టి బాణంబులు సంధించి పుంఖానుపుంఖంబులుగా వైచి హిరణ్యకశిపునందనుని ముంచినం గాంచి యతండు తపనీయపుంఖంబులగు తన బాణంబులచే ద్రుంచినం గాంచి మరల నరుం డసంఖ్యాకంబులయిన బాణపరంపర లతనిపయిం గురిసిన వానిం దప్పించుకొని ప్రహ్లాదుండు మరల బాణంబులు సంధించి నరు నురంబు గాడ నేయ క్రోధారుణనయనుండై యతం డయిదు నారాచంబుల దైత్యరాజు బాహు దేశంబులం గాడనేసె. ని ట్లతిఘోరంబయిన యుద్ధంబు ప్రవర్తించుచున్న నింద్రాదు లగు దేవతలు విమానంబులపై వచ్చి యుభయపక్షంబుల నెచ్చు తగ్గులులేక యున్న దుములసంగరంబు చూచి యిరువురపై బుష్పవర్షంబులుం గురియుచుండిరి. ఇట్లుండ దైత్యేంద్రుండు తీవ్రతరంబులగు శిలీముఖంబులం గూర్చి నరు నేయ నతం డలిగి నిజ బాణపరంపరలచే నడుమనే త్రుంపుట దిలకించి ప్రహ్లాదుండు ధర్మపుత్త్రుండును సనాతనుండును నగు నారాయణునిపై వాడితూపులు వైచిన నతం డలిగి నానాబాణపరం పరలచే దితిజేంద్రుం బొదివె నరనారాయణులకును బ్రహ్మాదులకు నవగ్రహంబు వాటిల్లుటం దివియెల్ల శరంబులచే నావరింపంబడి పవలిది, రాత్రియిది యని యేర్పరిం పరాక నిట్లు జిమ్మచీకట్లు గ్రమ్మె. దిదృక్షువులగు దేవదానవులు విస్మయంబందుచు, నాహా ! నిట్టిసమరంబు దృష్టపూర్వంబు గాదనువారును, ఆహా ! యెంతదారుణంబైన సంగ్రామంబిది యనువారును నై దేవర్షి గంధర్వ యక్ష పన్నగ విద్యాధర చారణాదు లును, నారద పర్వతాదులును జన్యంబు గాంచుచున్న సమయంబున నారదుండు పర్వతుం జూచి యిట్లనియె. ౨౦౮

క. మును పిట్టికదన మెన్నఁడు । గనలే దరయంగఁ దారకాసుర యుద్ధం
బును వృత్రాసుర యుద్ధం । బును మధుకైటభుల యుద్ధమును సరిపోలున్. ౨౦౯

క. హరి మధుకైటభులుం జె । చ్చెర జేసిన కదనమట్లు జేసెను దనుజే
శ్వరసుతుతో నారాయణుఁ । డరిమురి నొనరించె బవర మతికుశలుండై. ౨౧౦

పంచచామరము ॥ హిరణ్యకశ్యపాత్మజుం డహీనశక్తియుక్తిమై
దిరంబుగా నెదిర్చి పోరె దీప్తిమంతుడై సురా
సురప్రతానదుర్జయుండు శూరుఁ డూర్జితప్రభా
కరుఁడునైన ధర్మపుత్త్రి గర్వమెల్ల దూలఁగన్. ౨౧౧

క. నారాయణు డంతట దా । హైరణ్యకశిపు సాయకాయసము ద్రుంపం
వేరొకటి గొనగ నదియును । వారక దుత్తుమురుగాగ వడి నరుకంగన్. ౨౧౨

గీ. మరియుమరియు విండ్లు ధరియింప నవి యెల్ల । విఱిచివేయ గాంచి పరిఘమూని
యసురనాథు డేసె నపుడు నారాయణు । నురము నొవ్వ నంత గరము కనలి. ౨౧౩

క. తొమ్మిది బాణంబుల బరి । ఘమ్మును దళకమున సతని గడువడి సేయన్
దుమ్మై పరిఘము పడినన్ । హుమ్మని గదపూని యురికె నుర్వీసురుపై. ౨౧౪

క. గదదెచ్చి దాకి మ్రోకా । ళ్ళదరిన నారాయణుం డహంకృతిమీరన్
బదిలముగ నరికివైచెన్ గద నని కోపించి కనకకశిపుసుతుండున్. ౨౧౫

గీ. శక్తిపూని రాగ సర్వంసహామరు । డదియు ద్రుంచివైచె బదిశరముల
వెలయనిట్టు లాజి వేయివర్షంబులు । జరిగె విస్మయంబు జనుల కొదవ. ౨౧౬

సీ. సౌదామినీలతల్ సరికట్టుగ్రొమ్మొయిల్ మిసిమిమేలిమిసొల్పు మేనుగుల్క
దివ్యమాణిక్యచిత్రితవినీలస్తంభ భూతిసాయుధచతుర్భుజను లొప్ప
కలితలీలాకందుకముబట్టినిసువు నొద్దిక గౌస్తుభము రమాదేవి యొసగ
తతహారమున బచ్చబతకంబు మంజుల వనమాలనొలయు శ్రీవత్సమలర
తార్క్ష్యుపైనెక్కి భక్తబృందములుగొలువ చల్లని కృపారసము వెదజల్లికొనుచు
నిఖిలలోకైకసమ్మాననీయుడైన యాదినారాయణుండు ప్రత్యక్షమయ్యె. ౨౧౭

వ. యిట్లు ప్రసన్నవదనుండై యేతెంచిన శ్రీమన్నారాయణుం గాంచి ప్రహ్లాదుండు సవినయ
ముగా బ్రణామంబుజేసి. ౨౧౮

గీ. దేవదేవ జగన్నాథ దీనరక్ష । భక్తవత్సల మాధవ పరమపురుష
నిండుగా వేయివర్షముల్ నేను వీరి । తోడ బోరితి జయములేదు కతమేమి ? ౨౧౯

వ. అనిన విష్ణుండు ౨౨౦

క. నాయంశంబునం బుట్టిరి యీ యిరువురు సిద్ధపురుషు లిటు విను నర నా
రాయణులు వీరు యుద్ధము । చేయదగదు వితలమునకుం జేరుము వేగన్. ౨౨౧

క. అని హరి తిరోహితుండై । చనియె నసురపాలకుండును జనె నిజవా
సమ్మునకు మునివరులు దమ తప । మునకుం దొరకొనిరి ముదముం బొంది మహీశా ! ౨౨౨

వ. అనిన విని జనమేజయుండు. ౨౨౩

శా. పారాశర్యము నీ కథానకమునం బల్సందియంబయ్యె వం
దారు ప్రాభవకారులైన నరుండు న్నారాయణుండు న్శుభో
దారు న్స్వేష్టకశోద్భవు ల్శమయుతుల్ దాంతుల్ తపస్వు ల్నిరా
హారు ల్సత్వయుతుల్ మహామహులు తీర్థావాసు లాద్యుల్గదా ! ౨౨౪

గీ. తమ యనుత్తమమైనట్టి తపము విడిచి । రాగసంయుక్తు లెట్లైరి ప్రతిఘటించి
ప్రాకృతులఁబోలెఁ బరులతోఁ బపర మెట్లు । దనుజవిభుతోడఁ జేసిరి తాపసేంద్ర! ౨౨౫

ఆ. యుద్ధబుద్ధి యెట్టులుదయించె వారికి । శాంతి సుఖము విడువఁజాలి రెట్లు
శాంతిలేని తపము జరిపి రేగతి మును । ల్భుక్తికొఱకొ లేక ముక్తికొఱకొ । ౨౨౬

ఆ. తపముచేతఁ బీడితంబైన దేహంబు । దివ్యవర్షశతము ధృతి వహించె
నెట్లు వారు కోరి రెద్దాని రాజ్యమో । ధనమొ దార్యయొక్కొ మునివరేణ్య ! ౨౨౭

గీ. దుఃఖదము ధర్మనాశియు దూషితంబు నైన కలహంబుఁ గోరునె యమివరేణ్యుఁ
డతిసుఖారామమై శాంతమై తలిర్చు నిశ్చలధ్యానముద్రల నీటద్రోచి ౨౨౮

ఆ. మును యయాతి స్వర్గముననుండి పడెను భూ । తలమునం దహంకృతంబువలన
శబ్దముచ్చరింప శక్రుండు పడనీడ్చె । ననికిఁ గారణం బహంకరణమె. ౨౨౯

వ. అనిన విని వ్యాసుండు. ౨౩౦

సీ. జననాథ వినుము సంసారమూలము మూఁడు । విధము లహంకృతి విబుధమతము
జనుల కెవ్వరికినిశక్యంబుగా దహం । కృతిద్రోయ దేహులై బ్రతుకు కతన
సాత్వికాహంకృతిం జనియించు దపమును । యజ్ఞంబు నను నివి యవల రాజ
సాహంకృతినిగూడ నట్టివ యుదయించు । లలి దామసంబునఁ గలహ మొదవు
కార్యజాతంబున కహం । కార మొకటి । కారణంబగు నదిలేని కార్యమెందు
లేదు విశ్వం బహంకార మేదురంబు । బ్రహ్మరుద్రాదులును దాని భటులె సుమ్ము. ౨౩౧

క. పుట్టించును గిట్టించును । గట్టిగ దేవతల నరుల గంధర్వుల స్వా
రాట్టును నిన్నును నన్నును । బట్టి యహంకారమనెడి వస్తు వొకండె. ౨౩౨

శా. నానాయోనులఁ బుట్టెనంచు వినవే నారాయణుం డత్యుదా
రానందుండు ఝషంబు కూర్మము వరాహంబున్ నృసింహుండునై
తానుం బ్రాకృతునట్ల దైవవిధులం దప్పించుకోలేఁడుసూ
మౌనీంద్రుండు భృగుండు విష్ణు శపియింపంగాఁ గదా భూపతీ. ౨౩౩

క. అన విని జననాథుం డో । మునివర భృగుమునికి హరికిఁ బుట్టెనె వైరం
బనఘా భృగుముని గోపిం । దునిఁ దానెట్టుల శపించెనో వినవలతున్ ౨౩౪

వ. అనిన. ౨౩౫

## — * హరికి భృగు శాప కారణము * —

ఆ. ఆహిరణ్యకశిపుఁ డమరులతో యుద్ధ । మాచరించెఁ దొల్లి యఖిలలోక
భయదలీల నంత నాఁడు వోవ నతని । తనయు డెదిరె సమరతండములను. ౨౩౬

ఆ. పూర్ణవర్షశతము పోరి పరాజితుం । డగుచు దైత్యనాథుఁ డాత్మ నొగిలి
ధర్మపథముబూని తా బలి నృపుఁజేసి । తపముసేయ శైలదరుల కరిగె. ౨౩౭

క. బలి యంతట విబుధులతోఁ । గలనం గావించి యోడెఁ గమలాక్షుఁడు దా
బలియుఁడయి దేవతాసే । నలపక్షము బూని కూర్మి నటియింపంగన్. ౨౩౮

క. అంతట రాక్షసవీరులు । సంతాపముతోడ వేగఁ జని శుక్రునితో
నింతయు మొరవెట్టిన న । త్యంతకృపామయుఁడు శుక్రుఁ డసురుల కనియెన్. ౨౩౯

గీ. భయము మానుండు నేను మీ పాలగల్గి । మంత్రములచేత నోషధీ మహిమచేత
నెట్టులేనియు విబుధుల నెట్టివైచి । జయము గల్గింతు మీరు నిశ్చయము పొందుఁడు. ౨౪౦

క. నావుడు నసురులు సెలఁగుచు । దేవతలం బొడిచిపోర ధృతి విడువక ప
ద్మావాసుని కరుణాస । ద్భావంబున సుర లసురులఁ బడమొత్తి రొగిన్. ౨౪౧

క. భయమంది రాక్షసులు తమ । యయవారిం జేరి శరణటంచు నెఱిగి య
య్యయొ రక్షరక్ష యనిన్ । భయమేటికి ననుచు మంత్రబలముం జూపన్. ౨౪౨

క. అమృతాశనులు భయంబున । సమరము విడనాడి పారి చని రంతట న
య్యమరారులఁ గని శుక్రుఁడు విమల వచోయుక్తి నిట్లు విన్పించెఁ దగన్. ౨౪౩

క. దనుజులను వధించుటి నే । పనిసుమ్ము మురారి కర్తఁడు పంధియగుచుఁ దాఁ
గనకాక్షుఁ ద్రుంచెను మృగే । ట్తనుండై కాంచనకశిపుని దాడించెఁజుమీ. ౨౪౪

గీ. కాన నేను సమర్థుండ గాను వనజ । నయనుని జయింప దేవతాచయముగెల్వ
మంత్రబలమునఁ గంటి సమర్థగరిమఁ । గాన నోర్చుకొనుఁడు కొంతకాల మీరు. ౨౪౫

ఉ. ఇత్తరి నేను బోయి గిరిజేశుని బ్రార్థన మాచరించి య
త్యుత్తమమంత్రరాజము నయోచితభంగి గ్రహించి దాని మీ
కిత్తు నిజంబు నమ్ముఁడన నేమెటులోర్తుము బల్మిదూలి యీ
షత్తయినన్ స్వపక్షబలసంపదకుం గతిజూపకుండినన్. ౨౪౬

క. నావుఁడు నసురుల మాటలు । దా విని శుక్రుండు దితిజ దానవులారా
నే వచ్చుదనుకఁ దపములు । గావింపుఁడు శాంతిమీఱఁ గదలకు డనికిన్. ౨౪౭

గీ. సామదానాద్యుపాయముల్ సలిపి దేవ । సమితి నొప్పింపు డంపుఁడు చాలియున్న
వాని నొక్కని సమరంబు వలదు న్యస్త । శస్త్రులమటంచుఁ దెలుపంగఁ జనుఁడు వేగ.

మ. కవి దైత్యేంద్రుల కిట్లు చెప్పిచనె నక్కైలాసమందున్న కా
లవిరోధిం గన నంత దానవులు ప్రహ్లాదుఁడా మహాబోధాత్మపీ

రవరేణ్యున్ విబుధాంతికంబునకుఁ జేరంబంప నాతండు దే
వవితానంబులఁ జూచి నమ్రుఁడయి భవ్యప్రౌఢి దా నిట్లనెన్. ౨౪౯

గీ. న్యస్తశస్త్రులమైతిమో యయ్యలార । యుద్ధసన్నాహములు మానియుంటి మేము
తపము లొనరింపఁగాఁ బోయెదము మహావ । నంబులకు నారచీర లెనయధరించి.

గీ. మమ్ము విడువుండనంగ సత్యమ్మటంచు । నమ్మి వారు చనిరి స్వగేహమ్ములకును
గాశ్యపాశ్రమమునుజేరి కడఁగి శుక్రు । రాక కన్రెత్తిచూచిరి రక్కసులును. ౨౫౧

క. కపి దాఁ గైలాసంబున । భవుఁ గాంచి నమస్కరింపఁ బనియేమి యనం
గ విని బృహస్పతినోటం । దవులని మంత్రంబు నాకు దయసేయు మనన్. ౨౫౨

క. నీ విచ్చిన మంత్రంబులు । నే వేగం గొనుచు నేగి నిఖిలవిబుధులన్
వావిరి జయింపఁగల నన । గా విని సర్వజ్ఞుఁడైన గౌరీనిభుడున్. ౨౫౩

శా. దేవద్రోహి యితండు దైత్యగురుఁ డర్థిన్ దజ్జయం బీక్రియం
గావింపంగఁ దలంచినాఁడు సురలం గారింపఁగా నొప్పదే
నీవేళ న్వచియింతు నిట్లని భవానీవల్లభుం డోమునీ
నీ వుగ్రంబగునట్టి యొక్క వ్రతముం జేయంగఁ గార్యంబగున్. ౨౫౪

వ. అది యెద్దియనిన, పూర్ణంబుగా వేయేం డ్లనాహారుండవై ధూమకణంబులు పానంబుసేయుచుఁ దపంబుఁ జేసితివేని నీకుం గోరిన మంత్రంబులు సాధ్యంబయ్యెడు ననిన విని యట్ల కావింతునని శుక్రుండు ధూమపానవ్రతం బాచరింప నది విని దేవత లితండు తమకుం గీడు వాటిల్లంజేయు పూనికతో నిట్టి వ్రతంబు సేయుచున్నాఁడని యెఱింగి సక్రోధులై సాయుధులై దానవతండంబుల నావరింప గని రాక్షసులు దేవతలారా ! మీసత్యపరాయణత యేడబోయె. న్యస్తశస్త్రులమైన మాజోలికి రాకుండ మేము చేసికొనిన విజ్ఞాపనంబు విని మమ్ము విడిచిన మీరు మరల మామీఁద దండెత్తుట న్యాయంబుగాదు. అనవుడు విని దేవతలు దైత్యులారా ! మీరు మాయావులై కావ్యుం దపంబుసేయం బంపితి రది యస్మద్దుఃఖకారణంబు గావున మీ దంభం బెఱింగి మీతో యుద్ధంబు సేయ వచ్చితిమి. మీరును సమరసన్నద్ధులుగండనిన విని దనుజు లొండొరులతో నాలోచించుకొని శీఘ్ర గమనంబున శుక్రమాతకడకుం జని తమ పరితాపం బెఱింగించుకొనిన విని సకరుణంబైన హృదయంబుతో నామె యిట్లనియె. ౨౫౫

గమనికావృత్తము: వెఱవకుఁడు వెఱవకుఁడు వెఱవకుడు మీరల్
వెఱపు మదివిడువుఁ డీక్ష విబుధుల బలంబుల్
చెఱచి మిమ్ముఁ గృపఁదేల్చి క్షితుల భరియింతున్
సురలపనిఁ గనుడీక్షను సొరిది నణుచుండున్. ౨౫౬

ఆ. వె. దనుజు లాయుధములు దాల్చక ధృతిమీరి । శుక్రమాతపట్టు చూచికొనుచు
నామె యాశ్రమంబునంద వసింపంగ । సురలు వారివిధముఁ జూచిచూచి. ౨౫౭

క. తమబలము నెదిరిబలమును । గ్రమముగఁ గనుఁగొనఁగలేక గర్వోద్ధతులై
సమరమునకు గాల్దువ్వుచు । గమనంబులు సేయఁ జూచి కవిజననిదెసన్. ౨౫౮

క. తనతపముపేర్మి నిద్దుర । యనుదానిం గలుఁగజేసి యంపిన నమృతా
శనసంఘంబులపైఁ బడ । నసువులుసెడి మూకభావ మందిరి వారల్. ౨౫౯

ఆ. అపుడు కరుణతోడ హరి హరిహయుఁ జూచి । తనదు దేహమంద తాల్చుకొనియె
నందువలన నిద్ర యతనిజోలికిఁ బోక । యున్నఁ జూచి కావ్యుఁ గన్నతల్లి. ౨౬౦

ఆ. ఇంద్ర నిన్నుగాచె నీలచ్చిమగఁడు పీఁ । డిట్టివాడటంచు నెఱుఁగనైతి
నాయె నేమి చూడుమీ యిద్దరినిఁబట్టి । మ్రింగివైతుఁ దపము మేల్మివలన. ౨౬౧

చ. అని తన యోగవిద్యఁ గని యంబ హరి న్మరవైరి నొక్కతూ
రి నసురులెల్లఁజూడ నొనరించెను స్తబ్ధుల దానికెంతయున్
మనమున గుంది దేవపతి మాధవ నాగతి యేమిచెప్పుదుం
దను వొక యింతయేనియుఁ గదల్పఁగఁలే నిఁక నేమిసేయుదున్. ౨౬౨

క. ఏదేని యొక యుపాయము । చే దీని వధింపవలయు శ్రీవర యనినన్
దా దయఁబూనక ధర్మము । గాదనక న్సుదర్శనంబు గడువడి దలచెన్. ౨౬౩

క. తలపఁగ వచ్చినచక్రము । వలవేతం బూని యేసి వనితశిరము వ్ర
క్కలు సేయఁగ పడి చచ్చెన్ । వెలఁది బలారి ముదమంది విష్ణునిఁ బొగడెన్. ౨౬౪

క. స్త్రీవధఁ జేసితి భృగుఁడుం గేవల చండాతిచండ కృతిసంపన్నుం
దేవిధి దప్పను శాపము; వేవేగమ యిచ్చు ననుచు విష్ణుఁడు బొగిలెన్. ౨౬౫

## —* శు క్రు ని గూ ర్చి జ య ం తి పో వు ట *—

క. అంతట భృగుండు దద్వ్ర । త్తాంతముఁ గని వేపమానుఁడై హృదయమునం
జింతిల్లుచుఁ పూర్వసుప । ర్వాంతకుఁ గని క్రోధరస సమన్వితుఁడగుచున్ ౨౬౬

ఉ. పాపముఁ జేసితీవు జనవంచక స్త్రీవధ గూడదంచు నే
లా పరికింపవైతివి నిరాగసయంచు నెఱుంగవైతివే
శ్రీపతి సాత్వికుండనుచుఁ జెప్పుదు రయ్యది యేడవోయె నే
శాపమొసంగెదన్ గనుము సంయమివర్యుల శక్తిసంపదల్. ౨౬౭

మత్త. నిన్ను మాయలమారి ధూర్తుని నీచవర్తను నిందితున్
మున్ను సాత్వికుఁడంచు బల్కిరి మూర్ఖులైన మునీశ్వరుల్
వన్నె వాసియుఁ దూలఁ దామసవృత్తిఁ బూనితి నీయెడం
గన్నుగానవుగానఁ బొందుము గర్భసంభవ దుఃఖముల్. ౨౧౮

వ. అనిన విని జనమేజయుండు మునీంద్రా విధురుండైన భృగుండు మరల నెట్లు గృహస్థుం డాయెనో తెలుపవే యనిన వ్యాసుం డిట్లనియె. ౨౧౯

క. అని విష్ణుని శపియించిన । వెనుక న్నిజభార్యాశిరము వేగొని దేహం
బునఁగూర్చి యిట్టు లనియెన్ ; వనితామణిఁ దపముపేర్మిఁ బ్రతికింతునొగిన్ ౨౨౦

ఆ. నేను సత్యవాదినేనియు ధర్మైక । దృష్టినేనియును నుదీర్ణతపము
గంటినేనియుఁ దెరగంటులార కనుండు । యీమె మరల బ్రతుకు నిప్పుడనుచు ౨౨౧

ఆ. జీవనంబు జల్లి జీవనంబిచ్చిన । భృగునిభార్య లేచె బ్రీతిమెరయ
నధికవిస్మయంబు నంది భూతంబులు । మేలు మేలటంచు మెచ్చి పొగడె ౨౨౨

సీ. ఈరీతిఁ బ్రతికిన భృగుభార్య నీక్షించి । త్రిదశేశుఁడాదిగా దివిజులెల్ల
విస్మయంబందిరి విబుధేంద్రుఁ డంతట । నమరుల గాంచి యీ యతివ బ్రతికె
కవి తపంబొనరించి కడుదారుణములయిన । మంత్రము ల్గొనితెచ్చి మనల నింక
నేమి సేయునొకదా । యేది యుపాయంబ । టంచుఁ జింతించి నిజాత్మజయగు
చారుతన్వి జయంతిని సరస జీరి । నీవు భృగుజునియొద్దకు నెమ్మిఁ బోయి
రమణ నానావిధోపచారములు జేసి మంచితనమున వశునిఁ గావించుకొనుము
వెఱపు దీర్పుము నాకు వేవేగఁ బొమ్ము. ౨౨౩

గీ. అన విని జయంతి పితృవాక్య మాత్మఁబూని । చని వనంబున భృగుమౌనితనయు ధూమ
పానరతుఁ గాంచి యుపచారపక్కి దెలిసి । విసరె లేతరిటాకు వీవెనను బట్టి. ౨౨౪

చ. వలనగు శీతవారిని సువాసితముం గొనివచ్చి పానసం
కలన కమర్చి భక్తిజెలఁగంగఁ బయంటను జాటువెట్టి యిం
పలరఁగ నెండవేడి ముడుపంగఁ దొడంగి స్వధర్మపద్ధతిన్
బొలుపరసీక పక్వఫలపుంజములం గొనివచ్చి ముందిడున్. ౨౨౫

ఆ. పచ్చనైన కుశలు ప్రాదేశమాత్రముల్ పుష్పములను గోసి పూని నిలుచు
నిత్యపూజ కనుచు నిద్రకు మేలయిన చిగురుటాకుపాన్పు చేర్చిపెట్టు ౨౨౬

ఆ. ముని శపించుననుచు మనమున భయముచే । హావభావచేష్ట లతివ సూప
కెదను బ్రీతిపుట్ట నింపుగా స్తుతివాక్య । సమితి జదువుచుండు సరసఫణితి. ౨౨౭

ఉ. ధ్యానముమాని లేచుతరి నాచమనార్థము శుద్ధవారి దాఁ
బూని సమీపమందు నిడు పూజ్యుఁడతం డది జూచి మెచ్చి న
ట్లానలినాయతాక్షి పలుహాయనముల్ తన బ్రహ్మచర్యమున్
మానక నిర్వికారయయి భక్తి భజించె భృగుప్రజాతునిన్. ౨౬౮

వ. ఇవ్విధంబునం బూర్ణవర్షసహస్రంబుఁ దపంబుఁ జేసిన సంతుష్టుండై యంతకాంతకుం డతఁడు కోరినమంత్రంబు లొసంగి యంతర్ధానంబు నొందె; నంతఁ గావ్యుండు తన యొద్ద నుపచారంబులు గావించుచున్న జయంతిం గాంచి నీ వెవ్వతెవనియు, నీవు వచ్చిన పనియేమి నీ యుపచారంబులకుం బ్రీతుండనైతి, నీ వడిగినయది యెంత దుష్కరంబైనదయినను నీ వాంఛితంబుఁ దీర్చెద ననిన విని యయ్యంగనాతిలకంబు. ౨౬౯

తరువోజ. విను మునినాథ నే విబుధాధినాథు । తనయ జయంతిని తండ్రి నన్నంపె
నిను జేరి పూజించి నీదాననైతి । ననుమనె యదిగాన నతిభక్తితోడ
జనుదెంచితిని తపశ్శాలివి నీవు । గనుఁగొన నట్టిది కలదె లోకమున
మునుకొని నా మనమ్మున నున్నయట్టి । పని నెఱుంగవె నేనె పలుకవనే. ౨౭౦

గీ. వలపు నీమీదఁ గలిగె నా తలపెఱింగి । కలయఁగోరెద నిదియె నా కాంక్షితంబు
తెలియఁజెప్పితి నటమీఁద దేవరకును । దెలియనిది యెద్ది కలదె సందియము కొంత. ౨౭౧

క. అన విని శుక్రుడు పలికెన్ । వనితా పదివత్సరములు వారక నీ వే
నును గూడియుండ మితరుల । కును గనరాకుండఁ బరమ గూఢక్రియలన్. ౨౭౨

చ. అని చెలిపాణి పట్టి తన యాలయమార్గమువట్టి యేగి యం
దెనయ నదృశ్యులై జనుల కెయ్యడఁ గానఁగరాక స్వేచ్ఛ న
మ్మనసిజతంత్రగోష్ఠిఁ గడు మక్కువమై విహరించుచుండఁగా
దనుజులు కావ్యురాక విని తద్దయు సంతసమంది చెచ్చెరన్. ౨౭౩

ఆ. వరములంది వచ్చె గురుఁడు నే డాతనిఁ । జూడబోద మనుచు వేడుకలర
నింటికేగి చూడ నేరును గనరామి । విసికి విసికి చనిరి విమనులగుచు. ౨౭౪

వ. అప్పుడు. ౨౭౫

క. దేవేంద్రుఁడు నిజపుత్రిక । ధీవరుఁడగు శుక్రుఁజేరి ధృతి నాతనితో
భావజుతంత్రములందున్ । దా విలసిల్లుట యెరింగి తనగురుతోడన్. ౨౭౬

గీ. అఖిలవేదివి నీవు మాయందు గరుణ । గలదు నీ కది గావునఁ దెల్పుమయ్య
నింకమీదట నేది కావింపవలయు । దైత్యసంహారమునకు నుదారచరిత. ౨౭౭

ఆ. నిన్నె నమ్మి విబుధు లున్నవారలయ్య । నీవు వేగ మెద్ది యేని మాయ
లోనఁ జిక్కఁజేసి యా నరాధప్రలో । భం బొనర్చుమయ్య భద్రమూర్తి. ౨౭౮

క. అనుఁడు విని గురుఁడు కావ్యుఁడు । వనితామణితోడఁ గ్రీడ వాటిలియుంటన్
మనమున నెఱింగి భృగునం । దన వేషముఁబూని చనియె దనుజుల కడకున్. ౨౮౯

క. దానవు లతనిన్ శుక్రునిఁ । గా నెంచి నమస్కరింపఁగా మాయాసం
ధానమున నతఁడు వారల । తో నిట్లని పలికె మధుమధురభాషలతోన్. ౨౯౦

గీ. స్వాగతము మీకుఁ గ్రవ్యాదివర్యులార । మీ హితంబునకేకదా సాహసమున
శంభు సేవించి తెచ్చితి సారమైన । విద్య బోధింతు మీ కది వెండియు నన. ౨౯౧

చ. అన విని సంతసించి యసురాధిపులందరు దంభశుక్రునిన్
బనివడి మే ల్భళీ యనుచుఁ బల్మరు మెచ్చుచు మ్రొక్కుమీఁద మ్రొ
క్కును జరణంబులంట నిడి కొంకగ నేటికి దేవతాతతుల్
మనల నిఁకేమి సేయుదురు మందులటంచు వచించి రర్మిలిన్. ౨౯౨

## —• గురుకృతాసురప్రలోభనము •—

వ. అనిన విని జనమేజయుండు వ్యాసుంగని యోమునికులసార్వభౌమా! యంగీరసు కొడుకై సురల కాచార్యుండై తపోనిధియైన బృహస్పతి ఛలకర్మంబున కెట్లు తెంపు జేసె? సత్య మెల్లధర్మంబులకు మూలంబని ధర్మశాస్త్రంబులు పలుకుచున్నయవి. యట్టి సత్యంబును వాచస్పతి తనంత దా విడిచిన నితరులగతి యేమి? ఇంక సంసార బద్ధు లసత్యంబులకు వెఱతురే? మఱియు, ౨౯౩

ఆ. అశన మొకటిదక్క యఖిలలోకంబుల । కాధిపత్యమైన నాత్మ నొల్ల
రట్టి తాపసులకు ననృతంబులాడుట । వలన నేమికలుగు వసుధ ననఘ. ౨౯౪

ఆ. శిష్టులైనవారె చెలఁగి యబద్ధంబు । లాడిరేని శబ్ద మది ప్రమాణ
మనుట యెట్టు లా బృహస్పతి ఛలకర్ముఁ । డాయెగా విగీతుఁ డనగఁ జనునె. ౨౯౫

గీ. దేవతలు సాత్వికులుగదా దేవగురుఁడు । మిథ్యలాడిన మానవు లెట్టివారు
లగుదురే యేమివింత యీ యఖిలజగము । బూటకములాడ ధర్మ మెచ్చోట నిలచు. ౨౯౬

ఆ. హరియు మాయలాడు హరుఁడును మాయలా । డమరవిభుడు మాయలాడుగాగ
మమ్ముబోటి మర్త్యమండలి నేమందు । మాయజగమునందు మనుటయెట్లు. ౨౯౭

వ. కావున సురలును, నసురులును, వశిష్ట, వామదేవ, విశ్వామిత్ర, బృహస్పతీ ప్రముఖులగు మహామునులును, కామక్రోధాదులు గలిగి ఛలకర్ములై పాపరతులైనచో ధర్మం బెచ్చట నిలిచియుండు? నిదిగాక ఇంద్రుండును, వహ్నియు, చంద్రుడును, బ్రహ్మయు, వరదారాభిలంపటులయిరి. ఇఁక మూఁడు లోకంబులలో నార్యుఁడగువాఁ డెవండు, ఎవ్వాని వచనం బుపదేశంబుగా సంభావింపందగు నన విని వ్యాసుం డిట్లనియె. ౨౯౮

సీ. వినుము రాజేంద్ర య వ్విష్ణుండు శంకరుం । డజుఁడును శక్రుండు నమరగురుఁడు
నఖిలవికారమయంబులై నట్టి దేహంబులు గలవార లందువలన
నచ్యుతుండును రాగి యల శంకరుఁడు రాగి । ద్రుహిణుండు రాగి యింద్రుండు రాగి
రాగియయ్యును జతురతచే విదేహుండు । గాదోచు సంకటకలితుఁడైన
కారణంబులు గుణములు గావె యెంత । వారికేనియు నవి యెట్లు వదలియుండు
నిరుబద్రై దింటఁ బుట్టిన యీశరీర । మందఱికి నొక్క టేగదా యరసిచూడ. ౨౯౯

చ. ఎనయఁ బరోపదేశమున నెల్లరు శిష్టులు స్వార్థమావహి
ల్లినయెడఁ గామలోభముఖలిప్తులు గారె సమస్త దేవతల్
మునులును గాలధర్మముల మట్టక యేడకుఁ బోవువారు దే
హిని గుణముల్ త్యజించునని యెంచకు మెప్పుడు మానవేశ్వరా. ౩౦౦

సీ. ఒకవేళ నచ్యుతుం డురుతపంబొనరించు । ఒకవేళ మఘముసేయు నురుబుద్ధి
యొకవేళ హరి రమాయోగంబు వాటించు । మర్దించు నొకవేళ మనుజభుజుల
నొకవేళ విజయంబు నొందు నొక్కొకవేళ నపజయంబును బొంది యార్తి గుందు
శేషశయ్యను బండి చెలువొందు నొకవేళ । జాగ్రత్త నొకవేళ జగము నేలు
నిట్టు లీశుండు బ్రహ్మయు నింద్రముఖులు । మునులు సుఖదుఃఖములలోన మునిగిఁ మునిగి
తేలి తేలి చలద్గుణాధీనులగుచుఁ । గాలకర్మవశంబునఁ గడుచుచుండ్రు. ౩౦౧

గీ. ఎవ్వరెవ్వరి యాయుష్య మెంతయెంత । యెంతకాలంబు నుందు రీ యఖిలజగము
నిలుచునదికాదు నష్టమౌ ప్రళయమందు । సందియములేదు నామాట సత్యము నృప. ౩౦౨

గీ. మరలఁ బుట్టుచుఁ జచ్చుచు మరలమరల । కర్మవశమునఁ జక్రంబుగతిని దిరిగి
తిరిగి భవములపాలయి తేలలేరు ; విస్మయంబేల గురుఛలవృత్తికిపుడు. ౩౦౩

వ. కామక్రోధాదిదూషితంబై గుణబద్ధంబైన సంసారంబునుండి తొలంగు పరమార్థవేత్త దుర్లభుండు. ఈ సంసారంబు నుద్యమించి దారపరిగ్రహంబులేక సర్వసంగంబులనుండి విడివడినంగాని ముక్తుండుగాడు. బృహస్పతి యట్టివాఁడు కాఁడని మన మెఱుంగమే. గార్హస్థ్యంబు వహించినవాఁడు రాగాదివిముక్తుండు గానేర్చునే, కావున సకల ప్రయత్నంబుల సంసారసముద్రంబు దాటి సచ్చిదానందరూపిణి యగు భగవతి నారాధించవలయు, దేవీమాయచేఁగదా చరాచరంబులు గళాబద్ధంబులయ్యె. ఉన్మత్తక్రియ, నాసవమత్తుచందంబున సదసద్వివేకశూన్యుండై సంసారంబున వర్తించుట మాయాగుణంబుగాని మఱియొండు గాదు. సర్వగుణంబులనుండి దేవ్యారాధంబుననేకాని విముక్తుండుగాఁడు. ఎన్నివిధంబులం జూచిన భగవతి నారాధించుటయే శ్రేయంబు. తదారాధనంబున జీవన్ముక్తుండగు మానుషజన్మ మెత్తియు దేవి నారాధింపకున్న నిచ్చెన చివరమెట్టున కెక్కి దిరుగుచుండుటయేగాని వేఱొండుగాదు. జగం బసత్యసంబద్ధంబని నమ్ముము. నావుడు విని జనమేజయుం డిట్లనియె. ౩౦౪

ఆ. శుక్రురూపుఁదాల్చి సురగురుం డామీద । నేమిచేసె శుక్రుఁ డెపుడు వచ్చెఁ
గనికరంబుఁబూని వినుపింపు మయ్య యో । యవనిదేవ యనిన నతడు పలికె. ౩౦౫

చ. వినుము నరేంద్ర చెప్పెదను విస్తృతధైర్యుఁడు వేల్పుటొజ్జ దా
నను తపమకౌశలిన్ దితిసుతార్యుని రూపము బూనియుండఁగాఁ
గని దితిజుల్ నిజార్యుఁడని గట్టిగనమ్మి నటించి రెంతయున్
జనులకు లోభమెందుఁ బెలుచం గలిగింపదె మోహజాలమున్. ౩౦౬

క. అంతట దశవర్షంబులు । నంతముగానుశనుఁ డా జయంతిం గని యో
యింతీ సమయము చెల్లెను । సంతోషముమీఱ మనల సౌఖ్యము లొదవెన్. ౩౦౭

క. నాకొరకు నిరీక్షించుచు । నేకరణి వసించిరో మహేంద్రునివలనన్
సోకోర్చి నాదు శిష్యులు । రాకాశశివదన పోయి రావలె నటకున్. ౩౦౮

ఆ. పనులు చక్కబెట్టి మనుజాశనులకెల్ల । భయముఁ దీర్చి పహిమ బాటిలంగ
మరల నిన్నుఁ గలసి మదనతంత్రవినోద । మార్గమెనయువాఁడ మందగమన. ౩౦౯

చ. అన విని లేమ యోదితిసుతార్య నిను న్విడనాడి యొంటిగా
మనఁగలనె యట్లైనను సమంచితధర్మము లుప్తి జేయఁగా
జనదని యొప్పెదన్ సెలవొసంగితి పీవు మహానుభావ నీ
పని యయినంతనే మరల వచ్చెదనం చది బుద్ధి నుంచుమీ॥ ౩౧౦

సీ. ఆమాట విని కావ్యుఁ డతిరయంబున నేగి । క్రవ్యాదులున్న చక్కటికిఁ జేరి
చూఁడగా సురగురుం డోడక తనరూపు । ధరియించి సభతీర్చి దనుజవరులు
పార్శ్వంబులందుండి భక్తితో వినుచుండ । నార్యభావముఁ బూని యధికసౌమ్య
మార్గంబునను జైనమతపు సిద్ధాంతమున్ । పటువచోయుక్తి నుపన్యసించి
పశువధాదిక పాపసంబంధమైన । వేదమును నమ్మవలదని విశ్వమం ద
హింస దయయును గలిగి చరింపవలయు । ననుచు బోధింపఁ గని విస్మయంబు నంది. ౩౧౧

గీ. అహహ సురగురుమాయలో నడగి రెల్ల । యసుర లేమందు లోభ మెంతైన(ఁ జేయు
సురులకును ధర్మములు సెప్పు సురగురుండె । దొంగయై దితిసూనుల భంగపరిచె. ౩౧౨

క. ఔరా లోభముకాదా । కారణమగు సకలపాపకర్మంబులకున్
ధీరుఁడగు సురగురుండే । వారక పాషండధర్మ పండితుఁడాయెన్. ౩౧౩

## —• దైత్యులకు శుక్రసంప్రాప్తి •—

ఉ. ఈగతి నెమ్మదిం దలఁచి యెంతయు విస్మితుఁడై భృగూద్భవుం
డీగురుఁడే గురుండు విపరీతగురుండు సుమీ సురారులా

రా గురుఁడీతఁ డయ్యమరరాజికి నియ్యెడ మీగురుండ నే
నీగతి నున్నవాఁడ విడుఁ డీతని దవ్వుల కంపుఁడీ యిఁకన్. ౩౧౪

ఆ. మోసగాఁడు వీఁడు మొగమాట మింకేల । యితనిపలుకు లాద రించి వినినఁ
జెరుపువచ్చు నెంత చేటుపాటు దలంప । రైతిరీరు వీని నీతి వినుచు. ౩౧౫

వ. అనిన నసురులు. ౩౧౬

క. తలయును మొగమును ముక్కును । సెలవులు గడ్డంబు చెవులు చెక్కులు భుజముల్
గళమును రొమ్మును జేతులు । మొల తొడ పిక్కలును సకలమును నొకరూపై. ౩౧౭

ఆ. అతనిఁ జూచి యితని నితనిఁ జూచి యతని । నతని యితని భేద మావబడ్డ
యంత లేవటంచు నమృతంబుగఁ జూడ । గురుడు బలికె నసురవరులఁ జూచి. ౩౧౮

ఆ. వీఁడు భార్గవుండు కాఁడుసుమీ నేనె । భార్గవుండ వీఁడు ప్రాప్తుఁడయ్యె
దేవకార్యమూని దేవత లంపఁగా । మాయభార్గవుండు మాటలేల. ౩౧౯

ఉ. శంకరునొద్ది మంత్రములు చాలఁగఁ గైకొని వచ్చినాఁడ మీ
కంకిలి లేక చెప్పెద సురాధిపునిం గెలువుండు శంక లే
దింకను మంకువాఁ డితని నిచ్చటనుండి తొలంగఁ బంపుఁడీ
బింకము జూపెడిన్ గపటవేషమునం గవిసంచుఁ బల్కెడిన్. ౩౨౦

చ. అన విని వానినే భృగుజుఁ డంచు సునిశ్చితులై భృగూద్భవుం
గని యితఁడే గురుండు తగునా పలుమాటలు ప్రేలనేల మా
దనుజుల నెల్లఁ బ్రోవఁగల ధర్మదయాపరుఁడైన యీతనిం
జనువునఁ గొల్చి మేము కుహనావరునిన్ భజియింతుమే కటా. ౩౨౧

క. అని కారులాడి వీఁడికిఁ । జనుదెంచిన భృగుజుఁ డసురజాలముగని బల్
కినుకపడి నష్టసంజ్ఞత । ననగి పరాభవముఁ బొందుఁడని శపియించెన్. ౩౨౨

ఆ. కొలఁదికాలముననె తెలియంగ గలదు చా । శాపఫలము దాని చవులు గుడిచి
నంత మీఁద దెలియు నరేంద్రుడు గురుదంభవృత్తి పొందు మీకు మత్తు మిగిలె ౩౨౩

ఆ. ఇట్లుపలికి భృగుజుఁ డేగెఁ గోపముతోడ । ముదముమీఱ గురుఁడు మోము విప్పి
దనుజులెల్ల భృగుజు కినుకచే శప్తులై । రనుచుఁ దాను నేఁగె నమరపురికి. ౩౨౪

సీ. వినుమయ్య దేవేంద్ర విబుధలోకగురుండ ననిపించుకొంటి నే నమలబుద్ధి
కడఁగి దానవులను గావ్యుండు శపియించునట్లు గావించి నే నరుగుదెంచి
నాఁడను వైరుల కాదనీడను నేడ తోడునీడయు లేదు నేఁడు చూడ
సంగ్రామమునకయి సమకట్టుఁ డా శాపదగ్ధు లోడుదురు స్వస్థతఁ గనుండు

తే. మీర లన విని మీసాలమీఁదఁ జేతు । లిడుచు దువ్వుచు వేల్పుల విడిదినున్న
యెల్ల జేజేలు రాక్షసాధీశులున్న కడకు సంగ్రామమునకయి కదలి రపుడు ౩౨౫

వ. అట్లు వచ్చిన దేవతాసంఘంబులం గని యౌరా గురుం డెంతజేసెనని దుఃఖించుచు
దానవులు గుంపులుగూడి యొండొరులతో ౩౨౬

ఉ. మోసముఁ జేసి పోయె సురముఖ్యులయొజ్జ నెరుంగమైతి మీ
గాసికి లోనుగావలసెఁగా యిపు డెవ్వరు దిక్కు శుక్రునిం
బాసట గోరుటెట్లు సులభక్రియ లెల్ల గతించె నింక నా
యాసము వచ్చె సేయునదియైనను దోచ దటంచు ఖిన్నులై. ౩౨౭

గీ. భ్రాతృభార్యను బట్టిన పాడుముండ । కొడుకు దా నొక్క ఘన పండితుడ నటంచు
శుక్రరూపంబుఁదాల్చి తా వక్రగతుల । నక్రమై ముంచెఁ బెన్నేటి నట్టనడుమ॥ ౩౨౮

క. ఎటులైన భార్గవుండే । ఘటకుఁడు గావలె నటంచుఁ గడువడి దనుజుల్
పటుతరప్రహ్లాదుని ముం । దట నిడికొని శుక్రుఁజేరి దండము లిడుచున్ ॥ ౩౨౯

వ. నిలచినం గాంచి రోషారుణలోచనుండై ఛీ నిశాటులారా! సిగ్గులేక మరల నిట కేల వచ్చి
తిరి నాడు కపటభార్గవువంచనకు లోనై నే నెంతచెప్పిన వినక నన్నవమానించితిరి.
ఆ ఫలం బనుభవింపకతీరునా నాకేల మీకార్యఘటనంబు మీ తొంటిగురుండె సేయు పొండ
నిన విని ప్రహ్లాదుండు శుక్రుని పాదంబులు పట్టుకొని దీనాననుండై వినయంబుగదుర
నిట్లనియె. ౩౩౦

గీ. మేము మీబిడ్డలముగదా స్వామి నిన్ను । నమ్మి బ్రతుకుచున్నార మిమ్ము లెఱింగి
మాయగురుఁ డేదవచ్చెనో మాకు మత్తు । మందు జల్లిన గలిగెను మందబుద్ధి. ౩౩౧

గీ. ఏమిసేయుదు మపుడు మే మెనసి నిన్ను । నతని నొక్కటిగాఁ జూచి యాచి యాచి
యెంత యోజించినను నేర్పరింపలేక । యున్నవారము చేసెడిదున్నె యొకటి ౩౩౨

గీ. అజ్ఞులము మేముచేసినయట్టి తప్పు । లెన్న నేటికి క్షమియింపు మీవుదక్క
వేరెగతి మాకుఁ గలదె యుర్వీసురులకు । నరయ క్షణమాత్రకోపం బటంద్రు గాదె. ౩౩౩

గీ. శైత్యము స్వభావగుణమైన జలము వహ్ని । చేత నుష్ణముగాంచియు శిఖిని విడచి
మరలశైత్యంబు నొందినమాడ్కి సహజ । శాంతిఁ బూను ముపాధి నిష్క్రాంతమయ్యె.

గీ. కోపమెన్నగఁ జండాల రూపధారి । దాని దరిజేరనిత్తురే తత్త్వవిదులు
కాన రోషంబు మానుము కరుణతోడఁ । గావుమీ నీదుబిడ్డలఁ గన్నతండ్రి. ౩౩౪

క. కోపము విడువక మమ్ముల । నీపట్టున విడచితేని యేము నిరాశా
వ్యాపారులమై పొక్కుచు । నేపడఁగి రసాతలమున కేగెద మనఘా! ౩౩౫

క. అని ప్రహ్లాదుఁడు వినయం । బునఁ బల్కిన విని శమంబు పూని వెరవకుం
డని పల్కి రసాస్థలికిం । జనవలదు జయంబు మీకుఁ సమకట్టుఁజుడీ. ౩౩౭

క. మిము రక్షించెద మంత్రా । ర్థమహిమ సత్యంబు భీతిలం బనిలే దా
యమరుల జయించుటకు సు । క్షములగుదురు మీరు కాలసాహాయ్యమునన్. ౩౩౮

గీ. కాకమానదు కాదగు కార్యమెందు । శుభమయిన నశుభంబైన చూచి దాని
దలఁగజేయంగ నోపదు దైవమైన । వగవఁ బనియేమి యశుభంబు వచ్చెననుచు ౩౩౯

గీ. కాల మిప్పుడు మంచిది కాదు మీకు । విబుధులకు నోడియుంటిరి వితలమందు
మున్ను దశపూర్ణయుగములు మన్నుమిన్ను । మీరె యేలంగలేదె సమిద్ధవృత్తి ౩౪౦

క. సావర్ణికమనుకాలము । రావలె నీమనుమఁ డపుడు రాజై భూమిన్
దేవపురి నాగలోకముఁ । జేవం బాలించు వాఁడు స్థిరకీర్తిమెయిన్. ౩౪౧

క. నీ మనుమఁడైన బలి న । వ్వామనుఁడు సుబద్ధుఁజేసి వరమిచ్చెను దా
శ్రీమహిమను సావర్ణిక । నామమనువునాడు శుక్రనాముడ వీవే. ౩౪౨

క. కాఁగలవని యదిగైకొని । యాగామి దలంచుకొనుచు నతిభీతుగతిన్
దా గార్ధభాకృతిని శూ । న్యాగారమునందు నుండె న బ్బలి యంతన్. ౩౪౩

వ. ఇట్లుండ నొక్కనాఁడు గార్ధభరూపుండైయున్న బలింగాంచి విస్మితుండై దేవేంద్రుండు. ౩౪౪

ఆ. సర్వలోకభోగశాలివి దైత్యుల । ప్రభుఁడ వీవు భీతుపగిది నిట్లు
గార్ధభంబ వగుచు గడురహస్యంబుగా । నుండుటకును హేతు వొండు గలదె. ౩౪౫

క. అన విని బలి యిట్లనియెన్ । ఘనవాహ విచారమింత కావలెనె జనా
ర్దనుఁడు ఝుషకూర్మపోత్రుల । తనువులు పలుమారు పెక్కు దాల్చఁగ లేదే. ౩౪౬

గీ. బ్రహ్మహత్యకునై నీవు పద్మలీన । వృత్తి నుంటివి యెఱుఁగవే యేను నట్ల
కాలయోగంబు మహిమచే గాడ్దెనైతి । దైవకృతులకు దుఃఖింపఁదగునె యింద్ర. ౩౪౭

క. కావున దైవాధీనం । బై విశ్వంబెల్ల పెరుగు నడఁగును కాలం
బే వివిధసుఖాసుఖముల । కావాలమటంద్రుగాదె యార్యులు మఘవా. ౩౪౮

వ. ఇట్లు పలికిన విని యింద్రుండును నట్లయౌననిన నయ్యిరువురు యథాస్థానంబుల కరిగిరని శుక్రుండు చెప్పెనని వ్యాసుండు మరియు నిట్లనియె. ౩౪౯

క. అని యిట్లుశనుఁడు పలికినఁ । విని ప్రహ్లాదుండు మదిని విధియె బలిష్టం
బని యెఱిఁగి దనుజులం గని । ఘన మెప్పుడు దైవమదియె కనుఁగొనుఁ డనుచున్. ౩౫౦

క. విని మదగర్వితులగు న । ద్దనుజులు సంగ్రామ మిపుడు తప్పక చేయం
గను వలయు దైవ మెవ్వఁడు । గన నెట్టిది యెచట నుండుఁ గనరా దనుచున్. ౩౫౧

సీ. సర్వజ్ఞుఁడవు నీ వుశనశిష్యసంతానవరుఁడు మాముందును దరలకుండు
మనుచు దేవతల యుద్ధార్థంబు జీరిన వారును సమకట్టి వచ్చిరంత
బ్రహ్లాదునకు దేవపతికిని ఘోరమై పూర్ణవర్షశతంబు పోరు జరిగె
నా యుద్ధమున దానవానీకములు గెల్చె నంతట దేవేంద్రుఁ డార్యు నడిగె. ౩౫౨

తే. సర్వదుఃఖవినాశిని శక్తి దేవి । పరమశివ సర్వలోకైకపాలిని భగ
వతి మహేశ్వరి భూతసంతతివిధాత్రి । నాత్మ నిట్లని ధ్యానించె నధికభక్తి. ౩౫౩

సీ జయజయ కల్యాణి జయశూలధారిణి జయఖడ్గశంఖాబ్జచక్రపాణి
దశతత్వరూపిణి దారిద్ర్యనాశని మాతర్మహాబిందు మహతమూర్తి
దర్శననాయికే తతభువనేశాని సచ్చిదానందిని సకలకర్త్రి
ప్రాణాగ్నిహోత్రమంత్ర ప్రకాశిని దేవి దీపశిఖాత్మికే దివ్యకుండ

తే. లిని మహాబిందురూపిణి వినుత పంచ । కోశమధ్యగతే హసాంకురవిలాస
ముఖి మహానందకలికే నమోస్తుతే య । టంచుఁ బలుమారు మ్రొక్కి యనంతరము ౩౫౪

సీ. మాకుఁ బ్రసన్నవై మము రక్షించుమీ భక్తవాంఛితకల్పవల్లి తల్లి
శరణంబుగా నీదు చరణంబు నమ్మితి భక్తవాంఛితకల్పవల్లి తల్లి
సంపదల్ దయసేయ శక్తవు నీవెకా భక్తవాంఛితకల్పవల్లి తల్లి
దుఃఖముల్ తొలఁగింపు దొరసానివిగదమ్మ భక్తవాంఛితకల్పవల్లి తల్లి

గీ. ముక్తసంగుల కీవకా మోక్షదాత్రి । వఖిలజగములఁ బోషింతు వాదిశక్తి
పూర్ణితంబైన నీ తేజ మొకట సతము । భక్తవాంఛిత ఘనకల్ప వల్లి తల్లి. ౩౫౫

సీ. భువనంబు లన్నియుఁ బుట్టింప గిట్టింప నీవకా కెవ్వరు దేవదేవి
నీ మహత్వము నెన్న నేరరు బ్రహ్మయు నాదిత్యుఁడు శివుండు నచ్యుతుండు
చంద్రుండు వరుణుండు శమనుండు పవనుండు నిగమాగమములు మునిప్రవరులు
తల్లి నిన్గొలిచిన ధన్యులు సంసారబంధవిముక్తులై పరగుచుంద్రు

గీ. నిన్నుఁ గొలువనివారలు నిఖిలదుఃఖ । భాజనంబైన సంసృతిపా లగుదురు
నీదు శక్తికిఁ బ్రతి యొండు లేదు లేదు । మమ్ముగన్నమ్మ బంగారుబొమ్మవమ్మ. ౩౫౬

సీ. వింజామరలు బట్టి విసరెడి ధన్యులు తొలిజన్మమున నిన్ను గొలిచినారు
చెలువుగా నిన్ను బూజించెడి ధన్యులు తొలిజన్మమున నిన్ను గొలిచినారు
వలనుగా ఛత్రంబు పట్టెడి ధన్యులు । తొలిజన్మమున నిన్ను గొలిచినారు
ఊడిగంబులు నీకు నొనరించు ధన్యులు । తొలిజన్మమున నిన్ను గొలిచినారు

నిన్ను గొలువనివారల నెన్ననేల । వారి బ్రతుకులు బ్రతుకులా సారహీన
మైన సంసారమున జిక్కి నడుగడుగున । మోసమొందుటెకాక విముక్తిగలదె. ౩౫౭

వ. అని యట్లనేకవిధంబుల శునాసీరుండు గొనియాడ సింహారూఢయుఁ జతుర్భుజయు శంఖచక్రగదాపద్మాద్యాయుధధారిణియు, చారులోచనయు, రక్తాంబరధరయు, దివ్య మాల్యాలంకృతయు నై విశ్వేశ్వరి ప్రాదుర్భవించి ప్రసన్నవదనయై. ౩౫౮

చ. సురవరులార మీరు భయశోకము లందకుఁ డింక మీకు సు
స్థిరసుఖ మిచ్చెదం గనుఁడు సిద్ధి నటంచు వచించి లోకసుం
దరి మృగరాజునెక్కి వడి దానవులుండెడిచోటి కేగినం
గరమరుదార వారలును గన్గొని రా జగదేకపాలినిన్. ౩౫౯

వ. అట్లు చూచి. ౩౬౦

శా. ఈ దివ్యాంబను జేరిచూడఁగలమా యేమింక దిక్కంచుఁ బ్ర
హ్లాదు న్మాధవభక్తిసంయుతుని డాయంజేరి యీ యీశ్వరిన్
యాదోరాశిశయానుఁ జూచితివె మా కాలంబు సేయంగ నే
లా దూదూ యని తూలఁజేయునొకలీలన్ సంశయం బేటికిన్. ౩౬౧

వ. అని చెప్పి నిలచియున్న దానవులం జూచి విజ్ఞాత నిఖిలమర్యాదుండైన ప్రహ్లాదుండు దనుజులారా! మనకిప్పుడు సంగ్రామంబునకు సమయంబుగాదు పారిచనుట యుత్తమ మార్గంబు, నావుడు నదివిని నముచి యనువాఁడు దానవేంద్రా యీ మహాదేవి రోషారుణితనయనయై వచ్చుచున్నయది, మముచెంబడించి ఇప్పుడ చంపునోయను భీతి వొడముచున్నయది మేమెట్టులైనఁ గాలికొలఁదిం బాతాళంబున కురికెదముగాని యీ శక్తి మా వెంటఁబడకుండఁ జేయవే యనిన విని ప్రహ్లాదుండు. ౩౬౨

క. ఇష్టార్థధాత్రి దేవిన్, సృష్టిస్థితిలయవిధాత్రిఁ జిన్మయమూర్తిన్
గష్టభయశోకనాశిని । విష్టపవందినిఁ దలంతు వేడుకమీఱన్. ౩౬౩

సీ. సర్వంబు నీవయై జగముసు గల్పింపఁ । జేత్రాదు సర్వంబుఁ జేసినావు
సర్వంబు నీవయై జగములు గల్పింపఁ । గొందఱు కర్తలఁ గూర్చినావు
సర్వంబు నీవయై జగములఁ గల్పింపఁ । భేదము ల్మాయచేఁ బెంచినావు
సర్వంబు నీవయై జగములు గల్పింపఁ । త్రిగుణంబులకు పేరు దెచ్చినావు

తే. మేము నీ భక్తజనులము గామె తల్లి । దేవతలఁ జూచినట్టి యా దృష్టితోడఁ
గనుగొనఁగరాదె మమ్ములఁ గన్నయమ్మ । నీవకద బిడ్డలము మేము దేవదేవి. ౩౬౪

క. ఎందును స్వార్థపరాయణు । లందఱు మే మట్టివార మననేటికి మా
యందుఁ గరుణ యిడుమమ్మా । బృందారకులకును మాకును వేఱేమమ్మా! ౩౬౫

క. ఎందును ధనదారసహితు । లందఱు మేమట్టివార మననేటికి మా
యందుఁ గరుణయిడుమమ్మా । బృందారకులకును మాకు వేఱేమమ్మా. ౩౧౬

క. ఎందును గశ్యపసంభవు । లందఱు మే మట్టివార మగుదుముగా మా
యందుఁ గరుణ యిడుమమ్మా । బృందారకులకును మాకు వేఱేమమ్మా. ౩౧౭

క. కొందఱు బిడ్డలపై దయ । కొందఱు కొండికలమీఁదఁ గోపంబేలా
యందఱి నొక్కవిధంబునఁ । గందురుగదె తల్లు లీ జగంబున దేవీ. ౩౧౮

క. గుణభేదము సురలకసుర । గణములకును గలదటన్నఁ గలదే భేదం
బణుమాత్రము కామాదిక । గణములలో సకలలోకకర్త్రీ ధాత్రీ. ౩౧౯

క. వేడుకకై భేదంబులు । వాడుక గావించితీవ వైరములంచుం
జోడించి సురల నసురుల । నాడించెదు బొమ్మలాటయట్టులఁ దల్లీ! ౩౨౦

క ఓడించెద వొకపక్షము । పాడించెద జయము లొక్కపక్షమునందున్
వాఁడును వీఁడును నాటక । మాఁడగఁ జూడంగ వేడుకాయెనొ తల్లీ! ౩౨౧

క. భవజలధి దాటి సుఖముగ । నవలం బడఁజేయఁ గలుగునట్టిరు గలరే
భువి దివి నెచ్చటనైనను । వివరింపగఁ నీవ యొకతెవేసుమి తల్లీ॥ ౩౨౨

గీ. మొదల జగములఁ బాలింప । మురవిరోధి నేర్పరచినావు కావున నెల్లసురలు
నసురులును గూడి మధియింప నబ్ధియందు । బుట్టుమహానీయవస్తువుల్ పట్టిశౌరి॥ ౩౨౩

వ. లక్ష్మిని దాను గ్రహించె, నైరావతోచ్చైశ్శ్రవః కామధేను చింతామణి కల్పవృక్షాదుల నింద్రున కిచ్చె నమృతపానంబుఁజేసి దేవతలు సాధువులైరి. ఈ దేవతలు విష్ణునిబలంబున నిల్చియున్నవారు. దైత్యులకుం బరాభవంబు గల్గుచున్నయది, కాని ధర్మం బిది యనియు నధర్మం బిది యనియు నేరు నిర్ణయింపఁగలరు? ధర్మలక్షణంబు పదుగురు పది విధంబులం జెప్పుదురు. శాస్త్రంబులయందు ధర్మనిర్వచనం బేకవిధంబుగాక యున్నయది. వేదవాదకులు విధి ధర్మంబందురు. తార్కికులు యుక్తిసహంబు ధర్మంబందురు. చరాచరంబు సకర్తృకంబనుటయు యుక్తిసహంబుగాదు. ఏకకర్తృక కార్యంబులు పరస్పర విరుద్ధంబు లెట్లగు. వేదవిదులందఱు నేకాభిప్రాయంబు గలవారైరే యట్లగుటంజేసి స్థావరజంగమాత్మకంబైన సకలప్రపంచమ్మును స్వార్థపరంబై యున్నయది. నిస్పృహులకు సంసారబంధంబున్నె? బృహస్పతిభార్యను జంద్రుడు తస్కరించె. నిది యేధర్మంబు? గౌతమమునిభార్య నింద్రుండు గూడె. నిది యేధర్మంబు? దేవగురునిచే గర్భవతియైన భ్రాతృభార్య భోగింపబడియె. నిది యేధర్మంబు? రాహుశిరంబు నారాయణుండు నిజ చక్రంబునం దెగవేసె. నిది యేధర్మంబు? వానికన్నింటికేమి – నా మసుమఁడైన బలి ధర్మవంతుఁడు, సత్యవ్రతుండు, యజ్వయు, దాతయు, సర్వపూజకుండు నై లోకం

బులఁ బాలింప వామనాకారుండై వచ్చి మోసంబు చేసి రాజ్యంబెల్లం గైకొని పదభ్రష్టుం గావించిన త్రివిక్రమునియం దేధర్మంబుగలదు? ధర్మవాదంబులకేమి - ఎవ్వరికి దోచినట్లు వారు స్వమతానుకూలక్రియావిశేషంబులని చెప్పుచుందు రిదియెల్ల నీకుఁ దెలియనిది కలదే? పరికించిన యిచ్చచొప్పునం జేయందగు, నిఁక నీ చిత్తము మా బాగ్యమని మ్రొక్కి నిలువంబడిన ప్రహ్లాదుం జూచి దేవి యిట్లనియె. ౩౭౪

సీ. రాక్షసులార మీరలు భయమందంగఁ బనిలేదు దుఃఖంబు మానుడింక
బాతాళమునకును బదుఁడు మీకును శుభకాలంబు వచ్చుదాక నిలువుండు
తృప్తిగల్గినవారి కెల్లప్పుడు సుఖంబు తృప్తిలేకున్న సుఖాప్తిలేదు
మూడులోకంబుల మొనగాడు దుఃఖంబు వృద్ధిపొందించును దృప్తిలేక

తే. పొందు పొండిప్పు డన విని రండురండు । పోదమనుచును వైశంబ పోయి వితల
మందు వసియించి రమృతాశనారులెల్ల । శక్తికృత్యంబులకు వేఱుజాడ గలదె. ౩౭౫

వ. అని చెప్పిన విని జనమేజయుండు సాత్యవతేయున కిట్లనియె. ౩౭౬

## —* విష్ణుని నానావతార కథనము *—

సీ. భృగుశాపమున రమాప్రియునకు నవతారములు గల్గెనంటివి మునివరేణ్య
యెప్పు డెట్టుల నెందు నిది వినఁగోరెద వినిపింపుమయ్య సవిస్తరముగ
నారాయణుని యవతారకథలు విన్న బాపంబుదొలఁగు సంపదలుగల్గు
నావుఁడు వ్యాసుండు నరనాథ నీవడిగిన యదియెల్ల నే వినుతు నిపుడు
మహినిఁ బుట్టెను చాక్షుషమనువునాడు । నరుఁడు నారాయణుం డన నరకవైరి
ధర్మదేవునకును దారు తనయులగుచుఁ । దపమొనర్చినవార లుత్తమనిరూఢి. ౩౭౭

సీ. మఱియు వైవస్వతమన్వంతరంబున । నత్రికి కొడుకయి యవతరించె
నతఁడు దత్తాత్రేయు డనబడు విష్ణుండు । పరమతపోనిధి భవ్యమూర్తి
అత్రి యిల్లాలైన యనసూయ ప్రార్థింప । జలజాసనుఁడు పుట్టెఁ జంద్రుఁడగుచు
దూర్వాసుఁడై పుట్టె ధూర్జటి యదిగాక । నరసింహరూపుఁడై హరి జనించెఁ
గనకకశిపునిఁ ద్రుంచి భక్తవరుఁడైన । యట్టి ప్రహ్లాదు రక్షించె నమితకరుణఁ
బిదపఁ ద్రేతాయుగంబునఁ బిన్నవడుగు । రూపుఁ దాలిచి బలిభాగ్య మేపు దూల్చె. ౩౭౮

సీ. పందొమ్మిదవ త్రేత భగవంతుఁడగు శౌరి । జమదగ్ని కుమరుఁడై జననమంది
పరశురాముఁడనంగఁ బరగి క్షత్రియవర్గ । ములబట్టి చెండాడి గెలిచి భూమి
కశ్యపద్విజునకుఁ గడువేడుక నొసంగెఁ । దరువాతి త్రేత మాధవుఁడు పంక్తి
రథునకు రాముఁడు లక్ష్మణుఁ డన నర । నారాయణాంశ విస్ఫారమహిమ

నవని నుదయించె వారల యంశమునను । నరుఁడు కృష్ణుఁడునా మహానందగరిమ
ధరణిభారంబుఁ దీర్ప ధూర్తవధఁ జేసె । నాదినారాయణు గణింప నలవియగునె ? ౩౬౯

ఆ. ప్రకృతిననుసరించి బహురూపముల నిట్లు । దాల్చుచుండుఁ జక్రధారి ప్రకృతి
వదలియుండు నెవని వశము మానవనాథ । ప్రకృతి త్రిప్పుచుండు సకలజగము. ౩౭౦

వ. అది తనకభిన్నుండగు పురుషుం గూడియుండు, నప్పురుషుండు. ౩౭౧

క. సర్వాదిసర్వగతుఁడు । సర్వేశ్వరుఁ డఖిలవేత్త సర్వజగములన్
ధూర్వహతం బుట్టించును । నిర్వాహముసేయుఁ గొట్టు నిఖిలముఁ దానై ॥ ౩౭౨

సీ. అతఁడు నిరాలంబుఁ డతఁడు నిరాకారుఁ డతఁడు నిరామయుం డతఁ డనాది
యతఁడు నిస్స్పృహుఁ డతఁ డాదిపరాత్పరుం డతఁడు దుర్జ్ఞేయుఁ డున్నతుడు ఘనుడు
పేర్మిమీఱ నుపాధి భేదంబులనుబట్టి మూఁడు విధంబుల మొనయుఁ బ్రకృతి
నుత్పత్తికాలంబు యోగంబునంజేసి యొకరూపు పాలన నొక్కరూపు

తే. ప్రళయవేళల నొకరూపు బరిఢవిల్లు రూపు లవి మూఁడుమూర్తుల రూఢికెక్కు
సృష్టిని హిరణ్యగర్భుండు పుష్టి హరియు నష్టినీశానుఁడును నన నరవరేణ్య, ౩౭౩

వ. కావునం బ్రకృతియే సర్వంబునకుం గారణంబై యీ జగంబంతయుఁ దన మహి
మంబున సుఖదుఃఖంబుల పాలుఁజేసి విధితంత్రనియంత్రితయై భ్రమియింపం జేయు
చుండునని చెప్పిన విని జనమేజయుండు వ్యాసున కిట్లనియె. ౩౭౪

మ. నరనారాయణు లాశ్రమాంతరమున న్వారాంగన ల్వేఁడఁగా
స్మరబాణాహతలైన వారల శపింపంబూను నారాయణున్
గరమర్థి న్నరుఁ డడ్డగించెనని యుక్తంబయ్యె నీచేత న
త్తరి నాయంగన లేమిచేసిరొకొ వృత్తంబేమొ చెప్పంగదే. ౩౭౫

వ. అనిన వ్యాసుండిట్లనియె. ౩౭౬

ఉ. చెప్పెద నాలకింపుము సుశీల నరుం డటు లడ్డగింపగాఁ
నప్పరమ ప్రభావుఁడు మహామతి శాంతినిఁ బొంది నవ్వుచున్
దెప్పిలి కందచక్కెరలు దేనియ లుట్టిపడంగఁ బల్కె నా
యొప్పులకుప్ప యో సురతతోదరులార వినుం డటం చొగిన్. ౩౭౭

క. ఈజన్మంబున నంగన । తోఁ జేరనటంచు వ్రతము తొలుత దృఢమతిన్
నే జేసికొంటి గావున । రాజాననలార ముట్టరాదిపుడు మిమున్. ౩౭౮

క. కావున నా వ్రతభంగము । మీవలనం గలుగవేల మీరెఱుఁగరె ధ
ర్మావిష్కృతి నను దయతోఁ । గావందగుఁ ద్రిదివమునకుఁ గదలుఁడు వేగన్. ౩౭౯

క. స్థాయీభావము రతియగు । నోయంగనలార యెట్టులోపుదుఁ దద్భా
వాయతి కది లేకున్నన్ । గాయజసంబంధ మెట్లు గలుగును మీతోన్. ౩౯౦

గీ. ప్రీతిపాత్రుండనైతిగా మీకు నేను । నెంత ధన్యుండ నాభాగ్య మేమిచెప్ప
చారుముఖులార వ్రతరక్ష సలుపుఁ డిపుడు । మీకృపాద్రుక్ప్రపాసమ్మిళితుఁజేసి ౩౯౧

వ. ఇరువదియెన్మిదవ మహాయుగంబున ద్వాపరంబున దేవకార్యార్థినై భూతలంబున నే జన్మింపగలను. నాఁడు మిమ్ము దారలుగా గ్రహింపఁగలను. తథ్యంబని పల్కి యాశ్వాసింప వారలరచుచు స్వర్గంబునకుం జని తమ యావద్వృత్తాంతంబును శక్రుని కెరింగించిన విని సంతసించియున్న శతమఖుసన్నిధానంబున నిలిచియున్న యూర్వశితో నింద్రుం డిట్లనియె. ౩౯౨

ఉ. ఆ యమివర్యుఁ డెంతటి మహామహుఁ డెంతటి ధైర్యశాలి నా
రాయణుఁడు న్నిజోరువున నంగనలం బదియారువేవురం
దోయజపత్రనేత్రలను దోరముగా సృజియించె నౌర! య
త్యాయతచర్య డంచు మది నద్భుతమందుచు మెచ్చె నత్తరిన్. ౩౯౩

క. నరనారయణచరితము । నరవర మును వింటిఁగాదె నావలనన య
య్యిరువురు కృష్ణార్జునులై । ధరఁబుట్టిరి భృగుని శాపతత్వముపేర్మిన్. ౩౯౪

వ. అనిన విని జనమేజయుండు మునీంద్రా! శ్రీకృష్ణునిచరితంబు పరమాద్భుతం బది విన వలతు నందు సందియంబు లనేకంబులు గల వెట్లనిన. ౩౯౫

## — కృష్ణావతారాది ప్రశ్న —

ఆ. హరి యనంతుఁ డీశుఁ డచ్యుతుండు స్వగర్భ । జనితుఁడై తలిర్ప జనకునకును
జననికిని ననేక వత్సరంబులు । కాలిసంకె లెట్లు గలిగె ననఘ. ౩౯౬

గీ. మధురలోఁబుట్టిఁ యావులమంద కెట్లు । దారెఁ గంసునివధియించి ద్వారవతికి
నెట్లుపోయెను దంద్రియు నెల్లవారు । నున్నదేశంబువిడిచి వేఱొక్కకడకు. ౩౯౭

గీ. కృష్ణుఁ డుదయించినకులంబు నెట్లు ద్విజుఁడు । శప్తముంజేసె పుడమి రక్షణకుశౌరి
యెట్లు దేహంబు విడనాడె నిదియు నాకుఁ । దెల్లముగ వినిపింపుము ధీరవర్య! ౩౯౮

వ మఱియు దుష్టజనవ్యాకులంబైన భూతలంబుభారం బుడిపిన కృష్ణార్జునులు కృష్ణభార్యల లుంఠితలంజేసిన పాపిష్ఠుల నేల నిపాతితులం జేయరైరి. భీష్మ ద్రోణ కర్ణ బాహ్లిక వైరాట వికర్ణ దృష్టద్యుమ్న సోమదత్తాదుల నాయోధనంబున నిహతులం జేసిరికదా, వారలుమాత్రము భూమికి బరువై కృష్ణపత్నుల లుంఠితలంజేసిన దుష్టులు భారంబుకారైరే? పతివ్రతలైన కృష్ణపత్నులకు దుఃఖంబు ప్రాపింపఁ గతంబేమి ? వసుదేవునికెట్లు దేహ

త్యాగంబుగలిగె? కృష్ణాశ్రితులై మహాబలులగు పాండవులకుం దుఃఖంబులు రా గతంబేమి? వేదీమధ్యంబున లక్ష్మ్యంశంబునం బుట్టిన ద్రౌపదికిం జెప్ప నలవికాని దుఃఖంబు లెట్లు గలిగె? రజోదోషసమన్వితయైయుండ దుశ్శాసనుండు సభకుందెచ్చె. మఱియు నతనిచేఁ గేశగ్రహణకర్శిత యయ్యెఁ వన మధ్యగతయైయుండ సింధురాజుచేఁ బీడింపఁబడె. విరాటపురమునం గీచకునిచే దుఃఖపెట్టఁబడియె, ఇంతియగాక యామెకొడుకు లైదుగురు ద్రౌణిచే నిహతులైరి. బాలుండైన సుభద్రాతనూజుండు మడిసె. దేవకీసుతులు పసిపాప లార్వురు నిహతులైరి. హరి యెంతసమర్థుండైనను దుఃఖంబులు తప్పినవికావుగదా. అని మఱియు నిట్లనియె. ౩౯౯

క. యాదవకులంబు చెడియెన్ । శ్రీదయితుం డుగ్రసేనుసేవ యొనర్చెన్
హా దైవకృతము గడపఁగ । రాదుగదా ద్రుహిణహరిహరాదులకైనన్. ౪౦౦

క. లౌకికుఁడుగాని హరి యయ్యైకర్మములాచరించె నా భీష్మసుతం
గైకొని చోరునిరీతిం బ్రాకెగదా యేమిచెప్ప భగవన్మాయన్. ౪౦౧

గీ. అఖిలసంపదలకుస్థానమైన మధుర । విడిచి ద్వారక కేగి తాఁవిడిసె గాదె
యా జరాసంధుభీతిచే నహహః కాల । కర్మమహిమంబు నెన్నంగఁ గలమె యెందు. ౪౦౨

గీ. వీని నన్నింటి ననఘ సవిస్తరముగఁ । దెలుపుమీఁక పశుధర్మమై యలరునట్టి
బహుపతులకూర్మి యెట్లు ద్రౌపదికి నొప్పె । గోళకులు నొప్పిరేలాగు గురుకులమున.

వ. అనినవిని వ్యాసుండు. ౪౦౪

క. వినుమయ్యా జనమేజయ । ఘనతరకృష్ణావతార కథఁ జెప్పెద నీ
మనమున సందేహములకు । బనిలే దిక కారణములు బరికించినచో. ౪౦౫

## —: కృష్ణావతార కారణము. —

క. ధర దుష్టభరము నోర్వక । దరమందుచు ధేనురూపధారిణి యగుచున్
సురరాజుకడకు నేగిన । ధరణింగని యాతఁడనియె దయ దైవారన్ ౪౦౬

చ. భయపడనేలదేవి నిను బాధితజేసినవాఁ డెవండు ని
శ్చయముగఁ దెల్పుమన్న సురసత్తమ నా వగ పేమిచెప్పుదున్
దయ హృదయంబునం దెనయఁ దద్దయు నన్నిఁక నాదరింపుమీ
జయమగు నీకు దుష్టజన జాలము నే భరింపనోడితిన్. ౪౦౭

వ. సర్వలోకసార్వభౌమా! జరాసంధుండను మహాపాపియుం, మాగధుండను దుర్మార్గ వర్తియు, శిశుపాలుండను కుత్సితుండును, రుక్మియను నీతిరహితుండును, కంసుండను

గర్వాంధుండును, నరకుండను నయవిహీనుండును, సాల్వుండను క్రూరుండును, ధేను కవత్సకులను దుష్టులును, మొదలగు కొందఱు సర్వధర్మవిహీనులై, పరస్పరవిరోధులై పాపాచారులై, మదోన్మత్తులై, కాలరూపులై నన్నుం బీడింపఁ దద్భరంబు సహింప లేకయుంటి. ఇట్టియెడ నే నేమిసేయుదు? నెక్కడి కేగుదునని చింతిల్లుచున్నదాన. తొల్లి నేను హిరణ్యాక్షునిచేఁ బీడింపఁబడినప్పు డాదినారయణుండు వరాహరూపుడై నన్నుద్ధరించె. నిప్పుడేదురాత్ములభరింప జాల ముందిరువదియెన్మిదవ కలియుగంబు రాఁబోవుచున్నయది. అప్పు డతిభరంబునం గుందుదునోయను భయంబు వొడమెడిని. రసాతలంబున కేగి సుఖనిద్ర సుఖియించెద. నిప్పు డీ దుఃఖసాగరంబు దాటింప శర ణంబ వీవ యని నమ్మివచ్చితి. నీపాదంబుల కిదె నమస్కరించెద నని పల్కిన విని యింద్రుం డిట్లనియె. ౪౦౮

క. ధరణీ యిప్పుడ చని య । ప్పరమేష్ఠిని సకలలోకపాలకు నజునిన్
శరణంబు వేడు మచ్చటి । కరుదెంచెద నీదు దుఃఖ మడఁచెదఁబొమ్మీ. ౪౦౯

సీ. అది విని భూదేవి యజునిలోకమునకుఁ జనుచుండ వెంటనే శక్రుఁ డేగె
సర్వవిబుధపురస్సరుఁడయి యా యిర్వురును దను జేరిన వనజభవుడు
జూచి నిమీలితలోచనయై ధ్యానసముపేత యగు క్షమాసతినిఁగూర్చి
కల్యాణి దుఃఖింప గతమేమి యిప్పుడు పాపులచే బాధ పడితివాక్కా- ౪౧౦

తే. నా విని యనంత వినుము విన్నపము దేవ । వచ్చుచున్వాఁడు కలి మహాపాపిపాప
కర్ములైన ప్రజల్గల్గి కడుభరంబు । పెట్టుదురు నిల్వనోడితి భీతి దోచె. ౪౧౧

వ. అదియుంఁ గాక ౪౧౨

ఉ. రాజులు పాపచారులు పరస్పరవైరవిధానసంతత
వ్యాజులు చోరకర్మరతు లాశలెన్నఁగఁ బూర్వవైరుతే
యో జగదీశ వారిపొగ ర్దోర్చినఁగాక జరింపఁజాల నే
యోజను నన్ను బ్రోవగలవో నిను జేరితి నీకు మ్రొక్కితిన్. ౪౧౩

వ. అనిన. ౪౧౪

ఉ. నీదుభరంబుఁ దీర్చుటకు నేను సమర్థుఁడఁగాను వేగమే
పోదము రండు మాధవుని ప్రోలికి ధాత్రి సురేశ్వరుండు నే
నీదివిజుల్ నిసుం గలసి యేగిన నాతఁడు జాలిపుట్టి య
త్యాదరవృత్తి నీభరమునంతయుఁ దీర్చునటంచుఁ బల్కుచున్. ౪౧౫

వ. ఇట్లు హిరణ్యగర్భుండు శునాశీరాశిబృందారకబృందంబులు భూదేవితోడఁ దనవెంటను జనుదేర వైకుంఠంబునకుం బోయి వాసుదేవుం దిలకించి నమస్కరించి భక్తిప్రవణమాన సుండై చతుర్ముఖుండు వేదవాక్యంబుల స్తుతియింపం దొడంగె. ౪౧౬

తరళ. వేయిశిరలును వేయిగన్నులు వేదపూరుషునకు న
త్యాయతంబగు రూపమొప్పు మహామహుండవు మాకునుం
బాయ కిచ్చితి దేవతాత్వము భక్తిలోకశరణ్యునిన్
వేయివిధముల సన్నుతించెద విశ్వకారణ కేశవా! ౪౧౭

తరళ. ఇంతవాఁడవు నీవటంచు గణింపనోవు నెవండు సు
స్వాంతుఁడై నిను గొల్చువాఁడె సమస్తసంపదలందు నీ
చెంతఁ జేరితిమయ్య మమ్ములఁ జెల్వుమీర భరింపుమా
వింతలయ్యెడు నీదు చెయ్వులు విశ్వకారణ కేశవా! ౪౧౮

క. అని బహువిధముల వారలు । గొనియాడఁగ దైత్యవైరి గురుకరుణన్ ద
ర్శనమిచ్చి యెలనగవుతోఁ దనరుచు నందరిని స్వాగతంబడిగి వెసన్. ౪౧౯

ఉ. వచ్చిన కారణంబు దెలుపందగునన్నఁ బితామహుండు దా
గ్రచ్చర నోమహాపురుష కంజదళాక్ష ధరాభరంబు పెం
పెచ్చెను ధాత్రిదుఃఖము వచింపఁగ లేమిని నీవు భూమికిన్
వచ్చి దురాత్ముల న్నరికి ద్వాపరశేషము గెంటఁజేయుమీ. ౪౨౦

వ. అనగా। ౪౨౧

తరువోజ. ఇలభారముడుపంగ నేనెంతవాఁడ । నీవెంత శివుఁడెంత యింద్రాదులెంత
జలజాప్తుడెంత దా జలపతి యెంత । జ్వలనుండు దానెంత శమనుఁడునెంత
యలవియే యోగమాయకుదక్క పెరల । కణ్వాదిమేరుపర్యంతంబు నదియ
కులుకుచు దారాన గ్రుచ్చెనుగాదె । తలపంగ నెవ్వని తరము తన్మహిమ. ౪౨౨

క. ఆదేవి స్వేచ్ఛ నఖిలము । పాదుకొలుపు దాని యాజ్ఞఁ బట్టిసుమీ నా
చైదములు కాకయున్నను వేదములే మత్స్య కూర్మ మూర్తులు నాకున్. ౪౨౩

సీ. ఏభోగ మేకీతిన్ యాతిను దిర్యగ్యోను । లందుబుట్టిన దాని కబ్జగర్భ
ఏపుణ్య మేఫలం బిల క్షుద్రయోనుల । జనియించువానికి ననఘచరిత
కిటినైతి నరమృగాకృతినైతి దాతను । బాధింపఁగను బొట్టివాడనైతి
జమదగ్ని కుదయించి సకలరాజన్యుల । దయలేక చంపితి నయయొ రాఘ ౪౨౪

తే. వుండనై మునివృత్తితో దండకాట । విం జరించి జడలుదాల్చి వేళ్ల పండ్లు
సాపడుచు వల్కలముఁగట్టి సకలదుఃఖ । మనుభవించితి నెఱుగఁవే యమరవినుత. ౪౨౫

సీ. దండకాటవిలోన నెండలో నొంటిగాఁ । గాల్నడఁ దిరిగితిఁ గష్టపడితి
యసురమాయ యెఱుంగ కదిపైడిలేడిఁగా । దలచిఁ యేగితి దవ్వు దవ్వులకును ౪౨౬

బర్ణశాలను సీతఁ బాసి లక్ష్మణుఁడు రా । నంతలో రావణుం డవనిసుతను
యతిరూపమున వచ్చి హరియింప నేవచ్చి । జానకి గనులకుఁ గానరాక

తే. వెఱ్ఱిబట్టిన మానిసి వితముఁ బూని । యేడ్చి యేడ్చి వనంబుల నెల్లఁ దిరిగి
కార్యవశమున సుగ్రీవుఁ గపికులేంద్రు । చెలిమి గావించికొని నీతిఁ దొలఁగఁజేసి
వాలి నేసితి నెఱుఁగవే వనజగర్భ! ౪౨౭

సీ. తరువాత గోతులదండుతో లంకకు । జని యనిసేయ లక్ష్మణుఁడు నేను
బలమేది పటునాగపాశబద్ధులమైతి । మంతట వానరు లచ్చెరువడఁ
దార్క్ష్యుఁడు వచ్చి బంధము వదల్చిననాఁడు । నాచింత యింతయనంగ వశమె
రాజ్యంబు పోయె నరణ్యంబె యిల్లాయెఁ । దండ్రి బిద్దెను భార్య దప్పిచనియెఁ
బ్రబలయుద్ధంబు బ్రాపించె భౌజగాస్త్ర । పాశబద్ధులమైతిమి పరమదుఃఖ
మింతకంటెను గలదె యం చివ్విధమున । నెంతగుందితి బ్రహ్మ నీ వెరుగవొక్కొ. ౪౨౮

సీ. రాజ్యంబు పోయి యరణ్యంబు పాలయి । మునివృత్తి నుంటయే మొదటి చింత
యడవి కాపురము సేయంగ నే నేగుచో । గర్వైన నాతండ్రి యివ్వఁడాయె
గాల్నడ బాసట గానక యర్థంబు । లేక గానలకు వెళ్ళి పడరాని
పాట్లకు లోనైతిఁ బ్రభుధర్మములుమాని । వ్యాధునివలె నుంటి వనమునందు
తుదకు దైవంబు మంచిదై మదవదసుర । విసరములఁ ద్రుంచి జయమంది విబుధులార
సరగ సాకేతపురరాజ్యశాలినైతి । నెఱుఁగరే మీరు తొంటి నా యిడుమలెల్ల. ౪౨౯

గీ. మరల నవనిజగూడి సామ్రాజ్యగరిమఁ । గొంతకాలంబు గడిపి య య్యింతి లోక
నింద మ్రోయఁగలేక యన్పితి నరణ్య । భూములకుఁ జింత మునిఁగితి లేమబాసి. ౪౩౦

గీ. తుదకు జానకి భూమిలోఁ దూరె చనియె । నిట్లు రామావతారమం దింత చింత
గలిగె స్వాతంత్ర్య మెక్కడ గలదు నాకు।నెపుడు బరతంత్రులము నీవు నేను శివుఁడు. ౪౩౧

## —: వి ష్ణ్వా ది కృ త దే వీ స్తు తి :—

వ. అనిచెప్పి వాసుదేవుండు ఓయి వనజగర్భా యోగమాయామోహితంబైన యీ జగంబున నెవ్వఁడు తత్వం బెఱుగనోపు జగత్కారణంబు స్మరణంబులో నుంచక మనమందరము నేను విష్ణుండ నే నీశ్వరుండ నేను బ్రహ్మ ననుచు విజృంభించిన మోహంబుపాలైతిమి. సనాతనంబగు పరవస్తు విట్టిదని మన మెరుగుదుమే? మా యికువశంబుననున్న దారు పాంచాలికంబోలె పరతంత్రుండనై వర్తించు కల్పాదియందు నీవును నేను నెఱింగినది కదా! మణిద్వీపంబున మందారవృక్షంబుల దాపున శ్రీసమాజంబునం జెలువొందు దేవి గదా సర్వేశ్వరి! యాభగవతి సర్వకామదాయినిగాన నామెను స్మరింపక గార్యసాధనంబు

వేఱొండువిధంబున లేదని తెలియుండు నావుఁడు విని సకలసురలును దేవిని స్తుతియింపఁ
పాశాంకుశవరాభయధారిణియై దర్శనం బిచ్చిన సంతసించి. ౪౩౧

క. నూ లూర్ణనాభి పెనిచిన । పీలున మిణుగురును జిచ్చు బెనచినరీతిన్
నీ లీలాశక్తికృతం । బౌ లోకమునందు నుదయమందితిమమ్మా. ౪౩౨

క. జ్ఞానమున భవము విడువ న । జ్ఞానంబున భవముగల్గు నఖిలాధార
జ్ఞానమయి వీవు నిన్నున్ । ధ్యానించెదమమ్మ తల్లి దైవమతల్లి. ౪౩౩

క. ఎఱిగెదము మహాలక్ష్మిని యరసి మహాశక్తి నిన్ను ధ్యానించెద మో
పరదేవి మమ్ముఁ బ్రోవుము । కరుణామయివగుచు సకలకర్త్రి భగవతీ ౪౩౪

శా. తల్లీ యీ భువనార్తిఁ దీర్పఁగలమా ధాత్రాదులు న్నేను నీ
సల్లీలామహిమంబుపేర్మిమయి విశ్వంబెల్ల బ్రోవంబడున్
కల్లల్గావు సురారివర్గములచే గాసింబడెన్ భూమి నీ
వుల్లాసంబు నొసంగుమమ్మ తరమా యూహింప నీచోద్యముల్. ౪౩౫

క. కుజుఁడును గంసుఁడు యవనేం । ద్రజుఁడును బార్హద్రథుండు దర్పితసాల్వా
ఖ్య జరాసంధ బకాదులు । కుజనులు నృపులైరి వారిఁ గొట్టుము తల్లీ. ౪౩౬

క. నీ దయగల్గిన మేమే । యా దనుజులనెల్లఁ ద్రుంప నాతంకము లే
దో దేవీ శక్తి యొకటి సాదవగానుంట మాకుఁ జాలు భగవతీ. ౪౩౭

వ. అంత నింద్రుం డిట్లనియె. ౪౩౮

శా. ఆ వాణీసతితోడులేక ద్రుహిణుం డాఢ్యుండె సృష్టింపఁగన్
శ్రీవక్షంబునఁ దాల్పకున్న హరి రక్షింపన్ సమర్థుండె గౌ
రీవామాసహవాసిగాక గరళగ్రీవుండు సంహార వి
ద్యావైదుష్యము నేర్చునే భవదుదారానుగ్రహం బెల్లెడన్. ౪౩౯

వ. అంత విష్ణుండు. ౪౪౦

గీ. కర్త ద్రుహిణుండుగాడు నే గాను శూల । ధరుఁడుగాడు సమస్తంబు దావకీయ
శక్తిమహిమంబెసుమ్మ నిజమ్ము తల్లి । నీ కళాంశంబువలన జనించినాము. ౪౪౧

వ. అని పలువిధంబులం బ్రార్థింప విని దయారూపిణియగు మహాదేవి ప్రసన్నవదనయై
యిట్లనియె. ౪౪౨

క. మీ కార్యమేమి తెలుపుఁడు । సాకల్యముగాఁగ మీకు సౌఖ్యమూలెల్లం
జేకూర్తు వెరవకుం డిఁక । నాకు నసాధ్యంబుగలదె నమ్ముఁడు మీరగ్, ౪౪౩

వ. అనిన విని దేవతలు, ౪౪౪

సీ. వినుము మాయమ్మ మా విన్నపం బీధరా । కాంత దుష్టప్రజాక్రాంతయగుచుఁ
దల్లడిల్లుచుఁ బరితప్తయై స్వర్గంబు । నకు వచ్చి వేడిన సకల సురలు
బ్రహ్మకడకు బోయి ప్రార్థించి యతడును । మేమును విసువక నసురవైరి
పాలికిఁ జని నిన్ను బ్రార్థింప విష్ణుని । గొనివచ్చితిమి తల్లి కనుము మమ్ము
భూమిభారంబుఁ బెడబాపి భూతతతుల । సౌఖ్య మొందించి మమ్మేలఁ జాలు దీవు
నిన్ను సేవింపఁ గంటిమి నేడు మేము । ధన్యులముగామె జగములతల్లి దేవి. ౪౪౫

వ. అమ్మా తొల్లి నీవు మహామదుండగు మహిషాసురు మర్దించితివి. దంభప్రాగల్భ్యవిజృంభుండైన శుంభుం బరిమార్చితివి. దుష్క్రియారంభుండైన నిశుంభు న్వధియించితి వవిరత దుర్వ్యాజుండయిన రక్తబీజుం ద్రుంచితివి. అతిప్రచండుండైన చండుం జెండాడితివి. అన్యాయదండుండైన ముండుం గండడంచితివి. నిరంతర నీతిరహితాలోచనుండైన ధూమ్రలోచను బీచమడంచితివి. పుణ్యకార్యవిముఖుండైన దుర్ముఖుం దునుమాడితివి. కృతకవినోదస్పృహయాళుండైన కరాళుం గాలమట్టితి వింక బహురాక్షసుల శిక్షించి యుంటి వవ్విధంబునఁ గ్రూరకర్ములైన రాజన్యుల వధించి భూభారంబు వారింపవే యనిన నొక్కింత నవ్వి యదంభ నవాంభోధరగంభీరవాగ్గుంభంబు గదుర దేవి యిట్లనియె. ౪౪౬

క. మతి నెరుగుదు మది చింతిం । చితి మున్ను సురాంశములను జేకొని భారా
వతరణమునకై మీరలు । క్షితిఁ బుట్టఁగవలయు నదియ చేయుదు సుమ్మీ. ౪౪౭

క. నాశక్తి మీకుఁ దోడగు । నాశకకృత్యపరులైన యవనీశులకున్
నాశంబు గలుగఁజేసెడి । కౌశలి మీ కిచ్చుదానఁ గనుఁగొనుఁ డింకన్. ౪౪౮

క. యాదవకులమునఁ గశ్యపుఁ । డాదిత్యులతల్లిఁగూడి యానకదుందు
భ్యాది పదవాచ్యుఁడై పు । ణ్యోదయుఁడై పుట్టుఁగాక యుర్వీస్థలిపై. ౪౪౯

క. భృగుశాపమున న్విష్ణుఁడు । దగ వారికి నుద్భవించు దామోదరుఁడై
యొగి నేను యశోదకుఁ బుట్టఁగలను మాయామహావిడంబన మెనయన్. ౪౫౦

క. కారాగారగతున్ హరి । నేరుపునం గొల్లపల్లె నేఁ జేర్చెద నిం
కా రోహిణి కహిరాజు కు । మారుండై పుట్టి బలసమాఖ్యఁ దలిర్పన్. ౪౫౧

గీ. ఇంద్రునంశంబునం బుట్టు నిల నరుండు । ధర్మునంశంబునం బుట్టు ధర్మరాజు
ననిలునంశంబునన్ భీముఁ డవతరించు । నశ్వినులయంశమునఁ గవ లవతరింత్రు. ౪౫౨

గీ. వసువునంశంబున న్భీష్ముఁ డెసఁగు నమ్మఁ । డింక భూభార మడఁగింతు నెల్లగతుల
ధరకు భయమేమి పొందిక దరముమాని । మీకు నేఁ దోడునీడనై మేలొనర్తు. ౪౫౩

వ. మరియుఁ గురుక్షేత్రంబున క్షత్రియవధయగు. నసూయయు, నీర్ష్యయు, ధృష్ణయు' గర్వంబును, కామంబును, మోహంబును నను దోషంబులు గలిగి బ్రాహ్మణశాపంబున

యాదవులు పరస్పరవిరోధంబులు గల్పించుకొని వినాశంబు నొందుదురు. భగవంతుఁడును బరమపురుషుండైన విష్ణుండు శాపంబువలనఁ గళేబరంబు విడనాఁడు. నేఁది యెట్టులేని ధరాభారంబు వాపెద నని దేవి సెలవిచ్చిన విని సంతుష్టాంతరంగులై యెల్లదేవతలు స్వస్వనిలయంబుల కరిగి రంత. ౪౫౪

## —: దేవీమహాత్మ్యాది వర్ణనము :—

సీ. భారత వినుమయ్య భారావతరణంబు యోగమాయ యొనర్చు నోజ నీకుఁ
దెలిపెద యాదవకులమున విష్ణుండు భృగుశాపమునఁ బుట్టి పెరిగె మాయ
వలనఁగాదె సర్వవర్తనంబుల బ్రహ్మకైనను విష్ణునకైన జగతి
మూఁడు గుణంబుల ముంచెత్తి ముగ్గురు మూర్తుల నాడించు ముదుకశక్తి
గీ. గర్భవాసవిషాదంబుఁ గలుగఁజేసి । విష్ణు నానావతారసంవిష్టుఁ జేసె
దేవతలు దాశరథి నాఁడు తివిరి కోతు । లైరి యింకేమిచెప్ప లోకాంబమహిమ. ౪౫౫

మత్తకోకిల. కోరి యోగులు ముక్తసంగులు కొల్తు రా జగదీశ్వరిం
జేరి భక్తివిశేషలేశ విశేషలేశ లవంబుచే
భూరిసంస్కృతి ముక్తి వారిని బొందుఁగా కిఁక నన్యులె
వ్వారు గాంతురు దేవిసత్కృప వచ్చిన న్సుఖమయ్యెడిన్. ౪౫౬

తరల. వెలయు రూపులురెండు విద్య యవిద్య యంచును దేవికిన్
దెలిసి విద్యను గొల్చెనేనియు ధీరుఁడై భవముక్తుఁడౌ
తలఁచి మూఢు డవిద్యఁ గొల్చినఁ దప్ప వీభవదుఃఖముల్
పలుమరుం గనుచుండు భూతలపాలనైకధురంధరా. ౪౫౭

సీ. బ్రహ్మయు విష్ణుండు పరమేశ్వరుండును । జగదీశ్వరికి వశానుగులుసుమ్ము
దామయంత్రితములై తనరారు సర్వావ । తారముల్ కొన్నాళ్లు దనుజవైరి
యమృతసాగరమున విమల వైకుంఠప । త్తనమున సౌఖ్యంబు దవిలియుండు
కొన్నాళ్ళు దానవకోటితో యుద్ధముల్ । సలుపుచు వైరంబు దెలుపుచుండు
యోగనిద్రనొంది యుండును గొన్నాళ్ళు । జన్మములను జేయుఁ గొన్నినాళ్ళు
దానవారి దా స్వతంత్రుండుగాడుసూ । బ్రహ్మగాడు శూలపాణిగాడు. ౪౫౮

క. రవి శశి సుర సనకాదులు । వివరింపంగా స్వతంత్ర వృత్తులుగా రా
భువనేశ్వరీవశానుగు । లవితథముగ బొమ్మలట్టు లాడుదురుసుమీ. ౪౫౯

సీ. హర్షశోకాదు లయ్యమరులకును గల । వపుడు నిర్జరులను టాఖ్యకొఱకె
యుత్పత్తియును స్థితియును నాశనము గల్గు । నపుడు నిర్జరు లెట్టులైరి చెపుమ
యమరాఖ్యయును వారి కంతియకాక తదర్థంబువారల యందు గలదె

జలజంతువులకును స్థలజంతువులకును । గీటకంబులకును గ్రిముల కెట్టు
లట్టులేకాక యమరుల కధికమేమి । కలదు సుఖదుఃఖములఁ జెప్పవలయుచోటి
నాయువుల వర్షభేదంబు లధికసేచ । గతులఁ బొనరుట నైచ్యాధికతలు గలిగె. ౪౬౦

వ. మరియు వినుము నరేంద్రా బ్రహ్మ రుద్ర విష్ణ్వాదులకును గ్రమక్రమంబున నాశంబు గలుగుచుండుఁ గ్రిందాకు మీఁదాకు వాసిగాని వేఱొండు లేదు. దేహికి నాశంబును మృతునకుం బునరుత్పత్తి సిద్ధంబులు. మోహజాలవృతంబైన జంతువు భవదుఃఖములనుండి తప్పించుకొననేరదు. మాయ యెంతకాలంబు విద్యమానయగు నంతకాలంబు మోహజాలంబు బట్టికొనియుండు బ్రహ్మాదులకైనను సృష్టికాలంబున నుత్పత్తియుఁ గల్పాంతంబున నాశంబును సంభవించుచునే యుండు. ఏది యేజంతువునకు వినాశహేతువయి యేర్పడియుండు నది యట్లే సంభవించుచుండుంగాని యన్యథా ప్రవర్తింపనేరదు ఎప్పు డెయ్యది సంభవింపవలయు నప్పు డయ్యది సంభవింపక మానదు. భాస్కరుని కొడుకు మందుఁడు, చంద్రుఁడు క్షయరోగ పీడితుండు చూడు మిదియుంగాక. ౪౬౧

గీ. వేదములనెల్లఁ జదివిన వేదవేత్త । చెలఁగి జగముల సృజియించు సృష్టికర్త
భూరివిజ్ఞానవంతుఁడౌ బుద్ధిశాలి । బ్రహ్మ తనబిడ్డ వాగ్దేవిఁ బట్టెగాదె. ౪౬౨

గీ. దక్షుకూతురు రుద్రాణి తండ్రియింట । దగ్ధురాలైనయపుడు శీతాంశుమౌళి
యెంతపరితాపమొందెనో యేరికైనఁ । దరమె వచియింప భూలోకభరణచరిత. ౪౬౩

క. వలపోపలేక మేన । న్వలువం దిగనాడి వెఱ్ఱివాఁడై రుద్రుం
డలనాడు యమునఁ జొచ్చిన । నలుపెక్కెనుగాదె జీవనమ్ము మహీశా. ౪౬౪

క. సోమధరుఁడు భృగువనమునఁ । గామార్తుండగుచు గ్రీడ గావింప భృగుం
డామీఁద శాపమిచ్చిన । భూమంబగు లింగ మూడి భూమింబడదే. ౪౬౫

క. ఎద్దాయె దేవనాథుఁడు । గ్రద్దనఁ దాఁ బైడిలేడిగా నెంచి కుధీ
మద్దనుజుఁడనుచు నెఱుఁగక । యద్దానిని వెంటనంటి యఱుఁగడె హరియున్. ౪౬౬

క. రాముఁడు సీతంబాసిన । బాములు చెప్పంగఁదరమె బహుభంగులఁ దా
నా మెలఁత దలఁచి తలఁచి మ । హామోహమునొంది యాపదబ్ధిన్ మునిఁగెన్. ౪౬౭

క. కోతులను దండుగూర్చెం । గాతరుఁడై కొన్నినాళ్ళు కాంతావిరహా
త్యాతతచింతామగ్నుం । డై తనరెన్ జూడుమయ్య యవనీనాథా. ౪౬౮

క. సీతరమా నాతరమా । యాతత మహిమాభిరామ యగునట్టి జగ
న్మాత మహామాయావి । ఖ్యాతివిశేషానుభూతి గణించుటకున్. ౪౬౯

వ. అని చెప్పి వ్యాసుండు పరమోల్లాసుండై శ్రీకృష్ణ జననక్రమంబుఁ జెప్పెద వినుమని తొల్లి, కాళిందీతీరంబున మధువనంబను వనంబు గల దది మధుపుత్త్రుండైన లవణుచే బాలింపఁ

బడుచుండ లక్ష్మణానుజుండగు శత్రుఘ్నుండు. వానిం బరిమార్చి యచ్చట మధురా నామపురంబు నిర్మించి పుష్కర పుష్కరాక్షులను నిద్దఱు తనయులకు నా పురం బొప్పించి కాలధర్మంబు నొందె, నంతం గొన్నినాళ్ళకు సూర్యవంశక్షయంబైన నప్పటభేదనంబు యాదవులకుం జిక్కె. నంతం గొన్నాళ్ళకు, యయాతికులసంభవుండగు శూరసేనుండు మధురం బాలించె. నతనికి. ౪౨౦

మ. జనియించెన్ భువి శూరసేనునకు నంచత్కాశ్యపాంశంబునన్
వినుతప్రాభవుఁ డాశ్రితావనకళావిన్యస్తజీవుండు స
జ్జనపూజావిహితానుభావుఁడు సదా శాంతిప్రయుక్తోత్తమ
ప్రణవుం డావసుదేవుఁ డుద్ధత రిపుప్రాణక్షయోద్రావుఁడై. ౪౨౧

వ. మఱియు నడితి దేవకుఁ డనువానికి దేవకియై వరుణశాపంబున నుదయించె. నుగ్రసేనునకు గంసుండు పుట్టె దేవకుండు తనకూతు దేవకిని వసుదేవునకిచ్చి వివాహము సేసె. న వ్వివాహసమయంబున. ౪౨౨

ఆ. వె. కంస కంస నీదు గతి వెన్కఁ జూడుము । దేవకికినిఁబుట్టు దివ్యమూర్తి
నిన్నుఁ జంపఁగలఁడు నిలచి యష్టమగర్భ । జాతుఁడగు నతండు సత్య మిదియ. ౪౨౩

క. అని గగనవాణి పల్కిన । విని కంసుఁడు మనమునందు విస్మయమొదవన్
దన యనుజ నపుడ సంపెద । ననుచుం జింతించి పిదప నాలోచించెన్ ౪౨౪

గీ. ఈపె సన్మానయోగ్య నా కెన్నిచూడ । స్త్రీవధయుఁగూడ దే నేమి సేయువాడ
పాపములకెల్ల గలదండ్రు పాచితంబు । గాన స్వార్థప్రయోగంబు గరము మేలు. ౪౨౫

వ. అని. ౪౨౬

గీ. కత్తి చేబూని కదసి యా కంసుఁ డపుడు । దేవకీకేశబంధంబుఁ దివిచి లాగి
యేయ సమకట్టె నంత నా నృపతి జూచి । కన్నులను నీరుగార్చుచుఁ గరుణ మెనయ ౪౨౭

గీ కటకటాయని కొందఱు పటుభయంక । రాకృతులురాజు లాదుష్టు హస్తమట్టె
పట్టి విడిపించి రవ్వేళఁ బ్రబలకదన మాయె నేమందు నచ్చట నవనినాథ. ౪౨౮

ఆ. వె. విడువు విడువుమనుచు వీరులుకొందరు । నిలువు నిలువు మనుచు నెమ్మి నురికి
పట్టు పట్టుఁ డితని పాపిష్టు డసిబూని । కొట్టు కొట్టుడనుచుఁ గూతలిడిరి. ౪౨౯

వ. ఇట్లు వసుదేవపక్షవర్తులగు రాజన్యులకును గంసానుచరులకును ఘోరంబైన సంగ్రామంబు దలఁపడి యొండొరు బంతంబులంబట్టి విడువక పోరుచున్నతరి వృద్ధులగు యదుసత్తములు గంసు వారింపఁదలఁచి. ౪౩౦

సీ. ఇస్సిరో స్త్రీహత్య యిది నీకు జెల్లునా । దారుణపాపౌఘ కారణంబు
కీర్తినాశిని దీనికెలనఁ బోకుము కంస । సుదతిజంపినవాని జూడరాదు

ఎచ్చటనో డాగి యెవ్వడో పరిపంథి । పలికె నిట్లని యేలతలపరాదు
వీరుండవై యుండి బీరంబుచెడి గాలి । కూతలు విని మదిఁ గుందనేల
పెండ్లికూతురు మీయింటి పెద్దయాఁడు । బడుచు దీని వధించుట పాడియగునె
కాఁదగినకార్య మేరీతి కాకతప్పు । శాంతగుణవంత మాను మావంత వంత. ౪౮౧

క. అన విని శాంతిల్లిన కం । సునిఁ గని వసుదేవుఁడనియె సూనృతమిది యీ
వనితకుఁబుట్టిన తనయుల । ననఘమతీ నీకు నపుడ యర్పింతు దగన్. ౪౮౨

క. జనియించినవారల నీ । కును నే నొప్పించనేని కుంభీపాకం
బను నరకము పొలగుదుం । గనుమీ నా సత్యవర్తనము మనుజేంద్రా. ౪౮౩

క. అని యిట్లు సగముజెప్పిన విని పౌరవు లింతెచాలు విడుమిఁక క్రోధం
బని వేగిరించి పంపిరి । చనియెం గంసుండు తనదు సదనంబునకున్. ౪౮౪

## —• కంస కృత దేవకీ సప్తసుత వధ •—

ఉ. అంతట గొంతకాలమున కా వసుదేవుని భార్యయైన సీ
మంతిని చూలు్రమోచి ప్రథమంబునఁ గాంచెను బిడ్డ నొక్కనిం
గాంత విలాసు నచ్చెరుతఁ గాంచి నిజాంగనతోడ నాతఁ డా
వంతయుఁ జింతలేక తన యాడిక తథ్యముసేయ నిట్లనెన్. ౪౮౫

క. హంసమనోహరగమనా । కంసున కీబిడ్డ నివ్వఁగాదగుఁజుమ్మీ
ధ్వంసకుఁడు వాఁడు శిశువున్ । హింసించునొయనుచు వగవనేటికి మనకున్. ౪౮౬

గీ ఆబు సూతైననేని? సూ ఱాబునైన । నేని? పూనినశపథంబు మానరాదు
కాలపాశానువర్తియై కర్మఫలము । లనుభవించుకతీరునా మనుజునకును. ౪౮౭

క. శుభమేని యశుభమేనిం । ప్రభువేనియు నీచుఁడేనిఁ బ్రారబ్ధఫలా
నుభవ మదియేల తప్పున్ । నభయతఁన దప్పించుకొనఁగఁ జాలుదుమె చెలీ. ౪౮౮

ఉ. నావుఁడు దేవకీరమణి నాథునితో నను గర్మబద్ధుఁడై
జీవుఁడు తత్ఫలానుభవ సిద్ధికిఁ దప్పిచనంగ నేరఁ డే
దేవునిఁ గొల్చియు న్సకలతీర్థములేగి తపంబు చేసియున్
భావిత ధర్మశాస్త్రముల బాచితము ల్కానవచ్చుచుండఁగన్. ౪౮౯

క. కలుద్రావుట గురుభార్యం । గలయుట భూదేవహింస గావించుట వా
రలసొమ్ము ముచ్చిలుట యీ । యలతులతోఁ జెలిమియును మహాపాతకముల్. ౪౯౦

సీ. ఉర్వి మహాపాప మొనరించెనేనియు । జీర్ణవ్రతంబును సేయవలయుఁ
బదియురెండేడులు పాటించెనేని పా । పము నశించునటంచుఁ బలుకు స్మృతులు

పరగ మన్వాదులు పలికిన తీరున । ప్రాచితంబులుసేసి పాపములను
దొలఁగింపనేర్తుమో తొలఁగింపనేరమో । తెలుపుమయ్య మహాత్మ ధీరులైన
యాజ్ఞవల్క్యాదిమునులు మిథ్యలు నుడివిరె । సుశ్రుతముతప్పె చరకంబు శూన్యమే మ
హామఖంబులు రిత్తలే యవని గాఁద । లంచినది కాకపోదని యెంచితేని. ౪౯౧

ఆ. మనువు యాజ్ఞ్యవల్క్యుఁడును బరాశరుఁడును । దప్పులాడిరనుచు దలచితేని
ధర్మశాస్త్రములను దప్పి చరించిన । పాతకులముగామె ప్రాణనాధ. ౪౯౨

గీ. సిద్ధి ప్రత్యక్షమైయుండెఁ జెలఁగి మాన । వోద్యమంబున జగమిది యుత్తచిత్త
కల్పితముగాని వేరొండుగాదుసుమ్ము । బిడ్డ బ్రతికిన జాలఁదే మిధ్యకేమి. ౪౯౩

క. అనవుఁడు నవ్వసుదేవుఁడు । విని రమణీ కర్మయది త్రివిధ మగు ననుచున్
మును మునులు పురాణాదిక । మున దెలిపిరి నిత్యధన్య మూర్తులు వారల్. ౪౯౪

క. సంచిత జీర్ణ ప్రార । బ్ధాంచితసంజ్ఞలఁ బొసంగు నవి మూడును నిఁ
ర్వంచితము వర్తమానము । మించు ననిరి త్రివిధమగుచు మేచకవేణీ. ౪౯౫

వ. అవి మూడును శుభాశుభంబులకుఁ బీజభూతంబులై యుండు. జీవుం డనేకజన్మంబుల నుండి యార్జించిన కర్మంబు సర్వథా కాలక్రమంబున వెంటవచ్చుచుండు. కర్మవశంబునం బూర్వదేహంబు పరిత్యజించి శుభాశుభభేదంబులంబట్టి దివ్యదేహంబుతో స్వర్గంబునకేని యాతనాదేహంబుతో నరకంబునకేనిఁ బోవుచుండు. మఱియు జీవుండు లింగదేహంబుతోఁగలసి కాలంబుతో ననగి పెనగి సంచితకర్మసహవాసంబున దేహంబు గల్పించుకొని శుభాశుభంబు లనుభవించుచుండు. అపుడు ప్రారబ్ధసంజ్ఞికంబగు తత్కర్మంబున కేర్పడిన ఫల మవశ్యభోక్తవ్యంబై యుండుగాని యది భుజింపక తప్పించుకొనుటకు బ్రహ్మకైన దరంబుగాదు. ప్రాయశ్చిత్తాదులచేఁ బ్రారబ్ధంబు నశింపనేరదు. ప్రారబ్ధము భోగమువలన క్షయంబందు. మరియుఁ జెప్పెద వినుము. ౪౯౬

సీ. సారంబులేని సంసారం బనిత్యంబు । సత్యధర్మ మొకండు శాశ్వతంబు
జననంబు మరణంబు సర్వదేహులకు దై । వాధీనములు దుఃఖమందనేల
ఫలమేమి ధర్మమే పాటింపఁదగుఁగాక । బొంకాడి యం దేమి పొందఁగలము
సత్యంబుదప్పిన జనునిజీవితము వృ । థాభూతమేకదా దానివలనఁ
నపయశంబును బరలోకహాని కలుగుఁ । గానఁ గంసున కిప్పు డీ కందు నిచ్చి
సత్యమును నిల్పితివయేని సర్వశక్తి । దేవి భగవతి జగదంబ ప్రోవకున్నె! ౪౯౭

మ. అనినన్ దేవకి కన్నులం బొటబొటం జత్యుష్ణబాష్పంబులున్
జనియింపంగను వెక్కి వెక్కి విడఁజాలక్ మగ్గుఁడౌ పాలపా
పని నంచుం దడబాటుగా గౌఁగిగి కంపంబంది హా దైవమా
యనుచుం బెన్మిటిచేతులం దిడియె సత్యాధీనచేతస్కయై ! ౪౯౮

ఉ. బిడ్డను చేతులం దిడుక ప్రేముడి నవ్వసుదేవుఁ డేడ్చుచున్
గడ్డముక్రింద చేయిడి ముఖంబును జూచి యయో యిదేమి నే
నెడ్డతనంబునం దొలుత నేరికి గోడొనరించినాడనో
యడ్డమువచ్చె దానిఫల మంకిలియై సుఖసంపదాప్తికిన్. ౯౯

వ. అని యొక్కింత దడవు విచారించి సత్యవాక్యంబునందు చిత్తంబు హత్తించి శిశువుం గంసునింటికిం గొంపోవునెడ న్మార్గంబున. ౧౦౦

మ. వసుదేవుండదె జూడుఁడీ మనసుచేవం గంసభూభర్తకున్
నిసువున్వ్వెచ్చనొసంగ నేగెడిని మాని ప్రాణి సత్యంబునే
పసగాఁజూచునుగాని చూడఁడుసుమీ ప్రాణంబు నారీతి దు
ర్వ్యస్యనాసక్తుఁడు కంసుఁ డీ శిశువుఁ జంపంజూడఁడే యక్కటా. ౧౦౧

గీ. జన్మమన వసుదేవుని జన్మమే సు। జన్మమనవచ్చు నది నేఁడు సఫలమయ్యె
నిజముదప్పక తనముద్దు నిసువు దెచ్చి। హింసకని యిడబోయెడి కంసు నెదుట. ౧౦౨

వ. ఇట్లు బలుకుట వినుచు వసుదేవుండు. ౧౦౩

క. చని కంసునియెదుటం దన। తనయుని నిడ నతఁడు సూచి ధర్మిష్ఠుఁడ వీ
వనఘా యీ బాలుడు నా। కును శత్రుఁడుగాఁడు వీనిఁ గొట్టఁగనేలా. ౧౦౪

క. ఎనిమిదవ గర్భమందుఁ। జనియించిన సుతుఁడు నాకు శత్రుండుసుమీ
పనిగొని వానిం జంపెద। ననుమానములేదు పోవుమా యింటి కిఁకన్. ౧౦౫

చ. అన విని శూరసేనసుతుఁ డర్మిలిఁ జంకలుకొట్టుకొంచు నే
గెను శిశుకంబుతోఁడ దన గేమున కయ్యెడ మంత్రివర్గముం
గనుగొని కంటిరే శిశువిఘాతమె కాని ప్రయోజనంబు లే
దెనయఁగ నష్టమార్భకుని నేసెద నంచును గంసుఁ డాడినన్. ౧౦౬

క. ప్రాల్మాలక విని మంత్రులు। మేల్మేలు భళీభళి సమిద్ధచరిత నీ
వ్రేల్మడఁచువాఁడు గలఁడే। కల్మష మేమున్నదిందుఁ గంసనృపాంసా. ౧౦౭

వ. ఇట్లు పలికి కంసుని మంత్రులు స్వస్వనివాసంబులకుం జని రంత స్వర్గంబునుండి కలహాశనుండు కడుపు దడవికొనుచు వడివడి జనుదెంచినం గని కంసుం డర్ఘ్యపాద్యాదులం బూజించి సుఖాసనంబునం గూర్చుండ నియోగించిన నుపవిష్టుండై యున్నతరిఁ గంసుండు. ౧౦౮

క. మీరు మహాత్ముల రూరక। రారుగదా మమ్ముబోటి రాజులకడకుం
గారణముఁ దెల్పుఁ డనగా। నారదుఁ డిట్లనుచుఁ బలికె నయవచనములన్. ౧౦౯

గీ. కంస కంసనృహంస మహాంసశత్రు । మాంసవిచ్ఛేదనైక మీమాంస నేను
హేమగిరికిని మొన్ననే యేగినాఁడ । వింటె యచ్చటి వార్తలు వింతలయ్యె. ౩౧౦

సీ. అచ్చట బ్రహ్మాదు లందరు గుడగుడాలోచనంబులు సేయఁ జూచినాను
దేవకియఁట వసుదేవునకును భార్యయఁట విష్ణుఁడట యామె యందుబుట్టు
నఁట వాఁడు నిన్నుఁట గుటగుట మన్నించునఁట సరేకాని నీ వజ్ఞుఁడవొకొ
మొన్న బుట్టినవాని మొత్తక నిలుపుట కేమికారణమో వచింపుమనిన ౩౧౧

గీ. నష్టమంబైన గర్భంబు నందుఁబుట్టు । బాలుఁడే శత్రుఁడవి మున్ను పలికె గగన
వాణి ప్రథముని గడతేర్ప ఫలముగలదె । యనిన విని కంసుతోఁ గలహాశనుండు. ౩౧౨

ఆ. ఇంత వెఱ్ఱియేల యెఱుఁగవుగద కంస । రాజ నీతిగనని రాజు రాజె
రాళ్ళబరువు గను తరాజైన మేలుసూ । దేవగణము మాయ దెలియవైతి. ౩౧౩

క. నీవంటి మూర్ఖ మును నే । నీవిశ్వములోనఁ జూచి యెరుఁగను పరిధి
వ్యావృత్తి నెవ్వఁడష్టముఁ । డో వివరింపు మిఁక । నెట్టియూహ జనించెన్. ౩౧౪

క. అని కలహాశనుఁ డేగిన । విని బాలకుఁ బట్టితెచ్చి వేసెను శిలపై
మనసు కృపారహితంబై । కనుపట్టె న్వానికది సుఖంబుగ భూపా. ౩౧౫

వ. అనిన విని జనమేజయుండు పారాశర్యునిం జూచి సవినయుండయి యిట్లనియె. ౩౧౬

ఆ. బాలుఁడేమి చేసెఁ బాపంబు తన పిన్న । తనమునాడెఁ బిడ్డె ధర్మవేత్త
జ్ఞానవంతుఁడైన యా నారదుం డింత । పాపమునకు నేల పాలుపడియె. ౩౧౭

క. పాపము చేసినవాఁడును । పాపముఁ జేయించువాఁడుఁ బాయక నొకటే
పాపము నొందుదు రనుచును । తాపసులు వచింత్రు ధర్మతంత్రములందున్. ౩౧౮

క. ఆసంయమి యేలా యీ । దోసము నొడిగట్టె నింత ద్రోహము గలదే
యీసంశయంబుఁ దీర్పవె । వ్యాసా సకలార్థబోధనైకవిలాసా. ౩౧౯

వ. అనినవిని వ్యాసుండు. ౩౨౦

సీ. కలహంబు బొసగించి కడువేడ్క నీక్షించు । వేల్పు నారదుఁడని వింటిగాదె.
దేవతాకార్యంబు గావున తనస్వభా । వము పేర్మి వచ్చిన వాఁడుగాని
యతనికి లవమైన నన్నృతమాడుటయందు । గృతిలేదు కార్యంబు లెట్లుజరుగ
వలయు నట్టులఁ జేయువాడు ప్రాల్మాలక । యతఁడు శుద్ధుఁడు నింద్యుఁ డనగరాదు
శాపయోగంబు కలిమిని షట్శిశువులు । కాలధర్మంబునొందిరి కంసుచేత
వినుము వివరింతుఁ దచ్ఛాపవిధము నీకు । సాధుజనగణ్య తతపుణ్యజనవరేణ్య. ౩౨౧

సీ. మహితస్వాయంభువ మన్వంతరంబున । నల మరీచికిఁ బుత్త్రు లార్వు రధిక
బలు లూర్ణయందును బ్రభవించి యాత్మీయ । సుతను బట్టిన బ్రహ్మఁ జూచి నగిరి
యదిచూచి ధాత మీ రసురులుగం దనఁ గాలనేమికిని షడ్గర్భులగుచుఁ
బుట్టి రాదట నొక్క పుట్టువునందు హి । రణ్యకశిపుకుమారత వహించి
జ్ఞానసంయుక్తులై శాంతమానసులయి । తపము గావింప ధాత సంతసముబొంది
చెలఁగి షడ్గర్భులంజూచి శీతలాను । కంపదై వార నిట్లనె గజపురీశ. ౫౨

మ. మును నే దిట్టితి మిమ్ము క్రోధమున మీ మోహంబువాసెం దపో
ఘనపుణ్యంబున నిష్టమైన పరముం గాంక్షింపు డేనిత్తు నా
విని లోకేశసురాసురోరగనరప్రేతాళిగంధర్వసి
ద్ధనికాయంబులచేత మృత్యువు ప్రసక్తంబెప్డుఁ గారాదు నాన్॥ ౫౩

గీ. అట్టులనెయగుఁ బొందన నపుడు వారి । తండ్రి కాంచనకశిపుండు తన్ను విడిచి
వరములను దెచ్చికొనిరి వీ రరిగియనుచుఁ । గనలి శపియించె నిట్లని జనవరేణ్య ౫౪

గీ. తరలి షట్గర్భులార పాతాళమునకుఁ । బెక్కులేడులు నిద్రలోఁ జిక్కియుండి
పిదప దేవకికడుపున నుదయమంది । కాలనేమ్యవతారమౌ కంసుచేత
దోరుఁడనిపల్కె వారలె వీరలైరి॥ ౫౫

వ. అని మఱియు జనమేజయా యాషడ్గర్భులే దేవకి కుదయించి కంసుచే మడిసిరి. సప్తమ గర్భంబునందున్న శిశువుం బంచమమాసంబునన యోగమాయ రోహిణీ గర్భంబున నిడె నంతం గర్భంబు వోయెనని తెలిసి కంసుండు సంతసించె. శేషాంశంబున రోహిణియందు బలరాముఁడు జన్మించె భూభారహరణార్థంబు నారాయణుండు కృష్ణుండై పుట్టెననిన విని రాజు మునీంద్రా! వసుదేవుండు కశ్యపునంశంబునను, బలరాముండు శేషునంశంబునను, శ్రీకృష్ణుండు నారాయణాంశంబునను నవతరించిరని చెప్పితివి యింకం దక్కువా రెవ్వ రెవ్వరి యంశంబులో యెఱుంగం జెప్పవే యనిన రాజేంద్రా నీవడిగిన యర్థంబు సవిస్తరంబుగాఁ జెప్పెద వినుము కశ్యపుండు వసుదేవుండు, అదితి దేవకీ, అనంతుండు బలదేవుండు, ధర్మసుతుండైన నారాయణుండు శ్రీకృష్ణుండు , నతని యనుజుఁడైన నరుం డర్జునుండు, ధర్ముండు యుధిష్ఠిరుండు, వాయువు భీముండు, అశ్వినులు నకులసహదేవులు, సూర్యుండు కర్ణుండు, యముండు విదురుండు, బృహస్పతి ద్రోణుండు, శివుం డశ్వత్థామ, సముద్రుండు శంతనుండు, గంగ గంధర్వపతి దేవకుండు, వసువు భీష్ముండు, మరుద్గణంబు విరాటుండు, అరిష్టకొడుకైన హంసుండు ధృతరాష్ట్రుండు, మరుద్గణవిశేషంబులు కృపకృతవర్మలు, కలి దుర్యోధనుండు, ద్వాపరుండు శకుని, బుధుడు సువర్చుండు, చంద్రుండు ప్రరురువు, పావకుండు దృష్టద్యుమ్నుండు, నిబ్బృతి శిఖండి, సనత్కుమారుండు ప్రద్యుమ్నుండు, వరుణుండు ద్రుపదుండు, లక్ష్మి ద్రౌపది, విశ్వేదేవతలు ద్రౌపదీతనయులు, సిద్ధ కుంతి, ధృతి మాద్రి, మతి గాంధారి, అప్సరసలు కృష్ణాంగనలు

ఇంద్రప్రత్యర్థులగు రాక్షసులు రాజలోకంబులు, హిరణ్యకశిపుండు శిశుపాలుండు, విప్ర జిత్తి జరాసంధుండు, ప్రహ్లాదుండు శల్యుండు, కాలనేమి కంసుండు, హయగ్రీవుండు కేశి, బలిపుత్రుండగు నరిష్టుండు కకుద్మి, అనుహ్లాదుండు ధృష్టకేతుండు, బాష్కలుండు భగదత్తుండు, లంబప్రలంబులు ఖరధేనుకులు, వారాహకిశోరులు మల్లులగు చాణూరముష్టికులు, దితిపుత్రుండగు నరిష్టుండు కువలయనాగంబు, బలిపుత్రి బకి, దానితమ్ముఁడు బకుండునై పుట్టిరిట్లు సురాసురల యంశావతరణంబు లెఱుంగునది. అనిమరియు. ౨౨౬

క. వనజభవముఖసుధాంధులు । వనజాక్షునికడకు నేగి ప్రార్థించిన నా
ఘనుడిచ్చె నల్లనిది తె । ల్లనిదియుఁ గేశద్వయంబు లక్షణయుతమున్. ౨౨౭

క. నల్లదనము కృష్ణునకుం । దెల్లదనము రామునకును దేహములందున్
బ్రోల్లసదనూనరుచి రం । జిల్లుటకుం గారణంబు సెప్పితిని నృపా. ౨౨౮

వ. అని చెప్పి వ్యాసుండు మఱియు. ౨౨౯

గీ. ఆఱుగురు శిశువులఁబట్టి యౌగ్రసేని । హతులఁ గావించి సప్తమమైన గర్భ
మవిసెఁ బిమ్మట దేవకి కష్టమమగు । గర్భమొదవినఁ గంసుండు కడుభయమున. ౨౩౦

క. తనయంశంబున విష్ణుఁడు । ఘనమగు వసుదేవుభార్య కడుపున నిలచెన్
విను యోగమాయ గోకుల । మునను యశోదకడుపునను మునుకొని నిలచెన్. ౨౩౧

క. దేవకికడుపున శిశువును । వేవేగమ యోగమాయ విస్తృతలీలం
దా వెలికి దివిచి రోహిణి । లో విడిచిన నామెకుం బలుం డుదయించెన్. ౨౩౨

వ. అంతఁ గంసుండు. ౨౩౩

గీ. ఎన్మిదవగర్భ మొదవెగా యిపుడు దేవ । కికిని దీని నుపేక్షింప గిట్టదనుచు
దేవకీవసుదేవులఁ దెచ్చి కరుణ । మాలి కారాగృహంబునఁ గూలవైచె. ౨౩౪

గీ. గర్భగతుఁడైన శ్రీరమాకాంతు లోక । వర్ణనీయప్రభావంతు వార్ధిరాణ్ణి
శాంతు శాంతు ననంతు నక్రాంతుఁగూర్చి । స్తుతు లొనర్చిరి పలుమారు సురలు మునులు.

## —• శ్రీకృష్ణజననము •—

గీ. నెలలు నిండెను దేవకీలలన కడుపు । పాలవెల్లిని భక్తులపాలఁ గలుగు
చారుచింతామణియనంగ జననమందె । దండిబాలుండు తేజోమయుం డొకండు. ౨౩౬

సీ. మెఱుగుఁదీగెలతోడి మేఖంబులకుగ్రొత్త । మనికైన శ్రావణమాసమందు
లలిత మహేంద్రనీలచ్ఛాయ రాత్రుల । బరిఢవిల్లెడి కృష్ణపక్షమందు
దీపిత శ్రీకంఠి దేవతాకంబైన । కలితాష్టమీసమాఖ్య తిథియందు
బ్రహ్మదేవుడు తనప్రభువుగా వర్తిల్లు । చక్కని రోహిణిచుక్కయందు

గీ. జెలఁగి తన కూటమికి నిరీక్షించుచున్న । రాత్రి నలరింప రక్తుఁడై రాజు తూర్పు
సీమ వెల్వడివచ్చు నిశీథమందు । విష్ణుదేవుండు ప్రభవించె గృష్ణుఁడగుచు. ౫౩౭

సీ. కలకలనవ్వీరి చెలగి దేవతలెల్ల । మునులు చేతులుమోడ్చి మ్రొక్కు లిడిరి
గుసగుసలాడిరి గూడి రాక్షసులెల్ల । దుష్టరాజుల కొంటి తుమ్ము దగిలె
బుసబుస నాకసంబునకెక్కె జలరాశి । కాంతిమించెను దిశాకాంతలకును
గడగడ వడకె బ్రక్కలదూరెఁ గలిరాజు । శాకినిముఖపిశాచములు పరచె

గీ. దేవకీవసుదేవు లుద్దీప్తులైరి । కంసుఁడనువాఁడు కన్నీళ్ళుగార్చి యేడ్చె
చారుతరమైన కృష్ణావతారవేళ । గుంభినీనాథ మానితాకుంతబోధ ౫౩౮

ఉ. అంతకమున్న కంసుఁడు మహాబలశాలులఁ గాపువెట్టి య
త్యంతభయంబున న్నిదుర యక్షులకుం జొరనీకుఁడంచుఁ దా
నెంతయు జాగరూకుఁడయి యచ్చటిబంటుల కాజ్ఞయిచ్చి యు
న్నంత నిశీథవేళ ఘనమాయెను వారికి మాయనిద్దురల్. ౫౩౯

క. అప్పుడు విని రొకనుడి దివి । నిష్పాపనిఁ గొంచు నేగి యేగతినైనం
దెప్పున యశోదప్రక్కం । జొప్పింపుము తెమ్ము దాని సుత నిచ్చటికిన్. ౫౪౦

వ. అది విని దేవకి. ౫౪౧

గీ. ఇట్టి ముద్దులబాలు నే నెట్లువిడుతు । నయ్యయో కర్మ మిట్లాయె ననుచుఁ బొగిలి
చూచుకొని చూచుకొని బాలు సుగుణజాలు । భర్త చేతుల కందిచ్చె పరమసాధ్వి. ౫౪౨

గీ. ఇచ్చినంతనె దెసలకై యిట్టెచూడ । ద్వారములు వివృతంబులై యలర మెల్ల
మెల్ల బాదంబు లిడుచుఁ దా నుల్లమందు । గగనవాణినిఁ దలఁచుచుఁ గడచె గృహము. ౫౪౩

క. చనిచని యమునానది దాఁ । గనిన న్మోకాటిబంటిగా నొప్పిన నె
మ్మనమలర దాటి గోకుల । మునఁ జేరి యశోద యింటి ముంగిట నిలచెన్. ౫౪౪

గీ. నందువాకిటఁ బశుసంజ్ఞఁ జెందియున్న । చెలి విభూతినిజూఁచి య చ్చిన్నబిడ్డ
దానిచేతికి నిచ్చినఁ దగ గ్రహించి । నందు నెలనాగప్రక్కలోన నిడిన మాయనందినిం
దెచ్చి వసుదేవునకు నొసంగె. ౫౪౫

క. ఆ మాయశిశువుఁ గైకొని క్షేమమ్మున శూరసుతుఁడు చెరసాలకు వే
రా మగువసూచి శిశువుం । దామెల్లన నందె హస్తతామరసములన్. ౫౦౬

ఆ. జగముఁ దన మహేంద్రజాలమ్ములో ముంచు । మాయశిశువు గీయ గీయటంచు
బోరుపెట్టఁదొడఁగి పొంచి కాచెడివారి । నిదురనుండి లేపె నదిర శక్తి. ౫౪౭

ఉ. కావలివాండ్రు లేచి యది కాదనిన వ్విని యాలకించి లే
తే వినవచ్చె బిడ్డఁసడి లెమ్మిక లెమ్మిక యేమి నిద్ర రా

రా వడినేగి దెల్పఁదగు రాజున కంచు బిరానఁ బోయి యో
భూపర దేవకీసతికిఁ బుట్టెను బిడ్డ యటంచుఁ దెల్పినన్. ౫౪౭

చ. పగడపుకోళ్ళమంచమున భామినితోఁ బవళించి యంత ము
న్నుగఁ దన చెట్టస్వప్నము మనోగతదుఃఖము నిన్మడింప ద్మ
గ్యగళముపిప్పి మేలుకొనియున్న ధరాపతి తత్తరంబునన్
దిగి మొలకట్టు పల్మరును దిద్దుచు జుట్టును జుట్టు ముడ్చుచున్. ౫౪౮

మ. తడవాటై యెడవాటునం బదములం దండంబడ న్మెల్లఁగా
వడిదంబుంగొనఁ దుమ్మె నొక్కఁడు గృహాభ్యర్ణంబునందుండ ముం
గడపం దాటఁగఁ బిల్లివచ్చె నెదురై కానిమ్ము నాపైన మీ
గడియం దప్పఁగరా దటంచు జనియెం గంసుం డుదగ్రోగ్రుఁడై. ౫౫౦

చ. చని వసుదేవునిం బిలచి చాటిక నేల మదీయవైరి పు
ట్టెనుగద తెమ్ము బాలుని వడిం బరిమార్చెదనన్న నాఁతడుం
బనివడి దేవకీసవిధవర్తిని ముద్దుల మాయలాడి బి
డ్డను గొని రాజునం గడగడం గడుఁ గంపిలికొంచు నిట్లనెన్. ౫౫౧

గీ. నేన వచ్చెద బాలికతో నటంచు । నరిగె వసుదేవుచాటున మరిగిమరిగి
క్రొత్తబాలెంత సిగ్గున నెత్తిమీఁద । ముసుఁగు నడికట్టు పురిటాలి మిసిమితోడ. ౫౫౨

ఉ. పొత్తులలోన బిడ్డనిడి పొంకముగాఁ దన కేలుదమ్ములన్
మెత్తగ నుంచి పాదముల మెల్లనమెల్లన మెట్టుచు న్మహో
మత్తుఁడు వీఁడు నామనవి మాటలకుం గరుఁగండు కాని నీ
చిత్తము నాదుభాగ్యమని చెప్పెదఁగాక యటంచుఁ దగ్గుచున్. ౫౫౩

ఆ. కాదు సూడు నీకు గన్యక పురుషుండు । కాదు సూడుమింక కంస యనుచు
మొగముసూప కాపె మున్నుగా మొలసూపె। మొలయె మొలయటంచుఁ దలఁప కతడు ౫౫౪

క. ఔరా యాడుది పుట్టెన్ । వైరి పురుషుఁడంచు గగనవాణి వచించెన్
మారెనది తారుమారై । కారణ మేదొక్క కాలగతి కుటిలమగున్. ౫౫౫

ఆ. మరియుమరియుఁ జూచి మరిజూచి మరిజూచి । త్రిప్పిత్రిప్పిచూచి తేరజూచి
యూచియంచుఁ దెలియ కాదలచిత్తుండు । ప్రాచినోటితోడ బల్కె నిట్లు. ౫౫౬

క. సందియము లేదు దాడుది । బృందారకమాయ లిట్టివే యని వాగ్గా
బ్నందనుఁడు జెప్పెఁ గావున । వ్రందించెదఁ దెమ్మటనిన మగువ వగపుతోన్. ౫౫౭

మత్తకోకిల. కాదు కుఱ్ఱఁడు నేడు నీవిటు గంపమందఁగ నేటి కి
య్యాడుబిడ్డను గొట్టి దుర్యశ మందెదే సరివారిలోన్

వేడుక న్శిశుభిక్ష పెట్టుము వేడెదన్ దయలేదె నా
గోడు విన్నను గంసకంస తగుం దొలంగుట హింసకున్. ౨౫౮

మత్తకోకిల. నన్ను గద్దముబట్టి వేడితి నిన్ను నే బ్రతిమాలితిన్
జిన్నబిడ్డ యిదేమి వైరము జేయనేర్చుఁ దలంపుమా
మున్ను మిన్నను మాట నీకుల మూటయౌట యెఱుంగవే
నన్ను జంపుము నీదు డెందము నచ్చదేనియుఁ జెచ్చెరన్. ౨౫౯

వ. అనిపలుకుచున్న దేవకిదైన్యంబు దలంపునకు రానీక యాచిన్నివన్నిలాడిం బట్టి పాషాణంబుపై వైవ నది చేజారి దీటునం గాటుకపిట్టవలె మింటి కెగసి కనుమూసితెఱచినంతలో దివ్యరూపంబు ధరించి సల్లలితవల్లకీనినాదంబుబోని మృదుస్వరంబున నిట్లనియె. ౨౬౦

క. కంసా కులపాంసా నా । హింసవలన నేమి ఫల ముహీనతరమహో
హంసుండు గలడు నీకున్ । ధ్వంసకుఁడై వెట్టివాఁడ తరలుము వేగన్. ౨౬౧

క. అని యంతర్హితయై చన । గని విస్మయమంది యపుడు కంసుఁడు గేహం
బునకుం జని వెఱపు వగపు । బెనఁగొనఁగా దానవులను బిలిచి వచించెన్. ౨౬౨

గీ. ఎక్కడెక్కడ పసిబాలు రెలమి నుందు । రక్కడక్కడకును బోయి యరసి వారి
జెక్కచెక్కలు గావించి తక్కు మార్చి । యిక్కడికి రండనంగ వా రెల్లఁగదఁగి ౨౬౩

క. పూతన గోకుల నూతన । జాతుల మేతకయి చనియె సరగ నరశిరః
పాతక ధేనుకవత్సక । ఖాతల కేగి ప్రలంబ బకసహితముగాన్. ౨౬౪

వ. అంతం గంసుండు చింతావిష్టమానసుండయి గృహాంతరంబుననుండి సింగంబుఁ గలఁగన్న యేనుంగుబలె దైన్యంబుతోనుండె నంత నక్కడ నందగోకులంబున. ౨౬౫

క, మరునాటి ప్రొద్దుపొడుపునఁ । గరమరుదుగ నందుమందఁగల కామినులన్
బురుషులు యశోదకును నొక చిరుతఁడు బుట్టెనని వినిరి చెవులు దనియఁగన్. ౨౬౬

ఉ. పంచెడు పంచదారలను బండ్లబయిుం గొని యింటికింటికిన్
గంచునగార మ్రోగె నల కంసుని గుండెలు బిట్టుగొట్టికో
మించె మహోత్సవంబు లెలమిం గొలకట్టడి గాన్క కట్నముల్
గొం చరుదెంచి యిచ్చె నొగి గోపకబృందమునందు నింటిలోన్. ౨౬౭

ఉ. నందుని వైభవంబుఁ గని నందనసంభవ తన్మహోత్సవా
నందముఁ జూచి చారులు ఘనంబని కంసునితోడఁ జెప్పినన్
ముందు రణప్రియుండనిన ముక్కలు దా దఁలపోసి గోకులం
బందలివారలెల్లఁ దనకైరి విరోధులటంచు నెంచుచున్. ౨౬౮

క. దిగులుపడి మది నుపాయము । దగులక యప్పూతనాది దనుజావళి యె
వ్వగఁ బనిచేయుదురో చూ । డఁగఁ దానొక కొన్నినాళ్ళదంచెం జింతన్ ౫౧౯

సీ. ముక్కునగల మంచిముత్యాలబేసరి । యెడమచేతను సవరించుకొనుచు
మీగాళ్ళజారు నుమ్మెతవిరికుచ్చెళుల్ । గుడిచేతఁ గడుప్రీలకుండఁబట్టి
బిట్టు నిక్కుచు చాల బిగిచూపు జనుదోయి । నొప్పిజేతన నొసల్ ముప్పిరించి
కడుసన్నమైన లేనడుము జవ్వాడఁగాఁ । గలహంసవలె జారుగతి వహించి
మొలకచిరునవ్వుమొల్లలు మోవియనెడి । మోదుగలరులఁగలపెనా ముద్దుచెక్కు
టద్దముల నీడలేర్పడ నపుడు పూత । నాఖ్య నందుని యింటికి నరుగుదెంచె. ౫౨౦

క. దానింగని గోపీజన । మానందునిసతిని బిలువ నాబిడ జోజో
నా నాయన నా ముద్దుల । కూనాయని ముద్దులిడుచు గొమరునితోడన్. ౫౨౧

వ. వచ్చి నిజదృక్పాతజాతచేతోజాతకాంతరితసమస్తచేతసయగు పూతనం గాంచి నీ వెవ్వతె
వేల వచ్చితివని యడిగిన విని పూతన యిట్లనియె. ౫౨౨

క. అమ్మా యేమందును నా । యిమ్మడుగఁగనేల యీసమీపమె పల్లెం
గ్రుమ్మరెద శిశుక మీల్గెన్ । ఱొమ్ములు కడునొచ్చునమ్మరో కనుమమ్మా. ౫౨౩

ఆ. పాలబిగిని నేను పట్టలేకున్నాను । పాప లెచటనైనఁ బాలు గుడుచు
వారుగలరె యంచు వచ్చితి నడుగుచు । గొడుకు నిమ్ము పాలు గుడుచుగాని. ౫౨౪

వ. అనినవిని యశోద తనముద్దుకూన నితరులచేతి కొప్పింప మనసొప్పక తల్లి నాబిడ్డఁ
డితరులపాలు గుడువఁ డదికాక వీనికిం బాలకొఱతయు లేదనిన నంత మాయాకల్పితంబైన
యాకలిచే బిడ్డ నేడువసాగినం జూచి యీనాడు బిడ్డని కెన్నిసారులును గుడిపిన నాకలి
సెడలేదని యూహించి యీ యాడు దేమిసేయునని చేతికందిచ్చిన నది తన చేతుల నందు
కొని విషపూరితంబులైన స్తనంబుల గుడుపం దొడఁగె నంత. ౫౨౫

## —: శ్రీ కృష్ణలీలా ప్రారంభము :—

ఆ. పట్టిపట్టి కుడిచె దిట్ట బల్లక్కసి । యట్టునిట్టు దూలి కొట్టికొనఁగఁ
బట్టిపట్టి యనఁగఁబట్టి కృష్ణుఁడెకాక । చిట్టిపొట్టివారి చేతలె యివి. ౫౨౬

క. అని యందఱు నతివిస్మయ । మునఁ జూడఁగ దాని ప్రాణములతోఁ గుడిచెం
జనుబాలు బాలు డాపూ । తన కూలెం ధరణిఁ బర్వతమువలెను నృపా. ౫౨౭

వ. అంత గొన్నాళ్ళకుఁ గ్రమక్రమంబుగా ౫౨౮

సీ. బకునిఁ జంపెను వత్సుఁ బరిమార్చె ధేనుకు । మడియించెను బ్రలంబు మక్కుమార్చె
నింద్రుయాగము సేయ నియ్యనికతమున । నింద్రుండు గోపించి యెల్లమేఘ
నికరంబుచే రాళ్లనిండినవర్షంబు । గురిపింపఁగాఁ జూచి గోగణంబు
గోపగోపికలను గాపాడ గోవర్ధ । నాద్రి లీలాకందు కాభ నెత్తె
కేశి యనురాక్షసి బిత్పలోకేశుఁ జేర్చె । మఱిమఱి యగణ్యలీలల మహిమ జూపె
నింతయును విని కంసుఁడ త్యంతచింతఁ । తలపులో నెట్టకే నొక దారి ద్రొక్కె ౨౭౯

వ. కృష్ణుఁడు కాళియమర్దనంబును గోపికావస్త్రాపహరణంబును మున్నగు ననేక లీలల నతిప్రసిద్ధుండయ్యె నిత డితరులకు సాధ్యుండుగాడు ధనుర్యాగంబని మిషపెట్టి కృష్ణునిటకు రావించితినేని నేన వాసిం గదనంబున నోర్వఁగలనని యూహించి యక్రూరుం బిలిచి యోయి వృష్టికులసార్వభౌమా నేధనుర్యాగంబు సేయుచున్నాడనని చెప్పి రామకృష్ణులం దోడ్కొని రమ్మనిన నతండు నందుని మందకుం జని వారల సందర్శించి వృత్తాంతంబు సెప్పిన బలవంతుడగు రాజునాజ్ఞకుం బ్రతికూలంబు వచింపనేరక రామకృష్ణులం బంపిన నక్రూరసహితులై మధురాపురప్రయాణంబుచేసి ధనుర్భంగం బాచరించి రాజకంఠైన గజంబును, జాణూరుండును, ముష్టికుండును, శీలుండును, దోశలుండును నెదిర్చిన వారిం జంపిన విని కంసుండు మిగులవగచియు ధైర్యం బవలంబించియు వాలుంబలుకయుం బూని శ్రీకృష్ణుఁ గదసి గద్దించి యిట్లనియె. ౨౮౦

సీ. పాలు మీగడ వెన్న మేలైన పెరుగును । దొంగిలించిన కుఱ్ఱ దొంగ వీవు
కొలనిలో గోపికల్ జలకంబులాడగా । గోకలెత్తిన శుద్ధ గొంటె వీవు
సముచితచారధర్మము సింద్ర యాగంబు । వలదన్న పాషండకులుడ వీవు
పాలివ్వవచ్చిన పడఁతిఱొమ్ములు నొక్కి । చంపిన ప్రాణిహింసకుడ వీవు
నీతి యొక్కింతయేనియు నీకు నూరు । కంచుదివిటీల వెదకిన గానరాదు
మందలోచేష్ట లిచ్చోట మానుమింక । కంసు నెరుగవె శత్రు విధ్వంసు ననిన. ౨౮౧

ఉ. ఓరి కులాధమా విను మయో పసిపాపలటంచు నెంచ కే
దారినిఁ జంపి తార్వర సుదారగుణు ల్కని నవ్వరే సదా
చారుఁడనంచు బొంగెదు విచారవిహీనుఁడ వీవు నీకు నే
మారకుఁడం గనుంగొనుము మాటలు పెక్కులు ప్రేలనేటికిన్. ౨౮౨

వ. అని కృష్ణుండుపల్కిన విని కట్టల్కఁ గన్ను లెఱ్ఱజేసి పండ్లు పటపట గొరుకుచు నిది చూడుమంచు డిగ్గునం గదలి కేలనున్న వాలు జళిపించి యేసినం దప్పించుకొని దేవిం దలంచుకొని కృష్ణుండు కంసుచేతివాలు పీలునం దనకేలి కావర్షించుకొని రణకేళీవినోదంబునం గంసు మస్తకంబు దెగనేసిన నది విమానంబులనుండి వచ్చిన దేవతానికరంబులు సూచి పుష్పవర్షములు గురియించిరి. సమస్త మునిగణంబులు స్తుతించిరి జనులుల్లసిల్లి రంతం గృష్ణుండు కంసుననంతరం బతని తండ్రియగు నుగ్రసేను రాజ్యంబేల నియమించి

నిజపరాక్రమ ప్రభావంబులు జగంబున నిండించియుండం గని వసుదేవుండు రామకృష్ణులకు మౌంజీబంధనవ్రతంబు నెరవేర్చినఁ గాశికింబోయి సాందీపునొద్దఁ గొలదికాలంబున సమస్తవిద్య లభ్యసించి మరల మధురకు వచ్చి ద్వాదశహాయనవయస్కులై యుండ మగధరాజగు జరాసంధుండు తన యల్లుండగు కంసువధ విని దుఃఖితుండై సేనా సహస్రంబులం గూర్చుకొని మధురమీదికి దండెత్తికొనివచ్చి పదియేడు తడవులు కృష్ణునిచేఁ బీడింపబడి యోడి కాలయవనుం బ్రేరేప నతం డనేకాక్షౌహిణీసేనాసమేతుండై మధురమీదికి వచ్చినం జూచి కంసాంతకుండు యాదవులనెల్ల రావించి నిజాగ్రజుండగు రాముం జూచి యిట్లనియె. ౫౮౩

గీ. ఏమిచేయుదుమయ్య దండెత్తివచ్చెఁ । గాలయవనుండు భీకరా కారుఁడగుచు
నాజరాసంధుఁ డిదియెల్ల నాచరించు । చున్నవాఁ డిక మధురలో నుండదగదు. ౫౮౪

ఆ. ప్రాణముండెనేని బలుసాకు దినియైన । బ్రతుకవచ్చును గాన బ్రాణరక్ష
యెందు గలిగియుండు నందుంట క్షేమంబు । ప్రాణరక్షలేని రాష్ట్రమేల ౫౮౫

ఆ. పోరు గలిగె గోరు పొక్కుపై రోకంటి । పోటుగాఁగ మగధభూవిభుండు
గొడవ పెట్టుచుండఁ దడయక యిక్కాల । యవనుఁ డొకడు వచ్చె నకట యిపుడు. ౫౮౬

ఆ. వైరిభయములేని వైపుల నుందురు । బుద్ధిమంతులయిన పురుషు లెపుడు
క్షీరసాగరమునఁ జేరెను విష్ణుండు । కొండమీఁదఁ గూరుచుండె శివుడు. ౫౮౭

ఆ. సింధువునకు మిగులఁ జేర్వట రైవత । గిరికి దగ్గరఁట ప్రకృతియు రమ్య
మైనదేయట వినతాత్మజుండేగి చూ । చెనఁట ద్వారవతికిఁ జేరుద మిఁక. ౫౮౮

క. అంతట యాదవు లందరు । సంతసముబొంది పొంగి సకుటుంబముగా
గంతలుగట్టిరి యెడ్లకు । దుంతలకును నొంటెలకును దూరగతికినై ౫౮౯

ఆ. మధురలోనె స్వస్వమందిరద్వారముల్ । మూసివైచి బీగములు ఘటించి
బండ్లమీద నిడిరి పాత్రభూషాధన । వస్త్రపేటికలను వరుసదీర్చి. ౫౯౦

క. ముసలమ్మలు ముసలయ్యలు । మెసలంగాఁ జోటులేక మెల్లన దిగుచున్
వెస నెక్కుచు నెట్టెట్టో । గుసగుసలాడుచును బండ్లగూర్చుండి రొగిన్. ౫౯౧

క. పసిపాపలఁ దొట్టెలలో । విసువక నిడి చూచుకొనుచు వెస బాలెంతల్
కసుగందక వీవనలన్ । విసరుగొనుచు జనిరి శకటవిసరములపయిన్. ౫౯౨

ఆ. పడుచువారుకొంత నడుచువారయ్యును । దడవు నడచి యెండగొడుగులెత్తి
యడుగులందుఁ జెప్పుటట్టలు గట్టిగా । దొడిగి చనిరి యలఁత దోచకుండ ౫౯౩

వ. ఇట్లు రామకృష్ణులం బురస్కరించుకొని మధురలోనున్న యాదవులు కతిపయప్రయాణంబుల ద్వారవతిం బ్రవేశించి జీర్ణంబైన పట్టణంబు బాగుజేసికొని యందు నివసించి రంతం గాలయవనుండు యాదవసహితంబై యున్న ద్వారావతికిం బోవ నది కృష్ణుండు విని పురబహిఃప్రదేశంబునకు వెడలి కాలయవనునకు దృష్టిపథగోచరుండైనం గాంచి యిర్వురుం బదచారులయి ముందుఁ గృష్ణుండును, వెనుక యవనుండును బరచి పరచి దీర్ఘకాలనిద్రాపరవశుండై యున్న ముచికుందుండున్న గిరిగహ్వరంబు ప్రవేశించె నంత యవనుని స్పర్శంబునం జేసి ముచికుందుండు మేలుకాంచి తన యుగ్రదృక్పాతంబున వానిన్ దగ్ధుంజేసి కమలలోచనుండును పీతాంబరధరుండును, నతిమనోహరాకారుండును నైన శ్రీకృష్ణుని దర్శించి నమస్కరించి శాపంబునుండి విముక్తుండయ్యె నంతఁ గృష్ణుఁడు బలసహితుండై ద్వారావతికింబోయి దానికి నుగ్రసేనుం బ్రభువుం గావించి స్వేచ్ఛం గ్రుమ్మరుచు సుఖంబుండె నంత. ౨౯౪

చ. కలదు విదర్భదేశమును గాచు నరేంద్రుడుఁ భీష్మకుండు నా
నలరును వానికిం దనయయైతగు మేచకవేణి విస్ఫుర
జ్జలరుహపాణి చారుగుణ సంతతిహారిణి దృగ్జితైణి యు
జ్జ్వలతరభూషణాంచిత లసన్మణి రుక్మిణినాఁ బ్రసిద్ధయై. ౨౯౫

శా. ఆదామోదరు రూపయౌవనకళావ్యాపారముల్ నిచ్చటన్
భూదేవోత్తము లప్పుడప్పు పొగడం బూబోడి దావించుఁ ద
త్పాదాంభోరుహదర్శనంబు గలుగన్ దత్సంగతిం గోరుచున్
శ్రీదేవీవ్రత మాచరించి పడసెన్ సిద్ధిన్ ధరాధీశ్వరా. ౨౯౬

క. తనయన్న రుక్మియనువాఁ । డనయము శిశుపాలునకును ననుజ నొసంగన్.
మనమున్ంచియుండ నాతని । కనువుపడఁగనీక కృష్ణుం డంగన గొనియెన్. ౨౯౭

క. దేవీ పూజార్థంబై । యావెలఁదుక వెడలఁజూచి హరి బాహుబల
ప్రావీణ్యంబున గైకొని । తా వేగంబోయి నిజరథంబున నిడియెన్. ౨౯౮

వ. ఇట్లుకొనివచ్చి హరి రాక్షస వివాహంబున రుక్మిణిం బెండ్లియాడి తదనంతరంబ క్రమంబుగా జాంబవతీ, సత్యా, మిత్రవిందా, కాళింది, లక్ష్మణా, భద్రా, నాగ్నజితులను వారి యథావిధిఁ బాణిగ్రహణంబు సేసికొనియె. వీరెనమండ్రుం బట్టంబుదేవు లిందుం బ్రథమగణ్యయగు రుక్మిణికి నతిమనోహరాకారుండైన ప్రద్యుమ్నుండు పుట్టె. మధుసూదనుం డబ్బాలునకుం జాతకర్మాదికం బాచరించి యున్నం గొన్నాళ్ళ కాముగ్ధ బాలున్ సూతికాగేహంబునుండి బలవంతుడయిన శంబరుండు తన మాయాబలంబునం గొనిపోయి మాయావతి యనుదాని కొప్పించినంత వాసుదేవుండు చింతాసాగరంబునఁ మునిఁగి దేవీ స్మరణంబువేడి పలుదెరంగులం బ్రార్థింప దొడంగె. ౨౯౯

వసంతతిలకవృత్తము. ధర్మాత్మజుండనయి తల్లి భజించి నిన్నుం
శర్మప్రదాత్రివని చాలగ నమ్మియుంటిన్
వర్మంబువోలె ననుబాలనజేసి తీవున్
గీర్మాత్రవేద్యవౌ సుకీర్తి వెరుంగవే మున్. ౬౦౦

,, సూతీగృహంబుకడ సొక్కెడి యెవ్వఁడో మ
జ్జాతున్ శిశుగొనుచుసాగె మనంబు లజ్జా
భీతుల్వైనంగొనఁగ బిట్టదలంగ నీలా
గైతిం గదమ్మ జగదంబ కటాక్ష మిమ్మా. ౬౦౧

,, అత్యంతదుర్గమగునమ్మ పురంబు గేహం
బత్యున్నతంబగు దదంతరదుర్గభూమిన్
సత్యంబు సూతిశుభశాలిక గుప్తమందు
గృత్యంబు సూడఁగను గేవల చిత్రమయ్యెన్, ౬౦౨

,, సూనుం గొనంగ నిలుసొచ్చుట కేడు వచ్చెన్
ఏనింటనుంటిఁ గలరింతులు నూర్వు రందున్
దీనాళిఁ బ్రోచుటకు దిక్కిక నీవె యనన్
నానావిధంబులను నమ్మితి నిన్నె తల్లీ. ౬౦౩

,, ఎవ్వాఁడు నీమహిమ లెన్నఁగలండు నీకుం
దవ్వైన వానికినిఁ దప్పక ముప్పు గల్గున్
అవ్వా కృపాకలితవై ననుఁ బ్రోవవమ్మా
యెవ్వారు నన్నిక భరింతురు చెప్పుమమ్మా. ౬౦౪

,, సువ్వీయనం దెసలు సూచుచు సందియంబుల్
రువ్వంగ నేల యది రోకటిచందపెకాదే
యెవ్వారు వచ్చిరొకొ యీకిటుకింత సేయన్
పువ్వారుబోణి నను బ్రోవగ దమ్మ తల్లీ. ౬౦౫

,, త్రోయించితీవె బలురోహిణి గర్భమందున్
మాయమ్మ పంపితివి మందకు నన్ను నీవే
నీయాన నిన్ను విడనేర భజింతు నెప్డున్
సాయంబవై నిలుము శక్తి జగద్విధాత్రీ. ౬౦౬

,, నీవేగదమ్మ భువి నింగి భుజంగలోకం
బీవేళఁ గాచుచు నటించెద వంబరీతిన్

సీ విచ్చినావు సుతునిన్ సుఖమందు మంచున్
నీవే హరింపఁదగు నే కరుణించి యమ్మా. ౬౦౭

వ. అని యిట్లనేక విధంబులం బ్రార్థింపం గరుణించి ప్రత్యక్ష దర్శనం బిచ్చి యో శ్రీకృష్ణా! భయపడకుము శాపవశంబునం జేసిన సుతుని శంబరుండు గొంపోయె. నతండు, షోడశహాయన వయస్కుండై శంబరుం బరిమార్చు. నాప్రసాదంబువలన మరల ద్వారావతికి వచ్చి నీ కత్యంతానందంబుం గలుగఁజేయం గలవాఁడని చెప్పి యంతర్ధానంబు నొందె నంతఁ గృష్ణుండు సంప్రీతాంతరంగుండై నిశాంతంబు ప్రవేశించి సుఖంబుండె నని చెప్పిన విని రాజు వ్యాసున కిట్లనియె ౬౦౮

సీ. మునినాథ సందేహమును దొలఁగించుమీ వైష్ణవాంశజుఁడైన వాఁడు శౌరి
వానికి దుఃఖము ల్వచ్చెనె వింతాయె సూతికాగృహమందుఁ జొచ్చి తనయు
నొకదొంగ గొంపోవ నుత్తమజ్ఞానంబు గలవాఁ డెరుంగఁడే తెలియఁబల్కు
నావుండు వ్యాసుండు నరనాథ చెప్పెద వినుమని పల్కె నవ్విష్ణుడైన

గీ. శంభుఁడైనను విధియైన శక్రుఁడైన । మాయ బలవతి మోహిని మహితమూర్తి
దానిఁ దప్పించుకొనుటకుఁ దరముగాదు । మనుజులన నెంత యిక వేయు మాటలేల. ౬౦౯

## — * శ్రీ కృష్ణ కించిత్త త్వ కారణము * —

క. మానవ జన్మంబెత్తిన । మానవులకు నేది గుణసమాజంబగునో
దానిం బూనకయుండునె । మానాయకుఁడైన నేమి మనుజుండైనన్. ౬౧౦

వ. వినుము పార్థివేంద్రా! క్షుధయు, తృష్ణయు, నిందయు, భయంబును, తంద్రయు, వ్యామోహంబును, శోకంబును, సంశయంబును, హర్షంబును, నభిమానంబును, జరయు, మరణంబు, నజ్ఞానంబును, గ్లానియు, ప్రీతియు, నీర్ష్యయు, నసూయయు, మదంబును, శ్రమంబును, విదేహభవంబులైన గుణంబులు, అది యెట్లంటేని పురోగతంబైన బంగారులేడి యిట్టిదనియు, జానకీహరణం బగుననియు, జటాయుమరణంబు ప్రాప్తించుననియు, నభిషేకముహూర్తంబున వనవాసప్రయాణంబు వచ్చుననియు, రాముఁ డెఱింగెనే ? అదియుంగాక. ౬౧౧

క. జానకి యేగినచొప్పుం । గానక పొదపొదను నెమకి కడుశోకమునం
గానల దిరిగెను రాముడు । యేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా॥ ౬౧౨

కం. కానడు రాముడు మార్గము । తాను మహానాగపాశతతి నొడిగి గరు
త్మానుడు దొలగించెగదా । యేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౧౩

క. జానకిఁ బాపంబెఱుగని । దానిని బ్రాకృతు డొకండు దప్పిడినంతం
గానలకు బంపె రాముం । డేనరుడిక జ్ఞానవంతు డీభువిని నృపా. ౬౧౪

క. మానుగ గుశలవులను దన । సూనులనుచు నెరుగడాయె జూరాముడు దా
మౌనివలన దెలిసికొనియె । నేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౧౫

క. జానకి పాతాళగతిన్ । బో నెరుగక రాము డలుక బూని వడి సుమి
త్రానందను గోపించెఁజు । మేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౧౬

క. శ్రీనాథుండగు కృష్ణుఁడు । భానునిభుడు కంసువలని భయమునగాదా
యానందుమందలోఁబడె । నేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౧౭

క. నానా విధముల మాగధ । భూనాథు దడంపలేక పురమును విడిచెన్
ధీనిధి శ్రీకృష్ణు దా । నేనరుడిక జ్ఞానవంతు డీభువిని నృపా. ౬౧౮

క. జానుగ శిశుపాలున కీ । బూనిన రుక్మిణిని గృష్ణమూర్తి కృతకసం
ధానమునఁ నపహరించదె । యేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౧౯

క. సూనుండు శైశవంబున । దానవుచేటడుటొకింత దానెరుగఁడు సం
ధానచతురుడగు కృష్ణుం । డేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౨౦

*క. దీనత సత్యాజితుడై । తా నమరులచెట్టు దొంగతనమున దెచ్చెన్
సానందుడైన కృష్ణుం । డేనరుడిక జ్ఞానశీలుం డీభువిని నృపా. ౬౨౧

క. మానిని సాత్రాజితి దా । నా నారదునకును గృష్ణునర్పింపంగా
బూని ద్రుమంబున గట్టెను । నేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౨౨

క. మానుగ జాంబవతియు సం । తానమడిగికొనిన శౌరి తపమొనరింపం
బూని చనియె పర్వతమున । కేనరుడిక జ్ఞానశీలు డీభువిని నృపా. ౬౨౩

సీ. శివునిభక్తుండయి చెలువొందు నుపమన్యు । గురువుగా నొనరించికొని సపర్య
లొనరించి పాశుపతోరుదీక్షంగొని మొండియై వెండియు దండియగుచు
నుగ్రతపంబు దా నొకమాసమున మంచి ఫలభక్షణముచేసి భక్తినిల్చి
శివమంత్రమః జపించి చెలగుచు రెండవ నెల జలంబుల గ్రోలి నియతి నేక
పాదంబుననె నిల్చి పరగ మూడవనెల గాలిని భక్షించి కాలివ్రేల
నిలిచి నియమంబు సలిపిన నలరి శివుడు దేవతలతోడగూడి తా దివ్యదర్శ
నం బొసంగి యదూద్వహ నాకు దృప్తి । యయ్యె వాంఛితమెద్దియో యడుగు మనిన. ౬౨౪

వ. అంత శ్రీకృష్ణుండు సంతుష్టాంతరంగుండై యంతకాంతకుని పాదంబులకు దండవత్ప్రణా
మం బాచరించి మేఘగంభీరభాషణంబుల నిట్లని స్తుతియించె. ౬౨౫

దండకము: దేవదేవా జగన్నాథ భూతార్తినాశా మహావిశ్వనాథా సురారిఘ్న త్రైలోక్య
కారీ హరా నీలకంఠా శివా శూలి శైలాత్మజావల్లభా యజ్ఞహర్తా కథుం ధన్యుడ న్నేను నీ

దర్శనంబాయె నాజన్మ సాఫల్య మాయెన్ సదా కామినీపాశబద్ధుండ సంసారకూపంబునం జిక్కితిన్ నీవె దిక్కింక నాకున్ నినుంగొల్వ నేవచ్చితిన్ రక్షణార్థుండనై యో త్రినేత్రా నరాకారముంబూని దుఃఖంబులంబొంది ఖిన్నుండనైతిన్ భవాంభోధి దాటించి రక్షించు రక్షించు మక్షీణకారుణ్యముం జూపి నే గర్భవాసంబునం గొంతకాలంబు దుఃఖించితిన్ బిమ్మటం గంసభీతిం దపింపంగ నయ్యెన్ యశోదాకరస్థాంబుసేకంబుతో వృద్ధి వాటిల్లి యామందలోనుండి గోధూళితో నిండు కేశంబులుం దూల గొన్నాళ్ళు పల్పాటులం బొందితిం బిమ్మటన్ మ్లేచ్ఛ రాజన్యువల్లం గడుంభీతి ద్వారావతిం జేరి పైత్ర్యంబువోనెట్టికొంటిన్ యయాతి ప్రభుం డిచ్చియున్నట్టి శాపంబునన్ రాజ్యభారంబు జెందంగ లేనైతి నయ్యుగ్ర సేనుం దగం గొల్చితిన్ వెండియుం గామినీవశ్యతం ధర్మముం గంటి గార్హస్థ్యముంబూని స్వాతంత్ర్య మింతేనియున్ లేకయుంటింగదా యిప్పు డాభైష్మిసానందయై పుత్రులం గాంచి యుండుటం గనుంగొంచు భల్లూకరాట్పుత్రి సంతానముం గోరి నన్వేడి ప్రేరేప నిట్లే దపంబు గ్రలీలన్ నినుంగూర్చి కావించితిన్ సిగ్గుగానున్న దేమందు నేమందుమాడ్కిన్ వచింపంగ గాలంబు వచ్చెన్ భవద్దర్శనంబైనచో మోక్షముంగోర కీవెట్టివాంఛల్ ప్రసంగించు ధీమం తుఁడున్నే యదైనన్ బురాప్రాప్తశాపంబునన్ ధర్మసూనుండ నారాయణుండన్ నరత్వంబు ప్రాప్తించె దుఃఖానుభూతిం దొలంగింపకో శక్యమా సద్దయాపాంగ గంగోత్తమాంగా, జితానంగభూషీ కృతోద్యద్భుజంగాయ తుభ్యం నమోస్తంచు నే మ్రొక్కెదన్ మ్రొక్కె దన్ మ్రొక్కెదన్. ౬౨౬

క. అని యిట్టుల బ్రార్థించిన । విని శంభుడు నవ్వి యెంత వెఱ్ఱివి సరితే
నను దర్శింపగ దపమి । య్యడువున గావించినాడ వత్యుగ్రగతిన్. ౬౨౭

వ. కావున. ౬౨౮

చ. ఎనయ బదారువేలపయి నేబదిమందిని బెండ్లియాడు దీ
వనఘ యొకొక్కసుందరికి నేరుపడం బదిమంది పుత్రకుల్
జననము నొందగాగలరు సారభుజాబలవిక్రమోద్ధతుల్
మనమున జింతయేటికిక మానుము పూను ముదంబు మాధవా. ౬౨౯

వ. వెండియుం ఖండపరవశునండనున్న గౌరింగాంచి శ్రీకృష్ణుండు నమస్కరించి నిలువం బడియున్నం జూచి శౌరితో నిట్లనియె. ౬౩౦

సీ. కృష్ణుడా యిటువిను మీవు శంకింపక । చెప్పెద నీకగు ముప్పులెల్ల
నీవు నూరేడులు నిండుగ బ్రతికెదు । బ్రాహ్మణ శాపంబు బట్టి మరియు
గాంధారిశాపంబు గల్గియు నీకులం । బెల్లను క్షీణించు హీనగతుల
యాదవు లోర్వదురు సానుజుండవు నీవు । దేహంబు వాయుదు మోహమహిమ
కావలయు కార్యజాతంబు కాకపోదు । భావిభావంబు లెందును బ్రతిఘటింప
బడవు నామతమిది దుఃఖపడగ దగదు । మరియు దెలిపెద విను మొక్కమాట యిపుడు.

క. అష్టావక్రశపనసం । స్పృష్టత జోరులు హరింత్రు చేడెల నెల్లన్
కష్టంబు సుఖము నొకగతి । నిష్టముగావించుకొ మ్మహీనగుణాఢ్యా. ౬౩౨

వ. అని పలికి గౌరియు శంభుండు నంతర్ధానంబునొంది రంత గృష్ణుం డుపమన్యునకు నమ
స్కరించి ద్వారావతిం బ్రవేశించెనని చెప్పి మరియు, ౬౩౩

ఉ. కావున బ్రహ్మకైన దన కర్మము తప్పదు కట్టికుడ్పునిం
కేవిధి మానవుల్ తొలగి యేగెదరో జననాథ మాయకుం
దావగు లోకసంతతిని దప్పనె దుఃఖము పూర్వకర్మముల్
ప్రోవటయుండ జంతువులు పుట్టును జచ్చుచునుండు నెప్పుడున్. ౬౩౪

క. మాయాదేవికి లోఁబడి । వేయివిధంబులగుగతుల వెలయుదుముగదా
యేయెడలఁ గొయ్యబొమ్మల చాయలఁ బ్రాణులు స్వకర్మ సంగతి నధిపా. ౬౩౫

క. వైషమ్య నిర్దయతలను । దోషంబులు దేనియందు దోపవు కానన్
భాషలిక నేల సద్గుణ । భూషాపతి జీవమోక్షమునకే తలచున్. ౬౩౬

గీ. ఎలమి జగదంబ జగము సృజింపకున్న । మాయదడమిది తానేమి సేయఁగలదు
కానఁ గారుణ్యమూర్తియై కడగి యామె । జీవముఖసృష్టిఁగావించు నీవిధమున. ౬౩౭

క. జీవుఁడు కర్మముగతి మా । యావశుడై మోహవార్ధి నడగి కృశించున్
గావున స్వాతంత్ర్యం బొక । యావంతయు లేదు బ్రహ్మకైనను వింటే. ౬౩౮

ఉ. ఏవిధినైన దేవిని భజింపక కల్గదు ముక్తి సంసృతిన్
దేవినిమించ వేరె జగతిం గనరాదు భవాబ్ధిపోతమా
దేవియ నేను బ్రహ్మమన దేవియయంచు నభేదబుద్ధితో
జీవుఁడు సద్గురుం గొలిచి జేతయగున్ భవశత్రుభేదియై. ౬౩౯

వ. మరియు నశ్వమేధ నరమేధాది మహాయజ్ఞంబులు, భూదాన గోదాన కన్యాదానాది
మహాదానంబులును, చాంద్రాయణాది మహా వ్రతంబులును, దేవి భజనంబునకుం
దుల్యంబులుగావు, శ్వేతాశ్వతరుండు మున్నుగాగల మహామునులు, సచ్చిదానంద
రూపిణియగు దేవిం గొలిచికాదే సంసారసాగరంబును తరించిరి. ప్రపంచభీతుండ
వయి నన్నడిగిన యాఖ్యానంబు సెప్పితి, నిది సర్వపాపహరంబు, పుణ్యంబు, నత్య
ద్భుతంబు, నిది వేదసమ్మతంబు,దీని వినినవాఁడు సర్వపాపవినిర్ముక్తుండయి దేవీలోకంబు
జెందునని వ్యాసుండు సెప్ప నేవింటినని సూతుండు. ౬౪౦

## కృతిపతిసంబోధనము

శా. ఊఢక్ష్వేడవిరూఢబాధగడసీమోద్యూఢగాఢచ్ఛవి
ప్రౌఢాషాఢసమూఢవిష్ణుపదలీఢోదగ్రముక్తచ్ఛటా

వోధృష్మాధర లక్ష్మలక్షితతను స్ఫూర్జ్యుల్లసద్గౌరవా
ద్యాధాకారవిలిప్తభూతిసుకరా యల్లారిసోమేశ్వరా. ౬౪౧

గద్య. ఇది శ్రీమదిష్ట కామేశ్వరీపాదారవింద మకరందతుందిలమానసేందిందిర దాసు వంశపయఃపారావారరాకాసుధాకర, కామాంబాకన్నయ్య మంత్రీంద్రకుమార పవిత్ర హరితగోత్రాలంకార కృష్ణామండలమండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీవీరప్రతాపకోదండ హంవీర రామచంద్ర భూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయ మండల న్యాయసభావాదక నియోగభార వ్యవహార, శ్రీ వేంకటేశ్వర వరప్రసాద సంభూతకవిత్వ విద్యావిశేష బాల్యాది రచిత త్రింశత్ప్రత్యేకగ్రంథ మతిసార విబుధజన కరుణాసంపాదితోభయభాషా పరిచితప్రచార నిత్య, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీదేవీ భాగవతంబను మహాపురాణంబునందు చతుర్థస్కంధము.

చ తు ర్థ స్కం ధ ము స మా ప్త ము

39) శ్రీ

# దేవీ భాగవతము

## పంచమస్కంధము

—: శివకృష్ణుల యుత్కర్షాపకర్షవిచారము :—

క. శ్రీశ్రేయోబలవిభవస । మాశ్రయనిజపాదభజన మహిమాభినుతి
ప్రశ్రుతనిగమాంతార్థప । రిశ్రమ మునిహృన్నివేశ శ్రీసోమేశా. ౧

వ. అవధరింపు మనంతరంబ సూతుం గాంచి ఋషు లిట్లనిరి. ౨

క. సూతా సంతతసుగుణస । మేతా నీవలన వింటిమి మహాపుణ్యం
బై తగు కృష్ణచరిత్రము పాతకనాశనము చెవులపండువుగాఁగన్. ౩

ఉ. అందొక సందియంబుగల దందటికిన్ మహనీయుడైన శ్రీ
సుందరివల్లభుండు పరిశుద్ధుఁడు సర్వజగత్ప్రపూజ్యుఁ డా
నందమయుం డలంతియె వనాంతరసీమల కేగి యంతయున్
గొందలపాటునన్ శివునిగూర్చి తపం బొనరింపజొచ్చెనే. ౪

శా. శ్రీదేవీకళయైన పార్వతి దయాశ్రీయుక్తయై యిచ్చెనే
యాదివ్యాత్మనకున్ వరంబు కనఁగా నల్పుండె నారాయణుం
డాదేవిం గడుదీనతం గొలిచెనే యాహా! విచిత్రంబు స
మ్మోదంబొప్పఁగఁ దెల్పవే యన సుధాముగ్వాచుఁడై సూతుఁడున్. ౫

క. జనమేజయభూపాలుఁడు । మును గృష్ణచరిత్రమెల్ల మునుకొని విని వ్యా
సు నడిగె నీ సందేహము । నెనసి యతం డాదరమున నిట్లని చెప్పెన్. ౬

చ. సకలజగత్ప్రపూజితుఁడు సత్యుఁడు నిత్యుఁడు వాసుదేవుఁ డ
త్యకలుష దచ్యుతుండు నిరుపాధికుఁడైనను మానుషత్వముం
బ్రకటము సేసినప్డు తగు భావము లందక యుండరాదు వెం
డ్రుకలకుఁ జీదరించిన నెటుల్ కడిగొంగడి మెక్కఁగోరినన్. ౭

క. కామము క్రోధము లోభము । నా మోహము మదము మత్స రారంభంబున్
దామే పొడమును హర్షము నామోదము సుఖము సహజమగు మనుజునకున్. ౮

క. గుణమయమగు దేహం బిది । గుణముల విడనాడఁగలదె గుణియగు నాలా
యణుఁ డేల గుణముఁ దొలఁగున్ । గుణకార్యములెల్ల దేహిఁ గూడియయుండఁగన్ ౯

క. మేదుర సౌబలిశాపము । యాదవులం జంపె నెఱుఁగవా కృష్ణుండున్
గాదనఁగలిగెనె తనదు మహాదుఃఖకరంబులైన యాపత్ప్రతతుల్. ౧౦

క. హరికిం దసుమోక్షంబును । నరునకుఁ బండతన మబ్బెనా వినలేదే
పౌరిపౌరిఁ దస్కరపుంజము । దరిసి తనరి నెరుగరాదె తను మహిమంబున్. ౧౧

మ. శివుసేవించుట దేవిచే వరములం జేకొంటయుం జిత్రమే
వివిధప్రాణిచయావనుండయిన యా విష్ణుండు సర్వేశ్వరున్
భవు నాత్మప్రభవాదికారణు సదా ప్రార్థించునట్లుండ వి
ష్ణువునంశంబునఁ బుట్టువారు జగదీశుం గొల్వరే నిచ్చలున్. ౧౨

ఆ. వె. మొదటియచ్చు బ్రహ్మ మునికొని యైదవ యచ్చు విష్ణుదేవు డమ్మకార
మరయ శివుఁడు దాని యర్ధమాత్రమ దేవి యుత్తమత్వముత్తరోత్తరంబు. ౧౩

తే. గీ. అర్థమగుటను జగదీశి యంబ నిత్య కేశవునకును మీదివాఁ డీశుడెన్న
ధాతకును మీదివాఁడుసూ దైత్యరిపుఁడు విష్ణుఁ డభవుని గొల్చుచో వింతకలదె ? ౧౪

సీ. వరదానమునకునై సరసిజోద్భవుని వక్త్రంబున జనియించెఁ గాలగళుఁడు
మూలరుద్రునియంశమునఁ బుట్టెఁ రెండవ రుద్రుం డతండును భద్రమూర్తి
యఖిలపూజ్యుడయి యలరారు నట్లుండ మూలరుద్రుఁడుగాడె పూజ్యతముఁడు
దేవితత్త్వమునంటి తేజరిల్లుటఁ జేసి భవునకు నుత్తమత్వంబు గలిగె
గీ. హరికి యుగయుగమునఁ గల్గు నవతరణము । లెల్ల శ్రీ యోగమాయామహిమమువలన
గాదె కావున నీకును గల్గినట్టి । సందియంబును విడుమింక డెందమందు. ౧౫

చ. సరవిని నేత్రపక్ష్మపరిసంచలనంబున విశ్వమెల్లనున్
బరిపరిరీతులం జనన భావము నందఁగజేయుఁ బొమ్మ సం
హరణము సేయు నాసుగుణహారిని దేవియ పద్మసూతి శం
కరు జలశాయి షడ్విధవికారసమేతులఁ జేయు నిత్యమున్. ౧౬

చ. ఉరువడి సూతికాలయమునుండి వ్రజంబునఁ జేర్చి నందుమం
దిరమునఁ బ్రోవువెట్టి కడిడి న్మధురాపురి కంపి ద్వారకా
పురిఁ బదియాఱువేల పువుఁబోఁడుల దాసుఁడుగాఁ జరింపఁగా
నెరపెను దేవి నందసుతు నీరజనాభు ననంతు నాద్యునిన్. ౧౭

క. జగమున నొకయంగనయే । మగవానికి సంకెలంద్రదు మరి శతశతముల్
తగులంబగుచో నేగతి । యగునో యది యెంత గిజగిజాయెనొ హరికిన్. ౧౮

సీ. సాత్రాజితికిని వశంగతుండై మాట జవదాటకయ పారిజాతతరువు
దొంగిలించెను రుక్మితోఁ బోరి శిశుపాల ముఖ్యులను జయించి మోహనాంగి
రుక్మిణిఁ జేపట్టె రూఢిగా నయ్యహంకారమ్ము ననకా జగమ్మునందు
మంచిచెట్టల నొనరించుచుండును దేహి యయ్యహంకారమే యాదిబీజ

గీ. మగుఁ బ్రపంచంబునకు హరి హర విధులకు । దాని విడిచిననాఁడుగా ధన్యులగుదు
రెల్లవారు నహంకార మెచట నచట । బద్ధతయుఁ దద్విముక్తియే పరముక్తి. ౧౯

ఉ. ఆరయ భార్యగాదు మఱి యర్థచయంబును గాదు పుత్త్రిలుం
గారు సహోదరాదులును గారు గృహంబునుగాదుసు మ్మహం
కారమె యాదికారణము నమ్ముము రాజవరేణ్య లోకమం
దెరికినేని బంధమున హేతువు మాటలు వేయు నేటికిన్. ౨౦

శా. నేనే చేసితి నే బలీయుఁడను నేనే చేయుచున్నాఁడ నె
ద్దేనిం జేసెదఁ జేయనుంగల నటం చెంతేనియుం బ్రాణిబం
ధానం జిక్కెడుఁ గార్యసంతతికి నెన్నం గారణంబుండునో
దీనప్రాపక యా ఘటంబునకు మృత్పిండంబుపోలెన్ ధరన్. ౨౧

గీ. విశ్వమునుఁ బాలనముసేయు విష్ణుడైనఁ । దా నహంకృతి విడువండు తథ్యమరయ
కాకయుండిన సర్వదా శోక మోహ । మదముఖాంబుధి మగ్నుఁడై మనునె చెపుమ. ౨౨

చ. అవతరణప్రవాహముల నచ్యుతుఁడేల మునుంగు మోహసం
భవమగు నయ్యహంకృతికిఁ బాల్పడకుండిన నద్దిలేనినాఁ
డెవనికినేని సంసృతికి హేతువు కానఁగరాదు ముక్తికిం
బ్రవిమల మార్గ మద్దియసుమా మది నమ్ముము రాజచంద్రమా. ౨౩

వ. పురుషుండు సాత్వికుండనియు, రాజసుండనియుఁ, దామసుండనియుఁ ద్రివిధుండు, బ్రహ్మ
విష్ణు రుద్రాదులును గుణబద్ధులుగారె. విష్ణుండు స్వేచ్ఛచే నవతారంబు లెత్తునని కొందఱందు
రది సత్యంబు కాదు. ౨౪

క. ధరణిని దుస్తరశోకాఁ । కరమగు గర్భంబులోనఁ గడునీచగతిన్
బొరియం గోరెడి వెంగలి । యరయంగాఁ గలఁడె విష్ణుఁ డట్టిడె చెపుమా. ౨౫

ఉ. కావున యోగమాయసుమి కారణ మీజగమెల్ల శోకమో
హావహవృత్తిఁ జిక్కి వివిధాకృతులం భ్రమియింపుచుండు బ్ర
జ్ఞావిధి నెప్డు మాయవిడనాడఁగలం డపుడే విముక్తుడౌ
దేవినిఁ గొల్చికాని తడతేరఁడు మానవుఁ డెన్నిభంగులన్. ౨౬

వ. నావుఁడు నన్నరేంద్రుండు వ్యాసుం గాంచి యో మునికులసార్వభౌమా యోగీశ్వరీ మహాత్మ్యంబు సర్వోత్తమంబంటివి కావున నది సవిస్తరంబుగా వినవలఁతున్ జెప్పవే యన వ్యాసుండు. ౨౭

క. మహినెల్ల నాక్రమించిన । మహిషాసురు నేలుబడిని మరుదసురులకున్
బహువిష్టపభయదంబై । రహి మించెం దొల్లి యొక్క రణ మది వినుమా. ౨౮

## —. మ హి షా సు రో త్ప త్తి .—

మ. మద మొప్పన్ మహిషాసురుండు సని హేమక్ష్మాధ్రశృంగంబునం
బదివేలేండ్లు తపంబుసేసె నతిభీను ప్రక్రియారూఢి శుం
భదదంభాద్భుతకారియయ్యె నది దేవశ్రేణికిన్ బ్రహ్మ దా
మది సంతుష్టి వహించి యందుఁ జని ప్రేమంజూచి పల్కెందగన్. ౨౯

ఉ. ఓ యసురేంద్ర యేటికి మహోగ్రతపం బిటుసేయ వాంఛితం
బేయది తెల్పుమన్న మహిషేద్దనుజుం డమరత్వ మిమ్ము నా
కో యజ నీరజాసన మహోన్నతదివ్యచరిత్ర నావుడున్
గాయజునన్న యిట్లనియెఁ గాసరదైత్యవరేణ్యుతో నృపా. ౩౦

క. పుట్టుట. గల్గినవారికి । గిట్టుట లేకుండు బెట్టు కేవలము జగం
బిట్టులనె యట్టునిట్టును । నెట్టుకొనుం దేవికట్టు నెట్టందరమే. ౩౧

వ. కావున మఱియొండు వరంబెద్దేని వేడుమనిన నతండు మనంబున నాలోచించి యే యాడుది నన్నుం జెనకి పోరి వధింపంగలదు. పురుషుండైనచో నెట్లుండునో యని తలఁచి తనకు భామినివలన మరణంబుగోరిన నజుండు విని యది యట్లగునని చెప్పి యంతర్ధానంబు నొందె. నంత వరప్రభావంబువలన దున్నపోతురక్కసుండు వన్నెమీఱి యెన్న నలవికాని మన్నెదొరతనంబు సేయుచుఁ గన్నుగానక విహరించుచుండె నని చెప్పిన విని జనమేజయుండు. ౩౨

క. ఎవ్వనిపుత్రుడు రక్కసు । డివ్వడువున దున్నరూప మేలా వచ్చెన్
నవ్వల్ వొడమెడి నాకున్ । జివ్వన సెలవిమ్ము మిగుల చిత్రం బనఘా! ౩౩

వ. అనిన వ్యాసుండు. ౩౪

సీ. వినుము మహారాజ దనువుకుమారులు కల రిద్ద రధికవిఖ్యాతిపరులు
రంభ కరంభు లుగ్రప్రతాపులు వారు బిడ్డలులేనట్టి దొడ్డబెదరఁ
దపమాచరించిరి తద్దయు ఘోరులై బహువర్షములు పుణ్య పంచనదపు
జలమునందుఁ గరంభుఁ డెలమి మున్గి జపించె రంభుండు దా మావిమ్రానిక్రింద

గీ. బరగ బంచాగ్నిమధ్య విభ్రాజమానుఁ డగుచు ధ్యానించె నింతలో నమరవిభుడు
వగచి గ్రాహాకృతిం బోయి వడువెఱింగి యా కరంభుఁ జంపిన శోకమంది
రంభు డాత్మభిదాక్రియారంభుఁడగుచు. ౩౫

క. తనశిరము పావకునిలో । నను హోమము సేయబూని నమ్రశిరుండై
పొనరఁ గుడిచేతఁ గత్తిం । గొని డాకయి గేశములను గుదిగూర్చి యిడెన్. ౩౬

ఆ. అట్టులున్న వాని నగ్నిదేవుఁడు సూచి । మూర్ఖ యేటికిట్టి మృతకదనము
చచ్చి యేరి నీవు సాధించఁగల వాత్మ । హత్యకంటెఁ బాప మరయ గలదె. ౩౭

ఆ. ఏల సచ్చెదీవు హితమైన వరమును । గోరు మిపుడ యిత్తుఁ గొదువ యేమి
యని నగ్నిదేవు మనమున ధ్యానించి । జుట్టుపట్టు విడిచి యిట్టు లనియె. ౩౮

ఆ. మూఁడులోకములను ముఖ్యప్రజేతయు । పరబలార్థనైక బాహుబలుఁడు
కామరూపి శౌర్యఘనుఁడైన పుత్రుండు । వలయు నాకు నట్టి వర మొసంగు. ౩౯

వ. అనిన వీతిహోత్రుండు నీ వెట్టిజంతువుతో రమింతు వట్టి పుత్రుండు నీకుం గలుగు నీవు కోరిన గుణంబులు ప్రసాదించితి నిఁక నాత్మహననంబు మాని పొమ్మనిన విని వాఁడు సంతోషించి చని యక్షపరివృతంబును రమణీయంబును నగు స్థానంబుఁగాంచి యచ్చట గామోద్రేకంబున మత్తయై పరిపూర్ణరూపశాలిని యగు మహిషితో సంగమించి యది గర్భవతి యగుట యెఱింగి దానిం దోలుకొని పాతాళంబునకుం బోయి మహిషంబులతో బోషించుచుండ నంత. ౪౦

చ. అసురు డొకండు దాను మహిషాకృతిఁబూని మహామదంబునం
గుసుమశరార్తి జిక్కి యెదఁ గొట్టికొన న్మహిషీవతంసమున్
గసరగ వచ్చినం బెదరి గ్రక్కున బారిన దానివెంబడిన్
గొసవెసపార వేగని యకుంఠత రంభుడు వచ్చి తాకినన్. ౪౧

క. ఎదిరి స్వరక్షార్థంబై । మదమున బొడువంగ వాఁడు మడిసిన గనియం
గద నగ్గొరగేదియ దా మదిఁగుందుచు యక్షవటము మాటున కేగెన్. ౪౨

క. వెనువెంట నసురుఁడుం జనె । వెనుబోఁతై యంత యక్షు నీక్షించి దయన్
బనువడి యసురునితోఁ దా । రనిచేసి వధించి రంత యక్షులు కణకన్. ౪౩

క. ఆ రంభుని దేహము సం । స్కారము చేయంగబూనఁ గని యెను మగ్నిం
జేరి యనుగమ మొనర్చెం । గారుణ్యము గేదెలందుఁ గాంచితి మహహా! ౪౪

ఉ. ఆ చితిమధ్యమం దుదయమయ్యె మహాబలుఁడైన రాక్షసుం
దేచిన శౌర్యసంపదల నెన్నశరీరముతోడ నాతనిన్

రాచసిరిం గ్రహించుటకు రాయలగద్దియ నిల్పి రాతఁడే
మ్రోచెను గాసరాఖ్యుఁడను ముఖ్యసమాఖ్య ధరాతలంబునన్. ౪౫

క. వరదర్పితుఁడై దానవుఁ । డురురాజ్యము సాగరాంత మూర్వీతలమును
బరిపాలించెను బరిపం । థిరహితుఁడై యొక్కగోడుగ తివుర జగమునన్. ౪౬

క. సేనానిక్షురుఁడు ధనర । క్షానిరతుఁడు తామ్రుఁడను నిశాటుఁడు దర్కా
ధీనబిడాలక బాష్కల । భానుభులు త్రినేత్రకాలబంధులు రథికుల్. ౪౭

కం. భూపతులు కరము లిచ్చిరి । బాపలు వశులైరి యజ్ఞభాగప్రదులై
యీపగిది భూమినంతయుఁ । జేపట్టి సురాలయంబుఁ జేకొనునిచ్చన్. ౪౮

ఆ. తురగవైరి పంపె హరిహయు నొద్దికి । ప్రతినిధి నొకని నీవు పటురయమున
నరుగు మిపుడు త్రిదశపురికి నచ్చట నేను । జెప్పినట్టు లింద్రుఁజేరి చెప్పు. ౪౯

క. విడువుము స్వర్గము శీఘ్రము । నడువుము నీ వెచటికేని నాకపురీశా
నుడువుము దాసుఁడ నసురుల । యొడయని కని సేయ వజ్ర మూనుము కేలన్. ౫౦

గీ. నిలు మహల్యనుబట్టిన నీతిశూన్య । యెఱుఁగ మేనకొలంది నీ వెంతవాఁడ
వేచి నాకొమ్ము దగిలిన యురిసి ముక్క । లగుచు వజ్రంబు గిజ్రంబు పగిలి చనదె, ౫౧

వ. అని చెప్పుమని పంపిన సందేశహరుండు స్వర్గంబునకుం బోయి శచీపతి కడ సెప్పిన సక్రోధంబుగా నతండు వాని కిట్లనియె. ౫౨

గీ. ఔర యవ్వఁడు వీఁడు వీఁ డంతవాఁడె । యెఱుఁగమే యెంత మదమెక్కె నెంత గర్వ
శాలి వీనికినిఁ జికిత్స సలుపకున్నఁ గన్నుగానఁడుగా మోటదున్నపోతు. ౫౩

తే. గీ. నీవు దూతవుగావున నిన్ను జంపఁ । బాడిగాదని మానితిఁ బదపడుమిక
గడ్డిదినఁబట్టికొడుక నీ గర్వమడఁతు । పరువసంబేల కొమ్ముల దురదఁ దీర్తు. ౫౪

తే. గీ. ఎక్కడిది గర్వ మిది నీకు నెనుమ రమ్ము । పొగరు దూలింతు చెప్పుము పొమ్మటంచుఁ
బలుక విని దూత యేగి యబ్బలియునకును । వినిచె నోరక్కసులరేఁడ వినుమటంచు. ౫౫

మ. నిను దేవేంద్రుఁడు లెక్కసేఁయడు కడున్ ధీరుంపు వాఁ డాత్మశ
క్తిన బిట్టుంబొగడున్ మదోద్ధతుఁడు బుద్ధిన్ నిన్ వృషప్రాయుఁగాఁ
గనుచున్నాఁ డతఁ డాడినట్టి పలుకుల్ క్రవ్యాదనాథా వినం
గ నసహ్యంబులు నాలుకాడదుగదా నా కిప్పు డెట్లోర్చెదన్. ౫౬

క. ప్రియములు చెప్పఁగవలయును । నయమెఱిఁగినభృత్యుఁ డెపుడు నాధుని మ్రోలన్
బ్రియమని సత్యము చెప్పక । రయమునఁ బోవంగరాదు రాక్షసవర్యా. ౫౭

క. ఇదిసత్యం బిదిప్రియమని । వదరఁగరా దెపుఁడు నరుడు పరుషములు సుఖా
స్పద నీతి యెరుఁగవలయున్ । గద రాక్షసనాథ నన్ను గరుణింపు మిఁకన్. ౫౮

క. నీవార్తఁ దెలుపగానే । యావాసవుఁడనినపలుకు లవి ములుకులు నే
జీవముతో నీ యెదుటికి । నీ విధమున వత్తుననుచు నెఱుఁగను తండ్రీ! ౫౯

క. అబ్బబ్బా ! యేమని నీ । యబ్బకుఁ జెప్పకొనుమంచు నతఁడు కులిశముం
గొబ్బునఁ జేకొని లేచియు । నిబ్బరముగ నేలనొక్కా నిలిచె నిలేశా! ౬౦

క. కంపిల్లితి నేనచ్చట । చెంపల చెంపలనెయుండి చెప్పితిపోరా
చెంపలు వాయించెద నీ । కొంపకు వేవేగ మనుచుఁ గొట్టం గదసెన్. ౬౧

వ. అని దూత చెప్పిన విని యా దున్నరక్కసుండు పండ్లు పటపటం గొరికి కన్నులు గట్టెఱ్ఱఁజేసి మునుగాల నేలద్రువ్వుచు కొమ్ము పెడవాటుజేసి ఘోరంబుగా నాసా కుహరంబులనుండి బుస్సనిలేచుగాలికిం ధూళిగ్రమ్మి గగనంబునిండ తోఁకజాడించి వెన్ను వెంటన తలకంటనెత్తి కొలువుకూటంబు కొలనై నిండ పంచటమ్ము జేసి దానవులగాంచి యిట్లనియె. ౬౨

క. అద్దద్దా వింటిరకా । గద్దించెను నన్ను నూరుకన్నులవాఁ డా
ముద్దుం బడఁగూల్చెద నీ । ప్రొద్దే మీరెల్ల సురల పురికిం బొదుఁడీ. ౬౩

గీ. లంజెమిండడు వీఁడహల్యను సునీతి । విడిచి కూడినవాఁడెకా వీని పొగరు
గడపఁజాలనె యేన యొక్కరుఁడ బోయి । కంటిరే గొర్రె కొండను గదియదాకె. ౬౪

గీ. కానమే వీఁడు విశ్వాసఘాతుకుండు । తపములకు విఘ్నమొనరించు కృపణబుద్ధి
బ్రాహ్మణునియెమ్మదివిడిన పాపకారి । వీనితో సంధిసేయుట వెఱ్ఱిగాదె. ౬౫

గీ. శపథములుపూని నముచి దా సంధిఁజేసి । పడియెఁ గావున నింద్రుతోఁ బలువిధముల
యుద్ధమే మంచిపని మన కుత్సహింపుఁ । డీరు లే లెందు సందేహ మేటికింక. ౬౬

మ. కపటాచార్యుడు దంభపండితుఁడు నిక్కం బారమావల్లభుం
డపరాధాయుతశాలి కాముకుఁడు మాయారూపవిభ్రాజియున్
శపథాకర్త హిరణ్యనేత్రు దునిమెన్ గట్టల్కా దా బందియై
యుపమింపందగు వాని జిత్తులకు నెయ్యోజన్ సృగాలంబుతోన్. ౬౭

గీ. సగముమానిసిరూపంబు సగము సింహ । రూపమును బూని కంబంబులోన బుట్టి
యా హిరణ్యకశిపుఁ బట్టి ద్రోహియగుచుఁ । జంపె నెఱుఁగవె స్నేహంబు చనునె మనకు॥

ఉ. వట్టులుబెట్టుకొన్నఁ బెనుబాసలు జేసిన నమ్మఁబల్కినన్
నెట్టన నర్థమిచ్చినను నేర్పున బాదములంటి మ్రొక్కినన్

బుట్టల కెక్కినన్ మఱియుఁ బూరిని నోటను బెట్టుకున్న నే
పట్టున నమ్మరా దమృతపానమదాంధుల నాకవాసులన్. ౧౯

ఉ. నన్నొకరుం డెదిర్చి కలనం గడతేరునె యీ రెఱుంగరే
వెన్నుఁడనంగ నెంత బలభేదియు బ్రహ్మయు శంకరుండు నా
కు న్నమలం దృణంబు లనుకొందునుగాని మరొండు మాట యే
మున్నది లెండు లెండు పొద రేమిఁక హుమ్మనుఁజాశనావళుల్. ౨౦

తే. గీ. నిప్పు దా జొన్నచొప్పయు నీరపతియు గడ్డి యముడు తవుడు పెద్దగాలి చిట్టు
సూర్యచంద్రులు గుగ్గిళ్ళు చూడ నాకు । నమలివేయనె గడియలో నమరవితతి. ౨౧

క. మగటిమికి నేమి చూతము । మగరూపువహించు జంతుమండలిలోనన్
దెగవ్రేయలే దొకటియున్ । మగువలు మార్కొనుట యుత్తమాటయెసుమ్మా. ౨౨

గీ. అతల వితలాదులందును నద్రులందు । నచ్చటచ్చటఁగల మన యసురవరుల
సమరసన్నాహవశత శీఘ్రముగఁ గదలుఁ । దని వచింపుఁడు లెండు లెం డమరపురికి.

క. నే నొక్కఁడనే చాలుదుఁ । నానిడుగొమ్ములను సకల నాకులఁ జంపం
గానోపుదు నిక్క మ్మటు । లైనను శోభార్థమీరు నరుదేరఁ దగున్. ౨౪

సీ. సురలోకము జయించి చరచర విహరింతు । రమ్యమౌ నందనారామసీమ
మందారతరుపుష్పమాలికల్ ధరియింతు । గంధర్వగానసంగతుల వింపు
కామధేనువుపాలఁ గడుపునిండించెద నప్సరోనటనంబు లలరఁ జూతు
రంభనుమేనకోర్వసులఘృతాచీతి । లోత్తమాభిధల మదోత్కటాఖ్య
విప్రచిత్తప్రమద్వరఁ విదితకేశు । లను మహాసేన నాచుట్టు నెనసికొలువఁ
జేర రావించి మిగుల శృంగారలీల । లనుభవించెద రండు రం డసురులార. ౨౫

తే.గీ. శుక్రుఁ బిల్పించి శుభసిద్ధిసూత్ర మెఱిఁగి । జయవిధు లొనర్పఁజేయుఁడు పరగ ననుచు
బలికి మహిషాసురేంద్రుండు భవనమునకు । నేగె నిచ్చట సురపురి నింద్రుఁ డంత. ౨౬

క. యమవాయుధనదవరుణులఁ । బ్రమదంబునఁ జేరఁజీరి బలభేది రహః
క్రమమెరిఁగి యిట్లుపలికెన్ । విమలమనీషులరు మీరు వింటిరె వింతల్. ౨౭

క. మహి రంభునిపుత్రుండఁట । మహిషుండఁట దైత్యలోకమాన్యతమాయా
మహితుండఁట వరదర్పా । వహమదమత్తుఁడట నాకు వార్తల బంపెన్. ౨౮

సీ. దూత సెప్పినమాటఁ బ్రీతిమై వినుఁడయ్య । లోకపాలకులు పరాకులేక
నాకంబువిడిచి నే నేకానలకునేని । పోయి మనుట మంచిబుద్ధి యనెను
కాదేని తనకాళ్ళకడఁ బడి దాస్యంబు । సేయుచుండుట కిచ్చఁ జెందు మనెను
అట్టులగాకున్న నమరనాయక యుద్ధ । సన్నద్ధుఁడవుగమ్ము సరగ ననెను

తే. గీ. గాని పుణ్యాత్ముఁ డొకవృత్తి కల్పనంబు । జేసెఁ దనసేవలోనుండి చెరుపులేక
బ్రతుకవచ్చును నేనఁట పాడిదప్పి । యదియు లేదన్న నేమి సేయంగఁగలము. ౭౯

క. నీచుఁడు దా నిటు లాడెను । చూచితిరా దున్నపోతు చోద్యంబులు మీ
రా చండాలుని వేగమ । పీచమడఁపకున్న మనకుఁ బేరున్నె యిఁకన్. ౮౦

క. కావున నాలోచింపుం । డేవెరవో దుర్బలుఁడని యెంచకుఁ డీరల్
వావిరి శత్రుచ్ఛేదము । గావింపకయున్న సుఖము గలుగదుజుండీ. ౮౧

తే గీ. పొక్కు కురుపగుఁ గురుపు దాఁ బుండుజేయు । బుండు చీమగు వాతంబు బుట్టు చేటు
కారణంబగుఁ గావునఁ గడఁగి పొక్కు । జాడనే వేరువెల్లంకి జూడవలయు, ౮౨

తే.గీ. పురుషయత్నంబు కర్తవ్య మరయ నెందు । జయా పరాజయములు దైవశక్తిజములు
ఖలునితో । సంధిసేయంగగాదు యుద్ధ । యాన మొనరించుటయె నాకు నభిమతంబు. ౮

సీ. ఇంగితజ్ఞులు నంగహీనులు నిస్పృహుల్ । సత్యవాదులు మహాజవులునైన
చారుల నంపించి వైరిపీకుల బలా । బలము లెఱింగి చొప్పడఁగ దుర్గ
సంగ్రహంబొనరించి సరగ పిమ్మట యుద్ధ । యానము సేయంగ నగునుజుండు
సాహసింపగఁరాదు జయముఁ గోరినవాఁడు । చక్కగా బరికించి జాడఁదెలిసి

తే.గీ. యెరుకగలిగిన వారు వర్తింతు రద్ది । కానఁ జారులఁ బంపి యక్కడి బలాబ
లంబులను జూచి రాక్షసాడంబరముల । రూపుమాపెద నని క్రియారూఢి నతఁడు. ౮౪

ఉ. చారులఁ బంపినం । జని విచారవిశారదులై సురారి సం
చారము తద్భటప్రకరసారబలంబు లెఱిఁగి వచ్చి పా
కారికి నో సురేశ్వర మహాబలుఁ డాతడు వానిసైన్యముల్
భూరిపరాక్రమప్రథితముల్ గణియింపఁ దరంబె నావుడున్. ౮౫

క. అచ్చెరువడి దేవేంద్రుఁడు । చెచ్చెర గురు నధికసేముషీమంతుని భా
స్వచ్చరితుని రావింపక । రచ్చం గద్దె నిడి పలికె రమ్యమృదూక్తిన్. ౮౬

ఉ. మాకుఁ బురోహితుండవు సమస్త మెఱింగినవాఁడ వీవు ని
ర్వ్యాకులబుద్ధిశాలివి మహాత్ముఁడవుం బనిగల్గినప్పు డీ
వేకద దిక్కు మంత్ర మెఱఁగించుట కిప్పుడు దుర్మదోద్ధతుం
డై కడుఁ గాసరాసురుఁడు వ్యాపకుఁడయ్యెను లోకమంతటన్. ౮౭

క. నాకమును జయింతు ననుచు । బోకలుబోయెడిని దూతఁ బుచ్చె నిటకు ని
ర్భీతుఁడగుచు బృందారక । లోకము విడనాడుమంచు లోలత ననఘా. ౮౮

క. అట్టుల విడువకయున్నం । గట్టిడియై వచ్చువాఁడు గదనంబునకున్
బిట్టాముకలిసి మహిషుఁడు । కట్టా నే జేయఁదగిన కార్యము గలదే. ౮౯

క. నా విని గురుఁ డిట్లనియెన్ । దేవాధిప భయములేదు ధృతి వహియింపం
గా వలయుఁ బురుషకారము । గావింతము గెలుపు నోడు కర్మవశములౌ. ౯౦

క. ఉద్యమ మొనరించుటయే । సద్యోగము గెలుపు నోడు జగతిన్ దైవ
ప్రద్యోతితములు నీ వన । వద్యమనస్కుఁడవుగమ్ము వాసవ ధృతితోన్. ౯౧

క. గుడ్డిదగు నెద్దు చేనం । బడ్డయటులగాక బుద్ధిఁ బరికించి సదా
దొడ్డపనిఁ జేయనగుఁ గడు । గడ్డని యెంచంగఁ జనదు ఖచరవరేణ్యా. ౯౨

క. సుఖమగునుగాక యుండును । నిఖిలంబును దైవయుక్తి నెలకొనుచుండుం
బ్రబలమగు బురుషకార వి । ముఖుడై నంగాని యత్నములు జేయఁదగున్. ౯౩

ఆ. కార్యసిద్ధియైనఁ గాకున్న యత్నంబు । సేయ నందు నేమి సేగి గలుగు
పౌరుషంబులేక బరగునే దైవంబు । కాన యత్నమెపుడు గార్య మరయ. ౯౪

క. వరహాల వాన గురిసిన । గరముల చేబట్టకున్నఁ గలుగునె ఫల మె
వ్వరికేనిఁ గానఁ బౌరుష । మరయంగ విధేయమనిరి యార్యులు సుమతీ. ౯౫

గీ. కాన వచ్చిన యర్థంబుఁ గాళ్ళఁ జిమ్మి । చేత నెత్తక యేగిన చెట్ట కేమి
క్షేమ మదిగాన యత్నంబు సేయవలయు । యత్నమే లేకయున్న నిరర్థకంబు. ౯౬

క. జతనముజేసియు దైవము । ప్రతికూలంబాయెనేని బాటెల్లఁ జెడున్
మతిమంతున కపజయమున్ । మతిహీనునకును జయంబు మానక కలుగున్. ౯౭

గీ. మమత దుఃఖంబు నిర్మమత్వము సుఖంబు । సంతసముకంటెను సుఖంబు జగతి గలదె
గాన గెలుపోటములు సరిగా గ్రహింపు । మమరనాయక మనము సౌఖ్యంబు నొందు. ౯౮

క. కానున్నది కాఁగల దది । మానదు నూరేండ్లు తిండిమాని కృశుండై
యేనోములు నోచిన బృ । ధ్వనునకేఁ దమ్మిపూవు బిడ్డకు నేనిన్. ౯౯

క. ధృతిగలవానికి సంతస । మతిశయముగనుండు లోకమందు సురేశా
ధృతిలేనివాఁడు దుఃఖ । ప్రతతిం బడి కుందుచుండు పథ్యమ్మధృతియే. ౧౦౦

క. ప్రారబ్ధము భోగంబున । దీరును నే గుడువననిన దీరునె చెపుమా
శౌరికి శూలికి బ్రహ్మకుఁ । దీరునె యిఁక వారి వీరిఁ దెలుపఁగనేలా. ౧౦౧

క. తరుగుం బుణ్యము సుఖమునఁ । దరుగుం బాపంబు దుఃఖతాపంబులచే
సురవర కావున సుఖమ్ముం । బరికింపఁగరాదు బుద్ధిమంతుడు జగతిన్. ౧౦౨

క. ఆలోచింపుము మదిలో । నీలోనే నీవు తెలియనేర్తువు నీకుం
డోలాయమానమానస । మేలా కథనంబు సేయుమీ సురనాథా ౧౦౩

చ. అన విని యింద్రుఁ డిట్లనియె నార్య రణోద్యమ మేను జేసెదన్
దనుజుని రూపుమాపకయ తక్కిన నవ్వరె నన్ను జూచి నా
ఘనతరవజ్ర మేటికిఁక ఖ్యాతిచెడన్ సురరాజ్యభోగముల్
చను భయవిహ్వలుండనుచుఁ జాటరె నగ్గని సాటివారలున్. ౧౦౪

క. యతుల కెఱుక భూషణమగు । మతి తుష్టియ భూషణంబు మహనీయుండౌ
క్షితిసురునకు శుభకామికిఁ । బ్రతిపక్షచ్ఛేదనోద్యమమె భూషణమౌ. ౧౦౫

క. ఉద్యమవంతుఁడనై మును । తద్యోగమువలనఁగాదె త్వాష్ట్రి బల నము
చ్యాద్యసురులఁ జక్కాడితి । సద్యోవిధినెఱిఁగి యట్ల చంపుదు మహిషున్. ౧౦౬

క. శంభుత్రిక్కియ నీవొకఁడవు । దంభోళి యదొకటి మఱియుఁ దలఁపఁగ నుత్ఫు
ల్లాంభోజనయనుఁ డొక్కఁడ । దంభాశ్రయములుగదయ్య త్రాస మిఁకేలా. ౧౦౭

క. హరుఁడు గలఁడు పైపైనన్ । మరువకుమీ రాక్షసఘ్నమంత్రాక్షరముల్
స్మరియింపుమయ్య యత్నము । జరిగించెద నార్య సెలవొసంగు మనంగన్. ౧౦౮

ఆ. గురుఁ డొకింత నవ్వి సురవరా నామత । మెఱుఁగనట్టు లడుగనేల నీవు
మంచిదనుచు హెచ్చరించను గాదని । యడ్డుపెట్ట నెంచునైన వినుము. ౧౦౯

క. సందేహము గలయప్పుడు । పొందుగ నిటునటును జెప్పఁ బూనకయున్నం
గ్రిందుపడవు గౌరవములు । బృందారకవర్య నీవ యెఱుఁగుదుగాదే. ౧౧౦

ఆ. భావి యెఱిఁగి సెప్ప బ్రహ్మతరముగాదు । తెలియుఁ దెలియకుండు దేవనాథ
తెలిసిఁ జెప్పలేము తెలియక మానలే । మెద్ది యెట్టు లట్టు లద్ది జరుగు. ౧౧౧

క. కానున్నది కాకుండునె । కాని ప్రయత్నంబుసేయఁగాఁ దుద కెట్లే
పూని జయము గనవచ్చున్ । మానదు దైవంబు వేయిమాట లిఁకేలా. ౧౧౨

గీ. అయ్యయో యింద్ర యెఱుఁగనా యాలుముద్ద । రాలు రేదిమ్మరీడు మోహమున ముంచి
యెత్తికొనిపోయి కూడినయెడల నెంత । జరిగెనో కానఁ జెప్పంగజాల నమ్మ. ౧౧౩

క. ఇదమిద్ధమనుచు ఫలమున్ । మది నెఱిఁగిన నెఱుఁగకున్న మానఁగరా దొ
ప్పిదమెఱిఁగి యుపాయంబుల్ । సెదరక గావింప నేఘిసేగి ఘటించున్. ౧౧౪

వ. అనిన విని దేవనాథుండు పితామహునికడకుం జని నమస్కరించి లోకేశా! మహిషుండను రక్కసుండు మహోమదుండై స్వర్గంబుఁ దనయధీనంబు చేసికొన నిచ్చయించి దైత్యసైన్యంబులంగలసి నాకంబుమీదికి దండెత్తి రాఁదలంచియున్నవాఁడు నాపని పిల్లింజూచిన యెలుకచందంబుగా నున్నయది. ఏమిచేయుదునని దైన్యంపడినం జూచి పరమేష్ఠి యోయి త్రిదశవరేణ్యా! శంకరుపాలికిం బోయి యతని నడుగుదము రమ్మని కొంపోయి కైలా

సంబున శంకరుంగాంచి విన్నవించిన నతండు సెప్పిన చొప్పున నతనిం బురస్కరించు
కొని యెల్లరు రమాపతి పోలికిం బనివిని మదోద్ధతుండైన మహిషువిధంబు సెప్పిన విని
దనుజమర్దనుండు వారల కిట్లనియె. ౧౧౫

చ. భయఁపడనేల బ్రహ్మ! శివ! పాకవిభేది! పదుండు వేగ దు
ర్నయుఁడు బలాయరాక్షసుఁడు నా విని యెల్లరు స్వస్వకేతనో
చ్చయములు, స్వస్వచిహ్నములు, స్వస్వబలంబులు, స్వస్వవేషముల్
రయమునఁ గొంచు నేగిరి సురల్ మహిషాసుర దండయాత్రకున్. ౧౧౬

## —• దేవదానవ యుద్ధము •—

ఆ. అంచనెక్కె బ్రహ్మ యా గరుటామంతు । నెక్కె విష్ణుఁ డెద్దు నెక్కె శివుడు
వేల్పు లొక్కప్రక్క వెల్వలు గదలంగ । సోకుమూకదండు దాకె నెదుర. ౧౧౭

స్రగ్ధర. శూలప్రాసోరుఖడ్గస్ఫురితశరధనుశ్శోభికుంతోరుచక్ర
స్థూలోద్యద్భిండివాలాద్భుతపరశుగదాతోమరప్రోజ్జ్వలత్కా
ద్దాలోద్యచ్ఛక్తిఘోరోన్నమితహలమహోదారకౌక్షేయకోగ్రా
భీలాహిప్రేక్ష్యపాశామితముసలములన్ బేర్మి దీపించి రాజిన్. ౧౧౮

వ. అప్పుడు తుములసమరంబు పరమఘోరంబై యుండె నంత. ౧౧౯

క సేనాని మహాఘోరత । నేనుఁగుపై నెక్కి వచ్చి యేను ములుకులన్
దా నింద్రునిపై నేయఁగఁ । బూని యతం డర్ధచంద్రమున నేసె నృపా. ౧౨౦

క. అది యెదపైఁ దగిలిన వాఁ । డదరిపడియె మూర్ఛనొంది హస్తిపయిం గొం
కాదవక వజ్రముతో న । మ్మదగజముం బొడిచె నదియు మ్రగ్గె నృపాలా. ౧౨౧

వ. అది గని మహిషాసురుండు బిడాలుం జూచి. ౧౨౨

ఆ. మదముమీఱి పాకమర్దనుం డటుసేయ । నురకవేల పిల్లి పిరికివైతె
వరుణముఖులఁబట్టి వధియించితిని జూడు । మనిన గజమునెక్కి యతఁడు వేగ. ౧౨౩

క. వాసవుపై నిసితాస్త్రము । నేసిన నాతండు కనలి యేసె శరంబుల్
భాసురసర్పసమంబుల । నేసె నతఁడు మరల విశిఖబృందంబు లొగిన్. ౧౨౪

క. అతఁడేయఁగ నితఁడును మఱి । యితఁడేయఁగ నతఁడు నిట్టు లేసికొనినఁ బో
రతిఘోరమయ్యె నంతట । శతమఖుఁడు గజంబునేసెఁ జయ్యన గదతోన్. ౧౨౫

క. ఏసినదెబ్బకు నేనుఁగు । గాసింబడి యీల్గె నంతఁ గదునదలుచు రా
కాసులు చిందరవందర । లై సాగిరి కాలికొలఁది నటు నిటు గములై. ౧౨౬

గీ. హత్తి యీల్గుటఁజూచి య య్యసురుఁ దరద । మెక్కి వచ్చినఁ గనుఁగొని యింద్రుఁ
దలుక బాణవర్షంబుఁ గురియింప బట్టువిడువ । కసురుఁ దతివృష్టి గురియించె నాశుగముల.

క. ఎంతకును దనకు లోఁగక । యంతంబునఁ బోరు నసురుబాహుబలము దా
జింతించి తనకొమరుని జ। యంతుం బ్రేరేప నాతఁ డసురవరునిపై. ౧౨౮

గీ. ఆ జయంతుడు దివ్యఘోరాస్త్రసమితి । నేయ మూర్ఛిల్లిన బిడాలుఁ డేగె సూతుఁ దరద
మును దోలుకొని యంత నమర సేన । లందు జయజయశబ్దంబు లాశ లంటె. ౧౨౯

క. పాడిరి గంధర్వులగము । లాడిరి యచ్చరలు స్తవము లాడిరి సిద్ధుల్
కూడిరి దేవతలు భయము । వీడిరి మహిషునకుఁ జిత్తవేదన బొడమెన్. ౧౩౦

క. మహిషుఁడు తామ్రము నసురధూ । ర్వహుఁ బంపిన వాఁడు బాణవర్షము గురియన్
సహియింపక వరుణుఁడు దాఁ । దహతహఁ బాశంబు, యముడు దండము బూనెన్. ౧౩౧

వ. అప్పుడు దేవదానవుల కతిఘోరంబైన పోరు వాటిల్లి నానావిధాయుధపరంపరలం బొడిచి కొనుచు దేహంబు లెఱుఁగక క్రోధోద్రేకమానసులై కొట్టుకొనుచుండ యముండు తన యుద్దండదండాయుధంబుతోఁ దామ్రము నేసిన వాఁడు గదలక సితశిలీముఖజాలంబుల నేయ దేవత లుక్కుమీఱి పెక్కుశరంబుల రక్కసున్ ముంచిన దైత్యుండు మూర్ఛాగతుండై పడుట సూచి దైత్యసైన్యంబులు భయాతురంబులై హాహాకారంబులు సేసె నంత. ౧౩౨

క. తామ్రుఁడు మూర్ఛితుఁడై నన్ । హుమ్మానముమీర మహిషుఁ డుద్యద్ధ్రిక్ష
స్సామ్రాజ్యుఁడ ననుఁ గనుఁడని । క్రమగజారూఢుఁడగుచు గదఁ గొని వేగన్. ౧౩౩

ఉ. నేరుపుమీఱఁ గొమ్ములను నెట్టి గదాహతి గొట్టు తోకతో
వారకఁజుట్టి పాదములఁబట్టి యిటట్టును మట్టిమట్టి బృం
దారక సైన్యసంతతుల దర్పము గిర్ప మడంచకున్న నా
పేరు లులాయుఁడే త్రిదశభీకరరంభుఁడు ధీవిజృంభుఁడే. ౧౩౪

వ. అని విజృంభించి బృందారకబృందంబులపైఁ బడి యైరావతంబుపైనున్న యింద్రు మాఱ్కొని బాహుమూలంబున నొకదెబ్బవైచినం గనలి దేవాధీశుండు కులిశంబు నం గద బ్రద్దలుసేయ హయారి వాలుం బలుకయుం బూని యింద్రు నేసిన నతండునుం గ్రోధావిష్టుండై యతిఘోరంబైన నారాచంబుల నేయ నతండు వివిధాయుధపరంపరలం బొడిచె. నిట్లత్యంతవిస్మయకారణంబగు రణంబున నొండొరు మచ్చరంబులు విడక పోరు చుండి రయ్యవసరంబున. ౧౩౫

గీ. మోహినీ మాయ శాంబరీ ముఖ్యమూల । సకలలోకైక మోహన ప్రకటశక్తిఁ
జూపె రక్కసుఁ డవ్వేళఁ జోద్యమయ్యెఁ । గొండలంబోలు దున్నలు కోటి పుట్టె, ౧౩౬

## —• దేవతలు పలాయనులగుట •—

గీ. దైత్యనిర్మితమాయ నాదిత్యవిభుఁడు । చూచి కడు భీతుఁడై యేమిచోద్యమనుచు గడ
గడ వడంకెఁ దల్లడం పడియె బ్రాను । పడి నిలిచెఁ గ్రింద సతికిలఁబడియె వగచెఁ,

ఆ. వల్లెతాఁడు దూల వలువ యూఁడగ సవ । రించుకొనుచు మిణ్ణి పొంచి వెనుక
దిక్కు సూచుకొనుచు నెక్కడికింబోవ దక్కు । బ్రాణమంచుఁ దారెఁబాశి. ౧౩౮

ఆ. ఇంటియొద్ద సంచు లేమాయెనో బ్రతు । కేవ నింక మన్న లిన్ని వచ్చి
చుట్టుముట్టెఁ దూరఁ జోటేది నాకంచుఁ । బిరికితనముతోఁ గుబేరుఁ డడలె ౧౩౯

ఆ. చేతి దండ మేమి చేయు నీపట్టున । నెక్కినట్టి దున్న నెచట దోల
కాఱుదున్నలిన్ని కవలెల్ల గ్రమ్మెను । దాటఁగలనె యంచు ధర్ముఁ డేడ్చె. ౧౪౦

ఆ. కలమతోకదున్న కడిచుక్కదున్నాయెఁ । బల్లదున్న దాని బ్రక్కనుండె
కోరదున్న దీని కోరలెంతలటంచు । వెనుకఁబట్టి చనెఁ గృపీటయోని. ౧౪౧

ఆ. నాకుఁ గరసహస్ర మేకార్య మొనరించుఁ । గొమ్ము లొక్కరెండు కోట్లు గల్గి
కోటి దున్నలాయెఁ గొడుకేడనో యంచు । నర్కుఁ డేగి దాగె సప్తగిరిని. ౧౪౨

ఆ. మహిషకోటిపుచ్ఛభవవాయువునకు నే । దూలితూలి నిలువఁజాలకుంటి-
నంచు నిక్కినిక్కి యటునిటు వగ నేగెఁ । దొగలఱేఁడు గోచి దోపికొనుచు. ౧౪౩

వ. ఇట్లుండి. ౧౪౪

క. రావోయి బ్రహ్మదేవుఁడ । రావోయీ శంకరుండ రావోయి హరీ
వేవేగము భీతుల మముఁ । గావ నసుచు మొరలువెట్టఁగా విని యంతన్. ౧౪౫

సీ. బ్రహ్మయు శంభుండు పద్మనాభుండును । హంసోక్షతార్క్ష్యవాహనములెక్కి
దండశూలాద్యాయుధములను ధరియించి । యాజిలో నిలచిరి యందు శౌరి
మోహిని నీక్షించి ముదమొప్పఁ దన సుద । ర్శనమున నేయఁగా దర్ప మవఁగి
మాయ మాయంబై లులాయ హీనంబాయె । నది సూచి మహిషనరాశనుండు

గీ. నుగ్రవీర్యుండు సేనాని యుగ్రముఖుఁడు । నంధకుం డసిలోమాఖ్యుఁ డా త్రినేత్ర
బాష్కలులు గృద్దుపనువాఁడు మఱియునింకఁ । బేరుగల రాక్షసులు దేవప్రతన జుట్టి

క. దూడలను పమలఁబోయెడి । తోడేళ్ళనుబోలె సురలఁ దొడిబడ గండల్
గావఁగఁబట్టిన వారలు । తోడన వదిలించుకొని పొగుల్ దడవి కడున్. ౧౪౬

క. పడిపడిఁ బెనుదూఁపుంజడి । నడగింప బడుసు లేచు చసురులు సుకలున్
ఐడిబడి చెడిగుడి లాడిన । వడుఁవున గొట్టుకొని రొక్కవరుస మహిశా. ౧౪౭

వ. మఱియు నారాయణుం డంధకాసురు నైదుబాణంబుల నొంచిన నంధకుం డైదు బాణంబులతనిపై నేసె నవి తప్పించుకొని గోవిందుం డుగ్రశరపరంపరల నసురుల బొదవిన వారిరువురకుం బదియే నహోరాత్రంబులు చిత్రతరంబుగా నాయోధనంబు వాటిల్లె. ఇట్లుండ నింద్ర బాష్కలులకును, మహిషాసుర రుద్రులకును, యమ త్రినేత్రులకును, మహాహను ధనేశ్వరులకును, అసిలోమ వరుణులకును, బరస్పర సంగ్రామంబులు ఘోరంబులయ్యె. నప్పు డంధకుండు దన గదచే గరుడు నేయ నతం డొక్కింత నొచ్చుట యెఱింగి తన దక్షిణహస్తంబునఁ దట్టి సేదఁ దీర్చి శార్ఙ్గంబునుం బూని బాణంబు లేయ హరిం జూచి కోపించి దానవుండు నిసితాస్త్రంబుల నేయి దన చక్రంబువలన వానిం దప్పించుకొని నిలువంబడియున్న నసురుండు మోహినీమాయం బ్రయోగించుటయు హరిచక్రంబు విఫలంబగుటయుం జూచి సురసైన్యంబులు సదైన్యంబులై చింతిల్లె. దానవు లత్యంత సంతోషంబునం దేచ్చి యార్చి రప్పు డచ్యుతుండు కౌమోదకిం బూని యంధకు వెంటనంటి వానిం బట్టి యొకవ్రేటున నేలం గూల్చి మూర్ఛిల్లం జేసినం జూచి వాహవైరి యతికోపారుణితలోచనుండై హరిం గడిసినం జూచి శార్ఙ్గంబునట్టి నిసితాస్త్రప్రయోగంబు సేయఁ దనశరంబున నవి యాపికొని గదాయుధంబుచే వానిమస్తకంబు నేసిన వాఁడును మూర్ఛితుండై పడియె. నత్తరి దైత్యసైన్యంబుల హాహాకారములు మెండై యుండ ముహూర్తమాత్రంబున నొడలుదెలిసి రక్కసుండు జనార్దను దన పరిఘం గొట్టిన నతం డొక్కింత మూర్ఛిల్లం జూచి గరుడుండు రణాంగణంబుననుండి వెలువడె నంత నారాయణు మూర్ఛావశగతుం జూచి దేవతలు చెల్లాచెదరై చనుచుండం జూచి శంకరుండు సేనల మరల్చి మహిషుపై కురికి రోషారుణితనయనుండై శూలంబు వైచినం దానిం దప్పించుకొని దైత్యుండు గర్జిల్లె. నింతలో దనుజాంతకుఁడు దుంతరక్కసు నెదిరినం జూచి మహిషుఁడు రోషంబినుమడింపఁ దోకయాడింపుచు ముక్కోళ్ళంజీరుచుఁ గొమ్ముల నేలఁ గీయుచుఁ గొమ్ములం బర్వతశృంగంబులు గొట్టికొని వచ్చుచున్నం జూచి నారాయణశంకరులిరువురు నొక్కమొగి బెక్కుశరంబులం బొదివినం శృంగంబులొగ్గి పర్వతంబు పుచ్ఛంబునం జుట్టి వడిసెలరాయిపలె గిరగిరఁ ద్రిప్పి వైచినం దమమీదికి వచ్చు నద్రిం జూచి హరి చక్రప్రయోగంబు సేయఁ బర్వతంబు తుత్తుమురై కూలె మహిషాసురుండు. పెనుమూర్ఛం జిక్కి పడియు వెంటనే లేచి మానుషరూపంబుఁ దాల్చి గదాపాణియై పర్వత ప్రమాణోన్నతుండై ఘోరుండై మేఘనాదంబు సేయుచు వేల్పుల దద్దరిల్లంజేసిన విని విష్ణుండు తనపాంచజన్యంబుఁ బూరింపఁ జెవులు గింగురులువోయి దానవులు భయకంపితులైరి. దేవతలును, ఋషులునుం బరమానందంబు నొంది రంత నసురులం జూచి మహిషాసురుండు విషణ్ణమనస్కుండై మహిష మానుషాకారంబులు విడిచి సింహరూపంబు వహించి ఘోరనినాదంబు సేసి సటలు జాడించి సుర సేనలపై నురికె నంత. ౧౪౯

సీ. గరుదంచదురుమరుద్గతపటాపటపటా । పటితాపతితపాదవ్రజంబు
శరదభ్రసమశుభ్రతఃవక్త్రచంచూర్ధ్వ । తేరణత్కేంకారదారుణంబు

శరసితస్ఫురదరోచ్చరదశిప్రరుచిమ । న్నఖముఖవ్యాలీఢనక్షమంబు
చరమభూధరగభాస్వరవిభాసురతనూ । పరినిషణ్ణసుశార్ఙ్గన్ పాణికంబు
నటదపక్షేపణోత్క్షేపణక్రియాప్ర । సారణాకుంచనగమాగమైకరోష
భీషణంబు సుధాంధః ప్రతోషణాను । పోషణంబగు తార్క్ష్యవిభూషణంబు. ౧౫౦

ఉ. రివ్వున నుప్పరం బెగసి క్రిందికి క్రిందికి మోర యోరగాఁ
జివ్వున డిగ్గి మట్టమయి చేరువ చేరువ డాసి ప్రక్కలం
గవ్వపుగుత్తిలీల సుడికట్టుచుఁ గట్టుచుఁ జూచి చూచి దా
దవ్వులనుండి వచ్చి యొక దాటునఁ దాకెను సోకుమూకలన్. ౧౫౧

ఉ. తాకిన తాకునంబడి వితాకునఁ బళ్ళికిలించి రక్కసుల్
మూకలుమూకలై పరవ ముట్టి నఖక్రకచాళి గీరినన్
వాకలుగట్టి నెత్తురులు బాఱ గుయోమొఱో యంచు వేదనన్
గేకలువెట్ట నాత్మఁ బరికించి వడిం దనుజేంద్రుఁ డుగ్రుడై. ౧౫౨

సీ. బ్రహ్మాండభాండకర్పరము బీటికలెత్త దారుణోదగ్రనాదంబుసేసి
విజయానిలాభీలవిహృతి నద్రులబెల్లఁ । గిల సటారించోళి దుళిపి విసరి
చండభానుప్రభామండలాచ్ఛాదకాత్యుచ్చైర్గతంబుగాఁ దోకయెత్తి
భయదమంథానసర్వంసహాధరగుహ । ఘోరంబుగాఁ బెద్దనోరుఁ దెఱచి
బొబ్బరిల్లుచు గబ్బులా గుబ్బుకొనఁగ మేను సారించి కోరల మీటికొనుచు
నొక్కదూకున సింగంపురక్కసుండు సీదుచును సురలసేనలమీది కుఱికె. ౧౫౩

ఉ. ఉరికి జవంబునం గరుడు నుగ్రనఖాహతి రక్తవిప్లుతిం
బఱచి మురారిపైఁ గవిసి బాహువు గాడఁగఁ గోఱ నొక్కినన్
దఱి యిటులాయెనంచును సుదర్శనముం గొనఁబోవునంతలో
గఱచె మఱొక్కసారి యది గాంచి హృషీకవిభుండు చెచ్చెరన్. ౧౫౪

ఉ. అచ్చెరువయ్యె వీని బల మౌర వరంబునఁగాకయున్న నీ
చిచ్చులమారిరక్కసుని జెందునె యిట్టి ప్రభావసిద్ధి క
మ్మచ్చున దీయమే యితని నంబకృపారస మింతగల్గినన్
గ్రచ్చులు మానడిప్పు తరిగాదని యేగెను క్షీరవార్ధికిన్. ౧౫౫

క. హరి తనయింటికి నేగన్ । హరుఁడును దనయింటి కరిగె హరిహయు లేగన్
బరమేష్టియు మనకేమని । బిరబిరఁ దనయింటి కేగె భీతాశయుఁడై. ౧౫౬

సీ. అంతట వజ్రంబు హస్తంబునంబట్టి । యమరలోకాధీశుఁ డాజి నిల్చె
వరుణుండు శక్తి చేపట్టి యెదిర్చెను । జముఁడు దండముఁ బూని జతనపడియె
ధనదుండు కుంతంబుఁ దాల్చి మార్కొనియెను । జ్వలనుండు జ్వాలికోజ్జ్వలత జూపె

చండభానుండు ప్రచండతఁ దనరారె । ప్రాలేయకిరణుండు పట్టుబట్టె
దనుజవరవాహినులపై నుదగ్రగజాగ్ర । దుగ్రనారాచముల సపక్షోరగాతి
ఘోరముల వైవ దానవ వీరవరులు । హస్తకార్తెను బలె నల్పి రంపవాన. ౧౫౬

చ. సురలును దానవుల్కనుక సొప్పడఁ బోరిరి నూరు వర్షముల్
పోరిపోరి ఘోరఘోరముగ పూని గణింపఁగ నెవ్వఁడోఁపు మ
చ్చరముల కొండొరుం గవిసి సచ్చినయట్టుల మూర్ఛబోవుచుఁ
బొరలుచు లేచుచున్ రుధిర పూరము లేళ్ళయి వార్ధి నింపఁగన్. ౧౫౭

ఆ. పోరి పోరి తుదకుఁ బోరిలో నింద్రుండు । నిలువలేక పారె నింగి కదియు
నూచి పారి రెల్ల సురలును లోకపా । లకులు బ్రతుకుదేవుఁడా యటంచు. ౧౫౮

క. జయభేరిని మ్రోయించిరి । జయజయజయజయ యటంచు సంతోషమునన్
జయవార్తలు జగమెల్లను రయమునఁ జాటింపఁ జేసి రాక్షసుఁ డెలమిన్. ౧౬౦

సీ. సూరేంద్ర బవరాన నోటిప్రాచి దొలంగఁ । గామధేనువుపాలు గాచి త్రాగె
కదనరంగమునను గాళ్ళనొప్పులు దీరఁ । గడగి యైరావత గజము నెక్కె
ఆయోధనస్వేద మారంగ నారంగ । వందనారామంబునందుఁ దిరిగె
భయదాహవనినాద భగ్నశ్రుతుల గింగ్రు । బాయ నచ్చరపిండు పాట వినియె

గీ. కలనఁ జెరలాడఁ బొరలాడఁ గ్రమ్ము దుమ్ము । బోవ మందాకినీజలంబుల మునింగి
దున్నయై దురపుచెల్కల దున్నిదున్ని । యెక్కె దేవేంద్రుగద్దియ రక్కసుండు ౧౬౧

వ. ఇట్లింద్రపదంబునం ద్రిలోకసామ్రాజ్యపట్టంబుఁ గట్టుకొని మహిషాసురుండు మహా మహిమంబున రాక్షసరాజ్యరక్షణంబు సేయం గాంచి యింద్రుండు సురలతో బహు వర్షంబులు గిరిగహ్వరంబునం దాగి విసికి మరీచ్యాది మునిగణంబులతోడను, సిద్ధ గంధర్వ చారణ కిన్నర కింపురుష పన్నగప్రముఖ దేవయోనులతోడను గలసి చని పితామహు వేడిన నతండు, త్రిదివులారా! నే జేయునది యేమున్నది? అతండు వరబలంబునం బ్రబలియున్నవాఁడని చెప్పి హంసారూఢుండై వారలం దోడ్కొని శంకరునియొద్దకుం జని యతని బురస్కరించుకొని యెల్లఱు నారాయణునికడకుం బోవు సమయంబున. ౧౬౨

సీ. కలకలనవ్వుచుఁ గన్యక యెదురాయెఁ । బడమటిదిక్కున బల్లి పల్కెఁ
గుడినుండి యెడమకుఁ గొంకనక్క చరించె । పీలుగాదీర్చెను బాలపిట్ట
వెనువెన్కఁ జల్లఁగా విసరెఁ గమ్మనిగాలి । సరసంబుగాఁగూసె గరుడపక్షి
తొడిబడ నొకరెండు తుమ్ములు దుమ్మిరి । పూర్ణకుంభద్వయము గనుపట్టె
గోవెలయుగూఁసె జయఘంట గొట్టి రాత్మ । లందును గలంకములులేక యలరునట్లు
దోచెఁ దూర్పునఁ గ్రమ్మెను ధూళి యహహ । శకునములు మంచివాయె నాసమయమందు.

గీ. గురుఁడు పంచాంగమును జూచి సురల కనియె । శుక్రు దేఁశావశంబున సూర్యకుజులు
మూఁట నారింట శనియును మొనయువారు । లగ్నము శుభంబు పంచకరహితమనుచు.

క. ఈగతి శకునగ్రహములు । బాగని యెంచుకొని సురలు పటురయమున దా
రేగిరి వైకుంఠపురీ । భాగంబుల కమితసౌఖ్య భవ్యంబులకున్. ౧౬౫

సీ. తావిగల్గిన పైఁడితామర ల్గలవెందు । కురువిందములమెట్ల కొలఁకులెందు
క్రొమ్మిగడయసళ్ళు గ్రమ్ము కాలువలెందు । నాగమార్గముదెల్పు హంసలెందు
నెసగంపు బంచదారిసుకతిన్నియలెందు । పానకంబుల నూయి బావులెందు
నద్వైతబోధల నమరుచక్రములెందు । గలితపీయూష పల్వలములెందు
చారుగారుత్మతప్రభా చకచక ప్ర । చారశాద్వలములపట్ల జగ్గులెందు
బంధురానందపూరసర్వస్వ మెందు । నట్టివైకుంఠపురి సూచి రమరు లపుడు. ౧౬౬

సీ. మగరాలజిగిఁగ్రాల తగుపంజరాలఁబ్రా । బలుకుబల్కెడి ముద్దుచిలుకలెందు
పగడాలనిగరాల చిగురుమేయుచు సోమ । మొదవించు కోయెల కొదమలెందు
హరినీలరుచిదేల పురిఁప్రీలనిడిషడ్జ । విమలమంద్రముబాడు నెమళులెందు
నునుగెంపుపనిసొంపు తెరనింపుగనుశాస్త్రు । శంకదీర్చెటి గోరువంకలెందు
గీ. హార్యవార్యఛటాఛటా ధుర్యచిత్రచిత్ర వైడూర్యవలభికాస్థితుల యోగ
తత్త్వమెఱిఁగించు పారావతమ్ములెందు । నట్టి వైకుంఠపురి సూచి రమరు లపుడు. ౧౬౭

సీ. కలకండజాకుదు శ్శాలమికో బన్నీటఁ । దడిసి పెంపగు రసదాళియనఁటిఁ
మంచిగంధపునీరు ముంచియత్తరుఁగ్రోవిఁ । గుంచాలఁజల్లింప మించుమల్లె
చెఱకువాసాలమంపిఁజుల ముత్తెపుఁజేర్ల । పందిళ్ళలో ద్రాక్ష పండ్లగుత్తి
పాలమీగడ మెత్తి పానకంబులు పోసి । మణిపాత్రమునఁ బెంచు మామిడంటు
గవిలె పిండియు బచ్చాకు కమ్మపునుగు । కస్తురియుఁ గప్రమెఱవులు గట్టి కల్ప
శాఖినీడను బెరుగు గోజ్జంగికుదురు । గలుగు వైకుంఠ సుమరులు గాంచి రపుడు. ౧౬౮

సీ. తతమధువ్రతరవ శ్రుతిలీన గతి గాన । రసమీలపులుగు లీరాలనెరప
రకరకాలను దకత్తకదికుందక యంచు విరిజాజిజొంపాల భరతలాడ
ముద్దయిన యొద్దికల్ దిద్ది దిద్దిమ్మంచు । రొదగుప్వ మద్దెల లొప్పదలదీర్ప
సమము విషమ మతీతమునాగతము మా । గ్గమెఱింగి పికిలి తాళములుగొట్ట
గీ. ముద్దుచిల్కలు వాయించు మోరచుంగు । గూడి కోయెల పిల్లనగ్రోవి బాడ
సొంపుపెంపున మదినింపు నింపుమీఱ । వినిరి వైకుంఠపురమున విబుధు లపుడు. ౧౬౯

చ. అచట సునంది నందన సమాఖ్యులు పార్షదు లంబుజాక్షది
వ్యచరణభక్తులుం గల రనంతముఖుల్ భటులక్షముల్ ప్రభా
నిచయదిగంతవిస్తృతవినిర్మలమూర్తులు నిత్యదైత్యభి
త్ప్రిచరయశస్తుతిక్షములు పాపనిరాసమహస్సమున్నతుల్. ౧౭౦

సీ. ప్రాసాదమండల ప్రాసాదిత విచిత్ర । చిత్రాసనమూల వైచిత్రి జూచి
పద్మరాగోల్లస త్పద్మరాగాంచిత । సద్మవేదీదీర్ఘసరణి జూచి
కాంచనాచల నిభా కాంచనాచలగోపు । రోపరిస్థశిఖామహోన్నతిఁగని
హరిపదాలేఖాంక హరిపదాలేఖనా । ద్భుతకేతనోచ్ఛ్రయ స్ఫూర్తి నరసి
గీ. క్రమమ్మృగనాభిపంకసంకలితకలిత । సరస పన్నీరవాసనా భరితమహిత
వితతఘంటాపథంబుల విధము దెలసి । సురలు వైకుంఠపురమున దిరిగి రపుడు. ౧౨౧

సీ. పావన ఋగ్వేదపాఠంబు లొక్కచో । నొకచో యజుశ్శ్రుతాభ్యుక్తి మెచ్చి
మహితసామబ్రహ్మ మంత్రంబులొక్కచో । నొకచో నథర్వసద్యోగమరసి
ఈశాద్యుపనిషన్మహితగాథ లొక్కచో । నొకచో షడంగవాచకములెంచి
సాంఖ్యయోగాది దర్శనపఙ్క్తి యొక్కచో । నొకచో మనుప్రముఖోక్తు లెఱిఁగి
లలితగోవిందకీర్తనంబు లొకచోట । సరసమధువైరిమంత్రప్రచార మొకట
దివ్యనారాయణార్చనాధిక్యమొకట । బొగడి రమరులు వైకుంఠపురమునందు. ౧౨౨

క. ఈవిధమున నారాయణ । దేవుని మందిరము జేరి త్రిదశులు నిలువం
గా విజయుఁడు గని జయు నట । కావలిగా నుంచి హరి సకాశమున కొగెన్. ౧౨౩

వ. చని వాసుదేవుని దివ్యచరణారవిందంబుల కెఱగి భక్తివినయంబులు బెనంగొన
నిట్లనియె. ౧౨౪

ఆ. అజుఁడు రుద్రుఁ డింద్రుఁ డప్పతి యనలుండు । ననిలుఁడును యముండు నరుగుదెంచి దేవ
దేవ నిన్ను సేవింప నిలచిరి । ద్వారసీమ సెలవు గోరికొనుచు. ౧౨౫

క. అనపుడు దయామయుండగు । వనజాక్షుఁడు వెడలివచ్చి ద్వారంబున ని
ల్చిన విబుధుల శ్రమకర్శితు । లను జూచి మృదుప్రియోక్తులం దనియింపన్. ౧౨౬

క. కని దేవతలందఱు న । య్యనఘునకు నమస్కరించి యతిభక్తి స్తుతిం
బొనరించిరి శ్రుతిహితముగఁ । దనువులు పులకింప గార్య తత్పరు లగుచున్. ౧౨౭

గీ. దేవదేవ జగన్నాథ దివ్యరూప । జగదధీశ్వర కారుణ్యజలధి వరద
రక్షరక్ష మహారాజ రాజవదన । పరమకారుణ్యసదన నః పాహి యనుచు. ౧౨౮

క. అది విని మధురిపుఁ డేటికి । మదిగుందెద రిందఱును సమావిష్టులరై
విదితంబుసేయుఁ డిప్పుడు । త్రిదశేశ్వరులార నాకుఁ దెలియ నటన్నన్. ౧౨౯

క. వరబలమున మహిషాసుర । వరుఁడు మముం గానలకును బంపు టెఱుఁగవే
దొరకుట లే దొకమెతుకున్ । సురలకు యజ్ఞములలోన శుభమూర్తి హరీ. ౧౩౦

క. మగవానివలనఁ జావడు । మగువ యొవతె సాహసించు మనుజాశనునిం
దెగనేయఁగల నటంచున్ । నగధర కరుణింపకుంట న్యాయమె నీకున్. ౧౩౧

సీ. చంద్రశేఖరుభార్య శాంకరి యున్నది । వరుసవామాంగంబు వదలకుండు
బ్రహ్మదేవునిభార్య భారతి యున్నది । విభుతలవాకిలి విడువకుండు
పాకారిపేర్లాము పౌలోమి యున్నది । రమణు గాచుకయుండు రాత్రిపవలు
అంతకాదులయాండ్రు శ్యామాదు లున్నారు । వారి కెక్కడిదయ్య యూరు పేరు
పేరుగలదౌను దేవరవారిరాణి । నగలసొగసుల మొహరీలు నాణెములను
బాగుగ నెఱుంగు మీరొమ్ము బాయదెన్న । దేరు మహిషాసురునితోడఁ బోరఁగలరు. ౧౮౨

క. రోసాలు పొడుగు కొంపల । వాసా లెగిరింత్రు రిత్తవదరుటలోనన్
మీసాలు ద్రువ్వఁదురు మగ । వేసా లుండంగ నగరె వెలఁదుల నంపన్. ౧౮౩

వ. కావున మహానుభావా యెద్దేనియు నుపాయంబుసేసి రక్షించినంగాని మా దుఃఖంబులు తీరవని సురలు ప్రార్థింప విని గరుడధ్వజుం డిట్లనియె. ౧౮౪

క. మును నే మహిషాసురుతో । ననిజేసి జయింపలేక యరుదెంచితి వాఁ
డును బురుషుచేత నీల్గడు । ఘనవరబల మాతనికినిఁ గలుగుట కతనన్. ౧౮౫

## —: దేవీస్వరూప ప్రాదుర్భావము :—

వ. అదిగావు మనయందఱియందున్న నారీతేజంబులం బ్రార్థించి తేజంబులనెల్ల నేకంబు జేసితిమేనియది మహానారియై యసురు నుక్కడంప శక్తిగలదియగు, మన సాధనసామగ్రి యామహాశక్తికిచ్ఛేదముగాక యని సురల నట్లసేయ నియోగించి తానును నట్లసేయ నత్యద్భుతంబుగాఁదేజంబు లుత్పన్నంబులయ్యె. బ్రహ్మవదనంబునుండి రక్తవర్ణంబును, శుభాకారంబును, పద్మరాగమణిసదృశంబును, గించిచ్ఛీతంబును, గించిదుష్ణంబును గిరణజాలమంనుతంబును నగు తేజం బుద్భవిల్లె, నంత నారాయణు వక్షంబునుండి యొక తేజంబును, శివామభాగంబునుండి మఱియొకతేజంబును, లోకపాలురయుం దక్కు దేవత లయు శరీరవులనుండి వేఱ్వేఱు నొక్కొక్క తేజం బుప్పతిల్లె. శంకరునుండి వెడలిన తేజంబు రౌంబుంబును తీవ్రంబును దుర్ధర్శంబును దారుణంబును నయ్యెండె. నంత నారాయణునుండి యుద్భవిల్లిన తేజంబు శ్వేతంబును, సత్వగుణంబును, ఇంద్రునుండి వెలువడిన తేజంబు చిత్రరూపంబును దురాసంబును నయ్యెండె. నిట్లు వెడలిన తేజంబు లన్నియు రాశీభవించి యేకంబై యున్నం గని వియచ్చరు లచ్చెరుపడిరి. అది అంతట సుందరీ రూపంబు వహించి, నిలువంబడియె. అది త్రిగుణయు, త్రివర్ణయు, విశ్వ మోహినియు శ్వేతాననయు, గృష్ణనేత్రయు, రక్తోదరయు, దామ్రపాణియు, దివ్యభూషణ భూషితయు, సహస్రకరయు, నష్టాదశభుజయు ననిన విని జనమేజయుండు మునినాథా ఆ దివ్యతేజశ్శక్తి రూపంబు నింకను విస్తరించి చెప్పవే యనిన వ్యాసుండు నవ్వి యమ్మహాదేవి రూపంబు యథాతథ్యంబుగ జెప్ప బ్రహ్మకయిన నలవిగాదు.

నేనుం జెప్పుదునని పూనినను నే జెప్ప శక్తుండగాను. ఆ దేవి యరూపయయ్యును దేవతాకార్యార్థంబుగా రూపంబువహించినది దానికి సంధ్యాతేజంబులు భ్రూలతలును, వాయుతేజంబు శ్రవణంబులును, పర్వతంబులు దంతంబులు నయ్యె. ఇట్లు వివిధాంగంబులతో నత్యంతసుందరాకారంబు గల్గి తమయెదుట నిలువబడియున్న శక్తిం గాంచి సురలద్భుతాయత్తచిత్తులయి యుండం జూచి హరి వారలతో నిట్లనియె. ౧౮౭

ఉ. దేవతలార మీ రిపుడు దివ్యతరాయుధ భూషణంబులన్
దేవికి నిండు లెండనిన దీప్తమహాయుధపాళి యెల్లరున్
భావములందు బొంగుచును బావనమూర్తికి దివ్యశక్తికిం
బొరఁగనిచ్చి రత్యధికవైభవయుక్తి గ్రహించె దేవియున్. ౧౮౮

వ. మఱియు. ౧౮౯

సీ. మంచిచెందిరికావి మడుగులు రెండిచ్చె । వేడుక తా పాలవెల్లిరేడు
నిగనిగల్ చకచకల్ ధగధగల్ గొలిపెడి । చూడామణి నొసంగె సూర్యు డెలమి
కంకణంబులు దుద్దుగవ కంటె రతనాల । బేసరి యిచ్చెను విశ్వకర్మ
కుంకుణుకుణి నినాదాంకితకింకిణీ । కనఖంబులగు నందె లొసగె ద్వష్ట

గీ. ముద్దుటుంగరములు మంచిముత్తెసరులు । వైజయంతి జలజమాల వరుణు డిచ్చె
పుష్యరాగంబులును గెంపు పోడులు రవలు । సమదసింహంబునొసఁగెను జందమామ.

క. ఈగతి నొసగినసొమ్ముల । బాగుగ ధరియించి దేవి భాసిల్లెను బ్రో
ద్యోగినియై సింగముపై । రాగలడే యెదుటి కొక్క రాక్షసు డనుచున్. ౧౯౦

## —: దేవికి ఆయుధప్రాప్తి :—

సీ. చక్రంబులోనుండి చక్రంబునొకదానిఁ । దివిచి దేవికి విష్ణుదేవు డిచ్చె
శూలంబులోనుండి శూలంబు నొకదాని । దివిచి దేవికి మహాదేవు డిచ్చె
వజ్రంబులోనుండి వజ్రంబు నొకదాని । దివిచి దేవికి సురాధీశు డిచ్చె
దండంబులోనుండి దండంబు నొకదాని । దివిచి దేవికి ధర్మదేవు డిచ్చె.
వరుణుఁడుఁ దరం బొసఁగె శక్తి జ్వలనుఁ డిచ్చె । విల్లు వాయువొసగె జెంబు విధి యొసంగె
పాశఖడ్గపరశుపానపాత్రగదల దేవతలొసంగి రా మహాదేవి కపుడు. ౧౯౧

వ. ఇట్లొసఁగిన దాల్చి మహాతేజోవిభ్రాజమానయై జగన్మోహినియై యున్న శక్తిం గొలచి యత్యంతానందంబున బొంగి భయ భక్తి వినయపూర్వకంబుగ బృందారకులు స్తుతింప దొడంగిరి. ౧౯౨

గీ. పరమకళ్యాణి రుద్రాణి భద్రమూర్తి । భగవతీ దేవి యీశాని పరమసాధ్వి
కాళరాత్రి మహాదేవి కాళి శక్తి । మ్రొక్కెదము నీకు త్రైలోక్యమోహనాంగి. ౧౯౩

గీ. పుష్టి మతి ధృతి గతి సిద్ధి బుద్ధి యంబ । నిత్యనిరుపమ నిరవద్య సత్యవాచ
వైష్ణవి భవాని వాణి శర్వాణి తల్లి । మ్రొక్కెదము నీకు త్రైలోక్యమోహనాంగి. ౧౯౪

గీ. పుడమిలోనన యుండియుఁ బుడమిచేత । మెఱుఁగఁబడనట్టి దేవికి నీశ్వరికిని
నెల్లలోకంబులేలు మా తల్లికిదియ । మ్రొక్కెదము నీకు త్రైలోక్యమోహనాంగి ౧౯౫

గీ. మాయలోనన యుండియు మాయచేత । నెఱుఁగబడనట్టి దేవికి నిందు నందు
ననక యెల్లెడనున్న మా యమ్మ కిపుడు మ్రొక్కెదము నీకు త్రైలోక్య మొహనాంగి ౧౯౬

గీ. మాకు శుభమమ్మ రక్షించుమమ్మ నిన్ను । నమ్మియున్నాము మాయమ్మ యమ్మలమ్మ
సమ్మదమ్మున నాయోధనమ్మునందు । నెమ్మి మహిషాసురేంద్రు జయించుమమ్మ. ౧౯౭

గీ. దున్నపోతుసోకు దొలగించవమ్మ వా । డాత్రికరుఁడు దేవతాళికెల్ల
ఖలుఁడు నారిచేతగాని హతుఁడుగాఁడు । దేవి నీవ దిక్కు దేవతలకు. ౧౯౮

ఉ. నావుడు వారలాడు వచనంబులు దా విని యేల మీకుఁ జిం
తావిపులత్వ మద్దనుజు దర్ప మడంచెద నాజిలోన నే
నా విని దేవతల్ సెలగి నవ్వుమొగంబులతోడ నిల్చి రా
హా వసుధాధినాథ పరమాద్భుతముల్గద దేవిచైదముల్. ౧౯౯

వ. అని వ్యాసుండు మరియు. ౨౦౦

సీ. బ్రహ్మాండభాండముల్ పగిలి బీటికలెత్త । కులగిరుల్ కంపిల్లి కూలిపడగ
దద్దరిల్లుచుఁ బృథ్వి తహతహ వడకంగ । సంద్రముల్ సుడిఁగొట్టి చాలఁగలఁగ
దెస లెల్లయెడలఁ బ్రతిధ్వనుల్సెలరేగ । చైతన్యములు చెడి జంతులడల
సూర్యచంద్రులు నింగి సుడివడి యల్లాడ । త్రైలోక్యమెల్ల గగ్గోలుపడఁగ
దానవులగుండె లలజడి దల్లడిల్ల । గొళ్ళుగొళ్ళున రక్కసుల్ గోలపెట్ట
ఘీమ్మని వరాహమూర్తి దా గీపుపెట్ట । నబ్బురంబుగ దేవి దా బొబ్బవెట్టె. ౨౦౧

క. జయజయజయదేవి యనుచు । భయకంపములెల్లఁ దీరి పరమేశ్వరి యా
శ్రయమొదవె ననుచు నమరులు । రయమున నుత్సాహపడిరి రణమున కధిపా. ౨౦౨

క. దానవుఁ డారావము విన । గానే యిదియేమివింత యెక్కడ నాదవెన్
నేనుండఁగ నోరెత్తి మ । హానాదము నిట్లు సేయునది యున్నదొకో. ౨౦౩

క. అని యది గని రమ్మనుచున్ । దనదూతల నలుఁగడలకుఁ దగ నంపిన వా
రును జని కారణము జగ । జ్జననియగుటఁ జూచి రపుడు సభయాశయులై. ౨౦౪

క. కనివచ్చి రాక్షసునకున్ । దనుజభటులు దెలిపి రకట దైత్యవరేణ్యా
మునుకొని చని కనవశమా । యెనె మాకును జెప్పగలమె యిటునటు ననుచున్. ౨౦౫

సీ. ఎన్నియోభుజములు నెల్లసొమ్ములు దాల్చి । నది సకలాయుధ హస్తపెద్ద
బంగారుగిన్నెలోపల మధు విడికొని । త్రాగుచున్నది చండతరసుమూర్తి
యది మానుషియునుఁగా దది దేవతయునుఁ గా । దది రాక్షసియునుగాదయ్య వినుము
సింహంబుపైనెక్కెఁ జేతులు పదునెన్మి । దలశమదాక్షి నిర్మలసమాల
ఆకసంబున సింగంబు నధిగమించి । యున్నయది ఛత్రయున్నట్టు లెన్నరా ద
వెందుకై వచ్చినదియొకో యెవ్వతెయొకో । తెలియఁజాలము చిత్రంబు తేజ మఘప. ౨౦౬

క. శృంగారము వీరంబును । రంగగుహాసంబు మరియు రౌద్రరసంబున్
బొంగుచునున్నవి యా ది । వ్యాంగన యాననమునందు వసుధాధీశా! ౨౦౭

వ. దైత్యకులసార్వభౌమా చూచితిమి వచ్చితి మింతియకాని మాచేయునది యేమియును లేదు. ఆ మహాతేజంబుదరి డాసి యడుగనేరక యిటుఁ జేరితి మనవుఁడు మహిషుండు తన మంత్రివర్యుం గాంచి యిట్లనియె. ౨౦౮

క. ఓవిమలబుద్ధి వేగమ వీవేగుము దానిఁజూచి నెయ్యముమీరం
గావింపుము ముచ్చటలో । మావిభవముసెప్పి సామమార్గం బనినన్. ౨౦౯

క. అట్టులనే కావించెద । గట్టిగ నే నిపుడు పోయి కడునేర్పుమెయిన్
రట్టేల గడియలో నీ । పట్టమహిషిజేయకున్న మాంసభుజుఁడనే. ౨౧౦

క. అని చని దేవిం గని యు । య్యన దూరంబుననె నిలచి యో యిందుముఖీ
కనకాంగి కంబుకంఠీ । వినయంబునఁ బలుకువాఁడ విను మొక మాటన్. ౨౧౧

## —॰ దేవికిని మహిషాసురదూతకును సంవాదము ॰—

ఉ. ఎవ్వరిదానవీవు కత మేమిటఁ రా మృదుతన్వి మా ప్రభుం
డవ్విబుధావళిం గెలిచి నాకము నేలుచునున్నవాఁడు నీ
మొవ్వపురూపురేఖల సమున్నతిఁ దా విని నిన్నుఁగూర్చి తా
నవ్వల రాచవేఁడుకల నంద దలంచెను చారులోచనా. ౨౧౨

ఉ. మానుషరూప మొప్పఁ దనుమధ్య భవత్సవిధంబు సేరు ని
న్నా నవమోహనాంగుఁడు మహామహు డద్భుతచర్యఁ దర్మిలిం
బూని కనుంగొనన్ మనసు పుట్టి నసుం బనిచెన్ రసౌచితిం
దేనియలొల్క శీఘ్రముగఁ దెల్పుము కంజదళాయతేక్షణా. ౨౧౩

క. నావుడు విని నవ్వుచు న । ద్దేవి పలికె నోరి దుష్ట నిట్చరమంత్రీ
దేవతలకుఁ దల్లిని స్త్రీ । దేవిని దైత్యప్రణాశ ధీరోదారన్. ౨౧౪

క. మదపుటెనుబోతు రక్కసు । డదయుండై సురలఁదరిమి నాకముఁగొనినన్
మది నను స్మరించి వేడిన । సదయత వచ్చితిని మహిషుఁ జక్కాఁడ్చుటకై. ౨౧౫

గీ. దండులే దొక్కఁడాననె । తత్తరమున । వెడలితిని భక్తజనులను బ్రీతిఁబ్రోవ
నీవు సామోక్తిఁ బల్కెఁతి నేర్పుమీర । కొంతవరకును సరియంచు నెంతు దనుజ. ౨౧౬

గీ. నేను చెప్పినయట్లుగా నీప్రభునకు । దెలుపు మిప్పుడపోయి యో ఖలుడ నీవు
కన్నుగానవురా యోరి దున్నపోత । వితలమున కమరావతి విడిచి పొమ్ము. ౨౧౭

ఉ. చెప్పినయట్లు నాముదల చేసినవానియెడన్ దయారసం
బుప్పతిల న్నటించెద మదోద్ధతిమీరి నటించెనేనియున్
నిప్పులలోన మాడ్చి యవనిం బరమాణుపరంపరన్ వెసన్
జొప్పడఁజేసెదం గనుము చోద్యము నీ వసురాధమాధమా. ౨౧౮

ఉ మందమతీ యిఁకేల హనుమంతునిమోలనుఁ గుప్పిగంతు లీ
చందము మాని వేగమ రసాతలవాసివిగమ్ము కాదయే
నిం దలఁగొట్టి గోతనిడనే కనుగొమ్మను దొల్లి దైత్యులా
క్రందన నొందగా యుగయుగంబున జొప్పడ నాలకింపవే, ౨౧౯

ఉ. సింగము మార్కొనం గజము చేరినచందము సేయఁబోకుమీ
యంగనచేతగాని పడనట్టివరంబును గొంటిగాన నీ
కుం గడకాల మిప్పు డనుకొమ్మిది నీ కది మాన్పకో దలం
పుం గలదేని శీఘ్రముగఁ బొమ్మ రసాస్థలి కంచు దెల్పుమీ. ౨౨౦

ఉ, పొందున లాభ మొందుదురు పోరున నాశము వచ్చునందు రిం
కెందుకు నీకు స్వర్గము త్యజింపుము ప్రాణముమీదియాసతో
నుందువయేనిఁ దక్కిన మదుగ్రశరాహతి నాజిలోపలన్
గ్రుందెదు వెఱ్ఱికూఁత లిక మానుము మన్మథమోహచింతనన్. ౨౨౧

క. అనుమా దనుజాధమ వేఁ । జనుమా మీరాజుతోడఁ జయ్యన నేఁ జె
ప్పినయట్లు జా గిఁకేటికి । నన విని తా హేతుగర్భమగున ట్లనియెన్. ౨౨౨

గీ అడఁదానవు పటుయౌవనాంగి వమిత । మదమలీమసచిత్తవు మొదలు తుదయు
నెఱుఁగ కాడెదుగాక యీవేద దనుజ । పాలుఁదేద కలనయ సంభావ్యముసుమి. ౨౨౩

మత్తకోకిల. ఒంటిదానవు చిన్నదాన వయో మృదూరు పద్మాక్షి వా
కంటకోపముతోడ జన్యముఖంబునం బడి నిల్చెదే
పంటిక్రిందికి నప్పడంబవొ పప్పవో వడియంబవో
దంటయేనుఁగు జాజిపూవులదండ మట్టిన పోల్కియో. ౨౨౪

మత్తకోకిల. నిన్ను నేఁ బరుసంబులాడుట నీతిగాదది యేమనన్
వన్నెలాడులమిన్నరో రసభంగమైసనుఁ గావునన్
మన్నరక్కసు డెన్న దుర్దమదోర్బలుండు చలంబునన్
నిన్నుఁ బట్టకమానఁ డింతట నీవు పంతము మానుమీ. ౨౨౫

మత్తకోకిల. ఎన్నిఁజెప్పినగాని నీవు సహింపకిట్టులఁ బల్కినన్
గన్నుగానక యౌవనోన్మద గర్వభావము సూపితే
నిన్ను జంపఁగలాడ నైనను నీపయిం దమి హెచ్చఁగా
నున్నవాఁడు ప్రభుండు నొచ్చునొకో మనంబునఁ గోమలీ. ౨౨౬

మత్తకోకిల. నీవిలాసము విభ్రమంబును నేఁడు మా దొర విన్నవాఁ
డో విలాసిని నీకొసంగెడి నుల్ల మొక్కటగాదుసూ
దేవరాజ్యము దైత్యరాజ్యము దివ్యధామము లర్థమున్
నీవశంబొనరించి కొల్చును నీపదంబులు దాసుడై. ౨౨౭

క. పట్టపురాణివిగమ్మా । యెట్టయినను నీవు జగము లెల్లకు నీ వా
కట్టున నిలుచున్ మహిషుఁడు । దట్టుచు నీకాళ్ళ గడిగి త్రాగి బ్రతుకఁడే॥ ౨౨౮

క. హంసగమన వ్యర్థముగా । హింసలకుం జొరఁగనేల యిప్పుడ రమ్మీ
సంసారసారమెల్ల రి । రంసన్ మహిషుండు నీకు రంజిలజేయున్. ౨౨౯

క. అనిన విని దేవి యిట్లను । వినరా మనుజాద శాస్త్రవిధి విడువక నే
ర్పున జెప్పితి విదియు సరే । నిను మహిషుని సచివుఁడనుచుఁ నే నెఱిఁగితిలే. ౨౩౦

క. రాజు మహిషంబుగాఁగా । పోఁజెల్లునె నీకు మహిషబుద్ధి విను యథా
రాజా తథాప్రజా యను । నోజన్ వినలేదొ దుర్ణయోదయమూఢా. ౨౩౧

క. మగవాఁడను గాకున్నను । మగతనమే కలిగె నాకు మగువనయిననున్
మగువనయిను కారణమున్ । దగ నెరిగితయేని పలుకఁ దగదిటు మూఢా. ౨౩౨

గీ. మగువచేతఁ దనకు మరణంబు వేడె నీ । ప్రభువు దానఁజేసి భామనైతి
నయయొ యెంతపంద యసురుండు కొజ్ఞాను । ముద్దుగొసఁదలంచు మూఢుబోలె. ౨౩౩

క. పెదసుదుగులాడు నిన్నుం । గడగడలాడింప నెంతఁ గలవు కుమతి యి
య్యెడఁ దాటాకుల చప్పు । ళ్ళిడినం గుండేళ్ళు బెదరునే ఛీ పొమ్మీ. ౨౩౪

క. దైవము విపరీతమయిన । వావిరి దృణలేశమైన వజ్రముగాదే
యా వజ్రము తృణలవమై । పోవదె దైవంబు సకలముం జేయుగదా. ౨౩౫

ఉ. సేనలు నాయుధంబులును శ్రీయును ధీయును బాహుశక్తియున్
బూనుత దుర్గముల్ ధనము భోగము గాలము మంచిదైనచో

జానగు లేనినా డవి నిజమ్ముగ వ్యర్థములై నశించు న
య్యో నను నమ్ము నీప్రభున కోటమి కాఁగలదిప్డు చెప్పుమా. ౨౩౬

క. మరణము వడి దరికొనఁగాఁ । గరణంబులు సాధనములె కాలము నడపన్
మరణము జననము కాలవి । కరణమ్ములు వాని గడవగా దభవునకున్. ౨౩౭

క. ఎవని కేగతి మరణము । నివ్వటిలునటంచు దైవనిర్మితమయ్యెన్
దవ్వంతయు దప్పదుసు । మ్మవ్వానికి నట్లయొదవు నసురప్రవరా. ౨౩౮

క. వరములు గైకొని తమకున్ । మరణములేదనెడివారు మందమతులుసూ
మరణము స్వభావజంబని । యెఱుఁగుము కాలంబె మృతికి । హేతువుఁ గూర్చున్ ౨౩౯

క. అదిగావున నీవెత్తిని । వదలుము పదివేలు నీవు వదరఁగనేలా
సదమలబుద్ధివయేని । బదమా నృపుకడకుఁ జెప్పుమా యిబ్భంగిన్. ౨౪౦

క. దేవతలరాజ్యమెల్లను । దేవేంద్రునకిమ్ము వానిదెసఁ జూడకు సం
భావిత హవిరాదానము । దేవార్థమెసుమ్ము నీవు దివియకుమనుమా. ౨౪౧

ఉ. పొమ్మను నాకమున్విడచి భూరిరసాతలసీమ కద్ది శ్రే
యమ్మను కాకతక్కిన నుదారమదారచితాశుగాళిపాల్
గమ్మను దుష్టరాక్షసనికాయము సాయములెల్ల నేడు వ్య
ర్థమ్మను నిన్నుజంపగలదానను నే నను పొమ్ము రాక్షసా. ౨౪౨

వ. అనిన విని మహిషమంత్రి యిది యిట్లు సెప్పుచున్నయది, నే నేమిసేయుదు, నిప్పుడు పోయి ప్రభువున కిది సెప్పినదెల్ల నివేదించుటయొండె సంగరంబున కుపక్రమించి దీనిం జంపుటయొండె కర్తవ్యం బిందు సుతరంబు జింతింప వైశంబ, యేలినవానికడకుం జని వృత్తంబెల్లసెప్పి నతండు బుద్ధిమంతులతో నాలోచించి యేమికా సేయనిమ్ము, ఇప్పుడు నేను దీని జయించినను, జయించకున్నను రాజున కప్రియంబు సేసినవాఁడ నగుదు. కావున పోయి తెల్పెదనని నిశ్చయించి నృపసన్నిధిం జేరి నమస్కరించి చేతులుజోడించు కొని వినయపూర్వకముగా నిట్లనియె. ౨౪౩

క. మనుజాశనవర పదియును । నెనిమిది భుజము లుగ్రసింహ మెక్కెను ఘనసా
ధనముల బట్టెను దానిం । గనుగొనఁగాఁ గోటికనులు గావలెనుసుమీ. ౨౪౪

చ. వినయముమీర నేఁ దరిసి విన్నతి నో వనజాక్షి మా ప్రభున్
మనుజశరీరసంగ్రహుని మాన్య్యులులాయు భజింపుమీ యతం
డనుపమభాగ్యశాలి ద్రుహిణాండము నేలెడివాఁడు నీకునుం
బెనిమిటియైన నెంతమురిపెంబు, సెబాషని జెప్పి తాపెకున్. ౨౪౫

చ. అది విని దర్పధూర్వహదృగంచలయై స్మితపూర్వవాక్క్రియన్
మదవదుదారనాదగతి మంద్రముగాఁగ నతంద్రవృత్తిమై
పద పద వెఱ్ఱిమాటలకుఁ బాల్పడెనే మహిషీతనూజు నె
ల్లిదములు మీకు నచ్చెనె బలిన్ మిముఁ జేసెద దేవి కియ్యెడన్. ౨౪౬

ఉ. ఎక్కడిదున్నపోతు సరియే పద ఛీ విరమించుమింక నే
న్రుక్కడలేవ గాను నిను మూతిసిఁజెప్పిడి మాయజేయుదున్
బెక్కులు ప్రేలబోఁకుమికఁ బెత్తనముండదు రాజుతోడ
నా వక్కణముల్ వచింపుమని వారిజలోచన జెప్పె భూవరా. ౨౪౭

క. బఱ్ఱెలపోతున కొక గొఱ్ఱ । బఱ్ఱెయె పెండ్లాముగాఁగ బ్రాభవమొదవున్
మిఱ్ఱినకొమ్ములతోడన్ । గిఱ్ఱునఁ గోకికొని సరిగ గ్రీడింపదగున్. ౨౪౮

క॥ యుద్ధగుసలపుటకే స న్నద్ధుడవగుమనియె నీకు నారి యగుటకుం
బుద్ధిరవంతయు లేదిఁక । సద్ధర్మము నీవ సేయజాలుదు వధిపా. ౨౪౯

వ. అనిన విని మదవిహ్వలుండైన మహిషుండు మంత్రివరులం బిలిపించి యిట్లనియె. ౨౫౦

గీ. వినుఁడు మంత్రులార విబుధవిహితమాయ । తెమ్మకొనియె శాంబరియును బోలె
నాడు దోత్తు పుట్టె నసురుపాలిటి మారినంచు నుక్కు మీఱియఱచె. ౨౫౧

గీ. ఏమిసేయంగగలవార మిపుడు మీర । లారయంగవలయుఁగాక యతిరయమున
దాని సాధించుమార్గ మెద్దానినేని । మొదట సామంబు మీ రెఱుంగుదురుకాదె. ౨౫౨

వ. అనిన ౨౫౩

ఉ. సత్యముబల్కఁగాఁదగు నిశాచరనాయక సత్యమెన్నఁగా
నిత్యమునుం బ్రియంబగు వినిర్మలమార్గముతోఁగఁగూడి తా
నత్యనవద్యమౌనటుల నైనను గార్యములున్ హితంబులో
వ్యత్యయమాచరింపఁదగునా యటులైనను నాలకింపుమీ. ౨౫౪

క. నిష్టమయి నిజము బల్కిన । నిష్ఠురమగుఁ గొన్నియెడల నిభృతహితఫలా
ధిష్టితమగు దుద కసుర । శ్రేష్ఠా చేసైనమందు చెరుపదె రుజలన్. ౨౫౫

గీ ప్రాజ్ఞుఁడగువాఁడు సత్యంబు పల్కువాడు । పలుకుపొందిక నేర్పు జొప్పిడినవాఁడు
దొసుకుట దలంప నసురేంద్ర దుర్లభంబు । వదరుఁబోతులు వందలు వంద లుండ్రు.

క. ఇది మే లిది కీడనుచున్ । మదినెఱిగి వచింపఁగలరె మాటోటులు మే
మెదిసెప్ప నెదిఫలించునో । మదవన్మహిషేంద్ర ధైర్యమంధనగేంద్రా. ౨౫౭

చ. అనవుఁడు దానవుండు హితులార వచింపుఁడు మీరు స్వస్వమ
త్యనుస్మృతి మీకు నయిన నందఱుజెప్పిన దాలకించి నా

మనసున జక్కఁగా నరసి మంచిపథం బొకటేర్చి చేసెదన్
బని యది గావునం దెలుపు డాశయముల్ పరికించి గట్టిగన్. ౨౫౮

వ. అనిన విని విరూపాక్షుండు. ౨౫౯

క. ఎదగొన్నదిగద యిది స్మర । మదగర్విత యిప్పరాకుమాటలకే నీ
మది బెదరనేల యిప్పుడు । గదలెదెఱుఁగుము బిభీషికామాత్రముగాన్. ౨౬౦

చ. అనృతము సాహసంబుగల దాడుదటంచు నెఱుంగుమయ్య య
వ్వనిత మదాతిరేకమునఁ బల్కిన పల్కులకేల నీ మనం
బున భయ మాసురేంద్ర జగము ల్త్రితిమాత్ర జయించి నేటి కం
గనకుఁ దలంక నవ్వుదురుగాదె పకాపక సాగివా రొగిన్. ౨౬౧

ఉ. పంపుము నన్ను నేన చని భామిని నొక్కక్షణంబులోన ను
త్కంపితఁజేసి చంపెదను దానికి నీ కొదఁబాటులేదయే
నింపుగ సేనలంగొనుచు నేగి వధించెద నట్టకాదయే
సొంపుగ నాగపాశములఁ జుట్టి భవన్నికటంబు సేర్చెదన్. ౨౬౨

వ. అనిన విని దుర్ధరుం డిట్లనియె. ౨౬౩

గీ. రూఢి సత్య మీ విరూపాక్షు డాడిన । పలుకు లట్టులైనఁ దెలుపువాఁడ
వినుము నేను దనుజవీర నా మనమునఁ । దోచినట్టులరసి చూచి చూచి. ౨౬౪

క. నా మనమున కా మానిని కామాతురయగుచు రూపగర్వితయగుచున్
వేమారు భయముపెట్టెడి । గాముకు నిది హావ భావ కలనమె సుమ్మీ. ౨౬౫

క. రసవిదులగు కోవిదు లీ । రసనిధి వక్రోక్తి యంద్రదు రాక్షసనాథా
రసికున కిది ప్రియమేసు । మ్మసమాస్త్రిని శాస్త్ర మెఱిగినట్టి రెరుగ రే. ౨౬౬

గీ. నీయొదల మార్గణముల । నేఁయుదునన హేతుగర్భమేసుమి భామా
సాయకము లెరుగవే విపు । లాయతరసలసితసత్కటాక్షంబులెసుమ్మీ. ౨౬౭

క. నవ్వులకాడినకారులు । పువ్వులదోయి శ్నెసుమ్ము పురుషవరేణ్యా
యెవ్వతె యెటుగాకున్నన్ । జివ్వల నిన్నేయఁగలదు చేపట్టివెసన్. ౨౬౮

గీ. అజుఁడు విష్ణుఁడు శంకరుండైన నిన్ను । జెనకఁగాలేరు కామిని చేయునేమి
కార్య మది విపరీతంబుగాఁ దలంపు । మసురవర మానసంబున నళుకనేల. ౨౬౯

క. నిను బదమొత్తెదనని య । వ్వనిత యనుట నిన్నుఁ బూలపానుపుపై దా
నునిచెద ననుటయెసుమ్మా । దనుజేశ్వర కామశాస్త్రతంత్ర మెఱిగినన్. ౨౭౦

క. నీయసువుఁ దివిచెద నని । యా యంగన బలుకుట కొక యర్థముగలదా
కాయజశాస్త్రనయంబునఁ । బాయక వీర్యంబునండ్రు ప్రాణమ్మనుచున్. ౨౭౧

క. ఉత్తమయగు వరవర్ణిని । హత్తును వ్యంగ్యాధికతల వ్యాహృతులందున్
దత్తరపడనేటికి నిఁక । జిత్తము సరసంబుసేసి చెందుము దానిన్. ౨౭౨

క. సామము దానము రెండును । గామినియెడఁ జూపవలయుఁగాఁ బ్రథమమునన్
నీమీద బ్రేమపుట్టెడి । నా మదవతి కిదియె మార్గ మాలోచింపన్. ౨౭౩

వ. అనిన విని తామ్రుం డిట్లనియె. ౨౭౪

క. నామతము వినుము దనుజవ । రా మంచో కీడొ యాత్మ నరసి పలికెదన్
భూమనయాన్వితమును సుర । సామ్యృష్టము ధర్మసహిత మసుహేతుకమున్. ౨౭౫

మ. అది కామాతురగాదు వ్యంగ్యపులుగా వా మాట లో వీర యే
మదియెన్నన్ గడుఁజిత్రమయ్యెడి నహో యా యింతి దీప్తాకృతిన్
బదియున్నెన్మిదయౌ భుజంబు లెసఁగన్ డాసె న్నిరాలంబయై
విదితంబే యిది యెన్నఁడేని మనకున్ విశ్వంబులో నారయన్. ౨౭౬

ఉ. కాలకృతంబుగాక మఱి కాదిది నాకును దుర్నిమిత్తముల్
చాలఁగఁ దోచె దుష్టమగు స్వప్నము వచ్చెను కాన మానుషా
దాళికి నాపదల్ దరిసెనయ్య వృథాపరిజల్పితంబులన్
గాలముపుచ్చరాదు సరిగా మదిలోఁ బరికించు మింతటన్. ౨౭౭

ఉ. నల్లనిచీరెఁగట్టి యొక నాతి గృహాంగణమందు నేడ్చుచున్
మెల్లఁగ వచ్చె వేఁకువను మేదుర మాపదయంచు నెంచుమీ
గొల్లునఁ గూయు నిండ్లపయిఁ గూడి పతంగములెల్ల రాత్రులం
బెల్లుగ నాయె దుశ్శకునబృందము లాసురవాసభూములన్. ౨౭౮

క. అది గావున నమ్మదవతి । కదనమునేయఁగనె యిందు గదలె ననుచు నా
మదికిం దోచెడి నిక్కము । మదవన్మహిషేంద్ర ధైర్యమంధనగేంద్రా. ౨౭౯

క. ఇది మనుజకామినియుఁగా । దిది గాంధర్వియును సురియు నెద్దియుఁ గా దీ
యది దైవమాయ యనుచు । న్మది నెఱుఁగుము కష్ట దుష్ట మారి యటంచున్. ౨౮౦

గీ. కాన శౌర్యమేది కాందిశీకులమైన । నెల్లిదంబుగందు మెల్లయెడల
సంగరంబునకును సమకట్టనగు నిప్డు । కాదలంచినయది కాకిపోదు. ౨౮౧

క. కర్తవ్యం బిది యనియు న । కర్తవ్యంబిది యటంచు గణియింపంగా
గర్తయెవఁడు కార్యంబుల । వర్తింపంగవలయు ధైర్యవంతుం డగుచున్. ౨౮౨

క. జీవితమును మరణంబును । దైవాధీనములుసుమ్ము దానవనాథా
దైవంబును విడనాడిన । కోవిదుఁ డెవ్వం డశాండకుంభమునందున్. ౨౮౩

## —: దేవినిగూర్చి తామ్రదూతను బంపుట :—

వ. అనిన విని మహిషాసురుండు నీవు మహానుభావుండవు నీవెఱుంగనిదిలేదు యవ్వరారోహ నెవ్వఁడువుననేని జయింపఁగలవాఁడవు. సామదానంబుల వశగయైన నవ్వనితం గొని రమ్ము, కాదయేని సంగ్రామంబునం జక్కాడుము. బలగంబులంగూడి నీవు సని య చ్చేడియ యిచ్చటికి విచ్చేయుకతం బరయుము. కామంబునంగాక యున్నయెడ యథాబలంబుగ యుద్ధం బుపక్రమింపునది. భయనిర్దయత్వంబులు రెండును మాననగు. నెట్లు సేయవలయు నట్లు సేయుమని చెప్పినఁ దామ్రుండు సేనాసమూహంబులంగూడి కాలమహిమకు లోనైచనుచు మార్గంబున దుర్నిమిత్తంబు లనేకంబులు గానరా భయం బందియు జని చని యొక్కయెడ సింహాధిరూఢయై సకలసురానీకంబు గొలువ కోటిసూర్య ప్రభం దేజరిల్లుచున్న దేవిం గాంచి మృదుమధురవచనంబుల నిట్లనియె. ౨౮౪

క. అమ్మా దైత్యకులేంద్రుఁడు । కొమ్ములుగలవాఁడు నీదు గుణ యౌవన రూ
పమ్ములు విని మోహించెను । సు మ్మాతని చెట్టబట్టి సుఖముం గనుమా. ౨౮౫

క. అందముగలదాన వతని । చందము గన దుర్జయుం డసాధ్యుఁడు వానిం
బొందుము చెందుము సౌఖ్యము । నందనవనమందు విహరణమ్ము సలుపుమా. ౨౮౬

క. సుఖమే కోరుము హిమకర । ముఖి దేహ మేకముగఁ జేసిన యా
సుఖమే సుఖము కల దందున । నఖిలము దుఃఖంబు హేయ మది మానఁదగున్. ౨౮౭

క. కిసలయవిస్మరకరములు । కసుగందఁగ బట్టనేల కార్ముక శరముల్
కుసుమంబుల కందుకముల । విసువక నిడఁదగినయట్టివిగదే తల్లీ. ౨౮౮

క. కనుబొమ్మలనెడి చక్కని । ధనువులు గలుగంగ వేరెధను వింకేలా
కనులనెడి శిలీముఖము । నెనసియు బాణంబు లింక నేటికిఁ బట్టన్. ౨౮౯

క. ఆసంబడి చేయుబెకా । కీ సంసారమున యుద్ధ మిల దుఃఖ మౌ
కాసంతయు సుఖమున్నదె । పూసరములచేత నైన బోరొప్పదుసూ ౨౯౦

ఉ. నీవు ప్రసన్నవైనఁ గడు నెమ్మి భవత్పద్మదపదాసుఁడై
సేవయొనర్చు ధైర్యగుణ సింధుఁడు గాసరరాక్షసేశ్వరుం
డో విమలాంగి పోవిడకు ముత్తమమైన సుఖంబు పోరునన్
జావో సుఖంబొ సందియము చక్కనినీతి గ్రహింపు మిమ్మెయిన్. ౨౯౧

క. పడుచుతనంబున రాజ్యము । విడువక సుఖియింపవచ్చు వెండీ పిదపం
గొడుకులు పుట్టుదురుసుమీ । పుడమిం బాలింత్రు సుఖము బొందుదు ముదిమిన్.

వ. అనిన విని జగదంబ మేఘగంభీరభాషణంబుల వాని కిట్లనియె. ౨౯౩

## —: దేవీతామ్రుల సంవాదము :—

క. పోపోరా వదరకుమిట । పోపోరా మొండిదున్నపోతుసుమీ నీ
భూపాలుడు చండాలుడు । పాపిష్టుడు కామమోహపరుడు సురారీ. ౨౯౪

క. నీతల్లి గడ్డిదిన్నది । వాతను శృంగవతి లంబవాలగదర నే
నాతీరున శోభిల్లెడి నాతిని । గానసుము నీదు నాథునితోడన్. ౨౯౫

గీ. పులియ బెట్టినఁ కుడితితోఁ బొట్టనించి । కడఁగి కాంద్రగరికి దిని యొడలు పెంచి
బురదలో బడి పొరలాడి పోతరించి । తీవు నిను జంపవచ్చెను దేవియనుము. ౨౯౬

చ. హరిని వరింపలేదు శివునైనను గోరఁగలేదు వాసవుం
బరిగణనంబుసేయ జలపాలుఁ దలంప గుబేరు నెన్న భా
స్కరు శిఖి బ్రహ్మనుం బొగడ సర్వమరుద్గణ మెంత నాకు నా
శర పరమార్థమా యెఱుఁగజాలవు దున్నవు నిన్ను మెత్తునా. ౨౯౭

గీ. కన్నెపడుచు నేను గానురా చండాల । నాకుఁ విభుఁడు గలఁడు లోకకర్త
సర్వసాక్షి స్థిరుఁడు సరేశ్వరుఁడు నిరా । లంబుఁ డఖిలపూర్ణుఁ డింబరుండు. ౨౯౮

గీ. క్షమియు శాంతుండు శివుఁడు నిశ్చలుడు సర్వ భావనుఁడు సర్వవాసుండు పరము
డనఘు డచ్యుతుండు నిర్మలుండు నిరాశ్రయుండు వాని విడనాడి యెనుబోతు వలతునటర

ఉ. కొంటెపు పీవు నిన్ను యముఁ గుట్టముఁజేసెద నొండె పోరునన్
గంటుపడంగఁ జేసి పరగం జలమెత్తుక మర్త్యుఁగొల్వఁగా
గెంటెదనొండె జీవిత మొగిం మదిఁ గోరితయేని పొమ్ము ని
ష్కంటకలీల వేగమ రసాతలమార్గముపట్టి దానవా. ౩౦౦

క. సాహసమేటికి మాను వి । వాహంబును మఱియు న వ్వివాదంబును స
న్నాహింప నొప్పు సములకు । నూహలువెయ్యేల యింక నోరి దురాత్మా. ౩౦౧

గీ. దూతవీవు రెండు దొడ్డకొమ్ములుగల । వాఁడ వేను దివ్యవనిత నగుదు
వియ్యమెట్లుమనకు నెయ్యంబులేలాగు । తియ్యమైనజాడఁ దెలియలేవు. ౩౦౨

క. అని నే జెప్పినటుల నీ । జనపతితో ననుము పొమ్ము చయ్యన స్వర్గం
బును విడువు మనుపు తక్కిన । నినుఁ జంపెద గడియలోన నే నను మధమా. ౩౦౩

సీ. కల్పాంతనిర్ఘాతగర్జనారావమో । ప్రళయకాళీకంఠభవనినదమొ
విలయభైరవరచావిర్భావమో చండ । నరమృగేంద్రకఠోర నాదమొక్కొ
ఘనతరశరభవక్త్రభవనినాదమో । భయదోగ్రతర వీరభద్రరవమొ
సమయాంతభీమభీమహోరురావమో । స్ఫుటితవేధోండనిష్ఠురరవంబొ

గీ. నాఁగ గొంతెత్తి యొకబిట్టు నామబొడమ । భూమి కంపింపఁ గులగిరుల్ వొరలి పడఁగ
నసురపత్నులగర్భంబు లవిసిపోవ । నట్టహాసంబుచేసె న య్యాదిశక్తి. ౩౦౪

గీ. తాము్రఁ దది విని ధృతిదూఁలి తల్లడిల్లి । అట్టునిట్టునుఁ జూచుచు జుట్టువీఁడఁ
గట్టిగా గోచిఁడోపుచు గదలి నడిచి । పరచి మహిషునిముందర బడియె నసఘ. ౩౦౫

గీ. పురమునందెల్ల చెవులు గింగిరులువోవ । చెవుడుపట్టి సురారులు చేయునద్ది
తోచక పలాయనమె మంచిత్రోవ యనుచుఁ । దలచి పారిరి తమ కాళ్ళకొలది నసఘ. ౩౦౬

ఉ. అంతట దేవి యెక్కిన మహామృగవల్లభు డాత్మలోన న
త్యంతరుషావిశేషమున నార్చె నజాండము బీటలెత్తఁగా
జెంతలనుండఁజాలక నశేషనరాశనవర్గముల్ భయ
భ్రాంతతఁ బోవుచుం గనిరి త్రాసవినమ్రుని మంత్రి తామ్రునిన్. ౩౦౭

క. చూచి యతనిఁగూడి చనిరి । రాచనగరుశకు మహిషరాక్షసుఁడును సం
కోచితముఖుఁ దామ్రునిఁ గని । యేచినదుఃఖమునఁ బిలిచె నితర సచివులన్. ౩౦౮

వ. అట్లు పిలచి. ౩౦౯

గీ. ఏమిసేయంగదగు మన కింకమీద । దుర్గసంగ్రహమొనరించి తోనతోన
యుద్ధ మొనరింపదగుఁగాక యూరకే ప । లాయనముసేయ నవ్వరే లాఁతివారు. ౩౧౦

మత్తకోకిల. మీరలందరు బుద్ధిమంతులు మీకుఁ దోచనికార్యముల్
వేరెయున్నవె భీతినొందక లెండు మంత్రవినిర్ణయ
స్ఫారమైన విచార మారసి భవ్యకీర్తి వహింపుడీ
ధీయుతై మదుదారరాజ్యము తెంపునం భరియింపుడీ. ౩౧౧

ఉ. రాజ్యము మంత్రమూల మది రక్షితమై వెలుఁగొందు మంత్రులుం
బూజ్యులయేని మంత్రమును బోవగనెట్టరు నిత్యమైన సా
మ్రాజ్యము రాజునం దునిచి మాన్యతఁగాంచుచు దేవవర్గమం
దిజ్యుడువోలె హేతువుల నిచ్చి వచింతురు మర్మకర్మముల్. ౩౧౨

గీ. అబ్బురముగ నొక్క యాడుది నెర గట్టు । వాయి పద్చు మనము వాటిలంగ
గదనమునకు నేఁడు కాలుద్రువ్వుచు వచ్చె । కంటిరే విరుద్ధకాలమహిమ. ౩౧౩

క. ఏకాకినియుం బ్రబలయు । నాకౌకోనిర్మితయును నారియు నన్నుం
బోకార్ప వచ్చె నిది యక । టా కంటిరె కాలమహిమ యద్భుతమాయెన్. ౩౧౪

క. అందరికి జయముగలుగునె । కొందరికగు దానిఁదెలిసికోఁదరమె సదా
సందేహాస్పదమ యది యె । న్నన్ దైవాధీనమంద్రు నానాగతులన్. ౩౧౫

గీ దైవమెద్ది దాని దలపోయుటెట్టులు । దాని జూచినట్టి జ్ఞానియెవఁడు
నది యదృష్టమంచు నందురు సదుపాయ । వాదులైనయట్టివారు కడఁగి. ౩౧౬

క. అన విని బిడాలనామక । దనుజుం దనుఁ గేలుమోడ్చి దైత్యకులేశా
వనితామతల్లి వితమును । వినిచెద నే విన్నయట్టి విధ మనువుపడన్. ౩౧౭

గీ. దైత్యనాధ నీవు తామరసాక్షిచే । గాని యీల్లవనెడి గతి నెఱింగి
స్వస్వ తేజములను సముపాదనముచేసి । వనితగా నొనర్చి పంపి రిటకు. ౩౧౮

గీ. బ్రహ్మ విష్ణు శివాది దేవతలు ఛన్న । వృత్తి నింగిని నిల్చిరి వేళఁగాచి
దానవుల నిన్ను నన్నును దర్పమడఁప భావి యెట్టులొ దెలియఁ జొప్పడదు నాకు. ౩౧౯

క. ఇప్పుడు యుద్ధము వలదని । చెప్పఁగ నే నోప నేది చెప్పినయేనిం
తప్పక దేవరవారే । చెప్పవలయు విని నటింత్రు సేవకజనముల్. ౩౨౦

గీ. రాజసేవకులము మేము రాజునాజ్ఞ । యెట్టులగు నట్లు గావింతు మిది శుభంబు
నిదియు గీడనజాల మెందేని మాకు । జావు పెండిలియును నొక్కసరియఁ దలప. ౩౨౧

క. చచ్చిన వీరఖ్యాతుల్ । వచ్చును జీవింప సుఖము వదలక యుండున్
హెచ్చుగ రాజభటునకుం । గ్రచ్చులు వేయేల నీతి గావలయుఁగదా. ౩౨౨

క. నీకొరకే మృతినొందిన । మా కది క్షేమంబెకాని మానిని యోర్తే
పైకొనియె దైత్యకోటులఁ । బోకార్తునటంచు వింత పొడమెడి గనుమా. ౩౨౩

చ. దనుజవరేణ్య గెల్పు ఫలితంబగునంచుఁ దలంపనేఁ బలా
యనము విధేయ మెన్ననసు హానికి నెక్కుడె కీర్తిహానియుం
చునుఁ దలపంగరాదు కడుఁ జోద్యమగున్ త్రిదశేంద్రుసంయుగం
బున జితుఁజేసి యొక్కపువుఁ బోడికి నోటమిజెంద నవ్వరే. ౩౨౪

వ. కావున జయాపజయంబులు లెక్కసేయక యేది యెట్లు కానున్నయది యది యట్లగు
నని కృతనిశ్చయులమై మరణంబున యశంబును, జీవనంబున సుఖంబును భయంబు
నుం గోరి యుద్ధంబుసేయుట లగ్గు. పలాయనంబున యశోహానియు నిరర్థకత జీవనంబు
నుం బ్రాప్తించు, కావున శోకింపక యుద్ధప్రయత్నంబు సేయుండనిన విని బాష్కలుం
డిట్లనియె. ౩౨౫

చ॥ భయ మిదియేల యే నొకడ పంకజలోచనఁబట్టి చంపెదన్
రయమున రెండు రెండు బవరంబున కుత్సహనంబె స్థాయియౌ
జయకరమైన వీరరససంపదకున్ రిపు భీతికారణం
బయి యది మేలుగూర్చు ననయంబును దానవలోకపాలకా. ౩౨౬

సీ. సురనాధునకు ధనేశ్వరునకు బాశికి । పవనున కార్కికి పద్మజునకుఁ
బావకునకుఁ బద్మభవునకు శంకరు । నకు విష్టరశ్రవునకును భీతిఁ
జెందువాఁడనుగాను చెందుదునే యొక్క । యాడుదానికి చూడు మసురనాధ
బాణజాలంబులఁ బడఁజేతు నొక్కండ । బాహుబలంబున బ్రబలి మీర

గీ. లేల యుండుండు గృహముల నాలుబిడ్డ । లను విడువవల్దువల్దు మీ మనసువచ్చి
నట్టు లిందనిపలికిన నపుడులేచి । దుర్ధరుడు పల్కె మదగర్వ ధుర్యుడగుచు. ౩౨౭

గీ. మహిష మహిషదేవ మాయయై యంగన । బుద్ధిదెలియుము వెఱ బొమ్మగాఁగ
ఇప్పుడింత యఱుక నేటికి మంత్రికృ । త్యమ్ము నీతిసెప్పు టదియకాదె. ౩౨౮

క. ముత్తెరఁగుల మంత్రులుగల । రుత్తముఁడగు సాత్వికుండు । నొగి రాజుపనుల్
తత్తరపడక యొనర్చును । జిత్తమునం దాత్మకార్యచింత యుడఁడుసూ. ౩౨౯

క. రాజసుఁడు మధ్యముండగు । నోజం బతికార్యమునకు నొప్పిన సరణిం
నైజమగు కార్యములనుం । గాజేసికొనున్ సుసాధుకర్ముండగుచున్. ౩౩౦

క. తామసుడగుమంత్రి నృప । క్షేమము దలపఁడు స్వకార్యసిద్ధియె చూచున్
భూమీశ్వరుండు చక్కఁగ । నీమంత్రుల మువుఱభేద మెఱుగఁగవలయున్ ౩౩౧

గీ. కొందఱధమాధములు శత్రుకోటిబలము । బొగడి స్వచ్ఛందమునుఁదూరి బొంకులాడి
కార్యభేదంబుగావించి ధైర్యమెల్ల । చెరుపుదురు నృపతి కిట్టిరు జెప్పనేల. ౩౩౨

వ. అదిగావున దనుజకులసార్వభౌమా నేనిప్పుడుపోయి రణంబున నమ్మాయారమణి మరణంబు గావించి వచ్చెద నాబింకంబు జూడుమని చెప్పి మహాబాహులగు బాష్కలదుర్ముఖులు రణోన్ముఖులై చని దేవింగాంచి యిట్లనిరి. ౩౩౩

## —: బాష్కలదుర్ముఖులు దేవిపై వెడలుట. :—

ఉ. దేవతలన్ జయించెఁ గడిదిన్ మహిషుండు మహాబలుండు సూ
దేవి నరాకృతింబొనరి దివ్యవిభూషణభాసితాంబరుం
డై విలసిల్లుచున్నను రహఃక్రియలం దనియించువాఁడు నీ
వేవిధినేని వాని వరియించుట యుత్తమపక్షమందు మో
దేవి యతండు నిన్ను పరదేవతగా భజియించు నిత్యమున్. ౩౩౪

క. ఆహా మహిషునిదేహము । దేహమునంటంగ మనసు దీర్చుకొనుము నీ
దేహకమనీయతలు సం । దేహమె కృతకృత్యములుగదే కలకంఠీ. ౩౩౫

వ. అనిన దేవి. ౩౩౬

శా. ఓరీ వెంగళి నోరుమూయుమిఁక నీ యుద్యోగముల్ వ్యర్థముల్
పోరా నే మదనార్తఁగాను పశువుం బొందున్ బశుస్త్రీలకా
చారం బయ్యది సేసికొమ్మనుము నే సర్వేశ్వరిన్ విష్టపా
ధారాకారిణి నైననాన మహిషున్ దండింపగా వచ్చితిన్. ౩౩౭

క. ఓరి చతుష్పాత్పశువా । రా రమ్మను దడయనేల రణరంగమునన్
బారమ్మను నీగళమున । దూరమ్మను నీకు భగవతుల్కఁడువలతుల్. ౩౩౮

క. పోరాస విడిచితేనియు । పోరాము లికేల తోఁక పొట్టనిడుక వే
పోరా రసాతలమునకు । పోరాయనిరేరు దున్న పోతా యనుమీ. ౩౩౯

వ. అనిన విని క్రుద్ధులై బాష్కలదుర్ముఖులు ధనుర్బాణంబులు పూని నిలిచినం గాంచి దేవి సింహనాదంబు చేసి రణోన్ముఖియైయుండ నయ్యిరువురు తీవ్రతరంబగు బాణప రంపరల మునుప భగవతి దేవకార్యార్థసిద్ధికై వారిబాణంబుల నిజబాణంబులం దెగనేసి యతిఘోరంబగు యుద్ధంబు సేయుచో బాష్కలుండు పదరి పరిఘాఘాతంబుల దేవి నేయ నదిగాంచి వానిపై నైదు సునిసిత శిలీముఖంబులనేయ దానవుండు తన శరంబుల వానిఁ దుత్తుమురు సేయ సింహోపరిస్థితయైన దేవి పదిబాణంబుల వాని శరంబులు ద్రుంచి యట్టహాసంబుసేసి యర్ధచంద్రబాణంబున వాని శరాసనంబు భేదించినం గాంచి బాష్కలుండు గదంగొని కదియ రాఁజూచి దేవి నిజగదాపాతంబుల దానవు నేలం బడఁగూల్చిన వాఁడు ముహూర్తమాత్రంబునం దెప్పిరి పునః పునర్గదా ఘాతంబులంఁ దేవినేయ నది సూచి దేవి శూలంబున వాని వక్షంబుఁ బొడువ రక్తంబు గ్రక్కి సచ్చె అదిచూచి రాక్షససైన్యంబు భగ్నంబై చన జయజయేతి నినాదంబుల గగ నంబున బృందారకు లమందానందరసమగ్నులై రంత నతిబలాన్వితుండగు దుర్ముఖుండు కవచావృతుండై ధనుర్బాణధరుండై రథంబెక్కి దేవిం దరసిరాఁ గాంచి యాశీవిషోప మంబులగు బాణంబులేసిన వాఁడదరిపడియుఁ గుదిరి గుండెనిబ్బరంబుచేసికొని బాణవర్షంబు గురియింపఁ దద్బాణసమూహంబులనెల్ల భేదించి యతిఘోరముగా రాక్షససైన్యంబులం ద్రుంప నారణరంగంబు ఉత్తుంగరుధిరరసతరంగంబై చూపర కత్యంతభీభత్సరసోత్పా దకంబై సమకట్టె నప్పుడు. ౩౪౦

సీ. గోమాయుకోటులు కూడి నెత్తురులు ద్రావె । సారమేయములెంప చవులఁ దనిసె
తోడేళ్ళు కండలతో దృప్తి సెందెను. । కాకులు ముక్కుల గరచె నరము
లయ్యయోముఖజాల మాహరించె మెదళ్ళు । కంకాళి దినె పచ్చి పెంకుపొలసు
గృధ్రార్బుదంబులు గ్రీడించె శవపంక్తి । శ్యేనముల్ పచ్చి పెంచికలనెత్తె

కదలి క్రమ్ముకొనె మురుగు కంపుగాలి । గొల్లుమని పిట్టలెల్లను గూయఁదొడఁగె
నల్లగాల్వల మొండెముల్ నడచితేలె । రణము భేతాళగణనాట్యరంగమయ్యె. ౩౪౧

గీ. అంతగోపించి దుర్ముఖుం డతిభయంక । రస్వరంబున గద్దించి ప్రస్ఫుటత్క-
పోలుఁడై పల్కె దేవితో భూరివారి । దమ్మునా పొమ్ముపొమ్ము చండాలి చండి. ౩౪౨

గీ. పోక రణమొనరింపఁగాఁ బూనితేని । దినము మూడెను నీకు సందియములేదు
వెఱ్ఱి నీకేల శీఘ్రంబ బఱ్ఱెరేని । బిఱ్ఱుకౌగిట నఱ్ఱిడు కుఱ్ఱదాన. ౩౪౩

క. అని బాణవృష్టిఁగురిసినఁ । గని దేవి స్వకీయనిసితకాండంబులచే
తనుద్రుంచెను వెండియు వా । డును నేయఁగ నిట్టు లట్టులుం బటుగతులన్. ౩౪౪

వ. పోరతిఘోరంబయ్యె నయ్యెడ నయ్యంబ వాడిగల యమ్ములచే నతనిరథమ్మును భిన్నమ్ముచేసి యార్చిన వాఁడు పదాతియై గదఁగొని సింగంబుతలపై వ నదిబెదరక నాదంబు సేసి నిలువంబడం గాంచి దేవి సితధారంబగు ఖడ్గంబున వానిఁ దెగనరికి మృతుంజేసి యట్టహాసంబు సేసె. నదిసూచి రక్కసులుక్కుదరిగి వెక్కివెక్కి యేడ్చుచు పలుదిక్కులం బరచిరి. దేవిపై దేవతలు ముదంబునం బుష్పవర్షంబులు గురియించిరి. సిద్ధగంధర్వవిద్యాధర కిన్నరకింపురుష ఋషిగణంబులు హర్షంబునొంది రిట్లు బాష్కల దుర్ముఖుల మరణంబులు విని మహిషుండు క్రోధమూర్ఛితుండై దానవులం జీరి యిట్లనియె. ౩౪౫

సీ. వింటిరే జరిగిన వృత్తాంతమెల్లను । బాష్కలదుర్ముఖుల్ పడిరి కలన
నక్కజంబగు నొక్క యంగన యిటుసేసె । దైవచేష్టితము దుస్తరము గనఁడు
కాలంబు సుఖదుఃఖకారణంబగు నిందు । స్వాతంత్ర్యమున్నదే జంతువులకు
మున్నుజేసినయట్లు పుణ్యపాపంబుల । వలన మేళ్ళునుకీళ్ళు వచ్చుచుండు
చచ్చి రిరువురుశూరులు సంగరమున । వెండియుం జేయదగునట్టి వెరవుసూడు
డసురు యశంబునకు హాని యగుట కోర్వ । దరమె నావుడు ననియెఁ జిక్షురుడు గినుక.

గీ. ఆడుదాని జంపు టరిదియే దనుజేంద్ర । వడఁక నేల నీవు గడియలోన
దానిని హతజేసి తగవచ్చి నీ బహు । మానమందువాఁడ మహితలీల. ౩౪౬

## —॰ చిక్షురతామ్రులు దేవిపై వెడలుట ॰—

చ. అని రథమెక్కి సైన్యతతి నంతటనంతట నిల్పి తామ్రునిం
దనకు సహాయుజేసికొని దర్పమొలర్పఁగ సైన్యఘోషసం
జనితభయోద్గతిన్ దివిజసంఘము గంపిల నేగుదేర న
జ్జననియు జూచి యొత్తెను ప్రసన్నదివ్యశంఖము భూరిశంఖమున్. ౩౪౭

క. ఆ నినదము విని దానవ । సేనలు గుండె లదరంగఁ జెల్లాచెదరై
పూనిక కొనసాగదనుచు । వేనడచిరి కాలికొలది విహ్వలమతులై. ౩౪౯

వ. అట్లు కాందిశీకులై పరచు దైత్యసైన్యంబులం గాంచి చిక్షురుండు చేయెత్తి పేరెలుంగున
నో దైత్యులారా పరవకుండు పరవకుండు వెరపులేదు. ఈమదవతిని సునిసితప్రదరంబుల
నెద గాడనేసి చంపెద చూడుమనుచు విల్లంది దేవిం గాంచి యిట్లనియె. ౩౫౦

తరువోజ. కమలాక్షి నీవిట్లు గర్జిల్లి దైత్య । సముదాయంబుల కార్తి సలిపెదే చూడు
ప్రమదనుఁజంపుట పాతకంబనుచు । క్షమియించితినికాని కాకున్న నొక్క
నిమిషంబులోపల నిన్ను ఖండించి । యమరారి నఁగరింతు నధియెఱుంగవాకొ
సమదేభమునుఁ జూచి సారమేయంబు । కమిచి మొఱంగినగతి బొబ్బరిలెదె ౩౫౧

సీ. విలసితంబైన భ్రూవిక్షేపమేగాని । విలుబట్టివంతురే వెలదు లెందు
కమనీయవరకటాక్షప్రేక్షణమెగాని । యమ్ము సంధింతురే యబ్జముఖులు
శృంగారమృదుహాసచిహ్నమ్ములేకాని । కన్నెఱ్ఱసేతురే కాంతిమతులు
అందమ్ముగా రెప్ప లల్లార్తురేకాని । బొమముడిసైతురే పూవుబోండ్లు
కామశాస్త్రంబులేకాని కదనశాస్త్ర । విహిత కర్మంబులే నీలవేణులకును
జాజిపూదండవంటి నీ చక్కనైన । యొడలు సితశరముల నొంపఁ గఁడగిఁ తకట. ౩౫౨

వ. అని తనలో. ౩౫౩

గీ. క్షాత్రజన్మాను జీవియా జనునిజన్మ । మెంతపాపిష్టమయ్యెయో యింపుసొంపు గుల్కు
మృష్టాన్నమును మెక్కి జల్కమాడి । బాగుజేసిన మయిశరప్రతతి కిచ్చు. ౩౫౪

క. ధనలోభంబునకాదా । దనదేహము పరుల ఖడ్గధారలకిచ్చున్
ధనమేటికి దుఃఖంబును । గొనివచ్చునకాదె సుఖము కొంచెముగలదే. ౩౫౫

క. లలనా నీకును దెలియదె । కలనకు నిట్లేల మదిని గాంక్షించెదు న
శ్చలసంభోగజసౌఖ్యము । నలరింపక సంగరమున నలయగనేలా. ౩౫౬

గీ. కత్తిచేఁజచ్చువానికి గజముఁచేతఁ జచ్చువానికి సునిసిత శరముఖములఁ
జచ్చువానికి మరణాంతసమయమందు । జంబుకంబులె గతికాదె సంస్కరింప. ౩౫౭

క. పోరునఁజచ్చినవారికి । వీరస్వర్గంబటంచు వినిచిరి ధూర్త
ప్రారంభకులగు కుకవులు । వారిపలుకులెల్ల యర్థవాదములు సుమీ. ౩౫౮

గీ. అదికతమ్మున పొమ్ము వరాంగి నీవు । ఇచ్చవచ్చినచోటికి నెచటికేని
కాక తక్కిన దుంతరక్కసునిజేరి । పుష్పచాపునిసుఖములఁ బొందు మబల. ౩౫౯

వ. అనిన దేవి యిట్లనియె ౩౬౦

ఉ. ఉండుము నోరుమూసికొని యోరిదురాత్మక మూఢబుద్ధితో
పండితులట్లు నీతులను బల్కెదు ధర్మ మెఱుంగ లేవు ధీ
మండితులైనవారికడ మంచివిచారముతో మెలంగ వె
న్నండును క్షాత్రధర్మము లనంగ నెరుంగుదె మూర్ఖసేవకా. ౩౬౧

చ. సమర మొనర్చి యమ్మహిషుఁ జంపి తదీయమహోరురక్తక
ర్దమమున గీర్తి కంబము దిరంబుగ నిల్పి యథాసుఖంబుగా
సమరుచిం పుష్పవర్షముల నందుచు మౌనిగణస్తవంబులం
విమలమనీషఁగర్ణముల విందును బోయెమి రాక్షసాధమా. ౩౬౨

వ. అనినవిని చిక్షురుండు క్రోధరక్తాక్షుండై దేవిపై బాణవర్షంబు గురియ నయ్యంబ యతిసునిశితశిలీముఖంబుల వానిశరంబులాపికొని నిజచాపసముద్భంబులైన దివ్యాస్త్రంబుల నతనిముంచె నిట్లిరువురకు నత్యుగ్రంబగు సంగ్రామంబు వాటిల్లె. నత్తరి దేవీ బాణపరంపరలు గాడి చిక్షురుం డచలంబుంబోలె రథంబుపైఁబడినఁ గాంచి తామ్రుండు దేవింగవిసిన నతిఘోరతరనినదంబుపుట్ట నట్టహాసంబుసేసి చండి వాని కిట్లనియె. ౩౬౩

క. రారా రాక్షసవర్యా। సూరాత్మజ లోక మిపుడె సూచెదులే నీ
బీరాలకు జంకెదనే। నీ రాజేమూల దాగి నిలచెం జపుమా. ౩౬౪

క మీరెంతటివారలు మీ। పేరేమి వృథాశ్రమంబు పెట్టెద రేలా
వే రమ్మను మీరాయని। పోరాదా మీకు బ్రొద్దు పోదా యురకన్. ౩౬౫

గీ. చచ్చినఫలంబు మీరలు చావకున్న। ఫలమును సమంబె మహిషుండు పడియెనేని
దేవతలు సంతసింతురు దివ్యమునులు। హర్షమొందుదు రేనును నరుగుదాన. ౩౬౬

వ. కావున వెంగలివై సంగరంబుసేయక గృహంబునకేగి మహిషుం బంపుము. వాడు నారూపంబు సూచుంగాక యనిన విని తామ్రుండు బాణవృష్టిం గురియింప రుషాతామ్రాక్షియై దేవి నిజశరాశంబుబూని మహాజలనాడీగతగ్రహరాజుం బతివృష్టింబోలె శిలీముఖ ధారాపరంపరల ముంచిన నంత జిక్షురుండు మూర్ఛందేలి తామ్రుంగూడి యిరువురు కుపితులై దానవసైన్యంబులఁ బోగుసేసికొని రాఁ జూచి దేవి యనంతాశుగంబుల రాక్షస సైన్యంబులఁ గూలవైచె. నమ్మహాసంయుగంబున దేవతలు విస్మయమందిచూడ తామ్రుండు ముసలంబుఁ గొని దేవియెక్కిన సింగంబుం బొడిచి యట్టహాసంబుచేసినం జూచి భగవతి రుషాన్వితయై వాలుంగొని పిలుగాఁ జూచి వానిశిరంబునేయ ఛిన్నశిరుండై నేత్రులు గ్రక్కుచుఁ బెద్దనిదురవోయె. నంత చిక్షురుండు తామ్రుండు గూలుటం జూచి ఖడ్గంబుం గొని చండికపై నురక చండి తన ఖడ్గంబున వాని ఖడ్గంబుఁ దునిమి రెండవదెబ్బ వాని మస్తకంబు నరికె. నిట్లతిక్రూరులైన తామ్రచిక్షురుల మరణంబులు సూచి దివిజులు సంతసిల్లి జగన్మాతపై పూలవాన గురియించిరి. గంధర్వ వైతాళ సిద్ధ చారణాదులు జయజయ

శబ్దంబులు పలికిరి. ఇది విని మహిషుండచ్చెరువడి యసిలోమ బిడాలాదులగు దానవుల నాయోధనార్థంబు బంప సింహోపరిస్థితయు అష్టాదశభుజయు దివ్యయు ఖడ్గఖేటకధారిణి యునగు దేవిం గాంచి యున్నతరి నసిలోముండు ముందునడిచి వినయావనతుండై శాంతుండై దేవింజూచి యిట్లనియె. ౩౬౭

క. అమ్మా నిన్నొకటడిగెద । సమ్మతితో దెలుపుమమ్మ సత్యము నాకున్
వమ్మెరుగని దనుజులతో । నిమ్మాడ్కి రణంబు బూన నేమికతంబో. ౩౬౮

ఉ. సొమ్ములు గోరెదో రుచుల జొప్పడునట్టి యనర్ఘ్యరత్న పుం
జమ్ములు గోరెదో మదగజమ్ముల గోరెదొ చారు సూత్నవ
స్త్రమ్ములె గోరెదో కనకరాసియె కోరెదొ యిచ్చవచ్చిన
ట్లిమ్ముగ గాంచి యేగు మనియేటికి సంధికి నియ్యకొమ్మికన్. ౩౬౯

చ. సకలసుఖావహంబయిన శాంతిని బోవిడనాడి యిమ్మెయిన్
సకలసుఖాపహంబయిన జన్యము గోరఁగనేల జాజిపూ
లకు గసుగందు నీకరతలమ్ములకోరులఁ బట్టనోవ్వదే
వికచసరోజనేత్ర విను వేగిరపాటున సేగి వాటిలున్. ౩౭౦

చ. మునులు జనుల్సురల్ మువురు మూర్తులు దానవులెల్లవారు నెం
దును సుఖముం గనందలచి తోచినరీతి దపోవ్రతార్యవం
దనఘనకార్యకారులయి తప్పక వర్తిలుచుందు రర్థికా
వున గడుహేయమై యిడుమ బుచ్చెడి యుద్ధమిదేల మానినీ. ౩౭౧

వ. మరియు సుఖంబు నిత్యానిత్య భేదంబుల ద్వివిధంబై యుండు నందాత్మజ్ఞానజంబగు సుఖంబు నిత్యంబు భోగజంబగు సుఖం బనిత్యంబునని పెద్దలు సెప్పుదురు. వైదికులు నాశాత్మకంబగు క్రియలం బరిత్యజింతురు సౌగతంబు నవలంబించినను బ్రకృతసుఖ సంపాదన ప్రయత్నం బవశ్యకరణీయంబగు యౌవనంబున ననుభవింపదగిన భోగంబులం దిగనాడెదేల పరలోకంబున నిత్యసుఖంబు కోరుటయ పరమశ్రేయంబు యౌవనంబనిత్యంబు కాన ధర్మార్థకామంబులకు విరోధంబు లేకుండ మోక్షార్థియై పురుషుండు ప్రవర్తింపవలయు కావున ధర్మంబునకు మతిమరల్పుము యపరాధములేని దైత్యుల కపకారంబుసేయుట ధర్మంబుకాదు. ధర్మంబునకు దయాసత్యంబులు ప్రాణంబులు కావున నవి రెండును సర్వదా రక్షణీయంబులు. వెండియు వినుము. ౩౭౨

క. గోదానశతంబైనన్ । భూదానముసాటి యవ్వి నూరైనన్ గ
న్యాదానము సరి యవి నూ । రై దయతో సాటివచ్చునా మృదుతన్వీ. ౩౭౩

క. నారీమణి దనుజవధకు । గారణముం దెలుపు మేమి గావించిరొకో
నేరము నీకు నకారణ । వైరము తగదమ్మ యెఱుగవా యిది కొమ్మా. ౩౭౪

వ. అనిన విని దేవి యొక్కింత మనంబునం బరికించి యద్దనుజకులోత్తముం జూచి
యిట్లనియె. ౩౬౫

గీ. నేను వచ్చినపని విను దానవేంద్ర । జగమునఁ జరింతు నిత్యంబు సకలభూత
ములను న్యాయము నన్యాయమును నరయుచు । ధర్మపరుఁ బ్రోతు ద్రుంతు నధర్మపరుని.

క. రక్షింతు సాధుజనులను । శిక్షింతు నసాధువులను జెప్పగనేలా
రాక్షసు లధర్మపరులు సు । రక్షోభ మొనర్చి రేను రా బనిగలిగెన్. ౩౬౬

గీ. యుగయుగంబున నవతార యుక్తిఁ జేసి । సాధురక్షణ మొనరించి సకలదుష్ట
శిక్ష గావించి హరి హరుల్ చేయుపనులు । ప్రేరితంబులు నాచేత పృధుబలాఢ్య. ౩౬౭

గీ. మహిషుడు సుధాశనుల కిడుములు ఘటించె । వాని వధియింప వచ్చితి నేను దనుజ
పోదలచితేని వే పొమ్ము కాదయేని । నిలువు మీవేల మహిషుని బిలువరాదె. ౩౬౮

వ. నీవు మహిషునికడకుంబోయి నా చెప్పిన విధంబునం జెప్పి యుద్ధమునకు రమ్మను మటు
కాక సంధిక నిచ్చకలదేని దేవలోకంబు విడిచి శీఘ్రంబ పాతాళంబున కసురగణంబు
లతో బొమ్మనుము. నావుడు విని యసిలోముండు బిడాలుంజూచి యిట్లనియె. ౩౭౦

ఉ. ఏంటె భవాని చెప్పినది పిల్లులరాయఁడఁ యిట్టులుండఁగా
నంటునె సంధివిగ్రహము లక్కట సేయున దేమియున్న దీ
తంటలు వ్యర్థముల్ మఱొక దారి పొసంగునె చెప్పుమన్న న
మ్మంటలమారి దున్న యభిమాని యెఱుంగవె సంధి కొప్పునే ౩౭౧

ఉ. చచ్చినవారి జూచుఁ జను జావగ నంపెడి నున్నవారలన్
వచ్చినవారిలో మరల వాని గనుంగొనినట్టివారు లే
ర చ్చపలుండు రాజగుట నాతడు సెప్పిన పూన్కి మానగా
వచ్చునె చచ్చినన్ బ్రతికినన్ బరతంత్రులపాటు లిట్టివే. ౩౭౨

క. ఈ కఠినజల్పితంబుల । నేకరణిన్ మహిషునకును హేయోక్తి నధో
లోకమునకు వడి నేగుము । నాకంబును విడిచి యనుచు నాడెదము చెలీ. ౩౭౩

గీ. ప్రియముగానట్టిదది సత్య మయిననేమి । నోరుమెదలింపరాదంద్రు ధీరు లిందు
వీరుడగువాఁడు ఫల్గుప్రచారములను । ప్రభువునకుఁ జెప్పబూనఁ డెప్పనులనేని. ౩౭౪

క. ఎక్కార్యంబులనేనియుఁ । దక్కువపలుకులను బలుక దగదు నృపునితో
వెక్కసముగఁ దోఁచినచో । నిక్కంబుగ మృతియ మేలనిరి బుధవర్యుల్. ౩౭౫

క. బ్రతుకు మెతుకు జెడుననుచుం । జతికిలబడరాదు భటుడు స్వామిపనులయం
దతుకు సెడనీక ననిలో । మృతినొందుటకంటె గలదె మేలు ధరిత్రిన్. ౩౭౬

## —: అసిలోమ బిడాలురు దేవితో యుద్ధంబు సేయుట :—

వ. అని యుద్ధంబునకు సన్నద్ధులై యసిలోమ బిడాలులు నిలచి రందు బిడాలుండు బాణ సప్తకంబునం దేవి నేయ బాణంబులు నడుమ నిరిసిపడంజేసి వెండియు రెండు సునిసితశరంబుల శిరంబు గాడనేయ బొలబొల నెత్తురులు గ్రక్కుచు పడి చచ్చె నదిసూచి యసిలోముం డురువడించి చేయెత్తి భగవతిం జూచి యిట్లనియె. ౩౮౭

చ. ఎఱుఁగుదు దేవి దానవులఁ కియ్యదియే ప్రళయంబటంచు మా
దొరకు ప్రియంబు సెప్ప జెవి దూరదు భూపతికిం బ్రియుండనై
పరగెద వీరధర్మము ప్రభావము సూపెదఁగాక చండి నే
దురమొనరింతు నంచు దన దోర్బలపాటవమార నుర్వుడిన్. ౩౮౮

గీ. దేవిమీద నిసిత తీవ్రబాణములేయ । గనలి యార్చి వాని కాండతతులఁ
దుమురుచేసి వాడితూపులఁ బూచిన । మోదుగట్లు జేసెఁ బూర్వదేవు. ౩౮౯

వ. అంత దైత్యుండు బెదరక గదగొని దేవిపై నురికి సింగంబునేయ నది మ్రొగ్గక నఖాఘాతంబుల నతిఘోరవ్రణాంకితుం జేసి తక్కురక్కసులపై నురికి చెండాడె నంత రక్కసుండు రక్తధారాసిక్తాంగుండయ్యుం దేవిపై మరల గవియ, నసిధారం గంఠంబు నరికిన దల దెగి యసిలోముండు మడిసె నది సూచి దేవదుందుభులు మొరసె. విమానారూఢులై బృందారకు లత్యంతానందంబునం దేవిపై బుష్పవర్షంబులం గురియించిరి. జయజయధ్వనుల జెలరేగి యార్చిరి. రాక్షసబలంబుల హాహాకారంబులు పుట్టె. హతశేషులు మహిషున కది చెప్పిన వాఁడు శోకాకులుండై దారకుం జీరి యిట్లనియె. ౩౯౦

క. జవజంఘాలములై పటు । రవకములగు వేయి గాడ్దెలం గట్టి లస
న్నతకేతనమేదురమై । తివురు రథంబొకొడు వేగ దె మ్మిచ్చటికిన్. ౩౯౧

క. నావుడు దారకుఁ దట్టుల । గావించిన జూచి మనుజఘస్మరుడు మదిం
భావించె మానవాకృతి । తో విమలాంగి నలరింతు ద్రుటిలో ననుచున్. ౩౯౨

## —: మహిషాసురుఁడు దేవిపై దండెత్తుట. :—

సీ. బెడగైనపంగవా ల్నిడుదకొమ్ములు మాని । రహిమించు గలికితురాయి పెట్టి
కడుజల్లికుంచియ కలమతోకను మాని । డాలైన పట్టుదట్టీ బిగించి
దంపముం పెసలారు రొంపిత్రోలును మాని । సరిగంచు గింటెంబు జారకట్టి
యొడ్డసాపుననిడ్డ యుద్ధకాళుల మాని । హొయలుగా రెండు కాళ్ళూని నిలచి
చిప్పపెంకులసరి గొరిసెలను మాని । పంచనఖమైన పాదయుగ్మంబు దాల్చి
పోతరించిన పోతురూపు కడబెట్టి । వన్నెకాడయ్యె మహిషదేవద్విషుండు. ౩౯౩

వ. ఇట్లతిసుందరంబైన మానుషవేషంబు ధరించి మహిషుండు మహావీరులయిన దానవసైన్యపతులు వెంటం జనుదేర నత్యంతసంతోషంబున దుర్నిమిత్తంబులు లెక్కసేయక చని దేవీసమీపంబు సేరి మధురంబులగు వచనంబుల నో దేవీ! యీ సంసారచక్రంబున స్త్రీపురుషులకు సుఖంబనునది సంయోగంబువలనం గలుగు, సంయోగంబు ప్రీతిజంబనియు, స్వాభావికంబనియు ద్వివిధంబు. ప్రీతిజంబులగు సంయోగంబుల ముందు బరిగణించెద నెట్లన ప్రథమంబు మాతాపితృసంయోగం బది యుత్తమంబు, భ్రాతృసంయోగంబు మధ్యమంబు. మొదటిది యుత్తమసుఖదాయి యగుట నుత్తమంబు, రెండవది మధ్యమసుఖదాయి యగుట మధ్యమంబు. నావికాదుల సంయోగంబు స్వాభావికం బది యత్యల్పసుఖదం బగుట నధమం బనంబడు. నారీపురుషుల సంయోగం బత్యుత్తమంబు, మరియు నది చాతుర్య రూప వేష కుల శీలాది గుణోత్కర్షంబులంబట్టి యత్యుత్కృష్టసుఖదం బగుటచే యుత్కృష్టసంయోగంబై వర్తిల్లు. నీవు నారివి, నేను పురుషుండ. కులశీలాదిగుణంబుల నుత్కృష్టుండ నగుటంజేసి మత్సంయోగంబున నత్యుత్కృష్టంబగు సుఖంబు నీకుం బ్రాప్తింపంగలదు. అదియుంగాక వినుము. ౩౯౪

గీ. అమరవిభు గెల్చి మూడులోకముల కేను । ప్రభువనైతినిఁ గోరెదే రత్నములను
రత్నసానువు నీదకా రాణివగుచు । నన్ను గైకొమ్ము సుఖ మింతకన్న కలదె! ౩౯౫

గీ. సకలలోకేశ్వరి నీకు శరణు శరణు । శరణ మీవగదా నాకు చారుగాత్రి
నిలువజాలను మన్మథుని శరములకు । నాతురుడనైతి నిదురేడ నశనమేడ. ౩౯౬

క. శరణాగతరక్షణమే । పరమంబగు ధర్మమనుచు బలికిరి పెద్దల్
కురు కరుణాం దైన్యం నా । చరితం జన్మప్రభృతి విశాలాక్షి మయా. ౩౯౭

క. అని మ్రొక్కి యిట్లు ప్రార్థిం । చినవాఁడన్ బ్రహ్మ విష్ణు శివులను యుద్ధం
బున నోడించిన నే నీ । కును దాసుఁడనైతిని గనుగొనుమా మొగమున్. ౩౯౮

## —• దేవీమహిషాసురుల సంవాదము •—

గీ. నావుడును దేవి యొకవింత నవ్వు నవ్వి । పరమపురుషునిదక్క నే పరులగోరు
దానగా నెల్లజగముల ధాత్రి నేన । ప్రకృతి పురుషునిదేకాక పరులసొమ్మె. ౩౯౯

క. పురుషుని సాన్నిధ్యంబున । బరగుం జైతన్యమహిమ పరమపురుషునిం
దొరగినపుడు జడ నగుదున్ । బోరి నినుమును సూదిగంటు పోలిక నసురా. ౪౦౦

క. కామిని యనునది సంకెల । భూమి నయోమయము విడచి పోవఁగవచ్చున్
స్త్రీమయము గెడప దరమా । యో మందమతీ గృహేచ్ఛ నుడుగింపు మికన్. ౪౦౧

క. నారీసంగము దుఃఖద । మోరి జడుడ శాంతిగలిగి యుండుము సుకమున్
గోరితివేనియు నీకున్ । వైరంబేమిటికి నాకవాసులతోడన్. ౪౦౨

గీ. పొమ్మధోలోకమున కిఁకఁ బోరుమాని । కాదయేనియుఁ గదలుము కదనమునకు
మదము వదలింతు నా దివ్యమహిమ యెఱుఁగ । కిట్టులాడెదు కట్టిడి వేమనందు. ౪౦౩

వ. అనిన విని మహిషుండు. ౪౦౪

గీ. ఓసి వగలాడి యెఱుఁగవా యీ సరాగ । మింతులకు సహజమే నన్ను నింతసేపు
వంతలం బెట్టనేటి కావంతకరుణ । వాలుచూపుల దనుపవే చాలు బిగివి. ౪౦౫

గీ. కటకటా యెట్లు నీదు బంగారుమేను । నుత్తలంపడజేయుదు నువిదమిన్న
మల్లెపూచెండు బగ్గను మంటలోన । వైచుటయెకాదె యిది సూడ వన్నెలాడి. ౪౦౬

గీ. మదగజేంద్రంబు కుంభమ్ము మెదడు దినెడి । సింగ మెలుకను సాధింపజేసినట్లె
హరిహరాదుల గెల్చిన యట్టి నాకు । నిన్ను వధియింపబూనుట సన్నుతాంగి. ౪౦౭

క. నాకుం గూర్చినదానవు । గాకున్నను పోరుమాని కదురయమున ని
ర్భీకత వచ్చినదారినపో కేటికి దడసె దలరుబోణి సుపాణి. ౪౦౮

ఉ. ముద్దులుమూటగట్టుముఖమున్ ముఖమందిడి పంచదారతో
దిద్దినమోవి యాని వెలదీ నినుఁ గూడుటమాని నిర్దయన్
గద్దలు కాకులుం గొరికి కండలు దోకొనిపోవ గత్తిచేఁ
బ్రద్దలుజేసి నీతనువు బ్రాల్పఁగఁ గోమలి చేతులాడునే ౪౦౯

క. కాంతకు గాంతునియందే । కాంతునకుం గాంతయందె కలదు సుకము నీ
వింతయెరుంగవె నాతో । బంతమ్మున కొక్కొ వింతభావము కంటే. ౪౧౦

క. నాపై బాణములేసెడి । యా పుష్పశరాస్త్రిఁ దేల యబలా శరముల్
నీపై నేయం దేసిన । నీపలుకులు పలుకనేల నిందునిభాస్యా. ౪౧౧

క. దేవతలతోడ గలసెనొ । కో వలరే దో మృగాక్షి కొట్టదు నిన్నున్
భావమునఁ బంచబాణున । కేవిధి నింతటివిరోధ మేర్పడె నాతోన్. ౪౧౨

క. హరి గమలాలయ గూడెన్ । హరునిం బార్వతియు గూడె నబ్జభవుని వా
గ్వరగాత్రి గూడె జగమున । పరుఁబలలో నెవరు పురుషుఁ దలఁపరు సెపుమా. ౪౧౩

## ....: మందోదరియను దాని కథ :....

వ. ఇదియుంగాక వినుము మత్తకాశినీ మున్ను యోగ్యుండైన పతిని విడిచి శఠుండగు వాని వరించిన మందోదరియుంబోలె దుదకు నీవును బశ్చాత్తప్తవయ్యెద వనినం దేవి యది యెచ్చటికథ దానవాధమా యనుడు నయ్యసురుండు మందోదరీవృత్తాంతంబు సెప్పెద వినుమని యిట్లనియె. ౪౧౪

సీ. వినుము పద్మదళాక్షి పృథివీతలంబున । సింహళంబను నొక్కసీమ గలదు
దానిప్రభువు చంద్రసేనుం డతనిభార్య । గుణవతి యామెకు గూతు రొకతె
పేరు మందోదరి పెనిచె రాజన్యుండు । ప్రేమతో నక్కన్యఁ గోమలాంగి
పదియేండ్లచిన్నదై ప్రాయంపు టొయ్యార । ముల నొప్పఁజూచి పెండిలికిఁ దగిన
వరుని బరికింప బంపె భూసురుల వారు । పోయి మద్రేశ్వరుని సుధర్మపుత్తు డగుచు
సకలలక్షణలక్షిత ప్రకటు డగుచు । సుందరుండైన యొక్కనిఁ జూచివచ్చి ౪౧౫

వ. రాజేంద్రా మద్రధరాధీశుని కొడుకు కంబుగ్రీవుడనువాఁడు నీకన్యం బరిగ్రహింప యోగ్యుం డని పల్కిన విని రాజు నిజభార్యకుం దెలిపిన నాపె కుమారికం గాంచి యో చిన్నకూనా నిన్ను గంబుగ్రీవుండను రాజకుమారున కీదలంచె మీతండ్రి యని చెప్పిన నక్కన్నియ తల్లి కిట్లనియె. ౪౧౬

తరువోజ. ఒల్లనొల్లను పెండ్లియొల్ల నోయమ్మ । తెల్లంబు భూలోకదేవేంద్రుడైన
తల్లిరో యతడు కందర్పుండెయైన । నిల్లాలగాను నే నెవ్వనికేని
చల్లగా నే బ్రహ్మచర్యవ్రతంబు । చెల్లింతు నవిరతశ్రీ గాంతుఁ బిదప
కల్ల లీ సంసారకథలెల్ల నమ్మ । కల్లగాదమ్మ యక్కరలేదు మగఁడు. ౪౧౭

క. పరుల కొడలమ్మువారికి । పరమసుఖము గలదె యెందు స్వాతంత్ర్యమునం
జరియించెద సుఖమందెద । వరవర్ణిని నాకు నేల వరుడున్ గిరుఁడున్. ౪౧౮

చ. అనలుని సన్నిధి న్నిలచి । నాతిచరామి యటంచు బల్కి య
త్తను మరి మామను న్మరది నవ్వల బావను నాడుబిడ్డలన్
మనములు నొచ్చునో యనుచు మాటికి మాటికి నొత్తు లొత్తుచున్
దినములు బుచ్చగావలయు దీనికి నెక్కుడురోత యున్నదే. ౪౧౯

ఉ. ఇన్నిటికంటె నెక్కుడు నిజేశుని మాటను దాటరాదు సే
వ న్నిరతంబు దైన్యమె వివాహమువల్న సుఖంబులేదుగా
కన్నెలకు న్సపత్నిగలుగన్ బెనుభూతము పట్టుదేకదా
తన్నుకచచ్చుటే వినుము తల్లి కుటుంబము నెత్తికెక్కినన్. ౪౨౦

వ. తల్లీ సకలధర్మజ్ఞుండును నీతికోవిదుండును నైన యుత్తానపాదుండను రాజన్యుండు గలడు. అతని కుమారుండు ధ్రువానుజుండు ధర్మపరయు సాధ్వియు భక్తిపరాయణయు నగు నిజభార్యం దయలేక యరణ్యంబున విడువంజేసెనట యిట్టి చరిత్రంబు లింకను గలవు. కాలకర్మవశంబున వైధవ్యంబు ప్రాప్తించెనేని యంతకంటె నెక్కుడగు దుఃఖంబువేఱేదు కావున వివాహంబు నొల్లనని చెప్పిన తల్లి:తన భర్త కిదియెల్లం జెప్పిన నతం డట్లగాక యని యూరకొన్నం గొంతకాలంబునకు నక్కన్నియకు దృఢతరంబగు యౌవనంబు

సంప్రాప్తంబగుటం జూచి చెలికత్తెలు వివాహంబు సేసికొమ్మని యెంత ప్రేరేచిన వినక
నిశ్చలమానసయై యున్న నొక్క సమయంబున. ౪౨౧

క. మందోదరి తన చెలులగు సుందరులం । గూడి విటపి శోభితమగు తో
టం దిరుగుచు నొకనాఁ డా । నందంబున నందమైన ననలం గోయన్. ౪౨౨

గీ. మార్గవశమున గోసల మనుజవిభుఁడు । వీరసేనుం డనెడి మహావీరుఁడొకఁడు
రథముపైనెక్కి చూపుదూరమున బోవ । చెలియ లాతనిఁ గాంచి య చ్చేడెతోడ. ౪౨౩

గీ. అక్కరో దారి నేగెడి నొక్కనృపతి । యెవ్వఁడో తేరిపై నెక్కి నివ్వటిలుచు
ననుచుఁ దెలుపుచునుండగ నంతలోన । రేడు చెంగటి కరుదెంచి చేడె జూచి. ౪౨౪

చ. అపు డొక యూడిగంపు చెలి నాతఁడు బిల్చి యొహో వరాంగి యే
నృపునకుఁ గూతు రీ చెలియ యెవ్వతె నావుడు నీవు సెప్ప మే
నృపునిసుతుండ వో యనఘ యెవ్వఁడవో యన నేనుఁ గోసలా
ధిపుఁడను దారిదప్పి యరుదెంచితి సైన్యము వెన్క వచ్చెడిన్. ౪౨౫

ఉ. మా దొర చంద్రసేనుఁ డతిమానుషచర్యుఁడు వానిబిడ్డ మం
దోదరి యిద్ది నావుఁడు మహోజ్జ్వలతేజుఁ డితండు పల్కెఁ గా
కోదరవేణి యియ్యువతియు న్నృపపుత్రిక నేఁ గకుత్స్థవం
శోదితుఁడన్ గడున్నియతి నుంటిని నే నవివాహితుండనై. ౪౨౬

వ. కావున నన్నుల గాంధర్వవిధి గైకొను మనుము. ౪౨౭

క. అనిన విని చెలియ నేర్పున । వనితామణి జూచి పలికె బాలా యీతం
డనఘుండు గోసలాధిపుఁ । డనుకూలవిభుండ నీకు నయ్యెద ననెడిన్. ౪౨౮

సీ. ఆమాట విని నవ్వి యతివ వెట్టివె నీకుఁ । దెలియదే నా వ్రతస్థితి లతాంగి
పెండ్లి యొల్లదు కన్య ప్రథిపీశ పొమ్మని । పల్కుము నా నది పతికిఁ దెలుప
నతఁడు నిరాశుఁడై యరిగె నింతట దాని । చెలియలి యౌవనస్థితి నెఱింగె
నరనాథుఁడును స్వయంవరమనుఁ జాటింప । వరియించె నది యొక్క పురుషసింహు
నపు డొక్క స్మరాతురుం డతిశఠుండు । చేరి మందోదరిని నేర్పుచేత మఱపఁ
దండ్రితో నిట్టులనియె న త్తరుణి జనక । పెండ్లియాడెద మద్రభూమిపతిని ననిన. ౪౨౯

గీ తండ్రి సంతసించి తనయకుఁ బెండిలి । సేసి యరణమిచ్చి చెలఁగి చారు
దేష్ణుతోడ ననుప ధృతి నాతఁడును భార్య । సరిగఁ గొంచుఁజనియె స్వపురమునకు. ౪౩౦

వ. ఇట్లు చని కొంతకాలంబు మందోదరితో గందర్పసుఖంబు లనుభవించుచు నొక్కనాఁడు
కామాతురుండై చారుదేష్ణుం డొక సేవకునిపత్నిం గలసి సుఖించుచుండం గాంచి
వచ్చి సైరంధ్రి చెప్పిన విని మందోదరి తనలో. ౪౩౧

గీ. అయ్యయో మోసపోతి నే యౌవనంపు । మదము న న్నింతఁ జేసె నాపదలసొక్కి
చిక్కఁజేసెనుఁ జేఁజేతఁ జేసికొన్న । దనుభవింపక తీరునే మనుజులకును. ౪౩౨

చ. కడుతమకమ్మునం బొరలు గ్రమ్మెను గన్నుల కేమిసేయుదున్
బడుచుదనమ్మువంటి పరిపంథి జగమ్మున లేదు వీడు యో
గ్యుడని మనమ్మునం దలఁచి యూరక నేఁ జెడితిన్ విరుద్ధముల్
నడచెను వ్రాత తప్పి చనునా విధి వ్రాసెను మూడుపంక్తులన్. ౪౩౩

ఉ. పెండిలి వద్దటంచు మొఱ పెట్టితిఁ బెట్టితిఁ దండ్రి కాతఁడున్
దండన సేయకోర్చె నిక దా చిరకాలము కోసలాధినా
థుండును గోరినం గనక దూరితి నెక్కడినుండి వచ్చె ని
మ్మిండడు పూని త్రావితి భ్రమించి పయోముఖకాలకూటమున్. ౪౩౪

క. వలపుంగత్తెల మఱఁగెను । బలవన్మరణంబు నాకు బ్రాప్తించునొకో
కలదే సౌఖ్యము పురుషుల । వలనన్ గృహమేల నాకు వల్లభుఁడేలా. ౪౩౫

క. బలవన్మృతి నరకంబే । ఫలమగు పితలగృహము సేరఁ బలుపురిలో న
వ్వులపాలగుదుం గావున । నిలచెద నే నిటన కామనిఃపితి నటంచున్. ౪౩౬

## —• దేవీ మహిషాసురుల యుద్ధము •—

వ. అని తలఁచి పశ్చాత్తప్తయై సంసారంబు విడనాడి యచ్చటనే పడియుండె గావున నీ వేల వెఱ్ఱిపోకలు పోయెదు నేఁ జెప్పినట్లు విను మనిన దేవి కడునలుక నమ్మహిషుం జూచి యోరిదురాత్మ యిక్కథలు నే నెఱుఁగనియవి కావు నాకొలంది యెఱుంగ కేల ప్రల్లదించెదు ? యుద్ధంబు సేయుమొండె పాతాళంబునకు శీఘ్రంబ యేగుమొండె పెక్కు లరచిన ని న్నిక్కడ తక్షణంబున నుక్కడంచెద ననిన విని మహిషుండు శిలాసితంబులగు శిలీ ముఖంబులు సంధించి యేయ దేవియు నతనిపై లెక్కింపనలవిగాని బాణవరంపరల నేసె. నిట్లు మహిషాసుర మహాదేవుల కతిఘోరంబగు యుద్ధంబు వర్తిల్ల నడుమ దుర్ధరుండు వచ్చి దేవిపై సునిసితాస్త్రంబులేయ దేవి కడునలుక నొక్కబాణంబున వానిం దెగటార్చి, యార్చినం గని త్రినేత్రుం డనువాఁ డుపవడించి రాఁ జూచి త్రిశూలంబున వాని మడియించినం గాంచి యంధకుం డనువాఁ డుక్కుమిగిలి లోహమయగదచే సింగంబునేయ నది క్రోధంబున వానిం జంపె నంత దుంతరక్కసుం డతికోపంబున దేవిపై నురికివచ్చి బాణంబువేయం గని దేవి వాని శరంబులును, శరాసంబునుం ద్రుంప గదాపాణియై. ౪౩౭

క. సింగంబు గదసి యేయ న । భంగురగతి నదరి గోళ్ళ బరికిన వాడున్
కంగారై తానును నొక । సింగంబై పోరె గొంతసేపు మహీశా. ౪౩౮

గీ. దేవి యది గని సునిసిత తీవ్రబాణ పంక్తి నొప్పింప మాతంగ భాతి నదరి
పర్వతం బొండు కొమ్మునపై నిమిడ్చి । దేవి నేయగఁ గ్రోధవిస్తీర్ణయగుచు. ౪౩౯

గీ. అద్రి నమ్ముల నువుగింజ లంతలేసి । తునియలుగఁ జేసి యార్చిన దున్నపోతు
శరభమై సింగమునుబట్టి యరుగుదేర । దేవి యసురుని నెత్తుట దేలనేయ. ౪౪౦

వ. ఇట్లు దేవీ మహిషాసురుల యుద్ధంబు ఘోరంబయ్యె. దిదృక్షు దేవ గంధర్వ సిద్ధ చారణాదులు విస్మయమంది చూడ నానారూపంబుల మహిషుండు పెనగి కొంతవడికి మహిషరూపంబు పూని శృంగప్రహరణంబుల, పుచ్ఛభ్రమణంబుల తుండాఘాతంబులం గొట్టుచు రణవిహారంబు సేయుచు. ౪౪౧

గీ నీవు నాప్రోల ననిలోన నిలువఁగలవె । యొక్కతూకున నిన్ను నే నుక్కడంతు
మూర్ఖురాలవు తెలియక మోసపోతి । వబల నినుఁ జంపి చంపెద నమరవరుల. ౪౪౨

వ. అనిన విని దేవి మహిషరాజుంజూచి క్రోధారుణిత నయనయై యిట్లనియె. ౪౪౩

గీ. పోతరించితివో దున్నపోత నీవు । గర్వమింతేల నిలుపుమీ కదనమునను
నిన్నుఁ జంపుటకే వచ్చియున్నదాన । నేను గలుగంగ సురలకు నేమిభయము. ౪౪౪

గీ. ద్రాక్షపానకమునుఁ ద్రావి తవిలి నిన్ను । గడియలోఁ గూల్తు చూడుమా గర్వమేల
దానవులచావు నేటికి దగ్గరాయె । సురల జయఘోష సమయంబు దరియనాయె. ౪౪౫

వ. అని బంగారుగిన్నెలో ద్రాక్షారసం బిడికొని త్రిశూలంబు చేఁబూని దేవత లానందింప దానవువెంబడించి తోలిన నమరులు పుష్పవర్షంబులు గురియించిరి, జయదుందుభులు మొరసె మునిగణంబులు స్తుతింపఁదొడఁగిరి, సిద్ధగంధర్వచారణాదులు ముదితులైరంత నానాదేహంబులు పూని మహిషుండు పలువిధంబులం బోర నమ్మహాశక్తి త్రిశూలంబుపూని వాని నేయ మూర్ఛిల్లి నేలం బడి ముహూర్తంబున మరల లేచి తోకజాడించి దేవిపై నురుపడించి పదాఘాతాదుల ననేక ప్రచారంబులుసేయం గాంచి. ౪౪౬

ఉ. పూనెను దేవి హస్తమున భూరి మదోద్ధతఘోరమూర్తి మ
ద్దానవకాననప్రకరదాహనసాహసదావశుక్రమున్
భానుసహస్రదుర్దమవిభాపరితోషితశక్రమున్ సుసం
ధానపరీతసూర్యరథదారుణచక్రము, చక్రమున్ వడిన్. ౪౪౭

వ. పూని యి ట్లనియె. ౪౪౮

ఉ. ఓరి మదాంధ చూడు మిది యుత్తమచక్రము నీగళంబుపై
దారుణలీల నే విడచెదన్ క్షణమాత్రములోన ని న్యమ
ద్వారసమీపమం దిడి పదంపడి నాకడ కేగుదెంచు నీ
కే రిక దిక్కు చూడుమని యేసెను దైత్యులు తల్లడిల్లగన్. ౪౪౯

ఉ. ఏసిన యేటునన్ మహిషుఁ డీల్గెను ఖండితమస్తుఁడై మహా
త్రాసకునం ధరం బొరలె దానవు లొంది రధోగతిన్ రసా
వాసము దేవతాంగనలు పాడిరి యాడిరి కూడిరెల్ల సం
తోసము వారిదే యనఁగ స్తోత్రము లెన్నని చెప్ప దేవికిన్. ౪౫౦

క. దేవీ స్తవంబులను నా । నా విధములఁ జేసి రపుడు నాకౌకసు లా
ద్యా విద్యా హృద్యా యం । బా వరమునివేద్య గద్య పద్యా యనుచున్. ౪౫౧

క. సృజనంబు చేసి యెల్లఱ । స్వజనంబులుగా దలంచి సాకెదు నిన్నున్
భజనంబు సేయువారికి । వృజినంబులఁ దోలి మోక్ష మిచ్చెదు తల్లీ. ౪౫౨

క. పుట్టింప నజుని నళినము । పెట్టింప రమాకళత్రు విలయమునందుం
గిట్టింపగ శ్రీకంఠుని । బుట్టించితివీవ సకలభువనవిధాత్రీ. ౪౫౩

క. తుష్టివి జగతివి కాంతివి । పుష్టివి కరుణవు మహావిభూతివి జగదా
కృష్టివి శాంతివి దాంతివి । వృష్టివి మాయమ్మ మ్రొక్కు వెట్టెదమమ్మా. ౪౫౪

క. నీ ముదలలేక జగమున । జీమయు జిటుకుమనదమ్మ చెప్పగదరమే
నీమహిమ భవన్మాయా । వ్యామోహితములు జగంబులన్నియు దల్లీ. ౪౫౫

క. యజ్ఞమ్ముల స్వాహవగుదు । బ్రజ్ఞం భవదీయశక్తి బరగదయేని
యజ్ఞములకు ఫలము గలదె । సుజ్ఞానవతీమతల్లి శుభదవు తల్లీ ౪౫౬

క. కొందరు హరియందురు మరి । కొందరు శివుడందు రింకఁ గొందరు సూర్యుం
డందురు జగమేలగ నీ । వందరికిం దల్లివగుట యరయక జననీ. ౪౫౭

క. నిక్కము నిక్కము నీవే । చక్కని దొరసానివమ్మ సకలజగంబుల్
చిక్కులుదీర్చి భరించెదు । వాక్కులకుం దరమె నిన్ను వర్ణింప సతీ, ౪౫౮

క. మహిషాసురు బాధల గిరి । గుహలంబడి పెక్కునాళ్లు గోడుగుడిచి నీ
మహిమంబువలన నిప్పుడు । సుహితస్థితి గంటి మఖిలసుందరి తల్లీ. ౪౫౯

వ. అనిన విని దేవి సంతుష్టాంతరంగయై యిట్లనియె. ౪౬౦

గీ. ఎప్పుడెప్పుడు మీశక్తి దప్పినట్టి । గొప్పపనిపుట్టు సురలార యప్పుడప్పు
డెల్ల నన్ను స్మరింపు డహీనకరుణ । మిమ్ము రక్షింపగలదాన నమ్ముడనిన. ౪౬౧

గీ. తల్లి వీవు మాకు నెల్లెడ బోషింప । నీవుగలుగ గొరత లేమికలుగు
నిన్ను గనుల గంటి మన్ని కోరికలును । దీరె గోరగలది వేరెకలదె. ౪౬౨

క మావలని తప్పులన్నియు । దేవి సహియింపవమ్మ దీనులమమ్మా
యీ విశ్వంబున బిడ్డలు । గావించిన నేరములను గావరె తల్లుల్, ౪౬౩

గీ. ఈశరీరంబున సుపర్ణు లిరువు రుండ్రు । వారిసఖ్యంబు నిత్యంబు వాసినొప్పి
యెల్ల యపరాధములను సహించువాడు । వరుస మాన్యుండు మూడవవాడు సుమ్ము. ౪౧౪

క. జీవుండు సఖుడు నీ కత । డేవిధమున నిన్ను విడుచు నీశ్వరి పాపుం
డై వెలయు నరుడుతక్కం దేవతలం దెవడు నిన్ను దెలియఁడు చెపుమా. ౪౧౫

క. సుఖకారణములు నీపద । నఖకాంతులు దొరయ నెరగు నాకౌకులకున్
సుఖమేని దుఃఖమేనియు । నఖరభవత్సేవ నెఱప నట్టిరు గలరే. ౪౧౬

క రక్షించుము రక్షించుము । రక్షించుము నీవ దిక్కు రక్షాకర్త్రీ
యక్షీణకృపాకలిత కటా । క్షంబుల నునుపు మాయెడం జనయిత్రీ. ౪౧౭

వ. అని యిట్లు నానావిధంబులం బొగడుచున్న దేవతల నాదరించి జగన్మాత యంతర్ధానంబు నొందెనని చెప్పిన విని జనమేజయుండు వ్యాసున కిట్లనియె. ౪౧౮

చ అనఘ భవన్ముఖాంబుజభవామృతపానము సేసి తృప్తుడౌ
మనుజుడు లేడు దేవిమహిమంబులు విస్మయముల్గదా జగ
జ్జనని సురారి జంపి కడు శాంతి సుధాంధుల సంస్తవంబులం
గని చనినంత నిర్జరని కాయము లేమియొనర్చి రర్మిలిన్. ౪౧౯

క. వీనులు దనియగ నెపుడు భ । వానికథల్ విననిబ్రతుకు బ్రతుకే యంబా
ధ్యానపరుల కేకడ బ్ర । హ్మానందం బమృతపాన మల్పముగాదే. ౪౨౦

క. అసకు లోనై యజ్ఞుం । డీ సంసారాంబురాశి నీట్లును బ్రాజ్ఞుం
డా సకలేశ్వరి గొల్చి మ । హాసంసారాబ్ధిదాటి యందడె ముక్తిన్. ౪౨౧

గీ. పూర్వభవమున సంపంగిపూలచేత । నంబికాదేవి బూజించినట్టివారె
భోగభాగ్యంబులను బొంది భూమి నేలు । వారలైరని యెన్నంగవలయుజుమ్ము. ౪౨౨

క. భారతభూభాగంబున । దారిద్ర్యముచేత నెల్లిదముపడువారల్
నేరక దేవీభక్తివి । దూరులగుచు జెడిరటంచు దోచెడు ననఘా. ౪౨౩

వ. మరియు గుష్టాదిరోగాన్వితులును, బధిర మూకాంధక ఖంజాదులును దేవీపూజావిరహితులుగా దలంపవలయుం గావున సత్యవతీకుమారా కృపాయత్తుండవై దేవి మహిమం బింకను దెలిపి రక్షింపవే యనుడు వ్యాసుండు మనుజవల్లభుం జూచి యిట్లనియె. ౪౨౪

సీ. ఎచ్చోట బ్రహ్మయు నిందిరావిభుడును మృత్యుంజయుండును మెలతలైరి
ఏవీడు దుగ్ధపారావారమధ్యంబునందున్న దీవిలో నందమొందు
యేదివ్యదేశమం దెనయ మాయాశక్తి క్షేత్రపాలిని యయి చెలువుగులుకు
నేమహాస్థలమునం దింపుమీరగ నంబ యలర బ్రహ్మక్రీడ లనుభవించు

నట్టిదైన మణిద్వీపమందు జేరి । దేవి విహరింపగ సమస్త దేవ నరులు
భూమి బాలింప రవివంశభూతుడగుచు నొప్పు శత్రుఘ్ను నిల్పి రయోధ్యయందు. ౪౭౫

గీ. ఈవిధంబున ముదము భూదేవి కొసగి । స్వస్వవాహనముల నెక్కి సకలసురలు
నాకమున కేగి నిలచి రనంతరంబ । రాజు పాలించె భూమి ధర్మప్రతిష్ఠ. ౪౭౬

## —: సూర్యవంశభవుడగు శత్రుఘ్నుని పాలనక్రమము :—

సీ. ప్రజనెల్ల సంతోషభరితమానసులైరి తరుల బర్జన్యుండు కురిసె వాన
పాదపంబులు ఫలవంతంబులై మించె పండ్లు నిండగ నాలు పాలు గురిసె
నదులెల్ల నంబుపూర్ణంబులై పారెను మృగ పక్షి గణములు మెలగె బ్రీతి
నెటి బోలంబులు కుంట గతిసెడుగా బండె నీతిబాధలు పెద్దగోత గూలె
బ్రాహ్మణులు నిత్యయజనతత్పరత గనిరి న్యాయముగ దీర్చి రెల్ల ధరాధిపతులు
బేరముల మోసములు మాని యూరుభవులు బ్రాహ్మణాదుల గొల్చిరి పాదభవులు. ౪౭౭

క. దేవీభక్తిపరాయణు । లై విలసిల్లిరి ధరామరాధిప విట్ప
ద్యావర్ణులు సత్య దయా । ప్రావీణ్యము లడరె నెల్లప్రాణులయందున్. ౪౭౮

క. జారులు చోరులు దుష్పథ । చారులు పాషండు లనృతజల్పనపరులున్
లే ర య్యయోధ్య నొప్పగ । వీరుడు శత్రుఘ్నుఁ డేలువేళ మహీశా. ౪౭౯

వ. బ్రాహ్మణులు కొందరు సాత్త్వికులయినవారు ప్రతిగ్రహరహితులై దయాదమపరాయణులై యజనాదిషట్కర్మనిరతులై ప్రవర్తించిరి. మరికొందరు రాజసులై విద్వాంసులై రాజపురోహితులై షట్కర్మనిరతులై ప్రవర్తించిరి. యింతగొందరు తామసులై కించి దధ్యయనపరులై రాజసేవకులై ప్రవర్తించిరి. మహిషాసురవధానంతరంబు భూలోకం బత్యంతసుఖం బనుభవించె నని చెప్పి మరియు. ౪౮౦

గీ. సర్వపాపోపశమనంబు సర్వభోగ । భాగ్యదంబును నైన యంబాచరిత్ర
మింకను వచింతు వినుము మహీతలేంద్ర । యింతకంటెను సంతోష మేదికలదు? ౪౮౧

## —: శుంభ నిశుంభు లను రాక్షసులను దేవి జయించుట :—

క. శుంభ నిశుంభులు దురితా । రంభులు సంక్షోభితామరప్రకరమహా
దంభులు ఘనవివరోదర । కుంభులు గల రుద్ధతోరుఘోర స్తంభుల్. ౪౮౨

క. వారు దురాచారు లగుచు । బోరులు గావించి దేవపుంజము నొంపన్
భూరిబలంబున దేవి వి । దారణ మొనరించె మున్ను ధరణీనాథా! ౪౮౩

క. గండాగొండులు పటుతర । గండులు తీవ్రప్రతాపకంపితలోకే
శాండులు నిష్ఠురదారుణ । ముండులు మును గలరు చండ ముండులు భూపా! ౪౮౪

క. వా రమరుల బాధించి మ । హారణమును జేయ దేవి యత్యుగ్రగతిన్
వీరరస మదర నా దివి । జారుల వధియించె జగము లన్నియు నలరెన్. ౪౮౫

చ. కల దొక డింక దానవనికాయసమీడితభూరితేజు డ
త్యలఘుపరాక్రముక్రమజితాదితిసూను సమాజు డాజి సం
చలితబిడౌజు డుద్ధతి నిశాచరసైన్యహృదుత్సవప్రదా
కలితమహాధ్వజుండు మదగర్వభుజుండగు రక్తబీజుడున్. ౪౮౬

క. తామ్రఫలకసమజిహ్వు డ । నమ్రోగ్రమహాశిరుండు నరభోజనుడున్
నమ్రీకృతదేవేంద్రుడు । ధూమ్రాక్షుడు గలడు ప్రబలదోర్బలయుతుడై. ౪౮౭

క. భగవతి వారల నిరువుర । దెగనేసె రణంబునందు. దివిజు లలర నాం
దగ విని జనమేజయుఁ డా । జగదద్భుతకథను దెలుపు సంయమి యనినన్. ౪౮౮

సీ. వినుమయ్య రాజేంద్ర మును శుంభుడు నిశుంభు డనువారు పాతాళమును ద్యజించి
యన్నపానాదుల నటుబెట్టి యయుతాబ్దములు తపం బొనరింప నలరి బ్రహ్మ
కోరిక లడిగిన వా రమరతఁ గోర నది కోరరానిది యంచు నజుఁడు
బలుకంగ విని వారు పలుమారు దలపోసి మనుజులచేతను మరియును బశు
పక్షి గణములచేతను బ్రక్షయంబు । లేకయుండంగ గోరిన లెండు మిమ్ము
స్త్రీయొకతెదక్క నితరులచేతగాదు । మరణమొనరింప నన విని యరిగి రెలమి. ౪౮౯

## —: రక్తబీజాసురుని మహిమ :—

సీ. అంతట వా రిర్వు రతిబలవంతులై పెద్దవాడగు శుంభు బృథివినేల
రాజును గావించి రహిమించి యుండంగ చండముండులు మహాశౌర్యధనులు
ధూమ్రలోచను డురుదోర్గర్వవంతుండు రక్తబీజుండు దుర్వారబలుఁడు
సైన్యసంయుక్తులై సంతోషమున వచ్చి శుంభు సేవించి రదంభవృత్తి
రక్తబీజుని మహిమంబు రాజ వినుము । యుద్ధమున మేన రుధిరంబు లుప్పతిల్ల
దానినుండి జనింత్రు తద్వర్ణులైన । రాక్షసులు లక్షలకొలంది నక్షయముగ. ౪౯౦

సీ. ఆమీదట నిశుంభు డయుతాయుతంబుల సేనల గైకొని చెలగి భూమి
లోకంబునకు బోయి భీకరయుద్ధముల్ కావించి విజయంబు గాంచి మించి
స్వర్గంబునకుఁ బోయి సంగరం బొనరించి శుంభుండు దాను శోభదనరి
యింద్రు జయించి స్వాహేశుని జితుజేసి ధర్ము నోర్చియు బాశధరుని గెల్చి

గాలి దోలి కుబేరుని గడకునొత్తి । యీశ్వరుని గర్వ మడగించి యింద్రు గద్దె
కామధేనువు మణి కల్పకంబు నంద । నవనమును జేసికొని రొగి స్వవశములుగ. ౪౯౧

గీ. అమృతపానంబొనర్చి వా రమితలీల । బొదల గిరిగహ్వరములకు బోయి సురలు
పెక్కుదుఃఖంబులందిరి పేర్మియుడిగి । దైవగతి దేవతలకైన దప్పదాయె. ౪౯౨

క. వేయేండ్లీగతి తిరుగుచు । నాయాసంబులను బొంది యమరులు గురు న
త్యాయతమతి బ్రార్థింపగ । నా యాచార్యుండు పలికె నతిచతురతతోన్. ౪౯౩

సీ. వినుమయ్య దేవేంద్ర వేదమంత్రములెల్ల పరగు దైవాధీన ఫలము లగుచు
నీవును నొక మంత్రదేవతవేకదా యేల యీదుఃఖంబు పా లయితివి
కావున నిక్కంబు కానున్న దెప్పుడు కాకతీరదు దైవకల్పితంబు
శిష్టానుశాసనం బిష్టదాయక ముపాయంబును గావున నద్ది చేయ

గీ. వలయు జెప్పెద మును భగవతి దయార్ద్ర । హృదయయై చెప్పె మరచితే యెప్పుడేని
యిడుమగల్గిన దను స్మరియింపుమనుచు । కాన మీరు హిమాద్రికి గదలుడిపుడు. ౪౯౪

ఉ. ఆపె హిమాద్రియందు నవయంబును వర్తిలుచుండు మీకునుం
బ్రాపగు బీజమంత్రమహిమంబున మిమ్మనుగ్రహించి సం
తాపముదీర్చు మీకు నిదెదక్క యుపాయము వేరె లేదు మా
యాపరశక్తికంటె నొక యన్యవిశేషము లేదు చూడగన్. ౪౯౫

వ. అనిన విని దేవతలు హిమవంతంబునకుం జని దేవి నిట్లని ప్రార్థించిరి. ౪౯౬

దండకము: నమో దేవి విశ్వేశ్వరప్రాణనాథే సదానందరూపే నమో దానవాంతప్రదే
మానవానా మనేకార్థదే భక్తిగమ్యస్వరూపే నతే నామసంఖ్యా నతే రూప
మీదృక్తథా కోపి వేదాదిదేవాదిరూపే త్వమేవాసిసర్వేషుశక్తిస్వరూపా ప్రజాసృష్టి
సంహారకాలే సదైవ స్మృతిస్త్వం ధృతిస్త్వం త్వమేవాసిబుద్ధిర్జరాపుష్టి తుష్టీద్యుతిః
కాంతిశాంతీ సువిద్యా సులక్ష్మీర్గతిఃకీర్తిమేధే త్వమేవాసివిశ్వస్యబీజప్రమాణమ్.
యదా యైస్స్వరూపైః కరోషీహకార్యం సురాణాంచతేభ్యో నమామోద్యశాంత్యై
క్షమా యోగనిద్రా దయాత్వంవివక్షా స్థితాసర్వభూతేషు శస్తైస్స్వరూపైః కృతం
కార్యమాదౌ త్వయాయత్సురాణాం హతోసౌమహారి ర్మదాంధో హయారి ర్దయా
తేసదాసర్వదేవేషు దేవి ప్రసిద్ధాపురాణేషు వేదేషు గీతా కిమత్రాస్తిచిత్రం యదంబా
సుతంస్వంముదాపాల యేత్సోషయే త్సమ్యగేవ యతస్త్వంజనిత్రీ సురాణాంసహాయా
కురుష్వైకచిత్తేనకార్యం సమగ్రం నవా తేగుణానామియత్తా స్వరూపంవయందేవి
జానీమహే విశ్వవంద్యే కృపాపాత్రమిత్యేవ మత్వా తథాస్మాన్భయేభ్యస్సదా
పాహి పాతుం సమర్థే వినాబాణపాత్రై ర్వినాశూలఖడ్గై ర్వినాశక్తిదండై
ర్రిపూన్హంతు మేవాసిశక్తా వినోదా త్తథాపీహలోకోపకారాయ లీలా ఇదం

శాశ్వతం నైవజానన్తిమూఢా నకార్యంవినాకారణం సంభవేద్వా వయంతర్క
యామోనుమానంప్రమాణం త్వమేవాస్య విశ్వస్యకర్త్రీ త్వజ స్సృష్టికర్తా
ముకుందో వితాయం హరోనాశకృద్వై పురాణేప్రసిద్ధిః నకింత్వత్ప్రసూతాస్త్ర
యస్తేయుగాదౌ త్వమేవాసిసర్వస్యలోకస్య మాతాత్రిభిస్త్వం పురాసేవితాదేవి
దత్తాత్వయాశక్తి రుగ్రాచతేభ్యస్సమగ్రా త్వయాసంయుతాస్తే ప్రకుర్వంతి
కామం జగత్పాలనోత్పత్తిసంహారమేవేతి మన్యామహే సర్వలోకేశ్వరీ త్వం
నమస్తుభ్య మంచు న్సదా మ్రొక్కుచున్నాము శ్రీ శ్రీ జయ శ్రీ ౯౯౭

క. మందమతులు నిను గొలువక । నిందాస్పదు లగుచు పరమనీచు లగుచు నా
నందము నొందంజాలరు । వందనములు భక్తకల్పవల్లీ తల్లీ. ౯౯౮

క. కొందఱు వైష్ణవులును మఱి । కొందరు పాశుపతు లంబ కోరరు నిన్నుం
గుందుదురు నరకములబడి । వందనములు భక్తకల్పవల్లీ తల్లీ. ౯౯౯

క. మందరధరు డంభోనిధి । నందనకును శివుడు శైలనందనకును మ్రొ
క్కుం దక్కినవా రెక్కడె । వందనములు భక్తకల్పవల్లీ తల్లీ. ౧౦౦౦

వ. ఇట్లు దేవత లతిభక్తి ననేకవిధంబులం బ్రార్థింప దేవి దివ్యాంబరభూషణాద్యలంకృతయై
దర్శనం బిచ్చి మీరాక యెఱింగింపు డనిన, తల్లీ, మాభయంబు లుడిపి తొల్లి మహిషా
సురువలని బాధ తొలంగించి రక్షించినవిధంబున నేడును రక్షింపవలయు నిపుడు శుంభ
నిశుంభులును, చండ ముండ ధూమ్రాక్షులును రక్తబీజుం డను రక్కసుండును దేవ
రాజ్యంబు హరించిరి. మాకు గతి నీవకదా మా దుఃఖంబులు నివారింపవే యనుఁడు. ౧౦౦౧

సీ. ప్రాలేయగిరికూతు నాలోకముననుండి యొకమూర్తి నంబిక యుద్భవించి
కౌశికీనామ విఖ్యాతి నొక్కతెయును ప్రావృడంభోధర ప్రభలమించి
కాళికానామ విఖ్యాతి నొక్కతెయును శక్తు లిర్వురు దన సరస గొలువ
చిన్నారి సరిగంచు చీరెను ధరియించి మణికాంతిదనరు పైఠిణియు దొడగి
యమరసంఘంబులకును బ్రత్యక్ష యగుచు । నోలి గారుణ్యరసవార్ధి నోలలార్చి
మృదుమధురభాషణంబుల మేల్మిసూపి । యల్ల జిరునవ్వునవ్వి యిట్లనియె నధిప. ౧౦౦౨

క. బృందారకులార భయము నందకు । డ ద్దనుజవరుల హనన మొనర్తున్
సందేహము విడువుడు మీ । రందరు నాశక్తి జూడుడని కడువేడ్కన్. ౧౦౦౩

క. అని చెప్పిసింహవాహన । మున దా గూర్చుండి తన్ను మోదమెలర్పం
గను గాళిక పార్శ్వమ్మున । జనుదేరగ నేగె శత్రుసైన్యంబులకున్. ౧౦౦౪

గీ. పోయి పోయి యొక్క పూదోటలో నిల్చి । కాళి తనకు దోడుగను వసింప
జల్లగాలి వీవ శౌకంబు బైకంబు । పుదమరాళపఙ్క్తి గదిసి కూయ. ౧౦౦౫

సీ. ప్రకృతుల వికృతుల పద్ధతు ల్గనిపట్టి ద్వావింశతి శ్రుతుల్ దనర మీటి
తంత్రులార్చుచును మంద్రంబు మధ్యంబు తారకమును ఘన నయాదికము నెరిగి
దేశీయపద్ధతి దెలిసి గ్రామంబులు పొసగించి మూర్ఛనల్ పొందుపరచి
కంపనంబుల దాట్ల గతుల నందంద గావింపుచు నీలాలమెట్లమీద
గ్రమ్మ నఖచంద్రరేఖల కాంతినిండ । మోవ్కు జిగురింపగా నల్లరాళ్ళు గరుగ
గాత్రనాదంబు వీణతో గలసి మెలగ । దేవగాంధారి వాయించె దేవి యపుడు. ౨౦౬

గీ. సార మేయనుడిగి మోరలు పైకెత్తి । చెవులు నిక్కబట్టి చవులదేలు
జాడ జూపి యచటి లేడిపిండులు దేవి । పాట వినియె టిచ్చపోటులేక. ౨౦౭

గీ. ఎల్మికములు వెడలి పడగలు పైకెత్తి । పాపగనులు చుట్టు పట్ల జేర
సస్వరంబు పాడి శాంకరి బెదిరింప । దాయె వింతతొడవు నందు జెలిమి. ౨౦౮

క. పక్షులు గమ్మున్నై యంతిక । వృక్షంబులమీదనుండి వెలువక వినియెన్
మోక్షప్రదాత్రి గానము । నక్షీణాసక్తి సుఖమయంబయి తోపన్. ౨౦౯

క. ఆకసముననుండి యమర । లోకము గానామృతైకలోలతచే న
స్తోకప్రీతిన్ వినియెన్ । శోకములు హరింప దేవి సుస్వరగీతిన్. ౨౧౦

క. శుంభుని సేవించు మహా । దంభులయిన చండ ముండ దనుజులు పటుదో
స్తంభులు వచ్చిరి స్వేచ్ఛను । శాంభవి యున్నట్టి వనము సరసకు నంతన్. ౨౧౧

క. కాళిక దాళము వైవగ । చూళిక మాలికలు దాల్చి శోభిలుచు గడున్
వాలికలబోలు గన్నుల । వాలిక మృదుగీతి బాడు భగవతి యెదుటన్. ౨౧౨

గీ. నిలిచి యచ్చెరువడి మధురలలితగాన । కలన కలరుచు నెలమి వేగంబ బోయి
గద్దెపైనున్న శుంభుని గాంచి మ్రొక్కి । చెలువ మలరగ నిట్లని పలికి రపుడు ౨౧౩

గీ. అహహ యేమందుమయ్య హిమాలయంబు । నుండి యొకమోహనాంగి యీయూరి కనతి
దూరమున నున్న పువ్వులతోటలోన । విడిసియున్నది తరమె యా వింత బొగడ ౨౧౪

ఉ. పుట్టినదాది యప్పొలతిబోలినదాని ధరిత్రి వేలుపుం
బట్టున నాగవాసమున మానవులం దివిజాళి నాగులన్
నెట్టన జూడ మెన్నడును నేడును నాడు వినంగనైన లే
దట్టి పడంతి రూపు తగ దచ్చెర యచ్చెలి దాసి యౌటకున్. ౨౧౫

ఉ. వల్లకి చేతబూని గరువంపుదన మ్మరమోడ్పుకన్నులన్
దెల్లముగా నఖద్యుతులు తీగెలపై బ్రసరింపఁ జల్లగ

నల్లన మీట గాత్రనినదామృతము న్గలయంగ బాడ నే
జెల్ల నయారె యక్కలుకు జెప్పదరంబె సరోజసూతికిన్. ౩౧౬

గీ. మేతలుడిగి యెల్లమృగములు వినవచ్చె । నొప్ప నెమలి కుంచెవిప్పి యాడె
కౌదమకోయెలలకు గొంతులాడక చూచె । పాటసోకు తగిలి పడితి మేము. ౩౧౭

సీ. సారంగము వరాళి శంకరాభరణంబు నతులు కొప్ప నూగారు నయ్యె
బలహంసయును శ్రీయు లలిత పున్నాగంబు గమన శ్రవణ నాభి గతులు నయ్యె
కలితాచలయు చంద్రకళ చక్రవాకంబు జఘనంబు హాసంబు స్తనము లయ్యె
మధుర వనాటంబు మలయమారుతమును చరణయుగ్మంబు నుచ్ఛ్వాసమయ్యె

గీ. అవురవుర యేమిచెప్ప నయ్యబల యధర । మెత్త రాగంబులన్నియు నింపుసొంపు
గులుకు పలుకులు వెయ్యేల కోమలాంగి । మయి దలంచెద సంగీతమయమటంచు ౩౧౮

శా. తాళాభోగమురోజయుగ్మమున మొత్తంబయ్యె రాగచ్ఛటా
మూలంబున్ నునువాతెరన్ గలసె నంభోజాక్షి భావస్థిత
శ్రీలీలాప్తి నఖాంకురంబులను నిల్చెన్ గాత్రసౌభాగ్యమున్
దేలంజెప్పిన భారతంబగునుగాదే దానవాధీశ్వరా! ౩౧౯

క. రాగంబు మొదలుపెట్టను । రాగము దీర్ఘంబుచేసి రహి నలరింపన్
రాగము తుదముట్టింపను । రాగగదా యేమిచెప్ప రాక్షసవర్యా! ౩౨౦

క. నాదబ్రహ్మానందవి । నోదంబులు దానియంద నుతిగాంచుసుమీ
కాదేని దాని నడుమున । నో దానవనాథ శబ్ది యుండునె చెపుమా? ౩౨౧

క నాదప్రపంచమున కది । యాదిప్రకృతి యనవచ్చు నాత్మైకసుఖా
హ్లాదినియై మోదినియై । వేదినియై యొప్పు నెంతవింత సురారీ! ౩౨౨

మ. వినమే యూర్వసిపాట మేనకకళావిఖ్యాతగీతోల్లస
న్నినదంబున్ జవులూరు రంభస్వరమున్ హేమాకలాలాపరం
జనమున్ ప్రీతి దిలోత్తమాయువతి గానంబున్ ఘృతాచీ మృదు
స్వనమున్ వారల కింతశక్తిగలదే వర్ణింప దైత్యేశ్వరా. ౩౨౩

చ. కలువలు కన్నులన్న సరి గాదుసుమా కుముదాఖ్య వానికిం
గలుగుట సారసంబులన గాదుసుమా యవి నీకజంబులై
యలరుట మీలునాగ దగ దప్పులలో నవి మున్గి తేలుటం
బలుకు నికేమి నా నసుపమానములే యనవచ్చు గట్టిగన్. ౩౨౪

సీ. రోలంబజాలంబ యా లంబకచపాళి కాకున్న విరులసంగాత మేల
చిందంబు నందంబు దందంబు కందంబు కాకున్న శబ్దసాంగత్యమేల

బాకాలలో కాల తూకాల జంఘలు కాకున్న మంగళక్రమము లేల
ముకురాల నికరాః నికరాల చెక్కిళ్ళు కాకున్న సొగసందు గనగనేల
నడుమొకటి మాయ ముష్టిలో బడియెగాని । యింతి యవయవసౌభాగ్య మేమిచెప్ప
కాపురంబుండు నహహ శృంగారలక్ష్మి । చారుపంకేరుహాస్య. బంగారుమేన. ౨౨౫

ఉ. కలికి మొగమ్ము చంద్రుఁడని గట్టిగజెప్పుదు రద్ది నిక్కమే
వెలయుగ నవ్వుపేరిటను వెన్నెలయున్ దిలకచ్ఛలంబునన్
గలితకళంకమున్ బెదవి నామముతో సుధయున్ బొసంగు గ
న్నులనెడి కల్వక్రొవ్విరులనున్ వికసింపఁగజేయు నెంతయున్. ౨౨౬

చ. పరగ నపూర్వమైన విధివాసము దా స్వవశంబుజేసి శం
కరు సిగబట్టి దిట్టయగు కాంత నుసుంగవునుం జయింపగా
హరి కవతారమయ్యె నటులయ్యును జేదరికాన ముష్టికిన్
మరలక లోనుగావలసె మాయగదా యది వేయునేటికిన్. ౨౨౭

ఉ. మాపులురేపులంచు దమ మంజులభావముసూపలేక నీ
ర్కాపులుగా దలిర్చి కలకాలము పంకముబట్టి గంధసం
ప్రాపకతన్ మధువ్రత సమష్టినిబ్రోచెడి యుత్పలాబ్జముల్
చూపులదాపుల న్నిలువ జొప్పడునే హరిణాక్షి కింతయున్. ౨౨౮

చ. కులుకును దళ్కు సూప కొకి గోతను గొన్నిదినంబు లాదటన్
వెలవెలయంచువచ్చి నడువీధిదుకాణములోన గొన్నినా
ళులు తరువాత చెక్కడములోబడి నీరసవృత్తినున్న కెం
పులపస సొంపులాడి నునుమోవికి నీడన నవ్వురాదొకో. ౨౨౯

ఉ. దానిపసందు సూచితిమి తక్కినవారికినేమిగాని యా
సూనశరాసనుం డతివ సోయగమున్ గని కూర్మివేడ నిం
పూనక నంగహీనుడవు పొమ్మన నస్త్రమయంబు జేసినన్
మానిని మేను దా నతని మార్గణము ల్గొని యేయు దృష్టులన్. ౨౩౦

గీ. దనుజలోకచంద్ర దానిపుట్టు వెరింగి । కొనుము భార్యగాగ గొనుము నీకు
దగిన దదియ నీవు తగుదువు దానికి । నెసఁగు బొసగు బెండ్లి యిరువురకును. ౨౩౧

గీ. ఇల్లు గలిగినందు కిటువంటి పెండ్లాము । బడయకున్న రాజు బ్రతుకుసున్న
వన్నె వాసి లేని వనితలు పదికోటు । లున్ననేమి లేకయున్ననేమి. ౨౩౨

వ. రాక్షసేశ్వరా ! నీవు స్వర్గంబును జయించి యుచ్చైశ్శ్రవంబును, నైరావతంబును, చింతా
మణియు, కల్పవృక్షంబును, గామధేనువును, మరాళధ్వజంబైన విమానంబును, కుబేరుని

నవనిధులును, వరుణుని ఛత్రంబును, నీ తమ్ముఁడగు నిశుంభునిచేత వరుణపాశంబును గైకొనంబడియె. సముద్రుం డమ్లానపద్మమాలయు, మృత్యువు దారుణదండంబును నిచ్చిరి. మేనకా ద్యప్సరోగణంబులు నీకు వశగతులైరి. ఇట్లెల్ల రత్నంబులు నీ స్వాధీనములై యుండ నియ్యంగనారత్నంబు వశవర్తినిగాని లోపంబొందు నీకేల ? శీఘ్రంబునం గొనివచ్చి వివాహంబుగమ్ము. నావుడు విని శుంభుండు తన సన్నిధినున్న సుగ్రీవుం జూచి యిట్లనియె. ౨౩౩

సీ. వింటె సుగ్రీవ యవ్వేలదివృత్తాంతంబు దాని నే బెండ్లాడదలచినాఁడ
నీ వెఱుంగని నీతి నే జెప్పునది లేదుగాని యొక్కింత వక్కాణ మొనర్తు
దానంబు సామంబు దగు రెండుపాయముల్ శృంగారరసమున జెలగుచుండు
భేదంబు కూడదు వెలదులయెడ రసభంగంబగును దానబట్టి కార్య
సిద్ధి గనరాదు నర్మంపు చేష్ట లెపుడు । చూపవలయును గావున నోపుదీవు
పడతికడకేగి నాదు సంపత్తి పొగడి । వెంటబెట్టుకరమ్ము వేవేగ పొమ్ము. ౨౩౪

క. నావుడు విని చని యా సు । గ్రీవుడు జగదంబ గాంచి కేల్మోడ్చి లస
ద్భావంబున తన దౌత్య । ప్రావీణ్యముచూప నిట్లు పలికె మహీశా. ౨౩౫

క. నీరూపమునీ గుణములు । నీరమణీయతర గాననిపుణత లెల్లం
మారాజు వినెను శమకము । బాకి యతడు సెప్పుమన్న పలుకులు వినుమీ. ౨౩౬

క. సర్వాంగసుందరివి నీ । కుర్విన్ బ్రతిలేదటంచు నొక్కఁడు సెప్పెన్
పర్విన తమకముతోడ సు । పర్వారాతి నను గాంచి పలికె ముదమునన్. ౨౩౭

క. అదిగావున నేవచ్చితి । సుదతీ నీసముఖమునకు సుందరుడుసుమీ
త్రిదశేంద్రు నోటుపుచ్చెను । త్రిదివము తనవశముచేసి తివురుచునుండెన్. ౨౩౮

వ. మారాజు సౌభాగ్యంబు లెన్న వశంబుగాదు. అతండు నీకు నమస్కరించి చెప్పుమనె నెట్లనిన ౨౩౯

సీ. పాకశాసనుదోలి నాకంబు గైకొంటి నెలమి ముజ్జగముల నేలుచుంటి
యజ్ఞభాగములు నే నపహరించుచునుంటి స్వర్గలోకమున శ్రేష్ఠంబులైన
మాణిక్యములు మహోగాణిక్యములు నాదు గృహము జేర్చితిని నిగ్రహనియుక్తి
దేవతల్ మానవుల్ దితిజులు నాపంపు సేయుచునుందురు సేవకులయి
అట్టి నే నీకు దాసుండ నగుదు నీదు । పంపుసేయుదు నను మరుబాణములకు
నిడక రక్షించు రక్షించు మిందువదన । మరణపర్యంతమును నిన్ను మరువకుందు. ౨౪౦

సీ. వగలాడి నీవు నన్ వరియించితేనియు పట్టి నే నౌదల బెట్టుకొందు
పదునాల్గులోకముల్ బాలింతు వీవ నీ పదపద్మములగొల్తు బంటనగుచు

సతత సౌభాగ్యవి స్ఫూర్తి నమానుషమైన భోగంబు లందెదు భూరిమహిమ
పనులందు నీయాజ్ఞ గొనక నే వర్తింప నెటులైన లోప మొక్కటియు లేదు
నే నపథ్యంబ దేవతా మానవాసు । రాదులకును సుందరాంగి నీయంద చిత్త
మిడితి నను బ్రోవకున్న నా కేదిదిక్కు । కరుణజూడుము నాపాల గలికి కలికి. ౫౪౧

వ. అనిన దేవి యొక్కింత నవ్వి. ౫౪౨

క. శుంభుండు నిశుంభుండు న । దంభప్రజ్ఞులని సర్వదా వినుచుంటిన్
జంభారిని దరిమి జయ । స్తంభంబులు వైచి వాని సంపద గొనరే. ౫౪౩

క. జేతగదా దేవతలకు । దాతగదా బ్రాహ్మణులకు దానవతతికిన్
నేతగదా పటునిగమా । ధ్యేతగదా శుంభు నెన్న నెవ్వండోపున్. ౫౪౪

క. ముప్పది రెండుగుణంబుల । గొప్పతనముగల్గి యతడు కోవిదుడై తా
నొప్పగ జెప్పగ దరమా । యప్పిశితాశనవరేణ్యు నద్భుతచరితల్. ౫౪౫

క. ఇచ్చటికి నసురు జూడగ । వచ్చితి నే ననుము మంచి పసిడిఁ గలయఁగా
నచ్చంపు మంచిరతనము । వచ్చినయ ట్లనుము దానవప్రభుతోడన్. ౫౪౬

గీ. దేవతల మానవుల బూర్వదేవతలను । జూచితినిగాని వారలు శుంభు భీతి
నొక్కడును నన్ను గైకొన నోపడయ్యె । నేఁదెంచితి వింటి నే నీ గుణములు. ౫౪౭

గీ. వడిగ జని శుంభుతోడ నా వార్త దెలుపు । మితరులేరును వినకుండ హితమతింగి
యోయి రాక్షసనాథ నీ యొరపు వింటి । నన్నిగుణములు గలవాఁడ వగుదువీవు. ౫౪౮

గీ. శూరుడవు గుణివి కళావిశారదుడవు । దాతవు మహత్తరుండవు జేత వింక
భోక్తవు నిఖిలమాణిక్యములకు బలివి । యేను వరియింప నర్హుఁ డింకెవ్వఁ డధిప. ౫౪౯

క. నాయంత నేను వచ్చితి । నీయంతికమునకు జూడు నిందాస్పదనై
పోయెద నే నోమొక్కటి । నోయుచునున్నాను వెట్టినో మొట్టినొకో. ౫౫౦

గీ. బాలభావంబుచేత దద్వ్రతము పూని । యున్నదాన నదేమన నొక్కఁడెవ్వ
డేని మత్సమ బల శౌర్య ధృతి విరాజి । యాజి నను గెల్చునేని బెండ్లాడెద నని. ౫౫౧

క. అని యిట్లు పలుకుచుండగ । ననుఁగుంగత్తియలు సూచి యల్లన నగి యో
వనితా యద్భుతమగు వ్రత । మును బూనితివమ్మ క్రూరముగదొ యమ్మా. ౫౫౨

వ. అనిన వారి పలుకులు విని విననియ ట్లూరకుండి దేవి మరల. ౫౫౩

క. కావున నో దనుజేంద్రా । నీవు రణమునందు నన్ను నెమ్మి గెలువుమా
వేవేగమ రమ్మా యా । పై వేడుకలెల్ల జక్కబడునని యనుమా. ౫౫౪

వ. అనిన విని సుగ్రీవుండు. ౫౫౫

గీ. ఆడుదానవుగాన నీ వరయకంటి । విట్టి లింద్రాదులనుగెల్చినట్టి గట్టి
దిట్ట నిను గెల్వనోపడే చిట్టిదాన । వట్టి భ్రమలేల మానవే వ్రతము గితము. ౨౫౬

గీ. అయ్యయో వెఱ్ఱిదాన య య్యసురవరుని । మ్రోల యుద్ధంబుజేసెదే పూలదండ
మట్టు దేనుగ కదిఎంత గట్టిపనియొ । యట్టులెంచదే మారాజు గుట్టెరుగవు. ౨౫౭

గీ. మూడుజగముల బాలించు రేడు వాడు । వేడెగా తీర్పవే వాని వేడుకలను
పీడవే మూర్ఖభావంబు నేడు నే ని । టాడుమాటలు విని వెఱ్ఱి యాడుదాన. ౨౫౮

గీ. శుంభునేనియు గాదే నిశుంభునేని । గొనుము చెప్పితి హితము నీకును మృగాక్షి
కలదె శృంగారమునకంటె నలఘుసౌఖ్య । దాయియైనట్టి కార్యంబు దలచిచూడ ౨౫౯

క. ఒయ్యారి నీదు రాకను । న య్యసురేంద్రుండు గాచి యచ్చటనున్నా
డియ్యవసరమున నీవున్ । గయ్యంబులు బెట్టకొనుట కా దిటు వినుమా. ౨౬౦

గీ. బలిమి దనుజులు నీకొప్పుబట్టి లాగి । యీడ్చుకొనిపోయి మారాజు నింటజేర్తు
రట్లుగావున నా పలు కాలకించి । సన్నిధికి బొమ్ము తగ దింత సాహసమ్ము. ౨౬౧

గీ. యుద్ధ మెచ్చట మన్మథయుద్ధమెచట । మంచిచెడుగు లెరుంగక మాటలాడ
నేటికే చంచలాక్షి నా మాట వినుము । తత్తరంబున సౌఖ్యము త్రిప్పిపోవె. ౨౬౨

వ. అనిన విని దేవి యిట్లనియె. ౨౬౩

గీ. పట్టిన వ్రతంబు తప్పుట పాడియగునె । నేటిదా యిది నా చిన్ననాటనుండి
గడుపుకొనివచ్చితిని నేడు విడువగానె । నా చెలు లసత్యవతి నని నవ్విపోరె. ౨౬౪

గీ. శుంభుడైనను సరియె నిశుంభుడైన । సరియె సపరివార లిరువురు శౌర్యగరిమ
రమ్మనుము వేగ జయము సిద్ధ మ్మటంటి । వెంతలో నగు బెండ్లి నీ కింతయేల. ౨౬౫

క. నే నబలనుగద వారలు । దానవలోకాధిపులుగదా జయమనగా
బూనిన ముహూర్తమాత్రము । లోనగునే నపుడు దనకు లోనగుదుగదా. ౨౬౬

గీ. నాకు నేనయి వచ్చితి నాథుగోరె । యుద్ధ ముంకువయిమ్మంటి నుద్ధత బల
శౌర్యములు గల్గెనేనియు జయముగాంచి । కొనుము నను గాదె పాతాళమునకు బొమ్ము.

వ. అని యివ్విధంబున నే జెప్పితినని మీరాజునకుం జెప్పు మనిన దూత హేతుగర్భితంబు లైన దేవీవాక్యంబులు విని చని తన ప్రభువునకుం జెప్పిన నతం డది తన తమ్ముం డగు నిశుంభునకుం జెప్పిన నతండు మన మిప్పుడు రణంబునకుం బోవుట యయుక్తంబు, ధూమ్రలోచనుం బంపి దానిం బట్టి తెప్పింపుము అని పల్కిన విని సంతసించి ధూమ్రలోచనుం బిలిచి నీవు శీఘ్రంబ పోయి యవ్వనితం బట్టి యిచ్చుటకిం దెమ్ము. సైన్య సమేతుండవై యడ్డంబు వచ్చిన దేవీ మనుష్య దానవుల నెల్ల దునుమాడు మని చెప్పిన

విని యతండు మాయాదేవి యంతికంబునకుం జని మధురంబులగు పలుకుల
దేవి కిట్లనియె ౨౬౮

## —: ధూమ్రలోచనునితో యుద్ధము :—

క. ఓయమ్మ మానవాశన । నాయకుడు నినున్ వరించి నయమార్గమునుం
బాయక దూతం బంపిన । నీయకొనమి సూడ మిగుల హేయముసుమ్మీ. ౨౬౯

గీ. భావగర్భితమైన నీ పలుకునందు । యుద్ధశబ్దార్థమున నొక్క టున్నయటులఁ
దలచెదను రతిసంగ్రామతత్పరత్వ । మలర నీయంద యున్నదటంచు నబల. ౨౭౦

క. రమ్మా పట్టపురాణివి । గమ్మా శుంభునకు ముజ్జగంబుల వెస నే
లొ్కమ్మా యిక నైనను మే । లొ్కమ్మా బంగారుబొమ్మ గురుకృప నిమ్మా. ౨౭౧

చ. అలసట నీవు శయ్యపయి నల్లన నత్తమిల న్నఖాంకితం
బుల బలునొక్కులం దొగరు పోడిమి మైదొలుకంగ ఘర్మబిం
దుల సితగాత్రివై కులుకు తొంగలి రెప్పల మూసి నిద్దుర
న్మైకువ వాపుటే గెలుపు మీనపతాకుని సంగరంబునన్. ౨౭౨

క. నామాట వినుము శుద్ధియ । నీమీద న్వలపువగలి నిదుర యుడిగి య
క్కాముని శరములఁ జిక్కెను । భూమీశుడు రమ్మ వేగ పోద మటకిన్. ౨౭౩

వ. అనిన విని దేవి కనుసన్నఁ గాళి యిట్లనియె. ౨౭౪

ఉ. తియ్యని మాటలాడి మది ద్రిప్పఁ దలంచెద వో విదూషకా
యియ్యవి నే నెరుంగనొకొ యెందుకు రిత్తలు వేయి మాయెడన్
గయ్యము సేయఁగా బలము గల్గినయేని నిను న్వధించి మీ
యయ్యల శుంభముఖ్యులు యమాలయవాసుల నిప్డు సేయమే. ౨౭౫

చ. జగముల మోహవార్ధి నిడు శక్తి యిదంచుఁ దలంపలేక దు
ర్భగులరు మీర లెల్లిదము పల్కెదరేటికి నీచవర్తనన్
దగిలి మిము న్వరింపుమని తప్పక యింకొకమారు పల్కిన
న్దెగ నరికింతు నాలుకలు దెప్పున బొమ్ము శుభంబు గోరినన్. ౨౭౬

క. మందమతి శుంభుడెక్కడ । బృందారకబృందసేవ్య విశ్వజనని స
ద్వందిత యెక్కడ వీరల । పొందికలెక్కడ దురాత్మ పోరా ఛీ ఛీ. ౨౭౭

గీ. కోరి సింగంబుకొదమను గొంకనక్క । గంధిగజ మందగామిని గార్దభంబు
సురభి గవయంబు నెదగొన్న కరణి దోచె । శాంభవీదేవి యేడ మీ శుంభుడేడ? ౨౭౮

క. కాళికమాటలు విని యా । బాలిశుడు మహోగ్రుడగుచు పటురోషమున
న్రాలుచు నో మదవతి యీ । బాలిక గొనిపోదు చూడు పంతమెలర్పన్. ౨౬౯

క. సింగంబు నిపుడ చంపెద । నంగన మెడఁబట్టి రాజునంతికమునకు
న్బంగున గొనిపోయెద రస । భంగంబున కొక్కయింత భయపడకున్నన్. ౨౭౦

గీ. కయ్యమునకు నేల కాలుద్రువ్వెద వీవు । చీమవొక్కొ చిన్నిదోమవొక్కొ
నలిమిఁవైతు నిన్ను జిలజిలరక్తంబు । లొలికి క్షణములోన నుక్కడంగ. ౨౭౧

వ. అనిన విని కాళిక. ౨౭౨

గీ. ఎంతమగవాడవైతివి యేది చూత । మేయుమీ బాణములు నాగ నా యసురుఁడు
విల్లు చేబూని సునిసిత భల్లములను । బెల్లుగా నేసెఁ దొలుకారు జల్లువోలె. ౨౭౩

గీ. పంచపాది: కాళికయు నిజబాణసంఘములచేత । వాని బాణంబులనుద్రుంచి వానిమీద
బహుశిలీముఖముల నేయ బటురయమున । ధూమ్రనేత్రుఁ డతిక్రోధ తామ్రనేత్రు
డగుచు గురిపించె శరవృష్టి నబలమీద. ౨౭౪

గీ. అంత నక్కాళి వాని బాణాళి ద్రుంచి । విరథుజేసి మహోల్లాసవృత్తి నదరి
యట్టహాసంబుచేసిన నసురు డన్య । రథముపయినెక్కి క్రోధవిభ్రాజియగుచు. ౨౭౫

వ. అంత గాళి అత్యంతక్రోధావేశంబున నిజశరపరంపరల వాని శరాసనంబు ద్రుంచి వెను వెంట గొన్ని బాణంబుల రథంబును, గొన్నిట సూతు, మఱికొన్నిట ఖరంబులను ద్రుంచి సపక్షోరగసన్నిభంబులగు నాశుగంబుల నతనిపై వైవ విరథుండై పరిఘంబు బూని భయదంబులగు వాక్కుల నదల్చుచు గాళి నిట్లనియె. ౨౭౬

ఉ. ప్రేలకు పాతమంగలపుపెంకునుబోని మొగంబుతోడ ను
చ్చాలితతాళసన్నిభనితాంతమహోరుయుగంబుతోడ జం
జాలివి నీవు నాయెదుట దంభముసూపెద వుండుముండు మి
వ్వేళ నిదే తల న్నరికివేయుదు నంచు మహోగ్రమూర్తియై. ౨౭౭

క. అని యురువడించి పరిఘం । బున గాళిని బొడువ గ్రోధపూర్ణనయనయై
జననియ హుమ్మని పలికి ప్ర । ధన నిల్చిన భస్మమగుచు దనుజుఁడు బడియెన్. ౨౭౮

క. దుమ్మయి ధూమ్రాక్షుడు నన । జిమ్మల బూది యిడి యసుర సేనలు గములై
రొమ్ముల మోదుచు బారిరి । బ్రమ్మిన భయవిభ్రమమున బడి లేచి వడిన్. ౨౭౯

క. ఆ ధూమ్రాక్షుడు సచ్చిన । బాధలు దొలగెనని సురలు పటుహర్షరస
శ్రీధుర్యహులై యంచిత । బోధంబుల గురిసి రపుడు పూవులవానల్. ౨౮౦

సీ. అతిఘోరమైయొప్పు నాహవరంగంబునందు నక్కలుమేసె నసురశవము
లాడుచు గద్దలు గాడిదె పీనుగ పుఱ్ఱెమెదళ్ళ నాపోవ మెక్కె
కాకులు ఘూకముల్ కదసి దేగలు నెత్రుటేటిలో ద్రావి పెల్లాటనెఱపె
కారెను రక్తప్రవాహసహస్రంబు లేరులై సందంబు నెఱ్ఱజేసె
శాకినీ ఢాకినీ పిశాచ సముదాయ । మల్లకల్లోలముగ జెరలాడె దనివి
దీర పిశితంబు సాపడి త్రేపుకొనుచు । రామరావణయుద్ధంబు రాదు సాటి. ౯౧

గీ. అంత నద్దేవి పొంది స్థలాంతరంబు । శంఖనాదంబు బూరించె జగములెల్ల
గడగడ వడంకె నిదియేమి గడబిడ యని । యపుడు హతశేషు లరిగి రయ్యసురుకడకు. ౯౨

సీ. కుయ్యో దనుజనాథ కొంకులూడెను జూడు మిదిగో యటంచు బిట్టేడ్చువాఁడు
మొఱ్ఱో సురారాతి ముక్కుబోయెను మాటజెప్పలేనని మన్వి సేయువాఁడు
అయ్యో దితిజవీర హస్తంబులూడె నెట్లోర్చెదనని యంగలార్చువాఁడు
అబ్బో నరాశన జబ్బలుపడిపోయె గూలితి నని కొట్టుకొనెడివాఁడు
కటకటా దానవేంద్ర నా కాళ్ళువిరిగె । గతి యిఁకేమని కన్నీళ్ళు గార్చువాఁడు
నగుచు శుంభుని సన్నిధి కరుగుదెంచి । వనటఁదురటిల్లు దనుజులఁ గని యతండు. ౯౩

గీ. ధూమ్రలోచనుడేడ మీ దుఃఖమేమి । కాళ్ళుసేతులుబోవ నే కారణంబు
చిన్నివగలాడి యెక్కడ సేనలేవి । యెక్కడిది శంఖనాద మిదేమివింత. ౯౪

వ. అనిన విని భగ్నులైన హతశేషులు. ౯౫

గీ. ధూమ్రనేత్రుండు సచ్చెను దురమునందు । సేనలన్నియు బడి యాల్గె జెప్పలేము
తరుణి చెలికత్తె కాళిక దర్పమడర । సమరరంగంబు నీరాక్షసంబు సేసె. ౯౬

గీ పూవులవానలు గురిసిరి । దేవత లద్దేవిమీద దితిజులకెల్లన్
జా వొదవె దేవి శంఖా । రావము గావించె దుర్భరంబుగ నధిపా. ౯౭

క. జయము మనకు నిక లేదని । భయమున రణరంగమందు భగ్నులమగుచున్
రయమున వచ్చితి మిటకున్ । నయ మడుగుము మంత్రివరుల నరభోజివరా ౯౮

ఉ. సేనలు లే వదొక్కతయ చిన్నది కాళిక తోడు దేవతల్
మానుగ బైపయిన్ నిలిచి మానిని గెల్పునుగోరి చూతు ర ౯౯
ద్దానవవైరి శంకరుఁడు దాపునఁ దోడుగ నున్నవాడు ల
మ్మానిని యొక్కతే గెలుచు మానవ దేవ భుజంగ లోకముల్॥ ౧౦౦

క. ఇఁక నీ చిత్తము చెప్పితి । మకదా రాక్షసులు పంకజాననకు బిపీ
లికలో మశకములో మ । క్షికములొ మావంతు మేము చేసితిమి నృపా. ౧౦౧

క. అనిన విని దనుజేంద్రుఁడు త । మ్మునితోడ నిశుంభ వింటె ము ద్దియ చేతల్
తృణమే వజ్రాయుధ మగు । తృణమగు వజ్రంబు బల మదృష్టవశమునూ. ౧౦౨

సీ. ఇపుడేమిసేయుద మీవు సెప్పు మనంగ న న్నిశుంభుఁడు పల్కె నన్నతోడ
బాతాళమునకును బారుట కూడదు మొనసి రణంబున మోహరించి
మించుట శ్రేయ మెమ్మెయిన నన్నుబంపుము బలగంబుతోఁ బోయి పడతి నడచి
వచ్చెదనొండె నే నొచ్చెదనొండె యిట్లపజయం బొదవిన యప్పు నీవు
చని వరాననతోడను సంగరంబు । సేయవచ్చు ననంగ నీ చెప్పినయది
మంచిదేకాని నీవిప్డు మాను పైన । పంపెదను చండముండుల నతివ నేయ. ౬౦౨

క. ఏనుగు నంపవలయునా । మానుగఁ గుందేలుఁబట్ట మాను మనుజ నీ
పైనమని చండముండుల । తో ననియెన్ ఘనమదోద్ధతుండయి కినుకన్. ౬౦౩

గీ. చండముండులార చనుఁడు సేనలతోడ । సిగ్గుమాలి మదముచేత నిక్క-
కాళి యనెడుదాని గట్టితెం డాపని । యింపుగాకయున్నఁ జంపిరండు. ౬౦౪

క. అనవుఁడు నయ్యిరువురు సే । నను గొని చని దేవి జూచి నయగతితో నో
వనజేక్షణ యెఱుఁగవు మా । దనుజవిభుని దేవలోకదమనుం డనుచున్ ౬౦౫

—: చండముండుల యుద్ధము. :—

క. వాని యనుజుఁడు నిశుంభుడు । వానిం బోలెడును గెలిచె వాసవు ననిలో
వానిని వీనిని నీ వొక । దానవు గెలిచెదవొ చిన్నదానవు ముగిదా. ౬౦౬

గీ. ఆడుదేనియు నొక మగవాఁడయేని । లేడటే బుద్ధిసెప్పంగ లేడికనుల
తోడి పూఁబోడి నీవేడ నాడఁబాడ । మద్దెలనుగొట్ట నొకతవు ముద్దులాడి. ౬౦౭

గీ. ఉరుకు మురుకుమను సవతి యుండుగాని । తోడురుకు సవతి గలదె యేడనేని
నీవినాశంబునకు జూచు నిర్జరులను । హితులనుచు నమ్మి తీవు చే టెఱుఁగ వబల. ౬౦౮

క. పదునెనిమిదిభుజములుగల । వదిరా నే గెలువలేనె యసురుల ననుచున్
మది గర్వముపడకుము నీ । మదమెంత గజంబుమ్రోల మశకము లెక్కా. ౬౦౯

క. పడతీ సురలను శుంభుడు । బడనేయుట నీ వెఱుఁగవె ప్రత్యక్షంబున్
విడిచి యనుమానపథమున । నడువంగానేల వినుము నా వచనంబుల్. ౬౧౦

గీ. ఐనవారికి నాకులో గానివార । లకును గంచాన బెట్టుట లగ్గుగాదు
నీ హితముఁ గోరి చెప్పితి నీలవేణి । నిర్జరులమాయ లెఱుఁగవొ నీ కహితులు. ౬౧౧

క. దేవతలు స్వార్థపరులని । నీవెఱుఁగవె కాకయున్న నీ కేమిఫలం
బీవైరమ్మునఁ దెలియఁగ । లేవో పనిలేనిపాటు లేమా వినుమా. ౬౧౨

గీ. పృథివి బనిలేనిమంగలి పిల్లితలను । గొఱిగఁ దొరకొనినట్టిది దొరికెనొక్కొ
యెదిరి శుంభుండు నీమీది కెత్తిరాక । కడఁగి నల్లేరుపై బండి నడచినట్లె. ౬౧౩

గీ. కార్యమిత్రులు దేవతల్ కాంచనాంగి । ధర్మమిత్రుఁడ నే నిది తలచికొనుము
శుంభుఁ గైకొమ్ము మిక్కిలి సుఖముపడుము । కామశాస్త్రంబులో వాఁడు గట్టివాఁడు ౬౧౪

క. మొఱకగు రక్కసుపలుకులు । చుఱచుఱజెవిగాడి లోక సుందరి పెను మ
బ్బులుముటిమినట్ల యుఱుముచు । గొఱకొఱఁ గనె గనులు చింత కొఱవులఁబోలన్ ౬౧౫

ఉ. ఓరి దురాత్మ ప్రల్లదము లూరక యాడెదు శుంభు డేమి లె
క్కారయపైతి నే హరిహరాదులభోగ్యలుగా సమస్తసం
సారులకేను తల్లిని నిశాచర యెందరు శుంభులైరి నా
పోరున జచ్చి భస్మముయిపోయినవారలు కాన నీకు బ
ల్మారును జెప్పనేల శతమన్యుఁడు మున్నుగ నాకు సేవకుల్. ౬౧౬

క. వీరుడవయేని నాతో । బోరుము కాదేని పొమ్ము పొమ్మిఁక వదరన్
నోరు న్మూయించెద నీ । పేరిమి నామ్రోలనటర పిశితాశనుఁడా. ౬౧౭

గీ వీరధర్మంబు గైకొని పోరఁ జచ్చి । పోర వీరులపోక నీ ప్రొద్దునుండి
వీరనాకంబునకు నీవు వీరి వారి । జోలి నీకేల యోరి చండాల వేగ. ౬౧౮

గీ శుంభుడు నిశుంభుడును నీకు జుట్టలైరి । వారు వత్తురు నీవెంట వరుసవరుస
రాక్షసానీకములు వచ్చు నక్షయపద । మందు వసియింపు దేటికి సందియంబు. ౬౧౯

వ. అనిన విని చండముండులు కోపించి యతిభీషణంబుగా జ్యాఘోషణంబు చేసినం గాంచి జగన్మాత దైత్యహృదయభేదనంబుగా శంఖస్వనంబు పూరించె. నంత సింగంబు కుపితాంతరంగంబై దేవతానికరవినోదంబుగా నాదంబు సేసె. నాదంబు విని బృందారకబృందంబు లమందానందంబునొందిరి. ఋషులు హర్షించిరి. యక్ష గంధర్వ సిద్ధ సాధ్య కిన్నర ప్రముఖులు హసన్ముఖులైరి. అయ్యెడ చండికా చండులకుం బోరు ఘోరంబయ్యె. చండవినిర్ముక్తకాండపరంపరలు నిండియుఁ జండికాదేవి యుద్దండ పన్నగాభంబులైన శరంబులు తండోపతండంబులుగా నేసిన గగనంబెల్ల శిలీముఖపరంపరాచ్ఛాదితంబై బెడిదంబులగు వడగండ్లగురియు జలదంబులవడువున నడరె. ముండుండు సైనికంబులపయి నృది స్వాతీగతుండై అతివృష్టిగురియు శుక్రుంబోలె నిసితాశుగనివహంబుల నతిదారుణంబుగా గురియం గాంచి క్రుద్ధయై భగవతి భయదాకృతిన్బూని మహావదనయై కదనంబు సేయ నది సూచి కదళీపుష్పనేత్రయై బొమలుముడివడ నతిభీకరంబైన లలాటఫలకంబుతో వ్యాఘ్రచర్మాంబరధరయై, మాలావిభూషితశిరస్కయై, మహావాపీసమోదరయై, ఖడ్గపాశధరయై, యభయదాయినియై ఖట్వాంగధారిణియై, రౌద్రాకారిణియై, కాళరాత్రింబోలెఁ గాళిక వెడలె. ౬౨౦

సీ. మొగము పెద్దదిజేసి మునుమున్ను నాలుక పెంచి పల్మారు నాడించుకొనుచు
పిరుదులు పెనుగొండ సరియలబోలంగ నవని గంపింపంగ నడుగులిడుచు
భయదమౌ పులితోలు బాగుగా బిగియించి భద్రేభచర్మంబు పయినగప్పి
కొరకొరగా జంద్రకోఅవులంబోలె గుడ్లెఱ్ఱజేసుక మిఱ్ఱిమిఱ్ఱి చూచి
కత్తి చేబూని నునుబుచ్చకాయలట్లు । యసురసైన్యంబులను దునుమాడె యప్ప
డాలు వడియాలుగాఁగ దంతాలక్రింద । గరకర నమలివైచె నక్కాళరాత్రి ౨౧

గీ. గంటలధరించు మాతంగ ఘటలబట్టి । నోటనిడి పోకబద్దలపాటిచేసి
కడువడిని జర్వణముజేసి కాళరాత్రి । యట్టహాసంబు గావించె నద్భుతముగ. ౨౨

క. గుఱ్ఱంబుల లొట్టియలన్ । గఱ్ఱుంగుఱ్ఱనుచు దంత ఘట్టనయెసగన్
బిఱ్ఱడచి నమలి తినియెన్ । మొఱ్ఱో యని యేడ్చి సోకుమూకలు సెదరన్. ౨౩

వ. ఇట్లక్కాళి కదనరంగంబు బీభత్సరసతరంగప్రవాహంబు గావించిన జూచి చండముండులు క్రోధరసావేశంబునన్ దానిపయిన్ వాడితూపు లేసి యార్చిన నవియెల్లం దప్పించుకొని నిజనిసితశిలీముఖంబుల జండు నేయ వాఁడు మూర్ఛిల్లి పడిన దుఃఖితుండై ముండుండు కాళిపయిన్ శరసంఘాతంబువేయ నిషీకాస్త్రంబుల వాని శరంబుల నుగ్గుసేసి యర్ధచంద్ర బాణంబున వానినేయ వాడు మదంబుడిగి నేలంగూలె. నంత దానవ సైన్యంబులు హాహాకారంబులును, సురసైన్యంబులు హర్షంబులునుం బొందిరి. అట్లుండ జండుండు తెప్పరిలి గదగొని కాళిక దక్షిణభుజంబుననేయ కాళి వాని గదాఘాతంబు తప్పించుకొని మంత్రయుక్తంబగు బాణపాశంబుచే వానిం గట్టిన జండుండు లేచి శక్తింబూని తనపై కుఱికి రా గని ముండుంబోలె జండుం బాణపాశంబులం గట్టి యిరువుర గుందేళ్ళంబోలె దనచేత నిడుకొని జగన్మాతకడ నిడిన చండిక కాళిం గాంచి నీ వెంతనేర్పరివి వీ రిరువురన్ వధియింపవు, విడువవు, దేవకార్యసిద్ధి యతివేగంబునం జేయవలయుగదా, నావుడు విని యుద్ధంబు యజ్ఞంబుగదా ఖడ్గయూపంబున నాలంభంబు జేసెద నని గత్తి చేబూని వారి శిరంబులం ద్రుంచి రుధిరంబు ద్రాగె నది సూచి దేవి యోకాళీ నీవు దేవతార్థంబు చండముండుల హతులం జేసితివి. కావున నీకు చాముండయను బిరు దిచ్చితి నని పలికె నంత. ౨౪

క. హతశేషులు చని చెప్పిరి । దితిజకులాధీశునకును దేవా మమ్మున్
బ్రతికించెదొ చంపెదొ య । య్యతివ యతివకాదు రాక్షసాదిని సుమ్మీ ౨౫

క. అబ్బా కాళిక యున్నది । యబ్బాలికయొద్ద దాని యాననగుహలో
నిబ్బడి వేఘోండము లిడ । గొబ్బున నొక గ్రుక్కలోన గుటుకున మ్రింగున్. ౨౬

క. చండుని కండలు దినియెన్ । ముండుని మాంసంబు నమలె మూకల నెల్లన్
ఖండించి సాపడెను వే । దండాశ్వోష్ట్రములు నిడియె దవడలక్రిందన్. ౨౭

క. సైనికు లందఱు మడిసిరి । యేనును మరికొంద రంగహీనుల మగుచున్
దానం దానం డాఁగి బి । రానన్ వచ్చితిమి యిటకు రాక్షసనాథా. ౬౨౮

క. చచ్చిన యంత కష్టైనను । జెచ్చెర మేల్కొనుట మంచి చెయువుగదా మా
పచ్చన్ గోరితివేని వి । యచ్చర పరిపంథి యిప్పు డాలము విడుమా. ౬౨౯

క. పాతాళమునకు బోదము । భూతలమున స్వర్గమునను బొసఁగవు బ్రతుకుల్
భీతిదము సింహ మున్నది । యాతరుణీమణికి గుఱ్ఱమై సురవైరీ. ౬౩౦

క. కావున నీ సోదరుడును । నీవును దుర్మంత్రచిత్తనిశ్చయు లగుచున్
జావునకు నెదురుకొనుచున్ । బోవునటుల బనులు సేయఁ బోలదుసుమ్మీ. ౬

ఉ. ఆడుది యేమిసేయగల దంచు మృషామతి బూని వంశమున్
బాడొనరింపనేల నయ మార్గమె నీ కిది కాలకర్మముల్
తోఁడయినప్డు నీవు సిరితో దులదూగితి విప్డు డొక్క యీ
చేడియ మానుషాశనుల సేనల నన్నిటి ద్రుంచె జూఁడుమా. ౬౩౨

గీ. పూర్వకాలంబునను నీవు పుష్కరమున । దపము సేయంగ గనుఁగొని ధాత వచ్చి
వరము నడుగంగ నమరత్వ వాంఛితంబు । వేడ నత డిచ్చె వరము నివ్విధముగాఁగ. ౬౩౩

గీ. సురలచే నసురులచేతఁ నరులచేత । జావు నీకును గలుగ దే జాడనేని
యనుచు బుంలింగములె కూర్చె నందువలన । నాడుదే వచ్చె నేడు మహాసురేంద్ర. ౬౩౪

గీ. ఇది మహాదేవి దీని జయించలేవు । సర్వలోకంబులకు నిది జననసుమ్ము
శరణ మని కొల్వు మది నిన్ను చంపకుండు । ననుచుఁ బల్కిన పలుకుల నాలకించి. ౬౩౫

క. ఊరకయుండుడు భయవి । స్మారంబేనియును వేగ దరలుడు పందల్
మీరలు పాతాళమునకు । నేరికయిన జీవితాశ యెక్కుడుగాదా. ౬౩౬

క. స్త్రీవచ్చి కదనమునకున్ । జీవం గాల్దువ్వు నెట్లు చెప్పుదు మీసం
బీవిధమున బెరుగంగా । నావలనం గాదటంచు న్యాయం బగునే. ౬౩౭

క. దైవాధీనుడు బ్రహ్మయు । శ్రీవరుడును శంకరుండు శిఖియును సవితృం
డా వాసవుండు ధనదుడు । నీవిశ్వములోన నీవు నేనునుగామే. ౬౩౮

క. పూని జయోవా మృత్యు । ర్వా నాగ వినంగలేదె భయమేటికి నే
బూనికిమాన నవశ్యము । మానినితో బోరి కీర్తిమాన్యుడ నగుదున్. ౬౩౯

క. అని నిశ్చయించి విక్రమ । ధనుడై తగు రక్తబీజ దనుజుని బంపెన్
ఘన సైన్యంబులతో దే । వి నెదుర్కొని పోరి చంపి వే రమ్మనుచున్. ౬౪౦

## —: రక్తబీజాసురుని యుద్ధము :—

క. చని దేవిం గని యో చెలి । వినుమా నీ వెఱుఁగనట్టివి గలవె విద్వ
జ్జనులు రసంబుల ముఖ్యము । లనుగా శృంగార శాంతు లను జెప్పిరిసూ. ౬౪౧

గీ. రెంట శృంగార మధికంబు జేండ్లపట్ల । సుఖము గోఁగితివేని యో సుందరాంగి
చెట్టవట్టుము కీర్తివిస్తీర్ణవిశద । శోభితాజాండకుంభు మా శుంభు నబల. ౬౪౨

క. మును పే జెప్పితిఁ బోరా । ననుగెల్చినవాఁడకాని నా కిష్టుడు గా
డని కావున నను గెలువుమి । యనిలో గాకున్న రాక్షసాధమ వేగన్. ౬౪౩

క. పాతాళమునకు బొమ్మీ । నీతోఁ బనియేమి మాకు నెమ్మి నటంచున్
దూతపయి దనుజపతికిన్ । బ్రీతిం బలుకుమన దనుజ వీరుం డలుకన్. ౬౪౪

ఉ. అంబికతోఁడ బోరె నసురాధము డంబక పఙ్క్తినేయు చా
డంబరమెల్ల జూపుచు దడంబడ కా జగదంబ యేసె శా
తాంబకపఙ్క్తి వానిపయి నంతట మూర్ఛిలి తేరి మీద ప్రా
లెం బలగంబుఁ దూలి తరలెన్ బలమేది ధరాతలేశ్వరా. ౬౪౫

క. చచ్చిరి సైనికులెల్లన్ । నొచ్చె నరుణబీజుడని మనోగతి దుఃఖం
బచ్చుపడ శుంభు డప్పుడు । బుచ్చె ననికి గాలకేయ పూర్వాదివిజులన్. ౬౪౬

వ. అట్లు పంపిన నా రక్కసులు సమరంబునకు వచ్చి నిలచినం గాంచి దేవి యతిభీషణంబుగా ఘంటానాదంబును, జ్యాఘోషంబును, శంఖనాదంబునుం జేసిన సన్నం బరికించి కాళి మొగంబు పెంచె. దేవీ వాహనంబగు సింగం బత్యద్భుతంబుగా గర్జిల్లె. అది విని దానవులు క్రోధమూర్ఛితులై దేవిపయిన్ వివిధాస్త్రపరంపరల నేసి రంత దేవియు నతిఘోరంబుగా యుద్ధంబు జేసె. అప్పు డప్పో రతిభయదంబైనం గాంచి. ౬౪౭

సీ. వైష్ణవిపేరిట వచ్చె విష్ణునిశక్తి శంఖంబు చక్రంబు శార్ఙ్గ గదలు
ధరిఁయించి పద్మంబు కరమున నిడి పీతవసనంబు గట్టి భావజవిరోధి
శక్తి శాంకరిపేర జనుదెంచె వృషభంబు నెక్కి శూలముబట్టి యిందురేఖ
తలదాల్చి గూఢపాద్వలయంబు బెట్టి శోభామయి యగుచు నా బ్రహ్మశక్తి

గీ. బ్రాహ్మి పేరిటఁ జనుదెంచె వరట నెక్కి । యక్షసూత్ర కమండలు లలరదాల్చి
కొమరు శక్తియు గౌమారి నెమలి నెక్కి । వచ్చె శక్తిని ధరియించి యచ్చటికిని. ౬౪౮

సీ. ఇంద్రాణి పేరిట నింద్రునిశక్తి దానైరావతారూఢ యగుచు వజ్ర
హస్తయునై వచ్చె నాజికి నరసింహశక్తి వారాహి దా చారుసూక
రంబుపై నెక్కి సుప్రౌఢయై ప్రేతాసవామోదసహితయై యనికి వచ్చె

యామ్య నా యముశక్తి హస్తంబునను దండమును బూని మహిషవాహనము నెక్కి
వచ్చె నట్టుల వారుణి వరుణశక్తి । చేరె కౌబేరినాగ గుబేరు శక్తి
దేవతాశక్తు లన్నియు దీరె బారు । లగుచు స్వస్వకరణవాహనాఢ్యలగుచు. ౨౯

సీ. అప్పుడు శంకరుం డతిరయంబున దేవి సన్నిధి నిల్చి యో శక్తి వినుము
శీఘ్రంబ దనుజులఁ జెండాడు మమరులు స్వస్థులౌదురు మహాసవనములను
భాగంబులను జెంది భోగంబు లనుభవింతురు శాంతికలుగును దరుల వాన
గురియు భూములు పండు ధర సంతసిల్లు నిరీతికంబయి యవినీతి దొలఁగు
ననుచు నుండంగ జండిక యందునుండి । యద్భుతంబగు నొకశక్తి యుద్భవించి
వెడదనోటిని విప్పి యా మృడునితోడ । నవ్వుచును బల్కె నిట్లని నరవరేణ్య. ౩౦

వ. దేవదేవా శీఘ్రంబ నీవు చని శుంభ నిశుంభులతోడ నావచనంబులుగా బలుకు మెట్లనిన నోరి మూఢా యేల చెడెదు. దేవతలతోడి వైరంబుమాను. మతి వేగంబున పాతాళంబునకు రాక్షసులతోడం బోయి ప్రాణంబులు దక్కించుకొను మట్లు కాదేని తడవేల రణంబునకు రమ్మనుము. శంకరా నీ వీ దౌత్యంబు సేయుమన వల్లెయుని యతం డేగి యే జగదంబకుం దౌత్యంబు సేయ వచ్చితి నని దేవి సెప్పిన దంతయు దెలిపిన న య్యసురు లది చెవిఁబెట్టక యుద్ధసన్నద్ధులైరి. జనమేజయా శివుండు దౌత్యంబు సేయుటంబట్టి యద్దేవికి శివదూతి యను నామంబు వచ్చె నని చెప్పి మరియు. ౩౧

క. రాక్షసుల యుద్ధరంగం । బక్షీణమహోగ్రలీల నలమికొని బృహ
త్పక్షాహి సమశరంబుల । ప్రక్షేపించి రొకమొగిని భగవతి మీదన్. ౩౨

వ. అపుడు. ౩౩

సీ. కాళిక దునిమెను శూలఘాతంబున మోదె బ్రాహ్మి కమండ లూదకమున
బార్వతియు త్రిశూల పతితులగావించె చక్రంబుచేత వైష్ణవి వధించె
వాసవశక్తి దా వజ్రంబుచే గొట్టె వారాహి కోరల బట్టి చీరె
నారసింహియు జీల్చె నఖముఖముల శివదూతి దాన మలిపెన్ భీ తౌనర్చె
బరగ గౌమారి యూల్గించె బాణతతుల । వారుణీదేవి కట్టెను బాశములను
బెక్కువిధముల మాత లా రక్కసులను । చక్కమార్చిరి మ్రింగిరి చంపి రధిప. ౩౪

గీ. సురలు పుష్పవృష్టి గురిసిరి పెనుబొబ్బ । లిడిరి హర్షవార్ధి బడిరి దాని
యోజగాంచి రక్తబీజుండు క్రుద్ధుఁడై । తేరిమీద నెక్కి దేవి గదసె. ౩౫

## —• రక్తబీజ యుద్ధము •—

చ. అతని వరంబు వింటె పరమాద్భుత మంగమునందు రక్తబిం
దుతతుల నుద్భవిల్లుదురు నూరులు వేలును లక్షలైన య

ద్దితిజులు బిందుసంఖ్యకును దీటుగ తత్సములైనవారు వా
రతితరఘోరరూపులు మహాబలు లుద్ధతవీర్యులున్ నృపా. ౬౫౬

వ. ఇట్లు రక్తబీజుండు వచ్చి గరుడవాహనారూఢయైన వైష్ణవిం గదసి శక్త్యాద్యాయుధంబులచే నడచినం గ్రుద్ధయై చక్రప్రయోగంబు సేయ దేహంబున రక్తప్రవాహంబు గురియ నందుండి యనేకసహస్రసంఖ్యాకులగు రక్తబీజు లుత్పన్నులయిన నదిగని యచ్చెరుపడి క్రమక్రమంబుగ నైంద్రియు, బ్రహ్మాణియు, మహేశ్వరియు, నారసింహియు మొదలగు మాతలును దేవియు ననేకవారంబులు నానావిధాయుధంబులనేసిన వాని రక్తధారలనుండి వాని వంటి రక్కసులు పుట్టుటతక్క వేఱొండు ఫలంబు లేకుండుటం జూచి దేవగణంబులు భీతిల్లుటయు, రక్కసు లుక్కుమీరుటయు గాంచి యంబిక చాముండం బిల్చి యో చాముండా నీవు నోరుదెఱచుటకు సిద్ధంబుగా నుండుము. నేను దానవుల వివిధాయుధంబులం జక్కాడెద రక్తంబులు గారుటతోన నేలంబడనీక నీవు పానంబు సేయుచుండు మిట్లాయెనేని రక్తబీజసహస్రోత్పత్తి కలుగదు. నావుడు నది యట్లసేయ నంబిక నిజశక్తిముఖాద్యాయుధంబులనెల్ల సేనలం జంపి కృత్రిమరక్తబీజులం జెండాడి సహజరక్తబీజు జంపిన దద్రక్తంబెల్ల జండిక పానంబుసేసె. నిట్లు రక్తబీజు రణంబున నంబిక యత్యంత వినోదంబున నదరం జూచి దేవతలు సంతసిల్లి పుష్పవర్షంబులం గురిసిరి. హతశేషు లరిగి యదియెల్ల నెఱిగింప శుంభుండు శోషిల్లి, నిశుంభుం బంప నాలోచింప నతండు తాన రణంబునకుం బోయె. శుంభుండు ప్రేక్షకుండయ్యె. అంత నిశుంభుండు దేవింజేరి. ౬౫౭

గీ. బాణవర్షంబు గురియంగ భగవతి దము । జూచుచుండంగ జండిక సునిశితశర
రాజి సంధించి యేసెను రౌద్రలీల । నట్టహాసంబు గావించె నద్భుతముగ. ౬౫౮

ఉ. అంతట దేవి కాళిఁ గని యంగన చూచితె వీరు మూర్ఖులై
యంతకుప్రోలికిన్ జనెదు నద్ది యెఱుంగక నాజిసేయ నా
యంతికమందు జేరిరి మహాబలులై తగు రక్తబీజు దు
ర్దాంతు వధించు వార్త విని తప్పని మామకమాయఁ జూచితే. ౬౫౯

శా. ఆశాబంధమువంటి దేదియునులే దత్యంతమోహాస్పదం
బై శాతోదరి కష్టనష్టముల నే యాత్మందలపోయ దా
పాశంబున్ మెడజుట్టుకొన్న నరు దుష్ప్రారంభముల్ వింతలా
లేశంబున్ సుఖ మందు లేదు బెడద ల్నిక్కంబుసు మ్మెందునున్॥ ౬౬౦

క. ఈశుంభుండు నిశుంభుం । డాశాపాశములచేత నాజిని గంపే
నాశంబు నొంద వచ్చిరి । యే శుభఫల మబ్బు వీరి కిందును జెపుమా॥ ౬౬౧

గీ. దైవమోహితులై వీరు తారసిలిరి । దేవతల్ సూడ వీరల దేరిఁజూచి
యొక్కతూపునఁ జంపెద నోర్వు మీవు । చాన నాచేతనే వీరు చావవలయు. ౬౬౨

ఉ. కాళిక కిట్లుచెప్పి తన కర్ణములంటగ విల్లులాగి బా
ణాళి నిశంభునేయఁగ నిజాశుగపఙ్క్తి నతండు నేయుచున్
దూలఁగనేసె నక్కలన దోచె మహాభయదప్రవృత్తిమై
చాలగ నప్డు కేసరి నిశాతనఖంబుల సేన జెండినన్॥ ౬౬౩

గీ. సేనలన్నియు భయమున జిక్కువడియె । దాని కలిగి నిశుంభుండు ధైర్యవృత్తి
పండ్లు పటపటగొరుకుచు భయదవృత్తి । జంద్రకౌరవులవలె గనుల్ చాల వెలుగ॥ ౬౬౪

గీ. కాళి నొక దెబ్బకొట్టి ప్రకంపితోరు । ఖడ్గుఁడై వచ్చి జగదంబ గదిసి నిలువ
భద్రనిర్భిద్ర రౌద్రంబు బరిఢవిల్ల । నెదురనేకని రాక్షసుల్ బెదరిపోఱ॥ ౬౬౫

గీ. ఎదుఱకొని దేవి దేహంబు నెంతయేని । పెంచి యెఱ్ఱని కనులతో మించి యురువ
డించి నడుమున సౌవర్ణకాంచి వెలుఁగ । నిలువఁగా గాంచి దనుజుండు పలికె నిట్లు. ౬౬౬

గీ పెళ్ళిపై యాస పెనుగోత పెట్టి పూడ్చి । జయము గొనియెద నని యిట్లు భయములేక
రయమున రణంబు జేయంగ రాకసూడ । రణములోనను నీకు మరణమె సుమ్మి. ౬౬౭

వ. అనిన విని చిఱునవ్వునవ్వి దేవి యిట్లనియె. ౬౬౮

గీ. మూఢులార మీరు మొదలును దుదయును । నెరుగ కిట్లుబలుక నేల పొందు
విండ్లు నమ్ము లిచట విడిచి పాతాళంబు । జేరఁ గాదయేని చేయు డాజి. ౬౬౯

క. వీరస్వర్గము సేకురు । బోరం జచ్చితిరయేని మొగి శూరుండుం
భీరుండును గానేరడు । పూరుషుఁ డీలోకమందు మూఢత యేలా. ౬౭౦

క. అన విని మదగర్వితుఁడై । సునిసితఖడ్గంబుతో నిశుంభుఁడు గోట్టెం
ఘనభయదలీల సింగం । బును బిమ్మట లోకమాత మూర్థంబు నొంగిన్. ౬౭౧

క. అది సూచి దేవి భయదో । గ్రదశం గదబూని వాని కాల్సేతులనున్
గదలంగనీక యేయుచు । మదిరగొని పునఃపునః ప్రపానము సేసెన్. ౬౭౨

వ. ఇట్లు నిశుంభ జగదంబలకును దేవరాక్షసులకును పరస్పరజయేచ్ఛలం బోరు ఘోరంబైన గంక గృధ్రి కాక ఘూకాది పక్షిగణంబులును వృక సారమేయ జంబుకాది మృగగణంబులును రణరంగంబు ప్రవేశించి రుధిరప్రవాహంబు పానంబు సేయుచు మొత్తంబులై మత్తంబులగుచు దిరుగుచుండ రాక్షససేనల గజాశ్వాది శవపరంపరల నిండియుండ నగని నిశుంభుడు శుంభత్క్రోధోజ్జృంభుండై దేవిం గదిసి యేయ గుపితయై యుండు ముండుము యీయసివే నిను ఖండించెద నని చండిక నిశుంభుతల నరికిన

మొండెం బూరకయుండక గదాపాణియై దేవతండంబుల జెండంజొచ్చిన నది గని దేవి
నిజకాండ ప్రకాండంబుల వాని మొండెంబు తుండెంబులు సేసి వైచిన వాఁడు దండధరు
నంతకుం జనియె అది గని హతశేషులైన సైనికులు రాజమందిరమునకు చని సమర
వృత్తాంతంబు సవిస్తరంబుగాఁ జెప్పిన విని శుంభుండు కోపాకులితలోచనుండై
యిట్లనియె. ౬౭౩

గీ. కాలమే మేలు కీళ్ళకు గర్తసుండు। సచివులును భ్రాతలును బోర సమసిపోవ
కాతరుండనగుచు నేను కడఁగి బ్రతుక। నిశ్చయించిన గలదె సి గ్గింతకంటె॥ ౬౭౪

గీ. ఏమిచేసిన చేయ నిం దేదియెట్టు। కాఁదలఁచియున్నదో యట్లు కాకపోదు
చచ్చినను సరి బ్రతికిన సరియె కాల। మెట్లు తప్పించుకొందు పో రెట్లు మాను॥ ౬౭౫

గీ. కురియు నొకకాలమున మార్గశిరమునందు। వానగురియ దొకప్డు శ్రావణమునందు
కాలము నిమిత్తమాత్రమై కడఁగియుండు। నెమ్మి దైవంబు బలవత్తరమ్ము సుండు॥

గీ. దైవనిర్మితంబు తప్పించుకొన బ్రహ్మ। తరముగాదు సుండు పురుషయత్న
మేమిసేయు సురల నేన గెల్చితి తొల్లి। యిప్పు డిట్లు వచ్చె నేమిసేయ. ౬౭౬

ఉ. కావున జీవితాశ యుడఁగా దిపు డేనును బోయి యాజిలో
దేవి నెదిర్చిపోరెద తుదిన్ జయమో భయమో యెటైననున్
దైవముమీద భారమిడి దానవులార విధాత లెందరై
రో విబుధేంద్రు లెందరయిరో శివులెందరు పోయిరోగదా. ౬౭౭

సీ. మహిలోన జాతస్య మరణం ధ్రువం బను పలుకు సత్యం బని దెలుసుకొందు
అధ్రువంబయ్యున్న యంగంబు విడనాడి స్థిరమైన కీర్తిని జెందనొప్పు
క్షితిలోన వెయ్యేండ్లు బ్రతికిననేనియు బ్రతుకాస దప్పునే ప్రాణులకును
దుర్లభంబులలోన దుర్లభంబై నది పరికింప కీర్తి సంపాదనంబె
ఉత్తముఁడు కీర్తి గోరెడు నెత్తరులను। చెలఁగి యధముండు కోరును జీవితమ్ము
కాతరత్వము మీకేల కడగు డింక। శంకమాని మహారణోత్సాహు లగుచు ౬౭౮

క. అని యరద మెక్కి సైన్యం। బును గూడుకపోయె యుద్ధభూమికి నందున్
దనరారు జగన్మోహిని। దన కన్నుల కర్వుదీర దనుజుఁడు సూచెన్. ౬౭౯

సీ. ఉదయించుచున్న సూర్యునిబోలె మెరసెడి వేణిపై రాగిడి బిళ్ళతోడ
తళతళత్కలిత ముక్తాఫలసౌవర్ణ లలితమౌ ముక్కుబులాకితోడ
కుణుకుణుప్రచుర నిక్వణన ఘంటారత్న కలితమైన జఘన కాంచితోడ
కులుకు చందురుకావు లలరారు సరిగంచు వలెపుపుట్టము వలెవాటుతోడ
నిర్జరనికాయపూజాప్రణిహితపారి। జాతమందారపుష్పవిస్తారశోభి
తంబులయి తగు సర్వాంగ తతులతోడ। నొప్పి భుమ్మని శంఖంబు నొత్తె దేవి. ౬౮౦

గీ. ఘంట వాయించి నిలచిన కామినీమ । తల్లి గనుగొని మదనార్తి నుల్లమెరియ
పంచబాణంబులను గొట్టబడి మహోద్భ । తాంబుధిని మున్గి దేవితో ననియె నిట్లు. ౬౮౨

గీ. ఎంతమూర్ఖురాలవే బాల స్త్రీలకు । ధర్మమగునె యిది వృథాశ్రమంబు
నొంద నేమిఫలము బొందెదే మృదుతర । కాయమునకు దగునె కదనపీడ. ౬౮౩

క. నారులకు లోచనములే । బారమ్ములు బొమలె విల్లు భావములే మం
త్రారంభమ్ములు లక్ష్యము । పూరుషుడు మనోరథంబె పొసఁగు రథంబై. ౬౮౪

గీ. అంగరాగంబె సన్నాహ మరియ మంద । జల్పితమె భేరి లజ్జ భూషణముసుమ్ము
సరసిరుహదళనయన యసంశయముగ । దగు విడంబన మన్యాస్త్ర ధారణంబు. ౬౮౫

క. ఆడుది యుద్ధముసేయుట । గాడిదెపనిగాక సొంపుగా నుండునొకో
కూడదు నిక్కచనులపై । నోడక విల్లెట్లుపూనెదో కమలాక్షి. ౬౮౬

సీ. గదబట్టి ముందువెన్కకు బర్విడుట యేడ మందగమనమేడ మందయాన
చిగురాకువంటి నీ చెయ్యేడ మొరకైన పరిఘంబు జక్కగా బట్టుటేడ
మృగధరబింబంబు మేలిమి మొగమేడ యత్యుగ్రతేజంబు నందుటేడ
కొదమలేడినిబోలు కులుకైన కనులేడ కోపారుణములైన చూపులేడ
నవనవోదితమగు యౌవనం బిదేడ ప్రౌఢశస్త్రకళాపరిపాటి యేడ
తనువిలాసవిరోధి యుద్ధం బిదేల వీణ చేబూని పాడవే వెఱ్ఱిదాన ౬౮౭

గీ. సంగరంబున నీ కిచ్చ జాల గలద । యేనియు గురూపవగుము గెంపెసగు పెదవి
ముక్కు గోళ్ళను కాకిరూపును బిడాల । నయనములు లొట్టిమెడయు బూనంగ దగదె.

గీ. ఇట్టి నీరూపు జూచుచు నెట్లు బొంకుతు । కర్కశంబగు మాట యొక్కటి బలుకుము
నాగ విని జగదంబ దా నవ్వి యేమి । పలుకుచున్నావు మందాత్మ పరమమూఢ, ౬౮౮

గీ. నిన్ను నెదిరించి పోరాడ నేను గావ । లయును చూచుచు నుండెద భయములేక
కాళిక నెదిర్చి పోరుము కాదయేని । యిదియ చాముండతో బోరు మింతచాలు. ౬౯౦

గీ. ఓరి దానవ యిపుడు నే నుత్సహింప । యుద్ధమునకని కాళిక నొఱయజేరి
వాని హితపు కురూపంబు పూని కాళి । మట్టుపెట్టుము వేగ మి మ్మానవాదు. ౬౯౧

వ. అనిన విని కాళి యతిరయంబున గదంబూని వాని నెదిర్చిన నిరువురకు నతిభ
యానకంబగు సంగరంబు వాటిల్లె. విబుధ మునివర్గంబు లది సూచి విస్మయం బందు
చుండిరి. గదాఘాతంబున కాళిక నయ్యసురుండు నొంప వెనువెంట కనకోజ్జ్వలంబగు
గద దాల్చి వాని రథంబు దుత్తునియలుసేసి ఖరంబులం జంపి దారకు వధియించి
గర్జిల్లిన వాఁడు పదాతియై యట్టహాసంబున గదగొని కాళిని భుజాంతరంబునం గొట్టిన
నది తప్పించుకొని వాలుం బలకయుం బూని వాని దక్షిణభుజంబు నరికిన నొడలెల్ల

రుధిరంబుగార దుమికి వచ్చి మరలం గాళి నేయ వాని యెడమభుజంబు నరికె నంత సర్వాంగరుధిరుండయి పాదప్రహారంబులం దన్నవచ్చిన దన ఖడ్గంబున వాని చరణంబులు నరికిన విచ్ఛిన్నకరపాదుండై యుండు ముండు మని కాళి గద్దించుచున్న నది గాంచి కాళి వాని కంఠంబు దునిమె నంత వాఁడు గతాసుండై పెద్దనిదురవోయె నది సూచి సర్వదేవతలు సంతసిల్లిరి మఱియు. ౬౯౧

సీ. వాసవాదులు పూల వానలు గురిసిరి పాడిరి గంధర్వ పంక్తు లెలమి
దెస లెన్మిదియు జాల దెల్విఁతో నలరారె మరుదంకురము వీచె మందగతిని
నచ్చరపూఁబోండు లాడిరి వేడ్కతో సిద్ధసంఘంబులు చేసె స్తవము
మునులెల్ల గేలెత్తి మ్రొక్కిరి నదులెల్ల నకలంకజలములై యలర బారె

గీ. యజనహోమాగ్నులెల్ల నత్యంతదీప్తి । వెలిగెను బ్రదక్షిణశిఖాళి విస్తరించి
లోకవిద్రావణక్రియాలోలుఁడగుచు । నదరు శుంభుని గాళిక హతుని జేయ. ౬౯౨

గీ. ఆయుధంబులు విడిచి నిరాశు లగుచు । దేవికిని మ్రొక్కి హతశేష దితిజులెల్ల
వీక నరిగిరి పాతాళలోకమునకు । కలుగు పుణ్యంబు జగదంబ కథను వినిన. ౬౯౩

క. అనయులగు శుంభముఖ్యుల । హనన మమరరక్షణంబు నలరారు జగ
జ్జనని కథ విన్న జదివిన । ననఘా సమకూరు నాయురారోగ్యాదుల్. ౬౯౪

వ. అనిన విని జనమేజయుండు సాత్యవతేయుం జూచి. ౬౯౫

క. చండిక మహిమంబు జగ । న్మండిత మది వింటి నీ యుదారకరుణ నె
వ్వండీ ముక్కతలను విని । యుండెన్ జగదంబ ప్రోచి యుండెన్ జెపుమా. ౬౯౬

ఉ. దేవి యుపాసనావిధిని దివ్యతరంబగు పూజనక్రియా
భావితమైన ప్రక్రియయు పావనహోమవిధిన్ వచింపుమీ
నా విని మౌనివర్యుఁడు మనంబునఁ బొంగుచుఁ బల్కె నో మనీ
షావిశదాత్మ తెల్పెదను సాంగముగా విను దేవిపూజనన్. ౬౯౭

## —: సురథోపాఖ్యానము :—

వ, తొల్లి స్వారోచిషమన్వంతరంబున సురథుండను మహీపాలుండు గల డతండు మహో దారుండై ప్రజాపాలనతత్పరుండై సత్యవాదియై కర్మపరుండై గురుభక్తిరతుండై బ్రాహ్మణపూజకుండై స్వదారరతుండై దానశీలుండై యజాతశత్రుండై ధనుర్వేద పారగుండై ప్రజాపాలనంబు సేయుచున్నంత ౬౯౯

క. మ్లేచ్ఛులు పర్వతవాసులు । తుచ్ఛులు చతురంగబలముతో బృథ్వీగ్రా
హేచ్ఛన్ దండెత్తిన గని । తచ్ఛాంతికి నతఁడు సైన్యతతులన్ గూర్చెన్. ౭౦౦

క. అలతి తురకలదళంబులు । పలుతెగలై పరగె రాజుబలగంబులు న
ట్లలరినను తురకలకు జయ । మలవడియెన్ సురధునకును నపజయ మయ్యెన్ ౨౦౧

గీ. భగ్నుఁడై స్వపురము జేరి ప్రభువినీతి । కుశలులగు మంత్రివరులను గోరి పిలువ
గుమతులై వారు శత్రుల గూడికొనగ । చింతనొందెను భూపతి కొంత సేపు. ౨౦౨

గీ. చోటువదలక పరిఘయు గోట జక్క । జేసికొని తిరివేచి యాజికిని గదుర
వలయు మంత్రులు పరిపంథి వశగులయిరి । యేమి సేయుదు నిపుడు డిక్కేడి నాకు. ౨౦౩

గీ. పరులజేరిన యీమంత్రివరులు వేగ । పట్టియిత్తురు నను బరిపంథి కిపుడు
పాపబుద్ధుల నమ్ముట వలనుగాదు । సలుపరే యది యాశాపిశాచవశులు. ౨౦౪

క. అన్నల దండ్రిని బిడ్డల । సన్నయు గురు ద్విజుని బంధుసమితిని మిత్రున్
మన్నన సేయరుసుమ్మీ । పన్నుగ నాశాపిశాచవశవర్తు లిలన్. ౨౦౫

క. అని యేమియుఁ దోచక య । జ్జనపాలుఁడు హయమునెక్కి చయ్యన నొకఁడై
చనియెన్ ఖురము విడిచి యొక । వనమున కచ్చోట గొంతవడి నిల్చి యటన్. ౨౦౬

గీ. ఎక్కడికిఁ బోయెద నటంచు నొక్కగడియ । సేపు చింతించి యచటికి జేగ మూడు
యోజనంబుల దవ్వున నొప్పు నొక్క । తాపసులపల్లె దలపోసి దాని కఱిగి. ౨౦౭

వ. అందు. ౨౦౮

సీ. సింగంబు జెడబట్టి చెలగాడు లేడులు నెన్నదుండము నాకు మృగవరములు
నెలుకకు మేత సందిచ్చు మార్జాలముల్ బిల్లి మూపున మోచు వేపిగములు
నావుదూడల గాచునట్టి వ్యాఘ్రంబులు చెలగి మేకకు మేలు జెప్పు వృకము
బర్హి బర్హము సీడ బన్నుండు భుజగముల్ హరి జేరి జెడ ద్రువ్వు శరభమృగము
కోరి సంపంగి తేనియ గ్రోలు తేటి । వేడుకలరంగ జిలుక ముద్దాడు పుష్పగు
సంతతాన్యోన్య మైత్రిచే జాతివైర । మెన్నడును లేదు మునిపల్లె నెన్న దరమె. ౨౦౯

పంచచామరము : తరుల్ సరోవరంబులు న్నదంబులు న్నదుల్ స్ఫుర
చ్చర త్కుదుళ్ హటుల్ గిరు ల్విశాల సైకతంబులున్
పరస్పరానురాగహారి పైకశౌకముల్ తగన్
ధరాధరాకరంబు నొప్పు తాపసాశ్రమంబుసూ. ౨౧౦

సీ. చారుప్రసూనవాసనలకు దోడుగా హోమధూమంబులు నోలినడచు
సమదకోకిలవిరావములకు దోడుగా వేదస్వనంబులు వెంటదగులు
ఘనచూతఫలరసోద్గారంబు తోడుగా వఱలు నివ్వరిగంజి వార్పు లదర
కమనీయకిసలయ కాంతులదోడుగా తాపసోత్తమ జటాతతులు మెఱయ

క్రమతరలతికాకుడుంగములతోడు । శైత్యనిత్యంబులగు పర్ణశాల లలర
కాన సొగసును మునిపల్లెకోన సొగసు । జెలిమి సేసెడి నేమని చెప్ప నధిప. ౭౧౧

వ. అట్టి మునిపల్లె గాంచి యత్యంతసంతోషభరితాంతరంగుండై యనంతాకాంతుండు చింత
దొలఁగి తన గుఱ్ఱంబు నొక మఱ్ఱిక్రిందఁ గట్టి యచ్చోట్టి చూచిన నందొక వృక్షంబునీడ
మృగాజినాసనుండును, శాంతుండును, నతికృశుండును నైన యొక్క మునిశ్రేష్ఠుండు
క్రోధలోభాదిరహితుండై, ద్వంద్వాతీతుండై, విగతమత్సరుండై, యాత్మజ్ఞానరతుండై,
సత్యవాదియై, శమయుతుండై, శిష్యులకు వేదశాస్త్రార్థంబు లుపన్యసింపుచు, గూర్చుండి
కానవచ్చిన నతనిం జేరం జని భూమిపాలుండు భూమిపైఁ బొరగి యెఱిగి యశ్రుజలా
పూర్ణనయనుండయి జాలిపుట్ట నేడ్చినం గని ఋషివరుండు. ౭౧౨

గీ. లెమ్ము లెమ్మ నీకు లేదు భయం బింక । భద్రమగునటంచు బలికి కరుణ
జేయగాంచి యతఁడు సెప్పకయే దబ్బ । చాప బఱచె నొక్క ఛాత్రుఁ డంత. ౭౧౩

క. ఆ నరపతి లేచి సమా । సీనుండై యుండి మౌని చేసెన్ బూజల్
వానికి వెండియు నడిగెన్ । భూనాయకు పేరు నూరు పొక్కుకతంబున్. ౭౧౪

వ. ఇట్లడిగి మఱియు. ౭౧౫

ఉ. వచ్చిన కార్యమేమి నరవర్య యెఱింపుము నీ మనోగతం
బచ్చుపడంగ నీ యభిమతార్థము సాధ్యమయేని చేసెదన్
జెచ్చెర నన్న రాజు విని సేవకుఁడన్ సురథుండ శత్రుచే
నొచ్చితి రాజ్య గేహ గృహిణుల్ మది కింపులుగాక పీడితిన్. ౭౧౬

క. వచ్చితి నే నీకు శరణు । జొచ్చితి నీవెద్ది దారి చూపెదొ నాకున్
గ్రచ్చర నే నటు జేసెద । నిచ్చోటను నీవకా మరెవ్వఁడు బ్రోచున్. ౭౧౭

క. అనిన విని మౌని పలికెన్ । జననాయక నిలుము నీవు నావనమున ని
న్నును జెనకలే డొకండును । ఘనమగు నా తపముపేర్మి గలక యికేలా. ౭౧౮

గీ. వన్యఫలమూలములును నివారివర్ణ । బియ్యమును దించు మాతోడ బ్రీతిగలిగి
కొంతకాలంబు చిత్తవిశ్రాంతి దనరు । వర్ణతో తట్టు యెండంగ వలసినట్లు. ౭౧౯

వ. అన విని నృపాలుం డా యాశ్రమంబున వసియించి యొకనాఁ డొక వృక్షచ్ఛాయం
గూర్చుండి తన యింటిమీద ధ్యానంబువెట్టి తనలో నిట్లని తలపోయం దొడఁగె॥ ౭౨౦

ఉత్సాహ. తురకవారు శత్రులగుచు దోలి రెల్లరాజ్యమున్
గరుల హరుల రథచయంబు కాల్బలంబు లెల్లఁ గా
తరతబోయె మంత్రివరులు దౌష్ట్యమూని శత్రుభూ
వరుల జేరి రేమిసేయువాఁడ నేఁడు దైవమా. ౭౨౧

క. ధనమెల్ల దురాచారులు । పనివడి గొని జూదములకు పానంబుల కొ
య్యన వెచ్చము పెట్టిరి యిఁక । నను వొందునె రాజ్య మెప్పుడైనను నాకున్ ౨౨

వ. ఇట్లు విచారింపుచుండ పాంథుండైన యొక వైశ్యుం డద్దారిన పోవుచు నత్తరుచ్ఛాయ
నతని సమీపంబున నుత్తరీయంబు పరచి నత్తమిల్లినం జూచి నృపోత్తముఁడు నీ వెవ్వఁడ
విచ్చటికి రాగతంబేమి శోకపీడితుండవై యున్నట్లు గానవచ్చుచున్న వాఁడవు దుఃఖంబు
నకు గారణం బెద్ది సత్యంబు పలుకవే యనుఁడు నా మూఢపకొలమువాఁడు వీఁడు
సాధుండు వీనితోఁడ దన గోడు సెప్పం గూడునని యెంచి యో చెలికాడా నేను కోమటిని
నన్ను సమాధియని జనులు బిల్తురు. ధనవంతుడనై ధర్మంబులరసి సత్యంబుపలుకుచు
నసూయలేక జీవించుచుంటి. ధనలుబ్ధులైన పుత్రులును, భార్యయు నన్ను గృహంబునుండి
వెడలగొట్టిన స్వజనత్యక్తుండనై యివ్వనంబునకు వచ్చితి నయ్యా నీవు భాగ్యశాలివిగా
గానవచ్చుచున్నా వెవ్వండవు తెలుపుమనిన నేను సురథుండను భూనాయకుండ శత్రులచేఁ
బీడింపఁబడి, మంత్రులచే వంచింపఁబడి, రాజ్యంబు విడచి యివ్వనంబు ప్రవేశించితి. నా
యదృష్టవశంబున నీవు మంచి చెలికాడవు నన్నుం గలిసితివి. మన మిరువురము నీ
చెట్లక్రింద సుఖంబున విహరింతము. నీవు సమస్తంబు నెఱింగినవాఁడ విది యెఱుంగవే
శోకంబు విడువుము. శోకంబువలన రోగంబు పుట్టు. స్వస్థుండవు గమ్మనిన వాఁడు
నాకుటుంబంబు నిరాలంబంబు. నేనులేకున్న దుఃఖితంబగు. వ్యాధి శోకోపతాపితమై
సంసారంబు సెడునని మఱియు. ౨౩

గీ. భార్యతోడఁ జెలిమి బాసి వచ్చితి నయో । పుత్రసంగ సుఖము బోవిడిచితి
గటగటా యటంచు గడు దుఃఖమొందె నా । చిత్త మింక నేమి సేయువాఁడ. ౨౪

క. ఎప్పుడు భార్యం గలసెద । నెప్పుడు నా సుతులగాంచి యెత్తుకొనియెదం
జొప్పడిన స్వజనమును గన । నెప్పుడికేనియు నటంచు నేడ్చెద నధిపా. ౨౫

వ. అనిన విని రా జిట్లనియె. ౨౬

క. దుర్మార్గులు మూర్ఖులు దు । ష్కర్ములు నై నిను ద్యజించు కట్టడులఁ గనన్
శర్మంబు నీకు గలదే । ధర్మాధర్మముల జాడ దప్పితివె చెలీ. ౨౭

గీ. హితముసేయువా రహితులైరి దుఃఖంబు సౌరది నిచ్చువారు సుహృదులైరి
కాన మనసు గట్టిగాఁ జేసి యిక్కాన । నన్నుగూడి విహరణం బొనర్పు ౨౮

వ. అనిన వైశ్యుండు ౨౯

ఉత్సాహ. మనసు కుదుర దెంత వంత మానుకొందమన్న నో
జనవరేణ్య గృహము దుస్త్యజంబు దుష్టకోటి కి
ట్లనిన నాకు రాజ్యదుఃఖ మట్ల మానసంబు వే
దనము నొందజేయు మనకు దారిజూపు నెవ్వఁడో. ౩౦

వ. అని యొక్కింత దడ వాలోచించి యో మిత్రుఁడా యి య్యాశ్రమమందున్న యతి శాంతుం
డైన మునివరు దుఃఖనాశకంబగు నౌషధం బడుగుద మన వాఁడును నియ్యకొన
నిరువురు లేచి చని మునిం జేరి వినయోపేతులై నమస్కరించి నిలువంబడి రందు సుర
థుండు మునిం జూచి యిట్లనియె. ౨౩౧

సీ. మునినాథ యిదె చూడు మూడవకాలమువా డితఁ డీవనంబున కేగుదెంచి
నాకు మిత్రుం డయినాడు పుత్రులు భార్య వెళ్ళగొట్టిన వచ్చె వీ డిచటికి
యేమిహేతువొ కాని యెరుగ మిర్వురకును సంసారదుఃఖంబు సమసిపోదు
అది పోయె నిదిపోయె నను చింతచే నిద్ర పట్టదు రేయియు బవలు మాకు
స్వప్నమునుబోలె సర్వం బసత్యమనుచు । నెఱిగియును భ్రాంతి విడువ దిదేమివింత
నీవుతక్క మరొక్కరు నేరరిట్టి । సంశయము దీర్ప నన మునిస్వామి పల్కె. ౨౩౨

సీ. రాజేంద్ర వినుము కారణము దెల్పెద బంధమునకును మఱి మోక్షమునకును మాయ
బ్రహ్మయు విష్ణుండు పరమేశ్వరుండును శతమన్యుఁ డనిలుండు జలవిభుండు
సర్వామరులు మనుష్యశ్రేణి గంధర్వ పన్న గాసుర వృక్ష పశు లతలును
మృగములు పక్షులు మీనంబులును మాయచే జిక్కి బద్ధులై చే టెరుగరు
స్థిరచరాత్మకమైన యీ సృష్టియెల్ల । మాయవలలోన నున్నది మానవుండ
వొక్కడవు నీవు విడివడ నోపుదొక్కొ । పండితులె రాగవశులయి బడలుచుండ. ౨౩౩

ఉ సత్యయుగంబునందు వనజాక్షుఁడు తెల్లని దీవిలోన దా
నత్యధికోగ్రమౌ తపము నబ్దములున్ బదివేలు సెల్లగా
నిత్యవిధిన్ బొనర్చె నతి నిర్మలమై తగు బ్రహ్మవిద్యకై
సత్యసుఖోపలబ్ధికయి సంసరణోన్నత దుఃఖశాంతికై. ౨౩౪

క. బ్రహ్మయు దప మొనరించె న । జిహ్మగతిం దుఃఖశాంతి చేకుర సతత
బ్రహ్మానందము ప్రణవ । బ్రహ్మంబున గలదటంచు బహువత్సరముల్. ౨౩౫

వ. అంతట నొకప్పుడు వాసుదేవుండు స్థలాంతరంబు గోరి తన తొంటి యునికినుండి
లేచి, చనుచుండ నట్లె బ్రహ్మయు, వేరొండుచోటు నెమకుచు బోవ నిరువురు
నొక్కచో గలసి యొండొరు నెఱింగికొన నందు వాసుదేవుం జూచి పరమేష్ఠి తాన
జగత్కర్త నని పలుక నోరి మూఢుడా నేన జగత్కర్తనుగాని నీ వెట్లయితివి. రజో
గుణంబు నాశ్రయించి బలహీనుండవైనవాడ వీవు, నేను సత్త్వాశ్రయుండనైన సనాత
నుండనని యెఱుంగుము. నిన్న మొన్ననకదా నీవు మధుకైటభులచేఁ బీడింపఁబడి నన్ను
శరణంబువేడిన దనుజుల మర్దించి నిన్ను రక్షించినది నేనకా నీ కింత గర్వంబేల, యీ
ప్రసారితంబయిన సంసారంబునందు నాకంటె నధికుం డెవ్వ డీ వెఱ్ఱి విడువు మని యిట్లు
బలికిన బ్రహ్మ తాన కర్త ననియు, విష్ణుండు తాననియు, పరస్పర వాగ్వాదంబుల
బ్రొద్దుపుచ్చి మఱియు. ౨౩౬

క. పెదవు లదరంగ నొడలు । గదలన్ గన్నులను నిప్పు గణకణ కురియన్
పదరా నేనే కర్తను । గదరా జగమునకు నని జగడమాడంగన్ ॥ ౫౩౭

ఉ. కాంచిరి వారికి న్నడుమ గ్రమతరామృతసారచారుశో
భాంచితధాళధళ్యమహితాంగము దిగ్దళకావలీఢస
త్కాంచనమల్లికాకుసుమగంధసమాశ్రితభృంగమున్ నిరా
కుంచితదీర్ఘవృత్తిగతగోచరరంగము నొక్క లింగమున్. ౫౩౮

క. అంతట నాకాశంబున । వింతగ వారి కొక పల్కు విన్బడియెను శ్రీ
కాంతా వాణీకాంతా । యింత వివాదంబు చెల్ల దిరువురి కిచటన్. ౫౩౯

క. ఈ లింగము తుదముట్టఁగ । నోలిన్ గనిపట్టు నెవ్వఁడోపిక నతఁడే
మీలో శ్రేష్ఠుఁ డొకఁడు పా । తాళమునకు నొకఁడు దివికి దడయ కరుగుఁడీ ౫౪౦

క. నా విని యజుండు పైకిన్ । శ్రీవరుఁ డడుగునకుఁ జనిరి చెచ్చెరఁ బోవన్
బోవఁగ నెన్నాళ్ళకు నా । గ్రావము తుది ముట్టలేకి గళవళపడఁగన్. ౫౪౧

క. కడనుండి యొక్క గేదగి । పడఁ దుహిణుఁడు చేతఁబట్టి పరుగున దిగి య
జ్జడశాయికి నది సూపెను । కడముట్టితి లింగమస్తకము నే గంటిన్. ౫౪౨

క. అందుండి దీని దెచ్చితి । నాం దామోదరుఁడు దీని నమ్మికకును సా
క్షిం దెమ్మని యడిగిన నర । విందోద్భవుఁ డనియె నిట్లు వేడుకతోడన్. ౫౪౩

ఉ. ఇప్పుడు దూరదేశమున కెట్టులఁ బోయెద సాక్షి యెవ్వఁ డే
చొప్పున వచ్చు నాకు నపసూన మిదె వచియించు నిక్కమున్
గొప్పగనంచు దాని బురిగొల్పిన నయ్యది శార్ఙ్గిఁజూచి యో
యప్ప శిరంబునుండి నను నబ్జభవుండు గ్రహించె నావుఁడున్. ౫౪౪

క. అచ్చెరుపడి మాధ్యస్థ్యం । బచ్చుపడఁగ శివుఁడె తెల్పు నని హరి నిలువన్
గ్రచ్చర మొగలిన్ గనుగొని । బచ్చనివిలుకానిగొంగ పలికె గుపితుఁడై. ౫౪౫

గీ. ఓసి మొగలిపువ్వ నా సిగనుండి ని । న్నజుఁడు గొంచు వచ్చెనటవె కల్ల
నుడువనేల పడఁగ నడుమ నందెనుగాదె । బడుగుబమ్మ వీఁడు బద్దులాడు. ౫౪౬

క. నిను నెన్నడు నే ముట్టను । చను మనృతంబాడితీవు సరగున ననినన్
జనియె నది సిగ్గుతో న । వ్వనజభవుఁడు మ్రొక్కె శ్రీనివాసున కధిపా. ౫౪౭

వ. కావున బ్రహ్మ విష్ణ్వాదులగు మహాజ్ఞానసంపన్నులకు సముతము మాయాబలంబు మోహ
దంబై యుండు తక్కినవార లేమిలెక్క, దేవతాకార్య సిద్ధ్యర్థంబు రమాపతి నానా
యోనుల నవతరించి దివ్యానందసుఖంబు విడనాడి మాయాబలంబు పెంపున చింతాపరం

పరలం జిక్కు సర్వచరాచరంబు భగవతీమాయాబద్ధంబై యుండు, నావుడు విని రాజు సంయమీంద్రా దేవీస్వరూపంబును దన్మాయాబలంబును మొదలుగాఁగల వృత్తంబు కొంచె మెఱింగింపవే యనుడు ఋషి వాని కిట్లనియె ౨౪౮

సీ. అది నిత్య యదిపర యదికారణంబులకారణంబు నిఖిలాధారరూప
యది శక్తి యదియ సర్వాధీశి యది లోకమాత సర్వాత్మక మహితమూర్తి

శక్తిలేకుండిన శవముతో తుల్యంబు శక్తిగల్గిన జీవయుక్తిగలదు
ఆవిర్భవించు నొకప్పు డంతర్ధానమందు నొక్కప్డు దేవార్థమగుచు
నిర్జరులయేని మనుజులేనియును దన్ను । స్తవముజేసిన నానంద దాయిని యయి
వివిధరూపంబులను బుట్టు వింతమీర । తప్ప కొక్కప్డు దనయంత దాన బుట్టు. ౨౪౯

గీ. దృశ్యమునకెల్ల జనని యదే తలంప । గాలమున కంద దది దాని కర్త లేదు
సదసదాత్మిక పురుషరంజనము సేయు । నాటలాడును బ్రహ్మాండ నాటకమున. ౨౫౦

గీ. దాని శక్తులు గైకొని దగ జరింత్రు । పద్మయును వాణి గిరిజయు బహువిధముల
భువనములు దానిచేతిలో పూలచెండ్లు । శక్తిమహిమంబు గొనియాడ శక్యమగునె. ౨౫౧

వ. అనిన విని దేవీపూజావిధానంబు దెలుపుమని రా జడిగిన ఋషి యిట్లనియె. ౨౫౨

సీ. వినవయ్య రాజేంద్ర విన్పించెదను నీకు నంబపూజావిధానంబు నేఁడు
స్నాతుడై శుచియయి చలువమడుపుగట్టి యాచమించియును బూజాయతనము
చక్కజేసియు బ్రదేశం బక్క యందు దర్భాసనాసీనుఁడై యాచమించి
అర్చనద్రవ్యంబు లన్నియు నట జేర్చుకొనియు బ్రాణాయామమును నొనర్చి
చెలఁగి తా భూతశుద్ధినిఁ జేసి ప్రాణ । ముల బ్రతిష్ఠించి సంభారములను బ్రోక్ష
ణంబు గావించి దేశకాలంబులెంచి । న్యాసమొనరింపవలయు ధరాధినాథ. ౨౫౩

సీ. తామ్రపాత్రమున జందనగంధమునను షట్కోణయంత్రము వ్రాసి రాణదనర
బైల నవాక్షరమంత్రబీజంబులు తీరుగా వ్రాసి ప్రతిష్ఠ సేసి
పొసగఁ బూజామంత్రములచేత జగదంబ బూజించి వైదికములగు విధుల
జపియించునది నవాక్షరమంత్రము దశాంశమున వేల్చి తర్పణమ్మును బొసంగ
నట్లు గావించి భోజనంబట్లు బ్రాహ్మ । ణులకు నిడి చరితార్థయి నుడివి నిత్య
మిట్లు నవరాత్రకవ్రతం బేసగు నాశ్వ । యుజమునను జైత్రమున నాడి నుండి వసుస. ౨౫౪

సీ. క్రమముమీరగ నవరాత్రోపవాసంబు తప్పక జప్యమంత్రములచేత
ఘృతశర్కరామధుయుత పాయసములచే హోమ మెల్లరు సేయ నొప్పచుండు
భాగమాంసంబున నల్పుదు రది దినువాలల్లు మఱియు బిల్వదళములను
నరుణహయారి పుష్పాళిచే శర్కరామిళితతిలలచేత నొలయఁజేసి

యష్టమి చతుర్దశిని మఱి యన్నవమిని । మానరా దంబపూజ బ్రాహ్మణులభోజ
నంబు రాజేంద్ర యెల్లమానవులు దీని । వలన శుభములఁ బడయంగ వచ్చు బొమ్ము. ౭౫౪

సీ. నిర్ధనుండు ధనియౌ నీరోగుడౌ రోగి పుత్రులఁబడయు నపుత్రకుండు
అవనిఁబాలించు రాజ్యభ్రష్టుఁడగువాఁడు శత్రుపీడితుఁ డోర్చు శత్రుసమితి
విద్యఁగోరినవాఁడు విద్వాంసుడగు సందియము లేదు నాల్గువర్ణములవారు
జగదంబఁ బూజింప సకలశుభావాప్తియగు నవరాత్రవ్రతాఖ్య నిద్ది
యాడువారికి బురుషుల కందఱికిని । దృప్తిగల్గును వాంఛితావాప్తి గలుగు
కాదె భక్తులపాలిటి కల్పకంబు । ధారుణీనాథ విను జగదంబమహిమ. ౭౫౫

సీ. మాలిక. ఆశ్వినంబున శుక్లమందును నవరాత్ర మొనరించెడి విశేష మొకటి వినుము
విధిపూర్వకంబుగా వెలయ మండల మొనరించి పూజాస్థాన మెసగఁజేసి
వేదమంత్రములచే విధివత్తుగా దానిమీద రుచిరమగు మేల్మియంత్ర
మిడి పుష్పమాలా సహితవితానము గట్టి ధూపదీపముల నందు బొసగించి
భూరిభక్తి త్రికాలపూజలు సేయుచు బ్రాపుగోరుచు షోడశోపచార
వరగీతవాద్య స్తవన ముఖ మహితోత్సవంబులు గావించి డంబుమీర

కన్యకాపూజ విధిపూర్వకంబుగాగ । చందనాభరణాంబర చారుభక్ష్య
గంధ తైల కుసుమమాలికలను దన్పి । పూజనము సేయఁదగుఁజుమి భూవరేణ్య. ౭౫౬

సీ. అమలనష్టమినేని నవమినేనియు హోమ మొనరింప నగు విధు లొప్ప నెఱిఁగి
విప్రభోజనముల వెలయించి దశమిని బారణ మొనరించి భక్తితోడ
తన శక్తి కొలఁదిని దానంబు సేయంగవలయు వాంఛితసిద్ధి గలుగుకొఱకు
నీవిధంబున వ్రతం బెవ్వా రొనర్తురు వారు సధనయైన నారియేని
విను పతివ్రతయగు నట్టి విధవయేని । బురుషుఁడేనియు నిహలోక భోగ మొంది
పిదప బరమపదంబున బీటవెట్టు । భవనుగల్గిన జగదంబ భక్తిగలుగు. ౭౫౭

వ. కావున భూపాలకా! నీవు నేనుచెప్పిన విధానంబు తెలిసి దేవీపూజనంబు సలుపుము. నీవు శత్రువులం జయించి రాజ్యపదంబు గైకొని పుత్రదారాదులం గలసి సుఖం బనుభవించెదవు. ఓయి వైశ్యోత్తమా నీవును నట్లు సేయుము. నీవు గృహంబునకుం జేరి స్వజనులచే నత్యంతసన్మానంబు వహించి యధేచ్ఛంబుగా సాంసారికసుఖం బనుభవింప గలవు. అని చెప్పి ఓ భూనాథ వైశ్యులారా! మీకు దేవీలోకంబు ప్రాప్తింపగలదు. భగవతిం బూజింపనివారికి నిహలోకంబున నానాదుఃఖంబులును, దుదకు నరకంబును సంభవించు, నిటు వినుఁడు. ౭౫౮

పంచచామరము : ధిరం భవాని పూజనంబు తప్ప కాచరించు నే
నరుండు వానికిన్ సుఖం బనారతంబు సద్గుణ

స్థిరోన్నతాధిపత్య మాన శీలము ల్లభించు బం
ధుర ప్రతాపకీర్తు లబ్బు దోసము ల్తొలంగెడిన్. ౨౬౦

వ. అని చెప్పెననిచెప్పి వ్యాసుండు జనమేజయున కిట్లనియె. ౨౬౧

క. అని పల్కిన మునిపల్కులు । విని వారిరువురును మోద విపులహృదయులై
మునివరున కెఱఁగి మిక్కిలి । వినయంబున బల్కిరిట్లు విపులాధీశా. ౨౬౨

క. ధీరవర నేఁడుమాకుం । గోరంబులు దీరెఁ బిచ్చుగుంటుపయిం భా
గీరథి బారినయట్లే । నీ రమ్యవచోమృతంబు నెఱయుట కతనన్. ౨౬౩

క. సతతము పరోపకారమె । మతినెన్నంబడు నకృత్రిమగుణారామ
ప్రతతికిని సుఖస్థితి నం । చితగతి యగుగాదె యేమి చెప్ప మునీంద్రా. ౨౬౪

గీ. స్వార్థపరు లెందఱెందఱో నవని గలరు । చిక్క డుపకారియైనవాఁ డొక్కఁడేని
లక్షలో గుల్కరాళ్ళ వేలకొలది గను । పడును వజ్రంబు గాలించి పట్టవలయు. ౨౬౫

క. మేమిరువురమును దుఃఖము । తో మునివర నిన్నుఁజూచి తొఁడనె దుఃఖ
వ్యామోహము నడఁచితిమిగ । దా మేనున మానసమున ద్వద్వచనములన్. ౨౬౬

ఉ. ధన్యులమైతి మే మిపుడు తాపసవర్య భవద్వచస్సుధన్
మాన్యులమైతి మింత కృప మాపయిఁ జూపితి వేముసూడ సా
మాన్యులమే పురాతనభవంబున బుణ్యముచేసియున్న సౌ
జన్యమువల్లగాక విన సాధ్యమె నీ మహనీయసూక్తులన్. ౨౬౭

వ. కావున మునీంద్రా నవాక్షరంబగు దేవీమంత్రంబు భవన్ముఖంబునం వినవలయు ననుగ్ర
హింపవే యన విని మునివరుండు. ౨౬౮

గీ. ధ్యానబీజపురస్సరం బగునటులను । మంత్ర మిచ్చిన వార లాత్మలఁజెలంగి
సెలవుగొని యొక్క నదియొద్దు సేరి విజన । మైన దేశంబునందు నేకాంతముగను. ౨౬౯

క. ఉపవిష్టులగుచు వారలు । జపములు గావించి రఖిలజననీ మంత్రం
బపరిమిత నియమనిష్ఠల । నుపవాసవ్రతము పూని యుర్వీనాథా. ౨౭౦

గీ. పండ్లుమాత్రము సాపడి పరమనియతి । నొక్కయేడిట్లుగడిపి తదుత్తరంబ
శుష్కపర్ణాశనము జేసి సొరిది నొక్క । యేడు దాటింప నప్డు రెండేండ్లతుదను. ౨౭౧

గీ. సొగసు చెంగావిచీరెతో నగలతోడ । దేవి స్వప్నంబునం దోచె దివ్యలీల
నలర వారలు భక్తితో నంతనుండి । నీళ్ళుమాత్రము ద్రావుచు నిల్చి రుసురు. ౨౭౨

గీ. ఇట్లు వ్రతనిష్ఠ మూఁడవ యేఁడు గడప । దేవి ప్రత్యక్షదర్శనం బీవఁబడును
గాకయుండె నటంచును గాయములు త్య । జింపఁగాఁ బూని రిర్వురు క్షితితలేంద్ర. ౨౨౩

ఉ. కుండములందు నగ్ని దరికొల్పి నిజాంగవిఖండనంబులం
గండలు నెత్రు వ్రేల్చుచు నఖండముగా జగదంబ భక్తితో
నుండఁగ దేవి సత్కృప నొహో యనుచుం జనుదెంచి కోరికల్
నిండగ నిచ్చె దర్శనము నిర్మల శాంతమనోహరాకృతిన్. ౨౨౪

వ. ఇట్లు దర్శనంబిచ్చి దేవి యో రాజన్యశిఖామణీ, యో వైశ్యకులశిఖామణీ మీ వరం
బులు వేఁడుం డనవుఁడు రాజు శత్రుజయంబును, రాజ్యలాభంబును వేడిన నట్ల యగుం
గాక, మఱియు నీవు పదివేలయేండ్లు రాజ్యంబు సేసి దేహాంతంబున సూర్యునకు జన్మించి
మనువ వగుదు వని చెప్పె. వైశ్యుండు నేను సంసారసుఖం బొల్ల మోక్షదంబగు
జ్ఞానం బిమ్మని వేడిన నట్ల యగు నని వరంబు లిచ్చి దేవి యంతర్ధానంబు నొందె నంత.

క. నరపతియును వైశ్యుండును । బరమప్రీతిఁ జని మునికి ప్రణమిల్లిన న
క్కరుణాపయుండు విపులా । దరమున నిట్లనుచుఁ బలికె ధరణీపతికిన్. ౨౨౬

వ. రాజన్యా నీకు దేవీప్రసాదంబు గలిగె, ధన్యుండ వైతివి. నీతిగలిగి చిరకాలంబు రాజ్యంబు
సేయుము నావుఁడు నతండు హర్షయుతుండై మీ యాజ్ఞానువర్తి ననిచెప్పి హయంబు
నెక్కి నిజపురంబునకుం జనియె. నంత ౨౨౭

గీ మంత్రివరులు వచ్చి మానవేశ్వర నీదు । శత్రుసమితియెల్ల సమసె నాజి
నీవు రాజ్యమేలు నిష్కంటకంబుగా । ననిన మోదమంది యవనివిభుఁడు. ౨౨౮

క. భార్యల బిడ్డల గలసి య । వార్యగతిన్ సుఖములంది వసుధం బ్రజ్ఞా
ధుర్యుఁడయి యేలె ననుపమ । ధైర్యాదిగుణంబు లెసఁగ ధరణీనాథా. ౨౨౯

క. కోమటి పరమజ్ఞాన మ । హామహిమన్ దత్త్వవేత్తయై విహరించెన్
భూమిం గొన్నా ళ్ళాదట । దా ముక్తుండయ్యె దేవి దయచే నధిపా. ౨౩౦

గీ. ఈ చరిత్రంబు వినినవా రెల్లబంధ । ములు దొలంగి సుఖాంభోధి మునిఁగి తేలి
ముక్తులగుదు రనుచు వ్యాస ముని వచించె । నర్జునుని మునిమనుమని కనుచుఁ బలుక. ౨౩౧

శా. గౌరీసంగవిరామదక్షకృతధిక్కారక్షణప్రాపితో
దారక్రోధరసాంబురాశిజనితోద్యద్బాడబభ్రాంతికృ
త్స్ఫారప్రాభవవీరభద్రపటురూపత్రస్తసర్వామృతా
హారబ్రహ్మదిగీశమౌనివిసరా యల్లూరి సోమేశ్వరా. ౨౩౨

గద్య. ఇది శ్రీమ దిష్టకామేశ్వరీ పాదారవింద మకరందతుందిల మానసేందిందిర, దాసు వంశపయఃపారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్ర కుమార, పవిత్ర హరితసగోత్రాలంకార కృష్ణామండల మండనాయమా నాల్లూరగ్రహార పూర్వార్జితధరావిరాజమాన, శ్రీవీరప్రతాప కోర్కొండహంవీర రామచంద్ర భూమీశ్వర దత్త గోదావరీమండలస్థిత సీతారామపుర్యార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయ మండల న్యాయసభావాదక, నియోగభారవ్యవహార, శ్రీవేంకటేశ్వరవరప్రసాద సంభూత కవిత్వ విద్యావిశేష, బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేకగ్రంథ మతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచిత, ప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతం బగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణంబునందు పంచమస్కంథము.

సంపూర్ణము.

శ్రీ ర స్తు.

శా ర దాం బా యై న మః

శ్రీ

# దేవీ భాగవతము

## షష్ఠస్కంధము

శ్రీశైలేశానదిశా
పేశల కృష్ణానదీసమీపక్షోణీ
దేశవిలస దల్లూరిపు
రీశుభకర సంప్రవేశ శ్రీసోమేశా.

వ. అవధరింపు మనంతరంబ నిఖిలాగమార్థశ్రవణపరమహర్షులగు మహర్షులు నిరంతర
నిరుపమ పురాణగాథారథసూతుండగు సూతుం గాంచి యిట్లనిరి. ౧

ఉ. సూత భవద్వచోమృతము సొంపుగ వీనుల నాని యాని సం
ప్రీతి వహించియున్ మఱియుఁ బెక్కులు గాథలు నీముఖంబునం
శ్రోతృజనానుమోదమగు సూక్తుల గోరుదు రీ మహాముని
వ్రాతములెల్ల నట్లగుటఁ బల్కవె సత్కరుణార్ద్రదృష్టితోన్. ౨

గీ. వేదమందు బ్రసిద్ధమై వివిధపాప । నాశకంబగు వృత్రవినాశనంబు
కారణంబును దత్కథా క్రమమునెల్ల । వినవలతు మేము దెల్పవే విబుధవర్య. ౩

గీ. త్వష్టకొమరుండు వృత్రాఖ్య దానవుఁడు । మహేంద్రుచేఁ జచ్చుటకు గతమేమి త్వష్ట
దేవతాపక్షపాతియై దేజరిల్ల । బ్రహ్మయోని యతం డతిబలుఁడుగాఁగ. ౪

గీ. సురలు సత్త్వగుణులు నరులు రాజసులును । దెలియ దామసములు తిర్యగాదు
లంద్రు సూవె విబుధు లాగమవేదులు । దాని కిది విరుద్ధ ధర్మ మయ్యె. ౫

క. హరి సాత్త్వికుం డతం డే । కరణిన్ వజ్రంబు సొచ్చె గడుమాయావి
స్ఫురణంబు సూపి సంధిని । నెరపెద మని బద్ధులాడి నీతివిముఖులై. ౬

గీ. ఫేనశాతితుఁ జేసి రావృత్రు నెట్టు । లింతసాహస మింద్రున కెట్లు బొసగె
గొప్పవారును మోహంబు దప్పి సనక । తప్పు లొనరించి రేమందు దైవమాయ. ౭

క. నమ్మిన వృత్రుని జంపిన । యమ్మఘవుఁడు బ్రహ్మహత్య యనునట్టి మహా
ఘ మ్మందదె ముజ్జగముల । యమ్మయె వృత్రు హతుఁజేసె నంటి వదెటులో. ౮

వ. సవిస్తరంబుగాఁ దెలుపవే యనిన సూతుం డిట్టులనియె. ౯

సీ. వినరయ్య మునులార వృత్రుని వృత్తాంత మెల్లను దెలిపెద నింద్రుచేత
నతఁడు దుఃఖము నొంది నట్టి విధంబును వినిపింతు మును వ్యాసమునినిగూర్చి
జనమేజయుం డడిగిన ముని సెప్పిన విధమున దేవి యా వృత్రువధకు
గారణం బగుటయు శౌరి తోడగుటయు బొసగిన విధమును బూర్ణముగను
వినుటచే ధన్యులై పుణ్య మనుభవింత్ర । టంచు వ్యాసుండు జననాథ యమరవరుఁడు
త్వష్ట భూరితపశ్శాలి ధర్మపరుఁడు । దేవతాకార్యకర్త భూదేవహితుఁడు. ౧౦

చ. అతనికి బుత్రుఁడై త్రిశిరుఁడై రుచిరుండయి విశ్వరూపు డు
న్నతమతితోడ నొక్క వదనంబున వేదము లభ్యసించు నం
చితగతి నొక్కవక్త్రమున నిర్ఝరులం దిగమ్రింగు సర్వది
క్ప్రతతి మఱొక్క మోమునను బారఁగఁజూచు నొకప్పు డెంతయున్. ౧౧

ఉ. భోగములెల్ల మాని తపముం ద్రిశిరుం డొనరించెఁ బ్రాంచితో
ద్యోగమున న్మహోగ్రగతి నొయ్య బదాగ్రముమీద నిల్చి యం
భోగతుఁడయ్యెఁ బంచశిఖిపుంజగుఁడయ్యెను శీతలోష్మకా
లాగతులందు నిస్స్పృహత నన్నము పానము మాని భూవరా. ౧౨

ఉ. దానికి నింద్రుఁడుం బెదరి తత్తరపాటున దుఃఖితాత్ముఁడై
పూని తదంతరాయవిధమున్ బరికించి ఘృతాచి నూర్వశిన్
మేనకనుం దిలోత్తమను బిల్చి వరాననలార మద్రిపుం
డైన మహాబలుం ద్రిశిరు నంగజతంత్రగతాత్ముఁ జేయుఁడీ. ౧౩

క. అతండు తపముసేయగ । భీతిం బడియుంటి నేను వేవేగమునన్
బ్రీతిం బొందింపుఁడు మీ । చేతనయిన పనుల దపము చెరచి కుశలతన్. ౧౪

క. అన విని యచ్చరలు శచీ । మనసిజ త్రైలోక్యనాథ మమ్ము నెఱుఁగవే
మునివృత్తినున్న త్రిశిరుని । పని యెంతని నమ్మఁబలికి భయముడిపి తగన్. ౧౫

క. చని త్రిశిరుం గని గానా । భినయనటనవృత్తు లెన్ని విధములచేఁ జూ
పిన నతఁడు మనసు ద్రిప్పమి । ఘనవాహను జేరి యమర కామినులు వగన్. ౧౬

క. పాడితిమి మధురగానము । లాడితి మభినయకలామహా నైపుణితో
వేడితిమి చుట్టు నందఱు । గూడితిమి మనోజభావకుశలతలొప్పన్. ౧౭

క. ఆడడు పలుకొక్కటి మము । జూడడు కన్నెత్తి వింత జొప్పడు జపమున్
వీడడు విన డెడ్దయు జెఱ । లాడడు మాచేతనగునె యాతని మఱపన్. ౧౮

గీ. పాకశాసన వేఱొం డుపాయమొండె । సూచుకొనుమని పల్కిన సురవిధుండు
వారి వీడ్కొల్పి మదిదుర్విచారపరత । సిగ్గువిడనాడి పాపంబు సేయఁబూని. ౧౯

క. చౌదంతినెక్కి యింద్రుఁడు । వేదమయుం ద్రిశిరుఁ జేరి వేగమ కరుణా
ధీదూరుఁడగుచు వజ్రము । తో దపమున నున్నవాని దునిమె నృపాలా. ౨౦

గీ. పడిన త్రిశిరుఁ జూచి పాపాత్ముఁ డింద్రుండు । తపమునందునున్న ధన్యు శాంతుఁ
జంపెననుచుఁ దిట్టె జగమెల్ల నయ్యయో । యనుచు మునులు దూరి రతని బెలుచ. ౨౧

క. పతితమగు త్రిశిరుకాయం । బతితేజోగరిమ నొప్ప నమరేంద్రుఁడు జీ
వితమెడల దీతనికి నను । మతితో నత్యంతభీతి మగ్నుం డగుచున్. ౨౨

క. తనయెదుటనున్న తక్షుం । గని త్రిశిరుఁడు బ్రతికియున్న గతి దోచెడు స
మ్మతితో నావచనము విని । యతివేగము తలల గోయుమని వచియింపన్. ౨౩

ఉ. చెప్పితివే సురేంద్ర కడు చెట్టగదా శవఖండనంబు నీ
కొప్పె దపంబుసేయు ద్విజు నుగ్రగతిన్ వధియించు టెవ్వరున్
జెప్పఁగనైన లే దఘముఁ జేసితి వీ వదిగాక స్కంధమున్
గొప్పది గట్టిగా నఱుక గొడ్డలి యోపదుసుమ్ము నాకపా. ౨౪

క. చచ్చినవానిశిరంబున్ । ద్రచ్చిన నీ కేమిఫలము వచ్చును భయమే
మిచ్చోట గలుగు నావుఁడు । జెచ్చెర నింద్రుండు భీతిచే నిట్లనియెన్. ౨౫

గీ. జీవరహితమైన చిహ్నములు గనరావు । వీనిదేహమందు విశదలీల
దానిబట్టి యేను తలఁకెదనని పల్క । దక్షుఁ డిట్టులనియె దత్క్షణమున. ౨౬

క. కనికరములేక మునివు । త్రుని జంపితి వయయొ యింద్ర దోషము రాదే
ఘనమైన బ్రహ్మహత్యను । జెనకితి వేమందు నేమి చేయుదు వింకన్. ౨౭

వ. అనిన నింద్రుం డిట్లనియె. ౨౮

గీ. దక్షుఁడా యజ్ఞపశువున దలను నీకు । భాగ మిప్పింతు సంతోష పడుము దాన
వీని తలలను నరుకుము వేగ నాకు । బ్రియముగావింపుమని చెప్ప విని యతండు. ౨౯

క. అలరి త్రిశిరుశిరములు గొ । డ్డలిచే దెగనరకె యాత దరిగినపిదపన్
గలవింకంబులును గపిం । జలములు తిత్తురులు ముఖరసంబుల గ్రోలెన్. ౩౦

క వేదము జదివినమోమున । మోదమున గపింజలములు మునుకొనియె దిశా
స్వాదియగు ముఖము దిత్తురు । లూదె నమరహారిముఖము నందెను వటకల్. ౩౧

వ. అదిచూచి యింద్రుండు సంతసించి త్రిదివంబునకుం జని శత్రువిజయంబు గాంచితినని యుబ్బుచు బ్రహ్మహత్యం గూర్చి చింతిల్లుచుండె నంత త్వష్ట నిజపుత్రు నింద్రుండు వధియించుట విని కడుగనలి తనమనంబున. ౩౨

ఉ. చూతురుగాక నాబలము చోద్యము నిర్జరులెల్ల దేవతా
నేత మదీయపుత్రకు ననింద్యు ననాగసుమౌని నిష్ఠమి
త్రాతతవైరమూని తెగటార్చెను దత్ఫలమెట్లుదప్పు సం
జాతుని చేయుదున్ సుతుని జంభనిషూదను జంపు శూరునిన్. ౩౩

క. ఆథర్వణ మంత్రంబుల । సాధనమున నగ్నివేల్వ జనియించెను దే
జోధికుఁడు మహాపురుషుడు । భూధరరూపుఁడు కృపీట భూతేజుండున్। ౩౪

వ. ఇట్లు పుట్టిన పురుషుంజూచి. ౩౫

క. వర్ధిల్లుము వర్ధిల్లుము । వర్ధిల్లుము వృత్ర పుత్ర వాసవవిమతా
దుర్ధర తేజోమహిమా । విర్భూతిదలిర్పనంచు వెస దీవింపన్. ౩౬

గీ. పెరిగిపెరిగి నింగి పెనుభూతమై నిండి । నాకు పేరుబెట్టి నన్నునేల
గలుగ జేసితయ్య కార్యంబు సెప్పుమీ । యిపుడు సేయువాడ నెట్టిదేని. ౩౭

ఉత్సాహ. చల్లగాను జప్పరించి । సాగరంబు ద్రావనా
పెల్లగించి భూధరములఁ బిండిపిండి సేయనా
మెల్లగాను నోటఁ బెట్టి మిహిరకరుని మ్రింగనా
నల్లులట్ల సురలబట్టి నల్పి చంపివేయనా. ౩౮

వ అనిన విని సంతసించి త్వష్ట యిట్లనియె. ౩౯

క. నిజము వినుమన్న శక్రు । వృజినాత్మురతోసి వృత్రయటంచున్
సుజనస్తుతిగను నామము । న జగంబున గీర్తిగనుము నాదు హితుడవై. ౪౦

సీ. నీయన్న త్రిశిరుండు నిఖిలవేదములు వేదాంగములు పఠించి యలరినాడు
మూఁడుతలలుగల్గి ముజ్జగంబులును నచ్చెరువొందఁ దపమును చేసినాడు
తపోకయింత యాతనియందు లేనిదే శక్రుండు వానిని జంపినాఁడు
చంపి యవ్వల దలల్ శకలంబులై పోవ క్రూరత్వమున విడగొట్టినాఁడు

బ్రహ్మహత్య నొనర్చిన పాతకుండు । సిగ్గుమాలినవాఁడు దుశ్శేముషీకుఁ
డతని వధియింపు మిపుడు నీ వనఃచుబల్కి । ఉరుతర క్రోధమున నుద్యమించి. ౪౧

గీ. ఖడ్గమును శూలమును శక్తి గదయు దోమ । రంబు మున్నుగ సకలాయుధంబు లిచ్చి
యొసఁగ నక్షయ తూణీరమిచ్చి చక్రమిచ్చి రథమిచ్చి ప్రేరేప నెలమి నతడు. ౪౨

సీ. వేదపారగులైన విప్రులు స్వస్తులు సెప్పంగ రథమెక్కి చెలగుచుండ
నమరులచే దోల్లి యపజయం బందిన దనుజసేనలు వెంట దరలి రాఁగ
వృత్రునాజ్ఞను గొని వేగంబ దూతలు వచ్చి వృత్రు సమరవార్తఁ జెప్ప
సురపతి చింతతోఁ బరిపరి విధముల నరయుచు నుండంగ నపుడు గొంద
రమరవరు లతిరయమున నమర విభుని । పాలి కరుదెంచి యో శచీ ప్రాణనాథ
మేరుమంధరకాయుండు ఘోరరవుడు । వచ్చుచున్నాఁడు రథమెక్కి యిచ్చటికిని. ౪౩

మానిని. కాకులు డేగలు గద్దలు గూబలు కంకములున్ గటకధ్వనులన్
గూకలు వెట్టును గూయని ఛీయని కొంపలమీదను ఘోరగతిన్
శోకము వాజులు సూపుచు నశ్రులు సోకఁగ సొక్కిన చూపులతో
ప్రాకు గృహంబుల ప్రక్కల నేడ్చుచు రక్కసి మూకలు రట్టు కొనన్. ౪౪

క. పెల్లుగ నిద్దురవోయెడి । యిల్లాండ్రను దలలుబట్టి యీడ్తురు మఱి దా ౪౫
రిల్లిల్లు దిరుగుచుందురు । నల్లని పుట్టములు సోకు నవలాలు కడున్.

గీ. గాలియొక్కింత లేకయే కదలి ధ్వజము । లురులు చున్నవి యుల్కలు దొరగె నక్క
లేడ్చె నడురేయి వేళల నిండ్లముందు । తొండ లిల్లిల్లు గుంపులై దూరె నకట. ౪౬

గీ. అమరపురి దుశ్శకునపరివ్యాప్తమయ్యె । కాఱువడ బుజాల్నేతులు గన్ను లదరె
నేమిసేయుదు మయ్య మే మిట్టి బెడద । చిన్నె లెన్న దెఱుఁగము శచీకళత్ర. ౪౭

వ. అనిన విని యింద్రుండు బృహస్పతిం బిల్పించి తన మనోగతంబు దెలిపి దుర్నిమిత్త
శాంతి సేయింపవే యనుఁడు నతండు. ౪౮

గీ. ఏమి సేయుదు సురనాథ యీవు నిరప । రాధు మునిఁ జంపితివి చేయరానితప్పు
ఫలము గుడువక తీరునే నలువకైన । చెప్పితివె నాఁకు నేరంబు సేయునపుడు. ౪౯

గీ. ఎంత జేసికొనిన నంత యనుభవింప । వలదె పాపభీతి కలదె నీకు
కలదయేని బ్రహ్మకులు దపోగతుఁ జంపఁ । దగునె యిప్పు డిద్ది దాని ఫలమె. ౫౦

గీ వీఁడు వృత్రుం దవధ్యుఁడు వెడలివచ్చె । వీని పనిము ట్లజేయముల్ వీనితండ్రి
యిచ్చె నవి ప్రళయంబగు విబుధపురికి । నిండె గోలాహలంబులు నేడుఁ సూడు. ౫౧

క; అనిపల్కఁగ వినుచుండఁగ । గనియెన్ సురవిభుఁడు సకల గంధర్వమహా
మునినాథముఖులు సదనము । లను విడిచి చనంగ గొందలంబున నంతన్. ౫౨

ఉ. సేవకులార మీరు సని చెప్పుడు దిక్పతి రుద్రపూషసం
జ్ఞావరదస్రయక్షఖగ సాధ్య మరుద్గణ సిద్ధ కిన్నరా
శీ వసుముఖ్య దేవతల లెండిక రండిపు డెల్లవారు సే
నావృతులై విమానముల యందన వారలు నట్ల సేయఁగన్. ౫౩

గీ. ఇంద్రుఁ డైరావతము నెక్కి యేగె గురుని । ముందునిడుకొని వేల్పులమూకలెల్ల
గూడి రాక మెఱిగి వేల్పులకొండమీఁద । నొనర మానససరసున కుత్తరమున. ౫౪

వ. ఇట్లు దానవసైన్యంబులతో వృత్రుండును, దేవతాసైన్యంబులతో నింద్రుండును
దలపడి మానుషప్రమాణమున నూఱువత్సరములు దారుణంబైన రణంబు గావించి
రం దఖిలసురలును నింద్రుండును బలాయితులైనం గని వృత్రుండు తండ్రిం జేరి నమ
స్కరించి నీవు చెప్పిన కార్యంబు నెరవేర్చితి, దేవతలు పరాజితులైరి, యైరావతం
బిదె చూడు మింద్రుండు కాల్నడ నెందేని బరచె, భీతులం జంపుట ధర్మంబు గాదని
విడిచితి, యింక నెద్దియేని సేయంగలయది యున్న నన్నాజ్ఞాపింపుము. తప్పక యాచ
రించెద, నావుఁడు విని త్వష్ట యిట్లనియె. ౫౫

క. పావితుఁడనైతి నేఁటికి । నీవలన మనోజ్వరంబు నెట్టితిని గుమా
రా వినుము తపము నిశ్చల । భావంబున జలుపుమయ్య వరములకొఱకున్. ౫౬

క. వనజభవుని శంకరునిన్ । మనమున దలపోసి సేయు మా తపములు నీ
కనుకూల వరము లిత్తురు । వెనుకన్ దేవేంద్రుఁ జంపివేయుము కడిమిన్. ౫౭

గీ బ్రహ్మహత్యఁజేసె బాపియై యింద్రుండు । వానిమొగము చూడవచ్చునే మ
దాత్మ గుందుచున్నయది నిరాగసుఁడైన । త్రిశిరు దలఁచికొనుచు రేయుఁ బగలు. ౫౮

క. నీ వరినాశివగుచు న । ద్దేవేంద్రుని గెలువుమయ్య తీరదు నాకున్
లోవెత యేమని జెప్పుదు । నావిధము తనూజమణివి నా కీవకదా. ౫౯

చ. అది విని వృత్రుఁ డొందెను మహాచలరాజము గంధమాదనం
బెద బితృవాక్యతత్పరత నెంతయు నిశ్చలతన్ ఫలంబునై
న దినక నీళ్ళుద్రాపక మనంబున బ్రహ్మను నిల్పి యోగసం
పద దపమాచరించె నది పాకవిపక్షు డెఱింగి చెచ్చెరన్. ౬౦

వ. తత్తపోవిఘ్నప్రయత్నంబు సేయుచు గంధర్వ యక్ష కిన్నర పన్నగ ప్రముఖులం
బంపియు, ఫలంబులేక యూరకుండె. నంత వర్షశతంబు గడువఁ బితామహుండు, హంసా
రూఢుఁడై వచ్చి యెదుట నిలువంబడిన ధ్యానంబు విడిచి త్వష్టృపుత్రుండు నమస్క
రించి నిలచిన ననుజుండు వరంబు వేడుమనిన నతండు. ౬౧

శా. ప్రాప్తంబయ్యె సమస్తదేవభువనప్రాంచద్రమావైభవం
బాప్తత్వంబున నీవు బల్కినది నా కత్యంత భద్రక్రియా
దీప్తం బొక్కవరంబు గోరుటకు నో దేవాదిదేవా సదా
వ్యాప్తంబయ్యె మనంబు దెల్పెదను నా కద్దాని నిమ్మియ్యెడన్. ౬౨

వ. లోహకాష్ఠాదులు మొదలగు శుష్కద్రవ్యంబులచేతను నితరంబులగు ద్రవద్రవ్యంబుల
చేతను మరణంబు లేకుండునట్లును, వీర్యంబు హెచ్చునట్లును వరంబియ్యవే యనుఁడు

నవ్వి పితామహుం డది యట్లయగు దపంబుడుగుమని యంతర్ధానంబయ్యె. నంత వృత్రుం
డత్యంతానందంబున స్వగృహంబునకుం జని తండ్రికిం జెప్పిన విని సంతసించి పుత్రకా!
నీయన్నయగు త్రిశిరునిం జంపిన యింద్రుం జయింప శీఘ్రంబ పొమ్ము. దేవతా
రాజ్యంబు గైకొమ్ము. నా మనస్తాపంబు దీర్పుము, నావుడు నతం డలరి రణదుందుభి
మ్రోయించి, శంఖనాదంబుచేసి, స్వర్గంబు నిరమరంబు సేయుదు ననుచుం గదనంబునకుం
గదలినం గాంచి యింద్రుండు దేవతాసైన్యంబులం గూర్చికొని గృధ్రవ్యూహంబుపన్ని
యున్న వృత్రుండు సబలుండై తలపడిన నతిభయంకరంబైన యుద్ధంబు సంప్రాప్తం
బయ్యె. దేవతల కపజయంబును, పూర్వదేవతలకు జయంబునుం జూపట్టె నప్పుడు. ౭౩

చ. సురపతిఁబట్టె వృత్రుఁ డది సూచి నిశాచరు లార్చిరోలి ని
ర్జరులు భయంబునం బరవసాగిరి యేడ్చుచు నింద్ర యింద్ర యం
చురవడి దిక్కులాకసము నుర్వియు దేటదొలంగె వార్ధులం
దరిగెను నీరు వృత్రుఁ డతిదారుణమూర్తి వెలింగె నయ్యెడన్. ౭౪

గీ. శచికి ప్రాణవిభుని సకలలోకేశుని । నమృతపాననిరతు నమరవంద్యు
నప్సరోవినోది నా వృత్రుఁ డొకచేత । బట్టి నోటిలోన బెట్టుకొనియె. ౭౫

క. దొరికెనుగా శత్రుఁ డిపుడు । కరకర నమలెదను జూడు కడునీచుండై
పరిమార్చె ద్రిశిరు నపరా । ధరహితు నీతం డతండు తపమున నుండన్. ౭౬

క. సురవరు లది గని భయమున । గురు గాంచి యిదేమి వచ్చె గుర్వో మొఱ్ఱో
విరచింపవె యభిచారము । సురపతి విడిపింపు మాకు శోకము దొలఁగన్. ౭౭

వ. అనిన విని బృహస్పతి. ౭౮

గీ. ఏమిసేయువాఁడ నిపు డింద్రు డా వృత్రు । నోటఁబడియె నెంతపాటువచ్చె
ననుచు సృజనజేసి యావలింతను గురుం । డంపె నద్ది వృత్రు నంటె గడిమి. ౭౯

గీ. వృత్రు డావలింప వివృతమాయెను నోరు । శక్రుఁ డెఱిఁగి మేను సన్నజేసి
యూడిబడి సురేంద్రుఁ డొక్కదాటున వజ్ర । మూని మోహరించి యుద్ధమునకు. ౮౦

గీ. అంతనుండి యావలింతలు లోకంబు । నందు బ్రబలె నంత నమరవిభుఁడు
వృత్రుతోడను బదివేలేండ్లు సేసెను । గెలుపుగాన డావగింజయంత. ౮౧

గీ. విసికి వేసరి స్వర్గంబు వృత్రునకును । విడిచి యేగిరి విబుధులు విపినములకు
విశ్వమునకును దానవో విభుడనంచు । వృత్రు డందెను స్వర్లోకవిభవమెల్ల. ౮౨

క. మునుల గలసి సుర లాలో । చనములు గావించి రజితశైలంబునకున్
జని మమ్ముల బ్రోవుమనిన । విని శివుఁ డనెఁ బోద మిపుడు విష్ణునికడకున్. ౮౩

క. అని వనజభవుని దోడ్కొని । చని విష్ణుని జేర నతఁడు సదయుండై మీ
మనమున జింతకు గారణ । మును దెల్పుం డనఁగ వారు మూకత నుండన్. ౭౪

చ. వనజదళేక్షణా కలవె వార్తలు నీకు నెఱుంగరాని వెం
దును మము నేల యిట్లడుగ దొల్లి బలిన్ దగ బద్ధుజేయు వా
మనుఁడవు నీవుకావె సుధ మానినివై కొని దేవతాళి కి
చ్చినయది నీవుకావె నిజసేవకులన్ సురలన్ భరింపఁగన్. ౭౫

చ. అన విని శౌరి యిట్లను భయంపడనేటికి మీర లో సుధా
శనవరులార మీకు గడుసమ్మతమైన యుపాయ మొండు నే
వినిచెద నట్లసేయుడు వివేకముకల్గి యథైన దానవుం
డునుమఁగవచ్చు మీకుగల తొందరలెల్లఁ దొలంగు గ్రక్కునన్. ౭౬

గీ. మాయచేతగాని మడియించఁజాల మీ । వృత్రు బ్రహ్మవరము వీని కింత
దెచ్చిపెట్టె మీకు దెలియదే బలి దొల్లి । పొట్టినగుచు వెడలగొట్టినాఁడ. ౭౭

క. సుందరి నైతి నమృతమున్ । బృందారక సమితి కొసఁగ మీ రెఱుఁగరె యెం
దుం దితిజుల శాఠ్యమువల । నం దునుమఁగవలయుజుండు నమ్ముడు మీరల్. ౭౮

సీ. గంధర్వు లెల్లరు కడువేగ జని శత్రు మైత్రికి నొప్పించి మాయబూని
నమ్మికపుట్టించి నానావిధంబుల శపథముల్గావించి సమయమెఱిగి
పరిమార్పవలయు మీ పక్షమై నే వజ్రమును జొచ్చియుందు నిమ్ముగ ననంత
రమున నింద్రునకు సఖ్యము గూర్పు దరితోడ వాక్చమత్కృతిమీర వట్లుబెట్టి
మరియు జగదంబ శరణంబు మనకు గాన । కొల్తమిప్పుడు భక్తితో గోరి యనుచు
దేవతలగూడి విష్ణుండు దేవతాద్రి । శిఖరమున కేగి ప్రార్థించె క్షేమకర్త్రి. ౭౯

వసంతతిలక. దేవీ మముంగనఁగదే దయ లోకధాత్రీ । నీవేగదా సకలనేత్రి విజ్ఞానమూర్తీ
యీవిశ్వమందు ఘను లెవ్వరు మమ్ము నెప్డున్ బ్రోవంగఁజాలుదురు భూతవితానభర్త్రీ. ౮౦

వనమయూర. బిడ్డలముమేము మము పెంచినది నీవకా । యెడ్డెలగు రాక్షసుల నెట్లువధియించి మా
యడ్డములు దీర్చెదవొ యమ్మ నినువేడుటే । దొడ్డపని వేరొకటి తోఁచదు పరాకొకో. ౮౧

తోటకం. వేదములెల్లను విన్నును నిన్నీ । పాదములేగతి పావని మాకున్
గాదన నౌననగా గతి నీవే । లేదిక నన్యము లేశము తల్లీ. ౮౨

వనమయూర. చిన్నబిడ్డలు తప్పు జేసినను వారిన్ । గన్నతల్లులు సూచి కాచెదరుగా నీ
కన్న మాకిక దిక్కొకండుగలదే ని । న్నెన్నవెవ్వరుశక్తురీశ్వరివి నీవే. ౮౩

మత్తకోకిల. మున్ను మహిషునిఁ జంపి మమ్ముల మోదమందఁగఁ జేయవే
యెన్న శుంభ నిశుంభులన్ వధియించి దుఃఖము దీర్పవే

బన్న మొందితిమమ్మ వృత్రుని బాధ లెన్నఁడు దప్పునో
నిన్ను వేఁడితిమమ్మ యిప్పుడు నిశ్చలాత్మలమై కడున్. ౭౪

వ. అని యిట్లు విబుధు లనేకవిధంబులం బ్రార్థింప దేవి ప్రసన్నయై మీరు వచ్చిన కార్యంబు దెలుపుడనిన దేవతలకుం దుఃఖదుండయిన వృత్రు మాయామోహితుం జేయుటయు మా యాయుధంబులకుం బలం బిచ్చుటయు నర్థించెద మనిన నట్ల యగునని సెప్పి దేవి యంతర్ధానంబు నొందె. నంతం బ్రాప్తదేవీవరులై బృందారకులు సని నిప్పులకుప్పయుం బోలె మండిపడుచున్న వృత్రునికటంబునకుం జని. ౭౫

క. మధురంబులు బ్రియములు గా । నధరం బొక్కింత గదల నతివినయమునన్
సుధలొలుక ఋషులు పలికిరి । విధమెఱిఁగి వివేకగరిమ వృత్రునితోడన్. ౭౬

గీ. వృత్ర వృత్ర మహాభాగ విశ్వభయద । నీవ బ్రహ్మాండములకెల్ల నేతవుగద
శక్రుతో వైరమొకటి మా సౌఖ్యహాతి । మీరు మీరును బోరాట మేలుగాదు. ౭౭

గీ. మీకు సహజంబు వెతలయ్యె మాకు నావు । లావులును బోరి దూడల నణగఁద్రొక్కు
భంగియై సన్నకాంద్ర కాపద ఘటిల్లె । కడచె నీరీతి నూరక కాలమయయొ. ౭౮

మ. కలదే వైరమునందు నెందుగన సౌఖ్యం బాహవక్రీడలం
జెలువౌ మేను బడల్పడన్ జలిపి నిచ్చల్ కుందఁగానేల నే
బలియుండేనియు సంగరంబున జయప్రాప్తిన్ గనంజాలునే
పలుసైన్యంబుల జుక్కుమార్చి బహుళాపత్కారి కాకుండినన్. ౭౯

ఉ. స్నానముఁజేసి తృప్తిసన సాపడి శయ్యను బవ్వళింపుచుం
జానను గూడి భూరిసుఖసాధనమైన కుటుంబభోగమున్
గానక నంగరంబులను గార్ముకబాణములూని పోరుచున్
మేనుల గష్టపెట్ట నది మేలె విచారముసేసి చూచినన్. ౮౦

క. పోరులను జచ్చి మేనులు । ధారుణిపై దొరుగ రుధిరధారలు పెలుచన్
గారగ నక్కలు ద్రావఁగ । వీరస్వర్గంబు గోరు వెఱ్ఱులు గలరే. ౮౧

క. రేయుం బవల్లు యుద్ధము । సేయుచుఁ గాలంబు గడప శ్రీవిభవ సుఖ
శ్రేయములు వృథలుగావే । మాయందు గృపారసమున మన్నింపఁగదే. ౮౨

క. బలసూదనుఁడును నీవును । గలసి మెలసి యుంటిరేని గంధర్వులు మౌ
నుల మేము సుఖపడుచు మిము । గొలిచెదముగదయ్య నీతికోవిద వింటే. ౮౩

గీ. నిన్ను మేఘవాహు నెమ్మిగూర్చి ప్రియంబు । బలుకజేయ రాయబారులమయి
యిందు వచ్చినార మేవట్టుగోరిన । బెట్టుకొనెదమయ్య పృథుగుణాఢ్య ! ౮౪

గీ. హరిహయుఁడు శపథ మాచరించును భవ । దగ్రమందు దాని కనుమతింపు
మయ్య చెలిమికంటె నధికంబులేదుసూ । గురువుతోడు నిన్ను బెరసి చనము. ౯౫

క. సత్యమున భూమి నిలిచెను । సత్యంబున నెండగాయు జలజాప్తుండున్
సత్యమున గాలి వీచును । సత్యంబున గడలి దాటఁజాలదు కట్టన్. ౯౬

క. కావున సత్యమె జగమున । గావలయు విశేషలీల ఘనతరసఖ్య
వ్యావృత్తులందు సత్యమె । త్రోవసుమీ సకల నిర్వృతులకు మహాత్మా. ౯౭

క. ఒకచోట బవ్వళింపుచు । నొకచోటనె యాడికొనుచు నొకచో జలకే
శికలన దేలుచు సుఖమున్ । బ్రకటింపుడు శక్రు డీవు ప్రముదితవృత్తిన్. ౯౮

వ. అనిన వృత్రుండు. ౯౯

ఉ. మీరు మహానుభావులరు మీరు జగజ్జనమాననీయులున్
మీరు దపస్విశేఖరులు మిథ్యలు బల్క రొకప్పుడున్ సదా
చారులు పుణ్యమూర్తులు సుశాంతులు మాయ నెఱుంగ రీ శునా
సీరుఁడు బ్రహ్మఘాతుకుఁడుఁ ఛీ ఖలు నీతని నమ్మవచ్చునే. ౧౦౦

సీ. బుద్ధిమాలినవాడు పురుహూతు డితనితోఁ సిగ్గుమాలినవాడు చెలిమిసేయు
మీ రెఱుంగరు దురాచారుండు వీఁ డని నే నెఱుంగుదు వీని నీచవృత్తి
నరకంబునకుఁ బ్రయాణము గట్టుకొన్నాడు విబుధలోక సుఖంబు వెనుక బెట్టె
త ప్పెఱుంగనివాని దండించు పాపాత్మ త ప్పెఱింగి త్యజింప తప్పుగలదె
తొడరి వజ్రంబు శతకోటి దోషములను । సలిపి శతకోటి యయ్యెనో తెలియజాల
శాంతులరు మీ రెఱుంగక సఖ్యమనుచు । బలికెదరుగాని పొసగ దీ పాపితోడ. ౧౦౧

వ. అనిన మును లిట్లనిరి. ౧౦౨

గీ. చేసికొనినంత యతఁడెటో సేయు పొమ్ము । చెడడె ద్రోహంబు జేసిన చెనటి కూళ
కృతము స్మరియింప కిప్పుడం చితకృపాక । టాక్షమునగని శపథంబు నడుగుమయ్య ౧౦౩

వ. అనిన వృత్రుం డిట్లనియె నో మునీంద్రులారా! శుష్కంబుచేతనేని, యార్ద్రంబుచేతనేని, పాషాణంబుచేతనేని, దారువుచేతనేని, పగటియందేని, రాత్రియందేని, ఇంద్రు వజ్రంబుచేతనేని, దేవతలచేతనేని నేను వధ్యుండ గాకుండునట్లు సమయంబు సేయించితిరేని మా కిరువురకు సంధి పొసంగు, ననిన మును లట్లకాక యని సురేంద్రున కది విన్నవించి వృత్రునెదుట నగ్నిసాక్షికంబుగా ప్రమాణంబు సేయించి వా రిరువురకు చెలిమి పొసంగించి రంతటనుండి వా రిరువురు నందనాదివనంబులను, గంధమాదనాది పర్వతంబులను గూడి చరించుచుండిరి. శక్రుండు వృత్రవధకాముండుగాన రంధ్రాన్వేషణంబు సేయుచు విశ్వాసంబు పుట్టించి దంభవృత్తి నున్నం ద్వష్ట యది సూచి తన దనయుం గాంచి యిట్లనియె. ౧౦౪

గీ. పుత్రకా! పురుహూతుతో బొందు సనదు । వాఁడు నీ శత్రుఁ డదిగాక వానియంద
సూయ విడువక యుండెను జూవె వినుము । మాయగాండ్రను నమ్ముట మంచిగాదు. ౧౦౫

గీ. ద్రోహపరుఁడు రంధ్రాన్వేషి దుష్టబుద్ధి । గర్వితుండు గర్భచ్ఛేది కాముకుండు
కపటమానసుఁ డతిలోభి గాన శక్రు । నాయనా! యెన్నటికి నీవు నమ్మబోకు. ౧౦౬

క. ఈవిధమున దగ దెలిపిన । నా వృత్రుం డాలకింప కంబోధిప్రాం
తావనికిం దా జని సం । ధ్యావేళం దిరుగఁ గాంచి నముచిరిపు డాగెన్. ౧౦౭

క. ఇది పగటివేళయునుగా । దిది రాత్రియుగాదు సంధ్య యిప్పుడ వీనిన్
దుదముట్టింపఁగవలె నని । మది నారాయణుని దలఁచె మఘవుడు కడకన్. ౧౦౮

వ. తలఁచినంతనే వాసుదేవుండు వజ్రంబున నిలచెను. ౧౦౯

గీ. ఫేన మార్ద్రంబు శుష్కంబుగాని దనుచు । గాని పరాశక్తి మది దలఁచిన క్షణంబు
లోనఫేనంబులో నిల్చె బూని యప్డు । వజ్రము తదావృతము దీసి వాసవుండు. ౧౧౦

ఉ. వేసినయేటుతో నసురుఁ డీల్గి ధరం బడె బర్వతాకృతిన్
వాసవు డద్ది సూచి గరువంబున జంకలుగొట్టుకో మునుల్
భాసురచిత్తులైరి తన పాలిటి దేవిని బద్మరాగర
త్నాసమమూర్తి యంచు నయంబును గొల్చె మహేంద్రుఁ డంతటన్. ౧౧౧

గీ. వృత్రుపాటుఁ జూచి విష్ణుండు నిజపురి । కరిగె హరిహయుండు నమరపురికి
నేగె మునులు పాప మిది వచ్చె నయ్యయో । యఘము ముట్టె మనకు ననుచు జనిరి. ౧౧౨

చ. సుతుహతి నాలకించి వెత జొప్పడఁ గన్నుల నీరుగారఁగా
నతితరదుఃఖవేదనము నందుచు వానిని సంస్కరించి యా
శతముఖుమీద కోపమున శాప మొసంగెను వీఁడు వృత్రు నే
గతి పలుపాట్లబెట్టె నిఁక కల్గును వీనికి నట్టి గోరముల్. ౧౧౩

వ. అని యిట్లు శపియించె నని సెప్పిన జనమేజయుండు సాత్యవతేయా! వృత్రుం జంపి
శతక్రతుం డేమి యాపదం బొందె? సెప్పవే, నావుఁడు, నో నరేంద్రా! చేసిన పుణ్య పాపం
బులు వ్యర్థంబులగునే తత్ఫలం బనుభవింపక తప్పదు వజ్రంబునం బ్రవేశించి వృత్ర
వధకు సాధనభూతుండైన విష్ణుండును, నింద్రుచే శపథంబుసేయించిన మునులును
మొదలుగాగలవా రొక్కరును శక్రుండు పెక్కు చిక్కులం జిక్కిననాఁ డక్కరకు
రారైరి, వినుము. ౧౧౪

గీ. సంపదలు గల్గినప్పుడు సకలజనులు । తోడుగా నుండుదురుగాని గోడుగుడుచు
నాఁడు గన్నుల కగపడ రేడనేని । పారిపోదురు లోకస్వభావమిదియు. ౧౧౫

గీ. కలిమిగలిగిన దన కాంత గాళ్ళు గడిగి। యొాదలను జల్లుకొను గొంచె మాపదైన
మూర్తి చిల్లించు విరచును మునుమెటికల। యిడుమలందు సహాయులై యెవ్వరుంద్రు. ౧౧౬

క. తనపుణ్యమె తనచెలియగు। తనపాపమె తనకు వైరి తా నెయ్యడలన్
మనమున సత్కర్మపరత। నెనయంగావలయుఁగాక నితరము తోడే. ౧౧౭

ఉ. నిందకు బాత్రుఁడయ్యె సురనేత యసత్యములాడె నౌర గో
విందుఁడు దోడుగా స్వహితవృత్తుని వృత్రుని మాయజేసి తా
కొందలపెట్టి చంపె నిది కూడదటంచు జగంబులాడ వే
సందుల గొందులన్ మరియు చాటుల మాటుల నెల్లచోటులన్. ౧౧౮

క. నిగమముల విడిచికొనియెన్। సుగతుమతంబీతఁ డేమి చోద్యమొ యిది చూ
డఁగను శపథములఁ జేసియు। దెగనేసెను వృత్రు నట్టి తెక్కలి గలఁడే. ౧౧౯

వ. ఇట్లు సకలజను లింద్రుని నిందింప నతం డపయశంబు వచ్చెనని కుందుచుండె. మరియు వినుము. ౧౨౦

క. ఆ యింద్రద్యుమ్నుఁ డపయ। శోయుతుఁడై భ్రష్టుఁడయ్యె చూడు మఖిల భూ
నాయకసుతుఁడు యయాతియు। జేయంచె యషంబు దాన జెందఁడె గుణమున్. ౧౨౧

వ. ఇన్నిటికేమి సకలలోకపరిపాలనదక్షుండైన శ్రీమహావిష్ణుండు బ్రాహ్మణ శాపవశంబున నానాయోనులం బుట్టి దుఃఖం బనుభవింపడే! పాపంబున నపయశంబు గలుగు గావున నింద్రుండు బ్రహ్మహత్య చేసి మనస్స్వాస్థ్యంబులేక పలుపురిలో దలయెత్తనేరక నింటం బడియున్న పతివ్రతాశిరోమణియగు పౌలోమి యతనింగాంచి ప్రాణనాథా! శత్రుండగు వృత్రుండు మడిసె, నీ విట్లు చింతాక్రాంతుండవై యుండ నిమిత్తం బేమి? నా విని యింద్రుండు నారీమణీ! నే బ్రహ్మహత్య గావించితి, నందనారామవిహరణాది నానావిభవంబులు నాకు సుఖకరంబులుగావు. నీయందును నైరావత కామధేన్వాదులయందును మనం బొక్కింతయు సొరనేరదు. నే నేమిసేయుదు,నని లేచి శీఘ్రంబున మానససరోవరంబునకుం బోయి యందొక పద్మనాళంబునం బ్రవేశించియుండె. నంత స్వర్గం బరాజకం బయ్యెండం గని మును లెల్లం గూడి నహుషుండను రాజన్యు శక్రుం గావింప నతండు పంచబాణబాణావిద్ధుండై యచ్చరలతోఁ గ్రీడింపుచు నింద్రాణిచక్కదనంబును విని ఋషులం జేరి మహామునులారా! నన్ను మీ రింద్రుగా జేసితిరి. ఇంద్రాణి నన్ను సేవింప నేలరాదు? పిలిపింపుడు. పులోమజ లేనినాఁడు నా యింద్రత్వంబేల? ననవుఁడు విని మునులు చింతాతురులై యయ్యయో! యీ దురాచారు నింద్రుం జేసితిమి. వీఁడు పౌలోమిని గోరుచున్నవాడు. మనము పరాధీనుల మైతి మేమిసేయుద మంచు నయ్యమ కిది విన్నవించిన దుఃఖించి బృహస్పతిం బిలిపించి నన్ను రక్షింపవే యనుఁడు నతఁడది విని నీకు భయంబేమి పాపమోహితుఁడగు నహుషుండు నిన్నుం బట్టగలఁడే నీకు నేన ప్రాపై యుందు స్వస్థవుగమ్మని యూరడించె నంత. ౧౨౨

ఉ. అంగిరసుం బులోమజ సమంచితభక్తి భజించి మించి స్వే
చ్ఛం గడునీతి నుండ నహుషప్రభుఁ డల్గి సురాళిఁజీరి జీ
వుం గడతేర్తు నింద్రు సచివుండట వీడు శచిన్ స్వకీయగే
హంగతజేసి ప్రోచెడి నటారె విసుండన మౌను లార్తులై. ౧౨౩

ఉ. సామముమీర నిట్లనిరి సామి పరాకు జగత్ప్రభుండ వీ
వేమని చెప్పువారము సురేంద్రునిపత్ని మహాపతివ్రతా
స్త్రీమణి పారదారికత చేటు శ్రుతి స్మృతి సంప్రదాయమున్
మము దీర్చుకో విడువగాదుసుమీ వినుమీ భవాదృశుల్. ౧౨౪

ఉ. ధర్మము దీర్చు భూపతులె ధర్మము దప్పిన లోకు లెవ్వ రా
ధర్మము దేరిచూచెదరు ధర్మవినాశమె లోకనాశనం
బర్మిలి గామశాంతి గన నచ్చర లెందఱులేరు నీకు స
త్కర్మపరుండవై పథము దప్పక యేలుము నాకలోకమున్. ౧౨౫

చ. నిమిషసుఖంబు గోరి జననిందకు లోఁబడి సాధులోకవృ
త్తము విడనాడి వేఱొకని దారను బల్మి రమించి యాదటన్
యమునిపురంబు సేరి కడు నంగద మండుచునున్న చిచ్చుగం
బమును గవుంగలించుకొను మందమతిన్ గణియింపవచ్చునే. ౧౨౬

ఉ. పచ్చలకోళ్ళ నీలముల పట్టెలునుం బవడాలకంబమున్
గుచ్చులముత్తియంబులను గూర్చిన పందిలి యంచరెక్కచాల్
పెచ్చిన పాన్పుపట్టు బిగియించిన దోమతెరైన మంచమం
దచ్చరతో రమించు సుఖ మన్యవిలాసినియందు గల్గునే. ౧౨౭

ఉ. చెక్కిలిగొట్టు ముద్దులిడు జేతులఁజూచి కవుంగలించు ఱొ
మ్మెక్కు దటాలునన్ మరులు పెచ్చి కటుక్కున మోవి నొక్కు బల్
నిక్కు చనుంగవం బొడుచు నీ కల యచ్చరతోడి కూర్మి య
మ్మక్క సుఖంబుగాక పరునంగన బల్మిని బట్ట నేటికిన్. ౧౨౮

క. ఇటు నట్టును గొట్టుకొనున్ । సొటసొటపడు నేడ్చు నార్చు జూడదు కనులన్
తటబిటలును బెటవెటలును । బటుతర బరాంగనను బల్మి బట్టిన సుఖమా. ౧౨౯

క. కావున శచిమీఁది తమిన్ । బోవిడువుము పుణ్యమందు బుద్ధినిడుము భూ
దేవతలను దేవతలను । బ్రోవుము నిర్మలయశంబు బొందుము నృపతీ. ౧౩౦

వ. అనిన విని. ౧౩౧

ఉ. ఎక్కడికేగిరో మునులరీరలు గౌతముభార్య నింద్రుఁడున్
గొక్కొరొకో యటంచు నొగి గూసి రమించిననాఁడు, మీ సుధా
భుక్కులయయ్యవారి పువుబోడిని దారను జంద్రుఁ డంటి పే
రెక్కిననాఁడు, నాకు దగరే యిటు నీతులు సెప్పనౌ భళీ. ౧౩౨

గీ. వినను మీ రెన్ని సెప్పిన వినయమునన । యేని బలిమినయేని యయ్యింద్రుభార్య
నిచ్చటికి గొంచురండు మీరిపుడ యనినఁ । జనిరి మునులు బృహస్పతి సదనమునకు. ౧౩౩

క. చని దేవగురు గను గొని । వినమితులై మ్రొక్కి యో వివేకధనా
యింద్రు నహుషు జేసినకతమున । దసకు శచి నొసంగుడని యతఁడు మము నడిగెన్. ౧౩౪

క. నిను వేఁడఁగ వచ్చితి మాపెను మా కొప్పింపు మనిన విని గురుడు మహా
మునులార! శరణుసొచ్చిన । వనితన్ నే విడువఁ బొండు వైశంబనినన్. ౧౩౫

గీ. ఆర్య! యెద్దేని యొక యుపాయంబు సేసి । మమ్ము రక్షింపు మా మందమతికి నెదుట
బడఁగలమె యూరకయ పోయి కడగి మమ్ము । నరికివేయఁడె నావుఁడు గురుఁడు వలికె ౧౩౬

క. మన మందఱమును శచితో । డను గూడుక పోద మక్కడకు శచిచేతన్
అనిపింతము శక్రుఁడు చచ్చె ననుచు విని కలయుదాన క్షితిపా యనుచున్. ౧౩౭

క. పతి బ్రతికియుండ నన్యుని । బతిగా గైకొనుట తగదు పయనంబై నే
వెతకెద నన్వింత మనుచు । గృతమతులై యేగి కనిరి కృత్రిమమఘవున్. ౧౩౮

క. చనుదెంచిన సురులంగని । మనమున నుప్పొంగి వాడు మానిని గని యో
వనజాక్షి నేన సంక్రం । దనుఁడ నిపుడు నాకు నీవు దారవుగమ్మీ. ౧౩౯

క. నావుఁడు సిగ్గున వడఁకుచు । నో విపులాధీశ యింద్రుఁ డున్నాఁడేమో
యేవలననేని యనుచుం । భావంబున సందియమ్ము పడియెద మిగులన్. ౧౪౦

క. కావున వెదకెద నతఁడు స । జీవుఁడు గాకుండెనేని చేరెద నిను నా
కీవరము మాత్ర మిమ్మా । భూవర యన నట్లకాక పొమ్మన నంతన్. ౧౪౧

క. మునులార విబుధులారా । చని యింద్రుని వెదుకవలయు సాహసమున నం
చును శచి పల్కిన విని య । వ్వనజాక్షునిపురికి నేగి వార లతనితోన్. ౧౪౨

గీ. దేవదేవ జగన్నాధ దివ్యమూర్తి । యమరనాథుండు బ్రహ్మహత్యాప్రపీడి
తుండగుచుఁ బోయె నేఁ డదృశ్యుండు వాఁడు । మాకుగర్తవ్యమెయ్యది మఘవుఁ బోవ. ౧౪౩

క. భయవిహ్వలులగు నమరుల । నయవచనము లాలకించి నారాయణుఁడున్
దయతోఁ గని సురలారా । హయమేధము సేయ బ్రహ్మహత్య దొలంగున్. ౧౪౪

గీ. అంబ సంతసించు హయమేధమున శక్రుఁ । పాతకంబు దొలఁగు పూతుఁడగుచు
మరల దేవరాజ్య మహిమంబు గైకొను । నహుషుఁ డార్తుఁడగుచు నడచు భువికి. ౧౪౫

గీ. అనిన సురలెల్ల హయమేధ మాచరించి । పంచిపెట్టిరి చెచ్చెర బ్రహ్మహత్య
వృక్షములయందు నదులందు బృథివియందు । బర్వతములందు నంగనా పంక్తులందు. ౧౪౬

వ. ఇట్లు సేసిన హయమేధయాగఫలంబుంబట్టి యింద్రుండు బ్రహ్మహత్యవలన విముక్తుం డయ్యు గాలంబునకు వేచి పద్మనాళంబునంద యుండె. నంతం బౌలోమి నిజగురుం గాంచి యయ్యవారూ! హయమేధంబు సమాప్తమయ్యె, నింకను విభుఁడు రాఁడాయె? నేమిసేయుదు నని విరహాకులచిత్తయై యేడ్చినం గని దయార్ద్రహృదయుండై బృహస్పతి యో నారీశిఖామణీ! జగజ్జనని కటాక్షంబునం బడయరాని సుఖంబులు లేవు, నీవు జగదంబాపూజనంబు సేయుమని మంత్రం బుపదేశించిన వల్లెయని శచి సకలభోగంబులు విడనాడి తాపసివేషధారిణియై దేవీపూజనంబు సలుపం బ్రసన్నయై త్రిలోకధాత్రి. ౧౪౭

సీ. పాశాంకుశాభయవరములు ధరియించి నాలుగు భుజములు లీల దనర
కోటిసూర్యులతోఁడ దీప్తైన ప్రభలతో శశికోటి శీతలస్వాంత యగుచు
క్షణికప్రభాకోటి సమమైనకాంతితోఁ జారుచతుర్వేద సమితితోఁడ
నాపాటలంబిముక్తాపూర్ణమాలతో రమణీయలోచనత్రయముతోఁడ
గృప గనుంగొని యాబ్రహ్మకీటపజనని చతురకూటస్థమాతృకాకృతి మహేశి
శచికి బ్రత్యక్షమై యా విశాలనేత్ర । వర మడుగుమన్న నిట్లని పలికె బ్రీతి. ౧౪౮

గీ. అమ్మ జగములకెల్ల నీవమ్మవమ్మ । కంటి నే నిన్ను గన్నుల కరువుదీర
బూర్వభవమున నేఁ జేయుపుణ్యమునను । గలిగె శుభములు దుఃఖంబు దొలగిపోయె. ౧౪౯

గీ. మూఁడువరములు నా కిమ్ము ముఖ్యముగను । సురవిభుని పొందు నాకిమ్ము సురలకెల్ల
నహుష భయమును దీర్చుము నాకలోక । రాజ్య మింద్రున కిమ్ము సర్వప్రపంచ
ధాత్రి నావుఁడు జగదంబ దాని కలరి. ౧౫౦

క. ఈ నా దూతిం దోడ్కొని । మానససరమునకుఁ బొమ్ము మఘవుని కూర్మిం
బూనుము నహుషం భ్రష్టుం । గా నొనరించెద మహేంద్రు గావింతుఁ బతిన్. ౧౫౧

క. అన విని శచి దూతిం గొని । చని కనియెన్ విభుని మానససరోవరమం
దు నతిముదంబున నాతఁడు । వనితం దిలకించె నమ్మవారి కరుణచేన్. ౧౫౨

వ. ఇట్లు సురేంద్రుండును బులోమజయుఁ బరస్పరాలోకనజనితమహానందపరవశులై యొక్కింతతడ వొండొరులు మాటలాడనేరక యుండి యనంతరంబు సురవిభుండు నిజాంగనం గౌఁగిలించుకొని చిరకాలవిరహంబునకు ఎగచుచు నే నున్నజాడ నీ కెట్లు దెలిసెఁ జెప్పవే నావుఁడు దేవదేవిప్రసాదంబున నిన్ను దెలిసికొంటి. నా జగజ్జనని యీ దూతిం బనిచెఁ జూడు మని చెప్పి మఱియు. ౧౫౩

క. నహుషుడు రాజై లోకని । వహముం బాలించుచుండె వాఁడు స్మరార్తిన్
బహువిధముల దలఁచెను నను । గ్రహియింపం గురుని శరణు గంటి మహేంద్రా. ౧౩౪

గీ. అంగిరసుఁడు సెప్పినట్టి త్రోవను నహు । షునకుఁ జెప్పి యతని మనసు నొవ్వ
కుండ గిటుకుజేసి యొయ్యన సురలతో । విష్ణుపురము సేరి విష్ణుఁ గాంచి. ౧౩౫

గీ. మ్రొక్కి వేఁడ నతఁడు మొగి హయమేధంబు । సేయుఁ దఘమువలన బాయు శక్రుఁ
డనిన నట్ల చేసి యవ్వల గురునాజ్ఞ । జనని పూజనంబు సలుప నందు. ౧౩౬

గీ. ఆ జగన్మాత ప్రత్యక్ష యగుచు మూఁడు । వరము లిచ్చిన గైకొని వచ్చి నిన్ను
గాంచితిని రమ్ము నహుషుని ద్రుంచు మమర । పురము బాలింపు మన విని హరిహయుండు. ౧౩౭

చ. విను మిటు గీరవాణి యలివేణి తరిం బరికింప కేగినన్
బొనరు విపత్పరంపరలు పొమ్మిపు డీ వొకదాన వర్మిలిన్
మన త్రిదశాలయంబునకు మానసు దూలఁగనీకుమీ నయం
బున సతిధర్మము త్రిలస భూరియశంబును బొందు మెయ్యెడన్. ౧౩౮

చ. జనపతి యంతికంబునకుఁ జయ్యన నేగుము వానిఁ జూచి యో
జనవర రమ్ము నీవు మునిసప్తకసంభృతమైన పల్లకిన్
నను గ్రహియింప సంతసమునన్ భవదీయకృపారసంబు నే
గనియెద నప్డు నీమనసు గట్టిగ దీర్చెద నంచుఁ దెల్పుమీ. ౧౩౯

క. జగదంబ సహాయయగుం । దెగు నహుషుఁడు పరమమునుల తిట్టున జేజే
జగమును నేఁ బాలించెద । మగువా సందియమిఁకేల మానుము వగపున్. ౧౪౦

క. అనవుఁడు విని శచి స్వపురికిఁ । జని నహుషుని గాంచి నిలువ స్వాగతమే నీ
కును సత్యవచనరచనా । వనజముఖీమణుల మేలుబంతీ యింతీ. ౧౪౧

చ. బ్రతికితి నీదు సత్యపరిపాలనమూలకమైనమాటచే
సతి నినుఁ జూచితి న్మరల సంతస మింతని జెప్పఁజాల స
మ్మతి నిఁక సిగ్గుమాను మల మన్మథుబారికి నోర్వఁజాల నా
తతకృప నన్ను బ్రోవు మిఁక దాసుడ నీకు నరాళకుంతలా. ౧౪౨

వ, అనవుడు విని శచీదేవి నహుషున కిట్లనియె. ౧౪౩

క. నా కొక కోరిక యున్నది । యా కోరిక దీర్చితేని యాక్షణముననే
నీకు వశురాల నయ్యెద । దేకువతోఁ దెలుపుమన్న దెలిపెద నహుషా. ౧౪౪

వ. అనుఁడు నహుషుండు. ౧౪౫

క. నీ కోరిక దీర్పుటకున్ । నా కొక సందియము గలదె నారీమణి మి
న్నాకులును మెట్టమీనులు । గైకొని తెమ్మనిన తెత్తుగదవే సుముఖీ. ౧౬౬

వ. అనిన శచి. ౧౬౭

క. చేయుదొ లేదో నమ్మక । మేయనువున గలుగు నాకు నింద్రపదంబుం
బాయనివారికి నెప్పుడు । మాయలెకా యెట్టుబెట్టుమా యని పలుకన్. ౧౬౮

వ. అన విని నహుషుండు నీ వడిగిన కోరిక దీర్చనేని. ౧౬౯

క. నే జేసిన యజ్ఞంబులు । నే జేసిన సుకృతములును నీలాహికచా
నే జేసిన దానంబులు । నే జేయనియట్టు లందనేర ఫలంబుల్. ౧౭౦

వ. అనిన విని శచి ౧౭౧

సీ. ఐరావతంబు వాహనము పాకారికి వైనతేయుఁడు రమావల్లభునకు
యమునకు మహిషంబు హరునకు వృషభంబు భూరి కల్యాణగర్భునకు హంస
వాయువునకు లేఁడి కాయజునకు చిల్క ఘనతర సప్తజిహ్వునకు తగరు
కార్తికేయునకు సత్కాలకంఠంబును గజముఖునకు మూషకంబు నెన్నఁ
గను గలవు నీవు వారితో నెనయు టొక్క । ఘనమె యందఱి మీరంగ గలవు కాన
యెక్కదగు చక్కనగు నొక్క టెద్దియేని । పల్లకీ నా మనం బప్పు డుల్లసిల్లు. ౧౭౨

గీ ఎక్కదగు నీవు పల్లకి నింపుగల్గ । మునివరులు పల్లకీదండె మోయవలయు
నపుడు బ్రహ్మాదులకు నీవ యధికుఁడవని । వెంటవచ్చెదఁ జూడు మూర్వీతలేంద్ర. ౧౭౩

క. అనిన విని మానినీ నీ । కును బ్రియ మొనరించుటకును గోరెద గానన్
మునులపయి నెక్కి వచ్చెద । గనుమా యని మునుల బిల్చి కడు దీనుండై. ౧౭౪

క. మునులార వింటిరే శచి । నను మునివాహనము నెక్కినం దనపతిగా
గొనియెద ననియెం గావున । గనికరమున నట్లు సేయఁగదరే యనినన్. ౧౭౫

గీ. తత్త్వమెఱిఁగిన ఋషివరుల్ దాని కియ్య । కొనిన వారలపై నెక్కి తన పదము న
గస్త్యమస్తకమున నిడి గశను గొట్టి । సర్ప సర్ప యనంగ నశాంతుఁడగుచు ౧౭౬

క. తాపసులకెల్ల బెద్దయు । లోపాముద్రావిలాసలోలుండును వా
తాపిహరుఁ డబ్ధిజలపుఁడు । శాపమొసగె బడుము భువిని సర్పమ వగుచున్. ౧౭౭

క. అని యిచ్చిన శాపము వెం । టనె వాఁడును బదములం బడంగని యోరీ
చనియెదవు స్వర్గమునకున్ । ఘనుని యుధిష్ఠిరుని నీవు గనినప్పు డనన్. ౧౭౮

క. శాపవిముక్తిన్ విని యా భూపాలుఁడు సర్పమగుచు భూమిం బడియెన్
బాపిష్ఠుఁడు పోయెనని శచీపతికడ కేగి గురుఁడు సెప్పగ నతఁడున్. ౧౭౯

వ. నహుషుండు సర్పంబై పడుట విని సంతసించి స్వర్గంబునకు వచ్చిన నెల్లసురులును,
మునులును నమందానందమగ్నులై యింద్రలోకంబునకుం బట్టంబుగట్టినం దేవీకటా
క్షంబున నిది యెల్లసంప్రాప్తంబయ్యెనని యనవరతదేవీపూజాపరాయణుండై సుఖంబుండె
నని చెప్పిన విని జనమేజయుండు. ౧౮౦

శా. దేవాధీశుఁడు లోకవిశ్రుతుఁడు భూదేవప్రసాదార్జిత
శ్రీవిస్తారుఁడు సర్వసంయమిజనాశీర్వాదపాత్రుండు స
ద్భావుం డిద్ధశతక్రతుండు సురగంధర్వాప్సరస్సేవ్యుఁడున్
దైవాధీనత బొందె దుఃఖములు స్థానభ్రష్టుఁడై దీనుఁడై. ౧౮౧

శా. దేవీపూజనమందు నించుకయు సందేహంబులే కెల్లెడం
గావించున్ గమలాకశత్రుఁడు సదా కారుణ్యముం జూపు గౌ
రీవామావిభుఁడున్ సహాయుఁడగు స్వర్గిశ్రేష్టుఁ డా యింద్రుడున్
దైవాధీనత బొందె దుఃఖములు స్థానభ్రష్టుఁడై దీనుడై. ౧౮౨

క. ఏకారణమున గ్రతుభు । ల్లోకేశున కట్టి యిడుమలు తటస్థించెన్
నాకు వినిపింపగదవె కృ । పాకలితాత్ముండవగుచుఁ బావనమూర్తీ. ౧౮౩

గీ. కర్మ త్రివిధమయ్యె గడగి సంచితము ప్రా । రబ్ధమును ననంతరంబు వర్త
మానమును ననంగ మహిలోన జనులెల్ల । కర్మబద్ధులైరికాదె నృపతి. ౧౮౪

గీ. పెక్కు జన్మములను దక్కించుకొన్నట్టి । కర్మసంచితంబు కలుగు దాన
దొడరి సౌఖ్యమేని దుఃఖంబయేనియు । గల్పకోటికయిన గాదుముక్తి. ౧౮౫

గీ. వర్తమాన మనఁగ వర్తమానంబునఁ । జేయు కర్మ దాని జెంది సంచి
తంబుతోడ గలసి తండోపతండముల్ । చేయు జన్మమునకుఁ జివరగలదె. ౧౮౬

క. ప్రారబ్ధకర్మ కుడుచుట । కారంభింపబడిన దది యనుభవముననే
తీరును దానికి మోక్షము । వేరే లేదండ్రు బుధులు విపులాధీశా. ౧౮౭

గీ. కర్మ జన్మమునకు గారణం బగుచుండు । జన్మమే శరీరసంగ్రహంబు
తనువు కర్మములను దా జేయుచుండును । విడక తత్ఫలంబు గుడుచుచుండు. ౧౮౮

గీ. దేవతలకు పూర్వదేవతలకు సిద్ధ । యక్ష సాధ్యకిన్నరాదులకును
జన్మములకు గర్మ సాధనంబయ్యెను । గాయలబ్ధియున్న గర్మలేదె. ౧౮౯

గీ. కర్మములను బుట్టి కర్మంబు సేయుచు । కర్మఫలము గడపగా దరంబె
కుడువ దీరుగాని గుడువకఁ దీరునా । కర్మమే సమస్తకారణంబు. ౧౯౦

గీ. కారణము ద్రుంచెనేనియు గార్య మడఁగు । కారణంబైన కర్మంబు దొరెనేని
కార్యమైనట్టి జన్మంబు గంటకొట్టు । గాన కర్మక్షయోపాయగతిఁ గనఁదగు. ౧౯౧

క. ప్రారబ్ధ మనుభవింపక । తీరదు గావునను సకలదేవతలకు ద
త్ప్రారబ్ధమె దుఃఖములకు । గారణమయ్యెను మఱొండు కతమేలరయన్. ౧౯౨

క. మనుజుడు పాపము చేసిన । యనువున నమరుండు సేయు యక్షుడు సేయున్
వనజాక్ష విధి హరాదులు । నొనరింతురుసువ్వె తనువు లున్నకతమునన్. ౧౯౩

క. మనుజులునా దేవతలనఁ । గను భేదము లేదుసూవె ఘనవిభుతాలాం
ఛనుఁడైన దేవుఁడగు లా । వున గౌరవడెనేని మానవుండగు నధిపా. ౧౯౪

చ. ఘనమతి గావ్యకర్త ఋషిగా గణియించెద రన్నదాత దే
వునిగఁ దలంత్రు రాజు హరి బోల్తురు కావున దేవతాంశసం
జనితులు మానవుల్ గుణముచాలు పెరింగి సురేంద్ర వహ్ని ప
ద్మనయన ముఖ్యదేవతల తత్వములంచు నెరుంగ నొప్పెడిన్. ౧౯౫

క. బలమును విద్యయు దేజము । గలిమియు బ్రాభవము రూపు గలిగినవారల్
కలరూపున నయ్యో యమ , రులయంశములంచు నెంతురు మహీపాలా! ౧౯౬

గీ. కాన భేదంబు గనరాదు మానవులకు । దేవతలకును సుఖదుఃఖభావములను
భారతము వింటికాదె మీవారి చరిత । దేవతాంశజు లేరీతి దీనులైరి. ౧౯౭

గీ. వాసుదేవుండు నిజకర్మవశత నెంత । లేసి గొడవలపాలాయె నెఱుఁగవొక్కొ
రామకథ కృష్ణకథ భృగురాముకథయు । నింద్రుకథకును వింతాయెనే నృపాల. ౧౯౮

వ. అని చెప్పిన విని జనమేజయుండు మునీంద్రా ! భూభారనివారణార్థంబు వాసుదేవుండును వాసవియు జనియించిరనియు, బృథివి గోరూపధారిణియై చని పరమేష్ఠిశరణంబు వేఁడె ననియు ద్వాపరాంతంబున నజునిచే బ్రార్థింపంబడి నారాయణుండు దేవసమూహంబులతోడ భూలోకంబున నవతరించెననియు, భూభారం బుడిసెననియుఁ జెప్పుచున్నారుగదా కృష్ణుం డేరీతి భూభారంబు హరణంబొనర్చినవాఁడాయె? ద్రోణ భీష్మాదుల వధించుట భూభార హరణం బెట్లగు ? బెదరించబోయి తానే బెదరె నన్నట్లు మ్లేచ్ఛాదులచేతను, శబరాదుల చేతను గృష్ణుండు తానే బాధింపంబడియె. నది యెట్లు భూభారహరణంబగు ? నిట్టి సందియములు నామనంబునం బెక్కులు చిక్కులు పెట్టుచున్నయవి, కటాక్షించి తెల్పవే యనుఁడు వ్యాసుం డిట్లనియె. ౧౯౯

గీ కాలమే ధర్మములకును గారణమగు । కాలమునుబట్టి నడచును కాని వేఱె
నడువనేరవు ధర్మముల్ నరవరేణ్య । యుగయుగంబున నవి మారు చుండుసుమ్ము. ౨౦౦

గీ. ధర్మపరు లుదయింత్రు కృతయుగమందు । దెలియ ధర్మార్థపరు లల త్రేతయందు
తనర ధర్మార్థకామగుల్ ద్వాపరమున । గలియుగంబున విను మర్థకామపరులు. ౨౦౧

వ. అనిన విని రాజు సాత్యవతేయా! సత్యయుగంబున నెల్లరు ధర్మపరులంటి వా రిప్పు డెచ్చటనున్నవారు? తక్కిన త్రేతాద్వాపరంబుల వారెచ్చటనుందురు? తెలుపవే నావుడు నతండు రాజేంద్రా! సత్యయుగంబువారు పుణ్యకర్మలు సేసి దేవలోకంబున నున్నవారు, త్రేతాద్వాపరంబులవారును నిట్ల యుందురు, భోగ తారతమ్యములు గలవు, కలియుగంబున నధర్మపరులై నరకంబుం బ్రవేశింతురు, మఱియు. ౨౦౨

గీ. కలియుగోద్భూతులగుపాప కర్మలెల్ల । నరకమునను యుగాంతంబుపరకు నుండి
కృతయుగమునాది మానవాకృతులతోడ । సంభవింతురు మరల నో జనవరేణ్య. ౨౦౩

గీ. దైవయోగమువలన వ్యత్యయముగలుగు । చుండు యుగముల దుష్టాత్ము లుంద్రు సత్య
యుగమునందును గొందఱు సుగుణులుంద్రు । గలియుగంబున నిజకర్మగతులబట్టి. ౨౦౪

క. చేసిన కర్మముబోలిన । వై సుఖదుఃఖముల నుండు నవ్వల గలిలో
జేసిన పాపమునకు నవి బాసటయై పాపకర్మ ప్రబలంబ యగున్. ౨౦౫

వ. అనిన విని జనమేజయుండు తాపసవర్యా! యుగధర్మంబులు వక్కాణింపు మనుడు వ్యాసుండు. ౨౦౬

శా. సాయంప్రాతరుపాసితార్కులు త్రయీశాలుర్ స్వకర్మవ్రతుల్
గాయత్రీప్రణవానుమోదు లఖిలగ్రామస్థ దేవీజప
శ్రీయుక్తుల్ కరుణామయుల్ ఋతవచస్థేముల్ స్వకాంతారతుల్
మాయాబీజపరాయణుల్ కృతమునన్ మాన్యుల్గదా బ్రాహ్మణుల్. ౨౦౭

గీ. క్షత్రియులు లోకభరణవిచక్షణు లొగి । గోమటులు కృషి వాణిజ్య గోగణపరి
పాలనము సేసి జీవింత్రు పరగ శూద్రు । లుత్తముల గొల్తు రల సత్యయుగమునందు. ౨౦౮

గీ. ధర్మముల నించుకయ త్రేత దగ్గియుండు । దానికంటెను దక్కువ ద్వాపరమున
గలియుగంబున ధర్మంబు బొలియు నందు । రెల్లయడల నధర్మంబు వెల్లివిరియు. ౨౦౯

గీ. సత్యయుగమున నెవరు రాక్షసు లనంగ । బడిరి వారలె కలిని బ్రాహ్మణులుసుమ్ము
పాపములకును మూట లబద్ధములకు । గోట లన్యాయములకును బీట లుగ్ర
వృత్తులకు మృత్యుదేవత వేట లధిప. ౨౧౦

వ. మఱియు బాషండధర్మనిరతులును జనవంచకులును వేదవర్జితులును శూద్రసేవాపరులును ప్రతిగ్రహపరులును శూద్రధర్మనిరతులును వేదనిందకులును నై కలియుగంబున నానావిధపాపంబులపాలై యుందురని చెప్పి మఱియు ౨౧౧

గీ. నిఖిలవర్ణములందును నీతి సున్న । కలియుగమున స్వభావముగా నరేంద్ర
పాచితము లేదు కలియుగ పాపములకు । నిదియ పరిహార్య మేమందు నృపవరేణ్య ౨౧౨

క. నావుఁడు నో మునివర్యా । యీ విధముననుండు కలిని హేయస్థితికిన్
బ్రోవైన మనుజతతికిం । ద్రోవ గలదొ లేదొ తెల్పుదువుగాత మనన్ ౨౧౩

క. కలియుగమున నఘసంతతి । బొలియించుట కొక్కమార్గము గలదు విను మా
లలితాంబనామకీర్తన । మలఘుత నది యొకటి పాపహారి మహీశా. ౨౧౪

గీ. పుణ్యతీర్థమందు పొసగ నంబానామ । జపము సేసికొనుచు నపరిమితసు
ఖాప్తి నున్నవాని నంటవు భూతముల్ । పాపజాతములును బార్థివేంద్ర. ౨౧౫

వ. అనిన విని జనమేజయుండు మునినాథా ! పుణ్యతీర్థప్రభావంబులు సెలవియ్యవే యనుఁడు
నతండు మహీపాలా ! చెప్పెద వినుమని యిట్లనియె. ౨౧౬

క ఎక్కడదేవీ పూజన । మెక్కుడుగా నుండు నదియె యెక్కువక్షేత్రం
బెక్కడ నది తక్కువయగు । తక్కువక్షేత్రంబటంచు దాని నెఱుఁగుమీ. ౨౧౭

గీ. దేవిఁబూజించు స్థానమే తీర్థ మరయ । దేవిపే రెఱుఁగనిచోటు తీర్థమగునె!
పుణ్యముల యీవికిని దేవి పుట్టుదివి । యవ్వలేకున్న రాటాన నగునె పోగు. ౨౧౮

సీ. క్షితిని జాహ్నవి సరస్వతి నర్మద తమస కావేరి గోమల గండకి సర
యువు సింధువును గృష్ణయును గౌతమియు జర్మణ్వతి తాపియును వేత్రవతియు దపతి
యను నదుల్ మరియు దక్కినవి సముద్రగామినులును బుణ్యంబు లనిరి బుధులు
కల వింకను సముద్రగామిను లల్పపుణ్యంబులు శ్రాంతౌఘ మది వరంబు
శ్రావణం బాది రెండుమాసములు నదులు । గ్రామ్యవారిసమేతమై రజమునొంచు
కాన నపుడవి స్నానయోగ్యములు గావు । వినుమునుడివెద క్షేత్రముల్ జనవరేణ్య. ౨౧౯

సీ. క్షితిని బుష్కర కురుక్షేత్ర ధర్మారణ్యములు ప్రభాస ప్రయాగములును నైమి
శార్బుదారణ్యము లద్రులు శ్రీశైల కనకాద్రి గంధమాదనములును స
రసులు మానసము బిందుసరస్సు నచ్ఛోద కాసారమును లెస్స గా దలంపు
భూరిపుణ్యము నరనారాయణులు తపంబాచరించిన బదర్యాశ్రమంబు
వామనాశ్రమము శతయూపాశ్రమంబు । మఱియు దీర్థంబు లెన్నేని ధరణి గలవు
మునివిగీతంబు లధికపావనము లగుచు । నెచట దేవాలయంబుండు నచొటు వరము. ౨౨౦

వ మరియు ద్రవ్యశుద్ధియు, గ్రియాశుద్ధియు, మనశ్శుద్ధియు నిమ్మూడును బాగుగా
నుండెనేని తీర్థంబులు పూర్ణఫలదంబులగు, ద్రవ్య క్రియాశుద్ధు లెయ్యెడనేనిం గలుగు
గాని మనశ్శుద్ధి దుర్లభంబు, మనం బతిచంచలంబు, కామక్రోధాదులచే మలీమసంబైన

మనంబు శుద్ధంబగుట దుస్తరంబు గాకుండునే మనశ్శుద్ధి తీర్థదఫలంబులకుం బ్రథానాంత రాయంబు వినుము. ౨౨౧

గీ. ధృతి నహింసయు సత్య మస్తేయ శౌచ । ములును నింద్రియనిగ్రహంబును స్వధర్మ
పాలనము తీర్థసేవన ఫలదములగు । మనసు కారణ మెందును మానవేంద్ర! ౨౨౨

గీ. నిత్యకర్మంబులను దూల నెట్టుటొకటి । దారి సంపర్గదోషంబు దగులుటొకటి
నరుని తీర్థాధిగమన పుణ్యంబు వాపు । దాని పైపెచ్చు పాపసంతాప మిచ్చు. ౨౨౩

గీ. దేహజమలంబు దీర్థముల్ తీర్చగలవు । మానసంబును గడుగంగ బూనలేవు
తీర్చనేని సురాపగాతీరవాసి । గాధిజ వసిష్ఠ ముఖు లేల క్రోధులైరి? ౨౨౪

గీ. జ్ఞాననిష్ఠుండు గంగావగాహనంబు । సేయ నాంతరమలశుద్ధి జెందు నిజము
చెరి డెందంబు మంచిదిజేసి తీర్థ । యాత్ర జేయుట శుభకరం బవనినాథ! ౨౨౫

చ. శ్రుతులును శాస్త్రము వ్రతనిరూఢగతు ల్తపముల్ వితీర్ణతల్
సతతమనోవిశుద్ధికిని జాలవు, బ్రాహ్మణుఁడున్ వివేకి యం
చితనిగమప్రవీణుఁడు వసిష్ఠుఁడు రాగియు ద్వేషియుం గుధీ
యుతుఁడును నయ్యె గంగదరి నుండియు నేమికఁజెప్ప భూవరా! ౨౨౬

చ. తనరు వసిష్ఠశాపమున దా బకమయ్యెను గౌశికుండు న
య్యనఘుని శాపవాక్యమున నాడితనొందె వసిష్ఠుఁ డిర్వురున్
బనిపడి పోరి రొక్కమొగి మానసతీరమునందు రాజనం
దన పదివేలయేడు లతిదారుణలీల సురల్ భయంపడన్. ౨౨౭

వ. అనిన విని పరీక్షిత్కుమారుండు మునివర్యా! వసిష్ఠ విశ్వామిత్రులకుం బరస్పర కలహం బెట్లుగల్గె చెప్పవే యనుఁడు వ్యాసుండు మహోల్లాసంబున. ౨౨౮

ఉ. సాంద్రకకుత్స్థభూపకులసాగరచంద్రుఁడు రూపచంద్రుడున్
జంద్రముఖీమనఃకుముదచంద్రుఁడు దిక్తటవిస్ఫురద్యశ
శ్చంద్రుఁడు గంధసంకలితచంద్రుడు భూపతిచంద్రుఁ డా హరి
శ్చంద్రుఁడు భూరితేజుఁడు త్రిశంకుతనూజుఁడు భూమి నేలుచున్. ౨౨౯

క అనపత్యత నరమేథం । బును వరుణునిగూర్చి చేసె భూపతి వరుణుం
డును సంతసించె నంతట । గనకాంగికి మాధవికిని గర్భంబాయెన్. ౨౩౦

సీ. రా రమ్ము ప్రాణేశ నేరమెంచకుమని పిలిచి యల్లన ముద్దుబెట్టి విడుచు
కోపమా యని కన్నుగొనల వింతఁగజూచి యెసకపుకౌఁగిలి యిచ్చి విడుచు
పదములొత్తుచు నూర్చి సదయాత్మ యీనాఁటి కిది చాలుగా యంచు నొదిగి నిలచు

జీవితేశ్వర నీదు చేదోడు విడనంచు బాణిపట్టుక యల్ల బాన్పు డిగ్గు
పనులయెడ నోపికదొఱంగు తనువునందు । మనసుమురిపెంబు ఘనమగు మగనియందు
వెగటుపడునొక్కొ యని చాల వెరపుఁజెందు । నెలత చంద్రమతీదేవి నెలలయందు. ౨౩౧

క. నెలదప్పి నెలలుగడవఁగ । నెలతకు నెలనెలకు నొక్క నీటున నెలచి
న్నెల వన్నెల వెన్నెల బూ । నె లలితముఖసీమ చెలులు నెలయే యనఁగన్. ౨౩౨

క. ఆ పుండరీకవదనకు । బాపటయును బుంసవనము వైదికవిధులం
భూపాలుడు సేయించెను । శ్రీపూర్ణత వెలయ ముదిత శేముషి నధిపా. ౨౩౩

క. ఒకటై రెండై మూఁడై । యకళంకత నాలు గైదు నా ఱేడై చే
రిక నెన్మిది తొమ్మిదియై । ప్రకటంబుగ నెలలు గడవ బదియవ నెలలోన్. ౨౩౪

గీ. ఒక సుపుత్రుండు పుట్టె ద దుత్సవమున । భూపతి యొనర్చెగో దాన భూమిదాన
స్వర్ణదా నాన్నదానముల్ బ్రాహ్మణులకు । నంత నొకనాఁడు జలభర్త యరుగుదెంచె. ౨౩౫

క. వచ్చిన నుపచారములన్ । హెచ్చుగ గావించి పీట యిచ్చిన మదిలో
మెచ్చుచు గూర్చుండి నృపా । సచ్చరితుఁడ వీవు నీకు సరిగలదె యిలన్. ౨౩౬

క. నీకొడుకును బశువునుగాఁ । జేకొని నరమేధమఖము సేయుము రాజా
నాకుం బ్రీతుఁడవయ్యెదు । గాక యనిన నృపుఁడు లోన గ్రాగుచుఁ బలికెన్. ౨౩౭

క. నెలపురుడు దీరదింకను । నెలత యశుచికాన మఖము నే జేయదగున్
నెలమీద ననిన వరుణుం । డలరి చనియు నెలను గడిపి యరుదెంచె నృపా. ౨౩౮

క. అత్తరి రాజన్యుఁడు దా । జిత్తమెరియ వంత డాచి సెప్పెను వీఁడె
ట్లిత్తరి నర్హుడు పశు సం । పత్తి కసంస్కృతుఁడు దగునె పలుకు మటన్నన్. ౨౩౯

వ. విని వరుణుండు కోపించి నీ వసత్యవాదివి శాపార్హుఁడ వనిన భీతుండై హరిశ్చంద్రుండు పాశాయుధా కోపింపవలదు. సమావర్తనం బైనపిమ్మట వీనిం బశువుం జేసికొని నే యాగంబు సేసెద. నావుఁడు గడు నలరి వాఁడు సనియె నంత. ౨౪౦

క. ఎట్టని కన్నులు కలుగుట । గుట్టడు దా లోహితాంబకుం డనబడి తా
వెట్టత్తి తనగతిని విని । మొట్టో యని యేడ్చి పారిపోయె మహీశా. ౨౪౧

క. కాల మెటిఁగి వరుణుడు దా । నా లోననె వచ్చి యజ్ఞ మొదరింపు మనన్
భూలోకనాయకుఁడు దా । లోలోననె కుంది కుంద లోలాత్ముండై. ౨౪౨

ఉ. ఎక్కడఁబోయెనో యెఱుఁగ నేమి యొనర్చెద బుత్రుఁ డార్తుఁడై
నిక్కము బల్కితిన్ వినుము నీ వన బాశధరుండు క్రుద్ధుఁడై

తక్కులు బల్కనోడవుగదా కలరే యిటునంటివార ల
మ్మక్క! జలోదరాఖ్యమగు వ్యాధిని బొందు మటంచుఁ దిట్టినన్. ౨౪౩

క. తిట్టిన రోగం బొదలం । బట్టుట నతఁ డార్తుఁ డగుచు బడియుండెను దా
జిట్టెలుక నూతఁబడి న । ట్టట్టిట్టుల గొట్టుకొనుచు నవనీనాథా! ౨౪౪

క. వరుణుని తిట్టునను జలో । దరరోగముచేత దండ్రి తద్దయు బాధం
బొరయుటఁ బాంథులచే విని । యరుదేరఁగ లోహితాక్షుఁ డాలోచింపన్. ౨౪౫

క. హరిహయుఁడు వచ్చి వెంగలి । వరయఁగ నీ వేలపోయె దయ్యకడకు నిన్
నరుకును యజ్ఞంబున న । వ్వరుణుని భయకొరకు ననిన వాఁడును మానెన్. ౨౪౬

గీ. ఎప్పుడేని యాతఁ డేగెదనని పూన । నప్పు డింద్రుఁ డేగి యతని మాన్పు
నిట్టులుండ రాజు హితు గురుని వసిష్ఠు । జేరి పలికె వినయచిత్తుఁడగుచు. ౨౪౭

క. ఈ రోగబాధతోఁడను । ధారుణి నే బ్రతుకనేర దారియొకటి నీ
వేఱుపరచుము మునీంద్రా । నీరోగుఁడ నగుచు బ్రతికి నిను సేవింతున్. ౨౪౮

క. అనవుఁడు వసిష్ఠుఁ డనియెను । జననాథా మఖముసేపి జలపతికరుణం
గొనకున్న రోగమెట్టుల । చను గావున గొనుమి యొక్క జను బుత్రునిగాన్. ౨౪౯

క. అతఁడు దశవిధపుత్రుల । క్రీతుం డనఁబడును భయమొకింతయు లే ద
త్యాతత యజ్ఞము జరుపుము । శీతలుఁడై పాశి స్వస్థుఁ జేసెడి నిన్నున్. ౨౫౦

వ. అనిన విని రాజేంద్రుండు యజ్ఞపశుత్వమునకు యోగ్యుండైన యొక్కనిం గ్రీతుం గొనితెండని విప్రుల నియమించిన వారు నెమకి నెమకి నిర్ధనుండైన యజీగర్తుం డను నొక్కని ముప్వురుపుత్రులలో మధ్యముడగు శునశ్శేపుం డనువానిం గొనితెచ్చిన నలరి రాజన్యుండు మఖంబు సేయందొడంగి యబ్బాలుని యూపంబునకుం గట్టిన వాని యార్తిధ్వని విని విశ్వామిత్రుండు వచ్చి. ౨౫౧

చ. తెగువ యిదేమి మానవపతీ తగునా ద్విజబాలుఁ జంప బె
న్నెగులున నుండె వీడు కడునింద్యము నీ కిది యేను వేఁడెదన్
దగ నితనిం ద్యజింపు మిఁక దప్పక నీకు సుఖంబు గల్గెడున్
జగతి దయావిహీనునకు సౌఖ్యముగల్గదు నమ్ము నావుఁడున్. ౨౫౨

గీ. వినక రాజేంద్రుఁ డబ్బాలు విడువకున్న । వారుణంబగు మంత్రంబు వానికి నుప
దేశమిచ్చిన గుఱ్ఱండు దెలసి పెద్ద । పెట్టున బఠింప వరుణుఁడా పట్టుసేరి. ౨౫౩

గీ. బాలు విడిపించి భూపతి వ్యాధిరహితుఁ । జేసి యేగెను బిదప గౌశికుఁడు తనదు
మాట వినఁడాయె రాజని మనమునందు । గ్రోధమునుబూని వర్తించె గొన్నినాళ్ళు. ౨౫౪

సీ. అంతట నొక్కనాఁ డా హరిశ్చంద్రుండు గుఱ్ఱంబుపై వేటకౌఱకు నరుగ
గౌశికీతటమందు గాంచి గాధేయుండు ముసలిబ్రాహ్మణుఁడయి ముందుజేరి
సర్వస్వమర్థించి సమధిగతాశుఁడై గొన్నినాళ్ళకు వచ్చి కోరినంత
విని వసిష్ఠుఁడు వాని విపినంబునం జూచి మతిహీన గాధేయ కృతకవిప్ర
కొంగధ్యానంబుజేసెడి దొంగ వీవు । గర్వ మింతేలరా నీకు కట్టుబోత
మా హరిశ్చంద్రు నీమాయ మట్టినావు । బకమవై పోర నీ వోరి పాపకారి. ౨౫౫

వ. అని యిట్లు వసిష్ఠునిచే శపియింపఁబడి క్రోధారుణితనయనుండై గాధేయుండు. ౨౫౬

గీ. బకమనై యేను నున్నంతవఱకు నీవు । నాడివై యుండు పొమ్మన నట్టు లిద్ద
రొకడు బకమయి యాడియై యొకడు వేరు । వేరు చెట్లను గూళ్ళను బెట్టికొనిరి. ౨౫౭

వ. ఇట్లు మైత్రావరుణ విశ్వామిత్రులు మానససరోవరప్రాంతంబున నుండి పరస్పర వైరంబులు వహించి నిత్యంబును దేహంబులు రుధిరప్లుతంబులుగా బోరుచున్న సకలదేవతా విస్మయకరంబయ్యె నంత నది యెరింగి హంసవాహనాధిరూఢుండై సత్యలోకంబు నుండి బ్రహ్మ వచ్చి యిరువుర వైరంబులు బాపి శాపమోక్షంబుసేసి పంచి తానును నిజ నివాసంబునకుం జనియెఁ గావున రాజేంద్రా యహంకారాది రహితుండైన జ్ఞాన నిష్ఠునకుం బుణ్యతీర్థనివాసంబు ఫలంబిచ్చుగాని చిత్తశుద్ధిలేనివానికిం దీర్థంబులు వ్యర్థంబులని నమ్ముమనిన విని జనమేజయుండు మునినాథా వశిష్ఠునకు మైత్రావరుణి యను నామంబు జన్మవలనం గల్గెనో, కర్మవలనం గలిగెనో తెలుపు మనిన విని సాత్యవతేయుండు. ౨౫౮

గీ. బ్రహ్మవలన బుట్టి పరగ వసిష్ఠుండు । కనలి నిమి శపింప తనువుబోయి
మేదినిం జనించె మిత్రావరుణులకు । కాన నట్టిపేరు గాంచె నతఁడు. ౨౫౯

క. అనుఁడు జనమేజయుం డి । ట్లను నో మునినాథ యెందు కతనికి శాపం
బు నొసంగె నిమి మహాత్ముల । కును తప్పులుగలవె నీతికోవిద చెపుమా. ౨౬౦

చ. అనవుఁడు వ్యాసుఁ డిట్లనియె నంతయు నీకు నెఱుంగజెప్పితిన్
మునుఁ దన పుణ్యపాపములె మూలము లీ సుఖదుఃఖము ల్త్రికం
చునుఁ జను డెంత చేసికొను జొప్పద నంతయు నారగించు గా
వున మునులైననేమి యఘపుంజముఁ జేసిన దుఃఖమొందరే. ౨౬౧

గీ. చిత్తశుద్ధిలేక జేసిన తపములు । రిత్తలగును గాక బృథివి దాని
సత్తవలన నేమి సమకూరు సకలార్థ । వేత్త లొందరే విపత్తు లధిప ! ౨౬౨

క. పామరుఁడు ముక్తి వడయును । భూమిన్ సత్యవ్రతాది పుణ్యులపోలెన్
శ్రీమాయాశక్తిమహిమ । మేమనివర్ణింతు సర్వ మీశ్వరి యెఱుఁగున్. ౨౬౩

గీ. రాగ దంభ మోహ రహితమ్మై యలరారు । శక్తి భక్తి గలుగ ముక్తి గలదు
దళము శివునిమీఁద తలపు సానులమీద । నైన ఫలముగలదె యవనినాథ ! ౨౬౪

క. క్షమ నిక్ష్వాకుకులజుఁడగు । నిమి ధర్మపరుండు పరమనీతిజ్ఞుఁడు రూ
పము సంపద సత్త్వము దా । నము జ్ఞానము గలుగువాఁడు నరలోకపతీ! ౨౬౫

వ. అతండు గౌతమాశ్రమసమీపంబున బ్రాహ్మణహితంబుకొరకు జయంతపురంబను పురంబు నిర్మించుకొని యందుండి యజ్ఞంబుసేయ దలంపడి సకలసంభారంబు గూర్చుకొని భృగు వామదే వాంగీరస, వసిష్ఠ, పులస్త్య, ఋచీక, పులహ, క్రతుముఖ్యులగు వేదపారగులైన మౌనులం బిలిపించి నిజగురుండైన వసిష్ఠుం జూచినేనైదువేలేండ్లు దీక్షనుండి దేవీయజ్ఞంబు సేయ సమకట్టితి నది సేయింపవే యనుఁడు నే నింద్రునిచే నిదివఱక దేవీమఖయాజనార్థము నియుక్తుండనైతి నతండు పంచశతవర్షంబులు దీక్షనుండు గావున నింద్రయజ్ఞానంతరము వచ్చి నీకు యజ్ఞంబు సేయించెద నావుఁడు రాజన్యుండు సకలసంభారంబులు సమకూర్చుకొని సర్వమునుల నియంత్రితులం జేసికొనియున్న నేనెట్లు యజ్ఞంబుమానుదు? నిక్ష్వాకుకులంబునకు గురుండవయ్యు నీ విట్లు చెప్పుట యుచితంబుగాదు. ధనలోభంబున నీ విట్లు సేయుచున్నవాడవు నావుఁడు నిలువక యింద్రయాగార్థంబు వసిష్ఠుండు సనిన గౌతము యాజకుం జేసుకొని యజ్ఞంబు పరిసమాప్తి నొందించె, నంతకుమున్న యింద్రుని యజ్ఞానంతరము వసిష్ఠుండు నిమియజ్ఞంబు సూడవచ్చి యతండు నిద్రవోవుచున్న సమయంబగుట లేచి పూజింపమి క్రుద్ధుండై కులగురుండనగు నన్ను ద్యజించి యాగంబుజేసి నన్నవమానించితి కావున నీవు విదేహుండవుగమ్మని శపియించిన నది విని పరిచారకులు రాజు నిదురనుండి లేపి చెప్పిన నతండు గనలుచు వచ్చి యిట్లనియె. ౨౬౬

క. నాయందు లేదు నేరము । నీయందే కలదుసుమ్మి నెరి ధనమంద
త్యాయతతృష్ణను జెందితి । నా యజ్ఞము విడిచి చేరినాఁడవు మఖవున్. ౨౬౭

ఉ. బాపడవయ్యు ధర్మమును బాసితి నన్విడనాడి యర్థతృ
ష్ణాపరతంత్రవృత్తిమయి నానయొకింతయులేక నాకునున్
శాపమొసంగెదే తగునె సంయమి పాపముమూటగట్టెదే
కోపము తాపహేతువగు గూడ దెరుంగవె ధర్మసూక్ష్మమున్. ౨౬౮

క. నీపైనినున్న నేరము । నాపై బెట్టితివి యిట్లు నన్ను శపింపన్
గోపమురా నేపనిగల । దోపికలేనట్టివాఁడ వొజ్జల వగుదే. ౨౬౯

వ. నీవును విదేహుండవు గమ్మని శపించిన వసిష్ఠుండు చింతాత్ముండై బ్రహ్మకడకేగి శరణుజొచ్చి నిమిశాపక్రమంబు సెప్పి కాయంబులేని నే నేమిసేయంగలవాఁడ నన్యదేహోత్పత్తియందు నాకుం జనకుం జూపి పూర్వశరీరతుల్యంబగు శరీరంబు నాకు

దయసేయవే యనుడు, వసిష్ఠుని గాంచి నీకు మిత్రావరుణుల తేజంబు గలుగు నీ వయో
నిజుండవగుదు, స్థిరుండవుగమ్ము పొమ్మనిన విని బ్రహ్మకు బ్రదక్షిణంబు గావించి
నమస్కరించి వరుణాలయంబునకుం జని మిత్రావరుణుల శరీరంబునం బ్రవేశించియున్న
నొకానొకనాఁడు. ౨౬౦

చ. నవనవయౌవనాంచితఘనస్తని కోమలగాత్రి యుల్లస
ద్భుజవననేత్ర విద్రుమనిభోష్ఠ కిసాలయపాణి కంబుకం
ఠి విపులభూధరోపమకటిస్థల చంద్రనిభాస్య కోకిలా
రవ ఘనవేణి యూర్వసి నిరాకులయై యట కేగుదెంచినన్. ౨౬౧

క. ఆ దివ్యసుదతి గనుఁగొని । ప్రాదుర్భూతప్రతాప పటుపంచశరో
న్మాదంబున గోరి రబల । యీవెసనే నిలుపు మీవు స్వేచ్ఛ నటంచున్. ౨౬౨

క. భావంబునిలిపి యా మి । త్రావరుణుల గృహమునంద దా నూర్వసియున్
దావుకొనియుండె నొకనాఁ । డావనితన్ గాంచి వారి యాత్మలు గలగెన్. ౨౬౩

క. కుంభముల వీర్యంబు ల । ధంభగతిన్ జార దైవతంత్రమువలనన్
సంభవము నొంది రిరువురు । గంభీరమనస్కులగు నగస్త్య వసిష్ఠుల్. ౨౬౪

వ. అందు మొదటివాఁ డగస్త్యుండు, రెండవవాఁడు వసిష్ఠుఁడు నయ్యె. ప్రథముండు బాల్యంబు
నన దపంబున కటిగె ద్వితీయు నిక్ష్వాకుండు వేఁడఁ బురోహితుండయ్యె. నిఁదువలన
వసిష్ఠునకు మైత్రావరుణి యను నామంబు గల్గె నని చెప్పిన విని జనమేజయుండు నిమి
వృత్తాంతంబు సెప్పుమనిన సాత్యవతేయుండు. ౨౬౫

గీ. ఆ వసిష్ఠుండు తక్షణం బరిగి యన్య । దేహమును బొందె దన దివ్యతేజమునను
వానిచే శప్తుఁడయి నిమి వాని భంగి । జేయలేదయ్యె విను మది సెప్పెద నృప ! ౨౬౬

క. ఎన్నడు శపియింపబడె । సన్నాటికి గ్రతువు సనమి యవనీసుర లా
మన్నినిగూర్చి తలఁచిరి । కిన్నవిధేయంకిలాద్యకృత్య మటంచున్. ౨౬౭

క. అంచితమంత్రంబులచే । కించిచ్ఛ్వసనంబుగల్గ గీలించి రౌదల్
మంచివిలేపనమాల్యము । లుంచి తనువు నిలువజేసి రుర్వీనాథా. ౨౬౮

క. జన్నంబు గడిపి మునివరు । లన్నసువర్ణాంబరాగ్రహారాదులచే
జెన్నుగఁ బూజింపంబడి । మన్నెదొరా నీకు తనువు మంచిధి గలుగున్, ౨౬౯

వ. అని దీవించుచుండ నచ్చటికి వచ్చియున్న వియచ్చరు లలరి. ౨౭౦

గీ. మనుజదేహంబొ దేవతాతనువొ నీవు । మెచ్చునది తెల్పు కోరిక నిచ్చెద మన
నలరి యాతండు సురలార యంగవాంఛ । నంద నద్ది వినశ్వరం బగుటజేసి. ౨౭౧

గీ. సర్వసత్త్వంబులందు వాసంబు సర్వ । భూతనేత్రంబులందు రూపు గని సర్వ
దేవతలజూచుచుండెడి దేహరహిత । వాయుభూతుండనై యుండ వాంఛగలదు. ౪౮౨

వ. అనిన విని దేవతలు. ౪౮౩

క. ఏ మియ్యజాల మీవర । మా మాయాశక్తి దేవి యఖిలాంబ త్రిలో
కీమాత శక్తయయ్యెడు । భూమీశ్వర వేడుమయ్య పూర్ణప్రజ్ఞన్. ౪౮౪

క. అనిన విని దేవి ప్రార్థన । మును భక్తి నొనర్ప నంబ మోదంబున ద
ర్శనమిచ్చిన నిమి సంతస । మున జ్ఞానంబు భవమోక్షమును వరియించెన్. ౪౮౫

వ. మఱియు. ౪౮౬

గీ. సర్వభూతనేత్ర సంవాసమడిగిన । నట్లయౌ నటంచు నంబ పలికి
నిమి వసించుకతన నిమిషముల్ సర్వజం । తువులయందు గల్గు దివిని లేవు. ౪౮౭

క. అని వరము నొసంగి జగ । జ్జనని సనియె నంత సర్వ సంయములును త
త్తనువు నరణిజేసి మథియిం । చిన జనకుఁడు బుట్టె జనకచిహ్నంబులతోన్. ౪౮౮

గీ. ఆ విదేహుని వంశంబునందు బుట్టి । నట్టి వారలకును విదేహాఖ్య వచ్చె
జనకుబోలిన కొమరుండు జనకుఁడయ్యె । మథనబుట్టుట మిథిలనామంబు గల్గె. ౪౮౯

గీ. ప్రథమమిథిలుండు జనకుఁ డేర్పడగ గట్టి । నట్టి పురమును మిథిలాఖ్య మయ్యె నిట్టు
లా నిమి విదేహతయు వాని యన్వయంబు । క్రమము దెల్పితి ననిన భూకాంతుఁ డనియె. ౪౯౦

క. నిమి శాపకారణంబును । గ్రమమున నే వింటి నీదు కరుణ గలుగుటన్
నిమి రాజన్యుఁడు విప్రో । త్తముఁడు వసిష్ఠుడు పురోహితత్వకలితుఁడున్. ౪౯౧

గీ. వనజగర్భునిపుత్రుండు వాని నెట్లు । నిమి శపించెను శాంతి దాంతి విడనాడి
సకల ధర్మంబుతెఱఁగి యిక్ష్వాకు వంశ । సంభవుండయి నిరర్థ్యంబు సల్పె శాపు. ౪౯౨

క. క్షమ దుర్లభంబ యీలో । కమునం దిది గలుగువాఁడు గానబడడు యో
గమువలన నభ్యసించిన । నమరుపే దాపసున కవికలాత్మం డైనన్. ౪౯౩

వ. కామ క్రోధ లోభాహంకారంబులు దేహమధ్యస్థులై కానంబడని శత్రువులు, వీనిచే బాధింపబడనివారు స్వర్గ భూ సత్య వైకుంఠ కైలాసంబులందును లేరు. బ్రహ్మపుత్రులైన మునులు గుణత్రయావిద్ధులు కాకుండిరే? యోగాభ్యాస నిరతుండును, సాంఖ్య వేత్తయు నగు కపిలుండే ద్వైపయోగంబున నరువదివేలమంది సగరాత్మజుల దగ్ధులంజేసె. నింతకేమి, యహంకారంబు బ్రహ్మ విష్ణు శంకరుల కడంగెనే, యిక మనుజులగతి సెప్పనేల? ౪౯౪

మ. అనఘుం డవ్యయుఁ డచ్యుతుండు నిరతుం డాద్యుండు నిర్లేపు డం
జనహీనుండు సనాతనుం డజుడు హింసాశూన్యుఁ డజ్ఞేయు డా
ఘను డొక్కండును దేవి యొక్కతెయు దక్కన్ సర్వ మట్లే యగున్
గనుమా నీమదిలోన శక్తి పురుషైక్యం బుర్వరాధీశ్వరా! ౨౯౫

క. ప్రకృతిపురుషైక్యభావం। బకలంకత నెఱిఁగెనేని యది జ్ఞానము మో
క్షకరము దాన సిడుము న। మ్మక మిది వేదాంతడిండిమము నరనాథా! ౨౯౬

క. అనుభవజము శబ్దజమును। నని ద్వివిధము జ్ఞాన మందు రతిదుర్లభమౌ
ననుభవజము వేదాదుల। జనియించిన యదియ శబ్ద జంబు నృపాలా ౨౯౭

క. పెద్దల సాంగత్యంబున। దద్దయు మతిగలిగి లోకదర్శన మననో
ద్వృద్ధిశల ననుభవజ మే। ప్రొద్దును గ్రహింపవలయు భూతలనాథా! ౨౯౮

గీ. శబ్దజంబగు జ్ఞానంబు శాంతిదనరి। యాంతరంబగు చీకటి నణపలేదు
దీపమిడకున్న జీకటి బాపునెద్ది। కాన యనుభవజజ్ఞాన మూనవలయు ౨౯౯

క. భవబంధమోక్షణంబును। సవరింప సమర్థమైన జ్ఞాన మనబడున్
బవిమలమగు జ్ఞానంబను। భవమున నార్జింపవలయుఁ బార్థివవర్యా! ౩౦౦

గీ. శిల్పనైపుణంబు శీలంబు బరహిత। త్వంబు దోషశూన్యతయును క్షమయు
ధృతియు తుష్టి యనఁగని విజ్ఞానపరిపాక। ఫలములండ్రు విబుధవరులు భూప. ౩౦౧

క. జ్ఞానము తపమును యోగము। షూనుగ గామాది శత్రుమారకములగున్
భూనాయక కామాదులు। మానసజములండ్రు బుద్ధిమంతులు జగతిన్. ౩౦౨

క. నిమిరా జెందాకను దెం। దము నిలుపం డంతదనుక దా గనదయ్యెన్
క్షమ నది గావున మానవు। డు మనము గెలువదగు నెన్నడును జననాథా. ౩౦౩

గీ. శుక్రుడు శపింపగ యయాతి జుట్టునెరసి। ముసలి యయ్యెను మరల దా మునిని ఢట్ట
కూరకుండెను జననాథ వారివారి। యోగ్యతలబట్టి కార్యంబు లుండుసుమ్మి. ౩౦౪

గీ. హైహయులును బురోహితులైన భార్గ। వులను ధనలోభమున దొల్లి బిలుకుమార్చి
రలుకమైకొని బ్రహ్మహత్యాసమృద్ధ। పాపమును వెన్కనిడుకొని పార్థివేంద్ర. ౩౦౫

వ. అనిన విని జనమేజయుండు. ౩౦౬

క. హైహయులను మానవులే। బాహుజవంశంబునందు ప్రభవించిరి సం
మోహితులై నిజవంశపు। రోహితులను నెట్లు జంపిరో భార్గవులన్. ౩౦౭

క. కోపము తాపసుకొలకు కా। తాపము దా బ్రహ్మహత్య దగజేయును నా
నీపట్టున జూపట్టెను। భూపాలుర కేల యలుకపుట్టె మునీంద్రా! ౩౦౮

క. బలవంతుల మని యుత్తమ । కులజుల బూజ్యులను జదియగొట్టుదురే యే
ఖలులైన పాపకృతులకు । దలకరె భూపాలు రద్భుతంబగు నాకున్. ౩౦౮

గీ. అలతినేరమ్ములకు బ్రాహ్మణాగ్రణులను । క్షత్రిగోత్తము లేరీతి జంపనేర్తు
రకట సందేహమయ్యె నా కమలచరిత । చెప్పగదె యాతతేంద్రియజేత తాత! ౩౦౯

వ. అనిన విని వ్యాసుండు పరీక్షిత్తనయా వినుము తొల్లి కార్తవీర్యుఁడను పేర హైహయ రాజన్యుండు గలఁ డతండు సహస్రబాహుండు. నారాయణాంశజుం డగు దత్తాత్రేయుని శిష్యుండు సదా దానపరాయణుండై నిజయాజకులగు భార్గవులకు తన యర్థంబెల్ల ధార వోసిన తద్దానవశంబున భార్గవులు హయ రత్న సమృద్ధి వడసి రంత నృపశార్దూలుండైన కార్తవీర్యార్జునుఁడు స్వర్గంబునకుం జనిన హైహయులు ధనార్థులయి వినయపూర్వకంబుగ జేతులుమోడ్చి భార్గవుల నర్థంబు వేడిన ధనలోభంబుచే నాస్తి నాస్తి నాస్తి యను వచనంబు లాడి కొందఱు హైహయుల నెట్టిరి, కొందఱు ధనంబు భూమిం బ్రాతిరి. కొందఱు భయంబున ధనం బొసంగిరి, కొందఱు స్థానాంతరంబు నొందిరి, మఱియు. ౩౧౦

క. బుడిచెంబులు ముడసవెదురు । గడకఱ్ఱలు తలల జుట్టు గావంచాలున్
మడిసంచి దర్భచాపలు । మెడల నిడుక చనిరి చాటు మెట్టల కధిపా! ౩౧౧

సీ. కంకణంబులు మూట గట్టి దాచెడివారు ముక్కుపోగులు ముల్లె ముడుచువారు
గుళ్ళపేరులు బొడ్డుకొంగుల నిడువారు చెవిదుద్దు రొండిని జెరవువారు
కాలందియలదీసి మూలదాచెడివారు పెద్దనా నటకపై బెట్టువారు
ఫంజుల కమ్మల పాతిపెట్టెడివారు పిళ్ళేళ్ల చందుగ బెట్టువారు
కంచుకమ్ముల గుమ్మల నించువారు । పట్టుచీరెల బుట్టల బెట్టువారు
నైరి భార్గవసతులు హైహయులభీతి । దల్లడిలి తామరాకులో నీళ్లబోలె. ౩౧౨

క. కొంపలువిడిచిరి భృగుజులు । గంపలు నెత్తినిడి చనిరి గహనంబులకున్
దంపలు దుంపలుఁజేసుక । కంపలనక హైహయులకు గంపిల్లి నృపా. ౩౧౩

ఉ అంతట హైహయుల్ కడుధనాశను భార్గవులున్నచోట్ల క
త్యంతరుషాసమేతమతులై చనుదెంచి కనంగ గ్రంతలన్
గ్రుంతల నెందుసూచినను రోకటిచప్పుడు గోడికూత యొ
క్కింత వినంగరాక జనహీనగృహంబుల ముట్టడించుచున్. ౩౧౪

చ. ఉతకలనెట్టి తల్పులెగ నొత్తి బిసల్వదలించి సొచ్చి యు
ద్ధతగతి పంచపాళి ప్రోయి దండెము చూరు వసార దాలిగుం
త తరి కుదుళ్ల గూళ్ళ కురుదళ్ళ మదుళ్ళ పెరళ్ల నంతటన్
వెతకిరి హైహయుల్ కనరు వీసముగోకరకానియేనియున్. ౩౧౫

చ. పలుగులగొట్టి విట్టు సొనుపం దవుగోలల బెల్లగించి గ్రు
ద్దలులను గ్రొచ్చి పారలను ద్రవ్వి కడుం గునపాల వ్రచ్చి న
ట్టిలు గది మూల గోడకడ నిచ్చట నచ్చట నన్నిచోటులన్
బలుగతులం గనుంగొనిన బట్టరు హైహయు లొక్కగవ్వయున్. ౩౧౭

క. నూతులలో దిగి ప్రాతర । గోతులలో నెమకి నెమకి కొట్టుకొని వెసన్
మూతులపై యచ్చెరువున । జేతులనిడి హైహయులు కసింగొని వేగన్, ౩౧౮

ఉ. భార్గవులన్నచోటులకు బర్వునబోయి దృగధ్వగాములన్
స్వర్గముబంపి తద్ధనము సర్వము గైకొని వారి యంగనా
వర్గము దాల్చియున్న తనువల్లికలం గల పుస్తెపూసలన్
గుర్గురుమంచు మొట్టలిడ గొట్టుకపోయిరి హైహయు ల్వడిన్. ౩౧౯

గీ. సోమిదెమ్మగారి సొట్టముక్కున నున్న । ముక్కెరొకటి లాగి చిక్కపున్న
ముక్కుగోసి చనిన ముక్కిడియై యాపె । వెక్కివెక్కి నొక్కి నొక్కి యేడ్చె. ౩౨౦

క. అష్టావధాని కోడలు । కష్టపడుచునుండ బోయి కాళ్ళ కడియముల్
భ్రష్టములుగాగ దాచిన । నెష్టాగెష్టాగటంచు నేడ్చె నిలేశా. ౩౨౧

గీ. వాజిపేయయాజి వనిత చేతుల పైడి । గాజు లాగ రాక గత్తెరగొన
వద్దటంచు రొమ్ము గ్రుద్దుక విలపించె । దరిని మగడు నోరు దెరచి వగవ. ౩౨౨

గీ. పౌండరీకయాజి పౌత్రి గర్భిణి కుత్తు । గంటు నాను నడ్డిగలను దెంపి
పట్టుకొని చనంగ నిట్టట్టు నెమకుచు । బూస లేరుకొనుచు బొక్కె నధిప. ౩౨౩

గీ. సాంఖ్యశాస్త్రిగారి సవతిచెల్లెలు పండి । కూర్చుచుండ కొప్పుకుప్పె లాగ
లేచి మొత్తుకొనఁగ దోచికొనిరి దాని. । జూచి వగచె మగడు ప్రాచినోట. ౩౨౪

వ అట్లతిభయంకరముగా హైహయు లంగనాసమేతులగు భార్గవుల పయింబడి సక
లార్థంబులు దోచికొని యడ్డమువచ్చినవారి వధించి బాల వృద్ధాదుల బీడించి గర్భ
నిర్భేదంబు సేసి భీభత్సరసాస్పదులయి యుక్కుమీరి పెక్కుగతుల బాధింప గొందఱు
హిమాలయప్రాంతంబులకుం బోయిరి. మఱికొందరు హతశేషులు కపటవేషధారులై
జీవించి రిట్లుండ నన్యులగు మును లది విని యీ క్రూరకృత్యంబులు మీ కేల యని యడి
గిన హైహయులు. ౩౨౫

క. మీరందరు సాధువులే । కారా మాపూర్వులిండ్ల గల యర్థంబుల్
ధీరులమని పేరిడుకొని । వారక మ్రుచ్చిలినయట్టివారలుకారే. ౩౨౬

గీ. మనసు నొవ్వకుండ మంచిమాటలు మెచ్చ । నాడి చంకబిడ్డ లూడిపడఁగ
పతులయెరుకలేక యతివల, బతులను । నతివయెరుకలేక నడిగి కొనరె. ౩౨౭

క. పౌరోహిత్యము మాదని । వేరొక్కరిఁ జేరనీక వివిధగతుల సం
భారంబులనుచు నర్థము । చూరగొనరె మీరు యిద్ది చోద్యంబగునే. ౩౨౮

గీ. కొంగజపము చేయు దొంగలు మీరలు । చంగులిడుచు వచ్చి వంగి వంగి
నింగి జుక్కలెంచ నేర్పరులమటంచు । మింగుదురు గృహస్థు మేలిమెల్ల. ౩౨౯

క. అడిగితిమి ధనార్థులమై । యొడబడితిమి పావువడ్డి యొసగెద మనుచుం
నడువీధికి రావలదని । వెడలంగొట్టిరిఁగదా వివేకులు వీరల్. ౩౩౦

గీ. లేదు లేదు లేదు లేదన్న మాటకు । లేదు ముక్తి వీరు సాదులెట్లు
పాదుఁద్రవ్వి యందు బ్రాతిరి ధనముల । మీదుమీదు బీరపాదు లిడిరి. ౩౩౧

గీ. అర్జునుం డొసంగినట్టి యర్థంబును । పూడ్చనేల వీరు పుణుకదినగ
ద్రవ్వవలయుఁగాక వీరు తప్పొనరించి । రందువలన దగుదు మది గ్రహింప. ౩౩౨

క. త్యాగము భోగము నాశము । నాగను మూఁడుగతులగు ధనంబున కెన్నన్
త్యాగము భోగము మానిన । నొగతి మూఁడవది నాశ మందురు పెద్దల్. ౩౩౩

క. కావున దండ్యులు వీరలు । భూవరులము మేము జగతి బుణ్యముఁ బాపం
బేవేళ నారయందగు । మావిధులను మేము సేయ మా కది తప్పే. ౩౩౪

క. అదిగావున జననాథా । మది లోభము గూడ దెపుడు మానవులకు సం
పద లవి వచ్చును బోవును । బదిలముగా నిలువబెట్ట బ్రహ్మకు వశమా! ౩౩౫

క. తల్లుల దండ్రుల నన్నల । పిల్లల బాంధవుల గురుల మిత్రుల సతులన్
గొల్లుమన జంపివైతురు । చెల్లని ధనతృష్ణవలన జేటగుసుమ్మీ. ౩౩౬

గీ. కామ మద మోహ ముఖముల కంటె లోభ । మెక్కుడగు శత్రువు దలంప నెట్టులనిన
జగతి నాశాపరుండయి సలుపనట్టి । పాప మొక్కటి యున్నదే పార్థివేంద్ర! ౩౩౭

గీ. ఆశవలన బ్రాణమైనను త్యజియించు । నాశవలన మిత్రునైన జంపు
నాశవలన బుత్రునైనను విడనాడు । నాశవలన లేని యఘము గలదె? ౩౩౮

వ. అని సాత్యవతేయుండు జెప్పిన విని జనమేజయుండు మునీంద్రా! భృగుపత్నులు దుఃఖసాగరంబునుండి యెట్లు వెడలవడిరి? తదనంతరంబున హైహయు లేమిచేసిరి? తెలుపవే నావుఁడు వ్యాసుండు రాజేంద్రా! మునిపత్నులు హిమవంతంబున కరిగి యం దొక సరిత్తటంబున మృణ్మయియగు గౌరిం బ్రతిష్ఠించి తత్సమీపంబున నిలచి పూజించుచు మరణంబులకు గృతనిశ్చయలై యుపోషణంబు లాచరింప స్వప్నంబులం దేవి గన్పించి మీలో నొకదాని కూరువున నొక పురుషుండు బుట్టు వాఁడు మదంశోద్భవుండని, తెలియుండు. వానివలన మీకోరికలు దీరు, పొందని యాదేశించి

యంతహీనత యయ్యె. నంత వారలు మేల్కాంచి నిర్భయులై యుండ నందొక చతు
రయగు కామిని యూరువు గర్భంబుదాల్చి యున్నతరి హైహయ లేగుదెంచినం గని
యాబ్రాహ్మణి భయవిహ్వలయై పరువిడంజొచ్చిన ఖడ్గపాణులగు హైహయులు వెంబడించి
పట్టుకొన గర్భరక్షణం బెట్లుసేయుదు నని వేపమానయై సింగంబుం జూచిన చూడిలేడిం
బోలె కడునడలి కన్నీరు మున్నీరుగా నేడ్చుచున్నతరి ఆపెయూరువుం జీల్చికొని
రెండవ సూర్యుండునా మండిపడుచు కొండిక యొకం డుద్భవిల్లె. ౩౩౯

క. ఆ డింభకు వేడుములకు । నోడి ధరావరులు సనిరి యొక టొకవంకై
యూడిపడె కన్ను లంధత । మూడి పటాపంచలగుచు మొఱ్ఱో యనుచున్. ౩౪౦

గీ. నేత్రహీనులగుచు నృపతు లంతంతట । తడవికొనుచు వచ్చి ధరణిసురుని
శరణుజొచ్చి యెఱఁగి కరములు జోడించి । పలికి రిట్లు దైన్యభావ మొదవ. ౩౪౧

గీ. మమ్ము బ్రోవుమమ్మ మాపాలిదైవమ్మ । కన్నుఁగానదెనమ్మ కానలేము
నీకు బంట్లమమ్మ నేరమెంచకుమమ్మ । కన్నులిచ్చి మమ్ము గావుమమ్మ! ౩౪౨

గీ. ఇంతమీఁద నేగమేమియు సేయము । తల్లితోడు మాట తప్పమమ్మ
భార్గవులకునెల్ల పాదసేవ యొనర్చి । బ్రతుకగలము వారె గతి యటంచు. ౩౪౩

క. తెలియక పాపముఁజేసితి । మెలమిన్ క్షమియింపుమమ్మ యీనేరము మా
వలన నిఁకవెనుక తప్పులు । గలుఁగవు దేవతలతోడు కల్యాణి యనన్. ౩౪౪

చ. నృపవరులార మీకనులు నేను హరింపఁగలేదు చూడుడీ
యపరిమితప్రతాపుఁడు మహామహిముండు మదూరుజన్ముఁడున్
గుపితుఁడు భార్గవుండు మిము గూల్పఁదలంచె స్వబంధువైరులం
జపలుల గర్భపాతకుల సాధువిదారణలోలశీలురన్. ౩౪౫

క. నూఱేండ్లు మోచి కాంచితి । నూరువునను వీని శ్రుతిమయుండును దేవీ
కారుణ్యజనితుఁ డౌర్వుఁడు । మీ రీతని వినయయుక్తి వేఁడు డటన్నన్. ౩౪౬

క. ఆ యౌర్వునిఁ జేరి ధరా । నాయకులు నమస్కరించినం గని యాతం
డో యవనీశ్వరులారా । పోయి గృహంబులను సుఖము బొందుడు వేగన్ ౩౪౭

క. భార్గవులు నిజగృహముల క । నర్గళగతి నేగువార లచ్చోటను మీ
దుర్గతులు జూపకుం డిఁక । నిర్గమనము సేయుఁడనిన నృపతు లలరుచున్. ౩౪౮

క. సనయనులై వినయనయాం । జనులై జనవరులు సని నిజగృహములకు జ
య్యన నుండి రంత నౌర్వుం । డును దల్లియు విప్రులును గడున్ ముదమలరన్. ౩౪౯

వ. నిజనివాసంబులకుం జని సుఖంబుండి రని చెప్పిన విని జనమేజయుండు హైహయ

లను నామంబు కార్తవీర్యాదుల కెట్లు వచ్చెం జెప్పవే యనఁడు ద్వైపాయనుండు జననాథా వినుము. ౩౫౦

## —: హైహయుల వృత్తాంతము :—

మ. కలఁడుద్యన్నిరవద్యహృద్యతనుభాకంతుండు భూయస్త్రశ
త్త్రశితశ్రీమణిమాలికామకుటసాంద్రప్రాభవాక్రాంతుఁ డ
త్యలఘుక్రాంతదిశాంతకాంతఘనవిఖ్యాచంద్రికాకాంతుఁ డు
త్పలవిద్విడ్జనిమంతుఁడై యెసగు రేవంతుండు ధీమంతుఁడై. ౩౫౧

క. ఉచ్చైశ్రవ మెక్కి యతఁడు । పచ్చనివలువగలవాని పట్టణమునకున్
విచ్చేసిన గని విష్ణుఁడు । లచ్చిం గని యిట్టు లనియె లలనా వినుమీ. ౩౫౨

క. వీఁ డెవ్వఁడు చారుముఖీ । యీడకు రాఁ గతము తెలియదే యన వినియున్
జేడియ యేదియుఁ బలుకక । చూడంగా దొడగె మిగుల చోద్య మటంచున్. ౩౫౩

క. గుఱ్ఱము దొడ్డది యని సిరి । యఱ్ఱెత్తి కనుంగొనంగ హరి కోపమునన్
జుఱ్ఱున చూచెదవేలా । వెఱ్ఱి వడమెనొక్కొ నగరివెలఁదులమాడ్కిన్. ౩౫౪

క. గోడిగవుగమ్ము గుఱ్ఱము । జూడన్ మనసాయెనేని సుందరి యనినన్
జేడియ చింతిల్లి హరిన్ । వేఁడిన నాతండు కరుణ వీక్షించి తగన్. ౩౫౫

క. నాతో సమఁడగు పుత్రుఁడు । జాతుండగునాఁడు నీకు శాపము దొలగున్
నాఁతి యన లచ్చి గోడిగ । యై తిరుగుచునుండె నంత నర్కసుతుఁడు దాన్. ౩౫౬

గీ. విష్ణుకోపమునకు వెఱచి తండ్రిని జేరి । చెప్పె నంతయును విశేషఫణితి
నంత లక్ష్మి భూమియందును గాళించి । తమస గలిసినట్టి స్థలము సేరి, ౩౫౭

వ. సర్వకామదంబై సువర్ణాక్షంబున కవల నున్న మహాదేవక్షేత్రంబున నుండి పరమేశ్వరుఁ గూర్చి ధ్యానంబుసేయుచు వైరాగ్యంబుపూని దివ్యవర్షసహస్రంబు తపంబుసేయఁ దుష్టుండై మహాదేవుండు పార్వతీసమేతుండై వచ్చి బడబారూపంబునం దపముసేయు లక్ష్మిగాంచి. ౩౫౮

క. చపలాక్షి బడబవగుచున్ । దపమేటికి సల్పెదవు సుధాసింధువునం
దపరిమితవైభవంబున । విపులమహిమనుండకిట్టి వేసటయేలా. ౩౫౯

క. సర్వార్థదుండు నీపతి । సర్వేశుఁడు వాసుదేవ సంజ్ఞుఁడు నిత్యుం
దుర్వీజనసంసేవ్యుఁడు । దర్వీకరరాట్శయనుఁడు ధన్యుండుగదా! ౩౬౦

గీ. భుక్తి ముక్తిదుండు పుణ్యుండు విష్ణుండు । వాని విడిచి యిట్లు చ్చివతేల
పతియె దేవుఁ డన్యభావంబు కొఱఁగాదు । పడఁతి కెన్న డేడుగడ యతండె. ౩౬౧

క. నారాయణుండు నిన్నుఁ । బేరెద నిడి సాటిలేని పేరిమితోడం
గూరిమిసూపఁగ నిపు డే । నేరమి ప్రాపించె నయము నీ కిది తగునే. ౩౬౨

క. నావుఁడు విని మ్రొక్కి రమా । దేవి మహేశాన విష్ణుదేవుఁడు శప్తం
గావించె నన్ను నశ్విని । నైవచ్చితి నిన్ను గొలువ నతని యనుజ్ఞన్. ౩౬౩

గీ. అతని శాపముక్తి నడిగిన దనయంత । కొడుకు గలుగునాఁడు గుదురు ననియె
శంభు వేఁడుమనియె చనుదెంచితిని నిన్ను । గొలువ భర్తృనాజ్ఞ గోతురంగ. ౩౬౪

క. పతిగూడక పుత్రుం డే । గతి గలుగును నీదు వరము గాంచితినేనిన్
సతతంబు మేలు నా కగు । నతతరకరుణావిశేష హర ఫణిభూషా. ౩౬౫

క. నీవు హరికి భిన్నుండవు । కావుసుమీ నేను భిన్నగాను గిరిజకున్
దేవేశ్వర మీయైక్యము । త్రోవయు మాయైక్యమును నెఱుంగుదును శివా ! ౩౬౬

ఉ. నావుఁడు నో మృగాక్షి సురనాథులు మౌనులుయేని యైక్యస
ద్భావమెఱుంగలేరు తమ పాండితిబూని వితండలాడుచున్
శైవులు కొంద ఱీశ్వరుఁడె సామి యటందురు, వైష్ణవుల్ స్వభూ
దేవుఁడె యంద్రు మూఢులయి దేవిరొ యెట్టు లెఱింగితీ వనన్ ౩౬౭

సీ. వినుము మేమిద్వరమును రహస్యముగ గేళీగృహంబున నుండ లీల శౌరి
పద్మాసనము వైచి పరమనిష్ఠను ధ్యానపరుఁడయి యుండంగ నెఱిఁగి యేను
దరి వేచి కన్నులు దెరచిన గని మెల్లఁ జని వినయంబున సరస నిలచి
యెల్లదేవతలకు నీ వెక్కుడని యెంచి పొలవెల్లిని నేను బయలుదేరి
నపుడు దలచిఁతి వలచితి నట్టి నీవు । ధ్యాన మొనరించె దెవ్వని హరి ముకుంద
తెలుపవే యన నొక్కింత యెలనగవున । పలికె నారాయణుండు కృపామయుఁడయి. ౩౬౮

క. గౌరీవల్లభుఁ దలఁచెద । నారీ నే నతనిగొల్తు నన్ను జపించున్
వారక నతఁడును మాకు । న్వేరింతయు లేదుసుమ్ము విశ్వములోనన్. ౩౬౯

క. శివునకు నే బ్రాణంబును । శివుడుం బ్రాణంబు నాకు శివకేశవభే
దవిహీనులైనవారలె । ప్రవిమల విజ్ఞానపరులు భామిని వింటే. ౩౭౦

క. నను దేవుఁ డనుచు శివునిం । గనకుండెడువాఁడు పాపకర్ముఁడు నీచుం
డును గష్టుఁడు దుష్టుఁడు నై । చను నరకమునకును వాఁడు సచ్చిన పిదపన్. ౩౭౧

క. కావున హరికిం బ్రాణం । బీవని ధ్యానించితిని మహేశా నన్నుం
గావవె కృపతో వల్లభు । నేవిధి నేఁ గలయుదాన నేరూపమునన్. ౩౨౨

గీ. పెండ్లి యాయెనేని పిచ్చి దా గుదురును । పిచ్చి కుదిరెనేని పెండ్లియగును
సుతుఁడు గల్గెనేని పతి నాకు లభియించు । పతి లభించెనేని సుతుఁడు గలుగు. ౩౨౩

క. ఈ యన్యోన్యాశ్రయమును । బాయంజేయంగదయ్య పరమేశ్వర ని
త్యాయ శివాయ భవాయ హ । రాయ నమస్తే యటంచుఁ బ్రణతియొనర్తున్. ౩౨౪

వ. అనిన విని పరమేశ్వరుండు దయార్ద్రహృదయుండై భయంబుడుగుము హయరూపుండై నారాయణుండు నిన్ను జెందునట్లు జేసెద. నతనివలన తత్సముండగు సుతుం గాంచి యేకవీరుం డను నామం బిడి పెంపుము. వానివలన హైహయవంశంబు విస్తరిల్లు. హృదిస్థయగు పరమేశ్వరిని మఱచితివి. ఇది తత్ఫలంబు కావున తచ్ఛాంత్యర్థంబు పరదేవతం గొలువుమని యానతిచ్చి శివుండు గౌరీసమేతుండై యంతర్ధానంబునొందె. నంత బడబారూపిణియగు పద్మాదేవి జగదంబం ధ్యానించుచుండె నంత. ౩౨౫

క. సిరికి వరమిచ్చి పురహరు । దరిగి నిజాలయమునకు మహాగుణశీలున్
సరసు నురుతరజవుం గణ । వరు నొక్కని జిత్రరూపుఁ బంచె రయమునన్. ౩౨౬

క. హరిపురికి నతనితోడన్ । నరహరి సిరి నిట్టులలచ న్యాయమె కొనుమీ
కరుణామయుండ వగుచున్ । సరగున ననుమనుచు దెలుపఁ జని యాతండున్. ౩౨౭

మ. కలఁగన్ జూచె మహోరుహర్మ్యవిలసద్గోపురత్నతత్ప్రాకార
స్థలహీరాంచితకుడ్యనీలవలభీసోపానయుక్పుష్యమం
జులమై దూర్యకవిద్రుమోజ్జ్వమణికాన్త్యాభసుక్తావిశ్వం
ఖలగోమేధికకాంత్యనంతము సువీక్ష్యంబైన వైకుంఠమున్. ౩౨౮

వ. చూచి పరమానందంబునం దేలుచు ముకుందమందిరద్వారంబు సేరి తత్పాలకులగు జయవిజయులం గాంచి పరమేశ్వరుని దూతలు వచ్చియున్నారని మీ దేవునకుం జెప్పుండనిన విని జయుండు సని వాసుదేవునకు నమస్కరించి వాకిటికి శివదూతలు వచ్చియున్నారు, చిత్రరూపుఁడు తమ దర్శనంబు సేసి మహేశ్వరుని వచనంబులు విన్నవింపం దలంచియున్నవాఁ డనిన విని భగవంతుండగు నారాయణుండు వైళంబ గొనితెండనిన జయుండు వచ్చి యది సెప్పిన విని చిత్రరూపుండు హరిం జేరి నమస్కరించి నిలువంబడిన జనార్దనుండు. ౩౨౯

క. కుశలమె శివునకు గౌరికి । గుశలమె గణపతులకెల్ల గూరిమి నాకున్
విశదీకరింపు మిపుడు గి । రిశుఁ డేటికి నిన్ను బంపె బ్రీతి నటన్నన్. ౩౩౦

క. నీ లలనామణి యిందిర । కాళిందీతటమునందు గడు నిష్ఠఁ దపో
లీల వసియించె నేటికి । నీలాగున బంపి తఖిలమెఱిగియును హరీ! ౩౮౧

క. సకలార్థసిద్ధిదాయిని । ప్రకటితగుణధన్య బాడబత్వముగని యెం
దకు వానకు నోర్చి కడున్ । దికమకనొందంగఁ జూచెదే జగదీశా! ౩౮౨

మ. సిరి సామాన్యయె యెల్లదేవతలు సంసేవింత్రు సంపత్పరం
పరకున్ మూల మదేకదా నిరుపమప్రాగల్భ్యసంతోషితా
మర దేవీజనతామతల్లి నిరతామ్లానప్రభాపుంజ బం
ధుర దీనిన్ విడనాడి యెట్టు నిలువం దోచెన్ జెలీ చెప్పుమా. ౩౮౩

గీ. కలిమిలేకయున్న బలిమియులేకున్న । జాయ విడుచువాఁడు జగతిఁ గలఁడె
తప్పులేనిదాని దరలింప న్యాయమా । తప్పుఁగాచునట్టి గొప్పవాఁడ! ౩౮౪

క. సమయజ్ఞులు భార్యామూ । ల మిదం గృహ మందు రిదియు లక్ష్మి ధనమూ
ల మిదం జగ త్తటందురు । శమము విడిచితేల యింతసాహసమగునే. ౩౮౫

గీ. మగువవలనఁగాదె మగవాని సుఖములు । మగువ విడిచెనేని పగతురెల్ల
నగుదు రింతె దాన నగు ఫలంబేమి నీ । కెఱుకగానిదెద్ది యిందిరేశ! ౩౮౬

గీ. సర్వలక్షణసంపన్న సాధ్వి సత్య । నిరత నిత్యానపాయిని నీకు దాని
మాన నేలకలిగెనొక్కొ మనసు కృష్ణ । వాసుదేవ ముకుంద శ్రీవాస చక్రి. ౩౮౭

క. కాంతావిరహజదుఃఖం । బింతని నేఁ జెప్పఁగలనె యెఱుఁగవె గౌరీ
కాంతను విడనాఁడితి మును । పంతంబున దక్షునింట బడఁతి మడిసెనన్. ౩౮౮

క. నాకంటె విరహశోకము । గైకొన్నయతండు గలఁడె కావున వినుమా
లోకేశ యనుభవజ్ఞా । నాకలితుఁడ నాదు పలుకు లతిహర్షమునన్. ౩౮౯

వ. వినుము మఱియు. ౩౯౦

గీ. ఏమిసుఖము బొంది తిన్నాళ్లు లంగనా । రహితవృత్తి నుండి యహహ నీవు
కాన వేగ వచ్చి కాంత నాశ్వాసించి । బాడబంబ వగుచు బడయుఁగు సుతు. ౩౯౧

వ. అని శంకరుండు విన్నవింపుమనెనని చిత్రరూపుండు సెప్పిన విని జనార్దనుండు హయరూపధరుండై లక్ష్మి యున్నచోటికిం జనిన సుభయులు నొండొరు నెఱింగికొని సంగమింప నిందిర గర్భంబుదాల్చి సుందరుండును, సుగుణోత్తరుండును నగు నందనుం గాంచినం గని నారాయణుండు బాడబదేహం బిఁక విడువు మని నుడివినం గమలాలయ యో మనోహరా! విను మని యిట్లనియె. ౩౯౨

గీ. చిన్నకూన వీఁడు చిన్నారి నెమ్మోము । కనులు దెఱవలేదు కందు నెట్లు
విడువఁగలను నాకు వీనిపై స్నేహంబు । సహజ మేమిసేయఁజాలుదాన. ౩౯౩

గీ. విజనభూమి వీని విడిచి నే నేగిన । పెంచువారు లేరు గాంచువారు
లేరు రారు బెబ్బులే మ్రింగునో యెల్గు । బోతు నోటి కొక్క బొక్కె డగునొ. ౩౯౪

వ. అనిన. ౩౯౫

చ. వెఱవకు మంగనా యిచట వీనికి నొక్కభయంబులేదుసూ
చిఱుతను నేన ప్రోచెదను జెల్వ యొకింతయు దూలనీక నే
నెఱుఁగనె తుర్వసుండను మహీశుఁ డపత్యముగోరి నిష్ఠమై
జరిపె దపంబు వాఁ డితని సాకును బుత్రునిగా ముదంబునన్. ౩౯౬

వ. అని చెప్పి దివ్యదేహధారిణియగు పద్మాలయం గూడి వైకుంఠుండు నిజనివాసంబున
కరిగె. నంత బాలుం డున్నచోటికి చపుండను విద్యాధరుండు నిజకామినియగు మదాలసం
గూడి వచ్చి యేకాకియై యతిసుందరుండై తేజరిల్లుచున్న శిశువుం గాంచి యెత్తుకొని
నిజాంగన కిచ్చిన. ౩౯౭

ఉ. ముద్దులుమూటగట్టు మొగముం గని బిడ్డని జంకనెత్తి యా
ముద్దియ ముద్దుబెట్టుకొని ముచ్చటదీరఁగ గౌగలించి దా
నొద్దిక నేర్పునన్ గరము నోర్పున ప్రేమను జూపి పొత్తులం
దిద్దుచు జోలబాడుచు పతిం గని పల్కె మదాలసాఖ్య దాన్. ౩౯౮

ఉ. ఎవ్వనిబిడ్డ వీఁ డితని నేటికి నిక్కడ డించిపోయె నా
కివ్విధమున్ వచింపుమన నిందునిభానన నే నెఱుంగ నేఁ
డవ్విబుధాధినాయకు నిదంతయు నే నడుగంగఁ బోయెదన్
జివ్వన నాతఁడే మనకు సెప్పును దేవుఁడొ దయ్యమో సతీ! ౩౯౯

గీ, ఆతఁడు సెప్పిన మార్గంబు ననుసరించి । వీని బెంచెదగాక యో విమలవదన
ఇట్టియెడ నట్టుపుట్టులు గట్టిగాను । పట్టి కనిగొని సేయుట పాడిగాదె. ౪౦౦

వ. అని విమానంబుపై యిరువురు స్వర్గంబున కేగి సింద్రుం దర్శించి నమస్కరించి బాలుం
జూపి దేవదేవా! కాళిందీతమసాసంగంబున నిబ్బాలుండు మా కబ్బె. వీఁ
డెవ్వని కొడుకు, వీని దలిదండ్రులు విడువం బనియేమి. వీనిం గొమరుని జేసికొని
పెనుచుకొను దమకం బున్నయది. వీఁ డతిసుందరుండు, నా యిల్లాలు తన యుల్లంబున
నీ పిల్లవానిం గాంచినదిమొదలు తల్లినని యుల్లాసంబు పడుచున్నయది. దేవవల్లభా!
యీ ఫుల్లాబ్జనేత్ర తెల్లంబుజేసి వాల్లభ్యంబు జెల్లింపవే. యనుడు నల్ల నగి యల్లేఖాధిపుండు
మెల్లన నిట్లనియె. ౪౦౧

గీ. వీఁడు వాసుదేవు బిడ్డండు హయరూప । ధారియైన శౌరి దగిలినట్టి
తురగియైన పద్మ తుందంబున జనించె । హైహయాఖ్యుఁ డీతఁ డనఘచరిత. ౪౦౨

కం. వీనిని యయాతి యను నృపు । సూనున కీదలఁపుఁజేసె సొంపెసలారన్
బూని యతఁ డరుగుదెంచును । గాన నచటికేగి నిలువఁగాఁదగు నీకున్. ౪౦౩

వ. అ య్యయాతిసూనుం డాశ్రమంబునకు వచ్చిన బిడ్డం గానక దుఃఖించునో కాన నీవు వేగిరంబ చని యచ్చట విడువుము. నావుఁడు వాఁ డతివేగంబున బోయి బిడ్డ నచట విడిచి స్వనివాసంబు సేరె. నంత లక్ష్మీకాంతుండు సదారుండై విమానంబుపై నెక్కి నృపాలకుకడ కేగిన వాఁడు హరిదర్శనంబునకుఁ బరమానందపరవశుండై నేలంబడి ప్రణామంబుసేసిన లేవనెత్తి, యాశ్వాసించి నారాయణుండు కృపారసంబు సూప గడు నలరి యుత్సుకంబున భక్తియుక్తుండై యిట్లనియె. ౪౦౪

దండకం. దేవాదిదేవా జగన్నాథ దీనార్తివిచ్ఛేద మత్స్యావతారా లసత్కచ్ఛపాకార వారాహమూర్తీ నృసింహాకృతీ వామనా రామ రామా బలా యౌబలా నీ మహోదారరూపంబు దర్శించితిన్ నే కృతార్థుండ నైతిన్ జడుండన్ మునీంద్రుల్ సురేంద్రుల్ కనంజాల రీ దివ్యరూపంబు నా పూర్వపుణ్యంబునంజేసి నీయంతట న్నీవ విచ్చేసినావయ్య యాశాపరత్వంబునన్ జిక్కి సంసారవారాశిలో మున్గి యున్నట్టి పాపాత్ముడన్ గామము న్క్రోధమున్ లోభమున్ మోహమున్ మత్స రంబున్ మదంబున్ గడున్ రాగమున్ ద్వేషమున్ దృష్ణయుం గల్గి నీ సేవ గావింపగానేర కీలాగు వర్తిల్లుచున్నారమయ్యా మముం బ్రోవుమయ్యా నమస్తే నమస్తే నమస్తే యటంచున్. ౪౦౫

కం. అనిన విని వాసుదేవుం । డనియె సుధామధురములగు వ్యాహారములన్
జనవర కోరుము వరముం । జనువున నే నిపుడ నీ కొసంగెద న్నృపతీ. ౪౦౬

కం. అనవుఁడు విని నృపతి నృహరి । కిని మ్రొక్కి ముకుంద శౌరి కృష్ణా నాకుం
దనయుని దయసేయు మనన్ । వనజాక్షుం డలరి యిట్లు పలికె మహీశా. ౪౦౭

గీ. వినుము రాజేంద్ర కాళింది యనెడు నదియు । తమసయును సంగమించినతావునందు
నేను రమయందు గాంచిన సూనుఁ డున్న । వాఁడు నీబిడ్డ యయ్యెడు వానిఁ దెమ్ము. ౪౦౮

గీ. తెచ్చి పెనుపు మనిన తృప్తుడై నరపతి । శౌరికృపను గోర్కె దీరెననుచు
నరిగె నంత విష్ణు డంతర్హితుండయ్యె । సుతుని సుందరాంగుఁ జూచె రాజు. ౪౦౯

తరళ. కాలిబొటిమనవ్రేలు నోటను గట్టిగా నిడి కుడ్చుచున్
బాలు లేవని డీల నొందక పాణిపాదము లార్చుచున్
లీల గూర్కుచు నోలి నవ్వుచు లేచి చూచుచు బొరలుచున్
బాలుఁ డాడఁగఁ జూచె న జ్జన పాలుఁడర్మిలి దేలుచున్. ౪౧౦

ఉత్సా. మురువదెంత హొరువదెంత మురిపెమెంత చాగరే
మెరుగులెంత హొరుగులెంత మేనివన్నెలెంత హా
పరువమెంత గరువమెంత పంతమెంత బాపురే
చిరుతకూన ముద్దువగలు చెప్పశక్యమా భళీ. ౪౧౧

ఉత్సా. తమ్మివంటి నెమ్మొగమ్ము తద్ద ముద్దులొల్కఁగా
ముమ్మరమ్ములమ్ము రొమ్ము ముందు సిరుల దెల్పఁగా
కమ్మదనము లొల్కి పాలుగారు చెక్కు లొప్పఁగా
చిమ్మచీకటు ల్త్రొలంగు చిట్టికూన వన్నెలన్. ౪౧౨

వ. అని హరిం ధ్యానించి యానందబాష్పంబునిరుద్ధగద్గదకంఠుండై నరపతి కన్నులుమోడ్చి
చేతులు జోడించుకొని. ౪౧౩

ఉపేంద్రవజ్రము.
తపంబులో నెంతయు దుష్కరస్థితిన్ । బ్రపూర్ణనిష్ఠన్ బహుహాయనంబుల్
బ్రపన్నవృత్తిన్ బడియుండగా దా । గృపన్ సృజించెన్ గిరిధారి నిన్నున్
సీతల్లి శ్రీదేవి కనెంగదా నిన్ । నీతండ్రి పంకేరుహనేత్రుఁ డెన్నన్
బ్రీతిన్ మదర్థంబుగ పీడ్వడెని । న్నీతావునందుం గృప నెంచి నాకై. ౪౧౪
నన్నుద్ధరించు నా యన్న రారా । కన్నార నిన్ను గన్గొంటి తండ్రీ
యెన్నాళ్ళ కీశ్వరేచ్ఛాప్తి గల్గెన్ । చిన్నారి ముద్దుచిల్కా కుమారా! ౪౧౫

వ. అని చిన్నబిడ్డ నెత్తుకొని తనరథంబున నిడుకొని స్వపురమార్గంబు పట్టి చనియె. నంతట
పౌరవర్గంబులతో సచివు లెదుర్కొని, వందిమాగధులు పొగడ, గాయకులు పాడ, నర్త
కులు నటియింప నరపాలుఁడు పురంబు ప్రవేశించి సమాగతజనంబుల నాశ్వాసించి
నగరికిం బోవు నవసరంబున. ౪౧౬

క. తత్తరపాటున బురసతు । లత్తరి చిన్నారి ముద్దులయ్యాట లీలా
చిత్తజుఁడట శిశుమణి గని । వత్తమనుచుఁ బనులు మాని వడి మేఁడలపై. ౪౧౭

క. పరుగున వచ్చి మిటారులు । చిఱునగవులతోడ నొకరి చెట్ట లొకరు బల్
మురువుగ బట్టుకొని నిలచి । చిఱుతని గనుగొనిరి భద్రచిహ్నాని వేడ్కన్. ౪౧౮

చ. ముసలితనంపుగొంగ వడి ముట్టి రదంబుల నూడగొట్టి బ
ల్కసి తమభాగ్యము ల్గొనఁగ గబ్బితనం బిఁకచాలునంచు నీ
రసగతి గంధరాయణపరాయణతం జనుమాడ్కిఁ బొక్కుటన్
మెసలుచను ల్తగన్ శిశుమణిం గనవచ్చెను లోల యత్తరిన్. ౪౧౯

క. ఓయమ్మ వింటివా యీ । కాయజసన్నిభుఁడు తొంటి కాయజుబోలెన్
కాఁపుజునాయనకే శిశు । వై యిందిరయందు నుదయమైయుండెనదే. ౪౨౦

క. కాముఁడు వీనికి నన్నట । సోముఁడు మామఁట మహేంద్రసూనుఁడు వింటే
కామిని పిన్నబ్బట యిం । కేమి కొరఁత యంద మడుగనేటికి నింకన్. ౪-౨౧

గీ. ఎంత పుణ్యమమ్మ యీరాజునకు మహా । లక్ష్మి గన్న కొడుకు లక్షణాఢ్యు
వాసుదేవుఁ డిచ్చె వాని కృపారసం । బరయ నద్భుతముగదమ్మ కొమ్మ ! ౪-౨౨

వ. అని యొండొరుగూడిఁ యాడుచు కుసుమంబులను, లాజంబులును జల్లుచుండ నృప శార్దూలుండు సచివవర్గంబులతో నిజగృహంబు ప్రవేశించి మనోజ్ఞ యను తన సుందరికిం బాలు నిచ్చిన నత్యంతానందంబున నా సుందరి యంది తన ప్రాణవల్లభున కిట్లనియె. ౪-౨౩

క. ఈ చిన్నకూన మోముం । జూచిన విస్మయము వొడము సుకృతి యెవతకున్
నోచిననోములఫలం బగు । నో చెపుమా యెట్లు దక్కెనో నీచేతన్. ౪-౨౪

క. అనవుఁడు రా జిట్లను నో । వనితామణి వీని గనియె పరలక్ష్మి జనా
ర్దనుఁ డొసఁగె నాకు దయతోఁ । దనయు నొనర్చికొనుమనుచుఁ దపము ఫలిమిచేన్. ౪-౨౫

క. అని చెప్పిన విని సుందరి । మనమున నానందవార్ధిమగ్న యగుచు నో
జననాథ మనల భాగ్యము । ఘనతరముగదా యిఁకేమి గావలె మనకున్. ౪-౨౬

వ. అని యిట్లు భార్య పలుక విని సంతసించి రాజు పుత్త్రోత్సవంబుచేసి, జాతకర్మాది సంస్కారంబులు గడపి అత్యంత ప్రేమంబుతోఁ బెనుప దినదినప్రవర్ధమానుండైన శిశువునకు నాఱవమాసంబున నన్నప్రాశనంబు చేసి, తృతీయవర్షంబున జూడాకరణం బొనర్చి, పదునొకండవయేట మౌంజీబంధము గావించి, సకలవిద్యాపరిపూర్ణుం జేసి, ధనుర్వేదపారంగతుం బొనర్చి, పట్టాభిషేకంబునకు సమకట్టి పుష్యార్కయోగసంయుక్తంబగు దినంబున వేదపారంగతులగు విప్రులచే యధావిధిగా నభిషేకంబు చేయించి, బ్రాహ్మణులకు గో భూ హిరణ్యాది దానంబు లనేకంబులఁ జేసి, యా యేకవీరుండను కుమారునకు రాజ్యం బొప్పించి రాణితోఁగూడ మైనాకశిఖరంబు బ్రవేశించి పత్త్రఫలాశనుండై కాలంబు గడుపుచుండె. వంత గొన్నాళ్ళకు నృపతి సరేంద్రుం డింద్రపురికిం జనియె. నిచ్చట నేకవీరుండు ధర్మంబు విడువక రాజ్యపరిపాలనంబు సేయుచు సకలభోగంబు లనుభవింపుచు. ౪-౨౭

మ. ఒకనాఁ డా జనపాలమౌళి మహిమాయుగ్జాహ్నవీతీర పృ
థ్వీ కమాత్యావళిగూడి యేగి యచటన్ వీక్షించె నుద్యత్తరు
ప్రకరం బంచితకోకిలారవశుకాలాపాభిరామంబు చం
ద్రకిమందారవసాంద్రమున్ మునిగణోదారాశ్రమం బర్మిలిన్. ౪-౨౮

క. నీవారి వర్ణగింజలు । త్రోవల రాలుటయు హోమధూమము లెందెం
దే పరిమళ్ళను గొల్లత । లాసులునుం బెంపు తేళ్ళు నట గనవచ్చెన్. ౪-౨౯

క. మడిబట్టి లార వైచిన । గద దండెంబులును నేతికంపు పొగలు మూ
రెడు చేతెడు బారెడుగా । వడి నల్లిన దబ్బచాప వరుసలు దోచెన్. ౪౩౦

గీ. మల్లె చేమంతి గన్నేరు మొల్ల జాజి । పొగడ గురివింద సంపంగి పొన్నపూల
చెట్లవరుసలు సందండె జీడిమావి । మావి నేరేడు చాళ్ళు గన్పడియె నచట. ౪౩౧

వ. ఇట్లొప్పుచున్న గాంచి పృథ్వీనాథుండు దాని ఋష్యాశ్రమంబుగా దెలిసికొని పాదచారియై యొక్కరుండ సని తోటం జొచ్చి జాహ్నవీతోయంబు జాలుగారు నొక కొలనుం గని యందు రమ్యంబై యతిసుగంధాఢ్యంబగు యలరు నొక జలజంబుగని దానికిం దక్షిణంబున నట్టె జూడ. ౪౩౨

సీ. పొంగారు బంగారు రంగారు మేనితో నెరికప్పు సిరికప్పు నీటుతోడ
కంబునాడెంబు తోరంబూను గళముతో జపకొన్న రవ సన్న కవునుతోడ
తెగటీకు దగజోకు చిగురాకు మోవితో మునుదోప జనుపూప చనులతోడ
వగరువ్వ తొగపువ్వ జిగినవ్వ కనులతో తొండంబు గ్రొండంబు దొడలతోడ
సంపగుల చెంపగిలు నాస సౌరుతోడ । విదియనెల జదియగల నెన్నుదురుతోడ
జక్కవలు నిక్కు బలుచక్కి గ్రక్కజిక్కి । యొక్క చక్కనిచక్క తళుక్కుమనియె
౪౩౩

క. కన్నియ కన్నీరొల్కంగ । గిన్నర కంఠమున మృదుల గీతిక బాడం
గన్నద లోనన నేడ్చెన్ । మన్నీ డది సూచి మిగుల మాథురి దోపన్. ౪౩౪

ఉ. ఇంపులు సొంపులుం గులుకు నెవ్వతె వెవ్వని బిడ్డ వందముల్
ముంపెసలార నివ్వటిలు ముక్కిడి కోటెరు దీర్చినట్టులం
దెంపున స్వర్గముం డిగిన దివ్యల కన్యకవో భుజంగివో
చంపకగంధి చెప్పఁగదె తయ్యన నీ భయమెల్ల దీర్చెదన్ ౪౩౫

క. నా రాచరికమునందుం । జోరాదిభయంబు రాక్షసులభయమును నా
గారివ్యాఘ్రభయము వా । మోరూ కలదన్నవార్త యుంచెదనటవే ౪౩౬

వ. కావున నీవృత్తాంతంబుం దెల్పుము నిన్ను రక్షింతు ననిన విని మృదుస్వనంబునం బ్రపాన్వితయగుచు నొక్కింత దగ్గుత్తికదోప మెల్లన నిట్లనియె. ౪౩౭

## —: ఏకావళి వృత్తాంతము :—

సీ. వినుము భూపాల నా వృత్తాంతమెల్లను విశదీకరింతు సవిస్తరముగ
రథ్యానామకుఁడు మూరాజు వానిపడంతి రుక్మరేఖ యనంగ రూఢినెసగు
వా రసపత్యులై వారక జన్నంబు గావింప నగ్నిలో గలిగె నొక్క

కన్య యేకావళి కమనీయతరగాత్రి దాని గైకొని రాజు తడవు లేక
పత్ని కొప్పగించి పరమసంతోషంబు వెలయ మంగళంపు విధులు దీర్చి
యజ్ఞపూర్తి జేసి యవనీసురులఁ బంపి తనయువలెనె తనయ బెనుచుచుండె. ౪౩౮

క. నే నా భూనాయకుని ప్ర । ధానుని కూఁతురను దెల్పెద యశోమతియా
నా నామము రాట్పుత్రికి । నేను వయస్యనయి యుందు నిరతము భూపా! ౪౩౯

క. ఒడయని బుడుతయు నేనును । దడబడ కెల్లపుడు గూడి తగు నడవడులన్
విడువక యుందుము న న్నా । బిడ యాబిడ నేను మాకు భేదము గలదే. ౪౪౦

క. ఈ జాహ్నవియొడ్డునకున్ । రాజీవములను గొనంగ రాకలు మాకున్
రాజిల్లు నప్పుడప్పుడు । రాజుం బంపించు సుభటరాజిని మాతోన్. ౪౪౧

క. మేమిరువుర మిట రా నది । యేమో రక్కసుఁడొకం డహీనబలుఁడు మా
మోములఁ గనుగొని తటుకున । మామీదికి రాఁ దొలంగి మనసులుగలఁగన్. ౪౪౨

గీ. సేనలోసఁ జొచ్చి చేటుమూడె నటంచు । గోలపెట్టుచుండ గాలకేతు
నామకుండ ననుచు నవమోహనాంగి నే । కావళిన్ విలోలితాక్షిఁ జూచి. ౪౪౩

క. బుడిబుడి గదగొని త్రిప్పుచు । వడివడిగా నరుగుదెంచి వనితామణి దా
గడగడవణకుచుఁ దడిబిడి । యడలగ మెడనిడుక పోవ నసురున కేనున్. ౪౪౪

గీ. నన్ను గొంపొమ్ము విడువు మీ చిన్నదాని । ననుచు వెంబడిబడి యెంతగ నడిగినను
వినక గొంపోవ భటు లార్చి వివిధగతుల । బోరినను వారి జీరికిం బూన కేగె. ౪౪౫

గీ. వాని వెంబడించి నేనును నేగితి । సకియ నన్నుజూచి స్వస్థతయగుచు
నేమిసేయుదాన నిటుర మ్మనఁగ వాఁడు । రథమునందు దాని ప్రక్కన యిడె. ౪౪౬

వ. ఇట్లు మమ్మిరువుర స్వపురంబునకుం గొంపోయి, రాక్షసులం గాపువెట్టి, మరునాఁ డేకావళి సమీపంబునకు వచ్చి యచ్చపలుండు నన్నుంజూచి దుఃఖాతురయగు నేకావళికి బోధించి, నాకుం భార్యం జేయుమన విని నే నో రాక్షసేంద్రా! నీవ యడుగుము, నా మాట అది లక్ష్యము సేయదు, నావుడు నమ్మద్దియం పరిసి ముద్దులాడి! నీకు నేను దాసుండనై కొల్తు నన్ను బరిగ్రహింపుమని వేడందొడంగిన నేకావళి యిట్లనియె. ౪౪౭

చ. పిత మును రాజనందనుని బెండిలిసేయ దలంపువెట్టె నా
యతభుజుఁడైన హైహయున కర్పితనైతి నిఁకొండు మానిసిన్
బతి నొనరించుటెట్టులు సనాతనధర్మమువోవనాడి నీ
వతికుశలుండవయ్యు నిటు లాడుట ధర్మమె ధర్మపద్ధతిన్. ౪౪౮

శా. నాతండ్రిన్ బెడమాటలన్ బదరి కన్యాధర్మమున్ గెంట నే
స్వాతంత్ర్యమ్మును బూనవచ్చునె భళా సర్వజ్ఞులౌ మీర లీ
రీతిన్ బల్కిన నింక బ్రాకృతులు పేర్మిన్ గందురే ధర్మ వి
ఖ్యాతం బెంగిలికూటికాసపడువారా మిమ్ముబోటుల్ ధరన్. ౪౪౯

వ. ఇట్లెన్నివిధంబులం జెప్పిన. ౪౫౦

గీ. మదనమోహితుఁడై వాఁడు మమ్ము విడఁడ । దేమిసేయుదుమయ్య మా కేది దిక్కు
ఘోరరాక్షసరక్షితాగారమందు । చెలియ పాతాళమున నుండె క్షితితలేంద్ర. ౪౫౧

వ. అనుడు విని రా జిట్లనియె. ౪౫౨

క. నీ విచటి కేలవచ్చితి । వా వీయనిచెంతనుండి యంగన నీకున్
రా వీలుచిక్కెనటవె మ । హా విస్మయమయ్యెఁ దెలుపు మంతయు నాకున్. ౪౫౩

క. తెలిపితివి హైహయుని జెలి । వలచె ననుచు హైహయుం దెవఁడు నే నొకఁడన్
గలను మఱియొకఁడు లేఁ డిల । వలచెనటవె రాజతనయ వనితా నన్నున్. ౪౫౪

క. ఈ సందియంబు దీర్చిన । నో సరసిజవదన శత్రు నుక్కడఁచి చెలిన్
నీ సముఖమునకుఁ జేర్చెద । మోసపడినతావుఁ జూపుము రయంబారన్. ౪౫౫

చ. నరపతి కూఁతుగో దెలుగునా యటులైనను దాని దుఃఖమున్
దరలఁగఁజేయు నుద్యమము దాఁ బనిబూని యొనర్చెనా మహా
భరముగదా వరాంగి కటు బంది వసించుట శక్తి చాలునా
యరిని జయింప రాజునకు నంతయు నా కెఱిగింపు మంగనా. ౪౫౬

క. నీమాటలు వినినంతనె । నామనము గలంగ దొడఁగె నాళీకముఖీ
తామరపాకున నీరై । కోమలిగతి యెట్టులున్నొకో యిటమీదన్. ౪౫౭

ఉ. ఎప్పుడు కన్య నేను విడిపించెద నెప్పుడు జూచెదన్ ముదం
బెప్పుడు గాంచెదన్ సరస నెప్పుడు నిల్చెద ముద్దుముద్దుగా
నెప్పుడు మాటలాడెదఁ జెలీ! నిను నీ చెలి గూడి యాడఁగా
నెప్పుడు మెత్తునో సరస మెప్పుడొ యెప్పుడొ యెప్పుడో కదే. ౪౫౮

గీ. సంకటము వాసి యెట్లు రాఁ జాలితీవు । కన్నె యేగతి వగచునో నిన్ను విడచి
మనసు నిలువకయున్నది మంజువాణి । దారిఁజూపుము పోయెద దైత్యుఁ జంప. ౪౫౯

వ. అనిన విని. ౪౬౦

గీ. చిన్నతనమున నే నొక్క సిద్ధువలన । భగవతీమంత్రమును నేర్పబడితి దాని
బీజయుక్తంబుగాఁగ జపించి యుందు । రాఁగలిగితిని హైహయరాజచంద్ర. ౪౬౧

గీ. వచ్చి యిచ్చట జగదంబ మెచ్చి కొలిచి । యున్న స్వప్నంబునందు నా కొక్కవేళ
గానవచ్చి దయారస కలితయగుచుఁ । జెప్పె నిట్లని భూపాలసింహడింభ! ౪౬౨

గీ. హైహయుం డేకవీరసమాఖ్యుఁ డిచట । కరుగుదెంచును మామకీయార్చయందు
నిపుణుఁ డాతండు రాక్షసుని వధియించి । ప్రీతి నేకావళిని విడిపించు నిజము. ౪౬౩

క. వాఁ డేకావళిబతియగు । నోడకు మిఁక సంచుఁ బల్కి యోగి నేగెను నే
తే డెపుడు వచ్చునమచున్ । జూడఁగఁ జూడంగ నీవు జూపట్టితివో. ౪౬౪

వ. అనిన విని రా జిట్లనియె. ౪౬౫

గీ. నేనె హైహయుండ నిక్కంబు నమ్ముము । కన్నె జూడకున్న గడియసేపు
నిలువలేను దాని సీటును గోటును । దెలిపి యున్నచోటు దెలుపవైతి. ౪౬౬

గీ. హైహయునిదక్క గోర దేయధికునేని । గోరదని దెల్పితిని నాకు గూర్చుదాన
వగుచు వే నెట్లు తాళుదు నంబుజాక్షి । యోరిమిని జెప్పవే కన్య యున్నచోటు. ౪౬౭

గీ. ఈవు నన్ను గొనుచు నేగుము దరళాక్షి । యున్నచోటునకును నుగ్రదనుజు
జీచమడచి తెత్తు రాచకన్నియ నది । యెంత యడలునొక్కొ యింతవఱకు. ౪౬౮

క. అనిన విని యశోవతి దా । మనమున గడు నలరి రాజమాతంగ జగ
జ్జననీమంత్రమె మార్గము । కనుమని మంత్రింప నొక్క క్షణమున వారల్. ౪౬౯

వ. పాతాళంబునకుం జని రాక్షసగృహద్వారంబు ప్రవేశించిన దూతలు సూచి దనుజవీరుం
జేరి మహారాజా! యశోవతితోడ నొక మహావీరుండు మహాసైన్యసమేతుండై యుద్ధపరికరం
బులతో వచ్చుచున్నవాఁడు. నావుడు విని రాక్షసుండు దనుజవీరులారా శస్త్రపాణులై
మీరును నెదిరింపుడని యాజ్ఞాపించి కాలకేతుండు సమీపస్థయగు నేకావళిం గాంచి
యిట్లనియె. ౪౭౦

ఉ. ఎవ్వడు వీఁడు నీజనకుఁ డేనియు సంగర మాచరింప నే
బువ్వుల బూజసేయుదు ప్రభూతమహామణిరాజి నిచ్చి మేల్
బువ్వముబంతి జేసెదను బొల్పుగ గట్నము లిచ్చి పంపెదన్
గ్రొవ్వున నన్యుఁ డిందు దలకొన్న వధించెదఁ జెప్పు ముద్దియా! ౪౭౧

వ. అనిన విని యేకావళి. ౪౭౨

సీ. ఎవ్వడో వీఁడు నే నెఱుఁగజాలను నీదు బంధనంబున నిట్లు బడలియుంటి
నాతండ్రియునుగాడు నాయన్నయునుగాడు నాబంధువులలోని నరుఁడుగాడు
లాతి వీఁ డెవ్వడో యాతతబాహుండు దానేటికో చెప్పలేను వీఁడు
నావుఁడు రక్కసుం డో విమలాంగి నీ యనుగు యశోవతి యరిగెనెందు

వీని గొనుచువచ్చె పీటిమీదికి తన । చేటు పొ డెఱుంగ కోటుగనక
కాకయున్న నాకు కలఁడె శత్రుఁడు మూడు । లోకములను జూడ లోలనయన. ౪౬౩

వ. అని యిట్లు పలుకుచుండ నింతలోన గొందఱు దూత లరుదెంచి గృహంబుననున్న కాలకేతుం గాంచి. ౪౬౪

చ. సరిసరి వేళగాదిఁకను జాగొనరింపగ రాక్షసేంద్ర వ
చ్చిరి రిపు లింటిమీఁదికిని జెల్లనె గొంపలు నిప్పుముట్టగన్
దొరకఁబడి పల్లు పార గొని నూతులకున్ దొరకొంట లెమ్ము లె
మ్మొరువడి సైన్యమున్ గొనుచు నూరును మమ్మును వేగ బ్రోవగన్. ౪౬౫

వ. అనిన విని కాలకేతుండు బవరంబున కురువడించి చని యేకవీరుం గదసి గదాఘాతంబున వైచిన నేకవీరుండు కనలి గదగొని వాని శిరంబున వైవ వాఁడు గతాసుండై పడె. నంత రాక్షసులు కాందిశీకులైరి. యదిగని యశోవతి యేకావళి సమీపంబునకుం జని చెలియా యతిబలుండైన యేకరూపుఁడు యుద్ధంబుచేసి రక్కసుం జక్కడచె. నతండు కందర్పసుందరాకారుండు నిన్నుం జూడ నిచ్చయిడియున్నవాడు. నావుఁడు విని యేకావళి సిగ్గుపడి య గ్గజగమనతోడం గూడి చన యతిమలినంబగు స్కంధావారంబునందు వచ్చియున్న రాజసుతం జూచి రాజకుమారుం డిట్లనియె. ౪౬౬

క. చూడుము చూడుము కోమలి । వేడెద నిను నిదుగొ మదనవేదనకును నే
నోడితి విను విన్నపమును । సీడితమగు నీతి నెఱుగు దీవని తలఁతున్. ౪౬౭

క. అని రాజు పలుక సిగ్గున । వనిత పలుకలేక శిరము వాంచి నిలువఁగన్
గనుచు యశోవతి పలికెన్ । జననాయకునకును బరమ సంతోషమునన్. ౪౬౮

క. ఇది పెద్దలచాటు దనుచు । మది నెరుగరె మీరు సాధుమాన్యుం డతఁ డీ
సుదతి నొసగు నీ కిదియున్ । మది నిను వలచినది నిన్ను మానదు వింటే. ౪౬౯

ఉ. పెండిలిరాయబారములు పెట్టుము రాజున కట్టులైన నా
తండును నీకు నిచ్చు వనితామణి నంతట గోర్కె దీరు నా
పుండు నతండు నట్లయని పొంగుచు వారల గొంచు నేగి జే
డుండుపురంబు చేరి తగు నొద్దిక నిద్దఱి ముద్దులాడులన్. ౪౭౦

గీ. తెచ్చి చూపిన రాజున్యుఁ డచ్చెరువడి । యిచ్చె నేకావళిని వాని కిష్టలీల
బెండ్లి గావించి కట్నంబు పెట్టి పనిచె । నిరువురును సుఖమును బొంది రింటి కరిగి. ౪౭౧

క. లోకేశ యేకవీరున । కేకావళియందు బుట్టె గృతుగుణగణ్యుం
డై కార్తవీర్యభూపతి । యీకథ వివరించినాడ వే నీకు దగన్. ౪౭౨

వ. అనిన. ౪౮౩

క. మునినాథ నీవలన నే । వినినాఁడ విచిత్రకథల విశ్రుతఫణితిన్
ఘన హైహయవంశోదయ । మును దెల్పితి వదియు వింటి ముద మొదవంగన్. ౪౮౪

క. పరమస్వతంత్రుఁడగు నర । హరి పరతంత్రుఁడగుచు దురగాకృతి నొందెన్
బరమాశ్చర్యం బిది మునివర । నా కిది దెలుపవే కృపామతితోడన్. ౪౮౫

క. అనవుడు వ్యాసుఁడు వినుమీ । జనవర నే వింటి దొల్లి సర్వజ్ఞుఁడు స
న్మునికులచంద్రుం డమృతా । శనసుతుఁడగు నారదాఖ్య సంయమివలనన్. ౪౮౬

క. శమ్యాప్రాశాఖ్యంబై । రమ్యంబగు నాశ్రమమున రహి నే నుండన్
సౌమ్యుఁడగు నాతఁడు సుధీ । గమ్యపథం బట్టి వచ్చె గడువేడుకతోన్. ౪౮౭

క. వచ్చిన నర్ఘ్యాదికముల । నిచ్చి సమస్తోపచార హితవిధులను నే
నచ్చుపడజేసి యడిగితి । నిచ్చట నిపు డడిగినట్టి వృత్తాంతంబున్. ౪౮౮

వ. మరియు ౪౮౯

## —: వ్యాసుండు తన యిడుమల నుడువుట :—

గీ. సంయమీంద్ర యీ యపారమైనట్టి సం । సారమందు గలదె సౌఖ్య మెన్న
నెచట నెప్పుడేని యెవ్వనికేనియు । లేదు సుఖము లేదు లేదు లేదు. ౪౯౦

సీ. నట్టేట నొకదీవి బుట్టితి నెట్టులో కన్నప్పుడే తల్లి నన్నువిడచె
మొగి జూడ చుట్టంబు మ్రొక్కుదైవము లేక కాలకర్మవశానుగతుఁడ నగుచు
నడవిలో బడియుండి కడ కెట్టకేనియు బలునాళ్ళు నుగ్రతపంబుజేసి
కొండగుహల జేరి కొసకు సంతానాశ బరమేశ్వరుని గొల్చి పడసి శుకున
కఖిలవేదంబులను జెప్పి యతని విడచి । సుతవిరహదుఃఖమున వేగి యతితరాత్రి
నెల్లలోకంబులు దిరిగి తల్లి దలచి । సరగునం జేరితిని కురుజాంగలంబు. ౪౯౧

సీ. తల్లి పెండిలియాడి ధరణీశ్వరుని రాణిగా నుండుట యెఱింగి కడగి యచట
నే సరస్వతియొద్ద వాసంబుచేసుక యుండెడుతరి శంతనుండు స్వర్గ
మున కేగ విధవయై జనని నిజాత్మజు లిద్దరితో వసియింప నందు
చిత్రాంగదుని రాజుఁ జేసి భీష్ముఁడు భూమి నేలుచునుండంగ నింతలోన
గొడవ జిత్రాంగదుడు దోర నడలి తల్లి । సెప్పికొన భీష్ముడపుడు చిత్రవీర్యు
రాజు గావించి యా కాశిరాజుకూతురు । లిర్వురను బెండ్లి సేయంగ నేను గొంచె
మపుడు సుఖియించినాఁడ నో యనఘచరిత. ౪౯౨

క. అంతట విచిత్రవీర్యుం । డంతంబును బొంద భీష్ము డంబయు నడుగన్
గాంతల నిరువురఁ బొందితి । సంతానముకొఱకు శాస్త్ర సమ్మత మనుచున్. ౪౯౩

గీ. అల్లనల్ల వేలయై వెల్లబారిన । యంబికాఖ్య శపృ నాచరించి
నాడ బాండు గనుచు చేడియ యంచును । మొగి ద్వితీయ కనులు మూయఁ జూచి. ౪౯౪

గీ. అంధు గనుమటంచు నాడితి నంతట । దాసి నొక్కదాని తల్లి బనుప
విదురుగంటి దాని విమలాకృతినిబట్టి । ప్రథముడాయె బాండురాజు వింటె. ౪౯౫

క. రెండవసతి సుతు ధృతరా । ష్ట్రుం దని రిదియెల్ల నాకు జుట్టుకొనియె నీ
చండాలపు సంసారము। గండాగొండియగు మాయ గడవం దరమే! ౪౯౬

గీ తలచికొనిన గుండె జలజలమని చాల । జలదరించుచున్న దలవిగాదు
తెలుప మాయవలన గలుగని పలుబాము । లిలను లేవు పెద్ద వలయసుమ్ము. ౪౯౭

గీ. ఎంతజ్ఞానినైన నేటిలో బడద్రోచు । భూరిశాంతునైన బొందకీడ్చు
మునివరేణ్యునైన ముక్కుబట్టాడించు । మాయ గెల్చినట్టి మగడెవండు. ౪౯౮

శా. దోలారూఢమనుండనై కరిపురిన్ దొల్లించితిం గాలమున్
వేలంగానక మోహవార్ధిబడిసువ్వే పుత్రవాంఛల్ మదిం
దేలం గొన్నిదినంబు లుంటి రుష నెంతే దిట్టితిన్ భూపతి
స్త్రీలన్ మాయ మహావిచిత్రముగదా దివ్యప్రబోధోదయా! ౪౯౯

వ. మఱియు శూరసేనతనూజ యగు కుంతిని మద్రకుమారి యగు మాద్రిని బాండురాజు పెండ్లాడి కామినీద్వయసహితుండై యరణ్యంబున ద్విజశాపవశంబునన్ దిరుగ నేఁబోయి యతని నాశ్వాసించి మరల హస్తిపురి కేతెంచితి నంత గుంతి యమునివరంబున ధర్మ రాజును, వాయువువరంబున భీముని, దేవేంద్రువరంబున నర్జునిం గనియె. మాద్రి యశ్వినులవరంబున నకుల సహదేవులం గనియె. నంత నొక్కనాఁ డతఁడు కామాతు రుండై మాద్రితో గలయ పూర్వశాపవశంబున మృతుండైనం గాంచి పరమసాధ్వి యగు మాద్రి యనుగమనంబు సేసె నంత కుంతిం బిడ్డలతో దెచ్చి మునులు హస్తినాపురంబు జేర్చిరి. అదియుంగాక. ౫౦౦

క. ఆ పాండుడు పలుబాముల । వాపోవఁగ గుంతి గోల పడఁగాఁ గని నే
తాపంబు నొందితి సుఖ । స్వాపంబును నెఱుగనైతి సంయమివర్యా! ౫౦౧

క. ఆ పాండుసుతుల భీష్ముఁడు । గాపాడెను ద్రోణుచేత గార్ముకవిద్యా
నైపుణి గరపించెను నే । నాపట్టున జుట్టిజుట్టి యరయుచు నుంటిన్. ౫౦౨

గీ. గొంతికిని గన్నెదనమున గొడుకు పుట్టె । నతఁడ కర్ణాఖ్యుఁ డొకసూతుఁ డతని బెంచె
వాఁడు దుర్యోధనుని చెలికాఁడుగాఁ బొ । సంగె నాదట నతిశౌర్యశాలి సుమ్ము. ౫౦౩

క. ధృతరాష్ట్రునకును బలువురు । సుతులు దురాగతులు పాండుసుతులకు రిపుతా
యుతు లందుం దుర్యోధను । డతిచపలుడు మిగులబాధ లందించెఁజుమీ. ౫౦౪

క. జతుగృహములందు బాండుని । సుతులుండఁగఁ జిచ్చుబెట్టె శోకాధిక్య
స్థితినెంతయు నడలితి నా । మతి జెడె నాపదలు గలిగె మనుమల కనుచున్. ౫౦౫

గీ. ఎలమి బాండుతనయు లేకచక్రపురంబు । సేరియుండిరనుచుఁ జెలఁగి గొంత
కాల మెకవిధముగ గడిపితి నప్పుడ । యర్జునుండు మత్స్యయంత్ర మేసె. ౫౦౬

గీ. తల్లిమాటబట్టి ద్రౌపతి బంచపాం । డవుల భార్యగాఁగ నవల గొంత
మనసునందు సుఖనిమగ్నుండనై యుంటి । నిట్లు సుఖము దుఃఖ మెనసె నన్నుఁ. ౫౦౭

సీ. రాజసూయము చేసి రమ్యకీర్తి వహించి ధర్మజుం డుండగా నిర్మలాత్మ
వృత్తి గైకొంటి న వ్వెనుక దంభద్యూతమున బాండవు లరణ్యమునకు బోవ
దుఃఖంబు నొందితి దుర్యోధనుని దుష్టబుద్ధిచే బాండవుల్ పొందినట్టి
కష్టంబులెల్ల నా కష్టంబులుగ నెంచి యప్పటప్పటికి నే నడలుగొంటి
కాన సంసారమునను సుఖంబు వచ్చు । దుఃఖమును వచ్చు నెంతంత ద్రొడ్డవారి
కేని వింటివకా నాకు నిన్నిగతులు । ననుభవంబులు బ్రాపించె నద్భుతముగ. ౫౦౮

క. నే నెవ్వడ నెవ్వండో । నా నాయన తల్లి యెవతె నాకును సుతులే
రో నాకును సుఖదుఃఖప । రీణామము లెట్లో తెలుపు ప్రీతి నటన్నన్. ౫౦౯

చ. అన విని నారదుం డనియె వ్యాస పురాణకథావిలాస నీ
వనుపమబుద్ధిశాలివికదా విను జెప్పెద దేహధారికిన్
సనకసనందనాదులయినన్ హరియైనను శంకరుండయే
ని నలినగర్భుడేని విడ నేర్చునె సంసృతియందు మోహమున్. ౫౧౦

ఉ. ఓయి పరాశరాత్మజ మహోద్ధతమైన భ్రమంబుచేతనే
యీ యఖిలంబు నున్నయది యెప్పుడు భ్రాంతి నశించు నప్పు డీ
మాయ గనంగరాదు జితమాయుడు దేవుడుకాడు నీవు నే
నో యిక నెంతవారము ననున్ నిను బోల్చిన నీవ మేలుసూ. ౫౧౧

క. విరమింపు మేల చెప్పెదు । మరిమరియును రోలుబోయి మద్దెలతోడన్
మొర పెట్టుకొన్నయట్టులు । వెరగేటికి నాదు గొడవ వినుము తెలిపెదన్. ౫౧౨

## నారదునకు మర్కటత్వప్రాప్తి :—

ఉ. వేమను బర్వతాఖ్యుఁడును నింగి దొలంగి ధరం గనుంగొనం
బూనికతోడ వచ్చి ఘనపుణ్యము భారతవర్షమందు వెం

తేని ముదంబుతో దిరుగు చెక్కడ నెక్కడ తీర్థమందు న
చ్చో నొగి డిగ్గుచున్ నిలుచుచుం జరియించుచునుంటి మర్మిలిన్. ౫౧౩

గీ. మచ్చికలర మేము వచ్చునపుడె యొక్క । కట్టు జేసుకొంటి మెట్టు లనిన
నొకని మనసులోని దొకనికి దెల్పంగ । వలయు నెంత చాటువార్తయైన. ౫౧౪

క. తిరుగుచు దిరుగుచు సంజయు । పురి కరిగితి మతడు మమ్ము బూజించెను న
త్తరి వానకాలమగుటం । బొరి జాతుర్మాస్య మచట బుచ్చు తలపుతోన్. ౫౧౫

క. అచ్చటనే యుంటిమి । పౌరపొచ్చెములే కట్టులుండ భూపతి మమ్మున్
మెచ్చి పరిచర్యసేయఁగ । జెచ్చెర దన కన్యను బనిచెను దమయంతిన్. ౫౧౬

గీ. చక్కదనముల పెన్నిక్క చామనేత్ర । మందగామిని సువివేక మాన్య సర్వ
కాలముల మాకు పరిచర్య లోలి నెఱపె । నడుగులకు మడుగులొత్తుచు నతిముదమున ౫౧౭

గీ. మేము నిత్యము నియతితో సామవేద । సంహితలగోష్ఠి సలుపుచు జాలుగడపు
చుందు మం దేను వీణలో నొప్పు సామ । గానమును బాడుచుండుదు దాన లయల ౫౧౮

గీ. రాజపుత్రి వినియె రాగంబు లెంతేని । రాగ మాలకింప రాగ మెచ్చె
రాజపుత్రి కపుడు రాజరా గడు నను । రాగ మెచ్చె మందరాగధీర! ౫౧౯

క. రాగము నే జూపగ నను । రాగము నా మనసు జూపు రాజతనయ దా
రాగను వలరేడు తన జి । రాగను నే గనుల ధనివి రాగను గొంచున్. ౫౨౦

క. రసములొలుక నా కా పా । రసలోచన యుపచరించుఁ బ్రముదితమతితో
రస మడిగిన లవణాదిక । రస మడిగిన బంచశరశరసమర్పితయై. ౫౨౧

క. యోషామణి పరిచర్యల । నీషద్భేదంబు సూపె నిద్దతియెడలన్
భాషావైఖరిలోన ని । మేషోన్మీలనమునను నిమీలనమందున్. ౫౨౨

సీ. శీతోదక మమర్పు సేయు బర్వతునకు నుష్ణోదకంబు నా కొసగుచుండు
మంచిమజ్జిగఁదొల్పి యుంచుఁ బర్వతునకు నెరినాకు మీగడ పెరుగు బెట్టు
చిఱిచాపపై బట్ట బరచు పర్వతునకు బరగ నాకును దూదిపరపు బరచు
నందటి జూచిన ట్టా పర్వతుని జూచు గులుకుచూపుల నన్ను గలయఁజూచు
పలుకు బిగ్గన హుమ్మని పర్వతునకు । పిలువగా నల్ల దరిజేరి పెదవిగదల
బలుకు నొక వింత చక్కెర పలుకులొలుక । దీగెబోణుల మేలుబంతి దమయంతి. ౫౨౩

క. ఓ మౌనినాథ చూచితి । వో మామిడిపండు దీని బుచ్చుకొనినచో
మామీద బ్రేమ యధికం । బౌ మేలని తెచ్చి నాకు నందిచ్చుఁ దమిన్. ౫౨౪

గీ. పర్వతుఁడు లేనితరి నూచి బాల మెల్ల । మెల్ల నటు నిటు జూచుచు నల్లజేరి
మునివరా భూతి కొంచెము మొగమునందు । బెట్టుదని వేడుకొను దృష్టిగొట్టె ననుచు.

క. కాయజుశిములికిబోలెం । దోయజముఖి నన్నుఁ దనదు తొంగలిరెప్పల్
మూయుచు నెత్తుచు వగలం । జేయగ నా తెల్వి లేగె జెట్టాకపులుగై. ౫౨౬

క వగ లొడ్డులంటుకొని పా । రగ మగున నటింప మనసు ప్రమదామణిపై
దగిలి యితరముల నొల్లక । జగ మెఱుగను సంధ్య నెఱుగ స్నాన మెఱుంగన్. ౫౨౭

గీ. చెంబుతో నీళ్లలందిచ్చు చెలియ ముద్దు । చేతి హొయలును జూచుచు బ్రీతిమీరి
కాఁగునీళ్ళన్ని నే కాళ్లు గడిగికొంటి । దవ్వునన యుండి యయ్యింతి నవ్వుకొనగ. ౫౨౮

గీ. సంధ్యవార్చెడిచో నింతి సరస జనగ । కన్నులు తదంగ సౌందర్యగణన జిక్క
జెలఁగి సూర్యశ్చకగ్నిశ్చ సెప్పబూన । బర్వతుడు నవ్వె నిది పట్టపగ లటంచు. ౫౨౯

క. ఇట్టుల గాలము సన నొక । పట్టున నవ్వింత జూచి పర్వతు డడిగెన్
గట్టిగ నాకు దెలుపు మీ । గుట్టును నసుడు సిగ్గువలన గొంకుచు నేనున్. ౫౩౦

గీ. ఈ విశాలాక్షి దమయంతి యేను భర్త । గావలె నటఁచు గోరెడి కన్య నేను
వలచితినటన్న బర్వతుం దలిగి యోరి వంచకా కమ్ము నీవిప్డు వానరుఁడవు. ౫౩౧

వ. అని యిట్లు. ౫౩౨

క. నా మే నల్లుడు పర్వతు । డీమాడ్కి శపింప గ్రోధహృదయుఁడనై నే
నో మందాత్మఁడ పితృపతి । ధామంబున కరుగు మింక దడయక యంటిన్, ౫౩౩

గీ. నేను కోతినైతి మేనల్లుడా మృత్యు । లోకవాసి యయ్యె లోకమెల్ల
మమ్ము జూచి నవ్వె మహి నెంతవారికి । దేహముననె యుండు మోహ మనుచు. ౫౩౪

క. వీణను నేగొని పాడగ । నాణెంబును వినుచు మెచ్చు ననబోణి లస
ద్వేణి దమయంతి చింతిలి । ప్రాణముగా దలచి చేసె బరిచర్య లొగిన్. ౫౩౫

ఉ. అంతట నొక్కనాఁడు తన యాత్మజ గన్గొని సంజయుండు దా
నింతికి బెండ్లిసేయదగు నీ డిది యంచు దలంచి మి తులన్
జెంతకు జీరి బెండ్లి యిఁక జేయదగున్ సుత కిప్పు డొక్క భూ
కాంతుని సద్గుణాన్వితుని గంటిరె యంచు వచింప వారిలోన్. ౫౩౬

వ. నిరుపమనీతికోవిదుండైన యొక్క ముఖ్యమంత్రి యిట్లనియె. ౫౩౭

గీ. గుణగరిష్ఠులైన కువలయాధీశుల । సుతులు గలరు నీదు మతికి నిష్ఠు
డైనవాని దెచ్చి యాత్మజకును బెండ్లి । సేయవచ్చు నింత జెప్పనేల. ౫౩౮

క. నావుఁడు నది విని కన్నియ । భూవరుచిత్తము నెఱిగి యపుడ ధాత్రికి దా
వేవేగను తెలిపెను దన । భావము నారదునిమీద బట్టె నటంచున్. ౫౩౯

చ. అది విని ధాత్రి వచ్చి మనుజాధిప నీకును దెల్పుమంచు నీ
తనయ వచించె నారదు సుదారగుణున్ మహతీయుతున్ మనం
బున దలపెట్టితిన్ నిజవిభుం దని గాన మఱొండు వేడుకన్
నను బరుభార్య సేయకుము నారదమౌనికి నిమ్ము బ్రీతితోన్. ౫౪౦

చ. మొసళులుఁలేవు మీనములు ముట్టవు నాచును గానరాదు తా
రసలిలజాలసంతతతరంగయుతంబునుగా దనేక నీ
రసముల కాకరంబగుచు రాజిల దెప్పుడు సౌఖ్యమిచ్చు స
ద్రసమహితంబు నాదజలరాశి మునింగితినంచు దెల్పుమా. ౫౪౧

వ. అని యిట్లు దన సుత దమయంతి పలికెనని వచించిన ధాత్రివాక్యంబులు విని సంజ
యుండు మునియై వానరముఖుండైన నారదుని వరించె నిక్కన్య నే నేమిసేయుదు ననుచు
దన యంగనకడకుం జని. ౫౪౨

సీ. వింటివా యీవింత విమలాంగి మన దమయంతి నారదుని బెం డ్లాడదలచె
యీ వెఱ్ఱిబుద్ధి దా నెట్లుపుట్టెను దీని కేను దానముసేయ నితడు తగునె
బిచ్చగాడు కురూపు డచ్చపలాక్షికి పిచ్చితనంబును బుచ్చు మింక
నేకాంతమున జెప్పి యిది శాస్త్రవిధియుగా దాచారమును గా దటంచు బ్రీతి
ననిన నది యేగి గూతు నేకాంతమునకు । జీరి ముద్దాడి సరసను జేర్చి కొంత
సేపు వివిధములైన సల్లాపములను బ్రొద్దుపుచ్చి మధురవాగ్విభూతి దనర. ౫౪౩

శా. తల్లీ! నీకును బెండ్లిసేయఁ దలఁచెన్ ధాత్రీశ్వరుం డాత్మ నీ
యుల్లాసంబున కీడుజోడయిన రాజోత్తంసు సౌందర్యసం
పల్లీలామయు శూరు ధీరు ఘను తే బ్రాయంపువానిన్ సదా
వాల్లభ్యం బొనగూడగాఁ గలయుటే వామాక్షి భాగ్యం బిలన్. ౫౪౪

గీ. నిజము కల్లయు యెఱుగ విసీలవేణి । వింటి నే నిప్పు డొకవార్త వినుదోయి
బగుల నెగులొందితిని మది మిగుల దగుల । మాయె నారదునందు నీ యాత్మయనుచు. ౫౪౫

క. ఎక్కడి నీసౌందర్యం । బెక్కడి యా బడుగుకోతి యీవార్తయ దా
నిక్కంబయేని తమిచే । నక్కను వెనుదవిలె నం చనరె లోకమునన్. ౫౪౬

క. ఇంటింట బిచ్చమెత్తుచు । వంటకమును దినుచు ప్లవగవక్త్రుండై నీ
ఇంటబడియున్న వరవుడు । నంటెదనని పలుకు టెంతయక్కజ మబలా. ౫౪౭

క. నీ కోమలతను వెక్కడ । నా కోతిమొగంబువాని యంగవికార
స్వీకారం బది యెక్కడ । జేకొని గాడ్దెకును బట్టు జీ నిడినట్లే. ౫౪౮

గీ. తొయ్యలీ కాకిముక్కున దొండపండు । నోజ తుమ్మకు బెట్టిన జాజితీగె
క్రమను దాసీరకున కిచ్చు దమలపాకు । పేరిమగు నీకు నారదు బెండ్లిసేయ. ౫౪౯

గీ. కోతిమొగము పెట్టుకొని యెగదిగజూచు । ముక్కుపండ్ల ముదుక ప్రక్క నీవు
పెండ్లికూతునంచు బేరిడికొనియున్న । వనటగుంద కెవరి మనసు నిలుచు. ౫౫౦

గీ. బ్రతుకు లొక్కనాఁటివా యెంతకాలంబు । గడపవలయు నిట్టి బడుగుపొత్తు
విడువు విడువు దీని వినువారు నవ్వరే । పడుచ యెట్లు బొంద బడితివాక్కొ. ౫౫౧

క. అను తల్లిమాటలను విని । వనితామణి యల్ల నవ్వి పరమకృపన్ నా
కును సెప్ప దగుదు రీ రది । వినదగు నాకట్టులైన విను మో జననీ. ౫౫౨

ఉ. మోమున రూపు గల్మియును మూర్ఖునకున్ గలదేని దాన నా
కేమిఫలంబు సీరసున కెంతయు రాజ్యము గల్గియున్న చే
రామున లే శ్వరణ్యముల నద్భుత నాదరసంబు గ్రోలవే
సామము బాడినన్ వినుట జాలదె వేఱొకడేల నా కికన్. ౫౫౩

గీ. అంబ సప్తస్వరాత్మికయైనయట్టి । విద్య నారదుఁ డెఱుఁగు వేవ్వేర్క గృత్తి
వాసుఁ డెఱుగును మూఁడవభాని కద్ది । దెలియశక్యంబె వెఱ్ఱుల జలజనయన. ౫౫౪

క. ఛీ ఛీ గర్వోపేతత । భూచక్రం బేలునట్టి మూర్ఖునికంటెన్
గోచి యిడి బిచ్చమెత్తెడి । యా చతురగుణాఢ్యు కూరి మదిలెస్సగదా! ౫౫౫

చ. స్వరము లెఱింగి గ్రామముల సంగతులన్ బరిపూర్ణవేత్తయై
యరుదగు మూర్ఛనావిధము లన్నిట దా జతురత్వమూని య
ష్టరసవిధిజ్ఞుఁడైన పురుషప్రవరుండు ధరాతలంబునన్
దొరకుట దుర్లభం బతఁడు దుర్బలుఁడేనియు బేదయేనియున్. ౫౫౬

క. కైలాసమునకు గంగయు । నోలి సరస్వతియు నెట్లు లొందెడి నటులై
లీల స్వరజ్ఞానచణుఁడు । కైలాసమునందు చేరు గలుషరహితుఁడై. ౫౫౭

క. స్వరమాన మెఱుగువాఁడే । నరుడని జెప్పబడుచుండు నయమున సప్త
స్వరభేద మెఱుగకుండిన । ధరణిం బశువతఁడు దేవతాపతియైనన్. ౫౫౮

గీ. మూర్ఛనాతానమార్గసమ్మోదయుతుడు । గానివానిన పశువుగా గాంచుచుంద్రు
పశువు లనరాదు లేళ్ళను పాములేని । చెవులులేకున్న నాలించు నవి స్వరంబు. ౫౫౯

క. బాలుండు పోరువెట్టిన । జోలలుబాడంగ నిదుర సోకునుగాదే
లీలావతియగునే స్వర । లోలత లేకున్నసుం దరోదరి చెపుమా. ౫౬౦

గీ. అద్వితీయసామగాభిఖ్యు నారదు । నెఱుఁగడొక్కొ తండ్రి యెంతవెట్టి
చక్కఁదనము చూచి యొక్కమూర్ఖున కిచ్చి । చెఱుపఁదలఁచెనొక్కొ చేరి నన్ను. ౫౬౧

క. శాపంబువలన వానర । రూపము ప్రాపించినంతలోనే చెడెనే
వ్యాపారము లన్నియును న । కూపారము నారదుండు గుణములకెల్లన్. ౫౬౨

క. కిన్నరుల వన్నె చెడెనే । పన్నుగ నశ్వముఖులైనమాత్రనె నిత్యా
సన్నస్వరవిద్యాసం । పన్నులకు ముఖంబు లడుగ బనియుం గలదే. ౫౬౩

క. అనిన విని తల్లి రాజున । కును దెల్పఁగ నతఁడు కూఁతు కోరికవెంటం
జను టొప్పుననుచు నాకును । వనితామణి నిచ్చి చేసె వైవాహికమున్. ౫౬౪

గీ. నాతి కోతిమొగము నాదని యెంచక । నీతిఁ బ్రీతి గల్గి నెమ్మితోడ
నేత మూతి గడిగె నేనుమాత్రము త్రపా । పాత్రినైతి నాదు పాటు దెంచి. ౫౬౫

గీ. అంత గొన్నినాళ్ళు లరుగంగ బర్వతుం । డరుగుదెంచె దీర్థయాత్రఁ జనుచు
నా సమీపమునకు నయము దెలసి యేను । నతని కధికభక్తి నర్చ సలుప. ౫౬౬

వ. నన్నుం గాంచి. ౫౬౭

మ. కపివక్త్రంబున దుఃఖపూరితుఁడనై క్రాగంగ దా గాంచి స
త్కృపతో మామ నినున్ శపించితిగదా దీవ్రక్రియన్ నీవునుం
గుపితత్వంబున నన్ను దిట్టితివి నీకున్ శాపమోక్షంబు ని
త్రుపవృత్తిన్ గలిగింతు నాకును నటు ల్సల్పంగ నీకుం దగున్. ౫౬౮

## —: నారదునకు శాపవిముక్తి :—

క. నాపుణ్యంబున నీకుం । బ్రాపించును జారువక్త్రి మనినంతనె యా
శాపాయుధు మొగ మంచిత । రూపంబై యొప్పె నప్పుతరోచింటోలెన్. ౫౬౯

గీ. దాని కలరి నారదముని పర్వతుఁ జూచి । నీవు స్వర్గమునకు నేఁటనుండి
పోవపచ్చు ననిన బొంగె నాతఁడు మహా । నందపరవశత్వ మంది యధిప! ౫౭౦

చ. అమృతమరీచిబోలె బొలుపారు మొగంబున జంద్రికాంకురా
భమయిన నవ్వుతోడ ముఃపెం బెసగం గనుపట్టు బెన్మిటిన్
గమలదళాక్షి సూచి వడిగా జని చంకలు గొట్టుకొంచు తో
యమిదిగో తోయమంచు దన యన్గుపదంతులతోడ జెప్పినన్. ౫౭౧

గీ. తోయ మేది యేది తోయజాక్షి యటంచు । చేర మోముద్రిప్పి చేతిఁవ్రేల
మగని జూప వారు తగునమ్మ యిది యేమి । వింత వింతయనుచు వేగిరించి. ౫౭౨

క. శాపవిముక్తి విధం బప్పు । డా పర్వతువలన విని మహానందముతో
నేపారగ వడి వడి జని । భూపాలున కెరుకసేయ బొంగె నతండున్. ౨౬౩

ఉ. పొంగుచు భార్యగూడి తన పుత్రికయున్న గృహంబుసేరి ని
ర్భంగత నల్లునిన్ సరస బర్వతునిం గనె నప్డు వారి క
న్నుంగవ యెంతహర్షపడెనో వివరింప దరంబె భూవరా!
సంగతసౌఖ్యసారమున జంతుతతుల్ మది బొంగకుండునే. ౨౬౪

క. ఈగతి నానందభరితు । లై గానరసజ్ఞుడైన యా నారదుతో
భోగంబునొందు సుముఖి । శ్రీగల దమయంతి యనుచు జెలగిరి వేడ్కన్. ౨౬౫

వ. అని చెప్పి వ్యాసుండు వినుము సంజయుం డప్పర్వతఋషి ననేకవిధంబుల గొనియాడి వీడ్కొని నారదునకు బారిబర్హం బిచ్చినంత నారదుండు నాతోడ నో సత్యవతీ తనయా! దేహధారికి మోహంబు సిద్ధంబు దానివలన సుఖదుఃఖంబు లనుభవింపక తప్ప దని చెప్పి మరియు. ౨౬౬

క. ఏ బ్రాసిమాయలోబడె । నా బ్రహ్మ సంబమైన యఖిలంబు నిదే
యబ్రంబు హరిహరాజక । కుబ్రాజులు దాని దరమికొనజాలిరొకో! ౨౬౭

## —: నారదుని నారాయణుండు స్త్రీని జేయుట :—

చ. వెలయ నొకప్డు సత్యమును వీడ్కొని యే నల తెల్లదీవి కిం
పలరగ నచ్యుతుం గనెడి యాస దలంకొన వీణలోన న
త్యలఘుతసామమున్ స్వరసమంచితవృత్తుల బాడికొంచు వే
వెలలితి జూచితిన్ నిఖిల విశ్వవినోదను నజ్జనార్దనున్. ౨౬౮

ఉ. చూచిన యంతలోన హరి సుందరి పద్మ నిశాంత నిత్యశో
భాచయసర్వభూషణవిభాసిత సింధుకుమారి దిగ్గునన్
లేచి చనెన్ హరిన్ విడచి లీల దదంతరగారసీమ కా
లోచనపుట్టె నామనసులోపలహేతువు దాచ కత్తరిన్. ౨౬౯

మ. భగవంతుడవు పద్మనాభ నిరఘప్రారంభశుంభచ్ఛమా
దిగుణస్వాంతుడ వీ సుధాబ్ధిసుత నన్ దివ్యర్షి నీక్షించి శీ
ఘ్రగతిన్ లోపలి కేగె గారణము వక్కాణింపవే వేదపా
రగుడన్ మోహవిహీనుడన్ జడుడనో రాల్గాయనో కొంటెనో. ౨౭౦

చ అనవుడు నవ్వి శౌరి వినుమా మునినాథ నిజంబు పల్కితీ
వనఘుడవంచు నమ్మితివి యాత్మ నదైనను లోకనీతియుం

గనదగుగాదె సాధ్వులగు కాంతలు భర్తలదక్క యన్యులం
గనుగొననోప రట్టియునుగాక వచించెద నాలకింపుమీ. ౫౮౧

ఉ. మాయజయించువాఁడె జితమారుతుఁడైనను యోగియైన వి
ద్యాయుతుడైన సాంఖ్యముఖదర్శనవేత్తయయైన ధర్మబో
ధాయనుడైన నింద్రియజయక్షముడైనను గాన మోహధీ
నాయెడ లేదనం దగునె నారద! మాయకు బంటు లెల్లరున్ ౫౮౨

క. నీవనగ నెంతవాఁడవు । నావలనం శంభువలన నలి నజువలనన్.
దీవింపఁబడనేరదు మా । యావిలసన మనుచు దెలియుమా మదిలోనన్. ౫౮౩

క. దేహంబు గలిగెనేనియు । మోహంబును గలదు నమ్ము మునివర మనకున్
దేహములు గలవు గావున । మోహంబులు గలవు మాయ మూలమునుమ్మీ. ౫౮౪

గీ అనిన విస్మయమంది యో యంబుజాక్ష । మాయయెట్టిది యెటువంటి మహిమ గలది
యెక్కడ వసించు దాని రూపేమి యనిన । నారదున కిట్టులనియె దైత్యారి యపుడు. ౫౮౫

క. అది మూడుగుణములనుగల । దది నిఖిలాధార యదియు నన్నియెడగు దా
నది సర్వసమ్మతయ యగు । నది సర్వవ్యాపి చెప్ప నలవియె దానిన్. ౫౮౬

ఉ. దాని కనుంగొనం దలపు దట్టెనయేని మునీంద్ర! చూపెదన్
రా ననుగూడి చూచి యొక రాగము పెట్టెదవేమొ మంచిదే
యౌనని తార్క్ష్యునిం దలప నాతడు వచ్చిన నెక్కి నన్నునుం
దానిపయిం దగ న్నిలిపి దాటె వనంబులు పర్వతంబులున్. ౫౮౭

మ. చనుచుం జూచితి నేను బత్తనములన్ సాలంబులన్ బల్లెలన్
వనులన్ మౌనిజనాశ్రమంబులను సద్వాపీసరశ్శ్రేణులన్
ఘనఘోషంబుల నాపగావితతులం గ్రామంబులన్ శాద్వలా
వనులన్ బల్వలకోటులన్ గజఘటాపంచాస్యముఖ్యంబులన్. ౫౮౮

క. చారుమహిమ బులిప్రక్కం । జోరిగంబోలె పరమశోభనుఁడగు నా
శౌరికి దగ్గర గూడప । దారిపయిం బీటవయిచి యరిగితి నేనున్. ౫౮౯

ఉ. మే మట గాన్యకుబ్జము సమీపమునం గనుగొంటి ముల్లస
త్కోమలపంకరుట్కుముదకోకబిసాళి పతంగలోకమున్
వ్యామిళదత్యుదాత్తనినదానుగతాంచితచంచరీకమున్
క్షేమకరాప్యల న్మరుదసీకము నైన మహాతటాకమున్. ౫౯౦

వ. ఇట్లు గాంచి యత్యాశ్చర్యమగ్న చేతస్కుండనై వేదురెత్తినట్టు లట్టు నిట్టుం జూచుచున్న
నన్నుం గని నారాయణుండు మన మిచ్చట డిగ్గి యీ తటాకంబునందు స్నానంబుజేసి

మధురజలంబులఁ గ్రోలి యేగుదమని నుడివి నా తర్జని బట్టుకొని గరుడునింజిగ్గి నవ్వుచు నారదా! నే నిచ్చట నీ మనోహరంబగు వృక్షచ్ఛాయ నుండెద, నిర్మలజలంబుల నీవు ముందుగా స్నానంబుసేయుము, నీవెనుకన నేనును స్నానంబుసేసెద. సాధుజనంబుల చిత్తంబునుంబోలె జలంబు మిగుల విమలంబై యున్నది, నావుడు విని యేను. ౫౯౧

గీ. పట్టియున్న వీణ చెట్టుదాపున బెట్టి । యిత్తిత్రోలు బెట్టి బుజ్జిదరిని
ప్రాతనారపంచె పైబుజంబున నిడి । గోచి దోపుకొనుచు గొలను జేరి. ౫౯౨

గీ. కాలు సేతులు మురికివో గడుకుకొంటి । ముడిని వైచితి గట్టిగా ముట్టిజుట్టు
దర్భకట్ట యొకటి వ్రేళ్ళ దాల్చికొంటి । నాచరించితి ముమ్మారు లాచమనము. ౫౯౩

గీ. డిగ్గితిని నీళ్ళ స్నాన మాడితిని తనివి । దీర నే నంద యుండంగ నారినైతి
శౌరి నా వీణయును మృగచర్మమును ద । టుక్కునను గొని నింగికి నెక్కె ననఘ. ౫౯౪

గీ. శౌరియేగెచు నిజసదనంబునకు నింత । వీణ మఱచినాడ గాణతనము
మఱచినాడ నేను మౌనిననెడి బుద్ధి । మఱచినాడ త్రోలు మరచినాడ. ౫౯౫

గీ. అప్పడే లోకమందు నే నవతరించి । నట్టులాయెను నాబుద్ధి కఖిలదృశ్య
మానములు క్రొత్తలై వింతబూని కొలను । పూలు చెట్లును మృగములలీల దోచె. ౫౯౬

క. మును వీణ ద్రోలు చెంబును । గొని జరజర నడచువాఁడ కుచభరమున జ
య్యన వేణీభరమునను జ । ఘనభరమున నాకు మందగతు లాయెఁ జుమీ. ౫౯౭

గీ. వీణబరువునకును మారు వేణిబరువు । అక్షమాలికస్థానముం దాణివంద
బూడిపూతలచోట జవ్వాదపూత । యింతినైనప్డు నా హాయ లేమిచెప్ప. ౫౯౮

సీ. కావిదోవతి చక్క గట్టనేరని నేను కట్టనేర్చితి సరిగంచుచీరె
జుట్టుగూరిచి ముడిబెట్టనేరని నేను బెట్టనేర్చితి పూలుజుట్టి కొప్పు
పొలుపుమీర విభూతి బూయనేరని నేను పూయనేర్చితి మంచి పునుగు మేన
బెడగుగా జలిబొంత దొడుగనేరని నేను తొడగనేర్చితి నీటుదొరయు రవిక
నేమిచెప్పుదు దాపసాకృతిని విడచి । నే మును విచిత్రముగ ముద్దుటేమనైన
నాటి నాయొర్పు నా నేర్పు నాకె వింత । యయ్యెడును లాతులకు వింత యన వశంబె. ౫౯౯

వ. ఇట్లత్యద్భుతంబుగా పాలకడలి వెడలి వచ్చు జగన్మోహినియో యన నే నా తటాకంబు వెడలి వచ్చి నలుదిక్కులుం జూడ రథాశ్వగజపదాతిసమన్వితుండై మన్మథాకారుండైన యొక యౌవనపురుషుండు నాకనులయెదుటం బడినం జూచుచున్నంత నా రాజకుమారుండు నా రూప యౌవన కళావిశేషంబులకుం గామమోహితుండై కదసి నన్నుం గని యిట్లనియె. ౬౦౦

గీ. ఎవ్వతెవు నీవు వేల్పులయింతివొక్కొ । మనుజకాంతవొ భోగులమహిళవొక్కొ
యొంటరి జరింపనేటికి సువిద నీకు । ఐతిగలదొ కన్యవో వేగ బలుకు మింక. ౬౦౧

గీ. నేను దాలధ్వజుండను నృపతికులుఁడ । నన్ను బెండ్లాడితేనియు నాఁతి నీకు
సకలసౌభాగ్యములు గల్గు జా గికేల । తెలుపు నీ వాంఛితం బైన నలరి యేను. ౬౦౨

క నాతండ్రి నెఱుగ నెన్నఁడు । నాతల్లి నెరుంగ నా జనన మెట్టిదియో
యేతెఱఁగో నా బ్రతు కిఁక । నేటిరో యింతయైన నే నెరుగ నృపా! ౬౦౩

గీ. ఏమిజేసిన జేయు మిం కేను నీకు । దక్కితిని చిక్కితిని వేర యొక్కరెవరు
ముక్కుమొగమెరుగనివారు ప్రక్కజేర్చి । వేడుకలరంగ నన్ను గాపాడగలరు. ౬౦౪

క. నీదాసనయితి నను గ । న్యాదానము సేయు దాత యా యీశ్వరుఁడే
రాదలఁచితి నీతోడను । లే దిక నొక తెరవు నాకు లేఖేంద్రసమా. ౬౦౫

వ. అనిన విని తాలధ్వజుండు తన భటవర్గంబుల కాజ్ఞాపింప వస్త్రశిబికం బన్ని న న్నం దునిచి నిజనగరంబునకుం గొంపోయి యథావిధి నగ్నిసాక్షికంబుగా వివాహంబు సేసికొనిన నే నతనికి భార్యనైతి. నంత నతండు నాయం దత్యంతానురాగంబు బొడమి నిజరాజ్య కార్యంబులెల్ల విడనాడి క్రీడాసక్తుండైె. ౬౦౬

ఉ. మేడల మిద్దెలం గదుల మేలిమిమెట్టుల కట్టడంబులం
పీడక బూవుదోటలను వేదుల గృత్రిమపర్వతంబులన్
జోడుగ సింధుతీరముల సొంపగు మామిడిగున్న చెట్ల పె
న్నీడల గ్రీడలం జరిపె నీడన కాడన కెల్ల జాడలన్. ౬౦౭

సీ. ఏమరుపాటుగా నే నేదొ కనుచుండ వెనుకగా వచ్చి నా కనులుమూయు
ఓ లోలనయన నీ కోలోల యని వచ్చి కదసి నాతో సరిగంగలాడు
వెన్నెల బైటనే వేసంగి జమరార దిరుగాడ దా బూలసురటి విసరు
అలరంద కే జరణాగ్రంబులను నిల్చి కోయబో దా బూలకొమ్మ వంచు
పొత్తుననెగాని సాపడ బూనడెపుడు । కొనదు విడియమ్ము ముందు నే గొఱికకున్న
క్షణము దడవైన దా నిరీక్షణము సేయు । క్షితిపు తగులాట మింతని చెప్పవశమె. ౬౦౮

సీ. చీటిక మాటికి జేరంగ బిలువ నే విసికిన నేప్పు దా వెక్కివెక్కి
పలుమారు చెక్కిలి నులుమంగ నే మారుమొగమైన దా దీనముఖత దాల్చు
సరసనే చనుదేర సమయంబు గాదన్న వేగ రమ్మని మ్రొక్కి వేడుకొనును
పూలు గ్రుచ్చుచు నేను మోము వాంచిన నాదు గడ్డంబు పైకెత్తి కాంచి నవ్వు
తత్తనకయంచు నన్నుఁ జంక కెత్తుకొనును । ఓడబుచ్చెద బగడసా లాడుమనును
తోయమని సాచి తుద కుత్తిచేయి జూపు । క్షితిపు మదనవికారముల్ చెప్పదరమె. ౬౦౯

క. ఆ రాజు మన్మథతాప । స్మారము తోరమయి మందమతి నితరవ్యా
పారంబు లుడిగె మరచె మ । హీరాజ్యం బిహము పరమునేనే యైతిన్. ౨౧౦

ఉ. చక్కనిదాన భూపకులచంద్రుడు నన్నె వరించె నావలం
జిక్కెను భోగభాగ్యములు సేకురె బట్టపురాణినైతి నా
కొక్కరు సాటియే కల దహో పులిజున్నును బుట్టతేనియం
జెక్కడ లేని గర్వము వహించితి నిక్కితి విఱ్ఱవీగితిన్. ౨౧౧

ఉ. వీణ యెరుంగ జెం బెరుగ వీపున వ్రేలెడి తోలుచుట్టయుం
గోణ మెరుంగ బొం తెరుగ నోట జపించుట ముక్కుమూయుటన్
నాణెమెరుంగ నంగవసనం బెరుగన్ మడిసం చెరుంగ నా
రాణితనంబునాడు తగురా నడుమంత్రపుకల్మి కింతెరా. ౨౧౨

గీ. వ్యాసమునివర్య! యానాటి వైభవంబు । తలచి తెలుపంగ నూరేండ్ల కలిమియగునె
కలికిదనమున దళుకంటి తళుకుమంటి । కులికి కులికి కుసుక్కున గూలబడితి. ౨౧౩

క. ఈగతిఁ బంద్రెండేడులు । భోగించితి మొక్కక్షణము పోలిక నేనున్
సాగరవసనాపతియున్ । కాగల కాసింత యాయెగా మునిచంద్రా! ౨౧౪

గీ. చెప్పుకొనబోవ నాకేమొ సిగ్గుదోచు । నెలగడచి రెండు మూడాయె నలసటాయె
జేడెలెల్లను గుసగుసలాడ వింటి । గడుపు కడుపోసి మనరాణిగారి కనుచు. ౨౧౫

గీ. చప్పనాయె నోరు త్రిప్పెను గడుపులో । గొప్పలోని పూలు గొప్పబరువు
లాయె మొగము తెల్లనాయె మొనలు నల్ల । నాయె చవులమీద నాసలాయె. ౨౧౬

క. పదియవ నెల రాగానే । యుదయించెను బుత్రు డొక్క డుడువాసర యో
గ దిన కరణ శుద్ధి గలుగ । గడసి శుభస్థానములను గ్రహములు నిలువన్. ౨౧౭

క. నేత్రోత్సవముగ సుతుగని । పుత్రోత్సవ మాచరించె భూపతి యంతం
బాత్రత యెఱింగి యిచ్చెన్ । గోత్రాదుల విప్రవరులకును మునినాథా! ౨౧౮

క. అన్వహము ముద్దుజేసి సు । ధన్వుండను పేరుబెట్టి ధాత్రీపతి వే
డ్క న్వాని బెంచె నంచిత । తన్వాది సులక్షణైకధాముఁ డటంచున్. ౨౧౯

క. అంతట రెండేం డ్లరుగగ । వింతగ మరియొక్క కడుపు వెంటనె వచ్చెన్
గంతుసమసుందరుం డ । త్యంతశుభాంకుండు పుట్టె నాత్మజుఁడు మునీ! ౨౨౦

గీ. అతని వీరవర్మ యని పిల్చుచును రాజు । మిగుల ముద్దుజేసి పగలు రేయి
ముచ్చటెల్ల దీర మురిపెముల్ బడసెను । గనియె నన్ను రెంటికంటె ప్రీతి. ౨౨౧

వ. ఇట్లు క్రమంబుగా నిరుబదిమంది కొడుకులు పుట్టిరి. తదనంతరంబ నానావిధ సుఖదుఃఖంబు లొందుచుఁ జిరకాలంబు పుత్రాదులతో, వారిభార్యలు, బిడ్డలతోను గార్హస్థ్యధర్మంబునం బడవలసిన యెల్లపాటులుం బడుచు, పౌత్ర, ప్రపౌత్ర, స్నుషాదుల లాలన పాలనాదికంబుల జాగరూకతగల్గి వర్తిల్లుచు. ౬౨

ఉ. నేనకదా పతివ్రతను నేనకదా నృపభార్యనై శుభా
ధీనుల సూనులం బడసితిన్ మరి పౌత్రులు పౌత్రికుల్ శశాం
కాననులై మహాగుణగుణాఢ్యులునై తగువారు నాకె యం
చూనితి గర్వముం గరము నుబ్బితి రేగితి మిన్ను ముట్టితిన్. ౬౩

క. ఇటులుండగఁ బరభూపతి । తటుకున మాపురముమీద దండువెడలి తా
దటపిటముచేసి మహితా । ర్భటితో బడమొత్తె బుత్ర పౌత్రులనెల్లన్. ౬౪

క. అంతట సంతాపంబున । జింతిల్లుచు గర్వమెల్ల చెదరి నిశాంతా
భ్యంతరము వెడల కింతయు । శాంతిగనకయున్నయట్టి సమయమునందున్. ౬౫

## —॥నారదునకు స్త్రీత్వ నివృత్తి॥—

వ. లక్ష్మీకాంతుండు దయార్ద్రస్వాంతుండై వృద్ధబ్రాహ్మణవేషంబున విచ్చేసి నన్నుం జూచి యో యింతీ! నీవేల చింతిల్లెదు? లెమ్మనిన, నతనిం జూచుచు గన్నీరు మున్నీరుగా వగచుటం గని యీ పుత్రపౌత్రాదిక కుటుంబంబెల్ల భ్రమంబుగాని యథార్థంబు గాదు, నీకెక్కడ పుత్రు లెక్కడ యీసంసారం బెక్కడ మాయామోహిత వేలయయ్యె దూరక బంధుగుణంబులకును పుత్రపౌత్రాదికంబునకును దిలోదక వాసోదకంబుల జూడు దనిన నవ్విప్రుని పలుకులు విని నృపతియు నేనును గొందరు బంధువులంగూడి విప్రుడు సూపించు త్రోవన పోయి యొక పరమపావనంబైన తీర్థంబుగాంచి నిలువంబడిన నవ్విప్రుం డత్తీర్థంబున మునుగు మిదిలోకంబునకు దరిగాదని నుడివిన విని తీర్థంబునం దిగ్గి యొక్కసారి మునిగినంత. ౬౬

క. నాగడ్డము నామీసము । నాగోచియు నాదు చెంబు నారవలుపయున్
నాగొప్ప తెలిజడలు నా । నాగతులు న్నాకు కలిగి నారదుడైతిన్. ౬౭

క. నే నిట్లు నీటనుండగ । దానవసూదనుఁడు తీర్థ తటమున వీణం
బూని మృగాజినముం గొని । తా నిలచెను రమ్ము నారదా యనుచు నొగిన్. ౬౮

వ. అప్పుడు నేను.

గీ. అయ్యయో యింతలోనె యెంతాయె మాయ । గారడీ నే నెరుగనైతి కలికినైతి
గంటి పుత్రుల గడిపితి గాల మోలి । నింద్రజాల మిదంచు నా కెరుకలేక. ౬౯

వ. ఇట్లు చింతాకులపడియున్న నన్నుం జూచి నారాయణుండు నారదా! నీ వేల నిల్చెదవు, తీరం
బునకు రమ్మనిన, నేను పురుషసర స్తీరంబునకుం జేరి పురుషరూపంబుతో నిలువంబడి
హరిచరణంబుల కొరగి ప్రణామంబుసేసి యున్నంత. ౩౦

క. నను నారదుగా విప్రుని । వనజాక్షునిగా నెఱింగి వసుధాధిపు డా
త్మను గడువిస్మయపడి యి । ట్లని తా విలపించె గనుల నశ్రువు లొలుకన్. ౩౧

ఉ. ఎక్కడ కేగితే జలరుహేక్షణ! నన్విడనాడి పోవ నీ
కెక్కడిబుద్ధిపుట్టె దగునే తుది ని న్నెడబాసియున్న నా
కక్కరపట్టునే బ్రతుకు నారయ రాజ్య ధనాదు లేనునున్
నిక్కము నిన్ను జేరెద వినీలకచా మరుమాట బల్కుమా. ౩౨

వ. ఇట్లు విలపించుచున్న రాజున్యుం జూచి నారాయణుండు యుక్తియోజితంబులగు వచనం
బుల నతని కిట్లనియె. ౩౩

క. అది యెవ్వతె నీ వెవ్వడ । వది నిన్నుం గలసె నెట్టు లట్టుల యురిసెన్
మొదల నిను గూడు టొప్పిన । దుది విచ్చుట యొప్పకున్నదో జననాథా! ౩౪

క. నట్టేట రెండుకట్టెలు । కొట్టుకపోవు చొకచోట గూడు మరొకచోన్
నెట్టుకొని విడుచు నీవును । నట్టుల గూడితివి విడిచి తది చిత్రంబే! ౩౫

ఉ. ఓడలు గూడు నొక్కయెడ నొడ్డిగిలున్ మరియొక్కచోట టె
న్నీడకు వత్తు పాంథులు పసింగొని విత్తురు కొంత సేపులో
వాడును వీడు సంస్కరణవార్తలు నట్టివయంచు నమ్ము మీ
రేడ యెఱుంగుదే మొదల బ్రేయసి యిప్పుడు నట్ల యెంచుమీ. ౩౬

క. అప్పుడతి మరలవచ్చునె । యిప్పుడు నీ వడలుమాత్ర నేటికి దుఃఖం
బొప్పగ నీ పురికిం జని । యెప్పటియ ట్లనుభవించుమీ భోగంబుల్. ౩౭

వ. రాజేంద్రా! నీతోడం గొంతగాలంబు గాంతగా బ్రవర్తించినది దేవీమాయానిర్మితయగు
మోహినిగాని సత్యంబుగా గామిని కాదు, కావున జ్ఞానంబు గలిగి నీవు మరల నీపురంబు
నకుం జని రాజ్యంబు సేసికొను మనిన విని యా మానవేంద్రుండు లక్ష్మీజానికి నమస్క
రించి వీడ్కొని నిజమందిరమున కరిగి రాజ్యంబు తన పౌత్రున కప్పగించి వనంబున
కరిగె మరియు నేనును. ౩౮

గీ. నన్ను జూచి నవ్వు నారాయణుని గాంచి । యెంతమోసమాయె నిందిరేశ
యాడుదాననైన యప్పటి నాచేష్ట । లెల్ల దలచికొనిన నెంతవింత. ౩౯

గీ. ఆడుదాననైతి నదిసరే నా లింగ । దేహమచటనుండి తెలియనైతి
పూర్వదేహచరిత పుండరీకదళాక్ష । హేతువేమి చెప్పు మిపుడు నాకు ౪౦

వ. మునీంద్రా! తెలిపెద వినుము మహామాయావిలాసంబని దీనిం దెలియుము. సర్వజంతు దేహంబులయందును దశాభేదంబు లనేకంబులు గలవు. జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయంబు లనునవి దేహధారుల దశభేదంబులు. సుప్తుండగు నరుండు శ్రవణజ్ఞానాదిరహితుండై యుండు. ప్రబుద్ధుండై మరలి యెఱుంగుచుండు. నిద్రలో చిత్తంబు చలించుట స్వప్నంబులుపుట్టు. చిత్తవృత్తులు నానా భేదంబులు గలిగి యుండు. నేనుగు వెంబడించెడి, నన్నుం జంపవచ్చుచున్నది. నే నెందుబోవుదు ననియు, మృతుండైన పితామహుండు గృహాగతుండైన మాటలాడితి ననియు, మేలుకొనినప్పుడు తెలుసుకొను చున్నాఁడు. స్వప్నంబున భ్రమంబని తెలిసికొన నేరండు, కావున మాయామోహితుండవై యున్నంత మట్టుకు నీకుం బూర్వస్మృతి లేకయున్నయది. మోహంబు విడిచి యిప్పుడు పూర్వస్మృతి కలవాఁడ వైతివి. శంకరాదుల కేని దుర్జ్ఞేయంబగు మాయం దెలిసికొన నేరి తరంబు? గుణత్రయాత్మకంబైన జగంబున సంసారంబు గుణరహితంబై యుండునే? సమస్తంబు మాయామోహితంబని యెఱుంగుము. నన్నేల యడిగెద వని నారదుండు నాకుం జెప్పెనని వ్యాసుండు జనమేజయునకు మరియు నిట్లనియె. ౬౪౧

క. తదనంతర మేమాయెను । ముదమున దెలుపుమని యేను ముని నడిగిన న
మ్మృదుకతపసి నాతోఁడను । బదపడి యిట్లనుచుఁ దాను బలికె నిలేశా! ౬౪౨

క. గరుడహయుఁడు నే నేగెద । గరుడునిపై నెక్కి నీవు గదలు మిఁక ననన్
సరసిజభవుసదనమునకు । నరిగితి వైకుంఠమునకు నరిగె నతండున్. ౬౪౩

గీ. బ్రహ్మకడకు నేగి ప్రణమిల్లి నిలచిన । నెచొటువోయి యుంటి విన్నినాళ్ళ
చింత నొందనేల చెప్పుమీ యన విని । జనకుమొగము జూచి సంభ్రమమున.

గీ. తండ్రి యేమిచెప్ప దామోదరుడు మటు । మాయజేసె మోసపోయి యేను
గొలనియందు గ్రుంకి కులుకులాడి నయితి । క్షితితలేంద్రునకును గృహిణి నైతి.

క. చిక్కితి సంసారంబున । నెక్కితి నే మేద బెక్కు లేడులు సుఖస
మ్యక్కలితనైతి నంత ద । టుక్కున దిగబడితి నేమిటో యది యెల్లన్.

క. తుద కా నారాయణుఁడే । ముదుసలిబాపఁడయి వచ్చి ముదితమొదలు దా
వదలించెను నా కింకొక । సదమలతీర్థమున దించి స్నానం బాడన్. ౬౪౭

క. జడశాయి నడిగితిని నే । నుడుగక నీమాయ దెలుపు మోపికనని యా
లేఁడు దేవీమహిమంబని । నుడివెను దనలోకమునకును జనియెఁ దండ్రీ! ౬౪౮

క. నే వనితామణి నగుచున్ । భూవరుతో నున్ననాఁడు పూర్వజ్ఞానం
బావంత లే దదెక్కడి । దేవీమహిమంబొ నాకు దెలియదు తండ్రీ. ౬౪౯

క. నీ వేయుపాయమున న । ద్దేవీమాయను జయించి తేలితొ చెపుమా
నీవలనం బరమేష్ఠి । నే వినియెద ననిన నవ్వి నెమ్మిం బలికెన్. ౬౫౦

ఉ. మాయను నేన గెల్తు ననుమాట హుళిక్కి సమస్తలోకముల్
మాయకు లోబడున్ హరియు మాధవుఁ డింద్రుఁడు దిక్పతుల్ సదా
మాయ నెఱుంగ లేక తమ మార్గములం జనుచున్నవారు దు
ర్జ్ఞేయము దుర్జ్ఞయంబు పరికింపగ మాయకు మించ నున్నదే. ౬౫౧

క. కావున విస్మయ మేటికి । వే విడువుము శోక మనిన విని యక్కజమున్
బోవిడిచి తీర్థయాత్రలు । గావించుచు నుంటి నిన్ను గాంచితి నిచటన్. ౬౫౨

క. నీవును గౌరవహానికి । నీవడువున దుఃఖ మొంద నేటికి విడువం
గావలయు గాకయుండునె । కావలసినయదియు గాల కర్మవశమునన్. ౬౫౩

క అని నారదుండు సెప్పిన । విని నే వగపెల్లమకిని విడిచితి గాలం
బును గడుపుచుంటి నొకచో । టను శాంతి సరస్వతీతటంబున నధిపా! ౬౫౪

ఉ. ఇత్తరి నేను శాంతి నొకయింత వహించి సదర్థమై పురా
ణోత్తమమై సమస్తకథనోపగతంబయి భద్రదాయియై
చిత్తసుఖైక హేతువయి చెల్వగు భాగవతంబు జేసితిన్
గ్రొత్తలుగావు దేహధరకోటికి దుఃఖము లుర్వరాధిపా! ౬౫౫

వ. మాయాజన్యంబులైన గుణంబులతో గూడియున్న దేహంబులకు సుఖదుఃఖంబులు స్వాభావికంబులు. బ్రహ్మాదులు గుణంబులవలనం దొలంగినవారు కారు. గుణంబులు రజస్సత్వతమంబు లనునవి మూడై యుండు. సూర్యవంశజులైన రాజులును, చంద్ర వంశజులైన భూపాలురును, సమస్త దేవతలు, సమస్త ప్రపంచంబును గుణమయంబులు. వస్త్రంబునకు తంతువులును, ఘటంబునకు మృత్తు నెట్లట్లు ప్రపంచంబునకు గుణంబు లుపాదానంబులై యుండు మరియు. ౬౫౬

క. మాయావిశిష్టమైనది । యీ యఖిలం బనుచు దెలియు మీశ్వరియే తా
మాయారూపిణిసుమ్మి । మాయకు మిక్కిలియు లేదు మానవనాథా! ౬౫౭

క. హరిమాయ హరుడుమాయ య । సురవిభుడును యముడు సోమ సూర్యులు దిక్కుల్
సురలును నరులును మాయయ । నరయ న్నే నీవు నిదియు నది మాయసుమీ ! ౬౫౮

క. ఈవిశ్వంబున మాయకు । దాపలమై ధాత్రియై సదా పోషిణియై
దేవియను భావమున్నది । యో వసుధాధీశ కొలువు మోపిక జననిన్ ౬౫౯

క. ఆ దేవి కరుణగల్గిన । లేదుసుమీ మాయ నీకు లేశంబైనన్
రాదుసుమీ నీజోలికి । బాదుసుమీ శుభమునకును బరసుఖమునకున్. ౬౬౦

క. దేవీస్మరణము ధ్యానము । దేవీపూజనము స్తవము దేవిభజనమున్
దేవీకీర్తనమును భద్రావహములు నమ్ము నమ్ము మవనీనాధా! ౬౬౧

గీ. సచ్చిదానందరూపిణి శాశ్వతప్ర । బోధమయి లోకజనయిత్రి భూతభావి
వర్తమానవినోదిని వంద్య నింద్య । జనవిభేదినిఁ గొలువు మో జనవరేణ్యా! ౬౬౨

క. అని యీగతి వృత్రాసుర । హననాదులఁ జెప్పినాఁడ నాలించితి వీ
వును సావధానచిత్త । ప్రణయతఁ బూర్వార్ధ మిది పురాణంబునకున్. ౬౬౩

క. జగదంబాభక్తిరతుం । దగువానికి దీనిఁ జెప్ప నగు నితరులకున్
దగ దెన్న డిది రహస్యం । బగణితపుణ్యైకహేతు వతిపావనమున్. ౬౬౪

చ. సకలపురాణసారమును శాశ్వతబోధనిధానమున్ ద్రయీ
ప్రకటితమంత్రతుల్య మతి రమ్యము సాధుతర పమాణరం
జకమును దీని భూరిమతి సక్తిఁ బఠించిన జేరి విన్న నై
హికసుఖ మందు జ్ఞానము నహీనము నొందు నరుండు భూవరా? ౬౬౫

## —: కృతిపతిసంబోధనము. :—

మ. స్వశిఖామూలసమీక్షణానుసృతదీక్షా యుక్ర్పతిజ్ఞావిధా
వశపంకేరుహగర్భచక్రధర శుంభద్గర్వసర్వస్వక
ర్కశతానిష్ఫలతాకృదద్భుతకకుప్కాలాద్యవచ్ఛేదశూ
న్యశివానందసదోమ్చిదోమ్తనుధరా యల్లూరి సోమేశ్వరా.

గద్య : ఇది శ్రీమదిష్టకామేశ్వరీ పాదారవింద మకరందతుందిలమానసేందిందిర, దాసు వంశ పయఃపారావార రాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్రహరితగోత్రా లంకార, కృష్ణామండలమండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీవీరప్రతాపకోఘాండహంవీరరామచంద్రభూమీశ్వర దత్తగోదావరీమండల స్థిత సీతారామ పురార్ధభాగపరిపాలనాధీన, పుర్వోక్తోభయమండల న్యాయసభావాదక నియోగభారవ్యవహార, శ్రీవేంకటేశ్వరవరప్రసాదసంభూతకవిత్వవిద్యావిశేష బాల్యాది రచిత త్రింశత్ప్రత్యేక గ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితిప్రచారనిత్య, శ్రీరామా మాత్య ప్రణీతంబగు శ్రీ దేవీభాగవతంబను మహాపురాణంబునందు షష్ఠస్కంధము.

సంపూర్ణము.

శ్రీ

# దేవీ భాగవతము

## సప్తమస్కంధము

శ్రీకాంతా పదకన్యా
స్తోకమహాభర్మహర్మ్య సురుచిరశృంగ
ప్రాకటచిత్రవిచిత్ర
శ్రీకజటాజూటకేశ శ్రీసోమేశా! ౧

వ. అని యిట్లు సూతుండు పలికిన విని పరమానందహృదయారవిందులై శౌనకాదులు మునీంద్రా! నీవలన దివ్యచారిత్రంబులు విని ధన్యులమైతిమి. పదంపడి జనమేజయుండు వ్యాసునడిగిన నతం డేమి సెప్పె? నదియెల్ల సవిస్తరంబుగా వినిపింపవే యనుడు నతం డిట్లనియె. ౨

ఆ. వె. వినుఁడు మౌనులార జనమేజయుఁడు వాస । వితనూజుఁ జూచి యో తపోధ
నాగ్రగణ్య సూర్య నన్వయంబును సోము । నన్వయంబుఁ దెలుపు మాదరమున. ౩

క. అనుఁడును సాత్యవతేయుఁడు । జననాయకుఁ జూచి తాఁ బ్రసన్న వదనుఁడై
వినుమా యని వినిచెను దా । నిన తుహినమయూఖవంశ వృత్తాంతంబుల్. ౪

ఉ. శ్రీరమణీశునాభిసరసీరుహమం దుదయించె బ్రహ్మ యిం
పార నతండు భక్తి జగదంబను గొల్చి సమస్తలోకముల్
దా రచియింపఁ బూని పలు దారులఁ దా దలపోసి యింతయున్
నేరుపుఁ గానఁడయ్యె నవనీధవ! మానుషసృష్టి సేయఁగన్. ౫

వ. ఇట్లు మానుషసర్గవిస్తారం బతివేగంబునం జేయనేరక మరీచియు, నంగిరసుండును, నత్రియు, వశిష్ఠుండును, బులహుండును, గ్రతువును, బులస్త్యుండును నను నేడ్వురు మానసపుత్రులను, రోషంబువలన రుద్రుని, నుత్సంగంబువలన నారదుని, నంగుష్ఠంబు వలన దక్షుని, మఱియు సనకాదులగు కొందఱ మానసికులను సృజించె. అంత వామాంగుష్ఠంబువలన దక్షపత్ని పుట్టె. వీరిణి యను పురాణములఁ బ్రసిద్ధయైన యసిక్ని యను నదియ దక్షపత్ని యాద పత్ని వలన నారదుండు పుట్టెనని సెప్పిన విని జనమేజయుం డిట్లనియె.

ఆ.వె. సంయమీంద్ర నాకు సంశయం బొదవెడు । నలినగర్భసుతుండు నారదుండు
వెలయ దక్షువలన వీరిణియం దెట్లు । పుట్టెఁ బూర్వదేహ మెట్టుపోయె. ౭

ఆ.వె. అనుఁడు వ్యాసుతో ధరాధీశ పరమేష్ఠి । దక్ష! నీవు ప్రజలఁ దగ సృజించు
మనుచుఁ దొల్లి పలుక నాతఁ డయిదువేల । వీరవర్యులైన వారిఁ గాంచె. ౮

ఆ.వె. పుత్త్రిలెల్లఁ బారు పుత్రులఁ బడసి యి । ట్లొక్కరొకరి గేహ మొక్కయూరు
గాఁగ వృద్ధిఁబొందఁ గడు పెంపుతో నున్న । వారిఁ జూచి పల్కె నారదుండు. ౯

క. బిడ్డలను గనుటయే గడు । దొడ్డతనం బనుచు మీకుఁ దోచెను దగు నీ
గడ్డపరిమాణ మెఱుఁగరు । గడ్డయ్యెడి కొలిచి కనుఁడు కందుల నిటపై. ౧౦

ఆ.వె. కోడిగాల కిట్టు లాడిన నారదు । పలుకు లాలకించి వారు బ్రహ్మ
తనయ మేము పోయి ధర యెల్లఁ గొలిచి యా । వలను సృష్టి నేము సలుపుదమని. ౧౧

క. అని కొందరు తూరుపుది । క్కునకున్ దక్షిణమునకును గొంద ఱపరది
క్కునకుం గొంద ఱుదీచికి । జనిరి తురంగముల నెక్కి చయ్యన నధిపా! ౧౨

క. తన తనయు లిట్లు సనినం । గని దక్షుఁడు మనమునందుఁ గడు వగచుచుఁ గ్ర
న్నన నన్యతనూజాతులఁ । గనియెఁ బ్రజావృద్ధికొరకు క్ష్మాతలనాథా! ౧౩

క. వారలు పుత్రులఁ గాంచిరి । వారలు మఱిగాంచి రిట్లు వర్ధిల్లంగా
నారదుఁడు వచ్చి తొల్లిఁటి । తీరున వారలకుఁ బలుక దిగ్గన వారల్. ౧౪

ఆ.వె. తొంటివారు సనిన త్రోవకుఁ బోయిరి. । దానిజూచి యలిగి దక్షుఁ డంత
నారదుని శపించె నాశకుండవుగాన నిపుడ నాశమొందు మీ వటంచు. ౧౫

ఆ.వె. మఱియు నీవు సేయు దురితంబులం బట్టి । గర్భగోళగుఁడవు గమ్ము నాకుఁ ౧౬
బుత్త్రిసౌఖ్య మెడలఁ బుచ్చితి గావున । సుతుఁడ వగుమటన్న నతఁడు నంత.

క. వీరిణియం దుదయించెఁ గు । మారుండై దక్షునకును మఱియును బిదపన్
వీరిణియందే తగఁ గ । న్యారత్నములను సృజించె నఱువదిమందిన్. ౧౭

క. పదమువ్వురఁ గశ్యపునకుఁ । బదిమందిని ధర్మునకును మఱి సోమున కి
ర్వదియేడ్వురఁ దనకూఁతుల । నెద నానందమున నాతఁ డిచ్చె మహీశా! ౧౮

క. నలువుర నరిష్టనేమికి । నలువుర నంగిరున కవనినాథ ! భృగునకున్
జెలువుగ నిద్దఱి నిచ్చెఁ బొ । దలె వారివలన దేవ దానవకులముల్. ౧౯

వ. అనిన జనమేజయుఁడు సూర్యవంశంబు సవిస్తరంబుగాఁ దెలియజేయవే యనిన నేను
నారదునివలన విన్నవిధంబుఁ దెల్పెద విను మొకప్పుడు నారదుండు సరస్వతీతటంబునఁ

బుణ్యాశ్రమంబున విచ్చలవిడిఁ జరింపుచుచుండ నే నమస్కరించి వానియెదుట నిలిచి యో మునివర్యా! ఈ వైవస్వతమనుకాలంబున రాజచరిత్రంబులు వినిపింపవే యనిన నతండు సంతసించి నాకు వినిపించె నత్తెఱంగున నీకును విన్నవింతు నని యిట్లనియె. ౨౦

క. సర్వజ్ఞుఁడైన విష్ణుఁడు । సర్వపురాణములలోఁ బ్రశంసింపఁబడున్
సర్వంబు సేయు నభవుడు । సర్వాత్ముఁడు సర్వశక్తి సర్వేశ్వరుఁడున్. ౨౧

సీ. భగవతిఁగూర్చి దాఁ బదివేలయేడులు సృష్టినిఁ గామించి చేసెఁ దపము
తపము పేరిమిఁ గాంచెఁ దత లక్షణాఢ్యుల మానసపుత్రుల మహితగుణుల
నందు మరీచి మహాతేజుఁడై సృష్టిఁ గావింప యత్నించి కశ్యపు గనె
దక్షకన్యకలయి తనరెడి పదుమువ్వురను గశ్యపుఁడు సేసికొనియె పెండ్లి

తే.గీ. అతనికిని దేవతా దైత్య యక్ష భుజగ । పశు విహంగములు పుట్టెఁ బరగె నందు
వలనఁ గాశ్యపి యనుపేరు వసుమతికిని । దెలిపెదను విను మింకఁ బృథ్వీతలేంద్ర! ౨౨

క. దేవతలయందు సూర్యుం । డో వసుధాధీశ ఖ్యాతి నొందుచు నెంతే
ఠీవి వివస్వంతుండని । యీ విశ్వం బెల్లఁ బిల్వఁ బృథ్వీనాథా ! ౨౩

క. పుడమి వివస్వంతునకును । గొడుకై వైవస్వత మను కుంజరుఁ డెన్నం
బడె నతని కొడవె నిక్ష్వా । కుఁడు వెలసెం జందకిరణ కులవర్ధనుఁడై. ౨౪

వ. వైవస్వతునకు నిక్ష్వాకుండును, నాభాగుండును, ధృష్టుండును, శర్యాతియు, నరిష్యంతుండును, ప్రాంశుండును, నృగుండును, గరుషుండును. బృషధ్రుండునను గొడుకులు తొమ్మండ్రు. వారు మనువువలనం బుట్టుటనుబట్టి మానవులయిరి అం దిక్ష్వాకునకుఁ గొడుకులు నూఱువు రందు మొదటివాఁడు వికుక్షి యనంబడు. మనుపుత్త్రులగు తొమ్మండ్రవంశంబులు వివరించెద వినుము. నాభాగునకుం బ్రతాపశాలియగు నంబరీషుండును, ధృష్టుని క్షత్రంబు బ్రహ్మభూతంబయ్యె. నతండు సంగ్రామకాతరుండయ్యె. శర్యాతికి నానర్తుండను నొక కొడుకును, రూపలావణ్యసంయుత యగు నొక కన్యకయుం గలిగిరి ఆ కన్య నంధుండయిన చ్యవనుండు పెండ్లియాడ నా సుశీల పాతివ్రత్యంబునం జేసి సులోచనుండయ్యె. నది యశ్వినులచే నయ్యెనని వింటిమని చెప్పిన విని జనమేజయుండు. ౨౫

తే.గీ. వింతగానున్నదీకథ వినఁగ వినఁగ । నెఱిఁగి యందున కెట్లిచ్చె నృపుఁడు గూఁతు
సుందరాంగి సులోచన మందగమన । నెఱుఁగఁజెప్పవె కారణం బురుగుణాఢ్య!

క. అనుఁడును వ్యాసుఁడు శర్యా । తి నరపతికి వేయిమంది తీవియబోం డ్లం
దును నల్వురు రాట్పుత్త్రిక । లనుఁగుం గోమలులు లక్షణాంచిత లధిపా! ౨౭

క. అం దొకభార్యకు సుతయై । పొందుగను సుకన్య సుగుణపూరిత యగుచున్
సుందరియై తనతల్లుల । కందఱికిని ముద్దుఁజూపు నవనీనాథా! ౨౮

క. నగరమున కనతిదూరం । బగుచోట న్మానసాంబుజాకరతుల్యం
బగు కొలను గలదు తన్నిక । టగతి న్నానాలసద్విటపియుక్తం బై. ౨౯

ఆ.వె. క్రమ్ముకొన్నతోట నెమ్మితో జలపాన । మేని జేయ కాచరించెఁ దపము
భృగునికొడుకు చ్యవనుఁ డీశ్వరి జగదంబ । దేవి నాత్మఁ దలఁచి దృఢమనీష. ౩౦

క. చెదలుం జీమలపుట్టయుఁ । బొదలును దీవియలు గ్రమ్మి ముని యొడలెల్లన్
మొదలు తుద నడుము ప్రక్కలు । నిది యది యనరాక యొక్కటే పుట్టయ్యెన్. ౩౧

మ. ఒకనాఁ డా ధరణీధవుండు రమణీయుక్తుండు శర్యాతి యు
త్సుకతం బంకరుహాకరంబుఁ గన నుద్యోగించి యా తోఁటకుం
బ్రకటప్రాభవలీల నేగి సరసుం బ్రాపించి క్రీడింపఁగా
నికటారామమునన్ సుకన్య విహరించెం గ్రొవ్విరుల్ గోయుచున్. ౩౨

తే.గీ. పూలుచిదుముచుఁ జిదుముచుఁ బోయి పోయి । యట్టెచూచినఁ గననయ్యెఁ బుట్ట యొకటి
పుట్టనడుమను గననయ్యెఁ బొరియదోయి । బొరియలోఁజూడఁ గననయ్యె మెఱుగు లపుడు. ౩౩

క. ఇదియేమి చిత్ర మనుచున్ । మదవతి వల్మీకరంధ్ర మార్గమున వెడదై
బొదలంజేయఁ దటుక్కునఁ । గదిసి కరంబునను గంటకంబును బూనన్. ౩౪

తే.గీ. మెఱుపుమెఱుపులకొరపులు గఱపమఱప । బరగు నెరిగల మెఱుఁగుల నెరుగమేని
యొరపు మెరయించి తెరవ యొక్కరితె దరిని । దిరుగఁగనుఁగొని మునిమృదుస్వరముతోడ.

ఉ. దూరముపోఁగదే వికచతోయజనేత్ర కృశోదరీ ననుం
జేరఁగరాకు తాపసుఁడఁ జిన్నతనంబునఁ గంటకంబునుం
దూరిచె దేల రంధ్రమునఁ దోచక యిప్పని సేసెదేనియుం
గాఱియసుమ్ము నమ్ము మిది గా దొక చీమలపుట్ట సుందరీ. ౩౬

ఆ వె. అనిన వినక చిన్నతనముచే నక్కన్య । పుట్టబొరియఁ బగలఁగొట్టి నందు
మౌనికనులు పగిలె మానిని యెఱుఁగక । సరగ నేగి క్రీడ సలుపుచుండె. ౩౭

ఆ వె. కనులఁబొడువ నతఁడు కారెడి నెత్తుటితో । మిగుల వేదనమునఁ బొగిలి పొగిలి
క్రోధరసము బూని కొఱకొఱలాడిన । నంత నిచట రాజు నంతికమున ౩౮

క. మలమూత్రనిరోధం బై । గొలకొల సైనికులు గొట్టికొనిరి గజోష్ట్రం
బులు తురగంబులు నట్టుల । గిలగిలమని కూలి పెద్ద గీపులు పెట్టెన్. ౩౯

ఆ.వె. కడుపు లుబ్బి గుట్టు గట్టున మొట్టోయి । దేమి యొంటిరేవెలి కేగరాదు
రెండువ్రేళ్ళ పేరు లేనె లేదాయెను । చావుమూడె ననుచు సచివు లనిరి. ౪౦

ఆ.వె. పొట్టమీదఁ జేయి పెట్టుక శర్యాతి । నిట్టనీల్గికొనుచు నట్టు వాంచి
యెవరి పాట్లు విందు నే నేమిసేయుదు । నదియు నిదియు లే దటంచు నడలె. ౪౧

వ. ఇట్లు శర్యాతి నిజసైన్యంబులు శకృన్మూత్రంబులు లేక యత్యంతపీడితులై మొఱలు
పెట్టుచున్నం గని దాను దనమంత్రులును నట్ల బాధం బొందుచున్నవా రగుటచే నెద్ది
యుం చెప్పనేరక యొక్కింత తడవు మనంబునం బరికించి గృహంబునకు నేగి యాలోచింత
మని సైన్యయుక్తుండై వెడలివచ్చి నగరంబుఁ బ్రవేశించె మంత్రి సహితంబుగా నిజసైని
కులం జీరి యీ శకృన్మూత్ర నిరోధంబునకుఁ గారణంబు మన దుష్కృతంబయి యుండు
కమలాకరంబునకుఁ బశ్చిమభాగంబున మహాతపోధనుండు చ్యవనుండు దపంబు సేయు
చున్నవాఁ డతని కెద్దియేని యపకృతంబెవండేఁ జేసియుండు; తత్ఫలం బిదియ యుండు
నని నిశ్చయించి వారల నడిగిన వారు మేమెఱుంగమని శపథంబులు సేసిన నిజసుహృ
ద్వర్గంబు నడిగిన పీడ్యమానుండగు తండ్రిం జూచి సుకన్య యిట్లనియె. ౪౨

తే. గీ. నాయనా నీవు సరసులో స్నానమాడు । సమయమున నేను వనకేళి సలుపదలచి
యల్లనల్లన మల్లియ మొల్ల జాజి । పూవుగోయుచు నందందఁ బోయిపోయి. ౪౩

ఉత్సాహ. వెంటవెంటఁ బుట్ట యొకటి వీరుధావృతంబు నేఁ
గంటినయ్య తండ్రి రెండు కల్గు లున్న వందులో
ముంటితోడ రెండు మూడు పోట్లు పొడిచి చూచితిన్
దంట యెఱుఁగ మెఱుఁగటంచు దలచితి న్నృపాలకా ! ౪౪

క. అనినన్ విని రాజన్యుఁడు । మనమున నత్యంతశోక మగ్నుండయ్యెన్
మునియును బుట్ట న్వెడలెను । ఘనతరశోకమునఁ గనులు గనరామి నృపా ! ౪౫

ఉ. అంతట రాజు వోయి మునియంఘ్రులపైఁ బడి యోమహాత్మ య
త్యంతకృపామతుల్ తపసు లంచును బెద్దలు సెప్ప వింటి ని
య్యంతి యెఱుంగ కిట్టు లొనరించెను బాల విమూఢబుద్ధి నీ
క్షాంతికి నర్హురాలు విరసం బొనరింపకుమయ్య మ్రొక్కెదన్. ౪౬

క. వినయోపనతుండై య । జ్జనపాలుం డిట్లు పలుక సంయమి క్రోధం
బనునది యణువైనన్ నే । గన నెన్నఁడు శాపమియ్యఁగా లేదుసుమీ. ౪౭

ఆ.వె కనులు దీపులెత్తి కడు నడలితిఁగాని । చీమయంత నేను జేయలేదు
భగవతీజపంబు భక్తితో జేయుచు । నున్నవాఁడ నన్య మొం డెరుంగ. ౪౮

క. శ్రీదేవీభక్తునకున్ । బాధను నీ యింటియాడబడు చొనరించెం
గాదన నగునే నీకును । వేదన నేనేమి సేయ వేడెదు సెప్పుమా. ౪౯

తే.గీ. ఏమిచేయుదు నిపుడు నే నింత వృద్ధ । దశను నాకును నుపచర్య తప్పకాచ
రింపఁగలవార లెవ్వ రీ యెడను గనులు । రెండు వోయిన యంధుండ నృపవరేణ్యా. ౫౦

క. అని మునివర్యుఁడు పలుకఁగ । విని రాజన్యుండు సకల విధముల నీకుం
బనులొనరింపగ సేవకు । లను నియమించెదనుసూ తలంకఁగనేలా. ౫౧

క. నా సేవకజను లెల్లను । నీ సేవకులనుచు నమ్ము నెమ్మని నీకుం
గాసి యొదవనీ నింకన్ । భాసురగతిఁ బ్రోవవే కృపామతి నన్నున్. ౫౨

చ. అన విని మౌని భూమివర యంధుఁడ నేఁ దపమాచరింప నె
ట్లనువగు నద్దియెల్ల భవదాత్మజ నాపరిచర్య కిమ్ము నే
మనమునఁ గొంతశాంతిఁ గని మానక నే సుఖలీల నుండఁ బె
త్తనమున నాతపంబు నొక దారిఁ బ్రవర్తిలుఁ దొంటి యట్లగున్. ౫౩

తె.గీ. తాపసుండను నే నియతవ్రతుండఁ । దనర నీ విట్లు జేయుట తప్పుగాదు
కరము ప్రీతిమెయిం గాళ్లు గడిగి కన్య ధారవోయుము వేగమే ధారుణీంద్ర । ౫౪

క. జనవర శుభస్యశీఘ । మ్మనఁగా నశుభస్య కాలహరణమ్మనగా
వినవే, కానిమ్ము మనం । బున సందియపడకు నీకుఁ బుణ్యము వచ్చున్. ౫౫

వ. అనుడు. ౫౬

ఆ.వె. చ్యవనువాక్యములను శర్యాతి యాలించి । చేడె నియ్యననుచు జెప్పజాలఁ
డలరి యట్లకాక యననేరఁడాయెను । నిట్టునట్టు మనసు గొట్టుకొనఁగ. ౫౭

వ. తన మనంబున. ౫౮

ఉ. అక్కట యేమిసేయుదు మహాముని యీతఁడు గుడ్డి వృద్ధుడు
న్మిక్కిలి రూపహీనుఁడును నే నెటులం గొనుమంచు నిచ్చెదం
జక్కనిచుక్క భూమిఁగల చానలకుం దలకట్టు గాకికిన్
ముక్కున దొండపం డిడిన పోలిక నాసుత నంచితాకృతిన్. ౫౯

ఆ.వె. గ్రుడ్డిమగనిఁ గట్టి కొమ్మని చెప్పంగ । నెట్లు నాలుకాడు నెట్లు నేను
ధారవోయ నశ్రుధారలతోఁగూడ । నౌర యెంత క్రూరమైన చెయ్వి. ౬౦

ఆ.వె. మగువ తుల్యుడైన మగనితో గూడిన । సుఖముగల్గు నెందుఁ జూచి సూచి
యెట్లు గొంతుఁ గోయ నివ్వేళఁ జేయాడు । నగరె సాటివారు నన్ను గాంచి. ౬౧

ఆ.వె. మన్మథాంబకముల మాడ్కి మెత్తని మేన । నెట్లు ముద్దుమగుద యీ కఠోర
శల్యమాత్రదేహుసరస జీవించెడి । నయయొ కాలమెట్లు లబల గడపు. ౬౨

ఆ.వె. కన్యనియ్యకున్నఁ గసలి యి మ్మునినాకు । శాపమిచ్చెనేని సకలదుఃఖ
భాజి నగుదు నేయుపాయంబు నా కింక । ననుచు గేహమునకు నరిగి నృపతి. ౭౩

క. డోలాయమానమానసు । డై లోలోఁ గుంది కుంది యాతం డెద్దే
పీలుఁ గనక మంత్రులతో । నాలోచించెద నటంచు ననుచరు నొకనిన్. ౭౪

తే.గీ. పంచి మంత్రుల రావించి పరగ వారి । తోడ చ్యవనుఁడు తనతోడ నాడినట్టి
నుడుగుఁ జెప్పుచునుండ నయ్యెడ సుకన్య । యింగిత మెరింగి తాఁ దండ్రి కిట్లు లనియె.

తరళ. అనఘ యేటికిఁ దాపమొందెద వాత్మలో మునిపాలికిం
జని వసించెద సేవఁ జేసెద సంయమీంద్రున కిమ్ము నన్
ఘను డతం డిడుగంగ నూరక కాదనం దగ దెన్నఁడున్
మనమునందున శాంతిఁ బూనుము మానవేశ్వర నావుఁగున్. ౭౬

తే.గీ. కూతురా. యెట్లు పరిచర్య గ్రుడ్డివాని కాచరించెద వబల వీ వతఁడు మునలి
రూపహీనుంతు విన్నవారు హసియింత్రు । పర్ణశాలను నీ వెట్లు బ్రతుకఁగలవు ? ౭౭

క. ఒకచెంపఁగారు బా ల్వే । రొకచెంప నెత్తు రేదియుం దెలియని బా
లిక పీవు ని న్నరణ్యము । నకుఁ బంపిన నన్నుఁ జూచి నవ్వరె లోకుల్. ౭౮

క. నిను నా గుడ్డి కొసంగుకం । డెను సేనలు మిత్రజనులు నేనును బడిస
చ్చిన మేలుకాదె యే వే । దన గల్గిన నీను గుడ్డి తపసికి నిన్నున్. ౭౯

క. అనిన విని నవ్వుకొనుచున్ । వనితామణి తండ్రి నీవు వగవగనేలా
నను మునికిచ్చుట లోకం । బునకెల్ల సుఖంబుసేయఁ బుణ్యమకాదే. ౮౦

ఆ.వె. పెక్కు జనులు వగవ నొక్కర్తు సుఖపడు । టొప్పునొక్కొ కాక యొకతె వగవఁ
బెక్కుజనులు సుఖము దక్కించుకొను టొప్పు । నొక్కొ దలఁచి చెప్పు మూర్వరేశ. ౮౧

ఆ.వె నాకుఁ గష్టమనుచు నరనాథ నీవేలఁ । జింతిలంగ నాదు జిత్తమునను
భోగవాంఛకన్నఁ బుణ్యవాంఛయె దొడ్డ । పుణ్యవాంఛవలనఁ బుట్టు సుఖము. ౮౨

క. నాకష్టము నాయిష్టము । నాకే తెలియనగుఁగాక నరలోకవిభూ!
మీ కందరికిం దెలియునె । యేకష్టమురాదు నన్ను నీ వీ మునికిన్. ౮౩

ఉ. నావుడు మంత్రులున్ ధరణినాథుఁడు సంతసమంది మౌని సం
భావితుఁ జేసి తెచ్చి నిరవద్యత నాతనికిన్ సుకన్య ని
చ్చావిధి నిచ్చినన్ సకలసైన్యములున్ సచివుల్ హయాదులున్
భూవరుడున్ సుఖించె విడిపోయెను మూత్రపురీష రోధముల్. ౮౪

సీ. సన్నబుపేదారు సరిగచీరెను మాని కొసలుదీరిన నారకోక గట్టె
గరుడపచ్చల తళుకు గాజుదోయిని మాని గురువింజపూసల కుచ్చు దాల్చె
కొమ్మరైన మేలిమి కుత్తుగంటును మాని జిగి నల్లపూసల చేరు దాల్చె
రతనాలబిళ్ళ తోరంపుకీల్జడ మాని మడిచి ముచ్చలగుంట ముడిని వైచె

తే.గీ. నడవిలోఁ బర్ణశాలలో నధివసించు । నట్టి ఋషికన్యవేషంబు యుట్టిపడగ
నట్టి నృపుకడ కేతెంచి యమృతధార । లొలుక నిట్లని పలికె న క్కలికిమిన్న. ౨౫

క. ముని కనుమతమగునట్టుల । బనులందును బాటులందు పరమప్రీతిన్
జనవర నేఁ జరియించెద । ననుకూలవిధంబు లెఱిగి యందరు పొగడన్. ౨౬

తే.గీ. ఐహికార్థము నాముష్మికార్థ మేను । రేయుఁ బవలును జడదారిఁ జేరి గొలిచి
యెల్లవిధముల బతిసేవ లెసఁగ జేసి । నిన్ను మెప్పింతుఁ గనుమయ్య నృపవరేణ్య! ౨౭

క. గుడ్డికి ముసలికి రూపము । గడ్డగువానికిని నన్ను గట్టితి ననుచున్
దొడ్డ విచారము మానుము । సడ్డ యొకింతయును లేక సలిపెద సేవల్. ౨౮

వ. అనిన విని రాజు వగ పుడిగి డెందంబున నానందంబు నొంది కాంచనాభరణవర్జితయై మునిపత్నీవేషంబు ధరియించియున్న తన కూఁతుం జూచి యజినం బిచ్చి వివర్ణవదనుండై కన్నీరు లొలుకం బోయిరమ్మని పల్కిన విని యా పరమపతివ్రతాశిరోమణి నగరంబు వెలువడి చ్యవనుం డున్న వనంబు బ్రవేశించి. ౨౯

సీ. కొంకి గైకొనిపోయి కోయఁ గమ్మని పండ్లు గసిక చేకొని యేగి కందఁ ద్రవ్వు
కడుఁ బ్రీతి నా పెండ పిడిక । లెండఁగఁబెట్టుఁ గత్తిఁ బూనుక దర్భ గడ్డిఁ గోయు
వడి నేటికిని బోయి వలువ లుతికిఁ దెచ్చు వేడినీళ్ళను గాచి బిందె దోఁపు
సమయంబుఁ గనిపెట్టి సమిధ లేరుక వచ్చు బుట్ట నిండఁగ బత్రి బూలు దెచ్చు

తే.గీ. నిల్లలుకు ముగ్గుపెట్టుఁ బ్రోయి పరిశుద్ధిఁ జేయు నీవారిగింజలు చెరగు దంచు
వండి వడ్డించు న మ్మునివల్లభునిఁ గ । రంబునుంబట్టి లేపుఁ గరంబు భక్తి. ౩౦

క. దైనందినకృత్యంబుల । మౌనికిఁ బరిచర్యఁ జేయు మానిని తోడై
పూని సమస్తవిధమ్ముల న । నూనాదరసహిత యగుచు నొప్పె నృపాలా. ౩౧

ఉ. సాపడి లేచియున్న పతి సన్నిధికిం జని వక్కలాకులన్
దీపితమైన భక్తినియతిన్ దగ నిచ్చి కరంబుపట్టి తా
లేపి సుఖాసనంబుపయి లీలఁబరుండఁగజేసి నమ్రయై
దాపున నిల్చి యాజ్ఞగొని తద్దయు మెత్తఁగ నొత్తుఁ బాదముల్. ౩౨

సీ. అడుగులొత్తి మునీంద్రు నాజ్ఞగైకొని తాను బోసేసి గృహశుద్ధిఁ జేసి పాత్ర
శుద్ధియుఁ గావించి సొరది సాయంహోమసమయానుకూలోపచర్య సలిపి

స్వాదుఫలము లిచ్చి జల మిచ్చి యాతండు సొపడ మిగిలిన సత్ఫలములఁ
దా నారగించి నిద్రకు నాతఁ డరిగెడితరి నాస్తరణమును బరగ నునిచి

ఆ వె. సుప్తిసుఖముకొరకు సురటిని చేఁబట్టి । వీచుచుం బతివ్రతాచరణము
లతనివలన నెఱుగ నడిగికొంచుఁ బదాంతి । కమున నిదురఁబోవుఁ గలికి యధిప ౭౩

క. ఒడయఁడు చలికాలంబున । గడగడ వడకంగ జూచి కాష్టంబులఁ దా
నడవికిఁ జని తెచ్చి పదం । పడి రవులంజేసి యుష్ణ భావముఁ జూపున్. ౭౪

సీ. తొలికోడి గూయంగఁ దొయ్యలి మేల్కాంచి జలకుండికామృత్తికలను దెచ్చి
శౌచార్థ మర్పించి చల్లఁగాఁ జెయిఁబెట్టి దూరంబునకుఁ దానె దోడుకొంచుఁ
జని యాతఁ డచ్చోట శౌచంబుదీర్చుట యెఱిఁగి మరలఁ గొంచు నరుగుదెంచి
పీటపైఁ గూర్చుండఁ బెట్టి పాదంబులు గడిగి యాచమనార్థకజల మిచ్చి

తే గీ. దంతకాష్ఠం బొసఁగి ముని దంతధావ । నంబు చేసినపిమ్మట నంబుపాత్ర
మందు నుష్ణోదకం బిడి యతఁడు స్నాన । మాచరింపఁగఁ దడియొత్తు నతులభక్తి. ౭౫

క. ఇమ్మాడ్కిన్ బరిచర్యలు । సమ్మతి నమ్ముగిద సల్పె సకలవిధములన్
వమ్మొక్కింతయుఁ గనరా । కమ్మునియును సంతసించె నవనీనాథా ! ౭౬

ఆ.వె. అంత నొక్కనాఁ డహస్పతిపుత్రులౌ । నశ్వినులు దదాశ్రమాంతికమునఁ
దిరుగుచుండఁ జ్యవను తెరవ కోనేటికి । వచ్చి మునిఁగి యేగ వారు గాంచి. ౭౭

క. ఎవ్వతె వొంటరిగా నీ । వివ్వనిక వసింప హేతు వేమి యెవనికిం
బువ్వారుబోణివమ్మా । యెవ్వనికూఁతురవు తెలుపుమీ యని పలుకన్. ౭౮

క శర్యాతికిఁ గూతుర ముని । వర్యుండగు చ్యవనునకును భార్యను నే న
న్మర్యాదలు దెలియఁ దదుప । చర్యలు గావించుచుంటి సాధుత్వమునన్. ౭౯

క. పెనిమిటి యంధుఁడు ముదుసలి । యగు గావున రేయుఁ బగలు నోర్పున నతనిం
గనిపెట్టుకొని వసించెద । వనిలో సకలోపచారవర్తిని నగుచున్. ౮౦

వ. అనిన విని యశ్వినులు. ౮౧

తే.గీ. అయ్యయోయెంతవెఱ్ఱి వీ పద్మనయన । కుసుమకోమలమైన మేల్మిమిసిమి నెసఁగు
నొసపరి యొడలు బెనుగాసి కొసఁగి ముసలి । తపసి నంటుని నీ వెట్లుఁ దగులుకొంటి ౮౨

ఉ. అచ్చరలందుఁ గానము వియచ్చరసుందరులందుఁ గాన మో
నొచ్చెల నాగకన్యకల కున్నదె నీహొయ లెంతఁ జూచినన్
మచ్చసిదంబువానిసతి మానిని నీ కిటువంటి కష్టముల్
వచ్చెఁగదమ్మ వల్దు పగవారికినైనను జారులోచనా ! ౮౩

ఉ. ఎక్కడ దాపరించె సుదతీ యిటువంటి విభుండు నీకు నీ
చక్కదనంబుఁ జూచినను సర్వజగంబుల నేలఁజాలు ద
మ్మక్క విమానమెక్కి దివి నాడఁగ యోగ్యములైన నీ నడల్
దొక్కఁగనయ్యె నీ యడవిత్రోవల జాఖ్యను ముండ్లుఁ దొయ్యలీ! ౯౪

ఉ. కన్నులు లేకయుం బొకట కాదుగదా కడువృద్ధుఁ డెట్టుగా
నిన్ను సుఖింపఁజేయు రమణీ వృథయయ్యెను నీదు జీవితం
బన్నిట నారచీరలకునా తగు నీదు శరీర సౌష్ఠవం
బెన్నఁ దరంబె నీదు బ్రతు కిట్లు విధించిన బ్రహ్మ నేమనన్. ౯౫

ఉ. పుట్టలు గుట్టలుం బొదలు బోయలు ముచ్చులు కొండచిల్వలున్
దట్టపు మాకులున్ బులులు దంతులు సింగము లెలుగులున్ రొదల్
బెట్టెడి పట్టులుం గలిగి భీతిదమైన వనంబునందు నీ
విట్టుల నొంటిగాఁ దిరుగు టెంతయుఁ జోద్యముసుమ్ము మానినీ! ౯౬

ఉ. రాజస మెంతమేలు భళిరా సొగసెంత వినమ్రభావముల్
రాజిలుటెంత వాక్యమధురస్థితియెంత మృదుత్వమెంత యి
ట్లోజ దలిర్చియు న్మనిఁగితో జలజానన దుఃఖవార్థిలో
రా జెటులోర్చె నీ వెటుల రాగిలి తీ బ్రతు కుగ్గడించుచున్. ౯౭

ఉ. వాస మరణ్యమందు పరివారము లేదు నిరంతరంబు సా
వాసము గుడ్డితో పనులు పాటులు లెస్స యిదేమిచిత్ర మి
ట్లో సుముఖీ నిజాంగకము లూరక గాటియఁబెట్టనాయె ని
న్నోసముఁజేసి పాతకముఁ బొందె నెవండు ధరాతలంబునన్. ౯౮

చ నవనవయౌవనాంచితవు నారులమిన్నవు రాజపుత్రి వీ
భువనమునందు ని న్నొకతె బోలునె నిండిన పండుటాకులన్
వవిలిన జాజిపువ్వువలెఁ దద్దయు నొప్పెదు నీ హొరంగు నా
రవలువలోన బంగరుఁజెరంగులరంగులచీర కొప్పదే. ౯౯

చ. జిగిగలదాన తమ్మలపుఁ జీరలు కంఠముపైకిఁ దోచు నీ
మొగమున లక్ష్మి దా నటనమున్ సలుపు న్బొగడంగ మాకు శ
క్తిగలదె కోమలీ చిదిమి దీపముఁబెట్టఁగవచ్చునమ్మ నీ
సొగసు పురాకృతం బపరిశుద్ధము గావుట కేమిహేతువో. ౧౦౦

మ. మతిలేదా సలుమోములాతనికి ని న్మాద్రిక్కన్ విరుద్ధక్రియా
వితతిం బూని యొనర్చుచుండుఁ దగునే విశ్వాతిగాంచత్కళా

యుత నిన్నంధునకున్ ఘటించెగదె నయ్యో శుద్ధరత్నం బయో
గతముం జేసినయట్లు నీ బ్రతుకు చక్కంజేయుదో యింతటన్. ౧౦౧
చ. పెరపెర గంపిలు న్మనసు భీతమృగేక్షణ వీని మాని నీ
వొరు వరియింపుమా యిచట నుండఁ దలంపకు మంధసేవ దు
స్తరము జరావిగర్హితుని జవ్వని కొల్చుటకంటెఁ జచ్చుటే
కరము ప్రశస్తమే యుసుఖంబులఁ బొందుదె వీని పొందునన్. ౧౦౨
చ. అనినఁ గడున్వడంకుచు నృపాత్మజ ధైర్యముఁబూని చెల్లబో
వినఁగ నసహ్యమైనయది వింటిని దేవత లీరు సూర్యనం
దనులు సమస్తము న్దెలిసి తప్పులు వల్కుదురే భళా సతీ
జనముల ధర్మపద్ధతులు శైలగుహానికరంబు వచ్చెనే. ౧౦౩
తే.గీ అగ్నిసాక్షిగ నన్నిచ్చె నయ్య యయ్య । యి య్యమితతేజుఁడైన మునీంద్రునకును
శీలమెడలక నే వాని సేవఁజేయ । నదవి కరుదెంచియుంట దప్పాయెనొక్కొ. ౧౦౪

తే.గీ. అఖిలకర్మలకును సాక్షియై యినుండు । కాంచు మనలను గంపంత కంటితోడ
కశ్యపునికొడు కాతండు ఘనుఁడుగాడె । యిట్లు పలుకంగ మీకు నో రెట్టులాడె. ౧౦౫

క. వేడుకక త్తెలు వోమెడి । జాడల నే నెట్లుఁ బోవజాలుదు నయ్యో
కూడదు మీ రిట్లాడఁగఁ । బాడిదెలుపువారు నీతిఁ బాయం దగునే. ౧౦౬

ఉ. కూరిమి గల్గునేని బలుకుండు పతివ్రతకైన ధర్మములో
వారక నే పతి న్గొలుచు వర్తనమందును మందబుద్ధినై
నేరము చేసిన న్దగదు నీకని చెంపలుగొట్టు డొప్పెదన్
మీరలు దారినేగ కికమీద వచించిన శాప మిచ్చెదన్. ౧౦౭

క. నానా నారీరత్నము నా నా సత్యలు సవిస్మయాత్మత గనుచున్
నానావిధముల మనముల । నానావహిలంగ వడఁకినం గని యంతన్. ౧౦౮

ఆ.వె. అయ్యలార ధర్మహానికిఁ జింతిల్లి । యట్లు పల్కితిన్ దయామతులయి
నన్ను ధన్యఁజేసి మన్నింపరే యన్న । నశ్వినులు సుకన్య నాదరించి. ౧౦౯

క. దేవభిషగ్వరులము మే । మో వనిత సురూపుఁజేసి యింతుము చ్యవనున్
మావంటివాఁడుగా మా । మూవురఁ గనుగొనుము నీవు మోదం బలరన్. ౧౧౦

క మామువ్వురిలో నీకుం । బ్రేమం బెవ్వానిమీదఁ బెనఁగొను నతనిం
గామింపుము నా విని య । క్కామిని తన ప్రాణవిభుని కడకేగి దగన్. ౧౧౧

క. ఇనసుతులట యశ్వినులట । మనవనమున కరుగుదెంచి పలికిరి నన్నుం
గని మనసిజశరవిద్ధత । ననుషమమృదువాక్యఫణితి యలర మునీంద్రా. ౧౧౨

క. నీ మగనికి నంబకముల । నే మిచ్చెద మో మృగాక్షి యెలజవ్వనమున్
గోము నొసంగెద మంతట । నే నీపుర మొందు మందు నేరు మొక వరున్. ౧౧౩

క. ఏమాటయుఁ బలుకఁగలే । కో మునివర నిన్నుఁ జేరియుంటిని వారల్
వ్యామోహకారులో గుణ । ధాములో నే నెఱుఁగ నాజ్ఞ దయసేయఁగదే. ౧౧౪

క. అనుఁడు విని మునివతంసుడు । వనితా నీ విపుడ పోయి వారల వేగన్
గొనిరమ్ము నాసమీపం । బునకున్ దడవేటి కింకఁ బొమ్మా యనుచున్. ౧౧౫

చ. అన బతియాజ్ఞఁ బూని చని యంగన తా నిజభర్తమాట య
శ్విసులకుఁ దెల్ప వారలును జెచ్చెరవచ్చి సుకన్యఁ జూచి యో
వనరుహనేత్ర నీ మగని వారకి ముంపుము నీళ్ళ నేమును
న్మనిఁగెద మంచుఁ బోయి కొలనుంగని మువ్వురు మున్గి రొక్కటన్. ౧౧౬

తే.గీ. మునిఁగి లేచిన రూపులు మువురి కొక్కఁ । మాడ్కిఁ దనరారఁ గుండల మహితభూష
ణాఢ్యులై నిల్చి వరియింపు మతివ యొకని । మువ్వురం దని పల్కిన మగిద సూచి. ౧౧౭

ఆ.వె. మొగము కనులు చెవులు ముక్కును గడ్డంబు । మెడయు నెదయుఁ గాళ్ళు దొడలు వీపు
చేతు లందటి కొక రీతిగాఁ దోచిన । లేమ మగనిఁ బోల్చలేక యడలి. ౧౧౮

క. ఏయవయవంబుఁ జూచిన । నాయవయవ మొక్కరీతి నందరికి సమం
బాయె నిఁక నేమిసేయుదు । నాయెఁగదా యింద్రజాల మర్ధఘటికలోన్. ౧౧౯

తే.గీ. ఇన్నిఁటికి నేమిఁకను స్వర మేకమాయె । పలుకుబడినైనఁ బరికించి పట్టజాల
సంశయగ్రంధివిడుట యసాధ్య మింక దేవతాకృత్య మిది నేను దెలియఁజాల. ౧౨౦

క. ఆర్తి నిటుగుందు నాకును । గర్తవ్యము సెప్పువారు గలరే యెందున్
భర్త యెవఁ డన్యుఁ డెవ్వఁడు । భర్తనుగా కితరు చేయిఁ బట్టందగునే. ౧౨౧

క. ఒక్కటిమాత్రము నాకై । చిక్కిన మేలైనయట్టి చెయ్యి గలదు నేఁ
డక్కట యప్పనిఁ జేసెదఁ । జక్కఁగఁ జిమ్ములను జెప్పి చచ్చెద నంచున్. ౧౨౨

వ. అని కృతనిశ్చయయై. ౧౨౩

ఆ.వె. శరణుశరణు నీకు జగదంబ భగవతీ । శరణుశరణు నీకుఁ జక్కనమ్మ
నన్నుఁ బ్రోవుమమ్మ నాపాలిదైవమ్మ । దేవి నీవె నాకు దిక్కుసుమ్మ। ౧౨౪

ఆ.వె. వేదమాతవమ్మ విష్ణుని ప్రియవమ్మ । యాదిలక్ష్మివమ్మ యఖిలలోక
శుభవిధాత్రివమ్మ యభయంబు నీ విమ్మ । వేగ నన్నుఁ బ్రోవ రాగదమ్మ. ౧౨౫

శా. నీవే తల్లివి నీవె తండ్రివి నను న్జేపట్టి రక్షింపఁగా
నీవే దిక్కు సమస్తలోకములలో నీకంటె లేరెవ్వ రన్

బ్రోవంజాలుదు వార్తరక్షణకరీ భూతేశ్వరీ భూరిమా
యావిన్య స్తజగ త్త్రియాంచదుదరీ హర్షంకరీ శాంకరీ! ౧౨౬

ఉ. పిన్నల మేమెఱుంగుదుము పెత్తనమెల్లను నీదెకాదె యీ
యన్నిజగంబులం దఖువు నాదిగ మేరువుదన్క నీవయై
వన్నెయు వాసియు న్గలిగి వర్తిలుచుందువు ప్రోవవమ్మ యా
పన్నను కన్నబిడ్డను గృపామతివై జగదేకపాలినీ! ౧౨౭

మ హరికిన్ శంభునకు న్పితామహునకున్ వ్యావృత్తిఁ గల్పించి సు
స్థిరవిజ్ఞానమునిచ్చి సంతతముఁ బ్రీతి న్గాచు నీకంటె నె
వ్వరి నే వేడెద సిద్ధిదాయినివి దివ్యజ్ఞాన సంపూర్ణ వా
దిరమాదేవివి ప్రోవవే భగవతీ దేవీ దయాంభోనిధీ ! ౧౨౮

క. ఈవిధమునఁ బ్రార్థింపఁగ । దేవి తదీయాత్మ నిలిచి దీప్తజ్ఞాన
శ్రీ విలసిల్లఁగఁ జేసినఁ । దా విభునికరంబు పట్టెఁ దద్దయు బ్రీతిన్. ౧౨౯

క. అంతట చ్యవనుఁడు మిక్కిలి । సంతసమును బొంది త్రిదివ సద్వైద్యుల ధీ
మంతులఁ గని నను యౌవన । వంతునిఁగాఁ జేసినట్టివారలు మీరల్. ౧౩౦

క. సారతరమగు సుఖసుధా । సారమునకుఁ గారణార్థ సామగ్రి భవ
త్కారుణ్యరసైకసుధా । సారంబే కాదె యిడియ చాలదె నాకున్. ౧౩౧

క. మీకుం బ్రత్యుపకృతి నే । నేకార్యము చేసినన్ ఘటించును మీరల్
నాకౌకసు లేను ధరా । లోకములో నుందు దుర్బలుఁడ మనుజుఁడన్. ౧౩౨

ఉ. కన్నులు వచ్చె మేలయిన కాయము గల్గెను వృద్ధభావ మే
గె న్నవయౌవనంబు గలిగె న్గనకాంగినిఁ గూడి సౌఖ్యసం
పన్నుఁడ నైతి మీరరుణ బాటిలి దైవతవైద్యులార మీ
కన్నఁ బరోపకారుల జగానను గానను గాన వేడుకన్. ౧౩౩

తే.గీ. ఋణముఁ దీర్చుకొనంగ నే నెంచినాఁడఁ । గోరుఁ డొక వాంఛితంబు నా కోలఁది దెలిసి
మీరు గోరినయది నన్ను మించియున్న । నప్పుడైనను బ్రాణంబు లప్పగింతు. ౧౩౪

ఆ.వె. అయ్యవలన మాకు నన్నికోరికలును । దీరియున్న వెవ్వి కోరవలయుఁ
గాని మాకు నొకటి గలదు కోరిక దానిఁ । దీర్పఁగలిగెదేనిఁ దీర్చుమయ్య. ౧౩౫

చ. మునివర పైడికొండపయి మున్ను సురేంద్రుడుఁ బ్రహ్మయజ్ఞమం
దును మము దేవతాసమితితోడ సమమ్ముగ సోమపానమున్
గను నెపుడున్ నిషిద్ధులనుగా నొనరించెను వైద్యవృత్తి మా
దని యటుగానఁ జేయుము సమర్థుఁడవే న్మము సోమపాయులన్. ౧౩౬

క. నావుఁడు విని చ్యవనుఁడు మీ । రీవిధమునఁ జేసితి రుపకృతి మీకును నేఁ
గావించెదఁ బ్రత్యుపకృతి । దేవతలకు భయముపడక ధీరత కలిమిన్. ౧౩౭

క. శర్యాతిచేత యజ్ఞమ । వార్యతఁ జేఁగుంతు సోమపానము మీకున్.
ధైర్యమ్మున నొసఁగించెద । నార్యులు మెచ్చంగ దేవతావళితోడన్. ౧౩౮

వ. అనిన విని సంతోషించి యశ్వను లరిగిన నిజభార్యాసహితుండై చ్యవనుండు తన యాశ్రమంబు ప్రవేశించియుండ నంత నచ్చట శర్యాతినాతి నిజవిభుం గాంచి యొక్క నాఁడు. ౧౩౯

ఆ.వె. ప్రాణనాథ కూఁతుఁ బాసి యెన్నాళ్ళాయె । నడవులందుఁ దాపసాశ్రమమున
నారచీర గట్టి నానావిధములైన । కష్టములకు లోన గ్రాగుచుండు. ౧౪౦

ఆ.వె. ఎఱిఁగి యెఱిఁగి ముసలి కిచ్చితి మందులో । గుడ్డితనము నొకటి కూడ మూడె
నైననేమి యన్న నడవిలో వాసం బిఁ । క యయొ దానిదుఃఖ మడుగవలెనె. ౧౪౧

క. అటువంటిమగనితో న । క్కుటిలాలక మనల ముద్దు గూఁతురు వాసం
బటవిం జేయఁగ నొకనాఁ । దటు వోవకయుండఁ జెల్లునా జననాథా! ౧౪౨

క. భోగములు భాగ్యములు విడు । మా గోరెడు పసుపు గుంకుమలకై నను దా
నేగతి నోచకపోయెను । భూగోళమునేలువాని పుత్రికయయ్యోః ౧౪౩

క. చనుమా జనవల్లభ య । మ్మునియాశ్రమమునకు వేగ ముద్దులకూఁతున్
గొనిరమ్మా యిప్పుడైనం । గనులం గనుఁగొని యొకింత గందు సుఖంబున్. ౧౪౪

క. అనుఁడుం జనవల్లభు డో । వనితా నే నట్లొనర్తు వగవకు మని తాఁ
జని కాంచె సవనవహ్నిమహ । వనధూమోద్ధామమును జ్యవనధామంబున్. ౧౪౫

క. కని యందును నవయౌవన । ఘనసుందరు చారునేత్రుఁ గలసిమెలసియుం
దనయ ప్రవర్తించుటకున్ । దనలోఁ దాఁ గొంతసేపు తటవిటపడియెన్. ౧౪౬

ఆ.వె. ముసలిమగనిఁ జంపి మూర్ఖురాలిది మంచి । పడుచుఁవానిఁ దవిలి పాడుచేసి
శీలమెల్ల దీనిచేత నా కపకీర్తి । వచ్చె నేమిసేయవలయు నిపుడు, ౧౪౭

క గుడ్డికి ముసలికి నిచ్చితి । నెడ్డెను నేఁగాక యిప్పు డేమనవలయున్
బిడ్డను స్వార్థపరులకుం । గడ్డిది కూడిది యటంచుఁ గనరాచుసుమీ. ౧౪౮

క. ఎటువంటిది చేసినవా । రటువంటిఫలంబు నంద కన్యంబగునే
యటుగానఁ గన్య నెప్పుడు । నిటు నటు యోగ్యతల నరసి యీవలయుఁజుమీ. ౧౪౯

చ. పడుచును జంపి స్త్రీహనన పాతకమొందెను దానిమాని నే
నుడుగని లోకనిందితము నొందెను బొందెద నింద నెద్ది యి

ప్పుడు పరగింతునంచుఁ దలపోయుచునుండ సుకన్య సూచి తా
వడివడి వచ్చి సంతసపు బాష్పము లొల్కఁగ మ్రొక్కి యిట్లనున్. ౧౫౦

తే.గీ. తండ్రి నీవిట్లు నావిభు దరికిఁ బోక । మ్రొక్కి మాటాడ కేమొకో వెక్కసంపు
బెడదపడినట్టులుంటి వీ పేదదాని । యిల్లిదియన నేమి యల్లుని యిల్లుకాదె. ౧౫౧

క. నాయన యిన్నాళ్ళకుఁ గద । మాయింటను బాదమిడితి మంచిదె వేగన్
నీ యల్లునిఁ గనకుండుట । న్యాయంబే రమ్మిఁక గుటజాంతరమునకున్. ౧౫౨

క. మునుపటివలె దుఃఖింపం । బనిలే దిపు డల్లుఁడదిగొ పర్ణాలయమం
దున నున్నవాఁడు గుణనిధి । యనుపమసౌందర్యశాలి యర్హుఁడు మ్రొక్కన్. ౧౫౩

వ. అనినం గూఁతుపలుకులు విని రాజన్యుండు గడుఁ గినుక బొమలు ముడివడఁ బండ్లు
పటపట గొరకుచుఁ గన్ను లెఱ్ఱఁజేసి యిట్లనియె. ౧౫౪

తే.గీ. ఓసిపాపిష్ఠురాల నీ మోసమెల్ల । దెలిసెనే చ్యవనునిపనిఁ దీర్చి యొక్క
మదమలీమసచిత్తుఁడౌ మనుజుఁ దవిలి । కాపురముసేసెదే నిన్నుఁ గావదగునె. ౧౫౫

ఆ.వె. ఏమి పాపమునకు నీ వొడిగట్టితే । యేడనుండెఁ జ్యవనుఁ డేడి చూపు
గుడ్డివాఁడు ముసలి గొంతులో దగ్గుత్తి । నెఱసె నెఱులు గోటు నీ మగఁడు. ౧౫౬

మ. అనినం బక్కున నవ్వి తండ్రి వినుమా యల్లుం డితండే మనం
బున సందేహము మాను మశ్వినులు సత్పూజ్యుల్ మముం బ్రేమతోఁ
గని యీరూప మొసంగి రందువలనం గంజాక్షుడై చారుయౌ
వనుడయ్యెం జ్యవనుండు నే నెఱుగ నే పాపంబు నీతోడుగన్. ౧౫౭

క. తడవిఁక నేటికి మునినే । యడుగు మతండెల్లఁ జెప్పు నల్లుఁడౌ కాదో
గడుసరి నగుచున్ నే ప్రముక్తుఁడితనమునఁ బాప మొకఁడు గావించితినో. ౧౫౮

చ. అన విని రాజు మౌనిఁ గని యాదరమొప్ప నమస్కరించి ఓహో
మునివర సంశయంబు కరము న్బొదము స్గను లెట్టువచ్చె నీ
కును ముది మెట్లుపోయె విన(గోరెద నన్న నరేంద్ర ధీరు ల
శ్వినులు సుపర్వులై ద్యులని విందురటంచుఁ దలంతు నా మదిన్. ౧౫౯

తే.గీ. వారలు యథేచ్ఛ నిచటికి వచ్చి నాకుఁ । జూపొసంగిరి మైత్రిన యూపొసగిరి
మారుమేలుసత్రి యేను వారలకును । నొక్కపని యొప్పుకొన్నాఁడ నుర్వరేశ ! ౧౬౦

క. మా మామగారిచేత మ । హామఖ మొనరింపఁజేసి యందును మిమ్మున్
సోమంబును ద్రావించెద । నేమంబున సురలతోడ నే నని శ్వశురా. ౧౬౧

క. ఇఁక నేటికిఁ దటవిటపద । సకలంబును దెలిపినాఁడ సత్యమ్ము సుఖ
ప్రకటస్థితిఁ గూర్చెందుమి । యకలంకతఁ బీటమీఁద నవనీనాథా. ౧౬౨

తే.గీ. యాజకత్వంబు నా కిమ్ము యజ్ఞ మీవు । సేయఁదొడఁగుము శక్రుండు చిడిముడిపడ
నతని మదమార్తు నాడు తేజోతిశయము । వలన సోమంబు దేవవైద్యులకు నిత్తు. ౧౬౩

చ. అన విని సంతసించి నృపుఁ డట్లనఁ గావుతమంచు వారలం
గొని చని యాజకత్వమునకుం జ్యవనున్ గ్రహియించి తా దొరం
కొనియెను యజ్ఞమున్ బిలువఁ గూరిమి నెల్లధరాతలేంద్రులున్
మునులును వచ్చి రా దివిజముఖ్యులు వచ్చిరి వచ్చి రెల్లరున్. ౧౬౪

తే.గీ. వారితోడనె యశ్వినుల్ వచ్చి యొక్క । దిక్కునను గూరుచుండిరి దేవతావి
తానపంక్తిని నోరూరఁ దాలు జిహ్వ । లాడ నెప్పుడెపుడు సోమ మనుచు వేడ్క. ౧౬౫

క. దేవేంద్రుఁడు వారలఁ గని । యీ వైద్యులు రాఁగతం బదేమో సోమం
బేవడుపునఁ గలుగును వీ । రేవారలు పిలువ వచ్చి రిచ్చటి కనినన్. ౧౬౬

వ. సభాసదులలో నెవ్వఁడును నేమియుం బలుకక యూరకున్నయెడం జ్యవనుండు సోమంబు గొని యశ్వినులకుం బోయ సమకట్టి వచ్చుచున్నం జూచి యింద్రుం డడ్డగించి వీరు సోమగ్రహణార్హులు కారనినం జ్యవనుండు. ౧౬౭

ఉ. ఏటికి సోమపానమున కీ మహనీయులు సూర్యసూను ల
ప్రాటు లసంకరుల్ భిషజు లార్తజనావనులశ్వినుల్ దగం
బాటిల రర్హులై పరుల భామలఁబట్టిరొ పుట్టిరో యస
త్పాటలగంధికి న్దెలుపుమా యిపు డొప్పదె నిర్ణయం బిటన్. ౧౬౮

తే.గీ. వీరిచేతను నే నుపకార మొంది । మమతఁ బ్రేరేపఁ గావించె మఖము రాజు
మిమ్ము సోమంబుఁ ద్రావింతు వమ్ముగాక । యనుచు నే నొప్పికొంటి నీ యశ్వినులకు. ౧౬౯

క. కావున సోమార్హులుగాఁ । గావింతు మశ్వినులను గరుణామయులై
నా విని వీరి యుపేక్షసు । లై వెలసిరి సోమమునకు నర్హులె చెపుమా ? ౧౭౦

క. ఈఁగూడ దిపుడు సోమము । పోఁగూడదు వీరిదరికి బోరి సోమముతో
బాగుగనుండదు నీ పటు । గాఁ గావించితివయేని గలహము పొసఁగున్. ౧౭౧

క. వీ రా సోమంబును గొనఁ । గారాని యపాత్రు లీవ కావా యమరో
ద్ధారకుఁడవు తలవంచుక । యూరక యుండంగరాదె యొకమూల నిఁకన్. ౧౭౨

క. అని ముని సోమగ్రహ మ । శ్వినులకు భయపడక యొసఁగె స్థిరమతియై స
న్మునులును నాకౌకసులును । గని వెఱగందంగఁ దీక్ష ఘనతేజుండై. ౧౭౩

వ. అనిన విని యింద్రుడు. ౧౬౪

క. చెంపలు వాయించెద నీ । పెంపెంతర విశ్వరూపు విధమెఱుఁగవొకో
చంపెదఁ జూడుము బాపన । కొంపఁ జెఱుపఁబుట్టినట్టి కొంటెవుగావా. ౧౬౫

వ. అనినం జ్యవనుండు. ౧౬౬

శా. ఎట్టెట్టిట్లు మహాత్ములన్ సుధిషణాహీనుండవై తిట్టెదే
కట్టా యశ్వినులెట్టిపాతకములన్ గావించిరో చెప్పుమా
ముట్టంగాఁ దగదంటి సోమమును స్వామి ల్వారు నాపాలిటన్
రట్టుంబెట్టక నిర్జరేంద్ర యిఁక పోరా నోరు మూయించెదన్ ౧౬౭

క. వెజ్జులు యజ్ఞంబులలో । బొజ్జలు నవరించి సోమమును గొనఁదగునే
రజ్జులు పల్కెదవేటికి । మజ్జారే నాదు వజ్రమహిమ మెఱుఁగవో ? ౧౬౮

వ. అని యిట్లు. ౧౬౯

క. ఇంద్రుని సరకుగొనకయ ము । నీంద్రుఁడు సోమం బొసంగె నిదిగో కనుమా
యింద్రా యేదీ యిఁక నా । ముం ద్రోయము నీదు వజ్రమున్ గిజ్రంబున్. ౧౭౦

క. ఆ పలుకులు ములుకులుగాఁ । దోపఁగ నింద్రుండు కినుకతోఁ గులిశప్ర
క్షేపంబుఁ జేసెఁ జూపరు । లోపికచెడి పడి లబో లబో యని కూయన్. ౧౭౧

వ. అట్లు వజ్రంబు విడిచిన. ౧౭౨

స్రగ్ధర. బగ్గుం బగ్గంచు మంటల్ పటుగతినెగయన్ భానుకోటిప్రభంబై
జగ్గుల్ నిగ్గుల్ వొసంగన్ జటులచిటచిటోచ్చారణోచ్చారకంబై
తగ్గున్ మ్రొగ్గున్ వితాకున్ దగలక దిటమై దారుణాకీర్తమై యి
ల్లిగ్గుల్ గగ్గోలుతో లొల్లిఁగొన మునులు తాల్మి న్విడన్ వజ్రమాడెన్. ౧౭౩

క. ఘంభద్ధిత నడుదెంచెడి । దంభోళిని జూచి మౌని తడయక యపు డీ
దంభప్రభలకు నేమని । స్తంభింపఁగఁజేసెఁ దనదు తపము కడిమిచేన్. ౧౭౪

వ. ఇట్లు చ్యవనుండు వజ్రంబును స్తంభింపంజేసి శృతంబగు హవ్యంబును మంత్రంబుచే నగ్గి వేల్చి కృత్యన్బుట్టించె నది. ౧౭౫

సీ. తెఱచెనా నోరు విస్తృతమంధరనగంబు కడవంటికిని పాలకాయ గాఁగ
అఱచెనా తతవైధసాండంబుపై పెంకు పక్కు పక్కున బీట వాసి పగుల
చరచెనా యఱచేత సౌవర్ణభూధరం బడుగంటి పాతాళమందుఁ గ్రుంగ
కఱచెనా పెనుగోర గకుబనేకపరాజి గీవురు మని పెద్ద గీపు వెట్ట

తే.గీ. పఱచెనా నాల్క ప్రళయార్కి పంక్తివోలెఁ । గల జగంబెల్లఁ జిమ్మచీకటులు ముంపఁ
జ్యవనకృత హోమజుండైన చండమూర్తి । మదుఁడు వెలువడె నింద్రునిమదమడంప. ౧౮౬

క. వెలువడి వజ్రముపైఁ జని । గొలకొల నిర్జరులు గొట్టుకొన వదనమహా
బిలమున నిడె దేవేంద్రుఁడు । వలవల నేడ్వంగసాగె వసుధాధీశా ! ౧౮౭

తే.గీ చేత నిడియున్న వజ్రంబు చేయిగదల । కట్టె చూచి సురేంద్రుండు నిట్టనిలచి
యెట్టియెదుటి మహామదుఁ గొట్టలేక । దిట్టతనమెల్ల మట్టుగా దీనుఁడగుచు. ౧౮౮

వ. నిజగురుండయిన బృహస్పతిం దలంచినంత నతండు వచ్చినం జూచి నమస్కరించి తన గోడు విన్నవింప నతండు విని యీ మదనామక రాక్షసుండు చ్యవనుని యజ్ఞకుండంబునం బుట్టినవాఁ డతండు మహాతపశ్శాలి దీనిం గెలుచుట దుశ్శక్యంబు నీవు చ్యవను వేడుమనిన నతం డట్ల గావించి, నేఁటనుండి యశ్వినులకు యజ్ఞభాగంబుఁ గల్పింతునని పల్కిన నలరి చ్యవనుండు శాపం బుపసంహరించి మదుఁడనువాని స్త్రీలయందును, పానంబునందును, ద్యూత మృగయులయందు నుండంజేసి యజ్ఞపరిసమాప్తి వలన శర్యాతి నలరించె. మఱియు శర్యాతికి నానర్తుండును, నానర్తునకు రేవతుండును బుట్టిరి; రేవతుండు సముద్ర మధ్యంబునం గుశస్థలి యను పురంబు నిర్మించుకొనియె. అతనికిం గకుద్మి మొదలగువారు నూఱ్వురు కొడుకులును, రేవతి యను నొక కుమారికయుం గలిగిరి. తన కూఁతునకుం దగిన వరుం గానక బ్రహ్మ నడుగందలంచి కుమారికను వెంట నిడికొని బ్రహ్మలోకంబునకుం జనియె ననిన విని జనమేజయుండు వ్యాసున కిట్లనియె. ౧౮౯

క. మును నే వినియెద భూదే । వునకే వనజాతగర్భు పురిప్రాప్యంబౌ
నని భూపాలుం డేగతిఁ । జనియెం దన పుత్త్రితోడ సత్యంబునకున్ ? ౧౯౦

క. పునరాగమనము లేదని । వినియెద బ్రహ్మపురినుండి వింతగదా య
మ్మనుజేంద్రుఁడు మనుజత్వం । బున నేగతి మరల వచ్చె భూతలమునకున్. ౧౯౧

క. అనుఁడును వ్యాసుఁడు వినుమా । జనమేజయ బ్రహ్మలోక సౌర శివ దిగి
ద్వనజాక్షలోకములకుం । జనుటయు వచ్చుటయుఁ గలదు జను లిలలోనన్. ౧౯౨

క. నరుఁ డరిగె స్వర్గమునకున్ । పరగ మహాభిషుఁడు వోయె సత్యంబునకున్
సురలు వికుంఠంబునకున్ । జరుగుచు నుందురు నరేంద్ర సంశయమేలా ? ౧౯౩

వ. అనిన విని జనమేజయుండు తరువాతకథ సెలవియ్యవే యనిన విని వ్యాసుండు యిట్లనియె. ౧౯౪

క. రైవతుఁడు సత్యలోకము । లో వనజాసనుని లోనిలోగిట నుండం
గా వీణావాదనములు । గావించిరి క్షణము సేపు గంధర్వు లొగిన్. ౧౯౫

క. గానసభ ముగిసినంతన్ । దా నతఁడై రైవతుండు తామరసభవున్
దీనార్తిహరణు నీ చం । ద్రానన వరుఁ డెవ్వఁడంచు నడిగె నృపాలా! ౧౯౬

వ. మఱియు సర్వలక్షణసంపన్నుండును మహారాజపుత్రుండును గుణీనుండును నగు నొక్కనిం దెలుపవే యనిన నజుండు నవ్వి యో యి రైవతా నీవిచ్చట నిల్చిన కాలమున భూలోకంబున నిరుబదియేడు మహాయుగంబుల కాలం బయ్యె నందు ద్వాపరంబు ప్రవర్తిల్లుచున్న యది తొల్లింటి రాజు లిప్పుడు లేరు. మధురాధిపతియగు నుగ్రసేనుని కొడుకు కంసుండు సురద్వేషియై యున్నం ధరాదేవివలనఁ బ్రార్థితుండై నారాయణుండు రామ కృష్ణ రూపంబుల నవతారం బెత్తి కంసాది దుష్టవధ గావించె; నందు బలదేవుండు శేషాంశసంభూతుండు! హల ముసలాయుధుం డతం డీ కన్యకుం దగిన వరుండని చెప్పిన విని భూలోకంబునకు వచ్చి నీలాంబరున కా బాల నిచ్చి వివాహంబు సేసి తా నరణ్యంబునకు బోయి తపం బాచరించి గంగాతీరంబున దేహంబు విడచె; శర్యాతి సంతతి కొందరు రాక్షసులచేఁ జంపఁబడి, కుశస్థలి విడిచి చనిరి చాక్షుసమనువుకొడు కిక్ష్వాకుం డతండు సూర్యవంశంబు నుద్ధరించినవాఁడు. వానికి నూఱ్వురు కొడుకు లందు వికుక్షి మొదటివాఁడు; శకునిప్రముఖు లేఁబదిమంది బలపత్తరులు; వా రుత్తరాపథంబుఁ బాలించిరి; నలుబదియెనుమండ్రు దక్షిణంబుం బాలించిరి; యిరువురు రాజునకుం బార్శ్వవర్తులయి యుండిరి· యిట్లుండ నొకనాఁడు. ౧౯౭

తే.గీ. అష్టకాశ్రాద్ధమం దొక్క యవసరమున । మాంసమును గొనిరమ్మని మనుజవిభుడు
సుతు వికుక్షినిఁ బంపిన నతఁడు వోయి । శశక దంష్ట్రుల నడవినిఁ జదియమొత్తి. ౧౯౮

క. శ్రాద్ధంబు మరచి యాకట । బద్ధుండై తినియె శశక మాంసము శేషం
బ ద్ధాత్రీవిభుచెంతకు । బుద్ధి నొకింతయునుఁ గొంకుఁ బూనక తెచ్చెన్. ౧౯౯

క. గురు డది యెఱింగి తెలిపిన । నరపతి కోపించి యిఁక వనంబునకే యీ
వరుగుమని వెడలఁగొట్టిన । నరిగె శశాదాఖ్య వూని యటవుల కధిపా! ౨౦౦

క. అడవుల నతఁడు దిరుగఁగా । నొడయఁడు స్వర్గంబు నొందె నుర్వీరాజ్యం
బెడలక యతనికిఁ గలుగన్ । గడునీతి నయోధ్యఁ గొంత కాలం బేలెన్. ౨౦౧

తే.గీ. అతఁడు సరయూతటంబున యజ్ఞముల న । నేకములఁ జేసి గాంచె సమిద్ధచరితు
డగు గకుత్థ్సుని నాతని జగము పిలిచె । నింద్రవాహుం డటంచు నరేంద్రతిలక! ౨౦౨

క. అనుఁడు జనమేజయుం డి । ట్లను నో మునినాథ వాని కాఖ్యాంతర మే
యనువునఁ జొప్పడెఁ గారణ । మును దెల్పు మటన్న వ్యాసముని యిట్లనియెన్ ౨౦౩

తే.గీ. ఆ శశాద నృపాలు ననంతరం బ । తండును గకుత్థ్సుఁడను పేరఁ దనరె నిట్టు
లుండ నొక్కప్డు సురలు దైత్యులును బోర । నమరు లోడి మురారిపాదములుపట్టి. ౨౦౪

ఉ. వేడికొనంగ నచ్యుతుఁడు విశ్వమయుండు సుధాంధులార మీ
రోడక భూమికిం జని మహోదయుఁడైన శశాదపుత్రునిం
దోడుగఁ జేసికొం డతఁడు దోర్బలవిక్రమశాలి మీకునున్
గో డుడుపున్ సురారులను గొట్టు నటంచు వచింప దేవతల్. ౨౦౫

ఉ. భూమికి వచ్చి రాజుఁ గని పూజలఁజెంది జగన్నుతప్రభో
ద్దామ ధరాతలేంద్ర ఖలదైత్య వినాశముఁ జేయుమన్న మీ
కామిత మెట్టిదైన విధిగా నొనరించెదఁగాని యింద్రునిన్
ధీమహితున్ శచీపతి మదీయ తురంగముగా నొనర్పుఁడీ. ౨౦౬

మ. అనుఁడున్ దేవవిభుండు దా వృషభమై యా రాజమార్తాండు వా
హనకృత్యం బొనరించె నందువలనన్ వ్యాపించె న య్యింద్రవా
హననామంబు కకుత్థ్సభూపతికి నిత్యంబై పురంబుల్ జయిం
చిన యోజం గనియెం బురంజయుత సుశ్రీకప్రభావోన్నతిన్. ౨౦౭

తే.గీ ఆ కకుత్థ్సప్రభుండు లోకైకవీరు । డై తలిర్చెను దత్కులోద్భూతులకును
జెలఁగెఁ గాకుత్థ్సనామంబు శ్రీనివాసు । డవతరించెను బృథుఁడయి యతని కధిప. ౨౦౮

వ. పృథునకు విశ్వరంధియు, విశ్వరంధికిఁ జంద్రుండును, జంద్రునకు యువనాశ్వుంతును యువనాశ్వునకు శావంతుండును, నతండు గట్టించిన పట్టణంబునకు శావంతీపురం బని పేరు వెట్టె; శావంతునకు బృహదశ్వుండును, నతనికిఁ గువలయాశ్వుండునుం బుట్టిరి; కువలయాశ్వుండు ధుంధుండను రాక్షసుని జంపి ప్రసిద్ధికెక్కె. నందువలన నతనికి ధుంధుమారుం డను పేరు వచ్చె; నతనికి దృఢాశ్వుఁడు, వానికి హర్యశ్వుఁడు నా భూమిపతికిం నికుంభుండు, నా రాజేంద్రునకుఁ బర్హణాశ్వుఁడు. నా నృపాలునకుఁ గృశాశ్వుఁడు, నా జనపాలునకుఁ బ్రసేనుండు, నా భూభుజునకు యౌవనాశ్వుండు, నా ధరాజానికి మాంధాత, యితండ వేయిన్నెనిమిది ప్రాసాదంబులు కట్టించె; మఱియు ని మ్మహాభాగుండు జనకగర్భంబునుండి మాతృగర్భంబుచే నుద్భవిల్లె; నిది మహావిచిత్రం బనిన ధరావల్లభుఁడు విస్మయంపడి చరితంబు సవిస్తరంబుగాఁ దెలుపుమనిన విని వ్యాసుండు. ౨౦౯

తే.గీ. యౌవనాశ్వనకుఁను నూఱ్వు రంగనలయి । సకల భోగంబులును గల్గి సంతతికిని
నోనుకొనక వగచి నిజాధామమునను । నుండఁజాలక సతులతో నొందె నడవికి. ౨౧౦

క. అచ్చట బ్రాహ్మణు లందఱు । నచ్చెరువడ దీనుఁడగుచు నడలం గని వా
రచ్చువడ నడిగి రాతని । యొచ్చెమునకుఁ గారణంబు నుర్వీనాథా. ౨౧౧

వ. అడిగిన. ౨౧౨

తే.గీ. అన్ని కలుములు గలవు నా కయ్యలార । బిడ్డలకు నోచుకొననైతి దొడ్డయింటి
బిడ్డలగు నూఱ్వు రువిదలు వెంట వచ్చి । రడ్డు బాపుఁడు నా విని యవనిసురలు.

తే.గీ. పుత్త్రికామేష్టి సేయించి పుణ్యమిచ్చి । పుత్త్రిలను బడయుమటంచు బూని దాని
జలుపఁగాఁజేసి బ్రాహ్మణుల్ వెలయ నొక్క గిన్నె జల మభిమంత్రణక్రియల దీర్చి.

ఆ. వె. ఒక్కచోట నునుప నుర్వీశుఁ డది యెఱుఁ । గక పిపాసఁ బానకం బటంచుఁ
ద్రావె నంతఁ గడుపు దాల్చె నయ్యది నూచి । దైవచేష్టితముగఁ దలచి ద్విజులు.

ఆ.వె వ్రతసమాప్తి సేయ వరుసఁగాఁ గొన్నినా । ళ్ళకుగ రాజు గర్భ మెఱియ జన్మ
మందెఁ బుత్త్రుఁ డొక్కఁ డందువలన రాజు । బాధితుండుగాడు భగవతి కృప.

క. సంధానకుశలులును గుణ । సింధులు నగు మంత్రివరులు శిశువు న్గానుచున్
గంధాస్యతి శిశు రయమున । మాంధాతా । యనుచుఁ బల్కె మఘవుఁడు మింటన్.

ఆ. వె. అందువలన నతని నందను మాంధాత । యంచుఁ బిల్చి రనిన నవనినాథుఁ
డలరె నంత వ్యాసుఁ డట్టి మాంధాతకు । మించె మఱొక పేరటంచుఁ బలుక.

వ. మునీంద్రా మాంధాతకునామాంతరం బెద్దియనియడిగిననో జననాథా! మాంధాత ప్రతాపంబునకు గిరిగుహాంతరంబులకుం దస్యువులభయమంది చనిన కారణంబున నింద్రుం డతనికింద్రసదస్యుం డను పేరిడియె. అ య్యనంతావల్లభునకు శశిబిందుం డను రాజునకుం గూతు రయిన బిందుమతి యను నంగనామణియందు పురుకుత్స, ముచికుందులను నిద్దఱు కొడుకులు బుట్టిరి. అందు బురుకుత్సునకు నరణ్యుండును, నరణ్యునకు బృహదశ్వుండును, వానికి హర్యశ్వుండును, నతనికిఁ ద్రిధన్వుండును, ఆయనకు నరుణుండును, నమ్మహీపాలునకు సత్యవ్రతుండును గ్రమంబున నుదయించిరి. ఆ సత్యవ్రతుండు. ౨౧౯

క. అతఁడు దిటుం డిచ్ఛాకరు । డతిలోలుపుఁ డల్పబుద్ధియై భూసురరా
ట్సుతి నొక్కర్తు హరించెను । క్షితిసురు లతికోపకలితశేముషు లగుచున్. ౨౨౦

క. అరుణునికడ కరిగి యొహో । నరవర నీ కొడుకు విప్రనారిం గొనియెన్
జరిగెడి పెండిలికిం దా । నొఱగొడ్డియమయ్యె మనసు లోర్చునె చెపుమా. ౨౨౧

క. మీ రెంత రాజులైనన్ । బౌరులలో నున్న బీద బాపల కొంపల్
దూరి యిటు సేయ దగునే । మీరుదురే సాధుజనులు స్మృతిమార్గంబుల్. ౨౨౨

చ. అన విని రాజు క్రోధయుతుఁడై తన పుత్రుని జీరి యోరి నీ
కును గొరగాని చైదముల కొంటెకుఁ బెట్టితి మంచిపేరు పో
మ్మన విని యాతఁ డెచ్చటికినన్ను శ్వపాకులఁ గూడి పట్టణం
బునకును దూరదేశమునఁ బోయి వసించుము స్వేచ్ఛ నావుడున్. ౨౨౩

క. మనమునఁ గోపముతోడం । జని శ్వపచుల గూడెమునకు సవిధంబున నుం
డెను విల్లునమ్ములుం గొని । తన కర్మఫలం బటంచు దలఁచుచు నధిపా! ౨౨౪

ఉ. అంతట నవ్వసిష్ఠుడు మహాత్ముడు ధర్మవిదుండు శేముషీ
మంతుఁడు రాజ్యభారగరిమంబు వహింపఁగ భూవరుండు దాఁ
జింతిలుచు న్వనిం దపముసేయగ నేగె నవగ్రహవ్యథా
క్రాంతి ఘటిల్లె ద్వాదశ శరత్తులు రాట్సుతు ధర్మహానిచే. ౨౨౫

క. అప్పుడు విశ్వామిత్రుఁడు । తప్పక తపమాచరింపఁ దా నేగెఁ గడుం
గప్పిన కరువునఁ దత్సతి । చెప్పగరానట్టి గొడవ చెందె నృపాలా! ౨౨౬

ఆ. వె. పెదవి వెడద జేసి పెల్లుగాఁ గన్నీళ్లు । గార నేడ్చికొనుచు నోరు దెరచి
యమ్మ యాక లాక లాకలి యని పైట । కొంగు లాగ బాలకులను జూచి. ౨౨౭

ఉ. నివ్వెరగింజ లేరఁగను నేర నరణ్యమునందుఁ గందయుం
ద్రొవ్వఁగనేర బిడ్డలను ద్రోయఁగనేరను గూరనైనఁ దే
నెవ్వరు నాకు నింట నిపు డేగతి బిడ్డల బ్రోతు భర్త మ
మ్మి వ్వగ డించెపోయె నని యెంతయుఁ గుందుచు నాత్మలోపలన్. ౨౨౮

ఉ. ఆఁకలి బువ్వ బువ్వ యను నర్భకులం గని యెట్టులోర్తు నే
నా కొక ముద్దలే దనుదినంబును నారికగంజితోటి పొ
ట్టేకద బాత్రిపూట పగ లెద్దయు లే దిటు లెన్నినాళ్ళు నే
బోకడ సేయుదున్ ధనము పుట్టుట యె ట్లెవఁ డిచ్చు నిత్తరిన్. ౨౨౯

క. ఇందరి బిడ్డల నొకపరి । మ్రందించుటకంటె నొకనిమాత్ర మిపుడ నే
నెందేని యమ్మి క్రయధన । మంది పెఱలఁ బ్రోచుటే యుపాయ మటంచున్. ౨౩౦

ఉత్సాహ : నడిమివాని మెడకు దబ్బనారత్రాడు గట్టి యా
పడఁతి వెడలె నచట నచటఁ బౌరులకును జూపుచున్
బుడుత బుడుత వీనిఁ గొనుఁడు పొన్న లిచ్చి యంచుఁ దా
నుడుగ కార్తి మొగమునందు నుట్టిపడఁగ దీనయై. ౨౩౧

వ. ఇట్లు వచ్చుచున్న మునిపత్నినిం, బాలకునిం గాంచి సత్యవ్రతుండు నిజకరుణారసంబు ప్రేరేప నో యమ్మా! యేమి యిది? యని యడిగిన, నాయనా! నేను విశ్వామిత్రు నిల్లాల నన్నుం బిడ్డలం దిగవిడిచి యమ్మునివరుండు తపంబుసేయ నరణ్యంబునకుం బోయె; నే నీ బిడ్డల కన్నంబు పెట్టి భరింపనేరక యొక్కని నమ్మి క్రయధనంబునఁ దక్కినవారిఁ బోషింపఁగలనని యెంచి యిట్లు వీని నమ్మం దెచ్చితి ననుడు నాతండు తల్లీ! విశ్వామిత్రుండు వచ్చువరకు నీకుఁ గావలసిన యాహారంబు దెచ్చి నే నిచ్చెద. నావుఁడు నలరి

య య్యవతి సనియె. నతండ గళబంధప్రాప్తింజేసి గాలవుం డయ్యె. అప్పటినుండి యనుదినంబు సత్యవ్రతుండు వరాహ, మృగ మహిషాది మాంసంబులు గొనివచ్చి యొక వృక్షశాఖం గట్టుచుండు, నదిగొని యా పతివ్రత బిడ్డలం దృప్తులంజేసి తానును భుజించుచు సుఖంబుండె నప్పుడు వసిష్ఠుండు సత్యవ్రతుండు చేసిన యధర్మంబుం బట్టి యతనియందుఁ గ్రోధంబు గలిగియుండె నని సత్యవ్రతుం డెఱింగి వసిష్ఠునియందుఁ గోపంబు గలిగి యుండె. ఇట్లుండ నొక్కనా డరణ్యంబున మృగంబులు దొరకమి నవ్వసిష్ఠు ధేనువు వృక్షబద్ధంబై యున్న దానిం దొంగిలించి తన్మాంసంబుఁ దాను కొంత పెట్టుకొని మిగిలినది విశ్వామిత్రుని పత్నికై చెట్టుకొమ్మకుం గట్టె. అది యామె గొని తన బిడ్డలునుం దానును ననుభవించె నిది వసిష్ఠుం డెఱింగి కోపించి యోరి దురాత్మా! నీవు ధేనువధఁ జేసితివి కావునను, బితృకోపంబునకుఁ బాత్రుండవైతివి కావునను మూఁడు శంకువులు గల్గి త్రిశంకుడను పేరం బరగి యొక పిశాచంబవు గమ్మని శపించినం బరితపించుచు నయ్యరణ్యంబుననుండి ప్రకృతియు. మాయయు, సర్వేశ్వరియు, భగవతియు నగు పరమేశ్వరిం ధ్యానించుచుండె నని సెప్పిన విని జనమేజయుండు వ్యాసున కిట్లనియె. ౨౩౨

క. మునినాథ యవ్వసిష్ఠుని । కినుకకు లోనగుచు సన్నగిల్లిన ధృతితో
మనుజపతి త్రిశంకుండై । ముని శాపవిముక్తి కొక్క మూల మొదవెనే. ౨౩౩

వ. తదనంతరం బెట్లు జరిగెనని యడిగిన సాత్యవతేయుండు. ౨౩౪

తే. గీ. నరపతి త్రిశంకుఁడైన యనంతరంబు । నీచరూపంబుతోడ బిశాచమువలె
నడవిఁ దిరుగుచు శ్రీదేవి నాదిశక్తి । మది జపించె నవాక్షరమంత్ర మూని. ౨౩౫

ఆ. వె. జపము సేసి చేసి జనపతి హోమంబు । సేయఁదలఁచి ధర్మశీలురైన
బ్రాహ్మణోత్తములకు భక్తితోడ నమస్క । రించి యిట్టులనియె నెలమిమీర. ౨౩౬

ఉ. భూసురులార నిత్య పరిపూర్ణదయామతులార విష్టపో
ద్భాసినియైన యీశ్వరి జపం బొనరించితి హోమకృత్యముం
జేసెద యాజకత్వమును జేయుఁడు నా కిపు డీరు వేదవి
ద్యాసముపేతు లేను విపులాంధిపుఁబుత్తుఁ(?)డ ధర్మపద్ధతిన్. ౨౩౭

క. అనిన విని బ్రాహ్మణులు ది । గ్గున నిట్లని పలికి రాత్మఁ గోపించి నినున్
మును శపియించె వసిష్ఠుఁడు । చనునే మముఁ బిలువ నో త్రిశంకుపిశాచా. ౨౩౮

క. వేదాధికార మెందును । లేదు పిశాచముల కవని లేఖులఁ జేరం
గాఁ దగదు పొమ్ము పొమ్మిఁక । మాదగ్గర రాకు మనిన మదిఁ జింతిలుచున్. ౨౩౯

క. ఎందు కిక జీవితము నా । కిందఱిలో నింద మోచి యీ భువిలోనన్
మందునె యగ్నింబడి నే । ద్రుందెదగాకనుచు దీనమానసుఁ డగుచున్. ౨౪౦

ఉ. చిచ్చులఁ జేర్చి స్నానమునుజేసి కృతాంజలియై తదగ్రమం
దిచ్చల దేవి నాత్మ నిడి హెచ్చిన భక్తి నొహో దయామయీ
మచ్చపలత్వము న్మఱువుమా భవదీయపదాబ్జయుగ్మ మే
నిచ్చలు నమ్మితి న్పరమనింద్యుఁడ నా బ్రతుకేల జచ్చెదన్. ౨౪౧

ఉ. అంతట నంతరిక్షమున నద్భుతతేజము పుట్టి యందులో
నెంతయు వింత దోపఁగ సమిద్ధమృగేంద్రతురంగయానయై
కాంత విభూషణాంబరవికాసవిరాజితయై దిగంతవి
శ్రాంతయశోవిశాల యగు శాంకరి దర్శన మిచ్చి యిట్లనున్. ౨౪౨

తే.గీ. చెల్లునా నీకుఁ జిచ్చులో జీవ మెడల । తండ్రి ముదుసలి సుతులఁ బ్రథముఁడ వీవు
నీకు రాజ్యం బొసంగి వనికిని బోవు । రేపు లే దాగు మెల్లుండి రేడ వగుదు. ౨౪౩

తే.గీ. తనదు మంత్రులఁగూడి నీ తండ్రివచ్చి రేపె నినుఁ దోడుకొని పోవు శాపభవపి
శాచతయుఁ బోవుసుమి నా ప్రసాదమునను । మాను మీచింత యని దేవి మాయమాయె.

క. విని సత్యవ్రతుఁడు మన । మ్మునఁ బొంగుచునుండ మంత్రిముఖ్యులు దానున్
జనవరు డరుదెంచి పురం । బునకుం గొనిపోయి పట్టముం గట్టి రొగిన్. ౨౪౪

క. పట్టంబు గట్టి గద్దెను । బెట్టి నృపాలకుఁడు తనదు బిడ్డను గని యో
పట్టీ వినుమా యనుచున్ । గట్టిగ నీతులను జెప్పె క్ష్మాతలనాథా! ౨౪౫

సీ. మనమున ధర్మంబు మరువక యుండుము. విప్రసమ్మానంబు విడువ కెపుడు
న్యాయంబుగా ధన మార్జింపఁ బూనుము రక్షింపు మెప్పుడు ప్రజలనెల్ల
తలబోయినను నబద్ధం బాడఁగాబోకు చెలఁగి పైనం బొంటి చేయఁబోకు
తపసిపూజనముఁ దప్పక చేయుము క్రూరచోరాదుల చూపుమాపు

తే.గీ. గెలువు మింద్రియములను మంత్రులనుగూడి । మంత్రములఁ గాపుసేయుము మమ్ము వీడు
నల్పునది యేమి యని శత్రుఁ డల్పుఁడైన । నెంచకుము నమ్మకుము శత్రు నెనయువాని.

సీ. అన్నిచోటుల వేగు లమరించి యరయుమీ పాత్రదానము సదా పాటిగనుము
శుష్కవాదంబులఁ జొరబోకు మెప్పుడు దుష్టులమూకకుఁ దొలఁగి యుండు
మతివల మఱి ద్యూతరతుల నమ్మకు మెప్డు మృగయ నత్యాదర మిడఁగఁబోకు
త్రాగుడు జూదంబు బోగముదాని పాటలు పొత్తులును సదా తలఁపఁబోకు

తే.గీ. మన్న్యులగువారి నట్టుల నాచరించ । కుండ రక్షించుమీ ధర్మమూని నీవు
పరమకరుణాఢ్యుఁడని కీర్తిఁ బడయు మవల । నెల్లపనులందుఁ దాల్మి రంజిల్ల మనుము.

సీ. కప్పిరి కపిరిచీకటి యుండఁగా లేచి క్షాళనస్నానాదికము లొనర్చి
దీక్ష విడువకయ దేవిపూజ యొనర్చి పౌరి నొకప్పుడు మహాపూజసేసి

భగవతీ పాదాంబుపానంబు గావించి దేవియే దిక్కని తెలసి మెలఁగి
నిత్యకృత్యములను నియతితోఁ గావించి సంతోషభరితత సభకుఁబోయి.

తే.గీ. మూర్ఖ విప్రుల విడచి పాపులను విడచి । పాత్రవిప్రులఁ బూజించి పండితులకు
వినయపూర్వకపూజఁ గావించి దండ । నీతితోఁ గోశమును గూర్చు నీవు పుత్త్ర. ౨౪౯

వ. అని యిట్లు నీతులు గఱపి నరేంద్రుండు వనంబున కరిగి తపంబుసేసి కొంతకాలంబునకు స్వర్గప్రాప్తుండయ్యె. సత్యవ్రతుండు సింహాసనం బధిష్ఠించి ధర్మమార్గంబుదప్పక ప్రజాపాలనంబు సేయుచుండె నని చెప్పిన విని జనమేజయుండు: మునీంద్రా వసిష్ఠునివలన శపింపఁబడి త్రిశంకుపిశాచరూపంబు వహించిన సత్యవ్రతునకు రాజత్వంబును, సురూపంబును, రాజ్యయోగ్యతయు నెట్లు గలిగె నని యడిగిన దేవీదర్శనంబుతోడనే దివ్యదేహంబును, రాజత్వంబునుం గలిగిన వసిష్ఠుండును నరేంద్రుండును సకల ప్రజలును జూచి యత్యంతాశ్చర్యంబు నొందిరి. వసిష్ఠశాపంబు దేవ్యనుగ్రహంబునకు మీరియుండదని నమ్మిము. సత్యవ్రతు దివ్యదేహంబు సూచి దేవ్యనుగ్రహంబు వడసెనని భయంబున రాజ్యపదంబున కర్హుండు గాడని చెప్ప నోడిరి. అనంతరంబ సత్యవ్రతునకు హరిశ్చంద్రుండను రాజుపుట్టె. అతఁడు సకల శుభలక్షణసంపన్నుండై యువరాజత్వంబు వహించె నంత గొంతకాలం బరుగ సత్యవ్రతునకు మానుష శరీరంబుతో స్వర్గంబున నుండం దలంపు పుట్టి వసిష్ఠునిం జేరి యనేకవిధంబుల దన్నుమఖంబు సేయింపు మని వేడిన నతండు. ౨౫౦

క. ఈదేహముతో స్వర్గము । పోఁదలచుట వెఱ్ఱితనము భూజనులకు ని
మ్మేదినిలోపల జచ్చిన । మీదట స్వర్గంబు గలుగు మే ల్చేసినచోన్. ౨౫౧

క. కావున యజ్ఞంబు లొగిం । గావింపుము మృతుఁడవై జగద్వంద్యత న
ద్దేవతలప్రోలి కరిగెదు । నా విని కోపించి యవనినాథుడు పలికెన్. ౨౫౨

క. గర్వావేశము నీకును । దుర్వారం బిఁకఁ బురోహితుం బెఱవానిం
గీర్వాహుఁ గైకొని సేసెద । నుర్వీన్ జన్నంబు లనిన నుగ్రాకృతియై. ౨౫౩

తే.గీ. ఓరి విప్రాంగనాహారి యోరి బ్రహ్మ । ధేనుసంహారి యోరి పాపానుసారి
చచ్చినను బోవురా నీవు స్వర్గమునకుఁ । దిరుగఁ జండాలరూపంబు బరగు నీకు ౨౫౪

వ. అని యిట్లు వసిష్ఠుండు క్రోధావిష్టుండై శపించినం ద్రిశంకుండు. ౨౫౫

సీ. కట్టిన దువ్వల్వ కడుమైలగాఁ బోయెఁ బెట్టిన నగలెల్లఁ బెంకులాయె
పూసిన గంధంబు కౌసైన వపరాయె వేసిన శాటికల్ బిడకలాయె
పట్టిన ఖడ్గంబు పదునుకొడవలాయె మెట్టిన పావాలె యట్టలాయె
తీర్చిన పసిఁడిజందెము ప్రాంతవారాయె కూర్చిన మకుటుంబు గొంగడాయ

తే.గీ. పొసఁగఁ బల్కెడి మాటలు బూతులాయె । మెఱుఁగులీనెడి మేనెల్ల బరబరాయె
కొండెసిగవైచు దలకట్టు గుంగురాయె । గొప్పరాజ్యంబుగల రాజు గొడవరాయె. ౨౫౬

క. గాయత్రిని జపియించుచుఁ । బాయక యయ్యాదిశక్తి భక్తియుతుండై
శ్రేయము గనిన వసిష్ఠు । న్న్యాయమెడలి నృపుడు దూరినట్టి ఫలముసూ. ౨౫౭

క ఈగతి మాదిగయై తన । మైఁ గనుగొని వగచి వగచి మనుజేంద్రుఁడు తా
నేగతి జీవించెద నని । వాగులుగాఁ బాఱ బాష్పవారి విడుచుచున్, ౨౫౮

మ విసమున్ లోఁగొనియైన లోతయిన బావి న్గూలియైనన్ మెడన్
గొస బంధించి బిగించియైన శిఖియందున్ వ్రాలియైనన్ గడున్
నిసితంబైన యసిన్ దెగన్ దనులతన్ ద్రెళ్ళించియైనన్ నివృ
త్త సమీరుండను గావుటం దొసఁగు సిద్ధం బాత్మహత్యాకృతిన్. ౨౫౯

క కానున్న దైన దేగతి । నే నిప్పుడు దలఁచినం బనేమి యనుచు భూ
జాని నగరంబు వెలువడి తా నేగె సురస్రవంతి తటమున కెపా. ౨౬౦

తే.గీ. జనకు నాపత్తు విని హరిశ్చంద్రనృపతి । మంత్రులను జీరి మీరేగి మనుజనాథు
రాజ్యపరిపాలనమునకు ర మ్మనుండు । గురుఁ బ్రసన్నునిఁజేయు నీ కొడు కనుండు. ౨౬౧

తే గీ. అనుచుఁ బంపిన వా రెల్లఁ జని నృపాలు । నెల్లవిధముల వేడిన నొల్ల రాజ్య
మీవ ధర్మంబు విడువక యేలుకొను మ । టంచుఁ దెల్పుఁడు సుతునితో ననుఁడు వారు.

వ. డెందంబులఁ గొందలపడుచు వచ్చి హరిశ్చంద్రునకుం జెప్పిన నతండును గడు వగచి
రాజ్యం బరాజకంబగు నని చెప్పి యొప్పింపం బట్టాభిషిక్తుండై రాజ్యంబు చేయు చుండె
నంత. ౨౬౩

సీ. జననాథ విను గాధితనయుండు దన తపఃపరిసమాప్తి నొనర్చి భార్య బిడ్డ
లను జూచుకొను తలంపున స్వస్థలము జేరి కఱువులో దనవారు గాసిలేక
యుండుట కలరుచు నువిదను గాంచి యందులకుఁ గారణమును దెలుపు మేను
గుడువ నన్నము లేక గొట్టిడుమలఁ జెంది యొకనాఁడు శ్వపచువాటికకుఁ బోవ

తే గీ. యొక్క శ్వపచునియింటిలో నున్న శుష్క । మాంసమును సంస్కృతంబును భాండగతము
గాంచిఁ ద్రుచ్చిలితిని పొట్ట నించికొంటి । దానిఁ గనుగొనిఁ గొడవరి తత్తరమున. ౨౬౪

సీ. అయ్యయో నీవు బ్రాహ్మణుడవు నాయింటఁ గుక్కమాంసము వండు కుండలెల్ల
బగులఁగొట్టితి వేల తగునటయ్యా యన్న నిట్టుల వినుమని యేఁ బలికితి
నాఁకలిచేత నే నతిపీడితుండనై కణమైన దొరకక కష్టపడుచు
వచ్చి ద్రుచ్చిలి కుండ వ్రచ్చి కుక్కల నంజుడును దింటివని తెల్పిన నతడు విని

తే.గీ. అన్ని వర్ణంబులందును నగ్రగణ్య । మైన బ్రాహ్మణవర్ణంబునందు బుట్టి
యిట్టి దుర్జాతి మాదిగ యింటికుక్క । నంజుఁడును దొంగవైతి వన్యాయముగనె. ౨౬౫

వ. అనిన. ౨౬౬

సీ. ఆపదవచ్చిన యప్పుడు ధర్మసూక్ష్మముగల దెంత నీచకులమైన
నెట్టి నింద్యపదార్థ మేని యాఁకలి దీర్చుకొన దొంగిలియునైన దినఁగవచ్చు
కులధర్మ మెడలుటకుఁ బదార్థసేవన చౌర్యంబు మూఁడును జపుఁడు గనఁడు
క్షామమం దెన్నఁ బర్జన్యుడేఁ యపరాధి యనుచుండ గజతుండమంతలేసి

తే.గీ. ధారలుగ వాన గురిసెను దక్షణంబు । కఱవు దీరెను నీ వెట్లు గడపితొక్కొ
అట్టి దుర్భరమైన మహాపదయగు । కాటకములోన బహువర్షకాల మబల. ౨౬౭

క. అనవుఁడు సతి యిట్లను నో । మునివర కాయలును బండ్లు మూలము లాకుల్
గనులకుఁ బొడకట్టగ నే । మనమునఁ జింతిల్లి యొక్క మార్గముఁ గంటిన్. ౨౬౮

క. ఒక బిడ్డ నమ్మి పరబా । లక నికరము జీవములను రక్షించెద నం
చొకచోటున కరిగి యచట జకితస్థితి నుండ జూచి సత్యవ్రతుఁడున్. ౨౬౯

చ. ఎడపక మీకు భోజనము నే నిడెద న్మని వచ్చుదన్క నం
దుడుగక కుక్క పంది కణుజుమ్మల నంజుడు తెచ్చి పెట్టు మా
కడుపులు నిండఁ దించు నినుఁ గాంచితి మిప్పుడు భర్త తిన్నదే
యెడపక నాలుసుం దినియె నిందున కేటికి సంశయింపగన్. ౨౭౦

తే.గీ. ప్రాణనాయక వింటివా పార్థివుండు । శప్తుఁడయ్యెనుజుమ్మ త్రిశంకు నామ
మూనినట్టి శ్వపచభావ మొందుమనుచు । నవ్వసిష్ఠునిచే నన నాలకించి. ౨౭౧

ఆ.వె అబల రాజు శాప మావసిష్ఠుని గర్వ । మడచివైతుఁ జూడు మవనివిభుఁడు
మనకుఁ జేసినట్టి ఘనమైన యుపకారమునకు మారు మేలు చనదె సేయ. ౨౭౨

చ. అనుచు మునీంద్రుఁ డానృపతి నారయుచుం జని యొక్కచోటఁ దా
వనమున నుండఁగా గుఱుతుపట్టి త్రిశంకుఁడు చేరి దండవ
త్ప్రణతియొనర్చినం గరము పట్టుక లేపి మునీంద్రుఁ డిట్లనున్
మనమున నిక్కువంబయిన మక్కువ యెక్కువయై తలిర్పగన్. ౨౭౩

శా. నన్నుంగూరిచి నీవు సెందితివి నానా కష్టముల్ కావునన్
నిన్నుం బూతునిఁ జేసెదన్ దెలుపుమీ నీకోరికల్ నావుఁడున్
ము న్నే వేడితి నవ్వసిష్ఠు సవనమ్ము న్నాకుఁ జేయింపఁగా
న న్నాతం డిటుసేసెఁ జూడుమని దీనత్వంబునం గుందుచున్. ౨౭౪

తే.గీ. తాపసులతేడ నీవైన దయ దలంచి । యాజకత్వంబు వహియించి యజ్ఞపూర్తి
చేసి మానుషదేహంబుతో సురాల । యంబునకు స్వేచ్ఛమీర నన్నంపుమయ్య. ౨౬౫

వ. అనిన విని విశ్వామిత్రుం డా రాజశ్రేష్ఠునకు వసిష్ఠువలన బ్రాప్తంబయిన శాపవృత్తాంతంబు
సవిస్తరంబుగా విని. ౨౬౬

క. అది యెంతపని నృపాలక । మదిఁ గుందకుమింక నీదు మఘమునకును నే
ముదమునను యాజకుఁడనై । సదమలగతిఁ బూర్తిసేసి స్వర్గ మొసఁగెదన్. ౨౬౭

తే.గీ. అని వచించి మఖార్థమై యలరు పనుల । నెల్లఁ గావించి సంభార మెల్లఁ దీర్చి
బ్రాహ్మణులఁ జీరఁగ వసిష్ఠభయముచేత । మూలదూరిరి రాము రాము చను మనుచు. ౨౬౮

వ. అనిన విని. ౨౬౯

క. వైదికు లిద్దర నహహా । చేదస్తాలకును బంటచేలేసుమ్మీ
యీ దాడన గోదాడను । వాదుల దెడ్డముల కంతవారుంగలరే. ౨౭౦

చ. అని యొక కొంతసేపు దన యాత్మ విచారముసేసి దేవి వం
దనమున నిత్యకృత్యములఁ బా నొడఁగూర్చిన పుణ్యు మా త్రిశం
కున కిడి యోనృపాల యిదిగో వడి నీ వమరేంద్రుపట్టణం
బునకును బొమ్ము పొమ్ము జయ భూతదయామయి దేవి నావుఁడున్. ౨౭౧

ఉ. తుఱ్ఱున లేచి యట్టు నిటు దూఁగుచు గాలిపటంబువోలెఁ బై
కఱ్ఱిడి పోయి పోయి జను లద్భుతమందుచు గోపురాలపై
మిఱ్ఱుల మిట్టలం గనఁగ మిన్నొకని కానఁగరాక నిక్కపీన్
గుఱ్ఱమురౌతుప్రోలునకు గొంచెము దగ్గఱఁ బోవునంతలోన్. ౨౭౨

క. మాలఁడు వీఁడు మలీమస । చేలుండు నైలింపపురికిఁ జేరెడు ననుచున్
గాలుం బట్టుక క్రిందికిఁ । గూలింపఁగ వాఁడు పడుచుఁ గుయ్యో యనుచున్. ౨౭౩

ఉ. నన్నుఁ ద్రిశంకుని న్విబుధనాథుఁడు దాఁ బడఁద్రోచె నయ్యయో
కన్నులు విప్పి చూడఁగదె గాధితనూభవ యంచు నేడ్చుచో
నున్నవిధంబు సూచి యటు లుండు మటుండు మటుండు మన్న జే
డు న్నిలిచె న్నభంబునఁ గడున్ సురలున్ మునులున్ భయంపడన్. ౨౭౪

ఆ.వె. అటుల నృపతి నిల్పి యమ్మౌని వేఱొక్క । స్వర్గమును సృజింతు సరగ ననుచు
దీక్షపట్టియుండ దేవేంద్రుఁ డచటికి । వచ్చి వగచి దీనవదనుఁ డగుచు. ౨౭౫

క. మునినాథ కిసుకయేటికి । నిను వేడెద నింక వేఱె నిర్జరలోకం
బును జేయ మానుమనినన్ విని విశ్వామిత్రుఁ డోయి విబుధాధీశా! ౨౭౬

క. వీనిని మీ స్వర్గమునకు । రాని మ్మటులేనియు నితర స్వర్గంబుం
బూన నొనరింప నావుడు । నా నాకపురీశు డాత్మ నతిశంకితుడై. ౨౮౭

ఉ. ఈతఁడు దుస్సహోగ్రరుచి యీతని పేర్మికి బ్రహ్మ యోపునే
నా తరమా యటంచు జననాథుని దివ్యశరీరుఁ జేసి ని
ర్భీతిని స్వర్గలోకపదవిన్ నిలిపె న్గుశికాత్మజుండు సం
ప్రీతి నిజాశ్రమంబునను బిడ్డలతో సతితో సుఖింపఁగన్. ౨౮౮

## —: హరిశ్చంద్రోపాఖ్యానము :—

ఉ. సాంద్రయశోలసద్రుచివిచాలితశారదచంద్రు డా హరి
శ్చంద్రుఁ డపత్యహీనుఁ డయి చయ్యన వంశగురు న్వసిష్ఠు ని
స్తంద్రత వేడినన్ గరుణ జాల్కొన నో ధరణీతలేంద్ర వా
రీంద్రునిగూర్చి ధ్యాన మొనరింపుము నావుడు సంతసిల్లుచున్. ౨౮౯

క చని గంగాతటమున న । జ్జనపతి దప మాచరింప జలపతి గరుణం
జనుదెంచి దర్శనం బొస । గిన నెక్కుడు భక్తితోడఁ గీర్తించి తగన్. ౨౯౦

క. పాశధర మూఁడు ఋణముల । లేశంబును దీఁగ దెందు లే దీ పాపం
బీశత్వమేలఁ బృథివికి । బేశలసుతలాలనంబు బెనయకయున్నన్. ౨౯౧

క. అన విని వరుణుఁడు జనవర । వినుము సుపుత్త్రుఁడు గలుగ వేడెదవేనిన్
దనయుని నా యజ్ఞంబున । కును బశువుగ నిత్తువేనిఁ గోరిక యొదవున్. ౨౯౨

వ. అనిన నొక్కింత చింతిల్లి నృపాలుండు మనంబు గట్టిసేసుకొని తనలో దా నిట్లని వితర్కించె. ౨౯౩

క. బిడ్డలకు నోయఁజాలని । గొడ్డై గతిలేక దూలి కోల్పడుకంటెన్
బిడ్డను యజ్ఞార్థముగా । గొడ్డుం గావించుటే తగున్ భువిలోనన్. ౨౯౪

ఆ.వె. అని తలంచి నృపతి యప్పతిమాటకు । నియ్యకోలుసేసె నేగె వరుణు
డంత నతని నూఱ్వు రాండ్రలో బట్టపు । సుందరాంగి శైవ్య చూలుమోచె. ౨౯౫

ఆ.వె. తాల్చి కాంచె నొక్క తనయుని నతిసుంద । రాంగు రాజు నంతరంగమందుఁ
బొంగి జాతకర్మ పుణ్యాహములు సేసి । విప్రవరుల దానవితతిఁ దనిపె. ౨౯౬

క. పుత్త్రోత్సవ మొనరించి ప । విత్రుండగు రాజు మిగుల వేడుక నుండన్
జిత్రముగ వచ్చి యడిగెం । బుత్త్రి నొసంగుమని జలవిభుండు గడంకన్. ౨౯౭

క. అడిగినఁ బుత్త్రునిఁ బైఁ బ్రే । ముడివలన న్నృపతి దనదు ముద్దులకొమరున్
వడి నెలపురు డెవలిన పద । పడి నిచ్చెదననిన నతఁడు బాగని యరిగెన్. ౨౯౯

వ. అంత భూపాలుం డబ్బాలునకు రోహితుం దను పేరుపెట్టి గారామునం బెనుచుచుండ.

క. నెలదాటిన పిమ్మట న । జ్జలపతి చనుదెంచి యింక జాగేటికి మా
ర్పలుకక సుతు నిమ్మన రా । ట్కులవరుఁ డాత్మజునిమీది కూరిమిపేర్మిన్. ౩౦౦

ఆ.వె. పండ్లురానివాఁడు పశుకృత్యమునకును । బనికిరా దటంచుఁ బలుకుదురు మ
హాత్ములైనవార లగిగాన దంతముల్ । వచ్చుదనుక నిలువవలయు ననిన. ౩౦౧

క. లగని చని వరుణుఁడు దా । దిగ్గునఁ జనుదెంచి భువికిఁ దెమ్ము శిశువు నేఁ
డ్గ్గెల పండ్లు వచ్చెను దగ్గగరా దిపుడు నీవు ధాత్రీశ యనన్. ౩౦౨

క. చౌలంబుగానివానిం । బోలదు యూపమునఁగట్ట బుధుల నడుగుమీ
నాలోపమేమి నావుఁడు । లోలో గొణుగుచును వరుణుడుం జని మరలన్. ౩౦౩

క. చూడాకర్మము దీరిన । వాఁ డీతఁడు దెమ్మటంచు వరుణుఁ డడుగఁగా
వీఁ డనుపనీతుఁ డెట్టులు । గూడున్ యూపమున కనినఁ గోపించి వెసన్. ౩౦౪

ఆ.వె. కొడుకుమీఁది యాస తడవాచరించెదు । శాప మిత్తు ననినఁ జరణములకు
నెఱగి వేడుకొనినఁ గఱఁగిన మనసుతో । నాతఁ డొప్పుకొనియె భూతలేశ! ౩౦౫

క. వఱుగ్గైన వెనుక వచ్చిన । నొడయం డతిభక్తి మ్రొక్కి యుదకేశుని వే
డుడును సమావర్తనముం । గడచినపిమ్మటను శిశువుఁ గైకొన నొప్పన్. ౩౦౬

ఉ. అంతట రోహితుండు దన యాపదయెల్ల యెఱింగి భీతి దే
శాంతర మేగి మందునని యన్నగరంబును వీడి కాననా
భ్యంతరవాసిగాఁ జనియె న వ్వరుణుండును రాజుపాలి క
త్యంతరుషాన్వితుం డగుచుఁ దా నరుదెంచి కుమారుఁ గోరినన్. ౩౦౭

శా. ఓ పాశాయుధ ! యేమిచేయుదును నే న్యుగ్రాకృతి న్బాని నీ
పీ పాపంబును నే నొనర్చితి నటం చిబ్బంగి రాఁజెల్లునే
నాపాపం డెటుఁబోయెనో యెఱుఁగ నానాదేశశైలాటవీ
ద్వీపంబుల్ వెదకించితిన్ దొరకలే దేమందు నీతో నికన్. ౩౦౮

ఉ. నావుఁడు నా ప్రచేతసుఁడు నవ్వి భళా తగు నీ యసత్యవా
గ్భావము గంటిలెమ్ము కులగౌరవమెల్లను బోయె నెన్నిసా
ర్లీవర కెంత యోర్చితి సరే యిఁకమీద జలోదరాఖ్య రో
గావహమయ్యెడున్ నృపకులాధమ! నీ కని శాపమిచ్చినన్. ౩౦౯

చ. వనధిపు శాప మంది నృపవర్యుఁడు వ్యాధిని బొక్కియుండఁగాఁ
దనయుఁడు రోహితుండు దన తండ్రినిఁ జూచు తలంపుతోడఁ జ
య్యనఁ బయనంబుగాఁగ విబుధాధిపుఁ డాతనిపాలి కేగి యో
జనవర పుత్త్రి శీఘ్రముగఁ జావఁగ నేగెదె తండ్రిపోలికిన్. ౩౧౦

క. నీవేగిన క్షణముననే । యావరుణున కిచ్చు నిన్ను నాతఁడు మఘమున్
గావింపఁగ జేయు నిసున్ । వేవేగమ యూపమందుఁ బెట్టుదురుసుమీ. ౩౧౧

ఆ.వె. నిన్నుఁ గట్టఁ ద్రాడు నీవేల గొంపోవ । నిన్నుఁ జంపు తండ్రి నీకు నేల
వెఱ్ఱివాక్కొ యెఱుఁగవే తన్నుమాలిన । తగవు లేదటంచు ధాత్రిమీద. ౩౧౨

క. అనిన విని రోహితాశ్యుఁడు జనకునికడ కేగ మానె జనవాథుఁడు దాఁ
దన రోగమునకుఁ గుందుచు । దినములు గడుపంగలేక దీనుం డగుచున్. ౩౧౩

క. తన కులగురుని వసిష్ఠునిఁ । గని యాలోచనము సేయఁ గడు నరసి యతం
డును జనవర వరుణుండే । నినుఁ గరుణింపంగవలయు నెమ్మి న్వినుమా. ౩౧౪

చ. నరవర చెప్పెద న్వినుము నాకును దోచినయట్లు పుత్త్రి లీ
ధరణి గణింపఁగాఁ బదివిధంబులవారలు వారిలోన నొ
క్కరుఁడగు క్రీతుఁ డట్టి సుతుఁ గైకొని సేయుము జన్న మందునన్
వరుణుఁడు మెచ్చు రోగమును బాయును నీ కన నాత్మఁ బొంగుచున్. ౩౧౫

క. ఎక్కడనేనియు నొకసుతు । గ్రక్కున గొనితెండటంచు క్ష్మాసురవరులన్
రొక్కంబు లిచ్చి పంపినఁ । దక్కక వా రేగి యొక్క తపసులపల్లెన్. ౩౧౬

తే.గీ. కలఁ డజీగర్తుఁ డను ద్విజకులవరేణ్యుఁ
డతనికిని బుత్రకులు మువ్వు రతిదరిద్రుఁ
డై సుతుల నమ్ముకొనఁ దన యాత్మ గర్హి
తం బని తలంప దర్థలోభంబు పూని. ౩౧౭

వ. అజీగర్తుని సుతులలో మొదటివాఁడు శునఃపుచ్ఛుడు. రెండవవాఁడు శునశ్శేపుడు. మూడవవాఁడు శునోలాంగూలుఁ డందుఁ బ్రథమునందుఁ బ్రీతిచే నతండును, గనిష్ఠునందుఁ బ్రేమంబునఁ దల్లియు నమ్మనొల్లక మధ్యముఁడగు శునశ్శేపు నమ్మినం గొనితెచ్చి బ్రాహ్మణుఁడు రాజున కిచ్చిన నలరి యజ్ఞంబుసేయ సమకట్టి యెల్లమునుల రావించి యజ్ఞంబు సేయుచు నా శునశ్శేపుఁ బశువుం గావించి విశ్వామిత్రునకుం గత్తి యిచ్చి వానిం దెగనఱుకు మనిన విని యిట్లు దీనుండై యడలుచున్న బ్రాహ్మణ కుమారు ధనార్థినై చంపఁజాల ననిన విని రాజును, సభాసదులును నేఁ డేమి సేయఁదగి నది యని పెక్కువిధంబుల నాలోచనంబులు సేయ నయ్యయో యీ ద్విజకుమారుం డార్తుండై దుఃఖింపుచుండ వీని యూపనిబద్ధుం జేసి చంపుమన నీ రాజున కెట్లు నోరాడె

నని పలుగతుల నెల్లవారు పల్కుచుండ నేమియుం బలుకనేరక నశ్రుధారాపాతంబు గనుల వెంబడిం దొరుగ బాలుం డేడ్చుచుండ నర్థలోభంబున నతని తండ్రి యజీగర్తుండు చివ్వున లేచి నృపాలున కిట్లనియె. ౩౧౮

క. జనవర యీ కార్యము నే । నొనరించెదఁ జూడు మిదిగొ యోపిక నాకున్
ధనము ద్విగుణంబు సేసిన । ననిన న్విని నృపతి వాని కట్లనె యనినన్. ౩౧౯

తే.గీ. అయ్యయో యెంతనిర్దయుం డతికఠోర । చిత్తుఁడై యాత్మసుతుని హింసింపఁబూనె
నీ యజీగర్తునకును జే యెట్టులాడు । నర్థలోభులు చేయని యఘము గలదె. ౩౨౦

క. కొడుకును హింసింప ధనం । బడుగు నజీగర్తుఁ డెంతయాశా పరుఁడో
పుడమిని లోభగుణంబును । గడచిన పాపోపపాతకం బొండున్నే. ౩౨౧

చ. ఇతఁడు మనుష్యుఁడే మది నొకింత దయారస మూన కాత్మజున్
క్షితిపతి కమ్మె దా ననినిఁ । జేకొని చంపదలంచె నిట్టి దు
ష్కృతమునకుం ధనాశ పరికింపఁగ గారణమయ్యె నయ్యయో
సుతులును దల్లిదండ్రులును సోదరులున్ గలరే ధనాశకున్. ౩౨౨

క. రెండంతలు ధన మిచ్చినఁ । గొండికఁ జంపుదు నటంచు గొడ్డలిఁ బూనెన్
గండాగొండితనంబునఁ జండాలుఁడుగాక బ్రహ్మజాతి బొడమెనే. ౩౨౩

క. తన యంగమే తనయుఁడై । జనియించు నటండ్రు శాస్త్ర చతురులు కానన్
తను దాఁ జంపుకొనుట కీ । మనుజాధమునకును నెట్లు మనసునఁ దోచెన్. ౩౨౪

వ. అని యిట్లు.

క. గలగల గొలగొల మని సభ । గలవారలు జింతసేయఁ గౌశికుఁడు గృపా
కలితుండై రాజన్యుని । వలనికిఁ జనుదెంచి యిట్లు పలికె నృపాలా ! ౩౨౫

చ. శమము దమంబు దానమును సత్యము నధ్యయనంబు వైదిక
త్వము తపముం జపంబు నయవర్తనమున్ యశమున్ బ్రతాపమున్
సమతయు ధీరభావమును న్యాయము దైవమునందు భక్తిభా
వము శుచి యెల్లధర్మములు వాసిగనుం దయ గల్గెనేనియున్. ౩౨౬

క. ఇలలో దయయే ధర్మం । బులకును మూలంబు దయను బూనక పుణ్యం
బులనుచు జేయుట పాపం । బులసేయుటసుమ్ము దయయె పుణ్యము తలపన్. ౩౨౭

క. నీకును సుఖము గలుగునని । లోకమువారలకుఁ బీడలుం బొనరింపన్
నాకంబు గలుగునే యము । లోకంబున బాధలుం బడుదురుగాక నృపా । ౩౨౮

క. పాపం బెఱుఁగని నరుపైఁ । గోపము వడరాదు కినుక గూడక వైరం
బేపట్లఁ జనదు వైరం । బేపారక యొకనిఁ జంప నెట్లొప్పు నృపా! ౩౩౦

క. తన కితరు లేది సేసినఁ । దన కహితం బితరులకును దా నది సేయం
జనదుసుమీ జనపాలక । వినుమా యీ ద్విజకుమారు విడుమా వడిగన్. ౩౩౧

ఉ. జన్నము సేయునప్పుడు ద్విజప్రవరుల్ బహువాంఛితంబులన్
గ్రన్నన వేడరే నృపులు కాదన కియ్యరె యీ కకుత్థ్సవం
శోన్నతి పిన్నగాదు వినుమో నృప ! యీ ధరణీసురార్భకున్
మన్ననఁజేసి వేగ విడుమా యనఁ గౌశికుఁ జూచి రా జనున్. ౩౩౨

క. ఒడయఁడు జన్నము సేయుచు । నుడుగక దానంబు లిచ్చుచుండ ద్విజుం డొ
క్కఁడ డడిగినది యీకున్న । గడుపాపము వచ్చుఁ బుణ్యగతులు న్చెడయున్. ౩౩౩

ఉ. నావుఁడు భూతలాధిపుఁడు నాకు జలోదరపీడ యిందుచేఁ
బోవునటంచుఁ దెల్పె మునిపుంగవుఁడైన వసిష్ఠుఁ డట్టులం
గావున మాన నన్న విని కౌశికుఁ డో నరపాలసత్తమా !
నీవు భయంబు నొందకుము నేనకదా మును నీదుతండ్రికిం
ద్రోవ యొసంగితి న్విబుధలోకముఁజేరి సుఖింప వింటివే. ౩౩౪

ఉ. మాలతనంబునొంది కసుమాలపుజీవితముం గ్రహించి ఘో
రాలసవృత్తినున్నఁ గని యాత్మతపఃఫల మిచ్చి సౌఖ్యముం
జాలగనొంద నీజనకు స్వర్గమునం దిడినట్టి నన్నునుం
దేలికసేయఁబోకు మని దెల్పిన కౌశికు నాదరింపకన్. ౩౩౫

క. ఈ వెన్నిచెప్పినను నే । నీ విప్రకుమారు విడువ నేగు మనంగా
వేవేగ శునశ్శేపున । కా విశ్వామిత్రుఁ డనియె నత్యాదరతన్. ౩౩౬

క. విను మొక వారుణమంత్రం । బును దెల్పెద దాని జపం బొనరింపు మటం
చును జెప్పఁగఁ వాఁ డదియే । పనియని యొకసారి కొక్క పదిసారులుగన్. ౩౩౭

క. వరుణుని మంత్రము నూరెన్ । జరజర జిహ్వాగ్రమనెడు శాణమున స్ఫుటా
క్షరముగ సంతతను దయా । కరుఁడైన ప్రచేతుఁ డలరె గ్రక్కున వచ్చెన్. ౩౩౮

ఉ. వచ్చిన పాశిఁ జూచి నృపవర్యుఁడు మ్రొక్కి మహాత్మ నేఁడు నా
యొచ్చెము దీరఁ జేయుటకు నొయ్యన నియ్యెడ కేగుదెంచితేఁ
గ్రచ్చర గ్రీతు నొక్క సుతుఁ గైకొని నిన్నునుగూర్చి యజ్ఞమున్
జెచ్చెరఁ జేయుచుంటి దయసేయుము చూడుము విప్రబాలకున్. ౩౩౯

ఆ.వె. అర్థి దోష మెఱుఁగ దన్నట్లు నేఁ బుత్త్రి । లోభమునకాదె లోలబుద్ధి
నిన్ను మోసపుచ్చి యున్నందుకు ఫలంబు । ననుభవించినాఁడ నధికపీడ. ౩౪౦

క. ఆ పలుకులు విని వరుణుఁడు । భూపాలక విప్రసుతుని బోనిమ్మికఁ ని
య్యూపంబునుండి విడువుము । కోపము నా కింకను లేదు కొంచెంబేనిన్. ౩౪౧

తే.గీ. నీ జలోదరరోగంబు నేఁటనుండి । నీకుఁ గలుగదు దేహంబు నిర్మలమగు
నమ్ము నామాట యని పల్కి నరవిభుండు । విడిచె నయ్యూపముననుండి విప్రబాలు.

క. పులినోటనుండి తటుకున । వెలవడు నాదూడమాడ్కి విడివడి బాలుం
డలరుచు సభికులఁ గని పే । రెలుఁగున నెవ్వరి సుతుండ నెఱిఁగింపుఁ డనన్. ౩౪౩

క. కొంద అజీగర్తుని తను । వందుం బొడముటను వాని యాత్మజుఁడే కా
కిందఱితోఁ బనియేమని । పొందుగ వచియించిరి తలపోసి నరేంద్రా! ౩౪౪

క. కొంద ఱితఁడు భూనాథుని । నందనుఁడే క్రీతుఁడయ్యె నాగ మఱియును
గొందఱు వరుణుని తనయుఁడు । సందియమేలనిరి మఖము సంగతి నధిపా. ౩౪౫

తే.గీ. ఎవ్వరికిఁ దోచినట్లు వా రిట్లు పలుక । విని వసిష్ఠుండు లేచి యో విబుధులార
సొమ్ముఁగొని యమ్మకొనినభూసురున కితఁడు । సుతుఁడుగా డిది సర్వసమ్మతముసుమ్ము.

క. జనవరుఁడు వరుణునకు మఖ । మున నియ్యదలంచినాఁడు మునుకొని కానన్
జనవరునకు సుతుఁ డెట్లగుఁ । దనయర్థము నితరునకును దానము సేసెన్. ౩౪౭

తే.గీ. కాడు వరుణునకు సుతుండు కౌశికుండు । మంత్రజప ముపదేశించి మహిమఁగాంచి
యూపముననుండి విడిపించె రాపుదీర్చి । యదియఁగావున గాధేయు నాత్మజుండు. ౩౪౮

క. అనినన్ విశ్వామిత్రుఁడు । విని విప్రకుమారుఁ దనదు వెంటంగొని యే
గెను వనికి శునశ్శేపుఁడు । మనమున సంతోషమందె మనుజాధీశా! ౩౪౯

వ. అంత హరిశ్చంద్రుండు జలోదరరోగంబువలనం దొలంగి యత్యంతానందంబున నిజ
నగరంబు ప్రవేశించె. నిది యెల్ల విని తన కింక భయంబు లేదని దృఢచిత్తుండై
రోహితాఖ్యుండు నగరంబునకు వచ్చుట విని రా జెదురేగి కౌఁగలించుకొని యింటికిం
గొంపోయి సుఖంబుండె. నప్పుడు విశ్వామిత్రుండును, వసిష్ఠుండును రాజువలనం
బూజితులై స్వర్గంబున నమరావతికిం బోయి సుధర్మనున్న యవసరంబునం బ్రశంసా
వశంబున హరిశ్చంద్రు నుగ్గడించుచు వసిష్ఠుండు గౌశికున కిట్లనియె. ౩౫౦

ఉ. న్యాయవిదుండు ధీరుఁడు దయాళుఁడు కీర్తిపరుం డురుప్రతా
పాయతమూర్తి శౌర్యధనుఁ డార్తశరణ్యుఁడు యజ్వ దేవతా

ప్రాయుఁడు సత్యసంధుడు శుభవ్రతశాలి వదాన్యమౌళి యో
మా యజమానుఁ డెన్న నసమానుఁడు మానధనుండు కౌశికా ! ౩౫౧

మత్తకోకిల. ఆడితప్పఁడు పల్కిబొంకఁడు హాసలీలలనేనియున్
గూడియుండును సాధుబృందము కోప మింతయు లేదుసూ
పీడ డెన్నఁడు ధైర్య మీవిని వెన్కదీయు డెఱుంగఁ డీ
రేఁడులోకములందుఁ జూఁడగ నీడు వానికి లేదుగా. ౩౫౨

చ. తగవుల ధర్మరాజు పరదారసహోదరుఁ డింగితజ్ఞుఁ డో
ర్పుగలుగువాఁడు పుణ్యముల ప్రోవు ధనార్థుల కొంగుపైడి భూ
గగనచరాళికిం బెరటికల్పక ముర్వికి భూషణంబు బల్
మగఁడు త్రిశంకుసూనుఁ డసమానుఁడు సత్యవచోవ్రతంబునన్. ౩౫౩

క. అనిన విని క్రోధభీమా । ననుఁడయి కనులెఱ్ఱఁజేసి నాయెదుటఁ ద్రిశం
కుని సుతు గుణ మెన్నుట యం । బను ముందరసిడుక మేనమామఁ బొగడుటే. ౩౫౪

క. జగమునను హరిశ్చంద్రుని । సుగుణంబులు వొగడుటకును జొచ్చితి వాతం
డగు బొంకులమారి నుతిం । పఁగఁ జనునే మోసపోయె వరుణుఁ డెఱుఁగవే. ౩౫౫

తే. గీ. ఆ హరిశ్చంద్రుకడ కిప్పు డరిగి యేన । యనృతవాది యదాత యం చంద అనఁగఁ
జేసెదను జూడు నే నట్లుఁ జేయకున్నఁ । బూర్వసంచితపుణ్యంబు పోవుఁగాక. ౩౫౬

తే.గీ. నే హరిశ్చంద్రు నట్టి దుర్నీతుఁగాఁ గ । ణింపఁజేసితినేనియు నీదు పూర్వ
సంచితంబెల్ల నప్పుడ సమయుటకును । నీ వొడంబడుము వసిష్ఠ నేఁ డనంగ. ౩౫౭

క. అటులనె కానిమ్మనుచున్ । జటులతఁ గోపించి గాధినందన నీవున్
మటుమాయ లెన్నిజేసిన । నిటు నటుఁ దొలఁగండు మా మహీశుఁడు కనుమా. ౩౫౮

క. ఇద్ధరణి హరిశ్చంద్రుఁ డ । బద్ధంబే యాడెనేని బ్రద్దుఁడు దాఁ బ్రా
గుద్ధానము మాని యతి వి । రుద్ధంబుగ నపరదిశను రూఢిగఁ బొడచున్. ౩౫౯

క. నా శిష్యవరేణ్యుం డగు । త్రైశంకవుఁ డెప్పుడే నదాత యయిన నా
కాశమునఁ బట్టపగలె ప్ర । కాశింపవె చుక్క లదరి కౌశికమౌనీ ! ౩౬౦

క. మిన్నయగు హరిశ్చంద్రుని । చెన్నైన కృపారసంబు చెడెనేనియు నేఁ
బన్నిదము గట్టి పలికెదఁ । బెన్నేటను గుండ్లు దేలి బెండ్లు మునుఁగవే. ౩౬౧

తే.గీ. నీవు చేసిన గ్రహమును నే నొనర్తు । నీవు గెల్చెదవో లేక నేనొ చూడు
మారగింపఁగఁ బోవుచు నడుగనేలఁ । గూరదుచు లీవుదలఁచిన దారి జూఁడు. ౩౬౨

వ. అని యిట్లు వివాదపడి గ్రహంబు చేసికొని స్వస్వనిలయంబులకుం జని రంత హరిశ్చం
 ద్రుం డొకానొక యవసరంబున మృగయార్థం బరణ్యంబునకుం జనిన నచ్చట. ౩౬౩

ఆ.వె. వన్నెలాడి యొకతె వనమధ్యమున నొక్క । చెట్టునీడ నుండి బిట్టు వగవఁ
 జూచి నృపతి యో సులోచన యేటికి । వగచె దనిన నిట్లు వనిత పలికె. ౩౬౪

క. నే గౌశికముని పీడిత । నై కడుదుఃఖించెదను మదర్థం బతఁడున్
 గైకొనియెఁ దపోనియమం బీకాననమం దన న్మహీవిభుఁ డంతన్. ౩౬౫

శా. గాధేయాంతికసీమ కేగి మునిలోకగ్రామణీ లోకమున్
 బాధింపం దపమాచరింపఁదగునే ప్రావీణ్యము ల్లోకర
 క్షాధీ నున్నగరాదె మాను మని వక్కాణించి రా జేగినన్
 గ్రోధోద్రేకతఁ బంపెఁ గౌశికుఁడు దాఁ గోలాకృతిం దానవున్. ౩౬౬

క. ఉపవనసీమంబున న । క్కపటవరాహంబు రాజుఁ గడు నల్గింపన్
 నిపుణత విహరించెను ని । క్కపుఁ బందియె పొత్రి దుంగకాయ మెసవుచున్. ౩౬౭

సీ. సన్నజాజికుదుళ్ళ సందునఁ బొరలాడి మల్లెపూఁబొదబోదె మట్టగించి
 కురువేరుతిన్నెలఁ గోరలఁ గోరాడి గన్నేరుపొదలోని మన్నుఁ ద్రొవ్వి
 చిన్నసంపఁగిమ్రాను జిందవందరజేసి ద్రాక్షవ్రేళ్ళను మీదితాట యొలచి
 కన్నెమామిడిగున్న గదలించి పడఁద్రోచి పొగడక్రిందను బెద్ద బొంద జేసి

తే.గీ. తోటకావలివాండ్రను దూరమునకుఁ । దవిలి తరుముచుఁ జెంమలఁ దరుల దుంగ
 ముస్తె లెత్తుచు డిగి నీళ్ళ ముట్టివెట్టి । కలగఁజేయుచుఁ బంది సెల్గాటమాడె. ౩౬౮

ఉ. ఆ గతిఁ బంది యయ్యుపవనాంతరమందు నటించుచుం గడున్
 సేగియొనర్ప రాజునకుఁ జెప్పిరి య వ్వనపాలు రత్తరిన్
 జాగు భళా పరాకు విను సామి కటాచ్యము బాబుగారు మీ
 లోగిటి బాగు మాబ్రతుకు లోకముతోఁ బనిలేదు నావుఁడున్. ౩౬౯

ఉ. ఏటికి మీర లంద ఱిటు లెంతయు గుండెలుకొట్టికోఁగఁ బూ
 దోటను మాని వచ్చితిరి తొందర యొక్కటి గల్గెనొక్కొ ప
 ల్కొటలఁ బ్రొద్దుపుచ్చ కొక మాట వచింపుఁ డటన్న నయ్య ము
 మ్మాటికి నీకు దండ మిఁక మా మనవి న్విని మమ్ము నేలుమీ. ౩౭౦

ఉ. దండము లాదటం గొనియెదన్ ద్వరితమ్ముగ మీరు మస్విఁ దె
 ల్పుండన నేమి సెప్పుదుము పువ్వులతీగెలు ద్రాచ్చతీగలున్
 బండిన గుజ్జుమామిడిలు బావులు త్రోవలు చెల్మ లన్నియున్
 దండుగ బాబొ వే మచోటు దారిఁ జనం బనిలేదు నమ్ముమీ. ౩౭౧

చ. అనవుఁడు కారణంబు దెలియం బలుకుం దన నోయి మాప్రబో
గొనగొన బారు మీదఁబడు గుఱ్ఱను గట్టను మోరఁ జూపుఁ గ్రొ
వ్వున మనుద్రవ్వు బోదియెలఁ బొర్లుఁ దటాలున లేచుఁ బిందెలం
దునుముసు గాయలు న్నమలు దూయుఁ జివుళ్ళను బూలు రాల్చెడిన్. ౩౬౨

మ. అది యేజంతువు తెల్పుఁ డింకఁ దడవేలా యంచు భూజాని బె
ట్టిదమౌ చూపునఁ జూచినం బెదరి గుండెల్ దద్దరిల్లంగ గో
ప్ప దొరా పం దది పంది పంది వినుమీ బాబూ సరేకాని యా
మదమేమో మఱి యేనుఁగే పడదుసుమ్మా యీటెకుం గత్తికిన్. ౩౬౩

క. అనవుఁడు విని రాజన్యుఁడు । దనసైన్యముతోడ వనముదరిఁ జని చూడన్
ఖేనుబంది జాడ లంతటఁ । బెనయుట నది యున్నచోటు వెదకుచుఁ జనినన్. ౩౬౪

ఉ. మోర యొకింత సాచికొని ముట్టె రవంతఁ గదల్చి ప్రక్కలం
గోరల నేల గీరుచును గొర్రెలఁ ద్రోయుచు నోరఁ జూచుచున్
వేరును దుంప గాడ మెలివెట్టి దిటంబుగ నోటఁ బెట్టుచుం
బోరున గుఱ్ఱుగుఱ్ఱనుచుఁ బోయెడి పందినిఁ జూచి దిగ్గునన్. ౩౬౫

తే.గీ. విల్లుగైకొని రారాజు వేగలీలఁ । గాల సంధించి గురిఁజూచి కోలమునకు
దాక నేయంగ దానికిఁ దప్పి పాటి । చనినఁ నృపు డింకొక్క శరము నేయ. ౩౬౬

తే.గీ. అదియుఁ దప్పించుకొని చన నవనివిభుఁడు।మఱియునొకబాణమును వైవ గిరి మఱొక్క
చోటునకుఁ దార వేఱొండు సునిశితాశు । గంబు విడువంగఁ గికురించె గపటదంష్ట్రి.

ఆ.వె. ఇట్లు వైచి వైచి పృథ్వీశుఁ డా పంది నందలేక శ్రమముఁ బొంది పొంది
చెమటఁ దడిసి దప్పిఁ జెంది మధ్యాహ్నకా । లమున నెండలోఁ గొలంకు జేరి. ౩౬౮

తే.గీ. బలగ మెల్లను దవ్వున బడినకతన । నొక్కరుఁడు నక్కొలంకున నొక్క గడియ
మునుక లొనరించి గుఱ్ఱమునకు నీళ్ళు । పెట్టుకొని గట్టుచెట్టునఁ గట్టి పండె. ౩౬౯

ఆ.వె. నిదురరాక లేచి యెద దనపురమున । కరుగఁ దలఁపుజేసి యట్టెచూడఁ
దూర్పు పశ్చిమంబు నేర్పరింపఁగ లేక । దిగ్భ్రమంబుతోడ దిగులుసెంది. ౩౭౦

క. ఏదిక్కునకుం బోయెద । నాదుమనంబున భ్రమంబునం జిక్కి యయో
యేదియుఁ దోచదు సూర్యుం । డేదెస నుదయించెఁ గ్రుంకు నేదెస ననుచున్. ౩౭౧

శా. అశ్వీన్యాదులు గానరావు పగ లాహా యెట్లు లూహింతు స
ప్రాశ్వం జూచియు నాపురంబుదెస తూర్పా దక్షిణంబా మదిన్
విశ్వాసం బొనరింపనేర ననుచున్ జింతించు చుండంగ న
వ్విశ్వామిత్రుఁడు వచ్చె గృత్రిమమతిన్ వృద్ధక్షమాదేవుఁడై. ౩౭౨

ఉ. వచ్చిన మౌనిఁ గాంచి జనవల్లభుఁ డల్ల నమస్కరించినన్
జెచ్చెర స్వస్తితే స్తనుచు నెమ్మిని దీవనయిచ్చి యొంటిగా
వచ్చితి విప్వనంబునకు వాసవతుల్యుఁడవయ్యు సెప్పుమా
గ్రచ్చర నావుఁడున్ విని ధరావరుఁ డో పృథివీసురోత్తమా! ౩౮౩

వ. అనిన. ౩౮౪

ఆ. వె. పంది యొకటి తోట పాడుగావింపంగ । సైన్యములనుగూడి శరశరాస
ధారి నగుచు వచ్చి దానిఁ గొట్టఁగలేక । యడవి దిరిగి తిరిగి యలసినాఁడ. ౩౮౫

క. సైనికు లెచ్చట కేగిరొ నే । నిచటికిఁ జేరితిన్ వనింబడి దిక్కుల్
గానక భ్రమగొని సూదక । పానమునకుఁ గొలనుజేరి పండితి ననఘా. ౩౮౬

చ. పరమపవిత్ర నా కిపుడు పట్టణమార్గముఁ జూపి సత్కృపా
పరుఁడవుగమ్ము నీకు ధనవాంఛ పొసంగినయేని యిచ్చెదన్
దలఁగక నాఁగ నాఁతడు ముదంబునుబొంది ధరాతలంబునన్
నరవర పుణ్యతీర్థ మిది స్నానముసేయుము మీఁదఁ జెప్పెదన్. ౩౮౭

క. అని కొలఁకున భూనాయకు । మునిఁగించుచు దేశకాలములు నుడివి శుభం
బనుచుఁ బితృతర్పణంబును । నొనరింపఁగజేసి దాన మొసగుమటన్నన్. ౩౮౮

క. నీ వేది యడిగెదో భూ । దేవ యడుగు మన్న ద్విజుఁడు తెలిపెద నో భూ
దేవేంద్రా! నీ కీర్తిని । నే వింటిన్ మున్ను దాత వీవ యటంచున్. ౩౮౯

ఉ. నీవు త్రిశంకుపుత్త్రుఁడవు నీతివిదుండవు దాత వార్తలో
కావనదీక్షితుండవు మహామతి వంచు వసిష్ఠమౌని ము
న్నేవచియించె నాకు నొక యాప్సితమున్నది నిన్నుఁ గోరెదన్
వావిరి నా కుమారుని వివాహముమాత్రము సేయుమీ నృపా! ౩౯౦

చ. అన విని యుర్వరాధిపుఁ డహఃపతితేజుఁడు విప్రుఁ జూచి నీ
తనయుని పెండ్లికిన్ ధనము తప్పక యిచ్చెద నన్న వంచనా
ముని తన మాయచే నధిపుముందట నొక్క కుమారుఁ జూపి యా
వెనుకఁ బదేండ్లయీడుఁగల బిడ్డను గన్యకఁ జూపి యంతటన్. ౩౯౧

క. ఈ యిద్దఱకును బెండిలి । సేయింపుము నృపవరేణ్య చేసి పిదప రా
ట్స్వాయంబు ఫలమునందుము । నీయంత నృపునకుఁ జేయనేరమి గలదే. ౩౯౨

చ. అన విని మోహితుండయి ధరాధిపుఁ డట్లన యంచుఁ దాఁ బ్రతి
జ్ఞను దగఁజేసి కృత్రిమరసాసురదర్శితమార్గుఁడై ముదం

బున( జనియెం స్వకీయపురభూమికి గుఱ్ఱము నెక్కి యంత న
మ్మునియును రాజు మోసమున ముంచి నిజాశ్రమభూమికిం జనెన్. ౩౯౩

ఉ. అంతట గాధిసూనుఁడు నిజాశ్రమమందు వివాహయత్నముల్
వింతగ జేసి భూమివరు వేడుకఁ దోడ్కొనివచ్చి వేదికా
భ్యంతరమందు దానము నుదారత నిమ్మన నాతఁ డెంతయున్
సంతసమంది కోరు మిఁక సంయమి నావుఁడు నాతఁ డిట్లనెన్. ౩౯౪

క. వీరాగ్రగణ్య విను మీపే రీ లోకంబునందు । బెంపు వహించున్
వారణ రథ హయములతో । నీ రాజ్యము వరున కిమ్ము నేఁడు మహీశా ! ౩౯౫

క. ఈ వేదీమధ్యం బతి । పావనముసుమీ నరేంద్ర బహుపుణ్యంబుల్
గావించినవాఁడవు నీ । వీవిన్ వెనుతివియవనుచు నిద్ది యడిగితిన్. ౩౯౬

వ. అనిన విని హరిశ్చంద్రుండు కౌశికముని మాయచే మోహితుండై యుక్తాయుక్తంబులు
గ్రహింపనేరక. ౩౯౭

క. దత్తమని పలుకఁగా విని । యత్తరిన గృహీత మనుచు నమ్ముని హర్షా
యత్తుఁడయి పలికె నరపా । లోత్తమ దక్షిణను వేగ నొసఁగుము ప్రీతిన్. ౩౯౮

ఉ. పక్షయుగంబులేని ద్విజపంక్తియు సున్నములేని తమ్ములం
బక్షములేనిబండి విమలాంబువులేని జలాశయంబు రు
ద్రాక్షములేని శరభుజప మాయుధపుంజము లేని యోధుడున్
దక్షిణలేని దానము వృథాయని పల్కిరి తాపసోత్తముల్. ౩౯౯

క. కావున దానఫలార్థం । బీవొసఁగుము దక్షిణను మహీశ యటన్నన్
భూవరుఁడు నవ్వి ధన మెం । తో వేగము తెల్పు మేల తొందరపడగన్. ౪౦౦

వ. అనిన విని విశ్వామిత్రుండు. ౪౦౧

తే.గీ. హేమభారద్వయము సార్థమిమ్మటన్న । నృపతి దాస్యామి యని పల్కి యెలనగపున
జనియె సైన్యముతోఁగూడి స్వపురమునకు।బోయి యచ్చోటఁ దాఁ దలపోయదొడగె. ౪౦౨

తే.గీ. పొఁలికతోఁగూడ రాజ్యంబు పుచ్చుకొనియె । హేమభారద్వయము సార్థ మీఁగి గొనియె
గ్రింగుమీదును దెలియక బొందబడితి । మొనసి మునిముచ్చుమాయకు మోసపోతి. ౪౦౩

క. నీతినెఱుంగక మతిచెడి కోతికి । శివమెత్తినట్లు కూసితిఁ బిదపన్ం
చేత జలధార విడిచితి । భాతి చెడన్ లోతుగోత భ్రష్టుడనైతిన్. ౪౦౪

క. కపటముని మాట నమ్మితి । విపరీతము వచ్చుననుచు వెఱువనయితి నే
వ్యపగతమతినై చెడితిం । జపలాత్ములు సిరిని నిలుప శక్తులగుదురే? ౪౦౫

క. చింతాపరుఁడై నృపు ద । త్యంత విషాదమునఁ గృశత నందిన గని వి
భ్రాంతమతియగుచు నాతని । కాంతామణి చంద్రముఖి సగౌరవఫణితిన్. ౪౦౬

ఉ. ఏటికిఁ బ్రాణనాథ మది నింతటివంత సుతుండువచ్చె ఘో
రాటవినుండి తాసలిపి తందరు మెచ్చఁగ రాజసూయమున్
మేటియరాతివర్గమును మీరదు పాశధరుండు తుష్టుఁడై
పాటిలె హేతువున్ దెలుపుమా పరమాద్భుతమిద్ది యారయన్. ౪౦౭

క. అని పలికిన తన సతిఁగని । జననరుఁడను నో మృగాక్షి సకలంబు దపో
ధనుఁ డొకఁడడిగిన నిచ్చితి । దను మాలిన ధర్మ మగుట దాపము వొడమెన్. ౪౦౮

వ. అని యిట్లు తన పరితాపంబునకుఁ గారణం బొక్కింత సెప్పి ౪౦౯

ఆ. వె. కుడువగూర్కి సుడిగి కడుచింత వేగించి । ప్రక్కనుండి లేచి ప్రాతరర్హ
కృత్యములను దీర్చి కేశవాదులఁ జెప్పి । సంధ్యవార్చుచున్న సమయమునను. ౪౧౦

మ. నరనాథుం గన గాధిపుత్త్రుఁడు సుధాంధశ్చక్రసంతోషకృ
ద్వరయజ్ఞాదిపవిత్రు డాంహసలతాదాత్రుండు లోకోత్తర
స్థిరచారిత్రుఁడు లోకభీకరతపశ్చిత్రాతిచిత్రుండు భా
స్కరకోటిప్రతిమానగాత్రుఁ డగు విశ్వామిత్రు దేతెంచినన్. ౪౧౧

తే. గీ. వచ్చినమునీంద్రునకుఁ బీట యిచ్చి యందు । గూరుచుండ నియోగింప కొంతసేపు
ముచ్చటలు బుచ్చి యా రాజు మోముజూచి । యిచ్చిన సువర్ణమును రాజ్య మిమ్మటన్న.

క. ఈ రాజ్యమెల్ల నిపుడే । నీ రాజ్యముఁ జేసికొమ్ము నే నిచ్చితి ము
న్నే రాజ్యమునకునైనన్ । వారక నేఁబోయి బ్రతుకువాడనుజుమ్మీ. ౪౧౩

క. సర్వస్వము నీ కిచ్చితి । నుర్వీసురవర్య నిలుప నొక గవ్వ తపో
ధూర్వహుఁడ వివు మాకున్ । బర్వములగు సత్యవాక్యపరిపాలనముల్. ౪౧౪

తే. గీ. దక్షిణార్థము నేనిచ్చు ధనముమాత్ర । మిప్పుడందదు దొరికినయప్పు డిత్తు
నంచు మాధవి యను భార్య నాత్మజాతు । గాంచి యిట్లనిపలికె భూకాంతు డపుడు. ౪౧౫

ఉత్సాహ. ఈ మునీశ్వరునకు రాజ్య మిచ్చితిన్ సమస్తమున్
హేమరత్నతురగరథగజేంద్ర సంయుతంబుగా
భూమ సత్యవాక్యమహిత పుణ్యసిద్ధి నెక్కుడున్
బ్రేమ నీ యయోధ్యవిడిచి విపినమునకు నేగెదన్. ౪౧౬

ఉ. పోయెడు మానవేంద్రు గని పుత్రుడు భార్యయుఁ గూడి వెంటనే
పోయిరి హా యిదేమి యని పొక్కుచుఁ బౌరులు దుష్టవర్తనుం

డీ యమి యంచు గాధిసుతు నెంతయుఁ దిట్టిరి కౌశికుండు దా
నోయి నరేంద్ర దక్షిణకు నోపుదొ యోపవొ తెల్పు చెచ్చరన్. ౪౧౭

క. అనవుడు విన నృపతి తపో । ధన ద్విజకులవర్య నీకు దక్షిణకొరకున్
గనకం బియ్యక నే భో । జన మొనరింప నిది నమ్ము సత్యంబనినన్. ౪౧౮

ఉ. ఎక్కడనుండి తెచ్చెదవొ యీవు ధనంబును గోశమెల్ల నా
ప్రక్కనయుండె సత్యమును బల్కెదనంటివి నిర్ధనత్వముం
జిక్కిన నీకునున్ ఋణము జేకొనుమంచు నొసంగు నెవ్వ డీ
తక్కులు మాని లేదనుము దాపెద నాసముద్రోచినే నికన్. ౪౧౯

క. నీ యిష్టమైనచోటికి । బోయి వసింపు మిఁక దలను బువ్వాడదుగా
వేయేల నాస్తి యనుచున్ । బాయక పలుకు మదె చాలు పదివేలు నృపా. ౪౨౦

చ. అన విని రాజు సంయమివరా మదిఁ గొంకఁగనేల నేను నా
తనువును భార్యనుం గొడుకు ధర్మముదప్పక నమ్మివైచి నీ
ధనమును నీకొసంగెద సుదారచరిత్రు గకుత్థ్సవంశవ
ర్థను మదిలో దలంచి విదితంబొనరించెద సత్యవాక్యమున్. ౪౨౧

చ. మముఁ గొనజాలునట్టి యొక మానవు జూపుము కాశికాపురి
న్విమలత దాసకృత్యమును నే నొనరింతు సదారపుత్రభా
వమువహియించి నీదగు సువర్ణము గైకొను మేగుమేటి కీ
తమకమటంచు బల్కి నిజదారసుతాన్వితుడై మహోత్వరన్. ౪౨౨

మ. చని గాంచెం గనుదోయినిండఁగ హరిశ్చంద్రుండు దాక్షాయణీ
శుని శృంగారపు గోపురంబు వివిధస్తోమాత్మ మోదాకరం
బనఘుశ్రీకర మున్నతోన్నతనభోవ్యాలీఢకాంతిచ్ఛటా
ఘనహైరణ్యకకుంభగోపురము న క్కాశీపురం బర్మిలిన్. ౪౨౩

క. కని భాగీరథిలోనన్ । మునుకలు గావించి దేవు మునివందితు ధ
ర్గుని గొల్చి కాశ్యసదతో । జనియెన్ దుఃఖార్తుఁ డగుచు జనపతి పురికిన్. ౪౨౪

క. పురి కేగినంతఁ దొల్లిటి । ధరణీసురుఁ డెదురువచ్చి తప్పక యిపుడే
యరమరసెప్పక తనసొ । మ్మరువడి నిమ్మనిన నరవరోత్తము డనియెన్. ౪౨౫

ఉ. అంజలిజేసి మ్రొక్కెద మహాద్విజ నేనును నా కుమారుడున్.
గంజదళాక్షియుం గలము కావలియుందుము నీదు వాకిటన్
నెంజిలిలేక గొల్చెదము నిన్నును గృత్యము సెప్పు నావుడున్
గొంజక యిమ్ము స్వర్ణ మిదిగో నెలవోయెను మాటలేటికిన్. ౪౨౬

క. అని కపటభూమిదేవుఁడు । దన కడ్డమువచ్చినం బదంపడి లెక్కం
గనుమింక మిగిలియున్నది । దినమొక్కటి యనుచు నృపుడు దెలిపిన వినుచున్. ౪౨౭

క. నే నిప్పుడు బోయెద నీ । మానము నిలుపుకొను మెల్లి మరుమాటాడన్
మానక నిను శపియించెద । మానవనాయక యనంగ మనసున వ్యథతోన్. ౪౨౮

ఆ. వె. ఎట్టులిత్తు ధనము నీ బ్రాహ్మణునకు నా । కెవ్వరిత్తు రిప్పు డేమనందు
రాజధర్మమెల్ల బాళ్ళపా లొనరించి । దీనవృత్తి నెట్లు దేవురింతు. ౪౨౯

ఆ, వె. క్షత్రియులకు ధర్మశాస్త్రపద్ధతిఁ జూడ । మూడువృత్తులం డ్రదు కూడ దితర
వృత్తి గైకొనంగ జత్తునో యని యెన్న । నాత్మహత్యకంటె నఘము గలదె. ౪౩౦

ఆ. వె. అదియుగాక విప్రు నర్థం బపహరించు । వాడు కృమితనరకవాసమందు
కాన నిపుడు నన్ను నే నమ్ముకొనుటయే । మంచిపని యటంచు మది దలంతు. ౪౩౧

వ. అని యిట్లు పలుతెఱంగులం జింతించుచు ధీసుంద్రు తలవంచుకొని కన్నీళ్ళు విడుచుచున్న భర్తంగాంచి పతివ్రతాతిలకంబగు నతని పత్ని బాష్పగద్గదంబగు స్వరంబున నిట్లనియె.

చ. వగవగనేల ధర్మపరిపాలనముం బొనరింపి క్షత్రియుం
దగు నటుగాక దబ్బరల నాడుచు బాపము సేయువాఁడు పి
నుగవలె వర్జనీయుడు జనుం డిల సత్యముపల్క పుణ్యముం
దగులకయున్న నధ్యయనదానముఖంబులు వ్యర్థముల్ గదా! ౪౩౩

తే. గీ. అశ్వమేధంబు లొక్కనూ రాచరించి । రాజసూయంబు గావించు రా జసత్య
మాడెనేనియు స్వర్గంబునందునుండి । భ్రష్టుడగు దీని దెలియుము పార్థివేంద్ర. ౪౩౪

తే. గీ. ధర్మశాస్త్రంబులందెల్ల ధర్మములకు । మొదటిధర్మంబుగా సత్యమును గ్రహింత్రు
నిజము పల్కుటయేసుమ్ము నీతి ఖ్యాతి । భాతి త్రైలోక్యమున వేఱరీతి గలదె. ౪౩౫

క. కులమును వర్ధిలఁజేయును । బలమును గీర్తియు నొసంగు బాపౌఘంబున్
దొలగించు నిహపరంబుల । నలఘుసుఖముఁజేయు సత్య మవనీనాథా. ౪౩౬

తే. గీ. సత్యమును దొలగింపక జనవరేణ్య । కీర్తివహియింపు మీవు శోకింపనేల
పురుషులకు స్త్రీలు దలపంగ పుష్పఫలము । ఖంబులగు భోగవస్తువుల్ గద నరేంద్ర । ౪౩౭

క. కావున న న్నమ్ముము నీ । వావిత్తమువలన భూసురాగ్రణిఋణమున్
వేవేగదీర్పు మిదియే । త్రోవ సుతుఁడు వంశకరుఁడు ద్రోయకు మతనిన్ ౪౩౮

చ. అన విని రాజు మూర్ఛిలి మహత్తరదుఃఖపయోధిమగ్నుడై
తనువునెఱంగ కెత్తువడి తద్దయు నూర్పుచు నెట్టకేనియున్

మనమొకి యింత యింతదనమట్టున బాదుకొనంగ లేచి యో
వనితలమిన్న నిన్ను నెడబాసి మనంగలనే ధరాస్థలిన్. ౪౩౯

ఉ. నవ్వుచు గేళి నాయెదుట నర్మములాడెడినోట నెట్లుగా
జివ్వలుపల్కెడే చెవులు చీదరవొందెడి నయ్యయో నినుం
బువ్వులపాన్పుపై నలత బూనెడిదానిని విక్రయించుమం
చివ్వగ బల్కజెల్లునె సతీ సముదారమతీ కృపావతీ. ౪౪౦

ఉ. హా యిటువంటికష్టముల కైతివిగా ననబోణీ నీదు లే
బ్రాయము సోయగంబుననుబట్టికదా బహుళాత్రిజిక్కి యి
ట్లాయెనయో యికెట్లు తనువందును బ్రాణము నిల్పుకొందునే
నీయెడ జీవితుండనయి యిట్లునికిన్ ఫలమేమి సెప్పుమా. ౪౪౧

తే.గీ. దైవమా యింత దుర్దశ దారసిల్లె । భార్య నమ్మి జగంబున బ్రతుకగలన
బహువిధవిషాదమున నిట్లు బడయ బ్రహ్మ । మూఁడుపంక్తుల వ్రాసెగాఁబోలు నొసట.

వ. అని యి ట్లత్యంత దుఃఖావేశంబున బెనుమూర్ఛంబునం జిక్కి నేలంబడిన నిజ భర్తంగాంచి
యంగనారత్నం బంగలార్చుచుఁ బెరెలుఁగున నిట్లని విలపింపం దొడంగె. ౪౪౩

తే.గీ. హా మహారాజ హా మహాహార్యధీర । కోట్లకొలఁది ధనంబులు మేట్లువెట్టి
దానమిచ్చిన నీవ యిద్ధరణి వ్రాలి । యంగలార్పంగ నే బ్రతుకంగ గలనె. ౪౪౪

తే గీ. ఇంద్రవిభవుండవయ్యు నుపేంద్రవిక్ర । మాన్వితుఁడ విట్టి దుర్దశ కగ్గమైతి
వయ్యయో యేమిసేయుదు నధిప నేను । భార్య నైనట్టి దోషంబు ఫలమటందు. ౪౪౫

వ. ఇట్లు విలపించుచుండియున్న తలిదండ్రులంజూచి కుమారుండు నతిదుఃఖభరంబున
బాష్పంబువులు కన్నులం దొరుగ శోకించుతరి విశ్వామిత్రుండు వచ్చినం జూచి
హరిశ్చంద్రుండు మూర్ఛిల్లినం జూచి య క్కపటబ్రాహ్మణుండు జలంబులు జల్లి
మూర్ఛఁ దేర్చి, ౪౪౬

ఆ వె. లెమ్ము లెమ్ము రాజ యిమ్ము నా ధన మిష్ట । లెమ్ము లెమ్ము నీవు తేకయున్న
ఋణము బరువుమోచి పృథివిలో బ్రతుకంగ । జాల వీవు మాటలేల నింక. ౪౪౭

క. సత్యమున రవి వెలుంగును । సత్యంబున నిలిచె భూమి స్వర్గము శశియున్
సత్యమె ధర్మము దానము ; సత్యంబున నుండునంద్రు సర్వంబున్నృపా! ౪౪౮

క. విను మశ్వమేధయాగము । లను వేయిఁటిఁజేయనగు ఫలంబునకటెంన్
ఘనమగు సత్యంబును బ । ల్కిన ఫలమధికంబుసుమ్ము కీర్తింపంగన్. ౪౪౯

ఆ. వె. ప్రొద్దుగ్రుంకుదనుక నెద్దేని సదుపాయ । మరసి ధనముదేఁగ నవధి గలదు
పిదప పత్తు మరల బేర్మితో ధనమియ్య । జాలకున్న నీకు శాపమిత్తు. ౪౫౦

క. అని ముని యేగినపిమ్మట । ఘనుడగు బ్రాహ్మణుఁడొకండు కదలి చనంగా
గని రాజ్ఞి భర్తతోడన్ । వినయంబున నిట్లు విన్నవించె నృపాలా. ౪౫౧

ఆ. వె. తక్కువర్ణములకుఁ దండ్రి బ్రాహ్మణుఁడగు । తండ్రిసొమ్ము కొడుకు దా భుజింప
నర్హుడగునుగాన నయ్యెదే బ్రాహ్మణుం । దర్థమడుగు మిచ్చు ననిన నతఁడు. ౪౫౨

చ. దినకరవంశజుండను ప్రతిగ్రహ మెట్లొనరింతు నింతి యా
చనకుఁ దగున్ ధరాసురుఁడు క్షత్రియధర్మము లెన్న మూఁడుసు
మ్మనయము నో మృగాక్షి యజనాధ్యయనంబులు దానముం దపో
ధనులగు విప్రవర్యులుగదా గురువుల్ గురునొద్ద యాచ్నసే
యను మనసెట్టులొప్పు వినుమా యణుమాత్రము నొల్ల యాచనన్. ౪౫౩

క. ఇచ్చెద దక్షిణ విప్రున । కెచ్చోటనయేని యెట్టులేని ధనంబుం
దెచ్చెద నార్జించి సతీ । యొచ్చెమ్మగు యాచనమ్ము నొల్లనుసుమ్మీ. ౪౫౪

క. అనిన విని యువతి జనవర । వినుమా నామాట యిపుడు విప్రునియొద్దం
ధనమున్న దడుగు మిచ్చున్ । మనకును ఋణభారమెడలు మార్గము గలుగున్. ౪౫౫

క. సరి బేసి యగును బేసియు । సరియగు నొక్కపుడు మఱియు సన్మానంబే
పరిభవమగు పరిభవమే । తిరుగన్ సమ్మానమగు క్షితిం గాలగతిన్. ౪౫౬

క. ఓడక దాతలె యాచకు । లై డిల్లంబోయెదరు మహాయాచకులే
వీడక దాతలగుదు రిల । నోడలపై బండ్లు బండ్ల నోడలుఁ జనవే. ౪౫౭

క. బాపఁడొకఁడు బలియుండై । కోపించిన రాజ్యమెల్ల గోల్పోయి కడుం
దాపమున హరిశ్చంద్రుడు । వాపోయెడి నహహ కంటివా కాలగతుల్. ౪౫౮

క. ఆహా మానమెడలి నే । దేహి యనఁగనేర నాల్క దెగి రెండై నన్
బాహుబలార్జితవిత్తస । మాహరణము సేయువాఁడ నవనిసురునకై. ౪౫౯

వ. అనిన విని సాధ్వియగు నయ్యంగన యో ప్రాణవల్లభా నీవు యాచన కున్ముఖుండవు
గావేని నన్ను విక్రయించి తన్మూల్యంబున బ్రాహ్మణ దక్షిణ యిచ్చి సత్యంబు
పరిపాలింపుము. నాపుఁడు హరిశ్చంద్రుండు. ౪౬౦

తే. గీ. అయ్యయో యెంతకష్ట మియ్యఁగరావ । తంస మిట్టులఁ బలుమారు దా వచించు
విప్రశాపమువలన నివ్విధి ఘటింప । బోలు గాకున్న నీయల్పములు వలుకునె. ౪౬౧

మ త్తకోకిల. జూదమాడఁగగాదు మద్యపుసౌఖ్యనం బడియుండుటం
గాదు రాజ్యము పోయినందునగాదు భోగవశంబునం
గాదు బ్రాహ్మణదక్షిణార్థము కాంత సత్యము నిల్పకో
నే దయారహితుండ నయ్యెద నిన్ను నమ్మెద నిత్తరిన్. ౪౬౨

ఉ. అక్కట నేనృశంసులకునైనను శక్యముగానికార్యముం
దక్కక సేయగావలసె దద్దయు నీవును బెక్కురీతులన్
నొక్కివచించి తెంతయఘృణుండను నే నిటువంటిపాపమున్
నెక్కొని సేయఁబూనితిని నిన్ను బజారున విక్రయించెదన్. ౪౬౩

మ. అని యారీతిని బల్కి యానృపతి మోహావిష్టచేతస్కుడై
వనితారత్నము గొంచునేగి విపణిన్ బాష్పాంబుసంపూర్ణలో
చనుడై గద్గదకంఠుడై పురజనుల్ సంఘంబులై కూడి చు
ట్టును జక్రాకృతి దీర్చినిల్చి విన బిట్టుం దాల్మిఁ దా నిట్లనెన్. ౪౬౪

శా. ఓహో పౌరవరేణ్యులారా విను డుద్యోగించితి న్నేనిటన్
నా హేమాంగిని విక్రయించుట కనింద్యక్షాంతితోఁ గార్యసం
దోహంబుం బొనరించు దాసి యగుచున్ జూడుండు మీ కిచ్చయే
నూహల్ దెల్పుడు వేగ బేరమిడు డెద్దో యెంచి మీ రందఱున్. ౪౬౫

తే.గీ. అందు గొందఱు పెద్ద లా యవసినాధు । పలుకు విని యెవ్వఁడవు నీవు హీనబుద్ధి
వగుచు సహధర్మచారిణి నమ్మబూని । తకట నీమోముఁ జూడరా దనిన నతఁడు ౪౬౬

తే.గీ. ఎవ్వఁడవటంచు నడిగెదరే యెఱుంగ । రాదె నరమాంసమును దిను రాక్షసుండ
ననుచు నిటువంటి పాపాత్ముఁడను దురితము । నకు వెఱతునే యిదొక్క వింతపని గాదు,

వ. ఇట్లు పణ్యరంగంబున హరిశ్చంద్రుని యెలుంగు విని వృద్ధబ్రాహ్మణవేషంబు పూని. ౪౬౭

ఉ. తొస్సులువోవుమాటలకుఁ దోడు శిరంబువడంక నిస్సిరో
యిస్సిరటంచు గన్నులొక యించుకఁ గానఁగరామి భానుతే
జస్సున కడ్డ మొక్కచెయి సాచి వెసన్ బొమదోయినుంచి వ
ర్చస్స్వముపేతుఁడైన నృపసంయమి వచ్చెను గఱ్ఱబట్టుచున్. ౪౬౯

వ. ఇటు వచ్చి హరిశ్చంద్రుం జూచి. ౪౭౦

తే.గీ. ఏరయా దాసి నమ్ముచున్నార టిందు గొందు నే సొమ్ముగలవాఁడ కోట్లకొలఁది
పడుచుఁబెండ్లాము గృహమునఁ బనులకోర్వ । దిపుడు గొనిపోయెదను దెల్పు మింతివిలువ.

క. అనిన విని నృపతి తన మన । మున దుఃఖము నాపలేక ముఖమునఁ జేలం
బునఁ దుడుచు చేడ్వఁదొడఁగెన్ । ముని యది గని పలికె నేలఁ బొక్కెదటంచున్.

ఆ. వె. పలికి దీని రూపు ప్రాయంబు శీలంబు । గుణములకును దగిన కొలది ధనము
నేను దప్ప కిత్తు నీ విట్లు దుఃఖింప । నేల మాను మింక నీతిఁగాను. ౪౭౩

క. ముప్పదిరెండుగుణంబుల । నొప్పిన స్త్రీయేని దానికొక కోటివెలన్
జెప్పిరి శాస్త్రజ్ఞులు మఱి । చెప్పిరి యర్బుద మటంచు క్షితిఁ బురుషునకున్. ౪౭౪

క. అని యిటుఁ బల్కిన విని య । జ్జనపాలుఁడు దుఃఖభార సహితుం డగుచున్
మనమునఁ దోచక యేదియు । ననఁజాలక యూరకుండె నవనీనాథా! ౪౭౫

ఆ. వె ఊరకున్న జూచి ధారుణీవిబుధుండు । నారచీరఁ బరచి ధీయుఁ డగుచు
పొసఁగ బేర్చి బీరపూలనుబోలు దీ । నారములను గుప్ప లారబోసి. ౪౭౬

ఆ. వె. ఓరి ధర్మశాస్త్ర మొప్పినరీతిని । గ్రుమ్మరించినాఁడఁ గోటిధనము
నారి నిమ్మటంచు నవలాకచము బట్టి । రమ్ము రమ్మటన్న రాజవదన. ౪౭౭

ఆ. వె. విడుము విడుము బిడ్డ వెక్కి వెక్కేడ్చెడి । నొక్కమారుచూచి చక్కవత్తు
సుతుని మరల నేసు జూతునో చూడనో । నీకు దాసి నగుచు సాకఁబడుచు. ౪౭౮

ఉ. అంతట బాలకుఁడు దన యంబను జూచి బిరానవచ్చి య
త్యంతవిషాదచిత్తుఁడయి యంబరము న్విడ కంగలార్పఁగాఁ
జెంతకు వచ్చి యా ద్విజుడు ఛీ యిటురాకుము పొమ్మనంగ న
య్యెంతి యయో ధరాసురకులేంద్ర కృపామతి నాలకింపుమీ, ౪౭౯

ఆ. వె. వీని విడచి యెట్టునే నొక్కతన వత్తు । బాలుఁ గొనుము నన్నుఁబోలె శాస్త్ర
విధి నెఱింగి యనిన విప్రుఁ డాపటముపైఁ । బోసె నర్బుదంబు ప్రోవు లిడుచు. ౪౮౦

ఆ వె. తల్లిఁ గొడుకు నొక్క దంటగాఁ దనయంగ । వస్త్రమునను హస్తవనజయుగము
నంటబట్టి ముసలి యవనీసురుఁడు పదుం । డనుచు గెంటె నింటి కతిరయమున. ౪౮౧

ఉ. హా యని యేడ్చు చప్పుడు ధరాధిపుఁ డంగనయుం గుమారునిన్
మాయలమారి యమ్ముసలి బాపని చేతుల కప్పగించి య
య్యో యిఁక నేమిసేయుదు మృదూజ్జ్వలతన్వి సమస్త లక్షణ
శ్రీయుత బాసి బాలు గుణసింధు సుతుం గన కెట్టు లోర్చెదన్. ౪౮౨

వ. అని విలపించుచు నయ్యనంతాజాని యంతింతనరాని మోహంబున వేదురెత్తిన వానింబోలె
నొక్కెడ యనక యక్కడక్కడ గ్రుమ్మరుచుండ నంత నారాజ్ఞి భర్తకు నమస్కరించి

జానువులు నేలమోపి చేతులు జోడించుకొని వంగి నమస్కరించి బాష్పపర్యాకులలోచనయై దీనాననంబుతో గద్గదస్వరంబున నిట్లనియె. ౪౮౩

తే. గీ. దైవమా యీత డర్థులఁ దనివితీర్చి । నట్టిదేని ద్విజాగ్ర్యుల నగ్నిహోత్రుఁ
దృప్తుల నొనర్చియున్నేని భ్రష్టపుణ్యుఁడగుచు మరల హరిశ్చంద్రు డగునుగాత. ౪౮౪

వ. ఇట్లు పలికి పాదంబులపై వ్రాలియున్న పడఁతిం గాంచి హా చంద్రవదనా హా సర్వ శుభలక్షణసదనా నిన్నెడబాసి యెటువోవఁ గాళ్ళాడుఁ గాకుత్స్థవంశంబునం బుట్టిన నా కేలుం బట్టిన నీ కిట్టి బెట్టిదంపుదాసీత్వంబు ప్రాప్తంబయ్యె నేమి సేయుదు నెందుఁ జొత్తు నెవ్వరి నేమనందు నాయనా నా చిన్నికూనా నీముద్దుమోముఁ జూచుచుండు భాగ్యంబును నేను నోమనైతి నావంటి పరమ నిర్భాగ్యుండు భూలోకంబునం గలండె నాకుం గొడుకవై పుట్టిన ఫలంబిట్టులయ్యెనే యనుచుం బలుమారు నూర్చుచు నేలంబడి పొరలుచున్నం గాంచి నిష్ఠురుండైన వృద్ధవిప్రుండు, ఓహో యీయంగలార్పుతోఁ బ్రొద్దుపుచ్చుచున్నారా? బాగుగనే యున్నది నాకుం గల సర్వస్వంబు ధారవోసిన దిందులకో ? లెండు లెండని చబుకుతో రెండువైచి యంగనామణి బాలుంగొని కన్నీరు వరదలై పరువనేడ్చుచు మునివెంట నడువం దొడంగె నప్పు డా వృద్ధవిప్రుం డున్నత వృక్షాంతరంబున మరుగున నంతర్హితుండయ్యె నంత. ౪౮౫

క. బుక్కులు సెప్పుచు శిష్యులు । విక్కుచు వెన వెంటరాగ విశ్వామిత్రుం
డక్కజముగ మునుపటివలె । నక్కడికిని వచ్చి పలికె నవనిపుతోడన్. ౪౮౬

ఆ.వె ధనము ధనము ధనము ధనమిమ్ము ధరణీశ । దినములయ్యె నవధి దీరెఁ దీరె
నిజము నిజము నిజము నిజము దప్పకుమయ్య । తెలియుమీ కకుత్స్థకుల మటంచు.

వ. అనినవిని హరిశ్చంద్రుడు. ౪౮౮

ఉ. దండము దండమో మునిసుధాకర దక్షిణ యిద్దె కొమ్ము నా
దండిమునీశ్వరుండు గని ద్రవ్య మిదెక్కడిదన్న నెట్టిదై
యుండిననేమి నీ కనిన నోయి ధనంబిది యప్రశస్తమై
యుండిన నే గ్రహించుటకు నొల్లను గావునఁ దెల్పుమీ యనన్. ౪౮౯

క. మాయాదేవికుమారిక । యై యొప్పెడు నాదు భార్య సమ్మతి నిందుం
బాయక కోటి లభించెను । నాయాత్మజుఁ డమ్బదంబునం గొనఁబడియెన్. ౪౯౦

క. నను బదికోట్లకుఁ గొనుమా యని । యావిత్తంబు నల్ప మనియెంచుచు వం
తనుజిక్కియున్న భూపతి । గని ముని కనులెఱ్ఱజేసి గ్రక్కున బల్కెన్. ౪౯౧

తే. గీ. అంతరాజవు రాజసూయంబుచేసి । నట్టివాఁడవు నాకిచ్చు నర్థమిదియె
యింతవాఁడను వేదంబులెల్లఁ జదివి । తపముఁజేసిన బ్రాహ్మణోత్తముఁడవు గాన. ౪౯౨

వ. అనిన. ౪౯౩

తే. గీ. ఇచ్చెదను వేగిరింపంగ నేలనయ్య । యిప్పుడే యమ్మితిని బిడ్డ నిందుముఖిని
నాగ నిఁక నొక్కజాము యున్నది పగలిట । నంతలోననె తెమ్ము నా యర్థమనుచు. ౪౯౪

వ. చెప్పి విశ్వామిత్రుం డరిగిన నరేంద్రుండు శోకించుచు. ౪౯౫

క. తను నమ్మకొనెడు పీనుఁగు । నను నెవ్వఁడు గొని సుఖంబునం బొదలెడివాఁ
డినుఁ డ స్తగిరిని గ్రుంగక । మునుపే తెలుపంగ వినయమునఁ బ్రార్థింతున్. ౪౯౬

సీ పొఱకాచు వెల్లుల్లి నెఱగబ్బు మునుమున్న చలిదినంజుడుకంపు చెలిమి సేయ
ప్రాచిబట్టిన నల్లబండచాయల యొమ్ముపట్టెపై శవమాల్యపఙ్తులాడ
త్రుప్పుదేలిన యిన్పదుడ్లపోలికనున్న బాహుయుగ్మమున బెన్బడిత లొప్ప
మోటుదీర్చిన యేఁడుమూళ్ళ గొంగడి కొండె సిగమీదుగా నెత్తి జీరుకారు

తే. గీ. జారు పెదవులు గండుమీసాలు గొగ్గి । పారపండ్లును మిడిగ్రుడ్లు బడుగుమేను
పిల్లిగడ్డము గల్గి యాప్రేతరాజు । వెట్టిమాలనిరూపున నుట్టిపడియె. ౪౯౭

వ ఇట్లు వచ్చి. ౪౯౮

తే. గీ. వఱవు డొక్కఁడు నాకుఁ గావలయు నేఁడు । కొనఁదలంచితి నిప్పుడే కొంచుఁబోదు
వెల వచింపుమటన్న భూవిభుఁడు సూచి । యిట్లని వచించె నమ్మాల కెఱుకపడగ. ౪౯౯

తే. గీ. ఎవ్వఁడవు నీవు నావల్ల నేమి నీకు । పలుకు మనన్ బ్రవీరాఖ్యఁ బిలుతు రేను
వెట్టిమాలడ నను గొల్చి పీన్గఁ బట్ట । లెత్తి నాకిమ్ము నీపని యిదియ యనిన. ౫౦౦

తే. గీ. బాపఁడేనియు క్షత్రియ ప్రవరుఁడేని । కొనియెదరటంచు నేమనమునఁ దలంచి
పిల్చితినిగాని కులహీనుఁ బిలువలేదు । కొలుతురే నీచు సుత్తముల్ కుతలమందు. ౫౦౧

క. అనవుఁడు విని చండాలుడు । జననాయక మున్నుగా విచారింపక నీ
వని యిపుడు మారు చెప్పుట । చనునె ప్రమాణంబు నీకు సత్యంబైనన్. ౫౦౨

తే. గీ. సత్యమును సడ్డసేసిన జనులకెల్ల । ఘోరనరకంబు నొందక తీర దెందు
ధరణి సత్యంబు బల్కి చండాలుడైనఁ । దప్పు లేదంద్రు సత్యంబు తప్పజాల. ౫౦౩

వ. అని యిట్లు పలుకుచున్న సమయంబునఁ గ్రోధ వివృతాక్షుండై విశ్వామిత్రుండు వచ్చి యీ చండాలుండు నీకుం గోరిన ధన మిచ్చెదనని చెప్పుచున్న వినకయుంటి వవధి దప్పు చున్నయది నాదక్షిణ యీకున్న వాఁడవు వేగంబ నాసొమ్ము నాకిమ్మనుఁడు హరిశ్చంద్రుండు దీనాననుండయి యీ చండాలునొద్ద నేనెట్లు దాసత్వంబుసేసెదనని నతండు గోపించి నీవు వీని కమ్ముఁబడి యాధనంబున నాదక్షిణం బూర్తి సేయవైతివేని నిన్ను శపించెద ననవుండు. ౫౦౪

ఉ. దీనుఁడ నార్తుఁడన్ జడమతిన్ నతుఁడన్ భవదీయభక్తుఁడన్
మానుము క్రోధమున్ మదిని మాలఁడ నయ్యెద మాలఁ గొల్చెదన్
జ్ఞాననిధీ భవద్ధనమును గైకొను మేగుము నన్నుఁ బ్రోవు మె
ట్లైనియు సత్యవాక్యమున కేనుదొలంగ దొలంగ నమ్ముమీ. ౨౦౫

ఆ. వె. ఆనినఁ గనికరించినట్లు కౌశికమౌని । నాకు దాసవృత్తిఁ గైకొని యొన
రింపు మనిన నాతఁ డింపు నాకది యట్ల । సేయువాఁడ బనులు సెప్పు మిపుడు. ౨౦౬

చ. అనవుఁడు మంచిమాట యని యమ్ముని మాలని బిల్చి యోరి యీ
జనపతి నేన కొంటి నిఁక జయ్యన దెల్పుము వీని కెంత సొ
మ్ము నొసఁగె దీవు నావుఁడును భూవరునిం బరికించి చూచి యో
మునివర కోరినంత ధనముం గయికొమ్ము బిరాన నిచ్చెదన్. ౨౦౭

వ. మఱియు వినుము దశయోజనవిస్తీర్ణం బగు ప్రయాగమండలం బంతయూ ధనకనక
రత్నమయంబుఁ జేసెదం గొనుమని యట్లు కావింప విశ్వామిత్రుం డవి గ్రహించినం
జూచి హరిశ్చంద్రుండు నిర్వికారముఖుండై విశ్వామిత్రుండె తన కధిపతి యనియు
నతని దాస్యంబు సేసెద ననియుం దలంచుచు సంతోషంబున నున్న సమయంబున
నత్యద్భుతంబుగా నాకసంబున. ౨౦౮

క. ఇచ్చితివి భూతలేశ్వర । యిచ్చెద నన్నట్టి ధనమునెల్ల ద్విజునకున్
సచ్చరితుఁడ వైతి వహో । యచ్చుదల యొకింత లేవటంచు వినఁబడెన్. ౨౦౯

క. దివ్వున ననిమిషలోకము । పువ్వులవానలను గురిసె భూపతిమీదన్
నవ్వుచును హరిశ్చంద్రుం । డ విశ్వామిత్రుతోడ ననియె ముదమునన్. ౨౧౦

క. నీవే తల్లివి తండ్రివి । నీ వెయ్యది సేయుమన్న నే నొనరింతున్
బావనుఁడనైతి మునివర । సేవింపఁగఁ గలిగె నిన్నుఁ జింత లికేలా. ౨౧౧

క. అనవుడు విని యా కౌశికముని । తనమదిలోన లేశమును గృపలే కో
జనవర మాలనిఁ గొలువుము । చనుమని సెలవిచ్చి సొమ్ము జవురుక చనియెన్. ౨౧౨

వ. ఇవ్విధంబునం జెప్పిన సూతుం గని శౌనకుండు మునినాథా యనంతరం బా చండాలుని
గృహంబున హరిశ్చంద్రు డెట్లుగా మెలంగెఁ దెలుపవే యనుఁడు పరమాహ్లాదసమేతుండయి
సూతుం డిట్లనియె. ౨౧౩

చ. నరపతి వెట్టిమాలభవనంబున నైదుదినంబు లెంతయున్
బురపురబొక్కుచు న్వనిత బుత్రు దలంచుచు నన్నపానముల్
స్మరణము సేయకుండెఁ బెను సంకెళుల ంబడి యెట్టకేలకుం
దిరమొనరించె డెంద మిఁకఁ దీరదు మాలని కొల్వటం చొగిన్. ౨౧౪

ఆ. వె. తలఁచి తరియెఱింగి మెలఁకువతో వీర । బాహుఁ జూచి తనకుఁ బనులు సెప్ప
వేడ మంచిదనుచు వేగంబ సంకెలి । యూడ్చి పలికె నిష్ఠురోక్తి నతఁడు. ౫౧౫

తే గీ. కాశి దక్కినమున వల్లకాడు గలదు । కాచియుండుము విడువక కదల కచట
కొంక కేగుము పట్టుమీ కొంకికఱ్ఱ । వీరబాహుని కఱ్ఱని వేయు బొబ్బ. ౫౧౬

ఆ. వె. వలికి రాజు వీరబాహుఁడు హోయంచు । నుంటి వానిబం టహోయటంచు
నిదిగో హో యటంచు నే హరిశ్చంద్రుండ । హో యటంచుఁ గాచియుండు మచట. ౫౧౭

వ. ఇట్లు శవచేలాపహారి యగు వీరబాహుండు పనుప నాహరిశ్చంద్రుండు జర్ఝరంబయిన
దండంబు చేతంబట్టి కాశీపురంబు దక్షిణంబునం జని చని. ౫౧౮

సీ. ముఱికినంజుడు దించు మోరలెత్తుక కూయు రాబందు లొకమూల రట్టుసేయ
ప్రక్కప్రక్కల నెంపముక్కలఁ గురుకుట్లు నమలు కుక్కలగుంపు నటనసేయ
క్రుళ్ళుకంపున గౌచు నీళ్ళాడు విడ్రితాళ్ళ బెళ్ళించి నక్కలు గొళ్ళిసేయ
నాగుబ్బు కొనుగబ్బు లాసించి పైపై సి గదలు గద్దలగుముల్ రొదలుసేయ

తే.గీ. చిటచిటచ్చటపెటపెట చీయి చూయి । తుస్సుదిస్సనుధ్వనులతో ధూమమెగయ
జల్లుమను గుండెతో హరిశ్చంద్రుఁ డపుడు । కాశి దక్షిణమున వల్లకాడు సూచె. ౫౧౯

సీ. హా తండ్రి హా తండ్రి హా తండ్రి యనువారు హా తల్లి హా తల్లి యనెడువారు
హా యన్న హా యన్న హా యన్న యనువారు హా పుత్ర హా పుత్ర యనెడువారు
హా యల్లుఁడా యల్లుఁడా యని యనువారు హా మామ హా మామ యనెడువారు
హా తాత హా తాత హా తాత యనువారు హామిత్ర హామిత్ర యనెడువారు.

తే.గీ. ననుచు గొల్లున రొదపెట్టి యన్నిదెసల బొబ్బలిడువారిఁ జూచుచు నిబ్బరమ్ము
నబ్బజేసి హరిశ్చంద్రుఁ డల్లనల్లఁ గాశి దక్షిణమున వల్లకాడు సేరె. ౫౨౦

వ. ఇట్లు చేరి తనలో. ౫౨౧

తే.గీ అయ్యయో యెంత దౌర్భాగ్యమావహిల్లె । దారఁ బుత్రునిఁ బాసి చండాలవాటి
గుడ్డగుడుసేరి పెనుమాలకొంప గాయ । వలె హరిశ్చంద్రుఁడను చక్రవర్తి నేఁడు.

తే.గీ. ఎంత దుర్దశ వచ్చిన నెద్ది సేయు । వలసివచ్చిన ధర్మంబు పట్టువిడని
వాఁడె యిహమునఁ బరమున వాసికెక్కు । నని హరిశ్చంద్రుఁ డాత్మధైర్యంబు పూని.

చ. చినిగిన ప్రాఁతగుడ్డయును జింపిరిగొంగడి పుట్టగోచియున్
దనువునఁ గాటిఱూడిదె పదంబులఁ బల్చనిత్రోలుటట్టలున్
బనుపడు గొంకికఱ్ఱ పొగబారినచేతులునై త్రిశంకునం
దనుఁడట వల్కిలిగడపె ద్వాదశమాసము లెండ్లు నూఱుగాన్. ౫౨౪

వ. ఇట్లు శవోదనకృతఘున్నివారణుం డయి హరిశ్చంద్రుడు సత్యంబు దప్పక యుండె
నంత. ౨౨౫

ఉ. అక్కడ విప్రగేహమున నంగన దాస్యము సేయుచుండఁగా
నొక్కదినంబునన్ సమిధలోపికఁ దేరఁగఁబోయి బాలకుం
డక్కడనక్కడం దిరిగి యల్లన మోదుగకట్టె లేరి తా
నొక్కెడ మోపు గట్టి తలనుంచి వడిం జనుదెంచుచుండఁగన్. ౨౨౬

క. దప్పింగొని పుట్టపయిం । దెప్పున మోపునిచి పోయి నీరాని ముదం
బొప్పఁ జని మోపు గైకొన । నప్పుడె యొక కృష్ణసర్ప మతనిం గఱచెన్. ౨౨౭

తే.గీ. కౌశికుని మాయచే బాము గఱచినంత । మేనుదెలియక పడియుండె మృతునిలీల
దానిఁగని తోడిబాలకుల్ తల్లితోడ । నెఱుఁగజెప్పిన మూర్ఛిల్లి యొరగె భువిని ౨౨౮

క. నేలఁబడి ముహూర్తమునం । దేలి కనులు బాష్పవారి నిండి వగవఁగా
నాలోగిట నశుభముగా । నేలేడ్చెదు సిగ్గుమాలి యిది తగ దింకన్. ౨౨౯

మ. అని విప్రుండు దయారసంబు మతిలో నావంతయున్ లేక భ
ర్జనసేయన్ విని యేమియుం బలుక కుచ్చైకంఠనాదంబుతో
డను హాపుత్రక పుత్రకా యనుచు నేడ్వంజొచ్చినం బ్రాహ్మణుం
డెనుమా నాపని మట్టుపెట్టెదె యటం చెంతేసి క్రోధంబునన్. ౨౩౦

ఆ.వె. ఓసి కూలిదాన యూరకుండుము నీకు । బోసినాను బీరపూలవంటి
కరుకు లొక్కకోటి కడగండ్లమారివై । యేడ్చుదానవంచు నెరుఁగ కపుడు. ౨౩౧

వ. ఇట్లుఁ బల్కుచు గద్దించిన నమ్ముద్దియ పెద్దపెట్టున నేడ్చుచు దీనాననయై జాలి
పుట్టింప నా ముదుసలిజన్నిగట్టుం జూచి యిట్లనియె. ౨౩౨

ఆ.వె. నల్లత్రాఁచు గఱచె బిల్లవానికి నంచు । పింటి నచొటువోయి వేగవత్తు
మందు మ్రాకు లిచ్చి మాతండ్రి నన్నంపు । నీదు కాలిధూళి నెత్తిమోతు. ౨౩౩

వ. అనిన విప్రుండు, ౨౩౪

తే.గీ. కొలువులోనను నినుఁ బెట్టుకొన్నవాని । పనులు నెరవేర్ప కిటువంటి పలుకుఁ బలుక
దోషమని యీ వెఱుంగవో దోసకారి । మానుమిఁకఁ గూయ నిన్ను నేఁ బంపఁజాల.

తే.గీ. కూలిగొని స్వామికార్యంబు దూలఁజేయు । వాఁడు కల్పంబు నరకసంవాసియగును
బిదపఁ గుక్కుటమై పుట్టు వినుము నీకు । విధులు సెప్పుట చవిటిలో విత్తులిడుటె. ౨౩౬

వ. అని పల్కిన విని యవ్వనితామణి గడగడ వడంకుచు విప్రవర్యా సుముఖుండవు

నా కొక్క ముహూర్తమాత్రము సల పచ్చి పంపుము నా ముద్దుబిడ్డనుం బ్రతికించుకొని మరల వెంటనే వచ్చెద ననిన విని యత్యంత కుపితుండై విప్రుండు. ౫౩౭

క. నీపుత్రునితోడను నా । కేపనికల దోసి వధురనేటికి నింటన్
నాపత్ని పడుచుకున్నది । యోపునె పని కిపుడుపోయి యూదుము ప్రోయిన్ ౫౩౮

క. నాకోపము నీవెఱుఁగవు । పో కిచ్చట నిలచియున్నఁ బొలతీ నిన్నున్
నూ కెదను జబుకుతో నీఁకఁ । గాకాలు గుణింప కిట్టి కార్యము గనుమీ. ౫౩౯

తే.గీ. అన విని త్రిశంకుకోడలు నఖిలభూమి నేలునట్టి హరిశ్చంద్రునాలు వృద్ధ
విప్రునకుఁ దలయంటి బావికిని బోయి జలములను దెచ్చి సర్వంబు చక్కఁబెట్టె. ౫౪౦

వ. అంత నర్ధరాత్రంబున. ౫౪౧

క. ఇత్తరి బోవచ్చును నీ । చిత్తముకొలఁది నని కరుణచే విప్రుం డా
బిత్తరితోఁ దెలిపియుఁ దాఁ । దత్తరమున మాటమాట దాసీ యనుచున్. ౫౪౨

క. చచ్చినవానికి దాహము । చెచ్చెర గావించి రమ్ము చెడనీకు బనుల్
తచ్చెన బుచ్చెన లాడుచు । నిచ్చటి కర్కోదయమునకే వడి రమ్మీ. ౫౪౩

వ. అన విని యా పతివ్రతాతిలకంబు బాలుం డున్నచోటికిం బోయి యతండు మృతుండై యుండుటం జూచి యూధంబుం బాసిన కురంగంబు మాడ్కి, దూడఁ గానని యావు చందంబున నడలుచు. ౫౪౪

తే.గీ. అయ్యయో దైవమా దైవమా యిఁకేమి యిఁకేమి । కలదు మనుగడ నా కిదే విలయమ్మాయె
ననుచు బిడ్డనిపైఁబడి హాకుమార । హాకుమార పలుకవేమి యలుకయేల. ౫౪౫

తే.గీ. ముద్దుఁబెట్టుము నాయనా మోమునందు । నకట కళదప్పె నిదియేమి యక్కజంబు
నన్నుఁ జూడుము కనులతోఁ గన్ను లిట్లు । కాంతిదప్పివ కతమేమి కన్నతండ్రి. ౫౪౬

వ. అని మఱియు. ౫౪౭

క. రాజా యెక్కడఁ బోయితి । వీజాధం బాణతుల్యుఁ డీ బాలుఁడు వి
స్తేఁజు దయియుంద నూఱక । పోజనునే బ్రతుకనేల భువి నే నింకన్. ౫౪౮

వ. అని బాలునిం దన యక్కునం జేర్చుకొని. ౫౪౯

ఆ.వె. తండ్రి యేది యొక్కతరిఁ జిఱునవ్వుతో । మొగము ద్రిప్పి యొక్క ముచ్చటలాడి
ముద్దుబెట్టవోయి మురిపెంబుఁ జూచుచు । సంతసించుదాన చక్కనయ్య. ౫౫౦

క. నే నెవ్వతె ననుకొంటివి । రా నాయన తల్లి ననుచు రావే మెదురై
నానోము లిట్టులాయెనె । హా నాబ్రతు కింకనేటి కవనీస్థలిపై. ౫౫౧

క. సాముద్రికములు సూచిన । సాములు సెప్పినది నేఁడసత్యంబాయెన్
నా ముద్దుబిడ్డ జోస్యుల । ధీమత్త్వ మబద్ధమాయె తెన్నేది యికన్. ౨౫౧

తే.గీ. చక్రవర్తిత్వ మడుగంటె సర్వధనము । వోయె నే దాసినైతిని బూని భర్త
యేడఁబోయెనో యెక్కింత యెఱుగనైతి । నహహ హా దైవచేష్టితం బద్భుతంబు.

తే.గీ. ఎన్నియిడుమలు వచ్చిన నెంతకష్ట । జీవనంబైన పుత్ర నీ చిన్న మొగము
ముద్దుఁగొనుచున్న నాకదే ముక్తి భుక్తి । యనుచు నానందమున మందు నవనియందు.

ఉ. తల్లికిఁ దండ్రికిం బ్రియము దప్పక సేయును సత్యవాదియౌ
బల్లిదుఁడుం జిరాయువును భాగ్యముగల్గినవాఁడు దాన శీ
లోల్లసితుండు వంశకరుఁ డుజ్జ్వలకీర్తియు నౌనటంచు ము
న్నెల్లలు నీవు పుట్టినపుడే వచియించిరి దబ్బరాయెఁగా. ౨౫౪

మ. అవనీరాజ్యము మంత్రులుం ధనము ఖడ్గాదుల్ మృగేంద్రాసనం
బు వరానేకపవాజి ముఖ్యములు తోపుల్ మేడలన్ మిద్దెలున్
ధవళచ్ఛత్ర మయోధ్యసంపదలు పుత్రా యేడకుం బోయెనో
ప్రవికీర్ణస్థితి నిట్టు లియ్యడవిలోఁ బ్రాణంబులం బాసితే. ౨౫౫

సీ. చందనమృగనాభిసాంకవంబులఁ బూయు నెమ్మేను ధూళితో నిండెనయ్య
కొనగోట దిద్దిన గొనబైన గీరునామము గల్గు మోమంటె మంటియుండ
మల్లెమొగ్గలదండ లుల్లసిల్లెడి యొమ్ము మిట్టి బిట్టీగలు ముసురుకొనియె
తోడిబాలకులతోఁ గూడి పంతముపట్టి యాడు నీ కాల్సేతు లాడ వకట.

తే.గీ. పూర్వజన్మంబునందు నే భూతలమున । నెంత ఘోరదురిత మాచరించినానొ
యిప్పు డనుభవమాయె నా యేడు పెవరు । విందురయ్యా మహారాజ వినవె నీవు. ౨౫౬

వ. అని యిట్లు పేరెలుంగున విలపించుచున్న నయ్యింతి స్వరంబు కర్ణరంధ్రంబులం గలవ నగరపాలకులు నిదురనుండి లేచివచ్చి వారల ప్రక్క నిలువంబడి నీ వెవ్వతె వొంటరిగా భీతిలేక యిచ్చటి కెట్లువచ్చితి వీ కుమారుం డెవ్వండు నీ భర్తపేరేమి నావుఁడు విని యా సాధ్వి యేమియు బలుకక స్తబ్ధయై యుండ ననేకవారంబు లనేకవిధంబుల నడుగం జొచ్చినను మాటలాడలేక యత్యంత చింతాభరంబునం జిక్కియున్నం గాంచి దేహంబులం బులకలెత్త నాయుధపాణులై. ౨౫౭

క. ఏకాకినియై యున్నది । వ్యాకులచిత్తమయినట్టు లభినయమిడుచున్
శాకినియో ఢాకినియో ; కాకున్నను మాటలాడకయ యుండునొకో. ౨౫౮

వ. అనిన విని యందు మఱియొకండు. ౨౬౦

తే. గీ. అపునవును గాకయుండిన నర్ధరాత్ర । మిట్లుఁగా వచ్చునే నిక్కమేసుమిద్ది
బాలఘాతిని శిశువులఁ బట్టి చంపి । మ్రింగుచున్నది దీనిది దొంగయేడ్పు. ౫౬౧

వ. అని యిట్లు బహువిధంబులు పలుకుచుఁ దల కొందఱును, భుజంబులు కొందఱును, నడుము కొందఱును, పాదంబులు గొందఱునుం బట్టి మోచికొనిపోయి మాలపల్లియనున్న చండాలు మోల నిడి యోరి చండాలా! పుర బహిఃప్రదేశంబునం దీనింజూచితి మిది బాలఘాతిని వేగమ దీసం గడతేర్పు మనుఁడు చండాలుఁడు సూచి మీ ఠదియొక్కటియ సూచితి రిది యనేక శిశువుల నిట్లుగా వధియించియుండుం బుణ్యవశంబున నేఁడు మీరు దీనిఁ బట్టగల్గితి రిది వధ్యయే యెట్లనిన. ౫౬౨

క. ద్విజుల బాలకులను మద । గజగామినులను వధించుఁ గట్టిఁడి గురు నం
బుజనేత్రఁ గలయువానిన్ । గుణసు శిఖిసు మద్యపున్ దగున్ బొలియింపన్. ౫౬౩

క. అని యిట్లు వీరబాహుఁడు వనితామణి నంటఁగట్టె బహుపాశములన్
దనువును గాళ్లేతులు తల । వెనుకకు ముందరికిఁ గదల వీలీకుండన్. ౫౬౪

వ. ఇట్లు కట్టి హరిశ్చంద్రునకుం జూపి. ౫౬౫

ఆ. వె. ఓరి కూలివాఁడ యీ రేయి నిది బాల । ఘాతఁ జేసె దీనిఁ గట్టినాఁడఁ
దడయ కిపుడ దీనిఁ దటుకున నొకవ్రేత । జంద్రహాసమూని చంపు మనిన. ౫౬౬

క. ఆ వచన మశనిపాతము । గా విని రాజన్యుఁ డెట్లుగాఁ జంపుదు నే
స్త్రీవధకంటెం బాపం । బీ వసుధం గలదె సేయ నే నిది యనినన్. ౫౬౭

క. భయమేల బాలఘాతిని । రయమునఁ జంపంగ నీకు రాద్రఘము మహా
భయద యిది చంపకుండిన । నయమెల్లం దొలఁగు ననిన నరపతి పలికెన్. ౫౬౮

తే. గీ. ఎట్టిదైనను స్త్రీని వధింపరా ద । టంచు శాస్త్రంబు నుడువు నే నట్టిపనికి
నియ్యకొనన నన నది యెల్ల యిప్పుడేల । యొక్కదాని వధించిన నూరు నిలుచు. ౫౬౯

వ. కావున మారుమాట సెప్పక దీనిం గత్తితో నొక్క వ్రేత వ్రేయు మనిన విని హరి శ్చంద్రుండు స్త్రీవధ సేయ నను నా వ్రతంబునకు భంగంబు గల్గెడి నే నట్లు సేయంజాల మఱియొక్కని నియోగింపు మనవుడుం గనలి వీరబాహుండు. ౫౭౦

తరువోజ. స్వామికార్యము సేయ సమకట్టవీవు । నీమోము ముందర నీకయి నేను
నా మహాముని కిచ్చినట్టి యర్థంబు । లీమహి నిన్నని యెన్నంగ వశమె
నీమేను నమ్మిన నీచుఁడ వీవు । నామాట వినకుంట న్యాయమే నీకు
వేమారు నేటికి విసిగింతు నన్నుఁ । గామినిఁ జంపుము కత్తి చేఁబూని. ౫౭౧

వ. అనిన. ౫౭౨

ఉ. ఎందుకు స్త్రీనిఁ జంపుమని యిట్లు వచించెదు నీవు శత్రులన్
క్రందఁగఁజేయుమంచు నొక మాట వచింపుము దేవనాథునే
నిం దతవీర్యసంపద ననిం దెగటార్చి నిమేషమాత్ర రా
జ్యేందిర నీవశంబ యొనరించెదఁ జూడుము వీరబాహుకా! ౫౪౩

వ. అనిన విని వీరబాహుండు. ౫౪౪

క. ఏలా యీ పలుకులు చం । డాలుని గొలువంగవచ్చి నానావిధ దం
భాలకుఁ జొచ్చెదు చాలుం । జాలుం బదపద మహాగసా నిర్లజ్జా. ౫౪౫

తే. గీ. ఇట్టి దొరవేలి చండాలునింట గొలువు । గుదిరితివి కూలివానికిఁగూడ నట్టి
చైదమున్నదె వేగమే చంపు దీని । ననుచుఁ దన చేతి కత్తి రాజునకు నిచ్చె. ౫౪౬

తే. గీ. తలను వాంచి యెదుటనున్న తరుణిఁ జూచి । పరమపాపిష్ఠుఁడను నాకు బాలుపడియె
నిన్నుఁ జంపుట యిటు రమ్ము సన్నుతాంగి । చేతులాడకయున్నదే చేయవలసె. ౫౪౭

తే. గీ. అధిపుఁ డెఱుఁగఁడు తనభార్య యనుచు లేమ । తనపతి యటంచు నెఱుఁగ దింతయును
నట్టులుండి యంగన పలికె నోహో మహాత్మ । మాన్యచండాల నాదొక్క మనవి వినుము. ౫౪౮

క. మృతుఁడై పడియుండెను నా । సుతుఁ డిచటికి దవ్వుగాదు చొప్పెఱుఁగుదు నే
నతివేగ మిటకు వచ్చెద । నతనిం దహనంబుసేసి యన విని నృపుడున్. ౫౪౯

తే. గీ. మంచిదని పన్ప నేగి యమ్మగువ బాలుఁ । జేరి యేడ్చిన శబ్దంబు సెవులఁ జొచ్చి
శవము సన్నిధికిని వేగఁ జని తదీయ । వస్త్రమును దీసి మూటకో వైచి కట్టె. ౫౫౦

ఉ. అంతట రాజ్ఞి బాలుఁ దన యంగమునం దిడఁ జూచి యా నృపుం
డెంతయు వింతనొంది యిదియేమి మహాశుభలక్షణాఢ్యుఁడై
కాంతులయిక్కయై ధరణికాంతల బిడ్డలబోలె నున్నవాఁ
డింతయుఁ జూతునంచు నొకయింత మొగంబును దేరఁజూచినన్. ౫౫౧

వ. తన బిడ్డండని గుఱుతుపట్టి యత్యంత చింతాభరంబున నిలువలేక మూర్ఛిల్లి యొక్కింత తడ వేమియుం బలుకక కడు కెట్టకేని దెప్పరి తన చెంగటఁ గన్నీరు మున్నీరుగా నేడ్చు నంగనం బారజూచి తన యనుంగు వెలందిగా నెఱింగి, హా పుత్రకా ! హా ప్రియా ! యని విలపించుతఱి నయ్యతివయుం దన విభుండగు హరిశ్చంద్రుం డని తెలసి ప్రవృద్ధంబైన శోకంబునం జిక్కి యిండొరు కౌఁగలించుకొని బిడ్డని చేతులలో నిడుకొనియున్నంతరి నప్పరమసాధ్వి విభునిం జూచి. ౫౫౨

సీ. చండాలుఁడై హరిశ్చంద్రుఁ డిట్లుండెనే చక్రవర్తిత్వ మెచ్చటికిఁబోయె
చండాలుఁడై హరిశ్చంద్రుఁ డిట్లుండెనే ఛత్రచామరము లెచ్చటికిఁబోయె

చండాలుఁడై హరిశ్చంద్రుఁ డిట్లుండెనే చతురంగబలము లెచ్చటికిఁబోయె
చండాలుఁడై హరిశ్చంద్రుఁ డిట్లుండెనే చారుకిరీట మెచ్చటికిఁబోయె

తే. గీ. చండచండాలుఁడై హరిశ్చంద్రుఁ డిట్టు । లుండెనే వల్కలో బట్టలూడ్చికొనుచు
స్ఫారమాణిక్యసౌధ మెచ్చటికిఁబోయె । కటకటా సింహపీఠ మెచ్చటికిబోయె. ౫౮౩

క. మును పీ రాజు నడువఁగా । మునుమున్ను మహీశులెల్ల ముదమునఁ దమ య
త్యనుపమ వస్త్రంబులచే । మను దుడుతురుగాదె యకట మార్గమునందున్. ౫౮౪

క. అటువంటి చక్రవర్తికి । ఘటియించెనె నేఁడు వల్లకాటంబడి య
క్కటట యిట్టు మృతాంగంబును । నటునిటు బొరలించి కోల నంబర మూడ్చన్. ౫౮౫

సీ. పీనుగుల యొడళ్ళఁ బెనగొన్న పూదండలకుఁ జుట్టుకొన్న వెంద్రుకలతోడఁ
బూదిగ్రమ్మిన నల్లబొగ్గులనంటి సగముగాలు మెదడు చిట్టెములతోడ
గాలి కాలని యెమ్ము్కలనుండి గుప్పునఁ గడలగ్రమ్మెడి పొగకంపుతోడఁ
నుండలై మాంసంబు గండలు పైకుబ్బి కుసులార్చు రొమ్మెంపగూళ్ళతోడఁ

తే. గీ. చెదరనూకిన కుండ పెంచికలతోడ । బయలవైచిన పాడెకట్టియలతోడ
భయదమగు వల్లకాటిలో బట్టలెత్తు । శ్వపచుఁ డాహా హరిశ్చంద్ర చక్రవర్తి. ౫౮౬

చ. అని నిలపించుచున్ సరసిజానన రాజు గళంబువట్టి బి
గ్గనఁ దడవుండి మైవెలసి కాంత యిదంతయు స్వప్నమో నిజం
బొ ననుఁ గృపామతిం గనుచుఁ బోలఁగఁజెప్పుము మానసంబునన్
బెనగొను మోహ మెట్టుల లభించెను నీ కిటువంటి దాస్యముల్. ౫౮౭

చ. అన విని రాజు తా నఖిల మాపెకుఁ దెల్పినఁ బొక్కిపొక్కి నే
లనుబడి బొమ్మ మోదుచు నొడల్ ధరణీరజమాన మూర్ఛలం
గని నృపుఁ డేడ్చెఁ గొంతపడి క్రమ్మర నిర్వురు దెల్విఁదాల్చియుం
డ నిజకుమారు వృత్త మఖిలంబును దెల్పెను సాధ్వి భర్తకున్. ౫౮౮

వ. ఇట్లొండరు తమ వృత్తంబులు దెల్పుకొని యార్చుచు నొక్కింతదడ పూరకుండి యున్న
తరి న య్యంగనామణి జీవితేశ్వరుం గని. ౫౮౯

ఆ.వె. జీవితేశ నాదు శిరమును ఖండించి । స్వామికార్యమందు భక్తి పూని
నడచు టొప్పు ధర్మ మెడలి స్వామిద్రోహ । పాప మందనేల భూప యనిన. ౫౯౦

ఉ. చక్కనిచుక్క నాకయిన సాధ్వివి నీ విటులాడఁజెల్లునే
యిక్కఠినంపుమాట విని యెట్లు సహింతు నిరాగస న్నినున్

జెక్కఁగఁ జేతులాడునె యసింగొని ప్రేష్యత యిట్టు దెచ్చెనే
యక్కట నీకు భర్తనయినందునకా యిటువంటి కష్టముల్. ౫౯౧

వ. అనిన విని శైబ్య యిట్లనియె ౫౯౨

చ. భగవతిఁగొల్చితిన్ ద్విజులఁ బావనులన్ భజియించి మ్రొక్కితిన్
గగనచరావళిన్ సకల కర్మములం బరిచర్యఁ దన్పితిన్
మగువలు మెచ్చ సాధ్వినయి భర్తను దైవముగాఁ దలంచితిన్
మగఁడవు నీవ యీదుపుసుహా నృప భావిభవంబునందునన్. ౫౯౩

క. అనిన విని వగచి మూర్ఛిలి । జననాథుఁడు తెలివినొంది శైబ్యా నాకున్
మనుగడపై మతిలేఁదికఁ । జనియెద నరకమున కేని స్వస్థలికేనిన్. ౫౯౪

క. తప్పొడితి స్వర్గము నా । కెప్పటికిని లేదు స్వామి యీ పనికిం దా
నొప్పదు ప్రేష్యుఁడు స్వేచ్ఛన్ । మొప్పె పనులొనర్చి నరకమునకే పోవున్. ౫౯౫

తే.గీ. వంశకరుఁడైన పుత్రు డీవరుస నిపుడు । జీవితము బాసెఁ గష్టంబు సెప్పఁదరమె
నరకమే మేలు స్వామియానతికిఁ జూడ । కీక్షణమ మృతినొందెద నిందువదన. ౫౯౬

తే. గీ. చిచ్చుపేర్చియందు జిన్న బాలకు నుంచి । యందుఁ గూలువాఁడ నతివ నీకు
సెలవొసంగినాఁడ శీఘ్రంబ విప్రుని । యింటికేగి కొలువు మింపుమీర. ౫౯౭

తే. గీ. తన్పితినయేని విప్రుల దానములను । కొల్చితినయేనిఁ బూజల గురువరులను
వ్రేల్చితినయేని దేవతాతృప్తికొరకు । నీవు బుత్రుండు నేనును నెనయుద మిఁక. ౫౯౮

తే గీ. కేళికామందిరమునందుఁ గీరవాణి । నేను నవ్వులాలకాడిన నెఱసులెల్ల
నేడుక్షమియింపు మేగెద నిన్ను విడచి । యన్యజన్మంబునందు నిన్నంటువరకు. ౫౯౯

ఉత్సాహ. సార్వభౌముభార్యనంచు శైబ్య నీ వొకింతయున్
గర్వముంచబోకు విప్రుఁ గన్నతండ్రిఁగా మదిన్
సర్వకాలములనుదలఁచి చక్క జేయుమీ పనుల్
పర్వచంద్రవదన నిన్ను బాసి నేను పోయెదన్. ౬౦౦

వ. అప్పరమసాధ్వీలలామంబు దీనానయై గద్గదస్వరంబుతోఁ దన వల్లభుం గాంచి. ౬౦౧

ఉత్సాహ. ధరణినాధనిన్నుఁబాసి తాళనేనిమేపమున్ । నరకమేనిస్వర్గమేని నాకు మేలుకాదె నా
వరునితోడనున్కి కాన వచ్చెదన్ హుతాశన । స్ఫురితకీలఁగూలియిష్ట చొప్పులేల నేనికన్.

వ. అనిన రాజట్లకాక యని చితిం బేర్చి బాలునుంచి భార్యయుం దానును గరంబులు జోడించు
కొని పరమేశానియు జగదీశ్వరియుఁ బంచకోశాంతరగతయు రక్తాంబరపరీధానయుఁ

గరుణారసనాగరయు నానాయుధధరయు, జగత్పాలనతత్పరయు జగదంబయు నగు శతాక్షిం బ్రార్థింపం దొడంగి రంత ధర్మునిం బురస్కరించుకొని యింద్రాదులగు లోకపాలు రతిత్వరితగతిం బఱతెంచి రప్పుడు వారితో వచ్చి పరమేష్ఠి యిట్లనియె. ౬౦౩

సీ. రాజేంద్ర కనుము నే బ్రహ్మదేవుఁడనయ్య యిదిగొ దేవాధీశు డితడె సుమ్ము
ధరణీశ యీతఁడే ధర్ముండు చూడుమీ యీతండె జలనేత యిట్లు గనుము
ధనదుం డితండె యుత్తరదిక్కు పాలించు నీశాను డీతఁడే యిటులజూడు
స్వాహావిభు డితండె వాయుదేవుం డదే నిర్రృతి నాతండె, నిఖిలదేవ

తే. గీ. యక్షగంధర్వ సిద్ధసాధ్యమరుదురగ । చారణాశ్వినులవ్వారె సకలమౌని
వినుతిపాత్రుండు గాంచితే విశ్వమిత్రు । డనుచుఁ గీర్తింపబఁడు కుశికాత్మజుండు. ౬౦౪

వ. అంత రాజుంజూచి ధర్మం డిట్లనియె. ౬౦౫

తే. గీ. నీ తితీక్షయు నీ దాంతి నీదు శాంతి । నీదు సత్యంబు మొదలగు నిర్మలంపు
గుణములకు మెచ్చి నినుఁ జేరఁగోరి వచ్చి । తిని నృపాలక ధర్ముడ దెగువమాను. ౬౦౬

వ. ఇట్లు ధర్ముండు పలుక వినుచుం దలవాంచి యున్న రాజుం గని మహేంద్రుం డిట్లనియె. ౬౦౭

మ. సకలాశాగతకీర్తిసాంద్రుడ హరిశ్చంద్రావనీశుండ నీ
ప్రకటప్రోన్నతసత్యవాక్యమహిమన్ బ్రాపించె నీకుం గుమా
రకచూడామణికిన్ సతీమణికి స్వర్గ బ్రహ్మ లోకాదు లీ
విక రా రమ్ము విమాన మెక్కి దివి కిద్దే భార్యతోఁ బుత్రుతోన్. ౬౦౮

క. అంతట నపమృత్యుత్రా । సాంతక మగు పుష్పవృష్టి యనువుగఁ గురిసెన్
శ్రాంతుఁడు లేచిన క్రియ సత్యంత ముదంబునను రోహితాశ్వుఁడు లేచెన్. ౬౦౯

తే. గీ. బ్రతికి లేచి తనదు పజ్జ కేతెంచిన । భూరికాంతిమంతుఁ బుత్త్రుఁ గాంచి
శైబ్య సంతసించె జనపాలు, డలరె నా । నంద బాష్పచలితనయనుఁ డగుచు. ౬౧౦

క. సతితో సుతుతో నరపతి । యతిమోదముతోడ భూషణాంబరమాలా
ధృతితో ధృతిమన్మతితో । వితతోన్నతితోడ నిలచె విబుధవినతితో. ౬౧౧

సీ. అమ్మాడ్కి నరనాథ, డధికతేజస్సమన్వితుఁడయి నిల్చిన విబుధనేత
గని మహారాజ నీ కాంతయుఁ బుత్రుండు నీవు నారోహింపుఁ డీ విమాన
మమరలోకంబున కరుదెండు సకలపుణ్యములకు ఫలముగా ననిన నృపుడు
నాస్వామియైన చండాలుని యానతిలేక యేగతి వత్తు నాకమునకు

తే. గీ. ననిన ధర్ముండు భూపాల యపుడు నిన్ను । గొన్న చండాలుడను నేనె యన్న నింద్రు
డింకఁ దడవేల శుభముల కిక్కయైన । స్వర్గమున కన విని హరిశ్చంద్రు డపుడు. ౨౧౨

శా. దేవాధీశ యయోధ్యలో నధికభక్తి న్నన్ను సేవించు వా
రీవార్తల్ మెంత కుందిరొకా నే నెట్లేగుదెంతున్ గృపా
భావస్వాంతుఁడనై మహానరకముల్ ప్రాపించకున్నే నమ
జ్జీవత్యాగమహాఘ మల్పమె సురాసేవాదితుల్యంబకా. ౨౧౩

శా. నేనొక్కండ సురాలయంబునకు రానేరన్ సురాధీశ్వరా
దీనత్వంబుననున్న కోసలులకున్ దెన్నిచ్చెదే నిప్పుడే
యేనుం బైనము సేయుదుం దివికిఁ గాదే వారితోఁ గూడి రే
పో నేడో మరియొక్కనాడొ నరకంబో స్వర్గమో చేరెదన్. ౨౧౪

వ. అనిన నింద్రుండు హరిశ్చంద్రా గోసల వాసులు నానావిధ పుణ్య పాపంబుల వలన భిన్నంబులయిన వృత్తులనున్నవారు. స్వర్గంబునకు నీతో రా నెట్లోపుదురు. నావుడు నో సురాధీశా ప్రజాసహాయుడై కదా భూపాలుండు జన్నంబులు సేయుటయు, దానంబులు సేయుటయుం బొసంగుచుండు నట్టి యుపకారులకు నాతో భాగంబు పంచక యావత్ఫలంబు నే నొక్కరుండన యనుభవింప న్యాయంబగునే నే యజించినట్టియు, నే జపించినట్టియు నే దానంబు సేసినట్టియు కర్మంబుల ఫలంబు నా కొక్కనికి బహుకాలోపభోగ్యంబగుట కంటె నా యుపకారులతోడ నే నొక్కదినం బనుభవించుట శ్రేయంబగు నని రాజు పల్కిన నింద్రుం డట్లన యగునని తానును, ధర్ముండును, విశ్వామిత్రుండును జాతుర్వర్ణ్య సమాకులంబగు నయోధ్యకుం జని సర్వజనుల నాబాలగోపాలంబుగాఁ గొని వచ్చినం జూచి హరిశ్చంద్రుండు బ్రహ్మానందపరవశుండై యందఱితో విమానంబు నెక్కి యయోధ్యకు వచ్చి సంసారంబులం దెగడియున్నవారలం దక్క తక్కినవారల నక్కడ డించి తన తనూజుండగు రోహితాశ్వునకుం బట్టంబు గట్టి యయోధ్య నేల నియమించి నిజసతీసమేతుండై మహీపాలుం డింద్రాదులుతో దివ్య రథంబెక్కి నాకంబునకుం జనియె. నప్పుడు దైత్యాచార్యుండగు శుక్రుం డిట్లనియె. ౨౧౫

క. ఔరా తితీక్షపేరిమి । యౌరా దానంబుఫలము నందలి మహిమల్
స్వారాజ్యమునం దింద్రుని । జేరె హరిశ్చంద్రమనుజసింహుఁడు కంటే. ౨౧౬

క. పూని హరిశ్చంద్రోపా । ఖ్యానము వినఁ జదువ వ్రాయ నఘములు దొలగున్
సూనులు గల్గుదురు మహా । జ్ఞానము నైశ్వర్యమును సుఖంబును గలుగున్. ౨౧౭

వ. అని యిట్లు వ్యాసుండు చెప్పిన జనమేజయుండు మునినాథా! శతాక్షీదేవి యేకారణంబున
నుదయించె, నది యెట్టిది తెలుపవే యనిన విని సాత్యవతేయుండు. ౬౧౮

## —: శ తా క్షీ దే వి మ హి మ :—

మ. నరనాథోత్తమ తెల్పెదన్ విను హిరణ్యాక్షాన్వవాయోద్ధుడౌ
రురునాముండు గలండు వానికిఁ గుమారుండైన దుర్గుండు ని
ష్ఠురుఁడై దేవతలన్ జయింతు నిగమస్తోమంబు సర్వంబు ను
ద్ధురతం బ్రహ్మముఖంబునం గొని మహోద్యోగంబు వాటిల్లగన్. ౬౧౯

క. అని మనమునఁ దలఁచి వన। మ్మున కరిగి తపంబుసేసె మొగి వేయేం డ్లా
వనజజుఁడు మెచ్చి వరమే। మన విని రాక్షసుఁడు ప్రముదితాత్ముం డగుచున్. ౬౨౦

చ. సరసిజగర్భ త్వద్వదనసంభవవేదములెల్ల యిమ్ము నే
సురలజయింపఁజాలు పటుశూరుఁడ నయ్యెడు శక్తి నిమ్ము నీ
చరణము నమ్మినాఁడ ననఁ జయ్యన బ్రహ్మయు నట్ల యౌననన్
ధరణిసురాననస్థ మహిత శ్రుతులెల్ల దొలంగె నయ్యెడన్. ౬౨౧

క. రాక్షసుఁడు వేదచయముల నక్షీణతఁ దా గ్రహించి యడఁరగ భూమిన్
బ్రక్షీణవేదతన్ య। జ్ఞక్షామం బొదవె సురలు జరలుగని రొగిన్. ౬౨౨

క. దుర్గుం డమరావతికి న। నర్గళగతి నేగి యింద్రు నఖిలదిశారా
ద్వర్గము నోర్చిన వారలు। మార్గంబులు పట్టిపోయి మరిగిరి గిరులన్. ౬౨౩

క. అనలుఁడు హోమరహితుఁడై, వనదంబులుపట్టి భూమి వానలు లే కెం
దును గఱవుపట్టె నూతులు। వనజాకరములును నెండె వసుధాధీశా! ౬౨౪

క. శతవార్షికవగ్రహము। ద్భుతమై జంతువులు సచ్చె భూతబలంబ
ల్పితమయ్యె నపుడు బ్రాహ్మణ। వితతులు హిమగిరికిఁ జేరి విస్తృత భక్తిన్. ౬౨౫

శా. దీనత్వంబున వేడి రప్పుడు సమాధిధ్యానపూజాది సం
ధానంబు ల్లగఁ జేయుచున్ నిరశనత్వంబూని యో దేవి యో
దీనానాథశరణ్య యో సకలధాత్రీ యంచు నెంతేనియున్
స్థానభ్రంశమునొంది వచ్చితిమి నీ సాన్నిధ్యమున్ జేరఁగన్. ౬౨౬

ఉ. భూతల మెల్ల శోషపటున బొక్కె జలంబులు వట్టె బావులన్
నూతుల వానలే దకట నూటికి నొక్కఁడు జీవయుక్తుడై
యూతటి కున్నవాఁడు జగదీశ్వరి మమ్ములఁ గన్నతల్లి నీ
చేతనుఁగానిదెద్ది యిఁక: జేకొని యాపదదీర్ప రాగదే. ౬౨౭

ఉ. అమ్మవు నీవు లోకముల కన్నిటికిన్ గడుసార గాంచియున్
మమ్ముల నన్నపానగరిమమ్ములఁ దన్పకయున్న నేడకున్
బొమ్మని చెప్పెదో తగునె పూనియుఁ బూన కుపేక్షసేయ నే
రమ్ములు మేము చేసిన కర మ్మనురాగముతో క్షమింపుమీ. ౬.౨౮

ఉ. శంక యిఁకేల నీచరణసారసమే శరణమ్ము మాకు మా
సంకటమెల్లఁ దీర్చి యిఁక సాకకయున్నఁ గృపారసంబు నీ
వంకను లేదె లేదనుచుఁ బల్కఁగవచ్చు నెటైనఁ దొల్లి నీ
లెంకల బ్రహ్మ కేశవ గిరీశుల సత్కృప నేలయేలితో. ౬.౨౯

ఉ. మాకుఁ బ్రసన్నవై యొసఁగుమా యభివాంఛితము ల్దయామతిన్
భీకరవగ్రహగ్రహవిభీతులకుం గతిగానరా కతి
వ్యాకుల చిత్తులై పడెడి వంతల వింతలనంగరాదుసూ
ప్రాకృతలోకముం బరమపావని ప్రోవగదమ్మ వైశమున్. ౬.౩౦

దండకం. శ్రీదేవి వీవే సతీదేవివీవే మహాకాళివీవే సురారాధ్యవీవే సదీశానివీవే పరాశక్తివీవే నిరాలంబవీవే జగద్ధాత్రివీవే జగద్భర్త్రివీవే జగత్కర్త్రివీవే సదాధారవీవే సమస్తంబునీవే మహోదారమాయావిధానంబునన్ లోకముల్మించి యాడించుచున్నావు బ్రహ్మాదులున్నిన్ను బూర్ణంబుగా సంస్తవింపం జడుల్ మేము నీచాతినీచ స్వభావంబులంగూడి నిన్నెన్నఁగా నేర్తుమే కన్నతల్లీ దయంజూడవే యిన్నినాళ్ళింత క్షామంబులోఁ జిక్కి యన్నంబు శాకంబు లేకున్నఁ బండ్లే సమూలంబులై నం దినం జిక్కి యెందాక జీవంబులన్నిల్పికోశక్య మమ్మా జలంబైనఁ ద్రావంగఁ జూపట్టదెచ్చోటనేని న్నిరుత్సాహ చిత్తంబులం దత్తరం బందుచుం బొత్తిగా మాంసము ల్నెత్తురుల్ పోయి శల్యంబులం గట్టెలంబోలె మేను ల్పసల్పాసె నేరీతి నీ యాపదం బంపికోశక్తి మాకబ్బు నబబ్బ యిబ్బాధలం దీర్పవే యిస్సిరో యిస్సిరో తల్లి మేలైన కారుణ్యము న్వెల్లికొల్పంగదే కుప్పలుం దెప్పలుం దేల వర్షంబు హర్షంబు గూర్ప న్మహాధారలం బూని ధారాధరంబుల్ ధరాదేవిపై జోరునం గారగా జేయవే యంబ నీకు న్నమస్కారమమ్మా. ౬.౩౧

తే. గీ. ఇందరము మానవులము నిన్నేకరీతి । బ్రార్థనముసేయుచున్నాము భగవతీ శ
తాక్షిరూపంబుతో మమ్ము నాదరించి । ప్రోవుమమ్మ సదాదయాంబోధివమ్మా. ౬.౩౨

క. నోటికి మాటలు రా వెటు । చాటెదము భవద్యశంబు జననీ మాకున్
బాటిల్లెను క్షుత్తాపము । గూటికిఁ గొట్టుకొనుచున్న కుజ్జలముగదే. ౬.౩౩

వ. అన నాలించి దేవి దయాపరతంత్రయై ౬.౩౪

## —: శ తా క్షి దే వి వ ర్ణ న ము :—

సీ కుగవిందములబిళ్ళ కొప్పుపై నవరించి రవలుదుద్దులు చెవికవను బూని
గొమేధికపు బులాకీ ముక్కునందిడి పుష్యరాగముల జంపులు ధరించి
వైడూర్యముల బాజుబందుల నమరించి ముత్యాలపేరు రొమ్మున ఘటించి
పగడాల చేకట్లు దగ చేతులను దాల్చి నీలాలపైఠిణీ నెమ్మి దొడిగి

తే. గీ. గరుడపచ్చల మొలనూలు గట్టిచేసి । చెలఁగి మేలిమి జలతారుచీరె గట్టి
లెక్కలేనన్ని కినులతోఁ జక్కనైన । యంబ భూదేవతలకుఁ బ్రత్యక్షయయ్యె. ౬౩౫

వ. ఇట్లు శతాక్షీదేవి ప్రత్యక్షయై. ౬౩౬

మ. వడిఁ బర్జన్యునిఁ గట్టిజేసెఁ గురిసెన్ వానల్ వడిన్ ధాత్రిపై
జడులై జోరున పెన్మసుళ్ళఁబడి వృక్షప్రాంతభూభృద్గుహా
వళి జంతుప్రతతు ల్సరం గొలఁకులన్ వాపు ల్పుపూర్ణస్థితిన్
ఇలముం గూడగ నేళ్లు పెన్వరదలై జాల్వార నిచ్ఛాగతిన్. ౬౩౭

క. అంతటఁ దొమ్మిది రాత్రుల । సంతాపముదీరి జగము సంతోషించెన్
శ్రాంతిఁ దొలఁగ బ్రాహ్మణులకు । సంతర్పణజేసె దేవి సర్వమొసఁగుచున్. ౬౩౮

సీ. పనసకాయలకూర పట్టెడొడ్డించుక తొనలు నూ రొకసారి తినెడువారు
ఆవకాయలు పది యారగించియును మామిడిపండ్లు పెక్కులు గుడుచువారు
చిగురాకుపచ్చళ్ళు చేతినిండుగ మెక్కి వడి చింతపండుచా రడుగువారు
వరుగు దప్పళముల దరుగక భుజియించి వంకాయబజ్జి సాపడెడువారు

తే. గీ. బీర సొర దొండ కాకర బెండ పొట్ల । మేడికాయల కూరలు మెక్కి మెక్కి
మునగ దోటాకు కూరలు బుచ్చుకొనియు । కొసరి గోంగూర పచ్చళ్ళు మెసవువారు. ౬౩౯

వ. ఇట్లు నానావిధ భోజ్యశాకంబుల ఫలంబుల మూలంబుల షడ్రసోపేతంబుగా నన్నంబుల బ్రాహ్మణులం దృప్తులం జేసి. ౬౪౦

క. బంగారుజారి చేకొని । శృంగారవతీసుతల్లి శ్రీదేవి దయన్
పంగుచు లేచుచు చేతుల । బొంగిపొరల నపుడు నేతిబొ ట్లొడ్డించెన్. ౬౪౧

క. ఏమనిచెప్పుదు బాపన । సాముల తృప్తియునుఁ బరమ సంతోషంబున్
సోమరులై వేమారుచు । ధీమహితా బ్రేవుమనుచు దెగఁద్రేపి రొగిన్. ౬౪౨

తే. గీ. లేక లేక కలిగె శాకాది సంయుక్త । మైన యన్న మనుచు నవనిసురలు
దేవి కిడిరి పేరు దివ్యశాకంభరి । యనుచుఁ బిలిచి మ్రొక్కి యాదరమున. ౬౪౩

క. ఆ కోలాహల మసురా । నీకంబులు దెలుపఁగా విని నరపిశితభు
గ్లోకేశుడు దుర్గుఁడు దా । భీకరుఁడై వెదకె దేవబృందము నేయన్. ౬౪౪

శా. అత్యుగ్రుండగు దుష్టదుర్గుఁడు సహస్రాక్షౌహిణీయుక్తుఁడై
దృత్యుద్ధామత దేవతాతతి నిరోధించె న్మతాక్ష్యగ్రసం
స్థిత్యాశామతి త్రాహి త్రాహి కృపయా శ్రీదేవి యంచున్ సురల్
భృత్యత్వంబును జూపి మార్కొనిరి వైరిన్ ధైర్యసంపన్నతన్. ౬౪౫

వ. ఇట్లు దేవదానవు లొండొరులు మార్కొని పోర నతిఘోరంబగు సమరంబుశతవర్షసమాచ్ఛన్న సూర్యమండలంబై యుండ దేవి శరీరంబునుండి కాళికయు, తారిణియు, బాలయు, త్రిపురయు, భైరవియు, రమయు, బగళయు, మాతంగియు, త్రిపురసుందరియు, కామాక్షియు, తులజయు, జంభినియు, మోహినియు, ఛిన్నమస్తయు, గుహ్యకాళియు, నయుత బాహుకయు మొదలగు నిరువదియిద్దరు శక్తులు పుట్టిరి వారలనుండి యరువదినలుగురును, వారలనుండి యసంఖ్యాతలగు శక్తులునుం బుట్టిరి. ఇట్లు శక్తిమయంబై రణరంగంబు మృదంగ శంఖ వీణా నినాద మేదురంబయ్యె. పదిదినంబులలో నక్షౌహిణులెల్ల సమసె. పదునొకండవనాఁడు దుర్గుండు మహోత్సవంబుసేసి రక్తమాల్యాంబరాద్యలంకృతుఁడై రథం బెక్కి దేవీరథంబున కెదురుగా దోలించిన శక్తులద్ధంబయిన వారలం గెల్చి దేవిని మార్కొని రెండుజాములు సంగరంబుసేసె. నంతఁ బదియేను బాణంబులు విడిచి మహాదేవి దుర్గుని వాహనంబుల నాల్గింటను, నొకట సారథిని, రెంట నేత్రంబులను, రెంట భుజంబులను, నొకట ధ్వజమును, నైదింట హృదయంబును, దగులం గొట్టిన నా రక్కసుండు నెత్తురులుగ్రక్కుకొనుచు నేలంబడి యొఱగె. వాని తేజంబు వెడలి దేవీతేజంబునం గలిసె. నంత జగత్త్రయంబు శాంతివహించె. హరి శంకరులం బురస్కరించుకొని బ్రహ్మాది దేవతలు జగదంబకు వందనంబులుసేసి స్తుతించిరి. ౬౪౬

వాహినీవృత్తము. జగజ్జనని నీకు నంజలి యొనర్చి సేవించి భ
క్తిగల్గి స్తుతియింపకే దిగులుపుట్టి యున్నైతి మీ
దిగీశ హరి శంభులన్ దివిజలోకమున్ విప్రులన్
భృగు ప్రముఖ మౌనులన్ బృథువయన్ విలోకించితో. ౬౪౭

క. దుర్గమ రాక్షసబాధలు । నిర్గతములుగాగ లోకనికరము బ్రతికెన్
దుర్గ వని సురలు బొగడగ । దుర్గానామంబు వేడ్కతో దేవి గనెన్. ౬౪౮

వ అని చెప్పి వ్యాసుండు జనమేజయా! సూర్యసోమవంశక్రమంబు లిట్లు నుడివితి, పరాశక్తి మహిమంబే లోకమహత్వంబు. ఎవ్వండు మహారాజయోగంబున నఖండైశ్వర్యసంపన్నుం

దగు వాఁడు తొంటిజన్మంబున భగవత్యుపాసకుండుగా నెఱుంగుము, మరియు. ౬౪౯

మ. భవమూలప్రభిదాకృతార సకల ప్రాణావనాధార సం
స్తవనీయోద్ధతరప్రచార పటు నిస్తంద్రప్రభాపూర దా
నవదుర్గర్వవిదారణప్రథిత నానాకార సంపుష్టమా
నవనాధాగ్ర్యశరీర యౌ భగవతిన్ ధ్యానింప క్షేమంబగున్. ౬౫౦

క. సర్వప్రయత్నముల నా । సర్వేశ్వరి గొలువవలయు జనుఁ డెట్లనఁగా
నుర్విం బొల్లును విడచి య । ఖర్వత ధాన్యంబు గొనిన కర్షకులీలన్. ౬౫౧

క. దేవిని వినఁడిసచో । నీవిశ్వమునందు దుఃఖ మెంతయుఁ గల్గున్
గావున శ్వేతాశ్వతరులు । వేవిధముల గొల్తు రంటఁ బృథ్వీనాథా ! ౬౫౨

వ. "తేధ్యానయోగానుగతా అపశ్య న్దేవాత్మశక్తిం స్వగుణై ర్నిగూఢామ్" అని పలుకుచుందురు. ౬౫౩

తే. గీ భక్తిగలిగియైన భయముచేనైనను । సిగ్గుచేతనైనఁ జెలిమినైన
నితరచింతనంబు లెల్లను విడనాడి । దేవిఁ దలఁపఁ గలుగు దివ్యసుఖము. ౬౫౪

వ. కావునం బరాశక్తి నారాధింపుము పరాశక్తిభక్తుల చరిత్రంబులు వింటివికదా, యింక నీ వడుగునది యెద్ది ? యనిన జనమేజయుండు ౬౫౫

## —: గౌరీ లక్ష్మీ వాణీ చరిత్రములు :—

క. గౌరిని లక్ష్మిని వాణిని । నా రుద్ర రమేశ విధుల కర్పణసేసెన్
ధీర యగు దేవి మరలన్ । వారికి దలిదండ్రు । లేల వచ్చిరి చెపుమా. ౬౫౬

తే.గీ. మూలశక్తినిఁ బుట్టిన మువురు శక్తు । లేల యితరుల కన్యలై యెసగి రిద్ది
నసంభావ్యమై యొప్పుఁ గాన నాకు । చిక్కు చక్కఁగ వదలించి చెప్పు మనఘ ! ౬౫౭

చ. అనవుడు నో నరేంద్ర వినుమాస్థ పరమాద్భుత మీ చరిత్రమున్
విననగుఁ దొల్లి దేవి యతినిర్మల మువ్వుర శక్తులన్ సృజించి యి
చ్చెను భువనేశ్వరు ల్మువురు చేకొని రాదట నొక్కసారి లీ
లన జగము ల్జయించిరి హాలాహలనామకులైన రాక్షసుల్. ౬౫౮

చ. వనజభవుం డొసంగె వరవర్గము వారికి దాన గర్వమున్
గొని మధువైరి శంకరులఁ గొట్టఁగబోయిన వారు వారులుం
బెనఁగొని పోరి రొక్కమొగి బెల్లుగ నర్వదివేలయేండ్లు సా
ధనముల కోడరైరి వర దార్ఢ్యమునన్ దితిపుత్రకుల్ నృపా ! ౬౫౯

వ. విసుగుచు వారలన్ విడచి వీరవరేణ్యులు పెద్దలిద్దరున్
గుసగుసలాడుచుం బఱచి గొబ్బున నాత్మపురప్రవేశమున్

మసలకచేసి యాత్మ నభిమానము నొందగఁ జూచి నవ్వి ర
బ్జసరుహనేత్ర లార్యజనవేద్యులు లక్ష్మియు గౌరియున్ వెసన్. ౬౬౦

క. చీ చీ నవ్వకుమని యతి । నీచోక్తులఁ బల్కి రపుడు నిజ భార్యల త
ద్దీచతురశ లడుగంటెను । మేచకధవళాంగులకును బృథ్వీనాథా ! ౬౬౧

క. మాయాదేవీమహిమము । నాయిరువురు గానరయిరి యవనీనాథా
యే యితరుల కది సాధ్యము । హా యేమని పొగడుదున్ మహాదేవి నిఁకన్. ౬౬౨

క. అంతట సతి హరు విడచెన్ । బంతమ్మున సిరియు విడచెఁ బద్మదళాక్షున్
గంతు లుడిగె రంతు లుడిగె । సంతాపము హరి హరులకు సమకూరె నృపా ! ౬౬౩

తే. గీ. అజుడు వారిఁ జూచి యక్కజంపడి హేతు । వేమటంచు జింత నెనసి యొనసి
కనులు మూసి ధ్యానగతి నిడి భగవతి । మాయయంచుఁ దలచె మనుజనాథ ! ౬౬౪

క. తన శక్తి బలముకొలదిన్ । వనజభవుడు వారి కార్యభారము దా మో
చెను గొన్నినాళు లంతటఁ । దనలో నిట్లని తలంచె ధరణీనాథా ! ౬౬౫

తే. గీ. అయ్యయో హరియు హరు డిట్లైరి పీర । లెట్లు మరల స్వశక్తుల నెనయగలరు
అంచు మన్వాదులను దన యాత్మజులను సనకముఖ్యులఁ బిల్చి యిట్లనుచు బలికె. ౬౬౬

తే. గీ. తపముసేయంగనోప నిత్తరిని గార్య । మున్నయది భక్తి యుక్తిచే నొప్ప శక్తిఁ
గొలువు దన వారు సంతోషకలితు లగుచు । గాననాంతరమున కేగి కడునియతిని.

క. ఆరాధించిరి శక్తిని । ధీరులు హిమవద్గిరీంద్ర దివ్యతటమునన్
దారూఢధ్యానోన్నతి । నోరిమి నొకలక్షయేడు లుర్వీనాథా ! ౬౬౮

వ. అంతఁ బాశాంకుశవరాభయ చతుర్బాహుసమేతయుఁ, గరుణారసతరంగితాంతరంగయుఁ
ద్రినేత్రయు నయి పరాశక్తి ప్రత్యక్షమైనం గని. ౬౬౯

ఉత్సాహ. సర్వజనని విశ్వరూప సాధులోకపాలినీ
నిర్వహింతువమ్మ నీవు నిఖిలలోకకార్యముల్
గర్వులై వారిఁ గొట్టి ఘనులఁ బోచు నిన్ను నా
థర్వణములు సంస్తుతించుఁ దంత్ర మంత్ర శక్తిఁగా. ౬౭౦

క. పదుగుం బేకయుగా నె । ల్లెద లింగాంగములఁ గూర్చి లీల గణింపన్
బడియెడు సూత్రాత్మయ నాఁ । గడసరి వీ వఖిలలోకకారిణి తల్లీ ! ౬౭౧

తే. గీ. ప్రాజ్ఞుడనియును మఱియును బ్రత్యగాత్మ । పరగ వైశ్వానరుండనఁ బరగు దీవు
సచ్చిదానందరూపిణి సర్వశక్తి । సర్వలక్ష్యాత్మమూర్తివి జనని నీవు. ౬౭౨

సీ. అంతఁ బరాశక్తి యతిదయామూర్తియై ప్రత్యక్షయై నిల్చి పరమభక్తి
దన్నుఁ గొల్చుచునున్న దక్షాదులను జూచి తెలుపుడు మీ వరంబుల నటన్న
దక్షుండు దేవితో నక్షీణ సౌమ్యతాదక్షుడై పల్కెనో తల్లి నీవు
హరికిని హరునకు నంగబలం బిచ్చి శక్తిలాభంబు నొసంగుమింక
నా కులంబునకు జన్మంబు నొందుము నీవు నీదు పూజావిధి నెమ్మి దెల్పు

తే.గీ. మనిన విని దేవి నా శక్తులైన గౌరి । నంబుజాలయ హరహరు లవమతిగని
రందువలనను వారల కట్టి యల్ప । భావము లభించె శక్తుల బాసి రతుల. ౬౩

క. నాయెడ నవమానంబుం । జేయంగారాదు మీరు చేరి కొలువ నా
కీ యెడ దయగల్గెను హరి । కా యభవునకున్ స్వశక్తు లావేశించున్. ౬౪

క. నీయింట గౌరి పుట్టు మ । దీయంబగు నంశములను దెలియు మిక సుధా
తోయధిలో రమ పుట్టును । బాయక శివ కేశవులకు భార్యలు వారల్. ౬౫

క. మాయాబీజజపంబుం । జేయుడు వాంఛితములెల్ల జేకురు మీకున్
నాయెడల భక్తిగల్గిన । మీయెడలం గరుణగల్గి మెలగెద నేనున్. ౬౬

వ. ఇట్లు వచించి దేవి యంతర్ధానంబు నొందె. నంత దక్షాదు లరిగి యేతద్వృత్తాంతం బంతయు హిరణ్యగర్భున కెరింగించిరి. హరిహరులు స్వస్థులై గర్వంబు లుడిగి శక్త్యనుగ్రహంబునకుం బాత్రులై యుండి రిటు కొంత కాలంబు జరిగిన పిమ్మట నొకానొకప్పుడు శాశ్వతంబైన తేజంబు దక్షునియింట గన్యకారూపంబున నుద్భవిల్లిన దక్షగేహంబున మహోత్సవంబు వాటిల్లె. మరియు, ౬౭

సీ. సాధుల డెందముల్ చల్లనై యలరారె శుభలీల దేవదుందుభులు మొరసె
చారునీరములతో నేరులు ప్రవహించె ప్రభలతో భానుబింబంబు వెలిగె
మహి నెల్లచోటుల మంగళంబులు మీరె వలపుమించెడు పూలవాన గురిసె
సంభ్రమంబు లేదు నిస్తంద్రతతో బొంగె దిక్కులు నైర్మల్యభాక్కు లయ్యె

తే. గీ. కూడి గంధర్వులెల్లరు బాడి రెలమి । నాడి రచ్చరవెలదు లత్యాదరమున
దక్షుని గృహంబునం జగద్ధాత్రి ముద్దు । పుత్రియై శుభధాత్రియై పుట్టినపుడు. ౬౮

క. దక్షు డుమాదేవిని దా । వీక్షించి సతీ యటంచు బిల్చుచు నా ఫా
లాక్షునకు నిచ్చె గొన్నా । ళ్ళక్షీణోల్లాస సహితయై హరు గొల్చెన్. ౬౯

క తరువాత దక్షుజన్నము । తరి గోపమునూని మూర్తి దరలిచి హిమవ
ద్గిరికూతు రగుచు బొడమెన్ । హరుడే పెండ్లాడె గౌరి నవనీనాథా ! ౭౦

చ. అనవుడు నో మునీంద్ర జగదంబ నిజాంగము నెట్లుబాసె ద
క్షునిగృహమందు మిక్కిలి యశోభనమైన పనిం బొనర్చినం

దునకు గతం బొకొండు గలదో యటువంటి గుణాఢ్య దుఃఖబం
ధనములకగ్గమాయెనె కనంగ విచిత్రము విస్తరింపుమీ. ౬౮౧

చ. అన విని వ్యాసుడో నృపవరా విను దేవి కనుగ్రహంబునం
జనులకు సౌఖ్యమబ్బు నది చాలకయుండిన దుఃఖహేతువై
తనరును గాన దెల్పెదను దక్షునిపుత్రిక దాహహేతువున్
విను దది పాపశాంతికిని విస్తృతకారణరూపమై తగున్. ౬౮౨

సీ. దుర్వాసుడను ముని తొల్లి జంబూనదేశ్వరి పాదముల గొల్చి భక్తినున్న
తరి దేవి తృప్తయై తన కంఠమున నున్న క్రొత్తపూదండ చొక్కాటిని దివిచి
మెడవైవ నది గొంచు మింటిపై కెగసి చెచ్చెర దక్షునింటికి జేరి యందు
దాక్షాయణికిని వందనము గావించి సుఖోపవిష్టుండయి యున్నతరిని

తే గీ. దక్షు డా దండ గనుగొని తాపసేంద్ర । యేద దీ నంత నావుడు నిది మహేశ్వరీ
ప్రసాదంబు నావుడు ప్రీతి దాని । దనకు నిమ్మన నత డిచ్చె దక్షణమున. ౬౮౩

సీ. ఆ దండ గైకొని యది తన కేళికామందిరంబున బెట్టి మానసమున
దాని తావులకు నెంతయు నుబ్బుచుండంగ భగవతి కోపించి భర్గునందు
శాంకరియందును సరగ ద్వేషము బుట్టునట్టుల గావించె నంత వాడు
యజ్ఞ మొనర్చుచో హరు జీరకున్న సతీదేవి కోపించి దివ్యమైన

తే. గీ. తనదు మూర్తిని శిఖియందు దగ్ధభావ । మొందగా జేసె యోగధీయుక్తి ననిన
బిమ్మట మహేశ్వరుడు దన వెలది బాసి । యేమిగావించె నని నృపుం డెలమి నడుగ. ౬౮౪

క. ఆపైన జరిగినట్టి క । థాపుంజము నుడువ నాకు దరమా ప్రళయం
బేపుట్టె నేమిచెప్పెదు । గోపానల మొదవె శివునకున్ మనుజేంద్రా ! ౬౮౫

తే. గీ. రుద్రుకోపాగ్నిచే నతిరౌద్రుడగుచు । భద్రకాళీగుణాన్విత భద్రు డగుచు
నిఖిలలోకప్రచాలనిర్నిద్రుడగుచు । వీరభద్రుండు పుట్టె నుర్వీతలేంద్ర ! ౬౮౬

వ. ఇట్లతిరౌద్రాకారుండైన వీరభద్రుండు పుట్టి, ప్రళయవేళాసముద్భూతమహానటుంబోలె నటనంబుసేసి నిఖిల దేవ ముని వ్రాతంబుల మనంబులకు భీతి వాటిల్లి చెల్లాచెదరై పారం ద్రోలి దక్షాదుల దెగనరకిన బ్రహ్మాదులగు సకలసురలు ఋషిగణసమేతులై ఖండపరశుం బ్రార్థింప నతండు దయాళుండుగావున దక్షునకు బస్తమస్తకం బిడి బ్రతికించి యజ్ఞవాటంబున దహ్యమానయగు చిత్కళను స్కంధంబున నారోపించుకొని హా సతీ! హా సతీ ! యని రోదనంబుజేయుచు భ్రాంతచిత్తుండై లోకంబులుపట్టి తిరుగుచుండుటం జూచి బ్రహ్మాదులగు దేవతలు విష్ణు బ్రార్థింప నతండు ధనుర్బాణంబులు పూని పోయి సతీదేవి యవయవంబుల నిజబాణంబుల ఖండించి భూమిన్ వెదజల్లినం గాంచి యా ఖండంబులెచ్చ టెచ్చటం బడియె నచ్చటచ్చట శంభుండు నిఖిలాంశముల నిల్పికొని వసియించియు,

సతీవిరహాతురుండై జప ధ్యాన సమాధులచే గాలంబు గడుపుచుండె. నేటికిని నయ్యే స్థానంబుల మనుజులు పురశ్చరణాది కర్మంబులు సేసిరేని మహాఫలదంబులగు 'ననిన జనమేజయుండు. ౭౮౭

చ. మునివర యా సతీవనిత మూర్తులు గల్గినచోటు లెవ్వి భూ
మిని దదుదారధర్మముల మేలిమి సంఖ్యయు, నామముల్ మహా
వినయముతోడ వేడెదను వేగ వచింపుము విన్నదన్క నా
మన మొకయింతయుం గుదిరి మట్టున నిల్వదు సంయమీశ్వరా! ౭౮౮

క. అనిన విని వ్యాసు డిట్లను। ఘనశుభదములగును గాళికాపీఠంబుల్
వినుము వివరించెదను నీ। మనమును గదలంగనీక మట్టున నిడుమీ. ౭౮౯

సీస మాలిక } ఆనందకాననంబందు విశాలాక్షి। యలఘు ముఖక్షేత్రమందు గౌరి
నైమిశారణ్యంబునను లింగధారిణి। కమనీయ సుప్రయాగమున లలిత
గంధమాదనమున గాముకీశక్తియు। పుణ్యద మానసంబునను గుముద
దక్షిణక్షేత్రభూస్థలి విశ్వకామయు। మహితోత్తరమును గామప్రపూర్ణ
గోమంతభూస్థలి గోమతీదేవియు। హస్తినాపురిని జయంతి మరియు
మందరభూధరమహిఁ గామచారిణి। కాన్యకుబ్జంబున గౌరి యంద్రు
తత లీల చైత్రరథమున మదోత్కట। మలయధరాధరమహిని రంభ
ఏకామ్రపీఠమహిని గీర్తిమతి సుమ్ము। విశ్వంబునందు విశ్వేశ్వరియును
పుష్కరాఖ్య క్షేత్రమున బురుహూతయు। ముఖ్యమౌ హిమవంతమునను మంద
చారు కేదారాన సన్మార్గదాయిని। స్థానేశ్వరమున భవాని యంద్రు
గోకర్ణపీఠంబు గొను భద్రకర్ణిక। మహిని శ్రీగిరియందు మాధవియును
భువిమీద బల్వరంబున బిల్వపత్త్రిక। భద్రపీఠంబున భద్ర యంద్రు
స్వావరాహాఖ్య శైలంబునను జయ। కమలాలయంబున గమల యంద్రు
రుద్రకోటిస్థలి రుద్రాణి యను దేవి। పూజ్యమౌ లంజరంబునను గాళి
భూరి సాలగ్రామమున మహాదేవియు। నతుల మాహాలింగమందు గపిల
సుందర శివలింగమందు జలప్రియ। మాయాస్థలమున గుమారి యంద్రు
మాకుటక్షితిమీద మకుటేశ్వరీదేవి। సంతానపీఠకస్థలిని లలిత
మహనీయ గయలోను మంగళాదేవియు। బురుషోత్తమాఖ్యయౌ పురిని. విమల

ఘన సహస్రాక్షంబునను నుత్పలాక్షియు । నొగి హిరణ్యమున మహోత్పలయును
భద్రదంబున విపాశవమోఘాక్షి । యాసుబాళమున నారాయణియును
మొగి బుండ్రవర్ధనమ్మున బాటలాఖ్యయు । సుత్రికూటపు రుద్రసుందరియును
విపులంబునందును విపులమహాదేవి । యల మలయాద్రి గల్యాణియండ్రు
సహ్యభూధరమహాస్థలి నేకవీరయు । రామతీర్థమునందు రమణ యండ్రు
ఆహరిశ్చంద్రంబునందు జంద్రికయును । వరయమునా మృగావతియు నండ్రు
కోటితీర్థమునందు గోటరీదేవియు । మాధవవనమందు మరి సుగంధ
గోదావరీనదీకుంభినిని త్రిసంధ్య । దేవికాస్థలిని నందినియు నండ్రు
హరిగంగాద్వారమం దతిప్రియయును । ద్వారావతిని రుక్మిణీరమణియు
అతిశుభ శివకుండమందు శుభానంద । బృందావనంబున బ్రీతి రాధ
రమ్యమైతగు మధురను దేవకీదేవి । చిత్రకూటంబున సీత యండ్రు
పాతాళమందును బరమేశ్వరీదేవి । యల వినాయకభూమియందున సుమ
కరవీరమందును గనగ మహాలక్ష్మి । యుష్ణతీర్థంబున నొప్పు నభయ
వింధ్యంబునందును వింధ్యాధివాసిని । యొనర నాపర్వతంబున నితంబ
వైద్యనాథంబున వరలు నారోగ్యయై । మాండవ్యమందును మాండవియును
ఘనమహాకాలమందును మహేశ్వరియును । మాహేశ్వరీపురమందు స్వాహ
ఛగలండమునను బ్రచండాఖ్యయై యొప్పు । నిల వరారోహ సోమేశ్వరమున
అల కురండకపురమందు చండికయును । నామహేశ్వరిని సోమాఖ్య యండ్రు
భువి బ్రభాసంబున బుష్కరావతి యయ్యె । మహి సరస్వతీదేవి మాతయయ్యె
రహి దటంబునను బారావార యననొప్పె । నా పయోష్ణిని బింగళాఖ్య యయ్యె
నవని మహాలయమందు మహాభాగ । కృతశౌచమందు సింహికయు నయ్యె
నరయ గార్తికమున నతి శాంకరియు నయ్యె । నుత్పలావర్తమం దొప్ప లోల
శోణసంగమమున సొరిది సుభద్రయౌ । సిద్ధవనంబున జెలగు లక్ష్మి
భరతాశ్రమంబున బరగు ననంగయై । జాలంధరమున విశ్వముఖి యయ్యె

కిష్కింధపర్వత క్షితిని దారాదేవి । దారువనంబున దనరు బుష్టి
కాశ్మీరమండల క్ష్మాతలంబున మేధ । హిమగిరి ధారుణి నెసగు భీమ
విశ్వేశ్వరీపురీ విశ్వంభరను దుష్టి । గాయావరోహణ క్ష్మానుమాత
ముదమొప్పగ గపాలమోచనంబున శుద్ధి । యలర శంభోద్ధారమందును ధర
పిండారకంబున దండిమీరును ధృతి । చంద్రభాగాతటాచలను గళయు
మచ్ఛోరమందును మరి శివధారిణి । యుత్తమ బదరియం దురసి యయ్యె
నుత్తరకురువందు నొగి నౌషధియు నయ్యె । శ్రవణాలయంబున దివిరి నిధియు
ఆ కుశద్వీపమం దలర గుశోదక । భర్గసన్నిధియందు బార్వతియును
వేదవదనమందు వెలయంగ గాయత్రి । బ్రహ్మపురిని సరస్వతియు నయ్యె
దేవలోకంబున దెలియ నింద్రాణియు । సూర్యబింబమునందు సుప్రభయును
హేమకూటంబున నెనయ మన్మథ యయ్యె । మాతల వైష్ణవీమాత యయ్యె
తనరంగ గుముదంబునను సత్యవాదిని । వేణాధరాస్థలి వెలయ నమృత
అశ్వత్థమందును నల వందనీయయు । నచ్చరల దిలోత్తమాఖ్య యయ్యె
మానసమందును మరి బ్రహ్మకళ యయ్యె । సతులలోపల నరుంధతియు నయ్యె

తే. గీ. సర్వదేహులయందును శక్తి యయ్యె । నూటయెనిమిది పీఠముల్ సూటిదనర
దేవి వసియించుచుండు సతీశరీర । సంభవములైన యనయవచయ మహిమను. ౬౯౦

క. ఈ యావ త్తీర్థంబులు । శ్రేయోదాయకములయ్యె క్షితిలో మనుజుల్
బాయక సేవింపంగా । బోయిన నైహికసుఖగల్గు ముక్తియు గల్గున్. ౬౯౧

క. ఈ నూటెన్మిదిక్షేత్రము । లేనోటం బడునొ వారి కిష్టార్థంబుల్
సూటిగ దయచేయు నిరా । ఘాటంబుగ లోకమాత కరుణామయియై. ౬౯౨

క. ఈ నామంబుల నెవ్వడు । మానుగ లిఖియించు గ్రంథపత్రములందున్
వానికి గలుగును శ్రీ వి । ద్యా నానాసుఖము లంబ యనుకంప నృపా! ౬౯౩

వ. అని యిట్లు పలికిన వ్యాసుని వాక్యంబుల కలరి జనమేజయుండు మునీంద్రా! దాక్షాయణి హిమవద్గిరియందు బ్రాదుర్భవించె నని తెలిపితి వది యెట్టిదని యడిగిన వాసవీ నందనుండు. ౬౯౪

క. హరుడు సతీవిరహమ్మున । దిరిగి దిరిగి పరమనియతి దేవీధ్యాన
స్ఫురితమునివేషధరుడై । పరమతపము సేయదొడగె బార్థివముఖ్యా! ౧౯౫

క. అప్పుడు లోకంబెల్లను । గప్పుకొనియె సర్వదుర్వికారగుణంబుల్
చెప్పగ వశమే ముఖములు । విప్పారగ గాంతిరహితవృత్తి ఘటిల్లెన్. ౧౯౬

తే. గీ. గోరుచుట్టుపై రోకలి గూలినట్టు । లప్పుడే తారకాసురుం డనెడివాడు
బ్రహ్మవరమున బ్రబలి నిర్జరుల నోర్చి । జగముల ననేక బాధలు సలుపుచుండె. ౧౯౭

క. శివునికుమారుడు గాకిక । నెవడును వానిం జయింప డిలలో నని వా
గ్ధవుడు బలికిన కతంబున । శివుజాడలు సూచి వాడు సెలరేగె నృపా! ౧౯౮

తే. గీ. ఆలులేని శివున కాత్మజుడై పుట్టు । శివుడు వెంగలాయె చెట్టు కింద
బుట్టపెరుగ దపము బూనియున్నాడు నే । దనుచు బొంగె దారకాసురుండు. ౧౯౯

ఉ. అంతట దేవలోకము దశాకృతిధారిని జేరి మ్రొక్కి దై
త్యాంతకి తారకాసురుని యత్యధికంబగు పీడ కోర్వలే
మింతటనైన దీర్ప మన మేమ సమర్థులగాము లోకవి
భ్రాంతికి హేతువైన మన పాలిటి దేవిని దల్చుకొండికన్. ౨౦౦

క. దేవిని మరచిన కతమున । యీవిధమున బాధలెల్ల యేర్పడె మీకున్
గావున హిమవద్గిరికిన్ । బోవలయును మాత గొల్వబోలును రండీ. ౨౦౧

వ. అని సర్వదేవతలం దోడ్కొని నారాయణుండు హిమవంతంబునకుం జని యచ్చట దేవి
ప్రీత్యర్థంబు నానావిధంబులైన ధ్యానపురశ్చరణంబు లాచరించి దేవీయజ్ఞంబు చేసి
పరమభక్తిసమేతులై భగవతీప్రసాదంబునకు వేచియుండ నొకనాడు చైత్ర శుద్ధనవమీ
శుక్రవారంబున కోటిసూర్యప్రతీకాశంబును; జంద్రకోటిశీతలంబును, విద్యుత్కోటిసమా
నాభంబును, నరుణంబును, భూనభోంతంబులు నిండ స్త్రీరూపంబునుంగాక, పురుషరూపం
బునుంగాక యొక్క తేజంబు పరిభ్రమింపం గాంచి యాది నొక్కింత భయంబంది ధైర్యం
బులు తెచ్చికొని తద్దివ్యమంగళవిగ్రహంబుం బరికించి దేవీవిగ్రహంబుగా నిశ్చయించి
స్తోత్రంబులు సేయం దొడంగిరి. ౨౦౨

చ. అతితరకమ్రగాత్రి నవయౌవనశోభిత సుజ్జ్వలత్కుచ
ద్వితయసరోజకుట్మలక దివ్యరణద్వరకింకిణీనినా
దిత తతమేఖలావలయ దీప్తసువర్ణమహాంగదాదిభూ
షిత మహనీయరత్నసురుచిప్రవణయుగ్గలబంధరాజితన్. ౨౦౩

చ. విలసితకైతకాకలిత విస్తృతనీలశిలీముఖాళికుం
తల గణనీయసైకతనితంబ విరాజితరోమరాజి గం

ధిల ఘనసారఖండవితతిప్రవిమిశ్రితచారువీటికా
లలితసుపూరితానన చలత్కనకశ్రవభూషణచ్ఛటా
ధళధళితాస్య నర్ధహిమధామలలాటమనోహరభ్రువన్. ౨౦౪

ఉ. కోకనదాక్షి సన్మధురకోమలబింబసమోష్ఠి నిర్మల
శ్రీకరకుందకుట్మలరుచిప్రకరప్రదదంత మౌక్తిక
ప్రాకటహారసుందరస్ఫురన్మణిజాల కిరీటచంద్రరే
ఖాకలితావతంసిని వికాసవిరాజితచారుమల్లికా
స్తోకసుమాలికానికరశోభిత నిస్తులచారుకైశికన్. ౨౦౫

మ. విలసత్తుంకుమబిందుఫాలతలశోభిస్ఫార నేత్రత్రయీ
లలితాంచన్ముఖపద్మకోశవిపులాఢౌకాంకుశోద్యద్వరా
తులనాభీతిచతుర్భుజాసహిత విద్యుద్రక్తవస్త్రాఢ్య సు
జ్జ్వలసంఫుల్లసుధావమత్తుసుమశోభాపూర శృంగారిణీ ! ౨౦౬

ఉ. దేవనమస్కృతన్ నిఖిల దిక్పరిపూరితసర్వమాత లో
కావళి మోహినిన్ సుముఖి నంబను మందమృదుస్మితాననన్
శ్రీవిలసత్కృపాకృతిని జేరి కనుంగొని హర్షయుక్తులై
దేవికి మ్రొక్కి నమ్రులయి దీనతదోపగఁ బల్కి రందరున్. ౨౦౭

శా. దండంబో ప్రకృతీ మహాగ్నినిభభద్రాసత్తపోజ్వాలికా
దండంబో జగదండధాతివరదా ధైవేశ్వరీ శాంకరీ
దండంబో కరుణామయీ విధినుతా ధర్మార్థకామాదిదా
దండంబో శ్రితపోషిణీ కలితమేధాకాళరాత్రీ శివా ! ౨౦౮

ఉ. దండము విశ్వరూపిణి సుధామయి భారతి వైష్ణవీ సతీ
దండము స్కందమాత శుభదాయిని యీశ్వరి దక్షసంభవా
దండము లక్ష్మిశక్తి పతితవ్రజపావని శ్రీసరస్వతీ
దండము కాళరాత్రి నిరతాఘనసూత్రపవిత్రరూపిణీ ! ౨౦౯

ఉ. రజ్జువుజూచి పామని తలంచి యట్టు లనిత్యమైన యీ
ముజ్జగమున్ దిరంబనుచు మోహము నొందగఁజేసితమ్మ యీ
యజ్జన మమ్ము బ్రోవగదవమ్మ కృపాసహితాంతరంగవై
వెజ్జువు నీవకావె యవివేకపు పెద్దతెగుళ్ళు మాన్పగన్. ౨౧౦

వ. అని యిట్లనేకవిధంబులం బృందారకులు ప్రార్థించిన విని దేవి మదకోకిలకాకలీనినా
దంబున నిట్లనియె. ౨౧౧

క. మీకోరిక లొసగెడి కరు । ణాకలితను నేను గలుగ నమ్ముడు శుభమౌ
నాకుం భక్తుల బ్రోచుట । యేకద పని వేఱయున్నదే సురలారా ! ౨౧౨

క. అన విని సుర లో జననీ । యనుపమతేజుండు తారకాసురుడు మమున్
ఘనపీడాకలితుల జే । సెను గావున నిలువలేక చేరితిమి వినున్.	౨౧౩

క. హరునకు బుట్టిన కొమరుఁడు । హరియించును వాని శివున కతివయె లే దే
తెఱపునఁ దారకహననము । జరుగున్ మా కభయమిచ్చి సాకఁగదమ్మా !	౨౧౪

తే.గీ. అనవుఁడును దేవి పల్కె నో యమరులార । గౌరి యనుపేర నాశక్తిఁ గలుఁగు
మంచుఁగొండకుఁ దాని శివునకు గొమ్మగాఁగఁ జేయుఁ దది మీకు భద్రంబు సేయు బొందు.

క. ఆ మాటను విని హిమవ । ద్భూమిధరుఁడు భక్తిఁ గ్రోఁడ భూతేశ్వరికిన్
నేమమున మ్రొక్కి తల్లీ । ధామంబు పవిత్రమయ్యెఁ ధన్యుఁడనైతిన్.	౨౧౬

తే. గీ నీవు నాకు నందినివిగాఁగ నావంశ । మెంత ధన్యమగు మహేశ్వరీ జ
గత్త్రయంబు నీదు కడుపులో నిడుకొని । యేలుచున్నదాన వేమిచెప్ప ?	౨౧౭

తే. గీ. సకలవేదాంతపక్కులఁ బ్రకటమయిన । నీ స్వరూపంబుఁదెల్పి మన్నించు నన్ను
యోగమును భక్తియును జ్ఞానమో సమస్త । వేదకర్త్రి పురాణి నన్నాదరించి.	౨౧౮

వ. అతిగుహ్యంబయిన వేదాంతంబు నా హిమవంతున కిట్లని దేవి యుపదేశించె.	౨౧౯

## — దేవీ గీతలు —

క. మోహాపహంబులగు సద్వ్యాహారంబుల వచింతు నమృతాశనులా
రా హిమవంతుడా యటంచున్ । సోహంభావమును దేవి యుపదేశించెన్.	౨౨౦

తే. గీ. అన్నిటికిబూర్వ మేన యన్యంబులేదు । తత్తు నాత్మయు చిత్తు సంవిత్తు బ్రహ్మ
మప్రతర్క్య మనిర్దేశ్య మనుపమం బ । నామయంబును నేనసు మ్మమరులార !	౨౨౧

తే. గీ ఆత్మ కెసగు స్వతస్సిద్ధయైనశక్తి । దాని మాయ యటంద్రు తత్వజ్ఞు లెపుడు
నది సతియుగాదు తెలియుడీ యసతిగాదు।సూవె యుభయంబుగాని వస్తు వమృతంబు.

తే. గీ నిప్పునందును వేడిమి నీరజాప్తు । నందు బ్రభయును జంద్రునియందు జ్యోత్స్న
యుండురీతిని నాయందు నుండు మాయ । మాయలోబుట్టు గాలకర్మములు సతము.

తే. గీ. భేదమింతయులేక నాలోదలిర్చి । కలను గల్పించు వ్యవహారగతులబోలె
గూడితి స్వశక్తితోడనుగూడి సర్వ । బీజరూపిణినైతి నిర్భీతినైతి.	౨౨౪

క. చైతన్యసమాయోగము । చేత నిమిత్తత్వమొంది చెలగితి నింకం
భూతపరిణామవశమున । నాతత సమవాయినైతి నంచితలీలన్. ౨౨౫

క. కొందరు తపమందురు మరి । కొందరు తమమండ్రు మరియు గొందరు జడమం
చందురు కొందరు జ్ఞానం । బందరు కొంద రొగి మాయ యందురు జగతిన్. ౨౨౬

క. కొందరు ప్రధానమందురు । కొందరు ప్రకృతియని యండ్రు గొంద రజయటం
చందురు గొందరు శక్తియ । యందురు నానావిధముల నయ్యైయెడలన్. ౨౨౭

తే. గీ. మరియు శైవాగమవిదుల్ విమర్శయండ్రు । వేదతత్త్వార్థవేదు లవిద్యయండ్రు
తెలియ నామంబు లేరీతి జెలగుచున్న । నస్మదీయంబయిన శక్తి యది యొకండె. ౨౨౮

తే. గీ. జ్ఞాననాశకమైయు దృశ్యమయినందు । వలన మాయ జడత్వంబు బడసె జుమ్ము
అలర జైతన్య మెపుడు దృశ్యంబుగాదు । గాన జడముగాదు నిక్కంబుగుండు. ౨౨౯

క. తనయంత దాన వెలుగున్ । బొనరగ చైతన్యమెపుడు ముకుకొని యితరం
బు నపేక్షింపదు వెలుగగ । ననవస్థ ఘటించు గాన నదియే వెలుగౌ. ౨౩౦

తే. గీ. కర్మకర్తృవిరోధంబు గలుగుగాన । దీపమునుబోలె దనకు దా నోపి వెలుగు
వెలుగజేయ దదెట్లును వెలుగుచుండు । నిట్లు చెప్పిన దోషంబు నెనయకుండు ౨౩౧

తే. గీ. నాదు సంవిత్తు నిత్యంబు నమ్ముడింక । మెళకువను గల నిదురను మెరయు దృశ్య
చలనసంబంధియగు వ్యభిచార మొప్పు । గాని సంవిత్తు వ్యభిచారగతి బడయదు. ౨౩౨

ఉ. ఎయ్యది కర్మసాక్షియగు నెయ్యది యవ్యభిచారి యట్టి య
క్షయ్య మదీయ సంవిదనఘప్రథితాంగము నిత్యమంచు మీ
రెయ్యెడలం దలంపుడు సుఖావహముం బరమంబు సత్యమున్
చయ్యన దీని గానని విచారము సారవిహీన మెన్నగన్. ౨౩౩

క. నే నపరిచ్ఛిన్నను మరి । కా నితరం బద్ది మిథ్య గావున నేనే
జ్ఞానంబను సుఖమును మరి । కానుసుమీ ధర్మరూప నట్టిగ గనుడీ. ౨౩౪

క. సత్యము పూర్ణ మసంగము । నిత్యము నద్వైత మధిక నిర్మలముసుమీ
కృత్యంబులెల్ల మిథ్యా । మత్యనుభూతములు నమ్ము మహీధరవర్యా ! ౨౩౫

తే గీ. కాలకర్మస్వభావసంగతులు మాయ । వలన నుద్భవ మొందుచు గలనుబోలె
సర్గమెల్లను గలుగును సమయుచుండు । నా యలౌకికరూపం బనారతంబు. ౨౩౬

తే. గీ. తత్త్వములకెల్ల నాదిభూతంబుసుమ్ము । సచ్చిదానందమూర్తియు సర్వకర్మ
లింగమును దేశకాలాది సంగవర్జి । తంబు హ్రీంకారమంత్రవాచ్యంబు నమ్ము. ౨౩౭

తే.గీ. ఆదితత్త్వంబునందుండి యాకసంబు । శబ్దతన్మాత్రకంబయి సంభవించె
హరిపదంబుననుండి స్పర్శాత్మకంబు । నగుచు సంభవమయ్యె మహానిలంబు. ౨౩౮

తే.గీ. వాయువందును జనియించె వహ్నిరూప । గుణముగల్గి శిఖినిబుట్టె గురుజలంబు
రసగుణము గల్గి జలమున గ్రమముమీర । గంధగుణవత్తు ధారుణి గలిగె జుండు. ౨౩౯

తే.గీ. శబ్దమొక్కటె గుణమాకసంబునకును । వాయువునకును స్పర్శరవములు రెండు
వహ్నికిని స్పర్శరూపరవములు మూడు । వనమునకును స్పృగ్రూపరవరసములును
ధరకు బైనాల్గు గంధంబు దప్పవంద్రు. ౨౪౦

వ. శబ్ద స్పర్శ రూప రస గంధంబులతో వెలయు భూతజాలంబులం గలసిన ధాత్రియెల్ల మహత్సూత్రంబనంబడు. ఆదియె లింగంబునాంబడు గుణసమష్టియ లింగదేహంబగు. నవ్యక్తంబు కారణదేహంబగు. బంచీకరణమార్గంబునుంబట్టి స్థూలంబులు గలిగె నెట్లనిన, భూతంబులు తమ తమ గుణంబులతో నితరగుణంబులం గలసి యైదైదుగా నగుచుండు, నందువలన విరాడ్దేహంబగు. నదియె స్థూలంబు, పంచభూతగతంబులగు సత్త్వాంశంబులచే శ్రోత్రాదుల యుత్పత్తియగు, ప్రత్యేకంబుగా మిళితంబులగు జ్ఞానేంద్రియంబులచే నంతఃకరణంబగు, నది చతుర్విధం బెట్లనిన సంకల్ప వికల్పాత్మకంబు మనంబునాంబడు, సంశయహీనంబయిన నిశ్చయజ్ఞానంబు బుద్ధినాంబడు, ననుసంధానచతురంబు చిత్తంబగు, నహంకారరూపంబగు నాత్మవృత్తి యహంకారం బనంబడు, మరియు రజోంశంబులచే బుట్టిన కర్మేంద్రియంబులు ప్రత్యేకంబు మిళితంబులై ప్రాణంబగు, నదియు బంచవిధంబు, హృదయవాయువు ప్రాణంబును, గుదవాయు వపానంబును, నాభివాయువు సమానంబును, గంఠవాయు వుదానంబును, సర్వశరీరగంబు వ్యానంబు నని కీర్తింపబడు జ్ఞానేంద్రియంబు లయిదును, గర్మేంద్రియంబు లయిదును, బ్రాణంబు లయిదును, మనంబును బుద్ధియు సూక్ష్మశరీరం బగు. నిదియు లింగంబునాంబడు. మరియుం బ్రకృతియనునది ద్వివిధంబు. సత్త్వాత్మికను మాయయందు రవిద్య గుణమిశ్రితయైయుండు స్వాశ్రయంబును రక్షించుటంబట్టి మాయానామంబు గలిగె, దాని ప్రతిబింబం బీశ్వరుడగు. నతండు స్వాశ్రయజ్ఞానవంతుండు, సర్వజ్ఞుండు, సర్వకర్త, సర్వానుగ్రహకారకుండు మరియు నవిద్యయందలి ప్రతిబింబంబు జీవుండు, సర్వదుఃఖాశ్రయుండు. నీ జీవేశ్వరుల కిరువురికిని శరీరత్రయంబు చెప్పంబడియె, దేహత్రయాభిమానంబుచే నామత్రయంబు గలిగె. కారణశరీరాత్మకుండు ప్రాజ్ఞుండు, సూక్ష్మశరీరాత్మకుండు తైజసుండు, స్థూలశరీరాత్మకుండు విశ్వుండు. ఈశసూత్రవిరాట్పదంబులచే గీర్తింపబడు జీవుండు వ్యష్టిరూపుడు, ఈశ్వరుండు సమష్టి రూపుడు. సర్వేశ్వరుండు జీవానుగ్రహకాంక్షచే నానాభోగాశ్రయంబయిన విశ్వంబు గల్పించుచుండు. నతండు మదీయంబయిన శక్తిచే బ్రేరేపింపబడి యట్లు సేయ సమర్థుండు, మరియు, ౨౪౧

క. శంకింపకు మన్మాయా । సంక్లుప్తముసుమ్ము సకల జగముచు నానా
లంకర్త నేన యనా । తంకను బరమార్థమందు ధరణిధరేంద్రా! ౩౪౨

క. సద్వ్యవహారమున న । విద్యయు మాయయు నటంచు విబుధుల నామాం
కాద్యుపగతు లిచ్చిరి నిర । వద్యత మత్తత్వ మొకట వరలెడి జూడన్. ౩౪౩

క. ఆ నేన సర్వజగము న । నూనంబుగ జేసి యందు నుందుం బ్రాణా
పానాదులతో గర్మల । తో నానాభేదగతులతో నవనీంద్రా! ౩౪౪

క. నాలో మాయాభేదము । ల లోకాంతర్గతాదు లవి నేగానా
లీలో సాధుజనంటను । పేళి ముఖులవడునె పెండ నెండించినచోన్. ౩౪౫

క. నాయందు బుద్ధిమెదలదు । హేయంబుల జెప్పి నాకు నిత్తురు కర్తృ
త్వాయతి మూఢు లెరుంగరు । పాయని తమహేతువాదపద్ధతితోడన్. ౩౪౬

తే. గీ. కుండలోని వెలితి కొండలో వెలితికి । భేదమునుఘటించు నాది మాయ
కుండ బోయినపుడు కొండలోగలియదా । కుండ మాయ పెద్ద కొండమాయ. ౩౪౭

తే. గీ బొందిపేరుగొనుచు బొందిలో వానిని । జీవుడనుచు నీవు చెప్పినావు
బొందలేకయున్న నిందుండు నందుండు । నన్నియెడల నుండు సతడు బ్రహ్మ. ౩౪౮

తే. గీ. మాయలేకయున్న మహితంబు సర్వంబు । నెరుక పేరులేక యేకమగును
భేదమెల్ల మాయ పృథుగుణంబులు మాయ । నన్ను జెనకకుండు నాదు మాయ. ౩౪౯

తే. గీ. ఈశ్వరుడ నేను సూత్రాత్మ నే విరాట్టు । నేను బ్రహ్మను విష్ణువ నీశుడను మ
హేశ్వరిని వాణి నిందిర నే నిసుంద । దిక్కులను నేను దిక్కులరేడ నేను,
పశు విహంగమములు నేను పాము నేను. ౩౫౦

తే గీ. క్రూరుడను నేను చోరుడ గుత్సితుండ । నాడుదానను మగవాడ బేడివాడ
నన్నియును నేను పెద్దను జిన్న నెన్న । నేన కన్నది విన్నది నేనసుమ్ము. ౩౫౧

తే. గీ. నేన లోపల బయలందు నేన యెల్ల । కాలముల నెల్లచోటులు గాచియుందు
నేనుగానిది యొక్కటి గాననేరు । నన్నుగా నెన్నకున్నది సున్న సున్న. ౩౫౨

తే. గీ గొడ్డురాలుగన్న కొడుకొక్కరుడుదక్క । నేనుగాని దొకటి లేనెలేదు
త్రాడు జూచి నీవు త్రాచనుకొన్నట్లు । నన్ను బిలుతు వీవు నామములిడి. ౩౫౩

తే. గీ. సత్త యన్నియెడల నుందులేకుండగా । సత్తలోనె వేరె సత్త చొరునె
సత్తలోనజొచ్చు సత్తయ సత్తయె । సత్తయనుట లేదు రిత్తకాదె! ౩౫౪

క. అమ్మా! సమష్టిరూపం । బెమ్మాడ్కి వెలుంగు దాని నెరుగము కానన్
బ్రమ్మిన దయతో గనుగొను । మమ్మా చూపింపుమమ్మ మహిమలబొమ్మా! ౩౫౫

వ. ఇట్లు హిమవంతుండు దేవి నడిగిన వాంఛితార్థంబునకు నారాయణ శంకరాది దేవతలు మిగుల సంతసిల్లి చూచుచుండ నిది దేవతామతల్లి భక్తకామప్రపూరిణి యగుటం దన నిజరూపంబు జూపె. నాకంబు మస్తకంబును, చంద్రసూర్యులు చక్షువులును, దిక్కులు శ్రోత్రంబులును, వేదంబులు వాక్యంబులును, వాయువు ప్రాణంబును, విశ్వంబు హృదయంబును బృథివి జఘనంబును, నభంబు నాభియు, జ్యోతిశ్చక్రం బురంబును, మహర్లోకంబు కంఠంబును, జనలోకంబు ముఖంబును, తపోలోకంబు లలాటికయు, సత్యంబు శిరోగ్రంబును, నింద్రాదులు బాహులును, శబ్దంబు శ్రోత్రంబును, నాసత్యులు నాసికయు, గంధంబు ఘ్రాణంబును, దివారాత్రులు రెప్పలును, నోరగ్నియు, బ్రహ్మస్థానంబు భ్రూవిభ్రమంబును, జలంబు తాలువులును, రసంబు జిహ్వయు. యముండు దంష్ట్రలును, స్నేహకళలు దంతంబులును, మాయ నవ్వును, స్వర్గం బపాంగమోక్షంబును, వ్రీడ యూర్ధ్వోష్ఠంబును, లోభం బధరోష్ఠంబును, ధర్మమార్గంబు పృష్ఠంబును, ప్రజాపతి మేఢ్రంబును, సముద్రంబులు కుక్షియును, గిరులస్థులును, నదులు నాడులును, వృక్షంబులు కేశంబులును, కౌమారయౌవనజరలు గతులును, బలాహకంబులు కేశంబులును, సంధ్య వస్త్రంబును, చంద్రుండు మనంబును, విజ్ఞానశక్తియు, హరియు, రుద్రుండును నంతఃకరణంబును, అశ్వాదిజాతులు శ్రోణితలంబును, అతలాదిలోకంబులు కట్యధోభాగంబునుగా నిట్టి మహారూపంబు దాల్చె. ౨౫౬

సీ. కటకట పటపట త్కారదంష్ట్రలతోడ కణకణగౌరకంచు కనులతోడ
లేలిహానసహస్ర కీలాఢ్యజిహ్వతో బహువిధాయుధభుజాపంక్తితోడ
నొకవేయికనులతో నొకవేయితలలతో బ్రాహ్మంబుతో క్షాత్ర భాతితోడ
నొకవేయికాళ్ళతో నురుతర వీరరసంబుతో మహనీయ శక్తితోడ

తే. గీ. కోటిసూర్యప్రతీకాశ కోటివిద్యు । దాభమత్యంతభీకరం బాత్మనేత్ర
విపులసంత్రాసదము ఘోర వేష మగుచు । గానవచ్చిన రూపంబు గాంచి సురలు. ౨౫౭

క. అహాహా యేమని । యాహాకారములు సల్పిరందరు నొకరై
యూహలు దొలంగి కంపిలి । మోహితులై మూర్ఛలోన మునిగిరి పెలుచన్. ౨౫౮

క. ఇది జగదంబ యటంచున్ । మది నొకకొంతవడి కెఱుక మహితంబై స్వ
స్పదులుండగ దనచెంగట । గదిసి తనరు వేదచయము గనఁగాని వేడ్కన్. ౨౫౯

క. సురలను మేల్కొలుపుమనుచు । వెఱవుదెలుప ననియు నట్ల వేగమ చేయన్
పరిపూర్ణజ్ఞానంబున । వరదాత్రిని దేవి గాంచి వా రతిభక్తిన్. ౨౬౦

మ. అపరాధంబుక్షమించి ప్రోవుము త్రిలోకారాధ్య నీబిడ్డలం
గృపతో జూచుటయున్ స్వభావమెకదా గీర్వాణి త్రాసంబు మా
నుపవే కోపముమానవే పరమమందు ల్మీరు నిన్నెన్నగా
ద్రపకాదే నినుబట్టి పుట్టితిమి మాతల్లీ దయాంభోనిధీ. ౨౬౧

పంచచామరము. నమో నమ స్సమ స్తలోకనాథపూజితే హితే
నమో నమ స్సమ స్తవేదనాదరంజితే జితే
నమో నమస్సమ స్తశోభనప్రపంచరంజనే
నమో నమో యటంచు వందనం బొనర్తు మీశ్వరీ ! ౮౬౨

వ. అగ్నియు, సర్యముడును, సోముండును, నోషధులును, దేవతలు, సాధ్యులు, పక్షులు, పశువులు, మనుష్యులు, ప్రాణాపానాదులు, వ్రీహులు, తపస్సును, శ్రద్ధయు, ఋతంబును, బ్రహ్మచర్యంబును, సప్తప్రాణంబులును, సప్తార్చులును, సప్త సమిధలును, సప్తహోమంబులును, సప్తలోకంబులును, సప్తసముద్రంబులును, సప్తపర్వ తంబులును, సర్వరసంబులును, యజ్ఞంబును, దీక్షయు,పశువును, దక్షిణయు,యూపంబును, ఋక్కులు, యజువులును, సామంబులును నెవ్వరివలననుండి కలిగె నట్టి యాదిదేవతకు నమస్కరించెదము. మరియు ఊర్ధ్వంబునను, క్రిందను, వెనుకను, ముందరను, పార్శ్వం బుల నెల్లయెడల నోయమ్మా నీకు నమస్కరించెదము. ఈ యలౌకికంబయిన నీ యాకృతి నుపసంహరింపుమని వేడిన దేవతలం గరుణాకటాక్షవీక్షణంబులం జూచి పాశాంకుశవరాభయధారిణియు, సర్వాంగకోమలంబును, మందస్మితముఖాంబుజంబును నగు సుందరాకృతి జూపిన నెల్లరు భీతి వివర్జితులై శాంతచిత్తులై నమస్కరించి హర్షంబునొంది రంత దేవి యో సురలారా మహాతపంబులు సేసియు, మహాపుణ్యంబు లాచరించియుం దెలియరాని నా విగ్రహంబు మీకుం జూపితి నికఁ బ్రకృతంబు వినుండని యిట్లనియె. ౮౬౩

సీ. కర్తృత్వమును మరి కారయితృత్వంబు మొదలయినవి యుపాధిమూలకములు
ధర్మంబులనియు నధర్మంబులనియును గ్రియలవి ద్వివిధమై కెరలుచుండు
ధర్మంబు సుఖము నధర్మంబు దుఃఖంబు నొసగు గావున బహుయోనులందు
బుట్టుచు జచ్చుచు బూర్వసంస్కారంబువశమున గర్మముల్ ఎరుసఁ జేసి

తే. గీ. మరల బుట్టియు జచ్చియు మరల బుట్టి । చచ్చి మరి పుట్టిపుట్టియు జచ్చిచచ్చి
పరగ గడియారముంబలె తిరిగి తిరిగి । పాయఁ దజ్ఞానచక్రవిభ్రాంతిజేసి. ౮౬౪

క. వారక జననపరంపర । కారణ మజ్ఞాన మదియు కడు గొడవలకుం
గారణకారణ మజ్ఞా । నారణ్యము నరుకు దెలుకయను గొడ్డంటన్. ౮౬౫

క. అజ్ఞానజమగు కర్మం । బజ్ఞానము నెట్టులడచు నదిగాన మహా
సుజ్ఞానమె గనవలయుం । బ్రాజ్ఞుండగువాఁడు శాంతభావము మీరన్. ౮౬౬

తే. గీ. జ్ఞానహితకారి కర్మంబు గడఁగవలయు । జ్ఞానమే ముక్తికి సమీపకారణంబు
కర్మ లెన్నం బరంపరాకారణములు । కర్మమునసేసి జ్ఞానంబు గాంచవలయు. ౮౬౭

తే. గీ. చెలఁగి వైదికకర్మలు చిత్తశుద్ధి । హేతుకంబు లటంచును నెఱుఁగవలయు
కేవలము కర్మ మజ్ఞాన కృతము గాన । సన్నిహితసాధనంబు కాఁజాల దండ్రు. ౩౩౮

తే. గీ. ఎన్న నజ్ఞానకార్యమై యెసఁగునట్టి । కర్మ యేరీతి జ్ఞానంబు గలయఁగలదు
చీకటియు వెల్గు నొకచోట జేరియున్నె । యేకకాలంబున యటంచు నెఱుఁగవలయు. ౩౩౯

తే. గీ. శమము దమము తితీక్షయు సద్విరాగ । తయును సత్వంబువలన నుద్భవమునందు
చిత్తశుద్ధికి హేతువుల్ చిత్తశుద్ధి । వరకె తక్క పదంపడి వలదు కర్మ. ౩౪౦

తే. గీ. సాధనచతుష్టయము గల్గి సన్యసించి । శ్రోత్రియుడుబ్రహ్మనిష్ఠుండు శుచియు భక్తి
కలితుడైనట్టి గురుని సంగతిని భవ్య । దివ్య వేదాంతమార్గంబు దెలియవలయు. ౩౪౧

తే. గీ. తత్వమస్యాదివాక్యసంతతి విచార । మెప్పఁడును జేయుచుండంగ నొప్పును యతి
తత్వమసి వాక్యమునకు నర్థంబు వినుడు । నొక్కజీవాత్మ పరమాత్మ యొక్కటంట. ౩౪౨

క. ఇదియంతయు బ్రహ్మమయం । బిదియంతయు నొక్కటనెడి యెరుక గుదిరినన్
దుది నది నే నగుదును నే । నది యను భేదంబులేక యైక్యంబు గనున్. ౩౪౩

క. పదముల యర్థము తొలుతన్ । బదపడి వాక్యార్థ మెరుగ బరగెడి నిక త
త్పద మర్థము నేనే త్వం । పద మర్థము జీవు డైక్యభావ మసి యిడున్. ౩౪౪

వ. తత్తున కది యనియు, త్వమ్మునకు నీవనియు, నసి కగుచున్నావనియు నర్థంబులై వాక్యంబున కది నీ వగుచున్నా వను నర్థం బేర్పడి భిన్నార్థద్యోతకంబులయిన పదంబులకు నైక్యంబను నర్థ మసంగతంబైనందున లక్షణార్థంబుచే నైక్యంబు చెప్పవలయు. ౩౪౫

క. చిన్మాత్రము లక్ష్యంబై । సన్మతులకు దోచు గాన జగమున దత్తున్
దన్మహితపదంబును వి । ద్వన్మణు లేకార్థములుగ దలతురుజుండీ. ౩౪౬

క. ఆ దేవదత్తు డితడే । కాదగు నన్నట్లు నెన్నగా లక్షణయౌ
నీదనుచును నాదనుచును । భేదము గనఁబోడు తత్వవేది జగమునన్. ౩౪౭

వ. బ్రహ్మంబు స్థూలాదిదేహరహితంబు. పంచీకృత మహాభూతసముద్భవంబు. స్థూల శరీరంబు.ఇది భోగాలయంబు, జరావ్యాధిసంయుతంబు, మిథ్యాభూతంబు, భ్రాంతిచే నిది యున్నట్ల తోచు. నీ స్థూలశరీరం బాత్మనైన నా కుపాధిభూతంబు, సూక్ష్మంబు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ సహితంబు, ప్రాణపంచకయుతంబు, మనోబుద్ధియుతంబులయిన పంచీకృతభూతంబువలనంబుట్టి నాకు రెండవయుపాధి యగు. ననాద్యం, బనిర్వాచ్యం బయిన మాయయే కారణశరీరం బగును. ఉపాధి నశించెనేని గేవలాత్మ మిగిలియుండు దేహత్రయంబునం బంచకోశంబులు, నవస్థలుం గలవు. ౩౪౮

క. ఇదిగా దిదిగా దనియెడి । పదసందోహంబులోని పరమార్థంబే.
విదితంబుగ నారూపము । పదపడి మరియొక్కలాగు బలుకగ వశమే. ౭౭౯

రగడ. పుట్టదు చావదు పుట్టుకలేనిది । యిట్టిదిగా దది యేకము నిత్యము
గిట్టదు ముట్టదు గిట్టింపదు మరి । పొట్టిదిగా దది పొడుగునుగా దిక
అణువునకంటె నదణురూపంబగు । గణియింపగ నధికమునకు నధికము
కడుపున నాత్మను గదలక బ్రోచును । కడువడి నక్రతు గాంచుచు నుండును
గొడవలు లేవది కొను మహిమంబును । నది రథమెక్కెడి నరదము దేహము
పొదలెడి సారథి బుద్ధి యనందగు । మది మరి యెన్నగ మనసే పగ్గము
నెరవడిగల యింద్రియములె హయములు । గురువిషయంబులు గోచరములగును
ఎరుకవలన దా నిది గనవలెగద । మూఢు డెరుగ డిది మూలన యున్నది
గూఢము గూఢము గూఢము నమ్ముడు । జ్ఞానసారథిని గైకొని పోవలె
మానక గొనవలె మనసను పగ్గము । ఆతడు మార్గము నంతము సూచును
ప్రీతిని బ్రహ్మము రీతిని బొందును. ౭౮౦

క. శ్రుతిచే మతిచేతను దా । నతివిమలంబయిన తానె యాత్మ యటంచున్
సతతంబు నెఱుక సత మని । తతయోగవిచారమునను ధన్యత గనుడీ. ౭౮౧

వ. మరియు హకారంబు స్థూలశరీరంబు, రకారంబు సూక్ష్మంబు, ఈకారంబు, కారణాత్మకంబు, హ్రీంకారంబు, తురీయకంబు. సమష్టిదేహంబునందును గ్రమంబుగ బీజత్రయంబు నెరింగి సమష్టి వ్యష్టుల కైక్యంబు జింతించునది యిది సమాధి పూర్వంబె కర్తవ్యంబై యుండు. పదంపడి నన్ను ధ్యానించవలయు, నది యెట్లనిన, నిర్వ్యాజ్యభక్తియుక్తుండై నిర్జనస్థలంబున నాసాభ్యంతరచారులగు ప్రాణాపానంబుల సరిపరచి నిర్విషయుండై విమత్సరుండై హకారంబు విశ్వాత్మునిగా రకారంబునందును, రకారము తైజసునిగా నకారంబునందును, నీకారంబు బ్రాజ్ఞునిగా హ్రీంకారమునందును, విస్మరింపవలయు. బిమ్మట తన్నుదాను వాచ్యవాచకతారహితునిగాను, ద్వైతభావవివర్జితునిగాను, నఖండసచ్చిదానందస్వరూపునిగాను భావించవలయును నిందువలన నేను సాక్షాత్కరింతు, నక్కారణంబున నారూపంబు గలుగు. కావున నజ్ఞాననాశకంబు జ్ఞానంబెకాని మరియొండు లేదు. మరియు వినుండు, యోగంబు దెలిపెద నని. ౭౮౨

తే. గీ. కొండమీదను కూర్చుండి కులుకబోదు । భూమిమీదను పన్నుండి పొదలబోదు
అతలవితలాదులందుండి యాడబోదు । యోగ మది జీవపరమాత్మ యోగమరయ. ౭౮౩

క. యోగము చిత్తనిరోధము । రాగాదులడంగు జిత్తరాహిత్యమునన్
యోగైక్యభావ మపుడు వి । రాగికి దనయంత దాన రాజిలు శైలా! ౭౮౪

తే.గీ. యోగమునకు శత్రువు లున్నవారు । వార లార్వురు కామంబు వరలు క్రోధ
మవల లోభంబు మోహంబు నందుపైన । మదము మాత్సర్యమును వీని విడుమవలయు.

క. యోగారుల దునుముటకున్ । బాగగు సాధనము లెన్నబడు లోకమునన్
యోగాంగంబులు గావున । యోగం బెరుగంగవలయు నుర్వీంధ్రవరా ! ౭౮౬

మ. యమమున్ దా నియమంబు నాసనము ప్రాణాయామమున్ నిశ్చలో
ద్యమవిస్తారమహీధరేంద్ర విను ప్రత్యాహారమున్ ధ్యానమున్
విమలంబై తగు ధారణంబు జపలధీ క్షీకృత్స్నమాధ్యంగమున్
క్రమ మొప్పారెడి నెన్మిదంగముల యోగం బొప్పు నెందేనియున్. ౭౮౩

తే.గీ. హింసలేకుంట నిజమాడుటెప్డు ముచ్చిలమియు మరి బ్రహ్మచర్య మార్జవము దయయు
క్షమము ధృతియు మితాహార శౌచములును । బదియును యమంబు లనబడు బర్వతేంద్ర!

తే.గీ. తపము సంతోష మాస్తిక్య దానములను । సురలపూజయు వేదాంతసుశ్రవణము
హ్రీయు మతి జపహోమంబు లివి పదియును । నవనిధర నియమంబు లటంద్రు బుధులు.

మ. కమల స్వస్తిక వజ్ర భద్రములు నింకన్ వీరమున్ నాగ న
త్యమలస్ఫూర్తిని నాసనంబులగు శైలాధీశ్వరా యాసవ
క్రమమున్ జక్కగదెల్పెదన్ జపలతం గైకోలుగావింపక
చ్ఛముగా జిత్తమునిల్పి నీవును సురల్ సంతుష్టి నాలింపుడీ. ౭౯౦

మ అరకాళ్ళూరువు లెక్కగా మలచి యా యంగుష్ఠముల్ చేతులన్
సరిగా బట్టుక కూరుచున్న గమలాసం బంద్రు జానూరు కాం
తరసమ్యక్కృతచారుపాదతల మెన్నన్ స్వస్తికం బంద్రు భూ
ధరరాజన్య ఋజుత్వ మంగమున నందంబై యెసంగం దగున్ ౭౯౧

మ. వర గుల్ఫద్వయిసీవనిన్ నిలిపి యా వక్కాణిగం దొట్ట సుం
దరలీలం ఘటియించి యొలి వృషణాధఃపాదపార్ష్ణిద్వ బం
ధురుడై పాణుల బట్టెనేని యది భద్రఖ్యాతి జెన్నారెడిన్
ధరణీంధ్రాధిప ! యోగశాస్త్రఫణితిన్ బ్రాజ్ఞప్రణీతక్రియన్. ౭౯౨

ఉ. ఊరువులందు బాదముల నోజ ఘటించి పొసంగ జానుయు
క్చారుతరాంగుళు ల్వెనుక సాచిన వజ్రమునా బ్రసిద్ధమౌ
ధామణి నొక్కపాదమును ధైర్యముతో మరియొక్క యూరువం
దేరుపడంగజేసి తను వెల్లను దిన్నగ నిల్ప వీరమౌ. ౭౯౩

క. ఇడచేత బాహ్యపవనము । వడి బీల్చి సదా ప్రసన్న వదనుం డగుచున్
జడియక షోడశమాత్రల । వడి జేసిన గుంభకంబు వసుధాధ్రవరా ! ౭౯౪

క. లాగిన గాలి సుషమ్నను । బాగుగ నరుబదియునాల్గు మాత్రల యజ్ఞున్
లోఁగొన్న బూరకం బని । యోగివరులు పలుకుచుందు రో గిరినాథా! ౯౫

క. ఇరుబదిరెండగు మాత్రల । తరి లోపలి గాలినెల్ల త త్తిరపడక
క్కఁర మెల్ల మెల్ల బింగళ । తెరువున విడ రేచకంబు తిప్పలరేడా! ౯౬

క. తెలియగ జపమును ధ్యానము । గలిగినను సగర్భమండ్రు కాదేనియు నం
దు రది విగర్భమటంచున్ । ధర బ్రాణాయామ మిదియ ధరణీంద్రవరా! ౯౭

క. క్షమ బ్రాణాయామంబున్ । గ్రమమునఁ గావింపఁ జెమట గారెడి మొదటన్
హిమధామ! పిదప వడఁకు బొ । డము తుదకునుఁ బైకి లేచు ధరవిడచి వెసన్. ౯౮

తే. గీ. మహిని స్వేద మధమము గంపంబు మధ్య । మంబు గగనస్థితియు నుత్తమం బటండ్రు
నేరుపున నభ్యసించిన ధీరులకును । గలుగు నుత్తమ మది మనోగ్రంథి విప్ప. ౯౯

తే. గీ. విషయములమీది కింద్రియ వితతిబోవ । నీక బలవంతముగ లాగెనేని యదియు
రహి వహించును బ్రత్యాహరణ మనంగ । మేనకానాథ! ప్రాలేయ మేదినీధ్ర! ౧౦౦

శా. అంగుష్ఠంబున గుల్ఫజానువుల మూలాధార నాసోరు హృ
ల్లింగగ్రీవల నాభికంఠరసనాళిన్ మూర్ధ మస్తంబులన్
భంగం బింతయు లేక కన్బొమలకున్ మధ్యంబునం బ్రాణవా
యుం గీలించిన ధారణం బిదియె శ్రేయోదాయకం బద్రిపా! ౧౦౧

క. చైతన్యాంతరవర్తిని । బ్రీతిన్ దనయిష్టదేవు బెడియనిమతి వి
ఖ్యాతిన్ ధ్యానముచేసిన । రీతియె ధ్యానం బటండ్రు పృథుగుణధుర్యా. ౧౦౨

క. జీవాత్మకు బరమాత్మకు । నేవిధి భేదంబు లేదనేక మటంచున్
భావించుటయె సమాధిను । మీ వేయేటికిక నేను మీకు దెలుపగన్. ౧౦౩

వ. మరియు మంత్రయోగంబు జెప్పెద వినుండు, పంచభూతాత్మకంబగు విశ్వంబు శరీరంబుగా నెరుంగుడు. అవి చంద్ర సూర్యాగ్ని తేజంబులచే జీవ బ్రహ్మైక్యరూపకంబుగా దెలియుండు. శరీరంబున సార్ధత్రికోటినాడు లుండు, నందు ముఖ్యంబులు పది. వానిలో మూడు పరమప్రధానంబులు. మేరుదండంబునం జంద్రసూర్యాగ్నిరూపిణియగు దేవి యుండు. వామంబున నిడానాడియుండు. నది శుభ్రయు, జంద్రరూపిణియు, నా నాడి శక్తిరూపయు, సాక్షాదమృతవిగ్రహయునై యుండు. దక్షిణంబున పురుషరూపయై సూర్యవిగ్రహయైన పింగళాఖ్యనాడి యుండు. నది సర్వతేజోమయ సుషుమ్న వహ్నిరూపిణి. దానిమధ్యంబున నిచ్ఛాజ్ఞానక్రియాత్మకంబయి కోటిసూర్యసమప్రభంబై స్వయంభూలింగంబుండు. దానిమీద శివాత్మకంబై బిందునాదోపేతంబై మాయాబీజంబుండు. నందుమీద రక్తవిగ్రహయై మదంశంబై కుండలీనామంబు గల శక్తి యుండు.

దాని వెలపట హేమరూపంబును. వకారంబు మొదలు సకారంబు వరకు గల వర్ణంబులం గూడి చతుర్దళంబైన పద్మంబుండు. దానిమీద ననిలప్రభంబై వజ్రప్రభంబై బకారంబు మొదలు లకారంబువరకు షడ్వర్ణయుతంబై షడ్దళంబుండు. ఆధారషట్కంబునకు మూలంబై మూలాధారంబునాంబడు. నదియే స్వాధిష్ఠానంబని యెన్నంబడు. నందు స్పర్శ శబ్దంబునకు పరమలింగం బర్థంబయ్యె. నందుమీద నాభిదేశంబున మహా ప్రభంబయిన మణిపూరకం బుండు నది మేఘవర్ణంబును జంచలావర్ణంబునై యుండు. దాని మణిపద్మ మండ్రు. డకారంబు మొదలు ఫకారంబువరకు నక్షరంబులంగూడి దశ దళంబులు గలిగియుండు. విష్ణ్వాలోకనకారణంబై విష్ణువుచే నధిష్ఠింపబడియుండు. దాని మీద సూర్యసన్నిభంబయిన యనాహతపద్మం బుండు. నది కకారాది ఠకారాంతంబయిన దళంబులతో భానుప్రభాచిత్రంబులతో నధిష్ఠింపబడియుండు. అది పురుషార్థంబు లిచ్చు. జ్ఞానంబు నిచ్చు. నది పురుషాధిష్ఠితంబు, దానిమీద విశుద్ధాఖ్యంబగు షోడశపద్మం బుండు. నది విశదంబు వైడూర్యవర్ణంబు. దాని నాకాశపద్మం బండ్రు. దానిమీద నాజ్ఞాచక్రం బుండు. నది యాత్మచే నధిష్ఠింపంబడి యుండు నందు ఆజ్ఞాసంక్రమణంబు గలదు గావున నాజ్ఞాచక్రంబని చెప్పంబడు అది ద్వివిధంబు. హకార క్షకార యుక్తంబు, మనోహ రంబునై యుండు. దానిమీద రోహిణియుండు అది యాధారచక్రంబు. దానిమీద వెయ్యంచులు గలిగి బిందుస్థానం బుండు నని చెప్పి మరియు, ౮౦౪

తే. గీ. పూరకంబున నాధారమును బొసంగు । గలిత గుద మేఢ్రముల మధ్య గలుగు శక్తి
వాంచి బోధించి లింగంబువలన బిందు । చక్రమును బొందవలయును జనుడు ధాత్రి.

తే. గీ. అందుమీదట శంభుతో నాదిశక్తిఁ । గలిపి చింతింపవలయు నిశ్చలత నరుడు
భూరి లాక్షరసంబును బోలె నందు । బుట్టు నమృతంబు మాయాఖ్యముగ దలంచి. ౮౦౬

తే గీ. యోగసిద్ధిద మని యెంచి త్రాగవలయు । తనర షట్చక్రదేవతోత్పత్తికొరకు
మహితమై తగు నాధార మార్గమునను । తోడితేరంగదగు దానిత్రోవ దెలసి. ౮౦౭

తే. గీ. అనుదినము నిట్లు నేర్పున నభ్యసించి । సర్వపరిపూర్ణ భావంబు నిర్వహించి
జరయు మరణంబు నొందని సరణి దెలసి । యెల్ల భవబంధముల బాసి యింపుగనుఁడు.

తే. గీ. ఎల్ల మంత్రంబులును సిద్ధినెనయ నిందు । సాధకుని శక్తికొలదని సాధనముల
చాకచక్యంబునను మహా శైలవర్య ! ధారణము మార్గముల నెల్ల సేరుపరచి. ౮౦౯

క. అనవచ్ఛిన్నదిగాదుల । ఘనమాయాకలితదేవి గడు మోదమునన్
మనమునను నిలిపి తనయం । తను బ్రహ్మైక్యంబు జీవతతి కివ్వవలెన్. ౮౧౦

క. నా యవయవముల జిత్తము । బాయక నిలుపంగివలయు పరిశుద్ధుండై
యేయెడలను జూచినను నే । నే యని మనమునను దలఁచి నేర్పున మరియున్. ౮౧౧

వ. ఇట్లు విశుద్ధచిత్తుండైన నరునకుం బ్రహ్మసంసిద్ధి కరతలామలకంబు. సదా ధ్యానస్థుండై
బ్రహ్మరూపిణిం ధ్యానింపవలయు. నెట్లనిన. ౨౧౨

సీ. ఏది సూక్ష్మంబుల కెల్లను సూక్ష్మంబు నేది మహత్పదం బేది ఘనము
నేది గుహాచరం బేది సన్నిహితంబు నేది లోకంబుల కింటిపట్టు
నేది జ్ఞానవరిష్ఠ మేది కాదియుతంబు నేది లోకహితంబు నేక మేది
యేది పరంజ సర్వేశ్వరం బేది నిత్యం బేది నిహిత సౌఖ్యంబు నేది

తే. గీ. యదియ యక్షరమును బ్రహ్మ ప్రాణ మాత్మ । యమృతమును నౌపనిషదశరాసనంబు
జ్ఞాననిశితశరంబును బూని యక్ష । రంబు లక్ష్యంబుగా గొని గ్రాలవలయు. ౨౧౩

సీ. ప్రణవంబు విల్లు శరం బాత్మ బ్రహ్మ తల్లక్ష్యంబు గురి జూచి లలితఫణితి
పొరపాటులేక యా పురుషుండు తన్మయుండగుచు వేధింపగా దగును మరియు
దానియందును భూమి తనరు నాకాశంబు ప్రాణంబులును మనం బణగియుండు
అమృతసేతువు పరమాత్మ వెయ్యేటికి నాడు లలరు నాభి నరములవలె

తే. గీ. చెలగి సంహతములుగాగ చేరి లోన । తిరిగి బహువిధముల బుట్టి తివురుచున్న
బ్రహ్మనోంకారమును మహాభక్తితోడ । ధ్యానమొనరింపవలయు దద్దయును నరుడు ౨౧౪

తే. గీ. చక్కనగు బ్రహ్మపురమున జదల నాత్మ । సంప్రతిష్ఠితమై యుండె జారులీల
నది మనోమయమగుచు బ్రాణాంగనేత । హృదయమును జేరి యన్నమయేశ్వరుండు.

క. అది తెలిసిన పండితులకు । సదమల మానంద మమృతసారము తోచున్
హృదయగ్రంధియు విగుచున్ । గదలి పటాపంచలగును గర్మము లెల్లన్. ౨౧౫

క. కనకమయకోశమందున్ । బెనగును విరజంబు బ్రహ్మ నిష్కల మమలం
బును వెలుగుల వెలుగును నది । గనుగొనియెద రాత్మవిదులు క్ష్మాధరవర్యా ! ౨౧౬

తే. గీ లేదు సూర్యుండు చంద్రుండు లేదు సుమ్ము । లేవు తారక లచ్చోట లేదు మెరుపు
లేదు నిప్పును బ్రభ లందు బాదుకొనియె । నన్నివెలుగుల వెలిగించు నదియె కలదు.

క బ్రహ్మంబె ముందు వెనుకను । బ్రహ్మంబే దక్షిణమున బ్రహ్మమె మరియున్
బ్రహ్మంబె యుత్తరంబున । బ్రహ్మంబే క్రింద మీద బైలను లోనన్. ౨౧౮

క. ఇటువంటి యనుభవంబున్ । ఘటియించినవాడె లోకఘనుడుసుమీ వా
డట బ్రహ్మంబట యమృతం । బట శోకము కాంక్ష లేని యట్టిడట గిరీ ! ౨౨౦

క. రెండవది లేదు భయ మె । ట్లుండును నే నతని విడువ నొకటె యగుచు నా
తండును నను నెన్నడు విడు । వండుసుమా నేనె వాడు వాడే నేనై. ౨౨౧

తే. గీ. లేను తీర్థంబునందును లేను లేను । లేను కైలాసమందును లేను లేను
లేను వైకుంఠమందును లేను లేను । జ్ఞాని మానసమందు నున్నాను నేను. ౭-౨౨

తే. గీ. నేనె జ్ఞానిని జ్ఞానియే నేనుసుమ్ము । జ్ఞానియగువాని పూజయే నాదు పూజ
జ్ఞాని బూజింపవలయునుగద నగేంద్ర! । యట్టివానిదె జన్మ మీ యవని జూడ. ౭-౨౩

తే. గీ. జ్ఞానియున్న యిల్లు కల్యాణనిలయంబు । జ్ఞాని యున్నభూమి కనకమయము
జ్ఞాని దిగినచెట్టు కల్పభూజాతంబు । జ్ఞాని లోకనేత జ్ఞాని దాత. ౭-౨౪

క. ఈ గుహ్యము బాత్రులకున్ । బాగుగ దెలుపంగదగు నపాత్రులకును నం
హో గతులకు దెలుపదగదు । దా గురువరు మరువరాదు ధరణీధరేంద్రా! ౭-౨౫

క. ఇది బ్రహ్మవిద్య దీనిన్ । వదల కథర్వణునకున్ గృపామతి నింద్రుం
డొదవించెం బరులకుం జెప్పదగదు నీ వనుచు నతడు బాసలు గొనియెన్. ౭-౨౬

తే. గీ. అయ్యథర్వణుడు జెప్పె నశ్వినులకు । వాసవుడు విని కోపించి వజ్రనిహతి
దలను నరికిన నాతని తలను మరల । నతికి రశ్వను లాత్మవిద్యానిరూఢి. ౭-౨౭

వ. అని చెప్పిన విని హిమవంతుడు మహానందవంతుడై భక్తిమార్గం బుపదేశింపవే యనుడు జగన్మాత యతిహర్షంబున. ౭-౨౮

తే. గీ. కర్మయోగంబు జ్ఞానయోగంబు మరియు । భక్తియోగంబు నివి మూడు ముక్తినిచ్చు
జ్ఞానసాధనములు భక్తి కర్మము లిల । సులభమందును భక్తియేసుమ్ము శైల! ౭-౨౯

తే. గీ. భక్తి గాయ ధనములకు బాధలేదు । భక్తి మనసున బొడమి దా బాయకుండు
భక్తి సాధువులకు గొంగుపైడిసుమ్ము । భక్తి సులభక్రమంబున ముక్తినిచ్చు. ౭-౩౦

క. పరగంగ భక్తియును ము । త్తెరగుల దనరారు బరుల ధృతి బాధింపన్
దొరకొని క్రోధమదాధిక । ధరులై దంభము వహింప ధర దామసియౌ. ౭-౩౧

క. అనయంబు కీర్తియును జయ । మును భోగము గోరి నన్ను మొగి బ్రార్థింపం
గను భేదబుద్ధితో భ । క్తిని బూనిన భూమిభృత్పతీ! రాజసియౌ. ౭-౩౨

తే. గీ. తామసియు రాజసియును భేదప్రసక్తి । లౌకికార్థంబులను జేరలాగగలవు
మోక్షమునకును గావుసుమ్ము ధరణీధ్ర! । సాత్వికీభక్తి యొక్కటే సత్పథంబు.

తే. గీ. సాత్వికియు రెండుదెఱగుల జగ్గుమీరు । భేదసాత్వికియని యొండు పిలువబడును
దాని త్యాగంబటంద్రు కొందరు విబుధులు । క్రియల ఫల మీశ్వరికిని నర్పించుబుద్ధి.

క. పరసాత్వికి రెండవదై । గెరలెడి నా భేదసాత్వికియు సాధనమౌ
బరసాత్వికి సాక్షా । త్పరమకరణ మెప్పు డొక్క పరభక్తి యగున్. ౭-౩౫

క. ధరణీధరవర ! వినుమా । పరభక్తిన్ భేదబుద్ధి పరమాణువులే
దరిమురి నిది జ్ఞానముతో । సరియైనను జూచుచుండు సకలమునందున్. ౭౩౬

తే. గీ. నాగుణంబులు వినుటయు నామకీర్త । నంబు సేయుటయును కామనయును లేక
యుండుటయు నాదు సేవ దానొక్కటే । సదా మనంబున దలచుట దాని పనులు. ౭౩౭

క. కరి నేనే గిరి నేనే । హరి నేనే హరిణ మేనె యావును నేనే
కిరి నేనే సిరి నేనే । మరి నేనే మరియు నేనె మరి మరి నేనే. ౭౩౮

వ. అనుచు. ౭౩౯

క. చదివిన బాపనియందుం । జదవని పెనుగొల్లయందు చాకిన్ లేకిన్
మదకరియందున్ గుక్కను । మొదవున నొకలాగు నన్ను ముక్తుడు దలచున్. ౭౪౦

క. నా యునికి జూడ శ్రద్ధయు । నాయందుం భక్తిగలుగు నరులం జూడన్
బాయని ప్రీతియు నాకథ । లేయెడ నాలింప వేడ్క యిల భక్తులకున్. ౭౪౧

క. ఏకర్మము కావించిన । నే కార్యము జేసినను మదేకాగ్రమతిన్
గైకొని యానందంబున । లోకంబుననుండు భక్తిలోలుడు గిరిపా ! ౭౪౨

తే. గీ. ఈ పరాకాష్ఠ జ్ఞానంబు నెనయుచుండు । సర్వదా ముక్తు డీతడే చచ్చి బ్రతికి
భేదబుద్ధి యొకింతయు బెనయకుంట । ద్వైతయుతభక్తికాదు సాధనమతంద్రుు. ౭౪౩

తే. గీ. ఎన్ని వ్రతములైన నెన్నిధర్మములైన । నెన్ని జపములైన నెందునైన
నెన్నితీర్థములకు నేగిననైనను । నైక్యబుద్ధి లేనియపుడు సున్న. ౭౪౪

తే. గీ. ఐక్యబుద్ధితోడ నఖిలంబు జేసిన । చేతఫలము వాని జెందబోదు
చేతఫలము వాని జెందనేరకయున్న । జన్మమేది దుఃఖసమితి యేది. ౭౪౫

తే. గీ. జ్ఞానయత్నంబు సేయనివాని బ్రతుకు । వ్యర్థమేకాన జ్ఞానసంపాదనంబు
నుద్యమింపుము శైలేంద్ర ! హృద్యలీల । నీకు దెలిపితి నిఖిలంబు నిర్మలాత్మ. ౭౪౬

తే. గీ. పాలలో నేయి గూఢమై పరగుచుండు । నెల్లజీవుల జ్ఞాన మట్లే రహించు
గాని మథియించి మథియించి కడను గనుము । కదసి మనసను కవ్వంబు గదలద్రిప్పి.

వ. అని పల్కి, హిమవద్గిరీంద్రా ! నీవడిగిన యర్థంబు జెప్పితి, నింక నేమి వేడెద వనిన
విని హిమవంతు డిట్లనియె. ౭౪౭

క. దేవీస్థానంబులు భువి । నేవి గలవు జనని యేవి నెప్పుడు సమ్య
గ్భావోత్సవసహిత యగున్ । దేవీపూజాదు లెట్లు తెలుపవె మాకున్. ౭౪౮

తే. గీ. అనవుడును నవ్వి దేవి మహాగిరీంద్ర । మద్వినోదార్థములు తీర్థ మండపాయ
తన మహోత్సవములు నిన్ను దనియజేయ । దెలిపెదను సావధానతఁ దెలియుమయ్య.

రగడ. కోలాపురమది గొప్పది లక్ష్మికి । మూలము లక్ష్మియె మునుకొని యుండును
మాతృపురం బది మహి రెండవదగు । ప్రీతిని దత్పురి రేణుక యుండును
తులజాపుర మన దొడి మూడవదగు । సలలితమై తగు సప్తశృంగమును
హింగుళ యను దేవేశ్వరి స్థానము । పొంగుచు జ్వాలాముఖి సంస్థానము
మహి శాకంబరి మహితస్థానము । రహిగను భ్రామరి రమ్యస్థానము
నెరయు రక్తదంతిక సంస్థానము । వర వింధ్యాచలవాసిని స్థానము
నన్నపూర్ణ గల యాస్థానం బగు । వన్నెలుగుల్కెడి వారణాసియును
భీమదేవిగల పృథుసంస్థానము । వేమరు నెన్నగ విమలస్థానము
పటు చంద్రకళా పరమస్థానము । స్ఫుటమగు గౌశికి పుణ్యస్థానము
నీలాంబా మహనీయస్థానము । శైలాధిప శ్రీశైల స్థానము
జంబూనదికేశ్వరసంస్థానము । ప్రబలిన వేదారణ్యస్థానము
నేపాళంబున నెలకొని చెన్నగు । కోపరహిత యా గుహ్యాకాళియును
అందమైన మీనాక్షి స్థానము । విందగు సుందరి వేదారణ్యము
పణితం బేకాంబర సంస్థానము । నణిమాదుల బొల్పగు పరశక్తియు
చారుమహాలస సంస్థానంబును । స్ఫారత యోగీశ్వర సంస్థానము
నీలసరస్వతి నిత్యస్థానము । శీలము గై కొను చీనంబులలో
వైద్యనాథమున వగలా స్థానము । విద్యోతి మణిద్వీపము నా యిలు
త్రిపురభైరవీ దివ్యస్థానము । నపరిచితము కామాఖ్యస్థానము
నొప్పులకుప్పగు యోనిస్థానము । మప్పిన యెలుకల మాయాస్థానము
దీనిన యుండును దేవి రజస్వల । దీనిన యుందురు దేవతలందరు
దీనికి మించిన దివ్యస్థానము । గానము భువిలో క్ష్మాధరశేఖర
పొలుపుమీరు నల పుష్కరమందును । నలరుచు నా గాయత్రి వసించును
అమరేశ్వరపురి యందును జండిక । ప్రముదితగతిని ప్రభాసతీర్థమున
భూరిమహిమతో బుష్కరాక్షియును । చేరి నైమిశక్షేత్రమునందున
లీలావతి యగు లింగధారిణియు । పోలగ బుష్కరమున బురుహూతయు

సముచితముగ నాషాఢి నిజరతియు । నమలతరంబు మహాస్థానంబగు
చండముండి యను స్థానమునందును । దండిని పేరిట దగు నీశ్వరియును
భారభూతిలో బరగును భూతియు । నారయ నాకులమందు గులేశ్వరి
తలప హరిశ్చంద్రంబును జంద్రిక । లలిత శ్రీశైలంబున శాంకరి
వరుసను జప్యేశ్వరము త్రిశూలయు మరి సూక్ష్మయనన్ మాత్రకేశ్వరిని
ప్రేమ మహాకాళిని శాంకరియును । భూమిమధ్యమంబున శర్వాణియు
మరి కేదారపు మార్గదాయినియు । ధరణిని భైరవ ధామ భైరవియు
గయలోనను మంగళ యను దేవత । ప్రియయగు స్థాణు ప్రియ కురుభూమిని
మునుకొని నాకులమున స్వాయంభువి । కనకలేఖలో గనపడు నుగ్రయు
విమలేశ్వరమున విశ్వేశ్వరియును । నమితకీర్తియగు నట్టహాసమున
నానందయనా నలరెడిదేవియు । నౌను మహేంద్రమహాంతక యను సిరి
భీమపురంబున భీమేశ్వరియును । భూమిని వస్త్రాపురము భవానియు
అవని యశముగను నర్ధకోటికను । రవణమువలె రుద్రాణీదేవియు
నవిముక్త విశాలాక్షీ దేవియు । భవమడచు మహావలయమునందును
బాగయిన మహాభాగాదేవియు । గోగణ్యం బగు గోకర్ణంబున
పరమోత్తమయగు భద్రకర్ణియును । పరమశ్రేయము భద్రకర్ణికను
పరగ వశించును భద్రాదేవియు । భరితంబయిన సువర్ణస్థలిలో
నురుకళ్యాణద యుత్పలాక్షియును । సరవిని స్థాణుస్థానమునందును
సకలము నేలెడి స్థాణీశ్వరియును । ప్రకటిత కమలాపట్టణమందును
కమలాలయ యను కామేశ్వరియును । దమిగన చ్ఛగలండస్థానంబున
జయసంధాత్రి ప్రచండాదేవియు । ప్రియమున వీరిని పేర్మి గొల్చెదరు
సుకురండంబున శోభిలుచున్నది । మకుటముబెట్టిన మాన్యత్రిసంధ్యయు
మాకుటపురమున మకుటేశ్వరియును । మాకారణమగు మండలేశమున
శాండకినాందగు శక్తిభేదమున । చండత గాలంజరమున గాళియు
శంకుకర్ణమున సమ్మతి ధ్వనియును । నింకను గన స్థూలేశ్వరపురమున
స్థూలకారిణి స్థూలాదేవియు । హేలాపురమున హృల్లేఖేశ్వరి
క్షేత్రమహిమములు జెప్పితి మున్నే । గోత్రాధిప నీకును సంతసమున. ౨౩౧

క. దాత్రంబు లఘప్రతతికి । పాత్రంబులు స్తోత్రములకు బాలితబహు స
ద్గోత్రంబులు చిత్రములకు । జిత్రంబులు లోకజనని శ్రీక్షేత్రంబుల్. ౨౩౨

క. దానంబులు ధ్యానంబు ల । నూనంబులు నిరతపూజ నోచితవిలస
త్సూనంబు లదీనంబులు । జ్ఞానంబులు దేవి దివ్య సంస్థానంబుల్. ౭౫౩

వ. అనిన విని. ౭౫౪

క. దేవాదిదేవి నీ పూ । జావిధి వినుపింపుమమ్మ సకలజగంబుల్
గావింపను బ్రోవను వి । ద్రావింపను నీవకాదె తల్లి శక్తీ. ౭౫౫

వ. అనన విని శ్రీదేవి యత్యంతకృపారసతరంగమంగళాపాంగయై యిట్లనియె. ౭౫౬

చ. అవనిధరేంద్ర! నీవడిగినట్టి మహార్థము దెల్పుదాన మీ
భవభయము ల్తొలంగు సదుపాయము వేడుట కేను మెచ్చితిన్
ద్వివిధము నాదు పూజనము దివ్యతరంబగు నాంతరంబునుం
బ్రవిమలబాహ్యపూజనము నా జగతిం బుధవర్గగణ్యమై. ౭౫౭

మ. వసుధన్ బాహ్యము రెండుమార్గములుగా వాక్రుచ్చి రెట్లన్న మం
త్రసమేతంబగు వైదికంబొకటి తంత్రప్రక్రియం దాంత్రికం
బెసగంగా నొకటైయు వైదికము దా నింపారు మూర్తిప్రభే
దసముల్లాసత మీరుచున్ ద్వివిధమై తత్త్వార్థవిత్సేవ్యమై. ౭౫౮

క. మొదలన్ వైదికమును జె । ప్పెద విను మచలాధినాథ! పృథుతరమగునా
మొదటితనువు జూచితిగా । పదినూరులు వేలు తలలు పదములతోడన్. ౭౫౯

క. ఆ రూపమె పూజ్యంబును । ప్రేరకమును సర్వశక్తి మేధ్యంబు పరం
బారూఢిం దత్పూజా । పారాయణతయ సమస్తపాపము లడచున్. ౭౬౦

క. అదియే శరణము కావున । మది ధ్యానింపంగవలయు మరిమరి స్మరియిం
పదగును బూజింపదగున్ । గుదిరిన మానసముతోడ గుధరాధీశా! ౭౬౧

క. జన్మంబులు గావింపుడు । నన్నుం బరితృప్తజేసి నానాసుఖముల్
విన్నాణముగా గయికొను । డెన్నగ వైదికముకంటె నేదిగల దిలన్. ౭౬౨

క. భువి గేవలకర్మంబుల । నవితథమగు ముక్తిగలుగ దటువుగావున ధీ
ప్రవిమలమధ్యాన జప . శ్రవణ జ్ఞానములు గల్గి జరుపుడు కర్మల్. ౭౬౩

క. యుక్తిదనరు ధర్మంబుల । భక్తిజ్ఞానములు గలుగు భాసురలీలన్
భక్తిజ్ఞానము లొదవిన । ముక్తి పెరటికల్పకంబు భూధరవర్యా! ౭౬౪

క. శ్రుతియును స్మృతియును రెండే । గతులగు ధర్మంబులకును గావున నెవడే
నితరంబులగొని ధర్మము । లతికినచో నవి తలంప నాభాసములే. ౭౬౫

శా. సర్వజ్ఞత్వము సర్వశక్తితయు స్వేచ్ఛావృత్తియున్ బూరితా
ధర్వానంతగుణప్రభావము మదీయంబేసుమీ నుల్లస
ద్గీర్వైఖర్యుదితమ్ములై శ్రుతులు సద్గీతంబులై ధర్మముల్
పర్వంజేసె జగత్త్రయంబున దదభ్యాసంబు గావింపుడీ. ౨౬౬

శా. శ్రుత్యర్థంబులుగొంచు నమ్మనుముఖుల్ శోధించి కావించి రా
స్మృత్యుక్తుల్ మదుదారభక్తియుతులై శ్రీదేవినై యున్ననా
కత్యంత ప్రియముల్ గదా స్మృతిహితవ్యాపారముల్ కావునన్
స్మృత్యాచారము మానరాదు వినుడీ సిద్ధాంతవాక్యంబులన్. ౨౬౭

శా. తంత్రప్రక్రియలంచు గొన్నికల వా తంత్రోక్తులందుం బ్రదయీ
మంత్రార్థంబుల కానుకూల్య మెచటన్ బాటిల్లు నాభాగముల్
సంత్రాసంబులె లేక గైకొనుడు స్వేచ్ఛావృత్తిదుష్ప్రక్రియా
యంత్రాధీనులరైన వేదచయనిందాఘంబు పైపైబడున్. ౨౬౮

చ. సకలమెరుంగు నా వచనసారము వేదము రాజునాజ్ఞపో
లిక యగు దాని బోవిడచి లీలను స్వేచ్ఛ జరించెనేనియున్
ప్రకటము శిక్ష యట్లగుట పర్వతరాజవరేణ్య దివ్యవై
దికముల నమ్మి కర్మసమితిన్ గొని నాకు బ్రియంబుసేయుడీ. ౨౬౯

మ. ప్రకట ప్రాభవమొప్ప నిత్యమును నే బ్రహ్మాండగోళంబులన్
సుకరప్రక్రియ నేలుబుద్ధిని విధి స్తోమంబు గావించితిన్
వికలంబై జగమందు ధర్మముసెడన్ వేదంగ నే నొక్క ది
వ్యకళన్ సంభవమొందజేసి కుజనవ్యాపారమున్ జేసితిన్. ౨౭౦

శా. వేదంబున్ విడనాడి యన్యమగు దుర్వృత్తిన్ బ్రవేశించు మ
ర్యాదాహీనులకేకదా శ్రవణమాత్రత్రాసదోగ్రంబులై
బాధల్ సేయుచునుండునట్టి నరకావాసంబులన్ జేసితిన్
సాధుల్ వేదము నమ్మియున్నకతనన్ స్వర్గాదులన్ జేసితిన్. ౨౭౧

క. నా నిర్ణయముల విడివడు । మానవులను దోలవలయు మనుజపు లన్య
స్థానములకు నిజదేశము । లో నుంచఁగరాదు కార్యలోలుపు లగుచున్. ౨౭౨

వ. శ్రుతిస్మృతివిరుద్ధంబులయిన శాస్త్రంబులు తామసంబులు, కామపాలకంబును, కౌల కంబును, భైరవాగమంబును, లోకమోహనార్థంబు రుద్రుచేఁ జెప్పఁబడినవి. దక్ష భృగు దధీచుల శాపంబులచే దగ్ధులయిన బ్రాహ్మణులు వేదమార్గబహిష్కృతులయి నశింపఁ గాంచి శివుండు వారల సోపానక్రమంబున నుద్ధరింపం దలంచి శైవ వైష్ణవ సౌర శాక్త గాణాపత్యంబులగు నాగమంబులం గల్పించె. అందు వేదవిరుద్ధంబులగు ధర్మంబులునుం

గలవు. వైదికులచే దదర్థంబులు గ్రాహ్యంబులే యగు కాని కేవల విరుద్ధంబులగు నర్థంబులు మోహకంబు లని యెరింగి విడువవలయు. సర్వవిధంబుల వేదంబు నాశ్రయింపవలయు. ధర్మంబు జ్ఞానంబునిచ్చు. జ్ఞానంబు మోక్షంబు నిచ్చు. మరియు, ౭౬౩

ఉ. దారధనాత్మజేషణల దారికిబోక యహంకృతిం దగన్
జేరక సర్వభూతదయఁ జేకొని మద్గతచిత్తుడై సదా
కారిణియైన నన్ను గతిగా మది నెంచిన బ్రహ్మచారులన్
దారయుతు ల్వనుల్యము లుదారతఁ గాంతురు నిత్యయోగమున్. ౭౬౪

ఉ. ఓరిమి నిత్యయుక్తులు నియోగులు జ్ఞానరవిప్రకాశవి
స్తారులు మాయచీఁకటిని దప్పి ననుం భజియించి తారు సం
సారములందు నుండియును సారసపత్రమునంటలేని య
న్నీరునుబోలె నుందురు వినిర్మలమార్గముపట్టి భూధరా ! ౭౬౫

ఉ. వైదికపూజయందుఁ గల వాసి వచించితి సంగ్రహంబుగా
మోదమునం ద్వితీయగతి ముఖ్యముల న్వినుము నన్నుఁ గొల్తు రా
సాదులు విగ్రహంబునను స్థండిలమందును సూర్యచంద్రులన్
బాదుగ బాణలింగ జల భవ్యపటంబుల యంత్రహృత్తులన్ ౭౬౬

తే. గీ. దశవిధస్థానముల నన్ను దగిలికొల్చు । నిత్యసౌందర్యశాలిని నిఖిలలోక
జనని నానందమయిని ప్రసాదసహిత । నమల నాద్యంతరహిత శ్రీ నంబ దేవి ౭౬౭

తే. గీ. అల్పసామర్థ్యవశమున నాంతరంబు । సేయఁజాలనివారికిఁ జెప్పి రిఁకను
విత్తశాఠ్యం బొనర్పక వివిధగతుల । బూజలొనరింపదగునంచు భూధరేంద్ర. ౭౬౮

క. ప్రాతఃకాలమునందే । చేతోమోదమున లేచి శిరసున సుషమో
పేతంబగు పద్మంబును । ప్రీతిన్ స్మరియింపవలయుఁ బృథుభక్తి మతిన్ ౭౬౯

క. తరువాతను నిర్దపుఁ గ । ప్పురమును దులకించునట్టి భూరిచ్ఛవితో
గరమొప్పుచున్న నిజగురు । వరునిన్ స్మరియింపవలయు వసుధా ధపతీ. ౭౭౦

క. అంతటఁ గుండలిదేవిని । సంతోషమనస్కుఁ డగుచు స్మరియింపఁదగున్
స్వాంతఃపదవీచారిణిఁ । గాంతమహానందపదవికాసిని నంబన్. ౭౭౧

క. ఆ కుండలిశిఖ నడుమను । జోకం దనరారునట్టి సుభగను నన్నున్
దేఁకువతో తలఁపుఁడు ది । వ్యాకృతి శ్రీదేవి సచ్చిదానందమయిన్. ౭౭౨

వ. పిమ్మట శౌచాదిక్రియలఁ గడపి మత్ప్రీతికై యగ్నిహోత్రంబు సేసికొని హోమాంతంబున న్వాసనస్థుండై పూజాసంకల్పంబు సేయవలయు నందు ముందు భూతశుద్ధింజేసి మాతృకాన్యాసహృల్లేఖాన్యాసంబులుసేసి మూలాధారంబున హకారంబును హృదయంబున

రేఫంబును భ్రూమధ్యంబున ఈకారంబును మస్తకంబున హ్రీంకారంబును న్యసించునది. మంత్రోక్త కల్పోక్తక్రమంబు లెఱింగి న్యాసంబులు చేసినపిమ్మట నిజదేహాభ్యంతరంబున హృత్పథంబున మహాదేవిని నిల్పి ప్రాణాయామంబులు సేయునది. ౨౨౩

క. వనజాసనుండు విష్ణుం । డును రుద్రుం డీశ్వరాఖ్యుఁడు సదాశివుడున్
దనరంగ నైదుపీఠము । లొనరు న్నాచరణకమలయుగ్మము క్రిందన్. ౨౨౪

తే. గీ. పంచభూతాత్మలగువారు పరమశక్తి । నైన చిద్రూపయుక్తి నవ్యక్త నగుచు
నన్నివిధముల వారల కధికమైన । మహిమ దనరారుచుండును మహీధరేంద్ర! ౨౨౫

తే. గీ. అట్టి నన్నును ధ్యానించి యఖిలభోగ । పతినిఁ బూజించి జపియించి వరుస షోడ
శోపచారములను జేసి యొనర నాకుఁ । బూజఁగావించి సంతోషపూర్వకముగ. ౨౨౬

తే. గీ. మహితదిగ్బంధమునుజేసి మాన్యుడైన । గురువు నర్చించియుఁ దదాజ్ఞ గొనుచు బాహ్య
పూజకు దొరంకొనుచు దివ్యమూర్తి నన్ను । బేర్మి నావాహనముచేసి పీటయిచ్చి. ౨౨౭

ఆ. వె. మరియు నర్చనాద్య మరసి ప్రాణప్రతి । ష్ఠాదికంబు సేసి యర్ఘ్యపాద్య
సహిత మాచమనము స్నానంబు వస్త్రయు । గ్మంబు భూషణాదికంబు లిచ్చి. ౨౨౮

తే. గీ. గంధపుష్పాదికము లిచ్చి కరము భక్తి । యంత్రమున నావహింపించి యర్చనమున
దృప్తినొందింపఁదగు నిట్లు దినదినంబు । శక్తికొలదిని మనమున ముక్తిగోరి. ౨౨౯

క. అనుదినము నిట్లు నల్పుట । కును శక్తుడుగాదయేని కోరికలర శు
క్రునివాసరమున దప్పక । యొనరింపఁగవలయుఁజుమి మహోర్వీధ్రపతీ! ౨౩౦

క. నైవేద్యములును వీటీ । సేవయు గీతములు నృత్యసేవయు శయ్యా
సేవయు సుగంధసేవయు । నేవేళను సేయఁదగుసుమీ గిరివర్యా! ౨౩౧

తే. గీ. వేదపాఠంబు లుత్తమ విప్రవరుల । చేతఁ జేయింపఁదగు నాత్మసిద్ధికొరకు
భూసురుల కిడఁదగు మంచి భోజనములు । మదిని హృల్లేఖ నెప్పుడు మానరాదు. ౨౩౨

క. హృల్లేఖామంత్రంబును । సల్లలితముగా స్మరింప సకలార్థములన్
దల్లి యొసఁగు నెల్లప్పుడు । కల్లలుగా వంతకంటెగలదె జగమునన్. ౨౩౩

వ. అని యిట్లు దెలిపి శ్రీదేవి యంతర్ధానంబు నొందె నని వక్కాణించి మరియు వ్యాసుండు ౨౩౪

క. ఈ గీతలు వినఁ జదువం । బాగుగ శ్రీదేవి యిచ్చుఁ బరమైశ్వర్య
శ్రీ గో ధన ధాన్యాయు । ర్భోగ స్వర్గంబు లెపుడు భూతలనాథా! ౨౩౫

క. తదనంతరమున నమరులు । త్రిదివంబున కేగి రంత దేవియు గౌరీ
విదితాఖ్య గాంచి యంతయు । ముదమున హిమవంతునకును బుట్టె మహీశా! ౨౩౬

క. హిమవంతుఁడు దన కన్యక । నమరావనదక్షుఁడగుచు నభవునకిచ్చెన్
విమలాంగివలన నాతఁడు । బ్రముదితుడై కనియె సుతునిఁ గ్రౌంచవిభేదిన్. ౨౫౭

ఆ. వె. శక్తిధరునివలనఁ జచ్చెఁ దారకుఁడను । రక్కసుండు పిదప లక్ష్మికొరకు
దేవసంఘమెల్ల దేవిని బ్రార్థింపఁ । బాలవెల్లిఁ గమల ప్రభవమాయె. ౨౫౮

క. శ్రీకమలాదేవీమణి । వైకుంఠుడు దా గ్రహించి వక్షంబే య
స్తోకాలయముగ నునిచెన్ । నాకావాసులకు మిగుల నానందముగన్. ౨౫౯

## — : కృ తి ప తి సం బో ధ న ము :—

శా. కాదేట్కంకణతా శిరోవలయతా కమ్రోల్లసద్ధారతా
భేదాపాదివినోదమోదకలనాపిస్ఫారివై చిత్ర్యవి
జ్ఞాదౌర్బల్యవిధూతసర్వసుమన శ్చైతన్యభీవారణే
హాదార్ద్ర్యాదృతమంజులామృతకరా ! యల్లూరి సోమేశ్వరా ! ౨౬౦

గద్య. ఇది శ్రీమదిష్టకామేశ్వరీ పాదారవింద మకరందతుందిల మానసేందిందిర, దాసు వంశపయఃపారావారరాకాసుధాకర, కామాంబా కన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హారిత గోత్రాలంకార కృష్ణామండల మండనాయ మానాల్లూరగ్రహార పూర్వార్జితధరావిరాజమాన శ్రీ వీరప్రతాప కోర్కొండహంవీర రామచంద్ర మీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదక నియోగ భారవ్యవహార, శ్రీ వేంకటేశ్వర వరప్రసాదసంభూతకవిత్వ విద్యావిశేష బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేక గ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితి ప్రచార నిత్య, శ్రీ రామామాత్య ప్రణీతంబగు శ్రీ దేవీభాగవతం బను మహాపురాణంబునందు సప్తమ స్కంధము.

సప్తమస్కంధము సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీ శా ర దాం బా యై న మః

శ్రీ

# దేవి భాగవతము

## అష్టమస్కంధము

శ్రీ శ్రేష్ఠతమశ్రేయ
స్వాశ్రయచరణాబ్జయుగళసమధికశోభా
మిశ్రజటావన్మసిరా
జిశ్రుతిమిళదభినివేశ శ్రీసోమేశా. ౧

### —: మనువునకు దేవి వరమిచ్చుట :—

వ. ఆపదఢింపుము జనమేజయుండు నిభృతానందరసనిమగ్నుండై సాత్యవతేయున కిట్లనియె. ౨

క. అమృతరస సమ్మితంబుగ । నమృతకరార్కాన్వయోద్ధ హరి చరిత్రన్
క్రమముగ వినిచితివి ప్రమో । దమునం జెవులార వింటి ధన్యుడనైతిన్. ౩

క. ఆ యా మన్వంతరముల । నే యే విధమున మహామహేశ్వరి విబుధ
ధ్యేయ కొలువంగఁబడు మఱి । యే యే స్థానముల నెప్పు డెట్లుండు మునీ ? ౪

వ. అనిన విని ద్వైపాయనుండు భూపాలున కిట్లనియె. ౫

సీ. వినవయ్య రాజేంద్ర విన్పించెదను నీకు నారాయణునివల్ల నారదుండు
తొల్లి విన్నవితాన నెల్లవృత్తాంతంబు స్వాయంభువుడుగదా ప్రథమ మనువు
నతని గేహినిపేరు శతరూప యందురు వాఁ డొక్కనాడు నిర్వ్యాజభక్తిఁ
దండ్రియయిన బ్రహ్మదగ్గర జని మ్రొక్కి పరిచర్య సేసెడితరి నజుండు

తే. గీ. పుత్రకా నీవు కొలువుము భువనకర్త్రి। తత్కృపామహిమంబునఁ దనర లోక
సర్గము నొనర్పుమని పల్క సరగ నతఁడు । పరమకళ్యాణి దేవిని భక్తి గొల్చె.

దండకము. శ్రీ హ్రీ దయా కాంతి దాక్షాయణీ చిన్మయీ సచ్చిదానందరూపా సదారాధ్య సర్వేశ్వరీ సర్వసంపత్కరీ సర్వశోభాకరీ సర్వవిద్యాకరీ సర్వభద్రంకరీ శాంకరీ లోకధాత్రీ ననుం దీనునిం ద్వత్పదాంభోజభృంగాయమానుం గటాక్షింపవే నింపవే కోరికల్ నీకు నెవ్వార లీ డీ జగంబెల్ల నీ మాయచేఁ బుట్టు గిట్టుంగదే వేదవాక్యంబులున్ ధర్మశాస్త్రంబులుం దంత్రపాఠంబులున్ న్యాయవైశేషికాదుల్, మహాకావ్యముల్ సర్వమున్ నిన్నెఁ గీర్తించు నీవేగదా బ్రహ్మను న్విష్ణువు న్శంకరుం గంటి వో యంబ నీయందు లోకంబులు న్నీవు లోకంబులం దుందువో తల్లి నన్నుం బ్రసన్న స్వరూపంబుతో నేలుమమ్మా సదా నీపదధ్యానమే నాకు దిక్కంచు నే నమ్మియున్నాఁడ న న్నాలనే ముంచెదో నీళ్ళనే ముంచెదో యశ్యము న్నేఁ దలంప న్మహానీ పురాణీ సరోజాతగర్భాండముల్ నీకునుం కందుకంబుల్ విలాసార్థకంబుల్ రమాదేవియు న్గౌరియున్ భారతీదేవియుం ద్వత్కళాలేశసంజాతలేకాదె కళ్యాణి లోకేశి లోకైకమాతా ప్రతాపాఢ్య శృంగారలీలాలసత్కామరూపా శుకాలాప రాకామృగాంకాననా సద్వరం బిచ్చి న న్నేలుమమ్మా శివా శ్రీ జయశ్రీ జయశ్రీ. ౭

క. అని యీగతిఁ బ్రార్థించిన । జనని ప్రసన్నయయి పలికె స్వాయంభువ నీ
మనమునఁ గోరికఁ దెలుపుము । పని యెట్టిదియైన నీకు బ్రాపింపింతున్. ౮

క. నావుడు విని సంతసమున । దేవికిఁ దా మ్రొక్కి పలికె దీనవదనుఁడై
భూవినుతుఁడు స్వాయంభువుఁ । డో విశ్వేశ్వరి మహామహోమతి యనుచున్. ౯

వ. నిర్విఘ్నంబుగాఁ బ్రజాసర్గంబు నెరవేరునట్లు వరం బిమ్మనిన నట్లయగునని దేవి యనుగ్రహించి చనియె. నంత స్వాయంభువుండు పితామహునిం జేరి తండ్రీ ! నాకు రహస్యస్థానంబు దయచేయుము. ప్రజాసర్గంబుఁ జేసెద. భగవంతుండైన నారాయణుం గొల్చి యజ్ఞంబులు సేసి యతని యాజ్ఞం గైకొనియెద. ననవుడు నతండు చిరకాలంబు చింతించి యిది యెట్లు సంపాదించెద, ధరాతలంబెల్ల రసపూరితంబై యుండె. నారాయణ సహాయంబు వేడెద నని యెంచి. ౧౦

మ. అని పద్మోద్భవుడున్ మనుప్రముఖపుత్రానీకముం గూడి చిం
తనముం జేయుచునుండ నాతని మహోద్యన్నాసికాగహ్వరం
బునఁ దట్టాలున నుట్టిపాటుగనియెం బో వ్రేలికణ్పెందు చ
క్కని కోలం బది తక్షణంబ పెరిగెన్ గంధేభతుల్యంబుగన్. ౧౧

మ. మఱి దా నొక్కముహూర్తమాత్రమున శుంభత్కుంభినీ భ్రోన్నతిన్
బెరిగెన్ బద్మజముఖ్యు లద్ది గని యెంతే వింతనందంగ న
క్కిరి ఘోరక్రియ బొబ్బవెట్ట విని యక్షీణోరుభక్తి స్పృహా
నిరతిన్ సంస్తవమాచరింపఁ గరుణం డిగ్గె న్మహాంభోధిలోన్. ౧౨

మ. కలగంబారి సముద్రుఁడో సకల రక్షాదీక్ష ! రక్షింపు మా
విలఖావం బిడ కంచు వేడినఁ గృపా వీక్షన్ జలాటంబులన్
దొలగంద్రోయుచు నంతరంబువుల లోతుంగాంచి లోఁదూరి యం
దిలపై నిట్టటు పాఱి ముట్టియును మృత్తింపార మూచూచుచున్. ౧౩

మ. తన దంష్ట్రాగ్రమునందు జంతుయుతభూధ్రవ్రాతకాంతార ప
త్తన కాసార నదీసమేత నవనిన్ దరోద్ధతి న్మీదికె
త్తెను మత్తేభము పద్మినింబలె మహాదివ్య ప్రభావాఢ్యుడై
కని బ్రహ్మాదులు విస్మయాకలితులై కావించి రుచ్చైస్స్తుతుల్. ౧౪

శా. నానాదీనజనైకరక్షణ సదానందా ఘనాకార య
జ్ఞానానాదరణాఖ్య శార్ఙ్గి నిఖిలేశా సంతతశ్రీధరా
జ్ఞానానందనయాదిసంకలితదీక్షా దాసచిత్తాంచిత
స్థానా రాక్షసశిక్షణా చరితచిత్రా ధీర నారాయణా ! (నిరోష్ఠ్యము) ౧౫

క. భావిభవాపీపాపా । భావాభౌమాభ్రభావ భవ్యభ్రూమా
భూవా మామాభామా । భావభవవిభావభూమ భవభీ భీమా ! (ఓష్ఠ్యము) ౧౬

క. అని యిట్లు స్తవముసేయగఁ । విని తన కరుణారసంబు వీక్షలచేతన్
గనపఱచియున్న నంతటఁ । గనకాక్షాసురుఁడు భూమి గదువడిఁ జుట్టెన్. ౧౭

తే. గీ. చుట్టి యంబుధిలో వైవఁ జూచుచుండ । నంబుజాక్షుండు రౌద్రరసంబుమీర
వానిఁ దన కోఱలను జీఱి వసుధ గూల । నడఁచి తద్రక్తపూరసిక్తాంగు డగుచు. ౧౮

## —: స్వాయంభువమన్వాది కథనము :—

వ. ఇట్లు నారాయణుండు భూమి నుద్ధరించి నిజనివాసంబునకుం జనిన యనంతరంబ బ్రహ్మ స్వాయంభువును బ్రజాస్వర్గంబునకు నియోగించి నీతులు చెప్పి నిజధామంబుజేరె. నంత స్వాయంభువుండు మహాతేజస్కులయిన ప్రియవ్రతోత్తానపాదు లను నిద్దఱు కొడుకులను, నాకూతియు, దేవహూతియుఁ, బ్రసూతియు నను ముప్వురఁ గూతులం గాంచి మఱియు నాకూతిని రుచి యనువానికిని, దేవహూతిని కర్దము దనువానికినిఁ, బ్రసూతిని దక్షునకును నిచ్చె. నందు రుచికి యజ్ఞుండును. దేవహూతికిం గపిలుండును బుట్టిరి. యా కపిలుండు సాంఖ్యాచార్యుండై ప్రసిద్ధికెక్కె. బ్రసూతి కనేక కన్యకలుపుట్టి ప్రజావృద్ధి గావించిరి. ఇట్లు స్వర్గంబు క్రమక్రమంబుగ వృద్ధినొందె. గపిలుండు దేవహూతికి సాంఖ్యంబు సెప్పె. యోగాదులును నధ్యాత్మజ్ఞానవిశేషంబులును గఱపి నేటికినిఁ గపిలుండు సాంఖ్యాచార్యుండై యున్నవాఁడు. వెండియుం బ్రియవ్రతు వృత్తాంతంబు సెప్పెద వినుమని నారాయణుండు. ౧౯

## —: ప్రియవ్రత వంశవర్ణనము :—

తే. గీ. వినుము స్వాయంభువునకుఁ బెద్దకొడుకు । క్షమఁ బ్రియవ్రతుఁడనువాఁడు జనకు గొల్చి
సత్యమును ధర్మమును గల్గి శమగుణాఢ్య విశ్వకర్మతనూజనుఁ బెండ్లియాడె. ౨౦

తే. గీ. ఆపె పేరు బర్హిష్మతి యండ్రు కనియె నొక్క పదిమంది కొడుకుల నొక్కగూతు
జంద్రముఖి మందగమన నూరస్వతి యను । సైకతనితంబ బహుసుషమాకదంబ. ౨౧

సీ. అగ్నీధ్రు డిధ్మజిహ్వాఖ్యుండు యజ్ఞబాహుండు మహావీరుఁ డోలి రుక్మ
శుక్రకాభిఖ్యా విశోభియు ఘృతపృష్ఠుఁ డనువాఁడు సవన మేధాతిథులును
వీతిహోత్రుండు కవియు వహ్నినాముండు ననువారు పదిమంది యాత్మభవులు
వీరిలో ముప్వురు వీతరాగులు వారు కవి మహావీరాఖ్య సవను లెన్న

తే. గీ. ఆత్మవిద్యాధురంధరు లనఘు లూర్ధ్వరేతసులు నిస్పృహులును నిర్ధూతకలుష
మానసులు దివ్యహంసాశ్రమమున నిల్పి । విడిచి రనిశంబు త్రైగుణ్యవిషయములను. ౨౨

క. మఱియొండుభార్యయందు ము । వ్వురు పుత్రులు మహితగుణులు పుట్టిరి వారిం
ధర నుత్తమ తామసు లని । వర రైవతుఁడని పిలచిరి వనజపుత్రా. ౨౩

క. మన్వంతరాధిపతులగుచు న్వర్తిలునట్టి యిట్టి సుతులు గలిగి పే
ర్మి న్వసుధ నఖిలభోగ సమన్వితుఁడై యలరె నా ప్రియవ్రతుఁ డనఘా! ౨౪

క. ఆదివిభాగంబున న । య్యాదిత్యుఁడు వెలుగఁగా బ్రియవ్రతరా జే
కాదశమహార్బుదసమల్ । మేదిని బాలించె మంచి మేని బలముతోన్. ౨౫

తే. గీ. పరమమునినాథ రెండవభాగమందుఁ జిమ్మచీకటు లొదవె నీ క్షితితలమున
దానిఁగని తన యోగవిద్యామహిమము । వలన వారింతునని పూని వడు వెఱింగి. ౨౬

క. రవివర్ణ రథముపై దా । నవితథముగ నేడుసారు లవనిం దిరుగన్
రవియున్నకరణి రాజిలె । దవిలిన రథనేములేకదా సంద్రంబుల్. ౨౭

క. ఆ నేములకును మధ్య । స్థానంబులు ద్వీపసంజ్ఞ దనరె మునీంద్రా
నానావిధముల నతని య । నూన యశోలతలు బ్రాకి యుల్లసిలంగన్. ౨౮

వ. ఆ యేడుప్రదేశంబులు జంబు ప్లక్ష శాల్మలీ కుశ క్రౌంచ శాక పుష్కరంబు లను సప్త ద్వీపంబు లయ్యె. నేమిభాగంబులు లవ ణేక్షురస సురా ఘృత క్షీర మండ శుద్ధోదక సముద్రంబు లయ్యె. మఱియు జంబూద్వీపంబు క్షారజలధిచేతను వేష్టితంబై యుండు. దానికి నగ్నీధ్రు రాజుం జేసె. నిక్షురసపరివేష్టితంబైన ప్లక్షద్వీపంబున కిధ్మజిహ్వు నధిపతిం జేసె. సురోదధిపరివేష్టితంబైన శాల్మలీద్వీపంబునకు యజ్ఞబాహు నధిపతిం జేసె. ఘృతవార్థిపరివేష్టితంబైన కుశద్వీపంబునకు హిరణ్యరేతు రాజుం జేసె. క్షీరపారావారపరివేష్టితంబయిన క్రౌంచద్వీపమునకు ఘృతపృష్ఠు నధిపతిం జేసె. మండ

సముద్రపరివేష్టితంబైన శాకద్వీపంబునకు మేధాతిథిం భూపతిం జేసె. శుద్ధోదక సింధు పరివేష్టితంబైన పుష్కరద్వీపంబునకు వీతిహోత్రు జనపాలుం జేసె. ఊర్జస్వతియను కన్యను భార్గవున కిచ్చె. దేవయాని భార్గవునకుం గుమారికయై ప్రసిద్ధిగాంచె. నంత ప్రియవ్రతుండు యోగమార్గంబు నాశ్రయించె.

## —: భూ గో ళ వి స్తా రా ది వ ర్ణ న ము :—

సీ. వినుమయ్య మునినాథ ద్వీప వర్ష ప్రభేదములను వివరింతు దైవనిర్మి
తప్రకారంబులు దనరు జంబూద్వీప మొగిఁ బ్రథమము లక్ష యోజనములు
వర్తులాకారంబు వనజకర్ణికఁబోలె నవవర్షములతోడ నవని వొల్చు
నొనర దొమ్మిదివేల యోజనమ్ములు వర్షములకు నాయామముల్ భూధరములు

తే. గీ. దీర్ఘములఁగుచు నెన్మిది తివురు వాని । వరుస భేదింపఁజేయును వాని దక్షి
ణోత్తరంబుల విలువంపు లొనర రెండు । వర్షములు గల విక వాని వరుసలందు. ౩౦

సీ. అం దతిదీర్ఘంబు లవి నా ల్గిళావృతం బనునది మధ్యంబునందు నుండు
దానికి బొడ్డుగాఁ దనరు సువర్ణాద్రి యదరును లక్షయామడలయెత్తు
కర్ణిక భూగోళకమలంబునకు నది వెలయు నిర్వదిరెండు వేల యోజ
నములు శిరంబున నమరంగ మూలంబునందుఁ బదారును నలరుచుండు

తే. గీ. న య్యిలావృతమునకును నవల నీల ఘనకమగు శృంగవంతంబు దనరుచుండు
వరుస నవలను రమ్యక వర్షమొప్పె దాని కవ్వల గురువర్ష మౌనుజుమ్ము. ౩౧

వ. మఱియు నిలావృత రమ్యక కురువర్షంబులం భేదించు నద్రులు మూడై యుండు. నవి ప్రాగాయతంబులై లవణోదధిమేరకు నంటియుండు అవి ద్విసహస్రపృథుతరంబులై యంతకంతకును దశాంశాధికంబులై యుండు. నానా నద నదీ సమేతంబులై యొప్పు. ఇళావృతంబునకు దక్షిణంబున నిషధంబును, హేమకూటంబును, హిమాలయంబును గలవు. అవియుం బ్రాగ్విస్తీర్ణంబులును, నయుతయోజనోత్సేధంబులునై యుండు. నివి హరివర్ష, కింపురుషవర్ష, భారతవర్షంబుల పొలిమేరల నేర్పరుచుచుండు. మఱియు,

సీ. అ య్యిళావృతమున కపరదిగ్భాగంబు దప్పక మాల్యవంతంబు వెలయు
మఱి పూర్వమున గంధమాదనం బుండును నా నీల నిషధంబు లవ్వి రెండు
నెల్లలై యామడ లెక్కువై యొప్పారుఁ గేతుమాలాఖ్యంబు గీర్తిగాంచి
భద్రాశ్వవర్షంబు ప్రథితమై చెలువొందు మందరంబును మేరు మందరములు.

తే. గీ. కుముదమును నను నివి నాల్గు కుధరములును మేరుపాదముల యుతవిస్తారములును
నగుచు నెల్లలుగా నొప్పి యవనియెడల నున్నతిని మీదు మిట్టల మిన్నలగుచు. ౩౩

వ. మఱియు వీనియందుఁ జూత జంబూ కదంబ న్యగ్రోధంబులు క్రమంబున నేకాదశ శతోచ్ఛ్రియంబులై కేతువులుగా నుండు, బయోమధ్విక్షుసజ్జలంబులైన హ్రదంబులు గలవు. వాని జలంబులు పానంబు సేయువారు యోగైశ్వర్యంబులందుదురు. నందన చైత్ర వైభ్రాజక సర్వభద్రంబు లను నాలుగు తోటలు గలవు. వానియందు దేవతలు నిజాంగనాసమేతులై విహరింతురు. మందరంబుపై నున్న చూతంబున నమృతవంతంబు లవు ఫలంబు లొదవు, అవి గిరికూటతుల్యంబులు వాని రసంబులచే నరుణోదం బను నది ప్రవహించు. నచ్చట నరుణయను మహాదేవి దేవదానవవర్గులచే నిరతంబు పూజింపఁ బడుచుండు మఱియు, ౩౪

సీ. అరుణోద మందరం బందున జనియించి య య్యిళావృతమున నమర బాఱి
యచటనున్న భవాని యనుచరులైనట్టి దేవపత్నుల దివ్య దేహగంధ
వహమైన యనిలంబు వాసనల్ దశయోజనములకుఁ గొనితేర నమితలీల
నొప్పెడి నిట్టుల నొనర జంబూఫల సమితియుఁ దుంగదేశంబునుండి

తే. గీ. యవని వ్రాలుచు నేనుగు లంతలేసి । పొసఁగఁ గనుపట్టు తత్ఫలరసము పాఱు
దక్షిణేలావృతంబున నక్షయముగ । నచట జంబ్వాదినీదేవి యలరుచుండు. ౩౫

## —: ఇతర ద్రుమాది వర్ణనము :—

వ. మఱియు నచ్చటి లోకంబుల దేవ యక్ష రాక్షసాదు లద్దేవిం గొల్చి సకలసంపద లందు చుందు రింతియకాక కోకిలాక్షియుఁ, గామకళయుఁ గరుణయుఁ, గామపూజితయుఁ, గఠోరవిగ్రహయు, దేవమాన్యయు, గభస్తినియు, నను నామంబులచే దేవి పూజింపఁ బడుచుండు. జంబూరసం బచ్చట వాయ్వర్కయోగంబున సువర్ణంబగుడు నానాభూష ణంబుల కమరాంగన లుపయోగింతురు. మహాకదంబకోటరంబులనుండి పంచధార లుద్భవిల్లి మధుధారలు పశ్చిమేళావృతంబునం బాఱుచుండు. వానిం బానంబుసేయు దేవతల ముఖగంధంబులు శతయోజనంబులు విస్తరిల్లు, నచ్చట ధారేశ్వరీదేవి పూజింప బడుచుండు. యీమెకుఁ గరాళదేహ యనియుఁ, గాలాంగియనియుం, గామకోటిప్రవర్తిని యనియు నామాంతరంబులు గలవు. కుముదరూఢంబైన వటంబు శతబలంబని పిలువం బడు. కుముదమూర్ధంబునంబుట్టి తద్వటస్కంధంబు నొచ్చి యచ్చటనుండి గోముఖాది నదులు పయో దధి మధు ఘృత గుడాన్నాదులచేతను నంబరశయ్యాసనాభరణంబుల చేతను నిండి యిష్టంబులు సమకూర్చుచు నుత్తరేళావృతంబునం బాఱుచుండు. నచ్చట మీనాక్షీదేవి నీలాంబర, రౌద్రముఖి, నీలాలక నామాంతరంబులచేఁ బూజింపఁబడు. మఱియు నామెకు నతిమాన్య, యతిపూజ్య, మత్తమాతంగగామిని, మదనోన్మాదిని,

మాన, మానప్రియ, మారవేగధర, మారపూజిత, మారమాదిని, మాయూరవరశోభ. శిఖివాహనజనని మొదలగు నామంబులుం గలవు. తదీయ నదంబులందు జలపానంబు సేయువారికి వలీపలిత లక్షణంబులును, క్లమస్వేదదౌర్గంధ్యజరామయభ్రమంబులును లేక నిత్యసుఖంబు గలిగియుండు. నిక మేరుపర్వతంబునకుం జుట్టును గేసరంబులుం బోలె నిరువది పర్వతంబులు గల వెవ్వి యనిన, ౩౬

సీ. ధరఁ గురంగంబును గురగంబును గుసుంభ ధాత్రీధరంబును దగు త్రికూట
శిశిర పతంగక క్షితిధరంబు లురుచక్రంబును నిషధంబు గపిల శంఖ
పర్వతంబులు శితివాసముల్ వైదూర్య చారుధి ఋషభ హంసమ్ము లింక
నాగభూధరమును నారదశైలంబు కాలంజరంబు వికంక మివియ

తే. గీ. యిరుబది నగంబు లింక నగ్గిరికిఁ బూర్వ । భాగమున రెండుశైలముల్ బాగుమీరు
నవియుఁ బదియు నెనిమిదివే లామడలగు । మఱియు విన్పింతు వినుమయ్య మౌనివర్య! ౩౭

## —: మేరుపర్వత వర్ణనము :—

వ. ద్విసహస్ర ప్రమాణంబులగు జఠర దేవకూటంబు లుత్తరంబునను, పశ్చిమంబునం బవమాన పరిమాత్రంబులను, దక్షిణంబునం గరవీర కైలాసంబులును, మఱియు నిట్లే మేరువున కుత్తరంబునఁ ద్రిశృంగ మకరంబులును మేరు మూర్ధంబునం బ్రహ్మపురి యున్నయవి. అప్పురి దశసహస్రయోజనంబులఁ బొడవును, నంతియ వెడల్పునై యుండు. నది శాతకౌంభయుతంబు దాని తర్వాతిలోకంబులు లోకపాలురవి. మేరువుమీదం దొమ్మిది పట్టణంబులు గలవు. వాని నామంబులు మనోవతియు, నమరావతియు సంయమనియుం, గృష్ణాంగనయు, శ్రద్ధావతియు, గంధవతియు, మహోదయయు, యశోవతియు నని పిల్తురు. వీనికి బ్రహ్మేంద్రాదులు క్రమంబుగ నధిపతులు అచ్చటనే భగవంతుడైన నారాయణుని వామపాదాంగుష్ఠంబున నిర్భిన్నంబై యంఁ దూర్ధ్వ రంధ్రంబుననుండి గంగ యవతరించె. నది విష్ణుపదం బందురు. కొంతకాలంబున కది స్వర్గమార్గంబునకు వచ్చి దేవనది యయ్యె. నుత్తానపాదుని కుమారుండైన ధ్రువుండు పరమపావనుండై భగవత్పాదయుగళంబు సేవించుచు నిప్పటికి నచ్చటనే యుండె. నచ్చట సప్తర్షులు సర్వలోకహితార్థులయి ప్రదక్షిణంబు సేయుచుందురు. తపో మహిమంబులుగలవారి కాత్యంతికసుఖప్రదంబగు ప్రదేశం బిద్దియ. మహానటుండు తన జటాజూటంబున నవ్విష్ణుపాదోద్భవియగు గంగ నునిచి యవతరించుటయుఁ బ్రసిద్ధంబేకద. బ్రహ్మలోకంబున నున్నది నాల్గుగాఁ జీలి, సీత యనియు, నలకనంద యనియు, చక్షు వనియు, భద్ర యనియు నామంబులతో సముద్రంబునం గలసె,

సీత బ్రహ్మసదనంబుననుండి కేసరాఖ్యపర్వతంబులకు వచ్చుచున్నయది. యా గంగానది యచ్చటినుండి గంధమాదనంబు పైఁబడి తూర్పుగాఁ బ్రవహించి భద్రాశ్వ వర్షంబులఁ దడుపుచు క్షారసముద్రంబునం జొచ్చుచున్నయది. రెండవయది మాల్యవ త్శృంగంబుననుండి వెడలి వేగవతి యయ్యె. అది కేతుమాలావర్షంబునం బ్రవహించి గంగచక్షువను పేరితోఁ బశ్చిమంబుగా వచ్చి సముద్రంబునం గలియు మూడవధార పుణ్య యనియు, నలకనంద యనియు నామంబులం బూని బ్రహ్మపదంబునుండి దక్షిణం బుగా వెడలి పర్వత వనాదులు దాటి హేమకూటపర్వతంబుం బ్రవేశించి యతివేగవతియై భారత వర్షంబునం బ్రవహించి దక్షిణ సముద్రంబునం గలియు. నీ గంగానది యందు స్నానాదు లొనర్చువారలకు రాజసూయాది ఫలంబులు సేకూరు. నాల్గవధార శృంగవత్పర్వతంబునుండి భద్రావాచ్యయై యుత్తరంబుగాఁ బాఱి సముద్రంబునం గలియు. అన్యంబులగు నదీనదంబులు పెక్కులు మేరుమందరంబులనుండి వచ్చుచున్నయవి. భారతవర్షంబు కర్మభూమి యనంబడు. నితరవర్షంబులు భౌములకు స్వర్గప్రదంబులు. స్వర్గులకుఁ బుణ్యశేష భోగస్థానంబులు. అచ్చటివార లయుతాయువులు, వజ్రాంగులు, నాగసహస్రబలసమేతులును, గళత్రాఢ్యులును, సుఖాన్వితులయి యుంద్రు. మహాసౌర తపస్సంపన్నులయి యుందురు సర్వదా త్రేతాయుగసమంబైన కాలంబును నేకవర్షం బున కాప్తగర్భులగు స్త్రీలును నచ్చటి విశేషంబులు నని చెప్పి నారాయణుం డిళావృతవర్ష వృత్తాంతంబు సెప్ప నారంభించి యిట్లనియె. ౩౮

## —: ఇళావృత వృత్తాంత వర్ణనము :—

సీ. అన్నివర్షంబుల నఖిలాంబయగు దేవి యర్చింపబడుచుండు నమితభక్తి
నయ్యిళావృతమున నంబుజోద్భవు నక్షియందు జన్మించిన యాతఁ డొకఁడె
తన భార్యతో దేవతాత్వమూను పరేశు డఖిలాత్మకుఁడు దేవుఁ డమితశక్తి
నాక్షేత్రమందు నన్యపురుషుఁ డొక్కఁడు రాడుసుమా జగద్ధాత్రిజినేలు
తల్లి పరాశక్తి దాను శపించిన కారణంబున శాప మారయంగ

తే. గీ. విమలమైనట్టి యయ్యిళావృతమునకును బురుషుఁడెవ్వాఁడు రారాదు బొరసి యెవ్వఁ
డేని వచ్చిన నప్పుడే యింతిరూపు వచ్చు ననుచును మునిలోకవంద్యచరిత! ౩౯

వ. మరియు నచటివారందఱును స్త్రీలై యుందురు. వారు దేవిం గొల్చువారై సంకర్షణు భజియించుచుందురు. ఆత్మధ్యానయోగంబున సర్వభూతహితంబుఁగోరి తామసియుఁ, దురీయయు నగు ప్రకృతి నృగవంతుఁడగు రుద్రుండు ధ్యానించు నెట్లనిన. ౪౦

సీ. ప్రణవపూర్వక నమః పదము చతుర్థ్యంత భగవత్పదంబును బరగఁ బల్కి
యమ్మహాపురుషాయ యనునట్టి పదమును నతికించి యింపుగా నంతమీద

రాజితంబైన సర్వగుణసంఖ్యానాయ యనునట్టి పదమును వ్యాహరించి
యాపై ననంతాయ యనుచు నవ్యక్తాయ నమ యని పల్కిన నమరునట్టి.

తే. గీ. మంత్ర ముచ్చారణము చేసి మఱియు నాతఁ । డమితభక్తిని భద్రాత్ము నాదిదేవు
నా హయగ్రీవు సకలలోకైకవంద్యు । నిత్యమును గొల్చు నత్యంత నియతిమీర. ౪౧

సీ. అవల భజే భజన్యారణ పాదపంకజ భగస్య యటంచుఁ గడగి పల్కి
కృత్స్నస్య యనియును గెరలి పరంపరాయణ మని పల్కి యత్యలఘులీల
నరసిన యస్య మాయాగుణకర్మవృత్తిభి రని తామసమ్మతిని నిరీక్ష్య
తోహ్యణ్వపి యనుచు దొడి దృష్టి రజ్యతే యనుచు నీశే యదా యనుచు మఱియు

తే. గీ. నోజిత యటంచు మన్యు రంచును తదుపరి నంహసాకస్త మనుచును నవలఁ బ్రీతి
తో నమ న్యేత యని తమితో జిగీషు । రనియు నాత్మ యనుచుండు రనఘచరిత! ౪౨

ఉపజాతి. జగంబు మాయాశ్రయకర్మవృత్తులన్ । దగంగ నీ వెంతయు సేయుఁవాఁడవై
యొగి న్వినోదం బొనరించుచుండఁగా । నగున్ సమస్తోన్నతకార్యసంతతుల్, ౪౩

వ. అని మఱియు ౪౪

సీ. అసద్రుశోయో యని యవలను బ్రతిభాతి మాయయా క్షేబేవ మధు వటంచు
నేచి యాసవతామ్రలోచన యనియు ననాగవధ్వోర్హణ నాగబదము
లతికించి యీశిరె యనుచును హ్రీ యని యత్పాదయో రని యందుమీద
స్పర్శన యని పదంపడి ధర్షితేంద్రియా యని యమాహురనుచు న్నస్యయనుచు
స్థితి జన్మసంయమం త్రిభి రనియు విహీన మనియు మనంతమం చనియు ఋష
యో యనియు నవేద నొగిఁ బల్కి సిద్ధార్థ మివకర్వచిస్థిత మని యవలఁ బేర్మి
భూమండల మ్మని మూర్ధసహస్రధా మను నని యామీద మహితవృత్తి
యస్యాద్య ఆసీత్తు నని గుణవిగ్రహో యని మహాన్విజ్ఞాన యని యవలను
ధిష్ణ్యో యటంచును దెలివితో భగవానజఃకిల యంచును నరగ మఱియు
యత్సంవృతోహమ్మటంచును ద్రివృయస్వతేజసా యనచును నోజఁ దనర
వైకారికిమ్మని వరల తామస మని యైంద్రియని సృజే యనియు వెండి
నలరంగ నేతెవయంయస్య యని వశే యని మహాత్మన యని యటస్థితా శ్శ
కుంతాఇవ యనుచు గొమరొప్పదా సూత్ర యంత్రితా యని మహా నహమటంచు
వైకృతతామసే వరపదంబుల బల్కి మఱి యింద్రయాస్సృజామయని పిదప
నుడువ సర్వేయదనుగ్రహాదిదమని యన్నిర్మితాంకర్త్రి యని యపి యని
యటఁ గర్మపర్వాణీ మ్మనియు మహాజనా యే గురుసర్గమోహిత యటంచు
తనర నవేదనిస్తారణయోగమంచని యంజసాయని యతిముదమున
తస్మై నమో యని తనర తేవిలయో దయాత్మనే యని యిట్టు లాత్మనిష్ఠఁ

తే. గీ. దరలకుండు నటంచును దతవిభూతి । నయ్యిళావృతమున రుద్రుఁ డలరనొప్పు
నాత్మ సంకర్షణుని గొల్చు ననుచుఁ బల్కి । పిదప నారాయణుండు నారదుని జూచి. ౪౫

తే. గీ. అట్టులే ధర్మపుత్రకుండై నయట్టి । వాఁడు భద్రశ్రవుఁడు వాని వంశపతులు
పురుషులును భద్రసేవకుల్ భూరిభక్తి । హయగళుని గొల్చుచుంద్రు భద్రాశ్వమునను. ౪౬

సీ. ప్రణవనమస్సులు భగవతే ధర్మాయ లాత్మవిశోధనాయ నమ లయ్యె
మంత్రంబు దానిని మగుడక స్తవనముల్ గావింతురు శమాదికములుగల్గి
భగవద్విచేష్టితమ్మగు చిత్రములలోనఁ జిత్రంబు జనుఁ డింధుఁ డేయు బాప
మింతయు మేలు నూహింపండు నీశ్వరం బీ జగంబని పెద్ద లొజఁ దెల్పె.

తే.గీ. రట్టులయ్యును మాయచే గట్టుపడుచు నెట్టుదురు కాల మిపుడు నే నిన్నుఁ గొల్తు
నజరు నక్షయు నచ్యుతు నాధదేవు । వేదవేద్య మహాముహా విశ్వవంద్య. ౪౭

వ. భద్రశ్రవసు లిట్లు హయగ్రీవు సంస్తవంబులు సేయుచుందు రని చెప్పిన నారాయణునితో నారదుండు, ౪౮

## —: వర్ణాంతర్గత సేవ్యసేవక విచారము :—

మ. హరివర్షంబునఁ బాపనాశియగు పద్మాక్షుండు నారాయణుం
డురు కారుణ్యరసంబుమీరఁగ మహోద్యోగంబునం భక్తులం
బరిపాలించెడు దివ్యమంగళతనుప్రాశస్త్యుఁడై యట్టి శ్రీ
హరియం దంచితభక్తియుక్తుఁడయి ప్రహ్లాదుండు సేవించెడిన్. ౪౯

సీ. ప్రణవనమస్సుల పైనను భగవతె యని నరసింహాయ యనియు నందుఁ
బై నమశ్శబ్దంబు పల్కి తేజస్విని తేజసే యని తద్దఁ దెలివిగల్గి
ఆవిరావిర్భవ యని వజ్రదంష్ట్రి కర్మాశయాన్ రంధయ యని తదుపరి
రంధయ యని తమోగ్రస యని ప్రణవంబు పల్కి స్వాహా యని పరగ నభయ
మని మమాత్మని యని యవల భూయిష్ఠాయటంచును బ్రణమంబు మించ నుడివి
క్షౌమ్మనునది చెప్పి స్వస్త్యస్తు విశ్వస్య ఖల యని సంతోషకలితుఁడగుచు

తే. గీ. నయ్యధోక్షజు ధ్యానించునట్టి మనసు । గలిగి సాంసారికమ్ములనుఁ దొలఁగి మెలఁగఁ
జేయు మనుచును దత్త్వైకసిద్ధి గలిగి । సతము ప్రహ్లాదుఁ డాత్మలో సంస్మరించు. ౫౦

చ. జగములకెల్ల మేలగుతఁ జాలఖలుఁడు ప్రసన్నుఁడౌత భూ
తగణములెల్ల నీశ్వరుని ధ్యానము సేసెడిగాత మానసం
బు గరమధోక్షజుం దవిలి పొల్పెడిగాత నహైతుకింబులన్
దిగఁబడకుండుగావుత మదీయని ధ్యానము సేయు నిచ్చలున్. ౫౧

వ. మఱియు నాగార దార ధన పుత్రాదుల సంగమంబు గలుఁగకుండుఁగాత యనియు, ౫౨

క. భగవంతునం దకించన । యగు భక్తియె కలిగెనేని యఖిలగుణంబుల్
తగియుండు సందు తక్కిన । నగునే సద్గుణము లెంతయారటఁ బడినన్. ౫౩

క. మీనములకుఁ దోయమువలె । శ్రీనారాయణుఁడెసుమ్ము జీవము దేహ్య
త్తానమునకు హరిగొలువని । యీ నరు పెత్తనము వయసునందేసుమ్మీ. ౫౪

మ. హరిఁ గీర్తింపనినోరు తత్పదయుగధ్యానానురాగంబునం
గరమింపొందని మానసంబు తదవేక్షాశూన్యనేత్రంబులున్
గరుడస్యందనుఁ బూజసేయని కరాగ్రంబుల్ వృథల్గావె సం
సరణాంభోనిధి దాటు నావ నృహరిస్తోత్రంబకా యెన్నఁగన్. ౫౫

వ. అని యిట్లు ప్రహ్లాదుండు పరమాహ్లాదంబున నారాయణు గొల్చుచుండు. మఱియు కేతు
మాలావర్షంబున స్మరస్వరూపుఁడగు భగవంతునిం దద్వర్షాధీశ్వరి యగు రమాదేవి
ప్రణవంబుతోను నంత్యోష్మంబు రేఫయుక్తంబుచేసి వేర్వేర అ-ఈ-ఊ లంగల్చి
బిందుయుతబులుచేసి మూడుబీజంబులనుం బల్కి భగవతే హృషీకేశాయ సర్వగుణై
స్సర్వగుణవిశేషై ర్విలక్షితాత్మనే । ఆకూతీనాంచిత్తీనాం చేతసాం విశేషణాం చాధిపతయే
షోడశకళామయాయ ఛందోమయాయ అన్నమయాయ అమృతమయాయ సహసే ఓజసే
బలాయ కాంతాయ కామాయ నమస్తే ఉభయ ప్రభూయాత్ । స్త్రియోవ్రతైస్త్వాం హృషీ
కేశే శ్వరంస్వతో హ్యారాధ్య లోకే పతిమాశాసతేన్యం । తాసాంనతేవై పరిపాంత్యపత్యం
ప్రియధనాయూంషి యతో స్వతంత్రాః. అని యివ్విధంబునం భజించుచుండు. మఱియు
రమ్యకవర్షంబున మత్స్యరూపధరుండగు హరిని మనువు స్తోత్రంబు సేయుచుండు
నెట్లనిన. ౫౬

సీ. ప్రణవంబును నమస్సు బల్కి ముఖ్యతమాయ నమ యని సత్వాయ నా దలిర్పఁ
పదమూది యవ్వలఁ బ్రాణాయ యని యోజసే బలాయ యటంచుఁ జెప్పవలయు
సుమి మహామత్స్యాయ నమయనిపల్కిన మంత్రంబు నిఖిలైక మంగళంబు
దీనిఁ బఠించి యెంతేనియు భక్తితో స్తవముసేయును నీవె సకలలోక

తే.గీ. ములకు నీశ్వరుఁడవు సర్వమును సృజించి । బొమ్మలాటసుఁబోలె సంపూర్ణశక్తి
నాటలాడించెదవు దేవ యనుచు బల్కి । పరిపరివిధంబులను భక్తి భావ మడర. ౫౭

వ. మఱియు హిరణ్మయనామవర్షంబున భగవంతుండు కూర్మరూపంబు ధరియించి యోగపతియై
యర్యమునిచేఁ బూజింపంబడుచుండు. ౫౮

సీ. ప్రణవంబు నాగి నమః పదమును భగవతే యనునట్టి పదమును నమరఁజేసి
పరగ నాపైన కూపారాయ సర్వసత్వగుణవిశేషణాయ గతవర్ణ
తతిఁగూర్చి నోపలక్షిత స్థానాయ నమ యని వర్ష్మణే నమ యటంచు

భూమ్నే నమో యని పౌరినవస్థానాయ నమ యని తేయని క్రమతఁ జెప్పి
యెవనిరూపము మాయ నెనసి యర్థస్వరూపంబై వివిధరూపంబు లయ్యె

తే. గీ. నెవ్వనికి సంఖ్యయును వేదహీనచరితుఁ । దేపుమీరంగ వ్యపదేశరూపి యెవ్వ
డట్టి భగవంతునకును జోహా రొనర్తు । సంతతము భక్తియుతమానసంబుతోడ. ౨౯

చ. చెలఁగి జరాయుజంబులును స్వేదజముల్ మఱి యండజంబులున్
బొలువగు నుద్భిదంబులును భూరిచరాచరమెల్ల దేవమా
నులు పితృభూత మైంద్రియమునున్ దివియున్ క్షితియున్ గిరుల్ సరి
త్తులు దధి దీవులున్ గ్రహతతుల్ మఱి యిక్కలు నొక్కటేకదా. ౩౦

ఆ. వె. రెండుమూడునంచు నుండు భేదము లెల్ల కల్పితములు వేఱ కాదు నీకు
నామరూపము లవి యేమియు లేకున్న । నున్నయట్లు మాయ పన్నుచుండు. ౩౧

వ. ఇట్లని యర్యముండు స్తుతియించుచుండు. ౩౨

క. కురువర్షంబున దేవుఁడు । పరమపురుషుఁ డావిదంష్ట్రి భావంబున దాఁ
బరఁగగ భూదేవి మహా । దరమున స్తోత్రంబుసేయు దానవవైరిన్. ౩౩

సీ. ప్రణవంబును నమస్స భగవతే యని మంత్ర లింగాయ యనిభక్తి లీల బెనచి
వెలయ యజ్ఞక్రతవే యనియు మహాధ్వరావయవాయ యటంచుఁ బల్కి
యలర మహావరాహాయ నమో యని కర్మశుక్లాయనాం బేర్మినిలిపి
త్రియుగాయ నమ యని తే యని పల్కిన మంత్రంబు పఠియించి మాన్యవృత్తి

తే.గీ. యెవనిరూపంబు గుణములం దిమ్ముగాంచు । దారువులయందు జాతవేదసుఁడుబోలె
నట్టిదేవు ననంతుని న్నాదిమూర్తి । రమ్యగుణసాంద్రు యజ్ఞవరాహుఁ దలతు. ౩౪

వ. ఇట్లు ధరాదేవి వరాహమూర్తిని స్తవంబుచేయుచుండు మరియు కింపురుషవర్షంబున దాశరథియు సీతారామచంద్రుండు నగు భగవంతుని శ్రీహనుమంతుండు స్తవంబు సేయుచుండు. ౩౫

సీ. ప్రణవమ్మును నమస్స భగవతే ఉత్తమశ్లోకాయ నమ యని సొరిదిఁ జెప్పి
యార్యలక్షణశీల యనియు వ్రతాయ యటంచును నమయంచు నపల భక్తిఁ
దనరంగ నుపశిక్షితాత్మనే యనుచు నుపాసితలోకాయ యని నమయని
తాల్మితో సాధువాదనికషణాయ నమోయంచు మఱియును మోదమలర

తే. గీ. నెనసి బ్రహ్మణ్యదేవాయ యనుచుఁ బల్కి । యొగి మహాపురుషాయ యనుచు చ్చరించి
తొడిమహాభాగమునకు చతుర్థిఁజేర్చి నమ యనిన మంత్రమును మహాదరమున ను. ౩౬

వ. పఠించి మరియు, ౩౭

ఉ. మానవరూపమొంది మహిమం దివిజావళిఁ బ్రోచి రాక్షసో
త్తానముఁ జంపి లక్ష్మణునిఁ దమ్మునిగాఁ గొనినట్టి జానకీ
జానివి నీవు కొల్తు నసిశంబును నిన్నుఁ బరేశ సంతతా
నూనవిభాను నిర్గుణఘనుం బరముం బరతత్త్వవాంఛితున్. ౧౮

వ. అని యిట్లు హనుమంతునిచే స్తోత్రంబు సేయంబడుచుండు. మఱియు, భారతాఖ్య వర్షంబున నాదిపూరుషుండనైన నేన నివసించి యందు నీవలన స్తవంబు సేయంబడుచుండు. ౧౯

సీ. ప్రణవంబు నొగి జెప్పి పైస నమఃపదమిడి భగవత్పదము చతుర్థిఁగలయంగ
లీలతో నుపశమశీలాయ యని పల్కి యుపరతానాత్మ్యాయ యనుచుఁ జెప్పి
కెరలి యాపై నమో కించని విత్తాయ యని ఋషి ఋషభాయ యనుచుఁ బల్కి
నవి నరనారాయణాయ యంచును బిల్చి పరమహంస యటంచుఁ బలికి మఱియు

తే.గీ. పరమగురవేయటంచును బాగుమీఱఁ। గ్రమత నాత్మ పదంబునా రామపదము
నధిపతిపదంబు సమసించి యది చతుర్థి। నతికి యాపై నమో నమ యందు నీవు. ౨౦

క. బహుభంగుల లోకములన్। విహితంబులు సేసి సర్వవిశ్వమయుఁడవై
రహియించుచుండియు సుగుణ। రహితుడవై యుందు నీవు రాజీవాక్షా! ౨౧

వ. ఇవ్విధంబున నీవు నన్ను స్తోత్రంబు సేయుచుందు వీక భారతవర్షంబున నదీనదభేదంబులును, శైలంబులునుం జెప్పెద, నేకాగ్రమానసుండవై వినుము. మలయంబును, మంగళప్రస్థంబును, మైనాకంబును, త్రికూటంబును, కోల్లంబును, సహ్యంబును, దేవగిరియు, ఋష్యమూకంబును, శ్రీశైలంబును, వేంకటాద్రియు, మహేంద్రకంబును, వారిధారంబును, వింధ్యంబును, శుక్తిమంతంబును, ఋక్షంబును, నీలాద్రియు పారియాత్రంబును, ద్రోణంబును, గోవర్ధనంబును, రైవతకంబును, కకుభంబును, గౌరముఖంబును, ఇంద్రకీలంబును, గామగిరియు, మొదలుగాగల పర్వతంబులు గలవు. తామ్రపర్ణియుఁ, జంద్రవశయుఁ, గృతమాలయు, వటోదకయు, వైహాయసియుఁ, గావేరియు, వేణయుఁ, బయస్వినియుఁ, దుంగభద్రయుఁ, గృష్ణవేణియు, శర్కరయు; పర్తికయు, గోదావరియు, భీమరథియు, నిర్వింధ్యయుఁ, బయోష్ణికయుఁ, దాపియు, రవయు, సరసయు, నర్మదయు, సరస్వతియుఁ, జర్మణ్వతియు సింధువు, నందయు, శోణయు, మహానదియు, ఋషికుల్యయు, త్రిసామయు, వేదస్మృతియు, గౌశికయు, యమునయు, మందాకినియు దృషద్వతియు, గోమతియు, శరవేగయు, రోధావతియు, సప్తవతియు, సుషామయు, శతద్రువునుఁ, జంద్రభాగయు, మరుద్వతియు, వితస్తయు, నసిక్నియు, విశ్వయు మొదలుగాఁగల నదు లనేకంబులు గలవు. ఈ వర్షంబున సంభవించిన పురుషులు తమ తమ శుక్ల లోహిత కృష్ణాభంబులైన

కర్మంబులచే దివ్య మానుష నారక ఫలంబు లనుభవింతురు. వర్షవిభాగంబుచే నపవర్గంబు సాధించెదరు. ౬౨

ఉ. భారతవర్ష సంభవుల భాగ్యమె భాగ్యము మాధవాంఘ్రి సే
వారతి గల్గి సంసరణబంధములూడ్చి గుణప్రకాండముల్
మీఱి యఘాటవిన్ నరికి మేలగుమార్గము పట్టి మోక్షల
క్ష్మీరమణీయులై పొనరు మేటులు వారల నెన్న శక్యమే. ౬౩

ఉ. భాగవతాగ్రగణ్యులు విభాసుర కేశవభక్తియుక్తులున్
నైగమకర్మకాండకలనాపరిశోభితు లచ్యుతోత్సవ
శ్రీగరిముల్ మఖప్రకరకృత్యవిచారులు సార్వకాలికా
భ్యాగత(పూజనవ్రతపరాయణు లన్నిట మేటు లెన్నగన్, ౬౪

ఆ. వె. భాగవతులు లేని పదము శ్మశానంబు । శౌరిపూజలేని స్థలము మలము
భక్తిలేని బ్రతుకు పరమనీచముగాన । భరతవర్షభవులె భాగ్యనిధులు. ౬౫

వ. మఱియు జంబూద్వీపంబున కెన్మిది యుపద్వీపంబులు గలవు. స్వర్ణప్రస్థంబును, చంద్ర శుక్లంబును, ఆవర్తనంబును, రమణాణంబును, మందరంబును, హరిణంబును, పాంచ జన్యంబును సింహళంబును, దీనిన లంక యందురు. నారదా! జంబూద్వీప వివరంబు సెప్పితి. నిక ప్లక్షాది షట్కంబు వివరించెద నని, ౬౬

## —: ద్వీపాంతర సమాచారము :—

క. తనరం జంబూద్వీపం । బును(బోలె స్మేరువుండు మున్నీరును జు
ట్టును నిక్షురసంబులతో । నినుమడి పరిమాణమయ్యె నిల ప్లక్షమునన్. ౬౭

ఆ. వె. ప్లక్షవృక్షములను బరివేష్టింతంబగు । నిశ్చయముగ నిదియు నేరెడెంత
నొగి నచట హిరణ్మయుండైన యనలుండు । నలరెడిని ప్రియవతాత్మజుండు. ౬౮

ఆ. వె. చెలగి వాని సప్తజిహ్వు(డటందురు । వా(డు దాని నేడు వర్షములుగ(
జేసి పుత్రులకును జెర్రి యింత యిచ్చి తా । నసల యోగమార్గ మాశ్రయించె. ౬౯

ఆ. వె. యోగభావమందె యుగ్రు నుమాపతి । నాశ్రయించి క్షేమ మంతె(దుదిని
ఏడు పర్వతంబు లేడు వాహినులును । జువ్విదీవియందు నివ్వటిల్లు. ౭౦

వ. అరుణయు, నన్నృమ్లయు, నాంగిరసియు, సావిత్రియు, సుప్రభాతికయు, ఋతుంబరయు నను నివి నదులయ్యె. మణికూటంబును, వజ్రకూటంబును, ఇంద్రసేనంబును, జ్యోతిష్మంతంబును, సువర్ణంబును, హిరణ్యష్ఠీవంబు, మేఘమాలయు, నను నివి

పర్యంతబులు, ప్లక్షద్వీపంబున నదీజలంబుల దర్శన స్పర్శనంబులచేతనే రజంబునుం దమంబు నడంగు. హంసవర్ణంబును, బతంగవర్ణంబులును, నూర్ధ్వాయన వర్ణంబును, సత్యాంగవర్ణంబును నను నాలుగు వర్ణంబులు గలవు. వారు సహస్రవర్షపరిమితాయుష్కులు. వేదవిద్యావిధానంబుల సూర్యు యజింతురు. ప్లక్షంబు మొదలగు నైదు దీవుల యందు నాయువు, నింద్రియబలంబును, బుద్ధియు సమంబులు. ఔత్పత్తికిసిద్ధియు లోక విక్రమంబునుం దుల్యంబులై యుండు. మఱియుఁ బ్లక్షద్వీపానంతరంబున సురా సముద్రం బుండు. దాని క్రవ్వల శాల్మల వృక్షంబులచే నిండిన శాల్మలీద్వీపంబు ప్లక్షంబునకు రెండంతలై యుండు. ౭౧

తే. గీ. జువ్వియె త్రెత్తు ఘూమగు నివ్వటిల్లు । బూరుగను గరటామాను బొరసియుండు
నా ప్రియవ్రతుకొడుకైన యజ్ఞవాహు । దందు దొరయయి వర్తిల్లు నసఘలీల. ౭౨

క. తన యేడ్వురు కొడుకులకును । జనపతి ద్వీపంబు బంచె సంయమినాథా
వినుమా యవి వర్షములై । తనరెన్ దెల్పెదను నీకుఁ దన్నామములన్. ౭౩

వ. అవి సురోచనంబును, సౌమనస్యంబును, రమణంబును, దేవవర్షకంబును, పారిభద్రంబును, నాప్యాయనంబును, అభిజ్ఞతంబును, నాంబడు, శతశృంగంబును, వామదేవంబును, కన్దకంబును, గుముదంబును, పుష్పవర్షంబును, సహస్రశ్రుతియు, నను పర్వతంబు లేడు. అనుమతియు, సినీవాలియు, సరస్వతియు, గుహువును, రజనియు, నందయు, రాకయు నను నేడు నదులు గిత్తివహించు. నందలివారు నాలుగు వర్ణంబులవారు. శ్రుతధర, వసుంధర, వీర్యధరేషుంధరులు నాం ప్రసిద్ధులై యుందురు. సోము భజింతురు. దానిం దాటి సురాసముద్రంబునకు రెండంతలై ఘృతజలధి యుండు. దానిచేఁ జుట్టంబడి మహనీయంబైన కుశద్వీపంబు గలదు. ౭౪

క. ఆ దీవిని నామము దా । నాదిమకారణమెయైన యదియే కానన్
నీదు మదిం దెలియుము మౌ । నీ దివ్యకుశాళి యుండు నిరత మటంచున్. ౭౫

ఉ. అందు హిరణ్యరేతుఁడు ప్రియవ్రతసూనుఁడు ఱేడు వానికిన్
నందను లేడ్వురై తనరినం దగ రాజ్యము నేడుపాళ్ళుగాఁ
బొందికఁ బంచియిచ్చె మునిపూజిత యిప్పుడ వేడు వర్షముల్
విందువుగాక నామములు వే వివరించెద నింపుమీరఁగన్. ౭౬

వ. వసువును, వసుదాసుండును, దృఢరుచియు, నాభిగుప్తుండును, సత్యవ్రతుండును, వివిక్తుండును, దేవకుండును, వారి నామంబు లగు. నా నామంబులచే వర్షంబులం బేర్కొనియెద రా వర్షంబులయం దేడునదులు, నేడు పర్వతంబులు గలవు. చక్రంబునుం, జతుశ్శృంగంబునుఁ, గపిలంబును, జిత్రకూటంబును, దేవానీకంబును, నూర్ధ్వరోమంబును, ద్రవిణంబును నన నివి పర్వతంబులు. రసకుల్యయు, మధుకుల్యాయు,

మిత్రవిందయు, శ్రుతవిందయు, దేవగర్భయు, నఘచ్యుతయు, మంత్రమాలికయు నను నివి నదులు. మఱియు నందు నాల్గువర్ణంబు లుండు. కుశల కోవిదాభియుక్త కులక సంజ్ఞల జాతవేదుండు పూజింపంబడు నని మఱియు నారాయణుండు. ౮౭

## —: శిష్టద్వీప సమాచారము :—

క. ఘృతవారాంనిధిచే నా । వృతమైనది కుశము పేరి ద్వీపము మఱి యం
చితగతి దానికి నవ్వల స్థితింగాంచుఁ గ్రౌంచ మనెడి ద్వీపము మౌనీ! ౮౮

క. అది క్షీరోదధిచేతం । బదిలంబుగఁ జుట్టఁబడియె మఱి క్రౌంచగిరిన్
ముదమున ధరించు నయ్యది । యది కారణమయ్యె దాని కా పే రిడఁగన్. ౮౯

ఆ. వె. గుహుఁడు పొట్టఁ బగులఁగొట్టిన కతమున । బాధదీర నందుఁ బాలలోనఁ
దడియుచుండుఁ గ్రౌంచ ధరణీధరేంద్రుండు । వరుణుఁ దేలుచుండు వాని నెప్డు ౯౦

క. అదివిని ఘృతపృష్ఠుఁడు । నాఁ దగిన ప్రియవ్రతేంద్రు నందనుఁ డేలెన్
మోదమ్మున నిజసుతులకు । బాదుగ నేద్వురకు దాని బంచి యొసంగెన్. ౯౧

వ. ఆముఁడును, మధురహుఁడును, మేఘపృష్ఠుఁడును, సుధామకుఁడును, భ్రాజిష్ఠుండును, లోహితార్ణుండును, వనస్పతియు వారి నామంబులు. వారి పేళ్ళచే సప్త వర్షంబులుం గీర్తింపంబడు. శుక్లంబును, ధర్మమానంబును, భోజనంబును, నుపబర్హణంబును, నందంబును,నందనంబును, సర్వతోభద్రంబు ననునవి యేడుం బర్వతంబులు. నభయయు, నమృతౌఘయు, నాచార్యకయు, తీర్థవతియు, వృత్తిరూపవతియు, శుక్లయు, పవిత్రవతి కయు నను నవి యేడును నదులు. పురుష, ఋషభ, ద్రవిణ, దేవక నామంబుల నాలుగు వర్ణంబుల వారు నం దుందురు. అందుండు వా రాపోమయుండగు నపాంపతిం గొల్చు చుందురు. మఱియు "తానఃపునీతామీ వఘ్ని స్పృశత్వా మాత్మనా భువో" యను మంత్రంబు జపించుచుం జలపతి ననేకవిధంబుల స్తవంబుసేయుచుందు రింతియగాక యా ద్వీపంబున కవ్వల. ౯౨

ఉ. ముప్పదిరెండులక్షల సముజ్జ్వలయోజనముల్ తలిర్చి బల్
మెప్పు వహించు నా దధిసమేతమహాంబుధి తత్సమానమై
యొప్పెడి దీవి శాక మన నొయ్యన నం దొక శాకవృక్షమున్
గొప్పది యుండుటం దగియెఁ గుంబిని శాకసమాఖ్య దానికిన్. ౯౩

క. దానికి మేధాతిథియను । భూనాథుఁడు గలఁడు వాఁడు పుత్రుండె కదా
జానుగఁ బ్రియవ్రతునకున్ । దానును విభజించెఁ బుత్ర తతి కద్దీవిన్. ౯౪

వ. పురోజవుండును, మనోజయుండును, పవమానకుండును, ధూమ్రానీకుండును, చిత్ర రేఫుండును, బహురూపుండును, విశ్వధరుండు ననువారు పుత్రులు. వారి నామంబు

లఁగాంచి వర్షంబులు విస్తరిల్లె. నీశానంబును, నూరుశృంగంబును, బలభద్రంబును, శతకేసరంబును, సహస్రస్రోతకంబును, దేవపాలంబును, మహానసనంబును నను నేడుపర్వతంబులును, అనఘయుఁ, బ్రథమయు, నాయుర్దయు, నుభయస్పృష్టియు, నపరాజితయు, పంచపదియు సహస్రశ్రుతియు, నిజధృతియు నను నేడు నదు లుండు. సత్యవ్రత, క్రతువ్రత, దానవ్రత తానువ్రతులను వర్ణంబులు గల వం దంతర్యామి యగు నీశ్వరుండు సర్వంబుం బరిపాలించుచుండు. అటపై శాకద్వీపంబున కిబ్బడి యగు పుష్కరద్వీపంబు గల దది శుద్ధోదకసముద్రంబులచే నావరింపంబడి యుండు మఱియు, ౯౫

తే.గీ ఉజ్జ్వలజ్జ్వలనజ్జ్వాలి కోపమంబు । లైన పత్రంబునవి విశదాభములయి
స్వర్ణమయములు నై లక్ష సంఖ్య లొంది । తనరు పుష్కర మొక్కటి దాన నుండు ౯౬

తే.గీ. అదికతంబున విను బుష్క రాఖ్య గలిగె । స్రష్ట కాసన మిది దీని సాధుసమితి
మానసోత్తర మనెడి నామంబుతోడఁ । బిల్తు రది మానసోత్తర పృథివి నుంట. ౯౭

వ మఱియు నర్వాచీన పరాచీనంబులగు ద్వీపంబులకు నవధిగా నత్యున్నతంబును, బదివేల యోజనంబులు పొడవునుఁ, బదివేలయోజనంబుల నిడివియుం గలిగి యొక పర్వతంబు గలదు. దాని నవధిగిరి యందురు. నాలుగుదిక్కుల నాలుగుపట్టణంబులు గలవు. అవి యింద్ర యమ వరుణ కుబేరుల నగరంబులు. అందుపై మేరువుం దిరుగుచు భానుండు తేజరిల్లు. సంవత్సరాత్మకంబైన చక్రగతి దేవతల కొక్క యహోరాత్రంబగుఁ బ్రియవ్రత పుత్రుండు వీతిహోత్రతనూజుల నిరువుర వర్షద్వయంబునస్థాపించె. వారిని వమణుం డనియు, ధాతకి యనియుం బిల్తురు. వారిపేళ్ళనే రెండువర్షంబు లయ్యె. అచ్చటివారు కర్మయోగంబున బ్రహ్మరూపుఁడగు పరమేశ్వరు నర్చింతురు. మఱియు, ౯౮

## —: లోకాలోకపర్వత వర్ణనము :—

క. ఆ కడపటిగిరి లోకా । లోకం బన బరగు నదియు లోకంబున కా
లోకమునకు నడుమను సు । శ్రీకంబై యుండి పేరు చెందె మునీంద్రా! ౯౯

క. అచ్చోటఁ బ్రాణు లుండవు । చొచ్చిన దెద్దేని మరల జూడదు లోకం
బచ్చపు టద్దముబోలెడి । లచ్చిమగఁడు ముజ్జగంబు లకుఁ దుది నిడియెన్ ౧౦౦

వ. మఱియు సూర్యాదిధ్రువాంతంబులయిన ఖేటంబుల రశ్ములు లోకాలోకావశంబునంజేసి దిగువ మూడులోకంబులం దేజరిల్లుచుండు. పరాచీనంబులైన లోకంబుల కంటవు. భూమండలపరిమాణంబు పంచాశత్కోటిగణితంబు లోకాలోకంబందు నాలవ వంతుండు. దానిపై నాలుగు దిగ్గజంబులు బ్రహ్మచే నిర్మింపంబడి యుండు. ౧౦౧

చ. ధర ఋషభంబునుం బరమ తాపసకుంజర పుష్కచూడమున్
మఱియును వామనంబు జన మానితమైన పరాజితంబును

బరగి సమస్తలోకమును బాటిలఁజేయు మహోస్టభూతులున్
హరి భగవంతుఁ డేలును నిజాయుధసేవకబృందయుక్తుఁడై. ౧౦౨

ఉ. దానికిఁ బిమ్మటన్ మునిసుధాకర శుద్ధనభంబు బొల్చు నం
దా నలినాప్తుఁ డుండు లలితక్రియ భూగగనాంతరంబునన్
భానునకుం ధరాస్థలికి మధ్యను యోజనముల్ సుసంఖ్యనుం
బూనును గోటు లిర్వదిటఁ బొందిన యెదయి సర్వ కాలమున్. ౧౦౩

క. మృతమగు నండంబున ను । ద్ధితుఁడై మార్తాండుండయ్యె దినకరుఁడు మహో
మతియుత హిరణ్యగర్భత । నతికె హిరణ్యాండభవము నంది మునీశా ! ౧౦౪

క. రవివలన దిక్కు లొదవెన్ । రవివలనం గాలములును రహినొందె సదా
రవివలన గిరులు నదులును । భవమందె న్సర్వజంతు భావము గలిగెన్. ౧౦౫

క. రవి వృక్షంబులఁ బెంచున్ । రవి యుదకము లిచ్చు దేవ రాజిని నరులన్
రవియె ప్రకాశింపించును । రవి తిర్యగ్జంతువితతి రాజిలఁజేయున్. ౧౦౬

వ. మఱియు నా సూర్యునకు నుత్తరాయణంబున గతిమాంద్యంబును, దక్షిణాయనంబునం గతి శైఘ్ర్యంబును, సమకాలంబున న్సమగతియుం గలిగియుండు. మేష తులల సూర్యుం డుండునపుడు దివారాత్రప్రమాణంబు సామ్యంబు వహించు వృషభాదులనై దింటఁ బగలు పెరుగు. వృశ్చికాదుల నైదింట రాత్రులు పెరుగు నని చెప్పి నారాయణుండు వెండియు. ౧౦౭

## —: రవి గమన మాంద్యాది ప్రకారము :—

క. రవిగమనంబది నారద । త్రివిధంబగు శీఘ్ర మంద వృత్తుల సమతన్
దివి సర్వగ్రహములకున్ । త్రివిధస్థానములు గలవు తెలియుము దీనిన్. ౧౦౮

క. ఉండు జరద్గవ మనునది । దండిగ మధ్యమున మఱియుఁ దా నుత్తరమం
దుండెడి నైరావత ము । ద్దండత వైశ్వానరంబు దక్షిణమందున్. ౧౦౯

తే. గీ అశ్వనీ కృత్తికా యామ్య లందు నాగ । వీధి బ్రహ్మేశ మృగశిరో వృత్తిని గజ
వీధి పుష్యోరగాదిత్య విఖ్యాతి గలుగు । చోట నైరావతీవీధి సొంపుగాంచు
వీని నన్నింటి నుత్తర వీధు లంద్రు. ౧౧౦

తే. గీ. ఆర్షభీవీధి ఫల్గుణు లవల మఖయు । హస్త మొదలుగ మూడింట నాలవీధి
యవ్విశాఖయె మొదలగు నట్టిమూట । వెలయు జారద్గవీ నామ వీధి యనఁగ
మహితమగు మధ్యమంబైన మార్గ మిదియ. ౧౧౧

తే.గీ మొనయు నజవీథి యమ్మూలల మొదలుమూట। శ్రవణమాదిగమూట వైశ్వానరియగు
చివరినక్షత్రములు మూట సిద్ధవీథి। దక్షిణంబైన మార్గంబు తాపసేంద్ర ! ౧౧౨

తే గీ ఉత్తరాయణమాసాద్య యుగ సదక్ష। మధ్యబద్ధంబులును మహా మారుతప్ర
బద్ధములు నైన యమ్మహా పాశకర్ష। ణంబు బుధులాడుదురు రోహణంబటంచు. ౧౧౩

తే.గీ, దానిలోనుండి జరుగు మండలమునుండి। మాంద్యమును దినవృద్ధియు మహిమ గాంచు
గ్రమత సౌమ్యాయనంబున రాత్రి దనరు. ౧౧౪

తే గీ. అలరు నవరోహణము దక్షిణాయనమునఁ। బొరి బహిర్మండలంబును బొరసియుంట
గమనశైఘ్ర్యంబు దలఁపడు గానఁ బగలు। దరుగు రాతిరి హెచ్చును దాపసేంద్ర. ౧౧౫

చ. పరగ విషువ్రచారమున బాశసమత్వముచేత రేబగ
ళ్ళరయ సమంబులై తనరు నర్కుని క్ష్మాష్టిధృవంబుచేతనె
ట్లారగెడి నట్లుగా నయన యుగ్మముఁజొప్పడు మేరుశైలశే
ఖరముల నాల్గుదిక్కుల కాటముగన్ నగరంబు లొప్పెడిన్. ౧౧౬

క. తూరుపునం దైంద్రియు మఱి। సౌరదిశను బొలుపుమీరు సంయమనియు న
వ్వారుణి నిమ్లోచని కౌ। బేరి విభావరియు మౌని బృందసుసేవ్యా ! ౧౧౭

మ. ఇనుఁ డావిర్భవమందు నైంద్రవిభవం బేపార మధ్యాహ్నమై
పొనరు న్సంయమనిన్ నిమీలనమునిమ్లోచన్యభిఖ్యాతప
త్తనమందయ్యెడు నవ్విభావరి నిశీథం బయ్యెడున్ లోకబం
ధునకుం జెప్పితిఁ దత్ప్రవృత్తివిధ మందు న్భూతసంవేశమున్. ౧౧౮

ఉ. ఎక్కడ గానవచ్చు నది యే యుదయంబగు వారివారి కిం
కెక్కడ నస్తమించునది యే తపనాస్తమనంబుగాఁ దగున్
నిక్కముసుమ్ము దైవతము నీ మిహిరాంశునకుం దలంపఁగా
నక్కడ నిక్కడంచు నుదయాస్తమయంబులు లేవు నమ్ముమీ. ౧౧౯

క సూరుండు వొడము దిక్కుం। దూరుపని పచింత్రు మఱియుఁ దోయజసఖుఁడే
వారికి నెక్కడఁదోచును। వారికి నది తూరుపగుచు వర్తిలుసుమ్మీ. ౧౨౦

ఉ. వానికి వామభాగమున వర్తిలు మేరువు దీవులన్నియున్
దానికి దక్షిణంబున నుదంచిత లీలమయిం జెలంగు న
బ్భానుఁడు పూశ్చతుష్టయము బాయక గ్రుమ్మరు సర్వదా లస
ద్భానుపరంపరల్ వెలిగి పార్శ్వగలోకము లావరింపగన్. ౧౨౧

వ. సూర్యుండు దా నొక్క దివారాత్రంబునం దొమ్మిదికోట్ల యోజనంబులు జుట్టు నైంద్రి
నుండి సంయమనికి వచ్చుసరికి నైంద్రిం బదియేనుగడియ లగు నక్కడికి రెండుకోట్ల

యిరువదియైదులక్షల యోజనంబు లర్కుండు నడుచు ముహూర్తంబునకు సూర్యుని
రథంబు ముప్పదిలక్షల యోజనంబులు సను. త్రయీమయుండైన సూర్యుండు ప్రవహం
బను సమీరంబుచే నిండి దన నక్షత్రగ్రహపంక్తులం గూడి క్రుమ్మరుచుండు.
మఱియు, ౧౨౨

మత్తకోకిల॥ ఏకచక్రము ద్వాదశారము నింపుమీరు త్రినాభికం
బై కడుం షడుదారనేమికమై పొసంగెడి నర్యమా
స్తోకభూరిరథంబు మేరువు జుట్టు క్రుమ్మరుచుండెడిన్
బ్రాకటాక్షము మానసోత్తర పర్వతమ్మున నిమ్మగున్. ౧౨౩

తే.గీ. తైలకారకయంత్రంబుఁ బోలె నిట్లు । మానసోత్తరపర్వతాధీనమైన
యక్షమున ధ్రువపర్యంత మలమి తిరుగు । సూర్యునిరథంబు వేగవిస్ఫూర్తిఁదనర.

క. సప్తచ్ఛందములనియెడి । సప్తాశ్వము లీడ్చుచుండు సతతము పంకే
జాప్తునిరథము ననూరుఁడు । స్వాప్తకలాకౌశలమున సౌత్యము సేయున్. ౧౨౫

ఆ.వె. అలర వ్రేలికణ్పెఁ డంతలేసి తనుప్ర । మాణములు పొసంగ మౌనివరులు
వాలఖిల్యు లనెడి వా రరువదివేలమంది స్తుతులొనర్తు రందు నెపుడు. ౧౨౬

ఆ.వె. మఱియు నితరమునులు మాన్యులు గంధర్వు । లప్సరసలు మరగు యాతుధాను
లెలమి నెలకు నెలకు నేడ్వు రేడ్వురుగాగ । నర్కుస్తవమొనర్తు రధికభక్తి.

సీ. చరచరగ్రుమ్మరి సారెఁదిప్పుచునుండ నందుఁ గీటం బెదు రరగినట్లు
కాలచక్రంబు చక్కఁగఁ బ్రదక్షిణలీలఁ గనకాద్రిచుట్టును గదలుచుండ
గ్రహగమనంబు నిక్కంబుగ నెదురయి యుండు ఋక్షంబుల నోరిదవిలి
రాసుల గడచుచు రాత్రులందుఁ బగళ్ళ నెడఁపక నారాయణేచ్ఛనెసగి

తే.గీ. యవ్వసంతాదిఋతువులు నర్కచంద్ర । శోభలను మార్చుచును సర్వశుభదములగు
భావములు గల్గఁజేసియు బ్రజల బ్రోచు । నిందిరేశుండు సచ్చిదానందమూర్తి. ౧౨౮

చ. ఇరుబదిరెండు లెక్కల నహీనత సూర్యుఁడు జుట్టిరాగ వ
త్సరమగు వత్సరంబునకు ద్వాదశమాసము లొక్కమాస మి
ద్ధరణి సపాదభద్వయగతామరసాప్తునిచేతఁ జెల్వగున్
బరగెడి పక్ష మర్ధమయి । నన్ ఋతువయ్యెడు నాఱుమాసములన్. ౧౨౯

తే.గీ కాలచక్రంబు సగము న క్షమలహితుఁడు । దిరుగ నయనంబటండ్రు సుధీవరేణ్యు
లంతయును జుట్టివచ్చిన నబ్దమండ్రు । దానిఁ బంచవిధంబులఁ దలచుచుండ్రు. ౧౩౦

క. వత్సరమనియును మఱి పరి । వత్సరమనియును విశేష భావమున నిడా
వత్సరమనియును మఱియను । వత్సరమిద్వత్సరంబు వరుస నటంచున్. ౧౩౧

ఆ.వె. సవిత మాంద్యశైఘ్ర్య సమగతులనుబట్టి । వత్సరాఖ్య లొప్పె భానుగమన
విధము జెప్పినాఁడ వివరించి యిక హిమ । భాను ముఖ్యుల నడవడులు వినుము.

## —: చంద్రగమనాదులు :—

ఆ.వె. అర్కరశ్మిచయము నంటి యవ్వల లక్ష । యోజనములదూర మొనరఁ జంద్రుఁ
డొక్కయేట సూర్యుఁ డొగిఁ జుట్టుఁ జక్రంబు । మాసమునకులోన మహిమఁ దిరుగు. ౧౩౩

తే.గీ రెండుదినములపూటలో నుండురాశిఁ । దిరిగివచ్చును జంద్రుండు ధీసమేత
ధవళపక్షంబులను దేవతాతతులను । కృష్ణమునఁ బితృదేవులఁ దృప్తిపఱచు. ౧౩౪

క. అరువదిగడియలలోనం । దిరిగెడి నొక చుక్క యమృత దీధితియె మహా
పురుషుడు పదాఱుకళలం । బరగెడి లోకమున కతఁడె ప్రాణయసుమ్మీ. ౧౩౫

క. ఉండు మనోమయుఁ డన్నమ । యుండును నై యమృతకిరణుండో మునివర యా
తండే దేవ పితృ మను ష్యాండజ పశు వృక్షములకుఁ బ్రాణము వత్సా! ౧౩౬

వ. మూడులక్షలయోజనంబులు కాలచక్రక్రమంబున మేరువుం జుట్టి తిరుగు నభిజిత్తు గలసి నక్షత్రంబు లిరువదియెనిమిది. ఇట్లు చంద్రగతిస్వభావంబు తెల్పితి. మఱియుఁ బైఁ బై రెండులక్షల యోజనంబుల దూరంబున శుక్రుండుండు. నితఁడు సూర్యునకు ముందు వెనుకలఁ దిరుగుచుండు లోకంబులకు శుభప్రదుండు. వృష్టివిష్టంభంబు నడంచు. నతనికి రెండులక్షల యోజనంబుల బుధుం డుండు. శీఘ్ర మాంద్యాదిగతులయం దితండు శుక్రతుల్యుండు. మఱియు నతివాతాభ్రపాతవృష్టి భయాదులకు సూచకుండై యుండుఁ. బిమ్మట రెండులక్షలయోజనంబుల నంగారకుండుండు. నితండు మూడు పక్షంబుల కొక్క రాశి ననుభవించు. వర్షంబున వక్రత్వంబుఁగానఁ దేని భయసూచకంబు. దానిం గడచి రెండులక్షలయోజనంబుల బృహస్పతి యుండు. వత్సరంబున కొకరాశిం భోగించు, నితండు వక్రించకుండెనేని బ్రహ్మవాదులకు శ్రేయంబు. మఱియు నతని మీద రెండు లక్షలయోజనంబుల శనైశ్చరుం డుండు. నితం డేకరాశియందు ముప్పది మాసంబులుండు, నీతనికి నశుభదాయిత్వంబు మెండుగాఁ గలదు. తర్వాతం బదునొకండు లక్షలయోజనంబుల సప్తర్షి మండలంబు గలదు. లోకసుఖార్థులయి వారు దక్షిణంబుగాఁ దిరుగుచుండుదురు. ఇన్నింటికిం బైనఁ బదమూడు లక్షలయోజనంబుల మహాభాగవతుఁడైన ధ్రువుం డుండు. ఇతఁడు బహుకాలంబు దక్షిణంబునం దోచుచుఁ జలనంబులేక దేవపూజితుండై వర్తిల్లుచుండుం బదంపడి. ౧౩౭

## —: ధ్రువ మండల సంస్థానము :—

సీ. వెలపటలోపల వెలయంగఁ గాలచక్రమునందటి ధ్రువుని యాలంబనమున
గాలిచేతనుఁ ద్రోయఁగాఁబడి నింగినిఁ బక్కులట్టుల సదా భ్రమణశీల
ములగుచు ఖేటముల్ వెలయ స్వస్వస్థానములనుండి పతనాదు లొలయఁ గలఁత
నొందక గ్రుమ్మరు సందియం బేటికిఁ బ్రకృతియుఁ బురుషుఁడు పట్టి త్రిప్ప

తే.గీ. శింశుమారస్వరూపమై చెలగునట్టి । కాలచక్రంబు ధారణ క్రమమునందు
నీశ్వరున కృపయుక్తమై యెసఁగుచుండు । దివ్యసంయమికులనేత ధీసమేత ! ౧౩౮

సీ. భగవంతుఁడై నట్టి పద్మాయతాక్షుండు కుండలీభూతదేహుండు నగుచు
సర్వాక్శిరస్థుఁడై యలరంగ నాతని తోకకుఁ గొనగాఁగ ధ్రువుఁడు వెలయు
నాప్రజాపతితోక యగు నగ్ని యింద్రుండు ధర్ముండు స్రష్టయుఁ దాను తోక
చివర నంటుకయుంద్రు చెలగి సప్తర్షులు కటియందు నుందురు గ్రమముమీర

తే.గీ. దక్షిణావర్త భోగవిస్తారుడగుచు । కుండలాకారమును బూను నండజేంద్ర
వాహునకు నుత్తరాయణ భములు కుడిని ; దక్షిణాయన భములుండు దాపలి కడ. ౧౩౯

సీ. అజవీధిపృష్ఠంబు నందును సురనది యుదరంబునందును నొప్పుచుండు
నాపునర్వసులు బుష్యంబు శ్రోణిని దక్షిణమున వామంబున నమరుఁ గ్రమత
నార్ద్రదక్షిణపాద మందును నాశ్లేష వామపాదంబున వరలుచుండు
నభిజిత్తు మఱి యుత్తరాషాఢ నాసిక దక్షిణక్రమంబులఁ దనరుచుండు

తే.గీ. శ్రవణమును జలభంబును జక్షువులను । వరుసఁ గుడియెడమలయందుఁ గరము మెరయ
నా ధనిష్టయు నసురంబు నలరుఁ జెవుల । వెలపటను దాపటనుఁ దొంటి విధముగాగ. ౧౪౦

సీ. వామంబునందుండు వక్రులఁ గ్రమముగా మృగశిరోముఖములై మించునట్టి
తార లుదక్ప్రముల్ తగియుండు దక్షిణ వక్రికంబుల నొప్పు బ్రాతిలోమ్య
ముల స్కంధములయందు నొగి శతతారయు జ్యేష్ఠయు వెలపట నెడమనుండు
నెలమి మఖాదులౌ నెనిమిది తారలు దక్షిణాయనచరత్వమునుఁ బొందు

తే.గీ. నయ్యగస్త్యుఁడు నుత్తర హనువునందు । నధరహనువున యముఁడును నాసనమునఁ
గుజుఁ డుపస్థకమున మందగుండును గత్తుకందు గురుఁడర్యముఁడు బొమ్మ నందునుండు

సీ. ఎద హరి మనసున నిందుండు స్తనముల నశ్వినులును నాభి నసురగురుఁడు
బుధుఁడు ప్రాణాపానముల గళంబున విధుంతుదుఁడును గేతువు గదసియుంద్రు
తారాగణంబులు తగు రోమకూపంబు లందును నిట్లు దేవాదిదేవుఁ
డై నట్టి యాదినారాయణు నంగంబు సర్వదేవమయంబు సంయమీంద్ర

తే.గీ. ప్రయతుఁడై వాగ్యతుండయి పరమమౌని। ప్రత్యహంబును సంధ్యల బాయ కిద్ది
స్మరణసేయంగవలయును గరము భక్తి। నఖిలభద్రంబులకు నది యాటపట్టు. ౧౪౨

సీ. పరగ నమో యని పైన జ్యోతిరటంచు లోకాయ యని శుభ లోలుఁడగుచు
కాలాయ యని భక్తి కలితుఁడై యనిమిషాపతయె యటంచును బలికి పిదప
నరవి మహాపురుషాయాభి ధీమహి యని యుచ్చరించిన నదియె మంత్ర
మగుజుమీ తప్పక యవనీసురుఁడు సంధ్యలందు స్మరించిన నఘము లడగు

తే.గీ. గ్రహభమయమైనదైవంబు గాలమూర్తి। మ్రొక్కి స్మరియింపవలయును మూడుకాల
ములను బాపోపశాంతికి పుణ్యఫలముఁ। గోరి భూదేవుఁ డది మానఁగూడ దండ్రు. ౧౪౩

## —: రాహుమండల సంస్థానము :—

వ. అనిచెప్పి నారాయణుండు బ్రహ్మసుతునకు సైంహికేయుండగు రాహువుంగూర్చి చెప్పఁ దొడఁగె. నెట్లనిన, నారదా! విధుంతుదుండు గహంబుంబోలె దిరుగుచుండు. నతండు సూర్యచంద్రుల మర్దించుచుండు నారాయణానుగ్రహంబున నమరత్వంబునుం గాంచె. వైరానుబంధియై పర్వంబుల యోజనాయతపరిమిత ప్రదేశంబున సూర్య చంద్రుల నాచ్ఛాదించుచుండు. సూర్యచంద్రులకతండు దూరంబుననయుండి యాచ్ఛాదన కారకుం డగుట యెఱిఁగి హరి తనచక్రంబుచేఁ బరిహరించు నాచ్ఛాదితంబైన కాలంబు నుపరాగం బందురు. వాని దిగువ నయుతయోజనంబులదూరంబున సిద్ధచారణ విద్యాధర లోకంబు లుండు. దాని యడుగున నంతియ దూరంబున యక్ష రాక్షస భూత ప్రేత పిశాచ లోకంబు లుండు. దానియధఃప్రదేశమున నంతియదూరంబున వాయువు ప్రవహించు నంతరిక్షం బుండు. నదియ మేఘంబులుదయించుచోటు దాని యడుగున నూరు యోజనంబుల దూరంబునం బృథివి యుండుఁ. బృథివ్యంతరిక్షంబుల యంతరంబునం బార్థివంబులగు శ్యేన సారస హంసాదు లెగురుచుండు. భూమిక్రింద దేవర్షివివరంబులుండు. వానికి నొక్కొక్కయోజనం బాయామంబై యుండు వానిక్రిందం బ్రత్యేకంబు పదివేలయోజనంబుల యంతరంబులు గలిగి యతల వితల సుతల, తలాతల, మహాతల, రసాతల పాతాళంబు లనియెడి లోకంబులు గలవు మఱియు నాలోకంబులు నిరంతర సుఖప్రదంబులు. సర్వర్తుసామ్యరామణీయకంబులు. దైత్య దానవ కాద్రవేయాదులకు వాసభూతంబులు. మయమాయానిర్మితగృహహర్మ్యమండితంబులు. నానాలంకారశోభితంబులు. నానావిహంగ సంగతరంగత్తురంగవిభాజితతరంగిణీశోభితంబులునై యింద్రియోత్సవకారులయి యెల్ల ప్రదేశంబులు భగవన్మహిమంబు నన్నియెడలఁ జాటుచుండు నని చెప్పి మఱియు. ౧౪౪

## —: అతలాది లోకత్రయ వర్ణనము :—

సీ. వినుము చెప్పెద నాది వివరంబునం దతలాఖ్యలోకంబును యాత్మసూతి
యగు బలాఖ్యునివాసమై తొంబదారుమాయలవాడు సృజియింప స్వార్థసాధ

నములుగాఁగ్రైకొని యతిబలోపేతులయి కొందఱు మాయావు లుందు రచట
బలుఁ డావలించిన భామినుల్ పలువురు జగముల వలపింపఁ జాలువారు

తే.గీ. స్వైరిణు ల్పుట్టి యచటికి వచ్చునట్టి । వారి హాటకరసమున వలలఁ జిక్కఁ
జేసికొని హావభావసుస్మితమృదూక్తి । గూహనంబులఁ దనుపుచుఁ గులుకుచుంద్రు. ౧౪౫

క. అక్కడికేగిన పురుషుఁడు । గ్రక్కునఁ బదివేలసంఖ్య గజముల బలమున్
నెక్కొన సిద్ధుఁడ నేనని । నిక్కుచు నెడలేక విఱ్ఱవీగుచు నుండున్. ౧౪౬

సీ. అతలంబుక్రింద నో యవనీసురేశ్వర వితలంబుగల దందు వినుము భవుఁడు
హాటకేశ్వరసంజ్ఞ నలరుచు పార్షద గణములతోనుండి కమలభవుని
సర్గంబు వితతంబు సలుప భవానితోఁ గ్రీడించుచును దేవకృతసపర్య
లందుచునుండు న య్యభవుని వీర్యంబు హాటకి యనుపేర నమరునట్టి

తే.గీ. యేరుగా నందు మేల్మిబంగారు నొడము । దాని నచ్చటి దైత్యసంతతులు వారి
వన్నెలాడులు నగలుగా వాడుకొంద్రు । సాధుజనసంగనిస్తంద్ర సంయమీంద్ర ! ౧౪౭

సీ. వితలంబునకుఁగ్రింద సుతలాఖ్యలోకంబు గల దందుఁ బుణ్యసంకల్పుఁ డవ్వి
రోచనుకొమరుండు రుచిమంతుఁ డగు బలి యా త్రివిక్రమదేవుని నాన బడసి
స్వర్గ మింద్రున కిచ్చి సకలభోగాస్పదమగునట్టి యా లోక మాశ్రయించె
వెలయ నేటికి నా త్రివిక్రమదేవు నారాధించు నతఁడు నిర్వ్యాజభక్తి

తే.గీ. సుతలకథిపతియై పేర్మి నతఁడు భయవి । రహితుఁడై పాలనము సేయు రాజ్యమఖిల
ధర్మముల నావలోఁ బద్దఁ దరలకుండ । నతని విభవంబు వర్ణింప నలవియగునె ? ౧౪౮

తే.గీ. సారసాక్షునకును భూమి ధారఁబోయు । ఫలమిది యటంచుఁగొందఱు పలుకుచుంద
రదియె యుక్తంబు భగవంతు డైనయట్టి హరికరుణగల్గ నన్నియు నందయుండు. ౧౪౯

ఉ. ఎవ్వని నామ మాత్మ స్మరి యించినమాత్రన కర్మబంధముల్
త్రెవ్వఁగవచ్చు నెవ్వని యుదీర్ణకృపారస మబ్బనేనియున్
గవ్వకు లోకమెల్లఁ గొఱ గాదు భ్రమం బడగున్ భయాదులుం
దవ్వుల నిల్చు నట్టి పరదైవముఁ జేరఁ గొఱంత యుండునే. ౧౫౦

చ. పనిఁగొని దానమంచును నెపంబిడి యింద్రునిఁ గూర్మిచే విరో
చనసుతుఁబట్టి పాశములఁ జిక్కఁగ గట్టెనె కాని యింద్రుఁడే
యనఘుడు తుచ్ఛభోగముల కంచు హరిం బలుమాఱు వేడు నా
కును బురుషోత్తమార్చన మకుంఠసుఖాస్పదమంచు నెంచుచున్. ౧౫౧

మ. తన యైశ్వర్యము లెల్లఁ బోవిడిచి నా తాతైన ప్రహ్లాదుఁ డ
త్యనఘశ్రీవరపాదపద్మమకరందాయత్తచిత్తంబుతోఁ

దనరెంగావున భార్గవీవిభుని పాదద్వంద్వమే దిక్కటం
చును వైరోచని భక్తిమార్గమునఁ బుచ్చుం గాల మో తాపసా. ౧౫౨

ఆ. వె. నిఖిలలోకజాల నియమనశీలుండు । నిత్యుఁ డాద్యుఁ డఖిలనేత ధాత
భవ్యవేది పరుఁడు భగవంతుఁడగు మురా।హరుఁడు ద్వారపాలుఁడయ్యె బలికి. ౧౫౩

ఉ. రావణుఁ డొక్కసారి సుతలంబునకుం జని తజ్జయానియో
త్రోవను రాఁ గనుంగొని విరోచనపుత్రునిమీఁదిఁ ద్రేపిచేఁ
గావలియున్న శ్రీవరుఁడు కంజదళాక్షుఁడు కాలిద్రేలిచే
వే విసరంగఁ దూలి చనె వింతకదా పదివేలయామడల్. ౧౫౪

## —: తలాతలాది లోకచతుష్టయ వర్ణనము :—

సీ. సుతలంబుక్రిందను సొరిదిఁ దలాతలం బనునట్టి లోకంబు దనరుచుండు
త్రిపురాధిపతియయి తిపురు మయుండను రాక్షసుం డతడు పురత్రయంబు
కామారిచేత దగ్ధంబైన సద్దేవు కరుణచే రాజ్యంబు గాంచి మించె
నతడు మాయవుల కాచార్యుడై యొప్పు దైత్యపూజితుడు విస్తారబలుడు

ఆ. వె. సకల విధములైన సంసారభోగముల్। కలవు మాయనైజకర్మవృత్తి
ఘోరరూపుఁ డతని గొనియాడ శక్యంబె। బ్రహ్మపుత్ర! దివ్య భవ్యగాత్ర! ౧౫౫

సీ. ఆ తలాతలమున కడుగుననుండు మహాతల మదియెన్న సహులష్టట
పడగలనేకముల్ పరగిన కాద్రిపేయులనుఁ గొందరి నీకు దెలుపువాడ
కుహకనాముఁడు తక్షకుఁడు సుషేణుఁడు గాలయుఁడు మొదలగునట్టి యురగవరులు
నతిసత్త్వులగుచు మహాభోగులగుచు గ్రూరత్వంబు జూపి నిరాకులతను.

తే.గీ. దిరిగి గరుడునిచేత నుద్విగ్నులగుచు।నిజసతీపుత్రసహితులై నిత్యమత్త
వృత్తులౌనరంగ వసియింతు రిందు నెపుడు।వారి వైభవమును జెప్పవశముగాదు. ౧౫౬

సీ. అమ్మహాతలమున కడుగుననుండు రసాతలం బది దైత్యసమితి యునికె
వారు నివాతకవచసంజ్ఞులు హిరణ్యపురవాసులు మహావిభూతు లధిక
బలులు కాలేయాఖ్య బరగుదు రమరవిరోధులు సాహసప్రోద్ధతులును
శ్రీవరుచేఁ బరాజితులగుచు బిలేశయులవలె నతతంబు కలుగులందు.

తే.గీ. బొసఁగ వసియించెదరు సుధాభుగ్వరేణ్య।దూతియగు సరమాంగనదూతమంత్ర
వర్ణములవల్లఁ గొట్టగబడి భయంబు।బొందుచుందురుసుమ్ము తపోధనేంద్ర। ౧౫౭

సీ. ఆ రసాతలమున కడుగునఁ బాతాళలోకంబుఁగల దహిలోకపాలు
రైన వాసుకియు శంఖాఖ్యుండు గులికుండు శ్వేత ధనంజయా।ఖ్యాదులును మ

హాశంఖ ధృతరాష్ట్రు లలశంఖచూడుండు గంబలాశ్వతరాఖ్య ఘనభుజంగ
ధవులు దేవోపదత్తక మహామర్షులు మఱి మహాభోగుండు నుందు రందు

తే.గీ. పంచమస్తకములు మహాఫణము లేడు। నుండుఁ గొందరికిని బది యుండు ఫణలు
మరియుఁ గొందరికిని నూరు బరగు వేయి। గొందరికి నుండు మణిగణాస్పందరుచుల. ౧౪౮

ఉ. వారల కెప్పుడుం గినుక వర్తిలు నజ్జగమందు మూలవి
స్తారతలంబునం దిరువు దప్పక ముప్పదివేల యామడల్
మీరినచో ననంతయను పేరు వహించిన దేవి తామస
స్ఫారవిభూతి జేర్పు భగవత్కళ దా నివసించు నారదా! ౧౪౯

ఆ.వె. వేయితలల పాపరాయం డనంతుండు। తలలమీద నవనితలము నిల్పి
శేషుడనెడిపేర జెలగుచు ధరియించు। నతనిశక్తి నెవ్వ నలవియగునె? ౧౫౦

వ. మరియు నయ్యనంతుం డహమిత్యభిమానంబునకు లక్షణంబుగా సంకర్షణుం డను
పేర ద్రష్టృదృశ్యంబుల సంకర్షించుచుండ నొకానొక కాలంబున నతని భ్రూమధ్యంబు
ననుండి సాంకర్షణుండను రుద్రుం డేకాదశవ్యూహంబులతో నుదయించె నని చెప్పి
మఱియు నారాయణుండు ౧౫౧

చ. అతడు త్రిలోచనుండగు చుదగ్రత నొప్పెడి శూలమున్ మహో
గ్రత జళిపించుచున్ నిలువ గాంచి తదీయపదాబ్జయుగ్మశో
భితవరశోణకాంతి మణిబింబములన్ భజియించి సాత్వత
ప్రతతులతో నహీంద్రులు స్ఫురన్మణిశోభలు నూచుకొం ద్రొగిన్. ౧౫౨

తే. గీ. నాగరాజకుమారికల్ నవవయోనిలాసవిభ్రమములు సూపి లలిత చాప
చందనాగరుకర్పూర సంకుమదవిలేపనంబుల నొప్పి బాళిగొని యతని. ౧౫౩

క. నగవులతేటలు లోలో దగిలిన నెఱసిగ్గులును సుదర్శనలీలా
నుగతానంగవికారము లగపరచుచు నిచ్చ గొల్తు రనురాగమునన్. ౧౫౪

క. గుణమణి యనంతు డురుభూషణగణగణనీయమూర్తి సకలఫణిఫణా
మణిరుచినీరాజితసుచరణయుగళి వసియించు శుభకరణశీలుండై. ౧౫౫

వ. ఇట్లనంతగుణమణివిరాజితులుండును, సకలభయనివారకుండును, నిజరోమరంధ్రనిబిడిత
బ్రహ్మాండభాండకాండమండితుండును, సుర సిద్ధోరగ గంధర్వ యక్ష పక్షిరాట్పరిస్తూ
యమానుండును నయి యనంతుండు మృదులతులశీదళమాలికాజాలశోభితవక్షస్థలం
బున శ్రీవత్సంబు రాజిల్లం గుండలరత్నంబుల దీధితుల దిశలు వెలుగంగ నీలాంబరం
బుఁదాల్చి హలాద్యాయుధంబులు పట్టి యుదారలీల సాత్వతశిఖామణులచే వర్ణింపఁ
బడుచుండు. మఱియుం దెలిపెద వినుము. ౧౫౬

## —♦ ఆదిశేష స్తుతి - నరకాది స్తుతి ♦—

చ. సనకసనందనాదులగు సంయమివర్యు లనేకరీతులన్
ఘనతరభక్తి గొల్తు రనఘా విను మీవును దుంబురుండు గ్ర
న్నన ననిశంబు బాడుదురు నాదవినోదితమోదితాత్ములై
యెనయగ నేమపుహారుషు నీళు నతండె యనంతు డెన్నగన్. ౧౬౭

చ. గుణములు మూడు నెవ్వని యకుంఠితలీల వహించి జన్మ ర
క్షణ హననాది హేతువులుగా దనరారు జగత్త్రయంబునన్
ఘృణయును సత్వము న్శుచియు గేవలధర్మములై నిరంతర
ప్రాణిహితప్రవృత్తి నెవ్వని ప్రభావమున న్సుజనాళి కిచ్చెడున్. ౧౬౮

ఉ. ఎవ్వనిమూర్తియందు జగమెల్ల వసించును శంకయుండు దా
నెవ్వనిలీల గైకొని మహేశతగాంచి జగంబు బ్రోచు నిం
కెవ్వనినామకీర్తనము నీసున జేసినఁనేని పాపముల్
దవ్వులకేగు నట్టి పరతత్త్వ మనంతుడుగాడె నారదా! ౧౬౯

చ. నగిరి సరిత్సముద్ర పుర సత్వసమేత సమస్త ధాత్రి నొ
ప్పుగ బడగ న్ధరించిన విభుం డెవ డింతటి నల్లపూసగా
సుగుణగణప్రపాతమున శోభితు డెవ్వడు వెయ్యినాలుకల్
తగవుసుమ య్యనంతుని విలాసము లెన్నగ నింత వింతలే. ౧౭౦

వ. అయ్యనంతుని ప్రభావం బిట్టిదియని యెఱుంగుము. వత్సా లోకంబున జనుండు నిజకర్మబద్ధుఁడయి తదనుగుణంబయిన మార్గంబునం బ్రవర్తించుచుండు. నెంతవా నికేని కర్మఫలం బనుభవింపక దీరదని చెప్పిన విని నారదుండు నారాయణున కిట్లనియె. ౧౭౧

తే.గీ. కర్మలకునెల్ల నేకలక్షణము పొసగ । లోకవైచిత్ర్యమెందుకు లోకవిభుడు
పొసర గావించె గారణంబు పచియింపు।మగ్రసంపూజ్య నాయం దనుగ్రహమున. ౧౭౨

వ. అనవుడు. ౧౭౩

తే.గీ. కర్త శ్రద్ధనుబట్టి యీ కర్మలెల్ల వేఱు వేఱు వితంబుల వెలయుచుండు
గర్మలు పృథగ్విధములైన గతులునుం బృథగ్విధములగు జంతుసంతతికి ననఘ! ౧౭౪

తే.గీ. మూడుగా జీల్చె గర్మల మునివరేణ్య। మూడుగుణములు విసదృశంబులగు ఫలము
లిచ్చుచుండును సత్వంబు నెనయు శ్రద్ధ కర్తనుసుఖిజేయు నితరముల్ కావుసుమ్ము. ౧౭౫

తే.గీ. శ్రద్ధ రజసునబట్టి యీ జంతువితతి దుఃఖమునముంచు దామసి దుఃఖమౌఢ్య
దాత్రి యగు నిద్దిదెలియుము తాపసేంద్ర తారతమ్యంబు శ్రద్ధచే దగులు క్రియకు. ౧౭౬

తే. గీ. పుట్టు కెరుగ దవిద్యయం దుట్టిపడిన క్రియల పరిమాణములచేత గీలుకొనుచు
గతులు నూఱులు వేలు లక్షలని యెన్న వశముగాదుసుమీ పద్మభవతనూజ! ౧౭౭

సీ. వినుము నీ కదియెల్ల వివరించి తెల్పెద ధర క్రింద మొదటి దతలము వింటె
బెతరు లగ్నిష్వాత్త లతిమోదమున నందు వసియించుచుందురు వారు స్వీయ
గోత్రుల యాయువుల్ గోరుచు దమ సమాధిని నిక్కమగునట్టి దీవనల నొ
సంగుచుందురు వారి చరితంబులకు ననుగుణమైన ఫలముల గూర్చ నీశ్వ

తే.గీ. రాజ్ఞ గైకొని పితృపతి యందు నుండు సగుణుడై ధర్మపరుడయి శమదమాది
కలితుడై స్వపురుషులతో గర్మఫలవిచారములు సేయుచును మహోదారుడగుచు. ౧౭౮

తే.గీ. ధర్మతత్వజ్ఞమైనట్టి తన గుణంబు నయ్యయిప్రదేశములకు దా నంపుచుండు
వాని యాజ్ఞను దలమోచి వరుస నెల్ల ధర్మముల బరికింతు రా ధన్యు లనఘ! ౧౭౯

## —: యాతనా నరక పాతనాదులు :—

వ. మరియు నప్పితృపతి యధికారంబునకు లోబడి యిరుబదియొండు నరకంబు లుండు.
గొంద రవి యిరుబదియెనిమిదం్రు. ౧ తామిస్రంబును, ౨ నంధతామిస్రంబును,
౩ రౌరవంబును, ౪ మహారౌరవంబును, ౫ కుంభీపాకంబును ౬ కాలసూత్రంబును,
౭ అసిపత్రారణ్యంబును, ౮ సూకరముఖంబును, ౯ నంధకూపంబును ౧౦ క్రిమి
భోజనంబును, ౧౧ దప్తమూర్తియు ౧౨ వజ్రకంటకంబును, ౧౩ శాల్మలియు,
౧౪ వైతరణియు, ౧౫ బూయోదంబును, ౧౬ విశసనంబును, ౧౭ లాలాభక్షం
బును, ౧౮ సారమేయోదనంబును, ౧౯ అవీచియు, ౨౦ నయఃపానంబును ౨౧
క్షారకర్దమంబును, ౨౨ రక్షోగణంబును, ౨౩ సంభోజంబును, ౨౪ శూలప్రోతం
బును, ౨౫ దందశూకంబును, ౨౬ వటారోధంబును, ౨౭ పర్యావర్తనకంబును,
౨౮ సూచీముఖంబును నను నివి యిరుబదియెనిమిదియు వారు వారు చేసికొనిన
పాపఫలంబులుగా ననుభవింప దగినవయి యుండు ననిన విని నారదుండు. ౧౮౦

క. వినవలతు దెలుపు మచ్యుత యనఘా నారాయణా రమాధీశ జగం
బున గర్మ లెన్నివిధములు బొనరుస్ యాతనల నెట్లు బొందుదురు జనుల్. ౧౮౧

వ. అనిన విని నారాయణుండు ౧౮౨

క. పరులధనములను బిడ్డల దరుణులను హరించు పాపతంత్రుం డాహా
స్కరకింకరగోచరుడై తరలుం దామిస్రమునకు దండితు డగుచున్. ౧౮౩

తే.గీ. కాలపాశంబులను గట్టి కాళ్ళదన్ని త్రొక్కి తర్జించి భర్జించి దూరి గ్రుద్ది
యమునిదూతలు గొనిపోవునపుడు పాపి మూల్గు దీంద్రించు గోంద్రించు
మూర్ఛనొందు. ౧౮౪

క. తన్నేలినవానిసతిం గొన్నయతడు వానిధనము గొన్నయతడు దా
బన్నంపడు యమదూతల తన్నులబడి నొచ్చి యంధతామిస్రమునన్. ౧౮౫

తే.గీ. అంధతామిస్రమున బడునట్టి నరుడు గ్రుడ్డియై బుద్ధితెలియక కూలియుండు
వ్రేళ్లనరకిన దెగిపడు వృక్షముక్రియ గావుననె దాని కా పేరు గలిగెనండ్రు. ౧౮౬

ఉ. కన్నదియెల్లనుం దనకు గావలెనంచు దురీహితంబులన్
బన్నుచు భూతకోటికిని బాధ లొనర్చి కుటుంబకార్యసం
పన్నత జిక్కువాని దుది సౌరిభటుల్ గొనిపోయి గ్రుద్దులున్
దన్నులు వైచి రౌరవము దాస్తురు దిట్టుచు బట్టి నెట్టుచున్. ౧౮౭

తే.గీ. తొల్లి వానిచేత దుఃఖింపబడి జంతుకోటి రురువులగుచు ఘోర గీర
దార దారిలేక దటదటాయించుచు వాడి వత్తులగుచు వగచుచుండ్రు. ౧౮౮

క. రురువను జంతువు మిక్కిలి ఖర మురగముకన్న దాని కాటుల నెంతే
నెరయుట రౌరవనామము పొరి న న్నరకమున కిడిరి పూర్వులు మౌనీ! ౧౮౯

క. సలసలగ్రాగెడి నూనియ లలరెడి గూనలను ద్రోయ నడలుచు గొడవన్
బొలియుట గుంభీపాకము తలిదండ్రుల గురుల దెగడి దండ్యుడు గుడుచున్. ౧౯౦

తే.గీ. జంతుదేహంబునను రోమసమితి యెన్నివేలు గల వెన్నగా నన్నివేల యేండ్లు
క్రింద కొరవులు మండనగ్గెలనులందు నెండగాయంగ సెగలెత్తి యేడ్చు నరుడు. ౧౯౧

మ. తన వేదంబును మాని నాస్తికుని చెంతం జేరి పాషండవ
ర్తనముం బూనిన నీచు దేగు నసిపత్రప్రోజ్వలత్కాననం
బునకుం దన్నరకంబునం జబుకులన్ మోదున్ భటానీకముల్
తనువుం గోయుదు రింత లింత లసిపత్రస్ఫారదారావళిన్. ౧౯౨

శా. ఉర్విన్ భూపతియొండె రాజపురుషుం డొండెన్ నయంబెన్న క
య్యుర్వీదేవు శరీర శిక్ష నిడెనే నుగ్రాకృతు ల్యాముల్యా లా
గర్విన్ దంష్ట్రిముఖాఖ్యమం దిడి పొడింగా బిండిగా బిట్టుగా
దుర్వారశ్రమ నొందజేయుదురు ప్రొద్దుంబ్రొద్దు నేకక్రియన్. ౧౯౩

తే.గీ. ఈశ్వరాంకితవృత్తుల కెవడు బాధసేయు నవ్వాని జీకటినూయి యనెడి
నరకమున నుంతు రందులోనబడి కూరిర మృగ సరీసృపములచేత మెసవబడును. ౧౯౪

చ. అతిథికి నన్నభాగ మిడ కంతయు దానె భుజించునట్టి దు
ర్మతి క్రిమిభోజనమ్మన జెరంబడి యాయతతుచ్ఛకీటసం
తతియుత లక్షయోజనమితంబగు కుండమునం గ్రిమిస్వరూ
పత వహియించి దుఃఖములపాలయి కుందు బితామహాత్మజా! ౧౯౫

క. అస్రత్త్రాప్రహంతాదుడు క్షిప్రగతిం బోయి యందు జెడుగులు గుడుచున్
సుప్రకటక్రిమిభోజన మప్రతిహతదుఃఖసమితి కాకరముసుమీ! ౧౯౬

ఉ. కందలు మెండుగా బెరిగి కావరమెక్కఁగ నగ్నిసాక్షిగా
బెండిలిజేసికొన్న తన పెండ్లము వంతల ముంచి దానికిన్
దిండియు నీక యన్యసుదతిం దగులాటముగొన్నయట్టి యా
మిండడు గౌగలించు బలిమిన్ నిరయంబున జిచ్చుకంబమున్. ౧౯౭

ఉ. బొంకులు సెప్పి పెన్మిటికి బుద్ధి మరల్చి యతండు నిద్రవో
జం కొకయింత లేక యొక జారశిఖామణి గూడి బంగరుం
బెంకులు కొన్ని మేన నిడి వీథి నెగాదిగ గన్నులార్చు బల్
రంకులమారి జేర్చు బదిలంబుగ గౌగిట జిచ్చుకంబమున్. ౧౯౮

ఉ. చెడిపెతనంబునం దిరుగు చేడియలన్ విడిపడ్డ కుక్కఁకై
వడి విటవృత్తి గ్రుమ్మరెడివాని నయోమయవజ్రకంటక
జ్వలనసమేతఘోరమగు శాల్మలి గట్టి కశాహతి క్రమం
బడరగ నూకుచుండ నిరయంబున నెంతురు తొంటిచెయ్వులన్. ౧౯౯

ఉ. దండిగ రాజులొండె మరి తత్పురుషావళియొండె వేదముల్
మండుచునున్న యగ్ని నిడి లక్షల లెక్కఁలుపెట్టుకొంచు పా
షండతమీరి నారకము స్వర్గము దేవుడు దెయ్య మెందుకం
చుండియు జచ్చి వైతరణి నుందురు బీతలు సత్తులంటగన్. ౨౦౦

క. తరలవు ప్రాణము లంగము చురచురలా మెండు సౌఖ్యశూన్యం బనియో
నిరయంబు బాధజెప్పఁగఁదరమా పగవారికైన దగదు మునీంద్రా! ౨౦౧

క. కనుగానక సంతోషంబని చేతుదు చెట్టచెయ్వు లాదట నిరయం
బున బడి కుయ్యోమొఱ్ఱో యని యేడ్చుచు ననుభవింతు రమరమునీంద్రా! ౨౦౨

తే.గీ. శౌచమును మాని వృషలుల సంగమూని సిగ్గువిడనాడి చరియించు చెనటు లెల్ల
మురికిపెంటలు పంచటంబులును గళ్ళె లెసయ బారెడి యేటిలో మునుగుచుండ్రు. ౨౦౩

తే. గీ. దయ యనెడి వస్తువావబద్ధయును లేక మృగములను బక్షులను జంపి మేటనుచు
దిపురుచున్నట్టి విప్రుని తీవ్రబాణనిహతి నొంతురు యమభటుల్ నియమశీల! ౨౦౪

చ. పెనుపుగ సోమయాజి యని పిల్తురు నన్నిక సోమిదెమ్మ యం
చును బిలువంబడున్ గృహిణి శ్రోత్రియభావము జూపవచ్చు నా
కును గల దగ్రవీటి యని గొప్పతనంబున కంచు మేకలన్
హననముసేయు దంభముఖయాజి వెతంబడు వైశసంబునన్. ౨౦౫

క. కట్టిడి యమభటు లకటా ముట్టడిగొని కశలతోడ మొత్తుచు గూలన్
నెట్టుచు దిట్టుచు గొట్టుచు గట్టుదు రవ్వైశసమున గడు భయదముగన్. ౨౦౬

క. ఎవ్వడు తన ధర్మసతిన్ బువ్విలుతుని పదునుకత్తిపోటున జడుదె
యవ్వీర్యము ద్రావించెడి నవ్వా డవ్వీర్యకుండమందు వసించున్. ౨౦౭

ఉ. దారులుగొట్టువారు గృహదాహకులున్ విషదాయకుల్ మహా
చోరులు నూళ్లదోచుకొనుశూరులు రాజులు రాజపూరుషుల్
వారక సారమేయముల వాతలకుం దయసేయువారలై
మీరుదు రాత్మదేహముల మేటులు సౌరిభటుల్ హసింపగన్. ౨౦౮

క. కుక్కలు నిరువదికంటె మఱెక్కువగా నుండు పాపు లెందరయిన నొ
క్కొక్క నిమేషంబుననే ముక్కలుముక్కలుగ నమలి బోసేయు మునీ! ౨౦౯

తే. గీ. అనృతసాక్ష్యములకు నగ్రతాంబూలంబు గొనెడి పెద్దగంతు గొట్టి పిదప
సమర నూరుయోజనముల యెత్తైయొప్పు కొండనెత్తినుండి కూలు ననఘ. ౨౧౦

క. వెలయగ నాకాశంబున దలక్రిందుగ గత్తి రాళ్ళ స్థలమున బడగన్
బిలబిల ద్రోయుదు రార్కిభటులు నద్ది యవీచి యనబడున్ మునినాథా! ౨౧౧

క. ఒడలెల్ల నూపుగింజలపడువున దునియ లగునట్లు బడువారలకున్
విడవనుప్పలు దడపునకున్ కడుభీతిదమ య్యవీచి గన దరమె మునీ! ౨౧౨

తే. గీ. సోమపీథియయ్యు సురద్రావు నాతండు నట్లు సేయు నతని యంగనయును
నది ప్రమాదముననె యైనను కార్ష్ణాయసంబు గలుగు విప్ర జనప విశుల. ౨౧౩

ఆ. వె. కల్లుద్రావినట్టి కట్టిడి తా నెట్టి పుట్టు వెట్టివర్ణ మెట్టిచదువు
నెట్టితపము నెట్టికట్టుబాటందిన గట్టికుడుపు నందుబట్టు దొసగు. ౨౧౪

క. చదివినవారల బెద్దలను దపస్వుల వర్ణివరులను సదాచారా
స్పదుల వరాశ్రములను గని కదలనివా డేగు క్షారకర్దమమునకున్. ౨౧౫

క. నరమేధముచే నన్యుని నరికినవా రందు ఖాదనముసేసినవా
రరుగుదురు యమునిపురికిన్ మరియు నసృక్పానయాతనం బడుదు రొగిన్. ౨౧౬

క. శూలప్రోతమునందుం గూలుచు విశ్వాసఘాతుకులు కుందుదు రు
త్తాల బక కంక తుండోచ్చాలితులై యెందుబోవజాలక మౌనీ! ౨౧౭

క. దయలేక భూతజాలము భయమందగ బాధపెట్టు పాపులు వినుమీ
భయదమగు దందశూకనిరయమునబడి వగచెదరు నిరంతరము మునీ! ౨౧౮

క. అవట కుసూల గుహాదిక వివరంబులబెట్టి భూతవితతికి బాధల్
తవులంగ జేసి మూసిన యవివేకికి వహ్నియుతగుహాలు గల్గుజుమీ. ౨౧౯

క. సమయప్రాప్తుల నతిథుల బొమముడివడ గోపగించి పొమ్మనిన నరున్
యమభటులు కొంచు జని కంకముఖముల బెట్టి బాధగావింతు రొగిన్. ౨౨౦

వ. మరియు గేవలార్థపరాయణులును బరోపకారశూన్యులును, దయాసత్యశౌచపర్జితులును నగు దుష్కర్ములు సూచీముఖాది నరకంబులందుదురు. ధర్మపరులు బుణ్యంబులయిన స్వర్గాదిలోకంబు లందుదురు. కావున స్వధర్మత్యాగంబు సేయరాదు. దేవ్యారాధనానుష్టానతత్పరులగు నరులకు నరకప్రాప్తి లేదు. భవపాథోధిం దాటింపంజాలు నావ దేవీపాద సేవయే యని చెప్పిన విని నారదుండు. ౨౨౧

## —: దేవ్యారాధనక్రమము. :—

తే. గీ. అఖిలలోకైకపూజ్య నారాయణా ముకుంద వామన శ్రీదేవి గొలుచుటెట్టు
లెవ్వ రెప్పుడు గొల్చి యే యే ఫలముల నరకముల దొలగిరో తెల్పు నా నతండు. ౨౨౨

మ. యమిలోకోత్తమ తెల్పెదన్ వినుము ధర్మారాధనస్రక్రియా
క్రమమున్ దేవి యనాదియందు నిజభక్తశ్రేణి యారాధనం
బమరం గాంచె గృహస్థమార్గకరణీయశ్రేణిలోనెల్ల మే
లిమిసుమ్మా యది సర్వసంకటలతాశీదాత్రమై యొప్పెడిన్. ౨౨౩

సీస మాలిక. ఆజ్యంబుచేత బాడ్యమినాడు చక్కెరచేత విదియనాడు క్షీరధార
చేత తదియనాడు పూతబూరణపప్పుచేత చవితినాడు సెక్రకేళి
చేత బంచమినాడు చిఱువిరిదేనియచేతను షష్ఠినా డూతమైన
చెఱకుబెల్లపుగడ్డచేత సప్తమినాడు నారికేళోపాయసములచేత
నష్టమినాడు లాజాదికంబులచేత నవమినాడు దిలాశనంబుచేత
దశమినా డంచిత దధిచేత నేకాదశియనునా డటుకుల సేర్చచేత
ద్వాదశినాడు పెద్ద సెనగపప్పుచేతను త్రయోదశినాడు నెనుపు బేల
పిండిలో గల్పిన పెరుగుచేతను జతుర్దశినాడు పాయసౌదనముచేత
బున్నమినాడును బూజింపవలయు నా దేవిని భక్తివిస్తీర్ణులగుచు
తెవులడంగును జిరాయువుగల్గు దుఃఖంబువాయు విఘ్నంబులు బారిచనును
బుద్ధిగల్గును శాంతిబుట్టును వగపడంగును తాపమేగును గోర్కెదీరు
జమునిభయముదీరు సకలాంబదయవచ్చు ధర్మదంబైన సంతాన మబ్బు

తే. గీ. శివునిదయవచ్చు దేవికి జిత్తమబ్బు తిథులవరుసను దెల్పితి దిప్యమౌని
దినదినము ద్రవ్యముల బ్రాహ్మణునకు నొసగవలయుజూము బున్నమను
హోమకలన వలయు॥ ౨౨౪

మ. రవివారంబున బాయసంబు శశివారంబందు బాల్ ధారుణీ
భవువారంబున నంటిపండ్లు శశిభూవారంబునన్ వెన్న దా
నవవిద్విడ్గురువారమందు గలకండల్ చక్కెరల్ మెండు భా
ర్గవువారంబున నావునెయ్యి శనివారంబందు నైవేద్యముల్. ౨౨౪

చ. ఘృత తిల శర్కరా దధులొగి న్నవదుగ్ధ కిలాటకంబులుం
దత దధికూర్చి మోచక ముదారత ఫేణిక యాజ్య మండకం
సృతివటపత్రముల్ ఘృతము శ్రీవటకంబును గౌరకంబునుం
స్తుతమగు బూరణంబు మధు సూరణముం గుడ పాద్ధుకంబు ల
గ్ర్యత గనునట్టి కిస్మిసులు కజ్జురకాయలు లాజకంబు మా
నితగతితోన సపూప నవనీత సుముద్గ సుమోదకంబున
ద్భుతమగు మాతులుంగమును భోజనముల్ క్రమలీల రిక్కలం. ౨౨౫

మ. గుడముం దేనెయు నేయి దుగ్ధమును బెద్గుం జల్ల యప్పంబులన్
బెడగౌ వెన్నయు దోసయుం గుమిడి పేర్మి న్మోదకంబున్ జపుల్
దొడరన్ జేయ సమర్థమౌ పనసపండుం జెక్రకేళీలు నే
రెడులున్ మామిడిపండ్లు నువ్వులును గూర్మి న్వారిజల్ దాడిమం
బడరన్ రేగులబండ్లు మేలు సరి కాయల్ పాయసం బట్టులున్
మడితో సెగ్నలు నారికేళములు నిమ్మల్ సత్కశేరుల్ కడున్
వడితో సూరణ మెల్లయోగముల నెన్నంగా బ్రసాదంబులౌ. ౨౨౬

మ. వరకంసారము మండకంబు మురువౌప్పన్ ఫేణియున్ మోదకం
బురుమాన్యస్థితి వాటపత్రకము మేలౌప్పారు నా లడ్డుకో
త్కరమున్ ఘూర్తకమున్ దిలల్ దధియు మొవ్వంబైన య త్తేనెయున్
గరణశ్రేణిని లోకమాతకును బోనంబుల్ క్రమాధ్వంబునన్. ౨౨౭

వ. మరియు బ్రహ్మపుత్రా। మధూకపూజావిధానంబు దెల్పెద, వినుము. చైత్రశుద్ధ తృతీయ మొదలుసేసి యన్నిమాసంబులయందును దృతీయనాడు శుచియై మధూకవృక్షంబుం జేరి దేవీపూజావిధానంబున షోడశోపచారపూజ లాచరించి చైత్రంబున పంచఖాద్యంబులు నైవేద్యంబు సేయవలయు. వైశాఖశుద్ధ తృతీయయందు గుడ యుక్తంబుగాను, బిమ్మట బది మాసంబులం గ్రమంబుగా మధు, నవనీత, దధి, శర్కరా, పాయస, దుగ్ధ, ఫేణీ, దధికూర్చికా, గోఘృత, నారికేళ సమాయుక్తంబుగా నైవేద్యంబులు నెరపవలయు. ౨౨౮

సీ. మంగళ వైష్ణవి మాయయు గాళరాత్రియు దురత్యయ మహాదివ్యమాయ
మాతంగి కాళిక మలవాసియు శివ సాహస్రచరణయు సర్వమంగ

శాభిఖ్య యగుచు జైత్రాదుల బండ్రెండు మాసంబులం దిప్ప్రసూను దేవి
నామంబులం బూని కామంబుల నొసంగు క్షేమంబులకు గల్పభూమిజంబు
తే.గీ. గాన నయ్యాయి పేళ్ళతో మ్రానిపూజ సల్పి దేవీనమస్కారసరణి దెలసి
కోరికలు బండగాగోరి గూర్మితోడ। మ్రొక్కులిడ నిక్కవమ్మగా దక్కమేలు. ౨౨౯

సుగంధి. తల్లి మమ్ము బ్రోవవమ్మ దానకల్పవృక్షమా కల్ల గాదు నీదు పూజకన్న వేరె యున్నదే
చెల్లబో భవత్పదాబ్జ సీధుపానమత్తులన్। దల్లడిల్ల జేయలేరు ధర్మరాజుకింకరుల్. ౨౩౦

పంచచామరం. జొహారు నీకు సుందరీ కృశోదరీ
జొహారు నీకు సర్వలోకశోభినీ ఖలార్దినీ
జొహారు నీకు భామయీ యశోమయీ కృపామయీ
జొహారు నీకు భక్తి రక్తి సూక్తి ముక్తిదాయినీ. ౨౩౧

పంచచామరం. జొహారు నీకు శాంకరీ త్రిశుద్ధిమత్సుఖంకరీ
జొహారు నీకు దుష్టలోకశోషిణీ సుభాషిణీ
జొహారు నీకు భక్తలోక శోక మోహ హారిణీ
జొహారు నీకు భూర్యవార్య సూర్యబింబవర్తినీ. ౨౩౨

క. యమ నిగ్రహ రూపాఢ్యవు। యమపూజ్యవు దేవి నీవు యము నగ్రజవున్
యమ నియమాది వినోదివి। యమరోకాభారకర్త్రి వగుదువు తల్లీ. ౨౩౩

తే. గీ. రావి మర్రి వేము మావి వెల్గయు రేగు। పనస జిల్లెడు మరి బాలచెట్టు
నీకు నునికిపట్లు లోకైకపాలిని। కంట జూచి మమ్ము కావుమమ్మ. ౨౩౪

తే. గీ. దుగ్గవల్లి యింటి దొరసాని వీవకా జ్వరములెల్ల దోలు శక్తివగుచు
రోగజాతిబట్టి రోకళ్ళదంచెదు। మ్రొక్కులిడుదుమమ్మ చక్కనమ్మ. ౨౩౫

వ. అని యివ్విధంబున మధూకపూజ చేసినవారు దేవ్యనుగ్రహంబున సకలసంపద లను
భవించి యనంతరంబున స్వర్గంబునం జేరుదురు. యమభటులవలని భయంబు లేశం
బును లేదని చెప్పి నారాయణుండు మరియు, ౨౩౬

## —: కృతిపతిసంబోధనము :—

శా. విశ్వాతీతవిధాన విద్విబుధరా డ్విద్విడ్విభేదప్రచా
రాశ్వాయత్తగమిక్రియాకరణ సామర్థ్యప్రభావోల్లస
త్పశ్వగ్రేసరనామ భూమ ధవళ ప్రాంచత్ససాస్నాంకశృం
గాశ్వారోహక యోధకృత్యచతురా యల్లూరి సోమేశ్వరా। ౨౩౭

స్రగ్విణి. తార నీహార బృందార కానేకస। క్షీర మందార పుంజీభవన్మౌక్తికా
కార సంసారదుఃఖప్రతీకార దివ్యోరగేడ్హార యల్లూరి సోమేశ్వరా। ౨౩౮

గద్య. ఇది శ్రీమ దిష్టకామేశ్వరీ పాదారవింద మకరంద తుందిల మానసేందిందిర, దాసు వంశపయఃపారావారరాకాసుధాకర, కామాంబా కన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరితగోత్రాలంకార, కృష్ణామండల మండనాయమా నాల్లూరగ్రహార పూర్వార్జితధరావిరాజమాన శ్రీవీరప్రతాప కోరొ్కండహంవీర రామచంద్ర భూమీశ్వరదత్త గోదావరీ మండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయ సభావాదక నియోగభారవ్యవహార, శ్రీ వేంకటేశ్వరవరప్రసాదసంభూతకవిత్వ విద్యావిశేష బాల్యాది రచిత త్రింశ త్ప్రత్యేకగ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితప్రచారనిత్య, శ్రీ రామామాత్య ప్రణీతంబగు శ్రీ దేవీభాగవతంబను మహాపురాణంబునందు అష్టమస్కంధము.

అష్టమస్కంధము సంపూర్ణము.

శ్రీ ర స్తు.
శ్రీ శా ర దాం బా యై న మః.

# శ్రీ దేవీ భా గ వ త ము

## న వ మ స్కం ధ ము

— (౧) —

శ్రీ తాతమథనవేళా
జాతగరళభీతవిబుధ సంయమి దనుజ
వ్రాతమహాతతచేతః
ప్రీతికరగళప్రకాశ శ్రీసోమేశా। ౧

### —: దేవీకృత ప్రకృతివిధానము :—

సీ. వినుము నారద సృష్టి విధమున శ్రీదేవి ప్రకృతియై యైదురూపముల నలరు
గణనాథజనని, దుర్గయు, రాధ, లక్ష్మి, సరస్వతి, సావిత్రి క్రమముమీర
నావుడు విని పల్కె నారదుఁ డో దేవ యామె యెవ్వతె యెందు నవతరించె
నామె లక్షణమేమి యైదువిధములైన కారణంబేమి యెక్కరణి వారి
తే.గీ. పూజ లొనరింపవలయును భూరిమహిమ। లొక్కరొక్కరి కెయ్యది యొప్పుమీర
దెలుపగదవయ్య నా లచ్చిచెలువు డంత। దా వచించెను మధురామృతంబులొలుక. ౨

చ. ప్రకృతి లక్షణంబు నుడువంగలవాఁడు జగత్త్రయంబునం
దొకఁడును లేడు వత్స యటులున్న సుధర్మునివల్ల వింటి నే
నొకతరి గొంత కొంత యది యోపికమై విను మేను జెప్పెదన్
ప్రకటగతిన్ సుశాంతమతి ప్రస్ఫుటసన్నియతిన్ శుభస్థితిన్. ౩

చ. ప్ర యనఁ బ్రకృష్టవాచకము పై కృతి సృష్టిని దెల్పుఁగాన నా
క్రియఁ గన సృష్టియందునుఁ బ్రకృష్టతగాంచిన దేవి కర్థమా
ప్ర యనగ సత్వముం గృ యను పల్కు రజంబు తి నాం దమం బగున్
నయగుణధుర్య యిట్టులయిసం ద్రిగుణాత్మక శక్తియే యగున్. ౪

క. ప్ర యనంగఁ బ్రథమవాచక। మయి వర్తిలుఁ గృతి యనంగ నది సృష్టియగున్
బ్రియమగు సృష్టికి మొదలై జయమందిన దేవి ప్రకృతిశబ్దము గాంచున్. ౫

గీ. ఆత్మ రెండువిధము లయ్యె సృష్ట్యాదిని। గుడినిఁ బురుషు డింక నెడమ బ్రకృతి
యదియె బ్రహ్మరూప యదియె నిత్యయు నయ్యె। ఖ్యాతినొందు నది సనాతని యని. ౬

గీ. ఆత్మశక్తులకును నగ్నిదాహికలకుఁ బోలె భేద మెన్నబోల దెపుడు
బ్రహ్మమయము దృశ్యమానంబు సర్వంబు। భేదబుద్ధిలేని సాధులకును. ౭

క. శ్రీకృష్ణుని బుట్టింపగ। లోకజనని పటువినోదలోలుపయై తా
నేకప్రకృతియ వొడమి ని। రాకులయై యైదురూపు లందె మునీంద్రా। ౮

వ. అందు మొదటిది. ౯

సీ. అది శివప్రియయు నారాయణి హరిమాయ బ్రహ్మస్వరూపిణి బ్రహ్మవంద్య
దేవి మహేశి యధిష్ఠాత్రి సత్య పుణ్యాశ్రయ కీర్తి ధర్మానుకూల
మంగళదాయిని మాననీయ సుఖాఢ్య దుఃఖనాశిని వీతదురితచరిత
హర్షదాయిని శరణాగతపోషిణి సిద్ధేశ్వరియు సర్వసిద్ధిరూప

తే.గీ. ఆకలియు దప్పిఛాయ దయయును గాంతి।ధృతియు శాంతియు మతియునుఁ గృతియు నీతి
యీశ్వరియు నన నొప్పు గణేశమాత। మొదలుగాగల పలురూపముల వహించి. ౧౦

వ. అందు రెండవది. ౧౧

సీ. సత్వస్వరూపయు సర్వసంపద్రూప కాంతయుఁ బద్మయు దాంత శాంత
లోభ మోహ సకామ రోషవర్జితయును నఖిలమంగళయు భక్తానురక్త
భగవంతునకు నది ప్రాణతుల్యయుఁ బ్రియ సర్వసస్యాత్మిక సాధువంద్య
లోకజీవోపాయరూపిణి శ్రీలక్ష్మి ధనకనకప్రకాశిని శుభాంగి

తే. గీ. నీతిరూప ప్రభారూప నృపులయందు కలిత వాణిజ్యరూప విట్కులమునందు
మరియు వేదోక్తసర్వసమ్మతయుసుమ్ము పరమకల్యాణి పంకేజభవన లక్ష్మి. ౧౨

వ. అందు మూడవది. ౧౩

సీ. వాగ్దేవియును సరస్వతియును బుద్ధియు విద్యయు గవితయు మేధ ప్రతిభ
విమలయు సిద్ధాంత భేదార్థకలనయు వ్యాఖ్యయు బోధరూపయును గ్రంథ
కారిణి సర్వనేత్రి కల్యాణి కాళరూపిణి వీణ పుస్తక ప్రియయు వాణి
శారద నీరద పారదశుచిగాత్రి శ్రుత్యుక్త జగదంబ మత్యుదార

తే. గీ. సిద్ధియును శుద్ధయునుఁ గృష్ణసేవినియును మౌనిజనఫలదాత్రియు మంజుగీత
సర్వసందేహభంజని సకలమాత భవ్యగుణవతి భారతి పరమశక్తి. ౧౪

వ. అందు నాల్గవది. ౧౫

సీ. వేదవేదాంగశాస్త్రాదిమాతయును సంధ్యామంత్రరాజికిఁ దల్లి దేవి
చిత్ర సావిత్రి పవిత్ర జగద్ధిత శుద్ధస్ఫటికరూప శుభగుణాఢ్య

అమితతేజస్విని యానందరూపిణి యాత్మశుద్ధిప్రద యాదిమూ ర్తి
చారుచరిత సర్వసంస్కారరూపిణి బ్రహ్మతేజోమయి పద్మనేత్ర
తే.గీ. మహితనిర్వాణపదదాత్రి విహితసిద్ధి నిత్యనిరుపమ యోగిహృన్నిలయ దివ్య
భూషణార్థసుధామయి భూరివిభవ బ్రాహ్మణప్రియ గాయత్రి పరమశ క్తి. ౧౬

వ. ఇఁక నై దవది వినుము. ౧౭

సీ. లసితపంచప్రాణ రక్షిణి పరదేవి సారభూత విశాల చారునయన
రాసమండలభూత గోసమాజాలయ రాసకేళీవినోదాసమాన
గోపిక గోవిందరూపసంతోషిత హర్షరూపిణియు విరాకృతియును
నిర్లిప్త నిర్గుణ నిఖిలస్వరూపిణి నిర్మల నిత్య నిర్నిద్రచరిత
తే. గీ, వహ్నిశుద్ధాంబరయు శుభావాలమూ ర్తి। పూరితాభంగశృంగారపూర కృష్ణ
వత్సవాసిని వరద నిర్వ్యాజకరుణ రాధ లోకై కసుందరి రమ్యశ క్తి. ౧౮

వ. సకల బ్రహ్మాండమండలంబులందును దేవ్యంశరూపధారిణులై సర్వయోషిత్తులు రాజిల్లుచుందురు. పరిపూర్ణతమలు. పంచవిద్యాదేవత లనంబడుదురు. కళా కాష్ఠాది కాలంబులు దేవీరూపంబులు. మరియు ప్రధానాంశరూపంబులు సెప్పెద, వినుము. ౧౯

సీ శ క్తిప్రధానాంశజాత భాగీరథీ పాపనాశిని సుఖస్పర్శరూప
నిర్వాణదాయిని నిఖిలలోకాధార చంద్రస్వరూపిణి సాధ్వి సత్య
స్రోతస్వినీపర శుభదాత్రి లోకై కపాలిని నిర్మల పద్మరూప
భూతనాయకమౌళిభూషిణి నతలోకపాలిని స్వర్గసోపానరూప
తే. గీ. మరియును బ్రధానకళను జన్మంబునందినట్టి దా తులసిదేవి యాదివిష్ణు
కామినియు భూషణంబును క్రమరూప కలుషనాశిని సత్యసంకల్ప శీల. ౨౦

క. తులసి యఘపం క్తి నడచున్ దులసియ సకలేష్టదాత్రి తులసి శుభశ్రీ
కలిత లలితాంగి పావని తులసిని మీరంగ ము క్తిత్రోవ గలుగునే. ౨౧

క. తులసియ పరశ క్తిసుమీ తులసియె హిమవత్కుమారి తులసియె జలరు
ణ్నిలయ మరి తులసియ వాగ్లలనామణి దానికంటె గలదే యిలలోన్. ౨౨

క. తులసికి మ్రొక్కినవారికి వెలలేని శుభంబు గలుగు వితతార్థంబుల్
గలుగును యశమబ్బును శ్రీ తులసీవందనము భ క్తితోఁ జేయదగున్. ౨౩

గీ. దేవికి ప్రధానకళయయి తివురుచున్న తులసి నెవ్వాడు గొలువక తొలగియుండు
వాఁడు నీచాతినీచుండు వసుధ తులసి నలతిగా నెన్నరాదు మహాత్మ లెందు. ౨౪

చ. అలఘు శుభప్రదంబు సకలాఘవినాశము పుణ్యమూలమున్
గలుషకథావివర్జితము గంధసమేతదళాంకురచ్ఛటా

విలసిత నీరపాయి జనవేద్య సుఖప్రకటంబునైన య
త్తులసియె లోకపావనము తోయజగర్భకుమార నారదా। ౨౫

గీ. తులసిచెట్టుబుట్టు దొడ్డియే స్వర్గంబు తులసిచెట్టు వేల్పుతోటచెట్టు
తులసిమీద జల్లు జలము గాంగజలంబు తులసిగొల్చు నరుని గొలుచు నజుడు. ౨౬

క. మరియొక్క ప్రధానాంశం బరయగఁ గశ్యపునికూతురగు మనసయె శం
కరశిష్య జ్ఞానశాలిని యురగార్చిత శేషభగిని యొప్పు మునీంద్రా। ౨౭

క. నాగాంబ నాగపూజిత నాగేశ్వరి నాగకన్య నాగానందా
భోగాత్మక నాగశయిని యోగిని విద్యాస్వరూప యోగాశ్రయయున్. ౨౮

చ. మరువక మూడులక్షల సమంబులు దా దపమాచరించి యా
హరికరుణారసంబు చెలువందఁ దపస్వినులెల్ల గొల్వగా
నురుతరమైన తేజమున నొప్పి మునీంద్రుని భార్యయై మహా
దరమున నాస్తికాఖ్యునకుఁ దల్లియునైన వరాంగి యల్పయే. ౨౯

క. ఇంకొక్క ప్రధానాంశాలంకారము దేవసేన లలనామణి ని
శ్శంకాత్మతత్త్వవేదిని సంకట నిర్భేదనైకచతుర గలదుసూ. ౩౦

గీ. శక్తిషష్ఠాంశమైనట్టి షష్ఠి గలదు వృద్ధరూపయు యోగిని విపులవిద్య
శిశుగణావని సూతికాసేవ్య దివ్య సర్వదేశప్రచారిణి శాశ్వతయును. ౩౧

గీ. ప్రకృతి ముఖమున బుట్టిన భవ్యశక్తి సర్వమంగళ మంగళ చండి చండ
కోపరూపిణి నిరుపమ గుణగణాఢ్య సర్వవాంఛాప్రదాత్రి సుపర్వవినుత. ౩౨

క. రక్షించ దలచెనేనియు రక్షించును తత్క్షణమున బ్రముదితలీలన్
శిక్షించ దలచెనేనియు శిక్షించును జండి జగము జెనకి చిటికెలోన్. ౩౩

క. ప్రకృతి ప్రధానాంశంబున బ్రకటితయగు కాళి కమలపత్రాక్షి మహా
న్నికరపరిసేవ్య శశధరశకలాభరణ యగునట్టి శక్తి మునీశా। ౩౪

గీ. దేవి యర్ధాంశమున క్రూర దితిజనేతలైన శుంభ నిశుంభుల యాహవమున
కోటిసూర్యులతోడసు దీటువచ్చు తేజమలరంగ బుట్టిన ధీర దుర్గ. ౩౫

గీ. తనర భూదేవి దేవిప్రధానకళను నవతరించినదై యఖిలాశ్రయయయి
రత్నగర్భయు రత్నాకరయును రత్నభూషిణియు నయి వసుధయై పొలుపుగాంచు. ౩౬

వ. మరియు శ్రీదేవీస్వరూపంబగు ప్రకృతికంశంబులైన యంగనారత్నంబులం దెవ్వ
రెవ్వరిభార్యలై యెట్లు కీర్తివహించి రయ్యది విపరింతు నని నారాయణుండు. ౩౭

గీ. దక్షిణాదేవి యజ్ఞేశు ధర్మపత్ని దీక్ష సర్వత్రపూజిత దీని గొలువ
కాచరించిన కర్మముల్ వ్యర్థములగు విశ్వవందిత యసదృశ విమలకీర్తి. ౩౮

గీ. వరలు పితృదేవతలపత్ని స్వధ యనంగ మునులు పూజింతు రద్దేవి ననఘచరిత
దాని విడనాడి పితృపూజ తలపరాదు నిష్ఫలంబగు మునినాథ నిభృతిబోధ. ౩౯

గీ. వాయుదేవునిపత్నియౌ స్వస్తిదేవి విశ్వములయందు నెల్లెడ వినుతిగాంచు
దాని విడనాడి చేసిన దానమొండె పరగ నాదానమొండె నిష్ఫలముసుమ్ము. ౪౦

గీ. పొసంగ గణనాయకునిదేవి పుష్టి యద్ది జగమునందెల్ల పూజలఁ జాలఁ గాంచు
నామెఁ బూజింపకుండినయట్టివారు పురుషులును స్త్రీలు తనుకార్శ్యమును వహింత్రు. ౪౧

గీ. అయ్యనంతునిగృహిణియై యలరు తుష్టి దాని పూజింపకున్న సంతసము లేదు
మరియు నీశానపత్ని సంపత్తి యంద్రు పొసగ దారిద్ర్యములు దీర్చి ప్రోచుచుండు. ౪౨

గీ. కపిలునంగన ధృతి ధైర్యకారిణీ యది సత్యునిల్లాలు సతి ముక్తిజాడ జూపు
మోహుపత్ని దయాసాధ్వి ముక్తినిచ్చు పుణ్యుపత్ని ప్రతిష్ఠ దా పుణ్యమిచ్చు. ౪౩

గీ. సుకృతియిల్లాలు కీర్తి దా సుయశ మిచ్చు వెలయ నుద్యోగు సత్క్రియావిధులనిచ్చు
న య్యధర్మునిపత్ని మిథ్యావరాంగి సర్వధూర్తులచేతఁ బూజలను వడయు. ౪౪

గీ. కృతయుగంబున మిథ్య యొక్కింతలేదు పరగఁ ద్రేతను సూక్ష్మరూపంబునొందు
ద్వాపరంబున నర్ధాంగధారిణి యగు కలియుగంబున నొప్పుఁ బ్రగల్భయగుచు. ౪౫

గీ. దాని సైదోడు కపటుండు దానివెంటఁ దిరుగు నిల్లిల్లు కలియుగ స్థితి దలంచి
కపటుఁడును మిథ్యయు నధర్మ కట్టడులటు మీర రెన్నండు చెట్టల మేటులగుచు, ౪౬

గీ. శాంతియును లజ్జయును శీలు చానలెన్న వీరు లేనిది జగమెల్ల వెర్రిబొడము
జ్ఞానుభార్యలు ముప్వురు సతులు బుద్ధి ధృతియు మేధయు మౌఢ్యంబుదీర్తు రెలమి. ౪౭

గీ. ధర్మపత్ని కాంతి దానిచే లోకంబు తనరు వెలుగుఁ గాంతితప్పెనేని
మూర్తి లేక దేవముఖ్యులే చెడుదురు కాన కలదె శక్తి కాంతికన్న. ౪౮

గీ. రుద్రపత్ని నిద్ర రూఢిగా సదికాదె రంజిలంగజేయు రాత్రులందు
కాలమునకు ముగురు కలరు పత్నులు వారు సంధ్య రాత్రి దినము సంయమీంద్ర! ౪౯

గీ. భార్యలైరి క్షుత్పిపాసలు లోభున కతివలెల్ల జగము నాక్రమించి
రెందుఁ జూడ నుందు నెల్లర నిరతంబు చింత ముంచుచుంద్రు సిద్ధవర్య! ౫౦

గీ. ప్రభయు దాహికయును భార్య ల య్యగ్నికి వారులేని సృష్టి వలనుపడదు
పరగ మృత్యు జరలు ప్రజ్వాలు భార్యలు కాలునకును వారు కన్యలైరి. ౫౧

గీ. తంద్రయునుఁ బ్రీతియును నిద్ర తనయలెన్న సుఖునిభార్యలు జగమున జుట్టుకొనిరి
శ్రద్ధయును భక్తి వైరాగ్య చానలెన్న నమలత ముముక్షుజనసేవ్యలైరి వారు. ౫౨

గీ. అదితి సురమాత సురభియు నాలతల్లి భోగవతియైన కద్రువ నాగమాత
దితి దనుజమాత కశ్యపు సతులు వీరు సృష్టి కుపయుక్తలైరి నిర్దుష్టలీల. ౫౩

గీ. వినుము కశ్యపునిల్లాలువినత దాని। కొడుకై గరుడుండు సుధను దాగొంచువచ్చె
నమరపురినుండి తల్లి దాస్యంబు దీర్చ।నాపెయును సృష్టి కుపయుక్తయయ్యె జుమ్ము. ౫౪

మ. వినుమా రోహిణి చంద్రపత్ని, రవి దేవీరత్న మా సంజ్ఞయుఁ
మనునా లా శతరూప, యైంద్రియు బులోమ ప్రోద్ధదేవార్యు సం
గనయౌ తార, యరుంధతీరమణి విశ్వస్తుత్యుడౌ స వ్వసి
ష్ఠుని పెండ్లాము, నహల్య గౌతముని మించుంబోణి వీ రందరున్. ౫౫

చ. ఘనమతి దేవహూతి యల కర్దముకూతురు దక్షుభార్య యిం
కను బితృకన్య మానసియు గామిని మేనక మంచుగొండమే
లను ననసూయ యత్రిముని లాలిత కుంతి కుబేరుపత్ని జీ
వనపతి ధర్మపత్నియు సుభద్రయు బూజ్యలుకారె ధాత్రిలోఁ. ౫౬

శా. భీమోద్దామబలీంద్రభార్యయగు న వ్వింధ్యావళీ దేవి లో
పాముద్రాఖ్య యగస్త్యభార్యయును శైబ్యా దేవకీదేవులుఁ
వామాక్షుల్ దమయంతియున్ మరియు గాంధారీ యశోదాదులుఁ
శ్రీమీరం ద్రుపదాత్మజామణియు నా రీరత్న మా రాధయుఁ. ౫౭

గీ. దాన మందోదరియును గౌసల్య సత్య।వతియు సాత్రాజితియును రేవతియు జాంబ
వతియు గాళిందియును నాగ్న జితియు భైష్మి।క్షితిని వీరలు మిక్కిలి కీర్తి గనిరి. ౫౮

గీ. మిత్రవిందయు లక్షణా మీననేత్ర। సీతయును లక్ష్మియును గాళి చిత్రరేఖ
యుషయు యోజనగంధియు నొగి ప్రభావ।తియును భానుమతియు మహా దీప్తిగనిరి. ౫౯

సీ. బలుతల్లి రోహిణి పరశురామునితల్లి రేణుక మరియు శ్రీ కృష్ణభగిని
యేకనందాదేవి యిట్టివారలు సతుల్ పలువురు జగమున బ్రకృతికళలు
గ్రామదేవత లెల్ల బ్రకృతియంశంబులు కాని మఱొక్కటి గాదుసుమ్ము
ఇన్ని జెప్పగనేల యెల్లయోషితులు ప్రకృతికలాలవ ప్రాప్తిగందు
రాడువారలను వస్త్రాలంకృతులచేత బూజించవలయును బుత్రవతుల

తే.గీ. నెక్కుడుగ జూడవలయు నెందేని కడము।వడయకుండగ నట్టైన బ్రకృతిమెచ్చు
దేవి మెచ్చిన ముమ్మాడు దీవులందు నందరానట్టి దున్నదే యనఘ చరిత. ౬౦

గీ. ప్రకృతిసంభూతలైనట్టి భామలందు నుత్తములు మధ్యములు మరియును నధమలు
గలరు సాత్వికలై రాజసులరు నగుచు।తామసులు నయి జగమున దాపసేంద్ర. ౬౧

గీ. చెలగుదురు సత్వభవలు సుశీల లగుచు। బొరి రజోభవ బెంపొందు భోగ్య యగుచు
స్వప్రయోజనపరయయి పరల దమను। నందు బుట్టినయది యల్ప మంద కులట. ౬౨

వ. మరియు దుర్గాదేవి సురథునిచేఁ బ్రథమంబున బూజింపంబడి రావణవధార్థియగు రామునిచే బిమ్మట నర్చింపంబడియె. మరియు దక్షునకుం గన్యయై మహాదేవి దైత్య దానవుల నిర్జించి శివనింద వినజాలక దేహంబు విడిచి హిమవంతునకుం గూతురై పుట్టి కృష్ణ స్వరూపుడగు వినాయకుని, విష్ణుకలాసంభూతుండగు స్కందునింగని విలసిల్లె. నింతియ కాక లక్ష్మీస్వరూపిణియై మంగళభూపాలుచేఁ బూజింపంబడి వెండియు సర్వదేవతాముని పుంగవులచే నర్చింపంబడియె. నిదియిట్టుండ నాదియందు సరస్వతి బ్రహ్మచేఁ బూజింపం బడియనంతరంబు సమస్త దేవతానికరంబులచే గొలువంబడె. మరియు బ్రథమంబున రాధా దేవిగా లోకంబున రాసమండలంబునం బూజింపంబడి వెండియు నారాయణునాజ్ఞచే బ్రహ్మదులచే ధూపదీపనైవేద్యాది సమస్తోపచారంబులతోడ నర్చ లందె. నింక సద్దేవి సుయజ్ఞుచే బూజింపంబడి శంకరోపదేశంబున భారతపుణ్యక్షేత్రంబున నర్చలం గాంచి క్రమక్రమంబున మూడులోకంబులవారిచే గొలువంబడె. కావున దేవీకలారూపంబుల మహిమంబు కొంతవట్టు నుడివితి నికను బంచప్రకృతుల యుత్పత్తిక్రమంబు వినుమనిన నారదుండు. ౬౩

గీ. ప్రకృతి కెట్లుకలిగె బంచవిధంబులు ప్రథమసృష్టియందు బరగె నెట్లు
వినవలంతు దేవ విస్తరించి వచింపు। మనుడు బంకజహదళాక్షు డెలమి. ౬౪

గీ. ఆత్మ గగనంబు కాలంబు నఖిలదిశల। ప్రకృతియును గోలోకంబు ప్రకటమైన
దేకదేశంబయి చాల నెసన్నొప్పు। నట్టి వైకుంఠ మివ్వి నిత్యంబులండ్రు. ౬౫

గీ. అగ్నికిని దాహికాశక్తి కట్లు చంద్రు। నకును వెన్నెల కెండకు నలినహితున
కట్లు బ్రకృతికి నాత్మకు నంద్రభేద। వృత్తి గుణగుణులకుఁబోలె వృద్ధమునులు. ౬౬

గీ. పొత్తుగా దవినాభావ భూతిగాన। నొక్కచేకాని రెండుగా దొక్కటైన
నిత్యమే యెల్లవిశ్వంబు నిక్కమిద్ది నామరూపా ద్యుపాధుల భ్రామకున్న. ౬౭

గీ. ఆత్మ తనదైన ప్రకృతితో నలమికొనక। యెన్నడును నుండ దటులైన ని జగంబు
లెందుచే గల్పితములగు నిల గులాలు। డెట్లు వానెడి గుండల మృత్తులేక. ౬౮

గీ. మృత్కులాలభేద మిందులేకున్నను। పోల్కి నెప్పునపుడు బుచ్చుకొండ్రు
శక్తిలేని వస్తు చయములేనప్పుడు వాని। వేఱుసేయ వలనుపడెనె. ౬౯

క. ఎండ భువి నంటునట్టుల। యుండియు మలినంబుగాదు వ్యోమంబున మా
ర్తాండు డలరి భువి నంటం డెందే మార్తాండుడయ్యు నిల మౌనివరా. ౭౦

సీ. విభవంబనగ శక్తి విక్రమంబన శక్తి బుద్ధియు శక్తి సమృద్ధి శక్తి
భాగ్యంబనగ శక్తి బలమనగా శక్తి శక్తిగల్గిన యాత్మ సర్వశక్తి
సాకారుడగుచు నిరాకారుడగుచు సగుణుడయ్యు దానె నిర్గుణతగాంచు
భగమనగా శక్తి భగవతియద్దియే భగవంతుడయ్యెను భగముకల్మి

గీ. మది నిరాకారు ధ్యానింత్రు మౌనివరులు। వానిఁ బరమాత్ముఁ డని పరబ్రహ్మ యనియు
తెలియ సర్వజ్ఞు డనియు సదృశ్యు డనియుః సర్వకారణు డనియును శాంతు డనియు. ౨౧

సీ. తాఁ గానగారాక తా నన్నిటినిఁ జూచు సర్వజ్ఞు సర్వేశు సర్వమూల
తేజంబులోనుండి తేజంబు తానైన సుందరరూపు గిశోరవయసు
శాంతుండు దానయ్యు శాంతమంతులఁ బ్రోచు నవనీరదశ్యాము నళిననేత్రు
తాను వేఱై యుండి తగిలి భక్తులఁ బ్రోచు విమలహంస మయూర పింఛచూడు

గీ. మాలతీమాల్యమండితు మహితనాసు। సుస్మితునిఁ గాంచనాంబరు సుభుజు వేణు
హస్తు మాణిక్యభూషణు నఖిలవహుని సర్వమంగళు సిద్ధేశు సర్వసాక్షు. ౨౨

వ. విష్ణుభక్తిపరాయణులగు మహాపురుషులు ధ్యానించుచుండుదురు. మరియు. ౨౩

గీ. బ్రహ్మ బ్రతుకెల్ల నిమిషమెవ్వాని కట్టి జన్మ మృత్యు జరా భయ భ్రాంతి హీను
డెవ్వఁ డాత్మ పరబ్రహ్మ కృష్ణనాముఁ డట్టి దైవంబు వైష్ణవు లాశ్రయింత్రు. ౨౪

మ. జగముల్ సేయఁదలంచి యేపరుఁడు చిచ్ఛక్తిస్వరూపంబుతో
భగవన్నామముతో మహామహిమతోఁ బ్రకాశింతకాలాత్ముఁడై
యొగిఁ దా నొక్కఁడ వామభాగమున స్త్రీయుం దక్షిణాంగంబునన్
మగవాఁడై తన శక్తిఁ జూపె నతనిన్ ధ్యానింత్రు స్వేచ్ఛామయున్. ౨౫

వ. మరియు నాశక్తి ౨౬

మ. కమనీయాకృతి కామమూల జగదేకభ్రాంతి సంధాత్రి చం
ద్రముఖీరత్నము పంకజాక్షి కదళీస్తంభోరు శృంగారవి
భ్రమవిన్యాస విశేషభావయుత యుద్యచ్ఛ్రీఫలోరోజ సం
కుముదామోద శుకాభిరామ మృదువాక్సద్ధాస్యసుస్మి మునీ. ౨౭

క. శ్రీకృష్ణుని ముఖమనియెడి। లోకానందకర చంద్రులో నమృతంబున్
గైకొను చకోరములుగా। నా కాముని తనదు కన్నులలరించె మునీ. ౨౮

సీ. నొసటఁ గస్తురిచుక్క పొసఁగించి యాక్రింద సిందూరచందన బిందువు లిడి
యొప్పైన కొప్పున గుప్పె రత్నపుబిళ్ళ దానిపై విరిజాజి దండఁ జుట్టి
గళసీమ వన్నెబంగరుతీగె సంగడి నింద్రనీలపు పేరు లెసఁగఁ జేసి
స్తనభారమునకు నితంబముల్ తోడుగా నడకల మందమందతనుఁ బూని

గీ. చెలఁగి విహరించు నమ్ముద్దు చెలియఁ జూచి। వలచి వగలానితనమున గలసిమెలసి
రాసమండలమున మహారసికుఁడైన కృష్ణదేవుండు తడవుగాఁ గ్రీడ జేసె. ౨౯

క. నానాశృంగారములకు। దానకమై నృహరి సుఖము దనరఁగ బ్రీతిం
బూని యొక బ్రహ్మదిన మి। చ్ఛానిరతిన్ దేవితోడ సంభోగించెన్. ౩౦

గీ. క్రీడఁ జేసిచేసి కృష్ణుండు శ్రాంతుఁడై।చాన యోనియందు జగముతండ్రి
వీర్య మునిచె నంత విమలాంగి శ్రమజలం।బలమె విశ్వమెల్ల ననఘచరిత. ౮౧

గీ. దాని నిశ్వాసవాయువు దగిలి జగముఁ।బ్రాకి జీవుల కాధార మై కరమ్ము
మూర్తి మత్తయి గాలికి ముగిదయగుచు। వామభాగంబునందుండి ప్రేమఁదనరె. ౮౨

వ. మరియు నది ప్రాణాపాన వ్యానోదాన సమానంబులను నైదుగురు పుత్రులం గాంచె. వారల కదసి ప్రాణంబు లైదు పుట్టె. ఘర్మతోయంబుల వరుణుండును, వరుణానియుం బుట్టిరి. మరియు నా కృష్ణచిచ్ఛక్తి కృష్ణ గర్భంబు ధరించి శతమన్వంతరంబులు బ్రహ్మతేజస్సుచే ప్రకాశించుచుండ. ౮౩

క. కృష్ణునకు బ్రాణవల్లభ।కృష్ణున కసుతతికంటెఁ బ్రియతర మరియుం
కృష్ణుని గూడిన ముద్దియ।కృష్ణోరస్స్థితయు నైన గిరికుచ కంతన్. ౮౪

క. పదియార్వవన్నె మేలిమి। నదలించెడి మేనితోడ నలరుచు విశ్వా
స్పదుఁడౌ బాలునిఁ గని తా। మది జీదరబుట్టి కినుక మల్లడికొనఁగన్. ౮౫

గీ. కూనకొండిక బ్రహ్మండ గోళమందు।విడిచినం జూచి కృష్ణుండు వెఱఁగునొంది
చిన్నబిడ్డని విడచిన చెనటి గొడ్డురాలవై యుండు మింకముం దని శపించె. ౮౬

క. నీకళలం బుట్టెడి యా। నాకౌకస్త్రీలు నగుదు రల్లే యన న
స్తోక మహిమ నాలో నా।స్త్రీకిం గన్నియ జనించె జిహ్వాగ్రమునన్. ౮౭

క. వీణాపుస్తకధారిణి।మాణిక్యవిభూషణాఢ్య మహనీయగుణ
శ్రేణిక గళాధిదేవత। వాణెంబగు వెల్లమడుగునం జూపట్టెన్. ౮౮

వ. అంత నయ్యంగన ద్వివిధయై వామార్ధంబునం గమలయు, దక్షిణార్ధంబున రాధికయు నయ్యె. నంత నారాయణుండు దాను ద్వివిధుండై వామార్ధంబున జతుర్భుజుండును దక్షిణార్ధంబున ద్విభుజుండును నయ్యె. నయ్యిరువుర నారాయణున కిచ్చిన నతండు వారలం దోడ్కొని వైకుంఠంబున కరిగె. నయ్యిరువురు భార్యలు ననపత్యలై యుండ నారాయణుని శరీరంబువలన చతుర్భుజులగు పార్షదులు నలువురు పుట్టిరి. తేజోవయోరూపంబుల వారలు తుల్యులై ప్రవర్తిల్లిరి. మరియుం గమలాశరీరంబున దాసీ కోటులు పుట్టిరి. వెండియుం గోలోకనాథునకు లోమరంధ్రంబులనుండి యసంఖ్యాకులగు గోపకులు పుట్టిరి. రాధాశరీర లోమకూపంబులనుండి యనంత సంఖ్యాకులగు గోపికలు జనియించిరి. వీరందరు రాధతో తుల్యంబగు రూపవయోగుణంబులుగల వారలైరి. పురుషశాపంబునంజేసి వీరలందరు ననపత్యలై యుండిరి. మరియు నంతలోన. ౮౯

సీ. అఖిలశక్తిస్వరూపాఢ్య మాయాదేవి సతి సనాతని దుర్గ సకలబీజ
తప్తకాంచనవర్ణ తపనకోటిప్రభ బుద్ధ్యధిష్ఠాత్రి సంపూర్ణసుగుణ

దరహాసశోభిత వరసహస్రభుజాఢ్య శస్త్రాస్త్రధారణి చంద్రవదన
యనలశుద్ధాంశుక హరినీల వజ్రాది మాణిక్యభూషణ మాన్యచరిత

తే.గీ. ముక్తిగోరినవారికి ముక్తిదాత్రి । వైష్ణవులకును వైష్ణవి వరద లక్ష్మి
నిశ్చయించెడివారికి నెల్ల లక్ష్మియై తనరు కృష్ణదేవత యవతరించె. ౯౦

ఉ. ఏది గృహస్థులందును మహేందిరయో మునులం దపస్యయో
నేది శశాంకునందు రుచి యేది సరోజములందు శోభయో
నేది దినేశునందు ప్రభ యెయ్యది దాహికయయ్యె జిచ్చునం
దేది నృపాలురందు సిరి యీశ్వరి యద్దియసుమ్ము సంయమీ! ౯౧

గీ. అట్లు పుట్టిన వైష్ణవి యాదిదేవు । నెసఁగ స్తుతియించి మ్రొక్కి తా నెదుట నిలువ
రాధికేశ్వరు డామెకు రత్నసింహ । పీఠము నొసంగె మనమున బ్రీతిదనర. ౯౨

గీ. అంతలోన నాలు గాననములతోడ । ఘనకమండలవును గరమునందు
దాల్చి విష్ణునాభితామరసంబున । బురుషుఁ డొక్కరుండు బుట్టె ననఘ. ౯౩

ఉ. చందురు సోగవెన్నెలల చందమునం దనువొప్ప తెల్లచీ
రెం దగగట్టి నవ్యరుచి రెమ్మడి రత్నవిభూషణాళి నిం
పొంద ధరించి తేజమున నొప్పి సమస్తకలాసమేతయై
సుందరి బుట్టి కృష్ణునకు జోత లొనర్చి స్తుతించి నిల్చెనన్. ౯౪

వ. ఆ మిధునంబునకు నొక్క సింహాసనం బిచ్చి కృష్ణుండు వారలం గూర్చుండ నియోగించిన
నట్లచేసి హరిం బహువిధంబులం గొనియాడుచుండునంతలో నతండు మరల ద్వివిధుండై
వామార్ధంబున మహాదేవుండును, దక్షిణార్ధంబున గోపికాపతియు నయ్యె నందు. మహా
దేవుడు ౯౫

మ. స్ఫటికాంగుండు సహస్రకోటితపనాభాశోభితుం డుల్లస
జ్జటుడుం భస్మవిభూషితుండు మృదుహాసప్రస్ఫురద్వక్త్రుఁడున్
స్ఫుటభూషాపరిమండితుండు శశివిస్ఫూర్జత్కిరీటుండు ను
ద్భటుఁడుం గాలగళుండు దక్షిణకరభ్రాజన్మణీమాలుఁడున్.

గీ. ఐదు మోములదంట దిగంబరుండు।నగుచుఁ బురుషుండు వామాంగ మందు బుట్టి
మృత్యుమృత్యువు స్తుతియించి మేనువాంచి।దేవదేవున కెరఁగి విస్తీర్ణభక్తి. ౯౬

గీ. నిలచినం గని కృష్ణుండు నెమ్మి నతని।నలర మృత్యుంజయుఁడవు కమ్మనుచుఁ బల్కి
రత్నసింహాసన మొసంగి ప్రకటమైన । ప్రీతిగలరీతి చూపించె బేర్మి ననఘ. ౯౭

వ. మరియునంత ౯౮

గీ. ఒక్కబ్రహ్మకల్ప మొనర నబ్బాలుండు । వెల్లి బండియుండి పిదప లేచి
యొక్కడైన తానె చక్కఁగా రెండాయె । గృష్ణలీల కది యొ కింతవింతె. ౧౦౦

గీ. అంత గావుకావు మని రొదవెట్టుచుఁ । దల్లితండ్రి లేని పిల్లఁడొకడు
కదుపు సుత్తుతోడ జడధిలో దిక్కేది । కన్నులెత్తి మీదు గాంచుచుండె. ౧౦౧

గీ. పరమకృష్ణునకును బవియూర్ధ్వవంతైన।చిన్నికృష్ణుడితడు శ్రీవరుండు
తనదు రోమకూపతతిలోన బ్రహ్మాండ।సమితి దాచియున్న చక్కనయ్య. ౧౦౨

క. విశ్వములసంఖ్య నుడువగ।విశ్వేశుని చేతగాదు విధులు హరులు గౌ
రీశ్వరు లిందరనుచు పర।మేశ్వరుఁడెరుంగడు పెరల కెఱుకయె చెప్పుమా. ౧౦౩

క. ప్రతివిశ్వంబున బ్రహ్మయు । పతగతురంగుండు శివుఁడు వసియింతురు సు
స్థితి వారలసంఖ్యులును । మ్మతుల మహాకృష్ణలీల లవియే పొగడన్. ౧౦౪

క పాతాళము మొదలిడికొని । ధాతృజగము గలయఁగూడ ధాత్రండమగున్
నేతలు కేశాచ్యుత పురు।హూతాదులు ప్రతిజగమున నుందురుమౌనీ. ౧౦౫

మ. అవనీదేవ శరణ్య యయ్యఖిలమే దాండంబుపై రీవి నె
క్కువయై వేలఱు పేర్మిగాంచెడిని వైకుంఠంబు వైకుంఠలో
కపరేణ్యంబున నూర్ధ్వమందు దళితాఘంబైన గోలోకమిం
పవుగా యేబదికోట్ల యోజనములై యత్యంత విస్తీర్ణమై. ౧౦౬

గీ. అలరు నిత్యుండు సత్యుండునైన కృష్ణుఁ।బోలెఁ గోలోక మొప్పు సంపూర్ణమహిమ
నేడుదీవులభూములు నేడుకడలు।నేడుపర్వతములు నెన్న లేదు గల్గి. ౧౦౭

గీ. అవనిలోకంబు లోకయేడు నపల స్వర్గ।ధాత్రులోకంబులేడును దనర నిట్టు
లూర్ధ్వమునఁ గ్రింద లోకంబు లొప్పుచుండు।నేను నేడఱు గోలోక మెన్నదరమె. ౧౦౮

గీ. విశ్వములు కృత్రిమంబులు విశ్వనాశ।మందు సర్వంబు నాశంబు నందుచుండు
నీటిలో బుగ్గలివ్వి యనిత్యములుగ।దా పితామహతనుజ యుదారతేజ. ౧౦౯

క. కృత్రిమములుగాక కృష్ణునాస్థానంబు । లైనకతన నెపుడు హానిలేక
కొమపమీరియుండు గోలోక వైకుంఠ।లోకములు మునీంద్ర లోకవంద్య. ౧౧౦

క. ఒకలోమకూపమునఁ దగ । నొక బ్రహ్మాండంబు బ్రహ్మ యొక్కఁడు మలరేఁ
డొకఁడు హరియుకఁడు నుండుం । బ్రకటంబుగఁ గృష్ణునకునుఁ బరమమునీంద్రా. ౧౧౧

గీ. తన లోమకూపములలో । బొనరిన బ్రహ్మాండకోటిబూని గణింపం
గను నేరఁడు శ్రీకృష్ణుడు । మనమా లెక్కింపఁగలము మౌనివరేణ్యా? ౧౧౨

వ. ఇది యిట్లుండు మరియు. ౧౧౩

ఉ. ముప్పదికోట్ల యభ్రచర ముఖ్యులు దిక్పతులుం గ్రహంబులున్
జొప్పడు ఋక్షముల్ మరి వసుంధర వర్షచతుష్టయంబు సొం
పొప్ప చరాచరంబులు మహోదధులుం గల మేను గుల్కఁగా
గొప్ప విరాడ్విభుండయిన గోకులకృష్ణుడు గానవచ్చినన్. ౧౧౪

మ. జలదశ్యామునిఁ బీతవాసు ద్విభుజుం సస్మేర వక్త్రాంబుజున్
విలసన్మూర్తి నఘౌఘనాశు మురళీ విన్యస్తహస్తు న్మహో
జ్జ్వలతేజోనిధి భక్తపోషకుని సుస్వాంతున్ నిజోద్భూతిదున్
జలజాక్షుం గని బాలకుండు నగినన్ సర్వేశ్వరుం దర్కిలిన్. ౧౧౫

క. ననుబోలి జ్ఞానమహిమం । గనుమా యాకలియు దప్పి కనకుండుము సొం
పెనయఁగ నజాండనిలయ మే । కనరూఢిన్ నిర్భయత సుఖంబున మనుమా. ౧౧౬

వ. మరియు జరామృత్యుశోకాది వర్జితుండవై యుండుమని వరం బిచ్చి షడక్షరంబైన
మంత్రంబు నబ్బాలకు కర్ణంబున మూడుసారులు నుడివె. నది యెట్టిదనిన. ౧౧౭

గీ. ప్రణవము చతుర్థి గల కృష్ణ పదము వహ్ని । జాయనుం గూర్పనగు నట్టి సాధుపర్ణ
పంక్తి శ్రీకృష్ణమంత్రమై పరగుగాన।నది షడక్షరమై యొప్పు ననఘచరిత. ౧౧౮

వ. మరియు విరాణ్మూర్తి యగు నబ్బాలునకు విశ్వంబున విష్ణుభక్తుం డిచ్చు నైవేద్యంబుల
షోడశాంశం బాహారంబు గా జేసి మరియు నెద్దియేని వరంబు గోరెదవే యని యడిగిన
నాచిన్నిబాలుండు శ్రీకృష్ణుం జూచి యిట్లనియె. ౧౧౯

క. నీ పాదకమలముల సే।వాపాండిత్యంబె మదిని వలచెద నితర
వ్యాపారము నే నొల్లమ।హాపురుష త్వదీయ భక్తికన్నను గలవే. ౧౨౦

గీ. అధికమైననేమి యల్పమయిననేమి । యాయువేమి ఫలము నందజేయు
నీదుభక్తి గల్గెనేని జీవన్ముక్తుఁ।డగునుఁగాన భక్తి నడిగినాఁడ. ౧౨౧

గీ. కృష్ణభక్తిలేని కించిజ్ఞుబ్రతుకేల । పుట్టనేమి ధరణి గిట్టనేమి
తన్నుగన్నదేవు దానెరుంగకయున్న । దున్నకంటె వేరె తుచ్ఛుడున్నె.

గీ. ఒడలియందు జీవుఁ డొప్పి యుండిననాఁడు।శక్తిగల్గి జనుడు సంచరించు
నడలి జీవుఁడేగ శక్తులన్నియు నేగు ।విచ్చవిడిని దేహ విహృతి మాని. ౧౨౩

క. ప్రకృతికిఁ బరుఁడవు నీవై । యకలంకత వెలుఁగుచుందు వాత్మజ్యోతిన్
సకలంబున కీవే గతి । నికటస్థుఁడవైనయట్టి నిన్నుం గొలుతున్॥ ౧౨౪

వ. అని వినయభావంబుదోప నమ్రుఁడై యున్న చిన్నిబాలుం జూచి శ్రీకృష్ణుండు. ౧౨౫

ఉ. ఈవును నన్నుబోలి వహియింపుము సుస్థిరభావ మర్భకా
యావిధు లెందరేగిన ననంతవిభూతిదలర్చియుందు విం

దీ వఖిలాండకోటులకు వెన్నగ క్షుద్రవిరాట్ప్రభావశో
భావిమలుండవై మనుము భావుకమార్గ మెఱింగి నిచ్చలున్. ౧౨౬

శా. నీ నాభీకమలంబునం దజుఁడు జన్మించున్ జగత్స్రష్టయై
యా నాళీకభవుండు కాంచు ముఖమం దా రుద్రులన్ భవ్యులై
తా నేకాదశసంఖ్యావారల శివోదారాంశ సంభూతులన్
గానౌ నందు జగద్వినాశి యొకఁడ క్కాలాగ్నిరుద్రుం డనన్॥ ౧౨౭

క. వెన్నుఁడొకఁడు జగముల ప్రోవ న్నా క్షుద్రాంశమునను బ్రభవించును భ
క్త్యున్నతుఁడై నను గొలుచుచు। నన్నుం గనుగొందు వీవు నా ధ్యానమునన్. ౧౨౮

క. నావక్షస్థలి నిరతము। నావాసముగొనిన లక్ష్మి యగపడుచుండుం
గావలసినపుడు దలచిన। నావెలఁదుక నీకుఁ దల్లి యగును విరాట్టా. ౧౨౯

వ. ఇక నా లోకంబునకుం బోవుచున్నవాఁడనని చెప్పి శ్రీకృష్ణుం డంతర్ధానంబు నొందె. నంత దన నగరంబునకు జని బ్రహ్మ శంకరులం జీరి యో బ్రహ్మ నీవు జగత్స్రష్ట్యర్థంబు క్షుద్రవిరాట్టు నాభీకమలంబున స్రష్టవై పుట్టుము. వత్స శంకరా! నీవు బ్రహ్మఫాలంబునం బుట్టుమని చెప్పినం గృష్ణాజ్ఞ గైకొని బ్రహ్మయు, శంకరుండును, మహావిరాడ్లోమకూపస్థంబగు నొక బ్రహ్మాండంబున జలమధ్యంబున క్షుద్రవిరాట్టు పొడమియుండుటం జూచిత న్నాభికమలంబునం బితామహుం డుదయించి, లక్షయుగంబులు తిరిగి తిరిగి నాళీకనాళదండమూలంబు ముట్టలేక చింతిల్లి, మరల స్వస్థానంబు చేరి, మహావిరాడ్రూపుడగు శ్రీకృష్ణు పదాంబుజధ్యానంబు చేసి, క్షుద్రవిరాట్టును శ్రీకృష్ణునిం దివ్యదృష్టిం దర్శించి స్తోత్రంబుసేసి, తదనంతరంబున సృష్టి సలుపం దొడంగె. మరియు. ౧౩౦

గీ. పరున క్షుద్రవిరాట్టుని వామపార్శ్వ। మందు నుదయించె బ్రాతయౌ నచ్యుతుండు
నాల్గుభుజములవాఁడు శ్రీనాయకుండు। తెల్లదీవిని వసియించు దేవవిభుడు. ౧౩౧

క. చిన్ని విరాడ్విభు పొక్కిలి। గన్నశిశువు జేసె ముజ్జగంబుల దీసం
పన్నత నేత్రాదృశములకన్నిటికినిఁ గృష్ణదేవు నానతిసుమ్మీ. ౧౩౨

వ. నారదా! యివ్విధంబుననె క్షుద్రవిరాణ్మూర్తి ప్రతిలోమకూపంబున నుండు బ్రహ్మాండంబుల నొక్కొక బ్రహ్మాండంబున కొక్కొక బహ్మయు, విష్ణుండును, రుద్రుండును మొదలగువార లుందురని చెప్పిన విని బ్రహ్మపుత్రుండు నారాయణున కిట్లనియె. ౧౩౩

ఉ. త్రావితి నీదు వ్యాహృతి సుధారసమున్ భవదాహశాంతి స
ద్భావము నిక్కువమ్ము సముదంచితశక్తి మహత్వ మెంతయున్
నే విని సంతసించితిని నే డిక నొక్కటి నిన్ను వేడెదన్
దేవ దయారసం బెసగఁ దెల్పుము వీనులవిందుసేయుచున్. ౧౩౪

చ. ప్రకృతుల పూజనంబుల ప్రభావములున్ మరియెవ్వ రెట్టు లే
ప్రకృతి భజించి యేఫలము బట్టిరి లోకమునందు నెట్లుగా
బ్రకటితమై పొసంగె నిరపాయత నయ్యయి ధ్యానసంస్తవా
దికముల నెట్లు సల్పిరి సుధీవరసేవిత యానతీయవే. ౧౩౫

వ. అనిన విని నారాయణుండు వాత్సల్యంబుమీర నొక్కింత నవ్వి సంతోషంబ యని ప్రకృతి ప్రభావంబులు వక్కాణింపం దొరంకొని నారదా! మును వింటివిగాదె గణేశ జననియు, రాధయు, లక్ష్మియు, సరస్వతియు, సావిత్రియు నని ప్రకృతు లైదై యుండు. ౧౩౬

సీ. గణేశునితల్లి యయ్యెనుఁ గాళియు నవ్వసుంధరయు గంగాంబికయును
షష్ఠియు మంగళ చండిక తులసియు మనసయు నిద్రయు మరియు స్వధయు
స్వాహాయు దక్షిణాశక్తియు నన వారి చరితంబు దెలిపెద సంగ్రహముగ
కనకదుర్గా రాధికాచరిత్రంబులు విస్తీర్ణములు వాని వెనుక కునిచి

తే.గీ. పల్కెదను ముందుగా సరస్వతినిఁగూర్చి। కృష్ణనిర్మితమయ్యె నా గీస్సతీ స
పర్య యది లేని నాడెంత పండితునకు। నైన మూర్ఖత్వమది సిద్ధమండ్రు బుధులు. ౧౩౭

గీ. కృష్ణముఖమునందు సృష్టయై శ్రీదేవి। కృష్ణముఖము జూచి హృదయమందు
వలపు బయలుపడగ వగలు సేయగ గాంచి। దేవుఁడనియె నీతి దేటపడగ. ౧౩౮

గీ. నాల్గుబుజములాడు నారాయణుఁడు నాదు। కళనుఁ బుట్టినాఁడు కాముకుండు
మిగుల నెమ్మెకాఁడు వగకాఁడు నీ కీడు। వాఁడు నిన్నుఁగూడు వనిత పొమ్ము. ౧౩౯

గీ. రాధ నన్ను వలచి ప్రాణసమానయై। వర్తిలంగ దాని వదలు టెట్లు
ప్రాణములనుఁ బాసి బ్రతుకు నెవ్వండు దాని। దప్ప యన్య గలయ దప్పుగాదె. ౧౪౦

గీ. నాకు దనయుడైన నారాయణునితోడ। గలసిమెలసి సుఖము గాంతు నబల
త్వరితగతిని బొమ్ము వైకుంఠమునకు నీ। కతడు సాటి నీవు నతని సాటి. ౧౪౧

గీ. నిన్ను బోలియున్న నీరజేక్షణయొర్తు। కామ లోభ మోహ గతులు లేక
హరిని గొలుచుచుండు వరలక్ష్మి దానితో। గూడ నీవు వాని గొలువు మతివ. ౧౪౨

చ. ఇరువుర నొక్కకంటగను నీశ్వరు డా మురవైరి నీకు నే
వరము నొసంగెదన్ వినుము వారక మాఖమునందు శుద్ధమం
దరయగఁ బంచమిన్ నరులు నాకులు సిద్ధులు యక్షులాశరుల్
మరువక నిన్ను గొల్తురుసుమా ప్రతివిశ్వమునందు నిత్యమున్. ౧౪౩

గీ. నారి మను వసు రుద్ర గంధర్వులందు। సురగులందును నీపూజ జరుగుచుండు
భక్తి యుక్తి సదుపచార ఫక్కి నెరిగి। కల్పకల్పంబు కాలంబు కట్టకడకు. ౧౪౪

వ. అనిన విని నారదుండు స్వామీ నారాయణా యా మహాసరస్వతి సర్వలోకంబులం బూజింప
బడు నని యానతిచ్చితివి. పూజావిధాన, కవచ ధ్యానాదు లెవ్విధంబులో విననలతు.
మరియు బూజోపయోగ ద్రవ్యంబు లెట్టివియో యెరుంగ నిచ్ఛయించెదం గావున దెలు
పవే యనుడు నారాయణుండు. ౧౪౫

గీ. కణ్వశాఖోక్తమైనట్టి కరణి నా స।రస్వతీపూజకుం గల క్రమములెల్ల
సావధానుడవై యాపు నాలకింపు।మయ్య తెల్పెద నో చతురాస్యతనయ. ౧౪౬

సీ. మాఘ ప్రథమపక్ష మహితపంచమిని విద్యారంభదినమున నధిక భక్తి
పూర్వాహ్ణమున శుచిపూర్వకంబుగ స్నాతుడై నిత్యకర్మంబు లాచరించి
కలశంబు స్థాపించి కడగి స్వశాఖోక్తగతినేని తంత్రంబుగతినయేని
విఘ్నేశుఁ బూజించి వెలయ సరస్వతి నిష్టదేవిని భజియింపవలయు

తే.గీ. బాహ్యఘటమునసున్న యా పరమశక్తి। ధ్యానమొనరించి పదియునారైనయట్టి
విలసదుపచారములు సేసి వెన్న పెరుగు।క్షీరములు లడ్డుకంబులు సేర్చి మరియు. ౧౫౭

గీ. స్వచ్ఛమైన చెరుకు పాలు చక్కెర కల।కండ గుడము స్వస్తికంబు తెల్ల
వడ్ల యక్షతలును వరలంగ నట్టి బి।య్యమున సలుపు మోదకాళి గూర్చి. ౧౪౮

గీ. ఉప్పు నేతు లలర నొప్పు హవిష్యంబు। పక్వమైన యరటిపండ్లు మరియు
నాజ్యమందు గల్పిన య్యవ గోధూమ। పిష్టములను జేర్చి పెట్టవలయు. ౧౪౯

గీ. నారికేళజలము నారికేళఫలము। లార్ద్రికంబును పరమాన్న మిష్ట
మైన యన్న మమలమగు గుడాన్నంబును। రేగుబండ్లు గూర్చి ప్రీతినుంచి. ౧౫౦

గీ. అప్పు డా దేశమున జిక్కునట్టి మంచి। ఫలములును దావులెసలారు తెలివిరులును
తెల్లనగు క్రొత్తమడుగును దివ్యమైన। శంకమును మాల్యమును నమర్పంగవలయు.
నవల నిట్లని ధ్యానింపనగు మునీంద్ర। ౧౫౧

వ. ధ్యానవిధంబు జెప్పెద వినుము. ౧౫౨

సీ. వరసరస్వతి శుక్లవర్ణను సస్మిత రమణీయ కోటిచంద్రప్రభాఢ్య
శ్రీయుత శిఖి శుద్ధచేల వీణాధర రత్నాభరణ నిర్జరగణసేవ్య
మునినాథవందిత మను మానవార్చిత యజ విష్ణు శివ పూజ యంబ నిన్ను
ధ్యానించి మరియు వందనముగావించెద నాచరించెద బదియారుగతుల

తే.గీ. నలరు నుపచారములచేత నవల నార।గింపు జేయించెదను మది నింపుగులుక
మమ్ము దయజూచి సకలశుభమ్ములిచ్చి। పుణ్యమునొసంగి చదువిచ్చి బ్రోవవమ్మ. ౧౫౩

వ. ఇవ్విధంబున ధ్యానంబు సేయుచు విద్యారంభకాలంబులందును, ప్రతి మాఘశుక్లపంచమి
యందును సరస్వతీపూజనంబు చేసి, షోడశోపచారంబులు సమర్పించి, దండవత్ప్రణా

మంబు సేయవలయు. మరియు ఆ షోడశాక్షరీమంత్రంబు మూలంబుగా గైకొని జపింప వలయు. ౧౫౪

పంచచామరము. ధరన్ సరస్వతీపదంబు దా జతుర్థి గూరుచున్
బరంగ నంతమందు వహ్నిభార్యనుంచి యాది నిం
దిరన్ బొసంగజేసి వెంటనే దిటంపు మాయతో
హొరంగుమీర జేయ మంత్ర మొప్పునోయి నారదా! ౧౫౫

వ. తొల్లి యీ మంత్రంబు నేను జాహ్నవీ తీరంబున వాల్మీకున కుపదేశించితి. పుష్కరంబున సూర్యపర్వంబున భృగుండు శుక్రున కుపదేశించె. బ్రహ్మ బదరికాశ్రమంబున భృగున కిచ్చె. క్షీరసాగరతీరంబున జరత్కారుం డాస్తికునకుం జెప్పె. మేరువునందు విభాండకుండు ఋశ్యశృంగునకు వక్కాణించె. శివుండు గౌతమ, కణాదులకు నేర్పె. సూర్యుండు యాజ్ఞవల్క్యునకును, గాత్యాయనునకును దెల్పె. శేషుండు పాణినికి, భారద్వాజునకును జెప్పె. సుతలంబున బలి శకటాయనునకు నుడివె. ఇమ్మంత్రంబు చతుర్లక్షపరిమితంబు జపంబుసేయ సిద్ధివడయు. బృహస్పతి సమానుండగు బ్రహ్మ భృగునకు గంధమాదంబునం జెప్పిన సరస్వతీకవచంబు వక్కాణించెద వినుము. భృగుండు బ్రహ్మం జూచి దేవదేవా! సరస్వతీకవచంబు సెప్పవే యనుడు పితామహుండు. ౧౫౬

గీ. కల్పవృక్షంబువంటి దీ కవచ మెన్న। మున్ను లోకమున గృష్ణమూర్తి నాకు
దెలిపె దీనిన భృగునకు దెలిపె బ్రహ్మ। పండితులు దీనివలననే ప్రబలులైరి. ౧౫౭

సీ. కలిత సరస్వతీకవచంబుచేతనే వాల్మీకిముని కవివంద్యుడాయె
కలిత సరస్వతీకవచంబుచేతనే భార్గవుం డసురసంభావ్యుడాయె
కలిత సరస్వతీకవచంబుచేతనే జీవుండు బుద్ధివిస్తీర్ణుడాయె
కలిత సరస్వతీకవచంబుచేతనే స్వాయంభువుడు కీర్తిశాలియయ్యె

తే.గీ. మరియు వినుము సరస్వతీ మంత్రముననె। గౌతమ కణాద పాణిని కణ్వ శాక
టాయనాదులు గ్రాంథికులైరి వ్యాసుఁడలర వేదవిభాగంబు నాచరించె. ౧౫౮

వ. మరియు నీ కవచంబునకు బ్రజాపతి ఋషియు బృహతి ఛందంబును శారదాంబ దేవతయు సర్వతత్వపరిజ్ఞాన సర్వార్థసాధన కలితలయందు వినియోగంబును నైయుండు నని చెప్పి పిమ్మట లక్ష్మీబీజంబును, మాయాబీజంబును చతుర్థ్యంత సరస్వతియు నగ్నిదారయు గలసి నా శిరంబు రక్షించుంగాక. లక్ష్మీబీజంబును చతుర్థ్యంత వాగ్దేవతయు వహ్నిజాయం గలసి నా ఫాలంబు రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును, చతుర్థ్యంత సరస్వతియు, నగ్నిపత్నియుం గలసి నాశ్రోత్రంబులు రక్షించుంగాక. ప్రణవంబును లక్ష్మీబీజంబును మాయాబీజంబును చతుర్థ్యంత భగవతీ

పదంబును చతుర్థ్యంత సరస్వతీపదంబును వీతిహోత్రగృహిణియుం గలసి నా కనుదోయి రక్షించుంగాక. బిందుయుక్త ప్రథమ వక్రతంబును మాయాబీజంబును చతుర్థ్యంత వాగ్వాదినియు, నగ్నిజాయయుం గలసి నా నాసిక రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును చతుర్థ్యంత విద్యాధిష్ఠాతృదేవియు ననలునారియు గలసి నా యోష్ఠంబు రక్షించుంగాక. ప్రణవంబును లక్ష్మీబీజంబును మాయాబీజంబును చతుర్థ్యంత బ్రాహ్మీపదంబునుం దహనునబలయుం గూడి నా దంతపంక్తి రక్షించుంగాక. ప్రథమ వక్రతమంబు బిందుపూర్వకంబై నా కంఠంబు రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును చతుర్థ్యంత విద్యాస్వరూపాపదంబును వైశ్వానరసతిం గలసి నా నాభి రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును బిందుసహిత కలెకాకరంబుల యక్షరంబును చతుర్థ్యంత వాణీపదంబును ధనంజయవనితం గలసి నా హస్తంబులు రక్షించుంగాక. ప్రణవంబును చతుర్థ్యంత సర్వవర్ణాత్మికా పదంబును శిఖిచంద్రముఖిం గలసి నా పాదంబుల రక్షించుంగాక. ప్రణవంబును చతుర్థ్యంత వాగధిష్ఠాతృదేవతా పదంబును జ్వలనులలనం గూడి సర్వంబును రక్షించుంగాక. ప్రణవంబును చతుర్థ్యంత సర్వకంఠవాసినీపదంబును పావకునిపూవుంబోడిం గూడి తూర్పుదెసను రక్షించుంగాక. ప్రణవంబును జతుర్థ్యంత సర్వజిహ్వాగ్రవాసినీ పదంబును జాతవేదునిభామినిం గలసి యాగ్నేయంబున రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును లక్ష్మీబీజంబును బిందుయుక్త కలెకాకరంబును జతుర్థ్యంత సరస్వతీపదంబును బురజననీపదంబును గృపీటయోనిభామంగూడి దక్షిణంబున రక్షించుంగాక. బిందుయుతప్రథమవక్రతంబును మాయాబీజంబును లక్ష్మీబీజంబును నైఋతిని రక్షించుగాక. ప్రణవంబును బిందుయుత ప్రథమవక్రతంబును చతుర్థ్యంత జిహ్వాగ్రవాసినీపదంబును హవ్యవాహునిలేమంగూడి వారుణంబునరక్షించుంగాక. ప్రణవంబును జతుర్థ్యంత సర్వాంబికాపదంబును గీలిముద్దురాలింగూడి వాయవ్యంబున రక్షించుగాక. ప్రణవంబును బిందుయుత ప్రథమవక్రతమంబును లక్ష్మీబీజంబును బిందుయుత కలెకాకరంబును జతుర్థ్యంత గర్ణవాసినీపదంబును హవిర్భుజుకాంతం గూడి యుత్తరంబున రక్షించుంగాక. బిందుయుత వక్త్రితమంబును జతుర్థ్యంత సర్వశాస్త్రవాసినీపదంబును వైశ్వానరునింతిం గూడి యీశాన్యంబున రక్షించుంగాక. ప్రణవంబును మాయాబీజంబును చతుర్థ్యంతసర్వపూజితాపదంబును సప్తజిహ్వునిపొలతియుం గూడి యూర్ధ్వంబును రక్షించుగాక. మాయాబీజంబును జతుర్థ్యంత పుస్తకవాసినీ పదంబును నా హవిర్భుక్ప్రియయుం గూడి యధస్సున రక్షించుంగాక. ప్రణవంబును జతుర్థ్యంత గ్రంథబీజస్వరూపాపదంబును నిప్పునొప్పులకుప్పం గూడి సర్వత్ర నన్ను రక్షించుంగాక। యని యిట్లు వక్కాణింప నిది సరస్వతీకవచంబు నాంబడు. దీనివలనం

దై త్రిలోక్య విజయమును బంచలక్షజపంబున బృహస్పతితుల్యుండగు బండితుండగు, గవియగు నని చెప్పి మరియు నారాయణుండు. ౧౫౯

పంచచామరము. సరోజభూకుమారి సర్వసంపదాప్తి హేతువౌ
సరస్వతీ స్తవంబు తొల్లి సారసాప్తువల్లనే
వరప్రబోధమంది యాజ్ఞవల్క్యమౌని నేర్చె జె
చ్చెరన్ వచింతు దాని భక్తిచేత నాలకింపుమీ. ౧౬౦

ఉ. తేజము బోయె నో గుణవతీ గురుశాపము కల్మి నీ పదాం
భోజము లాశ్రయింతు నను బ్రోవుము మౌర్ఖ్యమువాపి తొంటియ
ట్లోజ సమస్తవిద్యలు మహోన్నతితో దయసేయుమమ్మ నీ
పూజ లొనర్తునమ్మ వినవో మొఱవెట్టెద నో సరస్వతీ। ౧౬౧

శా. ఇమ్మా జ్ఞానము సత్సభాంతరములం దిద్ధక్రియాకౌశలం
బిమ్మా కావ్యకలాపటుత్వము సుధీహృత్కర్షకప్రాభవం
బిమ్మా సూక్ష్మమనీషనిస్తుల రసాహీనోక్తి నీవేకదా
మమ్మానందపయోధి దేల్చెదు శ్రుతివ్యాహారచింతారతిన్. ౧౬౨

క. నిను దలచక నోరెత్తిన। జనునకు నగుబాటుగాదె చక్కనితల్లీ
కొనియాడెద నా నాలుక।కొనపై వసియింపు మజునికొమ్మా కరుణన్. ౧౬౩

చ. తొలిజన్మంబున భక్తిమై నిరతమున్ దోరంపు నీ నోముగా
జలుపంగాదె జనుండు ధీరుడయి యాశాపూరితఖ్యాతిచే
విలసత్పాండితి జూపు గావున ననున్ వేవేగ మన్నించి ని
స్తుల విద్యాపటు జేసి ప్రోవగదె సంతోషప్రదా శారదా। ౧౬౪

శా. ఆ వాల్మీకి రచించె రామకథ పద్మాప్తుండు సిద్ధాంతకుల్
ధీవైశద్యము పూనె వ్యాసముని దా దెల్పెం బురాణంబులం
ఠీవిం జొప్పడ బ్రహ్మసూత్రముల దుష్టిన్ బ్రహ్మ వేదంబులన్
గావించెన్ భవదీయపాదభజనాక్రాంతింగదా శారదా। ౧౬౫

మ. ఘనుడై నట్టిసనత్కుమారుడు కరుద్దర్పున్ దగంజూచి ధీ
ధనమున్ వేడిన మూకుడై యజుడు సిద్ధాంతంబుసేయంగజా
లనటంచుండగ గృష్ణుడేగి నిను సుల్లాసంబునన్ గొల్వుమం
చును దెల్పన్ విని యాత డట్లు సలుపన్ బోషింపవే శారదా। ౧౬౬

మ. క్షమ దానొక్కపు డయ్యనంతు బరమజ్ఞానంబు దా వేడఁగా
భ్రమ నాతం డొగి మూకుడై వెలవెలం బారంగ నక్కాశ్యపుం

దమలాత్ముండు నినుం దలంపు మనగా నాలించి తా నట్లుసే
య మహాప్రజ్ఞ లభించి ధారుణికి విద్యం దెల్పదే శారదా. ౧౬౭

ఉ. ప్రాకటసూత్రకారుడయి వ్యాసుడు వర్తిలె నిన్నుగొల్చి వా
ల్మీకి మహాకవిత్వనిధి మేధ వహించెను నిన్ను గొల్చి కా
దే కరుణామయీ శివుని దేవవిభుండును బ్రజ్ఞ వేడినన్
మూకతనుండి నీ వలన బొందుఁ దుదిన్ బరవిద్య శారదా. ౧౬౮

శా. నిన్నున్ స్తోత్రముచేయ బ్రహ్మయు భవానీభర్తయున్ లచ్చి రే
డు న్నాగేంద్రుఁడు నింద్రుడుం బవలురేడుం దక్కువేల్పుల్ భ్రమా
చ్ఛన్నుల్ మూఢులుగాక మాదృశులకున్ శక్యంబె మా తల్లి నీ
విన్నాణంబగు సత్కృపన్ వినుము నా విజ్ఞాపనల్ శారదా. ౧౬౯

వ. అని యిట్లు యాజ్ఞవల్క్యుండు స్తోత్రంబుచేసిన సరస్వతి దయార్ద్రహృదయయై దర్శనం
బిచ్చి యంతర్ధానంబు నొందె ననిచెప్పి మరియు నారాయణుండు. ౧౭౦

గీ. ఆ సరస్వతి వైకుంఠమందు తాను। గంగతోడను బోరాడి కడగి శాప
మంది భారతవర్షంబునందు స్వాంశ। మున నదీరూపయై పాఱు మునివరేణ్య. ౧౭౧

క. నదియైన సరస్వతికళ, యది పుణ్యద కలుషరహిత స్వాంబువులందుం
దుదిగన్న నరుల శ్రీహరి।పదమునకుం జేర్చు పరమపావన మౌనీ. ౧౭౨

గీ. మహితమైన సరస్వతీ మంత్ర మా।సరస్వతీతీరమున సుకరముగ జపము
సలిపెనేనియు గవి యగు జడుఁడు నమ్ము। మా సరస్వతీచరిత మత్యద్భుతంబు ౧౭౩

గీ. నిత్యము సరస్వతీనది నీట మునుగు। నరుఁడు మరల జగాన జన్మంబు నొంద
డింతకన్న నధికమైన దెద్దిగలదు। వాహినీరత్నమని చెప్పవచ్చు దాని. ౧౭౪

వ. అనిన విని నారదుండు కుతూహలంబుతో నారాయణు మొగంబు సూచి దేవా గంగా
సరస్వతు లమితశాంతిస్వరూపిణులు నిర్మలలు నయ్యు గలహింపం గారణంబేమి
సరస్వతికి శాపంబు రాఁ గతంబేమి యదియెల్ల వివరింపవే యనుఁడు నారాయణుండు.
౧౭౫

సీ. వింటె నారద మహావిష్ణువునకును లక్ష్మి గంగ సరస్వతియుం గురంగ
నయనలు మువ్వురు నయిరి సతులు వారు కలసిమెలసి కొంతకాలముండి
యొకనాడు గంగపూర్ణోత్తమ మొగ మట్టె వాలుఁగన్నులగాన వారఁజూచి
వలపులు గుల్కు మొవ్వపుసుధాధరమున నగవు మొలకలెత్త వగలుసేయఁ

తే.గీ. గాంచి విష్ణుండు నవ్వినఁ గమల సూచి। సత్వరూపిణి కావున సంతసమున
జిఱునగవు నవ్వి మొగము కొంచెము మరల్ప। నది సరస్వతి సూచి పేరలుకవొదమి
౧౭౬

చ. పరమకృపాలవాలుఁ దన భర్తను దీనజనావనుం బరా
వరు జగదాదికారణు శుభప్రదు దివ్యు ననంతు దా ననా
దరణముతో సరస్వతి యుదగ్రరుషారుణనేత్రయై సుధా
ధర మొకయింత దా విఱచి దార్తని ధూర్తని రద్దిసేయుచున్. ౧౭౭

గీ. పూర్వజన్మంబునందును బూని యెంత । మంచిపూజలు చేసిన మానవతికి
ధర్మమార్గంబు గని మెచ్చు ధవుడు గలుగు।కొలది నోచుక వగచిన ఫలముగలదె. ౧౭౮

గీ. భర్త ధర్మిష్ఠుడగునేని పక్షపాత।రహితుడగుఁ గాని ఖలు దనురాగవృత్తి
నెగుడు దిగుడులు సూపి తా నగడు చేసి । అట్టువెట్టుచునుండు నీయట్టు లధిప. ౧౭౯

క. అవులే యెరుగనె బాళిం । దవిలితి వా గంగమీద దయ మెందే వీ
దవు లక్ష్మిని దెలిసెదు వే । లవమేనియు గలదె నీ వలపు నాయందున్. ౧౮౦

గీ. గంగమీదిప్రేమ గలదు భార్గవిమీద । గాకయున్న నీవు గంగజూచి
నవ్వుదొడగినపుడు నావలెఁ గోపింప । కేల యూరకుండు నిద్ది చెపుమ. ౧౮౧

గీ. ప్రాణవిభునకు వెగటైన బ్రదు కికేల । కనులతోడను సవతుల గౌరవములు
గాంచుచును నోర్చి నిలుచుట కంటె మెడకు । నురిదగల్చుక సచ్చుట యుత్తమంబు ౧౮౨

క. మానంబుం బ్రాణంబు స।మానముగాఁ దలఁపవలయు మానముబోవం
గా నిఁకఁ బ్రాణం బేటికి । మానవతికి జీవనంబు మానమె కాదే. ౧౮౩

గీ. బుద్ధిహీనులైన పురుషులు కొందరు । మొనసి నిన్ను సత్యమూర్తినండ్రు
ధూర్తలక్షణముల వార్త లెరుంగక । వారి పల్కు వెట్టివాపు వింద్రు. ౧౮౪

చ. అని తన ముద్దులాడి హృదయంబునఁ గోపము పూనియున్న జా
దనుఁ గని సాంత్వనంబుల నెడంబడఁజేయఁగ వేళగాదు నా
కని తలపోసి చేడియల నచ్చటనే విడనాడి దిగ్గునం
బని నెఱమూని యేగెను సభాస్థలికి న్మురవైరి నారదా. ౧౮౫

చ. మురరిపు డట్టు లేగిన సమున్నతకోపభరంబు పట్టలే
కరవిరిబోణి గంగ గని హా తగులే మగనాలవౌదు సి
గ్గఱి నసుఁబోలువారలు జగంబునలేరు మగండు నాకు గిం
కరుడని విక్కి వీఁగి కనుఁగానవు పోతర మింత యొప్పునే. ౧౮౬

ఉ. పొంగెదవేమె నీ దురుసుపోడిమి పొక్కెనింతడు యేటికిన్
గంగ యభంగభంగములు గల్గవా నీకును బ్రుంగజేయుదున్
రంగులు చంగు లాత్మవిభు రాకలు పోకలు రేబగళ్ళు నా
కుం గలవంచు నింత కులుకో తళుకో బెళుకో జడస్థితిన్. ౧౮౭

చ. పొగరడగింతు చూడుము విభుడింకఁ నేమియొనర్చునో కనం
దగు నని చేయిసాచి యొక దాటునఁ గొప్పునుబట్టి లాగ వో
దగదిది నీకునుం దగదు తాళుము తాళుమటందు లక్ష్మి య
మ్మగువలమధ్య దా నిలచి మాన్ప సరస్వతి కిన్కపేరిమిన్. ౧౮౮

ఉ. ఇంత వచింపవైతి విపరీతము గంగను జూచి భర్తయా
వింతలు సూపినప్పు డొక వృక్షమవో మరి పెద్దయేరవో
పంత మికేల యట్లగుము భర్తయు సంతసమందు నెల్లరున్
సంతసమందువారలని శాపమిడె న్గడుగాయమాటలన్. ౧౮౯

క. శాపము విని పద్మ మదిం । గోప మొకింతయును లేక కూర్మిని వాణిన్
జేపట్టువిడక నిలచె నహహ పడఁతుల మేలుబంతియన లక్ష్మియెకా. ౧౯౦

ఉ. అంతట గంగ లక్ష్మి గని యక్కరొ యీ తెలివాయినోటి కొ
క్కింతయు నొప్పిలే దది యిఁకెన్నివితాలను గూయ నేర్చునో
వింతగ గొంతసేపు మన వీనుల విందము నల్లరాతితోఁ
గొంతుక జేసి పెట్టిరాకొ గ్రుక్కయు బుచ్చక మ్రోగు జెల్లబో. ౧౯౧

ఉ. పట్టుకొనంగనేల నను బట్టి యిదేమి యొనర్చజాలునో
కట్టిడియై యదంతయును గందముగాక శమంబుతోఁ దుదన్
ముట్టెడిదాక దీని బలముం జలముం దరువాతఁ జూపెదన్
గట్టిగ మీరలందరునుఁ గాంతురుగా యని గంగ వాణితోన్. ౧౯౨

ఉ. ఓసి పిపాసి లక్ష్మిఁ బరమోత్తమ సాధ్వి మహాపతివ్రతన్
దాసిగ నెంచితో కనకత్వత్సమగాఁ దలపోసితో సరే
వే సరిదాకృతుల్ పొసగులెమ్మని తిట్టితి వద్దియే నిరా
యాసముగా ఘటించి దురితాత్మకులుండు నధోజగంబ యా
వాసముగాఁ జరించునుఁ బాపములం గ్రహియించుచుండుమీ. ౧౯౩

చ. అన విని యా సరస్వతి మహాగ్రహచిత్తముపూని యోసి నీ
వును ధరణిన్ సరిత్తవయ పూనుము పాపులపాప మెల్లన
న్ననగలదానవైతి విఁక నద్దియ పొందుము నాగ నింతలో
వనజదళాక్షు డద్ది వినివచ్చెను భామిను లున్నచోటికిన్. ౧౯౪

వ. వచ్చి. ౧౯౫

చ. తటపటమింతలేక తన దక్షిణభావము మేల్మిచూపుచున్
దుటుకున జంకనెత్తుకొని తాను సరస్వతి మోముసూచి చె
క్కిట నొకముద్దు బెట్టుకొని గీస్పతి సత్త్వము పూనుమింక న
క్కట యిటుసేయగాదగునె కాని వచించెదనంచు లక్ష్మితో. ౧౯౬

సీ. పద్మ నీకళ బూని పనివిని ధర్మధ్వజునకు గూతురవయి జననమంది
మీ వయోనిజభావ మెనయంగ నటమీద వృక్షత్వమునుఁ బొంది వెలయగలవు
చెలఁగి నా యంశంబువలనను శంఖచూడుఁడు పుట్టు వానికిఁ బడతి వగుము
త్రైలోక్యపావనత్వము బూని తులసీసమాఖ్యనుఁ గైకొని యలరు మింక
గీ. నమర నొకయంశమున భారతాఖ్యవర్షమందు పద్మావతి యనంగ నలరునట్టి
నదివి గమ్మందుమీదట గదసె గంగ విశ్వపావని నీ వెనువెంటవచ్చు. ౧౯౭

సీ. గంగ భారతవర్ష కలుషాపహారిణిగా భగీరథు తపోగరిమవలన
భాగీరథివనంగ బరగుచు నా కళయగు సముద్రుని గూడు మంగనవయి
మరియు నా యంశంబు మరల జన్మించిన శంతనుపొందును నలుపు మబల
భారతి గంగశాపము నీకు కల్గినకారణంబున నీవు ధారుణికినిఁ
బోయి సరస్వతీ పుణ్యాపగ యనంగ బేరొంది భారత పృథివి నుండు
గీ. మింక నీ లక్ష్మి నాయొద్దనే వసించు। భారతి నీవు బ్రహ్మకు భార్యవగుము
గంగ నీవేగి యమ్మహాకాలు దీర్ఘ।జూటమున నిల్చి పత్నివై సొంపు గనుము. ౧౯౮

క. పలువురు భార్యలుగలవా।రల పాట్లు వచింప వశమె రాగతనమునం
దల మోదుకొనెడి పెండ్లము। గలయాతడు నరకకూపగతుఁడే కాఁడే. ౧౯౯

చ. అడవికిఁ బోయి మూలములు నాకులుఁ గాయలు మెక్కవచ్చుఁ బ
ల్విడిఁ బులి యెలుగు రేచులను భిల్లులఁగూడి వసింపవచ్చు నే
గొడవలులేక కేశములు గోళ్ళనుఁ బెంచుక యుండవచ్చు మ్రు
క్కడి చెడుగాడు దాని మెడఁగట్టుక యుండుట దుర్లభంబగున్. ౨౦౦

గీ. శాంతరూప లగుచు సౌశీల్యమును బూని। జగము బొగడ బరమసాధ్వియైన
యింతి కల్గువాని కిహలోకమందును। బరమునందు సుఖము బరగుఁగాదె. ౨౦౧

వ. అని యిట్లు బహువిధంబుల బహుపత్నికుని కష్టంబులు నుడివి, దుష్టపత్నితలం దూరి నారాయణుం డూరకున్న. ౨౦౨

గీ. అధికశోకార్తలగుచు నయ్యబల లప్పు డొండొరులఁ గౌఁగలించుచు నూర్చుకొనుచు
నశ్రుధారలు గురియంగ నడలి యడలి। రెట్టకేని సరస్వతి యిట్టులనియె. ౨౦౩

ఉ. నేరము చేసి నాథ యిటు నిందితనై చెడితిన్ భవాదృశుల్
కారుణికోత్తముల్ తెలివిగానని మూఢుల మమ్ముబోటులన్
నారుల బ్రేమ జూచుటయె నైజము కావున శాపముక్తికిం
దారి యొనర్పుమా పరమధన్యులఁజేసి భరింపుమా యికన్. ౨౦౪

వ. గంగ యిట్లనియె. ౨౦౫

క. ఏ నేమితప్పు జేసితి। నో నళినదళాక్ష తెలుపు మూరక యీ చం
దాన నను విడువదగునే। నేస్తము మాని యింక నే బ్రతుకుదునే? ౨౦౬

గీ. తప్పులేనివాని దండించువారలు। దండధరుని క్రూర దండనంబు
నొందకుందురే మహోదారచరిత యీ ముప్పు దీర్చి మమ్ము బ్రోవుమయ్య. ౨౦౭

వ. పద్మ యిట్లనియె. ౨౦౮

క. భారతిశాపమువలనం। భారతవర్షంబునందు వాహిని నగుచున్
వారల పాపముల నడచి। నే రయమున వచ్చుదాన నిన్నుం గలయన్. ౨౦౯

గీ. ఎంతకాలమునకు నే నిన్నుఁ జూతునో। జనులపాపములనుఁ జక్కఁజేసి
వచ్చి మరల నీదు వక్షస్థలంబుపై। నెక్కుదాన దులసివృక్షలీల. ౨౧౦

క. గంగాసరస్వతులకుం। భంగంబులు దీరు టెపుడు పరమపురుష యా
శృంగారవతులఁ గరుణా।పాంగంబులఁ జూచి ప్రోవు మఖిలగుణాఢ్యా। ౨౧౧

వ. అని దీనాననయై కొప్పుముడి వీడి పాదంబులం బట్టుకొన వ్రాలి నమస్కరించిన
లక్ష్మిం జూచి భక్తజనచింతామణియైన భగవంతుం డిట్లనియె. ౨౧౨

క. భారతి యొకకళతోఁ దా। ధారుణి నదియై పొసంగు దక్కినదానన్
దోరమగు సగము బ్రహ్మా।గారంబున నన్నుగూడి కడమయు సుండున్. ౨౧౩

గీ. గంగ యొకయంశంబునఁ బోయి క్షమను సర్వ।పాపములఁ దీర్ప నదియయి పారు నా భ
గీరథుడు గొనిపోవంగ గెరలియ యదియ। శివుని తల కెక్కి మిగత నన్జేరి యుండు.

గీ. అంశమున నొక్క యంశపుటంశ మూని। వామలోచన నీ వేగి భారతమున
తులసివయి నదివయి యుండి తుదకు గలిని నైదువే లేగ నావద్ది కరుగుదెమ్ము. ౨౧౫

గీ. భారతంబున గలదు నా భక్తగణము। స్నానమొనరింతు రెపుడు మీ జలములందు
వార లందును భయమును భక్తి గల్గి। మెలగు దీరలు పొందిక మేలుగందు. ౨౧౬

వ. నా భక్తుల విశేషంబులు జెప్పెద వినుండు. ౨౧౭

క. నా దాసు లేనదిం దప। పాదప్రక్షాళనములు బరగించెద ర
త్యాదరులై యా నదియే। నా దయచే దివ్యదీర్థ నామము నొందున్. ౨౧౮

క. స్త్రీఘ్నుండును గోఘ్నుండును కృతఘ్నుండును గరదుడు గురుతల్పగుడును బ్ర
హ్మఘ్నుడును బాతులగు ని।ర్విఘ్నంబుగ నాదు భక్తు బ్రీతిం గనినన్. ౨౧౯

క. ఏకాదశి రహితు సం।ధ్యాకర్మ విహీను మరియు నాస్తికు నృఘ్నున్
శ్రీకలితు బవిత్రునిగన్। బ్రాకట మద్భక్త దర్శనం బొనరించున్. ౨౨౦

క. అసిజీవియు మసిజీవియు। వసుమతి ధావకుడు గ్రామయాజకుడును దా
బసవని తౌతుం బోలరె। మసలక మద్భక్తుఁ జూచి మన్నించినదో. ౨౨౧

గీ. చెలగి నమ్మినవానిని జెఱచువాఁడు । తప్పుసాక్ష్యమువాడును స్థాప్యహారి
మిత్రు వంచించువాడు పవిత్రులగుచు । బొనరుదురు భక్తదర్శనంబుననుజేసి. ౨౧౨

గీ. ఘోరవాగ్దూషకుండును జారకుండు । పుంశ్చలీపతి పుంశ్చలీపుత్రకుండు నాదు
భక్తులకును వందనములుచేసి । పూజలొనరింప గందురు పూతవృత్తి. ౨౧౩

గీ పదజులకు వంటపనిసేయు పతితు డింక । దేవతార్చన గూలికి దీర్చునతడు
ధర నదీక్షితుడును నాదు దాసవరుల । దర్శనము సేయ నెసగరే ధన్యులగుచు. ౨౧౪

మ. పితను మాతను భార్యనుం దనయులన్ మిత్రున్ గురున్ భ్రాతలన్
సుతునుం గ్రుడ్డిని బాంధవుం భగిని శ్వశ్రున్ మామనున్ మాతులుం
మతిహీనుం గతిలేనివాని భరియింపం బూన డెవ్వాడు వా
డతిపాపాత్ముడు వాడె పూతుడగు సుమ్మా భక్తు దర్శించినన్. ౨౧౫

శా. దేవద్రవ్యము విప్రునర్థమును దా దించున్న దుష్టుండు లా
క్షావిక్రీతయు గన్నె నమ్మికొని బొజ్జన్నింపువాడున్ దయా
భావప్రక్రియలం బ్రపంచమును దా బాధించు పాపాత్ముడున్
బావిత్ర్యంబు వహించు తక్షణము మద్భక్తావళిం గాంచినన్. ౨౧౬

వ. అనిన విని శ్రీ మహాలక్ష్మి ముకుందా! పరమపురుషా! నీ భక్తుల దర్శించినమాత్రంబుననే సర్వంబును బూతంబగు నని యెరింగికొంటిమి. కాని తల్లక్షణంబులు వినవలతు మెరింగింపవే నావుడు భగవంతుండయిన విష్ణుండు పద్మారమణిం గాంచి యిట్లనియె. ౨౧౭

తే.గీ. గురుముఖంబున విష్ణుని గోప్యమైన । మంత్రపర్ణసమష్టియే మనుజ శ్రవణ
పథగతంబగు వాడెపో పరమపావనుం డనుచు వేదములు చాటుచుండు నబల. ౨౧౮

సీ. కండచక్కెరకన్న గడుతీపి యని భక్తిచేత నా స్మరణంబు సేయువాడు
నిరతిశయానంద నిరతిమై మద్గుణాంబుధిలోన డెందంబు ముంచువాడు
వీనుల నా కథల్ విన్నగానె వివశుడై కడువేడ్కమై గగుర్పొడుచువాఁడు
నను గొల్చువారల గనినమాత్రన గుతూహలచిత్తుఁడై చిందులాడువాడు

తే.గీ. మాటిమాటికి హరిహరీ మాధవా ముకుంద కేశవ గోవింద కుంభివరద
యంచు నుల్లాస మెనయ గీర్తించువాడు । నాదు భక్తుం డటంచును నమ్ముమబల! ౨౧౯

సీ. బ్రహ్మత్వమును నమరత్వంబు నొల్ల డింద్రత్వంబు నొల్ల డింతయును మదిని
స్వర్గంబు మోక్షంబు సాలోక్య సారూప్య సాయుజ్యముల నిచ్చ సాగనీడు
మనుత నొల్లడు రాజమహిమంబు లొల్లడు డెందంబు భోగంబులందు నిడడు
కర్మంబు నొల్లడు కామిని నొల్లడు గృహమునందును వాంఛ గీల్కొలుపడు

తే.గీ. సద్గుణ శ్రవణ శ్రావ్య మధురగీతిఁబాడు నారాయణా యని పలుకు నాడు
నిలుచు కూర్చుండు గన్నుల నీరువిడుచుఁ బ్రమొక్కు నవ్వును భక్తుండు మోహనాంగి -౩౦

వ. కావున నా భక్తుల లక్షణంబు లెరిగికొనుండు వారి పాదంబులు మీ జలంబులం దగిలిన మాత్రన మీరు పూత లగుదు రని పలుమారు వక్కాణించి విష్ణుండు చనియెనని చెప్పి మరియు నారదునితో నారాయణుం డిట్లనియె. -౩౧

సీ. గంగ శాపంబున గడగి సరస్వతి భారతంబున నది భాతి నలరె
భారతీదేవి శాపంబున గంగ దా హరిపదంబున సరిత్తై తలిర్చె
భారతంబున కేగి భారతీనామంబు బ్రహ్మకు బ్రియయయి బ్రాహ్మిపేరు
నల సరస్వంతుడౌ హరిభార్య యగుట సరస్వతీనామంబు రహిని వాగ

తే.గీ. ధిష్ఠితత్వంబు గైకొన్న దేవిగాన । వాణి యను పేరు బడసె బ్రవాహవతియ
యగుటను సరస్వతి యటంచు నం ద్రౌకంద్రు నారదమునీంద్ర సద్గుణానందసాంద్ర।

సీ. క్షితిపై భగీరథ క్షితిపతి తప మాచరించె తెచ్చెను గంగ బృథివి కందు
వలన భాగీరథీ వాహిని యను సంజ్ఞ వచ్చె నంతకుమున్న వామదేవు
జడలలో నిలచె నిశ్చలరీతి నొక యంశమున నంబుజాలయ మోదమలర
ధర్మధ్వజునకును దనయయై తులసీసమాఖ్యను వహియించె నాత్మకలను

తే.గీ. హాళి గలియుగమున నైదువేలేడులు । గడచువరకు దమదు కళలు నదుల
నునిచి పిదప శాప ముడుగంగ శ్రీహరిఁపదము జేరి సుఖము బడయు ననఘ. -౩౩

వ. మరియుం గాశీ, బృందావనంబులు దక్క యెల్ల తీర్థంబుల మహిమంబులును వైకుంఠంబు చేరంగలవు. సాలగ్రామంబును, శివశక్తులును, జగన్నాథుండును గలియుగంబు పదివేలే డులుచన వైకుంఠంబున కరుగుదురు. ఇదియుంగాక సాధువులును, బురాణంబులును, శ్రాద్ధతర్పణంబున శంఖంబులును, వేదోక్తకర్మంబులును, దేవపూజయు, దేవనామ కీర్తనంబును, వేదాంగంబులును, శాస్త్రంబులును, సత్య ధర్మంబును, వేదంబును, గ్రామ దేవతలును, అనశనవ్రతంబులును, దపంబులును గ్రమక్రమంబున నడుగంటి చను. వామాచారరతులును, మిథ్యాకపటసంయుతులును, తులసీనిందకులును, శఠులును, గ్రూరులును, దంభులును, మహాహంకారసంయుతులును, చోరులును, హింసకులు మొదలగు దుష్టతండంబులు మెండుగా నుందు రింతియకాక, స్త్రీపురుషభేదంబుదక్క తక్కభేదంబు గానరాక యెల్లరు స్త్రీవశగు లగుదురు. ప్రతిగృహంబునం గులటాతండం బులు నిండియుండు. గృహిణి గృహేశ్వరి యగు గృహి భృత్యుమాత్రుం డగు. యౌనేయబాంధవుల కర్తృత్వంబు లధికంబులగు. విద్యాసంబంధులు గారవింపబడరు. బ్రహ్మ క్షత్ర వి ట్శూద్రులు సర్వకర్మ వివర్జితులై యాచారశూన్యు లగుదురు. సంధ్యా

లోపంబును, యజ్ఞసూత్రలోపంబును వాటిల్లు. మ్లేచ్ఛాచారులై, మ్లేచ్ఛశాస్త్రంబులు పఠించి, స్వశాస్త్రంబులు విడనాడుదురు. బ్రహ్మ క్షత్ర వైశ్యులు నీచసేవలం బ్రతుకు చుందురు. సూపకార ధావక వృషవాహాది కృత్యంబులు నిర్భయంబుగా నడపెదరు. మనుజులందు సత్యంబును, భూమియందు పంటయును, వృక్షంబులందు ఫలాదులును, స్త్రీలయందు దపత్యంబులును, గోవులయందు క్షీరంబులును, దంపతులయందు బ్రీతియు, భూపాలురయందు బ్రతాపంబులును, మహానదులయందు జలంబులును, నూతుల నూట లును, వర్ణంబులం బుణ్యంబులునుం గ్రమంబుగా క్షీణించు. లక్షలో నొక్కండు పుణ్యుండు గానవచ్చుట దుర్లభంబు. గుణంబుల, నాకారంబుల, బలంబుల, బుద్ధిని, వాక్కున నరులు నానాట నల్పిష్ఠు లగుదురు. కొన్నినగరంబులును, గ్రామంబులును నిర్జనంబులై పోవు. నరణ్యంబులు సాగులై, యరణ్యవాసులు పన్నులచే బీడింపబడుచుందురు. నీటి యాధారంబులు గల తావులమాత్రము పంటలు పండు. వృష్టికై చూచు చోటుల బంటలు క్షీణించు. ప్రకృష్టవంశంబులు హీనంబులగు. హీను లుత్తములుగా గొనియాడబడుదురు. నాస్తికులు పలువురు తలలెత్తుదురు. నాగరులు సర్వత్ర దయారహితులును, హింస కులును, లోభులు నై పరోపకారశూన్యులై, స్వార్థపరాయణులై, లోకకంటకు లగుదురు. పొట్టివారును, రోగపీడితులును నై స్త్రీపురుషులు తరుచుగా ముక్కుచు, మూల్గుచుందురు. కలియుగమహిమంబు ప్రవృద్ధంబయినకొలంది ధర్మంబును, నాయువునుం దగ్గుచుండు. పదియారువర్షంబులకె తలలు నెరయు. తుద కిరువదిసంవత్సరంబులకు వృద్ధదశ ప్రాప్తించు. నెనిమిదేండ్ల కంగన పుష్పవతియగు. వంధ్యలసంఖ్య దండిగా నుండు. కన్యకావిక్రయంబులు సర్వత్ర నదుష్యంబులుగా నుండు. స్వగృహాంగనాజారోపాత్తంబ యిన యన్నంబు భక్షించువారు పలువు రుందురు. శ్రీమన్నారాయణ నామవిక్రయు లందందు జూపట్టుదురు. స్వదత్తాపహారులును, దేవవృత్తి, బ్రహ్మవృత్తి, గురువృత్తు లపహరించువారును, అగమ్యాగమనంబులు సేయువారును దఱచుగా నుందురు. మాయా వాదులు, విశ్వాసఘాతుకులు నిందరని చెప్ప శక్యంబుగాకుండు. కొన్నియెడల సంగ మంబును, జిత్తనియమంబు లేకుండు. సర్వజనులు మ్లేచ్ఛప్రాయులగుదురు. మరియు నిట్లు సర్వం మ్లేచ్ఛమయం జగత్తును నట్లుండ విష్ణునంశంబున నొక విప్రునకు కల్కి యనుపేరం బుట్టి దీర్ఘంబైన ఘోటకంబునెక్కి దీర్ఘకరవాలంబున వసుధ నిర్మ్లే చ్ఛంబుసేయ ధరణి యరాజకయై యుండ నారహోరాత్రంబులు గురియు పెద్దవానకు జగంబు తల్లడిల్ల నంత బన్నిద్దరు సూర్యులొ యనున హెండగాసి భూలోకంబు వాసయోగ్యంబు సేయ నంత నుత్తమంబయిన కృతయుగంబు ప్రాప్తంబయిన నానావిధ ధర్మంబులకుం దానకంబయిన భూతలంబున వర్ణత్రయంబు లేర్పడి భగవత్యను గ్రహంబున సంపూర్ణసత్యంబు ప్రవర్తిల్లునని చెప్పి మరియు నారాయణుండు. ౨౩౪

చ. కృతమున నాల్గుపాదముల గీల్కొను ధర్ముఁడు త్రేత నంచిత
స్థితి గను మూడుపాదముల జెల్వగు ద్వాపరమందునం బద
ద్వితయముతోడ నక్కలిని బెంపఱి నిల్చెడి నొంటికాలితో
గుతుకుచు బండు దుట్టతుద। కుం బదహీనత బ్రహ్మనందనా। ౨౩౫

క. వారంబు లేడగుం బది। యారగు తిథు లట్టిదినము లవి ముప్పదియుం
జేరిన మాసంబగునో। నారద పగటికిని జాలు నాలుగుసుమ్మీ ౨౩౬

క. ఎనిమిది జాలును రాత్రియ। దినమును నగుచుండు నట్టి దినములు పదియే
నొనరిన బక్షము పక్షము। లును రెండై నెల యగుం ద్రిలోకసుపూజ్యా। ౨౩౭

క. నెలలును రెండై ఋతువగు। నెల లా రయనంబు మరియు। నెలలుం బంద్రెం
డిల హాయన మగు హాయన। మలరారెడి నైదువిధములై మునినాథా। ౨౩౮

తే.గీ. నరుల వత్సరంబు సురల దివారాత్ర। మరయ నరుల యుగము నవ్వి మూడు
వందలకును మీద వందల నిర్వది। యైన సురల యుగ మటండ్రు సూరిజనులు॥ ౨౩౯

తే.గీ. దివ్యయుగము లవియు। డెబ్బదియొకటైన నదియ మనువుకాల మమరవిభుని
యాయువందు రింద్రు ల య్యిర్వదెన్మండ్రు। చనిన బ్రహ్మజునకు దినము రేయి॥ ౨౪౦

తే. గీ. బ్రహ్మకును నూటయెనిమిది వత్సరములు। గడవ బ్రాకృతమైనట్టికల్ప మండ్రు
బ్రళయమగునప్డు లోకంబుజలమయ మగు।మునులు మూర్తులుచిత్తున ముడిచికొండ్రు౨౪౧

తే.గీ. భగవతికి నొక్కనిమిషంబు బ్రహ్మలయము తలప। బ్రహ్మండసమితి యిద్దారి నడగు
బుట్టుచుండును దుదియును మొదలు లేక।కల్ప వేధోండముల లెక్క గన దరంబె। ౨౪౨

ఉ. ఎందరు బ్రహ్మలో గిరిశు లెందరొ కేశవు లెందరో శచీ
సుందరిభర్త లెందరొ వసుల్ మనువు ల్మరి యెందరెందరో
యిందు లికెందరో గ్రహపు లెందరో కన్యపు లెందరో చిదా
నందు డెరుంగుగాక గణనంబున కందునె లాతివారికిన్. ౨౪౩

ఉ. ఎన్ని ధరిత్రులో జగము లెన్నియొ యెన్ని యజాండకోటులో
యెన్నియుగంబులో మరియు నెన్నియొ కల్పము లెన్ని సృష్టులో
యెన్ని లయంబులో యెఱుగ నెవ్వరి శక్యము మాయచేత ని
ష్పములైన ద్రవ్య గుణ భావము లాత్మకు జిక్కు లెక్కకున్. ౨౪౪

తే. గీ. బ్రహ్మమొదలు తృణము పర్యంతమును నాత్మ। కళలకాని వేర కాదుసుమ్ము
కళలు వచ్చు బోవు కడలిలో నలలట్లు। సకలహేతు వెన్న బ్రకృతి సుమ్ము. ౨౪౫

తే. గీ. బ్రహ్మయంశ మగుచు బరగు విరాణ్మూర్తి। యర్థభామినీశు డతని బిడ్డ
వాడె కృష్ణు డనగ వర్తిల్లు నాతండు। ద్వివిధుడయ్యె వినుము దీని తెఱగు. ౨౪౬

తే. గీ. రెండుబుజములాత డుండగా జగమును నాలుబుజములాడు నలువుమీర
వర్తనం బొనర్చు వైకుంఠమందును। సృష్టిహేతు వెంత చిత్ర మనఘ. ౨౪౭

వ. మరియుం బరబ్రహ్మ స్వేచ్ఛామయుండును, నిరుపాధికుండును, నిరామయుండును, నిర్లిప్తుండును నైయుండు. శివుండు మృత్యుంజయుండై, సర్వజ్ఞుండై, సంహారకర్తయై తదిచ్ఛామాత్రసంభూతుండు. నదియేవిధంబును బ్రహ్మాండకర్తయగు బ్రహ్మయు బ్రకాశించు. మహావిభూతిసంయుతుండై, సర్వజ్ఞుండై, సర్వదర్శనుండై, సర్వవ్యాపియై, సర్వాత్మయై, సర్వసంపత్ప్రదాతయై పరమాత్మను సేవించుచుండు. పరమాత్మునకును మహాశక్తికిని భేదం బొక్కింతయులేదు. కావున నమ్మహాశక్తియగు సచ్చిదానంద రూపిణి కళాంశంబున సావిత్రియు, వేదమాతయు, వేదాధిష్ఠాత్రియు, సర్వవిద్యాధిదేవతయు, సర్వగ్రామాధిదేవియు, సర్వేశ్వరియు, సర్వవందితయు, సర్వజ్ఞయు, గృష్ణవామాంక స్థితయు, రాధికయు, గృష్ణవల్లభయు, సర్వసౌభాగ్యసముపేతయు నగు ప్రకృతిపుట్టె. నా ప్రకృతి.

మ. శతశృంగంబున దివ్యహాయనసహస్రం బా మహాదేవి తా
బతిసంప్రాప్తికినై తపంబు నొనరింపం గృష్ణ దానారి న
క్షతశోభాఢ్యను జూచి జాలిపడి వక్షఃపీఠికం జేర్చి యం
చితలీలాకుతుకంబుతో వరము నిచ్చెం బ్రేమ దైవారగన్. ౨౪౯

క. ఎడవక నా హృదయంబున। నిడుకొని నిను గారవింతు నిక నాకును ము
మ్మడుగు లధికముగ నెన్నంబడియెడు నాచేత సేవ బడసెద వబలా? ౨౫౦

వ. అని చెప్పెనని నారదుండు. ౨౫౧

తే. గీ. దుర్గ తపము చేసి ధూర్జటిసతి యయ్యె। వాణి తపమునల్పి బ్రహ్మ గలసె
సిరియు తపముజేసి శ్రీవిష్ణు బొందెను। దపమువలనగాదె ధన్యులగుట ౨౫౨

వ. దుర్గ హిమవంతంబున వేయి దివ్యవర్షంబులును, సరస్వతి గంధమాదనంబున లక్ష దివ్యవర్షంబులును, లక్ష్మి పుష్కరంబున రెండు యుగంబులును, సావిత్రి మలయంబున నలుబదివేల దివ్యవర్షంబులును, శంకరుండు శతమన్వంతరంబులును, బ్రహ్మయు విష్ణుండును వేర్వేర శతమన్వంతరంబులును దపంబుచేసి వాంఛితార్థంబులు బడసిరి. మరియు శ్రీకృష్ణుండు పదిమన్వంతరంబులు తపంబుసేసి నా లోకంబు నొందె. ధర్ముండు పదిమన్వంతరంబులు దపంబు సేసి సర్వపూజ్యుండయ్యె. నిట్లు దేవులును దేవతలును, మునులు, మనువులు తపోమహిమంబులవలన గాదె గొప్పవారైరని చెప్పిన విని నారదుండు. ౨౫౩

క. దేవికి నిమేషకాలము। బోవంగా నొక్క బ్రహ్మ పూర్ణాయుష్యం
బై వెలయు నందియంతే। లా విను మది ప్రాకృత ప్రళయ మంద్రు బుధుల్. ౨౫౪

క. ప్రాకృతమగు ప్రళయంబున । లోకేశతనూజ ధరణి లోకము గనరా
దేకార్ణవమై యేదియు । లేక జగము లాత్మయందు లీనంబు లగున్. ౨౫౫

క. అని యిట్లానతి యిచ్చితి । వనఘా సృష్ట్యాదియందు నంత నెటుల దా
జననంబు నొందునో యది । వినవలతుం గరుణతోడ విన్పింపు మజా । ౨౫౬

క. నావుడు విన నారాయణు । డో విశ్వసృడాత్మజాత యుర్వికి సృష్ట్యా
ద్యావిర్భావము రూపా । భావము లయమందు గలుగు పద్ధతి వినుమా. ౨౫౭

క. వసగల మధుకైటభ రా । క్షసవర్యుల మేధమునను సర్వంసహ దా
బొసగినకతమునగాదా । యనమానత మేదినీసమాఖ్య వహించెన్ ౨౫౮

వ. అని యిట్లు కొందరు సెప్పుదు రటులయినను ౨౫౯

క. మధు కైటభదేహంబుల । నధికృతమై మొదట వసుధ యమరకయున్నన్
వధకు దుద మేద ముండదు । బుధవర్యా కాన దాని మూలము వినుమా. ౨౬౦

సీ. ప్రళయంబున విరాట్టు ప్రతిలోమకూపంబునందు బ్రహ్మాండంబు లడగియుండు
యీశ్వరుండు వికాస మిచ్ఛగించినమాత్ర పొడము వెండియు లోకపుంజ మెల్ల
బుట్టుచు గిట్టుచు బొరిపొరి నీలీల ప్రతివిశ్వమున పృథ్వి బరగుచుండు
శైల కానన సరిత్సాగర ద్వీప గ్రహర్క్ష విద్యుద్ధ్యుతేశాది సహిత

తే. గీ. యగుచునారద విను బ్రహ్మాండకోటి । సశ్వరంబుసుమీ పరిణామములు వి
కారములు గల్గి నానాప్రకారములను । బ్రహ్మ తనశక్తితో నిత్య పదవి గాంచు. ౨౬౧

తే. గీ. ఆదిసృష్టిని గృష్ణునియందు బుట్టు । నవ్విరా ట్టగు గారణ మన్నిటికిని
నద్ది కాన కలారూప మైయట్టి । కాల మది నిత్యమందురుగాదె బుధులు. ౨౬౨

తే. గీ. కాలములకు నధిష్ఠాత్రి గాదలిర్చు నట్టి వారాహిదేవి ని త్య యనవలయు
నాదివిష్ణుండు దాగిటి యైననాడు । పడతి యామెయకద ధర్మపత్ని యయ్యె. ౨౬౩

తే.గీ. వినుము వారాహికొమరుండు విదితయశుడు । మహితమంగళమూర్తి కుంభప్రభుండు
మంగళసుతుండుసుమ్ము నా మౌనివరుడు । వెలయ దచ్చరితంబును దెలుపుమనిన. ౨౬౪

ఉ. తొల్లి జనార్దనుండు దయతో ధరణీతల ముద్ధరింప రం
పిల్లి హిరణ్యలోచనుని బీచమడంచిన నాడు గూర్మి సం
ధిల్లఁ బ్రకృష్టయౌ ప్రకృతిదేవి ప్రపంచపథంబునన్ బ్రభా
వోల్లసితున్ వరాహవిభు నొయ్యన జేరి నమస్కరించినన్. ౨౬౫

సీ. తళుకు బేడిసమీల దన్ను కన్నులదాని మురుపులీనెడి ముద్దుమోముదాని
సీలమండలనంట జీరు కీల్జెడదాని చెంగావిచీరె కుచ్చెళ్ళదాని
నిద్దంపు టద్దంపు నిగ్గు బుగ్గలదాని నెలనవ్వొలయు గెలపు సెలవిదాని

రవలదుద్దుల సౌరు దవులు తమ్మెలదాని బొలుపొందు విలువంపు బొమలదాని

తే. గీ. దొడ్డపిరుదులదాని నుం దొడలదాని గుడుసుగుబ్బలదాని సంకుమెడదాని
గులుకుపలుకులదాని జగ్గుగలదాని కాంచి వారాహుడెద దమకంబుమించి. ౨౬౭

సీ. చిన్నారి వగల మచ్చికమాటల గరంచి నెలవంకనొక్కుల గులుకరించి
పలుగెంపుటుదుటుసోకుల గళల్ దేలించి బలుపుదొంతర ముద్దు లలవరించి
కన్నుమూతలు నరగంటిచూపుల నార్చి మొగముమార్పులు జిడిముళ్ళ దీర్చి
వెలలేని వేట్రింత చెలగాటముల ముంచి కొదమపావ్రపు గుబగుబల నించి

తే. గీ. కులుకుపాలిండ్ల గౌగిళ్ళ గుస్తరించి పలుతెరంగుల ననవిల్తుపనుల మించి
రాజసంబున నాదివరాహమూర్తి ప్రకృతి రమణీయయైన వారాహి గూడి. ౨౬౮

ఉ. ఈగతి నొక్క వేలుపులయేడు వరాహు డహర్నిశంబు సం
భోగముసేయ నమ్మగుద మూర్ఛిలె నత్యధికాంగజాతసౌ
ఖ్యాగమముల్ ప్రగల్భమిథునాంచితవృత్తులుగావె వెన్నడుం
దా గననేరదయ్యెను దినంబిది రాత్రి యిదంచు నారదా! ౨౬౯

వ. ఇవ్విధంబున నయ్యాదివరాహుండు ప్రకృతిదేవిం గలసి యొకయేడు సుఖించి నిజవరాహ రూపంబుపూని యయ్యవనీదేవిం బూజ్యంబు గావించి ధూపదీపనైవేద్యాది నానోపచారంబుల నర్చించి యింద్రాదులగు దేవతలును, మునులు, సిద్ధులును, మానవులును నంబువాచీత్యాగ దినంబునందును, గృహారంభ ప్రవేశంబునందును వాపీకూపతటాకారంభంబునందును, కృషికర్మయందును నిన్ను బూజించి శుభంబు బడసెదరు. అట్లు సేయకున్న మూఢులకు నరకంబు ప్రాప్తించునని చెప్పిన వసుధాదేవి ముకుందున కిట్లనియె.

సీ. ముత్యంబు శుక్తియు మురవైరిమూర్తియు శివలింగమును శివాచిహ్నితంబు
శంఖంబును బ్రదీపసహిత యంత్రంబును మాణిక్యమును మూలమానికంబు
యజ్ఞసూత్రంబును నలరుల పొత్తంబు తులసియు జపమాల యరు దండ
జాంబూనదము ఘనసారము గోరోచనమును సాలగ్రామ విమలజలము

తే.గీ. చందనంబును భరియింపజాల నేను దక్కిన చరాచరము పుష్పదామమట్ల
లీలతో మ్రోయగలను పాలితసరోభవాండకాండుండవైన నీ యాజ్ఞజేసి. ౨౭౦

వ. అనిన భగవంతుడు విని వసుంధరా! నీ కా ద్రవ్యంబు లెవరేని యర్పించినం బహువర్షంబులు కాలసూత్రనియమంబునం బడి కుందుదు రని వరం బిచ్చి యూరకుండె. నంత యనంతాదేవి గర్భంబుదాల్చి తేజస్వియగు మంగళం గనియె. అప్పటినుండి మూల మంత్రంబునం గణ్వశాస్త్రోక్తమార్గంబున మూడులోకంబులవారును షోడశోపచారంబులు సేయుచు వసుంధరాపూజనంబు సేయం దొడంగిరి. ప్రథమంబున మురారియు బిమ్మట

బ్రహ్మయు బదంపడి మునీంద్రులు నాదట మనువులుం గొల్చిరి. ధ్యానస్తవన మంత్రా
దులు దెల్పెద విను మని నారదునకు నారాయణుం డిట్లనియె.

క. మొదలం బ్రణవము మాయాస్పదబీజము పిదప నవల బద్మాబీజం
బదుకు సబిందుకలై లిపు। లొదవింప సుధాచతుర్థియుఙ్ శిఖిసతియుఙ్. ౨౭౨

వ. ఇది మూలమంత్రం బిక ధ్యానంబు వినుము. ౨౭౩

సీ. శ్వేతపంకజవర్ణ సీతాంశునిభవక్త్రి సరసచందనలిప్త సర్వగాత్రి
రత్నాభరణరాజి రమ్యరత్నాధార రత్నగర్భ నుదార రత్ననిలయ
వహ్నిశుద్ధాంశుక వందితసుస్మిత విలసితాధార గృపాకలితహృదయ
వసుధవసుంధర వారాహినఖిలైకజీవనాధార భూదేవి నచల

తే.గీ. నాత్మ ధ్యానింతు స్మరియింతు నభినుతింతు। చెలగి కీర్తింతు బూజింతు సేవలెల్ల
జేసిమెప్పింతు గాంక్షిత సిద్ధికొరకు। నైహికాముష్మికఫలార్థి నగుచు నెపుడు. ౨౭౪

వ. అని ధ్యానించి ౨౭౫

తే.గీ. జయజలాధార జయశీల జయద జయవరాహ జాయజయంబిమ్ము ప్రథితవిజయ
మంగళా మంగళాధార మంగళేశ మాత మంగళమీవమ్మ మంగళాఢ్య. ౨౭౬

క. సర్వజ్ఞ సర్వరూపిణి। సర్వప్రద సర్వకామ సంధానచణా
సర్వేశి సర్వభాసిని। సర్వేష్టము లిమ్మునాకు సర్వాధారా. ౨౭౭

క. పుణ్యస్వరూప ఘనకా। రుణ్యోదయ పుణ్యబీజరూపామితస
త్పుణ్యాలయ పుణ్యవతీ। పుణ్యము దయసేయు మమ్మ పుణ్యనిధానా। ౨౭౮

సస్యాలయ సస్యాఢ్యా। సస్యప్రద సస్యరూప సంయమిసంఘో
పాస్యా సస్యోద్ధారిణి। సస్యంబుల బెనుపు మమ్మ సస్యవిధానా ౨౭౯

క. భూమీభూమిపవంద్యా। భూమాకారా సమస్త భూజనసౌఖ్య
శ్రీమాతా సురవినుతా। భూమిం దయసేయుమమ్మ భూమికృపాప్తిన్. ౨౮౦

వ. అని యిట్లు స్తవంబుసేయునది యని చెప్పిన నారదుండు భూమిదానకృత పుణ్యంబును
తద్హరణ దోషంబును కూపఖననాదికంబునందును వీర్యత్యాగంబునందును నంబువాచి
యందును దీపస్థాపనంబునను గల పాపంబు లెట్టివో యవియును బృధ్విజన్యంబులగు నితర
పాపంబులును దత్పరిహార మార్గంబులును వివరింపవే యనుడు విని నారాయణుండు. ౨౮౧

సీ. ఒక్క జేనెడు గొల్చి యుర్వి సంధ్యాపూతుడగు విప్రునకు నిచ్చునట్టివాడు
శివునియింటికి నేగు నవనిని సస్యాఢ్య నుర్వీసురున కిచ్చు నురుయశుండు

రేణుసంఖ్యాకమై రాణించు నబ్దసహస్రంబు విష్ణ్వాలయమున నుండు
గ్రామంబు నిచ్చు నా ఘనుడు సకలపాపముల బాసి శ్రీదేవి పురము జేరు

తే.గీ. భూమిదానంబునకు నను మోదియైన। యతడు విష్ణ్వాలయంబున నధివసించు
మిత్రగోత్ర సహితుడై విచిత్రలీల। కాన భూదానఫల మెన్నగా దరంబె. ౨౮౨

శా. తానై యిచ్చిన భూమినేని పరదత్తంబైన సస్యాఢ్యనే
యేనిం భూసురునుండి లాగికొన నూహించుఁ బలుం డెవ్వ డ
వ్వానిం ఘోరన గాలసూత్రనిరయావాసుం దగం జేయుచుం
దీనత్వంబున నేడ్చినన్ వినక మర్దిం ద్రర్కఁభూకింకరుల్. ౨౮౩

ఉ. ఎవ్వడు విప్రభూమి హరియించును వాని సుతుల్ సుతాత్మజుల్
నెవ్వగ గోష్పదంబున గనిం భుజియింపగలేక బీదలై
యివ్వసుధాస్థలిం దిరిపె మెత్తుదు రాతఁ డపుత్రకుండయే
జవ్వన రౌరవంబునకు జాగి చనుఁ బరమేష్ఠినందనా. ౨౮౪

ఉ. ఆవులు బోవుమార్గమున నావుల పెంటల జెర్వులోపలఁ
ద్రోవల భూమిదానమిడు దుష్టుడు దా నసిపత్రమందు వా
ణీవరపుత్ర నిల్చెడిని నిందితుడై పదునల్వు రింద్రులుం
బోవుదు రెంతకాలమున బొక్కుచు నంతటికాల మార్తుడై. ౨౮౫

తే.గీ. పంచపిండంబు లుద్ధరిం పకయ పరుల। నూతిజలమున నెవ్వాడు స్నాతుఁడగును
వానిస్నానంబు కల్మషావహముఫలమొ। కించుకయు లేదు నరకంబు గాంచు దుదిని. ౨౮౬

తే.గీ. కామియగుచు జాటుగా వీర్యపాతంబు। భూమిమీద జేయు మూఢజనుడు
మృతికి బిదప భూమి రేణుప్రమాణవ। ర్షములు బాధనొందు రౌరవమున. ౨౮౭

తే.గీ. కాంచియంబువాచిఁ గాంద్రించు నాతడు దప్ప కేగును గ్రిమిదంశమునకు
నందు నాల్గు యుగము లతిబాధపాలయి కుందు నంద్రు బుధులు గుణగణాఢ్య. ౨౮౮

క. పరకీయ లుప్తకూపాంతరమున గూపంబు మరల ద్రవ్వెడి మనుజుం
దరయంగ లుప్తమగు పు। ష్కరిణిం బుష్కరణి గొట్టు ఖలుడుఁ బతితుల్ ౨౮౯

సీ. పృధివీశు తండ్రికి బిండంబు పెట్టక శ్రాద్ధంబు సేయుట సనదు సుమ్మి
భూమిమీదను దీపమును బెట్టరాదుసు మ్మతడేడుభవముల నంధుడగును
నేలను శంఖంబు నెరి మోపగారాదు జన్మాంతరమున గష్టంబు వచ్చు
ముత్యంబు గెంపును మూలరాయియు బైడి నవనిపై నిడెనేని యంధుడగును

తే. గీ. శివునిలింగంబు శివమూర్తి చింద మెనయ। జలము శిల నిడ్డ జలమును జందనంబు
పూవు జపమాల క్రపంబు పూలదండ। భూమిపై నిడ్డ నరకంబు బొందు ననఘ. ౨౯౦

తే. గీ. కడగి గోరోజనంబు గప్పురంబు మొనసి రుద్రాక్షమును గుళ మూలకంబు
పుస్తకంబును జన్నిదంబును ధరిత్రి । నెవ్వఁ డిడు వాడు బ్రాహ్మణ్య హీనుఁడగును. ౨౯౧

క. జన్నముజేసి భూమిని । గ్రన్నన క్షీరములచేత గడుగక యున్నన్
వన్నియ చెడి యేడు తరము । ల న్నిలుచుం దప్తమగు నిల న్మునినాధా. ౨౯౨

క. భూకంపమునుం గ్రహణము । సోకినపుడు భూమి బాఱఁ ద్రొప్పించినవాఁ
డాకడ జన్మాంతరమున । బ్రాకటముగ నంగహీనభావము నందున్. ౨౯౩

వ. మరియు సర్వంబునకు భవనంబై భూమినామంబును గస్యపాశ్రితయై కాస్యపీసమాఖ్యయు స్థిరరూపంబున నచలాభిధానంబును బ్రపంచధారణంబున విశ్వంభరాఖ్యయు బృథుకన్యయగుటను విస్తృతత్వంబునను బృధివీసంజ్ఞయు సంతంబులేకుండుటచే ననంతయను పేరునుఁ బొందిన యీ ధరిత్రి సర్వపూజ్యయగుట యబ్బురంబె యని చెప్పిన విని నారదుండు పృధ్వీమాహాత్మ్యంబు వింటి నిక గంగోపాఖ్యానంబు సెప్పి నన్నుం గృతార్థుం జేయు మది భారతీశాపంబునం భారతంబునం జేరి యేయుగంబున నెచ్చట నెట్లు పూజింపంబడె నవ్విష్ణురూపిణి పూజావిధానంబుతోడం దెలుపవే నావుడు విని నారాయణుండు.

## —: గం గో త్ప త్తి క్ర మ ము. :—

మ. కలితాశీర్యదవార్యశౌర్యదవఖుక్రప్రక్రమావక్రని
స్తులజిహ్వాపటలీస్ఫుటోన్నటనదోర్భీతశత్రుక్షమా
తులరాడ్వీరకురంగరక్షణకళాధౌరంధరీపూర్ణకీ
ర్తిలతాసాంద్రుండు మించు మున్ నగరధాత్రీపాలచంద్రుం డిలన్ ౨౯౪

మ. ఇనవంశంబున బుట్టి యాతడు మహాహీనప్రభావాఢ్యుడై
యనువొందం విదర్భపుత్రియు సుశైబ్యాభిఖ్యయున్ భార్యలై
తను సేవింపగ నందు శైబ్యకును బుత్ర శ్రేష్ఠు డొక్కండు స
జ్జనగణ్యుం డుదయించి మించె వితతౌజఃప్రఖ్యు డుర్విస్థలిన్. ౨౯౫

తే. గీ. తనసపత్ని బిడ్డ గనుటయు దన కది లేకయుంటయు గని లీలనా వి
దర్భ తనయ యిందుధరుని సేవించిన । నతని కరుణవలన నబ్జవదన
తేగీ గర్భధారణంబు గలిగి శతాబ్దముల్ । నిండ నొక్కమాంస పిండము గనె
దాని జూచి యబల తత్తరపడి వొక్కి హరహరా యటంచు నడల శివుడు. ౩౯౬

చ. నునుదెలిజందెమున్ జమిరి నోటను కుక్కలులు జక్కి నొక్కుచుం
దనువున భూతిరేఖ లిడి దర్భల చొపనుజుట్ట వీపునం

దనువుగ బ్రేలదాల్చి విమలాంబుఘటం బొకచేత నొందుచే
తను గుశపాశబద్ధమగు దండము బట్టి ధరాసురేంద్రుడై. ౨౯౯

క. పిండము నలుబదివేలగు । ఖండంబులుసేయ నందు గలిగిరి శౌర్యో
ద్దండులు ప్రతాపజితమా । ర్తాండులు రిపుగండులైన తనయులు మౌనీ. ౩౦౦

వ. అయ్యరువదివేవురుం గపిలుశాపంబున భస్మీభూతులైనం గాంచి రాజు శోకించి వనంబున కరిగె నసమంజుండు నిజభ్రాతృభస్మంబులం బవిత్రంబులు సేయంబూని గంగానయనార్థియై లక్షవర్షంబులు తపంబుసేసి కార్యసిద్ధి వడయనేరక స్వర్గస్థుండాయె నంత నతని కుమారుం డంశుమంతుడు నట్ల చేసియు ఫలంబుగానక యపర లోకంబు నొందె. పిదప నతని పుత్రుండు పరమభాగవతశ్రేష్ఠుండు గుణవంతుండు విష్ణుభక్తుండు నగు భగీరథుండు గంగానయనార్థంబు లక్షహాయనంబులు తపంబు సేయ ననుగ్రహించి శ్రీకృష్ణ దేవుండు ౩౦౧

చ. మునుదలఁ బ్రేళ్ళ నెత్తుచును మూయుచు షడ్జముఖస్వరాళిసొం
పెనయగజేసి కెంబెదవి నీలకు రానిడి బిల్లఁ గ్రోవితో
బనివడి రాగముం గృతియు బాడుచు నౌదలఁ బింఛలాంఛనం
బొనరగ గొల్లపిల్లడయి యోపికతో జనుదెంచె మెల్లనన్. ౩౦౨

సీ. బ్రహ్మస్వరూపుడై పరిపూర్ణు డగువాడు స్వేచ్ఛామయుండయి చెలగువాడు
బ్రహ్మరుద్రాదులు బట్టజాలనివాడు మునిపూజితులలోన మొదటివాడు
నిరుపమనిర్లిప్త నిర్గుణుండగువాడు నఖిలజగత్సాక్షి యైనవాడు
ప్రకృతి మాయకు బరుడై వెలయువాడు నిత్యుడై సత్యుడై నిలుచువాడు

తే.గీ. లోకములనెల్ల నొక్కడై సాకువాడు । భక్తరక్షణ దనె యసుర క్తిమీర
గడగి గోపాలబాలకా కార మూని వచ్చె జిరునవ్వు నవ్వుచు నచ్చటికిని. ౩౦౩

వ. ఇట్లుకానవచ్చిన భక్తపరాధీనుండగు భగవంతునిం గాంచి భగీరథుండు పరమానంద భరితుడై స్తోత్రంబుసేయం దొడంగె. ౩౦౪

శా. నానాలోకనికాయముల్ కడుపులోనన్ నిల్పి యిచ్ఛావిధా
నానూనప్రతిభామయుండవయి మాయామోహవిభ్రాంతిసం
ధానంబుం గలిగించి యింతపని పూనన్ వేడ్కనీ కేటికిన్
గానన్ మూఢుని జేయనేల నను గృష్ణా భక్తకల్పద్రుమా. ౩౦౫

శా. నవ్వందోచు సమస్తవైధనమహాండంబుల్ ముఖాంభోజమున్
రవ్వంతన్ ముకుళింప నన్నియు గాన న్రావు లోకాళికిం
బువ్వం బెట్టెడివాడ వీవకద సంపూర్ణప్రభావాఢ్య మా
యవ్వా రాధిక నీకు గూర్మిసతి కృష్ణా భక్తకల్పద్రుమా. ౩౦౬

శా. నన్ను న్నీచు దురాత్ము నొక్కని భువిం గల్గించి సంతాపసం
చ్ఛన్నుఁ జేయగనేల ధర్మమగునే నాతండ్రి యెవ్వాడయే
ని న్నాటు న్నవపాదపాంకురము దా నీరీక యెండించ డ
న్నన్నా పాత్రుడ గాకపోతినాకా కృ॥ ౩౦౭

శా. ధర్మంబుల్ భవదివ్యవాగ్విదితముల్ తండ్రీ యి పేధర్మ మే
దౌర్మానుష్యము కామముఖ్యరిపువేధల్ నాకు గల్గించి నీ
కర్మంబంచు దొలంగియుంటివి పరాకా వింతకా దుర్వ్యథాం
తర్మగ్నుండను నన్ను బ్రోవు మిక గృ॥ ౩౦౮

శా. నేనై యున్నది నీవు నీవనగ నేనేకాదె వేరెద్ది యెం
దేనిం బోయి కనుంగొనన్ సకలమం దీవొప్పి యున్నాడ వ
లైనన్ నీవఖిలజ్ఞతాయుతుడ వే నజ్ఞుండ నీ చిత్రమున్
గానన్ లోకవిరుద్ధధర్మమగు కృష్ణా. ౩౦౯

శా. కన్నుల్ నాలుక ముక్కునుం జెవు లొడల్ గల్గించి తిండేమి సం
పన్నత్వంబు లభించెనాకు త్రిగుణప్రారబ్ధకర్మాళిచే
ఖిన్నత్వంబును బొంది జన్మసమితిం గెంటం గతింగాన న
న్నన్నా న్యాయముగాదునుమ్మ నిను కృ॥ ౩౧౦

శా. ము న్నెవ్వాడనొ వెన్క నెవ్వడనొ నా మూలంబు నేనే యెరుం
గ న్నాకర్మము మంచిదో చెడుదో య జ్ఞత్వంబునం గొట్టింకొం
చున్నాడన్ బ్రకృతావతారమున నెట్లో యెప్పుడో కాన నా
యన్నా యీభవవార్ధి దాటు టది కృ॥ ౩౧౧

శా. సంసారంబనుదానిలోనఁ గలదే సౌఖ్యంబు మూఢాత్మకుల్
హింసాధిక్యమటం చెరుంగకయు దా రేచ్ఛా ధనేచ్ఛాది వి
ధ్వసంబుం బొనరింపలేకయుఁ దదాభాసంబు మన్నించుచున్
హంసల్ పుచ్చెద రేమివింత యిది కృ. ౩౧౨

శా. జ్ఞానానందమయుండ నీ వొకడవే గా నిచ్చయో నీకు న
లైనన్ స్వార్థపరాయణత్వ మది నీ యందే ప్రవ ర్తిల్లె న
జ్ఞానగ్రస్తులకుం బరోపకరణేచ్ఛల్ పుట్టునే యేల నీ
యానన్ నేర్తువు చిత్రచిత్రములు కృ. ౩౧౩

శా. వానం జాణవు నీవటం చెరుగుదున్ బ్రహ్మాండంబులన్
వానిన్ గాల్పఁగఁ గుమ్మరామ మగుచున్ వ ర్తిల్లుఁ దాపత్రయం

ఔనౌ సంతసమాయెఁగాని నిరతం బక్కుండ నత్తాపమం
దే నెక్కొల్పిన కుమ్మరిం గనను కృ॥ ౩౧౪

శా. చీమం దోమను బ్రహ్మనుఁ శివుని రక్షింపం దొరంకొంటి వీ
వౌ మేలే మరి కామ లోభ మదమోహక్రోధమాత్సర్య వి
భ్రామంబుల్ మెడగట్టి యేచెదవు సొంపా యాత్మకింపా జగ
త్స్వామీ వింతలు నీ చరిత్రములు కృ. ౩౧౫

శా. జన్మంబెట్టిదొ నీవెఱుంగవుకదా సంసారతాపత్రయం
బు న్మాన్నె కన వెన్నడుఁ దుదియునుం బొందంగబో వుర్వియం
దు న్నాకుం గల బాధలం దెలియలేదో భక్తపూర్వంబె యై
న న్నమ్మిట్టు లుపేక్షసేయుదువె కృ॥ ౩౧౬

శా. క్షుత్తుం దృష్ణయు బెట్టితేల కుడువం గ్రోలంగ జీవివ్రజో
చ్ఛిత్తిం జూపగ నేల హింసన మొగిన్ జేచేతులం జేయకే
వృత్తిఁ బందుము దాని పాచితములౌ కృత్యంబులం జేయ కీ
షత్తైనం దురితంబు నెట్టుదుమె కృ॥ ౩౧౭

మ. అహహా నీవను లిట్టివం చెరుగ శక్యంబే విషప్రాణియౌ
నహికిఁ భేకము భక్షమయ్యె సహజవ్యావృత్తులఁ లోకమం
దహితుండౌ బలహీను గ్రూరమతి యత్యంతక్రుధోపేతతఁ
బ్రహరింపం గనదేల పాపమగు కృ॥ ౩౧౮

మ. భువనంబేలెడివాఁడొకండు మరి యా భూమీశునిఁ గొల్చుచుఁ
గవలంబుఁ దినువాఁ డొకం డతనికిం దాసుం డొకం డాతనిం
బవలున్ రేయియు నాశ్రయించు నతి యల్పప్రాణి యొక్కండుగా
నవరింపఁ ఫలమేమి యిందు నగు కృ॥ ౩౧౯

శా. నారుం బోసినవాఁడు నీ వౌనఁగఁడే నావంటి దీనుండ యా
సారం బొప్పగ బ్రోవకున్న మరి యేసంసారి నా తోడు నీ
దై రక్షించెడి నందు డంధుని సహాయత్వంబునుం బొంది పె
న్దారిం బో నమకట్టినట్టులగు గృ. ౩౨౦

శా. మన్నుఁ నీళ్లను నిప్పు గాడ్పు నభముఁ బట్టించి బల్ నేర్పుతో
నన్నుం జేసితి వొక్క బొమ్మను నరే నాచేయు కృత్యంబు లె
ల్ల న్నీవి కృత్యములేకదా యయితి నేలా కర్తనే నీదు మా
య న్నాబోటు లెరుంగజాలుదురె కృ॥

శా. ఎన్నో జన్మము లెత్తియెత్తి తుదలే కీరీతి నీ జన్మమం
దున్నాడన్ జగమందు నానదత మేలో కీడో నీ యిచ్చలే
కున్నన్ జేయున దేమియున్నది మ దుద్యోగంబులె ల్లన్ భవ
త్సాన్నిధ్యంబున జక్కజేయు మిక గృ॥ ౩౨౨

మ. కొణుదుం గోడను నల్లి పంచమున గొక్కుం గాదె బేసుం దలన్
బిణుదుం బాలనొసంగు నాబొదుగునం జిట్టెల్క జూరన్ విజృం
భణవృత్తిం జరియించి బాధ లొనరింపంజేయు నీకార్యల
క్షణమే లోకమునం దఘం బిడుట కృ॥ ౩౨౩

మ. కలదే నీకును బక్షపాత మటులం గాకున్న నొక్కండు భూ
వలయం బేలగ నొక్క డాకలములం భక్షింపనేలా మహా
బలు డొక్కండు కృశుం డొకండు మరి సంపన్నుం డొకం డెంతయున్
జడుఁ డొక్కండయి యుండ నేమిటికి గృ. ౩౨౪

శా. కాకిం గోయల కూసినట్టులనె చక్కం గూయగా జేసినన్
నీ కే బాధకమో యెరుంగనుగదా నీయింద్రజాలంబు నీ
కేకా కెవ్వనికిం దరంబు మది నూహింపంగ భేదంబు ల
య్యా కల్పింపగ నేటికో తెలియ కృ॥ ౩౨౫

శా. నన్నాయింద్రియపంచకం బనెడి దొంగల్ గొట్టి మోహాంధతన్
గన్నుల్ గానను సంచితాఘముల రొక్కంబేల చిక్కించుకో
రన్నా జ్ఞాన లవంబు బోచికొని రేమందున్ విచిత్రప్రభా
వౌన్నత్యంబగు నీ ప్రభుత్వమిది కృ, ౩౨౬

మ. తెలివా సన్నము గర్వమావలము నీ దివ్యాంఘ్రిసేవారతుల్
తలజూపం దలపెట్టరావు వనితా రమ్యాననా వీక్షణా
దులపై గోర్కులు మెండు భక్తజనులం దూషించి దుష్టావళిన్
గలయంబోయెద నెట్లు మాన్పెదవొ కృ॥

శా. నీకు న్మ్రొక్కెద నిన్ను గొల్చెదను నా నేరంబు మన్నింపవే
నా కేమార్గము జూపెదో యడవిలోనం బెట్టెదో పత్తన
ప్రాకారాంతరమందు నిల్పెదవొ నీ భక్తుండనై యుండగా
నా కేలోపము తెల్పుమా యికను గృ॥ ౩౨౮

శా. నీపాదాబ్జము నమ్మినాడను దపోనిష్ఠన్ సహస్రంబులే
లా పాండిత్యములేటికిం ధనము లేలా రాజ్యభోగంబు లే

లా పూర్వార్జిత పాపసంచయమునెల్లం ద్రోచెదన్ దావకీ
యాపారేద్ధదయాసముద్రమున గృ॥ ౩౨౯

శా. నిత్యం బెయ్య దనిత్య మెయ్యది సదా నీ వొక్కడై యుండగా
నత్యాశ్చర్యముగాదె వేరొకటి నీయం దున్నదన్నం దదీ
యాత్యాగంబు పొసంగుసన్న సకలవ్యాప్తం బనిత్యంబు నా
సత్యం బెట్లగు సత్యనిత్యుడవు కృ॥ ౩౩౦

శా. వాండ్రు నీండ్రును మీరురు మేమను వృథ గ్భావం బసత్యంబ పె
క్కండ్రే నిక్కపటంచు నొక్కొకరి ప్రక్కన్ శూన్యమే యుండునం
చం డ్రా శూన్య మశూన్యమౌట యెటు లాహా చిత్ర మూహింపగన్
తండ్రీ యద్వయసత్స్వరూపుడవు కృ॥ ౩౩౧

మ. సగుణత్వంబును నిర్గుణత్వమును నిచ్ఛారూపకావస్థలై
తగు నీకున్ సగుణస్థితిన్ భువన విస్తారంబు గల్పించ పెన్
వగలెల్లన్ జగమెల్ల నింపెదవు నానా నామరూపాదులన్
దగులే దాసుడ నన్ను నేలు మిక గృ॥ ౩౩౨

మ. నినుసేవింపని దుర్జనుండు జడులన్ సేవించు నీ వందనం
బును గావింపని మూర్ఖు డల్పుల పదంబుల్ పట్టు నీ సత్కథల్
వినగా నోపనివాడు వారవనితాలీలార్థముల్ వీనులన్
బనిగా నించు గృతాంతు జేరుటకు కృ॥ ౩౩౩

మ. పనిలేకున్నపుడైన ద్యూత మృగయావ్యాపారముల్ గైకొనం
జనుఁగా కజ్ఞుఁడు నిన్ను బాడ నినుమెచ్చన్ నిన్ను సేవింప నీ
యనఘప్రాభవలీలలన్ వినఁగ రాడయ్యో వరాహంబు చం
దనముం గోరునె పెంట గోరుక్రియఁ గృ॥ ౩౩౪

శా. ఆనందంబున నిన్ను బాడికొనుచున్ హా యీశ్వరా కిల్బిషా
త్మాన మ్మామవ యంచు గద్గదికతో దైన్యంబుతో నోర్పుతో
మేనెల్లం బులకాంకురంబు లెనయన్ బ్రేమంబుతో భక్తితో
ధ్యానంబున్ బొనరించు రక్తుఁ డిలఁ గృ॥ ౩౩౫

శా. నే వేదంబులు వల్లెవేసితిని నేనే శాస్త్రవాదంబులన్
గావింపంగ సమర్థుడన్ గవిని నేనే నాటకాలంక్రియా
ప్రావీణ్యంబన నాదకా యనుచు గర్వచ్ఛన్నచిత్తుల్ తుదిన్
దావుం గానరు నీకటాక్షమున దృ॥ ౩౩౬

మ. నిను భక్తావనదీక్షు శుద్ధు నచలుఁ దివ్యుఁ గృపామూర్తి న
త్యనఘుం జిత్తమునందు నిల్పికొని నిత్యధ్యానముం జేయ కా
ధనదారాది విచారభారమున బాధంజిక్కి మూఢుండు నీ
ఘనకారుణ్యము జెందగా గలఁడె కృ॥ ౩౩౭

శా. త్రోలుంబొమ్మకు త్రాళ్ళు గట్టి దెసలం దూలించి యాడించినం
గాలుం జేతులు ద్రిప్పు నవ్వు నెగయుం గయ్యంబులం జేయుఁ దా
వ్రాలుఁ లేచును గూరుచుండునటు లొప్పుఁ సూత్రముఁ బూను నీ
యాలం బంబున లోకులాడుదురు కృ॥ ౩౩౮

శా. నీమాటల్ శ్రుతులాయె నీసుతుడు వాణిఁ నోటనే యుంచె నీ
ధామం బంచితవల్లవీజనకరోద్యద్వల్లకీసుస్వరో
ద్దామం బాయెను నీవు నిత్యమును శబ్దబ్రహ్మరూపుండవే
నామాటల్ నిను మెచ్చ నెంతటివి కృ॥ ౩౩౯

శా. మాయాతీతుడవైన నీవు మములఁ మాయం బడంద్రోయఁగా
న్యాయంబా విమలప్రబోధ మమితంబై యుండ నద్దేల మా
కీయంజాలవు లోభముం గలదె నీ కీవింత లేమందు నీ
సాయంబే మది నమ్మియుంటిఁగద కృ॥ ౩౪౦

మ. కులముం గోత్రము తల్లిదండ్రులును నీకుఁ గల్గిరే లోకముల్
కలిగింపం దొరకొన్ననాటి కెచటన్ గాలూనితో గాయముం
గలదో నీకునుఁ గోశపంచకము నన్నప్రాణముఖ్యమ్ము లెం
దలరెంబో యిది దొడ్డగారుడము కృ॥ ౩౪౧

మ. కౌమరుం బ్రాయము గోడెకానితనముం గోపీజనంబుల్ వినో
దము రాసాదికచేష్టితంబులును రాధాసంగమానంగ సౌ
ఖ్యము కర్ణామృతవేణుగానము భుజంగప్రాశిపింఛావతం
సము నేతాదృశలీల లేమిపని కృ॥ ౩౪౨

మ. తెలియం జాలను నన్ను నే నకట నీ దివ్యప్రభావంబులం
దెలియంబూనుట పిచ్చుగుంటు తమి నద్రిం గూటముల్ మెట్టనం
జలువెట్టం దొరకొంట జాడ్యకృతపాశశ్రేణి బంధించి న
న్నలయింపందగునే నతుండగదె గృ॥ ౩౪౩

శా. నేరం బేమియొనర్చినాడ నయినన్ నీబిడ్డగానా యికె
వ్వారల్ నన్ను భరింతు రేది గతి తాపగ్రస్తసంసారపా

ధోరాశిం బడఁద్రోచి వేడుకను గాంతోగిల్లి ముద్దో మహా
ప్రారంభం బెదిసేయలేదు తగు గృ॥ ౩౪౪

మ. అపురా తెల్విఁకొరంత యాసలకు లే దంతంబు మర్త్యాళి కి
త్తెపులుం బెట్టుట కెద్ది కారణము పృథ్విఁ గాళ్ళుచేతుల్ మొలం
గవునుం బొజ్జను గుత్తుకఁ బుజములఁ గావించి శీర్షంబు గూ
ర్చపు నీ మొండెపుబొమ్మ లేమిపని కృ॥ ౩౪౫

మ. నను నీచుం జనియింపజేసితివి యజ్ఞానాంధకారంబులో
మునుగంజేసితి వాస్వరఁ రిపులము న్మ్రంబెట్టి తాపత్రయం
బున గూలం బడఁద్రోచితీస్థితినిఁ ద ప్పుంజేసె పీడంచు నిం
కను నాకు న్నరకంబుదప్పదొకొ కృ॥ ౩౪౬

మ. తృణముఁ మేరువు చీమయుఁ విధియు బృధ్వీగోళముం గొంచెమౌ
నణువుఁ గాలియు సంద్రముఁ సురపురం బాసత్యమున్ సొంతముల్
గణియింపం గుణసంగవృత్తులయి యేలా యాళ కంతంబు లే
దణుమాత్రంబును గారణం బెరుగ గృ॥ ౩౪౭

మ. పదివే లేండ్లు తపంబుజేసినను నీ భక్తుండు గా కెట్లుభా
స్వదుదుజ్ఞానసమేతుడయ్యేడిని నీ స్వత్వంబు జ్ఞానంబు దు
ర్మదమోహాంధులగొల్చి తంత్రగత ధర్మంబుల్ గొనంజాలుగా
కదిరా నీ కలిమిం గనందరమె కృ॥ ౩౪౮

మ. పశుపాలత్వము బూని గోజగతిలో వాసంబు గావించుటఁ
విశదంబే భవదీయవృత్తి పలుకన్ వేయేల మర్త్యాళినాన్
బశుసంఘంధా తదీయరక్షణమునఁ దండాధికం బొప్పు నీ
యశుభాశా సహితంబు పాశవము కృ॥ ౩౪౯

శా. ఏదో కొంచెము జ్ఞాన మిచ్చితివి నే నీజ్ఞానలేశంబుతో
నీదన్ బుద్ధను నమ్మి యేటబడినట్లే దుఃఖపాథోనిధిన్
బ్రాదుర్భూతభవద్దయాప్లవము సంపాదింపలేనా సదా
నాదానంద వినోదవిశ్వనుత కృ॥ ౩౫౦

మ. ధరణిం బెబ్బులిఁ గాంచి జంబుకము వాతంబెట్టుకొన్నట్లు భా
స్వర విజ్ఞానులబోలె నేను దపముం జల్పం దొరంకొంటి నా
తరమా నీ మహిమంబెరింగికొన గంతఁ గన్నులంగట్టి తె
న్నరయంబూనుటగాదె నాతపము కృ॥ ౩౫౧

శా. ఎట్టో నీగుణవర్ణనంబు గనలే నే జాడ నీపాదముల్
బట్టంగల్గుదు మోహపాశములచే బద్ధుండనై యుంటి నే
తట్టుంబట్టెద నుట్టికిన్నెగయ జేతంగాదు స్వర్గంబునుం
గట్టా బట్టెదనే దయం గనుము కృ॥ ౩౫౨

శా॥ కోరన్ రాజ్యము భోగముల్ గజములన్ గుఱ్ఱంబులన్ బ్రోన్నతా
గారాట్టాలక గోపురధ్వజములం గాంతా కుమారార్థముల్
జీరల్ భూషణముల్ భవత్పదరజోలేశంబు నే గోరెదన్
జారుశ్రీ నిడికొందు మస్తమున కృ॥ ౩౫౩

మ॥ చిఱుతన్ జ్ఞానవిహీను దుష్టచరితున్ క్షీణక్రియున్ గోపనుం
బెఱలన్ మోసముసేయువాని గతినుం బేదం దురాచారునం
దరు దూరందగువాని బందను నిరర్థప్రక్రియున్ నన్ను బ్రగ
చ్చుఱ నెట్లేలెదవో యెఱుంగగదె కృ॥ ౩౫౪

మ॥ బరువా తీగెకు గాయ నీవలన రూపం బందితిన్ నీవకా
కొఱు లెవ్వారు భరింత్రు నన్ను మహనీయోద్యోగబాహుళ్యతన్
మరతే యిట్టు లఖండబోధహితసామర్థ్యం బబద్ధంబె క్ర
చ్చర గారుణ్యముగల్గి యేలు మిక కృ॥ ౩౫౫

శా. క్రోఁతిం బ్రహ్మను జేయు నీకరుణకుం గ్రూరున్ సదాచారవి
ఖ్యాతుం జేయుటె దుస్తరంబె భవితవ్యం బెట్లుగా నున్నదో
యాతంకం బిక నేమి యట్లయగు నీ యంఘ్రిద్వయిన్ మాన వి
శ్వాతీతాత్మక నన్ను నేలు మిక కృ॥ ౩౫౬

శా॥ పాలన్ముంచెదొ నీళ్ళముంచెదవొ నీ పాదాబ్జముల్ నమ్మితిం
జాలన్ మ్రొక్కగ గాళ్ళ దన్న దగునే సర్వేశ నా పాపముల్
వ్రీలం జేయవె మోహపాశముల పేర్మిం గోసి రక్షింపవే
చాలున్ నీదు వినోదవైఖరులు కృ॥ ౩౫౭

మ॥ హరి భక్తాగ్రణి యంచు బేర్వడిన ప్రహ్లాదుండు నీ కేమి చు
ట్టరికంబుం బ్రకటించె నే మొసగె గట్టా నా యదృష్టంబెకా
కరవిందాసనువ్రాలు నా నొసటబాగై యున్నదో లేకొ యె
ట్లరయంబోయెద మ్రొక్కెదం గనుము కృ॥ ౩౫౮

మ॥ పరమప్రీతి భవత్పదాబ్జనతులన్ భావించు వజ్రాంగిపై
స్ఫురితజ్ఞానికి జీవగఱ్ఱవయి సంభూతాఖిలాండవ్రజో

ద్ధరణోద్వృత్తికి బ్రహ్మకాయవయి మాత్సర్యగ్రహస్థదు
ర్నరరింభోళికి బాణగొడ్డమవు కృ॥ ౩౫౯

మ॥ స్వజనుండంచు బరుండటంచు గలదే స్వామీ చిదానంద నీ
కజరుద్రాదులు స్వీయులా వ్రజగణంబా యార్తులా భక్తులా
సుజనోత్తానములా యనంతముఖులా సూర్యగ్రహవ్రాతమా
త్యజియింతే యటులైన మమ్మురక కృ॥ ౩౬౦

శా. కర్మారంభుడె మానవుండయినచో గర్వంతయున్ లేదు నా
యోర్మిన్ నీ భజనంబునన్ ఫలము నీ వుద్యోగివై కర్మముల్
బేర్మింజెంద నశింపజేయగల వేనిన్ బ్రోవుమీ నన్నికన్
స్వార్మానుష్యపదంబు లేమిటికి గృ॥ ౩౬౧

శా. తప్పా నాది భవత్పదాబ్జములచెంతంజేరి నీవాడ నా
యప్పా యొప్పులకుప్ప రాగదర మోహాంబోధి దాటించు మేల్
తెప్పా యంచును విన్నవించుకొనుచున్ దీనుండనై వేడుటల్
చప్పుళ్ళేటి కటంచు ద్రోయకుము కృ॥ ౩౬౨

శా. మొత్తో దేవుడ కావుమా భవభయంబున్ దీర్పుమా వేగమే
వెత్తో మొత్తియొ నీపదాబ్జములు సేవింపం దొరంకొంటి నే
జిత్తుం బస్పు మటంచు గోపమున నీక్షింపంగబో కట్లయే
సత్తెత్తంగలనే కృపంగనుము కృ॥ ౩౬౩

శా. పెట్టం గర్తవు కొట్టగర్తవు తగుంబో నీకుస్వాతంత్ర్య మి
క్కట్టుం బొందెడినాడు సేవకు నుపేక్షం ద్రోయగా జెల్లునే
యెట్టున్ నీకును ధర్మమెక్కడిది యంటే బూర్ణవిశ్వాసముం
గట్టా నీయెడ నెవ్వరుంచెదరు కృ॥ ౩౬౪

శా. పెట్టెల్ నించితి సంచితాఘనమున నీ పేరెత్తితి న్నేటిక
దట్టే యున్నదె నిన్ను గొల్చినను నా యయ్యా కటాక్షించుమా
బిట్టానం మొఱపెట్టు నన్ను విడువన్ బేర్వాసినీ కెచ్చునే
నట్టుం జేయక బ్రోవుమయ్య నను గృ॥ ౩౬౫

శా. నీవే దాతవు నీవె త్రాతవు మరిన్ నీవేకదా హర్త వే
త్రోవం జూచిన నీవెతక్క యిక నేరున్ లేరు లేరిందు స
ర్వావష్టంభుడవీవె నిన్వడచి యే యల్పాశ్రయాలంబమున్
గావింతుం దయజూచి యేలుమిక గృ॥ ౩౬౬

శా. కన్నారన్ నినుజూచి మ్రొక్కి పులిప్రక్కం జిక్కి జోరీగనై
యున్నాడన్ భయమేమి నాకు భవసంయోగంబు బాధించునే
యిన్నాళ్ళుంబలె నట్టులేయయిన నీ యీశత్వమున్ నీ ప్రభా
వౌన్నత్యంబును మెచ్చువారెవరు కృ॥ ౩౧౩

శా. రాధాదేవి సమస్తమైన యుపచారంబుల్ తగం దీర్పగా
మేధావుల్ గరుడాదు లూడిగముల న్మెప్పించగా రచ్చలో
వేధోముఖ్యులు స్తోత్రపాఠములు గావింపంగ గోలోకసం
ధాధోరోన్నత సింహపీఠి దగు కృ॥ ౩౧౪

శా. పూలుం బత్తిరి తెచ్చి నీ శిరమునుం బూజింపగానైన నే
జాలన్ సర్వలతాప్రతానసుమభూజభ్రాజి వేధోండముల్
నీలో నుండగ నీకు బూలిడుటకంటెన్ వెఱ్ఱి వే రెద్ది మి
ధ్యాలాలిత్యము సూపనేమిటికిఁ గృ॥ ౩౧౫

శా. నైవేద్యంబును బెట్టనేరజుమి నానాలోకసంవాసులౌ
జీవుల్ నీ విడునట్టి యన్నమున నే జీవించుచుండంగ ను
ద్దావజ్ఞత్వము సూపనేమి ఫల మాహారంబు నీకిచ్చి నా
వ్యావృత్తు ల్భవదంఘ్రిసేవ లిఁక కృ॥ ౩౧౬

శా. దారుల్ కొట్టెడివాని కర్థము నసత్యవ్యగ్రవాగ్వాది కా
గారౌన్నత్యము నిర్దయాత్ములకు భోగంబుల్ నరఘ్నాళికిం
భూరాజ్యంబును నిచ్చి నీదు చరణాంభోజాతమున్ నమ్మి నన్
బారందోలుట నీకు ధర్మమొకొ కృ॥ ౩౧౭

శా. నీ చాతుర్యములెల్ల దోచెడి జగన్నిర్మాణవైచిత్రి గా
ర్యోచిత్యంబున శబ్దరూపరసగంధాదిప్రసంగక్రమ
ప్రాచుర్యంబున జంతుసంతతి క్రియారంభంబులన్ గాన నే
యాచింతున్ భవదీయ సేవసము కృ॥ ౩౧౮

శా. పోరుం బెట్టినగాని బాలునకు నీ బో దంబ దుగ్ధంబులన్
ధీరోదాదుడవైన నీవు పరమార్తిం జిక్కియున్నట్టి న ౩౧౯
న్నేరీతిం బరికించెదో కరుణతో వీక్షించి రక్షించు మ
య్యా రాజీవదళాక్ష దేవహిత కృ॥

శా. నీమాహాత్మ్యము సర్వలోకసమితి విన్నెందెన్ నిరాతంకమై
నామందత్వము నన్నెపట్టుకొనియుండం జెల్లునే నీలస

న్నామోచ్చారణఁజేసి దాని దరుమంగాలేనె యోరాధికా
స్వామీ లోకహితైకకార్యభర కృ॥ ౩౭౪

శా. ఒల్లన్ దుఃఖమయంబు నీచమును నౌ నుర్వీశ్వరత్వంబు నే
నొల్లన్ నిత్యముగాని స్వర్గపద మత్యుత్సాహముం బొందెదన్
త్వల్లీలాకథనంబు త్వద్భజనమున్ త్వద్దాససాంగత్యమున్
గల్లల్ గావు కృపాబ్ధిదేల్పుమిక కృ॥ ౩౭౫

శా. భక్తశ్రేణికి పట్టుగొమ్మ వనుచుఁ బ్రార్థించితిన్ నిశ్చలా
సక్తిన్ నాకది దోషమా యికను నీ సామర్థ్యసౌలభ్యసం
యుక్తిం జూచెదగాక నీ యశముకల్లో నిక్కమో యేది నీ
శక్తిం జూపుము నన్ను బ్రోచుటకు కృ॥ ౩౭౬

శా. కృత్యాకృత్యవిచారమింతయును లే దీలోకమం దంతయున్
జాత్యంధుంబలె నేదియుం గనక రాజ్యంబేలుచేపాటి నీ
భృత్యత్వంబువహించి కొల్చుచును సంప్రీతిన్ మహాజ్ఞానని
ష్పత్త్యుద్ధాముడనౌట మేలుగదె కృ॥ ౩౭౭

శా. నీ నామస్మరణంబు గోరును మృడానీభర్త హాలాహల
స్థానంబైన గళంబుచే దుడుగనో సర్వామరుల్ కోరనే
లా నేనెంచెద గట్టిగా నమృతధారామాధురి న్మించెనం
చానందాత్మత చిత్కళాసహిత కృ॥ ౩౭౮

మ. అవతారంబుల నెత్తియెత్తి కుజనవ్యాపారముం జేసిచే
సి విధానజ్ఞుల నేలియేలి బలుగాసిం జెందనేలా రమా
ధవ గోలోకసుఖంబుకంటె భువనత్రాణంబు నీకెక్కువా
యవురా నీదయ కట్లు సేయదగు గృ॥ ౩౭౯

శా. ఆడంబాడగలేనినాడు లోకవేయం దిందు గల్పించి నా
వేడానాలుకయొక్కడేయిడితి యే రీతిన్ భవత్కీర్తన
క్రీడందేలుదు నీదుమెప్పువడయం గించిజ్ఞుడ న్నన్ను నే
జాడన్ బ్రోచెదొ నీదె భార మిక కృ॥ ౩౮౦

శా. పప్పు ల్దప్పళము ల్భుజించి కడుపుల్ పైపైకిఁ బొంగారగా
పప్పుల్సాపడి త్రేపిత్రేపి తనువుల్ పాలింతురే లబ్ధికై
మొప్పల్ ముప్పున నిప్పునం బడగనో భూస్థాపనం జేయనో
యప్పాతం బొనరింపనో యెరుగ కృ॥ ౩౮౧

శా. సాధుశ్రేణి భవన్ముఖోదితమహాశబ్దప్రమాణజ్ఞులై
యాధివ్యాధిజరామరాదిమయ కాయం బాసలోనుంచ కో
రాధానాథ ! రథాంగపాణి ! యనుచుం బ్రార్థించి ముక్తాఖులై
సాధిం బ్రచ్యుత దివ్యబోధమును గృ॥ ౩౮౨

మ. అనవచ్ఛిన్నము దేశకాలములచే నాద్యంతశూన్యంబు చి
ద్ఘనమున్ సత్ప్రచురంబు సంతతసుఖస్థానంబు బ్రహ్మం బటం
చును వేదాంతరహస్యముల్ తెలుపు నన్నుంగూర్చి బ్రహ్మాహమం
చననో భక్తుడనై మెలంగుదునొ కృ॥ ౩౮౩

శా. నీలో నైక్యమునొందుటే సుఖమొ నే నీసన్నిధిం జేరి యి
ష్టాలాపంబుల బ్రొద్దుబుచ్చుటయ శ్రేయంబో విచారింపగా
జాలన్ నా కెటులైన నిష్టమె యదోషంబైన సౌఖ్యంబు నా
కాలీలం ఘటియింపజేయు మిక కృ॥ ౩౮౪

మ. విలసద్భావరసాద్యలంకృతులతో వృత్తంబులం జెప్పి ని
న్నలరింపంగలవాడఁగాను మరి యుద్యద్వల్లకీవేణుగా
త్రలసద్గానముచే స్తుతింపగ సమర్థంబు లేదెట్లు న
న్నలసుం జంచలు నజ్ఞు నేలెదవు కృ॥ ౩౮౫

మ. పలుమాట ల్పనియేమి దర్శనము లొప్ప న్నేర్చి వాక్యార్థముల్
వెలయింపంగలవారు నిన్నుగను తెల్విం గోరియేకాదె యు
క్తులు ప్రత్యక్షులు పూర్వపక్షవినియుక్తుల్ శుద్ధరాద్ధాంతముల్
గలయంగొట్టుదు రేనుభక్తుడను కృ॥ ౩౮౬

శా. అద్వైతంబని ద్వైతమంచని విశిష్టాద్వైతమంచున్ మహా
విద్వాంసుల్ పలుపోకల న్నడచి రా భేదంబు లజ్ఞానకా
ర్యద్వేషాశ్రయము ల్తలంప నరుడెట్లైనం భవత్పాదకం
జద్వంద్వంబును బట్టగావలయు కృ॥ ౩౮౭

మ. అవనిం దారులు నూరు జూపడిన గమ్యస్థాన మొక్కండయై
తివురంగానమె నీవె గమ్యుడవు నా తెన్నుం బొడంగాంచి యి
ప్పొవరుంగొన్నగరాసి మానిసిని తప్పుం బెట్టెదో మూర్ఖమ్మా
నవుడ వచ్చితి నెట్టులో దరికి కృ॥ ౩౮౮

శా. దివ్యజ్ఞానముసున్న నీచరణ భక్తిన్ దీపి మెండాయె బల్
దివ్యజ్ఞానమె మేలు నీచరణభ క్తిన్ దీపి మేలోసదా

దివ్యజ్ఞానము నీదె నీచరణభక్తిం దీపినాదే యికన్
నవ్యానందము నీవు నాకిడుమ కృ॥ ౩౮౯

శా. మంచో చెడ్డయొ నిన్ను వేడితిని కుంభత్సంభవాంభోధిలో
ముంచో ముంచకయో భవచ్చరణముల్ పూజించి సేవించి నీ
పంచన్ జానిసమానిసిం జలుపుమీ ప్రార్థించెదన్ నన్ను దు
స్సంచారంబుల బెట్టబోకు మిక కృ॥ ౩౯౦

మ. రతనంబుల్ గలచోటనే కలవుగా రాళ్ళందులో భేద మే
గతి బ్రాపించె నెరుంగ శక్యమె సుధాకల్లోలినిన్ బ్రచ్చ ను
న్నతి హాలాహల మెట్లు పుట్టె నవురా నానాత్వముం గారణై
క్యతయున్ నీపనులందె గానఁబడు గృ॥ ౩౯౧

శా. నీదేమాయలమ్మాయదే సకలమౌ నీరేజగర్భాండ మిం
కే దిందున్నది పాలదే పెరుగు స్వామీ పెరుగదే చల్ల యు
న్మాదగ్రస్తుల మైతి మే మది భవ న్మాయామహత్వంబె దే
వా దీనుండను నన్నుబ్రోవుమిక కృ॥ ౩౯౨

శా. నీకు ల్చెప్పగ నేర్చు దండమును బాణిం బెట్టగా నేర్చు వి
ఖ్యాతప్రౌఢి బహుప్రఘాతమును జేయన్ నేర్చు నీయందునున్
జేతోవృత్తిని నిల్పి నిశ్చలత ధ్యానింపండు వాడెట్లవి
ద్యాతీతుండగు దెల్పవే కరుణ కృ॥ ౩౯౩

శా. నిన్నుం గీర్తనసేయఁగా శ్రుతులకున్ వేదాఖ్య వచ్చెంగదా
యెన్నంగా విది ధాతువర్ధము మరొండే జ్ఞానమేకాక నా
యన్నా నిన్నును గొల్చువారలకు జ్ఞానాధిక్యమే లాభమౌ
నన్నుం జ్ఞానినిజేయ వేమిటికి కృ॥ ౩౯౪

శా. నీకాలేటికి మాయగాక కలిసెన్ నీతోడ నైక్యస్థితిన్
జోకంబూనెడి రాధకానియది యస్తోకంబుగా బెత్తనం
బాకట్టెం జగదండగేహమున మా కావంత సందీదు నిన్
వైకుంఠేశు భజించు టెట్లికను కృ॥ ౩౯౫

శా. ఏలోకంబున నీవులేవు సకలం బీవున్నచోటేగదా
గోలోకంబున బ్రీతి మిక్కుటమె నీకుం జూడ గార్హస్థ్యధ
ర్మాలంబంబును సేవక ప్రజవినోదార్థంబులున్ మెండటం
చాలోచించెద నన్నుబ్రోవు మిక కృ॥ ౩౯౬

శా. ఇల్లుం బెళ్ళము గొడ్డు దొడ్డి మడి తో టేరుఁగా సమస్తంబు రం
జిల్లంజేసక గోప్రపంచమున నుఱ్ఱింబెట్టి సంసారివై
యుల్లాసంబున భక్తసంతతులతో నొప్పార నీభాగ్యమే
చల్లంగా మము నేలుగావుతను గృ॥ ౩౯౭

శా. నీవేకాక మరెవ్వ రీ జగమునఁగా నీ చిక్కు విప్పంగలా
రీ విశ్వంబున విత్తె ముందొ మరి చెట్టే ముందొ సాధింప స్వే
ఛ్ఛావాదంబులు చేసి చేసి యనవస్థన్ జిక్కిరే కాక వి
ద్యావంతుల్ కనఁజాలిరే తెలుపు కృ॥ ౩౯౮

శా. శృతి ప్రామాణ్యము నీ స్థితంబునకు నా శృత్యర్థము న్నీవ ప
ల్కృతిగానన్ మహితప్రమాణత గనెన్ గీర్తింప నున్మాదవి
చృతి బెండ్లో మరి బెండ్లికిన్ బిదప నే శాంతిల్లు నున్మాద నిం
ద్యత యన్యోన్యము నాశ్రయంబులగు కృ॥ ౩౯౯

శా. మాకుఁగా గంటికి గానరాని యణువుల్ మాన్యుఁగా నినుఁగా లోగొనుఁగా
లోకేశాండకరండమండలము నీలో నుండు నీ వాదియో
లే కాదిం బరమాణుపుంజమొ లన ల్లీలం బ్రకాశించెనో
నా కేరీతి నెరుంగ శక్యమగు కృ॥ ౪౦౦

శా. తిరమా భోగము సత్యమా జగము నీ దివ్యాంఘ్రిపంకేజబం
ధురమాధ్వీరసపానమత్తుల కుపాధు ల్లేవు నిత్యుల్ నిరం
తరగోలోకసుఖావహప్రచురబోధాశాలులై యుంద్రు వే
దరహస్యార్థము లెత్తిచెప్పెదను కృ॥ ౪౦౧

శా. సుతుడుఁగా దండ్రియు బెండ్లముఁగా మగడు రాజుం బంటు మా మల్లుడుఁగా
హితుడుఁగా స్నేహితుడుఁగా బురోహితుడు గేహిశ్రేష్ఠ డన్యోన్యసం
గతి సమ్మర్శము మాని పోరుదురు నిక్కం బర్థలోభంబునఁగా
గతి నీవే యనువాని కేవెఱపు కృ॥ ౪౦౨

శా. ఓగుం బాగులు నీ వెరుంగవని నే నూహింప న న్నేల భూ
భాగంబందు జనింపఁజేసితివొ నావల్లఁగా ఫలంబేమొ యే
లా గెచ్చో నెపు డేది చేసెద నదెల్లఁగా నీకె జ్ఞాతంబు నా
నాగోప్యార్థము లున్నపేటికవు కృ॥ ౪౦౩

శా. ప్రావృణ్మేఘము పట్టుమన్న బచరింపంబోదు వల్దన్న ధా
రావిస్తారము మాన దట్టులనె యౌరా నీకృపాధార రా

ధావామాధరబింబకీర పటుబోధాశూర ధీరా ననుం
గావం బ్రమొక్కెద జూడరా యికను కృ॥ ౪౦౪

శా. పినతాతల్ కపిలర్షి శాపమున నిర్భిన్నాంగులై భస్మమై
చన రత్యున్నతలోకవాసమునకున్ స్వామీ కృపాశాపతో
దను గంగాలవమిచ్చి ప్రోవగదె శ్రీ ధామా పితౄణంబు వా
యను నీవేగతి యంచు నమ్మితిని గృష్ణా భక్తకల్పద్రుమా॥ ౪౦౫

క. అని యిట్లు పలువిధంబుల । గొనియాడగ గృష్ణు డలరి కోరిన వరమి
చ్చి నగుచు ముదమున దనకడ । ఘనశోభం దనరు గంగ గని యిట్లనియెన్. ౪౦౬

క. భారతి శాపవశంబున । నౌరాపగ యవని కేగి సగరుకొమరులం
భూరి శుభలోకమునకుం । జేరి సుఖింప వేగ జేయుము పొమ్మీ॥ ౪౦౭

క. నీ నీరంబుల నెవ్వడు । స్నానం బొనరించు వాడు సాలోక్యసుఖ
శ్రీ నొందు నాదు దయచే । నానాజన్మార్జితాఘ నాశము గలుగున్. ౪౦౮

క. నీ గాలి సోకినంతనె । రాగ ద్వేషాది దోష రాహిత్యమగున్
బాగుగ నిను స్పృశియించుట। తో గలుగున్ నూరు మేల్క్రతువుల ఫలంబుల్. ౪౦౯

క. సామాన్య దినస్నానము । చే మఖశతఫలము గలుగు చెలవముగ శ్రుతి
ప్రామాణ్యమున నమావా । స్యా మన్వంతర ముఖముల శతగుణ ఫలమౌ. ౪౧౦

సీ. రవిసంక్రమణముల రవి శని గ్రహణాయనాదుల బూర్ణిమ సప్తమిని మ
హోదయంబందు నర్ధోదయంబునను జాతుర్మాస్య నక్షయ దురితనాశ
కంబును బుణ్యలోకప్రాప్తిహేతుకంబును నగు నీయందు జనుడు స్నాన
మాచరించినయేని మరిగాక నీవేగి ధరణీతలంబున దిరుగు మనిన

తే. గీ. నిభునిమాటలు వినుచు నవ్వి బుధగంగ । భక్తి నమ్రయగుచు జేరి పల్కె దేవ
తావకీయమహాజ్ఞ నౌదలను దాల్చి । యరిగెదను బృథ్వి కొక మన్వి నాలకింపు. ౪౧౧

క. పాపులు తమపాపంబుల । నాపాలొనరింతు రాది నారాయణ నే
నేపగిది ద్దోషంబుల । బాపుకొనంజాలుదాన వచియింపగదే. ౪౧౨

క. ఎన్నాదనుక భువిపై। నిన్నాత్మస్మరించుకొనుచు నే నుండెద నా
పన్నశరణ్యా తెల్పుము నన్ను గృపామతిని జూచి నా విధులెల్లన్. ౪౧౩

వ. అనిన విష్ణుండు ౪౧౪

సీ. నా కళారూపంబునం బ్రభావోన్నతి లవణవారాన్నిధి లలితమూర్తి
యగుచు లక్ష్మిరూప వగు నీకు బ్రియుడగు నీకు దగిన వాడు నిర్మలుండు

నిఖిలపూజ్యుండు మానిత కీర్తి శాలియు సరిమించి సిరిగాంచి సరసలీల
నెసలారుసదిగాక యెంతకాలము సరస్వతి మొదలగు నదుల్ సౌఖ్యవృత్తి

తే. గీ. భారతంబున బ్రఖ్యాతి బడయనేర్తు। రంతకాలంబు నీవును నంద నుండు
మింతయేటికి నైదువే లేండ్లు గలిగి విమలగుణవతి సంతోషవిస్తృతిమతి. ౪౧౫

తే.గీ. భారతంబున గల జనుల్ పరమనిష్ఠ। నిన్ను సేవించి స్నానాది నిరతులగుచు
నఘములను గెంటుదురు భవదంబుకణము। పరమపావనమై స్వర్గఫలము నిచ్చు. ౪౧౬

ఉ. గంగను మానవుండు మునుగంగలడేని పవిత్రుడై చెలం
గంగ నఘాళియెల్ల దొలగంగ సుధాశనపాళి యాత్మబొం
గంగ విమానమెక్కి పరగంగ వికుంఠపురంబులోనికే
గంగల డంతమందు దిరుగం గన డీ భవపాశబంధమున్. ౪౧౭

ఉ. మేలిమి గంగలో మునుగ మేలిమిబంగరుతో బనేమి స
మ్మేలితమైన ప్రాభవము మే లిక జెప్పఁగనేల భూతల
మ్మేలి సుపర్వనాథుపుర మేలి సరోరుహగర్భపత్తన
మ్మేలిన హెచ్చధేనుపురమేలిన నా దరి జేరు నంగనా. ౪౧౮

ఉ. అంగన యాత్మభక్తి వొలయంగను మర్త్యుడు గంగ నీటిపా
యం గని చేరడిగ్గి వెలయంగ గలంగ గలంగ నీతపే
యంగను బావనంబయిన యంగముగల్గి యఘాళియెల్ల బా
యంగ ననుం గనుంగొనెడి యంగదియంగదగొంగయై తగున్. ౪౧౯

ఉ. నీ యనుమానమేల తటినీ యనుకూల సుఖాప్తి లుప్తి రా
నీయనుదోషమున్ నిలువనీయను బుణ్యము నిన్నుబాసి పో
నీయను వక్రగంత్రి యననీయను నిత్యపవిత్రశుద్ధపా
నీయనుగా దలంచి జననీ యనువారలు నిన్ను భూజనుల్. ౪౨౦

క. ఎక్కడ చచ్చిన శవమున్। దక్కక నీలోన నునుప దటినీ నేనా
ముక్కడికిని సారూప్యము। దక్కింతున్ దీనికంటె ధన్యత కలదే. ౪౨౧

క. నాభక్తులు నీలోనం। బ్రాభవమును గందు రెందు పాపము లుడుగన్
శోభావతివై తనరెదు। నీ భయ మిక దీరెగాదె నిమ్నగ పొమ్మీ. ౪౨౨

వ. అని యిట్లు భగవంతుండు పలుకం గడు నలరి మ్రొక్కి నిలచిన భగీరథుం గాంచి ని
వీ గంగను గౌతమోక్తక్రమంబునం బూజింపుమని చెప్పిన నట్లు చేసెద నని యాజ్ఞం గయి
కొని గంగం దోడ్కొని చనియె నని చెప్పిన విని నారదుండు స్వామీ భగీరథుండు గంగం
బూజించిన క్రమంబు సెలవివ్వవే యనుడు నారాయణుండు ౪౨౩

సీ. నియతితోడ మునింగి నిత్యక్రియను దీర్చి ధౌతవస్త్రద్వయిదాల్చి విఘ్న
నాథుని రవి నగ్ని నారాయణుని శివు నంబను నార్వుర నలత గొల్చి
యధికారియగు నెందుకనిన విఘ్నము రాదు గణనాధు గొల్చినకతన నింక
రవి గొల్చుటను రోగరహితుడౌ శౌచంబు గలుగు వహ్నిని గొల్వ నళిననేత్రు

తే.గీ. గొలిచినందున శ్రీ గల్గు గుహజనకుని । గొలువ జ్ఞానంబు గలుగును గూర్మి నంబ
గొలిచినందున మోక్షంబు గలుగు నిక్క।మవల గంగను ధ్యానింపగను మునీంద్ర । ౪౨౪

వ. కణ్వశాఖోక్తంబయిన ధ్యానంబు దెలిపెద వినుము. ౪౨౫

ఉత్సాహ. మల్లె మొల్ల జాజి విరుల మాడ్కి నీ ప్రవాహముల్
తెల్లనై పవిత్రమై యతిద్యుతిం దలిర్చెడిన్
గల్ల గాదు నీవు కృష్ణగాత్రమందు బుట్టితో
తల్లి గంగ నిన్ దలంచెదన్ సతంబు గొల్చెదన్॥ ౪౨౬

ఉత్సాహ. తెల్ల మాయె నీదు కీర్తి దేవదేవుడే నినున్
బల్లవింపజేసె నమ్మ భక్తకల్పభూమిరు
ద్వల్లివైతి వో సమస్తవాహినీమతల్లి మా
తల్లి గంగ నిన్ దలంచెన్ సతంబు గొల్చెదన్. ౪౨౭

ఉత్సాహ. నల్ల వేల్పుగాదె నిన్ను నాటి భారతంబునన్
జెల్లు నీ విశేషమహిమచేత నెల్లమర్త్యులన్
బిల్లకాయలంచు కూర్మి పేర్మి నేలుదమ్మ మా
తల్లి గంగ నిన్ దలంచెదన్ సతంబు గొల్చెదన్. ౪౨౮

ఉత్సాహ. విల్లువంటి కన్నుబొమయు వేదివంటి జఘనమున్
జల్లి మెకముతోకవంటి చక్కనైన వేణియున్
పిల్ల లేడివంటి కనులు పేర్మిమీరునట్టి మా
తల్లి గంగ నిన్ దలంచెదన్ సతంబు గొల్చెదన్. ౪౨౯

వ. అని యిట్లు ధ్యానించి షోడశోపచారములుచేసి గంగాపూజ సల్పినవాని కశ్వమేధ ఫలంబు
లభించు నిక గంగాస్తవంబు సెప్పెద వినుమని నారాయణుండు. ౪౩౦

క. అమ్మా శివకరరూపిణి । సమ్ముగ్ధ మురారిదేహసంభూతా గై
కొమ్మా నా మ్రొక్కులు గంగమ్మా రాధాంగరససమ్మాయుక్త దయన్. ౪౩౧

రగడ. శూలిని దగ్గరనుంచుక సృష్టిని జొప్పడజేసెడి కాలమునందున
గోలోకంబున రాసమండలిని గోవిందుడు దా మ్రొక్కినదేవికి
వీలుగ గార్తిక పూర్ణిమయందును వ్రేతలు గొల్లలు వేడుకతోడను

మేలగు రాధికయుత్సవమందును మించి మహోన్నతిగొల్చెడి దేవికి
గోటియోజనంబులు పొడవై సిరి గోరి వెడ ల్పొకలక్షయు నగుచును
మేటిగ గోలోకంబున మహిమను మించిన తల్లికి గంగాదేవికి
నలరుచు నలుబదిలక్షల యామడ యా వైకుంఠమునందును విరివియు
బొలుపుగ నాల్గింతలు గల నిడివియు బలువుగ బ్రవహించెడి భాగీరథికిని
ముప్పదిలక్షల యామడ వెడలుపు మొనయగ నైదంతలు నిడివియు గని
యొప్పుచు సత్యమునందున నుండెడి యొప్పులకుప్పకు నొగి ఘా తల్లికి
ముప్పదిలక్షల యామడ దైర్ఘ్యము మొగి నాల్గింతలు నిడివియు నగుచును
మెప్పుగ శివలోకంబున నుండెడి మేలగు చక్కని మందాకినికిని
లక్షయోజనంబుల వెడలుపుతో లలితగతిని నేడంతలు నిడివయి
మోక్షమునొసగుచు ధ్రువలోకంబున ముద్దులతల్లికి సౌరవాహినికి
లక్ష యోజనంబుల వెడలుపుతో లలితముగా నైదంతలు నిడివయి
వీక్షింపందగి చంద్రలోకమున వెలసినతల్లికి సురదీర్ఘికకును
అరుబదివే లామడ వెడలుపు నై యంతకు బదియంతలు నిడివియు నయి
సరసిజబంధునిలోకమునందును జక్కగ వర్తిలు లోకజననికిని
లక్షయోజనంబులు విస్తీర్ణము లలి నైదంతలు నిడిపియు నగుచును
నక్షయమైన తపోలోకంబున నలరుచు దిరిగెడి యాపోమూర్తికి
వేయామడ విస్తీర్ణంబై పదివే లామడ నిడివై చెన్నొందుచు
బాయక జనలోకంబున వర్తిలు పరమేశ్వరికిని భక్తపోషిణికి
పదిలక్షల యోజనముల వెడలుపు బంచగుణంబగు నిడివియు నగుచు
విదితంబుగను మహర్లోకంబున వింతగవర్తిలు పాపనాశనికి
వేయామడలను విరివి గలిగి సరవి శతగుణమగు నిడివి దనరి నిర
పాయంబుగ గైలాసంబున జెరలాడెడి భక్తజనావనవృత్తికి
నూ రామడ వెడలుపు గల్గియు బది నూర్లామడ పొడవును దాల్చియు దగ
నోరుపుమీరగ స్వర్గమునందును నొప్పెడి తల్లికి మందాకినికిని
బదియామడ వెడలుపు దనరారగ బదిపదులామడ నిడివి గలిగి యును
వదలక పాతాళంబున నుండెడి వాసిగలమ్మకు వరభోగవతికి
క్రోసెడు వెడలుపు గలిగి ధరాస్థలి గుణవతియగు న య్యలకనందకును
భూసురవంద్యకు పుణ్యచరిత్రకు మ్రొక్కెద మ్రొక్కెద మ్రొక్కెద మ్రొక్కెద. ౪౩౨

తే.గీ. క్షీరవర్ణ యనగ గృతమున, నిందు । సన్నిభ యమరియు త్రేత, నెమ్మిం జంద్ర
నాభ ద్వాపరమున, నలువొ జలప్రభ । గలియుగమున నట్టి గంగ గొల్తు. ౪౩౩

వ. మరియు నీ గంగాస్తోత్రము పఠించినవారికి సకలార్థంబులు గలిగి సుఖింతురని చెప్పి మరియు నివ్విధంబున భగీరథుండు గంగాస్తవంబు సేసి గంగం దోకొని సాగరుల భస్మ రాసులం దడిపిన వాండ్రు తత్క్షణంబు వైకుంఠంబున నిత్యసుఖంబు గల్గి వర్తిల్లిరి. నీ వడిగిన గంగామాహాత్మ్యంబు సెప్పితి, నింక నేద్ది యడిగెద వనిన నారదుండు నారాయణా! భువనపావనియైన గంగ త్రిపథగ యగు నదియైనందుల కారణంబును దెలుపవే యనుడు నారాయణుండు ౪౩౪

తే.గీ. వినుము నారద తెలిపెద విస్తరించి। మున్ను గోలోకమున గృష్ణమూర్తి యొక్క
కార్తికిని బున్నమను విధిక్రమముమీర। రాసమండలమందును రాధ గొల్చె. ౪౩౫

తే.గీ. కొల్చి సంహృష్టుడై గద్దె గూరుచుండ। దేవతలు మునులును సభ దీర్చియుండ
కృష్ణసహిత సరస్వతి కేరిమీరి। వీణగొని పాడె పల్లవి వింత బొసగ. ౪౩౬

తే.గీ. బ్రహ్మ దా మెచ్చి తారహారంబొసంగె। శివుడు చక్కని మాణిక్యశేఖరంబు
నిచ్చె గృష్ణుండు కౌస్తుభం బిడియె రాధ। రవలముక్కెర యిచ్చె నారాయణుండు. ౪౩౭

తే.గీ. పేల్మి దుద్దులజో డిచ్చె గల్మిసాని। పరగ దుర్గయు దా నిచ్చె బ్రహ్మ భక్తి
ధర్మ డిచ్చెను భక్తిదా ధర్మబుద్ధి। వహ్ని శుద్ధాంశుకం బిచ్చె వన్నెమీర. ౪౩౮

ఆ. వె. బ్రహ్మ వీపు గిల్ల బరమేశ్వరుడు గొంతు। కెత్తి పాడె నౌర మత్తుమీర
సురలు మునులు పాట సొక్కొత్తి చిత్తరు। బొమ్మ లైరి యేమి పోకలేక. ౪౩౯

తే.గీ. కృష్ణుచేం జేతనం బొంది కెరలి చూడ। రాసమండలమందు సర్వస్థలంబు
జలమయంబైన నా సభాసదులు జూడ। త్రపత నొందిరి కృష్ణుండు రాధ యపుడు ౪౪౦

క. గొల్లలునుం గొల్లెతలును। నెల్లసురలు బ్రాహ్మణులును నేది గనక తా
రుల్లంబులు దల్లడపడ। గొల్లుమనుచు నేడ్చి రపుడు గుణరత్న నిధీ. ౪౪౧

తే.గీ. ధ్యానయోగంబుచే బ్రహ్మ తా నెరింగె। రాధికయు గృష్ణమూర్తియు ద్రవత జెంది
రనుచు నంతట వాగ్దేవి యద్భుతంబు। గాగ నశరీరిణీత్వంబు గాంచి యిట్లు
పలికె నందరు వినం గృష్ణ వాక్యసరణి. ౪౪౨

తే.గీ. నేను సర్వాత్మ నిది శక్తి నే ననంగ నిది యనంగను భేద మొక్కించుకయును
లేదు రాధాశరీరంబు లిల ద్రవత। నందె నద్దియ నేను నే నద్ది సుమ్ము. ౪౪౩

తే,గీ. కాన నామంత్రములచేత దీని గొల్పు। మానవులకెల్ల గోలోక మార్గ మెన్న
సులభమైయుండు నది శూలి తెలిసిసేయు। నాగ విని బ్రహ్మ శాంకరీనాథు జూచి. ౪౪౪

వ. శంకరా వేదసారంబయిన మంత్రవిస్తారంబుతో నిదే గంగాతోయంబు పూని స్తోత్రంబుం జేయుము నావుడు నతండిది భగవదాజ్ఞాపరిపాలనార్థకం బదియుంగాక యీ గంగతోయంబు పూని యెవ్వడు తీర్థంబాడండు వాండు కాలసూత్రంబను నిరయంబు జెందునని పూని వేద

సారంబు పఠించినంత కృష్ణుండు రాధాసహితుండై ప్రత్యక్షుండై నం గాంచి పునరుత్సవంబు చేసి రది కావున కృష్ణదేహసముద్భూత యగుటం గృష్ణాంగసంభూతయు, గోలోకంబునఁ బుట్టుటం గంగయు నై విరాజిల్లె. శివకృత వేదసారంబువలన ముక్తిదీపంబయ్యె. నిది తెలసి యెవ్వండు గంగఁ బూజించు, వాఁడు పూతుండగు ననిన విని నారదుండు జగదీశా భవచ్ఛరీరంబయిన శ్రీ రాధాదేవియే గంగ యగుటయు, శంకరుండును బ్రహ్మయు నారాయణు ననుజ్ఞ బడసి గంగం ధ్యానించి స్తోత్రంబులు సేయుటయు, నీవలన సవిస్తరం బుగా వింటి. గలిం బంచసహస్రహాయనాతంతరం బెట్లు జరుగుం డెలుపవే యనుడు హరి గంగ భారతంబు విడిచి పద్మావతీ సరస్వతులం గలసి వైకుంఠంబున కరిగి తులసిం గలసె. నారాయణున కపుడు నల్గురు ప్రేయసు లైరని చెప్పిన మరల బ్రహ్మపుత్రుఁడు విష్ణుపాదోద్భవ యనియు, గంగను బ్రహ్మకమండలుస్థ యనియు జెప్పెద రది యెట్టిదని యడిగిన నారాయణుండు ౪౪౫

సీ. మున్ను దా గోలోకమున ద్రవరూపిణియైన రాధాంగజ యమలగంగ
సంకర్షణునిచెంత సరసభావముచూపి యుండగ గొల్లత లొక్కమూడు
కోట్లతోడను దటుక్కున రాధికాదేవి వచ్చి చూచి తనదు వన్నెకాని
వగలును గంగమ్మ వలపులు నాత్మలో సహింపజాలక చాల గసలి

తే.గీ. బిరబిరన పోయి తా సింహపీఠి కెక్కి । వక్కలాకులు నిచ్చుచు బెక్కుచేడె
లక్కజంబుగ గొలువంగ నధికరాజ్య । విభవ మలరార గూర్చుండి విష్ణు జూచి. ౪౪౬

ఉ. ఎవ్వతె ప్రాణనాథ యిది యెందుకు నీకడ నిల్చియున్న ది
నెవ్వగలాడిపై వలపు నీకును నున్నటు లున్నదౌ నహా
యివ్వరగో ప్రపంచమున నే నొకతెఁ మనియుండగానె యీ
రవ్వలొకో సెబాసు నగరా పలుసారులు నిట్లు చేసినఁ. ౪౪౭

ఉ. ఓర్చితి బెక్కుసారు లిక నోర్చిన నొప్పదుసుమ్ము నీకునుం
గూర్చిన ముద్దులాడి యిదిగో కొనిపొమ్ము మరొక్కచోటికిఁ
నేర్చితి విట్టి దౌష్ట్యమును నీ విక గోభువనంబునందు గా
లార్చిన చూడు నీపని పురానుభవంబులు విస్మరించితే. ౪౪౮

ఉ. గంధపుకోనలో విరజకౌగిట నుండగ జూచియుఁ సఖీ
బృందము వేడినఁ గొడవబెట్టక నిన్ను క్షమించితిఁ గదా
డెందమునఁ దలంపుము వడిఁ విరజాంగన వాకయయ్యె మే
నందము గుంద నీవును ననంగుడవై చనవే మనోహరా । ౪౪౯

ఉ. నీ పరు వుగ్గడించుచు వినిర్మలతోయశరీర మొప్పగా
నాపగ యయ్యు నాపగయు నై ప్రచరింపగ దానిమీది మే
లాపగలేక నీవు విరజా యని సంస్మరింపగా
నోపిక యోగసిద్ధి గల యోగినిగావున చారుమూర్తియై. ౪౫౦

ఉ. నీకును దర్శనం బొసగ నీవును దాని గనుంగొనంగఁ జీ
కాకొనరించి శుక్రమిడి గర్భముజేసిన బుట్టె నౌర య
స్తోకసముద్రసప్తకము శూరుడవౌదువు నే నెరుంగనే
నీ కపటస్వభావ మది నేడును మాన వికేమి సేయుదున్. ౪౫౧

ఉ. సంపగితోట శోభ యను చక్కని గొల్లది నిన్ను గూడుచుఁ
రంపిల జూచి నిన్ను నది రా యని నే నదలింప నార్తిచే
పెంపెరలాడి తీవు నతివేగమ శోభ శశిం భజించె దా
గంపము నొందుచున్ దనువు గన్పడనీయక దక్కమాత్రమై. ౪౫౨

ఉ. అంతట దానిపొందు విడనాడగజాలక రత్నభూరులన్
గాంతల మోములఁ నృప శిఖామణులఁ గివలంబులందు పూ
బంతులబండ జేలగుడి బాలవినూతనవస్త్రపాళి నిం
తింతలు జేసి పంచితివి యీ విపుడయ్యది విస్మరించితే. ౪౫౩

చ. తులసివనంబులోన ప్రభ తో గలయం గని యేను తిట్టినన్
బిలబిల బోయి డాగితివి భీతిని ఛత్రప్రభ సూర్యు జేరినఁ
వలపున నీవు పోయి బహుభంగుల నారసి మంటగత్తెన
త్యలఘుత నూరడించితివహా పలుపోకలమారి పీవకా. ౪౫౪

చ. అనలునియందు గొంచెమును యక్షులయందును కొంచెమున్ మహా
జనులను గొంచెమున్ దివిజ సంఘములందున గొంచెమున్ స్వభూ
జనులను కొంచెమున్ మదగజంబులఁ గొంచెము ద్రాచులందు బ్రా
హ్మణుల తపస్వులన్ యతుల యందును గొంచెము కొంచె ముంచి పా
వనత గనంగజేసితివి వర్ధిలుగావుత నీదు బచ్చెనల్. ౪౫౫

చ. వెలయగ దొల్లి శాంతి యను వ్రేత నొకర్తుక గూడి రాసమం
డలమున నామనిన్ ముదమునన్ విరిసజ్జను బూలదండలం
గళమున దాల్చి చందనపు గంథము బూసి లతాంగి యాకులన్
మలచి యిడంగ తమ్మలము మానుగ జేయుచు రత్నశాలలోన్. ౪౫౬

ఉ. ఉండగ నేను జూచి కని నోగ్రపదంబుల నిన్ను దిట్టినన్
గుండతనంబునన్ మరగికొంటివి నీ వదిగాంచి శాంతి నీ

యందన లీనయైన గని యాపె నరణ్యమునందు సత్వస
మ్మండితులందు వైష్ణవుల మౌనుల శాక్తులయందునున్ మహా
పండితులందు ధర్మమున బంచితి నాకును జెందె వల్లభా. ౪౫౭

చ. మరచితివో క్షమాయువతి మాలిక నీమెడ వైచి గంధమున్
నెరయగ బూసి తల్పమున నిన్నిట కౌగిటలో నమర్చి యే
మరుగును లేక సొమ్మసిలి మత్తున నిద్దురబోవ జూచి నే
నరిమురి చేయిదట్టి ఘము నల్లన లేపినజాడ వల్లభా. ౪౫౮

ఉ. అచ్చట నీవు మేన్మరచి యాబిడతో నిదురించునప్డు నీ
పచ్చనికోక క్రోవి వనమాలిక కౌస్తుభరత్నరాజమున్
ముచ్చిలి యేను డాచితిని ముద్దియలెల్లను వేడినంతటన్
గ్రచ్చర నీకు నిచ్చితినిగాదె తలంపుము ప్రాణవల్లభా. ౪౫౯

ఉ. సిగ్గునబోయి భూతలము జేరి క్షమాసతి యుండ ప్రేమతో
దిగ్గున నీవు బోయి హరి దేవతలన్ మునులన్ సుధీతతిన్
జగ్గుగ వైష్ణవోత్తముల చాయను దుర్బలులందు ధర్మముల్
తగ్గనివారియం దునిచి లాలనజేసితి వీ వెరుంగవే. ౪౬౦

చ. ఎరుగనిదానగాను మరి యెన్నికతల్కల వెంచిచూచినన్
తెరవల మేలుకాడ వగుదే తగుదే పరవారి కృత్యముల్
మరుగున జెప్పుకోవలెను మంచికి బోయిన కీడు వెంటనే
తరుముక వచ్చు నిన్ను దయ దార్చుట నేరము ప్రాణవల్లభా! ౪౬౧

వ. ఇట్లు రాధాదేవి రోషారుణితలోచనయై కృష్ణు నదలించి గంగవంక కొరకొరం జూచి పట్టంబోయిన నది యెరింగి సిద్ధయోగినియగుట నిజయోగంబున దిరోధానం బొంది సభామధ్యంబున జలంబై నిండిన నది నిజయోగంబున రాధ యెరింగి పాణిం బురిగిలించి తజ్జలంబు పానంబుసేయ సమకట్టిన నది తెలసి గంగ శ్రీకృష్ణచరణాంబుజంబు గోరిన శుద్ధజలరహితంబులై గోలోక వైకుంఠలోక భూలోకాదులు జల జంతుమృతదేహ సమన్వితంబులై చేడ్పడి త్రావ పురిసెడు జలంబు లేక యెల్లవారు నాలుక లెండి కొట్టుకొన బ్రహ్మ విష్ణు శివానంత ధర్మ పాకశాసన చంద్ర ప్రభాకరులును మనువులు మునులు దేవతలు సిద్ధులు మొదలగువారు గోలోకంబునకుం జని గోవిందుంగాంచి కన్నుల బాష్పంబు లొలుక గద్గదస్వరంబుతో పులకాంకితదేహంబులతో భక్తినమ్రకంధరలతో రాసమండలంబున విలాసాంచితుండై యున్న శ్రీనివాసునకు నమస్కరించి యచ్చెరువడి యొండొరుల మొగంబుల సూచికొనుచు చతుర్ముఖుం జేరి వచ్చినపని జగన్నాథునకు విన్నవింపు నావుడు

నాతండు కుడిప్రక్కను విష్ణువు డావలి ప్రక్కను వామదేవుని చేకొని పరమానందయుక్తుండై రాసమండలంబున సర్వము కృష్ణమయంబయి యెల్లరు ద్విజులును, నెల్లరు మురళీహస్తులును, నెల్లరు వనమాలావిభూషితులును, నెల్లరు మయూరపింఛచూడులును, నెల్లరు కౌస్తుభరాజితులును నై గుణ రూప భూషణ తేజో వయః కాంతుల సమానులై యతిక్రమ నీయ విగ్రహులై యుండం గనుంగొని ౪౬౨

ఉత్సాహ. అందమాయె రాసమండలాంతరంబు జూడగా
యెందుజూడ నందు కృష్ణు డింపు సొంపు మీరు గో
విందు లెంద రెంద రెట్లు విందుకందు చెల్లబో
యిందు కృష్ణు డెవ్వడంచు నే జొహారు జేసెదన్. ౪౬౩

ఉత్సాహ. మందయాన రాధ యొక్కమారు చంకకెక్కగా
సుందరుండు నొక్కమారు సుదతి చంకకెక్కగా
ఇందువదన కృష్ణుడాయె కృష్ణు డింతియాయె నౌ
ఇందు కృష్ణు డెవ్వడంచు నే జొహారుజేసెదన్. ౪౬౪

ఉత్సాహ. ముందు శౌరి యతని వెనుక ముగుద దానివెంట గో
విందు డతని వెనుక రాధ వెలది వెనుక గృష్ణుడున్
సందు సందు నెట్టు లొక్క చాడ్పునన్ దలిర్పగా
నిందు కృష్ణు డెవ్వడంచు నే జొహారు జేసెదన్. ౪౬౫

ఉత్సాహ. మందయాన ముద్దుగొనెడి మాధవుం డొకండుగా
కుందరదన ముద్దుగొనెడి కోమలాంగి యొర్తుగా
క్రింద రేడు మీదసాని క్రిందసాని మీదరే
డిందు కృష్ణు డెవ్వడంచు నే జొహారు జేసెదన్. ౪౬౬

ఉత్సాహ. ఇందువదన కృష్ణు డాయె కృష్ణు డింతియాయె నౌ
చంద మెరుగ నేరితరము జాతిబోవు వచ్చు నే
మందు నింతవింతగాన నాత్మసంశయంబుతో
నిందు గృష్ణు డెవ్వడంచు నే జొహారు జేసెదన్. ౪౬౭

వ. అనియిట్లు లోకవిధాతయగు బితామహుండు శ్రీకృష్ణవిలాసంబునకు నత్యుల్లాసంబుపూని హృత్పంకజమధ్యస్థుండగు కృష్ణదేవుని ధ్యానించుచు ననేకవిధంబులం గొనియాడి నిమీలిత నయనుండై నిలువంబడియుండ రాధావక్షస్థలస్థితుండగుచు గోవిందుండు స్వపార్షదపరి వృతుండై గోపీజనమండలమండితుండై దర్శనంబిచ్చిన గాంచి దండవత్ప్రణామంబు చేసి లేచి చేతులు జోడించుక నిలచియున్న జలజ గర్భుం దిలకించి నిఖిలేశ్వరుండు మొగం బునం జిరునగవు మొలకలెత్త నలరించి మెల్ల వేలుపుల నుద్దేశించి ౪౬౮

తే.గీ. బ్రహ్మ రావోయి విష్ణుడా రాగదోయి శంకరా రాగదో యిటు స్వస్తి మీరు
గంగ గొనిపోవ మీరాక గాంచినాడ । శరణమవి సమ్మె గంగ నా చరణ మిపుడు. ౪౧౯

క. గంగను రాధిక దయతోఁడం గని రక్షించునేని దానిని మీకి
వ్వంగలవాడను భయరహి । తంగా నొనరించుకొనుడు తత్త్వజ్ఞులరై. ౪౨౦

క. అనిన విని ధాత తనయాననముల నాల్గింటిచేత నతిపూర్వముగా
గొనియాడదొడగె వేదవ। చనముల నత్యంతభక్తిసంయుక్తుండై. ౪౨౧

తే.గీ. గంగ తాయి తావకాంగసంభూతయు । మంగళాంగి రాసమండలమున
బొంగునాడు పరమపురుషుని దేహంబు । నందు బుట్టె నిరుపురందు గలరు. ౪౨౨

తే. గీ. శంకరుండు తొల్లి సంగీతమును బాడు । వేళ గృష్ణు డీవు వినికి జొక్కి
కరగి నీరుగాక గంగ దా బొడమెను । రెండుకళలు నందు నిండియుండె. ౪౨౩

తే.గీ. నీదుమంత్రంబు గ్రహియించి నిర్మలాంగి । యగుచు నీ గంగ వైకుంఠు నింతియగుత
భువిని బారెడు గంగకు లవణవార్ధి । ప్రియుడుగదవమ్మ రాధమ్మ దయను గనుము. ౪౨౪

క. అను బ్రహ్మవచనమునకుఁ । మనమున సంతసముబొంది మన్నించినరీ
తిని గనుబొమలను గనుపర । చిన గంగాదేవి యలరి చిరునవ్వొలయఁ. ౪౨౫

క. హరిచరణాంగుష్ఠనఖము । నురువడి దా వెడలి నిలచె నోరిమిని జలాం
తరగతయగు నిద్దేవత । సరసాలంకారవారసంయుత యగుచుఁ. ౪౨౬

తే. గీ. గంగలోని జలము కమలజుం డొకయింత । తన కమండలువున దాల్చి మించె
నర్ధచంద్రధారి యొదలఁ ధరియించె తృష్ణవంటి దొకటి పృథ్వి గలదె. ౪౨౭

వ. అంత కమలోద్భవుండు గంగకు రాధికామంత్రం బుపదేశించి తదీయంబులయిన స్తోత్ర
కవచ పూజావిధా ధ్యానంబులం గరపి సామవేదోక్తంబయిన పురశ్చర్యాక్రమంబు తెలు
పుడు చేసినట్లు కావింప గంగ వైకుంఠంబునకుం జనియె. నిట్లు లక్ష్మి సరస్వతీ గంగా
తులసు లను నలువురు భార్యలతో నారాయణుండు సుఖించుచుండె. నా సమయంబున
బ్రహ్మం గాంచి శ్రీ కృష్ణుండు. ౪౨౮

ఉ. ఓయి సరోజగర్భ వినుమో జలజోదర యో మహేశ్వరా
యీయెడ గంగనుం గొనుచు నేగుడు మీకొకమాట దెల్పెదన్
నాయెడనున్న మీరలు జనార్దనుపట్నముదక్క సర్వముఁ
దోయమయంబు నే డిది కనుంగొననేరదు నన్ను జేరుటన్. ౪౨౯

తే.గీ. ఎందలెందరు బ్రహ్మలో యెందరెంద । రీశ్వరులొ యెందంద రహీంద్రశయులొ
ఎందరెందరు మఖవులో యేమిచెప్ప । లీనులై యున్నవారు నాలోన నిపుడు. ౪౮౦

తే.గీ. ఈవు పోయి యిపుడు సృష్టిగావింపుము । నీదుగ్రుడ్డు నికను నే సమస్త
లోకసృష్టికొరకు లోకేశవితతిని । బ్రభవమంద జేతు బద్మగర్భ. ౪౮౧

తే.గీ. బహుయుగంబులాయె బద్మజా నా రాస, మండలమున మీర లుండునపుడు
యెన్నిలయము లప్పు డేగెనో మీరలు । కానరయితి రదియె కాలమహిమ. ౪౮౨

క. అని రాధానాధుడు దా । జనియెను శుద్ధాంతమునకు స్రష్టయు వేల్పుల్
చని సృష్టి మొదలుపెట్టిరి । ఘనముగ నా గంగ దొంటిగతి విలసిల్లెన్. ౪౮౩

వ. గంగ విష్ణుపాదంబుననుండి వెలువడి విష్ణుపది యనంబడియె మరియు నీ గంగా ప్రభా
వంబు వినియెడివారికి నైహికాముష్మికంబులు గల్గునని చెప్పిన నారదుండు ౪౮౪

తే.గీ. వింటి నీవల్ల శ్రీగంగవృత్తమెల్ల। లక్ష్మి భారతి గంగ తులవియు నల్వు
రంటి గృష్ణుని ప్రేయసు లందు గంగ యేగె వైకుంఠమునకు మరెట్లు వచ్చె. ౪౮౫

తే.గీ. ఈశ్వరుండైన శ్రీకృష్ణు డెట్లు దాని । మరల బ్రియురాలుగా గొను మార్గమొదవె
సందియము తీర్చవే నాకు జలజనేత్ర।యనుడు విని వేడ్కమీర నారాయణుండు ౪౮౬

సీ. నినుము నారద గంగ చని వికుంఠమునందు నిలువంగ వెంటనే జలజభవుడు
నచటికి బోయి నారాయణు దర్శించి యెరగి యిట్లనియె నోయి పరమేశ
యిది గంగ రాధికా కృష్ణాంగసంభూత యౌవనసంపన్న యనఘ శుద్ధ
కృష్ణుండు దీని వరింపండు తనదేహమందు బుట్టుటజేసి యదియుగాక

తే.గీ. రాధ గోపింప భీతిల్లి ప్రభుని పాద । పంకజం బాశ్రయించిన భయము బొదమి
నీరుగానక నే నేగి నియతిగొలువ । కృష్ణు డిచ్చెను మరల నా కీ స్రవంతి. ౪౮౭

సీ. మరియును రాధికామంత్రంబు దీనికి నుపదేశమునుజేసి యొప్పమీర
గొనివచ్చితిమి దీని గొనుము గాంధర్వవివాహంబునను సురేశ్వర మురారి
వలపున జేరిన వనితను విడనాడరా దదియునుగాక ప్రభుడవైన
నీ కిది తగినది నీవు చతుర్భుజత్వము గొన్న కృష్ణావతారశాలి

తే.గీ. వంగనయు నిన్న యర్థించె నదియుగాన । గొనుమనగ విష్ణు డలరి యకుంఠమదనేత్ర
ననుపమానంగ రంగ నాట్యంబు దెలిసి । గలసి యచ్చటనే యుండె నెలమిమీర. ౪౮౮

తే.గీ. మున్ను విశ్వంభరాలోకమునకు డిగిన । గంగ స్వస్థానమునకును గదలి మరల
విష్ణుపాదాబ్జముననుండి వెడలె నదియె । విష్ణుపది యను పేరిట వెలసెజుమ్ము. ౪౮౯

వ. అనిన నారదుండు. ౪౯౦

క. తులసియు శ్రీకృష్ణుని భా । ర్యలలోని దటంచు బల్కి తది యెచ్చోటన్
వెలసెను దొలిజన్మమ్మున । గుల మెయ్యది యెవ్వనికిని( గూతుర జెపుమా. ౪౯౧

## —: వే ద వ తీ తు ల సీ మా హా త్మ్య ము :—

సీ. ఆలకింపుము నారదా తొల్లి మనువయి వర్తిల్లు దక్షసావర్ణి కలడు
విష్ణువంశమువాడు వెలయు దత్పుత్రుండు వర్యుండు బ్రహ్మసావర్ణి సుమ్ము
విష్ణుభక్తుడు వాడు వీరుం డతని బిడ్డ వ్రతశాలి ధర్మసావర్ణి మరియు
వైష్ణవుం డతండు వరుస దత్తనయుండు వరలును రుద్రసావర్ణి యనగ

తే. గీ. వానికి సుతుండు దేవసావర్ణి యొప్పు । నాయనకు నింద్రసావర్ణి యాత్మజుండు
నతనికొడుకు వృషధ్వజుం డనగ బరగు । నద్భుతంబైన శివభక్తి నాశ్రయించె. ౪౯౨

క. గిరిజాపతి యయ్యాశ్రమ । ధరిణిన్ వసియించెజుమ్మ తా యుగములు మూ
డరుదారగ నద్దేవుడు । పరమకృపాదృష్టి జూచె బార్థివు ననఘా । ౪౯౩

వ. వాడు నారాయణు సరకుసేయక భాద్రపదమాసంబున లక్ష్మీపూజాత్యాగంబొనర్చి సర్వదేవతల మరచి యజ్ఞాదులను, విష్ణుపూజాదికంబులను నిందించుచు మత్తుండై యుండం గాంచి దివాకరుండు కోపించి భ్రష్టశ్రీకుం డగునట్లు శపించినం గని భక్తానుగ్రహపరాయణత్వంబున శంకరుండు తన శూలంబున సూర్యుం బొడచిన దన తండ్రి గూడి భాస్కరుండు బ్రహ్మను శరణంబు వేడె. బ్రహ్మ సూర్యుం దోడ్కొని విష్ణునాశ్రయింప వైకుంఠంబునకు జనియె నప్పు డమ్మువ్వురు నాలుకలు దడబడ గద్గదికతో దైన్యసమన్వితులై వెన్నున కది విన్నవింప విని నారాయణుండు. ౪౯౪

చ. వెరపు విడుండు మీరు మతి విహ్వలతన్ గననేల మిమ్మ న
క్కరగని ప్రోచువాడను జగంబులు నాయవికావె శంకరుం
డెరుగుడు నా ప్రియుండనుచు నెప్పుడు నన్ను భజించు నాత( డే
మరక భజింతు నే నతని మాయెడ భేద మొకింత యున్నదే? ౪౯౫

చ. అతడు శివస్వరూపుడు మహామహు డాశ్రితరక్షణైకదీ
క్షితుడు సమస్తపూజ్యుడు ప్రసిద్ధుడు సర్వమయుండునుం జగ
త్పతి కరుణాకరుండును సుపర్వశిఖామణి మృత్యుజేతయుం
దతశుభసంగతుండు ఖలదైత్యవిదారి యటం చెరుంగరే? ౪౯౬

వ. అని యిట్లు భగవంతుండు బ్రహ్మదులతోడం బలుకుచున్న యవసరంబున వృషారూఢుండై మృత్యుంజయుం డచటికి వచ్చి వృషంబు డిగ్గి హరిం జేరి భక్తియుక్తుడై ప్రణమిల్లి నిలిచినం గాంచి మహాదేవునకు బ్రహ్మయు గశ్యపుడును భాస్కరుండును నమస్కరించి

నంత నారాయణు ననుజ్ఞం బడసి శంకరుండు సుఖాసనంబునం గూర్చుండియుండ మొగం
బునం జిరునగ వొలయ వైకుంఠుం డిట్లనియె. ౪౯౭

తే.గీ. శంకరా యూరకే రావు శంక లేదు। గొప్పపనియేదొ తలపెట్టి యిప్పు డిటకు
వచ్చినట్టుల నున్నావు వదనపంచ। కంబునకు నింత కోపంబు గలుగనేల. ౪౯౮

వ. అనిన విని ౪౯౯

శా. నా దాసుండు వృషధ్వజుం డతని నీ నాళీకమిత్రుండు దా
నేదో రోసము నాత్మ బూని శపియించెన్ లక్ష్మిదూలం దదీ
యాదుష్కర్మము చెల్లునే తెలుపుమా యాతండె యాతండు నీ
పాదంబుల్ భజియింపవచ్చె నిదిగో బ్రహ్మాదిసంయుక్తుడై. ౫౦౦

క. నా భక్తుడు నిశ్రీకుండై। భువివర్తిల్ల వాని యాపద నడపన్
బ్రాభవము సూపకుండిన। నీ భక్తుడనైన నాకు నేరము గాదే. ౫౦౧

క. అనిన విని వనజనాభుడు। వినుము మహాదేవ నీవు వెడలినది మొద
ల్చనె నిప్పటి కతికాలము। గను మిరువదియొక మహాయుగంబులంచున్. ౫౦౨

తే.గీ. ఆ వృషధ్వజుడును బోయె నమరపురికి నతనికొడుకు రథధ్వజుం డరిగె దివికి
శర్వ ధర్మజుండు గు। శధ్వజుండు వాని కొడుకులు నే డున్నవారు భువిని. ౫౦౩

క. కమలాభజనంబున వా। రమలశ్రీ బడయగలరు హరిసుందరి త
ద్విమలాంగులకును సుతయై ప్రమదంబు ఘటింపజేయు బదమని పలుకన్. ౫౦౪

వ. అని యిట్లు చెప్పి నారాయణుండు సలక్ష్మీకుండై గృహాభ్యంతరమునకు జనియె. దేవతలు
ప్రహృష్టమానసులై స్వస్వనివేశములకుం జనిరి. శివుండు తపంబుసేయం బనివినియె.
నం దచ్చట భూమండలంబున ధర్మధ్వజ కుశధ్వజులు లక్ష్మింగూర్చి తపంబు జేసి మహా
లక్ష్మి వరప్రసాదంబున పృథ్వీశ్వరులై పుత్రవంతులై మహాకీర్తివహించియుండ నందు
కుశధ్వజునకు ధర్మపత్నియగు మాలావతికి ౫౦౫

క. నెలయై రెణ్ణెలలై మూ। డ్నెలలై యీరీతి పదియు నెలలై పిదపన్
నెలచెలియటిదయ గడు రం। జిల మాలావతికి నాడుచిన్నది గలిగెన్. ౫౦౬

క. కలిగినపుడ కురిసెను పువ్వు। లవాన ధరాతలమున బోరుగలిగె వే
ల్పుల దుందుభు లాకసమున। నల రంభామేనకాదు లాడిరి ప్రీతిన్. ౫౦౭

తే.గీ. దిక్కులెల్ల చాల దెలివి వహించెను। కమ్మనైన చల్ల గాలి వీచె
పలుకు గోయిలలును చిలుకలు గులుకుచున్। భువిని లోకమాత బుట్టినపుడు. ౫౦౮

తే.గీ. పుట్టినపుడె పాలపోరుమాడుగ పసిబిడ్డ స్వరయుతముగ వేదములను
బాడె నందువలన పాపను బిలిచిరి। వేదవతి యటంచు విబుధవరులు. ౫౦౯

సీ. మురువారు చెక్కిళ్లు ముద్దుబెట్టగవచ్చు నతివల కబ్బు ముత్యాలరాశి
తీరుగా చంకకు దివిచి యెత్తగబోవు కలికికి దొరుకు బంగారుముద్ద
చక్కని ముంగురుల్ సవరింపగాబోవు లలనకు గల్గునీలాలదండ
బులుపుతో చుబుకంబు పుణికి వాతెర నంటు వెలదికి లభియించు విలువ కెంపు

తే.గీ. కాలుసేతులు మొగమును గనులు దేరి । పార గనుగొని నవ్వించు పడతులకును
తవిలి వడి నిండు తులలేని రవలపిండు కన్నవారల భాగ్యంబు లెన్నదరమె. ౫౧౦

ఉ. ఈగతి కొంతసేపు పురిటింటనె వింతల జూపి యౌవన
శ్రీ గలదై తనంతటనె జివ్వున లేచి జలంబులాడి స
ర్వాగమవేదియౌ జనకు నానతి గైకొని గాన కోర్మితో
నేగి దపంబుసేయ నిత రేచ్ఛలు మాని హరిఁ స్మరించుచుఁ. ౫౧౧

క. ఒక మన్వంతర మచ్చట । నకలంకత దపముజేసి యత్యుగ్రగతిఁ
సకలాంబగాన మేనికి । నొకయించుకయైన కార్శ్య మొదవదు మౌనీ. ౫౧౨

తే.గీ. అంత నశరీరిణీదేవి యాపెతోడ । ననియె నో యింతి నీకు జన్మాంతరమున
బ్రహ్మ మొదలగువారలు బట్టలేని । పెద్దవేలుపు వెన్నుండు పెనిమిటి యగు. ౫౧౩

క. అని పలికిన విని సిరి దా । మనమున నొకయింత ముదము మల్లడిగొనగా
పనివడి తా జని యొక ని । ర్జనవని దపమాచరించె సంయుమినాధా. ౫౧౪

తే. గీ. మరలనిట్లు గంధమాదనంబున ఘోర । తపము సేయుచుండ దైత్యవిభుడు
రావణుండు నిష్ఠురక్రియాకృత సురభావనుండు వచ్చి దాని జూచి. ౫౧౫

చ. భళిభళి యేమియంద మిది భారతియో రతియో మరెవ్వతో
నెలకళయో తిలోత్తమయొ నింగిదొలంగిన కొమ్మెరుంగొ భూ
స్థలి దిగిపడ్డ చుక్కయొగదా సెక దా నిక దాళనిచ్చునే
యిలగలవారు దీని సరియే సిరియే యనం దగుఁ. ౫౧౬

సీ. కలికి పాలిండ్లంట గౌగలింపకయున్న శైలమెత్తిన భుజాశక్తియేల
వెలది నున్నని యూరువులను బట్టకయున్న దిక్కుంభికరభిదాధృతి యదేల
నాతి చెక్కిలిగొట్టి నవ్వించకున్న శ్వేతదీపమును గొన్న దర్పమేల
కొమ్మ పెన్నెరిగుంపు గోళ్ళ ద్రువ్వకయున్న మేఘనాధుని కన్న మేలిమేల

తే.గీ. పొలతుక ననంగసంగరమున జయించి । యనుపమానందరసవార్ధి మునుగకున్న
కనకగర్భ సురేంద్రాది ఘనుల నోర్చి యచ్చరల లోగొనిన నా యొయారమేల. ౫౧౭

క. అని వనితామణి దగ్గర । జని మన్మథబాణపీడ సైపకయ తటు
క్కున జేయిబట్ట గవిసిన । గని క న్నెర జేసి యింతి కనలి కనుగొనన్. ౫౧౮

క. స్తంభితుడై దనుజుడు దో । స్తంభము గదలింపలేక తడబడి జడుడై
జృంభణముమాని నిలువగ । నంభోజదళాక్షి సూచి యతికోపమునన్. ౫౧౯

ఉ. కామముబట్టలేక యిటుగా నను ముట్టితి వీవు నీకు న
క్షేమము వచ్చు నావలన చేటగు నీకును బంధుకోటికిన్
నా మహిమం బెరుంగవు సనాతనధర్మపథంబుగెంటితీ
వేమి లభించె పొమ్మనిన నేగెను రావణు డార్తచిత్తుడై. ౫౨౦

వ. అంత నయ్యింతి తత్క్షణంబు దేహత్యాగంబు చేసి కాలాంతరంబున విదేహునికూతురై సీతాదేవియై శ్రీరాముభార్యయై నానాప్రకారవిభవంబు లనుభవించె. మరియు వినుము. ౫౨౧

చ. దశరథసూతి రాఘవు డుదారగుణాఢ్యుడు చారుమూర్తి ధీ
విశదుడు తండ్రివాక్యమును బేరిమి సత్యము జేయబూని సీ
త శుభగుణాఢ్య లక్ష్మణుడు తమ్ముడు వెంబడి రా వనంబులన్
గుశలత గ్రుమ్మరన్ దనుజకోటుల గూల్చుచు ధర్మశాలియై. ౫౨౨

చ. అడవిని రాము డుండు సమయంబున సీతను రావణుండు బల్
వడి గొనిపోయి లంక నిడ వంత సలక్ష్మణుడైన రాఘవుం
డెడనెడ సీతవార్త లొకయించుక వించు వనాటయుక్తుడై
జడధిసమీపమం దడలసాగెను సీత తలంచి భ్రాంతుడై. ౫౨౩

ఉ. హా జనకాత్మజా దశరథాధిపుకోడల యజ్ఞవాటికా
భూజనకల్పవల్లి గుణభూషణభూషిత నిన్ను బాసి యీ
యోజన నేను వచ్చి యిటు లొంటిగ నుంటిని బూర్వకర్మవి
భ్రాజితదీర్ఘసూత్రమున బద్ధుడనై వలుబాము లొందుచున్. ౫౨౪

ఉ. నీకులొ కొండయో బురదొ నిత్రపుగంబమొ స్వర్గ మర్త్య పా
తాళములో మహాశ్రమమొ దండకకాననమో వ్రజంబొ యు
త్తాలవటద్రుమంబొ యొక తట్టొ యదెట్టుల సంభవించునో
కాలమువెంబడిన్ దిరుగగావలెతప్ప నశక్య మేరికిన్. ౫౨౫

ఉ. చందురుబోలు నీమొగము చక్కదనం బొకసారి చూచినం
డెందమునందునున్ దనివి దీరక జూచెద మాటిమాటికిన్
ముం దిపు డంధకారమున మున్గితి ని న్నెడబాసి యెట్లు నే
మందును రాక్షసాధముని మందిరమందును నీవు నిల్చితే. ౫౨౬

ఉ. పెండిలిముందు శంకరుని విల్ విరువం గని పొంగి చేటికా
తండముగూడి శాంకరివ్రతంబున జీరెలు రైక లర్థముల్

పండులు బంచియిచ్చితిని బ్రాహ్మణకన్యల కట్టి నీవు నా
యంత చౌలంగియుండ దరమా యొదలం దుసురుల్ ధరింపగన్. ౫౨౭

వ. ఇట్లు మాయావిశేషంబున విలపించెగాని రాము ధరణ్యంబున నుండునపు డొకసారి భగ
వంతుండైన పావకుండు దేవప్రేరితుండై సత్యేష్టంబు రచియింపంబూని విప్రవేషధారియై
వచ్చి సకలగుణాభిరాము రాము దర్శించి యిట్లు లనియె. ౫౨౮

శా. అయ్యో దుఃఖమువచ్చు నిన్ గనిన నాహా యెంతవారైన నే
మయ్యా రాజ్యపదంబు వోయె గహనంబం దుంటి వా రావణుం
డియ్యబ్జేక్షణ ముచ్చిలించునొకొ నే నిష్టైకదా మంచిసా
హాయ్యంబుం బొనరింతు ఛాయ నిడి నీ కా సీత గొంచేగెదన్. ౫౨౯

చ. అన విని సమ్మతించి నృపు డచ్చెలి నిచ్చిన గొంచు నేగి తా
ననుపమభక్తి గొల్చుచు మహావినయంబున భార్యయొద్ద నుం
చెను దనుజేంద్రుడుం గపటసీతను గైకొని యేగి లంకయం
దునిచెను దద్విధంబు విను మొర్మిని డెల్పెద సంయమీశ్వరా. ౫౩౦

తే.గీ. నీవు రావణుని జయించి నిరుపఘూన। వైభవమున నయోధ్యకు వచ్చునపుడు
జానకీదేవి పరిశుద్ధి సర్వజనుల। కెరుకపడ నే నొసంగెద నింతి మదల. ౫౩౧

ఉ. నీచుడు దానవేంద్రు డవనీసుత ముచ్చిలగా దలంచి మా
రీచుని వేడగా గపటవృత్తిని వా డొక పైడిలేడియై
యేచి యరణ్యమందు జరియింపగ జూచి విదేహకన్య దా
రాచనెలం గనుంగొని కరంబు మనంబున వేడ్కమీరగన్. ౫౩౨

ఉ. చక్కని పైడిలేడి యది సయ్యనబోయెడి వొన్నగున్నకున్
బ్రక్కను గుజ్జుమావికడ బంధుకదక్షిణమార్గమందు న
మ్మక్క కనుంగొనంగ మన సయ్యెడి నా కది తెచ్చియిమ్ము నే
మ్రొక్కెద నీకు రాఘవ సముజ్జ్వలమామకచిత్తబాంధవా। ౫౩౩

చ. అన విని సీతమీది తమి నా నృపకుంజరు డట్టె చూచి యా
కనకమృగంబు దేర సమకట్టి నిజానుజు సీతయొద్ద గా
పునిచి వనాంతరంబునకు నొంటిగ బాణసహాయుడై చనన్
దనుజుడు మాయచేసి పలుదారులు ద్రొక్కి యలంచె రామునిన్. ౫౩౪

చ. అది గని రాము డొక్క నిశితాస్త్రమునన్ బడనేయ లేడి దా
దుది రొద లక్ష్మణా యనుచు దోరముగా నిడ దూరమందు న
మ్మదవతి యాలకించి నయమాన్యు మరందిని జూచి యిట్లనెన్
పదపడి యే యనర్థములు బాల్పడునో యన కార్తచిత్తయై. ౫౩౫

క. సీయన్న లక్ష్మణా యని । కూయిడగా వినుచు నూరకుండగ దగునే
మాయహరిణంబు వచ్చె న । పాయం బేమాయెనొక్కొ యట జను మింకన్. ౫౩౬

క. అన విని లక్ష్మణు డో నా । జననీ రామునకు బీడ సలిపెడివా డీ
వనరుహగర్భాండంబున । గనరా దేమిటికి నిట్లు గందెదు మదిలోన్. ౫౩౭

తే. గీ. కలికి మరదిమాట కలిగి యో లక్ష్మణా । నృపుడు చనినవెనుక నీవు నన్ను
జేకొనందలంచి జెప్పితివేగాక । అన్న సెడవి నిడుట న్యాయమగునె ౫౩౮

తే.గీ. వదినెపలుకులు సూదులవలెను జెవుల । నొంప సీతను విడిచి యా యుత్తముండు
వనములోనికి నరుగ రావణుడు సూచి । తా నలరి భూసురాకృతిధారి యగుచు ౫౩౯

క. భిక్షము వేడిన జలజద । ళాక్షియు నిడ రా రథంబునం దిడుకొని వా
డక్షీణపరాక్రమమున । సుక్షముడై లంకలో నశోకముక్రిందన్. ౫౪౦

తే.గీ. సీత నిడియె నంత శ్రీరాము డడవిని । పైడిలేడి నేయ పాడు మెకము
నొడలుమాని మేల్మియొడలితో వైకుంఠపురికి నరిగె వాని పుణ్యమేమొ. ౫౪౧

తే.గీ. అంతలోనె రాము సంతికంబునకు లక్ష్మణుడు బోవ దనుజు చావు జూచి
యయ్యొ సీత విడచి యరుదెంచితివి యామె । పలుకు ములుకులకును సలుకు జెంది. ౫౪౨

క. రాముని సక్షేముని । దా ప్రేమం గని మ్రొక్కి నిలువ బెగ్గిలి యతడున్
భామిని యేమాయెనొ నీ । వేమిటి కిచ్చటికి వచ్చి తిది దగునె యనన్. ౫౪౩

తే.గీ. వదినమాటలు వినలేక వచ్చినాడ । నేమిచేయుదు నన వార లిరువు రేగి
యాశ్రమంబున జూడంగ నతివ లేమి । మూర్ఛితుండయ్యె రాము డమ్మగుద దలచి. ౫౪౪

తే.గీ. పలువిధంబుల విలపించి నిలువలేక ననుజుతోగూడి చాపసహాయు డగుచు
సీత వెదకుచు కిష్కింధ జేరి యచట । వానరసమూహముల చెల్మి వడసి నృపుడు. ౫౪౫

ఉ. కొంకక వార్థి దాటియు లఘుక్రియ లంకను ముట్టి రావణుం
బింకమడంచి రాత్రిచరబృందమునెల్ల వధించి జేతయై
పంకజలోచనం బరమపావని యంచు జగం బెరుంగ ని
శ్శంకc గృశానుకీల నిడ స్వాహమగండు కృపానమేతుడై. ౫౪౬

ఉ. స్వస్తి నమస్తభూవలయశాసనశౌండశరాయ యంచుc దా
వాస్తవియైన సీతc గొనివచ్చి రఘూద్వహుముందల నిల్పి భూ
రిస్తుతుడై కడ న్నిలువ శ్రీవన ఛాయయు నిల్చి పల్కె నీ
వస్తువు నేమిసేయుమనువారలు నావుడు రామ పావకుల్. ౫౪౭

వ. నీవు పుష్కరంబునకుం బోయి తపంబు సేయుము. స్వర్గలక్ష్మివై సుఖం బనుభవించెదు.
నావుడు నలరి పుష్కరంబున మూడులక్షల వర్షంబులు తపంబు సేసి స్వర్గలక్ష్మియై

తన్మహిమంబునఁ గాలాంతరంబున ద్రుపదు యజ్ఞకుండంబున ద్రౌపదియై పుట్టి పాండవు
లైదుగురికి భార్యయయ్యె. మఱియు వినుము. ౫౪౮

ఉ. శ్రుతిమతి నాఁగ గృతఁగ యశము జెంది కుశధ్వజుకూతు రయ్యె నం
చితగతిఁ ద్రేత రాముసతి సీత విదేహునికూతు రయ్యె నా
తతగతిఁ దానిఛాయ యల ద్వాపరమందును ద్రౌపదీత్వగ
ణ్యత వహియించె నిట్టులు త్రిహాయిణి యయ్యె యుగత్రయంబునన్. ౫౪౯

క. నావుఁడు విని నారదుఁ డను । దేవా సందియము నాకు దీరదు చెపుమా
దేవి ద్రుపదునికుమారిక । యై వరపంచకమునుఁ గలయం గతమేమో. ౫౫౦

తే.గీ. సత్యసీతతోడ జనపాలుఁ డేగిన । వెనుక మాయసీత జనపరాజ్ఞ
శివునిఁగూర్చి తపము చేసిన దేవుండు వరము వేడుమనుచు వచ్చి పల్కె. ౫౫౧

క. దేహిపతిం దేహిపతిం । దేహిపతిందేహిపతి మనెం దేహిపతిం
హే హర శంభో యనుచున్ । సాహసమున నైదుమార్లు శంకరు డంతన్. ౫౫౨

తే.గీ. అంగనా యైదుగురుభర్త లబ్బఁగలరు । నీకు నావుఁడు మదిఁబొంది నీరజాక్షి
ద్రుపదునింటను జనియించి రూప యౌవనాఢ్యయై పాండవులభార్య యయ్యెఁజుమ్ము. ౫౫౩

క. పిమ్మట రాముఁడు జగముల । యమ్మను నిజమైనసీత నంది ముదమునన్
సమ్మతి విభీషణునకున్ । బ్రమ్మిన లంకాపురంబు పట్టముగట్టెన్. ౫౫౪

క. వెండియు నయోధ్యకుం జని । మెండుగ రాజ్యంబు జనులు మేలన బదునొ
క్కొండు సహస్రాబ్దంబు లఖండానందమున నేలె గాయకమౌళీ. ౫౫౫

వ. ఇవ్విధంబున దాశరథి భారతంబు పాలించె నంత నవతారకార్యసమాప్తిఁ గావించి సర్వ
జనులం గూడి రాఘవుండు వైకుంఠంబు సేరి వేదవతియైన లక్ష్మిం గలసె ననిచెప్పి
మఱియు నారాయణుండు. ౫౫౬

తే.గీ. మరి కుశధ్వజుభ్రాత ధర్మధ్వజుండ । టంచు దెల్పితి వింటి వయ్యధిపుభార్య
మాధవి యనంగదగు నొక్క మంజువాణి । సైకతశ్రోణి హరినీలచారువేణి. ౫౫౭

క. కాముకుడై రసికాగ్రణి । యై మించిన నృపునితోడ నది వర్షశతం
బా మరుకేళిం గలసెన్ । దా మేలగు గంధమాదనంబున నధిపా. ౫౫౮

సీ. మంచిగంధము పూసి మించువాసన గమాయించు గస్తురివీడె మిచ్చి యిచ్చి
తతహంసతూలికాతల్పంబు సవరించి మెత్తగా నడుగుల నొత్తి యొత్తి
నీటు జూడను ముందు నిల్వుటద్దముబెట్టి సొగసుగా సిగదండ జుట్టి చుట్టి
పరిగయోణీపింఛ సరిజేసి విరజాజివిసుల వీవనబట్టి విసరి విసరి

తే. గీ. పెనగి వెలలేని ముద్దులు పెట్టిపెట్టి । గుబ్బపాలిండ్ల కసిదీర గ్రుమ్మిగ్రుమ్మి
చాల నెనుబడినా ల్గుపచారములను । రాచవలరాచకొలువులో రమణి మెలఁగె. ౫౫౯

చ. పగటిని రాతిరంచును నృపాలుడు గాంచెను కోమలాంగి నె
మ్మొగమును జూచి చంద్రుడను మోహములో బడి దంతపంక్తి రి
క్కలగమి యంచునుం భ్రమసి కమ్మని వాతెరయే సుధారసం
బుగ గొని కన్నులం గలువపువ్వులుగా గొని యేమి చెప్పుదున్. ౫౬౦

సీ. దొండతీవియ ప్రక్క తొయ్యలి నిలుచున్న బండని వాతెర పట్టి చిదుము
గొనబు మారెడుపత్రి గోయుచు గలికి చేయెత్త గాయని గుబ్బ నెనసి గిల్లు
పొన్నచాటున జేల దిన్నగా సవరింప నలరని మెలత పొక్కిలిని బట్టు
పూలపుటిక కంటి పొత్తి గోయుచునుండ నిడుగంబమని యింతి తొడల నిలుచు

తే.గీ. మారనిట్పారి మంత్రాభిచారకలిత । కామినీగ్రహమోహాంధకారచలిత
చిత్తసర్వస్వుడైన యాక్షితివరునకు । నెరుక చెడిపోయె మరపాయె నెల్లకడల. ౫౬౧

వ. ఇట్లు ధర్మధ్వజుండు నూరు దివ్యవర్షంబు లిది పగ లిది రేయి యని యెరుంగక సుదతితో విరతిలేని సురతిం గలసి యెట్టకేలకు నెరుక వడసి విరమించె. నంత నమ్మాధవికిం జూలు నిలచి నూరేండ్లు మోచి యొక శుభదినంబున శుభనక్షత్రంబున శుభవాసరంబున శుభయోగంబున శుభకరణంబున శుభలగ్నహోరాద్రేక్కాణనవాంశద్వాదశాంశత్రింశాంశంబుల శుభగ్రహ దృష్టి యోగాదులు గల వేళ గార్తికపూర్ణిమ శుక్రవారంబున మహలక్ష్మికళాసంపన్నయగు కన్నియం గనియె. ౫౬౨

క. పలుచని మోవికి నిడు । గన్నులకుఁ జలజాక్షి ముద్దునొసటికి నిలలో
దులలేదు లేదనంగా । తులసీ నామంబు దాల్చె తొయ్యలి యనఘా. ౫౬౩

క. పుట్టిన బాలిక వెంటనె దిట్టయగుచు నిల్లువిడచి ధృతి గాననముం
బట్టి తపమాచరించెను గట్టిగ నొక లక్షయేండ్లు కడునియతి మెయిఁ. ౫౬౪

వ ఇట్లు గ్రీష్మంబునం బంచాగ్ని మధ్యంబునను, దోయవస్త్రయై శీతకాలంబునను, వృష్టి ధారలం గూర్చుండి ప్రావృట్కాలంబునను, నిరుబదివేలేండ్లు ఫల తోయాశనయై, ముప్పది వేలేండ్లు పత్రాహారయై, నలుబదివేలేండ్లు వాయ్వాహారయై, పదివేలేండ్లు, నిరాహారయై యొంటికాల నిలచి నారాయణుండు భర్తకావలెం గోరి తపంబుసేయ గరుణార్ద్రహృదయుండై పరమేష్ఠి దర్శనం బిచ్చి వరంబు వేడుమనినం దులసి యిట్లనియె. ౫౬౫

క. కొంచక సర్వజ్ఞునకున్ । బంచాంగముసెప్పబూను పామరువి క్రియఁ
మించి వచింతు నాదగు । నంచితవృత్తంబు వినగదయ్యా మహాత్మా. ౫౬౬

క. నే గోలోకమునందుం । బాగగు తులసీసమాఖ్య బరగెడి గోపిన్
శ్రీగోపాలుని కింకరినై గర్వముమీర గులుకునపు డొకవేళన్. ౫౬౭

తే. గీ. రాసమండలనాయకి రాధ వచ్చి । చూచి హరి బిట్టు గద్దించి యేచి శాప
మిచ్చె నాకును పుట్టుము పృథ్విని నర । యోని నని యంత గోవిందు డూరడించి. ౫౬౮

క. నాయంశమున జనించుం । దోయజముఖి యవని నొక చతుర్భుజు డతనిం
బాయక పొందెదు దపముం । జేయుము భారతమునందు జెచ్చెర ననినన్. ౫౬౯

తే.గీ. తత్క్షణంబ యేను ధర్మధ్వజునిపత్ని । యందు బుట్టి యడవియందు జేరి
తపము జేసి నిన్ను దర్శించితిని నాకు । హరిని బతినిజేయుమయ్య యనిన. ౫౭౦

వ. వినుము శ్రీకృష్ణాంశుండయిన సుధాముండను గోపాలుండు గలడు. భారతీశాపంబున దనుజ
వంశసంభూతుండై శంఖచూడు డను పేర భారతంబున నున్నవాడు. రాధికా ప్రభావ
భయంబునం జేసి నిన్ను విలంభింప నక్షముడయ్యె. వాడు జాతిస్మరుండు; నీవును జాతి
స్మరవు. కావున వానికిం భార్యవు గమ్ము. పిదప నారాయణ వచనంబునంజేసి నీవు వృక్ష
రూపంబు నొంది విష్ణువల్లభ వయ్యెద, వదియునుంగాక లోకపవిత్రవయ్యెదవు. నీ పత్రి
లేని పూజలెల్ల నిష్ఫలంబులయ్యెడు. బృందావనంబున నీవు బృందానామంబు వహించెదవు.
నీ వచట గోపాలుంగూడి సకలగోపగోపీపూజ్య వయ్యెదవు. నావుడు విని హృష్టమాన
సయై తులసి బ్రహ్మకు నమస్కరించి. ౫౭౧

తే.గీ. రెండుచేతుల హరియందు నుండు వలపు । నాలుగుచేతుల హరియందు నాకు లేదు
కృష్ణవచనంబుబట్టి నే నియ్యకొంటి । దుదకు ద్విభుజుని కూరిమి దొరకవలయు. ౫౭౨

తే.గీ. రాగ రాధిక నెదిరింపరాదు నాకు । నెట్లు ద్విభుజుని కొన్నాళ్ళకేని గలయ
నోపుదును దాని దెల్పు నీ ప్రాపుగంటి । ననిన పరమేష్ఠి తులసితో ననియె నిట్లు. ౫౭౩

వ. షోడశాక్షరంబయిన రాధామంత్రంబు నీ కుపదేశించెద, నిది గైకొంటివేని యీ గోప్యంబు
రాధ యెరుంగనేరదు. రాధతో దుల్యవై ప్రాణసమాన వయ్యెద వని చెప్పి తులసికి రాధా
షోడశాక్షరి నుపదేశించి కవచంబునుం బూజావిధానంబునుం పురశ్చర్యావిధంబును నేర్పిన
నది యట్లు జేసి సిద్ధసమస్తభోగాస్పద యయ్యె నని చెప్పి మరియు. ౫౭౪

క. జిగిబిగిజవ్వనంబుబోలయ చిన్నియ వన్నియలెల్ల కన్నెకుం
దగి వగ లొద్దికల్వెలయ దళుకుల బెళుకుల గులుకు చూపులన్
చ. నగ వెగుగన్ను బొమ్మకవ నాలినడల్ నునుగెంపుమోవి ప
ల్లగరపు లిచ్చలున్ బయిటలో నవరింపులు హెచ్చె నారదా । ౫౭౫

అ వ్వవిలో వసియించిన । జవ్వనికిన్ దపసి వలతి చానలు చెలులై
పువ్వని కాయని పండని । నవ్వని యాటలని చెంగనాలని మెలగన్. ౫౭౬

క. వారలతో చెరలాడుచు । నారీమణి నిండుజవ్వనంబు కలిమి న
మ్మారుని పుష్పశరంబుల । కోరువలే కార్తికి యూరువసాగెన్. ౫౭౭

క. అది గని పడతులు చెలియా । యిది యేమే నీకు వేడురెత్తినక్రియ మా
మదికిం దోచెడి మదన । ప్రదరాహతి జిక్కి డిల్లపడి యుంటిగదే. ౨౬౮

క. అనిన విని చెలి మనోగతుడు । సుశుభనారాయణాంశుడును నగు యోగీ
శుని శంఖచూడు నెనయక । మనగలనే కొమ్మలార మదనునిబారిన్. ౨౬౯

సీ. పొలతిరో యిది గందపొడియంచు జల్లుదే కోడిగాలపై వఱ్ఱగుండ దెచ్చి
కలికిరో యిది మంచిగంధమం చలదెదే నవ్వుటాలపై వసనాభి నూరి
నెలతరో యిద్దె పన్నీరని ముంచెదే సలసలమను నుష్ణజలము బోసి
తరుణిరో యిది యెఱ్ఱదామరం చద్దెదే కణకణయను కొరకంచు బెట్టి

తే.గీ. తూడులా ఱ్ఱామలే యివి చేడె వట్టి । వేళ్ళచే చిత్రమూలమె వింతలాడి
వెన్నెలపై యిది కార్చిచ్చు విధముసుమ్ము । నింగి నిండునెలయపై ఫిరంగిగుండు. ౨౭౦

సీ. దిరిసెనపూలంచు దెచ్చిపెట్టితిరి నా చెవి బరువెక్కి పోజిమ్మరమ్మ
కలిగొట్టుపూలంచు దల దురిమితిరి నా తలదిమ్ముగొడమె పోదులుపరమ్మ
సంపంగిపూలంచు సవరించితిరి దండ మెడ యెత్తలేను వే గెడపరమ్మ
సన్నజాజులటంచు శయ్యనించితిరి నా యొడలెల్ల గందె వే దుడువరమ్మ

తే.గీ. చెలిమిజేసితి మీరిట్లు జేయుదురని । మది నెరుంగక యిన్నాళ్ళు మగువలార
మ్రొక్కెదను నన్ను విడచి మీదిక్కు మీరు । చూచుకొనరమ్మ యిక వేగ సుదతులార. ౨౭౧

క. అని యొడలు దెలియ కీ గతి । వనితలు గావించు చలువపనులెల్లను వే
దన హేతువులై తోచిన । మనమున గుందుచును మదనుమాయకు లోనై. ౨౭౨

సీ. పూసెద గంధంబు పోబోకు పోబోకు మని లేచి యుంకించు నాకసంబు
యేమిరా వలపు నీ కిందు లేదా యంచు మాటికి దనలోనె మాటలాడు
నున్నగా దువ్వి నే నూనెరాచెదను నీ మీసాలకని ఱ్ఱేళ్ళ మెదపునుఱక
ప్రొద్దుబోయెను సెజ్జ బూలు జల్లితినంచు నొత్తిగిల్లి బిరాన నత్తమిల్లు

తే. గీ. కాంత రమ్మని మెత్తల గౌగలించు । కటికహృదయంబు నీదని మెటిక విరచు
పురుషులను నమ్మరాదని మూతిద్రిప్పు । నంతలో మేలుకాంచి బల్వంత వగచు. ౨౭౩

వ. ఇట్లున్న జవరాలిం జూచి తపసికన్నియలు తమలో దాము గుసగుసలాడుచు వసవసం
జిక్కి యొండొరులతో ౨౭౪

క. వలపులు తులసీదేవికి । తలకెక్కెను తనదుమేను దా నెరుగదుగా
చెలులార యేమిచేయుద । మలవియె మన మెన్నదెఱుగమని విలపింపన్. ౨౭౫

క. తులసి విలపింప ధోడుగ । జెలియలు విలపించి రేమి చెప్పెద నెల్లగో
యెల బలికె నందునందున నళిసంఘము మొరసె రాగ మతిశయమయ్యెన్. ౨౭౬

క. సుతిమీరి రాగమునబడి । సతి మృదువీణాస్వరమున సావేరీసం
గతి మంద్రమధురగానము । గతి నేడ్చెన్ శంఖచూడగతమతి యగుచున్. ౫౮౭

ఉ. కాయము సన్నగిల్లె జలకంబులనాడి నెలాయె నూనియన్
రాయగలేదు వేసలికి రాత్రుల నిద్దురగాన సన్నమున్
దోయ మెఱుంగనే యెరుగ దొయ్యలిపిండుసు జూచి చూడన
ట్లాయె నికేటి నాబ్రతు కహా ప్రియు కౌగిలి యబ్బకుండినన్. ౫౮౮

క. భరమాయె విరహవేదన । తరమా నిలువంగ ఘోరతర మారశరా
కరమాయెను వనము మనో । హర మాధవ మారుతముల నలవియె కడవన్. ౫౮౯

ఉ. ఏచిన వేడుకన్ బతుల యిష్టవినోదము గొంతు రొప్పుగా
నోచినయమ్మ లెందు గౌరనోములు నోచినయట్టివారికిన్
వాచవి దీరునే మగల బాయని భాగ్యముగన్నవారలన్
జూచుచు గ్రుక్కిళించుకొనుచున్ మది నిచ్చలు బల్వరించుటే. ౫౯౦

వ. ఇట్లు బల్కుచు ౫౯౧

శా. నిండుంజందురు బండువెన్నెలలకున్ మేనిచ్చి యెట్లోర్తు నీ
గండుందుమ్మెదనారివాడు బ్రదుకంగానిచ్చునే యిస్సిరో
గండాగొండిశిఖండితండముల కేకల్ కోకిలాకాకలున్
మెండాయెంగదె చల్లగాలిబుడుతల్ వేడాయె నేమందునే. ౫౯౨

వ. అని చంద్రు నుద్దేశించి ౫౯౩

ఉ. మానుగ నిత్యజంగమసమాచరణుండవు నీవు వాడు రా
మానుజవంశవర్ధనుడు హా కడు నచ్చెరువయ్యె లింగమున్
బూనినవానిలోకమున భూతపతి ప్రతిపక్షు పొత్తునుం
గానము వైష్ణవుం గలయ గారణమేమొకొ యో నిశాచరా । ౫౯౪

తే.గీ. విషధిలో విషముతో నీవు వెలయబుట్టి । విషధరుని తలకెక్కితివిర సుధాక
రాఖ్యగల్గుట జూడ నత్యద్భుతంబు । కవివరుల మెప్పులెన్న నిక్కంబులగునె? ౫౯౫

వ. అని మన్మథు నుద్దేశించి ౫౯౬

ఉ. ఓరి లతాంతమార్గణ నయోచితకృత్యముమాని పాంథులన్
గారియబెట్టినన్ గనలి గాలగళుం డశరీరు జేసినన్
నీరయి యెట్లుగా మరల నేర్చితి బువ్వులకోరి బట్టగన్
వార కదృష్టరేఖ గలవారల కెందు నసాధ్య మున్నదే. ౫౯౭

వ. ఇట్లు విరహవేదనాదోదూయమానచేతస్కయై యుండం గాంచి తపసికన్నియలు శైత్యో
పచారంబులం దేల్చుచుండి రంత శంఖచూడుండు మహాయోగియై జైగిషవ్యువలన గృష్ణ

మంత్రం బుపదేశింపబడి సిద్ధుండై తపంబుజేసి వాంఛితార్థంబు బడసి బ్రహ్మజ్ఞానంబుచే బదరికాశ్రమంబునకు వచ్చి యొకనాడు వినోదార్థం బరణ్యంబునకుం జని విహరించు చుండ నంత ౫౯౮

సీ. నవయౌవనమువాని ననవిల్తుసరివాని నగుమోమువాని మేల్నడలవాని
కుండలాంచిత చారుగండస్థలమువాని లలిత త్రిరేఖికాగళమువాని
కస్తూరికాగురు గంధలేపమువాని నకలంకపుష్పమాలికలవాని
సమదేభకరసమాజానుబాహులవాని దళమైన బవిరిగడ్డంబువాని

తే.గీ. భానుమండలతులిత సుప్రభలవాని ఘనతరోదారపీనవక్షంబువాని
గంధగజమందగమనంబు గలుగువాని శంఖచూడుని గనుగొని సరసిజాక్షి. ౫౯౯

ఉ. కాంచినయంతనే యొడలు గంపిలె జెమ్మటబుట్టె మేను స్తం
భించెను సిగ్గుదోచె నల భీతమృగేక్షణ లేవలేక యొ
క్కించుక చేడె నూతగొని యెట్టులొ నిల్చి మొగంబు ప్రక్కకుఁ
వాంచి పయెంట దిద్దుకొని వల్లికచాటున జేరియుండగన్. ౬౦౦

వ. శంఖచూడుండు చూచి ౬౦౧

ఉ. నారి యిదేమి యి వ్వనమునందు వియచ్చరసుందరీమణుల్
చేరి వసించిరే యహహ చిన్నది కన్నది విన్నదే సదా
కారముతోడ గ్రుమ్మరెడి కాననలక్ష్మియొ కాకయున్న నీ
సౌరును గల్గునే మనుజసారసలోచనలందు నెందునుఁ. ౬౦౨

ఉ. దీని మొగంబునందు గల తేటను నూరవవంతయేనియుఁ
గానక చందురుండు భువి గాలిడ డాకనమందె పారు న
య్యో నలినాక్షి నవ్వ తన యొప్పెపుదీధితి దూలజేయగ
మానముబోయె బ్రాణమయినన్ భరియించెదనంచు బందయై. ౬౦౩

ఉ. చేరల గొల్చినన్ మిగులు చేడియకన్నులు వేణియంటిమా
బారకు హెచ్చు గుందనపుబంగరువన్నియ మించు మేనిడా
లౌరవురా నునుంగవునటన్నను ముష్టికి లోబడున్ బిసా
హారులకంటె మందము లహా గమనంబులు వింతయయ్యెడున్. ౬౦౪

ఉ. చక్కదనాలకుప్ప లతచాటునకేగెను సిగ్గుపేర్మిచే
నక్కట దీనిభావ మెటు లారయగల్గెద నంచు మెల్లనన్
బ్రక్కనె యున్న పొన్నకడ భామినిముందర నిల్చి ధీరుడై
మిక్కుటమైన ప్రేమమున మించి వచించె రసోచితంబుగన్. ౬౦౫

ఉ. ఎక్కడనుండి వచ్చితివి యెవ్వతె వెవ్వనిబిడ్డ వెందుకీ
చక్కి వసించె దీవు మధుసారము గుల్కగ బల్కి నీకు నే
దక్కిన కింకరుండ గనుదమ్ముల వ్రాల్పగనేల సిగ్గున
న్నిక్కము నీవు దేవతరుణీమణివంచు దలంచెద న్నెలీ. ౬౦౬

క. అనవుడు నిని వనితామణి । మనమున గల వలపు డాచి మరియాదకు లో
కనయమునకు నొక్కించుక । యును లోపము గలుగకుండ నొయ్యన బలికెన్. ౬౦౭

క. వినుమా నే ధర్మధ్వజు । ననుగుంగూతురను వనమునందు దపంబున్
బొనరింప వచ్చితి దపస్విని నిచ్చోటు వాసి నీవు శీఘ్రమ చనుమా. ౬౦౮

క. ఏకాకినులై కులసతు లేకాంతంబులను దిరుగ నిల సత్కులజుల్
తేకువ నీ వెవ్వతెవని । వీక నడుగరాదటంచు వేదము పలుకున్. ౬౦౯

క. కాముకుడుగాని యడుగడు । కామిని గులసతిని జేరి కాంచి కడంకన్
గోమలి నీ వెవ్వతె వని । యా మనుజుడు పుణ్యశీలు డగునే చెపుమా. ౬౧౦

వ. అదియునుంగాక ౬౧౧

తే.గీ. కామినీభోగమున మేలు గలుగ దెందు । కాముకులపాలి శాకినీగ్రహము యువతి
జపతపోనిష్ఠలకు నవసానశాంతి । పుణ్యములకెల్ల కత్తులబోను చాన. ౬౧౨

తే.గీ. అంగన యనం బయోముఖంబై తలిర్చునట్టి విషకుంభమే దానియందు బ్రీతి
దగిలి వర్తించెనేనియు దప్పక చెడు । పురుషుని గళంబునకు బొండ పువ్వుబోడి. ౬౧౩

తే.గీ. అంగిట విషంబు మున్నాల్క నమృత మిడుక । మంచిమాటల దేలించి మమత గొల్పి
తుట్టతుదకును నట్టేట బుట్టిముంచు । నమ్మరా దంగనలపొందు నరుడు ధాత్రి. ౬౧౪

సీ. కమ్మనిమాటల గరగించునేగాని వలపొకింతయు లేదు తలపులందు
వగలు జూపుచు చాల తగులుగొంటయెగాని నిజమాడు టనునది నీలివార్త
వన్నెలు చిన్నెలు వాసి మెండేగాని మది నొక్కి యనుమాట మట్టనమ్మ
చీటికిమాటికి జీరి వేడుకెకాని భక్తివిశ్వాసము ల్పట్టులేదు

తే.గీ. పాపమునకును వెరువరు పరమసాహసలు కఠినచిత్తలును కోప సహిత లన్య
పురుషయోగవిచారము ల్పూనువారు ఆడువారిని నమ్మరా దంద్రు బుధులు. ౬౧౫

సీ. కలహంబులకు నెప్డు కాల్దువ్వు వేషంబుగలవానిపై కన్ను గలిగియుండు
సంభోగమున నాత్మ సంతసంపదు నందు గొరతవచ్చినయేని బెరలజూచు
రసికులకై తారి రమణు సేవింపక వృద్ధుని శత్రువురీతి జూచు
ప్రియవాక్యములతోడ బిల్లి యెలుకనట్లు కటుకున గొరకు దా గనలెనేని

తే.గీ. బ్రహ్మ విష్ణు శివాదుల భ్రాంతిలోన । జరచు లోకంబునం దింద్రజాలగత్తె
మాయమందులమారి కొంపనిడుకొన్న । బ్రహ్మరాక్షసి యింతితో బ్రతుక వశమె. ౨౧౬

తే.గీ. అయ్యయో స్త్రీ శరీర మేమందు సర్వపాపసంచయములపుట్ట పరమనీచ
మెందుజూచిన హేయమ యిహపరములయాస విడనాడి కామిని నంటవలయు. ౨౧౭

తే.గీ. కల్లగా దంగనల పొందు నల్లత్రాచుతోడ చెలిమియ యెరికే గూడదబ్బ
దబ్బరసుఖంబు నమ్మి యీ ధాత్రి జనుడు।భ్రమసిపడు చిచ్చులో శలభంబుమాడ్కి. ౨౧౮

వ. అనిన విని శంఖచూడుండు. ౨౧౯

తే.గీ. ముద్దువగలాడి వ్రజాలమూట పీవు । పలుకు బలుకులలో గొంత కలదు నీతి
కాన నాయందు దయగల్గి పూని యట్లు । ధర్మములు చెప్పితి వది సంతసమె నాకు. ౨౨౦

క. స్త్రీరూపము ద్వివిధముగా । సారసగర్భుండు సృష్టిసల్పె జగముల
జారుతరరూపవతులను । సారాసారప్రభేదసంగతి నబలా. ౨౨౧

తే.గీ. కమలయు సరస్వతియును దుర్గయును మరియు నెన్న సావిత్రి రాధిక సృష్టిసూత్ర
రూపలై రాదిసృష్టిని రూఢి వారి । యంశముల కారె స్త్రీలు బ్రహ్మాండమందు. ౨౨౨

వ. వినుము శతరూపయు, దేవహూతియు, స్వధయు, స్వాహయు, దక్షిణయు, ఛాయావతియు, రోహిణియు, వరుణానియు, శచియు, గుబేరపత్నియు, దితియు, నదితియు, లోపాముద్రయు, ననసూయయు, కోటభియు, దులసియు, నహల్యయు, నరుంధతియు, మేనకయు, దారయు, మందోదరియు, దమయంతియు, వేదవతియు, గంగయు, మనసయు, తుష్టి, పుష్టి, మేధాకారిక, వసుంధరా, షష్టి, మంగళా, చండీ, ధర్మపత్నులును, స్వస్తి, శ్రద్ధా, శాంతి, కాంతి, క్షాంతి, నిద్రా, తంద్ర, క్షుత్పిపాసా, సంధ్యారాత్రిదినంబులును, సంపద్ధృతి, కీర్తి, క్రియా, శోభా, ప్రభాశివలును నుత్తమ స్త్రీస్వరూపలై యుగయుగంబులం జనియింతురు. ఇట్టి కలాకలాంశలై జనియించు స్త్రీలు సాత్వికాంశంబులం బొడమి యుత్తమరూప లగుదురు. రాజస, తామస కలాభివేశంబులవలన నెక్కువ తక్కువల బుంశ్చల్యాది స్వరూపంబుల నప్రశస్తలగుదురు. సాత్వికాంశంబుల నుత్తమలు, రజోంశంబుల మధ్యమలు, తమోంశంబుల నధమలు నైయ్యుందు రిది గుణత్రయవిభాగంబులబట్టి యుండు. జ్ఞానియగువాడు పరకాంతం గనుల జూడడు. బ్రహ్మాజ్ఞచే నీ సమీపంబునకు వచ్చినవాడ. నేను శంఖచూడుండను. గాంధర్వంబున ననుం గైకొనుము. నేను పార్షదులగు నెనమంద్రు గోపకులలోనివాడను. రాధాశాపవశంబున నిప్పుడు దానవుండనై యుంటి. నీవును రాధికా శాపంబు నంజేసి యిట్లు భూలోకంబునం బ్రభవించి యుంటివి. అని చెప్పిన విని నవ్వి తులసి యిట్లనియె. ౨౨౩

తే.గీ. ప్రాణనాథ నీదు పల్కులవలన బరాజయంబు నొంది రమణకృత్య
యోగ్యతను గ్రహించియుంటి నింతియసుమ్ము । కనలపలదు వేరుకాదు నమ్ము. ౨౪

క. వినుమా స్త్రీజితు డీ జగమున నిందితుడండ్రు బుధులు మోహంబున వా
నిని గూడి స్త్రీ పతితయగు । గన స్త్రీజితునకును లేదుగా నిష్కృతియున్. ౨౫

వ. విప్రునకు దశాహంబునను, క్షత్రియునకు ద్వాదశాహంబునను, వైశ్యునకుం బంచదశాహంబునను, శూద్రునకు మాసంబునను జాత మృతకంబుల శుద్ధి వాటిల్లుంగాని స్త్రీజితునకు జితావహనంబునంగాని శుద్ధి లేదండ్రు. స్త్రీజితుని పిండ తర్పణంబులు పితృదేవతలు ముట్టరు. అట్టివాని బుష్పఫలపూజాదికంబులు దేవతలు గ్రహింపరని పెద్దలు వచించిరి. కావున నిన్ను బట్టిచూచితిగాని మరియొండుగా దదియుంగాక. ౨౬

తే.గీ. కాంతుని బరీక్ష గావించి కన్య గోరవలయు దారిద్ర్యసహితు గోపనుని జడుని
దుర్ముఖుని బంగు గుడ్డిని దోషకారి । గుత్సితుని మూకు గోరంగగూడ దండ్రు. ౨౭

తే.గీ. పరమశాంతుని యౌవనభ్రాజమాను । సాధువును గర్మగలవాని జతురు జ్ఞాని
పండితుని సత్కులోత్పన్ను భావవేది । కోమలాంగుని విభునిగా గోరవలయు. ౨౮

తే.గీ. కన్నియను బెంచి పెంచి విక్రయముసేయు । నరుడు గుంభీపచన మను నరకమందు
గ్రిములు గరువంగ మూత్ర పురీషములను । ద్రావును । జతుర్దశేంద్రులు దరలుదనుక. ౨౯

వ. ఇట్లు పలుకుచుండ బ్రహ్మ ప్రత్యక్షుండై నిలచినం గాంచి తులసియు, శంఖచూడుండును భక్తివినయంబులు పెనంగొన నమస్కరించి నిలచియున్నం గాంచి పరమేష్ఠి యిట్లనియె. ౩౦

ఉ. ఏటికి వాద మిట్టులు మృగేక్షణతోడను పారకోటిలో
మేటివి నీవు భామినుల మేల్తర మియ్యది మీర లిర్వురున్
సాటికి జెల్లువారు గుణసంపద లెందు గొరంతలేవు ము
మ్మాటికి మీకు శోభనము మానక దీని బరిగ్రహింపుమీ. ౩౧

తే.గీ. వెలదుకను నీవు గాంధర్వవిధిని బెండ్లి । చేసుకొను మిట్టి వియ్యంబు చేరవచ్చి
నపుడు విడుచుటకంటె నెయ్యదియు దుఃఖకరము పేరొందు లేదు నిక్కంబు నమ్ము. ౩౨

సీ. అచ్యుతునకు లక్ష్మి యా కృష్ణునకు రాధ నాకు సావిత్రి చంద్రమకుటునకు
సతి కశ్యపునకు నదితి వసిష్ఠున కరుంధతి గౌతమునకు నెన్నగ నహల్య
యవ్వరాహునకును నచల యధ్వరునకు దక్షిణాయువతి కర్దమున కల్ల
దేవహూతియును నత్రికి ననసూయయు నలునకు దమయంతి నళినవైరి

తే.గీ. కల్ల రోహిణి మరునకు నా రతియును గురునకును దార మనువున కురుగుణాఢ్య
యైన శతరూప శిఖికి స్వాహయును దేవపతికి శచియును మరి గణపతికి బుష్టి. ౩౩

తే.గీ. స్కందునకు దేవసేనయు గడగి పత్ని । యగుచు నేరీతి వర్తించి రట్లు నీవు
తులసితోఁగూడి పరమసంతుష్టినుండి । సకలసుఖముల గనుమయ్య శంఖచూడ. ౬౩౪

క. విచ్చలవిడి దిరుగుము నీ । యిచ్చను తులసీసమాఖ్య నిందుముఖిని మే
లచ్చుపడ గూడి నిచ్చలు పచ్చనివిలుకాని బనుల బటుచతురుడవై. ౬౩౫

క. పిమ్మట గోలోకంబున । సమ్మతి జేరెదవు కృష్ణసంగతి కని యా
బమ్మ నిజలోకమునకుఁ । నెమ్మిం బనివినియె దనుజనేతయు నంతఁ. ౬౩౬

వ. అచట నయ్యంతిం గాంధర్వవివాహంబున శంఖచూడుండు బరిగ్రహించె. దివి దేవదుందుభులు మొరసె, పుష్పవృష్టి కురిసె. వెండియు ౬౩౭

క. అరువదినాలుగు కళలం । నరువదినాలుగు విధముల నానందించెఁ
స్మరశాస్త్రమెరిగి రసికత । నుర లరుదందంగ శంఖచూడుడు సతితోఁ. ౬౩౮

చ. తులసియు శంఖచూడుడును దుర్భరమన్మథబాధ్యమానులై
యలపులతోటలందు గృతకాద్రుల పూపొదరిండ్ల నిర్జన
స్థలముల చందనాగరులతాంతపరాగసుగంధచర్చలన్
దలిరులపాన్పులఁ గడుముదంబున నెట్టి రహర్నిశంబులఁ. ౬౩౯

సీ. గందపూతల తిలకంబుల మార్పుల గోటినొక్కుల బల్కనగఅపుల
కేరడమ్ముల మోవి గెంపుల నెలవంకలను మెడనొకుల నునుగసరుల
జేపట్ల ముద్దుల జెమటుటార్పులను గౌగిళ్ళ జెల్లాటల బిల్లిమిరియ
ముల దొడదార్పుల ముచ్చటలను బిక్క మలకల పావ్రంపు బలుకుబడుల

తే.గీ. తెప్పలార్పని చూపుల గొప్పవగల । మూతిముడుపుల బొలయల్క ముసుగుబాట్ల
మాలిమిని గద్దరింపుల మార్గ మెరిగి । తులసియును శంఖచూడుండు గలసి రనఘ. ౬౪౦

తే.గీ. పుష్పభద్రా నదీతీరభూములందు । సుందరారామసీమల సురభికుసుమ
చరదళినినాద చారుకుంజములయందు । క్రీడలను దులసితో శంఖచూడు డొప్పె. ౬౪౧

వ. ఇవ్విధంబున శంఖచూడుండు తులసిం గూడి భోగించుచు, రాజరాజేశ్వరుండై లోకత్రయంబు బాలింపుచుండె. ని ట్లొక మన్వంతరంబు గడచిన దేవతలు నిజభోగంబులు కొరవడి దుఃఖితులై బ్రహ్మకడకుం జని దుఃఖింప నతండు వారలం దోడ్కొని శివాలయంబునకుఁ జని మొరలిడ వారలం దోడ్కొని శంకరుండు వైకుంఠంబునకుం బోయి నారాయణునకు విన్నవింప నతండు నవ్వి బ్రహ్మం జూచి యిట్లనియె. ౬౪౨

చ. ఎరుగుదు శంఖచూడు డిత డిద్ధచరిత్రుడు నాకు భక్తుడై
పరగెను ధేనులోకమున బావను డంచితమూర్తి గోపకుం

దరయ సుధామనామకుడు నైతగు నొక్కట రాధశాపముఁ
దరలక పొంది యుద్భవిలె దానవయోని సరోరుహాసనా. ౬౪౩

క. నే నా గోలోకమునఁ । మానుగనుండంగ రాసమండలమునకుఁ
బో నుద్యోగించి విరజతో నేగి వినోదకేళితో నుండంగఁ. ౬౪౪

తే.గీ. దాసి యొక్కతె పోయి రాధకును దెలుప । వచ్చియును నన్ను గానక యచ్చెరువడి
నను దిరోహితుగా విరజను నదీస్వరూపగా దివ్యదృష్టి నే రూఢి నెరిగి. ౬౪౫

క. తన యింటికి జనియుండగ । నను నచ్చట నా సుధామ నామకసహితుఁ
కని వానిమీద కోపంబున నిలు వెడవాసి యీవు పొమ్మని పలుకఁ. ౬౪౬

క. వాఁ డట్లు చేయమికి గడు । మోడిఁ నిజసఖులచేత మొత్తింపగ త
త్తాడనములకును నిలువగ నోడి బహిర్గతుడుగాగ । నుద్ధతి నంతఁ. ౬౪౭

తే.గీ. పొక్కుచున్న గోరుపొక్కు పై రోకటిపోటటన్నయట్లు పొలతి దా శ
పించె నధికరోష భీషణవృత్తిని । బూని దనుజయోని బుట్టుమనుచు. ౬౪౮

క. అది గని గోపకులందరు । మది దుఃఖము నిలుపలేక మరిమరి వేడఁ
సదయహృదయయై రాధిక । ముదమగు వీనికి క్షణార్ధమున నని పలికెఁ. ౬౪౯

వ. ఓయి హిరణ్యగర్భా ! గోలోకంబున క్షణార్ధంబనఁ భూలోకంబున నొక మన్వంతరంబగు
గావున నితండు తదనంతరంబ గోలోకంబునం జేరంగలడు. నా శూలంబు గొని యేగుండు.
దీనిం గొని శివుండు పోయి శంఖచూడుని సంహరింపం గలండు. వాడు మదీయంబయిన
మంగళకవచంబు నిత్యంబును మెడఁ దాల్చియుండు. నది ధరించునంతవట్టు బ్రహ్మాదు
లకు వధ్యుండుగాడు. నే నది యాచించుకొనియెద. నిదియునుంగాక వాని ధర్మపత్ని
మహాపతివ్రత. తత్పాతివ్రత్యంబు లోపంబుగలిగినంగాదె వాడు దేహంబువిడుచు, కావున
నదియు నేన కావించెద. వాని పత్ని తత్క్షణంబ మానవదేహంబు విడిచి నాకుం బ్రియయై
వర్తించు. శంఖచూడుండును సుధాముడై గోలోకవర్తియగు నని చెప్పి శివార్థంబుగా శూలం
బిచ్చె. పిమ్మట నెల్ల బ్రహ్మ పురోగములగు దేవతలును భారతంబుం బ్రవేశించి రంత.

తే.గీ. శంఖచూడదనుజ సంహారమునకును । శంభు వేడి బ్రహ్మ శక్ర ముఖ్యు
లరిగి రాలయముల కభవుండు చంద్రభాగాస్రవంతి యొడ్డు గాంచి యచట. ౬౫౧

తే.గీ. చిత్రరథుడను గంధర్వశేఖరుండు । దూతకృత్యంబు సేయంగ ధూర్జటియును
నొక్క మఱ్ఱికడ విడిసి యొక యనుచరు । దనుజనాథుని యంతికంబునకు బనిచె. ౬౫౨

తే.గీ. పుష్పదంతసమాఖ్యను బూనినట్టి । యనుచరుడు శంకరాజ్ఞను గొని చని చని
కాంచె దనుజేంద్రపురము దా గన్నులార । దివ్యవిభవనిరాకృత దేవపురము. ౬౫౩

సీ. తనరంగ బంచయోజనముల విస్తీర్ణ మినుమడి దైర్ఘ్యంబు నేడు కోట
లేడు ఖేయంబులు నింపొందు వీథులు నూరు గృహంబులు నూరుకోట్లు
మాణిక్యయుతములౌ మాడుగులును గోపురంబులు నట్టాలకంబు లిన్ని
యని లెక్కపెట్టంగ నలవిగా దది యింద్రుపట్టణంబు గుబేరుపట్టణమును

తే.గీ. మీరి యలరారు చారుచామీకరోరు । ఛవిమయంబయి నడుమను శంఖచూడు
నాలయము చంద్రబింబంబు నట్లు వలయమై మణిశ్రేష్ఠమయమయి మహిమగాంచు. ౬౫౪

వ. ఆ శంఖచూడుని మందిరంబునకు జుట్టుంగల మణిప్రాకారంబునకు ద్వారపాలక పరిపాలితంబులగు ద్వాదశ ద్వారంబులు గలవు. అందు లక్ష మందిరంబులు నిరుపమానశాఖామయంబులు రత్నసౌపానవిభ్రాజమానంబులు నై యుండు. అట్టి మహానగరంబు ప్రవేశించి రాజమందిరద్వారంబు చేరి పుష్పదంతుం డచ్చటనున్న యొక శూలహస్తుండయిన ద్వారపాలపురుషుం జూచి నిజవృత్తంబు నివేదించి యా ద్వారంబు గడచి యాభ్యంతరద్వారంబు దర్శించి యచ్చటి పాలకునకు దా వచ్చినవిధంబు దెల్పిన వాడు నని శంఖచూడునకు చెప్పిన నతండు రానిమ్మని సెలవిచ్చిన నౌదల మోచి వచ్చి లోపలికిం బోనిచ్చిన నప్పుడు శంకరభటుండు శంఖచూడుం దర్శించె. నంత. ౬౫౫

ఉ. కాంచెను పుష్పదంతుడు జగద్విత ప్రభుతావిశాలు న
త్యంచితలీలు జారుతరహారవినూత్నమనోజ్ఞమాలు స
త్కాంచనచేలు దేవరిపుకాండసదఃపరిఖేలు సత్ప్రభృ
త్సంచయసమ్యగున్నతలసత్కరవాలుని శంఖచూడునిన్. ౬౫౬

వ. ఇట్లు కాంచి ౬౫౭

తే.గీ. ఈశుభృత్యుండ నేను రాజేంద్ర పుష్పదంతు డనువాడ బంపె నీడగ్గరకును
విబుధరాజ్యంబు వేగమే విడువు మట్లు । విడువవేని కలన కిష్ఠ వెడలుమయ్య. ౬౫౮

తే.గీ. పుష్పభద్రకడన పురవైరి యున్నాడు । కదనమునకు బుద్ధి కలదయేని
కదలి రమ్ము సైనికవ్రజంబుల గూడి । యనుచు నీకు చెప్పుమనియె దైత్య. ౬౫౯

తే.గీ. అనిన విని శంఖచూడు డో యభవుబంట । సౌరరాజ్యంబు విడువంగ జాల నేను
కదలి వచ్చెద రేపటి యుదయమ యని । చేరి చెప్పుము పోయి మీ జియ్యలకును. ౬౬౦

తే.గీ. అనిన విని చని వేగ న య్యగజమగని । గాంచి యా పుష్పదంతుం డుదంచితప్ర
కారమున శంఖచూడువాక్యంబు దెలుప । యుద్ధసన్నద్ధుడై శంభు డుండె నంత. ౬౬౧

సీ. కందసామియు భద్రకాళీశ్వరుడు వచ్చి రంతలోనే నంది యరుగుదెంచె
నావెంటనే వచ్చె నమ్మహాకాళుండు దండివాడగు భద్రకుండు వచ్చె

నరుగుదెంచిరి విశాలాక్ష బాణులును బింగళుడును మరియు వికంపనుండు
వికృతి విరూపులు విజయంబు చేసిరి మణిభద్ర కపిల తామ్రాక్ష దీర్ఘ

తే.గీ. దంష్ట్రి బాష్కల వికటరౌద్ర ఘనరౌద్ర కాలకంఠ కుటీచక కాలజిహ్వ
దుర్జయులును బలోన్మత్త దుర్ముఖులును । వచ్చి రపుడు రణోత్సాహవంతులగుచు. ౬౬౨

వ. మరియు వసువులును, దానవులును, ఆదిత్సుతులును, హుతాశనుండును, చంద్రుడును, విశ్వకర్మయు, నశ్వినులును, కుబేర జయంత నలకూబర యములు, వాయు వరుణ బుధ మంగళులును, ధర్మ శ నీశాన కామధేనువులును, నుగ్రదంష్ట్రియు, నుగ్రపిచండయు, కోటరయు, రైటభియు, వికటజిహ్వాకరాళయై, యష్టభుజయై, శంఖ చక్ర గదా ద్యాయుధోపేతయై, నాగపాశ, నారాయణ గాంధర్వాద్యస్త్రపాణియై, త్రికోటి యోగినీ పరివృతయై సార్ధత్రికోటి ఢాకినీసేవితయై భద్రకాళీదేవియు, వచ్చి నిలువ నపుడు స్కందుండు చంద్రశేఖరునకు నమస్కరించి యతనియొద్దం జేరి నిలచె. నంత నచ్చట శంఖచూడుండు యుద్ధయాత్రకు వెడలుననువార్త మహాపతివ్రతాశిరోమణి యగు తులసీదేవి విని భర్త కడకుం జని భయంబునం గొంతెండ గద్గదకంఠయై దైన్యంబుదోప నిట్లనియె. ౬౬౩

ఉత్సాహ. ప్రాణనాథ క్షణము నాదు వక్షమందు బండుమీ
ప్రాణమేలువాడ వీవె ప్రాణమిచ్చి ప్రోవుమీ
రాణమీరు నిన్ను గనులు రాగిలంగ జూచెదన్
ప్రాణమేమొ కొట్టుకొనుచు బల్వరించు నయ్యయో. ౬౬౪

తే.గీ. ఏమి ప్రాణనాథ యేమందు నా గుండె । జలదరించు నీవు సమరమునకు
బోవువాడ వనిన పురుషరత్నమ నాకు । నశుభమైన స్వప్న మైనకతన. ౬౬౫

క. అనిన విని శంఖచూడుడు । వనితా నీ వేల యిటు వగచెదు కాలం
బునుబట్టి కర్మఫలముల । యనుభవమున్ బోవనాడ । నలవియె చెపుమా. ౬౬౬

ఉ. కాలమునం జనించెడిని స్కంధమునొందెడి విస్తరించెడిన్
బూలను బూచెడిన్ సఫల పుంజక మయ్యెడి బండ్లు పక్వమై
రాలగ నొప్పెడిన్ దరువు రామ యెరుంగవె కాల మీ జగ
జ్జాలవిభాతికిన్ దదుపశాంతికి మూలమునుమ్ము ప్రేయసీ. ౬౬౭

క. కాలంబున సృజియించును । నాళీకభవుండు జగము నలినాక్షుడు దా
బాలించు శంకరుం డున్మూలించును గాల మెన్న మూలమునుమ్మీ. ౬౬౮

క. జనుచే జను జనియింపన్ । గను జనుచే జనుని బ్రోవగను జనుచేతన్
జను మడియింపంగల కాలు విచిత్రచరిత్రు నిచ్చలున్ భజియింతున్. ౬౬౯

ఉ. ఎవ్వని యాజ్ఞచే బవనుఁ డేపుగ వీచెడి పద్మబాంధవుం
డెవ్వని యాజ్ఞ బూని భువి నెండను గాచెడి దేవనాయకుం
డెవ్వని యాజ్ఞచేత గురియించెడి వృష్టిని పావకుండు దా
నెవ్వని యాజ్ఞచేత రగిలించెడి కాలుడు వాడె గోమలీ. ౬౨౦

క. నే నెవ్వడ నీ వెవ్వతె । వో నళినదళాక్షి మనకు యోగము గలిగెన్
మానుగ గర్మవశంబున । బూనిన కర్మమె వియోగమును గలిగించున్. ౬౨౧

తే.గీ. ఓడలను బండ్లు బండ్లపై నోడ లెట్లు । వచ్చు నట్టులు సుఖ దుఃఖ భావములకు
కాల మనునది యగుచుండు గారణంబు । వగచిన ఫలంబు లేదుసూ వనరుహాక్షి. ౬౨౨

తే.గీ. నేను దపము జేసి నీరజగర్భుని । వరముచేత నిన్ను బడసినాడ
నీవు హరినిగూర్చి నెమ్మి దపముజేసి । వరము గొంటి వతనిపురము జేర. ౬౨౩

వ. నీవు బృందావనంబున గోలోకంబునం జేరగలవు. నేనుగూడ రూపంబు బాసి గోలోకంబునకుం జనియెద. నింతేకాని వేర భయంబు మన కేమి యున్నయది యని యూరడించి నానావిధభోగంబుల నా రేయి గడిపి శంఖచూడుండు బ్రాహ్మముహూర్తంబున లేచి రాత్రి గట్టిన వస్త్రంబు విడిచి మంగళోదకంబుల స్నానంబు చేసి ధౌతవస్త్రంబు ధరియించి తిలకం బిడి యాహ్నికంబును, దేవతావందనంబునుం దీర్చి, మంగళవస్తువులగు మధ్వాజ్య దధి లాజలం బొడగాంచి రత్నశ్రేష్ఠ వస్త్రశ్రేష్ఠ కాంచనంబులు బ్రాహ్మణులకొర కిచ్చి, గురువునకు రత్నహారం బొసంగి, గజరత్నాశ్వరత్నాదుల దరిద్రులకు దానంబులు జేసి, మరియు నానావిధదానంబుల భూజనులం దనిపి, పుత్రునకు రాజ్యం బిచ్చి మూడులక్షల గుఱ్ఱంబులును, లక్ష యేనుంగులును, పదివేల రథంబులును, మూడుకోట్ల ధానుష్కులు, మూడుకోట్ల వర్మలు, మూడుకోట్ల శూలులునుం గల సేనలన్ మహారథుం డను సేనాపతివలన నడిపింపంబడుచుండ మూడులక్షల యక్షౌహిణీబలంబులు వెంటరా ధనుష్పాణియై విమానం బెక్కి చని చని పుణ్యభద్రానదీతీరంబున ౬౨౪

సీ. కపిలుండును జపంబు గావించిన స్థలంబు సిద్ధులు ప్రీతితో జేరుచోటు
పశ్చిమోదధికిని ప్రాగ్భాగమందును మలయంబునకు బశ్చిమంబునందు
బరగ శ్రీగిరికి నుత్తరభాగమందును గంధమాదనమునకు గాలుదెసను
నైదామడ వెడల్పు నైదువందల యామడల నిడివియు గల్గి యలరుచోటు

తే.గీ. పుణ్యభద్రాపగామణి పొల్చుచోటు । మలయజన్య శరావతి గలయుచోటు
నెడమ గోమతి యను నది యెసగుచోటు । నైన యక్షయవటసీమ నభవు గాంచి. ౬౨౫

తే.గీ. కని విమానంబు డిగ్గి రాక్షసవరుండు । హస్తయుగమును జోడించి యతివినయము
దోప శంభుని చేరి నిర్దుష్టభక్తి యుక్తి దండప్రణామంబు నొగి నొనర్చి. ౬౨౬

వ. ఇట్లు నమస్కరించి నిలిచియున్న శంఖచూడుం జూచి చంద్రశేఖరుండు ప్రసన్నాంతః
కరణుండై యిట్లనియె. ౬౭౭

చ. వనరుహగర్భునం దఖిలవందితునందు మరీచి పుట్టె నా
తనికి జనించె గశ్యపుఁ డుదారగుణోజ్జ్వలమూర్తి వానికిం
దనయలు రూపయౌవనయుతల్ పదుమువ్వురు వారి నిచ్చె ద
క్షునకును నందునుం దనువు సూవె కనెన్ ఘనదానవావళిన్
సునిశితవిక్రమోద్ధతివిశోభితు లిర్వదినల్వురన్ భునిన్. ౬౭౮

చ. దనుజులయందు నొక్కఁడగు దంభుడు ధార్మికుడై మురారిసే
వనమున జిత్తముంచి గురుభావమునన్ భృగుజం భజించి దా
ననువుగ బుష్కరంబున సహర్నిశమున్ నియమంబుతో జపం
బొనరిచె గృష్ణమంత్రము మహోద్యముడై యొక లక్ష వర్షముల్. ౬౭౯

చ. నిను గని మించె దంభుడు వినిర్మలకృష్ణపరాయణున్ దృఢున్
మును విను నీవు పార్షదుల ముఖ్యుడవై తగు గోపకుండవ
య్యును వల రాధశాపమున నుద్భవమందితి దానవుండవై
ఘనముగ భారతంబున సుఖస్థితి ధార్మికశేఖరుండవై. ౬౮౦

ఉ. నీవు మహానుభావుడవు నీకును బ్రహ్మయు బాకవైరియుం
దేవతలెల్లరున్ సములె ధీరత వైష్ణవశేఖరుండవై
దేవపురంబు తుచ్ఛము మదిం గడునాస వహింపనేటికిన్
భావుకమయ్యెడున్ విడువు మా హరి సంతసమందు నెంతయున్. ౬౮౧

శా. భూతద్వేషము లేకయుండుటె సదా పుణ్యంబగున్ గాశ్యపుల్
దైతేయుల్ దనుజుల్ సురల్ వినుము సద్ధర్మంబు పాటించితే
జ్ఞాతిద్రోహములోన పీసమయినన్ గాదట్టి పాపంబయే
నీతిన్ నీపదమందు నీకునికి యెంతే నొప్పు రక్షోవరా. ౬౮౨

ఉ. ఎల్లపు డొక్కరీతి మను నెవ్వడు లోకమునందు బ్రహ్మకుం
జెల్లునె సర్వదా శుభపరంపరతో పున బుట్టి జచ్చు వ
ర్తిల్లు గృశించు సృష్టి నొనరించును జ్ఞానముగల్గి దెల్వి సం
ధిల్లగ మౌఢ్యభావమును దీర్చుకొనం దప మాచరించెడిన్. ౬౮౩

చ. తరలక యుండనేరదుగదా యల ధర్ముడు సత్యమందు బం
ధురపరిపూర్ణభావము గనున్ మరి త్రేతను జూడ మూడుపా
ళ్ళరయ సగంబు ద్వాపరమునం దొక పాదము నిల్చుగావునన్
సురరిపువర్య ! నశ్వరముసుమ్ము సమస్తము నీ వెరుంగవే. ౬౮౪

క. బాలుడు యౌవనవంతుండౌ లీలన్ వాడె వృద్ధుడౌ నిష్మాడ్కిన్
కాలంబు జెరచు సర్వము । గాలము చిత్రంబు సర్వగతులం జూడన్. ౬౮౫

క. ప్రొద్దుపొడుచు బ్రొద్దెక్కున్ । ప్రొద్దుదిరుగు బ్రొద్దుగ్రుంకు పొరిపొరి నిట్లే
ప్రొద్దు మరిపొడుచు నెక్కున్ । ప్రొద్దుల జిత్రములు కాలపురుషుని మహిమల్. ౬౮౬

క. దినదినము దరుగు నొక్కొక । దినమున గనరాదు తుహినదీధితి మరలన్
దినదినము పెరుగు నొక్కొక ।దినమున బూర్ణుండు గనుము దినముల మహిమల్. ౬౮౭

క. ఇనునిం జంద్రుని రాహువు । పెనయుచు గబళించుచుండు విడుచుచునుండున్
దనుజేంద్ర యప్పుడప్పుడు । కన గాలమువంటి పొకడు గాదు ధరిత్రిన్. ౬౮౮

క. బలిచక్రవర్తికంటెను । బలియుఁడు జగమందు గలడె భాగ్యము వోవన్
బలి సుతలగతుడు గాడే । జలజాక్షునివలన గాలచక్రము మహిమన్. ౬౮౯

క. కాలమున బొడము జగములు । గాలంబున వృద్ధిబొందు గాలమున జెడున్
గాలము సకలము నడుపును । గాలమును జయించువాడు గలడే జగతిన్. ౬౯౦

క. పరమాత్మ పరబ్రహ్మము : పరమేశుడు నిన్ను నన్ను బ్రకృతివికార
జ్వరసహితులగా జేయుఁ । దరమే గడవగ లయంబు దానవనాథా. ౬౯౧

క. జీవాత్మయు బరమాత్మయు । గేవలుడును నిత్యుడును బ్రకృష్టుడునై యే
దేవుడు వెలయు నతండే । ప్రోవంగల డతని గొలుచు పురుషుల నసురా. ౬౯౨

తే.గీ. ఒనర నద్దేవు గొలిచి మృత్యుంజయుండ । నైతి నే నది గావున నసురవర్య
కాలగతి దప్పదేరికి గావునం బరేశు నమ్మట యొక్కటే హితమునుమ్మ. ౬౯౩

వ. అని యిట్లు వచియించి యూరకున్న మహాదేవుం గాంచి శంఖచూడుండు దేవా యీవు వచియించినదెల్ల సత్యంబ యగు, నైనను నా దొక విజ్ఞాపనంబు గలదు వినుము, జ్ఞాతిద్రోహంబు మహాపాపంబని దేవరవా రానతిచ్చితిరి. వైరోచనుం డింద్రు సర్వస్వంబు గైకొని యెచట డాచె ? సభ్రాత్రకుండయిన హిరణ్యాక్షుం డెట్లు హింసింపంబడె ? శుంభాదులగు రాక్షసు లెట్లు వధింపంబడిరి ? సముద్రమథనంబువలన రాక్షసులచే సంపాదింపబడిన పీయూషంబు దేవత లెట్లు గ్రహించిరి ? ఆయాస మొక్కరిది యనుభవం బొక్కరియది యయ్యె. నీ విశ్వంబు పరమాత్మకు క్రీడాభాండంబు, యెందుండి యైశ్వర్యంబు వచ్చు నందులకే యది మరలం జను. నొకప్పుడు రాక్షసులు జయింతు, రొకప్పుడు దేవతలు జయింతురు. అదిగావున పరమేశ్వరుండవును, మహాదేవుండవును నైన నీ కెల్లరు సమసంబంధులై యుండ, సురలపక్షంబు పూని నామీదికి దండెత్తివచ్చుట నిష్ఫలంబు. మాతోడం గలహంబు పూనుకొనుట మీబోంట్లకు లజ్జామాత్రఫలకంబె యగు. జయంబున నధికకీర్తి లభించినను, బరాజయంబున గీర్తిహాని తప్పక వచ్చునని నుడివిన విని నవ్వి మహాదేవుండు. ౬౯౪

చ. దనుజవరేణ్య నీ వల విధాతృకులుండవు నిన్నెదిర్చి నే
నని విజయంబు నొంద నటులైనను నా కపకీర్తి కల్గునే
మును హరి కైటభుం దనుజముఖ్యు హిరణ్యు నెదిర్చి పోరఁడే
నను గనవో పురాసురుల నా డెదిరించితి లజ్జ యేటికిం. ౧౯౫

వ. అని శంకరుం డూరకున్న శంఖచూడుండు నిజామాత్యులతోడ లేచి శివునకు సమస్కరించి విమానంబు నెక్కి చనియె నంత. ౧౯౬

సీ. అభవునివైపున నమరవర్యులు శంఖచూడునివైపున సురరిపులును
దలపడి పోరిరి ధైర్యంబు లుబివోవనీక భీకరరణోద్రేకములను
వృత్రశాసనుండును వృషపర్వుడును భాస్కరుడు విప్రచిత్తియు నుడువిభుండు
దంభుండు కాలాభిధానుండు కాలస్వరుండును గాలకేయుండు మఱియు

తే.గీ.ధనదుఁడును విశ్వకర్మయును ఘనుఁడు మయుఁడు వరుణుఁడు వికంకణుండును వాయుదేవు
నెదిరి చంచలుఁడును బోరి రింక వారు వారు దలపడి పోరిరి ఘోరలీల. ౧౯౭

వ. మఱియు బుధుండు గృపణుతోడ, శనైశ్చరుండు రక్తాక్షుతోడ, జయంతుండు రత్నసారుని తోడ, వసువులు వర్చోగణంబుతోడ, నశ్వినులు దీప్తిమంతునితోడ, నలకూబరుండు ధూమ్రునితోడ, ధర్మండు ధురంధరునితోడ, మంగళుండు షాక్షునితోడ, భానుండు శోభాకరునితోడ, మన్మథుండు పిఠరునితోడ, నాదిత్యులు గోదాముఖచూర్ణఖడ్గ ద్వికాంచీముఖ పిండాదులతోడ, రుద్రులు భయంకరులతోడ, మహామారి యుగ్రచండాదులతోడ, నందీశ్వరాదులు దానవసమూహంబులతోడ, విలయకాలఘోరంబుగా రణంబు సల్పి రంత దానవులకు జయంబును, దేవతల కపజయంబునుం జూపట్టి సురలు భీతులై దేవతలు కాలికొలంది పరువిడం జూచి స్కందుండు వెఱవకుండని దేవసైన్యంబుల నిల్పి నిజతేజంబున స్వగణంబులఁ వర్ధిల్లంజేసి దానవగణంబులతో నతం డొక్కరుండ పోరి శతాక్షౌహిణీ సేనల రూపుమాపె. కాళి రక్తపానంబుసేసె. నీగతి శక్తిధరుని శరజాలంబులం జిక్కి హతశేషదానవానీకంబులు భయంబునం బరువం దొడంగి రది చూచి దివి వియచ్చరులు పుష్పవర్షంబులు గురిసిరి. అది చూచి శంఖచూడుండు లేచి దేవసైన్యంబులపై బాణవృష్టిం గురియింప సహింపలేక దేవతలును బరువంజొచ్చిరి. నీహారావృతభానునిమాడ్కి స్కందుండు శరవృష్టి మునిఁగియు రాక్షసేంద్రునితో సమరంబునకు సన్నహించి బాణంబులు వైవం గని యతండు కుమారుని ధనువును, రథంబును, రథపీఠంబులును, ధ్వజంబునుం జెండాడిన మూర్ఛాక్రాంతుండై పడి క్షణంబునం దెప్పరిలి విష్ణుదత్తంబయిన చాపంబు పూని రత్నేంద్రసారనిర్మాణంబయిన యానంబు నారోహించి సర్వపర్వత వృక్షప్రస్తరాదులం గురియింప శంఖచూడుని రథ మకుట సారథి చాపాదులఁ ద్రుంప వాడు

మూర్ఛిల్లి పడి కొండొకసేపటికి తనువు దెలసి వేఱొకరథం బెక్కి వేఱొకచాపంబు పూని బాణపరంపరల గార్తికేయు నొంచి ప్రళయకాలభైరవాకారంబు పూని శక్తిం జేపట్టి యేయ నిప్పులు గ్రక్కుచు శక్తి దరికొని పైబడిన శరజన్ముండు మూర్ఛాగతుం డగుటం జూచి కాళి తన మూపున నతని నెత్తుకొని శంకరుసన్నిధి నిల్పిన నతండు నిజమహిమంబున శక్తిధరుని మూర్ఛనుండి తెరల్చి సంపూర్ణశక్తిమంతుం జేసిన మహాకాళిసమేతుండై మరల దేవానీకంబుల వెఱవకుండని యభయవాక్యంబుల మరల్చి రణాంగణంబునకుం బోయి సింహనాదంబు సేసె. దేవియు నట్ల కావించి మాధ్వీకంబు గొని నిలువం బడె. నది శంఖచూడుండు సూచి స్కంద కాళుల రూపంబులు సూచి భయంబునం జిక్కి యున్న దానవానీకంబుల వెఱవకుండని మరల్చి సమరంబునకు వచ్చె నంత గాళి వహ్ని ప్రయోగంబు సేసిన బార్జన్యంబుచే నివారించికొని వారణంబు బ్రయోగించిన గాంధర్వంబున భేదించివైచి మాహేశ్వరంబు ప్రయోగించిన వైష్ణవంబునం గడతేర్చి య మ్మహాశక్తి నారాయణాస్త్రంబు బ్రయోగించుటం జూచి రథంబు డిగ్గి సవినయుండై దండవత్ప్రణామంబు సేసి నేలం బడియున్న నది యూరకుండె. నంత బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన బ్రహ్మాస్త్రంబుననే దాని నివారించికొనియె. నిట్లు నానావిధ దివ్యాస్త్రపరంపరల నిరువురుం బోరి పోరి విసికియున్న సమయంబున గన్నుల గోపానలజ్వాలలురల మహాదేవి యోజనాయతంబగు శక్తిం బ్రయోగించిన నిజదివ్యశక్తిం దాని శతఖండంబు లొనర్చె. నదిగాంచి పాశుపతంబుం బ్రయోగింపం బూను నవసరంబున నశరీరిణీవచనం బొక్కండు వినం బడియె. ౧౯౮

క. నారాయణకవచం బీ। భూరిబలుండైన దనుజభూపతి పూనెన్
దోరడు పాశుపతంబున। దారి గనుంగొనుట కేల తడసెద రింకన్. ౧౯౯

క. తులసీపాతివ్రత్యం। బలరుచు నున్నన్నినాడు లసురుం డెందుం
జలియింప డిద్ది మున్నే। జలజభవునివరము మీకు సంశయమేలా. ౨౦౦

ఆ.వె. పాశుపతము మాని పరమశక్తి యనంత। యసురగణము నెల్ల నాకటికివి
శాంతిగాగ దైత్య సంఘంబులను మ్రింగి। మరల రాజుమీద మారుకొనియె. ౨౦౧

క. నానావిధాస్త్రసమితిని। దా నేసియు దనుజనాథు దర్పమడంపం
గా నేరక మల్లుని క్రియ। బూనె భుజాయుద్ధమునకు భూమి వడంకన్. ౨౦౨

చ. తలపడి బాహుయుద్ధమున దైత్యునితోడను గాళి దా మహా
ప్రళయభయంకరాకృతిని బాసిలి పోరుచు రాక్షసేంద్రునిన్
బలువిడి బట్టి వైశము నభంబునకుం గొనియేగి కూల్చగా
నిలబడి లేచి ధైర్యమున నెక్కొని కాళికి మ్రొక్కి గ్రక్కునన్. ౨౦౩

తే.గీ. మరల రథమెక్కి యసురుండు మహితలీల । వెలుగగా గాంచి కాళి తా విస్మయంబు
నొంది శంకరు సన్నిధియందు చేరి । శంఖచూడు రణాద్యంతసరణి నుడివి. ౨౦౪

తే.గీ. లక్షపరిమితమైన బలగముమాత్ర । మిపుడు దైత్యుల మిగిలిన దితరసైన్య
మెల్ల నమిలితి మ్రింగితి నల్లనెల్ల । మెల్ల మెల్లన గ్రోలితి దల్లడిలక. ౨౦౫

చ. కదనమునందు రాక్షసుని గ్రక్కదలింప దరంబుగాదు శం
భదురమహోగ్రమై యెనఁగుఁ బాశుపతంబున కంచు వాణి యొ
ప్పిదముగ బల్కె నాత డతిభీకరుడయ్యును జ్ఞానియౌట నా
ప్రదరము ద్రుంచెగాని తన బాణము నాపయి నేయ డొక్కడున్. ౨౦౬

వ. అనిన విని శంకరుండు శంఖచూడుని దరియం జని నిలచినం గాంచి యతండు నమ్రుండై ప్రణమిల్లి లేఖవిమానం బెక్కి ధనువు పూనినం గాంచి శంభుండును నిజశరాసనంబున బాణంబు సంధించి యేయ రాక్షసేంద్రుండు వాని నెల్ల నంత సంహరించె. నిట్లు పోరు ఘోరంబై శతాబ్దంబులు లోకభయంకరంబుగా బ్రవర్తిల్లినం దుదకు న్యస్తశస్త్రుండయి భగవంతుండు వృషభంబుమీద, నట్లన రాక్షసేంద్రుండు విమానంబుమీదను నుండునపుడు ౨౦౭

శా. వృద్ధబ్రాహ్మణవేషధారి యయి య విష్ణుండు రా జూచి ప్ర
త్యుద్ధానం బొనరించి మ్రొక్కగను దైత్యుం గాంచి విప్రుండు సం
పద్ధామా దనుజేంద్ర దాతవని నే బల్మారు వింటిన్ మనః
ప్రోద్ధంబైనది వాంఛితం బొకటి నా కో ధన్య నీ విచ్చెదే. ౨౦౮

క. అనవుడు విని దనుజేంద్రుడు । వినయంబున నట్ల యిత్తు వేడు మనగ దా
మనమున నలరి ద్విజేంద్రుడు । ఘనకవచము నిమ్మటన్న గడు మోదమునన్. ౨౦౯

క. ఇచ్చిన నది గొని యచ్యుతు । డచ్చెరువుగ శంఖచూడు నాకృతితో దా
గ్రచ్చర తులసికడకు నేయొచ్చెంబును గానరాకయుండన్ జనియెన్. ౨౧౦

క. చని తన మాయాబలమున । వనితన్ గవగూడి పొందె వరమాహాత్మ్యం
బున నిచట హరుడు శూలంబున బొడిచెన్ శంఖచూడు భూరిబలమునన్. ౨౧౧

క. పొడిచినమాత్రన దనుజుడు । పుడమిం బడి తక్షణమున బూడిదయై వెం
బడి నొక్క చక్కనగు వ్రేబుడుతండై మురళి చేతబూని మహిమతోన్. ౨౧౨

వ. పొడమి ౨౧౩

ఆ.వె. గోపకోటితోడ గోలోకమున కేగి । రాధ కాళ్ళ కెరగి ప్రముదితాత్ము
డయి మదామనా మలరార గృష్ణుని । గొలుచుచుండె నంత గోహయుండు. ౨౧౪

వ. పరమానందంబున నిలచియుండె. నంత కాలంబును నతివేగంబున సాదరంబై వానిం బొందె. నతని యస్థులు శంఖంబులై యతిపవిత్రంబులై శివ కేశవ పూజాసమయసమంచితంబులై లక్ష్మీకరంబులై జగంబున నుద్భవిల్లె. నపుడు సురదుందుభులు మొరసె. దివిజులు శివునిపై పుష్పవృష్టి గురియించి రప్సరస లాడిరి. మునీంద్రులు ప్రశంసించిరని చెప్పిన విని నారదుండు నారాయణునకు స్వామీ భగవంతుండు తులసీ సమీపంబున కేరూపంబున నెట్లు చని వీర్యాధానంబు సేసెం దెలుపవే నావుం డతండు పరమ దయాళుండై యిట్లనియె. ౨౧౫

ఆ.వె. సకలభువనకర్త శౌరి దా గవచంబు । శంఖచూడునుండి సంగ్రహించి
యతని రూపులెల్ల నచ్చున గ్రుద్దిన । ట్లొప్పు నొప్పులకును గుప్ప యగుచు. ౨౧౬

ఆ. వె. రాణియిల్లు జేరి రమణి యాతని రణవిజయశాలి యంచు వింతనొంద
జయ జయ యని పొంగి జయభేరి మ్రోయించి । ద్వారమందు నధిక దంభలీల. ౨౧౭

క. దాని విని యా పతివ్రత । యానందము నొంది బ్రాహ్మణాదులకును బల్
దానములు చేసి మెల్లన । దా నెదురుగ వచ్చి తత్పదంబులు గడిగెన్. ౨౧౮

క. సతి మగని పజ్జలము స । మ్మతి నెత్తిని జల్లుకొని సుమంగళ మనుచున్
బతి సింహాసనమున సంచితముగ గూర్చుండబెట్టి చెంత నిలచియున్. ౨౧౯

క. చిరునగవున గవికొనుచున్ । వరుమొగమే యనుచు లోకవరు మొగమున దా
మరి మరి చూచుచు దులసిక । మరియాదను విడక నాథుమడు వందిచ్చెన్. ౨౨౦

ఆ.వె. మంచి వక్కపొడి నమలనిచ్చి కవటాకు । దుల్పి యీనె దివిచి దొడ్డ సున్న
మించుకంత రాచి యింతి చిట్టెనవ్రేల । జుట్టి దంభవిభుని కట్టెదుటను. ౨౨౧

ఆ. వె. నిలచి యిచ్చి కప్రపలుకు నేలకికాయ । జాజికాయ పత్రి యోజమీర
గా లవంగములును గపటకాంతుని నోట । కందియిచ్చె దులసి సుందరాంగి. ౨౨౨

వ. ఇట్లు తమ్ములం బిచ్చుచు ౨౨౩

తే.గీ. సామి నా జన్మమిప్పుడు సఫలమాయె । జీవితము నిల్పగల్గితి జీవితేశ
కదనమున కేగిన విభుండు సదనమునకు । మరల రా గంటిననుచు జుంబనము చేసి. ౨౨౪

ఆ. వె. ప్రాణనాథ యెట్లు బవరంబు ముగిసెను । వినవలంతు దెలుపనే యటన్న
దంభశంఖచూడ దనుజుండు పలికె స । త్యము మగడని యింతి తలచుచుండ. ౨౨౫

క. అనిలో శివుడును నేనును । వనితా పోరితిమి నూరు వత్సరము లొగిన్
దనుజగణమెల్ల మడిసెను । వనజాసను డపుడు వచ్చి పల్కెను వినుమా. ౨౨౬

క. దేవాధికారమెల్లను । దేవారీ వారి కి మ్మిదే యర్థింతున్
నాపుడు సట్టుల జేసితి । నే వచ్చితి నిటకు వారు నేగిరి యబలా. ౨౨౭

వ. అని పల్కి దామోదరుండు తులసితో నత్యంతవినోదంబుమీర సుఖసంభోగంబు గావించె. నం దాకర్షణవ్యతిక్రమంబు గాంచి నీ వ్వెవడవు? మాయావివై వచ్చి నన్ను రమించితివి. శపించెద ననిన దులసి కఠినోక్తి నాలించి హృషీకేశుండు శాపభయంబు మనంబునం బెనంగొన దిగ్గన నిజరూపంబు ధరించి ౨౨౮

సీ. ఘనఘనాఘన నీలకాయంబుగలవాడు నవనవాంబుజ నయనములవాడు
కందర్పశతకోటి సౌందర్యముగలాడు సొగసైన చిరునవ్వు మొగమువాడు
కమనీయలసఘన కనకాంబరమువాడు చారుమాణిక్యభూషలుగలాడు
శ్రీవత్సలాంఛనాంచితవక్షముగలాడు కరధృతశంఖచక్రములవాడు

తే.గీ. సుప్రసన్నత గలవాడు శుద్ధచిత్తు । డఖిలమోహను డార్తలోకావనుండు
నిరుపమానుండు ధీరుండు నిశ్చలుండు నైన భగవంతు డపుడు ప్రత్యక్షుడయ్యె. ౨౨౯

వ. ఇట్లు ప్రత్యక్షుండైన పుండరీకాక్షుం గని తులసి మూర్ఛిల్లి కొండొకదడవున కొడలు దెలసి ౨౩౦

క. దయలేదు నాథ నీదు హృదయమున బాషాణతుల్యతం గంటిని స
న్నయ మింత లేక మత్పతి । నయయో హతు జేసినాడ వపరాధియొకో. ౨౩౧

ఆ.వె. ఔతిగుండెతోడ రాక్షసేంద్రుని హతు । జేసినాడ వీవు చెట్ట దలచి
ఔతిరూపు నొందు మాతత కాఠిన్యశాలి కిద్ది తగదె జలజనేత్ర. ౨౩౨

క. నిను గరుణాకరు డంచుం । గొనియాడెడివారు కారు కోవిదులు ధరన్
ఘను బాపరహితు నీ భక్తుని నొంచితి వితరులకును గూర్పు మురారీ. ౨౩౩

క. అని పలుమరు విలపించుచు । వనజాయతనేత్ర భ్రమానుపడియుండ జనా
ర్దను డామెను నూరడించుచు । ననియెన్ శోకింపనేల యంగన వినుమా. ౨౩౪

క. చిరకాలం బీ భారత । ధరణిన్ ననుగూర్చి నీవు తపమొనరింపం
బరికించి శంఖచూడుడు । మురియంగా నిరుపురకును ముద మొనరింపన్. ౨౩౫

వ. మీ యిరువురకు భార్యాభర్తృవియోగంబు కలుగం జేసితి, నింకను వినుము ౨౩౬

క. నీ తప మీడేరె నికన్ । జేతోమోదమున నన్ను జేరు మబల ల
క్ష్మీతరుణిబోలె నీవును । నాతంకములేక యుండు వడలగనేలా. ౨౩౭

తే.గీ. నీ శరీరంబు గండకీ నిమ్నగ యయి । పూత యయి భారతంబున బూజ్య యగును
జెలియ నీ కేశములు తులసీసమాఖ్య । బుణ్యవృక్షం బగుత సర్వగణ్యమగుచు. ౨౩౮

తే.గీ. సర్వపూజల నీ పత్రసమితి ముఖ్యమగును స్వర్గంబునను భూమియందు నతల
మందు శ్రేష్ఠమయినచోటులందు మేటి । వనములందును నీ వుందు వనఘమూర్తి. ౨౩౯

సీ. వినుము గోలోకంబునను విరజాతీరమందును రాసంబునందు బృంద
యందును భాండీరమందును జంపకవనమునం దనఘ చందనమునందు
నందును మాధవియందును గేతకియందును గుందంబునందు మఱియు
మాలతియందును మహిమతో నీవాస మొప్పారు నిను గొల్తు రుర్విజనులు
తే.గీ. పుణ్యము లొసంగుచును నీవు భూమియందు।దనరుదువుగాత సకలతీర్థ ఫలములును
నీదళంబున నుండుత నిన్నుగొల్చు । నిల్లె యిల్లయి యుండుత నిందువదన. ౨౪౦

మ. తులసీ నీదళముల్ జలంబులు నొగిం దోయింటనుం బట్టినన్
గలవే పాపము లొదలంబడిన నిక్కం బచ్యుతానంద ని
శ్చలతల్ కల్గవె నీదు మృత్తు గొనుచున్ స్నానంబు గావింప న
జ్జలజాక్షుం దొసగండె మోక్ష మిడ నీ శంకన్ విసర్జించుమీ. ౨౪౧

క. తులసీతోయము నిరతము । నలఘుత బానంబుసేయునట్టిరు గనరే
యిల లక్ష తురగమేధంబుల । ఫల మేమందు నీదు పుణ్యము తరుణీ. ౨౪౨

క. ప్రాణావసానమున నో । యేణేక్షణ నీ జలంబు నెవ్వడు ద్రావుఁ
రాణ నతడు గోవిందు ది । వ్యాణంబున కరుగుగాదె వదలక తులసీ. ౨౪౩

క. తులసీకాష్ఠకృతములై । యలరెడు మాలికను గళమునం దిడు మనుజుం
డల వైకుంఠమె తనదగు । నిలయముగా నుండుజుమ్ము నిత్యము నబలా. ౨౪౪

క. తులసిదళము కరమం దిడి । యిల శపథము సేసి కల్లలే వచియింపఁ
లలి గుంభీపాకంబున । బలుబాముల బొందుజుమ్ము పంకజవదనా. ౨౪౫

సీ. వినుము తులసి పూర్ణిమను నమావాస్యను ద్వాదశియందును ధరణి సంక్ర
మణమున మనుజుండు మనసొప్ప నభ్యంగనము సేసినపుడును నడిమిపగట
నశుచియందును మఱి యాశౌచమందును నిశను సంధ్యలయందు నియతిదప్పి
తులసిదళము చేత నొలచిన మనుజుండు హరిశిరంబును గోసినట్టిడగును
తే.గీ. భూగతంబైన దళమేని పూజ్యమగును।క్షాళనంబున నశులయ్యు శ్రాద్ధమందు
వ్రతమునను దానమున బూజ బతితమైన।హరికి నర్పితమని చెప్పనగును బర్యు
షితము మూన్నాళ్ళగుట యొప్పు నతులలీల. ౨౪౬

వ. నీవు గండకీనామమున నదివై భారతవర్షంబున బూజ్యవై, పూతవై, లవణోదధికిం బత్నివై, యంశమాత్రంబున బ్రవర్తిల్లెదు. మఱియు నొకకళామాత్రంబునం బుణ్య వృక్షాధిదేవతవై, పవిత్రవై వర్తిల్లెదు. శిష్టకలాసముచ్చయకలితవై వైకుంఠంబున రమాతుల్యవై నన్నుం గూడియుండుము. నేనును నంశమాత్రుండనై శిలారూపంబు వహించి భారతవర్షంబునకు వచ్చి సాలగ్రామంబునై యనేకరూపంబుల నీయంద యుండెద. వినుము. ౨౪౭

క. నవనీరదసన్నిభమును । వివర మొకటి చక్రములును వెలయును నాలై
ఘని లక్ష్మీనారాయణ । మవు వనమాలాంచితంబు నగునేని ధరన్. ౨౪౮

క. వనమాల యొకటి తక్కం । గను చక్రద్వార రూపకాంతుల లక్ష్మీ
వనజాక్ష సమం బయినన్ । ఘన మహిమం గను రమా జనార్దన మనగన్. ౨౪౯

క. ద్వారములు రెండు చక్రము ।లారయగా నాల్గు నైన నది రఘునాథం
బారూఢి నేకవివరము । వారకయ ద్విచక్రమై వామనము నగున్. ౨౫౦

క. ధరణి నతిక్షుద్రంబై । పరగి ద్విచక్రంబు నగుచు వనమాలా సం
భరితంబై నను నది శ్రీ । ధర మనబడుఁజుమ్ము శ్రీపదంబగు గృహికిన్. ౨౫౧

తే.గీ. చక్రములు రెండు స్థూలంబు నరవి వర్తులంబు దామోదరం బగు లక్ష్మి నిచ్చు
మధ్యమము సప్తచక్రంబు మహిమ మూర్తి । రాజరాజేశ్వరం బగు రమ నొసంగు. ౨౫౨

తే. గీ. వర్తులము చక్రములు రెండు బాణవిక్షతంబు మరి తూణశరసంయుతంబు మధ్య
మంబు సూ రామ మనునది మహిమ నిచ్చు । బూజగావించు నరులకు భూతలమున. ౨౫౩

తే.గీ. మధ్యమము సప్తచక్రంబు మండనములు । గొడుగు గల్గి విరాజిల్లు బుడమి దాని
రాజరాజేశ్వరం బంద్రు రాజ్యలక్ష్మి । నరులకు నొసంగు దెలియుము సరసిజాక్షి. ౨౫౪

క. పదునాలుగు చక్రంబులు । గదియగ స్థూలంబు నగుచు ఘననీలంబై
యొదవిన ననంతనామము । న దనరు దత్ఫలము ఘనము నాళీకముఖీ. ౨౫౫

క. చక్రాకారం బగుచు ద్వి । చక్రంబై ధేనుపదము నరవి వెలసి ని
ర్వక్రత మధ్యమ మైనన్ । సుక్రమమున బొలుచును మధుసూదన మగుచున్. ౨౫౬

తే.గీ. తనర నొక చక్రమున్న సుదర్శనంబు । చక్రముం గుప్తమగునేని చను గదాధ
రం బగుచు రెండు చక్రముల్ రాజిలంగ।హయముఖమును హయగ్రీవ మంద్రు సుదతి. ౨౫౭

తే.గీ. వెడలుపైన ముఖంబు దా వికటమైన । రెండుచక్రంబు లుండెనే దండిమీర
నారసింహాఖ్యచే దనరారు నదియ । చెంది వనమాల లక్ష్మీనృసింహ మగును. ౨౫౮

ఆ. వె. ఉండు ద్వారమంధు రెండు చక్రంబులు । సమము స్ఫుటము నగుచు సర్వకాల
ఫలము నగును నమ్ము వాసుదేవాఖ్యమ్ము । మఱియు వినుము సింహమధ్య నీవు. ౨౫౯

తే.గీ. సూక్ష్మచక్రంబు మరి మహాసుందరంబు । సుషిరమున ఛిద్రబహుళత సొంపుమీరు
దాని బ్రద్యుమ్న మని యంద్రు ధాత్రిలోన । సకలసంపద లొసగును జలరుహాక్షి. ౨౬౦

తే.గీ. అంటగలసిన చక్రముల్ రెండు గలిగి । పృష్ఠమున నుండెనేనియు బుష్కలంబు
దాని సంకర్షణం బంద్రు ధరణి జనులు । సంపదలనెల్ల సమకూర్చు సంతతంబు. ౨౬౧

తే.గీ. వర్తులంబును బచ్చనివన్నెయును బొ । సంగి యుండిన ననిరుద్ధ సంజ్ఞకంబు
మంగళప్రద మది కొల్చు మానవులకు।దా ని మహిమంబు గొనియాడ దరమె వెలది. ౨౬౨

క. ఎక్కడ సాలగ్రామము । చక్కగ వర్తిల్లు నచట సన్నిహితుండై
యక్కమలనేత్రుడును రమ । వాక్కామిను లింద్రు సర్వవాహిను లుండున్. ౭౬౩

తే.గీ. బ్రహ్మహత్యాదికంబైన పాపసమితి । నడచు సాలశిలావారి యఖిలరోగ
హారి యపమృత్యువును దోలు నదియ పావితంబు నరులకు నమ్ము ము తరలనయన. ౭౬౪

తే.గీ. గొడుగువంటిది రాజ్యంబు గుడుసు లక్ష్మి । బండివంటిది దుఃఖంబు పరగజేయు
ధరణి శూలాగ్రమును బోలి మరణమిచ్చు । వికృతముఖమైన నొసగును బేదరికము. ౭౬౫

క. పింగళము హానిహేతువు । నంగు జెడగ భగ్నచక్రమగునేనియు వ్యా
ధిం గలిగించు విశీర్ణ మమంగళమై యేరికేని మరణము సేయున్. ౭౬౬

మ. వ్రతదానంబులుమం బ్రతిష్ఠయు నొగిన్ శ్రాద్ధంబు దేవార్చయున్
సతతంబున్ జలుపంగ నొప్పు నవనిన్ సాలోపలశ్రేష్ఠసం
గతి నట్టైన శుభంబు తక్కిన మహాఘం బింద్రు తద్వారిపూ
తత తీర్థంబులకున్ మఘంబులకు మీదం జెప్పగా నొప్పుజూ. ౭౬౭

వ. మరియు సాలగ్రామంబు పూని శపథంబు చేయుచు నసత్యంబు పల్కెనేని కుంభీపాక నరకంబు నొందు. సాలగ్రామంబునందు దులసీవిచ్ఛేదంబు సేయువాడు స్త్రీవిచ్ఛేదిదోషంబు నొందు. మరియు ౭౬౮

క. తులసిని సాలగ్రామము । నల శంఖము నేమహాత్ము డభిరక్షించున్
జలజాక్షుని దయచేతన్ । గలుగున్ జ్ఞానంబు ముక్తి గలికి యతనికిన్. ౭౬౯

క. అని యిట్లు విష్ణు డాడిన । విని యానందించి తులసి విమలంబగు మే
త్తనువున శ్రీహరి వక్షం । బునకుం దా నెక్కి చనె విభుని పురముకున్. ౭౭౦

వ. కావున లక్ష్మి తులసి గంగా సరస్వతులు పుండరీకాక్షునకు నలుగురు భార్య లయిరి. యా బృందయే యిప్పుడు భారతంబున గండకియై యొప్పుచున్నయది. తత్తీరంబున హరియు శైలాకారంబున నుండి నానావిధ సాలగ్రామంబులరూపు దాల్చి క్రీడించుచుండు. సూర్యోపతాపంబున నవియు స్థూలంబులు, పింగళంబు లని యెరుంగునది. అని చెప్పిన విని నారదుండు తులసీపూజావిధానంబును, ఆచరించినవారిని దెలియం జెప్పవే యని యడిగిన నారాయణుండు. ౭౭౧

క. తులసిని బూజించి రసా । కలితుండై మురవిరోధి కలసిన కతనన్
జలజాలయవలె మెప్పులు । గలదయ్యా కులుకులాడి కడు నలరె మునీ. ౭౭౨

క. దక్షిణనాయకుడై పద్మాక్షుం డా తులసి మిగుల మన్నించుచు దా
నిక్షుశరాసుని క్రియలన్ । లక్షింపగ నోర్చి రల్ల లక్ష్మి గంగల్. ౭౭౩

క. ఓరువలేక సరస్వతి । పోరుం గావించి మొత్తఁ బోటి మదివి వి
స్తారరుషాభరమున దా । నారాయణు విడిచి చనె వనంబున కనఘా. ౨౩౪

మ. హరి దా భారతి బోధఁజేసి తులసీ వ్యాహారవిశ్రాంతికిన్
గరముం దా మది గుంది బృందకును వేగం బోయి సుస్నాతుడై
నిరవద్యక్రియతోడ నత్తులసికిఁ వేమారు ధ్యానించి సు
స్థిరచిత్తుండయి స్తోత్రముల్ సలిపె లక్ష్మీముఖ్య బీజంబులఁ. ౨౩౫

వ. ఇట్లు లక్ష్మీ వాణీ కామ మాయా బీజాత్మకంబయి దశాక్షరంబయిన మంత్రంబును స్వాహాం
తంబుగా జపంబు సేయువారలకు సర్వసిద్ధి యగుట నిశ్చయంబు. మరియు ఘృతదీపంబు
చేతను, ధూమంబుచేతను, నైవేద్యంబుచేతను, చందన పుష్పాదులచేతను, నానావిధోప
చారంబులచేతను, బుండరీకాక్షుండు బూజింప సంతుష్టయై వృక్షంబునుండి తులసి యుద్భ
విల్లి ప్రసన్నయై చరణాంబుజద్వంద్వంబున వ్రాలి యున్నం దిలకించి నిన్ను నేను
శిరంబునను, వక్షంబునను ధరియించెద నంతటనుండి సర్వదేవతలును, మానవులును
నిన్ను శిరోవక్షంబుల ధరించుచుం బూజించుచుందురు. అని శ్రీమదాదినారాయణుండు వరంబు
లిచ్చి తులసిం దోడ్కొని నిజనివాసంబునకుం జనియె నని చెప్పిన విని నారదుండు. ౨౩౬

క. తులసీధ్యానంబును మఱి । తులసీపూజనము తులసిస్తోత్రము వినఁగఁ
వలతుఁ దెలుపవె నావుడు । జలజాక్షుడు పలికె బరమసంతోషమునన్. ౨౩౭

వ. తొల్లి గరుడధ్వజుండు తులసీవియోగంబున ధ్యానించె నెట్లనిన. ౨౩౮

తే.గీ. బృందరూపంబుగా వృక్షవితతి యగుచు । పృథివి నేదేవి జనియించి వృద్ధిగాంచు
గతమునం జేసి బృందాఖ్య గాంచి మించె । నట్టి తులసిని బ్రార్థింతు ననుదినంబు ౨౩౯

తే.గీ. సమ్మదమ్మున బృందావనమ్మునందు । తొల్లి యేదేవి తా నుద్భవిల్లి లలిత
కలిత బృందావనాభిఖ్య గాంచి మించె । నట్టి తులసిని బ్రార్థింతు ననుదినంబు. ౨౪౦

తే.గీ. అఖిలవిశ్వంబులందును సఖిలజను ల। వలన బూజింపబడుచు నిర్మలత గాంచి
పృథివిపై విశ్వపూజితాభిఖ్య గాంచె । నట్టి తులసిని భజియింతు ననుదినంబు. ౨౪౧

తే.గీ. వివిధవిశ్వంబులకును బావిత్ర్యమిచ్చి । పృథివి నేదేవి విశ్వపావని యనంగ
ఖ్యాతి వహియించె నట్టి సత్కాంతిసహిత।యైన తులసిని భజియింతు ననుదినంబు. ౨౪౨

ఆ.వె. పువ్వు లెన్నియున్న బురుహూతముఖ్యులు । నీవులేని పూజ నిష్ఫలం బ
టంచు దలతు రట్టి యఖిలకుసుమసార।మైన నిన్ను గొలువ నఖిలమంతు. ౨౪౩

తే.గీ. నీవు దొరికినమాత్రాన నిఖిలభక్త । కోటి యానందభరితమై యూర్మిమూపు
కతన నందిని యనుపేరు గలిగె నీకు । నట్టి నీ విష్ట సంతుష్ట వగుము దేవి. ౨౪౪

క. తులలేని దేవి వనుచున్ । బలువిధముల బొగడబడుటబట్టి జగమునన్
దులసీసమాఖ్య నీకున్ । గలిగె నిన్ని శరణ మిపుడు గంటిని దేవీ. ౭౮౫

తే.గీ. ప్రియతమవు నీవు గావున । బృథివియందు । కృష్ణజీవని యనియెడి కీర్తి నీకు
గలిగె నావల్ల నిది నీకు గాదు మిథ్య । కావునను నన్ను రక్షించుగాత దేవి. ౭౮౬

క. దనుజాంతకు డీగతిని న్న । వనముం జేయంగ దులసి వలపున జని యా
తని పాదంబులపై బడి । తను గైకొనుమనుచు నేడ్చె తద్దయు నంతన్. ౭౮౭

మ. హరి దానిం గని లేవనెత్తి తన హృద్యంబైన వక్షస్థలిన్
ధరియించెన్ దదనంతరంబ నిజసద్మంబున్ బ్రవేశింప నా
తురతం భారతి యానతిం గొనుచు సంతోషంబుతో నేగి స
త్వరలీలాగతి దాని బూర్ణకృప బ్రీతం జేసె నత్యంతమున్. ౭౮౮

మ. తులసిం గాంచి సరోజలోచనుడు సంతోషంబుతో నీవు ని
శ్చలధన్యస్థితి సర్వపూజ్యవగుమీ సర్వత్ర నిన్నెల్ల రో
దలపై దాల్తురు నీకు మ్రొక్కెదరుగా ద్వన్మూర్తి సేవింతు రి
చ్ఛల నంచున్ బలుకంగ బ్రీతి మదిహెచ్చం భారతియుక్తయై. ౭౮౯

వ. నిలిచియుండ ౭౯౦

క. అది గని లచ్చియు గంగయు । మది ముదమున బొదలి రంత మాధవుడును స
మ్మదమున నలువురతోడన్ । సదనమ్మున నుండె నధికసంపల్లీలన్. ౭౯౧

క. చను బృందయు మరి బృందా । వని యనగా దులసి విశ్వపావని యన నం
దిని విశ్వపూజ్య హరిజీవని సుమసార యనునట్టి వరనామములన్. ౭౯౨

క. తులసిని బూజించుచు నే । యలఘుడు మది భక్తిగల్గి యష్టాభిఖ్యల్
పలుమారు నుడువు నాతడు । బలవద్గతి సర్వమేధఫలమందుసుమీ. ౭౯౩

క. తులసీదేవీ భవ ని । ర్మలమగు గార్తికిని బూర్ణిమను హరి దానే
తులసిం బూజించెను ద । త్తులసిప్రభావంబు సర్వతోభద్ర మగున్. ౭౯౪

క. కీర్తించుచు శ్రీతులసిం । గార్తిక బూర్ణిమను బూజగావించు నెవం
డార్తిదొలగి యా మనుజుడు । వర్తించును సౌఖ్యపదవి వైకుంఠమునన్. ౭౯౫

క. పురుషు డెవడు కార్తికమున । పురుషోత్తమునకు భక్తి బొదలగ దులసీ
వరదళము నొసగు నాతడు । బరగు నయుతధేనుదానఫలమంది ధరన్. ౭౯౬

మ. తులసిం గార్తికమందు గొల్చు నరు డొందుం బుత్రపౌత్రాభయో
జ్జ్వలదారోగ్యసుఖాయురున్నతులు దత్స్తోత్రంబు ధ్యానంబు పూ
జలు నెల్లన్ నిగమంబునందె తెలియున్ జాలంగ గణోక్తిమై

తులసీవృక్షము దృష్టిగోచరము నిర్దుష్టప్రభావంబునై
మెలగుం దానికి మించు భద్రతము భూమిన్ వేరె లే దెన్నగన్. ౪౯౭

క. నిరతంబు తులసి నౌదల । నరుడు ధరింపంగ నొప్పు నానావిధ భా
సురసౌఖ్యదాయిని యగున్ । బరమపవిత్రత్వమందు భాసిలుకతనన్. ౪౯౮

ఆ. వె. తులసికి దులలేదు తులసి పావనమూర్తి । తులసి ముక్తిదాత్రి తులసి వంద్య
తులసి సర్వపూజ్య తులసి శిరోధార్య । తులసి విష్ణుభక్తికలనకర్త్రి. ౪౯౯

వ. నారదా తులస్యుపాఖ్యానంబు సవిస్తరంబుగా జెప్పితి నింక నేమి యడిగెద వనిన నార
దుండు నారాయణున కిట్లనియె. ౫౦౦

క. అమృతోపమమగు తులసీ । రమణీయతలెల్ల వింటి రాక్షసవైరీ
క్రమమున సావిత్రీ మహి । మము నే వినవలతు దెల్పుమా దయతోడన్. ౫౦౧

## —: సావిత్ర్యుపాఖ్యానము :—

క. అనుడును విని నారాయణు । డను నో మునినాథ శ్రద్ధ నాలింపుమి యా
జనని మునుమున్న విధిచే । తను బూజింపంగబడియె దరువాత నొగిన్. ౫౦౨

క. వేదగణంబులచేతన్ । మోదంబున బూజ లంది మునిగణములచే
నాదట బూజల బడసెన్ । సాదరగతి గొల్చె బిదప నశ్వపతి దగన్. ౫౦౩

క. అన విని నారదుడు దయా । వనధీ యశ్వపతి యనెడువా డెవ్వడు దా
ఘనదేవి బూజసేయ గ । తనమేమి తెలుపుమయ్య దయ దైవారన్. ౫౦౪

క. వినుపింపుము నాగ జనా । ర్దను డనియెన్ భద్రమండలంబున గల్పా
వను డశ్వపతి సమాఖ్యుడు । జనపాలుడు గలడు శత్రుశాసను డగుచున్. ౫౦౫

క. వానికి గులసతి మాలతి । భూనుత సుగుణాఢ్య పరమపురుషునకు రమా
మానినిబోలె బతివ్రత । యై నెగడన్ సకలసంపదన్వితయగుచున్. ౫౦౬

తే.గీ. లేమ కెంతయు బిడ్డలులేని కొరత । మది నెరియజేయ గుందుచు మౌనినాథు
డగు వసిష్ఠుని వేడగ నాత డాత్మ । నరసి సావిత్రి బూజింపు మనుచు జెప్పె. ౫౦౭

శా. సంతోషంబున మాలతీలలన యా సావిత్రి బూజించె న
త్యంతప్రీతి నటయ్యు దేవి దయ ప్రత్యక్షంబుగాకున్కిచే
చింతాసాగరమగ్నయై సదనముం జేరంగ దా నేగి యా
యింతిం గన్గొని యూరడించి యచలాధీశుండు పుత్రార్థియై. ౫౦౮

శా. సావిత్రీజపతత్పరత్వమున బ్రాంచద్భక్తి నూరేండ్లు శ్ర
ద్ధావంతుం డగుచున్ దపంబు సలిపెన్ దా జూడగాజాల ద

ద్దవిన్ జిత్రముగా వినంబడె నభోదేశంబున న్వాణి రా
జా। వేవేగమ సేయబూను మిక గాయత్రీజపం బర్మిలిన్. ౨౦౯

క. అని యిట్లు వినుచు నంతనె। జనుదెంచి పరాశరుండు జనపతి గని యో
మనుజేశ్వర గాయత్రీ। మను మహిమము జెప్పదరమె మాబోటులకున్. ౨౧౦

క. గాయత్రి నురక నొకపరి। బాయక స్మరియించువాని పాపము దొలగుఁ
వేయేటికి దెలిపెద విను। మో యవనీనాథ దాని యుత్తమగుణముల్. ౨౧౧

క. పదిసారులు జపియించిన। జెదరు నరుడు రాత్రి పగలు జేసిన యఘముల్
పదపడి నూరు జపించిన। గదలుం మాసార్జితాఘకాండము దవులఁ. ౨౧౨

క. వేయిపరులు జపియించిన। బాయును సంవత్సరకృత పాపచయంబుల్
న్యాయముగ లక్షజపముం। జేయగ జన్మాఘరాశి శీఘ్రము తొలగుఁ. ౨౧౩

క. శతలక్ష జపం బయినన్। గతసకలభవార్జితాఘకాండం బడగుఁ
దత దశకోటి జపంబున। నతులంబగు ముక్తి గలుగు నవని ద్విజులకున్. ౨౧౪

ఆ. వె. పాపబడగబోలె బరగించి హస్తంబు। రంధ్రముద్రితంబు రహి నొనర్చి
యెత్తి వాంఛ కచలవృత్తి జపింపగవలయు భూసురుండు ప్రాఙ్ముఖుడయి. ౨౧౫

ఆ. వె. కడగి ద్విజు డనామికామధ్యదేశంబు। మొదలుపెట్టి దిగువ ముట్టికొనుచు
వదలకల్లనల్ల వామక్రమంబున। నన్నవ్రేలిమూల మంటవలయు. ౨౧౬

ఆ.వె. తెల్లదామరపూసలు దెచ్చియేని। స్ఫటికములగూర్చియేని ద్విజప్రవరుడు
దండ గావించుకొని సంస్కృతంబు చేసి। తనర గాయత్రి జపియింపదగు మహీశ. ౨౧౭

క. దేవాలయమునకేనియు। బావనతీర్థమునకేని బనివిని యచటఁ
రావాకున బద్మంబున। ధీవరు డా మాలికం బ్రతిష్టించి తగన్. ౨౧౮

క. గాయత్రీ శతజపముఁ। జేయుచునేనియును గాంగజీవనమున నే
న్యాయముగ బంచగవ్యము। పోయుచునేనియును శుద్ధి బొందింప దగున్. ౨౧౯

క. ఈ విధి దశలక్షజపము। గావించిన మనుజునకును గరుణాన్వితయై
సావిత్రి దర్శనం బిడు। పోవనడచు నఖిలపాపపుంజము వేగన్. ౨౨౦

మ. సరిగా నిత్యమునుం ద్రిసంధ్యల మహాశాంతిన్ శుచిత్వంబుతో
బొరి వార్చన్ ధరణీతలేంద్ర విను మొప్పున్ నీకు సంధ్యాక్రియా
విరహోపేతు డశుద్ధు డెల్లక్రియలన్ విప్రత్వ శూన్యుండగున్
మఱియున్ శూద్రునితోడ దుల్యుడుసుమా మాన్యుండుగా డెప్పుడున్, ౨౨౧

సీ. వసుధ నెవ్వాడు యావజ్జీవపర్యంతమును మూడుసంధ్యల మొనసి వార్చు
వాడు సూర్యునితోడ నీడగు తేజంబునందున నమరి తపమందు తలప

వాని పాదరజంబుచే నిల బూతయౌ నలర జీవన్ముక్తు డనగ వాడె
వాడు సోకిన తీర్థవాసంబులెల్లను పావనత్వము నొంది పరిఢవిల్లు
పాపంబులెల్లను పరుగిడి చను వైనతేయుని గని కాద్రవేయులట్లు

తే.గీ. మూడుసంధ్యలు వార్చని మూఢజనుని । పూజ నమరులు ముట్టరు పొరి బితరులు
దర్పణంబులు గొనరు గోత్రాతలేశ । యకరణంబున బ్రత్యవాయంబుకతన, ౮౨౨

తే.గీ. ఎవరు మూలప్రకృతి భక్తి నెనయకుంద్రు । నెవరు తన్మంత్రమును బఠియింపకుంద్రు
నెవ్వరు తదుత్సవార్చనహీను లెన్న । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౩

తే.గీ. విష్ణుమంత్రవిహీనుడై వెలయువాడు । మూడుసంధ్యలు వార్పని మూర్ఖజనులు
నరయ నేకాదశీహీను డైనవాడు । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౪

తే.గీ. ఎవడు విష్ణుని నైవేద్య మెరుగ డెపుడు వాడు । ధావకుడును వృషవాహకుడును
శూద్రునన్నము దినెడి భూసురుడు నెన్న । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౫

తే.గీ. శూద్రశవదాహులైన భూసురులు మరియు । వృషలి బెండ్లాడువారలు వినుము శూద్ర
సూపకారులు నగువారు శూద్రసములు । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౬

తే.గీ. అవని శూద్రప్రతిగ్రహ యాజనములు । సేయువారును మాంసాశు లేయడ నసి
చేత జీవించువాడును క్షితితలేంద్ర । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౭

తే.గీ. అర్థలుబ్ధత గన్యల నమ్మువారు । నచ్యుతునినామపంక్తుల నమ్మువారు
మహిన వీరాన్నభోజులు మానవేంద్ర । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౮

తే.గీ. కడజనిన యింతిచేత నాల్గవదినమున । నన్నమును దినువారును నఘముచేసి
బ్రతుకుచున్నట్టివారును వార్ధిషికులు । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౨౯

తే.గీ. విద్యనమ్మెడివారును వృషహయార్చ । నరయనట్టిరు సూర్యోదయంబు పిదప
గూర్కువారును జేపల గొరకువారు । వారు విషహీనమైనట్టి పాము లందు. ౮౩౦

క. అని చెప్పి మునిశ్రేష్ఠుడు । చనియె నిజాశ్రమమునకును జయ్యన నంతన్
జనవరు డా సావిత్రిన్ । దనివారగ గొలిచి కాంచి తత్పద మందెన్. ౮౩౧

వ. "అనిన విని నారదుండు జగన్నాథ పరాశరుం డా యశ్వపతినృపాలునకు సావిత్రీ ధ్యాన
పూజన స్తోత్ర విధానంబు లెట్లుగా పలికి మంత్రం బెద్ది యొసంగె ? పిదప నరవరేణ్యు
డేమిచేసె ? నెట్లు దేవిం బొడగాంచె ? నే యే వరంబులుబడసె ? వినవలతు సవిస్తరంబుగా
దెలుపవే యనుండు భక్తపరాధీనుండయిన నారాయణుండు. ౮౩౨

తే.గీ. జ్యేష్ఠకృష్ణత్రయోదశి జెన్నుమీర । శుద్ధకాలంబునందు దా శుచి వహించి
తగ చతుర్దశివ్రతము మొదలిడవలయు । నద్ది పదునాలుగేడుల యవల ముగియు. ౮౩౩

సీ. పదునాల్గు నైవేద్య ఫలములు సుమ ధూపకంబులు వస్త్రయుగ్మంబు మరియు
యజ్ఞోపవీతంబు నమరించి ఫలశాఖికాయుతంబైన మంగళఘటంబు
నిలిపి గణేశు దినేశు వహ్నిని విష్ణు శివు శివ నర్చించి చెలగి విప్రు
డావాహనము ఘటమందు గావించి ద్విజాగ్ర్యుండు దా దేవి నాత్మ నిలిపి.

తే.గీ. యొనర మాధ్యందినంబున నుక్తమైన । క్రమము విడనాడ కఖిలైకకామదంబు
పుణ్యఫలదంబు నైనట్టి పూజనమున । నెమ్మి మంత్ర స్తవముల ధ్యానింపవలయు. ౮౩౪

వ. తప్తకాంచనవర్ణాభయు, బ్రహ్మతేజోజ్వలంతియు, గ్రీష్మమధ్యాహ్నమార్తాండసహస్ర సమప్రభయు, ఈషద్ధాసప్రసన్నాస్యయు, రత్నభూషణభూషితయు, వహ్ని శుద్ధాంశుకాధానయు, భక్తానుగ్రహదాయివిగ్రహయు, సుఖదయు, ముక్తిదయు, శాంతయు, గాంతయు, సర్వసంపత్స్వరూపయు, సర్వసంపత్ప్రదాత్రియు, వేదాధిష్ఠాత్రియు, వేదశాస్త్రస్వరూపిణియు, వేదబీజస్వరూపయు నగు వేదమాతఁ భజించెద నని యిట్లు ధ్యానంబు సేసి నైవేద్యం బిచ్చి శిరంబునం జేయి నిడుకొని పునర్ధ్యానంబు సేసి ఘటంబున దేవి నావాహించి వేదోక్తవిధానంబున నాసన పాద్యార్ఘ్య స్నాన గంధ ధూప దీప నైవేద్య తాంబూల శీతోదక వసన భూషణ మాల్యానులేప నాచమనీయ తల్పంబులను షోడశోపచారంబుల నెల్ల నడుపునెడ. ౮౩౫

సీ. అమ్మ సావిత్రి నీ కతిభక్తి నిచ్చెద హేమసింహాసనం బింపుమీర
తల్లి సావిత్రి పాద్యంబు నీ కిచ్చెద తీర్థోదకంబును దెచ్చి వేడ్క
తాయి సావిత్రి నే దగ నీ కొసంగెద నర్ఘ్యంబు దూర్వాదళాన్వితంబు
జనని సావిత్రి నే స్నానీయ మిచ్చెద మంచిగంధము నీరు ముంచి యెత్తి

తే.గీ. చందనంబును వాసనాసహిత వస్తుచయము గలపోసి గంధంపు జలము నే స
మర్పణము సేయుదును నీకు నతిముదమున । శోకసంహర్త్రి సావిత్రి లోకధాత్రి. ౮౩౬

సీ. సర్వమంగళమును సర్వమంగళదాయి యగు ధూప మిచ్చెదనమ్మ నీకు
దీప్తికారకమును దివ్యగంధయుతంబు నగు దీప మిచ్చెద । నమ్మ నీకు
స్వాదురూపంబును సకలపుష్టిదము నైవేద్య మిచ్చెదనమ్మ వెలయ నీకు
కర్పూరయుక్తమ్ము ఘనవాసితంబును నగు వీటి యిచ్చెదనమ్మ నీకు

తే.గీ. శీతలంబును లోకైకజీవదంబు । నైన పానీయ మిచ్చెదనమ్మ నీకు
నిరుపమానందసంధాత్రి నిఖిలధాత్రి । శోకసంహర్త్రి సావిత్రి లోకధాత్రి. ౮౩౭

సీ. శోభాస్వరూపంబు శోభాకరంబును నగు వస్త్రయుగ్మంబు నందవమ్మ
కాంచనమయము శ్రీకరము శ్రీయుతమును నగు భూషణనికాయ మందవమ్మ
సర్వమంగళమును సముచితగంధంబు నగునట్టి మాల్యంబు నందవమ్మ
శృంగారమును భవ త్సేవార్హమును నగు నగురు లేప సుఖంబు లందవమ్మ

తే.గీ. అమితశుద్ధంబును సుగంధమైన యట్టి । యందమగు గంధ మిదిగో నీ వందవమ్మ
నిరుపమానందసంధాత్రి నిఖిలదాత్రి । శోకసంహర్త్రి సావిత్రి లోకధాత్రి. ౨౩౮

సీ. రమ్యంబు శోభాకరంబును నైనట్టి సిందూర మిదిగో నీ వందవమ్మ
పావనగ్రంథి సంభావితం బైనట్టి యజ్ఞసూత్రం బిదే యందవమ్మ
నేర్చియు నేరక నే జేయు నుపచార మంతయు గృపను నీ వందవమ్మ
శక్తిలోపముచేత సలిపిన క్రియలందు నలతు లెంచక ప్రీతి నందవమ్మ

తే.గీ. కేలుమోడిచి యొదల గీలుకొల్పి । యాత్మ ధ్యానించి మ్రొక్కెద నందవమ్మ
నిరుపమానందసంధాత్రి నిఖిలదాత్రి । శోకసంహర్త్రి సావిత్రి లోకధాత్రి. ౨౩౯

వ. అని యివ్విధంబున నుపచారంబులు సల్పి స్తోత్రంబు చదివి పిమ్మట విప్రునకు దక్షిణ యిచ్చి చతుర్థ్యంతంబయిన సావిత్రీపదంబునకు వహ్నిభార్యం జేర్చి లక్ష్మీ మాయా కామబీజ పూర్వంబుసేసి యష్టాక్షరమంత్రంబున మాధ్యందినోక్తక్రమంబున జపియించుచుండవలయు. ఈమంత్రంబు సర్వకామదం బిది బ్రహ్మకొసంగి కృష్ణుండు గోలోకంబున నొసంగెం గాని యద్దేవి గోలోకంబు విడచి రానొల్లకున్కి శ్రీకృష్ణునాజ్ఞచే బరమేష్ఠి భక్తిపూర్వకంబుగా వేదమాతం గొల్చిన బరితుష్టయైనం గాంచి యతండు స్తోత్రంబు చేసిన విధంబు సెప్పెద వినుము. ౨౪౦

క. నాకు బ్రసన్నవుగమ్మా । లోకేశ్వరి సుందరీ తలోదరి భక్తా
నీకానుగ్రహకారిణి । కాకోదరవేణి నిత్యకల్యాణి యికన్. ౨౪౧

క. నాకు బ్రసన్నవుగమ్మా । పాకారిముఖామరాళి పాపశమని య
స్తోకమణీగణభూషిణి । కాకోదరవేణి నిత్యకల్యాణి యికన్. ౨౪౨

క. నాకు బ్రసన్నవుగమ్మా । ప్రాకటతేజస్స్వరూప పరమానందే
ద్ధాకారిణి శుభకారిణి । కాకోదరవేణి నిత్యకల్యాణి యికన్. ౨౪౩

క. నాకు బ్రసన్నవుగమ్మా । లోకేశాది ద్విజాతిలోకనిరత సు
శ్రీకారిణి వేదజనని । కాకోదరవేణి నిత్యకల్యాణి యికన్. ౨౪౪

మ. అని యిమ్మాడ్కి నజుండు పల్క విని యత్యంతప్రమోదంబునన్
జనియెన్ బ్రహ్మనుగూడి సత్యమునకున్ సావిత్రి యా మంత్రమే
వినుమా యశ్వపతుండు గైకొనియె సావిత్రీవరప్రాప్తియున్
గనియెన్ నాలుగువేదము ల్చదివినన్ దత్పుణ్య మిం దబ్బెడిన్. ౨౪౫

శా. సావిత్రీభజనంబు జేసి యిటు లశ్వక్ష్మాతలేంద్రుండు భ
క్త్యావేశంబున నుండ దేవి శతతిగ్మాంశుప్రభోపేతయై
తా విచ్చేసి నృపుం గనుంగొని దయాతాత్పర్యముప్పొంగ నెం
తే వేడ్కన్ జిఱునవ్వు నెమ్మొగమునన్ దీపింపగా నిట్లనెన్. ౨౪౬

మత్తకోకిల. వాసవోపమ నిన్నెఱుంగుము వాంఛితంబు నెఱుంగుదున్
నీ సతీమణి యాడుబిడ్డను నెమ్మి గోరెడి నీవు పే
రాస జెందెడు పుత్రలాలన కాపెకోర్కి లభించెడిన్
భాసురంబగు నీదు కోర్కెయు బట్టుదప్పదు పొమ్మికన్. ౨౪౭

క. అని దేవి తిరోహితయై । నను సంతసమున గృహంబునకు జని నృపు డ
త్యనఘయగు వనిత కిది దెల్పిన నాకెయు మిన్నుముట్టి పెంపెసలారెన్. ౨౪౮

క. మాలతికి చూలు నిలుపగ । నాలో నెల రెండునెలలు నై మూన్నెలలై,
నాలుగు నెలలై యై దా । రై లీలన నేడు నెన్మిదై తొమ్మిదియై. ౨౪౯

క. పదియవ మాసమ్మున న । ష్మ్మదితకు మాలతికి నొక్క ముద్దియ పుట్టెన్
ముదమున సిరి క్షీరాబ్ధికి । నుదయించినయట్లు భాగ్యయోగము కల్మిన్. ౨౫౦

క. సావిత్రి వరముచేతన్ । శ్రీనిలసిత యగుచు బుట్టె జిన్నికొమిరె యం
చా వసుధాధిపు డామెకు । సావిత్రీనామ మిడియె సంతోషమునన్. ౨౫౧

తే.గీ. విదియజాబిల్లి బోలె న వ్వేలది నాట । నాట నభివృద్ధినొంది నానావిధముల
తల్లిదండ్రుల ముచ్చట లెల్ల దీర । ముద్దుచూపుచు దా గొన్ని ప్రొద్దులకును. ౨౫౨

ఆ. వె. జవ్వనంబు నొంద జనపతియును స్వయం । వరము సాటి యందు వరగుణాఢ్యు
మహితగుణమణిం ద్యుమత్సేననందను । సత్యవంతు వలచు జాడ గాంచి. ౨౫౩

శా. ఆ సావిత్రిని జారుగాత్రిని గుణాఢ్యన్ భూషణశ్రేణితో
దాసీదాసజనంబుతో నిరుపమద్రవ్యాళితో దానమున్
జేసెన్ భూపతి సత్యవంతుడు సతిన్ జేకొంచు జేరెన్ నిజా
వాసం బచ్చట గామభోగనిరతిన్ వా డుండ గొన్నాళ్ళకున్. ౨౫౪

మ. ఫలముల్ దేరగ దండ్రి యాజ్ఞగొని య బ్బాలుండు దా గానన
స్థలికిం బోవగ దైవయోగమున నా సావిత్రియుం బోవ నం
దలి వృక్షంబున కెక్కి వాడు పడినం బ్రాణంబు లేగంగ జిం
తిలజొచ్చెన్ లలితాంగి దైన్యమున నెంతేభీతి వాటిల్లగన్. ౨౫౫

క. అది గని యము డబ్బాలున్ । గదలని యంగుష్ఠకాయు గట్టి కరమునన్
గదియించి చనగ వెంటన్ । మదవతియుం జనియె దీనమాననయగుచున్. ౨౫౬

ఆ. వె. వెనుక దిరిగిచూడ నినసూనుచెంగట । వగచికొనుచు వచ్చు మగువమిన్న
గాంచి పల్కె నోసి కలికి నీ వెచ్చటి । కరుగుదెంచుదాన వని యముండు. ౨౫౭

క. పెనిమిటితో రాదలచితె । మనుజతనువు విడువు మిచట మర్త్యశరీరం
బున నాలోకమునకు రా । జన దది నిర్ణయముసుమ్ము సరసీజాక్షీ. ౨౫౮

క. కర్మమునం జనియించును । గర్మంబున బెరుగు మఱియు గర్మమున జెడున్
గర్మమె సుఖదుఃఖము లిడు । గర్మమె భయశోకములకు గారణము సఖీ. ౨౫౯

క. కర్మమునం దేవత్వము । కర్మమున నరత్వ మింక గంధర్వతయున్.
గర్మమున రాక్షసత్వము । కర్మముననె మోక్షగతులు గలుగునుసుమ్మీ. ౨౬౦

క. కర్మమున బ్రాహ్మణత్వము । కర్మమునన్ క్షత్రియత్వ గతి విట్త్వంబున్
గర్మమున గలుగు శూద్రత కర్మంబున నగునుజమ్ము కనకనిభాంగీ. ౨౬౧

తే.గీ. విని పతివ్రతయైన సావిత్రి భక్తి । బెనగొనగ ధర్ము నీక్షించి పృథుగుణాఢ్య
జ్ఞానమార్గైకదర్శక కమలబంధు । తనయ వినుమని పల్కె నిస్తంద్ర యగుచు. ౨౬౨

సీ. కర్మ యనగ నెద్ది కర్మకర్త యెవండు కర్మకు హేతువై కడగు నెద్ది
దేహ మనగ నెద్ది దేహి ధా నెవ్వండు రహి దేహమునకు గారకు డెవండు
జ్ఞాన మనగ నెద్ది కన బుద్ధినా నెద్ది ప్రాణికోటికి బ్రాణమనగ నెద్ది
యింద్రియంబు లనంగ నెవ్వి లక్షణ మెద్ది వానికి దేవతావర్గ మెద్ది

తే.గీ. భోక్త యెవ్వండు తెలియంగ భోజయితయు । నేడు భోగంబనంబడు నెద్ది జీవు
డనగ నెవ్వండు పరమాత్మ యనగ నెవ్వ।డంతయును నాకు నెఱిగింపుమయ్య ధర్మ । ౨౬౩

వ. అనిన విని ధర్మండు ఓ సుందరీ । వేదోక్తంబయిన ధర్మంబు పుణ్యకర్మంబునాంబడు. తద్విరుద్ధంబు పాపం బగు. ఫలసంకల్పరహితంబగు దేవసేవాదికంబు కర్మనిర్మూలకంబయి భక్తి నిచ్చు. కొందరు కర్మఫలంబు గోరి యనుభవింతురు. కొంద రది త్యాగంబుసేసి ముక్తు లగుదురు. భక్తుండు జన్మ మృత్యు జరా వ్యాధి శోక భయ వివర్జితంబగు ముక్తి వడయు. మఱియు నా భక్తి ద్వివిధంబగు. నందుమొదటిది శృత్యుక్తంబై నిర్వాణ మోక్షదంబై భాసిల్లు. ఇదియ పరమవైష్ణవుల యుపాసనామార్గంబు. రెండవది బ్రహ్మవిత్తము లగు యోగులు కోరుదురు. ఇది యుపనిషద్గోచరంబు. బ్రహ్మైక్యంబు సిద్ధించు. కర్మకు బీజరూపుండును, తత్ఫలప్రదుండును, కర్మరూపుండును నగు పరమాత్మ నాంబడు. భగవంతుం డుత్కృష్టయైన ప్రకృతిని విడువకుండు. దేహంబు నశ్వరంబు. పృథివియు జలంబును దేజంబును వాయువును నాకాశంబును సృష్టివిధానంబున సూత్రరూపంబులై యుండు. కర్మకు కర్త దేహి, యాత్మ భోజయిత, భోగంబు విభవభేదంబు, నిష్కృతి మోక్షంబగు. నిది యుంగాక సదసద్భేదబీజంబగు జ్ఞానంబు నానావిధంబై యుండు. విషయవిభాగంబుల వేరు పరుచునది బీజంబునాంబడు. వివేకం బీ జ్ఞానంబునకు బీజం బగు అని శ్రుతులు చెప్పు. వాయుభేదంబులగు ప్రాణాదులు దేహికి బలరూపంబులై యుండు. ఇంద్రియవర్గం బీశ్వ రాంశంబై యనూహ్యంబై కర్మప్రేరకంబై దేహాలకు దుర్నివార్యంబై యుండు. నిరూ

పింపనలవి గాక యప్రత్యక్షంబైన మనంబు జ్ఞానభేదంబులకు మార్గంబగు. త్వక్చక్షుశ్శ్రోత్ర
జిహ్వాఘ్రాణంబులు జ్ఞానేంద్రియవర్గంబు. ఇది దేహుల కర్మలకు మూలంబు. మిత్ర రిపు
రూపంబై సుఖదుఃఖంబులం గూర్చు. సూర్య వాయు పృథివీ బ్రహ్మాదు లధిదేవత లనంబడు
దురు. ప్రాణ దేహాదుల భరించువాడు జీవుండు. పరమంబును, వ్యాపకంబును నగునది
బ్రహ్మ యనంబడు. అది నిర్గుణంబును, నిత్యంబును, కారణకారణంబు నై పరమాత్మ
నాంబడు. ఇదియ ఎఱుకగలవారల కెఱుక. నీ వడిగినయది తెల్పితి నో ముద్దియా! యథా
సుఖంబుగ జను మనిన విని సావిత్రి ధర్మున కిట్లనియె. ౨౨౪

తే.గీ. అయ్యయో కాంతు విడనాడి యంచిత ప్ర। బోధకుని నిన్ విడచి యెందుబోవుదాన
నడిగినది యెల్ల చెప్పి న న్నాదరించి। ధన్యజేయుము వేడెద ధర్మరాజ! ౨౨౫

క. ఏ యే కర్మముసేసిన। నే యే యోనిని జనించు నేకర్మమునన్
బాయక స్వర్గము వడసెడి। నే యే కర్మంబు నరకహేతువు తండ్రీ! ౨౨౬

శా. ఏకర్మంబున ముక్తి గల్గు మఱి దా నేకర్మమిచ్చున్ శుభా
స్తోకప్రక్రియ భక్తి యుక్తి మఱి యిచ్చున్ స్వర్గలోకంబు నే
యే కర్మం బొసగు న్మహానరక మే యే కర్మయోగం బిడున్
ధీకాంత్యాదు లొసంగు కర్మ మది యేదీ రోగ మే దిచ్చెడున్. ౨౨౭

క. ఏకర్మము దీర్ఘాయువు। లోకసుఖము నిచ్చు మఱియు లోభాదిగుణం
బేకర్మ మిచ్చు సుఖ మిక। నేకర్మము గలుగజేయు నేర్పడ జెపుమా. ౨౨౮

తే.గీ. కర్మ మెయ్యది యల్పాయుగా నొనర్చు। గర్మ మెయ్యది దుఃఖంబు గలుగజేయు
గర్మ మెయ్యది గ్రుడ్డినిగా నొనర్చు। గడగి చెవిటినిగా జేయు గర్మ మెద్ది? ౨౨౯

ఆ. వె. కాయకంటివానిగా జేయు నెయ్యది। యంగహీను జేయునట్టి దెద్ది
కుంటివాని జేసి కుందించు నెయ్యది। కపటి జేయునట్టి కర్మ మెద్ది? ౨౩౦

ఆ.వె. దొంగజేసినట్టి దుష్టకర్మం బెద్ది। కడసి మోక్ష మిచ్చు కర్మ మెద్ది
బ్రాహ్మణత్వమిచ్చు పటుకర్మ మెయ్యది। ఘన తపస్వి జేయు కర్మ మెద్ది? ౨౩౧

ఆ. వె. దేనులోక మిచ్చు దివ్యకర్మం బెద్ది। నరక మనగ నెద్ది నరకసంఖ్య
యెద్ది నరకమునకు నేగువా డెవ్వాడు। తూలియాడ నుండుకాల మెంత? ౨౩౨

వ. ఇట్లడిగిన సావిత్రీ ప్రశ్నంబులకు విస్మయం బంది యొక్కింత నవ్వి యముండు జీవుల
కర్మపాకంబు జెప్పదొడంగె. ౨౩౩

సీ. తరుణి! పండ్రెండేండ్ల దానవు నీవు నీ జ్ఞానంబు యోగులకైన లేదు
సావిత్రివరదానసౌభాగ్యమున జేసి సావిత్రి వైతివి యీవు బిడ్డ

నీ తండ్రి సావిత్రినింగూర్చి తప మాచరించి ని న్నూతుగా గాంచి మించె
హరికి శ్రీవలెను గళ్ళపున కదితివలె గౌతమున కహల్యకరణి నింద్రు

తే.గీ. నకును శచివలె మిహిరాంశునకును రోహిణి । వలె స్మరునకు రతివలె నిప్పునకును
స్వాహవలె విప్రుసమితికి స్వధనుబోలె । రవికి నుషవలె సత్యవద్రమణి వీవు. ౮౭౪

ఆ.వె. తల్లి గాన నీకు తలపున గల్గిన యట్టి వరములెల్ల నడుగవమ్మ
తప్ప కిపుడ యిచ్చి మెప్పింతు నే నిన్ను । మనమునందు గొంకు మానుమమ్మ. ౮౭౫

వ. అనిన విని సావిత్రి తన మనంబున నత్యంతానందంబు నొంది నిఖిలధర్మవిదుండైన పితృపతిం గాంచి యిట్లనియె. ౮౭౬

తే.గీ. సత్యవంతువలన నౌరసత్వమొలయు । పుత్రశతకంబు నాయందు బుట్టవలయు
నిదియు నొక వరమడిగితి నీగదయ్య । తామరసబాంధవతనూజ ధర్మరాజ । ౮౭౭

తే.గీ. అంధుడైనట్టి మా మామ కక్షియుగము । రాజ్యలాభంబు మరియును బూజ్యుడైన
తండ్రికిని బుత్రశతకంబు దగ నొసగుము । తామరసబాంధవతనూజ ధర్మరాజ । ౮౭౮

తే.గీ. లక్ష హాయనములు భూతలమున భోగ । భాగ్యముల నంది కడ సత్యవంతుతోడ
నేను వైకుంఠమున కేగ నిమ్ము వరము । తామరసబాంధవతనూజ ధర్మరాజ । ౮౭౯

తే.గీ. జీవకర్మవిపాకంబు చెవుల దనియ । వినవలతు విశ్వవిస్తారబీజ మాల
కింప మనసాయె దెలుపుము కృపవహించి । తామరసబాంధవతనూజ ధర్మరాజ । ౮౮౦

వ. అనిన విని ధర్ముం డిట్లనెను. ౮౮౧

క. కర్మవిపాకము జెప్పెద । నిర్మలమతి వినుము సాధ్వి నే డెందేనిన్
గర్మము శుభమై యొసగును । కర్మ మశుభమయిన దుఃఖసమితిన్ జేయున్. ౮౮౨

వ. శుభాశుభ కర్మంబులకు భారతంబున జన్మంబగు, నితరంబుల దత్ఫలానుభవమాత్రంబు గలిగియుండు. నరుండు నితరంబగు జీవులట్లుకాక గర్మభోగి యగు. పుణ్యకర్మంబున స్వర్గాదులు గలుగు. బాపకర్మంబున నరకాదులు కలుగు. పూర్వార్జిత శుభాశుభ కర్మానుభవంబు నకై సర్వయోనులం భ్రమించుచుండును. కర్మనిర్మూలంబునం భక్తిబోధము. నది నిర్వాణ రూపయు, ద్వివిధయు నగు. నిది యిట్లుండ నింకను విశేషంబు సెప్పెద వినుము. సర్వ జాతులయందును మానుషజాతి దుర్లభ యగునది. భారతవర్షంబున నతిదుర్లభ యగు. నందు బ్రాహ్మణత్వంబు మహాదుర్లభ యగు, దానికిం బైదై బ్రహ్మనిష్ఠత్వం బత్యంత దుర్లభంబై పొసగు. బ్రహ్మనిష్ఠుండగు బ్రాహ్మణుండు సకాముండనియు, నిష్కాముం డనియ ద్వివిధుండు. సకాముండు కర్మఫలభోగి యగు. నిష్కాముండు సర్వదా నిరుపద్రవుండు. వానికిం బునర్జన్మంబు లేదు. వాడు ద్విభుజ కృష్ణమందిరంబగు గోలోకంబున సుఖించు. సకాముండు చతుర్భుజ విష్ణుమందిరంబగు వైకుంఠంబున గర్మఫలంబగు

వైభవం బనుభవించుచు భారతవర్షంబునకు మరల వచ్చి కాలాంతరంబునకు నిష్కా ముండై భక్తుం డుత్తమముక్తి నందు. సకాములగు బ్రాహ్మణ వైష్ణవులు నిర్మలభక్తిమంతులు కారు కావున పునరావృత్తిరాహిత్యంబులేదు. తీర్థాశ్రితులు, తపోవృత్తినిరతులు బ్రహ్మలోకంబునం దుందురు. వారికిం బునరావృత్తికలదు. స్వధర్మనిరతులును, తీర్థవాసులును సత్యలోకంబు సేరుదురు. వారికిం బునరావృత్తి కలదు. స్వధర్మనిరతులు, సూర్యభక్తులు సూర్యలోకంబునం దుందురు. వారికిం బునరావృత్తి కలదు. మూలప్రకృతిభక్తులు మణిద్వీపంబున నిత్యసుఖం బనుభవింతురు. శివభక్తులు, గణపతి భక్తులు, శక్తిభక్తులు శివలోకంబునం దుందురు. వారికిం బునరావృత్తి కలదు. తక్కిన క్షుద్రారాధకులును, భ్రష్టాచారులును, క్షుద్రలోక నరకావాసంబులం జెందుదురు. కేవల కర్మఫలమాత్రభోగులు భారతంబునం బొడమరు. స్వధర్మ నిరతుండగు విప్రునకు గవ్య నిచ్చువాడు చంద్రలోకంబునుం బొంది పదునల్వు రింద్రులకాలం బుండు. సాలంకృతయగు కన్య నిచ్చెనేని ద్విగుణఫలం బనుభవించు. కర్మఫలత్యాగులు కృష్ణలోకంబునకుం బోవుదురు. గవ్య రజత స్వర్ణవస్త్ర సర్పి ఫలజాలాదులు పాత్రులగువారి కిచ్చువారు చంద్రలోకంబునం జేరుదురు. మరియు సూర్యలోకంబుం బొందుట కలదు. అచ్చట పదివేల సంవత్సరంబు లుందురు. విప్రునికొరకు సదక్షిణంబుగ భూదానంబు సేయువారు విష్ణుమందిరంబగు శ్వేతద్వీపంబు ప్రవేశించి యచ్చట యావచ్చంద్రదివాకరంబుగ నుందురు. విప్రునకు గృహంబు గట్టించి ఇచ్చువారు గృహరేణుపరిసంఖ్యామిత వర్షంబులు విష్ణులోకంబున నుందురు. దేవాలయంబులు కట్టించువా రే యే దేవునకు భక్తులగుదు రా యా దేవుని నివాసంబున తద్రేణుసంఖ్యావర్షంబు లుందురు. తటాకంబు నంద ద్విగుణ ఫలం బగు, వాపిచే దశగుణఫలంబు కలుగు, వాపీప్రదానంబున దటాకఫలంబు గలుగు. నాలుగువేల ధనువుల ప్రమాణంబు గలది వాపినాంబడు. పాత్రుడగు వానికి దానంబుజేసిన కన్య దశవాపీసమానఫలం బిచ్చు. తటాకంబున గలుగు ఫలము తటాకోద్ధరణంబున గలుగు, వాపీపంకోద్ధరణంబున వాపీఫలంబు గలుగు, నశ్వత్థవృక్షంబు వైచి ప్రతిష్ఠ చేసెనేని యయుతవర్షంబులు తపోలోకంబున నుండు. పుష్పోద్యానదానంబు సేయువాడు ధ్రువలోకంబున నయుతవర్షంబు లుండు విష్ణునకు విమానం బిచ్చువాడు మన్వంతపర్యంతంబు విష్ణులోకంబున నుండు. చిత్రయుక్తంబగునేని చతుర్గుణఫలంబు లభించు. దానిలో సగముఫలము శిబికాదానంబునం గలుగు. విష్ణునకు డోలికామందిరంబు కట్టించువాడు శతమన్వంతరంబులు విష్ణులోకంబున వసియించు. సౌధయుతంబగు రాజమార్గంబుం గల్పించువా డయుతవర్షంబు లింద్రలోకంబున నుండు, బ్రాహ్మణుల కిచ్చు దానంబులతోడం దేవతలకిచ్చు దానంబులు తుల్యంబు, లింక వినుము. ౮౭౩

క. అనా డిచ్చిన యదియే । యీనాడును గలుగుచుండు నియ్యది దే దే
నేనాడును ఫలియించదు । మానవులకు దీని నమ్మ మానక కొమ్మా. ౮౮౪

ఆ.వె. పుణ్యకర్మచేసి పురుషుండు స్వర్గాదు । లనుభవించి భారతాఖ్యవర్ష
మందు బుట్టువందు నవనిసురుడు క్షత్రి యుండు వైశ్యుడును మరొక్క డగుచు. ౮౮౫

క. ఒకజాతి మానవుడు వే రొకజాతికి బోడు నమ్మ మో యంగన వా
డకలంక దాన తపములు సకలంబును జేసియేని శతకల్పములన్. ౮౮౬

క. సేసికొనిన కర్మము బో । సేసిననేకాక చెడదు చెడుగో మేలో
దా సాపడవలసినదే । పాసి చనదు కల్పకోటి బహుందశకములన్. ౮౮౭

వ. దైవతీర్థ సహాయంబునను గాయవ్యూహంబుచేతను శుద్ధిగలుగు. ఓ తలోదరీ । నీ వడిగి
నది తెలిపితి. నింక నేమి విన నిచ్చయించెద వని యముం డడిగిన విని సావిత్రి ధర్మ
రాజా । మానవు లే యే కర్మంబులచే స్వర్గాదిలోక సుఖంబు లనుభవింతురు ? తెలుపవే
నావుడు పితృపతి యలరి యిట్లనియె. ౮౮౮

ఆ.వె. ధరణిసురున కన్నదానంబు చేసిన । మానవుండు వినుము మంజువాణి
యన్నకణములన్ని హాయనంబులు సుఖ । మనుభవించుచుండు నభవునింట. ౮౮౯

ఉ. ఎవ్వనికేని యన్నమిడెనేనియు దానికి మించు బుణ్య మో
జవ్వని లేదు లేదనుచు జాటు స్మృతుల్ భువి నన్నదానమం
దెవ్వడు జాత్రుడో యనుచు నెన్నగరా దొకప్రొద్దు లే దటుల్
బువ్వము బెట్టువా డరుగు భూతగణేశ్వరు డుండు సీమకున్. ౮౯౦

క. భూసురవరులకు సురలకు । నాసనము నొసంగువార లరుగుదురుసుమీ
యా సరసీరుహలోచను । వాసమునకు నందు నుంద్రు వర్షాయుతముల్. ౮౯౧

క. పారునకు బాలమొదవును । దీరుగ దా నొసగునట్టి ధీరుడు లక్ష్మీ
నారాయణుకడ నుండున్ । వారక దల్లోమమాన వర్షంబు లొగిన్. ౮౯౨

తే.గీ. నాలుగంతలు పుణ్యదినంబునందు । శతగుణము శుభతీర్థ సంగతిని గోటి
గుణము నారాయణక్షేత్రకుంభినిం బొ । సంగు గోదానఫలము విస్తార మబల. ౮౯౩

తే.గీ. భారతంబున గోవును భ క్తితోడ । విప్రునకు నిచ్చునాతండు వినుము సుదతి
వాన మొనరించు బదివేల వత్సరములు । చంద్రలోకంబునందు నిశ్శంకమతిని. ౮౯౪

క. ఉభయముఖీ । గోదానం । బభయప్రద మవనిసురున కర్మిలి నొసగన్
ప్రభుత హరిలోకమందున్ । విభవముగను లోమతూన వితతాబ్దంబుల్ ౮౯౫

క. ధవళచ్ఛత్రము విప్రున । కెవ డొసగును వాడు జీవనేశునియింటన్
దివురుచు దా వసియించున్ । సవురుగ బదివేలయేండ్లు సౌఖ్యం బొప్పన్. ౮౯౬

ఆ.వె. పీడితాంగుడైన విప్రునకును వస్త్ర । యుగ్మ మిచ్చునట్టి యురుగుణాఢ్యు
డనిలులోకమందు నధివసించును పది । వేలయేండ్లు సౌఖ్యశీలు డగుచు. ౬౯౭

క. సాలగ్రామంబును వ । స్త్రాలంకృతముగ నొసంగు నాతడు పద్మా
లోలునియింటన్ సుఖమున । దేలెడి నామిహిరకిరణదిననాధముగన్. ౬౯౮

క. ఏమనుజుడు విప్రునకున్ । బ్రేమునితో శయ్య నొసగు పృథివి నతండున్
సోమునిమందిరమున నా । సోమార్కముగా వసించు సుందరి వింటే. ౬౯౯

క. భూమిసురులకు సురలకు । వేమటు దీపంబు లిచ్చు విమలగుణుడు స్వా
హామానినీసనాధుని । ధామంబున నొక్కమనువుదనుక వసించున్. ౭౦౦

క. గజదానము బ్రాహ్మణునకు । నిజముగ గావించునట్టి నిర్మలుడు జయం
తజనకు నర్ధాసనమున । భుజియించున్ భోగ మొక్క పురుహూతుదశన్. ౭౦౧

క. భారతమున విప్రునకున్ । వారువము నొసంగునట్టివాడు ముదమునన్
వారుణమున నుండును శ్రృం । గారముగ జతుర్దశేంద్ర కాలము తన్వీ. ౭౦౨

ఆ. వె. శిబిక నిచ్చువాడు చేరి గుఱ్ఱము నిచ్చు । వానివంటివాడె వసుధ నెన్న
వాని నిచ్చువాడు వాయులోకంబున । నొక్కమనువుదనుక నుండు సబల. ౭౦౩

ఆ.వె. చెలగి వ్యజనమేని సీవిరియేనియు । నిచ్చువాడు వాయునింట నుండు
పరమసుఖముతోడ బదివేలయేడులు । మరియు దెలుపువాడ మగువ వినుము. ౭౦౪

ఆ.వె. ధాన్య రత్నములను దగనిచ్చువాడును । బట్టువాడు తడవు బ్రతుకగలరు
వదల కేగువారు వైకుంఠమునకును । వారి భాగ్యమెన్నవశమె ముగుద. ౭౦౫

క. హరినామము భక్తిమెయిన్ । నిరతము జపియించునట్టి నిర్మలమతియౌ
నరుడు చిరజీవిసుమ్మీ । మరణము వెరగందు నట్టిమనుజుని గనినన్. ౭౦౬

క. లీలం భారతమందున్ । డోలన మొనరింపజేయు ధూర్వహుండు రమా
లోలుని బ్రీతికి బాత్రుడు । మేలుగ హరిలోకమందె మెలగు మృగాక్షీ. ౭౦౭

క. పున్నమరేకదజామున । జెన్నుగ డోలనము సలుప శ్రీహరియింటన్
వన్నెగలిగి శోభనసం । పన్నత వసియించును శతమన్వంతరముల్. ౭౦౮

క. ఉత్తరఫల్గునియందున్ । జిత్తమలర డోలనంబు జేయించినచో
నుత్తమఫల మది ద్విగుణము । మత్తద్విపయాన దాని మహిమ మలతియే. ౭౦౯

క. తిలదానము గావించిన । దిలసంఖ్యాబ్దములు శివుని దివ్యాయతన
స్థలి నుండు బిదప సుఖియై । వెలయున్ జిరజీవి యగుచు బృథివి మృగాక్షీ. ౭౧౦

క. తిలదానమునకు ద్విగుణము । ఫలమగు విప్రునకు దామ్రపాత్ర మొసగినన్
ఫలదానము స్వర్గద మగు । బొలుపొందవగ వృక్షదానము నట్టిదయౌ. ౭౧౧

శా. సాలంకారణవస్త్రసుందరిని గన్యన్ భూద్యుషద్వంశ్యుడౌ
బాలుం బిల్చి యొసంగువాడు ముదమొప్పన్ జంద్రలోకస్థితిన్
గ్రాలుం బేర్మి జతుర్దశేంద్రుల మహాకాలంబు దర్వాత దా
జాలుంబో పదివేలయేం డ్లనఘ గంధర్వప్రభుస్థానమున్. ౯౧౨

శా. నానాద్రవ్యయుతంబునున్ మరియు నానాసస్యసంయుక్తముం
గా నొప్పారెడి భూమి విప్రునకు నిష్కాపట్యుడై యిచ్చినన్
దా నుండున్ హరిలోకమందు విలసత్సౌఖ్యాబ్ధి నోలాడుచున్
లీలన్ శక్రులు నూర్వు రేగుదనుకన్ లేమా యతం డాదటన్. ౯౧౩

క. ప్రోపెసగు భూమి నొసగిన । భూపాలుం డగుచు బుట్టి భోగము లందున్
శ్రీపతికరుణావశమున । నేపారగ జన్మశతక మేకవిధమునన్. ౯౧౪

క. గ్రామంబును భూసురునకు । ప్రేమంబున నొసగునట్టి పధుగుణు డొందున్
దామోదరుని నివాసం । బేమందున్ లక్షమనువు లేకవిధమునన్. ౯౧౫

ఉ. సుప్రజమున్ బ్రకృష్టమును శుద్ధజలాంచితవాపికావనీ
ద్ద్రప్రభమైన పత్తనము దారత యోగ్యతగల్గినట్టి స
ద్విప్రుని కిచ్చెనేని యలివేణి యతండు వసించు రాజితా
ద్రిప్రభునింట నింద్రులు పదింబదియౌ నయుతంబు లేగగన్. ౯౧౬

చ. నగరశతంబు వాపులు వనంబులునుం బ్రజలున్ సమృద్ధలీ
ల గొమరుమీరగా నొసగు లక్షలు నూరగు నింద్రు లేగగా
నగుదనుక న్మురారిగృహమందు వసించును బిమ్మట న్మహిన్
దిగి త్రిదశేంద్రభోగమున నేరెడిదీవి సమస్త మేలెడిన్. ౯౧౭

క. అధికారముతో దేశము । నధిపు డొసగెనేని నాలుగంతలు ఫలమౌ
బుధునకు నగరం బిచ్చిన । విధి నొందినదానికంటె వినుము వెలందీ. ౯౧౮

క. జంబూద్వీపం బిచ్చిన । నంబకరుణ యింతయనగ నలవె మణిద్వీ
పంబున నుండు బునర్జ । న్మం బిక లే దెన్నటికిని మదగజగమనా. ౯౧౯

క. దేవీభక్తులు తప్పక । దేవీలోకంబునందె తిరుగుదురు పున
ర్భావంబు లేదు వారికి । భూవలయమునందు నెందు బుష్పంబోడీ. ౯౨౦

క. హరిపేరిట గార్తికమున । బరగు దులాదాన మిచ్చు ప్రభుడు సుఖముగా
హరియింట యుగత్రయ సు । స్థిరుడగు దరువాత హరికి సేవ యొనర్చున్. ౯౨౧

క. హరిసేవాపరుడై తగు । తరి గంగను రేవకడను దా మునిగినచో
వరుబదివేల యుగంబులు । హరిమందిరమునన యుంచు నంభోజాక్షీ. ౯౨౨

క. తరువాత నతడు శ్రీహరి । వరకరుణాపసముకల్మి వైకుంఠమునన్
స్థిరుడై యుండు బునర్భవ । విరహితుడై సౌఖ్యపదవి వెలయగ నబలా. ౨౩

శా. గంగాతోయమునందు నిత్యమును మున్కల్ వెట్టువా డొందు ని
ర్భంగంబైన పవిత్రతన్ రవివలెన్ బాటించు నెల్లప్పుడు
న్పొంగుం దద్దతురంగమేధఫలవిస్ఫూర్తిన్ ధరాదేవికిన్
శృంగారంబులు వాని పాదరజముల్ చేరున్ హరిస్థానమున్. ౨౪

తే.గీ. మీన మేషాది మధ్యంగతేన తాప హారి సద్వారి నిడునట్టి భూరియశుడు
కర్మరతుడు విశుద్ధుండు కడగి సూర్య । చంద్రపర్యంత ముండు నీశ్వరుని యింట. ౨౫

క. జలదాత యవల నిరుపమ । కులజుండై శివుని భక్తి గొని వేదచయం
బులు చదివి సుఖించును భూ । తలమున నత్యంతశుద్ధతాయుతు డగుచున్. ౨౬

శా. వైశాఖంబున సక్తుదానమును భవ్యశ్రేయుడై సేయువా
డైశావాసమున న్వసించు నినచంద్రాంతంబు కాలంబు వి
ద్యాశోభామహిమాన్వితుం డగుచు సౌఖ్యంబందు వా డంతటన్
లేశంబున్ గొరలేక భూతలమునన్ వేయేల చంద్రాననా, ౨౭

తే.గీ. చైత్రమున నేని మాఘమాసమున నేని । వ్రతియగుచు వేత్రమును బూని శివుని భక్తి
గొలిచి వర్తించు నాతడు కొలువుదినము। లన్నియుగములు వసియించు నభవునింట. ౨౮

తే.గీ. నరుడు శ్రీరామనవమిని కరము భక్తి । రాము గొల్చిన మన్వంతరంబు లేడు
విష్ణులోకంబునందున విడువకుండు । పిదప శ్రీరామభక్తుడై పృథివి నేలు. ౨౯

క. శరదాదిమాస శుద్ధే। శ్వరతిథి మొదల రమగొలుచువా డా రాధే
శ్వరుకడ గోలోకంబున । కరుగున్ పదునల్వురింద్రు లగువర కుండన్. ౩౦

సీ. పొలుపొంద గార్తికి బూర్ణిమయందును గోపీశతంబున గోపశతము
రాసమండలముగా రచి జేసి శిలయందు శ్రీకృష్ణ రాధల జెక్కి వేడ్క
పదియారు విధముల బరగెడి యుపచారములు చేసి మదిలోన మోదమంది
నుత్సవ మొనరించి యురుభక్తి వర్తనం బొనరించువార లత్యూర్జితముగ
తే.గీ. రాధికానాథలోకవిభ్రాజమాన । భోగభాగ్యము గంద్రు విస్ఫురితమహిమ
బడతిరో విను మొకబ్రహ్మ గడచుదనుక । ధీరగణ్యంబు రాధికాదేవిమహిమ. ౩౧

తే.గీ. రాసలీలోత్సవము చేసి యెవ్వడేని । లోక మందినవాడు నిర్భీకవృత్తి
మరల ధర బుట్టి హరిభక్తి మరగి తుదకు । గృష్ణపార్షదుడై మహాకీర్తి గాంచు. ౩౨

క. ఏకాదశీవ్రతము సు । శ్లోకుండై సేయువాడు సురుచిరమహిమన్
వైకుంఠంబున నుండును । లోకేశుని జీవితంబు లోగొనువరకున్. ౩౩

క. భాద్రపదాది ద్వాదశి । భద్రముగా నింద్రు గొలుచువాడు త్రిదివ మ
హాద్రగతి జేరి యుండును । సద్రూపత షష్ఠివర్షసాహస్రంబున్. ౯౩౪

ఆ.వె. భానువారంబునందు సప్తమిని సంక్ర । మణమునందును రవిగొలుచు మానవుండు
పరగ పదునలుగురు సురేశు లరుగుదనుక । సూర్యునింటను వసియించు శుద్ధమహిమ. ౯౩౫

తే.గీ. జ్యేష్ఠశుద్ధ చతుర్దశి జెలగి యెవ్వ । డాచరించును సావిత్రి యర్చనంబు
నేడుమన్వంతరంబులు వాడు బ్రహ్మ । లోకమం దుండు సుఖముగా లోలనయన. ౯౩౬

తే.గీ. మాఘశుద్ధాహితిథియందు మాన్యవృత్తి । భారతిని గొల్చు మనుజుండు బ్రహ్మరేయి
పగలు నుండు మణిద్వీప పత్తనమున । వానికి బునర్భవము లేదు వసుధయందు. ౯౩౭

ఆ.వె. గోవు నిచ్చువాడు గోలోకమున నుండు । ముదవిరోధిగూడి ముదముమీర
ధేనురోమసంఖ్య దివురు నన్నిటరెట్టి । వత్సరములు సుఖము వడయుచుండు. ౯౩౮

క. హరిభక్తుడు హరిలోకము । హరుభక్తుడు హరునిలోకమందును బూజా
పరుడై దానపరుండై । వర నామస్మరణ భజనపరుడై యబలా. ౯౩౯

క. సాలగ్రామము నెవ్వడు । మేలుగ బూజించు దత్సమిద్ధజలంబున్
గ్రోలును వా డేగును శ్రీ । లోలుని మందిరమునకు దలోదరి వింటే. ౯౪౦

తే.గీ. సర్వతీర్థాభిగమనంబు సలుపువాడు । నశ్వమేధంబు జేసినయట్టివాడు
రాజసూయం బొనర్చిన రాజు వీరు । జన్మరహితులు సంతతసౌఖ్యపరులు. ౯౪౧

తే.గీ. అన్నియజ్ఞంబులకు బెద్ద అంబగూర్చి । సేయు యజ్ఞంబు దానిని జేయువాడు
నిత్యసుఖమును జెందు వినిర్మలప్ర । భావమున మానికంబులదీవిలోన. ౯౪౨

వ. మరియు జెప్పెద వినుము. మహాసంభారయుతంబుగ దొల్లి దక్షునిచే యజనంబుజేయం బడి శంకర దక్షులకు కలహంబు వాటిల్లుటం గాంచి నందికేశ్వరుని విప్రులును, విప్రులను నందీశ్వరుండును శాపంబులచే దూషించుకొనిరి. అపుడు శంకరుం డా యజ్ఞంబును విధ్వంసంబుసేసె నంత దక్షుండు దేవీయజ్ఞంబు ప్రారంభించి యాచరించి సుఖం బనుభవించె. అదియుంగాక ధర్ముండును, గశ్యపుండును, శేషుండును, గర్దముండును, స్వాయంభువుండును, దత్పుత్రుండగు ప్రియవ్రతుండును, శివుండును, సనత్కుమారుండును, ధ్రువుండును, గపిలుండును, దేవీయజ్ఞంబు చేసి శత రాజసూయంబుల ఫలం బందిరి. దేవీయజ్ఞంబుకంటె నుత్కృష్టతరంబగు పుణ్యంబులేదు. దానిం జేయువాడు జ్ఞానతేజంబుల విష్ణుతుల్యుం డగు. దేవతలలో మహావిష్ణుండును, వైష్ణవులలో నారదుండును, శాస్త్రంబులలో వేదంబులును, వర్ణంబులలో బ్రాహ్మణత్వంబును, తీర్థంబులలో గంగయు, పవిత్రులలో శంభుండును, వ్రతంబులలో ఏకాదశియు, చుక్కలలో జంద్రుండును, పక్షులలో గరుడుండును, స్త్రీలలో రాధా, ప్రకృతి, వాణి, వసుంధరలును,

నింద్రియములలో మనంబును. ప్రజాపతులలో బ్రహ్మయు, వనంబులలో బృందా
వనంబును, వర్షంబులలో భారతవర్షంబును, శ్రీమతులలో శ్రీయు, విదుషులలో సరస్వ
తియు, పతివ్రతలలో దుర్గయు, సౌభాగ్యవంతులలో రాధయు నెట్లనో యట్లు యజ్ఞంబు
లలో దేవీయజ్ఞంబు సర్వోత్కృష్టంబు. సర్వవేదశాస్త్ర పురాణేతిహాసంబులయందు జెప్పం
బడు. సర్వతపో వ్రత జప తీర్థదాన ధర్మాదులకంటె శతగుణఫలప్రదంబు. ఈ దేవ్యర్చ
నంబు వాసికెక్కుం గావున నీవు దేవీభక్తిపరాయణవు గమ్మని చెప్పిన విని సావిత్రి ఓ
సూర్యనందనా శక్తికీర్తనంబు సర్వధర్మంబులకు నెక్కుడంటివి, దేవీభజనంబు సేయు
విధంబు చెప్పుము. అదియుంగాక శుభకర్మవిపాకంబు సెప్పితి వింక నశుభకర్మవిపాకంబు
గూడ నానతీయవే యనుచు భక్తినమ్రయై సావిత్రి. ౯౪౩

సీ. సర్వభూతములందు సముడయి యెవ్వాడు సర్వసాక్షిత నొంది శమనుడయ్యె
పుష్కరంబున ధర్మ బూజించి యెవ్వాడు దనయుగా గాంచె బద్మప్రియుండు
సర్వజీవిగణంబు సమయించి యెవ్వాడు తతకీర్తి గాంచె గృతాంతుడగుచు
దండధారియు శుద్ధతముడు జీవులశాస్త యెవ్వాడు విశ్వంబు నెల్ల యేలు
తే.గీ. చూడ నెవ్వాడు బ్రహ్మనిష్ఠుండు జీవ । కర్మఫలదుండు మిత్రుండు ఘనగుణుండు
పాపులకు దుఃఖదుం డయి పరగుచుండు । నట్టి యమునకు నే మ్రొక్కి యభినుతింతు. ౯౪౪

క. అని యిట్టులు నుతియించిన । వనితకు నుపదేశ మిచ్చె వనజాప్తసుతుం
డనుపమ దేవీమంత్రము । వనజాయతనయన విడువవల దిది యనుచున్. ౯౪౫

వ. అని మరియు నారాయణుండు నారదుని కిట్లనియె. ౯౪౬

క. మాయాబీజ మహామను । వాయమకుం బద్మబాంధవాత్మజుడు మహా
ధీయుక్తి నుడివి పిమ్మట । బాయక విను మశుభకృతివిపాక మటంచున్. ౯౪౭

వ. ఇట్లని చెప్పదొడంగె. ౯౪౮

క. శుభకర్మవిపాకంబున । శుభమందును నరుడు మరియు సుందరి విను మీ
శుభహీనకర్మపాక మ । శుభమగు నరకంబు నిచ్చుజూవె వరాంగీ. ౯౪౯

ఆ. వె. నరకభేదములవి నానావిధంబులు । కర్మభేదవశత గలుగుచుండు
పృథుతరంబులైన భీకరగర్తముల్ । జెప్పువాడ వినుము చిన్నదాన. ౯౫౦

వ. నరకకుండంబు లెనుబదియారు శ్రుతికథితంబులై యుండు, వహ్నికుండంబును ౧ తప్తకుం
డంబును ౨ క్షారకుండంబును ౩ విట్కుండంబును ౪ మూత్రకుండంబును ౫ శ్లేష్మకుండం
బును ౬ గరకుండంబును ౭ దూషికాకుండంబును ౮ వసాకుండంబును ౯ శుక్ర
కుండంబును ౧౦ గాత్రమలకుండంబును ౧౧ కర్ణవిట్కుండంబును ౧౨ మజ్జాకుండం
బును ౧౩ మాంసకుండంబును ౧౪ నఖకుండంబును ౧౫ లోమకుండంబును ౧౬ కేశ

కుండంబును ౧౭ అస్థికుండంబును ౧౮ తామ్రకుండంబును ౧౯ లోహకుండంబును ౨౦ చర్మకుండంబును ౨౧ తప్తసురాకుండంబును ౨౨ తీక్ష్ణకంటకకుండంబును ౨౩ విషకుండంబును ౨౪ తప్తతైలకుండంబును ౨౫ క్రిమికుండంబును ౨౬ పూయకుండంబును ౨౭ సర్పకుండంబును ౨౮ మశకకుండంబును ౨౯ దంశకుండంబును ౩౦ గరళకుండంబును ౩౧ వజ్రదంష్ట్రికుండంబును ౩౨ వృశ్చికకుండంబును ౩౩ శరకుండంబును ౩౪ శూలకుండంబును ౩౫ పరశుకుండంబును ౩౬ ఖడ్గకుండంబును ౩౭ గోలకుండంబును ౩౮ నక్రకుండంబును ౩౯ కాకకుండంబును ౪౦ మంథానకుండంబును ౪౧ బీజకుండమును ౪౨ వజ్రకుండమును ౪౩ తప్తపాషాణకుండమును ౪౪ తీక్షణపాషాణకుండమును ౪౫ లాలాకుండమురు ౪౬ వశీకుండమును ౪౭ చూర్ణకుండమును ౪౮ చక్రకుండమును ౪౯ వక్రకుండమును ౫౦ కూర్మకుండమును ౫౧ జ్వాలాకుండమును ౫౨ భస్మకుండమును ౫౩ దగ్ధకుండమును ౫౪ తప్తసూచియు ౫౫ అసివత్రమును ౫౬ క్షురధారమును ౫౭ సూచీముఖమును ౫౮ కోకముఖమును ౫౯ నక్రముఖమును ౬౦ గజదంశమును ౬౧ గోముఖమును ౬౨ కుంభీపాకమును ౬౩ కాలసూత్రమును ౬౪ మత్స్యోదమును ౬౫ కృమికందుకమును ౬౬ పాంసుభోజ్యమును ౬౭ పాశవేష్టనమును ౬౮ శూలప్రోతమును ౬౯ ఉల్కాముఖమును ౭౦ అంధకూపమును ౭౧ వేధనమును ౭౨ తాడనమును ౭౩ జాలరంధ్రమును ౭౪ దేహచూర్ణమును ౭౫ దళనమును ౭౬ శోషణమును ౭౭ కషణమును ౭౮ శూర్పమును ౭౯ జ్వాలాముఖమును ౮౦ ధూమాంధమును ౮౧ నాగవేష్టనమును ౮౨ ప్రకంపనమును ౮౩ భీషణమును ౮౪ అసృక్కుండమును ౮౫ అశ్రుకుండమును ౮౬ ననునివి యెనుబదియారును నరకంబులు మరియు దేవీపాదార్చన వందన నామస్మరణ భజనోపచారంబు లాచరించువారికి నరక భయంబు లేదు. నరకంబులు భయంకరులయిన యమకింకరులచే రక్షింపబడుచుండు. ఆ కింకరులు దండపాశ శూల శక్తిహస్తులును, దయాశూన్యులును, తేజస్వులును, నిశ్శంకులును, తామ్రపింగళాక్షులును, యోగయుక్తులును, నానారూపధరులును నయి యుందురని చెప్పి మరియు. ౯౫౧

మ. హరిసేవారతులై విశుద్ధులయి పూర్ణాచారులై సువ్రత
స్థిరులై తాపసులై మనస్వులయి వాసిఁ బ్రహ్మచర్యాశ్రమా
క్షరపుణ్యాశ్రయులైన మానవులు నిక్కం బెన్నఁడుం జూడ రా
నరకావాసము దూరమందునయినన్ నాళీకపత్రేక్షణా! ౯౫౨

మ. బలలోభంబున దుష్టవాక్కులనచే బంధువ్రజంబుఁ వృథా
కులముంజేసి వహ్నికుండమున కేగున్ లోమసంఖ్యాబ్దముల్

వెలయంగా నటనుండి పిమ్మటను నుర్వీఁ మూడు జన్మంబులఁ
మెలగుఁ నీచత రౌద్ర ధగ్ధ పశుయోనిన్ పద్మపత్రేక్షణా. ౯౫౩

సీ. బాపని కిచ్చిన వస్తువు మరల నింకొక్కని కిచ్చిన ప్రముక్కడికిని
వసకుండము లభించు వా దందు నూరేడు లుండును దిను నద్ది యోగిరముగ
గృకలాసమై పుట్టు కీడొందు పృథ్విలో నేడు జన్మంబుల నెత్తి యబల
రౌద్రంబుతోడ దరిద్రుడై యల్పాయువై యుండు గొన్నినా శ్వవనిలోన

తే. గీ. పురుషు గామిని గామిని బురుషునేని । శుక్రపానంబు సేయింప శుక్రకుండ
మందు వసియించు నూరేడు లదియ తించు । పిదప కృమియయి భువి బుట్టి
యదియ గ్రమింగు. ౯౫౪

సీ. గురు విప్రు నెత్రోడగొట్టినయాతం డసృకుండమందు నసృక్కు దించు
పదిపదులేం డ్లుండి పై వ్యాఘ్రమై పుట్టి యేడు జన్మంబుల గోడుగుడిచి
శుద్ధుం డగును విష్ణుస్తోత్రంబు సేయుచు నశ్రువు లోడగా వరుగునట్టి
హరిభక్తు గన్గొని హసియించువా డశ్రుకుండంబులోపల నుండు నద్ది

తే.గీ. క్రోలుచును శతవర్షముల్ గోడుగుడిచి పిదప జండాలనారియై పృథివి బుట్టి
శోకమును జెంది పిమ్మట శుద్ధ డగును వింటె కల్యాణి యలివేణి విమలపాణి. ౯౫౫

సీ. అవని మిత్రద్రోహియగు మానవుడు కాయమలకుండమున నుండు మలము దించు
నూరేండ్లపిమ్మట ధారుణి గాడిదై మూడుజన్మములందు గోడుగుడిచి
బధిరుని గన్గొని పకపకనగువాడు కర్ణవిట్కుండంబు గదలకుండు
నూరేడు లాదట ధారుణి జెవిటియై పేదయై జనియించు పృథివియందు

తే.గీ. నేడు జన్మంబులందు నో యింతి వింటె । లోభమున ధరణీయుల లొల్లి బెట్టి
కుందజేసెడి మనుజుండు కూలు పజ్జ । కుండమున నద్ది మెక్కుచు గొనకు పృథివి
సప్తభవముల మీనంబు శశకము నగు. ౯౫౬

మ. అవనీదేవుడు క్షుత్తునం బడలి దాహక్రాంతులం జిక్కి తా
భవనప్రాంతము జేర నన్నమిడకే పంపించు పాపిష్ఠమా
నవు డుండం జను దప్తకుండమునకున్ దా లోమసంఖ్యాబ్దముల్
పొవరారఁ దుది సప్తజన్మములలో బుట్టుఁ భువి న్పక్షియై. ౯౫౭

మ. రవివారంబున సంక్రమంబున సమన్ శ్రాద్ధంబునన్ క్షారమున్
నవవస్త్రంబును జేయ క్షారయుతకుండంబుం బ్రవేశించి యం
దు వసించుం దగ తంతుమానసమలుం దోడ్తో జనుఁ జాకియై
భువి జన్మింపగ నేడుసారులు స్ఫురత్పూర్ణేందుబింబాననా. ౯౫౮

మ. ధరమూలప్రకృతిఁ త్రయీవితతి శాస్త్రశ్రేణి బౌరాణబం
ధుర నానార్థములఁ హరిఁ హరు విధిఁ సూర్యాదుల న్గౌరి వా

ణీ రమణా దూరినచో భయావహగతిన్ బెక్కుల్ మహాకల్పముల్
తిరుగుం బిమ్మట సర్పమై భువిని బాతివ్రత్యశోభానిధీ. ౯౫౯

మ. పరద త్తంబునకే స్వద త్తమునకే బాధన్ వెసం జేయువా
డరలే కర్వదివేలయేండ్లు మలకుండాంతర్గతిం బొల్చి పెం
పర యన్నేళ్లు విషంబునం గుడిచి యాపై విట్క్రిమిత్వంబుతో
ధర జన్మించి యనేక బాధలు పడున్ దారేశబింబాననా. ౯౬౦

మ. పరతాటాక మహిం దటాక మొనరింపన్ బూని తత్ద్రేణువి
స్తరమానాబ్దము మూత్రకుండమున మూత్రం బాని యా పిమ్మటన్
ధర నెద్దై జనియించి నిండగు శతాబ్దం బందు నింతేల యో
తరుణీ! చేసిన పాప మెప్పుడును బాధంబెట్ట కెట్లుండెడిన్? ౯౬౧

సీ. ఏకాకియై మృష్ట మెవ్వాడు దిను వాడు శ్లేష్మకుండమునందు జేరియుండు
నది దించు పూర్ణశతాబ్దంబు బిమ్మట నన్నేండ్లు పురుగగు నవనిలోన
పిత మాత గురు ప్రియ సుతు సుత నెవ్వాడు పోషింప డాతండు పోయియుండు
గరకుండమం దొక్క ఘనశతాబ్దము గరం బనుభవించుచు దదనంతరంబు
తే.గీ. భూతయోనుల జనియించి పొందు గొడవ। లొక్కనూరేడు లాదట నురుశుచియగు
నతిథి గని కన్నుద్రిప్పెడి యతని జలము।పితలు గొనకుంద్రు దూషిక కతడు బోవు. ౯౬౨

సీ. కన్యను బోషించి కడ నొక్కనికిని ధనాశ నమ్మెడి యధమాధముండు
మాంసకుండంబున మానినీ లోమప్రమాణవర్షంబులు మాంసభోజి
యగుచుండు నాదట యమభటుల్ మాంసంపుతట్ట నెత్తిని బెట్టి దండములను
గొట్టుచుందురు నెత్రు గొనగొన గారగా నాదట విట్క్రిమి యగుచు భువిని
తే.గీ. బుట్టి యరుబదివేలేండ్లు బిట్టు బాధ। లెనయు నాదట వ్యాధుడై యేడుభవము
లుండు నంతట గిటి కుక్క బోరు భేక।ముఖభవంబుల గుందును ముగుద వినుము. ౯౬౩

సీ. వ్రతదినంబుల నుపవాసవాసరముల శ్రాద్ధంబులందును సంగమంబు
వసనక్రియను గొను వాడు నఖాదకుండంబున దద్భోజనంబు గొంచు
దినమాసవర్షముల్ చన నుండు కేశంబు లంటుట చూడక యంధవృత్తి
బార్థివలింగంబు పరగబూజించెడి నరుడు తత్ద్రేణుమానంబులైన
వర్షంబు లార్తితో వసియించు గేశకుండమునందు నంతట క్షమను యవన
తే.గీ. యోని జనియించి నూరేడు లుండి పిదప। శతసమల రాక్షసుండయి జగతి దిరుగు
పాప మొనరించి సుఖమొంద బ్రహ్మతరమె।పులినసుశ్రోణి మృదుపాణి భుజగవేణి. ౯౬౪

సీ. పరకాంత శ్రోణులు వక్షంబు స్తనములు నాస్యంబు వలపున నంటి చూచు
పతితుండు కాకభాధితలోచనుం డయి కాకతుండంబును గదసియుండు
లోమసంఖ్యాబ్దము ల్మొగి నాదటను మూడు భవముల గాకియై పావనుడగు
సుర విప్ర కాంచన చోరుండు మంధానకుండంబునం బడి కొట్టుకొనుచు
లోమాబ్దముల నుండి భీమకింకరదండపీడితుండై చాల భీతి నొంది

తే.గీ. విష్ట భుజియించి గ్రుడ్డియై పేదయయ్యు। క్రూరుడై యేడు జన్మముల్ గొడవజెంది
స్వర్ణకారుండునై పుట్టు స్వర్ణవణిజు। డగుచు జనియించు ధాత్రిపై నంబుజాక్షి. ౯౬౫

సీ. తామ్రచోరుడు లోహతస్కరుండును రేణుసంఖ్యాబ్దములు బీజచర్వణు డయి
బీజకుండంబున భీమకింకరులచే దండితుండగు పరితాపమొదవ
వేలుపుసొమ్మెత్తు వెంగలి వజ్రకుండమున లోమాబ్దంబు లమితబాధ
వసియించి తాడింపబడు వజ్రములచేత రౌప్య గవ్యము లంబరముల దోచు

తే.గీ. వాడు పాషాణకుండంబు వదలకుండు। లోమసంఖ్యాబ్దములు శ్వేతరూప ధవళ-
చిహ్న శుక్ల విహంగమై చెట్ల దిరిగి। యేడు జన్మంబులకు శుద్ధి నెనయు నబల. ౯౬౬

సీ. పుంశ్చలియన్నంబు భుజియించు మనుజుండు నాత్రి లాలాకుండమందు జేరి
లోమాబ్దములు నిల్చి భీమకింకరదండతాడితుండయి పరితాపమంది
శూలరోగముతోడ భూలోకమున బుట్టి సకల బాధల నొంది చక్కబడును
పారుండు మ్లేచ్ఛుల పరిచర్య జేసిన మసిజీవియైనను నసువు లెడల

తే.గీ. మ్రగ్గి మసికుండమున రోమమానవర్ష। ములు వసించి పిదప వాడు మూడుజన్మ
ములను గరి పసరం బయి పుట్టి మేక। భవము గని తాడిచెట్టయి యవల గెలుచు. ౯౬౭

సీ. సుర విప్ర ధాన్యాది వరవస్తువులు మ్రుచ్చిలించిన మనుజుండు కొంచ కేగు
చూర్ణకుండమునకు సొరది నం దుండును నూరేండ్లు పిమ్మట సారసాప్త
తనయుదూతలచేత తాడితుండయి పిమ్మటను మేషమయి కుక్కుటంబు నగుచు
మూడుజన్మంబుల గోడుగుడిచి నరుం డగుచు గాసవ్యాధి ననుభవించి

తే.గీ. వంశహీనుండు దారిద్ర్యవంతు డగుచు। భూమి నల్పాయువై వెతనొందు ద్విజుని
సొమ్ము గొని చక్ర మిచ్చెడి శుంఠ చక్ర। కుండమున శతవర్షము లుండు నబల. ౯౬౮

సీ. ద్విజగోధనంబుల దిన్నదనంబులు చెరపిన మనుజుండు చేరు వక్ర
కుండంబునకు నందు నుండును నూరుయుగంబులు పిదప వక్రతను డగుచు
నేడు జన్మంబులు నెంతయు బేదయై వంశహీనను డయి వర్తిలు భువి
పిమ్మట గృధ్రమై పిదప సూకరమయి పిల్లియై నెమలియై బిట్టు వగచు

తే.గీ. మొనసి తాబేటిమాంసంబు దినుచునుండు। నిండనూరేండ్లు దా గూర్మకుండమందు
కూర్మభక్షితుడై మీద గూర్మభవము। మొదలుగాగల జన్మముల్ వదల కెత్తు. ౯౭౦

సీ. ఘృత తైల హారియు శతవర్షములు జ్వాలికా భస్మకుండముల్కడసి యుండు
భువి మత్స్య మూషక మూర్తియౌ నవ్వల సుర విప్ర గంధ వస్తువుల దొంగి
లించినవాడుండు మించిన లోమాబ్దములు దగ్ధకుండసంకలితు డగుచు
పరపైత్యకావని బలమున ఛలమున హింసచే హారియించు హీననరుడు

తే.గీ. నుగ్ర సూచీముఖంబున నుండు పెద్ద । బొబ్బలిడుచును నేడ్చును భూరి బాధ
సప్తమన్వంతరంబుల దప్తుడగుచు । బిదప జనియించు భూమిపై బేదయగుచు. ౯౨౦

సీ. ధర్మంబు నరయక ధరణీజనుంగార దండించెడి ప్రమత్తుడుండ నేగు
గోళకుండంబునకును నది తప్తతోయాక్తాంధకార భయంకరమ్ము
భీమదంష్ట్రములగు పృథుకీటకములచే సంయుక్త మగుటచే సకలబాధ
లా కీటకములచేత నందుచుండును లోమసంఖ్యాబ్దములు దుది జిక్కబడును

తే.గీ. అక్రమంబుగ సరసుల కవలబడిన । నక్రముల జంపు మనుజుండు నక్రకుండ
గతుడగుచు లోమమానాబ్దకములు నిల్చి । పృథివి నక్రమగుచు బుట్టు బీడబొలగు. ౯౨౧

సీ. విష్ణుపాదంబున విడువండు పితృపిండ మెవ్వాడు వా డేగు నెక్కుడైన
గోడునకై యస్థికుండాంతరమునకు నందుండు లోమసంఖ్యాబ్దచయము
పిమ్మట కుక్కయై పృథివిని జన్మించి యామీద గుంభజం బగుచు నేడు
భవముల విలపించి భాగ్యహీనుండయి తుదకు శుద్ధి వహించు దోయజాక్షి

తే.గీ. కడుపుతోనున్న భార్యను కవయు నరుడు । తప్తతామ్రంబునందును దగవసించు
శతశరత్తులు పిమ్మట జిక్కబడును । పులినసుశ్రోణి మృదుపాణి భుజగవేణి. ౯౨౨

సీ. భువి జతుస్నాతాన్నముమ నవీరాన్నంబు తిని లోహకుండంబు నెనయ చేరు
నరుడు నూరేండ్లట్లు బరగి తర్వాతను చాకిదియై యంత గాకియునయి
సప్తజన్మము లుండి సకలబాధల జెంది వ్రణియయి పేదయై వరలి పిదప
శుద్ధత నొందును సారథి జర్మాక్తహస్తముచేత దేవుని ద్రవ్య మంటు

తే.గీ. కొంటె నూరేండ్లు దా జర్మకుండమందు । జొచ్చు శూద్రాజ్ఞ గైకొని శూద్రునింట
గుడుచు విప్రుండు పడి సురాకుండమున శతాబ్ద ముండును దుది శూద్రయాజి యగును. ౯౨౩

సీ. వాగ్దుష్టుడగుచు స్వస్వామి గొట్టినవాడు తీక్ష్ణకంటకకుండ దేశ మొంది
తాడింపబడు ఘోరదండపంక్తులచేత దండి కింకరులచే గండ లెగయ
నాదట సప్తజన్మావధిగాగ మచ్చై ప్రశవంబై పుట్టి చక్కబడును
విష మిడి జీవుల వేధించు మనుజుండు విషభోజి యగుచును వేయిసమలు

తే.గీ. కుంది విషకుండమున నుండి యందుమీద । వ్రణి నృఘాతియు నై నూరు వత్సరములు
నుండి యాదట గుష్ఠియై యుర్వి నేడు । జన్మముల సంగదలనొంది చక్కబడును. ౯౨౪

సీ. అవు నెద్దును గతినాత్ముడై క్రతో బిట్టు గొట్టెడునట్టి బెట్టనరుడు
తప్తతైలంబునంద వసించు నాలుగు యుగములకాలంబు నెగులుదగుల
అమీద లోమమానాబ్దముల్ వృషమయి భూమి నాపద । నొందు బొరి నెవండు
తప్తలోహంబువ దా గాల్చు జీవిని హేలకు నయ్యాత డేగు గోళ

తే.గీ. కుండమునకును నయుతాబ్ద ముండు నందు బిదప వ్యాధిమయుండయి పృథివి బుట్టు
నొక్కభవమున శుద్ధుడౌ నుర్వీసురుడు । వ్యర్థముగ నెల నంజూడు నారగించి
గృమికి జని లోమమానంబు కెరలి పిదప । నవనిలో మ్లేచ్ఛచపలాక్షి యై జనించు. ౯౨౫

సీ. అవనీసురుడు శూద్రయాజియై తచ్ఛ్రాద్ధభక్తంబు దిని తచ్ఛవముల గాంచి
లోమమానాబ్దముల్ పూయకుండమునందు తగ నుండి యమదండ తాడితు డయి
పూయమానును దుద భూమిపై శూద్రుడై యేడుజన్మములందు గోడుగుడిచి
రోగి మూకుడు బధిరుడు దరిద్రుడు నయి చెరలాడి చేత్పడి చెట్ట యగును

తే.గీ. అవనిలోనను గృష్ణపాదాంకితపుయి । తనరు సర్పంబు గొట్టిన మనుజు డేగు
సర్పకుండంబునకు నందు సర్పభక్షితుం డగుచు నుండు పెక్కేండ్లు తుదకు సర్ప
జన్మమున బాధలను బొందు క్ష్మాతలమున. ౯౨౬

సీ. బ్రహ్మప్రదత్తజీవ్యములను క్షుద్రజంతువులను జంపెడి తుంటరికివి
మాశకంబున జంతుమానాబ్దముల యునికి పాశాళి బద్ధాంఘ్రి పాణి యగుచు
నా జంతువులచేత నారగింపబడుచు మోగి కింకరులచేత మొత్తబడుచు
వా దేడ్చుచుండును పడి నందుమీదట క్షుద్రజంతు వగుచు క్షోణి బుట్టి

తే. గీ. బిదప యావనుడై పుట్టు బేర్మి దరిగి । కొనకు నవయవహీనుడౌ మనుజు డగును
వాని నాకింకరులు క్రలూని తాడ । నంబు సేయుదు రేమందు నంబుజాక్షి. ౯౨౭

తే.గీ. క్షుద్రజంతుప్రహారికి క్షుద్రజంతు । లోమమానాబ్దములు నాదులోకమందు
నునికి యగు బృథ్వి సూకరయోనియందు । గాకయోనిని జనియించు కంబుకంఠి. ౯౨౮

సీ. ధనలోభమున ప్రజాతతిని దండించువా డుండును వృశ్చికకుండమందు
లోమసంఖ్యాబ్దము లామీద వృశ్చికజాతియై భువి బుట్టి సప్తభవము
లనుభవించును బాధ లాదట శుద్ధుడౌ ధరణీసురుడు శస్త్రధారియైన
నన్యధావకుడైన నవని సంధ్యాహీన విప్రుడైనను మహావిష్ణుభక్తి

తే.గీ. హీనుడైనను శరముఖ్య హేయకుండ । మందు వసియించు లోమసంఖ్యాబ్దసమితి
విద్ధుడగు శరములచేత బిదపవాడు । శుద్ధుడై బ్రతుకునుజుమ్ము శోభనాంగి. ౯౨౯

సీ. కడు ధనలుబ్ధుడై ఖడ్గంబునను నరు నరకువా డసిపత్ర నరకమందు
పదునల్వురింద్రుల తుదిదాక వసియించు గత్తిచే భూసురు మొత్తెనేని

నూరుగురైన మనువులకాలంబుండు ఖడ్గధారలచేత గాసినొంది
తిండిపెట్టరు నూరు దండిజన్మంబుల మంధానమున నుండు మరియు నవల

తే.గీ. పందియై కోడియై యేడు భవము లుండు । కుక్కయై యేడుభవముల కొట్టుకొనును
పులియు కప్పయు నక్కనుబోతు నగుచు । వనటనొందెడి నేడేసి జననములను. ౯౮౦

సీ. గ్రామంబులును నగరంబులు గాల్చెడి నరు డేగు క్షురయుక్త నరకమునకు
నందు రక్తాంగుడై యవ్వల మహి నేడుపుట్టు లమేధ్యంబు భోజనముగ
వహ్నివక్త్రిండగు వా డంతటను గువ్వ యగు నేడుజన్మంబు లందుమీద
శూలియౌ గుష్ఠియౌ సొరది నేడేసి జన్మంబుల బిమ్మట మాన్యుడగుచు

తే.గీ. పరుల నిందించువాడును బ్రాహ్మణులను । దిట్టువాడును సూచిని గొట్టుకొనుచు
మూడుయుగములు తేలు పాము మఱి వజ్ర । బస్త్రకీటములును నయి వ్యాధి గుందు. ౯౮౧

సీ. కొంపగూల్చెడివాడు గో ఛాగ మేష సంహర్తయు గోలోమికాఖ్యమైన
నరకంబునందు గింకరులచే బాధితుండగుచుండును యుగత్రయంబు మఱియు
వ్యాధియుక్తంబైనయట్టి బాముననప్తభవము లుండును బిదప నొక మూడు
జన్మంబులను మేషజాతియు జన్మత్రయము ఛాగజాతియు నగును మఱియు

తే.గీ. రోగియును బేదయైన నరుండు దార । హీనుడును బంధుహీనుండు నైనవాడు
నగుచు సంతాపమును బొందు నంబుజాక్షి । నరకబాధల వచియింప నాతరంబె. ౯౮౨

సీ. సామాన్యవస్తువుల్ చౌర్యంబొనర్చు మానవుడు నక్రముఖంబు దవిలి యందు
మూడుయుగము లుండి మునుకొని గోజాతియై నరుడయి చక్కనగునుజుమ్ము
గజ గో తురగభేది గజదంశమునకేగు మూడుయుగము లందు గోడుగుడుచు
మూడుజన్మములందు మునుకొని హస్తియై గుఱ్ఱమై యామీద గోవు నగుచు
మ్లేచ్ఛుడై మూడేసి తుచ్ఛజన్మములంది చక్కనౌ మరి విను జలరుహాక్షి
బలమైన దప్పిచే జలమాను గోవును వారించునాతడు వడిగ గోము

తే.గీ. కాఖ్యనరకంబునకు జేరి యందు గ్రుములు । తప్తజలములు పైబార తాపమొందు
నొక్క మన్వంతరము వెండియుం దరిద్రు । డగుచు గోహీనరోగి తలంచుచుండు ౯౮౩

సీ. అతిదేశ విప్ర గోహత్యల నొనరించు కొంటె యగమ్యతో గూడు దోషి
స్త్రీహత్య నొనరించు చెనటియు భిక్షుకహత్య గావించిన యతడు భ్రూణ
హత్య జేసినవాడు నరుగు కుంభీపాకనరకంబునకు నందు సరసిజాప్త
సుతుకింకరులు వాని చూర్ణంబు గావించి వహ్నిలో బడవైచి వడిగ దప్త

తే.గీ. తైలమును బోసి యుడికింప దత్తరమున । గొట్టకొన దప్తలోహముల్ పెట్టి కాల్చ
పదునలుగురింద్రు లరుగంగ బాముల బడునందుమీదట ధారుణియందు దిగ్గి కుకకం ౯౮౪

సీ. గద్దయై వేయేండ్లు కడగి సూకరమయి వేయేండ్లు కాకియై వేయియేండ్లు
సప్తజన్మంబుల సర్పమై యరువదివేలేండ్లు క్రిమియయి విష్ట నుండు
బిదపను గుష్ఠియై పేదయై యుండును నావిని సావిత్రి నలినబంధు
తనయుని గనుగొని ధర్మదయాసాంద్ర యల యతి దేశికి యనగ నెట్టి

తే.గీ. వా డగమ్య లనంగ దేవలు డనంగ । గ్రామయాజి యనంగ దీర్ఘప్రతిగ్ర
హియు ననంగను సంధ్యావిహీను డనగ । క్షమన దీక్షితు డన సూబకారు డనగ
వృషలిమగ డన నెవ్వరు విన వలంతు. ౬౭౪

వ. అనిన విని ధర్మరాజు సుందరీ కృష్ణునందును, కృష్ణార్చనమందును, ప్రకృతియందును శివునియందును, శివలింగంబునందును, సూర్యునందును, సూర్యమణియందును, గణేశు నందును, దుర్గయందును, భేదబుద్ధి జేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. స్వగురు నందును, నిష్టదైవంబునందును జన్మదాతయందును, మాతయందును, భేదబుద్ధి జేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. వైష్ణవులందును, భక్తులందును, యితర బ్రాహ్మణుల యందును, భేదబుద్ధి చేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. విప్రపాదోదకంబునం దును, సాలగ్రామతీర్థంబునందును భేదబుద్ధిజేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. శివనైవేద్య, విష్ణునైవేద్యంబుల భేదబుద్ధిం జేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. సర్వేశ్వరుండు నగు శ్రీకృష్ణునియందును. సర్వాంతరాత్మయై నానాలోకాధారుండైన నిర్గుణ బ్రహ్మంబునందును భేదబుద్ధి జేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. శక్తిభక్తుని యందును, శక్తి శాస్త్రంబునందును ద్వేషంబు వహించువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. వేదవిహితంబగు పితృదేవార్చనంబు విడుచువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. నారాయణుని, నారాయణ మంత్రోపాసకుని నిందించువాడును, కారణ బ్రహ్మరూపిణియగు మహాదేవిని నిందించువాడును బ్రహ్మహత్యాదోషంబు నొందు. కృష్ణజన్మాష్టమిని, శ్రీరామ నవమిని, శివరాత్రిని, యేకాదశిని, భానువారంబును, పంచపర్వంబులును విడుచు మాన వుడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. అంబువాచియందు భూఖననంబును, శౌచాదికంబును జేయువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. గురువును, దల్లిని, దండ్రిని, సాధ్వియగు భార్యను, సుతుని, సుతను, దోషంబులేక పోషించక త్యజించువాడు బ్రహ్మహత్యాదోషంబు నొందు. సమర్థుండయ్యు పెండ్లిలేని సుతుని గన్పెట్టనివాడును, హరిభక్తివిహీనుండును, హరిం బూజించనివాడును, హరినైవేద్యంబు కొననివాడును, పార్థివలింగంబు బూజించని వాడును బ్రహ్మహత్యాదోషంబునొందుదురు. గోవుల క్రూరదండనంబు సేయువాడును, వృషభవాహనుండగు విప్రుండును, గోవునకు ఉచ్ఛిష్టంబును బెట్టువాడును, వృషవాహన్న మును భుజించువాడును గోహత్యాదోషంబు నొందుదురు. వృషలీపతిని యాజనంబునం

బిలిచికొనువాడును, వాని యన్నంబు దినువాడును శతగోహత్యాదోషంబు నొందు. శుద్ధాగ్నిని కాలిచే ద్రొక్కువాడును, గోవును దన్నువాడును, కాళ్లు గడిగికొనక నిల్లు ప్రవేశించువాడును, గోవధా దోషంబు నొందు. స్నిగ్ధపాదుండై భుజించువాడును, శయనించువాడును, సూర్యోదయంబున భుజించువాడును గోహత్యాదోషంబు నొందు. అవీరాన్నభోజియును, యోనిజీవ్యుండును, త్రిసంధ్యావిహీనుండును స్వభర్తయందును, దేవునందును భేదబుద్ధి వహించు సంగనయు, పెనిమిటిని తిట్టునట్టి గట్టివాయును, గోమార్గంబునను, దటాకంబునను దుర్గంబునను సస్యంబు పెట్టువాడును, లోభంబుననేని, అజ్ఞానంబుననేని గోవధా ప్రాయశ్చిత్తంబు మానినవాడును, గోవులపాలించని గోస్వామియు గోహత్యాదోషంబు నొందుదురు. ప్రాణులను, దేవతార్చనను, నిప్పును, నీళ్ళను, నైవేద్యంబును, పుష్పములను, అన్నమును దాటువాడును, ఎల్లప్పుడు బీదలకు, సర్థులకు లేదు లేదనువాడును, మిథ్యావాదియు, మోసగాడును, దేవద్వేషియు, గురుద్వేషియు, గోహత్యాదోషంబు నొందుదురు. దేవతా ప్రతిమను, గురువును, బ్రాహ్మణుని, పతివ్రతను గాంచి సంభ్రమంబున నమస్కరించని వాడును, ప్రణతునకు గోపంబున నాశీర్వదించని బ్రాహ్మణుడును, విద్యార్థికి విద్య నివ్వనివాడును గోహత్యాదోషంబు నొందుదురు. మరియు నగమ్యాలక్షణంబు దెలిపెద వినుము. ౯౮౬

క. గమ్యయగును స్వగృహిణి దా । రమ్యంబగు వేదవిదితలక్షణసరణిన్
సామ్యము గను నే యన్య య । గమ్య యనంబడును జనదు గలయగ దానిన్. ౯౮౭

క. సామాన్యము జెప్పితి నిక। నో మానిని తెలిపెదను సయోచితసరణిన్
నీమదిని నోర్మి వినుమా । కామినులం చెన్నబడు నగమ్యలరీతుల్. ౯౮౮

క. శూద్రు గొని విప్రపత్నియు । శూద్రాంగన విప్రు గలసి శ్రుతులందును నం
చద్రీతి జెప్పబడియెను । గద్రూభవవేణు లత్యగమ్య లటంచున్. ౯౮౯

ఆ.వె. పాదసంభవుండు బ్రాహ్మణి గలసిన । నూఱుబ్రహ్మహత్య లేరుపడును
బ్రాహ్మణికిని నంత పాపంబు సేకూరు । కుంభమందు నుడికి కుందుచుండు. ౯౯౦

ఆ.వె. బ్రాహ్మణుండు శూద్రపత్నిని గైకొన్న । శూద్రుఁడుండు గొన్న సుదితి గొన్న
పదజయైన దాని ప్రాపున నున్నను । వృషలిమగడు వాడు వింటె ముగిద. ౯౯౧

ఆ.వె. పతితగును వృషలిపతి కులంబుననుండి । మాలకంటె నూరుమడుగు లలతి
విష్ఠతోడ సమము విను తర్పణము వాని । పితలు బట్ట రమరతతులులు గొనరు. ౯౯౨

ఆ.వె. కోటిజన్మములను గూడబెట్టినయట్టి । ధర్మమెల్ల జెడును దపములెల్ల
పూజలెల్ల మురిగిపోవును వృషలిని । విడువలేక పొందు చెడుగునకును. ౯౯౩

ఆ.వె. కల్లుద్రావునట్టి కడుదోసకారికి । వృషలి గట్టుకొన్న వెంగలికిని
పెంటభోజనంబు పెట్టింపబడు నాదు । లోకమందు వినుము లోలనయన. ౯౯౪

ఆ.వె. తప్తముద్రచేత దగ్ధమౌ దేహంబు । తప్తశూలదగ్ధ తనువు నొప్పు
పాపకారియు హరివాసరహితుండు । కుంభమున నుడికి కుందుచుండ్రు. ౯౯౫

ఆ.వె. గురువువెలది రాజుకోమలాంగి సవతితల్లి । నత్తగూతు దనయునాలి
జెలియ వదినె సవతిచెలియ పతివ్రత । నవ్వ మేనయత్త సక్క శిష్య॥ కనకము. ౯౯౬

ఆ.వె. శిష్యపత్ని మరియు జెలియులి భ్రాతృక । న్యకను పిన్నతల్లి నన్న భార్య
నన్నకొడుకునాలి నంటంగరాదను । ప్యగమ్యలంచు నజుడు బలికె. ౯౯౭

క. కామమున నత్యగమ్యల । తో మన్మథకేళి సలుపు దుష్టుడు జననీ
కామి యనబడును వానికి । నామీదట బ్రహహత్య లవి నూరంటుగా. ౯౯౮

తే.గీ. ఆ యగమ్యల నంటెడి యధమజీవి । కర్మలకు నర్హుడునుగాడు ఖలు డటంచు
వాని ముట్టజనదు ఘటీపాకమంది । యంతమున బాధనాలోకమందు నందు. ౯౯౯

తే.గీ. తప్పుసంధ్యనువార్చెడి మొప్పె యొకడు । సంధ్యవార్చక మానెడి చండి యొకడు
మూడుసంధ్యల గౌరబెట్టు మూఢు డొకడు।నాతి సంధ్యావిహీనుండసంగ బరగు. ౧౦౦౦

తే.గీ. శైవ వైష్ణవ శాక్తుని సౌరు గాణ । పత్యు గని దూరి గర్వంపు పట్టు బూని
మంత్రమును గొనకున్నన దుర్మార్గవర్తి । యవనిలోన దీక్షితుం డనగ బరగు. ౧౦౦౧

వ. ప్రవాహంబునకు నాలుగు హస్తముల ప్రమాణముగల గంగావాహినీతీర భూమి యందు నారాయణుండు వసించునట్టి నారాయణక్షేత్రమందు మృతుండగువాడు హరిపదంబు నొందుం గాన వారణాసియందును, బదరియందును, గంగాసాగరసంగమంబునను, పుష్కరంబునను, హరిహరక్షేత్రంబునను, ప్రభాసంబునను గామకోటి తీర్థంబునను, హరిద్వారంబునను, ద్వారావతిని, మాతృపురంబునను, సరస్వతీనదీ తీరంబునను, బృందావనంబునను, గోదావరిని, గౌశికిని, త్రివేణిని, హిమాలయంబునను నెవ్వండు దానంబు పరిగ్రహించు వాడు తీర్థ ప్రతిగ్రాహి యనంబడు. వానికిని గుంభీపాకనరకంబు సిద్ధంబు, మరియు, ౧౦౦౨

తే.గీ. శూద్రయాజన మొనరించి శూద్రసేవ । సేయునాతండు గ్రామయాజి యన నొప్పు
దేవద్రవ్యంబు దినువాడు దేవలుండు । శూద్రపాకోపజీవియే సూపకరుడు ౧౦౦౩

తే.గీ. సంధ్యవార్చక పూజలు సలుప కిచ్చ । వచ్చినట్లు చరించెడి వాడెపో ప్ర
మత్తు డనబడు తెలిపితి మగువ నీవు । నన్నడిగినట్టి యఘలక్షణముల నెల్ల. ౧౦౦౪

క. భగవత్సేవ యొనర్పక । మగువా దోషంబు లెపుడు మట్టుపడవు మే
లగు కర్మ చేసి శుద్ధత । దగు దుష్కర్మలను నరకతాపము గల్గుగా. ౧౦౦౫

తే.గీ. లంజయింటిపడుపు లంజచే గుడుపును । బ్రాహ్మణునకు దొడ్డపాతకములు
వాడు కాలసూత్రవర్తియౌ నూరేండ్లు । పిదప రోగి యగుచు బృథివి బుట్టు. ౧౦౦౬

చ. ధృతి నొకరన్ రమించును బతివ్రత రెండవవాని గూడినన్
క్షితి గులటాత్వమొందును స్పృశించి తృతీయుని ధర్షిణీప్రకీ
ర్తితయగు బుంశ్చలీత్వమున ద్రిమ్మరు నాలవవానిగూడి పం
చతనువులంటి వేశ్య యగు షష్ఠుని గూడిన బుంగియౌ వినిం
ద్యత నిక నెందరైనను మహాగణికాభిధ గాంచి వర్తిలున్. ౧౦౦౭

తే.గీ. కులట మొదలగు దుష్టల గూడెనేని । నరుడు మత్స్యోదక మనియెడు నరకమందు
బాధ జెందుచు వొల్లింటి పనుల దలచి తలచి యేడ్చును తనలోన దళనయన. ౧౦౦౮

క. కులటాగామికి నూరేం । డ్లలధృష్టాగునకు నాలుగంతలు గను బుం
శ్చలి గలయ నారు వేశ్యం । గలయ నెనిమిదియగును బుంగి గలసినదంతల్.పాతకము. ౧౦౦౯

క. అరయంగ మహావేశ్యం । దరిసిన నూరంతలు యమదండన బడు ది
త్తిరి వాయస పిక వృక సూ । కర శాల్మలు లగుదు రవని గ్రమముగ వారల్. ౧౦౧౦

క. రవి చంద్ర గ్రహణంబుల । యవసరముల సాపడునత డారుం తుదమం
దు వసించు మెదుకు లన్నేం । డ్లవలన్ భువి నుదరరోగియై బుట్టుజామీ. ౧౦౧౧

తే.గీ. మాట యిచ్చిన కన్యను మరల బసన । కిచ్చువా డుండు నూరేండ్లు హీనవృత్తి
పాంసుకుండిక దద్రవ్యభాజి యుండు । పాంసువేష్టమునను శతాబ్దములు సుదతి. ౧౦౧౨

క. ఓజం బార్థివలింగము । బూజింపని చెనటి కూళప్రోతమునందున్
బా జేరియుండు నూరేం । డ్లో జలజదళాక్షి దేవలుండగు బిదపన్, ౧౦౧౩

తే.గీ. పృథమివేల్పునకు బ్రకంపమును బొనర్చు । నట్టి నరుడు ప్రకంపనమందు నుండు
విప్రలోమాబ్దములు భార్య విభుని గోప।దృష్టి గని యుల్మకంబున గష్టమొందు. ౧౦౧౪

తే.గీ. మగనిపై గోపమున దిట్టు మందయాన । మొగమునను గొరకంచిడి మొత్తి మొత్తి
యమునిదూతలు నూరేండ్లు హానిజేయ।బిదప విధవ యగుట కేగు పృథివి కబల. ౧౦౧౫

తే.గీ. భర్తృదూషిణి యేడగు బాము లట్లు । విధవయై వ్యాధియుక్తయై వెనుక జక్క
బడును శూద్రునితో గూడు పడతియంధకూపమున బడి బాధతో గొట్టుకొనును. ౧౦౧౬

తే.గీ. శూద్రభోజ్య చతుర్దశ సురవరేణ్య । కాలమును మేధ్యమును జాల గలయు సీళ్ళ
మునిగితేలుచు నుండును వెనుక నేడు । జన్మముల గాకి బందియు జంబుకంబు. ౧౦౧౭

తే.గీ. అగుచు నూరుభవంబుల నార్తిజెంది । కోడియును బావురంబును గోతియు నయి
యేడుజన్మంబు లట్లుండి గోడుగుడిచి ।మాలెతై సర్వభోజ్యయై మనును బిదప. ౧౦౧౮

తే.గీ. అందుమీదట రజికియై యవల యక్ష్మ రోగమున బాధలం జిక్కి భోగములను
బాసి పుంశ్చలియై కుష్ఠబాధిత యగు । దైలకారిణియై తుద । మేలు గాంచు. ౧౦౧౯

తే.గీ. వేశ్యచేరును విడువక వేదనమున । నేని జలరంధ్రమునవేని యింక బుంగి
దండతాడనమున బడియుండు గులట । దేహచూర్ణకమున బడు దెలియు మబల. ౧౦౨౦

తే.గీ. స్వైరిణియు దళనంబున బడును ధృష్ట । శోషణంబున జిక్కును సొరది నిట్లు
నాదులోకంబునను యాతనలను బొందు । వారు పడుపాటులెల్లను వరుస వింటె. ౧౦౨౧

ఉ. దూతల క్రూరదండనముతోడను విష్ఠ భుజించి మూత్రముం
రోతకు నోర్చి త్రావి చెదరుంబడుచు న్మను నొక్క దేగ నీ
రీతిన యుండి పిమ్మటను బృథ్విని విట్క్రిమియై జనించి య
త్యాతత లక్షవర్ష విపదార్తి బడల్పడువారు పుంశ్చలుల్. ౧౦౨౨

చ. తమియొదవన్ సవర్ణ పరదారల బొందెడివాడు దా గషా
యమువకు బోయి యద్ది తిని యంతట దప్తజలంబు సేరి శో
కముపడి రెండు వర్షములు గాంచి పునర్భవమందు విప్రుడై
క్షమ జనియించి శుద్ధుడగు క్షత్రియు డూరుజు దంష్ట్రిసూనుడున్. ౧౦౨౩

క. పరుని సవర్ణుని గూడిన । తరుణియు నట్లగునుజుమ్ము తప్పదు భువినం
దరవిందభవుడు పూర్వము । సరిగా వచియించెనమ్మ సావిత్రమ్మా. ౧౦౨౪

క. బాపనముద్దియ గూడిన । భూపాలుడు కోమటియును బొందుం దల్లిం
జేసట్టిన పాపము నే , నాపగుడుపు పూర్వమందు నాలోకమునన్. ౧౦౨౫

ఆ.వె. చేటలంతలేసి చెడుపురుగులు గుట్ట । గ్రాగినట్టి యుచ్చ ద్రాగికొనుచు
బాధపడునుజుమ్ము పదునల్వు రింద్రుల । దనుక విప్రకాంత దగునె ముట్ట. ౧౦౨౬

ఆ.వె. భువిని బంది యగుచు బుట్టి విష్ఠను దిని । యేడు బాములందు గోడుగుడ్చు
భాగలత్వమునను సకలదుఃఖములందు । బాసనక్క బొందు బాపిరాజు. ౧౦౨౭

ఆ.వె. పాణి దులసి బట్టి బద్దులాడినవాడు । జ్వాలికాముఖంబు నోలి జేరు
గంగనీళ్ళ శిలను గైకొని బొంకాడు । కష్టు దుండు జ్వాలికాముఖమున. ౧౦౨౮

వ. మరియు వినుము. ౧౦౨౯

ఆ.వె. వలపటికయి సాచి వరమిచ్చి తప్పిన । ఖలుడు జ్వాలికాముఖంబు సేరు
దేవతాలయమున దివిరి చెప్పినది పో । గడపి జ్వాలికాముఖమున జేరు. ౧౦౩౦

ఆ.వె. బాపనయ్య ముట్టి గోపాదమును ముట్టి । బద్దులాడువాడు జ్వాల జేరు
చేసినట్టి ప్రతిన జేయకుండినవాడు । కదలకుండు జ్వాలికాముఖమున. ౧౦౩౧

క. మిత్రద్రోహి కృతఘ్నుఁడు । గోత్రజ విశ్వాసఘాతుకుండును మిథ్యల్
చిత్రించి సాక్ష్యమిడు నవ । విత్రుడు జ్వాలాముఖమున వేదన లందున్. ౧౦౩౨

క. జ్వాలాముఖగతులు జ్వలన । కీలాదగ్ధు లగుచుండ్రు కింకరనికర
స్థూలాయసదండంబుల । పాలై పదునలుగు రమరపాలుర దనుకన్. ౧౦౩౩

ఆ.వె. తులసి ముట్టి బొంకు పలుకువాఁ డాదట । మాల యగుచు నేడు మనుకులుండు
గంగనీళ్లు ముట్టి కల్లాడి సప్తజ । న్మముల మ్లేచ్ఛ డగుచు మహిని దిరుగు. ౧౦౩౪

ఆ.వె. శిలను ముట్టి తప్పు చెప్పినవాఁ డేడు । పుట్టువులను బెంటపుర్వుగా జ
నించు నర్చి ముట్టి నిక్కంబు వల్కని । మొండి సప్తజన్మముల బురువగు. ౧౦౩౫

ఆ.వె. వడిగ జేయి సాచి వరము చెల్లించని । ఖలుడు సప్తజన్మములను బాము
బాముమండి పిదప బ్రహ్మహీనుం డగు । మనుజు డగుచు దుదిని మంచి బడయు. ౧౦౩౬

తే. గీ. సురగృహంబున బద్దాడు నరుడు సప్త । జన్మముల దేవలుండగు జ్మావిబుధుని
ముట్టి కల్లాడు పురుషుండు పులిగ బుట్టి । మూడు బాముల బధిరుండు మూకుడు నగు. ౧౦౩౭

తే.గీ. ముంగిసైపుట్టు మిత్రుల మోసగాడు । గండకంబును నగు గృతఘ్నమనుజుండు
నమ్మినాతవి జెఱచిన నరుడు వ్యాఘ్ర । మగును గల్లరి మండూక మగును సుదతి. ౧౦౩౮

తే.గీ. నిత్యకర్మల వర్జించు నీచధరణీ । సురుడు మీ దేడు క్రిం దేడు తరముల పురు
షులను జెడజేయువాఁ డగు సుందరాంగి । కర్మహీన ద్విజాళికి గడు నఘంబు. ౧౦౩౯

తే.గీ. వేదవాక్యంబు విని నవ్వు వెట్టియు నుప । వాసమును వ్రతమును గెంటువాఁ డితరుల
దూరువాడును ధ్వాంతాంధచారి యగుచు।బొగను దినునూరువర్షముల్ పొగిలి పొగిలి. ౧౦౪౦

శా. వేదోక్తంబును దూరు నీచుడు వృథావేశంబునం గుందుచున్
యాదోజన్మముల న్మృతంబు గొని మత్స్యావిర్భవం బూని యా
మీదన్ శుద్ధత గాంచు దేవులను భూమీదేవులన్ దూరినన్
మీదం గ్రింద బదేసిమంది జెరచున్ మీనాక్షి యాలింపుమీ. ౧౦౪౧

తే.గీ. వాడు ధ్వాంతాంధమున కేగివగచి ధూమ । తమము లోగొన నది తించు దల్లడిల్లి
నాల్గువందలయేడులు మూల్గుచుండి । యేడుజన్మంబులం దొందు నెలుకబాము. ౧౦౪౨

తే.గీ. వెన్క నానావిధంబైన విహగజాతు । లందు జన్మించి కృమిజాతి నవతరించి
వృక్షజాతులలో బుట్టి పిదప బశువు । తనువునంబుట్టి శుద్ధుడౌ తరళనయన. ౧౦౪౩

తే.గీ. జ్యోతిషముచేత జీవించు నతడు ధనము । గొంచును జికిత్స యొనరించు కూళ లక్క
యినుము మొదలగునవి యమ్ము జనుడు రసము।విలుచువాడును గను నాగవేష్టనంబు. ౧౦౪౪

తే.గీ. నాగవేష్టమున కేగు నరుడు పాప । గములచే గట్టబడి లోమగణనసమల
నందు వసియించి పక్షియై యవల గణక।వైద్యజీవియ యగు సప్తభవములందు. ౧౦౪౫

క. ఆమీదట గోపకు డగు । నామీదట గర్మకారు డగు నెన్నంగా
నామీద రంగకారుం । డై మించుఁ బిదప శుద్ధు డగు మృదులాంగీ. ౧౦౪౬

ఆ.వె. చేరి నీకు నేను జెప్పితిని ప్రసిద్ధ । కుండములను నింక గొంచెపాటి
కుండములును గలవు దండనార్థము దండ । ధరుడ నాదు ప్రోల దరళనయన. ౧౦౪౭

ఆ.వె. చేసుకొన్నకర్మ చెడ్డదో మంచిదో । దానిఫలము గుడిచికాని నరుడు
మేలు చెందలేడు మీనాక్షి నీవింక । దెలియగోరె దెద్ది తెలుపగదవె. ౧౦౪౮

వ. అనిన విని సంతోషించి సావిత్రి. ౧౦౪౯

తే.గీ. వేద వేదాంగపారగ విమలమూర్తి । ధర్మరాజ మహాభాగ కర్మబంధ
మోక్షకారణమైనట్టి ముఖ్యవస్తు । వొండు గలదొక్కొ సకలశాస్త్రోక్తి లరయ. ౧౦౫౦

తే.గీ. నరకకుండంబులోనికి జొఁగనీక । మంగళప్రదమై సుఖమై భయాప
హమయి సర్వప్రదం బయినట్టి కర్మ । కలదె తెలుపుము నా కిష్ట కరుణ బూని. ౧౦౫౧

తే.గీ. నరకకుండంబు లెట్లుండు నళినమిత్ర । తనయ యా కుండములకును జనెడివార
లెట్టిరూపంబున వసింతు రిచట బూడి । దైనవానికి తను వేది యచటి కరుగ. ౧౦౫౨

తే.గీ. కఠినబాధల బొందిన కాయ మెట్లు । తడవు నిలుచును దగ్ధమై చెడునుగాక
యని యడిగినట్టి సావిత్రి నాదరించి । ధర్మరాజు దొరంకొనె దాని నుడువ. ౧౦౫౩

వ. ఓ మధురవాణీ! నాలుగువేదంబులయందును, ధర్మశాస్త్రంబులయందును, పురాణముల యందును, ఇతిహాసంబులయందును, పాంచరాత్రాద్యాగమములయందును, సంహితలయందును, సర్వవేదాంగంబులయందును సారభూతంబును, గర్మబంధవిమోచకంబును, మంగళప్రదంబును, భయరహితంబును నగు నుపాయంబు వివరించెద వినుము. ౧౦౫౪

తే.గీ. పరగ దేవతలను మహాభక్తి పూజ । సలుపువారలు రారు నా సదనమునకు
దేవి నఖిలైకమాతను ధృతి దలంచి । భక్తులగువారు రారు నా భవనమునకు. ౧౦౫౫

క. హరి తీర్థ మాశ్రయించుచు । హరివాసరమును బవిత్రమని తలచుచు శ్రీ
హరికిఁ వందన మిచ్చెడి । హరిభక్తులు రారు మామకాలయమునకుఁ. ౧౦౫౬

చ. వదలక మూడుసంధ్యలను వార్చుచు శుద్ధమనస్కు డైనవా
డెద పరదేవిభక్తి గనడేని నివృత్తిని బొందనేర డో
మదవతి యీశ్వరార్చనము మాధవసేవయు గృష్ణమంత్రముఁ
గదలని మోక్షహేతువులు కావున భక్తులు పొంద రాపదల్. ౧౦౫౭

క. పరమేశ్వరుని త్రిలోచను । హరునిఁ సేవించు పావనాత్ముల గన్నఁ
గరుడుని ధూరమునం గను । నురగంబులుపోలె దూత లోడుదు రెదరఁ. ౧౦౫౮

క. లోకైకపోషకుండగు । శ్రీకృష్ణుని మంత్రమును విశేషనియతితో
నూకొనిన స్మరించిన నా । లోకముపేరైన వినరు లోలంబకచా. ౧౦౫౯

క. ధారుణి శ్రీదేవి పదము । లారాధించెడి మహాత్మునం దతిభీతిన్
బేరైన చిత్రగుప్తుడు । వారక దా గంటమెత్తి వ్రాయడు ముగుదా. ౧౦౬౦

క. పదతీ పృథివియు వాయువు । జలమును నగ్నియును నాకసంబును జెప్పం
బడు బంచభూతము లనుచు । నొదలికి సమవాయు లగుచు నొప్పు ధరిత్రిన్. ౧౦౬౧

క. ఆ యొడలు కృత్రిమం బగు । బాయక నశ్వరము నగును భస్మంబును నౌ
నేయెడనో యిది పోయిన । నోయమ యంగుష్ఠమాను దొదవెడు నందున్. ౧౦౬౨

తే.గీ. జీవపురుషుండు దా నట్టి చిన్నిమేను దాల్చి బద్ధుం డగుచు తాప దాహములను
జెడక మసిగాక బాధల జెందుచుండు । నాదులోకంబులో నుండు నరకములను. ౧౦౬౩

ఆ.వె. జలమువలననేని శస్త్రంబుచేనేని । కత్తినేని తీక్ష్ణకంటకమున
నేని రాతనేని నూనియకాగులో నేని మండు గుంజునేని జడడు. ౧౦౬౪

క. చెప్పితి నీ వడిగినయది । తప్పక నో యింతి యింక దండధరుపురిన్
జొప్పడు కుండంబులయం । దొప్పెడి లక్షణములెల్ల నోర్మి దెలిపెదన్. ౧౦౬౫

వ. వినుమని ధర్మరాజు సావిత్రి కిట్లని చెప్పం దొడంగె. నో పతివ్రతాశిరోమణీ ! యా
కుండంబులు పూర్ణేందుమండలాకారంబులై, నిమ్నంబులై, తప్తపాషాణసమన్వితంబులై,
యనశ్వరంబులై, పాతకులకు నానాదుఃఖకారణంబులై యుండునట్లు మహేశ్వరి యిచ్ఛచే
దొల్లి నిర్మింపబడియె. మరియు వినుము. ౧౦౬౬

తే.గీ. మండుకొఱవుల శతహస్తమానశిఖల నల్గడల క్రోసు వహ్నికుండంబు దనకు
శిక్షితాన్వితముమ దూతరక్షితంబు దండతాడనఘోరసంతాపరవము. ౧౦౬౭

తే.గీ. తప్తజలకుండ మరకోసు దాన హింస్ర జంతు కాకుధ్వను లుదకశబ్దములును
గలిగియుండు మహాఘోరగతులు మిగుల దుస్సహం బది వినుమిక దోయజాక్షి. ౧౦౬౮

తే.గీ. క్షారకుండంబుకడ నుండు గాకకోటి । త్రాహి త్రాహి యటంచు శబ్దములుసేయు
బాపులును వారి దాడించుపక్కి నాదు।దూతలును మందు రది క్రోసుదూరముండు. ౧౦౬౯

తే.గీ. విట్కృతంబగు కుండంబు వినుము క్రోసు శుష్కకంఠోష్ఠతాలులై క్షుధ బొగులుచు
నుంద్రు నా కింకరులు గొట్ట మరురవముల సేయుచును బాపు లార్తులై చెలియ వినుము. ౧౦౭౦

తే.గీ. మూత్రకుండంబు పుర్వుల మురికిగుంట యుండు గవ్యూతమాత్రమై యోర్మి నాదు
కింకరులు గొట్ట నేడ్చుచు నంకిలిబడి । కొట్టుకొందురు దానిలో జెట్టనెరులు. ౧౦౭౧

తే.గీ. శ్లేష్మకుండంబు పుర్వులచేత నిండి । వానిచే దినబడుచుంద్రు పాపు లందు
దండతాడితు లగుచును దాని నిడివి । క్రోసులో సగ మందురు కుముదనయన. ౧౦౭౨

తే.గీ. మఱియు గరకుండ మరకోసు మానమగుచు గీటములచేత బాపుల గీటడంచు
గండములచేత దూతలు దండనంబు । సేయగా జేయుచుందురు సితకరాస్య. ౧౦౨౩

తే.గీ. వినుము మలపూర్ణకుండంబు విస్తృతంబు నిడివి యరక్రోసు పాపులు పడుదు రందు
వజ్రదంష్ట్రంబు పుర్వులు వారి గఱచు మోది తాడవమొనరింత్రు నాదు భటులు. ౧౦౨౪

తే.గీ. ఒక్క క్రోసు వసాకుండ ముండు నందు వసను దిని బాపు లుందురు వగచికొనుచు
శుక్రకుండంబు నొకక్రోసు శుక్రకీట మయము పాపులచే నిండి భయద మగుచు. ౧౦౨౫

తే.గీ. రక్తకుండంబు బలులోతు రక్తమయము కీటమయమును నై పాపికోటి నొంచు
నంబకాశ్రుపు పాపిసమన్వితంబు । పాపిసంఘంబు గీటముల్ పట్టి కరచు. ౧౦౨౬

తే.గీ. గాత్రమలకుండ మది పాపిగణము లుండు దూతతాడనములు మెండు దోమగండు
కర్ణవిట్కుండ మనునట్టి గతి వహించి । వాపివలె నుండు బాధించు బాపిచయము. ౧౦౨౭

తే.గీ. మజ్జతో నిండు కుండంబు మఱియు స్నిగ్ధ మయపు కుండంబు రెండును భయదములగు
వాపివలె నుండు నందును బాపిచయము । దండదండితులై యుంద్రు తల్లడిలుచు. ౧౦౨౮

తే.గీ. మఱి నఖాదులు నాల్గు నమ్మాడ్కి నెసగు దామ్రకుండంబు కొఱవుల దగిలి మండ
నిడివి గవ్యూతియై చాల బెదురుపెట్టు పాపిసంఘంబు నక్కటా పద్మనయన. ౧౦౨౯

తే.గీ. తప్తలోహంబులో నుండు తప్తలోహ।మయములగు ప్రతిమలు పాకి మాటిమాటి
కేడ్చు తత్పరిరంభణం బేలవచ్చె।ననుచు రక్షింపు డనుచు మృగాంకవదన. ౧౦౩౦

తే.గీ. ఒగి భయానకమును ధ్వాంతయుక్తలోహ కుండమును దప్తవారుణీకుండము మరి
చర్మకుండంబు దద్భోజి జనముచేత। నిండి గవ్యూతిమాత్రమై యుండు నబల. ౧౦౩౧

తే.గీ. ఉండు శాల్మలి యొక లక్ష కండెము లయి ముండ్లతో నిండి యొక క్రోసు బుట్టి చుట్టి
మీది కెక్కించి పాపుల మీటి క్రిందబడగ ద్రోయుదు రకట నా భటులు ముగుద. ౧౦౩౨

తే.గీ. తైలకుండంబునను దప్తతైలమందు మరి విషాదంబు నొక క్రోసుమాన ముండు
వాని రెండింట బాపులు వగచి వగచి కొట్టుకొనుచుంద్రు దూతలు కొట్టుచుంద్రు. ౧౦౩౩

తే.గీ. ధ్వాంతకుండంబు క్రోసుండు దానియంత । శస్త్రతల్పంబు పాపులు సకలవిధము
లయిన బాధల నందుదు రందు గూని । గసిక లంటంగ బురుగులు గరచుచుండ. ౧౦౩౪

తే.గీ. పూయకుండంబు రెండు గవ్యూతు లుండు పూయమునదిరుగు పురుగులు బొడుచుచుండ
దండ్యుడగువాని నా భటుల్ తరిమి తరిమి।తాడనము సేయుచుందురు దండములను. ౧౦౩౫

తే.గీ. అబల మశకంబు మొదలగునట్టి మూట మశకములు మెండు క్రోశార్ధమానముండు
కాళ్ళు చేతులు గట్టిన గావు కావు । మనుచు నేడ్వంగ బాపుల నరయ డొకడు. ౧౦౩౬

తే.గీ. వజ్ర వృశ్చిక కుండముల్ వాపిలోన సగము మానంబు గలవగు దగిలి వజ్ర
వృశ్చికంబులచే గడు వేదనలను।బొందుచుందురు పాపులు పూవుబోణి. ౧౦౩౭

తే.గీ. శరము మొదలగునవి మూడు చంద్రవదన। వానిచేతనె నిండి దుర్వారవేద
నలను బాపులను బీడించు దెలియ వాపిలోన సగమగు పరిమాణమూని పెలుచ. ౧౦౮౮

తేగీ. తప్తతోయాఖ్య మనునది ధ్వాంతయుతము। కీటకసంయుతమును బాపికోటి భయద
మొకక్రోసుండు నాభటు లొక్కమొగిని బట్టి తన్నుచు గ్రుద్దుచు గొట్టుచుంద్రు. ౧౦౮౯

తే.గీ. నక్రకుండంబు వాపిలోన సగ ముండు। పెంటదినునట్టి జలజంతు లంటియుండు
బాపులెల్ల రు వానిచే భక్షణంబు। సేయబడుదురు బలుకంపు చేటు రోత. ౧౦౯౦

తే.గీ. బీజ మలధానకుండముల్ వింద్లు నూరు। నాదుభటు లార్చి పాపుల మేదురముగ
గొట్టుచుందురు వారలు బిట్టువగవ। జాలి లేశంబులేక యో చంద్రవదన. ౧౦౯౧

తే.గీ. వేడిరాళ్ళకుండు వెక్కసమైయుండు। రెండువాపులంత నిండు నిరుల
గొఱవు లొడల నంటగొట్టుచుందురు భటుల్। బాపిసంఘ మేద్వ బట్టి కట్టి. ౧౦౯౨

తే.గీ. క్రోసు లోతు లాలకుండంబు భయదంబు। పాపికోటి నందు బడగద్రోచి
నీటిమీద బెట్టి కాటుకకొండల వంటి నాదు భటులు బట్టికొంద్రు. ౧౦౯౩

తే.గీ. ఒనర చూర్ణకుండ మొక్క క్రోసుండును। దుష్కృతులను జేయు దుండగింద్ర
కదియ తిండిగాగ నదరించి బెదరించి। దరిసి నాదుభటులు తన్నుచుంద్రు. ౧౦౯౪

తే.గీ. గురుకులాలచక్రకుండంబు సంతత ఘూర్ణమానమగును గోమలి పది
యారుకోణములను మీరు గవ్యూతులు। రెండు దండనములు మెండుసుమ్ము. ౧౦౯౫

తే.గీ. తప్తజలసమన్వితము కందరం బది। జలచరములచేత ఖలుడు నమల
బడుచు నుండు నాదు భటులు దండింతురు। గ్రోశమాన మద్ది కోమలాంగి. ౧౦౯౬

తే.గీ. తప్తభస్మంబు క్రోసుండు దానియందు। బడిన పాపులు భస్మంబు భక్షణంబు
సేయజేతురు నా భటుల్ జెప్పజాల। తప్తపాషాణములు నోట దార్చుచుంద్రు. ౧౦౯౭

తే.గీ. దగ్ధకుండంబు క్రోసుండు ధ్వాంతయుతము। నెక్కుడును లోతు దానిలో జిక్కు ఖలుల
రాపిడి యొనర్చి నా భటుల్ రజ్జువులను గట్టి కొట్టుచు నుందురు కట్టియలను. ౧౦౯౮

తే.గీ. క్షారకుండంబునకు దుష్టజంతు వేగి। యూర్మిలం జిక్కి చీకటి నుండుగాన
కేడ్చుచుండు ద్విగవ్యూతు లుండు నద్ది। మామక భటాళి బాధ లేమందు నందు. ౧౦౯౯

తే.గీ. సూచికుం డది మిక్కిలి బాధచోటు। క్రోసులో సగ ముండును గ్రుచ్చి క్రుచ్చి
పొడుతు రొడలెల్ల తూంట్లుగా జడమతులను।నాదు కింకరులకు దయ లేదుసుమ్ము. ౧౧౦౦

తే.గీ. క్షురషకుండంబు సంతయై సొంపుగాంచు। రక్తకీటమయము లోతు ప్రబలమైన
చీకటియు దాని జేరిన చేటుబొంధు। బెడద నిడివియు నేబదివింద్ల పెట్టు. ౧౧౦౧

తే.గీ. కూపరూపంబు గోకాఖ్య కుండ మద్ది। యిరుబదగు వింద్ల లోతుండు నెక్కుడైన
గొడవలకు స్థాన మం దుండు చెడుగునరులు।కీటభక్షితులై యుంద్రు గీపులిడుచు. ౧౧౦౨

ఆ.వె. కడగి నూరువిండ్లు గజదంశ ముండును । గోముఖంబు కొంత కొఱత యగుచు
ముప్పదుండు బాపి ముప్పులు చెప్పంగ । నలవికాదుసుమ్ము జలజనయన. ౧౧౦౩

క. కుంభీపాకము గొప్పది । గాంభీర్యంబునను నూరు కండెంబులును
మ్మంభోజనయన యద్దియు । గుంభమువలె నుండు మూసికొను జీకటిచే. ౧౧౦౪

ఆ.వె. కుండలోన బెట్టి వండెడి కుండంబు నందు నుంచ్రు పాపు లన్నికుండ
ములకు నాల్గుబడులు మూల్గుచు నేడ్చుచు । భటులు గొట్ట దిట్ట బాధపడుచు. ౧౧౦౫

ఆ.వె. కుండ నుడుకు గుండుగొను పాపి దుఃఖంబు । సెప్పవశమె మూర్ఛజెందు లేచు
దల్లడిల్లు వడకు దటవిటపడు నార్చు । కావు కావు మనును గలవరించు. ౧౧౦౬

తే.గీ. కాలసూత్రంబు తప్తోదకసహితంబు । గట్టి పాశంబులను బట్టి కట్టి కొట్టు
దురుగదా నాదు కింకరుల్ దుష్కృతములు । సేసి వచ్చినవారల సేగి యలతె ? ౧౧౦౭

తే.గీ. మత్స్యములగుంట యొక నూయి మండునీళ్లు । నిర్వదియునాల్గు గవ్యూతు లేమిచెప్ప
నఘుచేసినవారల యార్తి నాదు । దూత లిడు తాడనంబులు దుస్సహములు. ౧౧౦౮

తే.గీ. నూరుధనువుల మానమై పేరుగాంచు । నవటమను కుండమున జలం బంటినంత
సర్వరోగంబులను బట్టు దండిబండ । పాపులకు భటదండనల్ ప్రబలము లగు. ౧౧౦౯

తే.గీ. ఘోరమైన యరుంతుదకుండమందు । నూరుధనువులు పాంసువు నూరువిండ్లు
పాపులకు భయదము లయి బాధ లిచ్చు । తదశనంబున దూతల దండనమున. ౧౧౧౦

తే.గీ. పాశవేష్టన మది యొక్క క్రోశముండు । పగ్గములగట్టి శూలంబు పట్టి పొడిచి
బాధనొందంగ జేతురు భటులు మిగుల । పాపిగణముల దయలేక పద్మనయన. ౧౧౧౧

క. శూలప్రోతం బనునది । చాల భయంకరము నూరు చాపము లుండుఁ
దేలుదురు మండుచుండెడి । నీళులలో నందుబడిన నీచులు సుదతీ. ౧౧౧౨

క. చెలగు ప్రకంపన మనునది । వలి బాపసమూహములను వడకగజేయుఁ
బలు మంచునీళ్లలోపల । నలరుం గ్రోశార్థ మగుచు నంభోజాక్షీ. ౧౧౧౩

క. ఉల్కాధను శ్శతమానం । బుల్కాలు మెం డఘుల బట్టి యుల్కాలచేతఁ
బల్కారులచే గాల్తురు । పల్కంగా దరమె దాని బాధలు ముగుదా. ౧౧౧౪

తే.గీ. అంధకూపంబు నూరువిం డ్లందు లోతు । లక్షనిలువులు కీటకభక్షితు లయి
పాపిజనములు గొడవల బడుదు రందు । వేయియేటికి చీకటినూయి యద్ది. ౧౧౧౫

తే.గీ. వేదనం బది నూ రగు విండ్ల పెట్టు । పాపు లందుండి మద్భుతబాధితు లయి
పొరలుచుందురు మేనులు పొక్క నేడ్చ । ధనువు లొక పదియారగు దండతాడ
నాఖ్య మైనట్టి కుండ మో యబల వినుము. ౧౧౧౬

తే.గీ. జాలరంధ్రంబు వల లురుల్ చాల గల్గి । నూరువిండుల పెట్టయి ఘోరమగుచు
బాపులను బట్టికొట్టెడి భటులచేత । నిండియుండును సురరాజనీలవేణి. ౧౧౧౭

తే.గీ. చూర్ణకుండంబు మహిమంబు । చోద్యమెన్న కోటినిలువుల లోతగు కొట్టి కొట్టి
నుగ్గుగావింప మూర్ఛిలి బెగ్గిలి పడు । పాపికోటుల దయ జూచువారు లేరు. ౧౧౧౮

తే.గీ. దళసకుండంబు పదియారు ధనువు లుండు । తప్తసికతంబు ముప్పది ధనువు లుండు
నూరునిలువులు శోషంబు మీరి యుండు వెలయ కూర్పంబు పంద్రెండు విండు లుండు. ౧౧౧౯

చ. మరియు బ్రతప్తవాలుకము మండుచు బాపుల బాధపెట్టి దా
నిరువదివిండ్లు పెట్టగుచు నెంతయు నాదు భటుల్ ప్రతాడనం
బురువడి సేయుచుండు రటు నుగ్రగతిన్ గడుభీతిదంబుసు
మ్మరయగ నద్ది చెప్పదరమా విలసత్సరసిజలోచనా. ౧౧౨౦

తే.గీ. జ్వాలిశాముఖ మది శిఖిజ్వాల లెగయ ఖలజనుల గాల్చుచుండు నక్కట మృగాక్షి
దాని కొలు యిరువదివిండ్లు దప్ప దచట । నస్మదీయ భటుల బాధ హంసగమన: ౧౧౨౧

తే.గీ ఇటుకయామములో మంట లెగయుచుండు।వాపిసగ మదియు సర్వపాపులకును
జూపు చెడగొట్టి యెక్కుడు రాపుబెట్టు । తీపులెత్తంగ మూర్ఛల దెలియకుంద్రు. ౧౧౨౨

తే గీ. మఱియు ధూమ్రాంధమను కుండు వరలు ధూమయుతమగుచు బరిమితి ధనుశ్శతమునగుచు
శ్వాసరంధ్రంబులను బొగ చాల దూరి । యూపిరాడింప దం దుండు పాపులకును. ౧౧౨౩

తే గీ నాగపాశంబు నూర్వింఢ్లు నాగవేష్టి । తులను గావించు నం దుండు ఖలుల బట్టి
యెనుబదారగు కుండంబు లెఱుగజెప్పి నాద నింకేమి యడిగెదు నళిననయన. ౧౧౨౪

వ. అనిన విని యలరి సావిత్రి ధర్మరాజా! నీవలన నఖిలంబు వింటి, గృతార్థనైతి, వింక సారసారంబై, సర్వపాపవినాశకంబై ముక్తిదంబైన దేవీభక్తిని నాకుం దయసేయుమని నుడివి మఱియు. ౧౧౨౫

తే.గీ. ఆదుదానను నా తెల్వి యలతిగాదె । ముక్తిలక్షణమును దేవిభక్తిభేద
మును బిదపను నిషేకఖండనము దెల్పి యార్య నను గృతకృత్య సేయంగదయ్య, ౧౧౨౬

చ. అవని దపంబు స్నానమును యజ్ఞము దానమునుఞ్ వ్రతంబునుఞ్
జపకగదయ్య మూఢునకు జ్ఞానము నిచ్చుటకంటె గావునఞ్
బ్రవిమలలీల నాపయిని బాయని ప్రేమను దెల్పుమయ్య యా
వివరములెల్ల బల్గతుల వేడెద నిన్ను దినేశనందనా. ౧౧౨౭

తే.గీ. తంత్రికంటె నెందు దల్లి నూరుమడుంగు । లెక్కుడంద్రు దాని కొక్కనూరు
మడుగు లెక్కుడంద్రు మహిని జ్ఞానము నిచ్చు । దేశికుండు వేయి తెలుపనేల. ౧౧౨౮

వ. వనితా! నీ విట్లు పలువిధంబులం బలుకనేల? నీ వడిగినవెల్ల దెల్పెద నని మున్న నీకు
వరం బిచ్చియుంటి. నీ వడిగిన ముక్తిలక్షణంబును, నిషేకఖండనంబును దెల్పెద వినుమని
ధర్మరా జిట్లు చెప్పదొడంగె. ౧౧౨౯

ఉ. శేషుడు వేయివక్త్రముల, శ్రీగణుఁ డైదుముఖంబులఁ, మహా
భాషుడు ధాత నాలుగగు వక్త్రములఁ, బహువేది శౌరి, దా
మూషికవాహనుండు సురముఖ్యుడు షణ్ముఖుడుఁ వచింపలే
రీషదుదంతమేని సకలేశ్వరి సద్గుణకోటి నంగనా! ౧౧౩౦

క. వేదములు నాలుగును విను। మా దేవీమహిమముల గలాంశము దెల్పఁ
గా దగవు వాణియును। సనకాదులు కపిలార్కసిద్ధు లర్హులె సుదతీ. ౧౧౩౧

క. ఒక దొక కొంత యెఱుంగు మ। రొక దొక కొంతయు నెఱుంగు నోపి యజుడు దా
నొక కొంత యెఱుగు గణపతి। ప్రకటించెడి నతనికంటె బైవా డగుచున్. ౧౧౩౨

క. గణపతికంటెను శంభుడు। గణియింపగగలడు దేవికథనము మిగులఁ
భణనీయుడు గోపాలక। మణి చెప్పెం దొల్లి రాసమండలమందుఁ. ౧౧౩౩

ఆ.వె. శివుడు కృష్ణువలన దవిలి విన్నంతలో। దేవిగుణము కొంత దెలిపె ధర్మ
నకును రజతగిరిని బ్రకటంబుగా దాన। గొంత రవికి నతడు కోరి చెప్పె. ౧౧౩౪

వ. నా తండ్రియగు సూర్యుండు తొల్లి నేను వైరాగ్యయుక్తుండనై తపంబున కరుగం దలంచి
నప్పుడు నా కెఱింగించిన విధంబున జెప్పెద వినుము. ఆకాశంబు స్వాంతంబు నెఱుంగనట్లు
దేవిగుణంబులు దేవియే యెఱుంగదు. ఇక నితరుల జెప్పనేల యని చెప్పి ధర్మరాజు
వెండియు. ౧౧౩౫

సీ. సర్వాత్మయై మఱి సర్వేశ్వరుం డయి సర్వకారణమూలసాధను డయి
సర్వపాలకు డయి సర్వాధ్యు డయి యింక సర్వకర్తయు సర్వసాక్షియు నయి
నిత్యరూపాదియై నిత్యశరీరు డయి నిత్యచిదానంద నిశ్చలుండు
నయి నిర్గుణుండును నిరంకుశుం డయి నిరామయు డయి నిర్లిప్తు డయి వినిర్మ
తే.గీ. లుండు నిశ్శంకుడును భక్తలోలు డయి పరాత్పరుం డయి పరిణామరహితు డగుచు
ప్రకృతి మాయాన్వితుండగు పరమపురుషుఁడాతని వికారమేసుమ్మి యఖిల మబల. ౧౧౩౬

తే.గీ. పురుషునకు బ్రకృతికి భేద మరయరాదు। వాడు నదియు నొక్కటై వరలుచుండ్రు
సచ్చిదానందరూపిణి శక్తి మాయ। రూపులేకయె రూపంబు సూపుచుండు. ౧౧౩౭

మ. మునుము న్గొల్లత నొక్కదాని సృజనంబుం జేసె నద్దేవి యే
మన నగ్గోపవధూటి చక్కదన మాహా దాని వర్ణింపఁ జా

లను నవ్వఁ నవరత్నముల్ వొదము నా రంభాది దివ్యాంగనా
జనముల్ దాని హొరంగులో శతశతాంశం బీడురానేర్తురే। ౧౧౩౮

ఉ. తల్లలనానురూప గుణధాము ముఖచ్ఛవిధూతసోము సం
ఫుల్లసరోజలోచను ముముక్షువికారవిమోచను స్మహ
మల్లు గుమారతల్లజుని మంజుల వేణునినాద భూరిసం
పల్లలితుఁ సృజించె నొక వల్లవసుందరు వల్లవీయతుఁ. ౧౧౩౯

తే.గీ. అతడు కృష్ణుండు ద్విభుజుండు నఖిలకర్త। యాపె రాధామహాదేవి యాద్యమాయి
ప్రకృతి లోకవిధాత్రి యో పద్మనయన। యారయఁగ మెప్డు భేదంబు వారిలోన. ౧౧౪౦

వ. అతని వంశహస్తుగా ద్విభుజుగా రాసమండలమధ్యస్థుగా వనమాలావిభూషితుగా గౌస్తుభ
మణివిరాజితుగా జంపక మాలతీ మాలికావిశోభితుగా శిఖిపింఛచూడునిగా భక్తులు ధ్యానిం
తురు. మఱియు, ౧౧౪౧

సీ. ఏవాని భయముచే నా వారిజభవుండు సర్గంబు జేయు నొసళ్ళ వ్రాయు
నేవాని భయముచే శ్రీవల్లభుడు సర్వపాలనం బొనరించు లీల లొసగు
నేవాని భయముచే నీశుండు కాలాగ్నిరుద్రుడౌ సేయు నుపద్రవములు
నేవాని భయముచే నిందుధరుండు మృత్యుంజయుండౌ జ్ఞాన మొసగుచుండు

తే.గీ. ఎవ్వాని భయంబుచే బవ నేన సురప। మృత్యు వహ్ని జ లాకాశ పృథ్వు లడరి
వాని వాని పను ల్సేయు వరుస విడక। భవసముద్రంబు దరియింపవలయు నబల. ౧౧౪౨

వ. డెబ్బదియొక్క దివ్యయుగంబులయిన నొక యింద్రుం డగు. అట్టియింద్రు లిరువదియెని
మిది సన బ్రహ్మకు నొక దివారాత్రంబగు, యిట్టి దినములు ముప్పదియైన బ్రహ్మకు నొక
మాసంబగు, నవి రెండయిన నొక ఋతువగు, నట్టి ఋతువు లారయిన నొక వత్సరం
బగు, నా వత్సరంబే ద్విభుజుండగు శ్రీకృష్ణునికి నొక చక్షుర్నిమీలనంబగు, నిదియే
ప్రాకృతంబగు ప్రళయంబు. దీనియందు సర్వదేవతలు బ్రహ్మయందు లీను లగుదురు.
బ్రహ్మ శ్రీకృష్ణు నాభియం దుండు, చతుర్భుజుండయిన క్షీరాబ్ధిశాయి కృష్ణుండు ద్విభుజుని
వామపార్శ్వంబున నుండు, జ్ఞానంబున శివుండుండు, సర్వశక్తులు మాయాదేవియందు
లీన లగుదురు. మాయ ద్విభుజుని బుద్ధియందు లీనయగు. నారాయణాంశుండగు స్కందుండు
వక్షంబున లీనుండగు, గణేశ్వరుండు బాహువున లీనుండగు. పద్మాంశంబులు పద్మయందు
లీనయగు, పద్మ రాధ యందు లీనయగు, గోపికలును దేవతాస్త్రీలు నట్ల యగుదురు.
సావిత్రియు, వేదశాస్త్రంబులును సరస్వతియందు లీను లగుదుదు. సరస్వతి రాధజిహ్వ
యందు లీనయగు. గోలోకంబుననుండు గోపకులెల్లరు శ్రీకృష్ణుని లోమంబుల లీను లగు
దురు. మరియు శ్రీకృష్ణుని ప్రాణంబున ప్రాణవాయువులును, జఠరాగ్నియందు హుతాశ

నుండును రసవంబున జలంబును చరణాగ్రంబుల వైష్ణవబృందంబులును, నిఖిలవిశ్వంబులు లోమకూపంబులందును లీనంబులై యొక్క నిమేషమాత్రం బుండి వెండియు నున్మీలనంబున సృష్టి యగు నట్టి బ్రహ్మాండంబులు నూరదగు బ్రహ్మప్రళయం బండ్రు. మరియు వినుము. ౧౧౪౩

క. పరమాణుసంఖ్యవలె వా। గ్వరసృష్టుల నెన్న దరముగా దల రాధా
పరుడు కనుమూయుటయును। దెరచుటయుం జూడ నవిగదే మూలంబుల్. ౧౧౪౪

తే.గీ. ప్రకృతియందును గృష్ణుండు ప్రళయవేళ। లీనుడై యుండు బ్రకృతియు లీన యగును
నిర్గుణపరాంబయందు ననర్గళముగ। నిర్గుణబ్రహ్మమే శక్తి నిశ్చయంబు. ౧౧౪౫

క. విను మఖిలవేదశిఖరము। లనెడి సదే వేద మగ్ర ఆసీత్తనగా
ననుమానింపగనేటికి। మునులు దెలియగలరె యట్టి మూలప్రకృతిన్. ౧౧౪౬

క. నిగమముల ముక్తు లవి నా। లుగుగా నెన్నంగబడియె లోలాక్షి భ
క్తిగలిగి దేవుం గొల్చిన। నగు ముక్తులు దేవిభక్తి యధికముసుమ్మీ. ౧౧౪౭

తే.గీ. రూఢి సాలోక్య మనగ సారూప్య మనగ వరలు సామీప్య మనగ నిర్వాణ మనగ
నాలుగు విముక్తిభేదముల్ నలిననయన। శక్తిభక్తులు కోరరు ముక్తి గిక్తి. ౧౧౪౮

తే.గీ. శక్తిభక్తు లెపుడు శక్తిసేవాపరా। యణత గోరుచుందు రదియె చాలు
సేవలేని ముక్తి చెప్పంగనేటికి। భక్తి సేవ మిగుల బ్రబలజేయు. ౧౧౪౯

ఆ.వె. దేవరూప మేల దేవలోకం బేల। దేవసన్నిధియును దేవతాత్వ
మేల యంచు శక్తినే కొల్తు రెవ్వేళ। యంచు భక్తిముక్తి కధిక మనుచు. ౧౧౫౦

క. దేవతలకు దుఃఖంబులు। లేవే కోరికలు లేవె లేవే తనువుల్
లేవే కామాదులు మఱి। కోవిదు లా రూపములను గోరగనేలా. ౧౧౫౧

వ. ఇవి భక్తిముక్తి భేదంబు లిక నిషేకఖండనంబు సెప్పెద వినుమని ధర్మరాజు సావిత్రి కిట్లనియె. ౧౧౫౨

క. భోగంబె నిషేకము త। త్త్యాగంబె నిషేకఖండనాఖ్యం బగు శ్రీ
సాగరకన్యావిభు సేవా గరిమము జ్ఞాన మది శుభప్రద మబలా. ౧౧౫౩

ఆ.వె. విష్ణుసేవ సల్పి విష్ణుభక్తుండైన। దుఃఖసమితినుండి తొలగగలడు
తెల్పినాడ నీవు తెల్పుమన్నది యంచు। బల్కి సుదతి మగని ప్రాణమిచ్చి. ౧౧౫౪

క. కొమ్మా నీప్రాణేశుని। గొమ్మా నీకోర్కెలెల్ల గొనసాగుగదా
పొమ్మా భూలోకమునకు। నెమ్మది నిక జింతయేలనే సావిత్రీ। ౧౧౫౫

ఆ.వె. జ్ఞానదాత విడచి కదలుచునుండంగ। నడ్డమేగి యడుగులందు వ్రాలి
పొక్కుచున్న సుదతి పుయిలోటకు మనంబు। గరగి యముడు పలికె గరుణమీర. ౧౧౫౬

చ. అలరుచు లక్షయేండ్లు సుఖ మందుదు భారతమందు నాదటఁ
గలుగును దేవిలోకము ప్రకంపనము న్విదనాడి యేగుమీ
లలన నిశాంతసీమ కవలఁ బొనరింపు మదుచ్యమాన ని
శ్చలసరణిఁ మనంబున బరా కొకయింతయు లేక భక్తితోఁ. ౧౧౫౭

క. సావిత్రినోము నోముము। దేవీ పదునాలుగేండ్లు తెరవల కది భ
ద్రావహము మోక్షకారణ। మో వనితా దాని మార్గ మోపిక వినుమా. ౧౧౫౮

ఆ.వె. జ్యేష్ఠమాసమందు నెలమి శుద్ధమునందు। నల చతుర్దశీ మహాదినమున
సకలశుభదమైన సావిత్రినోమును। సలుపుచుండవలయు చారువదన. ౧౧౫౯

ఆ.వె. భాద్రపదమునందు బరగు శుక్లాష్టమి। యందు నోమవలయు నాదిలక్ష్మి
షోడశాబ్దములన వేడుకతో నట్లు। చేసెనేని విష్ణు జెందు నబల. ౧౧౬౦

క. ప్రతిమంగళవారంబున। సతిభక్తిని మంగళాంబ నారాధింపఁ
ప్రతిశుక్లషష్ఠియందు। న్నతి షష్ఠీదేవి గొలువ నగు భద్రంబుల్. ౧౧౬౧

తే.గీ. మగువ। యాషాఢసంక్రాంతి మనస గొలిచి। యొనర గార్తికశుద్ధాష్టమిని మొదలిడి
ప్రతినెలను రాధికాదేవి భక్తి గొల్చి। సర్వసంపద లందుమీ సరసిజాక్షి. ౧౧౬౨

క. ఈరీతిని దేవీవ్రత। పారీణత గనుము నీవు భామినిరో దే
వీరాజ్యము లభియించును। వారక రాసేశుకరుణ వడసెదు గడకఁ. ౧౧౬౩

వ. అని యిట్లు సావిత్రికి దేవీవ్రతమార్గంబు లుపదేశించి భర్త నిచ్చి యముండు నిజలోకంబు
నకు జనియె. నంత సావిత్రియు పునర్జీవితుండైన భర్తతో సత్యుల్లానంబున నిజాల
యంబునకుం జని స్వవృత్తాంతంబెల్ల నచ్చట వారల కెరింగించె. నపుడు వార లా సావిత్రీ
సత్యవంతులం గనుంగొని యపరిమిత సంతోష భరితాంతరంగులయి రని చెప్పి నారాయ
ణుండు, ౧౧౬౪

శా. సావిత్రీసతితండ్రిఁ గాంచె సుతులన్ సౌభాగ్యసంయుక్తులఁ
వే వే మామయు గాంచె నేత్రయుగముఁ బృథ్వీతలేంద్రత్వముఁ
దా వేడ్కం బతిగూడి సత్తనయులఁ గాంచెన్ మహాధీరులన్
శ్రీవిస్తారత లక్షహాయనములఁ జీవించె ధర్మాజ్ఞచేఁ. ౧౧౬౫

తే.గీ. కడకు సావిత్రి పతితోడ గదలిచనియె। భగవతీలోకమునకు నిశ్చయత నహహ
మహి బతివ్రతలగువారి మహిమ లెన్న। నిట్టివియసుమ్ము నారదా యేమిచెప్ప. ౧౧౬౬

వ. నారదా। నీ వడిగిన సావిత్రీచరితంబును, గర్మవిపాకంబునుం దెలిపితి. నింక నెద్ది విన
నిశ్చయింతు దెలుపవే యనిన నారదుండు. ౧౧౬౭

## —: మ హా ల క్ష్మ్యు పా ఖ్యా న ము :—

క. శ్రీ మూలప్రకృతి యయి ని । రామయ యయి యొప్పు శక్తియంశమయిన యా
రామ మహాలక్ష్మి యనం । గా మహి యశమందు వంటి వది యెట్టిదొకో. ౧౧౬౮

క. ఆమె యుపాఖ్యానము విన । నా మనమున గోర్కెవొదము నారాయణ నీ
మోమున వినియెద దెలుపుము । ప్రేమగలిగి యనిన నతడు వినుమని తెలిపెన్. ౧౧౬౯

మ. మును సృష్ట్యాదిని గృష్ణదేవునకు సొంపు న్నింపి వామాంసమం
దును జన్మించెను దేవి రాసమున ముద్దుల్ గుల్కుచున్ శ్యామయై
తనుకాంతిం దిశలెల్ల గ్రమ్మి వటసందీప్తాభయై యౌవనం
బును రంజిల్లగ చారునేత్రయయి యంభోజాస్య రమ్యాకృతిన్. ౧౧౭౦

తే.గీ. దేవు నిచ్ఛచేత దేవి మహాలక్ష్మి । యనగ బరగె దక్షిణాంసమందు
రాధ యనగ నొక్క రమ్యమూర్తి జనించె । నందునలన నిద్దఱై రి చెలులు. ౧౧౭౧

క. ద్విభుజుడవై నను గూడుము । ప్రభువా యని వేడుకొనియె రాధ ముదమునన్
ప్రభును జతుర్భుజుడ వగుచు । విభవము గనుచు లక్ష్మి వేడుక గోరెన్. ౧౧౭౨

క. వామాంశ మొక్క మూర్తియు । గా మఱి దక్షిణము నొకడుగా ద్వివిధుండై
దామోదరుండు నిలచెన్ । స్వామికృపకు నేది కొఱత సంయమిముఖ్యా । ౧౧౭౩

తే.గీ. రాధ గోరినట్టి రమణుండు ద్విభుజుండు । కూర్మి బొసగ లక్ష్మి గోరుకొన్న
పతి చతుర్భుజుండు నతిమహిమాన్వితుం । డగుచు నిలువ వార లలరి రంత. ౧౧౭౪

క. ద్విభుజుడు కృష్ణుడుగాగా । విభుడయి రాధికను గొనుచు వేగం జనియెన్
విభవమున గోజగమునకు । త్రిభువనములు గోజగంబు క్రిందివి కావే. ౧౧౭౫

క. ధీరుడు చతుర్భుజుండగు । నారాయణమూర్తి లక్ష్మి నయమున గొనుచుం
జేరెను వైకుంఠమునకు । నేరుపునను నిత్యసౌఖ్యనిలయంబునకున్. ౧౧౭౬

తే.గీ. ప్రధాన మహాలక్ష్మి యమ్మలమ్మ । యఖిలసంవత్సరరూపిణి యాదిదేవి
తా ననంతస్వరూపయై తరుణులందు । దివ్యవస్తువులందు వర్తించుచుండు. ౧౧౭౭

సీ. స్వర్లోకమున నొప్పు స్వర్గలక్ష్మి యనంగ రాజులందును రాజలక్ష్మి యనంగ
గృహముల గృహలక్ష్మి గృహమేధి రక్షిణి సురభులయందును సురభిలక్ష్మి
యజ్ఞంబులను దక్షిణాఖ్యలక్ష్మి యనంగ నాగలోకంబున నాగలక్ష్మి
క్షీరవారధియందు సింధుకన్య యనంగ చెలగి పద్మినులందు శ్రీ యనంగ

తే.గీ. చంద్రునందును శోభనా సరవి సూర్యునందును మహాప్రభ యనంగ మహిమ గాంచు
సర్వలోకైకసంధాత్రి సాధుకర్త్రి । శ్రీమహాలక్ష్మి శ్రీదేవి సిద్ధసేవ్య. ౧౧౭౮

సీ. నగలయం దుండును నవరత్నముల నుండు శుద్ధాంబువుల మఱి సుఫలములను
రాజపత్నుల బతివ్రతలయం దుండును క్షేత్రంబులను పంటచేల నుండు
ధౌతవస్త్రము లందు దైవాలయములందు ప్రాణప్రతిష్ఠిత ప్రతిమలందు
శుభఘటంబులయందు సుమమాలికలయందు జాటీరరసమందు పాలయందు

తే.గీ. వృక్షశాఖల నవమేఘవితతియందు । పుణ్యతీర్థంబులందు సద్భూమి నుండు
సర్వలోకైకసంధాత్రి సాధుభర్త్రి । శ్రీమహాలక్ష్మి శ్రీదేవి సిద్ధసేవ్య. ౧౧౭౯

తే.గీ. మొదట నారాయణుడు గొల్చె ముఖ్యలీల గోరి సద్భక్తితోడ వైకుంఠమందు
అదట నజుండు శంకరుం డవల గొల్చె । శ్రీమహాలక్ష్మి గొలువని శ్రేష్ఠు లెవరు ? ౧౧౮౦

క. మనువులు గొల్చిరి దేవిని । మనుజేంద్రులు దిక్పతులును మౌనివరేణ్యుల్
ఘనులు గుహులు గంధర్వులు । గొనకొని నాగాధిపతులు గొల్చిరి లక్ష్మిన్. ౧౧౮౧

క. భాద్రపద ప్రథమాష్టమి । భద్రము సేకూర లక్ష్మి బ్రహ్మ భజించున్
ఛిద్రేతరభక్తిని నిరుపద్రవముగ । నేకపక్షపర్యంతంబున్. ౧౧౮౨

క. చైత్రంబున । బౌషమున నకృత్రిమ భాద్రమున మంగళేద్ధదినమునన్
జిత్రముగ మూడు జగముల । బత్రితవిహగుండు గొలుచు భక్తిని లక్ష్మిన్. ౧౧౮౩

క. ఘనముగ వర్షాంతంబున । మనుపును సంక్రాంతియందు మాఘ్యమునందున్
మునుకొని పూజించును దా । సనయతి శ్రీదేవి మూడుజగములు మెచ్చన్. ౧౧౮౪

సీ. శ్రీమహేంద్రునిచేత చిరమంగళునిచేత నిలచి కేదారుచే నీలుచేత
సుత్తానపాదుచే నొగి నలుచే సుబలునిచే ధృవునిచేత లోలుపులగు
దక్షుచే బలుచేత దగ గశ్యపునిచేత చంద్రుచేతను నివస్వంతుచేత
వాయుపుచే బ్రియవ్రతుచేత గర్దముచేత యమునిచేత శ్రీదుచేత

తే.గీ. వహ్నిచేతను మఱియును వరుణుచేత । యమునిచే బూజ లందెడు ననవరతము
సర్వలోకైకసంధాత్రి సాధుభర్త్రి । శ్రీమహాలక్ష్మి శ్రీదేవి సిద్ధసేవ్య. ౧౧౮౫

వ. అనిన నాలించి సంతుష్టుండై యత్యుత్సాహంబున నారాయణుం జూచి నారదుం
డిట్లనియె. ౧౧౮౬

శా. వైకుంఠంబున నుండు విష్ణునరమే వాసంబు లోకేశి ల
క్ష్మీకాంతామణి యెట్లు భూమి కరిగెన్ జేతంబునన్ సింధుక
న్యాకారంబును మెచ్చె దొల్లి యెవ రయ్యమ్మన్ బ్రపూజించుచున్
లోకాధిక్యము నొంది రిద్ది విన నే లోలాత్ముడన్ దెల్పుమా. ౧౧౮౭

వ. అనిన విని నారాయణుం డిట్లని చెప్పదొడంగె. ౧౧౮౮

ఉ. తొల్లి పురందరుండు కడు దుర్దశపాలయి లక్ష్మి బాసి గో
మెల్ల జెడంగ స్వర్గము ద్యజించి మహారుష లక్ష్మి వంతచే
నుల్లము తల్లడిల్ల జని యొర్మి వికుంఠపురంబు సేరినన్
గొల్లున దేవతల్ సనిరి గొబ్బున బ్రహ్మసభావితర్దికిన్. ౧౧౮౯

ఉ. ధాతకు గోడు దెల్పుకొన దానును వారలగూడి యాశ్రిత
త్రాతను విష్ణుదేవు బరతత్త్వవినోదు వికుంఠమందిరున్
బ్రీతి స్తుతింప జొచ్చిరి సభీతికులై యతిదీనులై యజున్
దాతను ముందుబెట్టుకొని తత్తరపాటున గొంతు లెండగన్. ౧౧౯౦

ఉ. ఏమిది యంచు విష్ణుడును బృచ్ఛయొనర్పగ లక్ష్మివృత్త మ
క్షేమము నాకమందుటయు జెప్పిరి నిర్జరు లంత గేశవుం
డా మహనీయలక్ష్మి పునరాగతికిం దగు వీలు సేసెదన్
బ్రేమను మిమ్ము బ్రోచెదను వేగమ పొండని చెప్పె చెచ్చెరన్. ౧౧౯౧

వ. అనిన విని నారదుండు దేవతలకు లక్ష్మి తొలంగుటకు నిమిత్తమేమని యడిగిన
నారాయణుండు దుర్వాసుశాపంబువలన నని చెప్పి మఱియు, ౧౧౯౨

క. హరి లక్ష్మి కాజ్ఞ యిచ్చెను । సరగున క్షీరాబ్ధియందు జనియింపుము నీ
వరవిందాలయ యంచున్ । తెరగెరిగి సతీమతల్లి తెగువయొనర్చెన్. ౧౧౯౩

తే.గీ. దుగ్ధసింధువునను దేవి దూరియుండె । నప్పుడే దేవదానవు లబ్ధిదరువ
లక్ష్మి యందును బుట్టె సులక్షణ యయి।దాని వనమాలతో జక్రధరుడు గొనియె. ౧౧౯౪

క. హరి సురలకును దదంశము । కరుణ గలుగుననుచు వరము కడువడి నొసగెన్.
బరితృప్తిని బృందారకు । లరిగిరి సంపత్సమృద్ధి నలరుచు మౌనీ. ౧౧౯౫

వ. అని యివ్విధంబున సంగ్రహముగా నారాయణు పల్కులు విని నారదుండు, ౧౧౯౬

శా. దుర్వాసుండు శపింప నేమిటికి నేదోషంబు గావించె నా
గీర్వాణాధిపు డెట్లు ద్రచ్చిరి సురల్ గీర్వాణులున్ వార్ధి దా
గర్వంబెల్ల నడంగి శక్రు డెటులం గావించె స్తోత్రంబు లా
సర్వాధారకు లక్ష్మి కామె యెటులన్ సాక్షాత్కరించెన్ దయన్. ౧౧౯౭

క. ఆ సంవాదం బెట్టిది । యాసన్ వినవలతు దెలుపుమన విని లక్ష్మీ
వాసుడు నారాయణు డను । నో సంయమివర్య విను మహోత్సాహమునన్. ౧౧౯౮

ఉ. పాకరిపుండు తొల్లి మధుపానమదంబున రంభతోడ గ్రీ
డాకలనన్ జరించుచు మహాటవి గ్రుమ్మరుచుండగా మహ
శ్లోకుడు నత్రిసూనుడు విశుద్ధుడు విష్ణుని మ్రొక్కి శంకరున్
జోక నమస్కరింప నొకచొప్పున దా మదికొండ కేగుచోన్. ౧౧౯౯

శా. ఆ సుత్రాముఁడు గాంచె నుజ్జ్వలతనున్ వ్యాసక్తవేదాంతవి
ద్యాసంపన్ను రవిప్రభున్ విమల సద్యజ్ఞోపవీతున్ మహో
ల్లాసున్ దండకమండలూల్లసితు పుండ్రస్ఫారభవ్యాననున్
వాసోభాసితు శిష్యకోటియుతు దుర్వాసున్ జటామండితున్. ౧౨౦౦

క. కని వృత్రరిపుఁడు మ్రొక్కిన । మునియును దీవించి యిచ్చె మురశాసనద
త్తనవీనముంజుశోభా । ఘనమగు న ప్పారిజాతకౌసుమమాలన్. ౧౨౦౧

క. ఆ పూవు ముసలితనమును । జోపున్ రోగంబు లడచు శుభముల నొసగున్
బ్రాపగు నెల్లపనులలో । నేపుణ్యుఁడు దాని మహిమ లెన్నఁగనోపున్ ? ౧౨౦౨

క. మత్తుగొనియున్న శక్రుఁడు । చిత్తము చేడ్పాటుతోడ జెచ్చెఱ మునిరా
డ్దత్తమగు మాలికం దన । మత్తగజమునెత్తి నిడియె మౌనివరేణ్యా ! ౧౨౦౩

తే.గీ. దాని దాల్చిన యైరావతంబు । సర్వగుణములను విష్ణుతుల్యమై కుమతియైన
శక్రు విడనాడి కాననస్థలుల దిరిగె । నేగె నెచ్చటికే నెవ్వ రెఱుగరైరి. ౧౨౦౪

క. అది కని దుర్వాసుఁడు దా । మది గనలి సురేంద్రు జూచి మఘవా యేరా
మదమున మద్దత్తసుమము । మదగజశిరమావహింప మరియాదటరా ? ౧౨౦౫

క. ఇది విష్ణునివేదితమైనదిరా భోగింపవైతి వకటా త్యాగం
బిది కూడునె బ్రహ్మఘ్నతగదరా యీవేళ నీదుగతి దలపోయన్. ౧౨౦౬

చ. హరికి నివేదితంబయినయట్టి పదార్థము ముట్టినంతటన్
సిరియును గీర్తియుం గలుగు చేరి భుజించిన మోక్షమబ్బెడిన్
మఱియు ద్యజించెనేనియు సమస్తవిపత్తులు గల్గు విష్ణుపా
దరజము మేను సోకినను దప్పక పూతుడుగాకయుండునే ? ౧౨౦౭

సీ. హరికి నర్పించని యన్నంబు చెడిపెల యన్నంబు శూద్రుల యన్నము మఱి
శివలింగముల నిచ్చు భవుల యన్నంబును వెజ్జులయన్నంబు వేదబాహ్యు
నన్నంబు కన్యల నమ్మెడివారల యన్నంబు పర్యుషితాన్న మరయ
యోనిజీవులయన్న మొగి దేవలాన్నంబు పరగ వృథా మాంసభక్షణంబు
గిరిశ ద్విజాన్నంబు పరిహృతోచ్ఛిష్టంబు శూద్రయజ్వాన్నంబు శూద్రమగని
యన్నంబు శవదాహి యన్నంబు నెన్న మిత్రద్రోహి యన్నంబు తలప గూట
సాక్షుల యన్నంబు సర్వపాపంబుల నాచరించినవారి యన్నము దిని

తే.గీ. యున్నవారల పాపంబు లొక్కమొగిని । జెక్కి చెండాడి పూతుల జేయకున్నె
యహహ శ్రీవిష్ణు నైవేద్యమైనయట్టి । వస్తువేదైన విడనాడువారుగలరె ? ౧౨౦౮

క. హరిభక్తిగలుగు మనుజుఁడు । ధర శ్వపచుండేని సర్వధర్మపరుండై
వరుసం గోటికులంబుల । నిరుపమగతి నుద్ధరించు నిశ్చిత మిదియే. ౧౨౦౯

క. హరిభక్తిలేని మనుజుఁడు । ధర విప్రుండేని తన్ను దానైనను ను
ద్ధరణంబు సేసికొనఁడీ । పరమార్థము దెలియుమయ్య పాకవిరోధీ । ౧౨౧౦

మ. హరి నిర్మాల్యము లేశమైన మనుజుం డజ్ఞానభావంబునన్
సరగం దా గ్రహియించెనేని వినుమా సప్తోద్భవాయాతదు
స్తరపాపంబుల జెందు జ్ఞానవశతం దా గొన్న గోట్యుద్భవ
స్థిరపాపంబుల బోవనెట్టు నిదియే సిద్ధంబు దేవాధిపా. ౧౨౧౧

మ. హరికర్పించిన యీ లతాంత మదిరా యత్యంతగర్వంబునం
గరి కర్పించితి పీవ శైకొనక, దుష్కాలంబు నీ కబ్బెరా
సిరి నిన్నున్ విడనాడి శౌరిపదమున్ జెందున్‌గదా చూడరా
హరిభక్తుండను నేను నిర్భయుడ పీ వల్పుండ వో వాసవా । ౧౨౧౨

ఉ. కాలముగాని మృత్యువయకాని జరాదులుగాని నా డెసన్
జాలవు భీతిగొల్ప మురశాసనుభక్తుడ పీ వనజ్ఞతన్
గ్రాలితి వేమి చేసెదవురా యిక నీ విభవంబు సర్వమున్
దూలెను మత్తు డెన్నడు నధోగతిజెందకయుండనేర్చునే ? ౧౨౧౩

క. నీతండ్రి యేమిసేయును । నీతాతయు నేమిసేయు నీగురువునకుం
జేతనయినదేమి యికన్ । గాతరుడనె నాకు శంక కలదే మఘవా. ౧౨౧౪

క. శాపము విని దేవేంద్రుం । డాపద నొందితి నటంచు నతిదీనుండై
తాపముపడి మొత్తోయని । పాపాత్ముడ నైతి ననుచు బలుమరు నేడ్చెన్. ౧౨౧౫

వ. ఇట్లు విలపించి ౧౨౧౬

క. గర్వ ముడిగి సురనాథుడు । దుర్వాసునకున్ నమస్కృతులు సేసి వెసన్
గీర్వాణులయేలికనై । నిర్విణ్ణతపాలయితిని నీ శాపమునన్. ౧౨౧౭

ఉ. నీవు మహానుభావుడవు నీ కెవ రీడు తొలంగినట్టి ల
క్ష్మీవిభవంబు నే నడుగ గించితు జ్ఞానము నాకు నిమ్ము నా
నావిధసంపదల్ గలిగినన్ వి దాగతి బీజ మెన్న బ్ర
జ్ఞావిపినోగ్రదావదహనంబగు భక్తియు ముక్తియుం జెడున్. ౧౨౧౮

క. అని యింద్రుడు పలికిన విని । మునివర్యుడు చెప్పదొడగె మురరిపుపదసే
వనము శుభదంబు ముక్తిద । మనుచున్ ముదమునకు హేతువగు సిరి యనుచున్. ౧౨౧౯

వ. మరియు నిట్లనియె ౧౨౨౦

క. ఘనసంపత్తిమిరాంధుడు । జనన మరణ శోక రోగ జరలందును గా
కరయంగ మోక్షమార్గము । సురవర సంపత్సుఖంబు సుఖమే ఛీఛీ. ౧౨౨౧

క. సంపన్మత్తుడు మూఢుడు । సంపన్మత్తుండె కల్లు చవిచూచిన వా
డింపగునె సత్వశాలికి । సొంపని సిరి నమ్మనగునె సుఖమే ఛీఛీ. ౧౨౨

క. హరిహయ సంపన్మత్తుం । డరయన్ విహ్వలుడును విషయాంధుడు కామా
తురుడును రాజసికుడు నగు । మరియుం గనలేడు సత్వమార్గము మఘవా । ౧౨౩

క రాజసుడని తామసుడని । యోజన్ విషయాంధు డొప్పు నొగి ద్వివిధుండై
రాజసుడగు శాస్త్రజ్ఞుం । డీ జగతిని శాస్త్రమూఢుడే తామసుడౌ. ౧౨౪

తే.గీ. శాస్త్రమును రెండువిధముల జగతి బరగు । మార్గముల జూపును ప్రవృత్తిమార్గ మన ని
వృత్తిమార్గంబు నన నా ప్రవృత్తిమార్గ । మెల్లదుఃఖంబులకు నెప్పు నీడ్చుచుండు. ౧౨౫

శా. నానాయోనుల బుట్టి పుట్టి మరల న్నాశంబునుం బొందుచున్
జ్ఞానం బింతయు లేక లోభ మద ముఖ్యాక్రాంతి నల్లాడుచున్
దా నెద్దేనియు నొక్క సత్పురుషు సందర్శించి సాంగత్యముం
బూనం బూర్వభవార్జితాఘముల రొప్పుం ముక్తి సిద్ధించెడిన్. ౧౨౬

క. ఇటులనుచు గురువు నాకుం । బటుగతి నుపదేశ మిచ్చె పాకాహిత యా
దట నేమి వినదలంచెదు । స్ఫుటముగ దెలుపుమన సురవిభుడు తృప్తుండై. ౧౨౭

తే.గీ. అంతనుండియు వైరాగ్య మాశ్రయించి । వెలయ నానాటి కది చాలవృద్ధిజెందె
నట్టులా ముని యాశ్రమమందు గొన్నినాళ్లు వసియించె స్వర్లోకనాధు డటవి. ౧౨౮

వ. ఇట్లు ము న్నాశ్రమంబున వైరాగ్యదశ నవలంబించియున్న యింద్రుం డొక్కనా డయ్యా
రణ్యంబు విడిచి స్వర్గంబున నమరావతికిం జని కాంచిన. ౧౨౯

మ. దనుజాక్రాంతము భీకరంబు వికృతధ్వానం బపిత్రాది బం
ధునికాయం బతిచంచలంబు విజశత్రుగ్రస్తము న్నాకమున్
గని యింద్రుండు బృహస్పతిన్ నిజగురున్ దర్శింపగా నేగి కాం
చెను గంగానదితీరమం దతని నక్షీణప్రభామండితున్. ౧౩౦

శా. ఆదిత్యాభిముఖుండు సాశ్రునయనుం డానందపూర్ణుండు ధ్యా
నోదారుండు మహామహుండు విబుధవ్యూహప్రియుం డిద్ధగం
గాదివ్యాంబుపవిత్రుడై జపములో గన్మూసియుండంగ గ్ర
వ్యాదద్విట్పతి చూచి కొంతవడి దా నచ్చోటనే యుండగన్. ౧౩౧

క. యామాంతంబున లేచిన । యా ముని దర్శించి కనుల నశ్రులు దొరగన్
మామవ మామవ యనుచున్ । మోము చరణయుగళి నంట మ్రొక్కి సభయుడై. ౧౩౨

క. తన వృత్తాంతము దెలిపిన । విని మునినాధుండు రోషవికృతాక్షుండై
మనమున బొగిలెద వేటికి । వినుమా నా వచనములను విబుధవరేణ్యా । ౧౩౩

క. నీతిజ్ఞుం డెన్నటికిని । గాతరభావంబునొందగా నోపడును
మ్మేతరిని సేగి యోగులు । బ్రాతుకొనవు నశ్వరములు శ్రమకరములగుచున్. ౧౨౩౪

క. మును పటి తనువున బుణ్యం । బొనరించిన నేడు శుభము నొందును మును గీ
డొనరించిన నేడును గీ । డునుబొందక యెట్లుచొప్పడుచున్ సురనాథా. ౧౨౩౫

క. చేసికొనిన కర్మంబులు । పాసి చనునె కట్టికుడుపు పలుమరు మనుజున్
వాసవ యిది కర్మనియతి । నీసరివా డడలజెల్లునే మదిలోనన్. ౧౨౩౬

క. మును గృష్ణుడు బ్రహకు జెప్పె । నవశ్యము పూర్వకర్మ పృథుఫలమున నీ
తనువున శుభాశుభంబుల । ననుభవ మొనరింపవలయు ననుచు బిడౌజా। ౧౨౩౭

తే.గీ. జన్మకోటిశతంబుల జలిపినట్టి । కర్మ మది వెంటనంటి నిక్కముగ గుడుపు
కర్మము నశించినప్పుడు కర్మఫలము । లేదు మోక్షంబు సేకూరు లేఖనాథ. ౧౨౩౮

క. కర్మమున లక్ష్మి గలుగును । గర్మంబున దైన్య మొదవుగాదె జగమునన్
కర్మఫలము విడిచి చనునె । శర్మ మశర్మంబు వాని సంబంధములే. ౧౨౩౯

తే.గీ. వెలయు దేశ కాల భేదంబులను గర్మ । న్యూనతాధికతల బూనుచుండు
యెన్నిగతులనైన నెల్లెడలను కర్మ । మనుగమించుచుండు నఖిలజగము. ౧౨౪౦

తే.గీ. పండు నొక్కచేను పరిపూర్ణఫలదమై । కొలది బండు నొక్క పొలమునందు
క్షేత్రభేద మద్ది చేసిన కృషి రెంట । నొక్కటైన పంట యొకటిగాదు. ౧౨౪౧

క. సామాన్యదినమునందుం । భూమిసురున కిచ్చు నీగి పుణ్య మమవసన్
బ్రేముడి దానము జేసినచో షటి కోటిగుణితంబుసూవె జగమునన్. ౧౨౪౨

వ. పురందరా, మఱియుం జెప్పెద వినుము. రవి సంక్రాంతుల భూసురున కిచ్చిన దానంబు కోటిగుణితంబు. సూర్యగ్రహణంబునం గోటిగుణం బగు, జంద్రగ్రహణంబున లక్ష గుణంబగు. నక్షయల నక్షయం బగు. నిట్లు కర్మభేదంబులునుం దత్ఫలభేదంబులు నెఱుంగునది. ౧౨౪౩

క. దానంబులనేనియు మఱి । స్నానంబులయందునేని జపములనేనిన్
గాననగు పుణ్యఫలములు । మానవులకు దేశ కాల మహిమలవలనన్. ౧౨౪౪

ఉ. సారెయు గోలయుం భ్రమము చారుశరావము మృత్తు దోడుగా
గూరిచి కుమ్మరీడు పలుకుండలు వానెడి నవ్విధంబునన్
సారసజన్ము డీ జగము సర్వమునందును మానవాళికిం
బోరున గర్మసూత్రముల బూని ఫలంబుల నిచ్చుచుండెడిన్. ౧౨౪౫

ఉ. ఎవ్వని యాజ్ఞచే సకల మిద్ది సరోజభవుం డొనర్చు వా
డివ్విధి జేసె నాతని భజింపుము వాడు విధాత ధాతను

మ్మవ్వల నెద్దికా దఖిల హర్తల హర్తయ రాజరాజు వెన్
దివ్వెల దివ్వె శంకరుడు దెల్పెను నాకిది పాకశాసనా ! ౧౨౪౬

క. అని దేవగురుడు మఘవున । కనుపమవిధులెల్ల దెలిపి యాశీర్వాదం
బొనరించి కౌగలించెను । మనమున గరుణారసంబు మల్లడికొనగన్. ౧౨౪౭

## —: ఇంద్రాదులు బ్రహ్మలోకంబునకు పోవుట :—

వ. అని తెలిపి నారాయణుండు వెండియు నారదున కిట్లనియె. ౧౨౪౮

క. అంతట నింద్రుండును దితిజాంతకు ధ్యానించి తా బృహస్పతితోడన్
జింతార్త సురలతోడన్ । వంతం బనివినియె ధాతృవాసంబునకున్. ౧౨౪౯

క. గురు సురయుతుడై సురపతి । పరమేష్ఠిని జూచి మ్రొక్కి భక్తి నిలువగా
గురుడు సకలవృత్తాంతము । తిరుగుమరుగులేక నుడివె దీనవదనుడై. ౧౨౫౦

వ. ఇట్లు బృహస్పతి యాద్యంతంబు దేవతావిభవవినాశవృత్తాంతంబు జెప్పి నిలువంబడిన
నవ్వి యింద్రునిం జూచి పితామహుం డిట్లని వచింపందొడంగె. ౧౨౫౧

క. నాకు బ్రపౌత్రుడ వీవై । నాకులమున బుట్టినావు నయవిదుడవు నా
కౌకసుల ఱేడవైతివి । శ్రీకరుడగు నాంగిరసుని శిష్యుడవుగదా. ౧౨౫౨

క. నీ తల్లి తండ్రి దక్షుం । డాతతశౌర్యప్రతాపు డచ్యుత సేవా
ప్రీతుడు కులములు మూడును । పూతంబులు నాకు నెంతపోడిమి వత్సా ! ౧౨౫౩

క. నీతల్లి పతివ్రత యగు । నీతండ్రి విశుద్ధమూర్తి నియతేంద్రియు డ
మ్మాతామహ మాతులులుం । బూతాత్ములు నాకు నెంతపోడిమి చెపుమా. ౧౨౫౪

క. పైతృకదోషమువలనను । మాతామహదోషమునను మఱి గురుదోషా
యాతగతి మానవుం డిల । శ్రీతరుణీరమణదోషి సిద్ధము వత్సా ! ౧౨౫౫

క. హరి సర్వాంతర్గతుడా । హరి సర్వశరీరవర్తి హరి కప్రియుడై
హరిచే విడువబడిన య । న్నరుని శరీరంబె శవము నమ్ముము వత్సా ! ౧౨౫౬

క. మానసము నింద్రియంబులు । నేనుం జ్ఞానంబు శివుడు నిజముగ భృగుక
న్యానాయకుండు ప్రాణము । గా నుందుము బుద్ధి ప్రకృతిగత భగవతి యౌ. ౧౨౫౭

క. నిదుర మొదలయిన శక్తులు । వదలని శ్రీదేవి కళలు వత్సా వినుమా
యిది యాత్మ ప్రతిబింబుడు । గద జీవుడు భోగతనుడుగా వర్తించున్. ౧౨౫౮

క. కాయమ్ము నాత్మ విడిచిన । గాయగతములెల్ల విడిచి కదలును వేగన్
రాయలు చనుచో బరిజను । లేయనువున బిరబిరాన నేగుదు రటులై. ౧౨౫౯

ఉ. నేనును శూలి శేషుడును నీరజమిత్రుడు ధర్మ దీరు నె
వ్వానికి పాదభక్తులము వానికి నర్పితమైన దేవతా
సూనము ధిక్కరించితివి శోభయు శ్రీయును లేక యెక్కుడుం
దీనత నొందగావలసె నీ విపు డెందును దైవ మల్పమే. ౧౨౬౦

క. శ్రీకృష్ణుని నిర్మాల్యము । చేకొని ధరియింపకేల జెచ్చెఱ కరిపై
వీక విసరితివి ఛీఛీ । నీకున్ సిరి యేలనిలుచు నిర్జరనాథా । ౧౨౬౧

క. నీవును నను దోడికొనుచు । నా వైకుంఠంబు వోయి హరిపాదంబుల్
సేవింపుము మరల గలుగు । శ్రీవిభవములెల్ల నీకు బుధమూర్ధన్యా । ౧౨౬౨

క. అని యింద్రునకుఁ దోడై । వనజాసను డరిగి యరిగి వైకుంఠపురిన్
గనుగొని సంతోషంబున । మునుమును జన నొక్క సౌధమున దతలీలన్. ౧౨౬౩

ఉ. కాంచిరి వారు కాంచనధగద్ధగితాంబరు బ్రజ్వలత్ప్రభో
దంచితు శాంతు నిత్యు నిగమార్థనికేతనునిం జతుర్భుజున్
బంచమహాయుధున్ ఘనకృపారసశోభితునిం ద్రయీవచ
స్పంచయసంస్తుతున్ సకలసమ్మతు లోకవిభున్ సనాతనున్. ౧౨౬౪

క. కని కన్నుల నీరొలుకగ । వనటం దురటిల్లి మ్రొక్కి వాసవముఖ్యుల్
మునిశాపంబును మొదలిడికొని తమ కగు గొడవ దెల్పికొనిరి మునీంద్రా । ౧౨౬౫

వ. ఇట్లు గతశ్రీకులై దుఃఖించుచుం బాదంబులపై బడియున్న యింద్రాదులం గని భగవం
తుం డగు కృష్ణుండు వెఱువకుండని చెప్పి బ్రహ్మ మొగంబు సూచి యిట్లనియె. ౧౨౬౬

క. భీతిల్లెద రేటికి మీ । రీతిరున మీకు మరల నిచ్చెద లక్ష్మిన్
బ్రీతినయిన విను వనరుహజాతా చెప్పెద నొకొండు సమయోచితమున్. ౧ ౬౮

క. నే నెపుడును మద్భక్తుల । లో నుండెద లక్ష్మితోడ లోలుడ నగుచున్
మానెద భక్తవిరోధుల । స్థానంబులు లక్ష్మి నిలువజాలునె యచటన్. ౧౨౬౮

క భూతేశుని యంశంబున । జాతుడు దుర్వాసు డతడు సరసుడు నాకుం
బ్రీతుడు నిన్ను శపించెను । నీ తప్పున విడిచినాము నేనును సిరియున్. ౧౨౬౯

క. ఎచ్చట శివపూజలు లే । వెచ్చట తులసిని భజింప రెచ్చట ద్విజులున్
మెచ్చరు భోజనములచే । నచ్చట శ్రీలక్ష్మి నిలువ దమరకులేశా । ౧౨౭౦

క. ఎచ్చట నిందింతురు నను । నెచ్చట మద్భక్తనింద లెడపక గలుగున్
సచ్చరిత దూషితులు వా । రచ్చట శ్రీలక్ష్మి నిలువ దమరపురీశా । ౧౨౭౧

క. ఎచ్చట నను బూజింపక । యెచ్చట హరివాసరమున గృతభోజనులై
విచ్చలవిడి జరియించెద । రచ్చట శ్రీలక్ష్మి నిలువ దమరపురీశా । ౧౨౭౨

క. ఎచ్చట నాపే రమ్మరు । రెచ్చట గూతుంద్ర విక్రయింతురు పెలుచన్
ఎచ్చట నతిథిభుజింపం । దచ్చట శ్రీలక్ష్మి నిలువ దమరపురీశా. ౧౨౬౩

క. ఎవ్వడు కులటకుబుత్రుం । డెవ్వడు శూద్రాన్నభోజి యెవ్వడు పతితుం
డెవ్వడు నను స్మయిరింపం । ద విప్రుని విడిచి లక్ష్మి యావల దొలగున్. ౧౨౬౪

క. శూద్రునకు సూపకారుడు । శూద్రుల సేవించువాడు శూద్రస్త్రీ కా
మోద్రేకి వృషభవాహుడు । భద్రగుణుడుగాడు లక్ష్మి బాయును వానిన్. ౧౨౬౫

తే.గీ. సూర్యు డుదయించుతరి దిండి।స్రుక్కు పగటి కూర్కు పగలింటి యంగన కూటమియును
నింద్యములు బ్రాహ్మణుడు వీని।నెఱపెనేని తోడనే లక్ష్మి వా నిల్లు తొలగిపోవు. ౧౨౬౬

వ. మరియు సదాచారహీనులును, అసచ్ఛూద్రసంపర్క సంయోగ ధర్మంబులు గలవారును, ధర్మశూన్యులును, వేదబాహ్యులును, వివిధదుర్గుణవిశిష్టులు నగు బ్రాహ్మణుల యిండ్ల లక్ష్మి నివసించదు. ఇంకను వినుము. ౧౨౬౭

క. దయలేనివారి యింటను । నయహీనుల యింట శౌచనాశుల యింటన్
నియమరహితు నింటను నా । ప్రియ యుండ దసత్యవచనభాషణు నింటన్. ౧౨౬౮

క. హరి పూజాపరు నింటను । బరశివు బూజించు నింట బరమాద్వైత
స్థిరు నింట దాత యింటను । సిరి యుండుఁ నన్నుగూడి సిద్ధము మఘవా । ౧౨౬౯

క. దేవీధ్యానము గలచో । దేవీస్తుతి గలుగుచోట దేవీచరిత
స్థావం బెచ్చట నచ్చట । శ్రీ విలసిల్లంగ నిలుచు శ్రీలక్ష్మి దయఁ. ౧౨౭౦

క. అని యిట్లు సురేంద్రునకుఁ । వనజాక్షుడు దెలిపి తనదు వక్షస్థలవా
సిని బిల్చి పాలవెల్లిం । జననంబును బొందుమనుచు జయ్యన ననిపెన్. ౧౨౭౧

క. వనజాసను గని నీవుం । బవినిను మమరాళితోడ బాలసముద్రం
బును మథియింపుడు పుట్టును । వనజాలయ యదియె సురల వర్ధిలజేయున్. ౧౨౭౨

వ. కావున మీరు వోవచ్చునని హరి యానతిచ్చిన విని సంతోషించుచుం జనిరి. నారాయణుం డంతఃపురంబు ప్రవేశించె. నంత. ౧౨౭౩

సీ. మందరాద్రిని దెచ్చి మంథానముగ జేసి వాసుకి ద్రాడుగా జేసి మఱియు
కూర్మరాజును మంచి కుదురుగా గావించి అసురుల దంభసఖ్యంబు వడసి
మథియింప మథియింప నుదధి బుట్టిన విషం బభవుండు మ్రింగె వీతభయుడగుచు
పీయూష మమరులు పీల్చిరి దాచిరి యైరావతంబును హస్తివరము

తే.గీ. వరల నుచ్చైశ్రవంబు ధన్వంతరియును । అల్ల చింతామణియు నప్సరోంగనలును
అనిమిషుల పాలబడిరి లక్ష్మిని మురారి । గైకొనియె సంపదలు గగ్గె నాకమునను. ౧౨౭౪

వ. అంత దేవతలు రాక్షసులం బారదోలి రాజ్యంబు గైకొని మహాలక్ష్మీప్రసాదమహిమంబున
రాజ్యం బేలుచుండి రని చెప్పి నారాయణుండు, నారదా! యింక నెద్ది విన నిచ్చగింతు వని
యడిగిన నారదుండు. ౧౨౮౫

## —: శ్రీ మహాలక్ష్మీపూజామంత్రాదులు :—

శా. శ్రీనారాయణపాదసేవనము లక్ష్మీదాయకం బంటి శ్రీ
ధ్యానస్తోత్రము లెట్లు చెప్పుము భవద్వాక్యామృతాసారముం
బానం బే నొనరించియున్ దనివి యెప్పాటం గనంజాల నా
నానూనవ్రతపుణ్యదానఫలసంధానంబు సేకూర్పవే. ౧౨౮౬

వ. అనిన విని నారాయణుండు. ౧౨౮౭

చ. మును విను మో మునీంద్ర సురముఖ్యుడు తీర్థమునందు స్నానమున్
బొనరిచి ధౌతవస్త్రమును బూని ఘటంబును నిల్పి విఘ్న నా
ధుని దిననాథు వహ్నిని మధుద్విషు శంకరు గౌరి భక్తితో
ననువుగ గంధ పుష్పముల నర్చనజేసి యథాక్రమంబుగన్. ౧౨౮౮

క. వనజాలయ కావాహన । మును దా గావించె నమరముఖ్యుడు బ్రహ్మన్
దన యాజకు నొనరించుక । ఘనముగ నావాహయామి కమలా మ్మనుచున్. ౧౨౮౯

సీ. తతచారుసాహస్రదళపద్మసంస్థిత శారదేందుప్రభాశాలిని పర
తప్తకాంచననిభతనుసుషమోపేత భూరిమాణిక్యవిభూషణాఢ్య
వివిధదాసీభూతవిబుధనారీగణ సకలగుణాఢ్య ప్రసన్నవదన
నిరుపమ కల్యాణి నిత్యయౌవనయుక్త సర్వసంపద్ధాత్రి సరసగాత్రి
తే.గీ. దేశకాలానవచ్ఛిన్న దేవదేవి । కన్నతల్లి నిజాశ్రితకల్పవల్లి
భవభయంబుల బోనెట్టు పాలవెల్లి । నీశ్వరిని లక్ష్మి మదిని ధ్యానింతు నిన్ను. ౧౨౯౦

సీ. నవరత్నసింహాసనం బిదే నీకిత్తు కైకొనుమా మహాకమలనిలయ
భాగీరథీజలంబు పాద్యంబు నీకిత్తు కైకొనుమమ్మ గోలోకనిలయ
అమలజాహ్నవితోయ మర్ఘ్యంబు నీకిత్తు చేకొనగదవమ్మ లోకమాత
వరశుభ్రకార్పాసవస్త్రద్వయం బిత్తు ధరియించుమమ్మ కందర్పజనని
తే.గీ. యజ్ఞసూత్రద్వయము ధూప మందుమమ్మ । దీపమును జూపెదను మహాదేవి కనుము
చందన మలందుమా పుష్పసమితి నిడుమ । సరస నైవేద్య మిచ్చెద శక్తి కొనుమ. ౧౨౯౧

క. అన్నంబు ప్రాణరక్షక । మెన్నగ బ్రహ్మస్వరూప మిష్టము పుష్టిన్
జెన్నొందజేయుదల్లీ । యన్నము గొనుమమ్మ తుష్టి నందగదమ్మా । ౧౨౯౨

సీ. పరమాన్నమును మంచి భక్ష్యముల్ కజ్జముల్ శర్కరాన్నమ్మును సరస నిడితి
అవడలును బూరె లతిరసంబులును చిత్రాన్నంబు పెట్టితి నంతికమున
పక్వాన్నములు కొన్ని పణ్యారములు కొన్ని యారగింపుము తల్లి యాదరమున
చెఱకు బెల్లము దేనె చెలువైన పోళీలు భక్షించగదవమ్మ పరమసాధ్వి

తే.గీ. చామరముబట్టి విసరెద జల్లగాలి । ననుభవింపుము నిర్మలంబైన ముకుర
మందియిచ్చెద చూచుకొమ్మమ్మలమ్మ।యీశ్వరీ చారుతాంబూల మిదియ కొనుము. ౧౨౯౩

వ. మఱియు నాచమనంబులకును బానార్థంబును జలంబు నిచ్చెద. మంగళవాద్యంబునుం జర్పితి. పుష్పాదులం బూజించితి. నీరాజనం బిచ్చితి. మంత్రపుష్పం బిచ్చితి. ప్రదక్షిణ నమస్కారంబు జేసెద నని. ౧౨౯౪

క. తల్లీ నా పాపంబుల । నెల్లం బారంగద్రోలి యిష్టార్థంబుల్
కొల్లలుగ నిమ్మ నీవే । ముల్లోకంబులకు నాదిమూలవు లక్ష్మి । ౧౨౯౫

వ. నీవు లక్ష్మివి. నీవు మాయవు. నీవు కమలవాసినివి. నీవు దక్షసావర్ణిపూజితవు. ప్రియవ్రతోత్తాన కేదారాదులచేతను బూజింపంబడి వారలకు రాజ్యలక్ష్మిప్రద వైతివి. అని యిట్లింద్రుం డతిభక్తిపూర్వకంబుగా వ్రతం బాచరించినం దేవి రత్నమయం బయిన విమానంబున నుండి నవ్వుమొగంబుతో బ్రహ్మాదులు సేవింపుచుండ దర్శనం బిచ్చినం గవి యత్యానందంబునం బురందరుండు. ౧౨౯౬

దండకం. శ్రీమన్మహారాజరాజేశ్వరీ – సర్వలోకేశ్వరీ – సాధుభక్తౌఘసంపత్కరీ – సుందరీ – శాంకరీ – ముఖ్యసర్వామరీ – శక్తిదా – రక్తిదా – భక్తిదా – భుక్తిదా – ముక్తిదా – మంజుమంజూక్తిదా – ధ్యాసదా – నూనసమ్మానదా – మానదా – జ్ఞానదా – దీన సంతాన సౌభాగ్యదా – శత్రుషడ్వర్గసంహారిణీ – లోకసంచారిణీ – విష్ణువక్షస్థలా వాసినీ – పద్మపద్మప్రియా – పద్మమాలాప్రభాసంచయా – పద్మహస్తద్వయా – పద్మపాదద్వయా – పద్మగర్భాండ సృష్టి స్థితి హ్రాస మూలాశ్రయా – రాధికా కారకృష్ణప్రియా – తే నమో తే నమో – తే నమో యంచు బల్మారు నీకుం జొహారుల్ దగం జేతునమ్మా – చరం బీవకావే – స్థిరం బీవకావే – గుణ ద్రవ్యము న్నీవకావే – ధరాద్యూర్ధ్వలోకంబు లేదుగా – సదా యే డదోలోకముల్ – నీకు వశ్యంబులై యుండు – ముమ్మూర్తులున్నీవె కా – నీవు లేకున్ననుం బీలు వేదు – గోలోకమందున్న కృష్ణుండు నీభర్తయే కాదె వైకుంఠమందున్న విష్ణుండు నీకుం బ్రియుం డెంతగా నిన్నువర్ణింతు – నీపాదపద్మంబె నాకుగా శరణ్యంబు – నాకుగా బ్రతాపప్రభావంబులం గూర్పుమమ్మా – జయంబుగా ఘటింపంగదమ్మా – మహైశ్వర్యమిమ్మా – యిదే మ్రొక్కెదగా – మ్రొక్కెదగా – మ్రొక్కెదన్ శ్రీకరీ – భక్తరక్షాకరీ – యిందిరా – లోకమాతా యటంచుం భజింతుగా. ౧౨౯౭

క. ఈగతి నింద్రుడు గొలువగ। సాగరకన్యకయు సకలసంపదలును వే
వేగమ విబుధుల కిడి కృష్ణాగారంబునకు జనియె హరి సేవించెన్. ౧౭౯౮

తే. గీ. మనుజు డీ స్తోత్రమును శుద్ధమానసుడయి। మూడు సంధ్యల జదివిన నేడుదీవు
లేలు నైశ్వర్యమును జెందు నిది నిజంబ।టంచు నారాయణుడు జెప్పె నమరమునికి. ౧౭౯౯

క. నారాయణ నతరక్షణ। కారణకారణ పరేశ గరుడతురంగా
ధీరుడవు నీవుకావే। సారజ్ఞుడ వఖిలలోకసఖుడవు తండ్రీ। ౧౮౦౦

క. లక్ష్మీనాయక నీచే। లక్ష్మీచరితంబు వింటి లలిత కృపాస
ల్లక్ష్మింబుగల్గి నీయెడ। సూక్ష్మంబులుగావు నీ యశోమహిమంబుల్. ౧౮౦౧

క. జానుగ మరియొక్క యుపాఖ్యానము వేదోక్తనిర్మలార్థము గూఢం
బైనది నా కెరగిపుంము। నానాపుణ్యైకకారణంబును దయతోన్. ౧౮౦౨

తే.గీ. అనవుడు విని పల్కె నారాయణుండు। పెక్కులాఖ్యానములు శ్రుతివిదితములయి
యున్న వవియెల్ల నుడువంగనోపు నెవ్వ।డుండు నొక్కటి యడుగు మే నది తెలిపెద. ౧౮౦౩

క. అనవుడు విని నారదు డి। ట్లను స్వాహాదేవిచరిత మాలించెద జ
య్యాన దెల్పుమనుడు నారా। యణు డిట్టుల బలికె బద్మజాత్మజుతోడన్. ౧౮౦౪

## —: స్వాహాచరిత్రము :—

శా. ఆదిన్ సృష్టికిమున్ను దేవతలు స్వాహారార్థ మంభోరుహ
ప్రాదుర్భూత మహాసభాంతరము చేరంబోయి యా దంటకున్
వేదోక్తంబుగ మ్రొక్కి విన్నపము గావింపంగ నాతండు వే
వే దైత్యాంతకుపాదపద్మముల సేవించెన్ మహాభక్తితోన్. ౧౮౦౫

తే.గీ. యజ్ఞరూపు డగుచు హరి భగవంతుండు। స్వకలచేత నుండ జ్మోవిబుధుల
యజ్ఞకర్మలందు నల హవిర్దానంబు। సేరుగాదె దానవారులకును. ౧౮౦౬

ఉ. భక్తిని విప్రకోటులు నృపాలక వైశ్యులు నిచ్చు నా హవి
ర్భుక్తులు దేవతావతుల బొందకయుండుటజేసికాదె సం
సక్తవిషాదులై సురలు సారసగర్భుని జేరి రప్డు వే
దోక్తవిధంబునన్ విధియు నోపిక గొల్చెను గృష్ణదేవునిన్. ౧౮౦౭

చ. కొలచిన బ్రహ్మదేవునకు గూర్మిని గృష్ణుడు బల్కె నో యజా
కొలువుము శ్రద్ధతో బ్రకృతి కోరికదీరునటంచు నంతటన్
జలజభవుండు దా బ్రకృతి సర్వజగజ్జననిన్ మనంబునన్
నిలిపి సమస్తపూజల ననేకవిధంబుల జేసి మ్రొక్కినన్. ౧౮౦౮

తే.గీ. ప్రకృతి ప్రత్యక్షయై దయారసము జిల్క । వరము వేడుమనంగ నా బ్రహ్మ సూచి
స్తవము కావించి యో దేవి సప్తజిహ్వు । దాహికాశక్తి వగుమిక సాహసమున. ౧౩౦౯

క. నీపేర హవిర్దానము । నేపారగ జేయబడిన నింద్రాదులకుం
బ్రాపించు వార లది దిని । నీపై గడుభక్తి గలిగి నిలుతురు తల్లీ । ౧౩౧౦

తే.గీ. అ పవనమిత్రు సంపత్స్వరూప వగుచు । గృహిణి వగు మిక లోకైకగీతచరిత
యనపుడును బద్మజుని మాట లాలకించి । ప్రకృతిదేవి విషణ్ణయై పలికె నిట్లు. ౧౩౧౧

తే.గీ. తపముచే శుచి నయి కృష్ణు దవిలియుంటి । వాని విడచి పరుని జేరు వార్త కలయే
వినుము నే నట్లు సేయంగ వెఱతు నిపుడు।స్వామి పీడనాడ ధర్మమే కామినులకు. ౧౩౧౨

వ. నీవు జగద్విధాత యగుటయు, శంభుండు మృత్యుంజయుం డగుటయు, శేషుండు విశ్వంబు భరించుటయు, ధర్ముండు ధర్మసాక్షి యగుటయు, గణనాథుం డాద్యపూజ్యుం డగుటయు, ఋషులు పూజ్యు లగుటయు, ప్రకృతి సర్వపూజ్య యగుటయు నెవ్వని ప్రసాదంబునం గలిగె నట్లుంటచే కృష్ణుని పాదపద్మంబులు హృదయంబున నిల్పి కొల్చెద నని చెప్పి తపంబునకుం జని సేయ శృంగారవిగ్రహుండై శ్రీకృష్ణుండు పొడసూపినం గాంచి మూర్ఛాక్రాంతయై పడియున్న దేవిని లేవనెత్తి క్రోడంబున నిడికొని యూరార్చి హరి యిట్లనియె. ౧౩౧౩

తే.గీ. సగ్నజితుని సతవు సాగ్నజితి వగుచు । నాదు చారుభవమున నృతివగు
దీవు నేడు వహ్ని కింతివి గమ్ము నీ । యంశమునను బోయి యంబుజాక్షి. ౧౩౧౪

తే.గీ. నా ప్రసాదంబు గలిగె నో నాతి నీకు । నిఖిలలోకంబు పూజించు నిన్ను మిగుల
కలిత మంత్రాంగరూపవు గమ్ము వేగ । పొమ్మనుచు చనె మహాపురుషు డంత. ౧౩౧౫

తే.గీ. బ్రహ్మయానతి గైకొని పావకుండు । వెఱచుచును జేరి దేవిని వినుతి జేసి
సామవేదోక్తమైనట్టి సరణి విడక । ధ్యాన మొనరించి పాణిగ్రహణము జేసె. ౧౩౧౬

చ. అనలుడు స్వాహ కూరిమి శతాబ్దము లొక్కగతిం రమింపగా
ఘనమగు వహ్నితేజమున గర్భము దాల్చి లతాంగి కాంచె దా
తనయుల ముప్వురన్ సునయ దక్షిణవహ్ని ని గార్హపత్యవ
హ్నిని సుషమాంచితున్ గుణమణిన్ దుది నాహవనీయ పావకున్. ౧౩౧౭

చ. మునులును బ్రాహ్మణుల్ నృపులు మోదమునొందుచు నిల్చి రా హవి
స్సును దగ స్వాహ పేరు తుది జొప్పడ నంతట దేవతాతతుల్
తిని రది నాటనుండియును దేవతలెల్లరు సంతసంబునన్
మనిరి మునీంద్ర స్వాహగల మంత్రము మంత్రమునుమ్మి నేటికిన్. ౧౩౧౮

వ. మరియు స్వాహాపూజావిధానం బెట్టనిన సావధానుండవై వినుము. ధ్యానంబును, స్తోత్రంబును, బూజావిధానంబును సామవేదోక్తంబుగా సర్వయజ్ఞారంభకాలంబులందును సాలగ్రామంబుననేని, ఘటంబుననేని స్వాహం బూజించి యజ్ఞంబు సేయవలయు. లేకున్న ఫలంబు నర్థింపరు. మరియు ధ్యానంబు వినుము. ౧౩౯

క. సిద్ధను నరులకును గ్రియాసిద్ధిప్రదయైనదాని సిధ్యాకారన్
బుద్ధిదను భూతిదను పరిశుద్ధను స్వాహను దలంతు శుభసిద్ధికినై. ౧౪౦

వ. మరియు మూలమంత్రంబు ౧౪౧

క. ప్రణవంబున హ్రీంకారము । స్వనితంబగు శ్రీయు బిందు సంయుక్తములై
ప్రణుతిగతి వహ్నిజాయా । ఫణితిన్ స్వాహాపదంబు బరగు చతుర్థిన్. ౧౪౨

వ. స్వాహయు, వహ్నిప్రియయు, వహ్నిజాయయు సంతోషకారిణియు, శక్తియు, గాలదాత్రియు, బ్రజాగతియు. దహనదాపికయు, ధ్రువయు, క్షమయు, సంసారసారరూపయు, ఘోరసంసారదారిణియు, దేవజీవనరూపయు, దేవపోషణకారిణియు నను నీ పదియారు నామంబుల నెవ్వడు స్మరించు వాడు సర్వతాపంబు లడగి, సమస్త భువనఖండంబులనుండి పాసి, సర్వార్థంబు లందు నని చెప్పిన విని నారదుండు స్వధోపాఖ్యానంబు వినగోరిన నారాయణుండు దయాళుండై చెప్పదొడంగె. ౧౪౩

మ. సృజనార్థిన్ సృజియించె బ్రహ్మ పితలన్ జిత్రాకృతుల్ మీర స్త్రీ
ప్రజలుం దేజము గల్గు నల్వురను శోభామూర్తులం జేసె ద
ద్ద్విజతృట్టుచ్ఛమనార్థ మేర్పరచె శ్రాద్ధంబుం దగం దర్పణం
బజు డంచున్ నిగమంబులం దెలియు నో యజ్ఞాతభూపుత్రకా. ౧౪౪

తే.గీ. అనఘ తర్పణపర్యంతమైన స్నాన । మలర శ్రాద్ధంబు దేవార్చ యాహ్నికంబు
మూడు సంధ్యలు బ్రాహ్మణ ముఖ్యకర్మ లనుచు వేదంబు దెలిపెడి వినుము మరియు. ౧౪౫

తే.గీ. మూడు సంధ్యలు తర్పణమ్మును బలియును బ్రహ్మయజ్ఞంబు నిత్యము బ్రాహ్మణుండు
సలుపకుండిన విషహీనసర్పమంచు।బలుకుచుండును శాస్త్రంబు పరమమౌని. ౧౪౬

సీ. హరి నివేదనగాని యన్నంబు దినువాడు మరి దేవిపూజను మానువాడు
నగు గర్మలకును ననర్హుండు భస్మాంత సూతకుండును మహాసూరివంద్య
బ్రహ్మ శ్రాద్ధాదుల బరగంగ సృజియించి చనినమీదట విప్రసమితి యిచ్చు
శ్రాద్ధముల్ పితలకు రాకున్న క్షుధితులై బ్రహ్మలోకమునకు వడిగ నరిగి

తే.గీ. ఖిన్నులై మొరవెట్టిన గృపను విని సరోజగర్భుండు సృజియించె నోజ దనదు
మానసంబున నొక కన్య మానవతివి । రూప యౌవనసంపన్న బావరహిత. ౧౪౭

క. స్వధ యను పేరిడి ద్రుహిణుడు । మధురాధర నిచ్చె బితృసమాజంబునకున్
బృథివీసుర లొసగిన యా । మధురశ్రాద్ధముల బితృసమాజము గ్రోలెన్. ౧౪౮

తే.గీ. బ్రాహ్మణులకు నపుడు బ్రహ్మ దా జెప్పెను ; సౌరదానమందు స్వాహ శక్తి
పైతృకమున శక్తి స్వధయును నై యుండ్రు।యజన శక్తి దక్షిణాఖ్య యనుచు. ౧౩౨౯

వ. అంత పితృదేవతలును, మునులును- మనువులు స్వధం బూజించి పరమానంద సమేతులై స్వధాదేవీవరంబుచే బరిపూర్ణమనోరథులైరని చెప్పిన విని నారదుండు స్వధాపూజా ధ్యాన స్తోత్రాదికంబు దెలుపవే యనుడు నారాయణుండు. ౧౩౩౦

క. శరదశిత కామతిథియం । దరయ౯ మఘయందు శ్రాద్ధ మందును స్వధకుం
బరిచర్యాపూజాదుల । నురుభక్తిం జలిపి శ్రాద్ధ మొనరింప దగు౯. ౧౩౩౧

తే.గీ. స్వధను విడిచి ద్విజుడు శ్రాద్ధంబు సేసిన । ఫలము బొందలేడు తెలియు మద్ది
విధికి గన్య పూజ్య విమలాంగి గుణవతి । శ్రాద్ధఫలద పితల సతియు గాన. ౧౩౩౨

వ. స్వధాధ్యానంబు వినుము. ౧౩౩౩

తే.గీ. బ్రహ్మమానసపుత్రివి భాసురాంగి । వనవరత యౌవనాఢ్యవు నఖిలపూజ్య
వురుపితృశ్రాద్ధఫలద వహో స్వధమ్మ । తప్ప కే నిన్ను మదిలోన దలచువాడ. ౧౩౩౪

తే.గీ. కలశముననొండె శిలనొండె యలఘులీల । దేవి నావాహనము చేసి భావమలర
ధ్యానమొనరించి మూలమంత్రంబుచేత।బూజ గావింపదగు స్వయంభూతనూజ. ౧౩౩౫

తే.గీ. ప్రణవహ్రీంశ్రీలు క్లీయును బరగ బిందు । భరితములును జతుర్థ్యంత స్వధయు స్వాహ
గలసెనేనియు మూలంబు బొలుచు నద్ది।యుచ్చరింపంగవలయు ద్విజోత్తముండు. ౧౩౩౬

తే.గీ. స్వధ యనుటతోనె తీర్థసుస్నాయి యగుచు।వాజపేయఫలము బొందు వదల కొక్క-
మూడుసారులు సేయ నా భూసురునకు । వశ్యకర్తవ్య మది శ్రాద్ధఫలము నొందు. ౧౩౩౭

తే గీ. శ్రాద్ధకాలంబునను స్వధాస్తవము విన్న।శ్రాద్ధఫలమును బొందును స్వధ స్వధ స్వధ
యని త్రిసంధ్యల జపియింప నలఘుగుణసమన్వితయు సాధ్వియునునైన యాలుగల్గు. ౧౩౩౮

ఉత్సాహ. పితల ప్రాణతుల్యవమ్మ ప్రీతి జననివమ్మ నీ
వతులగుణగణాఢ్యవమ్మ యఖిలపుణ్యరూపవున్
సతతసత్యరూపవమ్మ శ్రాద్ధఫలదవమ్మ స
న్మతివి శ్రాద్ధదేవివమ్మ మంగళాంగియో స్వధా. ౧౩౩౯

ఉత్సాహ. అనఘ నీవు సృష్టిమొదల నవతరించినావుగా
ఘనలయంబునందు నీవు కానరాకయుండగా
యెనయ స్వస్తి నీవు ప్రణవ మీవు స్వాహ నీవుగా
జనని దక్షిణవును నీవు సర్వమంగళా స్వధా ; ౧౩౪౦

వ. అని యిట్లు స్తోత్రంబు సేయునది యని చెప్పి పరమేష్ఠి యావిర్భూతయైన స్వధను పితృ
దేవతలకు సమర్పించి యంతర్ధానంబు నొందినం బితృదేవతలు ప్రహర్షితు లయిరి.
మరియు, ౧౩౪౧

చ. తెలిపితి స్వాహావృత్తమును దెల్పితి నే స్వధ సచ్చరిత్రముం
దెలిపెద దక్షిణాఖ్య పరదేవి చరిత్రము సావధానతం
బొలుపుగ నాలకింపు మిక మున్ను సుశీల యనంగ గోపికా
లలన యొకర్తు గోజగతి లక్షణయుక్త వసించు బేర్మితోన్. ౧౩౪౨

చ. మనసిజుమత్తదంతి వినుమా యది చక్కదనాలదొంతి స
జ్జనగణనీయ చారుగుణజాల సుశీల సరోజపత్రలో
చన తనులిప్తచందన నిశాకరబింబసమాస్య జ్ఞాతకా
మ నయరహస్య కృష్ణునకు మానినియై విహరించుచుండగన్. ౧౩౪౩

చ. ఒక్కట రాసకేళి బరమోజ్జ్వలయై రసభావవైఖరిన్
మిక్కిలి వేడ్క నవ్వుచు దమిన్ వడి కృష్ణుని దక్షిణాంకమం
దెక్కిన రాధకున్ వెఱచి యీశుడు దా దలయెత్తకున్న రా
ధక్క యదంతయుం దెలసి యగ్గి కనుల్ కడు నెఱ్ఱజేయుచున్. ౧౩౪౪

చ. పెదవి గదల్చుచుం దనువు బిట్టు వడంకగ వచ్చుచున్న య
మ్మదవతి గాంచి యచ్చోటును మాని తిరోహితుడయ్యె గృష్ణు డం
గదను సుశీల మున్నయిన కాంతలు కంపిల కేలుమోడ్చి రా
ధ దయదలంచి ప్రోవు మిక తప్పు క్షమింపు మటంచు గోపకుల్. ౧౩౪౫

వ. సుధామాదులగు త్రిలక్షకోటులు శరణంబు వేడుచుండ ౧౩౪౬

ఉ. కాలికొలంది బారు తన కాంతుని గాంచు సుశీల జూచి రా
ధాలలనాశిరోమణి యుదగ్రరుషాభర మాపలేక యా
బాల సుశీల జూచి యిక పాదము పెట్టకు ధేనులోకమం
దో లలితాంగి యట్లయిన నొప్పుచెడం బడదౌదు వప్పుడే. ౧౩౪౭

వ. అని శపించి రాసంబున గృష్ణుండు లేమికి వగచి విరహవేదనాదోధూయమానయై క్షణంబు
యుగంబుగా గడుపుచు, ౧౩౪౮

తే.గీ. ప్రాణనాథ కృష్ణ ప్రాణాధికప్రియ । ప్రాణదేవ యెట్లు ప్రాణ మేను
నిలుపుదాన నేడు నిన్నెడబాసి యి । య్యెడల నాదు గర్వమెల్ల దూలె. ౧౩౪౯

క. పతిభాగ్యమె సతిభాగ్యము । పతిసుఖమే సతిసుఖంబు పతియే గతిగా
సతమున్ బతివిరహంబున । నతికిం బ్రతుకేల సకలసంపద లేలా. ౧౩౫౦

క. మేలైనదానిలోపల । మేలైనది వరుని పొందు మీనాక్షికి జుట్టా
లెందరున్న పెనిమిటి । బోలుదురే యెందునేని పూబోడులకున్. ౧౩౫౧

క. భరియించి భర్త యనగా । బరగును పాలించెగాదె పతి యనదగు నీ
శ్వరుడై స్వామి యనంబడు । గరముం గామంబు గూర్చి గాంతు డనబడున్. ౧౩౫౨

క. విందై ప్రీతి నొసగి చె । ప్పం దగియెం బ్రియు డనంగ బరమైశ్వర్యం
బందిచ్చి జీవితేశుడు । నాం దనరెన్ మరియు బ్రాణనాయకు డగుచున్. ౧౩౫౩

క. రతి దానంబున రమణుడు । సతికిన్ సుతలాభ మతని సంగతినికదా
శతపుత్రులైననుం భర్తృ । తులితులే యరయ గుణవతికి నెందేనిన్. ౧౩౫౪

ఉ. స్నానము తీర్థముం దపము సర్వమఖంబులు విప్రసేవయున్
దానములన్నియున్ విపుల దక్షిణలున్ వ్రతముల్ శ్రుతంబులున్
మానిత పుణ్యకర్మములు మానినికిన్ బతిపాదపద్మసే
వానిరతిన్ బదార్వదగు వంతును బోలవు ధర్మ మెంచినన్. ౧౩౫౫

క. గురువునకంటెను భూసుర । వరుకంటెను దేవుకంటె వనజేక్షణకున్
గురుతరుడుసుమ్మ ప్రాణే । శ్వరు డహహా వాని బాసి బ్రతుకం దరమే. ౧౩౫౬

శా. గోపీలక్షలు గోపకోటులు ననుం గొల్వంగ బ్రహ్మాండర
క్షాపారీణత యత్ప్రసాదమున దక్కంగొంటి దద్దేవు స
ద్వ్యాపారం సుగుణాశ్రయుం దెలియకేన న్యాయభావంబునన్
గోపింపం జనునే దురత్యయము లెందున్ స్త్రీస్వభావస్థితుల్. ౧౩౫౭

క. అని రాధిక విలపించెన్ । మనమున బ్రేమమున నాథ నాథ యికను ద
ర్శన మిమ్ము దీననై యిట । వనటం గుందెదను విరహవారిధిలోనన్. ౧౩౫౮

వ. ఇది యిట్లుండ దక్షిణాదేవి గోలోకంబును విడిచి తడవుకాలము లక్ష్మీశరీరంబునం దపం బొనరించె. నంత బృందారకులెల్లరు దుష్కరంబగు యజ్ఞంబు చేసి ఫలంబుబొందలేక విషణ్ణులై బ్రహ్మం జేరి నివేదించిన నతండు నారాయణు ధ్యానంబు జేసిన మహాలక్ష్మి నుండి వెడలించి దక్షిణ నొసంగిన దానినిం బితామహుండు యజ్ఞదేవున కిచ్చి యతనిం బూజించినం బ్రహర్షితుండై యజ్ఞదేవుండు దక్షిణాసౌందర్యంబు సూచి మూర్ఛితుండై కొండొకవడికిం దెలసి దక్షిణం బాణిగ్రహణంబు సేసె. దేవతలు యజ్ఞఫలంబు లంది రంత. ౧౩౫౯

క. జన్నంపువేల్పువెలదుల । కన్నాకగు దక్షిణన్ సుఖస్థితి గూడెన్
దిన్నగ బంద్రెండేడులు । కన్నుల విలుకాని క్రియల గడు వలపుమెయిన్. ౧౩౬౦

క. దక్షిణచూలాలై తా । నక్షయగుణు గర్మఫలసమాఖ్యుని గనియెన్
వీక్షించి యపుడు యజ్ఞుం । డక్షీణఫలంబు నిచ్చె నమరుల కెల్లన్. ౧౩౬౧

క. అది గొని దేవత లెల్లరు । త్రిదివంబున కరిగి రంత దృప్తులగుచు శ్రీ
ప్రదమగు శ్రౌతము కర్మకు । దుద దక్షిణ యిచ్చెనేని ద్రుహిణతనూజా. ౧౩౬౨

తే.గీ. ఎఱుకలేకయేని యేకతమననేని । వడిగ దక్షిణార్థ మిడక గర్మ
గడపి మీద రెండు గడియలు దడసినయేని రెట్టిధనము నియ్యవలయు. ౧౩౬౩

తే.గీ. దక్షిణార్థ మీక తా నేకరాత్రంబు । గడపెనేని నూరుబడుల సొమ్ము
మూడురాత్రు లేగ మొగి సహస్రగుణంబు । ధన మొసంగవలయు దాపసేంద్ర. ౧౩౬౪

తే.గీ. ఏడురాత్రు లరుగ నిరువేలు నెలబోవ । లక్ష యేడు మసలి లక్షశతము
నియ్యవలయు నంత కెక్కువ దడసిన । కర్మ నిష్ఫలంబుగద మునీంద్ర. ౧౩౬౫

తే.గీ. మహిని దక్షిణ యీనట్టి మనుజు డొందు బ్రాహ్మణద్రవ్యహరు డొందు పాప మవని
వాడు కర్మార్హుడును గాడు వాని లక్ష్మి । నిలువనేరదు ముట్టరు నీళ్ళు పితలు. ౧౩౬౬

తే.గీ. దక్షిణ యిడకున్న దహను డాహుతి ముట్ట । డమరు లట్టి పూజ నాదరింప
రరయ గర్మలందు నత్యంతముఖ్యంబు । దక్షిణార్థ మండ్రు తత్వవిదులు. ౧౩౬౭

క. అడిగిన దక్షిణ యివ్వక । గొడవగుడుచు నరుడు మిగుల గుంభీపాక
స్థుడగుచును లక్షయేడులు । తడవుగ యమదూత దండతాడితుడగుచున్. ౧౩౬౮

క. తరువాతను మాలండై । యెరియుచు రోగమున జిక్కి యిల నిర్ధనుడై
నెరి దక్కి క్రింద మీదన్ । బొరి నేడుతరంబులైన పురుషుల జెఱచున్. ౧౩౬౯

వ. అని యిట్లు చెప్పి మరి యెయ్యది వినవలతు వని యడిగిన నారదుండు నారాయణుం జూచి
యయ్యా దక్షిణలేనికర్మ నెవ్వ రనుభవింతురు. దక్షిణా పూజాక్రమం బెట్టిదది వివరింపవే
యనుడు నారాయణుండు. ౧౩౭౦

తే.గీ. ఇల నదక్షిణకర్మను బలి గ్రహించు । వామనుడు తొల్లి యిది కానువాయి జేసె
బలికి నదిగాన కర్మకు ఫలములే దదక్షిణంబైనచో గర్తపక్షమునకు. ౧౩౭౧

వ. మరియు నశ్రోత్రియుని శ్రాద్ధద్రవ్యంబును, శ్రద్ధలేని దానంబును, వృషలీపతియగు
విప్రుని పూజాద్రవ్యంబును, నసద్విజుని యజ్ఞంబును, నశుచి పూజయు, గురుభక్తిలేని
వాని కర్మయు బలిం జేరు. సంశయంబు లేదు. మరియు వినుము. ౧౩౭౨

తే.గీ. దక్షిణను పూజసేయుట తలచుటయును స్తవముసేయుట మొదలగు ధర్మములను
గణ్వశాఖను గనవచ్చు గాన దాని । దెలిపెదను విను మింక నో యలఘుచరిత. ౧౩౭౩

తే.గీ. తొల్లి యజ్ఞుండు దక్షిణాతోయజాక్షి జూచి మోహించినప్పుడు స్తుతి యొనర్చె
మనమునందును ధ్యానించి మహితభక్తి నతని పలుకులు వివరింతు నన్ను వినుము. ౧౩౭౪

మత్తకోకిల. నీవు గోపివి నీవు గోపుల నేత్రివౌదు దయానిధీ
నీవు రాధకు సాటిదానవు నిత్యసౌఖ్యవిధాయినీ
నీవు కృష్ణుని ముద్దరాలవు నిన్నుఁగొల్చెద మానినీ
నీవు కీర్తివహించినావు వినిర్మలమ్ముగ దక్షిణా. ౧౩౭౫

మత్తకోకిల. పుట్టినావుగ దీవు కార్తిక పూర్ణిమన్ శుభరాసమం
దెట్టివారును నిన్ను నోమెద రీప్సితంబులపంటకై
ముట్టి కొల్చెద లక్ష్మికిం గుడిమూప వీవు సుశీలవా
గట్టిదానవు నన్ను వేగమ కావరాగదె దక్షిణా. ౧౩౭౬

మత్తకోకిల. ధర్మకర్మఫలంబు లిచ్చెడి దాత్రివైతివి శంభుడుం
ఛర్మగర్భుడు దిక్కులేలెడివారు సత్ఫలదాతలే
కర్మకోటికి కర్మరూపిణి కర్మకర్తృశుభాకృతీ
శర్మదాయిని లోకపావని జ్ఞానబోధిని దక్షిణా. ౧౩౭౭

వ. అని దక్షిణాస్తోత్రంబు నెవడయేని యజ్ఞకాలంబునం బఠించిన తప్పక సర్వయజ్ఞఫలంబు
నందు. వినుము. ౧౩౭౮

మ. ధనయజ్ఞంబున భూమియజ్ఞమున బూర్తంబందు మాణిక్య కాం
చన తామ్రాది సవంబులందు వితతేచ్ఛన్ హస్తిమేధంబునం
దును గౌరీశ సురేంద్ర రుద్ర శుచి పాథోనాథ యజ్ఞంబులన్
వినుమా చెప్పెద నింకనుం దెలియగా విస్తీర్ణభావంబునన్. ౧౩౭౯

మ. అరినిర్భేదనమందు వృష్టిని సముద్యద్యోనియాగంబునన్
వర భద్రంబున బాపమోచనమునన్ వారాహిజన్నంబునన్
బరమప్రీతిని దక్షిణాస్తవము నెవ్వారల్ పఠింపంత్రు వా
రురువిఘ్నంబుల నెట్టి కర్మఫలసంయుక్తిం భజింత్రెల్లరున్. ౧౩౮౦

వ. వెండియు దక్షిణాధ్యాన స్తవ పూజాక్రమంబు లెఱింగింతు సావధానుండవై వినుమని
నారాయణుండు. ౧౩౮౧

శా. సాలగ్రామమునుంచియేని కలశస్థాపంబు గావించియే
నోలిం దక్షిణ నాదిశక్తి మది నత్యుల్లాస ముప్పొంగగా
లీలావాహము చేసి భక్తిగదముల్ చెల్వార జోడించి దే
వీ లక్ష్మి పరమేశ్వరీ యనుచు దా వేడంగ నొప్పుం గడున్. ౧౩౮౨

క. సిరి కుడిమూపున బుట్టిన । సిరి కదవే నీవు మంచిచెయువులనెల్లన్
నెరజాణవు కర్మతులకు । సిరి నొసగెద పట్టి నీకు పేసెద గొలుపుల్. ౧౩౮౩

క. వెన్నుని సతివి నీవా । వెన్నునిచే గొలువడిన వెలదివి మరియుం
జన్నముల సిద్ధి నొసగెద । వెన్నగ శుద్ధిదవు నీకు నెరగెద భక్తిన్. ౧౩౮౪

తే. గీ. ఇట్లు దక్షిణ ధ్యానించి యెసగ మూల । మంత్రమున బ్రాజ్ఞుడెనట్టి మనుజు డధిక
భక్తితో శ్రద్ధతో శుద్ధభావు డగుచు । పూజ యొనరింపగాదగు బుధవరేణ్య ! ౧౩౮౫

క. వేదోక్తమార్గ మెడపక । యా దేవికి బూజ సేయనగుజుమ్ము సదా
భేదంబు లేదు నారద । శ్రీదేవికి దక్షిణకును సిద్ధము తలపన్. ౧౩౮౬

వ. సప్రణవమగు లక్ష్మి కామ శక్తి బీజంబులు దక్షిణాసహితంబు లయి మంత్రంబు లగు. నది చతుర్థ్యంతంబు జేసి వహ్నిజాయం గలిపిన మూలమంత్రం బగు. నది సర్వత్ర పూజా విధానమంత్రం బగుచుండు. ౧౩౮౭

ఉ. జానుగ సర్వకర్మఫల సంపదలన్ దయసేయు దక్షిణా
ఖ్యానము నీకు జెప్పితిని హర్షముతో త దుదారభక్తి న
జ్ఞానము బాసి మానవుడు శాంతి వహించి సుఖంబు లందు నెం
దేని కొరంత రాదు వినుమీ యిది వ్రాసిన విన్న జెప్పినన్. ౧౩౮౮

ఉ. పుత్రులులేనివాడు గను భూరిగుణాఢ్యుల సుందరాంగులన్
క్షేత్రములేని మానవుడు జెందు బతివ్రత సుందరాంగినిం
బుత్రవతిన్ బ్రియన్ విమల బుణ్యవతిన్ గుణధన్య సత్కులన్.
జిత్రముగా నిరక్షరుడు సెందును విద్యను దీని విన్నచోన్. ౧౩౮౯

తే.గీ. భూమిలేనివాడు భూమి సంపాదించు । బంధుహానియందు బంధనమున
నాపదలను మాస మరలేక వినువాడు । సంశయంబులేక సౌఖ్య మందు. ౧౩౯౦

వ. అని యిట్లు పలికిన నారాయణువచనంబులు విని నారదుండు స్వామీ దీనశరణ్యా నీవలన నింకను దక్కిన మహాదేవతల చరిత్రంబులు వినవలతు సెప్పి మన్నించవే యనిన నతండు, ౧౩౯౧

క. ప్రకృతికి షష్ఠాంశంబై । యకలంకత నలరు షష్ఠి యాఖ్యానంబున్
బ్రకటించెద విను మది బా । లకులకు బరదేవి మంగళప్రదసుమ్మీ. ౧౩౯౨

తే.గీ. మరియు నది దేవసేననా మహిమ గాంచు । మాతృకలలోన క్రౌంచాద్రిమర్దనునకు
బ్రాణసమయైన యిల్లాలు పరమసాధ్వి । యాయు విచ్చును బాలుర నరసి ప్రోచు. ౧౩౯౩

ఉ. ధర్మునిచేత వింటి మును దద్విధమున్ విద కేను జెప్పెదన్
శర్మదమున్ బవిత్రమగు షష్ఠిచరిత్రము నాలకింపుమీ
కర్మవిమోక్షహేతువు వికారవివర్జిత మార్యగణ్యమున్
నిర్మలపుణ్యదంబు నగు నీరజగర్భతనూజ వింటివే. ౧౩౯౪

మ. ధర స్వాయంభువపుత్రుడై మునిగణేంద్రస్తుత్యుడై యోగమా
ర్గరతుండైన ప్రియవ్రతుం డకృతదారత్వంబునన్ బెక్కువ
త్సరముల్ పోనిడి బ్రహ్మయాజ్ఞవలనన్ యరాన్వితుం డయ్యెజు
మ్మరయత్నంబున నట్టులయ్యు ననపత్యుండై కడుం గుందుచున్. ౧౩౯౫

శా. భూరిప్రాభవు గశ్యపుం గొలిచినన్ బుత్రేష్టి సేయించి త
ద్వార న్మాలిని జీరి మౌని చరువున్ దా నిచ్చినన్ మెక్కి య
న్నారీరత్నము తత్క్షణంబ వడసెన్ గర్భంబు తద్వార మొ
ప్పారెం ద్వాదశదివ్యహాయనము లాపై గాంచె నప్రాణునిన్. ౧౩౯౬

తే.గీ. అన్నియవయవంబు లతిసుందరములయ్యు । దేహమందు స్వర్ణదీప్తులయ్యు
కన్నబిడ్డ జీవకళ లేనివాడౌట । నెల్లవారు సూచి యేడ్చి రపుడు. ౧౩౯౭

ఉ. తల్లియు దండ్రియున్ మిగుల తల్లడపాటున దూలి తూలి మూ
ర్ఛిల్లి యొకింతసేపటికి జేతనవృత్తి ఘటిల్ల నశ్రువుల్
వెల్లువలై తొరంగ మది వేదన జిక్కి కటుస్వరంబునన్
బెల్లుగ నేడ్చి కూలబడి బెగ్గిలి భీతిలి యెట్టకేలకున్. ౧౩౯౮

చ. నృపమణి బాలకుం గొనుచు నేగి శ్మశానము జేరి యచ్చటన్
విపినములోన జిత్తమున వేదన సైపగలేక యేడ్చుచున్
విపులతరార్తి బాలకుని వీడక స్వాసువులన్ ద్యజింపను
న్నపుడ విమాన మొక్కెడు మహావిమలంబయి సేరవచ్చినన్. ౧౩౯౯

మ. కనియెన్ దారువిమానరాజమును భూకాంతుండు సంపూర్ణయౌ
వనవిభ్రాజితశ్వేతచంపకసుమాభన్ మందహాసాంచితా
ననమాణిక్యవిభూషణాన్విత సతానందైకసంధాయినిన్
మునిసంపూజిత దివ్యదేహ గరుణామూర్తిన్ విశాలేక్షణన్. ౧౪౦౦

క. అనపత్యులకు నపత్యం । బును ప్రియులకు ప్రియల గర్మముఖ్యులకును గ
ర్మను బేదలైనవారికి । ధనము నొసంగెదను నేను ధరణీనాథా । ౧౪౦౧

చ. సుఖమును దుఃఖమున్ భయము శోకము హర్షము మంగళంబునున్
నిఖిలవిభూతు లాపదలు నిర్ధనభావము నర్థపూర్తియున్
సఖులను బంధుజాలమును శాత్రవులున్ దనుమంజిమంబు దు
ర్ముఖతయు వీని కన్నిటికి మూలము కర్మముసుమ్ము భూవరా । ౧౪౦౨

క. అని చెప్పి దేవి తన కర । మున బాలకు నెత్తి జీవమును బోసిన యం
తన నవ్వుకొనుచు నా శిశు । వనుపమతేజమున మెరయ వచ్చెరుపడుచున్. ౧౪౦౩

తే.గీ. రాజు ముదమునొంది రాజరాకేశ్వరి । యైన దేవసేన యడుగుదమ్మి
కవకు మ్రొక్కి నిలువగా జూచి దేవి బా । లుని గ్రహించి దివికి జనదలంచె. ౧౪౦౪

వ. అంత. ౧౪౦౫

తే.గీ. శుష్కకంఠోష్ఠతాలుడై చూపులందు । దైన్య మడరంగ నృపుడు స్తోత్రంబు సేయ
నలరి యద్దేవి యతనిపై నాదరమున । బలికె నొక వేదవిధి వినిర్మలహితంబు. ౧౪౦౬

క. స్వాయంభువమనుసుతుడవు । చేయింపుము నాదు పూజ చేయుము నీవున్
శ్రేయస్కర మది యట్టులు । నీ యిష్టమయేని బిడ్డని స్నీకిత్తున్. ౧౪౦౭

సీ. వెలయు సువ్రతనామ విఖ్యాతుడై గుణవంతుడై యోగసంపన్నుడగుచు
నారాయణాంశుడై భూరియశోయుక్తుడై పండితుండయి యమలుడగుచు
శతయజ్ఞకర్తయై యతిబలోపేతుడై శుభుడయి రాట్కృతస్తోత్రుడగుచు
జ్ఞాతిస్మరుండయి జ్ఞానియై సిద్ధిసంపూర్ణుడై దాతయై పుణ్యుడగుచు

తే.గీ. నలరు నిబ్బాలు డనుచు నయ్యఖిలమాత । యొసగె నృపచంద్రునకు నత డపరిమితము
దంబు నందుచు మ్రొక్కి హస్తములు సాచి । యంది వికసితముఖపద్ముడగుచు నిలువ. ౧౪౦౮

తే.గీ. దేవి దీవించి చనియెను దివికి నంత । రాజగృహమునకుం జని రాజవదన
కెల్ల వృత్తాంతమును దేవి పిల్లవాని । జేతికిచ్చిన నంది యచ్చెరువు నొంది. ౧౪౦౯

క. మేలగు దనచేతులతో । బాలుని మహితార్థచంద్రపాలుని సుగుణా
వాలుని గైకొనె నప్పుడు । మౌళిని తన మేను తానె మరచె మునీంద్రా! ౧౪౧౦

క. పుత్రోత్సవ మొనరించెను । ధాత్రీవరు డపుడు దేవి దప్పక కొలిచెన్
దత్రత్యవిప్రసువిదిత । సూత్రక్రమపక్కి మంత్రసూక్తుల ననఘా. ౧౪౧౧

మ. ప్రతిమాసంబున శుక్లపక్షమున నొప్పన్ షష్ఠి శ్రేయస్థితిన్
వితతార్చావిధులన్ నిరంతరము కావింపించె భక్తిన్ బ్రియ
వ్రతధాత్రీశుడు మానవవ్రతతిచే బ్రాల్మాల కా యేకవిం
శతి వారంబున షష్ఠవారమునసుం జల్పించె నత్తీరునన్. ౧౪౧౨

క. బాలుల యన్నప్రాశన । వేళల శుభకార్యములను వివిధగతుల శో
భాలలితులగుచు గొలిచిరి । మేలుగ శ్రీషష్ఠి జనులు మేదిని ననఘా! ౧౪౧౩

వ. షష్ఠిపూజావిధానంబును ధ్యానాదికంబును కణ్వోక్తక్రమంబునం దెలిపెద వినుము. సాల
గ్రామంబునంగాని, ఘటంబునంగాని, వటమూలంబునంగాని ప్రాజ్ఞుండగువాడు పూజించు,
నందు ధ్యానంబు వినుము. ౧౪౧౪

క. కొడుకుల నొసంగి శుభముల । బడయంగాజేయు దల్లి భగవతి గరుణా
జడనిధి మణిమయభూషిత । జెడుగుల నెడబాపు దేవసేన భజింతున్. ౧౪౧౫

సీ. అర్ఘ్యంబు పాద్యంబు నాచమనీయంబు దీపంబు గంధంబు ధూప మలర
వివిధఫలాహార వితతుల నిచ్చియు బ్రణవంబు హ్రీంకార పరకముగను
నొనర షష్ఠిదేవియును జతుర్థిని గూడి యగ్నిభార్య గలసి యమలమైన
మంత్రంబు దగినది మాటి మాటికి శక్తిని ననువుగా జపముజేసి
తే.గీ. సామవేదోక్తమైనట్టి స్తవము జేయ । వలయు నెవ్వాడు మూలంబు వదల కొక్క
లక్ష జపియించు నాతండు లలితపుత్ర । లబ్ధి వడయును విను స్తోత్రలక్షణంబు. ౧౪౧౬

సీ. సేగిబాపెడి దేవసేనకు దండంబు భద్రంబు లిచ్చు నంబకు జోహరు
వరము లొసగు దేవవందినికిని మ్రొక్కు సిరు లిడునట్టి షష్ఠికిని జోత
పుత్రదాయినియైన ధాత్రికి జేజేలు మేలొర్చు తల్లికి గేలుమోడ్పు
మాయ తానైన యమ్మకు నమస్కారంబు బాలపోషిణికిని వందనంబు
తే.గీ. శారదకు భక్తరక్షావిశారదకును । సారకును గరుణారసాసారమతికి
సిద్ధకును బూజ్యకును నిత్యశుద్ధమతికి । వేదవేద్యకు నిదె యభివాదనంబు. ౧౪౧౭

వసంతతిలక. జోహారు నీకు వరదా సురసేవ్యపాదా। జోహారు నీకు సుమతీ శుభవాగ్విభూతీ
జోహారు నీకు పరమాసురవైరిభీమా । జోహారు నీకు సుకటీ సుఖమూర్తి షష్ఠీ. ౧౪౧౮

ద్వి ప ద వృ త్త ము.

ధనమును నా కిమ్ము తనయుల నిమ్ము । మనమున నిను గొల్తు మానక షష్ఠి
మానంబు మా కిమ్ము మరి జయ మిమ్ము । మానుగా యశ మిమ్ము మహిమతో షష్ఠి
జ్ఞానమ్ము నా కిమ్ము సంపద లిమ్ము । ధ్యానంబు జేతు నే దయజూడు షష్ఠి
గానమోదిని నాకు గల్యాణ మిమ్ము । మానుగా నన్నునేమరకమ్మ షష్ఠి. ౧౪౧౯

క. ధాత్రిని మనుజుడు షష్ఠీ । స్తోత్రంబును జదివెనేని శుభగుణయుతుడౌ
పుత్రుండు గలుగు వత్సర । మాత్రం బొనరింపవలయు మానక వ్రతమున్. ౧౪౨౦

వ. మరియు గాకవంధ్యయు, మృతాపత్యయు, నొకసంవత్సరము స్తోత్రంబు పఠించెనేని షష్ఠిదేవీప్రసాదంబునం బుత్రవతి యగు. మఱియు రోగయుక్తుండైన బాలునియొద్ద దలిదండ్రు లీ స్తోత్రం బొక మాసంబు పఠించెనేని యారోగ్యంబు గలుగు నని చెప్పి నారాయణుండు. ౧౪౨౧

తే.గీ. జలజభవపుత్ర తెలిపితి షష్ఠిచరిత । మాగమోక్తంబు మంగళం బఖిలవంద్య
మనఘ మంగళమంటికాఖ్యాన మింక । వినుము దెల్పెద పూజాది విధులతోడ. ౧౪౨౨

సీ. అక్షీణకల్యాణదక్షమై భక్తకోటిని మంగళముల నింపించుకతన
మహికి బిడ్డండైన మంగళుచేత సేవిత యయి సిరులిచ్చి వెలయుకతన

మంగళచండినా షహి బేరు వహియించె మూ ర్తిభేదంబున మూలశక్తి
ప్రకృతి కృపారూప ప్రత్యక్ష సతులకు నిష్టదేవత సకలేష్టదాత్రి
తే.గీ. మున్ను శంకరుచే నది పూజ వడసె । త్రిపురవధమందు శౌరి ప్రేరేప పిదప
బ్రహ్మ యుపదేశ మొసగంగ రాక్షస ప్ర । పాతితంబైన యానంబు పడుచునుండ. ౧౪౨౩

ఉ. శంకరు డార్తుడై కొలువ చండి దయామయి యోడనేల నీ
వింక భయంబు దక్కుము మహేశ మురారి వృషస్వరూపు డా
శంక దొలంగు మేను రణశక్తినిగా నిను బట్టియుండెదన్
పంకజనేత్రదత్తశరబాధితు జేయుము దైత్యు నావుడున్. ౧౪౨౪

క. అత డట్లు సేయ త్రిపురులు । హతులయ్యెన్ విబుధులెల్ల నానందరసా
న్వితులై కురిసి రౌకమొగిన్ । మితిమీరగ విరుల వతనిమీద మునీంద్రా. ౧౪౨౫

క. హరియును సరసిజభవుడును । పరమాహ్లాదమును బొంది భాసురగతి శం
కరునిన్ నుస్నాతుంగా । బరగించిరి దేవిపూజ భక్తి నొనర్పన్. ౧౪౨౬

ఉ. మంగళచండిపూజ పురమర్దను డోర్పున జేసె నౌ మహా
భంగురలీల నర్ఘ్యమును బాద్యము నాచమనీయ వస్త్ర స
న్మంగళ దీపికా కుసుమ మాల్య సుగంధము లిచ్చి పాసెమున్
పొంగలి మేక గొఱ్ఱె యెనుబోతుల నంబకు మ్రింగబెట్టుచున్. ౧౪౨౭

ఉ. మంగళచండిపూజకును మాధవు డెంతయు నాత్మలోపలం
బొంగుచు గీత వాద్యముల భూరిమహోత్సవకీర్తనాదికో
త్తుంగరవంబులన్ వివిధ తూర్యనినాదములన్ నభంబు మ్రో
యంగ నటించె నోలి నమృతాంధులు దానును గూడి వేడుకన్. ౧౪౨౮

తే.గీ. మరియు మాధ్యందినోక్తక్రమంబుమీర । ధ్యానమొనరించి మూలమంత్రంబుచేత
ద్రవ్యములనెల్ల యర్పించి భవ్యనీల। స్తవము గావించె సంతోషసహితు డగుచు. ౧౪౨౯

తే.గీ. ప్రణవ హ్రీంకారములు లచ్చిపలుకు కామబీజమును సర్వపూజ్యను బేర్చు దేవి
పదము మంగళచండిక నొదవనిల్చి।యొనర హూంహూంపటుస్వాహ యనగవలయు. ౧౪౩౦

వ. దశలక్ష జపంబువలన మంత్రశుద్ధి యగు. ధ్యానంబు వక్కాణింతు వినుము. ౧౪౩౧

సీ. అనయంబు నవయౌవనాన్వితయగు దాని పదియునారేడుల బాలవోలె
లలిత శరత్పద్మకలిత వక్త్రముదాని నొరపు ముత్తెంపు పల్వరుసదాని
దొండపండు మెరుంగు దొరయు వాతెరదాని భవతమోజ్యోతియై పరగుదాని
తెల్లనంపెగవన్నె నుల్లసించెడుదాని గలువరేకులవంటి కనులదాని

తే.గీ. యఖిలజగముల తల్లియై యలరుదాని । నెల్లవిధముల కలుములు నిడెడుదాని
పరమపరిశుద్ధరూపవిస్ఫురణదాని।నమ్మ మంగళదేవి ధ్యానం బొనర్తు. ౧౪౩౨

వ. అని నారాయణుండు దేవీ స్తవనవిధంబు బ్రహ్మకిట్లని నుడువందొడంగె. ౧౪౩౩

మానినీవృత్తం. మంగళకారిని మంగళశోభిని మంగళవాసిని మంగళదా
మంగళరూపిణి మంగళభూషిణి మంగళవర్తిని మంగళజా
మంగళ మంగళ మంగళదక్ష సుమంగళపక్ష సమంగళభా
మంగళచండిక మానక నిత్యము మమ్ముల నారయుమా కృపతోఁ. ౧౪౩౪

క. అని యీగతి శంభుడు దా । మనమున నత్యంతభక్తి మంగళచండిన్
బెనుపడర నిల్పి స్తోత్రం । బును జేసి ముదంబుమీర బూజించి చనెన్. ౧౪౩౫

క. ప్రతిమంగళవారంబున । మతినిడి పూజింపవలయు మంగళచండిన్
వితతములగు సంపద లీ । ప్సితగతి బడయంగగోరు పేర్మి ధరిత్రిన్. ౧౪౩౬

తే.గీ. అంగజవిరోధి మును సర్వమంగళుండు । మంగళాంబను సేవించె మార్గ మెరిగి
దేవతలు గొల్చి రంతట ధీరవృత్తి । సర్వజనులును గొల్చిరి చండి భక్తి. ౧౪౩౭

క. అమరులు సేవించిరి మును । లమలత సేవించి రెల్ల యాశ్రమముల ని
త్యము మనువులు గొల్చిరి పూ । జ్యములగు నమ్మంగళాంబ చరణాబ్జంబున్. ౧౪౩౮

క. మంగళదేవీ స్తవము వి । నంగల చదువంగలట్టి నరులకు జగతిన్
మంగళములు సేకూరును । మంగళచండీప్రసాదమహిమము కలిమిన్. ౧౪౩౯

## —: మనసోపాఖ్యానము :—

వ. అని నారాయణుండు మనసోపాఖ్యానము వినుమని నారదున కిట్లనియె. ౧౪౪౦

క. ఆ భగవతియగు కన్నియ । శోభావతి కశ్యపునకు సుత యగు చేతో
వైభవమున జగమున మన । సాభిఖ్యానంబు గాంచె నాలింపు మునీ. ౧౪౪౧

క. పరమాత్మయైన యీశ్వరు । బొరి మనమున దలచి దలచి పొందెను మనసే
శ్వరి యను నభిధానము శ్రీ । హరికరుణావశమునం దపోధికమహిమన్. ౧౪౪౨

క. హరిగూర్చి మూడుయుగములు । పరమతపం బాచరింప భామినికి నొడల్
కర మిరిసి ముదుకదనమున్ । గొరల జరత్కారువని ముకుందుడు పిలిచెన్. ౧౪౪౩

క. గోపీసతి కోరిన వర । మా పడతి కొసంగి తాను నర్చించెఙామీ
యాపై లోకత్రితయ మ । హాపూజిత యయ్యె నలువ యర్చించె నొగిన్. ౧౪౪౪

తే.గీ. గౌరవర్ణంబుతో జగద్గౌరి యనియు । శంభునిసపర్య గావించ శైవ యనియు
విష్ణుభక్తిని గొల్చి తా వైష్ణవి యని । నాగభృతి నాగేశ్వరి నాగ జనియె. ౧౪౪౫

వ. నాగేశ్వరిని నాగభగినియు నందురు ౧౪౪౬

తే.గీ. విషము హరియించుకతమున విషహరి యని । యోగసంబంధమున సిద్ధయోగిని యని
ఘనతరంబైన జ్ఞానంబు కలిగియుంట । నమృతసంజీవని యనంగ నలరె దేవి. ౧౪౪౭

వసంతతిలక. ఆస్తీకమాత సకలార్థ వివేక విద్యా । విస్తార ధన్యగుణ విద్వరసజ్జరత్కా-
ర్వస్తోకహర్షద వరాంగి సురాధినాథ । ప్రస్తోత్రపాత్ర నిరపాయచరిత్ర యయ్యెన్. ౧౪౪౮

వ. ఇట్లు జరత్కారు వనియు, జగద్గౌరి యనియు, మనస యనియు, సిద్ధయోగిని యనియు, వైష్ణవి యనియు, నాగేశ్వరి యనియు, నాగభగిని యనియు, శైవి యనియు, విషహరి యనియు, జరత్కారుప్రియ యనియు, ఆస్తీకమాత యనియు, నమృతసంజీవని యనియు, బదిరెండు నామంబులం గొనియాడంబడు. మనసాదేవిని మనస్సుచే బూజాకాలంబున నెవ్వండు ధ్యానించి నామస్మరణంబు సేయు నట్టివానికిని వాని వంశంబులకును నాగ భయంబు మొదలగు నరిష్టంబులు లేవు; మఱియు, ౧౪౪౯

చ. మనస మనంబునం దలప మ్రానవు డుగ్రభుజంగవర్గ భీ
తిని బడ డెన్నడుం బరమతీవ్రవిషానలబాధ నెట్టెడున్
బనుపడి యొక్కలక్షను జపం బొనరించిన సిద్ధిగాంచు న
య్యనఘుడు విష్ణులోకమున హర్షముతోడ జరించు నాదటన్, ౧౪౫౦

సీ. సొంపైన తెల్లని సంపంగి క్రొవ్విరి మించు నిద్దపువన్నె మేనిదాని
వగ్నివిశుద్ధాంశుకాధాన బన్నగ యజ్ఞోపవీతిని నఖిలయోగ
విద్వర ప్రజ్ఞానవిలసిత సిద్ధసిద్ధాదిదేవత దేవి నఖిలవంద్య
సిద్ధిప్రదను మౌనిసేవిత కల్యాణగుణకదంబను ద్రయీఫణితచరిత
తే.గీ. లోకసుందరి గరుణావిలోకనాఢ్య । రమ్యగుణగణశోభిత రాజవదన
మంత్రమంత్రార్థరూపిణి మహితమూర్తి । నిత్య నిరుపమ సౌభాగ్య నే దలంతు. ౧౪౫౧

వ. అని ధ్యానించి వేదోక్తంబులగు మూలమంత్రంబులం ధూప దీప నైవేద్య గంధానులేపన పుష్పాక్షతాదు లిచ్చి పూజింపవలయు. కల్పతరువను పేరం బరగు ద్వాదశాక్షరంబై పరగు మనసా మూలమంత్రం బెద్ది యనిన. ౧౪౫౨

తే.గీ. ప్రణవశ్రీహ్రీంకారములు బిందుపరకములగు । శ్రీయు క్లీయును నైయును జేరి యొప్ప
నవల మనసాపదంబు దేవ్యైపదంబు । స్వాహతోగూడి మూలంబు వాసికెక్కు. ౧౪౫౩

తే.గీ. పంచలక్షజపంబున బరగు సిద్ధి । సిద్ధిగాంచిన మనుజుండు సిద్ధు డగును
వానికి విషంబె యమృతోపమానమగును । వాడు ధన్వంతరినిబోలు వైద్యు డగును. ౧౪౫౪

క. యమివర సంక్రాంతిని స్నా । నమయి పిదప గూఢగృహమున న్సతి నావా
హము సేసి క్రొల్చి పురి బం । చమి నైవేద్యంబు లొసగ సకలార్థదయౌ. ౧౪౫౫

వ. నారదా పూజాప్రకారంబు నుడివితి. తదుపాఖ్యానంబు సెప్పెద విను మని నారాయణుం
డిట్లనియె. ౧౪౫౬

క. మును దండశూకబాధను । మనుజులు కశ్యపుని వేడ మనసను బుట్టిం
చెను మానసమున నయ్యం । గన శంకరు భక్తి గొల్చె గైలాసమునన్. ౧౪౫౭

క. కరుణన్ శంకరు డష్టా । క్షరి యగు శ్రీకృష్ణమంత్రసారము దెలిపెన్
నిరపాయభక్తిరసకున్ । పరమతపశ్చాతురీరభసకు మనసకున్. ౧౪౫౮

శా. అ య్యష్టాక్షరి బూనియున్ మనస శర్వానుజ్ఞ దా బుష్కరం
బొయ్యం జేరి యుగత్రయంబు తప మత్యుగ్రక్రియన్ నిశ్చల
త్రయ్యంతోక్తవిధిం బొనర్చుచును సిద్ధత్వంబు పాటించిన
న్నాయంబొప్ప జరింప గృష్ణుడు కృపం దా దర్శనం బిచ్చుచున్. ౧౪౫౯

శా. బంటా మింతయులేక శౌరి మనసన్ బల్మారు పూజించి మే
ల్కాంటం జూచి వరం బొసంగెను త్రిలోకప్రార్చ్య వౌదంచు న
వ్వెంటన్ శంభుడు కోరి కొల్చెను మహావిస్ఫారసౌజన్యతన్
దంటన్ గొల్చిరి కశ్యపుండు మనువుల్ నాగంబులు న్మౌరివుల్. ౧౪౬౦

వ. మరియు జరత్కారు పూర్వవృత్తాంతం బెట్టిదనిన ౧౪౬౧

మ. కడకన్ గశ్యపు డిచ్చె నాపెను జరత్కారుండు నా నొప్పు పా
రుడు దా గైకొనె వైధసాజ్ఞ మదిలో రొచ్చింతయున్ బూన కా
బిడతో గొన్ని దినంబు లుండి యతడున్ విశ్రాంతు డయ్యెన్ దపం
బుడుగంజేసి వటద్రుమూలమున భద్రోద్యుక్తి నిద్రాళుడై. ౧౪౬౨

క. పడతుకలమిన్నతొడ దల । గడ బడక యొనర్చి కూర్కె గడజామున భా
నుడు గ్రుంకుసమయమున దన।యొడయడు మేల్కొనమి కాత్మ యయ్యలలూగన్. ౧౪౬౩

తే.గీ. ఏమిసేయుదు సంధ్యప్రొద్దితడు లేవ । దరచి లేపిన కోపించు నురక నిదుర
నడపగా దటు సేయక గెడపగాదు । గడపగా దెల్ల గర్మల గార్య మెద్ది. ౧౪౬౪

తే.గీ. ధర్మలోపంబు బ్రహ్మహత్యకు సమంబు । ఉభయసంధ్యల నిదురించు టొప్పదెందు
వందనము దీర్పనట్టిడు కుందు నశుచి । యగుచు నతనికి బ్రహ్మహత్యకు సమమగు
నట్టి పాపంబు దక్కునటంద్రు బుధులు. ౧౪౬౫

తే.గీ. ఇతడు సుఖనిద్ర నడపిన నెంతయేని , గోపగించిన నది నన్ను గొట్టుగాక
వీని వేదోక్తమునకును హాని పొసగ । కుండ జేసెదనని మది నూహజేసి. ౧౪౬౬

క. లేవయ్యా ప్రాణేశ్వర । లేవయ్యా మౌనిలోకలేఖేశ్వర సం
ధ్యావన్దన సమయం బి దు । షావరు డదె పశ్చిమంపు శైలము నెక్కెన్. ౧౪౬౭

క. అని పెనిమిటి నుద్బోధించిన నాతడు లేచి నిద్ర చెరిపితి వనుచుఁ
గను లెఱ్ఱచేసి యయ్యంగన కిట్లని పలికె గంపితాధరు డగుచుఁ. ౧౪౬౮

ఉ. ఇంపుగ నిద్రపోవు నను నేటికి లేపితి భర్త నీక్రియఁ
నొంపగ బాడియే జగతి నుగ్మలికిం బతికిఁ బ్రియంబుగా
బం బొనరించుటేకదె తపంబు వ్రతంబును దానముఁ గ్రియా
సంపదయెల్ల వ్యర్థమగు సామికి నప్రియ మాచరించినఁ. ౧౪౬౯

క. దానము తీర్థము యజ్ఞము । స్నానము నుపవాసమును నిశాకరముఖికిన్.
మానుగ బాతివ్రత్యములో నొక లక్షాంశమునకు లోబడియుండుఁ. ౧౪౭౦

తే.గీ. భర్తకు బ్రియంబు జేసిన బడతి విష్ణులోకమున కేగి సుఖియించు లోకనాథు
సమ్ముఖంబున దుష్క్రియాచరణ యగుచు నీచజన్మంబు వడయు నింతి మరి వినుము.౧౪౭౧

వ భర్తకు నప్రియంబుగా నటించిన యువతి యాచంద్రార్కంబు కుంభీపాకనరకంబు గుడిచి
పిదప చండాలియై పతి పుత్ర విహీనగా బుట్టి తురటిలు నని భర్త పలికిన పలుకులు ములు
కులుగాగాడ నులికిపడి యా చిలుకలకొలికి మృదువచనంబుల నిట్లనియె. ౧౪౭౨

తే.గీ. సంధ్య లోపింపగాదు నా సామి కనుచు । నిద్రకును నేటి భంగంబు నే నొనర్చి
నీకు నప్రియ మాచరించితిని నేడు । శిక్షకును నర్హ నిష్టంబు సేయుమయ్య. ౧౪౭౩

క. అని పాదంబులపై బడి । ననబోణి గడుఁ బునఃపునారోదనముఁ
బొనరింపుచుండ సూర్యుని । గని యాతడు శాపమిడగ గడగిన నంతఁ. ౧౪౭౪

క. భగవంతుడయిన యర్కుఁడు । దగ సంధ్యనుగూడి వచ్చి తా వినయమునఁ
దగిలి యథోచితరీతిన్ । సుగుణోన్నతుడైన మౌని జూచి వచించుఁ. ౧౪౭౫

క. నే నస్తమింపబో గని । మానిని య వ్విహితకర్మ మట్టగు ననుచుఁ
నీ నిద్రకు భంగంబును । దా నొనరించు టిది సూడ ధర్మమెకాదే. ౧౪౭౬

క. కరుణామయులరు విప్రులు । తిరముగ కోపంబు నిడరు ధృతిమంతులు నే [illegible]
శరణార్థినైతి నంగన । బరికించి క్షమింపుమీ శపన మొప్పదుసూ. ౧౪౭౭

చ. అవనిసురుండు కోపము క్షణార్ధము విల్చిన నెల్ల లోకముల్
తపులబడు న్పునస్సృజన దా నొనరింపగ నేర్చు కూర్మిచేఁ. ౧౪౭౮
దివిరిన తేజ బాడబుల దేవరు లట్టిరుకారు కావునఁ
వివిధపథమ్ములందు ధరణీసురదేవుడు కృష్ణుదేకదా. ౧౪౭౯

క. అని పలికి సూర్యు డరిగిన । ముని సంతోషించి శాపమును మానిపురా
తనమగు ప్రతిజ్ఞ కలిమిఁ । మనమున గనికరములేక మననము విడిచెఁ. ౧౪౮౦

ఆ.వె. పడతి మగడువిడువ గడునడలి యడలి। వడకి వడకి కొంత దడవునకును
దుడుకు మాని పల్కె పడతి యొడయని గశ్యపుని భక్తితోడ నాత్మ దలప. ౧౪౮౧

వ. అంత శంభుండును, విధాతయు, గశ్యపుండును, జరత్కారుసమీపంబునం బొడకట్టుడుం గాంచి వినయవిభ్రమంబు లడర వారికి నమస్కరించి జరత్కారుం డిట్లనియె. ౧౪౮౨

ఉ. మీరు మహాభానువులగు మేటుల రిచ్చటి కేలవచ్చిరో
కారణము న్వచింపు డనగా సలుమోములదంట యో జర
త్కారు మునీంద్ర తోచితివి ధర్మసతిన్ గుణధన్య సాధ్వి నీ
నేరుపు ధర్మశాస్త్రముల నీ కొకకొంత కొరంత జిక్కెనే. ౧౪౮౩

ఆ.వె. ధర్మపాలనంబు దక్కనే పుత్రుడుత్పత్తిగాకయున్న బరమనీతి
మంతుడైన గృహి సమంజసాపత్యంబు। నిడక ధర్మపత్ని విడువరాదు. ౧౪౮౪

క. అది గావున నీ సతికిన్। సదపత్యము నిచ్చి పిదప జక్క విడువుమీ
సదమలమగు ధర్మము నీ కొదవున్ మునిలోకచంద్ర యురుగుణసాంద్రా। ౧౪౮౫

క. పడతి కడుపునను గొడుకున్। బడయకయ కడున్ విరాగమానసుడై తా
విడుచు నెవ డతని పుణ్యము। చెడు జల్లెడనిడిన నీళ్ళచెలువున దపసీ. ౧౪౮౬

వ. అనుడు న వ్వనజగర్భుని వచనంబు విని జరత్కారుండు సమంత్రయోజనంబుగ నాభిస్పర్శంబు చేసి యో యువతీ జితేంద్రియవ్రతపరుండును, ధర్మశీలుండును. బ్రాహ్మణాగ్రణియు, దేజస్వియు, దపస్వియు, యశస్వియు, గుణోపేతుండును, వేదవేత్తయు, జ్ఞానియు, యోగియు, విష్ణుభక్తుండును, గులోద్ధారకుండును, జన్మమాత్ర సంతుష్టపితృదేవుండును నగు పుత్రుండు నీ గర్భంబున నుదయింపంగలవాడు. మరియు వినుము. ౧౪౮౭

సీ. విష్ణుభక్తుని గన్న పెండ్లామె పెండ్లాము అనిరుద్ధు కృప గోరు జనని జనని
ప్రద్యుమ్ను గీర్తించు బంధువే బంధువు శౌరినామము నేర్చు సఖుడె సఖుడు
సంకర్షణు జపించు జనకుండె జనకుండు హరిమంత్ర మిచ్చిన గురుడె గురుడు
చక్రధారిని గొల్చు సహజుడే సహజుండు పద్మాక్షు స్మరియించు భగిని భగిని
తే.గీ. యాసరోజాసనస్తంబకాంత మైన। యీ చరాచరవిశ్వంబు నెల్ల నెవ్వ
డలర బుట్టించు గిట్టించు నట్టివాని। గోపకాగ్రణి సేవించు కొడుకె కొడుకు. ౧౪౮౮

క. నారాయణ చరణాబ్జసమారాధన గరపజాలనట్టిడు గురుడా
వైరులకంటెను గడు నపకారి యనుచు నెన్నవలయుగాదె వరాంగీ. ౧౪౮౯

క. కావున శ్రీకృష్ణుని పదసేవ యొనర్పు మది నీకు క్షేమము నొసగున్
నీ వఖిలతత్వవేదినివై వెలయుదు వేయునేల యమృతాంశుముఖీ. ౧౪౯౦

క. చలమున నే నిను విడిచితి । లలనా మన్నించు నిర్మలంబగు క్షమయే
కలిగించు సత్వ మంతట । వెలయుం గ్రోధోపశాంతి వెలదుక వినుమా. ౧౪౯౧

క. నే దపమున కేగెద దామోదరచరణములు నమ్మి యోగి నగుచు నో
పైదలి నే జెప్పినయవి । కాదన కిక బో యథాసుఖమ్ముగ నెందే. ౧౪౯౨

క. అనవుడును బాష్పపూరిత । సునయనయై మనస మిగుల శోకించి యయో
నను విడనాడందగునే । మనమున దయలేక లోకమాన్యచరిత్రా. ౧౪౯౩

క. ఎప్పుడు నే నిను వేడిన । నప్పుడు న న్నాదరించి యలరించెదు నే
నిప్పుడు విను విడనాడిన । నిప్పులలో నురుకుటే మునిజనప్రవరా. ౧౪౯౪

క. చుట్టములను విడనాడుట । బిట్టారట మంతకంటె బెడద యరయగఁ
బట్టిని విడచుట తాలింగట్టిన । ప్రాణేశు బాసినను మృతియకదా. ౧౪౯౫

క. సుతు లొక్కనూర్వురైనం । బతితో సరిరారు ధర్మపాలినికి బతి
వ్రతకు బ్రియుండే ప్రియతము । డితరంబులు కావు నమ్ము మిది ప్రాణేశా. ౧౪౯౬

వ. మఱియు గుటుంబి కపత్యంబునందును, వైష్ణవునకు హరియందును, ఏకాక్షునకు నయ
నంబునందును, పిపాసునకు జలంబునందును, బుభుక్షునకు అన్నంబునందును, కాముకునకు
కామినీయోగంబునందును, చోరునకు బరపదార్థగ్రహణంబునందును, గులటకు జారునం
దును, విద్వాంసునకు శాస్త్రంబునందును, వణిక్కునకు వాణిజ్యమునందును నెట్లట్లు సాధ్వి
యగు నంగనకుం బ్రాణవల్లభునందు చిత్తంబు హత్తియుండునని పల్కి కన్నీరు మున్నీ
రుగా వగచుచు దన స్వామిపాదంబులపై వ్రాలినం గరుణంబు వొడమి జరణంబులనుండి
యరుణాధరను లేవనెత్తి క్రోడంబున నిడికొని నేత్రజలంబులం దడిపి కొండొకవడి
సుఖింపంజేసిన భగవదనుగ్రహంబున నిర్మల జ్ఞానంబు వొడమి వా రిరువురు విశోకులై
రాదట. ౧౪౯౭

తే.గీ. తరుణి నూరడబల్కి య । త్తపసి పరమపురుషు గోవిందు దలచుచు బూర్ణ నిష్ఠ
దపము గావింప జనియె న । త్తరుణి గర్భవతి శివాలయమున కేగె ద్వరితగతిని. ౧౪౯౮

క. కైలాసంబున శంభుని । లీలావతి గౌరి తపసిలేమకు వగపుఁ
దూలించి కూర్మిబిడ్డం । బోలెను లాలించి నిలిపి పోషించె గడుఁ. ౧౪౯౯

వ. అంత నొక్కనాడు. ౧౫౦౦

క. చూలాలికిని శుభగ్రహ । శాలియయిన లగ్నమందు జననం బందెఁ
బాలుడు సద్గుణశీలుడు । బాలెంతతనమ్ము పొసగె భామామణికిఁ. ౧౫౦౧

తే.గీ. పుణ్యవతియైన గౌరమ్మ పురుడునోసె । బురిటినాళ్లెల్ల గడిపి య ప్పువ్వుబోణి
చంద్రు డుదయించి యెక్కుచో జారుదీప్తి । పొనరు దూరుపుదిక్కునుబోలి వెలిగె. ౧౫౦౨

తే.గీ. గర్భమున నున్న యప్పుడే కందునకును । జ్ఞానమార్గము గరపెను గరళగళుడు
కడుపువెడలినపిదప సత్క్రమముగాగ । జాతకర్మాదు లొనరించె జయయటంచు. ౧౫౦౩

క. వేదములను జదివించెను । సాధులనుం బూజసేసె సకలార్థములన్
బీదలకు దానమిచ్చెను । సాదరముగ శివునివంటి సరసుఁడు గలడే. ౧౫౦౪

క. మణిరత్నకిరీటాదుల । నణిమాద్యైశ్వర్యయుక్తుఁ డా శంభుండు బ్రా
హ్మణకోటి కిచ్చె మునికుల । మణి యగు నీ బిడ్డ లోకమాన్యుఁడటంచున్. ౧౫౦౫

తే.గీ. లక్షగోవుల రత్నకలాపముల న । సంఖ్యముల నిచ్చె బార్వతి క్ష్మాసురేంద్ర
ధర్మపత్నుల బిల్పించి తత్తదర్హ । రీతుల నెరింగి మనసపై ప్రీతి జేసి. ౧౫౦౬

వ. అంత క్రమక్రమంబుగా, ౧౫౦౭

తే.గీ. సత్క్రమంబుగ వేదంబు సదువనేర్చి । మొనసి మృత్యుంజయజ్ఞానమును నొసంగి
భక్తిరస్త్వాస్య యనుచును బలికెగాన । నాత డాస్తీకు డను పేర ఖ్యాతిగాంచె. ౧౫౦౮

వ. అంత నయ్యాస్తీకుండు శంకరుననుమతి గొని పుష్కరంబున నారాయణుంగూర్చి తపంబు సేయంబూని దివ్యంబులయిన త్రిలక్షవర్షంబులు తపంబు సేసి శంకరునకు నమస్కరింప మరల గైలాసంబునకు వచ్చి యచ్చట నున్న తన తల్లియగు మనస మానసం బలరింపం జేయుచు నుండి గొన్నాళ్ళకు దన జనకుండగు గశ్యపు నాశ్రమంబునకుం దన తల్లిం గొంపోవ నేగినం బరమహర్షసమేతుండై యతండు బ్రాహ్మణులకు శతలక్ష రత్నాదికంబుల నొసంగి, భోజనంబులం దృప్తులం జేసె. నిట్లుండ మనస నిజపుత్రసమేతయై చిరకాలంబు కశ్యపాశ్రంబున నుండె. మఱియు దదీయంబయిన యొక యాఖ్యానంబు కలదు. చెప్పెద వినుమని నారాయణుండు నారదునితో నిట్లనియె. ౧౫౦౯

సీ. భువి నభిమన్యుని పుత్రుండయిన పరీక్షితుఁడను రాజన్యశేఖరుండు
శృంగి నామక రసాత్రిదివేశుచే శయింపంగబడియె ము న్నేడు నాళ్ళ
గడవకయుండ దక్షకభక్షితుండవు గమ్మని యది విని య మ్మహీశు
డంగరక్షల నుపాయంబు లేర్పరచి సప్తాహంబులు ప్రమాద మంటనీక

తే.గీ. కడపుచుండంగ కదలి తక్షకుడు వచ్చు । దారి ధన్వంతరియు దాపుసేర నిర్వు
రకును సంవాద మొదవి తుదకు సమాధి దనరి మణి యిచ్చి పంపె నత్తాచువెజ్జు. ౧౫౧౦

క. అంతట దక్షకు డా నృపు । నంతికమున కేగి కరచి యసుపులు గొనియెన్
జింతం జనమేజయ భూ । కాంతుడు తత్సుతుడు పైతృకంబులు తీర్చెన్. ౧౫౧౧

క. ఆ కినుకన జనమేజయ । భూకాంతుడు సర్పయజ్ఞమును జేసిన మం
త్రాకృష్టి నగ్ని బడె నతి । లోకమహిమ దందశూకలోకము మౌనీ. ౧౫౧౨

క. తక్షకు దదలుచును సహ । స్రాక్షుని శరణంబు వేడ నది గని విప్రా
ధ్యక్షులు సతక్షకేంద్రుని । బ్రక్షయమున కుద్యమింప భయవిహ్వలుడై. ౧౩౧౩

క. సురసంఘముతో వైశమ । హరిహయు డమ్మనస జేరనరిగి వినయవి
స్ఫురణంబున గొనియాడిన । బరిపూర్ణదయారసమున బరికించి వెసన్. ౧౩౧౪

క. తన కొమరుం డాస్తీకుం । డను మునివరు ననుప నేగి యాతడు భూమీ
శుని వేడిన నత డతిభ । క్తి నహిప్రళయంబు మాని కృతకృత్యుండై. ౧౩౧౫

క. జన్నంబు గడపి దక్షిణ । లెన్నే ద్విజవరుల కొసగి యిల యేలెను మున్
మన్నెదొర మనస గొల్చెన్ । గ్రన్నన సకలోపచారకలితక్రియల౯. ౧౩౧౬

ప. ఇట్లు మనసాఖ్యానంబు దెలిపితి, నిక నేమి యడిగెద వనిన నారదుండు మహేంద్రుండు మనసం బూజించినవిధంబు నుడువవే యనుడు విని దయాపరుండగు నారాయణుం డతని కిట్లనియె. ౧౩౧౭

సీ. స్నాతుడై యాచమనము చేసి వెలిమడుంగులు గట్టి దేవిని లలిత రత్న
సింహపీఠిక నిల్పి చెలగుచు మణికలశంబులయందు గంగాంబువు లిడి
సలలితభక్తితో సంప్రదాయ మెఱింగి జలకంబులార్చి త్రయ్యలఘుమంత్ర
ముల వస్త్రయుగ్మంబు వెలయించి గంధంబు నలది యర్ఘ్యాదికంబుల నొసంగి
తే.గీ. పరమనియమంబుతో గణపతి దినేశు । వహ్ని విష్ణు శివార్యల వరుస గొల్చి
మరి దశాక్షరమగు మూలమంత్రమునను మనస జపియించె నింద్రుండు మౌనివర్య ! ౧౩౧౮

క. మద్దెలలు మ్రోగె నెల్లెడ । దిద్దిమ్మని గీతు లెసగె దీర్ఘములగుచున్
ముద్దియ లాడిరి యప్పటి । ప్రొద్దులు మంగళము లాయె భూతము లలరె౯. ౧౩౧౯

తే. గీ. బ్రహ్మ విష్ణు శివాజ్ఞ జొప్పడగ నిట్లు । మేన బులక లెసంగ ననూనభక్తి
యుక్తి ని బురందరు డమంద యోగభోగబంధురముగ బ్రహ్మానందభరితు డగుచు. ౧౩౨౦

చ. భవ్య నిరంతరాయ నిరపాయ మహోద్యమ నిత్యశుద్ధ సం
భావ్య ముకుంద పద్మజ కపర్ది దినేశ గణేశ ముఖ్య సం
సేవ్య క్షమాది సద్గుణ వశీకృతకాండకరండకాండ వా
స్తవ్య స్తుతింతు నిన్ను మనసా ఘనసాత్వికదివ్యమానసా. ౧౩౨౧

క. నాతల్లివైన యదితికి । నేతీరున భక్తియుక్తి నే నొనరింతున్
బ్రీతి నటుల నతివినయసమేతుడనై కొల్తు నిన్ను నేలిన తల్లీ. ౧౩౨౨

క. నా ప్రాణంబులు పుత్రులు । నా ప్రియసతి బంధుకోటి నానాభృత్యుల్
మీప్రాపున బ్రతికితిమ । మ్మా ప్రోవవె తల్లి కల్పమహీరుహవల్లీ. ౧౩౨౩

క. నిను గొనియాడ దరంబే । ఘనశక్తిని ప్రకృతి వఖిలకారణమౌ నీ
కనికరమువలన విభవము । గొని బ్రతికెదనమ్మ నిన్ను గొల్చెదనమ్మా. ౧౫ ౨౪

క. నీ పూజయందు బ్రీతియు । నీ పాదాబ్జముల గొలుచు నీతియు భక్తి
వ్యాపారము గల రీతియు । జేపట్టితి తక్కవేమి చెప్పుము తల్లీ । ౧౫ ౨౫

తే.గీ. వినుము నీ పూజ నిత్యంబు విబుధసేవ్యమైన లోకత్రయంబున నఖిలజనులు
నీ వ్రతం బాచరింపంగ నే నొనర్తు । దద్విధానంబు దెలిపెద దల్లి వినుము. ౧౫ ౨౬

వ. ఆషాఢ సంక్రాంతియందును, బంచమియందును నీ పూజ తప్పక యెవ డాచరించునో యతనికి నాయు రారోగ్య పుత్ర పౌత్ర ధన ధాన్యాదులు గలుగు. కీర్తిమంతుండగు. గుణవంతుం డగు. నిన్నుం గొల్చినవారికి సర్వంబు జయం బగు, నపజయంబు లేదు. నీ నామం బుచ్చరించినమాత్ర సర్వవిషంబులు నిర్విషంబులగు. నీవు కశ్యపాపత్యంబ వగుట నాకు భగిని వయ్యెదవు. అక్కా । కశ్యపుని మనంబునం బుట్టి మనస వైతివి. ఇప్పుడు సర్వజగంబులు మనసార నిన్ను గొల్చుటంబట్టి సార్థకనామధేయవు గమ్మని చెప్పి భగినిపతిం దోడ్కొని, ఇంద్రుండు సపుత్ర దార బాంధవంబుగ స్వర్గంబునకుం జనియె. మనస నిజపుత్రునితో దండ్రియగు గశ్యపుని యింట చిరకాలంబు నివాసంబు సేసె. మరియు, ౧౫ ౨౭

క. గోలోకమునుండి సురభి । యాలో గశ్యపుని యింటి కరుదెంచి దగన్
బాల పదివేల కడవల । నోలోలో యనగ స్నాన మొనరింపించెన్. ౧౫ ౨౮

ఆ.వె. సురభి మనస పూజ చొప్పడ గావించి । యేగె నంత జ్ఞాన మెల్ల సురలు
మనసవలన దెలసి మహిమ జెందిరి భక్తి । మునివరేణ్య మనస ముఖ్యగాదె. ౧౫ ౨౯

వ. అనవుడు విని నారదుండు స్వామీ । సురభ్యుపాఖ్యానంబు సెప్పవే యనిన నారాయణుండు సురభ్యుపాఖ్యానంబు సెప్పం దొడంగె. ౧౫ ౩౦

## —: సు ర భ్యు పా ఖ్యా న ము :—

క. గోవులకును నధిదేవత । గోవులకును మొట్టమొదటి గోవు తలంపన్
గోవులకు తల్లి మరియును । గోవులకు బ్రధాన సురభి గోష్ఠలి బుట్టెన్. ౧౫ ౧

ఆ.వె. మొట్టమొదటి సురభి పుట్టువు దెలిపెద । వినుము బృంద యనెడు విపినమందు
గోపికాయుతుండు కోమలాంగుడు సదా । నందమూర్తియైన సుందరుండు. ౧౫౩౨

క. తన ప్రేయసియగు రాధికయును దా । నును వేడ్కలలర నొగి నేకాంతం
బున గ్రీడ సలుపుచును గ్రన్నన బా । లను గ్రోల మనమునం గుతుకమిడఁగా. ౧౫౩౩

ఆ.వె. ఊద బిందు పొదుగు నొరపైన గిన్నియ । కొమ్ముదోయి గల్గి కొమరుమిగులు
చక్కనైన సురభి యొక్కటి తనదు డా । చక్కి బొడమజేసె చక్రధరుడు. ౧౫౩౪

ఆ.వె. నాణెమైన ముద్దునడకల నిట్టట్టు । లాడుకొనుచు బాల కాసగొనుచు
వేడుకలర దల్లి వెనువెంటనంటిన । దూడ నొక్కదానిగూడ జేసె. ౧౫౩౫

వ. అట్లు నిజప్రభావసంభూతయైన సురభిం గాంచి దామోదరుండు సుధాతిరిక్తంబును, జరామృత్యుహరంబును నగు దాని పాలవలన తన పిపాసం దీర్చుకొని, తత్త్రిజయానియుక్తభాండవిస్రంసనంబు పేయ నందున్న దుగ్ధంబులతో క్షీరసరోవరం బను పేర నొక కొలను గోలోకంబున వెలసె. దదనంతరం బది రాధాదేవికిని, గోపికలకును క్రీడావాపియై పరగె. దాని విస్తీర్ణంబు శతయోజన పరిమితంబు. మరియు రాధానాథుం డవ్వాపి మహారత్నఖచితసోపానశోభితంబు గావించె. మరియు నా సురభి లోమకూపంబులనుండి యనంతకోటి కామధేనువు లుదయించె. నదియె గోసృష్టికిం బ్రథమకారణం బయ్యె. నాడు నారాయణుండు ఆ సురభి నతిభక్తిం బూజించె. నంతనుండి ముల్లోకంబులవా రా సురభిం బూజించుచుండిరి. ఇట్లని స్తుతించె. ౧౫౩౬

మ. విమలాయై సతతం నమోస్తనుచు హ్రీంబీజ ప్రకృత్యై నమో
నమ యంచున్ జగదంబికేస్తు వినతానాం భాగ్యదే తే నమో
నమ యంచున్ గరుణామయే నిరుపమానందప్రదాయై చ తే
నమ యంచుం సురభి ప్రణామము మురనాథుండు జేసెన్ వెసన్. ౧౫౩౭

మత్తకోకిల. భక్తకల్పకభూరుహంబగు భాసురాంగివి రాధికా
సక్తచిత్తపు కృష్ణదేవుని సంగతిం జరియింతు వ
త్యక్తదుగ్ధపు బుద్ధిధాత్రివి ధర్మరూపిణివమ్మ వే
దోక్తరీతిని నిన్ను గొల్చెద నో సురభ్యభిధావతీ. ౧౫౩౮

మాలినీవృత్తం. ఆర్తులపాలిటి యంబవు చారుగుణాళి మదంబవు భక్తులకుం
గీర్తి నొసంగెడు కృష్ణుని చెంగట గేళి యొనర్చెదు ధేను జగ
ద్వర్తినివై నిరవద్యసుఖోన్నతి వత్సలవై మము బ్రోవుము నీ
గీర్తనజేసెద గేవలభక్తిని క్షీరము లిమ్ము కృపామయతన్. ౧౫౩౯

క. అని యీగతి హరి వేడినఁ । విని సురభి దయార్ద్రదృష్టి వీక్షించుచు ద
ర్శన మిచ్చి యింద్రు డడిగిన । యనువున వరమొసగి యరిగె నంతర్హితయై. ౧౫౪౦

వ. మరియు వేదోక్తంబగు సురభి ధ్యాన స్తోత్ర మూలమంత్రాదికంబు క్రమంబుగా వచియింతు, వినుము. ౧౫౪౧

క. పారులకు వేద్యమగు వే । మారును స్మరియింప నార్యమాన్యము మిగులం
గారియ లడంచు మంత్రం । బారక్షరముల నెసంగు నది సౌరభమై. ౧౫౪౨

తే.గీ. ప్రణవపూర్వక జేంతమై పరగు సురభి । పదముమీద నమో యని పలుక సురభి
మూలమంత్రంబు దగు నది మూల మఖిల । శోభనావాప్తికిని మునిస్తుత్యకృత్య. ౧౫౪౩

క. సిద్ధుడగు లక్షజపమున । బుద్ధిమదగ్రేసరుండు పూని సదా దా
వృద్ధిం గోరినయేనియు । ని ద్ధారుణి సురభిమంత్రమే తంత్రమగున్. ౧౫౪౪

క. లక్ష్మీరూపను మంగళ । పక్ష్మల దృక్పాతధేనువర్గప్రసువున్
లక్ష్మాంచితరూప స్వస్సు । క్ష్మ పాతాళ పూజ్య సురభి నుతింతున్. ౧౫౪౫

తే.గీ. కలశమం దొండె ధేనువుతలన యొండె । నావు గట్టెడి స్తంభంబునంద నొండె
సాలశిల నొండె శిఖి నొండె నీళ్ల నొండె।ద్విజుడు సురభిని బూజింప విజయమొందు. ౧౫౪౬

మ. విను మొక్కప్డు ముకుందు మాయవలనన్ విశ్వంబునన్ బాలులే
క నుపాత్తక్రియులై సురల్ మునులు బ్రహ్మం జేరబో బాకశా
సనుతో నాతడు మూలగోవును మహైశ్వర్యప్రదాత్రి న్మనం
బున ధ్యానింపుము మ్రొక్కు మన్న నతడున్ మోదంబునుం బొందుచున్. ౧౫౪౭

క. ఆలీల సురభి కరుణా । శాలినియై వర మొసంగ జగములనెల్లన్
బాలన్ మునిగిరి తేలిరి । యోలోయని యెల్లవారు నుల్లాసముగన్. ౧౫౪౮

ఆ. వె. పాలవలన నేయి ప్రభవించె । నిండారె నేతివలన యజ్ఞజాతి గలిగె
యజ్ఞజాతివలన నమరులు ప్రీతులై । వృష్టి నొసగి రవని వృద్ధిబొందె. ౧౫౪౯

క. జను డీ సురభిస్తోత్రం । బును జదివిన గోసమృద్ధి పుణ్యమును యశం
బును నారోగ్యము నాయువు । మునుగాగల సుఖములంది ముక్తియు గాంచున్. ౧౫౫౦

## —: రాధా దుర్గా పూజావిధానము :—

వ. అని చెప్పిన విని పరమానందభరితుండై పరమతపోవిశారదుండగు నారదుండు నిఖిల
నిగమాంతపారాయణుండగు నారాయణున కిట్లనియె ౧౫౫౧

క. ప్రకృతుల వ్యాఖ్యానంబులు । సకలంబును వింటి జన్మ సంసారనివా
రక మింతకంటె గలదే । యిక నొక్కటి వినవలంతు నెద్ది యనంగన్. ౧౫౫౨

క. శ్రుతిచోదితమగు రాధా । సతి పూజాక్రమము వినక శ్రవణద్వయి యే
వితమున నిలువగగల ద । చ్యుత సుకృతంబులను బరమసుకృతంబకదా । ౧౫౫౩

వ. అనవుడు, ౧౫౫౪

చ. క్రమమున దెల్పెదం గలహపుస్కర చారుతరంబు సారసా
రము సరసం బుదార మధురంబు శ్రుతిప్రతిపాదితంబు గూ
ఢము పరమోత్తమంబును విడంబితపుణ్యకథామయంబు శ్రీ
దము విను రాధికావ్రతవిధానము జ్ఞానము నిచ్చు నెల్లెడన్. ౧౫౫౫

వ. నారదా! వినుము. మూలప్రకృతి సంవిత్తునుండి జగత్సృష్టికాలంబున శక్తియుగంబు పుట్టె. నది ప్రాణబుద్ధ్యధిదైవతంబును, సర్వజగంబులకు నియంతయు, ప్రేరకంబుననగు. విరాడాది సమస్త చరాచరప్రపంచంబు తదధీనంబై యుండు. తత్ప్రసాదంబు లేక మోక్షంబు దుర్గమంబు. కావున శక్తిద్వయ సేవనంబు సమస్తజనులకు విధేయంబు. అందు మొదటిదియగు రాధికామంత్రంబు బ్రహ్మ ఋష్యాది సేవితంబయిన వరమమంత్రంబు. ప్రణవపూర్వక చతుర్థ్యంత రాధాపదంబుపై వహ్నిజాయం గూర్ప నగుచుండు. ఇది షడక్షరంబు. చతుర్విధ పురుషార్థసాధకంబు. మఱియు ఇది మాయాబీజాదికంబై వాంఛా చింతామణి యగు. వక్త్రకోటి సహస్రంబును, జిహ్వాకోటిసహస్రంబును గలవానికయిన నీమంత్రమాహాత్మ్యంబుం గొనియాడ నలవిగాదు. భక్తితత్పరుఁడై యాది నీమంత్రంబు శ్రీకృష్ణుండు మూలదేవిచే గోలోకంబున రాసమండలంబునుం గ్రహించె. అ య్యచ్యుతుచే విరాడ్బ్రహ్మయు, నతనివలన ధర్ముండును, ధర్మునివలన నేనును గ్రహించితిమి. నేను మంత్రంబు స్మరించుటంబట్టి ఋషినైతి. బ్రహ్మాదు లది నిత్యంబు ధ్యానింతురు. రాధార్చనంబు విడచి చేసిన కృష్ణార్చనంబు నిష్ఫలంబు. ప్రతివైష్ణవుండును రాధార్చనంబు తప్పక యొనర్పవలయు. కృష్ణుండు రాధాధీనుండు. రాధ రాసేశ్వరి. దాని విడచి కృష్ణుండు ప్రవర్తింపడు. మఱియు, ౧౩౫౬

శా. రాణం భక్తుల వాంఛితార్థఫలముల్ రాధించుటంబట్టి రా
ధానామంబుని మించె దేవి తదతీద్ధశ్రీసహాయుండనై
నే నైతిన్ ఋషి నెల్ల దేవతలు నేనే సర్వనిర్మాతవం
చానందబున గొల్తు రేమన దదీయంబైన మాహాత్మ్యమున్. ౧౩౫౭

వ. ఈ మంత్రంబునకు ఛందంబు గాయత్రి, రాధికదేవత, తారంబు బీజంబు, శక్తిబీజంబును, శక్తిమూలావృత్తిచే షడంగంబులు సేయువది. రాసనాయికయగు రాధం ధ్యానించవలయు. సామవేదోక్తంబగు దేవీధ్యానంబు నుడివెద, వినుము. ౧౩౫౮

స్రగ్విణి. మల్లికా మాలతీ మంజరీ మాలికన్
ఫుల్లపద్మాళి విస్ఫూర్ణదాస్యాలకన్
ప్రోల్లసద్భూషణీ భూతగోమేధికన్
గల్లసారాధికన్ రాధికన్ గొల్చెదన్. ౧౩౫౯

స్రగ్విణి. హావభావాది విన్యాససంశోధికన్
పావనాంఘ్రిద్వయ ప్రాప్తకృష్ణాదికన్
సేవకార్తిప్రణాశప్రభాసాధికన్
భావకారాధికన్ రాధికన్ గొల్చెదన్. ౧౩౬౦

స్రగ్విణి. సర్వపాపచ్ఛటాసత్వరోచ్చాలికన్
గర్విరక్షోవ్రజాకార నిర్మూలికన్
శర్వ వేధోముఖాశ్వాస సమ్మేళికన్
సర్వదారాధికన్ రాధికన్ గొల్చెదన్. ౧౫౬౧

సీ. ఏదేవి పదియు రెండేండ్ల దెల్లప్పుడు నేతల్లి లీలావతీతిలకయు
ఏయంబ శృంగారతోయరాసిలహరి యేయవ్వ రాసకేళీష్టచరిత
ఏయమ్మ కోటిపర్వేందుప్రతీకాశ యేసాధ్వి సుకుమారభాసురాంగి
ఏశక్తి సంతతాహీనవిద్యావతి యేయైదువ వరాభయేద్ధహస్త

తే.గీ. ఏసతీమణి మృదుమందహాసవదన । ఏజగన్మాత గోపికాబృందసేవ్య
ఏజనని శుద్ధవసనవిరాజమాన । యట్టి రాధామహాదేవి నాత్మ దలతు. ౧౫౬౨

వ. ఇట్లు ధ్యానించి బాహ్యప్రదేశంబున నొండె సాలగ్రామపుటమున నొండె అష్టదళ
యంత్రంబున నొండె దేవిని యథావిధిం బూజింపందగు. నెట్లనిన. ౧౫౬౩

తే.గీ. ప్రీతి నావాహనము సేసి పీఠ మిచ్చి । యర్ఘ్యమును బాద్యమును నిచ్చి యాచమనజ
లంబు ముమ్మా ఱొసంగి మూలంబుచేత।నవల మధుపర్కమును గోవు నలర నిచ్చి. ౧౫౬౪

తే.గీ. జలకముల నార్చి యంటి వస్త్రద్వయంబు । జందనమును దధ్యన్నంబు సకలభూష
ణములు పూవులు తులసియు క్రమముతోడ।నర్పణముసేసి యెంతేని హర్షమొప్ప. ౧౫౬౫

తే గీ. నాలుగువిదిక్కులందును నడుమ నంగ । పూజనము చేసి పరివారపూజ చేసి
యష్టదళపద్మ మొనరించి యందునుం బ్ర । దక్షిణంబుగ ముందరిదళము పూని. ౧౫౬౬

సీ. లలి దూర్పునందు మాలావతిం బూజించి దమునఃకకుభను మాధవిని గొల్చి
రహి దక్షిణంబున రత్నమాల కెరంగి రక్షోదిశను శీల బ్రస్తుతించి
పడమట శశికళన్ భక్తితో భజియించి వాతకాష్ఠను వారిజాత మ్రొక్కి
కౌబేరమునను బరావతి సేవించి దర్పకారిదెస సుందరిని దలచి

తే.గీ. బ్రహ్మముఖ్యుల మరి దిశాపాలకులను । బాహ్యమున నర్చనము చేసి పరగ శంఖ
ముఖమహాయుధములు వ్రాసి మోదమలర। సకలరాజోపచారముల్ సలుపవలయు. ౧౫౬౭

తే.గీ. అంతట సహస్రసంఖ్య జపాచరణము । సేయుచు సహస్రనామార్చ బాయ కెవ్వ
డొనర గావించు వాడు విష్ణూపమాను । డరుగు గోలోకమునకు మహామహిమను. ౧౫౬౮

క. రాధాజన్మోత్సవమును । మేధావిత నెవడు పేయు మేదిని సంప
త్సాధనుడై కార్తికశుక్లాధిపూర్ణిమను । వాడు హరితుల్యుండౌ. ౧౫౬౯

ఆ.వె. దేవి రాధ తనదు దివ్యలీలావినో । దమున నిచ్చమీర దా జనించె
భాసురముగను వృషభానునామునకు బ్రం । దావనమ్మునందు దావసేంద్ర ! ౧౫౩౦

వ. మరియు నిందుం జెప్పబడిన మంత్రములచే వర్ణసంఖ్యాది విధానంబులు చెడనీయక పుర
శ్చరణక్రియాయోగ్యంబయిన దశాంశంబు హోమంబు గావించి తిలలచే వేల్చునది.
నావుడు విని నారదుం డిట్లనియె. ౧౫౩౧

క. మాధవ దయతో జెప్పుము । సాధనమగు స్తోత్రసరణి చయ్యన నాకున్
బోధమయమై తనరెడి । రాధాదేవీప్రసాదలాభంబునకుణ్. ౧౫౩౨

వ. నావుడు నారాయణుండు. ౧౫౩౩

క. అక్షీణరాసకేళీదక్షవు । కరుణార్ణవవు సదా త్రైలోక్యా
ధ్యక్షవు కృష్ణప్రియ విక । రక్షింపుము మమ్ము వేగ రాధాదేవీ ! ౧౫౩౪

క. దేవీ జ్యేష్ఠ మహేశ్వరసేవితచరణాబ్జయుగళ శ్రీ వాణీ గౌ
రీ వినుత సత్కృధామయి । రావమ్మా మమ్ము బ్రోవ రాధాదేవీ ! ౧౫౩౫

క. నీవే సావిత్రివికద । నీవే గంగవును యమున నీవే మఱి ప
ద్మావతియును నీవేసుమి । రావమ్మా మమ్ము బ్రోవ రాధాదేవీ ! ౧౫౩౬

క. రమణీయమూర్తి మనసవు । విమలవు తులసివి సమస్తవిశ్వేశ్వరి వో
శమదమదాత్రి నమస్కృ । రము గైకొని ప్రోవుమమ్మ రాధాదేవీ , ౧౫౩౭

క. సంసారాంబుధితరణీ । హింసాదికరహిత ప్రకృతి హేమాలంకా
రాంసాదిక జగదవనరి । రంసాయుత నిన్ను దలతు రాధాదేవీ ! ౧౫౩౮

క. ఈ స్తోత్రము లభియించుట । దుస్తర మిది తెలిపితిణ్ విధూతమహాపా
పస్తోమము ముక్తిదము సమస్త । శ్రీ లిచ్చు చదివినట్టిర కనఘా ! ౧౫౩౯

క. అర్గళములేని దఘముల । మార్గంబుల బోవనీదు మఱి దుర్గ విప
ద్వర్గంబుల నడచుటచే । దుర్గాఖ్య వహించె రాధ దోయ్మునినాథా ! ౧౫౪౦

క. రాధాసేవ కనర్హం । డీ ధరణిని లేడు నమ్ము మిది నిక్కము ని
ర్బాధకము మోక్షలక్ష్మీ । సాధకము నితాంతబోధ సంయమినాథా ! ౧౫౪౧

క. కలదు నవాక్షరమంత్రము । తెలిపెద విను ముత్తమంబు దివ్యము నానా
ఫలదము దానిం దెలియక । యలతులు వేయింట ముక్తినందంగలరే ! ౧౫౪౨

వ. వాగ్భూపంబును, శంభువనితయు, గామబీజంబును, చాముండాయై పదంబును, నమః
పదంబును గూడి నవాక్షరంబగు మంత్రం బయ్యె. ఇది భక్తులపాలింటి కల్పద్రుమంబు.

దీనికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఋషులు. గాయత్ర్యుష్ణిగనుష్టుప్పులు ఛందంబులు, మహాలక్ష్మి మహాకాళీ సరస్వతులు దేవతలు, రక్తదంతికా దుర్గా శాంకరులు బీజంబులు, నందా శాకంభరులు దేవులు, ధర్మార్థకామమోక్షంబులయందు వినియోగము. ఋషులను మౌళియందును, ఛందంబుల వక్త్రంబునను, దైవంబుల హృదయంబునను, శక్తిబీజముల స్తనంబులను న్యసింపవలయు బీజత్రయంబుచేతను, బీజచతుష్కంబుచేతను, బీజద్వయంబుచేతను, సర్వంబుచేతను మంత్రాంగషట్కంబు జాతియుక్తంబు సేసి శిఖాలోచన శ్రుతి నా సానన కంఠంబుల న్యసించునది. సర్వమంత్రవర్ణంబులచే వ్యాపకంబు సేయునది. యాదట జేయందగిన ధ్యానం బెట్టిదనిన, ౧౫౮౩

సీ. ఖడ్గ చక్ర గ దాశుగ శరాస పరిఘ శూల భశుండికా శిరోలలిత శంఖ
హస్త త్రినేత్ర మహాకాళి వివిధభూషణయుతయు నసితాంజనసమేత
తత సమప్రఖ్యయు దశపాద దశముఖి కామబీజమహాప్రకాశమూర్తి
మధుకైటభాసురమర్దని కాలసంతోషితపరమేష్ఠి దురితరహిత

తే.గీ. నక్షమాలా పరశు గదాబ్జాశని । శరకుండికా శక్తి చ ర్మోరుదండ ఘంటి
కా సురాపాత్ర చక్రాసి పాశ । శూలధారిణిని రక్తవర్ణను దలతు మదిని. ౧౫౮౪

సీ. అరుణాబ్జపీఠ మాయాబీజరూపిణి మహిషరక్షోహంత్రి మహిత లక్ష్మి
హల శంఖ చక్ర ముసల శూల చాప శరాది ధారిణి కుందహాసితలసిత
శుంభవిదారిణి సుఖశాలినిని వాణి నవరూప సచ్చిదానందమూర్తి
సంయమిధ్యానగోచర నిత్య నిరుపమ పరిశుద్ధ నిఖిలైకపాలిని సతి

తే.గీ. పరమకల్యాణి నాగమపంజరస్థ శుకుని గీర్వాణి నాద్యంతశూన్య మావ్య
విష్టపత్రయధన్య సద్విద్వరేణ్య । ధన్య ముక్తివదాన్య ముక్తజనగణ్య
పుణ్యభక్తశరణ్య నే బూని గొల్తు. ౧౫౮౫

వ. మఱియు రాధాయంత్రప్రకారంబు వినుము. త్ర్యస్రంబును, షట్కోణంబును, అష్టదళంబును, చతుర్వింశతిపత్రకంబును భూగృహయుతంబును నై యుండు. సాలగ్రామంబున నొండె, యంత్రంబున నొండె, ప్రతిమయం దొండె, బాణలింగంబున నొండె, సూర్యబింబున నొండె, జయాది శక్తియుక్తంబగు పీఠంబున నొండె రాధాదేవి నుద్దేశించి యర్చింపవలయు. ౧౫౮౬

చ. వలనుగ బూర్వకోణమున వాణిని బ్రహ్మను నైరృతంబునన్
జలరుహమందిరన్ హరిని శాంకరి శంభుని వాయుదిక్కునన్

చెలగుచు నుత్తరంబునను సింహము డాకకుభఁగా మహాసురఁగా
బొలుపుగ ముందటఁగా మహిషు బూజ లొనర్తురు కోను లాటిటఁగా. ౧౫౮౩

సీ. నందజ రక్తజ సుందరియైన శాకంభరి మఱియు దుర్గయును భీమ
యారు కోణంబుల నర్చింపబడుదురు బ్రాహ్మి మాహేశి కౌమారి యవల
వైష్ణవీదేవియు వారాహియును నారసింహియు నైంద్రియు జేర నంత
చాముండయు మఱి యష్టదళపద్మంబున బూజింపఁబడుదురు భూతి దనర

తే.గీ. ఇరువదియునాల్గు దళముల గృష్ణమాయ । ధీయు నిద్రయు ఛాయయు దృష్ణ క్షుధయు
జాతి లజ్జయు శాంతియు శ్రద్ధ కీర్తి । లక్ష్మి ధృతి వృత్తి శ్రుతి స్మృతి లలిత దయయు
దుష్టి పుష్టియు మాతయు దొడరి భాతి । పూజగావింపబడుదురు పుణ్యమహిమ. ౧౫౮౮

క. భూపురములను గణేశుని । నేపారగ క్షేత్రపాలు నెసగగ వటుకుఁగా
బ్రాపగు యోగిని బూజా । వ్యాపారమునందు గొలువవలెఁజుమ్ము మునీ ! ౧౫౮౯

క. వెలపల నింద్రాది దిగీ । శుల నాయుధసంయుతులను శోభింపదగున్
తులలేని పదవి మీరగ । బొలుపుగ రాజోపచారములచే మౌనీ ! ౧౫౯౦

క. పిదప నవాక్షరమంత్రము । ముదమున జపియించి పఠనమును జేయదగుఁగా
సదమల సప్తశతస్తుతి । యిది దుర్గావ్రతము మునిజనేశ్వర వింటే. ౧౫౯౧

క. నవరాత్రంబుల రాధా । స్తవమును గావించెనేని తప్పక నరు డా
భువనేశ్వరి దయచే వై । భవపరిపూర్ణుడయి సకలభాగ్యము లందుఁగా. ౧౫౯౨

వ. మఱియు శుభాశుభంబులు కనుంగొనుటకు బాలునిచేతి కొక శలాక యిచ్చి యీ గ్రంథంబునం జొనుపం జేసి యప్పట్టు తివిచి చదివిన నందు సంభవించు వృత్తాంత భాగంబునుం బట్టి యిది మేలగు, నిది కీడగు నని సులభంబుగా దెలిసికొనందగు. నీ రాధా దుర్గా మాహాత్మ్యంబువలన సర్వదేవతలు, మనువులు, మహారాజులుం గృతకృత్యులైరని నారాయణుండు వక్కాణించె. ౧౫౯౩

## —: కృ తి ప తి సం బో ధ న ము :—

శా. ధీసంశోభిత పద్మగర్భకృత తద్ధిత్తోనతాళక్రియా
వ్యాసంగాంచిత శౌరి మర్దళకళావ్యాపారయు గ్ధాత్మజా
యా సంగీత రసానుకూల పటు సంధ్యాలాస్య సారస్వత
వ్యాసోల్లాస నట న్మహానటవరా యల్లూరి సోమేశ్వరా ! ౧౫౯౪

మాలినీ. కఠినకలుషభంగా జ్ఞానదానప్రసంగా । పఠిత నిగమసంగా పార్వతీకామితాంగా
శతహరరణరంగా చంద్రలేఖోత్తమాంగా । ఉథితరిపురణాంగాల్లూరిసోమేశలింగా । ౧౩౯

—: గద్య :—

ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసువంశ పయః పారావారరాకాసుధాకర. కామాంబా కన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరితగోత్రాలంకార, కృష్ణామండలమండనాయమా నాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీ వీరప్రతాపకోదొ్కండహంవీర రామచంద్రభూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగపరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదకనియోగ భారవ్యవహార, శ్రీవేంకటేశ్వరవరప్రసాద సంభూతకవిత్వవిద్యావిశేష, బాల్యాది రచిత త్రింశత్ప్రత్యేకగ్రంథమతిసార, విబుధజన కరుణాసంపాదితోభయభాషాపరిచితి ప్రచారనిత్య, శ్రీరామామాత్యప్రణీతంబగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణమునందు నవమస్కంధము.

సంపూర్ణము.

శ్రీ రస్తు
శ్రీ శారదాంబాయై నమః

# శ్రీ దేవీభాగవతము.

## దశమస్కంధము

శ్రీకరణ కరణ కరణా
శోకజయనిదానవర విశోభిత బలవ
చ్ఛ్రీకాంతాకాంతనుతి
స్వీకార కృపాప్రవేశ శ్రీసోమేశా । ౧

### స్వాయంభువమన్వాఖ్యాన వర్ణనము

సీ. నారాయణ ముకుంద నానాచరాచరపాలనకారణ పరమశక్తి
చరితంబు పాపనాశకమును దెల్పితి వింటి నే చెవులకు విందుగాఁగ
నా దేవి యఖిల మన్వంతరంబుల నెట్టిరూపంబుతో నుండు రూఢి నెట్టు
లుదయించు మాహాత్మ్య మొప్పారు నేరీతి నెవ్వ రెవ్వరు పూజ లిచ్చుచుండ్రు
తే.గీ. భగవతీభక్తులకు భద్రమగు చరిత్ర । మెంతవిన్నను దన్విలే దిద్దియెల్ల
దెలుపవే విందుఁ గోరికల్ దీర సకలపాతకంబులు దూరంబు పాఱిపోవ. ౨

వ. అనిన విని పరమానందకందళితహృదయారవిందుండై గరుడస్యందనుండు బ్రహ్మ
నందనుని కిట్లనియె. ౩

శా. నా నాభీకమలంబునం దజుఁడు జన్మంబందె నాతండు దా
భానూద్దీపితసత్ప్రతాపయుతునిన్ స్వాయంభువుం గాంచి నం
ద్యానించెన్ శతరూప నాతనికి నందంబొప్ప నిల్లాలుగా
ధ్యానంబుం దగఁజేసె దుగ్ధనిధిచెంతన్ వాఁడు సర్వేశ్వరిన్. ౪

మ. క్షితి నేకంబగు పాదము న్నిలిపి భక్తిం గామముం గ్రోధమున్
జితముల్ చేసి పరాంబధ్యానమున నక్షీణంబుగా సుస్థిరం

దతినైశ్చల్య మనస్సమేతుఁడయి నిత్యంబుం నిరాహారుడై
శతవర్షంబు లొగిన్ దపంబు సలిపెన్ స్వాయంభువుం డోరిమిన్. ౫

వ. ఇట్లు తపంబుసేసిన. ౬

శా. మాయాశక్తి ప్రసన్నయైనఁ గని యమ్మౌనీంద్రుఁ డో తల్లి నీ
మాయన్ లోకములెల్ల జాతములగున్ మాయంబులై పోయెడిన్
శ్రీయున్ ధీయును గాంతియున్ ధృతియు వాణీదేవియున్ గౌరియున్
నీ యంశంబులఁ బుట్టి రెన్నఁగలరే నిన్నబ్జగర్భాదులున్. ౭

వ. జగజ్జననీ ! నాకు సర్గకార్యంబునకు విఘ్నంబు రాకుండునట్లును, వాగ్భవమంత్రంబుచే సత్వరంబునఁ గార్యసిద్ధి యగునట్లును, ఈ సంవాదంబు పఠించువారలకును, వినువారలకును జ్ఞానసిద్ధియుం గర్మసిద్ధియుం బుత్రపౌత్త్రాభివృద్ధియుం గలుగునట్లును, వరంబులిమ్మని వేఁడిన విని పరాశక్తి యో మహాబాహూ ! నీవు కోరినయట్ల యగుంగాక ! వాగ్భవమంత్ర ప్రభావంబున నీకు నిష్కంటకంబగు రాజ్యంబు గలుగును. వంశకరులైన పుత్రులు గలుగుదురు. నాయందు దృఢమైన భక్తియుం గలుగు. నంతంబున భవమోక్షం బగు నని వరంబు లిచ్చి మహాదేవి యమ్మనువు చూచుచుండ వింధ్యపర్వతమునకుం జనియె. నా వింధ్యపర్వతంబు భానుమార్గంబు నడగింపం బెరుగుచు నగస్త్యమహర్షిచే రుద్ధంబయ్యె, నా పర్వతంబున నా సోదరియగు పరమేశ్వరి లోకపూజ్యయై వర్తిల్లుచుండు నని చెప్పెనని చెప్పిన విని ఋషులు సూతమహర్షి కిట్లనిరి. ౮

## వింధ్యాచలవృత్తాంతము

క. రవిమార్గనిరోధమునున్ । దివిపై వింధ్యాద్రి యెట్లు తివురుచుఁ జేసెన్
దవిలి యగస్త్యుం డేలా । కవకవ యడఁగించె నేమికతము తెలుపుమా. ౯

చ. కలఁడు మహీతలంబున జగత్ప్రథితంబగు వింధ్యపర్వతం
బలము లతావితాన మహిజాది సమేతమునుం ద్విజాళిసం
కలితము చారు నిర్ఝర క్రమ తటాకయుతంబు జంతుసం
కులవితతంబు సాధు మునికోటి సమాశ్రితమై చెలంగుచున్. ౧౦

క. అచ్చట నచ్చటఁ దిరుగుచు । వచ్చెను నారదుఁడు వింధ్య వరనగమునకున్
జెచ్చెర నది గని నగము మహోచ్చైర్గతి బూజఁ జేసె మరుభక్తిమెయిన్. ౧౧

ఆ.వె. అర్చ చేసి వింధ్యుఁ డా మౌనివరుఁ జూచి । నీదు రాకవలన నేను ధన్య
భావ మందితిని శుభంబులు చేకూరె । నాదు గృహము పావనంబు నయ్యె. ౧౨

ఉ. ఎక్కడినుండి వచ్చెదు మునీంద్ర భవచ్చలనాదిక్రియల్
నిక్కము లోకసంతతికి నిర్మలసౌఖ్యద మర్యముంబలెన్
దక్క సంచరించెద వుదారమతిన్ దెలుపంగదయ్య యీ
వాక్క యపూర్వమైన జగదున్నతవృత్తము తాల్మి నావుడున్. ౧౩

ఉ. ఓయి సువర్ణపర్వతమునుండి మదాగమనంబు చెల్లబో
వ్యాయతి యేమి చెప్ప సకలాశల నింద్ర యమాది లోకముల్
ధీయుత లోకపాలకుల దివ్యగృహంబులు నేను గాంచితిన్
హా యటనుండి యిస్సిరో తదద్భుతవైఖరు లెన్న శక్యమే ? ౧౪

వ. అని బ్రహ్మతనయుండు నిట్టూర్పు నిగుడించినం గాంచి పర్వతేంద్రుండు మునీంద్రా !
నీ వూర్చిన కారణం బేమనిన ౧౫

తే.గీ. గౌరికిని దండ్రి శివు మామగారు గాన । నడరె హిమవంతునకును బూజ్యత ధరిత్రి
పరమశివుని నివాసమై పావనమితి । నడచి కైలాసగిరి పూజ్యమయ్యె ధరణి. ౧౬

తే.గీ. కడఁగి నీలగిరీంద్రంబు గంధమాద । నంబును నిషేధమాయ్యె నానానగేంద్ర
ములును స్వస్థానములనుండి పూజ్యవృత్తిఁ । గాంచుచున్నవి యొక్కొక్క కారణమున. ౧౭

ఉ. మేరునగంబు తన్నఖిలమిత్రుఁడు సూర్యుఁడు చుట్టెడుం గదున్
నేఁడుపుమీఱ నిత్యమును నిర్ణయ మింతయుఁ దప్ప కోర్కితోఁ
దారకలుం గ్రహంబులును దానును నింతకుమించ నున్నదే
వేఱ యొకండు వైభవము విశ్వమునం దవి గర్వమొందెడిన్. ౧౮

శా. సర్వేషామహమేవవర్య యనుచున్ సర్వేషు లోకేషు నా
ఖర్వోవమత్సమ యంచుఁ గాంచనమహాగ్రావేంద్రుఁ డత్యంతమున్
గర్వంబు న్మతిఁ బూనియుండె నిదియేకా కారణం బెన్న నో
యుర్వీభృత్కులవర్య నే నిపుడు నిట్టూర్పున్ వడిం బుచ్చగన్. ౧౯

క. అవు నవును దపోబలముం । దవిలినవారలకు నట్టి ధర్మము లుండుం
దివిరి ప్రసంగవశంబున । ను వచించితిఁగాక యనుచునుం జనియె నృపా ! ౨౦

వ. ఇట్లు నారదుండు చనిన,

## : వింధ్యకృత భానుమార్గనిరోధనము :

క. ఔరా నారదుఁ డాడిన । తీరున మేరుండు పొంగి తివిరెడు వానిన్
మీఱి జయింపఁగ నా కొక । దారి గలదె యంచు మిగులఁ దటవిటపడుచున్. ౨౧

క. మేరువును గెలువకున్నను । బౌరుషమే నాకుఁ జూడు సద్యాప్తుని సం
చారంబువలన వాఁడా । తీరున నుబ్బెడిని వాని తిమ్మిరి యడఁతున్. ౨౩

ఆ.వె. నేను దివికిఁ బెరిగి నీరజాప్తునిదారి । గట్టి నిలచియున్నఁ గదలలేడు
భాస్కరుండు వాని ప్రావరణము లేక । మేరుగిరియశంబు దూరు గుహల. ౨౪

ఉ. ఎప్పుడు సూర్యపద్ధతికి నేను నిరోధము సేయువాఁడనం
చొప్పుగ నాత్మకూటముల నున్నతలీలను వృద్ధిసేయఁగా
నప్పటికిన్ రవిన్ బొదువ కంతకు నంతకు నెత్తియెత్తి యొ
క్కప్పటి కర్యమాధ్వమున కడ్డముగా గిరి వృద్ధిఁబొందినన్. ౨౫

ఉ. తూరుపునుండి లేచి యల తోయజమిత్రుని తెచ్చి తెచ్చి య
ద్దారి రథంబు బోవుటకుఁ దద్దయు నడ్డముగా శిలామయం
బూరును నాడు దోపనటులున్న ననూరుఁడు సూచి చెల్లబో
సూర యిదేమి చిత్ర మదె చూడుము దారిని బోవలే మికన్. ౨౬

ఉ. ఎక్కడిది రాళ్ళతిప్ప యిది యెన్న డెరుంగము మాయయయ్యొ నీ
చక్కటి కిద్ది యొక్కఁడు నిశాచరుఁ డెవ్వఁడొ తెచ్చియుండుబో
యక్కట గుట్టముల్ నడువ కాగె నిఁ కేమియొనర్తు నిత్తఱిన్
దక్కగ వెన్క త్రిప్పుటకుఁ దత్తడు లెక్క వి కేమిసేయుదున్. ౨౭

వ. ఆసమయంబున ౨౮

చ. పడమటిభూములందుఁ దెలవారదు తూరుపునందుఁ బ్రొద్దు దా
బొడిచి యొకింత యెక్కి యిటుబో దటుబో దొకచోట నుండె నె
ప్పుడు గనుగొన్న నొక్క తిథి పూటయు జాము ముహూర్త మొక్కటే
గడియయు నొక్కటే యగుడుఁ గర్మములెల్ల నశించె భూస్థలిన్. ౨౯

క. నెల వారము నక్షత్ర । మ్ముల తిథి యోగంబు కరణ మత్తెత్తి వడిం
దెలుఁపగలేక పురోహితుఁ । డిలు ని ల్లూరకయ తిరిగి యేగిరి భూపా । ౩౦

శా. ప్రాతస్సంధ్యలు వార్చి బ్రాహ్మణులు విభ్రాంతిం దగం జిక్కి యే
రీతిం దక్కిన సంధ్య వార్చెదము శౌరీ కృష్ణ గోవింద యం
చాతంకంబున కేడ్చి యేడ్చి యొకలా గర్ధాన్నముల్ గుడ్చి ర
య్యో తిక్కం దగఁ దీర్చువా రెవరు మా కో దేవుఁడా యం చొగిన్. ౩౧

క. అడుది వాఁకిలి దుడువదు । పాడదు మేల్కొల్పు తవదు పతితోఁ బ్రేమం
గూడదు బ్రొయిదగ్గిరనే । పీడదు కూర్చుండనెంతవింతాయె నృపా । ౩౨

వ. మఱియుం బశ్చిమదేశంబువారు, ౩౩

ఆ.వె. తెల్లవారు నింకఁ దెల్లవారునటంచుఁ । జూచి చూచి చూచి సోలి తూలి
లేచి దిక్కుచూచి వేచి వేచి విచిత్రమేమి యంచుఁ బండి రెప్పటట్టు. ౩౪

ఆ.వె. పండి మరల లేచి భామల లెమ్మన్నఁ గోడి కూయలేదు గొల్లపడుచు
చల్ల చేయలేదు చయను లేటికిఁ బోవలేదు లేవనేల లెమ్మటన్న. ౩౫

ఉ. వెండియుఁ బండి నింత యిది వింత యటంచును మేలుకాంచి యా
నిండిన చీఁకటిండ్ల బడి నీల్గుచు మూల్గుచు నావులించుచున్
వండఁగలేక మంచములఁ బండఁగలేక సమస్తకృత్యముల్
చండితనంబునం బదరిచాపలపాలయి రేమిచెప్పుదున్. ౩౬

—: ఇంద్రాదులు రుద్రుని స్తోత్రముచేయుట :—

వ. ఇట్లుండ మహేంద్రప్రముఖులగు దేవతలు బ్రహ్మకడకుం జని నివేదింప బ్రహ్మ వారలం
దోడ్కొని శంకరు నింటికిం బోయి యిట్లని స్తుతింపం దొడంగిరి. ౩౭

ఉ. దేవగణాధినాధ జగదేకకుటుంబి గిరీంద్రకన్యకా
సేవిత యష్టసిద్ధియుత సేవకపోషక చిన్మయాత్మ వి
ద్యావిశదాకృతీ వృషహయా రజతాద్రినివాస దేవతా
దేవ మహామనూ గణపతీ యభవా శుభవైభవా హరా । ౩౮

మ. గిరిజా భూతివిభూ స్వభూ వినుత యక్షీణాంగశృంగార భా
స్వరతేజోనిధి యోగమార్గఫలదా సర్వాత్మకా దైత్యసం
హర దీనార్తిహరా మహావృషభవాహా కాలకాలా మనో
హర వాగ్గుంభణ నీకు మ్రొక్కెదము దేవా । మమ్ముఁ బ్రోవంగదే. ౩౯

క. అని యిట్లు దేవతాతతి । వినయంబున వేఁడ నవ్వి విబుధవరులు మీ
రొనరించిన స్తవములకుం । దనివొందితి మీఁదు వాంఛితం బేమి యనన్. ౪౦

తే.గీ. దేవదేవ మహాదేవ త్రిపురవైరి । నుడువఁజాలము మా గోడు బెడిదమయ్య
నావు లావులు పోరాడి కావరమునఁ । బ్రేళ్ళఁ ద్రొక్కెను దూడలకాళ్ళ గిరిశ । ౪౧

క. మేరువుపై వైరంబును । మీఱంగాఁ జేసి వింధ్యపృథివీధర మా
సూరునకు నడ్డమాయెను । దారిం బోలేక యతఁడు తటువిటఁ జిక్కెన్. ౪౨

క. కాలజ్ఞానంబులు మా । కేలీలం గలుగుఁ గర్మ లెట్లు జరుగు నే
వేళం జూచిన నొకటే । వేళాయెను వెళ్లె స్వాహా వెళ్లెను స్వధయున్. ౪౩

## —: రుద్రాదికృత విష్ణుస్తుతి :—

వ. అనిన నాకర్ణించి శంభుండు మనము వైకుంఠంబునకుం బోయి నారాయణునితో నాలోచింత
మని వారలం దోడ్కొని హరిమందిరంబునకుం జని నమస్కరించి స్తుతించె. నెట్లనిన ౪౪

## —: దశావతార స్తుతి :—

మ. శ్రుతిపాటచ్చరపాటనోచ్చలనసంక్షోభా ర్తవేధోండసం
తతిసమ్యక్కరణానుకూల జలమధ్యప్రభ్రమాచ్ఛచ్ఛదా
గతి ఖేదాయత పుచ్ఛ వేదచయసంగ్రాహైకదక్షోరుప
త్ప్లుతివిస్తార తురంగచారుగళవిస్ఫోటోగ్ర మత్స్యాకృతీ ! ౪౫

మ. తత మంధానగిరీంద్ర దేవదనుజోద్యద్ధస్తసంచాలనా
కృతసంఘట్టమహావ్యధాసహనభూరిక్షామ్యవత్కర్పరా
యతసర్వాంగ కఠోరతాకలిత హృద్యత్తీరపాథోధిసం
ప్లుతచంచన్నవనీతలేపవిలసద్భూర్యాభకూర్మాకృతీ ! ౪౬

శా. అత్యుగ్రోరు హిరణ్యనేత్ర కరపీడాయత్తసర్వంసహా
సత్యుచ్చైరవదీనతాపహరదీక్షావేక్షణప్రక్రియా
ప్రత్యాలీఢదృగుజ్జ్వలజ్జ్వలనదంష్ట్రాక్రూరదంభోళివి
స్ఫూత్యామర్దితతత్పురారితను పృథ్వీభృత్క కోలాకృతీ ! ౪౭

శా. విభ్రాజద్ధరిభక్తియుక్త సుగుణావిర్భూతిమద్బాలకా
దభ్రోక్తిక్రమసత్యతా ప్రకటనార్థప్రీతి తస్సంగృహీ
తాభ్రచ్ఛేది సటానిలోగ్రనఖదాత్రాద్రిక్రియాజృంభణ
ప్రభ్రష్టప్రబలుద్ధిరణ్యకశిపుప్రాణా నృసింహాకృతీ ! ౪౮

మ నిఖిలాస్వప్ననిషూదనైకకృతి నిర్ణిద్రప్రభావాఢ్య భూ
రిఖరాంశూరువిభావిభావిత బలిశ్రీసంగ్రహేచ్ఛావిశో
భ్యఖిలాక్రాంతి సమర్థయాచనకలీలాయత్తఖర్వాంగతో
న్ముఖ మాయావటురూప నిశ్చలగుణా మోదాత్మకా వామనా ! ౪౯

మ. అతులోదారకఠోరభీషణకుఠారాభోగధారాపరా
జిత సప్తత్రికవార భూదివిజరాజిద్వేషి దుష్టావనీ
పతిసంఘాత మహామహోవిపులదీపవ్యాపితద్వీపకా
యతనోద్దామయశోలతాధవళితాశా జామదగ్న్యాకృతీ ! ౫౦

మ. యమి యజ్ఞావన జానకీగ్రహణ వన్యావాస సుగ్రీవసం
గమ వాలివ్యధ నాబ్ధిబంధన మహాశత్రుప్రాణసంహార భీ
మ మరుద్ద్విజజిదాది నిర్మథన కుంభశ్రుకుంభకర్ణాంత పం
క్తిముఖత్రాణవినాశకృత్తదనుసూతిత్రాత రామాకృతీ ! ౫౧

మ. హలధారోద్ధృతహస్తినాపుర మహావ్యాపార సూర్యాత్మజా
జలసంభేదన రేవతీభరణ రాజద్వారుణీమోహన
చ్ఛలవిన్యాసచరత్ప్రలంబమథనాంచ త్కామసంవర్ధనో
జ్జ్వల విఖ్యావిజయాదిశోభిత మహాభా రౌహిణేయాకృతీ ! ౫౨

మ. అమలానందరసైకహేతు శమనిర్వ్యాజోపకారక్రియా
క్రమ కారుణ్యరసప్రధానకృతి యాగప్రోక్తహింసాంతకృత్
ప్రమితాచారధురీణ సిద్ధగణసంభావ్యానువాదానువా
దమహాయుక్తివచోనిగుంభ సరసార్థస్తోమ బుద్ధాకృతీ ! ౫౩

మ. యవనమ్లేచ్ఛపుళిందహూణశకదుష్టాధీశపీడామహా
హవదుర్భిక్షమసూచికాదిచటుల వ్యాధిశ్రమక్రాంతహీ
నవరాచారవిహీనవిప్రగణనింద్యక్షత్రియోర్వంశ్రిసం
భవభారాసహనోర్వరావనకళాపారీణ కల్క్యాకృతీ ! ౫౪

వ. అని యిట్లు ప్రార్థించినం గాంచి కరుణాకలితదృష్టియై భగవంతుండయిన నారాయ
ణుండు, ౫౫

క. నను బ్రార్థించినవారల । కును భయమెయ్యది వినుండు కోరికయెద్దో
వినిపింపుడు నావుడు సుర । లనుపమ వినయాదిగుణసమన్వితులగుచున్. ౫౬

తే.గీ. అర్యమునిమార్గమును వింధ్యుఁ డడ్డగించె । భోగములు పోయెఁ కర్మలు బొత్తిగా న
శించెఁ గాలంబు దెలియక చిక్కు లొదవె । నేమిసేయుదుమయ్య మా కేది దిక్కు ? ౫౭

వ. అనిన విని నారాయణుండు, ౫౮

తే.గీ. పరమకళ్యాణిఁ డై త్రిలోక్యభరణశీల । దేవిఁ గొలుచుచు భక్తుఁడై దివ్యమౌని
కుంభజుఁడు కాశి నున్నాఁడు కోరి మీరు । వాని వేడుండు తీర్చు మీవాంఛ నతఁడు. ౫౯

క. నావుడు విని చెచ్చెర న । ద్దేవతలెల్లరును శుభమతిం బోయిరి యీ
శావాసమునకుఁ గాశికిఁ । బావన గంగానదీ భువనశోభితకున్. ౬౦

తే.గీ. చని యగస్త్యుని గాంచి । నిశ్చలమనస్కు లగుచు నత్యంతవినయంబు లాత్మలందు
నెనఁగ దీనాననంబుల నిట్టు లనుచు । స్తుతు లొనర్చిరి మున్నుగా నతు లొనర్చి. ౬౧

## —: ఇంద్రాదికృతాగస్త్య ప్రార్థన :—

తే.గీ. ద్విజగణాధీశసంపూజ్య దివ్యచరిత । దుష్టవాతాపిబలనాశ దురితభేది
కుంభసంభవ నిగమార్థగుహ్యవేది । సర్వవిద్యావిశారద సాధుచరిత । ౬౨

క. లోపాముద్రాధీశ్వర । స్థాపితధర్మప్రచార సంయమికులసం
దీపక మిత్రావరుణసు । తా పారావారనీరతర్పితహస్తా । ౬౩

వ. అని యిట్లు గొనియాడి తమ రాక యెఱింగించి వింధ్యకృతవిపన్నివారణంబు గావింపవే
యని వేడిన విని యగస్త్యుండు శంకింపక యంగీకరించిన దేవతలు సంతసించి స్వస్వనివా
సంబులకుం జని రంత, ౬౪

## —: అగస్త్యకృత వింధ్యవృద్ధికుంఠనము :—

క. రాజులకన్నియ యగుచుఁ । రాజిలుచున్నట్టి సుగుణరాజి సముద్రఁ
భ్రాజిత పాతివ్రత్యము । లోఁజేసిన పరమభద్ర లోపాముద్రన్. ౬౫

క. తన ముద్దియ గనుఁగొని యో । వనితా సూరునకు వింధ్యవసుధాధర మా
మున నడ్డమాయె భూమికి । జనియింపగరాని కీడు సంప్రాప్తించెన్. ౬౬

చ. తెలియదు దానికారణము దేవి పురాతనవాక్యసంస్మృతిన్
దలపఁగ వారణాశిని సదా నిలువందగు మోక్షకాంక్ష ని
ర్మలుఁడ విముక్త మెద్ది గనుమా యిపుడేమొకొ నాకు విఘ్న మి
ట్లాలసె నటంచుఁ జెప్పి సమయోచితపద్ధతి నాశ్రయించుచున్. ౬౭

వ. అంత మణికర్ణికయందు స్నానంబు సేసి, విశ్వేశ్వరునిం బూజించి, దండపాణి నర్చించి,
కాలరాజుం జేరి. ౬౮

ఉ. కాలవిభూ మహాభుజ జగద్భయహారక భక్తపాలకా
శ్రీశఁ బొసంగెఁ గాశి నిటు వీడ్కొనఁజేయుట మేరఁగాదు ని
ద్రాళుత మాను మింక జనతాపనివారణమందు వేగ శ్ర
ద్ధాళుఁడవై దయాళుతను దప్పక యేలుము నీకు మ్రొక్కెదన్. ౬౯

తే.గీ. నేను జేసిన తప్పేమి నీవు నన్నుఁ। గాశికిని దూరమునఁ దోలఁ గారణంబు
గలదె రక్షింపుమని పల్కి కదలి సాక్షివిఘ్ననాథుని దర్శించి వితతభక్తి. ౭౦

క. ఈపగిది కాశికాపురిఁ । గాపరులగు దైవములను గనుగొని పిదపఁ
లోపాముద్రాన్వితుఁడై । తాపసవర్యుండు సనియె దక్షిణమునకుఁ. ౭౧

క. చని వింధ్యసమీపమునన్ । దనర నిలిచియుండ నద్రి తత్తరపడుచున్
వినతుండై సాష్టాంగము । నొనరించెను బరమభక్తియుతుఁడై వేగన్. ౭౨

క. మునియుఁ బ్రసన్నవదనుఁడై । యను నో గిరినాథ యేను యామ్యమ్మునకున్
జని వచ్చునంత నిచ్చట । నొనరఁగ నీ వీ విధమున నుండు మటంచున్. ౭౩

తే.గీ. ఆవిధంబున బల్కి సంయమివరుండు । శిఖరముల కెక్కి యంగన చెయ్యివట్టి
మెల్లగా దక్షిణంబున మెట్టు మెట్టు । వరుసనే డిగ్గి శ్రీశైలవరము సేరి. ౭౪

తే.గీ. అచ్చోటుం బాసి తగ మలయాచలమున । కరిగి యందును మేలైన యాశ్రమంబు
నిరవుఁ జేసుక యుండె మహీధ్రబాధ । దొలఁగె సూర్యునకును సురాదులకు భువికి. ౭౫

క. మను పూజితయై నిలిచెను । జనని మహాదేవి వింధ్యశైలంబున గా
వున వింధ్యవాసిని యటంచును లోకమునందు యశము శోభిలనొప్పెఁ. ౭౬

## —: స్వారోచిషాది మనుచరిత్రము :—

వ. అని చెప్పిన సూతమహర్షి పలుకుల కలరి శౌనకాది మహామునులు సంయమీంద్రా । నీవలన స్వాయంభువమను జన్మంబును, వంశవిస్తారంబును వింటిమి. తక్కిన మనువుల వృత్తాంతంబులు వినవలఁతు మనిన నత్యంతానందసమేతుండై సూతుండు. ౭౭

ఆ.వె. నారదుండు తొల్లి నారాయణునివల్ల । వినినయట్లు నేను విన్నవింతు
మనుతనూజులైన ఘనులు ప్రియవ్రతో । త్తానపాదు లధికధర్మపరులు. ౭౮

ఆ.వె. ఆ ప్రియవ్రతునకు నాత్మజుం డగుచు ద్వి । తీయ మనువుఁ బొసగు దివ్యకీర్తి
శాలియైన యట్టి స్వారోచిషుఁడు ధాత్రి । యమునకూలమునకు నరిగి యచట. ౭౯

ఉ. కాపుర ముండి జీర్ణదళ కందళ భుక్తిఁ దపంబు సేసె దో
షాపహ దివ్యరూప జగదంబను మృన్మయిఁ గొల్చి భక్తితో
నీపగిదిం ద్విషట్కమగు నేడులు పోవఁగఁ గోటిసూర్యసం
దీపితమూర్తియై పొడమె దేవి ప్రసన్నత రాజుముందటన్. ౮౦

తే.గీ. తారిణీదేవి లోకైకధాత్రి యిట్లు । దర్శనం బిచ్చి యా ధరాధవునిఁ జూచి
సర్వమన్వంతరాశ్రయ స్వామ్య మొసగి । యిలను నిష్కంటకంబుగా నేలుమనియె. ౮౧

వ. అని యిట్లు వరం బిచ్చి నిజస్థానంబునకుం జనియె. నంత ధరణీతలేంద్రుండు భగవతీ కృపావిశేషంబుకలిమి మహాతేజస్కుండై రాజ్యంబు సేసె మఱియు మూడవ మనువగు నుత్తముఁడు ప్రియవ్రతుని కొడు కతండు వర్షత్రయంబు గంగాకూలంబున నుపవాసంబులు చేసి వాగ్భవమంత్రంబున దేవిం బూజించి నిఖిల ధరాభారంబు వహించి చిరకాలికంబైన సంతతిం గాంచి వర్ధిల్లె. నాల్వమనువైన తామసుండను ప్రియవ్రతసుతుండు నర్మదా దక్షిణకూలంబున కామరాజకూట పరాయణుండై వసంత శరన్నవరాత్రపూజ లొనరించి

మహాదేవిం గొల్చి తత్ప్రసాదంబున సార్వభౌముఁడై శూరులును వీరులును నైన పదిమంది సుతులం గాంచి యంతంబున స్వర్గంబు నొందె. నైదవ మనువగు రైవతుండు కాళిందీ కూలంబునం గామరాజుం జపియించి యంబంగొల్చి సమస్తవిభవంబులుం గాంచె. నిక నారవవాడైన చాక్షుషుని చరితంబు విను మని యిట్లనియె. ౮౨

## —: చాక్షుషమనూపాఖ్యానము :—

సీ. అంగరాజకుమారుడైన చాక్షుషుఁడు దా పులహావి శరణంబుఁ బొంది భక్తి
మునినాథ నేను మేదినికెల్ల నధిపతి నగునట్లు బలము వీర్యంబు నస్త్ర
శస్త్ర నైపుణియును సంతతి చిరకాలికము తుద మోక్షంబు గలుగునట్టి
యొక యుపాయంబును బ్రకటింపవే యనవుడు గర్ణపథమున నుడుగులుబడి
తే.గీ. పరమశక్తిని భక్తితోఁ బ్రార్థనంబు । సేసికొమ్మ్మ వరం బిచ్చుఁ జెచ్చెర నన
విని నరేంద్రుండు న మ్మహామునిని మెచ్చి । భగవతీపూజ యెట్టిదో పలుకుమనిన. ౮౩

సీ. వినుమయ్య రాజేంద్ర విశదంబు సేసెద వాగ్భవబీజ మవ్యక్త మెలమి
ననిశంబు జపియించి యఖిలలోకోత్తరసౌఖ్యంబుఁ బడయుము జనవర యన
విరజచేరువ కేగి వెలయంగఁ బ్రథమాబ్దమున బల్లవాశసంబును నొనర్చి
జలపానమును జేసి చయ్యన రెండవ సంవత్సరంబును శాంతిఁ గడపి
తే.గీ. వాయువును గ్రోలి మూడవ వత్సరంబు । చల్లగాఁ దీర్చి తరువాత సమలనెల్ల
స్తంభమునుబోలెఁ గదలక సలిపె నతఁడు । తపము వాగ్భవమంత్రంబు జపముతోడ. ౮౪

తే.గీ. ఇట్లు ద్వాదశవర్షము లేగఁబుచ్చి । యున్న నొకనాడు జగములఁ గన్నతల్లి
దర్శనం బిచ్చి మది వాంఛితంబు తాన । తెలిసి వర మిచ్చెఁ గోరినతెఱఁగు విడక. ౮౫

క. పుడమిని సర్వము నేలెను । గడు శూరుల ధర్మపరులఁ గాంతియుతులఁ దాఁ
బడసె న్సుత్రులఁ జాక్షుషుఁ । డుడుగక దేవీప్రసాదయుక్తిన్ ఘనుడై. ౮౬

## —: వై వ స్వ త మ నూ పా ఖ్యా న ము :—

తే.గీ. మరియు నేడవవాఁడైన మనువు సుగుణ । ఘనుఁడు వైవస్వతుఁడు భక్తకల్పవల్లి
లోకముల తల్లి గొల్చి భూలోకమెల్లఁ । బాలనము సేయుచును సార్వభౌముఁడయ్యె. ౮౭

తే.గీ. ఎన్మిదవవాఁడు సావర్ణి యీశ్వరీప్ర । సాదమును గాంచెఁ దాఁ బొంటి జన్మముననె
యందునంబట్టి భూలోకమంత యేలె । బాహువిక్రమ సత్ప్రతాపముల కలిమి. ౮౮

వ. అనిన విని నారదుండు సావర్ణి యెట్లు పూర్వభవంబునం బుణ్యంబు సంపాదించె విన వలఁతు దెలియఁబలుకవే యనవుడు నారాయణుండు, ౮౯

సీ. వినుము నారద మహావీరుఁడై యలరారు స్వారోచిషాభిఖ్య సార్వభౌముఁ
డవనిని బాలింప నలఘుండు చైత్రవంశోద్భవుఁడైనట్టి సురథరాజు
తన మండలంబు పాలన మొనరింపంగఁ గోలావిదారులౌ కుంభినీశు
లరికట్టినం గాంచి యఖిల సైన్యంబులతో వారిపైఁ జని చేవఁ బోరి
తే.గీ. యపజయము నొంది నిలువలేక చొటు వాసి। యొంటిగా నడవికిఁ బోయి యున్నయపుడు
గాంచె నొక మౌని యాశ్రమక్షమను దాని । యందు నివసించెఁ గొంత సేపంతలోన. ౯౦

క. ముని పూజ సేయఁగా గని । వినయముతో నెదటి కేగి విప్రోత్తమ నీ
కు నమస్కార మటంచున్ । దన గోడుం దెలిపె మిగుల దైన్యముతోడన్. ౯౧

క. విని మౌని నృపకులోత్తమ । జనని గలదు మనకు నదియె సర్వేశ్వరి యీ
పనులెల్ల నామె మాయను । జనియించునుగాని యితరసంగతి గలదే. ౯౨

క. మాయాదేవియె విష్ణుని । గాయజసంహరుని బ్రహ్మ గనినది వారల్
సేయు పనులెల్ల వినుము త । దీయాజ్ఞాచరణముల మదిం గను మధిపా. ౯౩

ఆ.వె. అంబ సెలవులేని దాకు లల్లాడవు । జనని సెలవుమీఁద జరుగు జగము
తల్లి సెలవుగోరు దైవంబు లెన్నొన్నొ । మాత సెలవుక్రింద మనల బ్రతుకు. ౯౪

ఆ.వె. శక్తి కోపగింప చలిచీమ పులియగు । శక్తి కరుణ నగ్ని చల్లనగును
శక్తియందె జగము జగములందే శక్తి । శక్తిఁ గొలువకున్న జగము లేదు. ౯౫

ఆ.వె. సార్వభౌముఁడైన జక్రవర్తియైన । యింద్రుఁడైనఁ దా మహేశుఁడైన
వాని తండ్రియైన వాని బాబైనను । మాత కెపుడు ద్వారదూతకాడె. ౯౬

క. మన రాజ్యంబులు మనసా । ధనములు మన విభవములును దార సుతాదుల్
ధనములు పశువులు మేడలు । మనుగడలును లోకమాత మహిమలెకావే. ౯౭

ఆ.వె. దేవి కరుణయనెడి దీపంబు లేకున్న । లోకమెల్ల మనకుఁ జీకటిల్లు
జీకటింటిలోనఁ జిందులాటలు దొడ్డ । సిగ్గుగాదె దీపశిఖను గనుము. ౯౮

క. భువనేశ్వరిఁ గొలువని యీ । వివిధాచరణములు నేలనిడిచిన సాముల్
బ్రవిమలభక్తిన్ భగవతిఁ । దివిరి కొలువుమయ్య భూపతీ తడవేలా. ౯౯

ఆ.వె. సర్వశక్తిదేవి సర్వసాక్షిణి దేవి । సర్వమాత దేవి సర్వధాత్రి
సర్వమూర్తి దేవి సర్వసంచారిణి । సర్వనేత్రి దేవి సర్వమెఱుఁగు. ౧౦౦

ఆ.వె. లక్ష్మి నెదనుబెట్టి లక్ష్మీధవుఁడు పొంగు । వాణి నోటనిడుక బ్రహ్మ తివురు
గౌరి మేననుంచి గౌరీశ్వరుం డుబ్బు । దేవి దానె పొంగుఁ దివురు నుబ్బు. ౧౦౧

ఆ.వె. అంబ యాజ్ఞలేని యారోగ్య మెక్కడి । దంబ యాజ్ఞలేని దన్న మేడ
దంబ యాజ్ఞలేని దైశ్వర్య మెక్కడి । దన్నిమేళ్ళ కంబ యాజ్ఞసుమ్మ. ౧౦౨

ఆ.వె. జగతి నందరికిని జగదంబ యొక్కతే । తల్లి దాని కొక్క తల్లి లేదు
తల్లిలేని తల్లి తల్లి యందరికైన । తల్లిఁ గొలువ కెట్లు తప్పు మనకు. ౧౦౩

ఆ.వె. కడుపులోను మోచి కన్నతల్లికిఁ దన । కడుపులోన బిడ్డఁ గానరాదు
కడుపులోని బిడ్డఁ గనుగొని మనఁజేయు । తల్లి మేలొ కన్నతల్లి మేలొ. ౧౦౪

ఆ.వె. కూ డడుగని తల్లి కో కడుగని తల్లి । కూడు కోక లిచ్చి కులుకు తల్లి
కానరాని తల్లి కరుణగలుగు తల్లి । జగము తల్లి మనలసాకు తల్లి. ౧౦౫

వ. అనిన విని యా సురథుండు దీర్ఘదర్శిం జూచి యో మునీంద్రా । మీ రానతిచ్చిన దేవి యెట్టిదియొ, దాని రూపం బేదియో, యెం దుద్భవించెనో సర్వంబును నెఱింగింపవే యనుఁడు ముని యిట్లనియె. ౧౦౬

ఆ.వె. విశ్వవిహృతియెల్ల ప్రిలినపిమ్మట । యోగరాజ్యభోగ మొంది శేష
శయ్యఁ జక్కఁజేసి చక్రి దాఁ బన్నుండి । కనులనిండ నిదురఁ గాంచియుండు. ౧౦౭

ఆ.వె. నిదుర నిదుర యనఁగ నిదురయా యది వాని । చెవులునిండు గులిబిచేత గొప్ప
దనుజవరులజోడు తామసోపేతమై । పుట్టె మధువు కైటభుండు నాగ. ౧౦౮

ఉ. వారు మదంబుపేర్మి నట వర్తిలు బ్రహ్మను జూచి నీవు మ
మ్మోరువగల్గుదే యనుచు నుద్ధతిఁ బైఁబడ నుద్యమించినన్
శౌరి పరుండె నిద్రితుఁడు చండులు రాక్షసు లేమిచేయుదున్
దారి యికేమి నా కనుచుఁ దద్దయుఁ గుందుచు నెట్టకేనియున్. ౧౦౯

సుగంధి. ఏకరూప యేకశక్తి యేకకారణాత్మికా
నేకరూప నద్వితీయ హృల్లిఖా దయాత్మికా
శ్రీకరీ త్రయీమయీ పరీతవిష్టపత్రయీ
లోకసేవ్య తుర్యతుర్య లోలుపైకమానసా. ౧౧౦

భుజంగప్రయాతం. పరా పంచమీ శ్రీ ప్రపంచేశ్వరీ సు
స్థిరా షష్ఠి షష్ఠేశ్వరీ భద్రధాత్రీ
వరా సప్తమీ సప్తవారేశ్వరీ స
ప్తరాజద్వరానంద ధాత్రీ వరాంగీ. ౧౧౧

తే.గీ. అష్టమీ యష్టవసునాథ యష్టమూర్తి । నవమి నవసంఖ్య నవరాగ నవ్యమూర్తి
దశమి దశదిక్పరిపూజితోదారమూర్తి । దశనజితదాడిమసుబీజ ధన్యమూర్తి. ౧౧౨

తే.గీ. దేవి యేకాదశీ ప్రియ దివ్యచరిత । అవిరతైకాదశశివస్తుతా భగవతి
ద్వాదశాదిత్యపూజిత ద్వాదశభుజ । ద్వాదశీతిథిరూప నిత్యసుఖకర్త్రి. ౧౧౩

పంచచామరము. త్రయోదశాభిధాన లక్షితా త్రయోదశాత్మికా
త్రయోదశీ త్రయోదశామరప్రసన్న వైఖరీ
త్రయోదశోల్లసద్గుణప్రతాన సంతతప్రియా
నయక్రియా భయాది దివ్య నవ్యచేష్టితాశ్రయా. ౧౧౪

పృథ్వీవృత్తము. చతుర్దశమనుప్రసూ చతుర సౌమ్యసంశోభినీ
చతుర్దశసురాధిరాట్స్వవిచార విభ్రాజినీ
చతుర్దశతలేశ్వరీ సకల సాధుసంరక్షిణీ
నతార్తి పరిశోషిణీ నతజనవ్యథానాశినీ. ౧౧౫

కళావతీవృత్తము. ధీరా పంచాధికదశవేద్యా । సారా షోడశ్యనుగతరూపా
హారి ప్రాలేయకరకలాఢ్యా । భూరి ప్రోద్యద్భుజగణయుక్తా. ౧౧౬

వ. ఇట్లు ప్రార్థించినం బరమప్రసన్నయైన తామసియగు శక్తి దామోదరుని విడనాడి దానవుల మాయామోహితులం జేసె. నంత వాసుదేవుండు నిదురనుండి లేచి మధుకైటభులం జయింప నుద్యమించి యైదువేల దివ్యవర్షంబులు వారలతోఁ బోరి విజయంబు గానక మీ బలంబులకు మెచ్చితి, వరంబులు వేడు డనిన, నేము వరంబులు వేడువారలము కాము. నీవే వేడు మనిన నట్లకాక యని మీరిరువురు నాకు వధ్యులు కాఁగల రనిన, విని వారు జలరహితపృథివిం దమ్ము వధియింపు మని కోరిన నారాయణుండు నిజజఘనంబున మధుకైటభుల శిరంబులు ద్రుంచె. నది కారణంబుగా నప్పుడె బ్రహ్మచే స్తోత్రంబు సేయంబడి, సర్వయోగీశ్వరేశ్వరియగు మహాకాళి యుద్భవించె. నిఁక లక్ష్మ్యుత్పత్తి క్రమంబు సెప్పెద విను మని యిట్లనియె. ౧౧౭

మ. కలఁ డత్యుగ్రబలాన్వితుండు మహిషీగర్భోద్భవుండున్ మహో
జ్జ్వలతేజుండు వరప్రభావజనితప్రాగల్భ్యవిస్తారని
స్తులశౌర్యోచ్చలితాఖిలాదితిభవస్తోముండు సర్వప్రభుం
డలఘుండౌ మహిషాసురుండు త్రిదశేంద్రావాసభోగోన్నతిన్. ౧౧౮

ఆ.వె. మహిషదనుజు ధాటి మఘవుఁ డోర్వఁగలేక । లేఖచయముతోడ లేచి బ్రహ్మ
దరికిఁ బోయి వేడ ధాత శంకరుఁ జూప । నతడు సురలతోడ నచ్యుతుఁ గని. ౧౧౯

ఆ. వె. తెలియఁబల్కె నప్డు దేవతలందరు । నొక్కచోట నాత్మయోజనములు
చేసి రంత నార్తచింతామణికి విష్ణు, దేవునకును బుట్టెఁ దేజ మొకటి. ౧౨౦

క. అంతట నమరులకెల్లను । వింతగ నుద్భవమునొందెఁ బృథుతేజంబుల్
సంతోషంబున దివిజులు । గంతులు వైచుచును దివ్యగానము చేయన్. ౧౨౧

సీ. ముఖమయ్యె న య్యష్టమూర్తితేజం బొగి శమనుతేజంబు కేశగణ మయ్యె
వైష్ణవతేజంబు బాహువు లాయెను సౌమ్యతేజంబు దా స్తనము లయ్యె
మాహేంద్రతేజంబు మధ్యమం బాయెను జలపతితేజంబు జంఘ లాయె
భౌమతేజము నితంబము లాయెఁ బరమేష్ఠితేజ మంఘ్ర్యంగుళీరాజి యయ్యె
తే.గీ. ధనదుతేజంబు ముక్కాయెఁ దా ప్రజాపు । తేజమే దంతతతి యాయె నోజ నగ్ని
తేజమును గన్ను లాయెనుఁ దివిరి సాధ్య । పావనంబులు భ్రుకుటీ శ్రవంబులాయె. ౧౨౨

క. తేజస్వినియై యీగతి । రాజిలుచున్ నిలచియున్న ప్రకృతీశ్వరికిన్
భ్రాజిత చక్రాద్యాయుధ । రాజి నొసగి రచ్యుతేశ్వర బ్రహ్మదుల్. ౧౨౩

వ. మఱియు శివుండు శూలంబును, విష్ణుండు చక్రంబును, వరుణుండు శంఖంబును. హుతాశనుండు శక్తిని, వాయువు బాణంబులను, మహేంద్రుండు వజ్రంబును, ఘంటయును, నైరావతంబను నేనుఁగును, యముండు దండంబును, బ్రహ్మ యక్షమాలాకమండలువులను, దివాకరుండు రశ్మిమాలను, గాలుండు ఖడ్గంబును, సముద్రుండు హారంబును, నంబర ద్వయమును, చూడామణినిం, గుండలంబులను. నిర్మలంబగు నర్ధచంద్రంబును, నూపురంబులును, గ్రైవేయకంబును నిచ్చె. విశ్వకర్మ యూర్మికలును, హిమవంతుండు సింహవాహనంబును, వివిధరత్నంబులును, సురాపూర్ణంబగు పానపాత్రంబును నిచ్చె. శేషుండు నాగహారం బిచ్చె. నిట్లు వివిధాయుధభూషణధారిణియై వెలుంగుచున్న దేవిం గాంచి విబుధు లత్యంతానందపరవశులై నానాగతుల స్తోత్రంబులు సేయుచుండ, బహుశస్త్రపాణులగు మహిషాసుర సైన్యంబు లుక్కుమీఱి యెదుర్కొనిన ననేకమార్గంబులఁ జిక్షుర, దుర్ముఖ, దుర్ధరాదు లగు దానవులం జెండి, మహిషుండు నానారూపంబులం బెనఁగులాడిన విడువక నాగపాశంబులం బంధించి, చిత్రవధ యొనర్చి, యార్చినం గాంచి యఖిల లోకంబులు సంతసిల్లె. నీ మహిషాసురమర్దినియె శ్రీమహాలక్ష్మి నాఁ బడు. నింక సరస్వతి వృత్తాంతంబు సెప్పెద నని యిట్లనియె. ౧౨౪

మ. విను రాజేంద్ర సరస్వతీభవము నే విన్పింతు నొక్కప్డు దా
మును శుంభుండను దైత్యుఁ డుత్కటబలంబుం బూని వర్తింపఁగా
ననుజుండైన నిశుంభుఁ డాతనికి సాహాయ్యంబు గావింపఁ ద
ద్దనుజారాతి చమూసమష్టి భయమందంజేయఁగా నార్తులై. ౧౨౫

మ. హిమవద్భూధరభూమికిం జని మహాహీనప్రతాపాఢ్య స
ర్వమయిన్ శ్రీజగదంబఁ గొల్చిరి సదారాధ్య న్మహాతాండవ
ప్రమదానందవిధాత్రి శంకర హరి బ్రహ్మాది సంస్తూయమా
న మహానృత్యవిరాజితన్ దళిత నానారాక్షసశ్రేణికన్. ౧౨౬

తే.గీ. భగవతి నిశ్చలానందభరితమూర్తి । యఖిలలోకైకమాత భయాపహర్త్రి
విష్ణు శంభు ద్రుహిణ ముఖ్య వినుతరూప । అంబ శాంకరి మమ్మేలవమ్మ తల్లి । ౧౨౭

క. మాకుఁ బ్రసన్నవుగమ్మా । శోకంబుల నణఁచుమమ్మ శుంభ నిశుంభుల్
లోకైకభయదులయి రిఁక । నీ కరుణారసమె పూని నిలుపుము తల్లీ! ౧౨౮

చ. అని దివిజాళి పల్కు విని యంబ ప్రసన్నముఖాంబుజాతయై
వినుము సురాధినాయకుల విన్నప మంచును గౌశికీప్రభ
దనువునఁ గల్గఁజేసి యనిన న్విని తద్దయుఁ బ్రీతి వారలన్
గని సురనాథులార యభికాంక్షితముల్ దెలుపుండు నావుడున్. ౧౨౯

శా. దేవీ శుంభ నిశుంభు లిద్దఱు మదోద్రేకంబునన్ లోక వి
ద్రావిప్రక్రియలం జరించుచును మా ధామంబులం బట్టి రే
త్రోవంగానక నీకు మ్రొక్కితిమి మా దోర్దర్పముల్ లేశమున్
గా వుగ్రాసురులం జయింపఁగను శక్తంబుల్ జగన్మోహినీ! ౧౩౦

క. దీనుల మొఱ లాలింపను । దీనులఁ గృపఁజూచి కాంక్ష దీర్పను నీవే
కాని యొరులేరు లోకము । న జగజ్జాలపాల లోలుపలీలా! ౧౩౧

క. వారల బాధలు మాకుం । దూరంబుగఁ దొలఁగిపోవ దుష్టాసుర సం
హారంబుఁ జేసి మమ్ము । నపారకృపం బ్రోవుమమ్మ భగవతి దేవీ! ౧౩౨

వ. అనిన విని దేవి వారి కిట్లనియె. ౧౩౩

ఆ.వె. వెఱవవలదు వలదు విశ్వకంటకులగు । దనుజనాయకులను దునిమి మిమ్ము
నిజనివాసములకు నే నిప్పు డంపెద । ననుచు జనని పలికి యరిగె గిరికి. ౧౩౪

ఉ. అంతట దేవి రాక్షసకులాధిప వృత్తములం గ్రహించి య
త్యంత వినోదయై ఖరుల నాటలఁ బాటలఁ బేర్చి కాళికా
కాంతను గూడి కేళివనికాస్థలి నుండఁగఁ జండ ముండ దే
వాంతకు లద్ది గాంచి తదుదారవిలాసము లుగ్గడించుచున్. ౧౩౫

ఉ. దిగ్గునఁ బోయి రాజుఁ గని దేవవిరోధివరా మహారా! యా
జగ్గులు చెప్పలేమొక విశాలవిలోచనఁ జూచినారమే
తగ్గున నొగ్గు గాన మది దైవతకాంతల నాగకాంతలం
బెగ్గిలఁజేయు నందమున విన్నది కన్నది గాదు భూమిపై. ౧౩౬

ఉ. నీకును భోగయోగ్య యది నీ విఁక జాలము సేయ కిప్పుడే
కైకొనుమయ్య దాని మృదుగానము వించు ముహూర్తమాత్ర మా

లోకము సేసి వచ్చితిమి లోకములన్నియు నేలుచున్న నీ
కా కలభోరు దక్కఁ దనకాక పృథల్ మహనీయ సంపదల్. ౧౩౭

క. దైతేయనేత యది విని । దూతన్ సుగ్రీవ నాముఁ దొయ్యలిఁ దేరన్
బ్రీతిం బంచిన వాఁడును । గాతరత వహింప కేగి కనుఁగొనె దేవిన్. ౧౩౮

ఆ.వె. చూచి సంతసించి శుంభుండు త్రైలోక్య । విజయలక్ష్మి దనదు భుజములందు
నిడక నిన్ను నెత్తి నిడఁదలంచినవాఁడు । వడతి శుంభు చెట్టఁబట్టు మనిన. ౧౩౯

తే.గీ. అనిన మీ దైత్యనాయకుఁ డంతవాఁడ । యగును నే నేమిసేయుదునయ్య మున్ను
ప్రతిన యొక్కటి చేసితిఁ బ్రతినఁ । దప్పరాదు వినుమేను జేసిన ప్రతిన దూత । ౧౪౦

క. ఎవ్వఁడు నా దర్ప మడఁచు । నెవ్వఁడు నా బలమునెల్ల నిఱియించెడి వాఁ
డెవ్వ డెదిరి ననుఁ గెల్చెడి । నవ్వాఁడే నాకుఁ బెన్మిటయ్యెడు ననుచున్. ౧౪౧

తే.గీ. నా ప్రతిన సత్య మొనరించి నన్నుఁ గైకొ । నంగవచ్చును శుంభుండు నాగ నితర
నాయకులవంటివాఁడె యెంతపని తనకు । గాన నేగుము చెప్పుము దీనినెల్ల. ౧౪౨

తే.గీ. దేవి పలుకులు విని వచ్చి తెలుప శుంభుఁ । డత్యుదగ్రాగ్రహగ్రస్తుఁ డగుచు వేగ
ధూమ్రలోచనుఁ గనుఁగొని తోయజాస్యఁ । జిటికెలోఁ దెమ్ము సిగఁ జేతఁ జిక్కఁబట్టి. ౧౪౩

చ. అనుఁడు నతండు లెస్సయని యా శరవీరబలంబు లంటి రాఁ
జని జగదంబఁ గాంచి విరసంబుగ బిగ్గన నోసి దైత్యనా
ధుని భజియింపు మేలెదవు తొయ్యలి నీపును మూఁడులోకముల్
విన కటు తక్కినం గనుము వేణిని బట్టుక కొంచుఁ బోయెదన్. ౧౪౪

క. అనిన విని దేవి యోరీ । విను నీ రా జేడబోయె వేగమ రమ్మం
చును దెల్పరాదె యేటికి । ననుఁ గెలువఁగరాదు కైకొనఁగరా దనినన్. ౧౪౫

ఆ.వె. దైత్యుఁ డదరిపడుచుఁ దత్తరంబున విల్లు । చేతఁబూని పేర్చి సింగినాదుఁ
జేయఁ బూన శక్తి చెచ్చెఱ క్షణములో । హుంమ్మటంచు వాని దుమ్ముఁజేసె. ౧౪౬

క. ఆ వార్తను విని శుంభుఁడు । పావకశిఖవోలెఁ గోపఁబడుచుం జండున్
వేవేగ ననిచెఁ గలనకు । నావల ముండాభిదాను ననిచెఁ గ్రమముగన్. ౧౪౭

చ. వెనుకనె రక్తబీజు ననిపెం జని వారలు దేవి నొంతు మే
మనుచును బాణవర్ష పరిఘాసి గదాది మహాయుధంబులన్
మునుకొని యేసి యేసి చలముం బలముం దగఁ జూప దేవి దాఁ
గనుఁగొని శూల మూని కడఁక న్పొడువ న్హతులైరి మువ్వురున్. ౧౪౮

క. అంతట శుంభ నిశుంభులు । పంతంబులు మీఱ వచ్చి బాణాదులచేఁ
గొంతవడి కొట్టికొనియున్ । గంతుకొనిరి దేవిచేతి ఖడ్గమువలనన్. ౧౪౯

క. ఇది వాగీశ్వరి కావున । మది గనుము సరస్వతీ సమాఖ్య యటంచున్
వదలక తెల్పితి నడిగితి । యది జనవర యనిన నృపతి యతిభక్తిమెయిన్. ౧౫౦

క. విని దేవియె శరణంబని । మనమునఁ దలపోసి భక్తిమార్గ మెఱిఁగి పూ
జన మాచరించెఁ గొన్నాళ్ళ । నితరగతచిత్తుఁ డగుచు ననశనుఁ డగుచున్. ౧౫౧

వ. అట్లు పూజింప దేవి ప్రత్యక్ష యగుచు. ౧౫౨

తే.గీ. వరము వేఁడు మనంగ న వ్వసుమతీశు । డఖిలలోకైకజనని మోహప్రణాశ
నంబు జ్ఞానంబు దయసేయు మంబ దుష్ట । భూమిధరశంబ ముఖజితసోమబింబ । ౧౫౩

క. నా రాజ్యము నిష్కంటక । మై రంజిలఁజేయు మనిన నట్టుల యౌఁగా
కో రాజన్యశిఖామణీ ।మీఱిన మఱియొండు మంచి మే లొసరింతున్. ౧౫౪

ఆ.వె. భానునకు నీవు ప్రభవించి సావర్ణి । యనెడు పేర మనువ వయ్యెదుసుమి
యనుచుఁ జెప్పి దేవి యరిగె । నియ్యదియె సావర్ణిమనువుచరిత వరగుణాఢ్య । ౧౫౫

వ. అనిన విని నారదుండు తక్కినమనువుల చరితంబులు వినవలతునని యడిగిన లెస్సయని
నారాయణుండు. ౧౫౬

క. ఆ వైవస్వతమనువున । కావిర్భావంబు నొంది రారురు కొడుకుల్
శ్రీవెలయగ విమలోదయు । లై వర్తిలి రురుయశోగుణాఢ్యత ననఘా । ౧౫౭

వ. కరూషుండును, పృషధ్రుండును, నాభాగుండును, దిష్టుండును, శర్యాతియు, త్రిశంకుం
డును ననువా రార్వురై రి. వీరు కాళిందీతీరంబునకు బోయి నిరాహారులై జితశ్వాసులై
లోకజననిఁగూర్చి పూజసల్పి నానావిధోపచారంబులచే దేవిం దనుపుచు జీర్ణపర్ణాశనులయ్యు,
వాయుభక్షణంబులు సేసియు, జలంబులు గ్రోలియు, ధూమ్రపాన, రశ్మి పానంబులు
సేసియుం గ్రమక్రమముగా బహుశ్రములై వ్రతంబులు నడుప నత్యంతాదరంబునం
బండ్రెండుసంవత్సరంబుల కడపట దేవి ప్రత్యక్షయై నిలచిన నతిభక్తియుక్తులై నమ్రులై
వా రార్వురును వినయంబున స్తోత్రంబులుసేయ రాజపుత్రులం జూచి దేవి యిట్లనియె. ౧౫౮

క. జననాథతనయులారా । మనమున మెచ్చితిని మిమ్ము మత్పూజావం
దనముల నిష్కల్మషులై । యునికి నడుగు డింక వరము లొసఁగెద ననినన్. ౧౫౯

క. చిరజీవిని యగు సంతతి । యురువగు భోగంబు సంతతోజ్జ్వలయశమున్
స్థిరబుద్ధియుఁ బ్రాభవమును । వరములు దయసేయుమమ్మ వరదాయిని నాన్. ౧౬౦

తే.గీ. ఏవమస్తని వర మిచ్చి యింక వినుఁడు । మీర లందఱు మనువులయి మీఱగలర
టంచు బ్రామరి పల్కి తా నరిగె నంత।మనువులయి రన్యభవముల మనుజపతులు. ౧౬౧

వ. ప్రథముడు నవమమనువగు దక్షసావర్ణియయ్యె, ద్వితీయుడు దశముడగు మేరుసావర్ణి

యయ్యె. దృతీయు డేకాదశుండగు సూర్యసావర్ణియయ్యె. జతుర్థుఁడు ద్వాదశుండగు
చంద్రసావర్ణియయ్యె. బంచముడు త్రయోదశుడగు రుద్రసావర్ణియయ్యె. షష్ఠుడు చతుర్ద
శుడగు విష్ణుసావర్ణి యయ్యె. నిట్లు పదునలుగురు భ్రామరీప్రసాదంబున నట్టి దశ లంది
రనిన విని నారదుండు. ౧౬౨

క. భ్రామరి యెట్టిది యెయ్యది । దామోదర యెందు బుట్టె దానికిఁ బనియే
మీ మహి బుట్టుటకును నా । కామోదముమీరఁ దెల్పు మన హరి పలికెన్. ౧౬౩

చ. కలదు మహాజగద్విజయకంకణుఁ డుద్ధతవైరివీరదో
ర్బలహరణుండు విక్రమనిరంకుశభూరిరణుండు భీకరో
జ్జ్వలకరణుండు నాకపురవాసి పరాజయకారణక్రియా
చలచరణుండు పూర్వదివిషచ్ఛరణుం డరుణుండునా ధరన్. ౧౬౪

తే.గీ. దైత్యసంస్థానమైన పాతాళమందుఁ । దివిరికొని వాడు దేవతాద్వేషి యగుచు
బద్మసంభవుగూర్చి తపంబుసేయ । హిమనగంబున కేగి యహీననియతి. ౧౬౫

క. గాయత్రీమంత్రంబునఁ । బాయక తప మాచరించె బదివేలేడుల్
మేయుచుఁ బర్ణంబుల జలపాయి యగుచు జేసె నొక్క పదివేలేడుల్. ౧౬౬

తే.గీ. వాయువును మెక్కి పదివేల వర్షము లటు । సలిపి తుదకు నిరాహారసరణి నన్ని
యేండ్లు దప మొనరింపంగ నెల్లలోకముల దహింపంగఁజాలు నగ్నులు వొడమిన. ౧౬౭

సీ. ఏమి యేమిది యంచు నెల్ల దేవతలును భయమంది వేవేగ బ్రహ్మకడకు
నరిగి తెల్పిరి దైత్యు నత్యద్భుతంబైన తప మద్ది విని ధాత తత్తరమున
నరుణునికడ కేగి యట్టె చూఁడగ బ్రాణమాత్రావశిష్టుండు మహిత నిష్ఠఁ
దతిశుష్కగాత్రుండు నైయుండ వరమింక నడుగుమటన్న వా డలరి కన్ను
తే.గీ. విప్పి చతురాననుని జూచి విహితలీల । నమ్రుఁడై మ్రొక్కి వినయ దీనత్వములకు
నాకరంబైన మాటల నబ్జగర్భు । ద్రుహిణ పరమేష్ఠి యనుచు సంస్తుతులు సేసి. ౧౬౮

క. వరము లవి యెన్నియైనన్ । వరములుగావనుచు దనుజవరుఁ డారసి వా
గ్వరు నడిగి మందు నే నిలువరముగ నని చావులేని వర మొక టనఘా । ౧౬౯

క. అడిగిన వరమున కబ్జభ । వుఁడు దా నెలనగవు నవ్వి బోధించెను నీ
వడిగితివి నాకు హరి క । మ్మృదునకునుం గలిగినట్టి మృతి లేకుండన్. ౧౭౦

క. నాకును శక్యంబగునే । నీ కమృతత్వంబు నొసఁగ నెమ్మి నడుగుమీ
యేకాంక్షితమేనియు నీ । లోకమున మఱొకటి నాకు లోనైనదిగాన్. ౧౭౧

తే.గీ. వనజగర్భుఁడు పల్కిన వచనము విని । నరులచేతను రాక్షసవరులచేత
సురలచేతను స్త్రీలచే పురుషవరుల । చేత శస్త్రాస్త్రసమితి నాజిని మృగాది
కములచేఁ జావులేని వరము నొసగుము. ౧౭౨

క. విపులంబగు బలమును నా । కిపుడే యొసగుము మహాత్మ యీ వన విధి దా,
గృప నట్లన యగుఁ బొమ్మని । స్వపురంబున కరిగె నంత వాఁడును పేర్మిన్. ౧౭౩

చ. దనుజగణంబు జీటి వరదర్పమునం దనుజాధిపత్యమున్
గొని యొకదూత నాకమునకు న్కదనంబున కిప్డు నీవు ర
మ్మనుచు సురేంద్రుతోడఁ దగ నాడఁగఁ బంపిన వాఁడు వచ్చి యి
య్యనఁ దెలుపంగ నింద్రుఁడు భయంబునఁ గంపిలి తత్తరంబునన్. ౧౭౪

చ. సురలనుఁగూడి పంకరుహసూతినిఁ జేరఁగఁబోయి చెప్ప నా
తర మిది కాదటం చతఁడు తండ్రికడం జని విన్నవింప శం
కరుకడ కందఱిం గొనుచుఁ గంజదళాక్షుఁడు వచ్చి లోకభీ
కరుఁడగు దైత్యు నోర్వ పనిగట్టివిచారము చేసె నోర్పునన్. ౧౭౫

ఆ.వె. అంతలోన నరుణుఁ డమరులతోఁ బోర । నరిగి యర్కు నిందు యముని వహ్ని
గెలిచి వారి వారి కృత్యముల్ వేర్వేర । దానె పూని చేసె తపము పేర్మి. ౧౭౬

వ. ఇట్లు కొంతకాలంబు గడచినం దేవతలు స్వస్వస్థానంబులు విడచి కైలాసంబున శంకరు
సన్నిధానంబున నుండ నశరీరిణీ వాక్కొండు వినవచ్చె, నది యెట్లనిన. ౧౭౭

క. ప్రవిమలమతితో మీరలు । భువనాధీశ్వరిని భక్తిఁ బూజింపుడు మీ
కవితథమగు జయము గలుగు । నవినీతుండైనయట్టి యరుణుండు తెగున్. ౧౭౮

క. దనుజుఁడు గాయత్రీజపమును మానిననేని నాశమును బొందును గా
వున వాని నట్లు చేయుం । డనగా విని యింద్రుఁ డాయ్య నాత్మం దలచెన్. ౧౭౯

చ. తలచినయంతనే యఖిలధర్మవిదుండగు జీవుఁ డెంతయున్
దలమగు ప్రేమతోఁ గులిశధారిసమీపము చేర నాతఁ డ
త్యలఘుతఁ గారవించి సకలార్చనముల్ వడి సల్పి వ్యోమవా
క్కలనము దెల్పి వేడె నుపకారము దైత్యవధార్థ మిమ్మెయిన్. ౧౮౦

వ. గురువరా ! నీ వరుణుని సమీపంబునకు జని వాఁడు గాయత్రీమంత్రత్యాగంబు సేయ
నుపాయంబు గావింపుము. మే మిచ్చట భగవతీపూజనంబులు సేయుచుందుము. నీ క య్యాది
శక్తి సహాయ క్రియాసిద్ధిం గావించు నని చెప్పి తారు జాంబూనదేశ్వరిం దర్శించి తపశ్చ
ర్యల మాయాబీజ జపపరులై యజ్ఞంబులు సల్పుచుండి రంత బృహస్పతి యతివేగంబున
నరుణుని యంతికంబునకుఁ జనిన వాఁ డతనిం బూజించి మునివరా ! యెచ్చటనుండి
వచ్చెద రేమికార్యము నేను భవత్పక్షపాతినిగానుగదా మీదుమిక్కిలి ప్రతిపక్షభావంబు
నొందినవాఁడ నైతి నన బృహస్పతి వానిం గాంచి. ౧౮౧

తే.గీ. నేను గొల్చెడి దేవినే నీవు గొల్చుచుండ నావాద వెట్లు కావో తెలుపుము
నావుడును విని రాక్షసనాయకుండు । దేవిమాయకు లోనయి తెంపుచేసి. ౧౮౨

క. ఛీ దేవగురుఁడు గొలిచెడి । యా దేవిని నేను గొల్చు టది మగతనమే
కాదని గాయత్రీజప । మా దినముననుండి మానె నభిమానమునన్. ౧౮౩

క. కృతకార్యం డగుచు బృహ । స్పతి యా స్థానంబు విడిచి చనెఁ దాను నిజా
యతనమున కంతనుండి పి । శితభోజికిఁ దేజమెల్ల జెడె మునివర్యా । ౧౮౪

ఉ. ఆ గతి జీవుఁ డేగి దనుజాధిపుతేజముఁ దూలఁజేసినన్
బాగని దేవతల్ జనని భక్తిఁదొలంగక కొన్నినాళ్ళ లి
చ్చాగతి నున్న దేవి పరశక్తి మహేశ్వరి లోకమాత నా
నాగుణకర్మధాత్రి కరుణం దన దర్శన మిచ్చి నిల్చినన్. ౧౮౫

ఉ. దేవతలెల్ల సంతసిలి దిగ్గున లేచి నమస్కరించి యో
దేవి జొహారు శిష్టవితతిప్రతిపాలనకార్యధుర్య నా
నావిధమూర్తి దివ్యకలనాంచితశక్తి జొహారు చాపలీ
లావిపులా జొహారు మములన్ దయజూడు మటంచు మ్రొక్కినన్. ౧౮౬

తే.గీ. భ్రమరవేష్టితమైనట్టి భ్రామరీ మ । హాకృతిం జూచి జగదంబ యాత్మగరుణఁ
గోకిలసుభాషణంబుల నాకవరుల । కిట్లని వచించె సురలార యేమి కోర్కె ? ౧౮౭

తే.గీ. అనిన విని దేవతలు మది నలరి తమకు । సంభవించిన దుఃఖవిస్తారమును సు
రారిచరితంబు వేదనిందాదికంబు ।బ్రాహ్మణుల పీడఁ దెలిపిరి భ్రామరికిని. ౧౮౮

ఆ.వె. అమ్మవారు తనదు హస్తంబులందున్న । తుమ్మెదలను వెడలఁదోలె వెలికి
జుమ్ము జుమ్మటంచుఁ దుమ్మెదల్ చెలరేగి । క్రమ్మె నిమ్ములను జగంబులెల్ల. ౧౮౯

సీ. శ్వేతాభ్రకపుఁజాయ చిన్నిరెక్కలతోడ, వ్యోమమెల్లను నిండె నొక్కగుంపు
ఇంద్రనీలపుఁజాయ లెసఁగు ఱెక్కల నార్చి, ప్రక్కలెల్లను బ్రాకె నొక్కగుంపు
తాళకంపు మెఱుంగు తల్కు లెల్లెడ నిండ, దిక్కులఁ జెలరేగె నొక్కగుంపు
ఇంగిలీకపుఁదేట లెసగించి లోలోని, చక్కలెల్లను దూఱె నొక్కగుంపు

తే.గీ. చిలుకఱెక్కల చెలువంబు గులకరించి । యిక్కడక్కడ నటియించె నొక్కగుంపు
భ్రామరీదేవి చేతిలో బ్రభవమొంది । బ్రబలి వ్యాపించియున్నట్టి భ్రమరపంక్తి. ౧౯౦

ఆ.వె. భ్రమరగణము లిట్లు పలుదిక్కులను నెక్కి । రక్కసులు వసించు చక్కలందు
జేరి ముక్కు చెవుల దూరి చుఱుక్కున । నొక్కి కఱవ నెత్తురుగ్రక్కి పడరి. ౧౯౧

క. అబ్బా చెవిలోఁ దూరెను । గొబ్బున ముక్కునను దూఱెఁ గుఱుకను దూరెన్
విబ్బర మికేటి దనుచున్ । బొబ్బలిడి ధరిత్రిఁ బడిరి పూర్వదివౌకుల్. ౧౯౨

క. అక్కట యెక్కడి తుమ్మెద । లుక్కులు చెడఁగుట్టెఁ దద్దయును సలుపెక్కన్
చిక్కితిమి దేవుడా యని । తెక్కలిరక్కసులు పడిరి ధృతిచెడి నేలన్. ౧౯౩

క. కత్తులు కందవు ములుకుల । మొత్తంబులఁ బడవు చేత ముట్టి దగుల వే
యెత్తున జయింతు మనుచుం । దత్తరమునఁ గొట్టికొనిరి దనుజగణంబుల్. ౧౯౪

క. తుమ్మెదసేనలతోడ రథమ్ముల కేన్గులకు మఱిపదాతులకును న
శ్వమ్ములకుఁ బోరు పొసఁగునె । యమ్మక్క యిదేమటంచు నసురులు బెగడన్. ౧౯౫

క. చెవికడ జుంజుమ్మనుచున్ । రవములు గానించు గావరంబునఁ దిరుగున్
జివిరి మొగ మట్టె త్రిప్పిన । జవజవ ముక్కోళ్ళ దూరి చంపె నసురులన్. ౧౯౬

వ. ఇట్లు పలుతెఱంగుల రంగుల భృంగంబులు పీడాపరంపల నొంపఁ జేయునదిలేక రక్కసులు మడిసి రది విని దేవత లానందపరవశులై దుందుభులు మొరసి రట్లు రాక్షస హననంబు గావించి వచ్చి తుమ్మెదలు దేవీహస్తంబులం బ్రవేశించె. సమస్తలోకంబులు వీతభయంబు లయ్యె. నిదియె భ్రామరీచరిత్రం బని చెప్పె నారాయణుండు. ౧౯౭

## —: కృతిపతిసంబోధనము :—

మ. అమృతాంధస్సరిదంబుపూరవరహీరాంచన్మణీమాలికా
క్రమసమ్మృష్టమనోజ్ఞ బాలశశిరేఖాప్రస్ఫురన్మల్లికా
సుమనోగుచ్ఛభుజంగమాధిపఫణాకుంభచ్ఛిలాభూషణా
ద్యమిత శ్రీకలితోత్తమాంగ చతురా యల్లూరి సోమేశ్వరా । ౧౯౮

## —: గద్య :—

ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసువంశపయఃపారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరితగోత్రాలంకార, కృష్ణామండలమండనాయమానాల్లూరగ్రహారపూర్వార్జిత ధరానిరాజమాన, శ్రీవీరప్రతాప కోదండహంవీరరామచంద్రభూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగపరిపాలనాధీన, పూర్వోక్తోభయమండలన్యాయసభావాదకనియోగభారవ్యవహర, శ్రీవేంకశ్వరవరప్రసాదసంభూతకవిత్వ విద్యావిశేష, బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేకగ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితిప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణంబునందు దశమస్కంధము

సంపూర్ణము.

★

శ్రీ ర స్తు
శ్రీ శారదాంబాయై నమః

# శ్రీ దేవీభాగవతము.

## ఏకాదశస్కంధము

శ్రీ సీతారమణాంగన్యాస కరన్యాసపూర్వకార్చారూప
వ్యాసంగరంగవివిధపురీసంగత లింగకోశ శ్రీసోమేశా ।
వ. అవధరింపు మటమీద నారదుండు.

క. నారాయణ దామోదర । నీ రమ్యవచోమృతమున నే జగదంబా
చారిత్రంబును వింటిని । ధారుణిలో నన్నుఁబోలు ధన్యులు గలరే ।  ౧

### —: సదాచారవిధిక్రమః :—

క. శ్రీయుత యే యాచారము । ధీయుక్తిఁ జేసెనేని ద్విజుఁ డిహ పర ల
క్ష్మీయుక్తి ననుభవించెడి । నా యాచారంబు దెలుపు మంబుజనాభా ।  ౨

తే.గీ. లోకమాతకుఁ బ్రియ మతిలోకసుఖము । దినదినము రేపకడ లేచి తీర్చవలయు
నట్టిదియు ద్విజులకు ముఖ్యమైనదియును । నైన యాచారమును వినుమా తెలిపెద.  ౩

ఆ.వె. అలర ద్విజుఁడుదయాస్తమయములందు । కర్మ నెప్పుడు విడువంగగాదు నిత్య
మేని నైమిత్తికము గామ్యమేని గర్మి । తేతరంబునుఁ గాపాడు టెందు నొప్పు.  ౪

ఆ.వె. తల్లి దండ్రి సుతుఁడు దారయు జ్ఞాతియు । జుట్టపక్షములు మఱెట్టియాప్త
లేని ధర్మమునకు నెనగారు ధర్మంబె । నిలుచుఁ దనకుఁ బ్రాణవిలయమందు.  ౫

క. కావున ధర్మమె నరులకు । నావ భవాంభోధి దాట నారద విను నా
నావిధపుణ్యంబులకుం । ద్రోవ నిరంతము దనకుఁ దోడై యుండుఁ.  ౬

క. శ్రుత్యుక్తము ప్రథమంబగు । స్మృత్యుక్తము రెండవదయి చెలగుచు నుండుఁ
సత్యము కావున ధర్మము । నిత్యంబును జరుపవలయు నియమపరుండై.  ౭

క. ఆచారంబున నాయువు । నాచారంబుననె సుతుల నందగఁదగు న
య్యాచారంబున నన్నము । నాచారంబున నఘక్షయంబునుఁ గలుగుఁ గా. ౮

క. ఆచారము వరధర్మం । బాచారము శుభము నెన్న నది యైహికశో
భాచయముఁ గూర్చుఁ బరసుఖగోచరమై యింపు సొంపుఁ గూర్చు మునీంద్రా ! ౯

క. ధర్మము దీపంబై దుష్కర్ముల నజ్ఞానతిమిరగతులను మహితాం
తర్ముఖులఁ జేసి వారికి । శర్మంబు నొసంగు జలజసంభవపుత్రా ! ౧౦

క. ఆచారంబున సత్కర్మాచరణము దానివలన నధికజ్ఞాన
ప్రాచుర్య మొదవు మోక్షశ్రీ చేకురు మనువు దీనిఁ జెప్పు మునీంద్రా ! ౧౧

తే.గీ. సర్వధర్మంబులందు నాచారమే వరిష్ఠ । మై యుండుఁ దపమిదే పృథులమైన
జ్ఞాన మిదె కల్గు సర్వంబు దీనివలనఁ । గాక తక్కిన శూద్రువికంబె నలఁతి. ౧౨

క. ఈ యాచారము ద్వివిధంబై । యుండునటంద్రు విబుధు లది యెట్లన శా
స్త్రీయము లౌకికమును నని । యేయెడ నివి సేయఁదగినవేసుమి మౌనీ ! ౧౩

తే.గీ. ధర్మములు పెక్కు లవి దేశ ధర్మములును । గ్రామధర్మంబులు కులధర్మములు జాతి
ధర్మములు నన నన్నియుఁ దప్ప । కాచరింపవలయును ద్విజుఁడు మునీంద్ర వినుము. ౧౪

క. ఎందేని దురాచారుఁడు । నిదింపం । బడును వందనీయుఁడు కాఁడా
పందకుఁ దెవుళ్ళ మెండగు । పొందవు ధర్మమును కామమును మునినాథా ! ౧౫

వ. అనిన విని నారదుండు లక్ష్మీనాథా ! శాస్త్రంబులు పెక్కులుగదా ? ధర్మంబు లనంతంబు, లం దెద్ది యెట్లాచరింపందగు సంగ్రహంబుగాఁ దెలుపవే యన నారాయణుం డిట్లనియె. ౧౬

క. శ్రుతియును స్మృతియును మఱి యి । ద్ధతర పురాణచయము ధర్మంబునకై
వితత ప్రమాణములుగా । కితరంబులు కావటందు రెందు మునీంద్రుల్. ౧౭

వ. నారదా ! శ్రుతి స్మృతి పురాణంబులకు విరోధంబు వాటిల్లెనేని యందు శ్రుతియె ప్రమాణం బగు. శ్రుతి స్మృతులకేని శ్రుతి పురాణంబులకేని, విరోధంబు గలిగినప్పుడు శ్రుతియె ప్రమాణం బగు. శ్రుతులలోఁ బరస్పరవిరోధంబు గలిగినప్పుడు రెండును ధర్మంబు లగు. స్మృతులలోఁ బరస్పరవైరుధ్యంబు గలిగినప్పుడు విషయంబు కల్పించునది పురాణంబులం దొకానొకచో నాగమధర్మంబు గానవచ్చెడి. నదియు ధర్మంబు గాఁదగుం. వేదంబునకు విరోధంబు గాదేనిఁ దంత్రంబు ధర్మం బగుఁ బ్రత్యక్ష శ్రుతి విరోధంబైన తంత్రంబు ధర్మంబు కానేరదు. ధర్మంబు వేదమూలకంబు. గావున వేదవిరుద్ధంబు కారాదని చెప్పి మరియు, ౧౮

సీ. వేదంబు విడనాడి వేఱొండు పథమున వర్తించు దుర్మార్గ వర్తనులకు
సలసలఁగాఁగు నూనెలతోడ గుండముల్ యమలోకమున సిద్ధ మగుచునుండు
నదిగాన సర్వప్రయత్నంబులను వేదవిహితధర్మమును గావింపవలయు
స్మృతియేనియుఁ బురాణ వితతార్థమేనియుఁ దంత్రోక్తమేనియుఁ దప్పకెపుడు

తే.గీ. వేదమూలంబుగావున వివిధశాస్త్రసమితికినిఁ బ్రమితికి దోడు సాగెఁ గాని
కాకయుండిన ధర్మవు గాదుసుమ్ము। కుత్సితపథుం డథోగతిఁ గూలకున్నె। ౧౯

వ. మఱియుఁ గామాచారులునుఁ, బాశుపతులును, లింగధారులునుఁ, దప్తముద్రాంకితులును, వైఖానసులును వేదమార్గము పరిత్యజించి నిరయంబు నొందుదురు. వేదోక్తంబగు ధర్మంబు నాచరించినవా రుత్తమలోకప్రాప్తు లగుదురు. ౨౦

క. ఆ దినమునఁ దా జేసిన। దేదో యిచ్చినది యెదియొ యిప్పించిన య
ద్దేదో పలికిన దేదో। తా దప్పులనెల్ల వేచి తలపఁగవలయున్. ౨౧

క. బ్రాహ్మముహూర్తమునఁ దా। బ్రహ్మధ్యానంబు సేయవలయును నియతిన్
బ్రాహ్మణుఁడు తత్త్వ మెరిగిఁ య। జిహ్మగతిన్ జిత్తశుద్ధి చేకురుకొఱకున్. ౨౨

వ. ఊరుస్థోత్తానచరణుండై యుత్తరచరణంబు సవ్యంబున నుంచి యురంబునకు ముఖంబు వాంచి నిమీలితాక్షుండై దంతంబుల నొండొంట నొరసీయక యచలజిహ్వుండై సమ్మృతాస్యుండై యింద్రియంబుల నిగ్రహించి నాతినిమ్నాసనస్థుండై ద్విగుణంబుగాని త్రిగుణంబుగాని ప్రాణాయామం బుపక్రమించునది. పిమ్మట హృదయంబున దీపంబుఁబోలె వెలుఁగుఁ బరంజ్యోతిం ధ్యానించుచు నాత్మ ధారణంబు సేయునది. సధూమంబనియు, విధూమంబనియు, సగర్భంబనియు, విగర్భంబనియు, సలక్ష్యంబనియు, నలక్ష్యంబనియుఁ బ్రాణాయామంబు షడ్విధంబై యుండునది. రేచక పూరక కుంభకాత్మకంబై యుండునది. వర్ణత్రయాత్మకంబై ప్రణవం బనంబడు నిడామార్గంబున వాయువుఁ బూరించుట పూరకం బనంబడు. నుదరంబున నిలుపుట గుంభకం బనంబడు. షోడశమాత్రలచే మెల్లఁగా బింగళ మ్మార్గంబున విడచుట రేచకం బనంబడు. నిది సధూమం బగు ప్రాణాయమం బంద్రు. ౨౩

సీ. ఆధారము. లింగమందు నాభిని హృదయంబునఁ దాలుమూలంబునందు
నొసటను రెండును నెసఁగఁ బదాఱును నిర్వదియునుఁ బది యెనయ నారు
నాలుగు నైన చెన్నగు దళంబుల పద్మముల వ్రాసి నాసాంతమునను ఫాల
మున డ భ క ఠ లనుఁ దనరించి కంఠదేశంబున స్వరములఁ బక్కి వ్రాసి

గీ. తత్త్వబోధక హం క్షం గతంబుసేయ। సకలదళగతమై మోక్షసాధకంబు
నై చిదానందమయమయి యలరు వర్ణమూర్తి వస్తువునకు నిదే మ్రొక్కువాఁడ. ౨౪

వ. అని నమస్కరించి.

చ. అరుణసరోజసంస్థితయయి యప్పొడిఁబోలిన రూపుగల్గి శం
కరహితచిహ్నయై మృదుల కంజసుతంతునిభాకృతిం దివా
కర శిఖి చంద్రలోచన నగస్తని చిత్తమునందు నిల్పి సు
స్థిర యగునేని నొక్కపరిఁ జేకురు మోక్షము భక్తకోటికిన్. ౨౬

క. స్థితి స్థితియగు గతి యాత్రా । గతియగు మతి ధ్యానమగునుఁ గన నా మాటల్
స్తుతియగు నేఁ గావించెడి । కృతులెల్లను నీదు సేవ గీర్మయి దేవీ ! ౨౭

క. నేనే దేవి నితరుఁడనుఁ । గానుఁజుమీ శోకభాజిఁ గానుఁజుమీ బ్ర
హ్మానందపరుఁడ నిత్యుఁడ । నేనే బ్రహ్మంబ ననుచు నెఱిఁ జింతింతున్. ౨౮

వ. ఇట్లు బ్రహ్మైక్యానుసంధానంబు సేసి మానసపూజఁ గావించి. ౨౯

క. గురుఁడు పరమేష్ఠి నాకున్ । గురుఁడు రమాపతి పినాకకోదండుండున్
గురుఁడు పరబ్రహ్మము నా । గురుఁ డాతని కెప్పుడు మ్రొక్కుకొనియెదఁ బ్రీతిన్. ౩౦

క. రెక్కలువచ్చిన పులుఁగులు । గ్రక్కున నీడంబు విడిచి కదలిన మాడ్కిన్
దక్కదు వేదాధ్యయనం । బక్కర కాచారరహితునం దంతమునన్. ౩౧

తే.గీ. అలర బ్రాహ్మీముహూర్తంబునందు లేచి । ప్రాణముల నాయమించి యాపైన వేద
మభ్యసింపంగఁదగు నందు రార్య లవల । నిష్టదైవంబు నెలమి ధ్యానింపవలయు. ౩౨

తే.గీ. ఐదు నైదు నుషఃకాల మండ్రు బుధులు । నేడు నై దరుణోదయం బెన్నగ నెని
మిదియు నైదైనఁ బ్రాతస్సమీరితంబు । నవల శేషంబు సూర్యోదయాఖ్య మండ్రు. ౩౩

సీ. ప్రాతరుత్థానంబు పరగంగఁ గావించి యాశుగ విక్షేపణాధికమగు
దూరంబునకుఁ బోయి నైరృతిదిశకును నడచిపోఁదగు భూసురుఁడు నియతిని
వెనుకమేన నివీతమును గృహస్థ వనస్థు లవ్వర్ణి కర్ణంబునందు నిడఁగ
వలయు భూమినిఁ దృణంబులఁ గప్పి తలమీద వలువనుఁ గప్పంగ వలయు మౌన

తే.గీ. మూనవలయు నుమియఁగూడ దూర్చఁదగదు। కడఁగి విణ్మూత్రములు సేయు గాలమందు
నారదా శౌచవిధి రోగనాశకంబు । పొసఁగ నాయువు పెంచును భూతి నిచ్చు. ౩౪

తే.గీ. వలికి సాగున జలమందు మలను గుడినిఁ । గర్తమున శాద్వలంబునఁ గాదు పెంట
విడువ నడుదారి సంధ్యల గుడుచుచును జపించుచునుఁ బలుదోముచుఁ జలుపరాదు. ౩౫

చ. పొలుపుగ హవ్యకవ్యముల మూత్రపురీషవిసర్జనంబులన్
గలయిక నార్యనొద్ద సవనంబుల బ్రహ్మమఖంబునందు నిం
పలరఁగ దానముల్ జలుపునప్పుడు విప్రుఁడు మౌన మూనఁగా
వలయు సతంద్రు పెద్దలగువారలు నారద ధీవిశారదా ! ౩౬

తే.గీ. సకలసురలు మునులు పిశాచములు నురగ । రాక్షసులు పొందు నాదారి రాక మీరు
విడచెదను విష్ఠ నే భూతవితతులార । యిచట నశుచికి దూరస్థు లీరు కండు. ౩౭

వ. అని ప్రార్థించి పిదప యథావిధి శౌచంబు నడపవలయు. మఱియు, ౩౮

ఆ.వె. గాలి నగ్ని విప్రుఁ గమలాప్తు నుదకంబు । నావుఁ గనుఁజూచు చవనిసురుడు
విష్ఠ విడువరాదు వినుము నారద శౌచవిధులు పెక్కుఁ గలవు విస్తరింతు. ౩౯

ఆ.వె. కాలుమడుపు విష్ఠఁ గప్పంగవలయును । గడ్డి యాకు పెంకు లొడ్డి పిదప
లింగ మెత్తిపట్టి లేచి వారిసమీప మందుఁ జేరవలయు నంద్రు బుధులు. ౪౦

ఆ.వె. చెంబుతోడ వారిఁ జేకొని యన్యప్రదేశ । మునకుఁ బోయి తీరభూమి
శ్వేత రక్త కృష్ణ పీత మృత్తులఁ బూని । శౌచవిధిని ద్విజుఁడు సలుపవలయు. ౪౧

ఆ.వె. అంబులందు గుదులయందుఁ బుట్టల నెల్ల । బొక్కలందు మన్నుఁ బూనరాదు.
మున్నుఁ గడుగ మిగులు మన్నునుఁగొనరాదు । శౌచవిధులయందు సంయమీంద్ర । ౪౨

తే.గీ. మూత్రమున కిబ్బడగు శౌచమునను మిధున।కర్మ మబ్బడి యిది యెఱుంగఁదగు ద్విజుడు
చెలఁగి లింగంబునం దొండు చేత మూడు।నుభయముల రెండు మృత్తిక లుచ్చకంద్రు. ౪౩

తే.గీ. మూత్రమున కినుమడి శౌచమునకు లింగమందు రెండు నపానంబునందు నైదు
నొకట బది యుభయంబుల నొనర నేడు।మృత్తికలు సెప్పఁబడె వినుమీ మునీంద్ర । ౪౪

ఆ.వె. ఎడమకాలు ముందుఁ గడుగంగదగుఁ గుడి। గడుగనొప్పు నవలఁ గడిగిఁ నాల్గు
నాల్గు మృత్తికలను నయమొప్పఁగా రాచి । యిది గృహస్థశౌచ మెఱుఁగుమయ్య । ౪౫

తే.గీ. బ్రహ్మచారికి నిది రెట్టి వనగునకును । త్రిగుణము చతుర్గుణమును యతికి నటంద్రు
ఉసిరికాయంత మృత్తిక నొక్కసారిఁ । గొనఁగఁదగు నంద్రు పెద్దలు మునివరేణ్య । ౪౬

ఆ.వె. ఇదియ పగటిశౌచ మిందులో సగమగు । రాత్రిపూట నాతురప్రతతికి
నందులోన సగము నధ్వస్థునకు దానిలోన సగమటంద్రు మౌనివర్య । ౪౭

తే.గీ. స్త్రీలు శూద్రు లశక్తులు బాలు రర్థి । శౌచకర్మనుఁ గంపువోఁ జలుపవలయు
గంధలేపక్షయం బెంతకాలమునకు । గలుఁగు నందాక సలుపంగ వలయుఁజుమ్ము, ౪౮

తే.గీ. ఎడమచేతను శౌచంబు నడుపవలయు । దక్షిణంబున నెప్పుడుఁ దగదు సేయ
బొడ్డుక్రింద నెడమచేయి బొడ్డుమీద । నొనరఁ గుడిచేయి నెప్పుడు నుంచవలయు. ౪౯

క. జలపాత్రముఁ గొనగూడదు । మలమూత్రములను విడుచుసమయమున నెవఁడే
జలపాత్రము పట్టినచో । వలయు న్వానికినిఁ జేయఁ బాచితము మునీ । ౫౦

క. ఈవిధమున శౌచంబునుఁ । గావింపని భూసురు డుదకము మాత్రముఁ దా
ద్రావుచు ద్రిరాత్ర ముండి జ। పావిష్టుండైనఁ దొలఁగు నఘము మునీంద్రా । ౫౧

క. దేశము కాలము ద్రవ్యం । బా శక్తియు సోపపత్తి యరసి ద్విజుండుం
దా శౌచము నడుపవలయు । లేశము విడఁదగదు బుద్ధిలేక జడుండై. ౫౨

క. నాలుగు గండూషము లొక । వ్రేలం బండ్రెండు రెండు వ్రేళ్ళనుఁ జేయం
బోలు నధోముఖముగఁ దా । నోలిన్ వామముగ నొల్ల నుమియఁగవలయుం. ౫౩

ఆ.వె. ఆచమనము సేసి యవ్వల దంతధా । వనము సేయవలయు వసుధలోనఁ
గంటకములు పాలు । గల చెట్టునను ద్వాదశాంగుళముల పుల్లయైన లెస్స. ౫౪

క. చిటికెనవ్రేలు చివరయం । తటిలావుండంగఁదగుఁ దుద న్నాలుగంగొ
ట్టుట యొప్పు దంతధావన । పటుకాష్ఠము ద్విజుఁ డెఱింగి పరమమునీంద్రా ! ౫౫

క. కడిమియుఁ బరణికయు మా । మిడి మేడియు బొద్దుగయును మేలగు వేమున్
గడు శస్తము లని చెప్పిరి । తడఁబడకయ మునులు దంతధావనమునకుం. ౫౬

క. సోముఁడు రాజై వచ్చెను । నా ముఖమున్ గడుగు యశమున న్భాగ్యమునం
శ్రీమాధా జ్ఞాన యశో । ధీమహిమాదుల వనస్పతి నా కిమ్మీ. ౫౭

వ. ఇట్లని స్మరింపవలయు ౫౮

తే.గీ. దంతకాష్ఠంబు దొరకని తరుల మొగము । గడుగఁగూడని తిథులను దొడరి పదియు
రెండు గండూషములు సేయ లెస్సయండ్రు । సవితి చెడుఁగులమారు దుష్కార్యనకును. ౫౯

క. మునివర షష్ఠి నమావా । స్యను నేకాదశిని ప్రతిదాఖ్యతిథిని ధా
వన మాచరింపఁ గులదా । హనమగు నొక యేడుతరము లండ్రు మునీంద్రుల్. ౬౦

సీ. అంఘ్రిశౌచము దీర్చి యాచమనము చేసి యంగుష్ఠమున జలం బన్న వ్రేల
జలముతో రెండుసారులు రాచి ముక్కోళ్ళ నంటించి భూసురుం డాత్మనియతి
నిష్ఠ నంగుష్ఠ కనిష్ఠికలనుఁ గన్నుఁదోయియుఁ జెవులు పొందుగ స్పృశించి
బొటిమనం జిటికెనఁ బొక్కిలి స్పృశియించి యరచేత హృదయంబు నంటి పిదప
తే.గీ. నంగుళులచేత నొదల నంటవలయు । దలను నోంకార గాయత్రి దలచి సిగను
ముడిచియాచమనముసేసి మొగి హృదయము।బాహువుల స్కంధములనంటవలయు మౌని. ౬౧

## —: స్నానవిధి :—

ఆ.వె. తుమ్మి యుమిసి చేతిఁతోఁ బల్లుముట్టియు । మఱియుఁ బతితుతోడ మాటలాడి
వఱల దక్షిణశ్రవణమును ముట్టంగ । వలయు నండ్రు బుధులు వరమునీంద్ర ! ౬౨
ఆ.వె. అగ్ని జలము చంద్రుఁ డర్యముం డనిలుండు । వేదములు వసించు విప్రవర్యు
వలపటిచెవియందు వలనొప్పు నటుగాన । నది పవిత్రమందు రార్యు లవని. ౬౩

క. అంతట నది కరిగి సుతర । చింతనుఁడై నీళులాట సేయవలయు న
త్యంతమగు మలము తనురం।ధ్రాంతరముల బేరియుండునదిగాన మునీ ! ౬౪

క. ధరణి నగమ్యాగమనజ। దురితమ్ము ప్రతిగ్రహోత్థ దురితంబు రహ
శ్చరితంబగు దురితంబును । హరియించును స్నానకర్మ మది మునివర్యా ! ౬౫

క. స్నాతుండుకానివాని క్రియాతతి విఫలంబు కాన నవనీసురుఁడుఁ
బ్రాతస్స్నానము సేయుట । యాతతభద్రప్రదం బహరహంబు మునీ ! ౬౬

ఆ.వె. దర్భయుక్తుఁ డగుచు ధారుణీదేవుండు । స్నానమెప్పుడేని సలుపవలయు
స్నానమాచరించి సంధ్యను వార్చంగ । దనుతు వీని నెపుడు తప్పరాదు. ౬౭

తే.గీ. జలకమాడక యేడును సంధ్యలేక । మూడు. నగ్నిని విడనాడి యేడు నైదు
దినము లుండిన నేనియు ద్విజుఁడు।ద్విజుఁడుకాడు శూద్రుండె యనిరి సత్కార్యవిదులు. ౬౮

క. గాయత్రికంటె నధికం । బేయెడలను లేదు నమ్మ మిహపరసుఖముల్
గాయత్రియంద యుండుఁ । గాయంతం త్రాయతే యనంబడు ననఘా ! ౬౯

క. గాయత్రి ప్రణవసంయుత । మై యలరుచు వ్యాహృతిత్రయంబునుఁ గూడఁ
జేయు నిహపరసుఖంబుల । గాయంతం త్రాయతే యనంబడు ననఘా ! ౭౦

క. ప్రాణాయామత్రయమును । నాణెంబుగ నాచరించి నయమార్గపరి
త్రాణుం డయి వేదమంత్ర । శ్రేణిం జపియింపవలయు శ్రేయము గలుగుఁ. ౭౧

తే.గీ. పలుల నటుఁజేయు నూటొక్కతరమువారి । నరకమునునుండి తొలఁగించు ధరణిసురుడు
పూని జపసంయుతుని సగర్భుం డటంద్రు । ధ్యానమాత్రు నగర్భుం డటంద్రు బుధులు. ౭౨

క. స్నానాంగతర్పణంబును । జానుగఁ గావించి దేవ సంయమి పితల
త్యానంద మొందఁజేసి మ । హానియతిం ధౌతవస్త్ర మటు గట్టఁదగుఁ. ౭౩

తే.గీ. భూతి రుద్రాక్షధారణంబుల నొనర్చి । జపమొనర్పంగఁదగు విప్రజనుఁ డనయము
మఱియుఁ జెప్పెద రుద్రాక్షమాల విధము వినుము మునినాథ నీవు సవిస్తరముగ. ౭౪

సీ. కడఁగి ముప్పదిరెండు కంఠదేశంబున చెలగును నలుఁబది శిరమునందు
నలరు నాఱాఱు కర్ణప్రదేశంబుల చెరిపదిరెండును చేతులందుఁ
బదియాఱు పదియాఱు బాహువులందును నొక్కటొక్కటి నేత్రయుగ్మమందు
జెలగుచు నొక్కటి శిఖయందు వక్షంబునందు నెన్మిదియును నమర నిట్టు
తే.గీ. లెవ్వఁడు ధరించు రుద్రాక్ష లెలమితోడ । నతఁడె పాపంబు లడఁగించు నమితశాంతి
మంతుఁడై యొప్పు సజ్జనమాన్యుఁ డతఁడు । కాడె వాడె స్వయం నీలకంధరుండు. ౭౫

సీ. యజ్ఞోపవీతంబునందు వేదంబులఁ దలఁచుచు రుద్రాక్షఁ దాల్పవలయు
హస్తంబునంధును నాశాష్టకంబును దలఁచుచు రుద్రాక్షఁ దాల్పవలయు

కంధరంబునను వాక్కాంతావతంసంబు తలఁచుచు రుద్రాక్షఁ దాల్పవలయుఁ
దనరంగ సిగయందుఁ దత్తారతత్త్వంబు దలఁచుచు రుద్రాక్షఁ దాల్పవలయుఁ

తే.గీ. దెలియఁ గర్మంబులందును దేవదేవి । దలఁచి రుద్రాక్షలనుఁ జక్కఁ దాల్పవలయు
సర్వవర్ణాశ్రములు దీని జపునవచ్చు । గాని లే దొక్కమది ద్విజోత్తానమునకె. ౭౬

క. రుద్రాక్షధారణంబున । రుద్రత్వము నొందు నరుఁడు రూఢిగ మఱియుఁ
రుద్రాక్షధారి కెప్పుడు । భద్రంబులు గలుగుఁ బాయు బాపములెల్లన్. ౭౭

తే.గీ. చేరి రుద్రాక్ష ధరియింప సిగ్గువడెడి । వాఁడు భవదుఃఖముల నెట్టలేడుసుమ్ము
కాచి రుద్రాక్షధారినిఁ జూచి నవ్వు । నతఁడు సంకరుఁ డుత్పత్తియందు నమ్ము. ౭౮

తే.గీ. మునులు మునులౌట తుద్రాక్షమూలమునెనె । తాత తాతౌట రుద్రాక్షధారణమున
చెలఁగి రుద్రాక్షకంఠెను శ్రేష్ఠమెద్ది । పావనులకును రుద్రాక్ష వట్టుగొమ్మ. ౭౯

తే.గీ. భక్తి రుద్రాక్ష ధరియించు బ్రాహ్మణునకు । వస్త్ర ధాన్యంబు లిచ్చిన వారలకును
సర్వపాపంబు లడుగంటు సంతతంబు । చారుతరమైన శివలోకసౌఖ్య మొదవు. ౮౦

తే.గీ. చారురుద్రాక్షధారికి శ్రాద్ధమందు । భోజనంబునుఁ బెట్టిన భూసురునకు
సందియములేదు పితృలోకసౌఖ్య మొదవు । మౌనికులవర్య రుద్రాక్షమహిమ వింటె. ౮౧

తే.గీ. క్రమ రుద్రాక్షధారికిఁ గాళ్ళు గడిగి । నీళ్ళు ద్రావిన వానికి నిఖిలపాప
చయ భయంబులు తొలఁగు నిశ్చయముసుమ్ము । శివునిలోకంబు వారికిఁ జేరువయగు. ౮౨

క. హారమయినఁ గటకమయిన । భూరి సువర్ణంబునైన భూదేవుఁ డొగిన్
దా రుద్రాక్షనుఁ జేరిచి । ధారణ మొనరింప రుద్రతనుఁ గ్రహియించున్. ౮౩

క. మంత్రంబుతోడనేనియు । మంత్రములే లేని భక్తిమతినేనియు హ్రీ
గత్రాశయముననేని స్వ । తంత్రత రుద్రాక్షఁ దాల్పఁ దరలు నఘంబుల్. ౮౪

తే.గీ. అహహ రుద్రాక్షమహిమ మెంతని వచింతు।నాతరమె నీతరమె యల్ల నలువతరమె
కాన సర్వప్రయత్నముల్ పూని ద్విజుఁడు । కోరవలయును రుద్రాక్షధారణంబు. ౮౫

వ. అనిన విని నారదుండు నారాయణా! రుద్రాక్షమహిమంబు నీ కె ట్లనుభూతంబయ్యె
నావుఁడు మునివర్యా! తొల్లి షణ్ముఖుం డడిగిన గౌరీవల్లభుండు సెప్పఁగా వింటి నని
చెప్పి యతడు పల్కిన విధంబున. ౮౬

తే.గీ. వినుము షణ్ముఖ త్రిపురాఖ్య దనుఁజు డొకఁడు । దేవతలనెల్ల మథియించి త్రిపుర వాని
మీది కే నేగి సర్వసుధాదమయము । గా నఘోరాస్త్ర మనుదానిఁ గలుగఁజేసి. ౮౭

తే.గీ. దివ్యవర్షంబు లొకవేయి తివిరి యేను । కనులు దెరచుక యుంటి నా కంటినీటఁ
బుట్టె రుద్రాక్షవృక్షము ల్భూరిమహిమ । వాని కిచ్చితి వరము పావనత కలుగ. ౮౮

వ. రుద్రాక్షంబులు ముప్పదియెనిమిది భేదంబు లయ్యె. నందు సూర్యనేత్రోద్భవంబులు పండ్రెండు. కపిలవర్ణంబులు సోమనేత్రోద్భవంబులు పదియాఱు. వహ్నినేత్రోద్భవంబులు పది కృష్ణవర్ణంబులు మఱియు నం దేకముఖంబు శివరుద్రాక్షంబు, బ్రహ్మహత్య నడంచు. ద్విముఖంబు దేవీరుద్రాక్షంబు, నానావిధపాపంబు లడంచు; త్రిముఖంబు వహ్నిరుద్రాక్షంబు, స్త్రీహత్యం బాపు, చతుర్ముఖంబు బ్రహ్మరుద్రాక్షంబు, నరహత్యం దొలగించు;పంచముఖంబు రుద్రరుద్రాక్షంబు, సర్వపాపవిమోచకంబు; షణ్ముఖంబు కార్తికేయాని రుద్రాక్షంబు, బ్రహ్మహత్యానివారకంబు; సప్తముఖంబు మన్మథరుద్రాక్షకంబు,స్వర్ణస్తేయ దోషహరంబు. అష్టముఖంబు వినాయకరుద్రాక్షంబు, అన్నకూట, తూఁకూట, దుష్టస్త్రీగమన, గురుదార గమన దోషనాశకంబు, విఘ్నంబులం బోకార్చు, నవవక్త్రంబు వామబాహువునం ధరియింపఁదగినది. ఇది భక్తిముక్తిప్రదంబు. భ్రూణహత్యా బ్రహ్మహత్యాది మహాపాతకంబులం దోలు. దశముఖంబు విష్ణురుద్రాక్షంబు, దీనిని శిఖం ధరించునది. భూత ప్రేత పిశాచ భేతాళాదుల నంటనీదు. ఏకాదశముఖంబు రుద్రైకాదశం బనంబడు. దీనిం గర్ణంబులం ధరించునది. వాజపేయశతఫలం బిచ్చు. గోలక్ష దానతుల్యంబు. ద్వాదశ ముఖం బాదిత్యరుద్రాక్షంబు,గోమేధాశ్వమేధ ఫలంబును. గోదానఫలంబునిచ్చు.వ్యాఘ్రాదిభయంబు గలుగదు. త్రయోదశ ముఖంబగు రుద్రాక్షంబు దొరికెనేని కుమారరుద్రాక్షం, బిది సకల భోగప్రదంబును, సర్వపాపహరంబును నగు. చతుర్దశముఖంబగు రుద్రాక్షంబు లభించెనేని శివపిండంబు నాఁబడు. మూర్ధంబునం దాల్చునది. పరమపదం బిచ్చు. శిరోమాల యిరుబదాఱింటిచేతను, హృదయమాల యేబదింటిచేతను, బాహువలయంబు పదాఱింటిచేతను, మణిబంధవలయంబు పండ్రెండింటిచేతను, జపమాల నూటయెనిమిదింటిచేతనొండె, నేఁబదింటిచేతనొండె, నిరుబదియేడింటిచేతనొండెం గూర్పనొప్పు. నూటయెనమిదింటిచేఁ గూర్పఁబడిన మాల యుత్తమంబు. ధరించినను, దాని చేఁబూని జపించినను అనుక్షణం బశ్వమేధఫలంబు గలుగు. నిరుఁబదియొక్క కులముల నుద్ధరించి, శివలోకం బిచ్చు నని చెప్పి ఈశ్వరుండు జపమాలాలక్షణంబు సెప్పెద వినుమని యిట్లనియె. ౮౯

## —: జపమాలావిధి :—

క. రుద్రాక్ష ముఖము బ్రహ్మయు । భద్రములగు బిందువులను బరికింపంగా
రుద్రుండు మఱియు బుచ్ఛము । కద్రూసుతశాయి సకలకల్యాణదముచ్. ౯౦

క. ఇరుబదియైదక్షంబుల । నెరి బంచముఖములఁ దెలుపు నెరుపున నిద్దే
పరగిన సకంటకంబుల । సొరిదిం గూర్పవలె నక్షసూత్రంబు సుతా । ౯౧

ఆ.వె గోపుతోక సుట్టుకొన్నట్లుగాఁ జేసి । మొగముమొగమునంటఁ దగ ఘటించి
తోక తోక నంట జోకతో నమరించి । మేరు పూర్వముగను మెలపఁదగును. ౯౨

వ. ఇది నాగపాశం బనంబడు. ౯౩

క. ఈలాగునఁ గూర్చించిన । మాలకు శ్రీగంధ మలఁది మహిమదలిర్పన్
మేలైన పంచగవ్యము । లీలం బైఁజల్లఁగావలెంజుమి పుత్రా । ౯౪

సీ. చల్లి శుద్ధోదక స్నానంబు గావించి న్యసియింపవలయు మంత్రగణములను
శివ నస్త్రమంత్రంబుచే ముట్టి కవచంబుచే నవకుంఠంబు చేసి మూల
మంత్రంబుచేతను మఱియుఁ దొల్లిటిలాగు న్యాసంబు గావించి భాసురముగ
నొనసి సద్యోజాత ముఖములఁ బ్రోక్షించి యష్టోత్తరశతంబు నమర మూల
తే.గీ. మంత్రము స్మరియించి శుద్ధమౌ మహిఁ బెట్టి । పైన సాంబుని న్యసియించి పట్టిరేని
యక్షమాల ప్రతిష్ఠిత యగునుఁ జుమ్ము । కొంగుబంగార మది యెల్లకోరికలకు. ౯౫

ఆ.వె. కంఠ మూర్ధ హృదయ కర్ణ బాహువులందు । నక్షమాలఁదాల్చునతని భాగ్య
మెన్నఁగ దరమె జపియించెడివేళల । దానిఁ బూన భోగదంబుసుమ్మి. ౯౬

సీ. స్నానంబు దానంబు జపమును హోమంబు వైశ్వదేవంబు దేవతల యర్చ
నిష్కృతి శ్రాద్ధంబు నిష్ఫలం బగుగాదె యక్షము ధరియింప కాచరింప
నశుచియౌ మానవుల డక్షంబు ధరియింపగాదు భక్తినిఁబట్టి కాక వేఱె
రుద్రాక్షతరువంటి భద్రమౌ దృణమైనఁ గాన నత్యంతయోగ్యంబు నమ్ము
తే.గీ. చెలఁగి జాబాలనిగమంబు సెప్పుచుండు । నక్షము ధరించు పశుపు రుద్రాకృతిఁ గను
బ్రహ్మవిష్ణ్వాదు లవి తాల్చి ప్రబలులైరి । పరగ రుద్రాక్షధారులే భాగవతులు. ౯౭

వ. బహుజన్మతపఃపరిపాపంబున మహాదేవప్రసాదంబుచే నక్షధారణేచ్ఛ మనుజునకు స్వాభావికంబు. నక్షధారి మహాపాపంబులు సేసియు ముక్తుం డగును. మఱియు మహాసేనా । కుశగ్రంధిపత్రజీవాదులు రుద్రాక్షంబునకు షోడశాంశంబగు ఫలంబు నీఁజాలవని చెప్పె నీశ్వరుండు మఱియు. ౯౮

చ. పురుషులలోన విష్ణువునుఁబోలె గ్రహంబులలోపలన్ హరి
త్తురగునిఁబోలె దేవతల ధూర్జటిపోలె నదీగణంబునన్
సురనదిఁబోలె నంగనల శూలిసతిం బణిబోలె నక్షసం
భరణము సర్వధర్మముల పైదని నమ్మము క్రౌంచభేదనా । ౯౯

ఆ.వె. నూరుతపములైన నూరుదానములైన । నూరువ్రతములైన భూరిమహిమ
నెసఁగు నక్షదాన మిచ్చు ఫలంబులో । లక్షవంతు నీవు పక్షివాహ । ౧౦౦

క. శివభక్తుఁడు శాంతుండును । నవు భక్తున కక్షదాన మది సేయఁదగున్
దివిరి యది యిచ్చు పుణ్యం । బవితథమగు దానిఁ బొగడ నలవియె పుత్రా । ౧౦౧

క. భృతరుద్రాక్షున కన్నం । బతిభక్తిని బెట్టెనేని యాతని మహిమన్
నుతిసేయఁ దరమె రజత । క్షితిధరమున సంతతము వసించు కుమారా । ౧౦౨

క. మొగమున బూదియు మేన । దగ రుద్రాక్షమును లేక తరుణేందుధరుణ్
మొగిఁ జూడరాదు గుడి కే । గఁగరా దతఁడు శ్వపచుండుగాదే తనయా । ౧౦౩

తే.గీ. మాలమాదిగవాండ్రతో మాల్మి గన్న । నంజుడును దిన్న మద్యపానంబు గొన్న
బరసతినిఁ గొన్న సకలపాపములు సున్న।తలను రుద్రాక్ష యొక్కటి తాల్చియున్న ౧౦౪

తే.గీ. సకలవేదపురాణముల్ చదువు ఫలము । సర్వతీర్థాభిగమనంబు సలుపుఫలము
నిఖిలయజ్ఞతపోదాన నిష్ఠఫలము । భక్తి రుద్రాక్షదాల్చిన ఫలము సమము. ౧౦౫

క. రుద్రాక్షము ధరియించిన । శూద్రుఁడు మాలండు సెందు శూలిత్వంబున్
రుద్రాక్షము సతతంబును । భద్రంబు లొసంగుచుండు భక్తులకు సుతా । ౧౦౬

వ. కీకటంబున గర్దభంబునుబోలె రుద్రాక్షంబు ధరించువాఁడు శివలోకంబునుం బొందు ననిన
విని స్కందుండు తండ్రీ । యక్కథ యెట్టిది తెలుపుమనినఁ బుత్రకా । వినుమని
యిట్లనియె. ౧౦౭

క. మును వింధ్యపర్వతంబున । తనయా గర్దభము గలదు తజ్జంతువు వీ
పున రుద్రాక్షభరం బిడి । వెనుఁబడి యొక బేరఁగాడు వేగమ తోలెన్. ౧౦౮

ఆ.వె. మోయలేక గాడ్దె ముట్టెసరచి పడి । గంతుగొట్టె దానిఁ గరుణఁజూచి
నాసమీపమందు వాసంబుసేయఁగాఁ । గాచినాఁడఁ గృత్తికాతనూజ । ౧౦౯

వ. మఱియు నొక కథ సెప్పెద వినుము. కోసలంబున గిరినాథుండను ద్విజుండు గలడు.
వాఁడు ధనవంతుండును, ధర్మాత్ముండును, వేదవేదాంగపారంగతుండును నై వర్ధిల్లు.
నతనికిఁ గందర్పసుందరుండైన గుణనిధియను కొమరుండు గలండు. వాని గురుండు
సుధిషణుండు, వాని భార్య ముక్తావళి యనునది. తన యౌవనమదంబుచే గుణనిధి ముక్తా
వళిని మోహింపఁజేసి కలయుటయెుండెకాదు, సుధిషణునకు విషంబు వెట్టించి తన మాతా
పితలకు నది తెలియుటంజేసి వారలకును దద్విషంబ ప్రయోగించి యందఱం జంపి నానా
విలాసభోగంబుల ద్రవ్యంబు వెచ్చపుచ్చుచు, బ్రాహ్మణగృహంబుల దొంగిలించుచు, సురా
పానమదోన్మత్తుండై బంధుజహిష్కృతుండై గ్రామంబునుండి వెడలఁగొట్టంబడి ముక్తా
వళిం గూడి గహనంబునకుం బోవుచు మార్గంబున బ్రాహ్మణసహస్రంబులం దునిమి
కాలంబు గడుపుచుండఁ గొన్నాళ్ళ కంతకాలంబు వచ్చి సమసిన యమదూతలు గముల్కై
నిలువ శివలోకంబునుండి శివగణంబులు సేరి యమదూతలం బెదరింప నుభయపక్షంబులకు
వివాదంబు పొసఁగె నంత. ౧౧౦

క. కాలుభటు లిద్దఁగ మహా । కాలుభటులు వారిఁ దన్ని కడకొత్తిన పె
న్నాలంబున కయ్యది మును । మూలంబై పొసఁగ వినయమున యమదూతల్. ౧౧౧

క. వీనికిఁ బుణ్యము లేదీ । శానునిలోకంబు నొందఁ జాలునె యనుఁడున్
వీనికి సమీపధారుణి । పైనన్ రుద్రాక్ష మున్నభంగి నెఱుఁగరే । ౧౧౨

వ. అనిన విని యమదూతలు రుద్రాక్షమహిమంబు దెలుసుకొని నిజలోకంబునకుం జనిరి. శివ దూతలు గుణనిధిని శంకరాలయంబునకుం గొని చని రని చెప్పి మఱియు రుద్రాక్షమంత్ర లక్షణ విన్యాసంబు దెలిపెద వినుమని యిట్లనియె. ౧౧౩

## —: రుద్రాక్ష మంత్ర లక్షణ విన్యాసము :—

ఆ. వె. లక్షపుణ్యములును లభియించుఁ జూచిన । ముట్టెనేనిఁ గోటి పుణ్యములగు
పూనెనేవి భూరి పుణ్యము ల్సమకూరు । నక్షమహిమ మెన్న నలవియగునె. ౧౧౪

ఆ.వె. అక్షమాలఁ బూని దక్షుఁడై జపియింప । లక్ష లక్షకోటి లక్షకోటి
పుణ్యములను బొందు బుత్ర సంశయమేల । నక్షమహిమ మెన్న నలవియగునె । ౧౧౫

క. రుద్రాక్షంబులలోపల । భద్రాక్షముఁ బూనెనేని బహుఫలద మగున్
భద్రము ధాత్రీఫలసమ । సద్రూపం బయ్యేనేని సర్వోత్తమమౌ. ౧౧౬

తే.గీ. మధ్యమము రేఁగుఁబండుసామ్యమువహింప । యధమమగు ఛణమాత్రమై యలరెనేని
తెలు పెఱుపు పస్పు నలుపులఁ దెలియుమింక । బ్రాహ్మణక్షత్రియవిడంఘ్రిభవములంచు. ౧౧౭

తే.గీ. స్వీయవర్ణాధములుతాల్ప శ్రేయమండ్రు।సమములును దృఢములును స్నిగ్ధములు కంట
కయుతములు శుభములు క్రిమి కలిత భిన్న।కంటకరహితములు మేలుకాదుసుమ్ము. ౧౧౮

తే.గీ. పుండుకూడదు సుడిచుట్టి యుండరాదు।మఱి షడక్షంబు కొరగాదు మహిఁ దలంపఁ
దొలి తనంతటఁ గల్గిన దొడ్డదండ్రు । పౌరుషంబైన మధ్యమఫలము నిచ్చు. ౧౧౯

తే.గీ. ఒఱయ బంగారురంగైన నుత్తమంబు।రెండయిన మూడయిన పేసు లుండవచ్చు
గంఠదేశంబునను గర్ణికలను మకుట । హార కేయూర ముఖముల నదుకవచ్చు. ౧౨౦

వ. శిరంబున నీశానమంత్రంబును, కర్ణంబునఁ దత్పురుషేదమంత్రంబును, లలాటంబున నఘోరమంత్రంబును హృదయంబునం దానకరంబుల నఘోరబీజమంత్రంబులును,నంగంబునం బంచబ్రహ్మంబులను, మూలమంత్రంబున సర్వాక్షంబులును ధరియించునది. మఱియు నేకవక్త్రంబు పరతత్వప్రకాశకంబు, ద్వివక్త్రం బర్ధనారీశ్వరంబు, త్రివక్త్రం బగ్ని రూపంబు.చతుర్వక్త్రంబు పితామహ స్వరూపంబు పంచముఖంబు పంచబ్రహ్మస్వరూపంబు, షణ్ముఖంబు కార్తికేయ వినాయకరూపంబు, సప్తవక్త్రంబు సప్తమాతృకారూపంబును,సప్తాశ్వదైవతరూపంబును, సప్తముని రూపకంబును నగు, నష్టవక్త్రంబగు రుద్రాక్షం బష్టమాతృకారూపంబును, వస్వష్టప్రీతికరంబును నగు, నవముఖంబు యమదేవతాకంబు,

దశముఖంబు దశదిశాదేవతాకంబు, ఏకాదశముఖంబు రుద్రైకాదశదేవతాకంబు, ద్వాదశ ముఖంబు విష్ణురూపంబు, త్రయోదశముఖంబు మదనదేవతాకంబు, చతుర్దశముఖంబు పరమేశ్వరదేవతాకంబు గావున నివి సర్వకామదంబులగు. మద్య మాంస లశున పలాండు శిగ్రు శ్లేష్మాంత విడ్వ రాహభక్షణంబు వర్జించునది. గ్రహణంబున, విషువత్తున, సంక్రమణంబున, నయనంబున, దర్శను, బూర్ణిమను దక్కు పుణ్యదినంబులను రుద్రాక్షధారణంబు సేయునది. దద్భక్షణపరుసైతము భక్షంబులు వర్జించునది అని శివుండు కుమారునకుం జెప్పెననిపల్కి నారదునకు నారాయణుం డిట్లనియె. ౧-౨౧

## —: భూ త శు ద్ధి :—

ఆ.వె. వినుము భూతశుద్ధి విధము మూలాధార । మందునుండి లేచి యా సుషుమ్న
గదసి బ్రహ్మరంధ్ర గతమైన కుండలి । శక్తి నాదిదేవి సంస్మరింతు. ౧-౨౨

వ. మఱియు జీవంబు హంసంబుచే బ్రహ్మమందుఁ గల్పి, పాదాది జానుపర్యంతంబు చతుష్కోణంబై సవజ్రకంబై, స్వర్ణవర్ణకంబైన భూమండలంబును, జాన్వాది నాభిపర్యంతంబు చంద్రార్ధనిభంబై, లం బీజయుక్తంబునుగా స్మరింపవలయు. నాభ్యాది జానువర్యంతంబును అర్ధచంద్రనిభంబును, పదద్వయాంతంబును, వంబీజయుక్తంబును, శ్వేతాఢ్యంబును నగు జలమండలంబు స్మరింపవలయు, నాభ్యాది హృదయపర్యంతంబును త్రికోణంబును, స్వస్తికాన్వితంబును, రం బీజయుక్తంబును, రక్తవర్ణంబును నగు పావకమండలంబు స్మరియింపవలయు. హృదయాది భ్రూమధ్యపర్యంతంబును వృత్తంబును, షడ్బిందులాంఛితంబును, యం బీజయుక్తంబును, ధూమ్రవర్ణంబును నగు వాయుమండలంబును స్మరింపవలయు. ఆభ్రూమధ్య బ్రహ్మరంధ్రపర్యంతంబును వృత్తంబును, స్వచ్ఛంబును, మనోహరంబును. హం బీజయుక్తంబును నగు నాకాశమండలంబు స్మరింపవలయు. భూమిని జలంబున, జలంబు నగ్నిని, నగ్ని వాయువునందు, వాయువు నాకాశంబునఁ గల్పి యాకాశంబు నహంకారంబున, నహంకారంబు మహత్తున, మహత్తునుఁ బ్రకృతి యందుఁ, బ్రకృతిని మాయయందు మాయ నాత్మయందు బ్రవిలాపంబుసేసి, శుద్ధజ్ఞానమయుండై వామకుక్షిస్థుండును, కృష్ణవర్ణుండును, నంగుష్ఠమాత్రుండును, బ్రహ్మహత్యాశిరోయుక్తుండును, కనకస్తేయబాహుకుండును, మదిరాపానహృదయుండును, గురుతల్పకటీయుతుండును, తత్సంసర్గిపదద్వయుండును నుపపాతకమస్తకురదును, ఖడ్గచర్మధరుండును, దుష్టుండును, అధోవక్త్రుండును, దుస్సహుండును నగు పాపపూరుషుం దలఁచి వాయుబీజంబున శోషింపంజేసి, వహ్నిబీజంబున దాహంబుసేసి, కుంభకంబున బహిర్భస్మంబు వాయుబీజంబున తేపి, సుధాబీజంబునం దడిపి, భూబీజంబున ముద్దఁజేసి, యాకాశబీజంబున విశుద్ధముకురాకారంబుసేసి, మూర్ధాదిపాదపర్యంతం బంగంబుల రచియించునది. ఆకాశభూతంబుల భస్మంబును పునరుత్పాదనంబు సేయునది. సోహంమంత్రం

బుచే హృదయంబున కాత్మను దెచ్చునది పరసంగంబుననుండి సుధామయంబగుకుండలీ జీవంబుం దెచ్చి హృదయాంబుజంబున నిల్పి మూలాధారగత యగు శక్తిని ధ్యానించునది. ౧౨౩

సీ. రక్తవారాశిలో రహిమించు నోడలో నరుణసరోజంబు నందునుండి
సిరిమించు శూలంబు చెఱకులో దండంబు తుమ్మెదగుణ మంకుశమ్ము నైదు
బాణమ్ములనుఁ గేళ్ళ బట్టి స్రుక్కునుఁ గపాలముఁ దాల్చి త్రిణయన లసితయగుచు
నా పీనవక్షోరుహాఢ్యయై బాలార్కవర్ణయై తాటంకకర్ణ యగుచు

తే.గీ. సకలజంతువులకుఁ బ్రాణశక్తియగుచు । నంతరాత్మస్వరూపిణి యగుచు నిఖిల
లోకపరిపాల నైకవిలోల యగుచు । దంబుగను దేవి మాకు సుఖంబు లిచ్చు. ౧౨౪

వ. అని పరాశక్తి యగు దేవిం ధ్యానించి విభూతి ధరించునది. ౧౨౫

## — శిరోవ్రతవిధానము :—

వ. మఱియు నిందు శిరోవ్రతంబు ముఖ్యంబు. దానిం గావించికాదె బ్రహ్మాదులు దేవతలైరి. ఇది యథర్వణశ్రుతివిదితంబు. శాఖాభేదంబులచే నామభేదంబు గలిగినను వస్తువు లేకం బకాన ఫలంబు సమంబగు. అగ్నిరిత్యాదులగు మంత్రంబు లాఱిఁటిచే శుద్ధంబగు భస్మంబు గొని సర్వాంగోద్ధూలనంబుసేయుట శిరోవ్రతంబు. ఇది ద్వాదశాబ్దవ్రతంబనియు, నబ్దవ్రతం బనియు, నద్ధారవ్రతంబనియు, ద్వాదశాహవ్రతంబనియు పలుదెఱంగులు. మఱియు శిరోవ్రతస్నాతుండగువాఁ డుపదేశించుటకు సందియంపడెనేని వినష్టవిద్యుండగు. బ్రహ్మవిద్యాకుశలుండునుఁ, గారుణికుండును, మునియును, మృదుండును, నిర్మలమనస్కుండును నగువాడే శిరోవ్రతోపదేశంబుసేయుట కర్హుండు. శిరోవ్రతోపదేశంబు బ్రహ్మవిద్యోపదేశంబునకుఁ దుల్యంబని నమ్మము. త్రిపుండ్రధారణంబు జాబాలులచేఁ జెప్పంబడియె. సతారంబగు త్ర్యంబకమంత్రంబుచే గృహస్థుండు త్రిపుండ్రధారణంబు సేయవలయు. ద్విరుక్తంబగు నోంకారహంసంబుచే సన్యాసియు, మేధావీత్యాది మంత్రంబుచే బ్రహ్మచారియు ధరించునది. వనప్రస్థుండు గృహస్థునితో సముండు. త్రిపుండ్రంబు భస్మంబున నొండెన్ జల బుననొండెఁ ధరించునది. నిత్యంబును దిర్యగ్రేఖలు దేర ధరింపవలయు. త్రిపుండ్రధారి కాఁడేని వైదికుండు కానేరఁడు. సర్వకర్మ బహిష్కృతుండును నగు. ప్రణవంబుచేఁగాని, బంచాక్షరంబుచేఁగాని యతి లలాట హృదయ బాహుప్రదేశంబుల దప్పక విభూతిం ద్రిపుండ్రంబుఁ దాల్పవలయు. త్రియాయుషమంత్రంబుచేఁగాని, మేధావీ మంత్రంబుచేఁగాని;గౌణభస్మంబునం బ్రహ్మచారి త్రిపుండ్రంబు ధరింపవలయు. ప్రణవంబు నకుమారు నమఃపదం బంతంబున నిడి శూద్రుండు భస్మోద్ధూళనంబు భక్తికొలఁదిం జేయ

నొప్పు. వేదమంత్రంబు ద్విజేతరులకుం దగదు. అగ్నిహోత్రజంబగు భస్మంబుగాని, విరజాగ్నిజంబగు భస్మంబుగాని శుద్ధపాత్రంబునం బునఃప్రక్షాళించి, పాణిపాదంబులం గడిగి, రెం డాచమనంబులుచేసి, సమాహితమనస్కుండై భస్మంబు పంచబ్రహ్మ మంత్రంబులచే మెల్ల మెల్లం గొని ప్రాణాయామత్రయంబు చేసి, అగ్నిరిత్యాది మంత్రంబులచే నేడుసారు లభిమంత్రించి, యోమాపోజ్యోతి రిత్యాదులచే ధ్యానంబు సేసి, మొదట భస్మంబు శరీరోద్ధూళనంబు సేసికొనవలయును. ధరించు భూతి నిర్మలంబుగా నుండఁదగు. తదనంతరం బా జగన్నాథుండగు నారాయణుని ధ్యానించి, తోయంబుగొని భస్మంబు దడిపి కలిపి యూర్ధ్వమస్తంబున ముందుగాఁ ద్రిపుండ్రంబువెట్టి, మధ్యమానామికాంగుష్ఠంబులచే ననులోమ విలోమంబులుగాఁ ద్రికాలంబులం ద్రిపుండ్రంబు ధరియించునది యని చెప్పె నారాయణుండు. ౧౨౬

## —: గౌణభస్మానువర్ణనము :—

క. ఓ నారద గౌణం బ । జ్ఞానధ్వంసకము మఱియు జ్ఞానదము నగుఁ
నానావిధ మది దెలియుము । భూనుతము విభూతిమహిమ పొగడగదరమే. ౧౨౭

క. ఔపాసనాగ్నిజంబును । నోపిక నాలింపు మగ్నిహోత్రజము సమి
ద్వ్యపము విరజానలజము । నా పచనాగ్నిజము దావజాభిఖ్యంబుఁ. ౧౨౮

క. ఔపాసనజము గృహికిఁ । బ్రాపౌ సమిదుద్భవంబు వర్ణికి నేటొ
గాపులకు బచనశిఖిజము । ప్రోపగు నితరులకు దావభూతి తలిర్పఁ. ౧౨౯

క. కాలము చిత్రాభంబును । మేలగు పూర్ణిమయు మఱియు మేదిని స్వీయం
బే లలితము క్షేత్ర వన వ । నీలాస్థలు లొప్పు నచటి కేగఁగవలయుఁ. ౧౩౦

సీ. పూర్వత్రయోదశిఁ బొలుపొంద స్నాతుఁడై యాహ్నికంబుల దీర్చి యార్యు గొల్చి
శుక్లాంబరము దాల్చి శుద్ధుఁడై యజ్ఞోపవీతియై తెల్లని విరులఁ దాల్చి
యలది గంధంబు దర్భాసనంబున నుండి దర్భముష్టినిఁ దగఁ దాల్చి పిదప
నలరంగ మూడుమా ర్లాయామములు సేసి ప్రాఙ్ముఖోదఙ్ముఖ భాతి నొప్పి

తే.గీ. దేవదేవుని ధ్యానించి తెలివి కలిగి । వ్రతము సేసెద నేను యావచ్ఛరీర
పాతమనియేని ద్వాదశాబ్దమనియేని । నాలు మూ డొక్కయేడుల ననుచునేని
మ్రొక్కుకొనఁదగు భక్తిచేఁ జిక్కి ద్విజుఁడు. ౧౩౧

వ. మఱియు నాలుమాసంబులేని, మూడుమాసంబులేనిఁ, బండ్రెండుదినంబులేని, యారు దినంబులేని, నొకనాడేని వ్రతంబుసేసెద నని సంకల్పించి విరజాహోమంబు నుండు విధివత్తుగా నగ్ని నాధానంబుసేసి, యాజ్య సమిచ్చరువుల విధిపూర్వకంబుగా హోమంబు

చేసి, పూతాహంబునకుఁ బూర్వంబ తత్త్వశుద్ధికై మూలమంత్రంబున సమిధాదుల వ్రేల్చి, ౧౩౨

క. తత్త్వంబులు నామెయి శు । ద్ధత్వంబునుఁ బొందఁజేసి తనరెడుఁ గాతన్
దత్త్వజ్ఞత్వము నా కిది । సత్వంబునుఁ గలుగఁజేసి సమధికలీలన్. ౧౩౩

వ. జ్ఞానేంద్రియంబు లైదునుఁ, గర్మేంద్రియంబు లైదునుఁ, ద్వగాదిధాతువు లేడునుఁ, బ్రాణాదివాయువు లైదును, మనోబుద్ధ్యహంకారంబులును, గుణంబులు మూడును, బ్రకృతిపురుషులును, రాగంబును, విద్యయుఁ గలయు నియతియుఁ, గాలంబును, మాయయు, శుద్ధవిద్యయు, మహేశ్వరసదాశివులును, శక్తియు, శివతత్వంబును, దత్వంబులును ననంబడు విరజమంత్రంబులచే హోమంబు సేసి, హోత విరజుండగు. వెండియు గోమయంబు దెచ్చి పిండంబులు సేసి యభిమంత్రించి యగ్నియం దుంచి దినంబున దానిఁ గాపాడుచు హవిష్యంబు భుజియించి చతుర్దశీప్రభాతంబునఁ బూర్వోక్తంబంతయు నడిపి యా దినంబు నిరాహారుండై కాలశేషంబుగడిపి పూర్ణిమనాడు ప్రాతఃకాలంబునం దొల్లిఁటిలాగు సేసి హోమాంతంబున రుద్రాగ్ని నుపసంహరించి భస్మంబుగొని జటిలుండేని, ముండుండేని, నేకజటుండేని నగుచు లజ్జాహీనుండయ్యేనేని దిగంబరుండై, తక్కేనేనిఁ గాషాయవసన చర్మ చీనాంబరంబుల నెద్దేనిఁ దాల్చి ఏకాంబరుండై దండంబు వట్టి, మొలనూలు గట్టి, పాదంబులు గడిగికొని, రెండుమూరు లాచమనంబులు సేసి విరజానలసంభవంబగు భస్మంబు ప్రోగుజేసి యగ్నిరిత్యాద్యథర్వణ షణ్మంత్రంబులచే మూర్ధాది చరణాంతంబు పూసి, ప్రణవంబునంగాని, శివమంత్రంబునంగాని సర్వాంగోద్ధూలనంబు సేసి, త్రియాయుష సమాహ్వయంబగు త్రిపుండ్రంబు ధరించునది. ఇట్లు త్రిసంధ్యలఁ బాశుపతవ్రతంబు సలిపెనేని భుక్తిముక్తిప్రదంబై, పశుత్వ వినివర్తకం బగు. ౧౩౪

క. ఆయుష్య మిచ్చు బల మిడు । శ్రీయొసఁగును రోగ మడఁచుఁ జిరపుష్టిదమౌ
నీ యాచారము మునిమత । మై యత్యంతంబు శుభదమై సిరు లిచ్చున్. ౧౩౫

క. ఈమాడ్కి భూతిఁ దాల్ప మ । హామారి భయంబు దొలఁగు నఖిలార్థములన్
సేమము శాంతిక పౌష్టిక । హేమద కామదము లనఁగ నిది మూడయ్యెన్. ౧౩౬

క. మూడువిధంబుల భస్మం । బీడితమగు మొదవు కరిని నెనఁయగ జేతన్
బేఁడఁగొని బ్రాహ్మమనువున । గాడం గాల్పంగ శాంతికం బగు ననఘా. ౧౩౭

ఆ.వె. మొదవు గుదమునుండి యొదవుచో నంతరి । క్షంబునందుఁ బట్టి షట్శరీర
మంత్రముననుఁ బేఁడ మహిమతోఁ గాల్చినఁ । బౌష్టికం బటంద్రు పరమమునులు. ౧౩౮

క. ఓ సంయమివర వినుమా । ప్రాసాదమనువునఁ గాల్ప భస్మంబై నం
భాసురకామదమైచను । దోసము లడఁగించి శుభము దొరకొనఁజేయున్. ౧౩౯

తే.గీ. ప్రొద్దుననెలేచి యాహ్నికములనుఁ దీర్చి । మందకునుఁ బోయి యాలకు వందనమిడి
నిండువెన్నెల గోవుల పెండఁజేర । వర్ణభేదంబు లెఱుఁగంగవలయుఁజుమ్మ. ౧౪౦

క. వెల్లావు బ్రాహ్మణునకునుఁ । బల్లా వా క్షత్రియునకు వైశ్యునకును రం
జిల్లెడి దోరావును మఱి । నల్లా వా శూద్రునకును నాణెంబులగున్. ౧౪౧

వ. మరియుఁ బౌర్ణమ్యమావాస్యాష్టములఁ బ్రాసాదమంత్రంబుచే గోమయంబు దెచ్చి హృదయమంత్రంబుచేఁ బిడుకలుసేసి శుచిప్రదేశంబున సూర్యకిరణంబుల నార్చి ప్రాసాదమంత్రంబుచే నుముకతోఁగాని, పొల్లుతోఁగాని కల్పి, యరణ్యంబునుండియేని, శ్రోత్రియగృహంబునుండియేని నగ్నిఁ దెచ్చి శివబీజంబుచే ముట్టించి, విచక్షణుఁడగువాఁడు వహ్నికుండంబుననుండి భస్మంబు తివిచి. నవపాత్రంబుదెచ్చి యందుఁ బ్రాసాదమంత్రంబుచే నునిచి, మొగలి, కలిగొట్టు, కుంకుమ, చందనంబులు మొదలుగాఁగల సుగంధద్రవ్యంబులు చేర్చి, సద్యోమంత్రంబునఁ బాత్రం బచ్చట నునిచి, మొదట జలస్నానంబు సేసి, పిదప భస్మస్నానంబుచేసి, జలస్నానంబున కసమర్థుఁడగువాఁడు భస్మస్నానము మాత్రముచేసి, యీశానమంత్రంబునఁ బాణి పాద శిరంబులు గడిగికొని, తత్పురుషంబున నాననంబును, నఘోరంబున హృదయంబును, వామంబుచే నాభియు, సద్యోమంత్రంబుచే సర్వాంగంబు నుద్ధూలింపవలయు. తదనంతరము పూర్వవస్త్రపరిత్యాగంబును, శుద్ధవస్త్రపరిగ్రహంబునుం జేసి, బాద పాణులఁ గడిగికొని, త్రిపుండ్రంబు ధరియించునది. మధ్యాహ్నంబునకుంబూర్వంబు భస్మంబు తడిపి ధరియించునది. తత్పరంబు జలవర్జితంబని నెఱుంగునది. తర్జన్యనామికామధ్యంబులచే మూర్ధంబునను, లలాటంబునను, గర్ణంబులఁ, గంఠంబున, హృదయంబున, బాహువుల భస్మన్యాసంబు సేయునది. ప్రాసాదమంత్రంబుచేఁ బంచాగుళుల మూర్ధంబునందు, శిరోమంత్రంబుచేఁ ద్ర్యంగుళుల ఫాలంబునందు, సద్యోమంత్రంబుచే దక్షిణకర్ణంబున మధ్యాంగుళిచేతను, వామదేవమంత్రంబుచే వామకర్ణంబున మధ్యాంగుళివలనను, అఘోరమంత్రంబున మధ్యాంగుళిచేఁ గంఠంబునందు, హృదయమంత్రంబున మూడంగుళులచే హృదయంబునను, శిఖామంత్రంబుచే దక్షిణబాహువునఁ, గవచంబుచే వామబాహువున ద్ర్యంగుళులవలనను, యీశానమంత్రంబుచే మధ్యాంగుళితోడ నాభిని స్పృశించవలయు. ౧౪౨

క. వనజభవుఁడును ముకుందుఁడు । త్రినయనుఁడును రేఖలైరి దీనిం గనుమా
మునివర క్రమమున మొదటిది।యును రెండవదియును మూడ్వ వొగిఁబుండ్రమునన్. ౧౪౩

తే.గీ. అభవుఁ దేకాంగుళన్యాస మందునుండు।శిరమునందుండు నా బ్రహ్మ చేరి నొసట
శివుఁడు వసియించు నశ్వినుల్ చెవులనుండ్రు।గణపతి వసించు నెప్పుడుఁ గంఠమందు. ౧౪౪

## —: కల్పాంతరోక్త భస్మధారణ లక్షణము :—

క. మరియుం జెప్పెదఁ గల్పాం । తర మొక్కటి వినుము దానిఁ గామ్యఫలదమై
పరగునుఁ గపిల శకృత్తం । బరమునఁ బట్టికొని తెచ్చి పరమప్రీతిన్. ౧౪౫

ఆ.వె. పుఱ్ఱు, పిట్టు, కంపు బురదవంటిదిగాక । మంచి దేర్చి పైది మాని పిడక
జేసి మూలమంత్ర సిద్ధంబుగాఁ గాల్చి । భస్మ మొక్క బరిణఁ బట్టవలయు. ౧౪౬

క. బంగారు వెండి బరిణలు । శృంగారముల ధనులైనఁ జేయింపఁదగున్
రంగైన దారు మృత్తులఁ । బొంగుచు మోక్షార్థ మవ్విభూతికి మౌనీ ! ౧౪౭

క. పైనంబునఁ బోయెడితఱిఁ । దానేనియు ననుగుఁడేనిఁ దాల్పఁగవచ్చున్
బూని విభూత్యాధానము । పూనఁగరా దశుచి శుద్ధభువి నిడవలయున్. ౧౪౮

ఆ.వె. నియతి గల్గువాడు నీచాంగములయందుఁ । జల్లరాదు భూతి సకలగతుల
శుద్ధి చూడవలయుసుమ్ము వేదోక్తమం । త్రములఁ జేసినట్టి విమలభూతి. ౧౪౯

క. శివసన్నిధినుండి ద్విజుఁడు । శివభక్తుఁడు దెచ్చినట్టి శ్రీభూతి నొగిన్
శివ మనుచు భక్తిఁ గైకొని । శివమంత్రము సెప్పి తాల్పఁ జెలువముగుల్కన్. ౧౫౦

ఆ.వె. తంత్రయుక్తిచేతఁ దగఁ దాంత్రికులు సేయు । భూతిఁ గొనఁగవచ్చుఁ బుణ్యమబ్బు
భూతిమహిమ మెన్నఁ బురుషుని శక్యమే । మోక్షమునకు నదియె ముఖ్యపథము. ౧౫౧

తే. గీ. పగజ పాషండులేనిఁ గాపాలికాదు । లేనియు విభూతి మంచిది యిచ్చిరేని
భక్తిచేఁ బుండ్రమునుఁ దాల్పవలయుగాని । కాదనుట తప్పుసుమ్మి మర్యాదమీరి. ౧౫౨

క. నరుఁడు త్రిపుండ్రంబును । ధరియింపఁడయేనిఁ బరమదారుణ మగు న
న్నరకంబున నుండు ననుచు । నెఱుఁగుము మోక్షంబు వార లెఱుఁగుట కలదే. ౧౫౩

క. అంది విభూతిం గైకొని । యందముగ విభూతి నిడనియట్టి మనుజుఁ డా
పందేసుమి నరకములోఁ । గొందేసుమి వాని బ్రతుకు కుందిన వెనుకన్. ౧౫౪

క. పీడక విభూతిఁ దాల్చని । పాడుమొగము సూడరాదు పాపం బదియున్
గాడేసుమి కాల్చి విడుచు । మోడేసుమి యేమిచెప్ప మునికులవర్యా ! ౧౫౫

క. ఛీఛీ భూతిం దాల్పని । నీచులయినవార లెదుట నిల్చినయేనిం
జూచిన దోషము వచ్చును । బాచితమును గలదొ లేదొ పాపంబునకున్. ౧౫౬

ఆ.వె. జనుఁడు దాఁ ద్రిపుండ్రమును దాల్పక యొనర్చు । తపము రిత్త సలుపు జపము రిత్త
వ్రతము రిత్త వాని మతమును రిత్తయౌ । నతని కృతములెల్ల యకృతములగు. ౧౫౭

క. జనుఁడు త్రిపుండ్రము దాల్పక । యనఘత గోరుటఁ దలంప నత్యంతవిషా
శనుఁడై బ్రదుకం గోరుట । యనవచ్చునుఁజుమ్ము తాపసాన్వయచంద్రా ! ౧౫౮

వ. మఱియుఁ బ్రాఙ్ముఖుండై పాణిపదంబులు గడిగికొని, ప్రాణాయామంబు సేసి, సంకల్పించి భస్మస్నానంబు సేయవలయు. అగ్నిహోత్రసముద్భవంబగు శుద్ధభస్మంబు నీశానమంత్రంబుచే మూర్ధంబున నిడవలయు. తదనంతరంబ క్రమముగాఁ బురుషమంత్రంబున ముఖంబునందు, నఘోరమంత్రంబున హృదయంబునందు, వామదేవమంత్రంబున గుహ్యమునందు, సద్యోజాతమంత్రంబునఁ బాదంబులందు నుంచవలయు. వెండియుఁ బ్రణవంబున సర్వాంగోద్ధూలనంబు సేయవలయు. దీని భస్మస్నానం బం్రదు. సర్వకర్మ సంసిద్ధికొఱకిది మొదలఁ జేయవలయుఁ బిదపఁ గరపాదంబులు ప్రక్షాళించి యథావిధి స్పృశించి విధిక్రమంబునం బంచబ్రహ్మమంత్రంబులచే భసితంబు గొని లలాటంబునందును, హృదయంబునందునుఁ, గంఠంబునందును, ద్రిపుండ్రంబుఁ దాల్పవలయు. శూద్రాంత్యజుల హస్తంబునుండి భస్మంబు నందికొని యిది సేయరాదు. అగ్నిహోత్రజ భస్మలిప్తుండై కర్మ నారంభింపవలయు. గానినాఁడు ఫలంబులేదు. త్రిపుండ్రంబు లేని నాఁడు సత్య శౌచ జప హోమ తీర్థ దేవతాపూజనంబులు వ్యర్థంబులు. ౧౫౯

ఆ.వె. అనఘ శ్రాద్ధమందు యజ్ఞమందు జపంబు । నందు హోమమున సురార్చనమున
వైశ్వదేవమునను వలయుఁ ద్రిపుండ్రంబు । దీనిఁ దెలియఁదగును ధీవరేణ్య। ౧౬౦

క. శివలింగము మణిసఖ్యము । ప్రవిమలమంత్రంబు దలపఁ బంచాక్షరముꣳ
సువిభూతియు నౌషధములు । భవరాహితి ముక్తికాంత వలచుటకొఱకుꣳ. ౧౬౧

వ. మునీంద్రా ! త్రిపుండ్ర భస్మోద్ధూలనంబులు సర్వవైదికధర్మంబులకునుఁ గన్నాకులు. ఇవి బ్రహ్మయు, విష్ణుండును, శంకరుండును, సరస్వతియు, లక్ష్మియు, గౌరియు నెల్లప్పు డాచరించునవియ. ఇది సంపత్కరంబు. ఇది యపత్యకరంబు. ఇది యశ్వమేధతుల్యంబు, నిది వేదోదితంబు. ఇది శాస్త్రోక్తంబు, నిది యాగమవర్ణితంబు, నిది పురాణవిదితంబు, నిది జ్ఞానదంబు, నిది మోక్షదాయకంబు. ఇది సర్వవర్ణశ్రేయస్కరంబు. ఇది కుష్ఠ భగంధరాది రోగహరణంబు, నిది భూత ప్రేత పిశాచ మారకంబు, మహాపాతకోపపాతకాతిపాతకానుపాతక ప్రకీర్ణపాతక వినాశకంబు. దీని మహిమంబు వర్ణింప నెవ్వనితరంబు. వేయింటి కొక్కటి సెప్పెద, విభూతిధారణమాత్రంబున మోక్షంబుగలుగునని చెప్పి మఱియు, ౧౬౨

## —: త్రిపుండ్రోర్ధ్వపుండ్ర మహిమ :—

తే.గీ. అగ్ని రిత్యాది మంత్ర చోద్యంబుసేసి । భూతితోడను నొసటఁ ద్రిపుండ్రమిడిన
బ్రాహ్మణ క్షత్రియార్యుల ప్రబలమహిమ।యేమిసెప్పెద నీశ్వరుం డెఱుఁగునొకడు. ౧౬౩

ఆ.వె. మంత్రపూతభస్మ మహిమచే ద్విజుఁడగు । భస్మహీనముఖము పాడుబొంద
మాల యనఁగ వాఁడె మాదిగ యన వాఁడె । నిక్కువమ్ముసుమ్ము నిక్కువమ్ము. ౧౬౪

ఆ.వె. భూతిలేని సంధ్య బూదిఁ బోసిన నెయ్యి । భూతిలేని జపము కోఁతిజపము
భూతిలేని తిండి పుత్తిలోపలిగంజి । భూతిలేని మేను బోసితిత్తి. ౧౬౫

ఆ.వె. నడిమిమూడు వ్రేళ్ళఁ గడువేడ్క నిడఁదగు । భూతి నేత్రయుగ్మ పూర్తినొసట
అస్వరం బనామి కౌఖ్యంబు మధ్యమం । బగును మలిపియెన్న నన్నవ్రేలు. ౧౬౬

వ. ఇందున కొక యుపాఖ్యానంబు సెప్పెద వినుము. తొల్లి దూర్వాసుండు భస్మదిగ్ధసర్వాంగుండై రుద్రాక్షమాలికాధరుండై జగదంబానామసంకీర్తనపరుండై పితృలోకంబున కరిగినం గవ్యవాలాదులగు మహర్షు లెదురుగా వచ్చి ప్రత్యుద్ధానాభివందనంబు లాచరించి సకలోపచారంబులు కావించి యచ్చటచ్చటి ముచ్చటలం బ్రొద్దుపుచ్చుసమయంబున. ౧౬౭

క. శోకము నొందుచుఁ గుంభీ । పాకంబున నుడుకునట్టి పాపులు భీతిన్
గేకలు పెలుచ నిడిరి మొ । ఱ్ఱో కుయ్యో చచ్చితి మిదె బ్రుంగితి మనుచున్. ౧౬౮

క. సంయమినీపురమందున్ । సంయమి దూర్వాసుఁ డాత్మసంశయమందన్
గుంయో కుంయో ఘనరవ । సంయుక్తంబయ్యె శోకసంతాపమునన్. ౧౬౯

క. దానిని విని దూర్వాసుఁడు । మౌనులతో ననియె సుగుణమండితులారా
యీ నినద మ్మనకుఁ గారణ । మేను వినవలఁతు వచింపుఁడీ యన వారల్. ౧౭౦

క. మునినాథ కలఁడు సంయమ । ని నియముఁడను రాజు దీని నీ వెఱుఁగుదకా
ఘనుఁ డతఁడు పాపులకు శి । క్షను విధియించును స్వకర్మసమభోగములన్. ౧౭౧

ఆ.వె. నీలిరంగులవారు నీలికోకలవారు । దుడ్డవారు గసిక తెడ్డవారు
దూత లున్నవారు పాతకులగువారిఁ । బట్టితెత్తు రిటకుఁ గట్టి కొట్టి. ౧౭౨

క. సలసల నూనియ క్రాగన్ । గలగలమండుచును భీతిఁగావించుచు నిం
దలఘువులగు కుండంబులు । కల వెనుఁబదియాఱు పాపకర్ములపాలన్. ౧౭౩

క. వినుమా కుంభీపాకం । బనుకుండము మిగుల గొప్ప దా కుండము వ
ర్ణన మొనరింపఁగ నాఱేం । డ్లునుఁ జాలవు వినుము దాన డుల్లెడువారల్. ౧౭౪

శా. దేవీద్రోహులు శంకరాహితులు శ్రీదేవీవిభుద్రోహులున్
దేవ బ్రాహ్మణ వేద నిందకులు నాదిత్యోగ్రగజద్రోహులున్
వ్యావృత్తాంగజతంత్రతాపజననా ద్యాచారవంతుల్ గుణా
భావుల్ దుఃఖమునొందుచుం బడుదు రీ బల్ఘోరకుండంబునన్. ౧౭౫

వ. మఱియు మాతృ పితృ జ్యేష్ఠ పురాణ స్మృతి నిందకులును నీ మహాఘోరకుండంబునం బడి కేకలువేయుచుందు రనిన విని మునీంద్రుండు కుండసమీపమునకుం జని తలవాంచి చూచినప్పు డా పాతకులు స్వర్గసుఖంబునకంటె నెక్కుడై నవ్వుచుఁ, బాడుచు, నాడుచుఁ

బరస్పరవినోదంబుల మృదంగ వీణా ఢక్కా దుందుభి స్వరంబుల మధురవినోదాయ త్త చిత్తులై మత్తులై యుండం గాంచి మును లత్యంత విస్మయంబునంది తమ రాజుకడకుం జని యా విచిత్రంబు సెప్పిన నతండు మహిషారూఢుండై వచ్చి చూచి యీ వార్త దేవేంద్రున కెఱింగించిన నతం డైరావతారూఢుండై బ్రహ్మ విష్ణులకుం దెలుప వారును వచ్చి చూచి రింతియకాక నానాదిక్పాలకులును దేవతలును జనుదెంచి యీ కుండంబుచుట్టు విడిసి యిది మహాపాపులశిక్ష కొఱ కేర్పడియు స్వర్గఫలం బిచ్చుచున్నదని యచ్చెరువడి రంత. ౧౭౬

సీ. అపుడు దేవతలెల్ల నంబుజాక్షునిఁ జేరి మ్రొక్కిన న ద్దివ్యమూర్తి కరుణ
నీక్షించి శంకరు నింటికిఁ దా నేగి యర్ధనారీశ్వరుం డగుచుఁ గోటి
కందర్పసుందరాకారుఁడై చంద్రార్ధభూషణుండయి మృదుభాష లొప్ప
వరణీయ షోడశవర్షవయస్కుఁడై భూరి చారుభుజంగధారి యగుచు

తే.గీ. నలప నీశ్వరుఁ గనుఁగొని యమునిపురిని । బొసఁగిన విచిత్రకథ సెప్పి పుష్పబాణ
వైరి గౌరీశ యందుల కారణంబు । దెల్పవే యన నవ్వి య ద్దేవుఁ డనియె. ౧౭౭

చ. వినుము ఖగేంద్రవాహ యిది విస్మయమయ్యెను మీకు నే నెఱుం
గనె మహనీయభస్మముగుణం బని యత్త్రిజుఁ దేగుదెంచి చూ
చెను దనులి ప్తభస్ముఁడయి చెల్వగు త త్త్రిసరేణుపుంజమున్
బెనసి సుఖంబుగాంచి కడుపెంపున నిర్మలులైరి పాతకుల్. ౧౭౮

క. ఇటనుండి భూతిమహిమన్ । బటుతీర్థంబగును జోటు పావనమై సం
కటరహితము పితృతీర్థం । బఁటని జనుల్ పిలువ వికసితాంబుజనేత్రా । ౧౭౯

క. ఆ తీర్థంబున నెవ్వడు । స్నాతుండగు నతఁడు సకలసౌఖ్యము లందున్
బ్రీతిన్ బితృలోకులు పటు । రీతిఁ బ్రతిష్ఠింతు రొక్క లింగం బచటన్. ౧౮౦

క. ఆ లింగము పూజించెద । రోలిం దన్నగరవాసు లుల్లాసమునన్
దైత్రిలోక్యమాత యచ్చట । లీలం బూజింపఁబడుఁజూడీ నిరతంబున్. ౧౮౧

వ. ఇట్లు శశిధరుండు భస్మంబు మహిమ సెప్పిన విని యఖిల దేవత లత్యాశ్చర్యంబు నొంది యా తీర్థంబున లింగంబుం బ్రతిష్ఠించి దేవీనికాంతంబు నిర్మించి పూజించి విమానారూఢులై చనిరి. నాటనుండి యచ్చట భద్రగణంబులు పరిపాలకులై యుందురు. కుంభీపాకంబు మఱియొక దూరప్రదేశంబున స్థాపింపబడియె. మఱియు వైష్ణవాగమప్రసిద్ధం బగు నూర్ధ్వపుండ్రంబుంగూర్చి చెప్పెద వినుము నారదా యని నారాయణుండు. ౧౮౨

తే.గీ. పర్వతాగ్ర నదీతీర భాగములను । క్షేత్రములయందు మఱియును సింధుతీర
మునను దులసిమొదల మంచి పుట్టలందు । మృత్తుఁ గొనఁదగు నధికసంపత్తిగోరి. ౧౮౩

క. శ్యామము శాంతికరంబగు । భూమిం బీతంబు దా విభూతిద మరుణం
బాతత వశ్యకరంబగు । శ్వేతము ధర్మార్థమోక్ష సిద్ధిద మనఘా ! ౧౮౪

క. అంగుష్ఠము పుష్టిదమగు । బొంగుచు నాయుష్య నొసంగు భువి మధ్యమ మొ
ప్పంగ ననామిక యన్నము । సంగుఁ బ్రదేశిని యు ముక్తిసాధనముసుమీ. ౧౮౫

తే.గీ. వర్తిదీపంబువలె వేణుపత్త్రమువలెఁ బద్మముకుళంబువలెఁ గచ్ఛప ఝష శంఖ
రూపములఁబోలె నుంచిన రూఢి సకల । భోగభాగ్యప్రదంబగు మునిపరేణ్య ! ౧౮౬

క. నదియంగుళముల పుండ్రం । బది యుత్తమపుండ్రము తొమ్మిదట మధ్యమమౌ
విదితం బెన్మిది యేడా । రు దుది నయిదు నడుమనే వరుసఁగా వర్తిల్లున్. ౧౮౭

క. నలుమూడిరంగుళంబులఁ । బొలిచినను గనిష్ఠమండ్రు మునివరులు సదా
విలసిల్లు నూర్ధ్వపుండ్రము । చెలువము వర్ణింపఁదరమె శేషునకైనన్. ౧౮౮

వ. మఱియు నొసటఁ గేశవుండును, నుదరంబున నారాయణుండును, హృదయంబున మాధవుండును, గంఠంబున గోవిందుండును, నుదరదక్షిణపార్శ్వంబున విష్ణుండును, బాహుమధ్యదక్షిణపార్శ్వంబున మధుసూదనుండును, గర్ణదేశంబునఁ ద్రివిక్రముండును, నుదరవామభాగంబున వామనుండును, బాహువామభాగంబున శ్రీధరుండును, వామకర్ణంబున హృషీకేశుండును, బృష్ఠంబునం బద్మనాభుండును, గకుత్తున దామోదరుండును, ఇట్లు ద్వాదశదేశంబుల నయ్యైనామంబుల నుచ్చరించుచు నూర్ధ్వపుండ్రంబు ధరించునది. అశుచియైనను, ననాచారుండైనను, నూర్ధ్వపుండ్రాంకితుండు పూతుండగునని చెప్పి వెండియు, ౧౮౯

క. నరుఁ డూర్ధ్వపుండ్ర మిడినన్ । సరవి న్నాలోక మధిక సామీప్యంబై
పరగును శ్వపచునకేనిన్ । గరమరుదగు నూర్ధ్వపుండ్ర ఘనమహిమ మొగిన్. ౧౯౦

తే.గీ. జగతి నేకాంతులగు భక్తజనులు సాంత । రాళమగు పుండ్ర మిడుదురు రమ్యలీల
నదియు విష్ణుపదాకృతి నమరియుండు । నూర్ధ్వపుండ్రంబునకు సాటి యుర్విఁ గలదె ! ౧౯౧

క. పరమైకాంతులు గల రా । వరభక్తులు సాంతరాళ వైఖరి నెపుడున్
ధరియింతురు పుండ్రంబును । సిరిగా శ్రీచూర్ణరేఖఁ జేకొని నడుమన్. ౧౯౨

క. మఱికొందఱు నా భక్తులు । సరిగా నచ్ఛిద్రపుండ్ర శాలులుగల రా
పరమశుభకార్యులై తగు । నరు లంబుజ వేణుపత్త్ర నానాకృతులన్. ౧౯౩

క. అచ్ఛిద్రంబైనను మఱి । సచ్ఛిద్రంబైన భక్తిసహితులగుచుఁ దా
రచ్యుత నిడినం బాతక । విచ్ఛేదము గల్గి పరమవిభవప్రదమౌ. ౧౯౪

వ. ఓమంతంబులగు గేశవాది నామంబులచే దండాకారోర్ధ్వంబిడిన నంతియచాలు. సాంతరాళంబుగా, శ్రీచూర్ణసహితంబుగా నిడినను శ్రేయోదాయకం బగు. ౧౯౫

ఆ.వె. మహిమ నూర్ధ్వపుండ్ర మధ్యంబునందును । బసపుఁగూడినట్టి పచ్చనైన
యూర్ధ్వపుండ్ర మిడిన నొగి నేను లచ్చియుఁ।వాని ముఖమునందు వర్తిలెదము. ౧౯౬

ఆ.వె. అంతరాళహీనమైన పుండ్రంబును । నునుపరా దటందు రొక్కరొకరు
పూర్వు లాచరించు పొంత నరసి చేయ । వలయుఁజుమ్ము పుండ్రవర్తనముల. ౧౯౭

వ. భస్మచే నూర్ధ్వపుండ్రంబును, మృత్తుచేఁ దిర్యక్పుండ్రంబును నునుపరాదు. పుండ్రంబు పూర్వులయాచారంబుననుసరించి యుండుఁ బుండ్రహీనుండై యుండరాదు. బ్రాహ్మణునకుఁ బుండ్రంబు యజ్ఞోపవీతంబువంటి దని నమ్ముము. ౧౯౮

క. నాభక్తు లూర్ధ్వపుండ్రము । ప్రాభవమున నిడుదు రభవభక్తులు తిర్య
క్శోభాయుతపుండ్ర మిడుచు । వైభవమున నుందు రిదియ వరుస మునీంద్రా ! ౧౯౯

క. పుండ్రము శ్రౌతము స్మార్తము । పుండ్రము పౌరాణిక మగు భూర్యాగమికం
బం డ్రిది తప్పదు ద్విజులే । వ్వండ్రేనియు దీని దాల్పవలయు నిరతమున్. ౨౦౦

వ. అని యిట్లు వక్కాణించి నారాయణుండు నారదుం జూచి మునివరా సంధ్యోపాసన క్రమంబు సెప్పెద విను మని. ౨౦౧

క. చుక్కలు గ్రుంకకమునుపే । చక్కఁగ బ్రొద్దుటను నాకసమున నడిమికిఁ బ్రొ
ద్దెక్కఁ బగలు మునుమాపున । నొక్కింత యినుండు తోప నొప్పును సంధ్యల్. ౨౦౨

తే.గీ. ఉత్తమము చుక్కలుండంగ నుడుపవేగ।మధ్యమ మటంద్రు బుధు లధమంబు సూర్యు
డుదితుఁడైన పదంపడి యో మునీంద్ర।పుణ్యదముసుమ్ము ప్రొద్దుటిపూట సంధ్య. ౨౦౩

తే.గీ. ఉత్తమము సూర్యుఁడుండఁగా నుగ్రకరుఁడు । గ్రుంక మధ్యమమని రార్యకోటి మఱియు
నధమమగుఁ దారకోపేతమగుచు నింగి।వెలుఁగ మునుమాపు సంధ్య యుర్వీసురేంద్ర. ౨౦౪

ఉ. పారుడు చెట్టు ధర్మములు పత్రము లో మునినాథ వేదవి
స్తారము శాఖికాచయము జ్ఞానము పండు సమస్తతీర్థసం
చారతపోవ్రతాదికవిచారము పుష్పగణంబు సంధ్య దా
వేరదిగాన వేరునువ వృక్షమునుండును సంధ్య యల్పమే ! ౨౦౫

తే.గీ. సంధ్య నేరనివాఁడును సంధ్య మరచిపో । వువాఁడును సంధ్యను బూని వార్ప
నట్టివాఁడును బ్రాహ్మణులందుఁ బుట్టి।శూద్రుఁడగు నేడు పరమున శునకమగును. ౨౦౬

క. ఉదయాస్తమయములకునుం । బద ిడి ఘటికాత్రయంబు వార్పఁగవచ్చున్
దదనంతరమున నిష్కృతి । నొదవింపఁగవలయునందు రూర్జితబుద్ధుల్. ౨౦౭

క. కాలాతిక్రాంతికిఁ దగు । పీలెన్నఁగ నాల్గవదయి వెలసెడి యర్ఘ్యం
బేలీలాష్టోత్తరశత । కీలిత గాయత్రియే నొగిం బాచితమా. ౨౦౮

తే.గీ. ఎప్పు డేకర్మ గావించు నప్పుడు త ద। ధీశ్వరి న్సంధ్య దా నుపాసించి యట్టి
కర్మ గావింపఁదగు నం(డ్రు ధర్మవిదులు। విధి నెఱుగ కాచరించుట వెఱ్ఱితనము. ౨౦౯

తే.గీ. ధామమందలి సంధ్య సాధారణంబు। మందలోనైనయెడ నది మధ్యమంబు
వాహినీతీరమందైన వర మటం(డ్రు। ధర్మశాస్త్రమ్ము లెఱిఁగిన ధన్యు లనఘ। ౨౧౦

క. దేవీసమీపమున సంధ్యావం। దన మాచరింప నందుల ఫలమున్
దేవాధీశ్వరులును స్తుతి। గావింపఁగలేరు ముక్తి గలుగుట కతనన్. ౨౧౧

వ. సంధ్యావందనంబు శైవ వైష్ణవ శాక్తేయ గాణపత్యాదులగు నందఱును జేయందగిన దై
ద్విజున కవశ్యవిధేయంబై వర్తిల్లుచున్నయది. మొదలఁ గేశవాది నామస్మరణంబుచే
నాచమనంబు సేసి, (ప్రాణాయామంబు సేయునది. కేశవ, నారాయణ, మాధవ, గోవింద,
విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర,
సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ,
అచ్యుత, జనార్దన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణ యను నిరువదినాలుగు నామంబుల స్వాహాం
తంబులును, ప్రణవసహితంబులుం జేసి యందు మొదటి మూటిచే జలంబు పానంబుసేసి,
పిదప రెంటిచేఁ గరంబులు గడిగి, తర్వాత రెంటిచే నున్మార్జనంబుసేసి, యనంతర
మొక్కదానిచేఁ బాణిం, బాదంబుల, శిరంబునఁ బ్రోక్షించి, సంకర్షణాదులచే ద్వాదశాంగం
బులు స్పృశించవలయు. ౨౧౨

క. కుడిచే నాచమనంబును। నెడమను స్పృశియించుటయును నెంతయు నొప్పున్
గడునింద్య మెడమచేతన్। దడయక స్పృశియింపకయ యుదకమును గొన్నన్. ౨౧౩

క. గోకర్ణాకృతి హస్తము। జోకం దనరించి యందుఁ జొప్పడు నీళ్ళన్
గైకొనుటయమాత్రమే। కాఁ కించు న్మించునైనఁ గలుఁద్రావుటయే. ౨౧౪

క. కడ(వేలు మొదటి(వేలును। విడిచి తగం దక్కినట్టి (వేళ్ళ ద్విజుఁడు దా
ముడుచుక యాచమనంబున్। గుడిచేతం జేయనొప్పుఁ గోవిదవర్యా। ౨౧౫

వ. అంతం బ్రాణాయామంబు సేయవలయు. నది ప్రణవసహితంబగు గాయత్రీమంత్రంబు
స్మరియించుచుం గావింపవలయు. ప్రాణాయామంబు రేచక, పూరక, కుంభకాత్మకంబై
యుండు. రేచకంబు దక్షిణ నాసారంధ్రంబునుండియు, బూరకంబు వామరంధ్రంబు
నుండియుం జేయఁదగినది. యుదరంబునం బూరించుటయ పూరకంబు. దక్షిణనాడి
నంగుష్ఠంబునం బీడించునది. కనిష్ఠానామికలచే వామరంధ్రంబుం బీడించునది. మధ్యమ
తర్జనులు వర్జింపఁదగినవి. రేచకంబన వాయువును డించుట. పూరకంబన వాయువుం
బూరించుట, కుంభకంబన వాయువును నిల్పియుంచుటయని యెఱుంగునది. పూరకంబున
నీలోత్పలదళశ్యాముండగు నారాయణుని చతుర్భుజ నాభిమధ్యంబున ధ్యానించునది. కుంభ

కంబునం గమలాసనుండును, ప్రజాపతియుఁ, జతుర్వక్త్రుండును నగు బ్రహ్మఁ హృదయం
బున ధ్యానించునది. పూరకంబునం ద్రిలోచనుండగు శంకరుని లలాటంబున ధ్యానించు
నది. పూరకంబున విష్ణుసాయుజ్యంబును, రేచకంబున శివరూపంబును, గుంభకంబున
బ్రహ్మలోకంబునుం గలుగు. వెండియు ౨౧౬

క. హరినామంబులఁ ద్రావుచు । పరగెడి నాచమన మెందుఁ బౌరాణికమౌ
భరిత ప్రణవంబగు సు । స్వర గాయత్రిం గొనంగ శ్రౌతం బనఘా । ౨౧౭

వ. పౌరాణాచమనాద్య మనియు, శ్రౌతాచమనాద్య మనియుఁ జెప్పంబడునవి. పాపహరంబు
లగు ప్రణవసహితంబై వ్యాహృతిత్రయాత్మకంబగు గాయత్రి నుచ్చరించెనేని నది
శ్రౌతంబగు. వానప్రస్థ, గృహస్థులు పంచాంగుళులచే ప్రణవంబున నాసాగ్రంబు పీడింప
వలయు కనిష్ఠానామికాంగుష్ఠంబులచే యతి, బ్రహ్మచారులు నాసాగ్రంబు నొత్తందగు.
నాపోహిష్ఠా యను మంత్రంబులు మూటిచేఁ గుశోదక ప్రోక్షణంబు సేసికొనవలయుఁ.
ప్రోక్షణానంతరంబునం బునరాచమనంబు సేసి సూర్యశ్చ యను మంత్రంబు సెప్పి యుదక
మాచమించునది. పదంపడి గోకర్ణంబుం బోలె నిడిన దక్షిణహస్తంబున వారిం గొని
నాసంబుతుదకుఁ దెచ్చి కృష్ణవర్ణుండై, కుక్షి నున్న పాపపురుషుని భావించి ఋతంచ యను
దానిం బఠించి పిమ్మట గాయత్రిచే దక్షిణ నాసాపుటంబునుండి పాపపురుషు నీడ్చి యా
యుదకంబు కనులం జూడక నా శరీరంబు పాపరహితమగుఁగాక యని తలంచి వామ
భాగంబున నిడికొని యున్న శిలపై నయ్యుదకంబుం బారంజల్లందగు. నంత, ౨౧౮

తే.గీ. లేచి తన రెండుకాళ్ళు సరిగను నిలిపి । యలర దోయిట జల మిడి యన్నవ్రేలు
మొదటివ్రేలును విడి భానుమూర్తిఁ జూచి । నీరు గాయత్రి సెప్పి ముమ్మారు
విడువ । వలయు నర్ఘ్యంబు లివి సుమ్ము వసుమతీశ । ౨౧౯

వ. మఱియు నసావాదిత్య మంత్రంబునఁ ద్రివారంబు ప్రదక్షిణంబు సేయునది. మధ్యా
హ్నంబున సకృత్కరణం బొప్పు. ౨౨౦

తే.గీ. ప్రొద్దుట నొకింత వంగియుఁ బొలుపుమీఱ । నిలచి మధ్యాహ్నవేళన వెలయఁ బ్రొద్దు
గ్రుంకుతరి గూరుచుండియుఁ గోరి యర్ఘ్య।దానమును జేయవలయును మౌనివర్య । ౨౨౧

తే.గీ. అంది సూర్యుని మ్రింగంగ నరుగుఁదెంచు । ఘోరమందేహరాక్షసు లోకొట్లుమూడు
పదులు వారలు బొలియుదు రదన నెల్ల । వార లర్ఘ్యంబు నిడిరేని ధీరచరిత । ౨౨౨

వ. అర్ఘ్యాంగభూతమంత్రోచ్చారణ మాత్రంబున సంధ్య సాంగం బగునని తెలియునది.
యర్ఘ్యంబు మహాపుణ్యజనకంబు. ౨౨౩

క. నే నర్కుఁడ నే జ్యోతిని । నే నాత్మను జ్యోతి శివుఁడ నిక నెన్నంగా
నే నాత్మజ్యోతిని తెలుపై । నట్టిడ రసము నేన యఖిలజ్యోతిణా. ౨౨౪

తే.గీ. బ్రహ్మరూపిణి గాయత్రి వరద దేవి । స్మరణ సేయంగ సిద్ధించుకొరకు నాదు
హృదయమధ్యంబునను బ్రవేశించుమమ్మ । రమ్ము రా రమ్ము భగవతీ రమ్ము రమ్ము. ౨౨౫

తే.గీ. దేవి భగవతి కల్యాణి దివ్యమూర్తి । మరలివచ్చుటకై నీవు తరలిపొమ్ము
అర్ఘ్యజలముల నా హృదయంబు సేరు । లెమ్ము లేలెమ్ము గాయత్రి లెమ్ము లెమ్ము. ౨౨౬

వ. అని యిట్లు పలికి శుద్ధస్థలంబునం గూర్చుండి గాయత్రీమంత్రజపంబు సేయునది. ప్రాత స్సంధ్యాప్రధానంబునందుఁ బ్రాణాయామానంతరంబు ఖేచరీముద్ర శ్రేయస్సాధనంబు. వినుము, ౨౨౭

క. ఖే యన నాకాశంబున । బాయక చరి యనఁగ మనసు ప్రసరించును స
ద్ధీయుతునకు నెద్దాని స । హాయంబున నదియె వసుధ నగు ఖేచరినాన్. ౨౨౮

క. భ్రూమధ్యంబున దృష్టిని । ధీమంతుం డిడినయేని ధృతి ఖేచరియై
భూమి నిది ప్రశస్తంబగు । సామాన్యముకాదు దీని సామర్థ్యమొగిన్. ౨౨౯

తే.గీ. ఆసనంబుల నెన్న సిద్ధాసనంబు । ననిలములయందుఁ దల్పఁ గుంభానిలంబు
ముద్రలందును ఖేచరీముద్ర గొప్ప । సత్య మిది సత్య మిది నమ్ము సంయమీంద్ర । ౨౩౦

శా. యోనిస్థానక మంఘ్రిమూలఘటితం బొలిం దగం జేసి పా
దాన న్మేఢ్రము నొత్తి రొమ్ము సరిగాఁ దా నుంచి స్థాణుక్రియన్
మేనిన్ నిల్పి జితేంద్రియుం డచలదృక్లేశంబు భ్రూమధ్యగ
శ్రీ నొప్పించిన యోగికి న్శుభదమౌ సిద్ధాసనం బిద్ధరన్. ౨౩౧

ఆ.వె. వరదయైన దేవి వచ్చుఁగాపుత నక్ష । రమ్ము బ్రహ్మ సమ్మితమ్ముగాగఁ
గరము వెలయునట్టి గాయత్రిఁ గొల్చెద । వేదమాత దీది వినుము కనుము. ౨౩౨

క. రేపొనరించిన పాపము । రేపే పోఁగొట్టుమమ్మ శ్రీమతి దేవీ
మాపొనరించిన పాపము । మాపే వెడలింపుమమ్మ మా జనయిత్రీ. ౨౩౩

తే.గీ. సర్వవర్ణ మహాదేవి సంధ్య యో స । రస్వతీ దేవి యజరామరా సమస్త
దేవి నీ కిదె మ్రొక్కెద త్రిజగదీశ । యని నమస్కార మొనరింపనగు మునీంద్ర. ౨౩౪

వ. ఓజోసి యను మంత్రంబునం దేవి నాహ్వానంబుసేసి పిమ్మట శాపమోక్షంబు సేయవలయు. మొదల బ్రహ్మశాపంబును, పిదప విశ్వామిత్రశాపంబును, వెనుక వశిష్ఠ శాపంబును మూడు గలవు. బ్రహ్మస్మరణంబున బ్రహ్మశాపంబును, విశ్వామిత్ర స్మరణంబున విశ్వామిత్ర శాపంబును, వశిష్ఠ స్మరణంబున వశిష్ఠశాపంబును నశించు. మఱియు, ౨౩౫

చ. పురుషుఁ బ్రమాణు సత్యు నధిపున్ బరమాత్మ సుసంజ్ఞకుం జగ
ద్గురు మహనీయుఁ జిన్మయు నగోచరు నిత్య నిరంజనున్ నిరీ

శ్వరు ననఘుం బరాత్పరుఁ బ్రసన్న గుణాతిగు నాదిదేవు సం
స్మరణము సేయుదున్ హృదయసారసమధ్యమునందుఁ బొందుగన్. ౨౩౬

వ. ప్రణవసహితంబుగా నమోంతంబుగా భూః అని, పాదంబులకు, భువః అని జానువులకు, స్వహాః యని కటులకు, మహః యని నాభికి, జనః యని హృదయంబునకు, తపః అని కంఠంబునకు, సత్యమ్మని లలాటంబునకు న్యాసంబుసేసి తత్సవితుః అని యంగుష్ఠంబులకు, వరేణ్యమ్మని తర్జనులకు, భర్గోదేవస్య యని మధ్యమములకు, ధీమహి యని యనామికలకు, ధీయోయోనః యని కనిష్ఠికలకు, ప్రచోదయాత్తని కరపృష్ఠతలంబులకు, తత్సవితుః బ్రహ్మాత్మనే అని హృదయంబునకు, వరేణ్యం విష్ణ్వాత్మనేయని శిరంబునకు, భర్గోదేవస్య రుద్రాత్మనే యని శిఖకు, ధీమహి శక్త్యాత్మనే యని కవచంబునకుఁ ధియోయోనః కాలాత్మనే అని నేత్రత్రయంబునకు, ప్రచోదయాత్సర్వాత్మనే యని యస్త్రంబునకు న్యాసంబులు విధింపఁబడినవి. మఱియు వర్ణన్యాసంబు గలదు. అదియుం బ్రణవపూర్వకంబు, తత్కారంబున పాదాంగుష్ఠద్వయంబు, సకారంబున గుల్ఫంబులు, వికారంబున జంఘలు, తుకారంబున జానువులు, వకారంబున నూరువులు, రేకారంబున గుదంబు, ణీకారంబున లింగంబు, యకారంబునం గటి, భకారంబున నాభి, గోకారంబున హృదయంబు, దేకారంబున స్తనంబులు, వకారంబున హృదయంబు, స్యకారంబునం గంఠంబు, ధీకారంబున ముఖంబు, మకారంబునం దాలుదేశంబులు, హికారంబున నాసికాగ్రము, ధికారంబున నేత్రమండలము, యోకారంబున భ్రూమధ్యము, యోకారంబున లలాటంబు, నఃకారంబునం బూర్వముఖంబు, ప్రకారంబున దక్షిణముఖంబు, చోకారంబున పశ్చిమముఖంబు, దకారంబున నుత్తరముఖంబు, యాకారంబున మూర్ధంబు, తకారంబున వ్యాపకంబు న్యాసంబు సేయవలయు. ౨౩౭

క. కొందఱు న్యాసవిధిం గన। కుందురు మఱికొంద ఱిదియు నుండందగునం
చందురు దేవీధ్యానం। బందఱు సేయంగవలయు నది యెట్లన్నన్. ౨౩౮

సీసమాలిక. భాస్వజ్జపాసుమాభను గుమారిని బరమేశ్వరి నరుణాంబుజేద్ధపీఠ
రక్తగంధవిలేప రక్తమాల్యాంబరఁ జతురాస్యను జతుర్భుజను ద్వినేత్ర
స్రుక్స్రువమాలావిశుద్ధకుండధరిత్రి సర్వాభరణదీప్త సర్వజనని
అమల ఋగ్వేదసమధ్యాయినిని హంస తురగేంద్రగామిని ధూతపాప
నాహవనీయ మధ్యస్థను బ్రహ్మదేవతను జతుష్పద నతులితాష్ట
కుక్షి మహేశ్వరి నక్షీణ సప్తశీర్షను వహ్నివక్త్రను శైవశిఖను

తే.గీ. నిష్ఠచిత్తను భావింతు విమలబుద్ధి। సకలపాపాపనోదనశక్తి నమల
బ్రహ్మగాయత్రి నోంకారపంజరస్థ। భగవతిని దేవి నఖిలసంభవవిధాత్రి. ౨౩౯

తే.గీ. అలర సాంఖ్యాయనము గోత్రమయ్యు బ్రహ్మ।కవచమయ్యును నాదిత్యగతమునయ్యు
వెలయునట్టి మహేశ్వరి వేదవిద్య।దివ్యతరమూర్తి గాయత్రి దేవిఁ దలఁతు. ౨౪౦

సీసమాలిక. సమ్ముఖమ్మనఁగను సంపుటంబనఁగను వితతంబనగ మఱి విస్తృతమన
ద్విముఖంబనంగను త్రిముఖంబనఁగ జతుష్కము పంచకము షణ్ముఖము నధోము
ఖమనంగ మఱి వ్యాపకము నంజలికము నా శకటంబనగఁ బాశంబు గ్రథిత
మనఁగను సమ్ముఖ మ్మనఁగను నున్ముఖంబునుఁ బ్రలంబంబును ముష్టికమును
మత్స్యంబు కూర్మంబు మఱి వరాహంబు సింహాక్రాంతమనఁగ మహాపదాను
గాక్రాంతమనఁగ ముద్గరము పల్లవమును నా నివి యిర్వదినాల్గు ముద్ర

తే.గీ. లయ్యె గాయత్రికిని వీని ననుదినంబు।ద్విజుఁడు విడువక బట్టినఁ దేజ మొదవు
నప్పుడపుడు శతాక్షర నరయవలయు । దేవతాజ్యేష్ఠతనుజాత ధీసమేత. ౨౪౧

వ. మరియుం గాయత్రి కిరువదినాలు గక్షరంబులని కీర్తింపంబడు. జాతవేదసం బను
ఋక్కు నుచ్చరింపవలయు. త్ర్యంబకఋక్కు నావర్తించి గాయత్రీ శతవర్ణకా భవతీయం
మహాపుణ్యా యను మంత్రంబు జపియించునది. పిమ్మటఁ బ్రణవపూర్వకమ్ముగా భూర్భువ
రాదులం జెప్పి చతుర్వింశతి గాయత్రి జపింపవలయు. నిత్యంబును బ్రాహ్మణుం డిది
విధిగా నొనర్పవలయు. మరియు వినుము. ౨౪౨

## —: సం ధ్యా ది కృ త్య ము :—

తే.గీ. పాదములు విడ గాయత్రిఁ బలికెనేని । బ్రహ్మహత్యను దొలఁగించు బ్రాహ్మణునకుఁ
జరణము లభిన్నములుగాఁగ జరిపెనేని।బ్రహ్మహత్యాసమంబవి పలుకుచుంద్రు. ౨౪౩

తే.గీ. సంపుటైకయు గాయత్రి షట్ప్రణవము।ననఁగ గాయత్రి వివిధమై యలరుచుండు
నదియుఁ బంచప్రణవయుక్తమయ్యెనేని।జపమొనర్పవలయు నంద్రు సంయమీంద్ర. ౨౪౪

వ. సంపుటైకయు, షడోంకారయు, నూర్ధ్వరేతసులకు విధింపఁబడినవి. గృహస్థుండును,
బ్రహ్మచారియు, మోక్షార్థియుఁ దురీయం జపియింపవలయు. దీనికిఁ ధ్యానంబు సెప్పెద
వినుము. ౨౪౫

చ. అనుపమసోమసూర్యదహనామలబింబ మచింత్యముగా మహా
ప్రణవమయంబు ఫుల్లసితపద్మము పీఠముగాఁ దనర్చు నే
ఘనునకు సూక్ష్మముం బరమకాంతిమయం బచలంబు నట్టి బ్ర
హ్మను జిదచిత్స్వరూపుని సుఖాత్ముని గొల్తు ముదంబు వేడుచున్. ౨౪౬

మ. నియమంబొప్పఁ ద్రిశూలముద్రయును యోనిప్రఖ్యయౌ ముద్రయున్
నయమార్గంబున నక్షమాల యన నెన్నంబొల్చు నమ్ముద్రయున్

త్రియమౌ లింగక పారిజాత సురభి శ్రీమన్మహాముద్రలున్
జయముం గోరినవాఁడు పట్టవలయుం సంతుష్టుఁడై యెల్లెడన్. ౨౪౭

వ. పిమ్మటఁ బంచోపచారంబులం బూజింపవలయు. ౨౪౮

సీ. గంధం బొసఁగి నమస్కారంబు సేసెద లాకారునకు విష్ణులాత్మకునకు
పుష్పం బొసంగి నేఁ బొరి పొరి మ్రొక్కెద హాకారునకు గగనాత్మకునకు
ధూపం బొసంగి నే దొడిఁబడ నెరిగెద యాకారునకుఁ బవనాత్మకునకు
దీపం బొసంగి నే ధృతి దండ మిడియెద రాకారునకును వహ్న్యాత్మకునకు

తే.గీ. నతుల నైవేద్య మొసఁగి నే నతు లొనర్తు। నమల వాకారునకు నమృతాత్మకునకు
యరలవహ యంచుఁ దలచి పుష్పాంజలి యిదె।
యర్పణముసేయుదును నే సహర్నిశంబు. ౨౪౯

వ. అని యిట్లు పూజించి ముద్రలు ప్రదర్శించి, శిరంబును, గంతంబునుఁ గదలనీయక దంతంబులు గానరానీక మెల్లమెల్లన గాయత్రీజపం బష్టోత్తరశతంబేని. నశక్తుండైన దశవారంబేనిఁ గావించి యుత్తమ యను ననువాకంబున దేవి నుద్వాసింపవలయు. ౨౫౦

తే.గీ. జలము నడుమను గాయత్రి జపముసేయ। రాదటంచునుఁ బలికిరి ప్రాజ్ఞులైన
మునులు కావునఁ దెల్పితి మునివరేణ్య। సాధుజనగణ్య విహితవిస్తారపుణ్య! ౨౫౧

మ. సురభి జ్ఞాన సుశూర్ప కూర్మములు నచ్చో యోనియుం బద్మమున్
దిరమై పొల్పెసలారు లింగక మొగిన్ నిర్వాణకంబుం భునిన్
బరమశ్రీదము కా జపాంతమున నొప్పం జూప నీ యెన్మిదిన్
ధరణిన్ ముద్ర లటంచ్రు ప్రాజ్ఞులగు పెద్దల్పూవె భద్రాత్మకా! ౨౫౨

తే.గీ. అక్షరంబులు విడిచినయట్టి తప్పు। లచ్చులును హల్లులును జారినట్టివియును
సకలమును క్షమియింపవే సర్వజనని। కశ్యపప్రియవాదిని కాలరూపి! ౨౫౩

తే.గీ. కడఁగి గాయత్రి ఛందంబు గాధిజుండు। ఋషి సవిత దేవత యటందు రిదియుఁగాక
యొనరఁ దర్పణమున వినియోగమయ్యె। ననుచుఁబలుకంగవలయును మునివరేణ్య! ౨౫౪

వ. మఱియు భూరిత్యుక్త్వాచే ఋగ్వేదపురుషుని, భువయిత్యుక్త్వాచే యజుర్వేద పురుషుని, స్వర్వ్యాహృతిచే సామవేదపురుషుని, మహః అని యథర్వవేదపురుషుని, జనః పదాంతంబుచే నితిహాస పురాణపురుషునిఁ దపోవ్యాహృతి సర్వాగమ పురుషునిఁ దృప్తినొందించుచున్నాఁడ నని పల్కి, సత్యపదంబుచే సత్యలోకపురుషునిం దర్పించునది. యనంతరంబ ప్రణవపూర్వకంబగు భూర్వ్యాహృతిచే భూలోకపురుషుని, భువర్వ్యాహృతిచే భువర్లోకపురుషుని, స్వర్వ్యాహృతిచే స్వర్లోకపురుషునిఁ, బ్రణవసహితంబగు భూఃపదంబుచే నేకపదగాయత్రిని, భువఃపదంబుచే ద్విపదగాయత్రిని, స్వఃపదంబుచేఁ ద్రిపదగాయత్రినిఁ దృప్తినొందించుచున్నాఁడ నని చెప్పవలయు. ప్రణవపూర్వకంబగు

భూర్భువస్స్వః పదంబులచేఁ జతుష్పదగాయత్రినిఁ దర్పించుచున్నాఁడ నని పలుక వలయు. మఱియు గాయత్రియు, సావిత్రియు, వేదమాతయు బృథ్వియు, నజయుఁ, గౌశికియు, సాంకృతియు, సార్వజితియు నగు దేవి నుషస్సునఁ దర్పణకాలంబున నుచ్చరింపవలయు. తర్పణాంతంబున శాంతికొరకు జాతవేదసంబు చెప్పవలయు, మానస్తోక యను మంత్రంబు జపింపఁదగు. పదంపడి త్ర్యంబకంబుం బలుకవలయుఁ బిమ్మటం దచ్ఛంయో యను మంత్రంబు జపించి, యతోదేవా యను రెంటిచే సర్వాంగస్పర్శంబు సేసి, స్యోనాపృథివీ మంత్రంబుచే భూమికి నమస్కరించి యథావిధి గోత్రప్రవరలు సెప్పి ప్రాతస్సంధ్యాకృత్యంబు పరిసమాప్తి నొందింపవలయు. తదనంతరం బగ్ని హోత్రంబు సేసికొని పంచపూజ నొనరింపవలయు. ౨౫౫

క. దేవిని నారాయణు శివ । దేవుని గణపతిని సూర్యు ధృతి నర్చింపం
గా వలయుఁ బురుషసూక్తము । చే విప్రుం డనుదినంబు స్థిరభక్తిమెయిన్. ౨౫౬

సీ. నడుమ భవానినిఁ గడఁగి యీశాన్యంబునందు మాధవు ననలాశయందు
గౌరీనాథు రాక్షసదిక్కున గణేశు వాయవ్యమున సూర్యు వరుసదప్ప
కర్చన గావించి యవ్వలఁ దా షోడశోపచారంబుల నొనరఁ జేసి
మునుకొని దేవిని బూజించి పదపడి యితరదేవతలఁ బూజింపవలయు

తే.గీ. దేవిపూజనమునకు నధికములేదు । కావ శ్రుతుల సంధ్యోపాస్తి మానరా ద
టంచుఁ జెప్పంబడె ద్విజు లద్ది తెలసి।యనుదినము సంధ్య నర్చింపనగు మునీంద్ర ! ౨౫౭

క. వనజాక్షు నక్షతలజే । తను గణపతిఁ దులసిచేతఁ దగ దూర్వలచే
తను దుర్గఁ గేతకంబుల । ధనదసఖునిఁ బూజసేయఁదగదు మునీంద్రా ! ౨౫౮

సీ. మోదుగ పొగడయు మొల్లయు లొద్దుగ గన్నేరు మంకెన గస్తిపూలు
సింధువారంబును శింశుపయును మఱి మేడియు గరికియు బిల్వదళము
కుశమంజరియు సల్లకులు బండిగురివిందపూలును జిల్లేడుపూలు మఱియు
మందార కేతకీ మహిత కదంబ చంపక కర్ణికారపుష్పముల మఱియు

తే.గీ. పొన్నపూవులు జాజులు సన్నజాజు।లాదిగాఁగల పుష్పంబు లంబ కొప్పు
గుగ్గులంబున ధూపంబు గూర్పఁదగును।తైలమున దీప మిడఁదగుఁ దాపసేంద్ర ! ౨౫౯

వ. ఇట్లు పూజావిధానంబు సల్పి వేదంబు లభ్యసించి పదంపడి పోష్యవర్గార్థవం బర్థసాధనంబు స్వవృత్తి విడువక తృతీయదినభాగంబునం గావింపవలయు. ౨౬౦

## —: శ్రీ దేవీపూజా విశేషము :—

వ. మఱియు నింక భుక్తిముక్తిప్రదంబగు దేవీపూజావిధానంబు సవిస్తరముగాఁ జెప్పెద నని భక్తరక్షణపరాయణుండగు నారాయణుండు నారదున కిట్లనియె. ౨౬౧

ఆ.వె. ఆచమించి మౌని యగుచు సంకల్పించి । భూతశుద్ధి జేసి మాతృకల ష
డంగముల న్యసించి యవ్వల శంఖంబు । నిలిపి యర్ఘ్య మిచ్చి కొలువవలయు. ౨౬౨

ఆ.వె. అస్త్రమంత్రవిధుల నర్చనద్రవ్యముల్। ప్రోక్షణంబు సేసి రూఢి గురువు
నాజ్ఞ గొనుచుఁ బూజ నాచరింపఁగఁదగు । నందు మొదలఁ బీఠికార్చనంబు. ౨౬౩

ఆ.వె. సరగ షోడశోపచారము లొనరించి । వేదమంత్రములను వెలయఁ జెఱకు
పాలఁగాని ద్రాక్షపానకమునఁగాని । స్నానమిచ్చిరేని సంపదలగు. ౨౬౪

క. అగరును గాశ్మీరంబును । దగు గంబుర కస్తురియు ముదంబున నిడి భ
క్తిగలిగి దేవికి స్నానము । సొగసుగఁ గావింప సకల శుభములు గలుగున్. ౨౬౫

క. పెరుగునఁ బాలను నేతను । దరుగక స్నానంబు నొసఁగఁ దత శుభదంబౌ
వరశర్కరతోనైనం । గరము శుభము గలుగునంద్రు జానులు మౌనీ । ౨౬౬

క. శక్తి సహస్రఫ లోదక । యుక్తిన్ స్నానంబు సేయ నొసగును ముక్తిన్
భుక్తిని దినమ్ము మునివర । భక్తిప్రధానంబునమ్ము భగవతియెడలన్. ౨౬౭

ఆ.వె. వస్త్రయుగ్మ మిచ్చి వరభూషణము లిడి । గంధ మలది లక్తకం బొసంగి
పూల నియ్యవలయుఁ బూని బిల్వదళంబు । వలని మహిమ సంఖ్యవలన హెచ్చు. ౨౬౮

వ. మఱియు మాయాబీజంబు చతుర్థ్యంతంబు సేసి నమఃపదంబుతోఁ గూర్చి జపించుచు నానా
విధపుష్పంబులచే దేవి నర్చించిరేనిఁ బరమపదప్రాప్తి యగుఁ, బ్రత్యేకంబుగా నొక్కొక
జాతి పుష్పంబులు సహస్రసంఖ్యాకంబులు దెచ్చి పూజించిరేని మనోవాంఛితంబులు దీరు,
సమస్త పాపంబులు నశించు. గుగ్గులుధూపవాసనచే గృహంబు నించిన భువనత్రయంబు
సిద్ధించుఁ, గర్పూరఖండంబుల దీపం బొసంగిన సూర్యలోకంబు ప్రాపించు, శతసహస్ర
దీపంబు లిడిన సమోహంబైన తేజంబు గలుగు. షడ్రసోపేతంబగు నైవేద్యంబు స్వర్ణ
పాత్రంబుల నిచ్చి నానాఫలంబుల నివేదించిన భువనత్రయంబుం దృప్తింబొంది తదనంత
రంబు పానీయ మిచ్చి తాంబూలం బొసంగి మృదంగవీణాదులచే వినోదంబు సేసి వేద
పారాయణంబునుఁ జేయించి పురాణాదిశ్రవణంబున నలరించి, ఛత్ర చామరాదు లిచ్చి సకల
రాజోపచారంబులు సేసి, ప్రదక్షిణంబు సేసి, క్షమియించుమని వేడికొని దేవీపూజఁ జేసిన
వారి కెల్ల సౌఖ్యంబులును, శరీరానంతరంబున మోక్షంబునుఁ గలుగు, నిందున కొక పూర్వ
కథ కలదు, చెప్పెద విను మని నారాయణుండు. ౨౬౯

చ. కల దొక చక్రవాకవిహగంబు హిమాలయమందుఁ దొల్లి వి
చ్చలవిడి నెల్లదేశములఁ జయ్యనఁ గన్గొను చొక్కునాడు పే
శలమగు గాశికాపురము చక్కని ప్రాలి మహాన్నపూర్ణ ని
శ్చలయయి యుండుచోట నొకసారి గణాశనుఁ జుట్టెన గ్గుడిన్, ౨౭౦

చ. పదపడి దేశము ల్తిరుగు పాటును మాని స్వవాసమందునన్
దుద నొకచోట బిద్ది తన తొల్లిఁటిపుణ్యముకల్మి స్వర్గసం
పద నొక రెండు కల్పములు భాసిలి యాదటఁ బృథ్విఁ జేరి సౌ
ఖ్యదమగు క్షత్రియాన్వయమునందు బృహద్రథుఁడై జనించినన్. ౨౭౧

క. ఉర్వీశునకుం జక్కఁగఁ । బూర్వజ్ఞానంబు గలదు భూమి నటంచున్
సర్వజనులు గొనియాడ న । ఖర్వత విని సకలమునులు కదలిరి చూడన్. ౨౨

తే.గీ. వచ్చి నరపతిఁ గనుగొని వసుమతీశ। తెలియఁజెప్పవె పూర్వస్మృతి యెట్టులబ్బె
భూత భవ్యంబు లెఱిఁగెడిరీతి యెట్లు । నావుఁడును విని మునులకు నరవిభుండు. ౨౩

వ. నేను పూర్వజన్మంబునం జక్రవాకంబనై యుండి దేశాటనంబు సేయుచుఁ గాశికిం జేరి యన్నపూర్ణగుడిచుట్టు నున్న యన్నకణంబు లేరికొని తింటిఁ, దత్ఫలంబున నా కీ పూర్వ జ్ఞానంబు కలిగె నని చెప్పిన భగవతీమహిమంబు గొనియాడుచు మును లరిగిరి. కావున దేవీపూజ నిరంతరంబు సేయువారికిఁ గలుగు ఫలంబు వక్కాణింప నెవ్వరితరంబు? ఇఁకను మాధ్యాహ్నిక సంధ్యాక్రమంబు సెప్పెద వినుమని యిట్లనియె. ౨౪

## —: మధ్యాహ్నిక సంధ్యాదిః :—

సీ. చెలఁగి సావిత్రికి శ్వేతవర్ణకుఁ ద్రిలోచనకును నిదె నమస్కార మిడుదు
నతిభక్తి వరదకు నక్షమాలాఢ్యకు శూలాభయకరకు జోతు లిడుదు
నల వృషారూఢకు యజురాఖ్యసంహితకును రుద్రదేవతకు నతి యిడుదు
వర తమోయుతకు భువర్లోకగమునకు నాదిత్యగకు మ్రొక్కు లాస నిడుదు

తే.గీ. నని భగవతిని ధ్యానించి యాచమనము । చేసి యర్ఘ్యం బొసంగి మంచివిపులేని
మారెడుదళంబులేని సొంపారునీట । నునిచి యర్ఘ్యం బిడుట మేలు మునివరేణ్య! ౨౫

ఆ.వె. అర్ఘ్యజలము నెత్తి యాదిత్యునకుఁ జూపి । మొదటిసంధ్యఁబోలె ముగియఁ జేయ
వలయు నర్ఘ్యమననె వార్చుట ఫలదంబు। కాన నర్ఘ్య మెపుడు ఘనమటంద్రు. ౨౬

వ. అర్ఘ్యంబునకు మందేహాసురహాని ముఖ్యకారణంబు గాన ప్రణవసహిత గాయత్రిచే నర్ఘ్యంబు తప్పక యీఁదగు. నాకృష్ణేనేతి మంత్రంబుచే జలంబులందుఁ బుష్పంబు లిడ వలయు, నవి సంభవించవేని మారెడుపత్రిం గొనియుంచవలయు, నది దొరకదేని దూర్వా దులు వేయవలయు. నర్ఘ్యప్రదానంబుచే సాంగసంధ్యావందనఫలంబు గలదు, నిఁకను దర్పణవిధానంబు సెప్పెద వినుము. యజుఃపూరుషుని యజుర్వేదంబును మండలంబును హిరణ్యగర్భుని ఆత్మను సాంకృతియై దేవమాతయగు దేవిని సంధ్యను రుద్రాణిని నీమృజనుఁ గ్రమంబుగాఁ దర్పణంబు జేయందగు. భూ ర్భువః స్వః పురుష యను మంత్రంబుతో మధ్యాహ్న తర్పణంబగు నుదుత్య మను మంత్రంబుచే సూర్యోపస్థానంబు సేయవలయుఁ, జిత్రందేవానా మ్మను మంత్రంబుచేఁగూడ నది సేయవలయు, ననంత రంబు జపంబు సేయునది. మఱియు. ౨౭

ఆ.వె. ప్రొద్దుపొడుపునందుఁ బొలుపుగాఁ బై కెత్తి । ప్రొద్దుగుంకువేళఁ బొసఁగ వాంచి
పట్టపగలు సేతు లట్టె తొమ్ముననఁగూర్చి । జపము సేయవలయు సజ్జనుండు. ౨౮

తే.గీ. రహి ననామిక మధ్యపర్వంబునుండి । యాకనిష్ఠిక మొదటికణ్పాదిసేసి
పరుసఁ దర్జని మూలంబువరకు నెన్న । దానిఁ గరమాల యందురు తత్త్వవిదులు. ౨౭౯

ఉ. గోవునుఁ దల్లిఁ దండ్రి ద్విజుఁ గూల్చిన పాపము నెట్టుఁ గల్లునుం
ద్రావిన దోషముం గడపు బ్రాహ్మణునర్థము గొన్న దోసముల్
బోవఁగఁజేయు నార్యసతిఁ బొందిన పాతక మార్చు నౌర సం
ధ్యావిధి నీశ్వరీజపసమాచరణం బొక వేయి చేసినన్. ౨౮౦

తే.గీ. త్రికరణంబులఁ జేసినట్టికలుషములు । కడఁగి గాయత్రిచే నథోగతికిఁ బోవు
ఎల్ల వేదంబులను బఠియించునట్టి । ఫల మదొకటగు గాయత్రిఫలము నమ్ము. ౨౮౧

## —: బ్రహ్మయజ్ఞ విధానము :—

వ. బ్రహ్మయజ్ఞ విధానంబు దెల్పెద, మూడాచమనంబులు, రెండు మార్జనంబులు సవ్యపాణి పాదోపస్పర్శంబులు సేసి శిరంబునఁ, గన్నుల, నాస, శ్రోత్రదేశంబున, హృదయంబున, మౌళినిం బ్రోక్షించి దేశ కాలంబు సెప్పి, రెండు దర్భలు దక్షిణహస్తంబున నిడి వామంబున మూడిడి దేవతాప్రీతికై బ్రహ్మయజ్ఞంబు సేసెద నని చెప్పి మూడుమారులు గాయత్రిం జపియించి యగ్నిమీశేపురోహిత మ్మని నుడివి, పిమ్మట యదంగ యని నుడివి, అగ్నిర్వై యనికీర్తించి, పిదప మహావ్రతం చైషపంథా యని పలికి, మఘవత్తనునది వక్కాణించి, ఇషేత్వోర్జ యనునది వచించి, అగ్నఆయాహి యని వ్యాహరించి, శంనో దేవీః అనుదానిం బఠించి, వృద్ధిరాదైచ్ అనునది యుచ్చరించి, పంచసంవత్సర యని యాడి, మయరసతజభన యని, అథాతోధర్మజిజ్ఞాస యని చదివి, అథాతో బ్రహ్మజిజ్ఞాస యని నోటంబట్టి, తచ్ఛంయో యనుమాట గొణిగి, బ్రహ్మణే నమ యని యుక్తంబుసేసి, యనంతరము తర్పణము చేయునది. ప్రజాపతియు, దేవతలు వేదంబులు, ఋషులు, ఛందంబులు, నోంకారంబు, వషట్కారంబు వ్యాహృతులు, సావిత్రి, గాయత్రి, యజ్ఞంబులు, నభంబు, పృథివి, అంతరిక్షము, అహోరాత్రములు, సంధ్యలు, సిద్ధులు, సముద్రంబులు, పర్వతంబులు, క్షేత్రంబులు, నోషధులు, వనస్పతులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, పక్షులు, గోవులు సాధ్యులు, యక్షులు, రాక్షసులు, మంత్రంబులు, విప్రులునుం దర్పణార్హులు. మఱియు నుపవీతియై శతర్చుల, మధ్యముల, కృత్సమతుల, విశ్వామిత్రుని, వామదేవుని, అత్రిని, భరద్వాజుని, వసిష్ఠుఁ, బ్రగాథుఁ, బావమాన్యు, క్షుద్రసూక్తంబుల, మహాసూక్తంబుల సనకు, సనందను, సనాతను, సనత్కుమారుఁ, గపిలు, నాసూరినాము, వోహావిఁ, బంచశీర్షకుఁ దర్పింపవలయు. నింకను బ్రాచీనావీతియై సుమంతు, జైమిని, బైలు, మహాభాష్యంబు, భారతంబును, ధర్మాచార్యుల, బాహవి, గార్గ్య, గౌతము, శాకలు, బాభ్రవ్య, మాండవ్య, మాండూకేయు, గర్గిని, వాచక్రవిని, బడబనుఁ, బ్రాతిధేయికను, సులభను, మైత్రేయిని, గహోళునిఁ, గౌశీతకు, మహాకౌశీతకు, భారద్వాజునిఁ, బైంగ్య, సుయజ్ఞకు, సాంఖ్యాయను, నైతరేయు, మహైతరేయు, భాష్కలు,

సుజాతవక్త్రి, జౌదవాహిని, శౌజామిని, శౌనకు, నాశ్వలాయనుఁ దప్పక తర్పింప వలయు. ౨౮౨

క. నా కులమువారు మఱియును । నాకు సగోత్రులును నైన నందనహీనుల్
గైకొందు వస్త్రనిష్పీ । డాకలితజలంబులఁగా మదంజలి జలముఁగా. ౨౮౩

వ. అని యిట్లు బ్రహ్మయజ్ఞంబు సేయ సర్వవేదవేదాంగంబులు పాఠంబుసేసిన ఫలంబు గలుగుఁ, దదనంతరము వైశ్వదేవంబును, వెండియు నిత్యశ్రాద్ధంబును, నాదట నతిథి భోజనంబును, పిమ్మట గోగ్రాసంబును, నవ్వల నిష్టులతోఁగూడి సాపడుటయుఁ దర్వాతఁ బగటి యాఱవ భాగంబునను, నేడవ భాగంబునను నితిహాస పురాణాదులం బ్రొద్దుపుచ్చ వలయు. నెనిమిదవ భాగంబు లోకవృత్తంబులం గాలంబు గడిపి, సాయంతనంబు గాఁగానే సాయంసంధ్య వార్చవలయుఁ, దత్క్రమంబు వినుము. ప్రాతస్సంధ్యవలె నాచమనాదికంబు సేసి దేవీధ్యానంబునందు. ౨౮౪

సీ. వృద్ధసరస్వతి కృష్ణాంగి కృష్ణవస్త్రయు శంఖ పద్మ చక్ర సుగదాక
రయు గరుత్మద్వాహ రత్నభూషాయుత మంజీర మేఖలా మండితయును
దత రత్నమకుటయుఁ దారహారాన్విత తాటంకబద్ధసుందరమణీక
పీతాంబరయు సామవేదసంహితయును ఘన సచ్చిదానంద క్రమమూర్తి

తే.గీ. సూర్యపథగామినియు స్వర్విహార్యుదార । మూర్తియును నైన భగవతి మూలశక్తి
నతి యొనర్చుచు నావాహనంబొనర్తుఁ । బరమభక్తిని సంతోషభరితమతిని. ౨౮౫

వ. మఱియు నాపోహిష్ఠాది మంత్రంబులు పూర్వంబుంబోలెఁ జేయవలయు. సూర్యశ్చకు మారుగా నగ్నిశ్చ యనునది సెప్పవలయు. నారాయణప్రీతికై యర్ఘ్యంబీవలయు. ౨౮౬

తే.గీ. కాళ్ళురెండు సమంబులుగాఁగ నిలచి । తివిరి దోయిట జలమిడి దేవుఁ దలఁచి
క్రమముగా మూడుసారులు కడునియతిని । విడువనగు నర్ఘ్యజలములు పృథివిమీద. ౨౮౭

వ. పిమ్మట సూర్యోపస్థానమ్ము ఇమమ్మేవరుణచేఁ జేసి గాయత్రిం జపియించి ప్రాతః కాలంబుంబోలె నడుపవలయు, సాయంసంధ్యాతర్పణంబున ఋషి వసిష్ఠుండు, విష్ణువు దేవత, ఛందస్సు సరస్వతి, సాయంసంధ్యాతర్పణమున వినియోగము. సామవేదంబు నస్వః యనుదానిచేఁ దర్పణ్యంబు సేసి హిరణ్యగర్భునిఁ, బరమాత్మను, సరస్వతిని, సంకృతిని, సంధ్యను, ఉషసిని, నిర్మృజిని, సర్వసిద్ధికారిణిని, భూ ర్భువ స్స్వః పూరుషునిం దర్పించెదనని చెప్పవలయు. ఇఁక గాయత్రీపురశ్చరణ విధానంబు సెప్పెద నని నారాయణుండు. ౨౮౮

## —: గాయత్రీపురశ్చరణకర్మ :—

సీ. పర్వతాగ్రమున నాపగయొడ్డునను బిల్వమూలంబునను గోష్ఠమునను మఱియు
చెరువుదాపున రావిచెట్టుక్రిందను మంచితోటలోపల దివ్యతులసియెదుట

పుణ్యాశ్రమంబున మొనసి పురశ్చరణము సేయనగు గురునాధునొద్ద
మూడు వ్యాహృతులను వీడక గాయత్రి నయుతంబు సేయవలయునుజుమ్మ

తే.గీ. ధర నృసింహార్క వారాహ తంత్ర వేద। మార్గములచేతఁ జేయక మానెనేని
ఫల మొకింతయు లేదు జపంబునందు। కానఁ జక్కఁగ విధు లెఱుఁగంగవలయు. ౨౮౯

క. గాయత్రియ భూసురులకు। బాయని దైవంబుగాన బ్రాహ్మణులెల్లన్
వేయేల శాక్తులేసు। మ్మీ యన్యులుగారు నమ్ముమీ నా మాటల్. ౨౯౦

వ. ముందు మంత్రసంశోధనంబు సేసుకొని, యాత్మశుద్ధి గని, తదర్థంబు మూడులక్షలేని శక్తుండుగానిచో నొక్కలక్షయేని జపింపందగు. నాత్మశుద్ధిలేక హోమాదికంబు నిష్ఫలం బగుఁ, దపంబుచే దేహంబు దపింపంజేసి దేవతలం, బితృదేవతలం దృప్తినొందించుట లగ్గు. క్షత్రియుండు పరాక్రమంబున, వైశ్యుండు ధనంబున, బ్రాహ్మణుండు తపంబున, స్వర్గప్రాప్తుండగు. నట్లుకాన బ్రాహ్మణునకుం దపంబు ముఖ్యంబు. చాంద్రాయణాది వ్రతంబులు కర్తవ్యంబులు. ఇఁక నన్నశుద్ధి వచించెద వినుము. అయాచితవృత్తి మొదటిది, రెండవది యుంఛవృత్తి, మూడవది శుక్లవృత్తి, నాల్గవది భిక్షావృత్తి, యధాక్రమబలీయంబులై యుండు. శుద్ధంబైన భిక్షాన్నంబు దెచ్చి నాలుగుభాగంబులు గావించి యం దొకభాగంబు ద్విజులకొఱకును, గోగ్రాసంబుకొఱకు, రెండవది. యతిథులకొఱకు మూడవదియు, నాల్గవ భాగంబు దనకును దన భార్యకును నుపయోగింపబడవలయు. వానప్రస్థ గృహస్థులకు గుక్కుటాండప్రమాణంబులగు కబళంబులగునవి. గృహస్థున కెనిమిది,వనప్రస్థునకు నాలుగు, బ్రహ్మచారికి యధేష్టమది గోమూత్రవిధిపూర్వకంబై యుండవలయు. కరంబు నిశ్ఛిద్రంబు చేసి సావిత్రింతదృచం బను మంత్రంబున నభిమంత్రించుచు, దొమ్మిది యారు, మూడు సార్లు క్రమంబుగాఁ బ్రోక్షించవలయు. వైశ్యాన్నంబునకంటె క్షత్రాన్నంబును, దానికంటె బ్రాహ్మణాన్నంబును బ్రశస్తంబులు. చోర, చండాల కృత్య విశిష్టులగు వైశ్య, క్షత్రియుల యన్నం బధమంబు. శూద్రాన్నంబును శూద్రసంపర్కంబును నరకాపాదకంబులు. మఱియుఁ బురశ్చరణంబు గాయత్ర్యక్షరసంఖ్యాకలక్షల జపంబు క్తంబు. ద్వాత్రింశల్లక్షమానంబు విశ్వామిత్రమతంబు. పురశ్చరణరహిత బ్రాహ్మణుండు జీవరహిత శరీరంబువంటివాడు. జ్యేష్ఠాషాఢ భాద్రపద పుష్య మాసంబులందు, మలమాసంబులందును, అంగారక శని వారంబులందును, వ్యతీపాతలందును, వైధృతియందును, అష్టమి, నవమి, షష్ఠి, చతుర్దశి, త్రయోదశి, అమావాస్య, ప్రదోషంబులందును, రాత్రియందును, భరణి, కృత్తిక, ఆర్ద్ర, ఆశ్రేష, జ్యేష్ఠ వసు, శ్రవణ జన్మ నక్షత్రంబులందును, మేష, కర్కి, తులా, కుంభ, మకరంబులందును బురశ్చరణంబు సేయరాదు. చంద్రతారానుకూల శుక్లపక్షంబునఁ బురశ్చరణంబు సేయదగుఁ, బ్రథమంబున స్వస్తివాచన నాందీశ్రాద్ధంబులుసేసి బ్రాహ్మణసంతర్పణంబు సేయుట లెస్స. అట్లు చేసి శివస్థానంబునం బ్రత్యఙ్ముఖుండై జపించునది. ౨౯౧

క. వారాణశియును మఱి గే। దార మహాకాళములును దగు నాసికయున్
ధారుణిని త్ర్యంబకంబును। నారయఁగా బంచదీపికాఖ్యము లయ్యెన్. ౨౯౨

తే.గీ. ఎల్ల యెడలను దీపం బహీనమైన। యట్టి కూర్మాసనంబందు నార్యజనులు
ప్రతిదినము నొక్కరీతి జపంబు సేయ। వలయు నెక్కువ తక్కువ లొక్కలుగనీక. ౨౯౩

క. ప్రాతఃకాలము మొదలిడి। యాతత మధ్యాహ్నవేళ కలర జపముగాఁ
జూతురు పెద్దలు కావున। భూతలమున నదియ పాపపుంజ మడంచున్. ౨౯౪

క. ఇరుబదినాలుగులక్షలు। వరుసం జపియించి తుదను వర తిలపత్త్రిం
బుల నలరుల మధురాన్విత। ములను దశాంశముగ హోమమును జేయఁదగున్. ౨౯౫

ఆ.వె. కార్యసిద్ధివరకుఁ గడఁగి జపింతురు। కొంద ఱవనిసురులు కొఱతయిడక
దినమునకును వేయి యనుదినంబు జపింత్రు। కొంద ఱాత్మశుద్ధికొఱకు ననఘ! ౨౯౬

ఆ.వె. సర్వకర్మములనుఁ జలిపిన గాయత్రి। కర్మఫలము నిచ్చి కాచుచుండు
కామదంబు సౌఖ్యకారి మోక్షదము పు। రశ్చరణమువంటి క్రతువు గలదె? ౨౯౭

వ. నారదా! వైశ్వదేవవిధానంబుం దెలిపెద వినుము. ౨౯౮

## —: వైశ్వదేవాదివిధానము :—

ఆ.వె. ఐదు గలవు దేవయజ్ఞంబు బ్రహ్మయ। జ్ఞంబు భూతయజ్ఞ నామకంబు
నుఁ బితృయజ్ఞమును మనుష్యయజ్ఞంబును। ననఁగ యజ్ఞములు మహామునీంద్ర! ౨౯౯

తే.గీ. పరగఁ బ్రోయియు బేషి ణ్యు పస్కరములు। ఖండనియు సర్వతోముఖకుండికయును
బంచసూనలు నాఁ బాప భంజకమ్ము। లందఱు గృహస్థులకుఁ దాపసాధినాథ! ౩౦౦

తే.గీ. ప్రోయిలోని యుపపాత్రను భూమియందు। ఖర్పరంబునఁ గూడదు కడఁగిసేయ
గుండమందును మఱియును స్థండిలమున। వైశ్వదేవము సేయంగవలయుఁజుమ్ము. ౩౦౧

తే.గీ. ఊదరా దగ్ని నెప్పుడు నో మునీంద్ర। చేతిచే నజినముచేత జేటచేత
నోటితో నూదవలయు వహ్నులను రగుల। వినుము దెల్పెద నింక సవిస్తరముగ. ౩౦౨

ఆ.వె. పండ్లు పెరుగు నేయి బహువిధ మూల శా। కములచేతనేని జలములచేత
నేనిఁ దొరకకున్న నెండుకట్టియలనే। గడ్డినేని వేల్వఁగాఁదగుఁజుమి. ౩౦౩

ఆ.వె. నేతితోడ వేల్మి నెగడుఁ దైలమ్మున। క్షారమునను వేల్వఁ గాదటండ్రు
దధినిఁ బాయసమునఁ దగు వేల్వఁ దదలాభ।సమయమందు జలము జముదు టొప్పు. ౩

తే.గీ. పర్యుషిత శుష్కములచేత వ్యాధి గలుగు। శత్రువులు గెల్తు రుచ్ఛిష్ట సక్తమైన
రుక్షములచేత లేమియు రూఢి క్షార। మెసఁగ నరకంబు గలుగును హోమవిధుల. ౩౦౫

తే.గీ. బొగ్గులును బూడిదయుం ద్రోచి పొసగ వహ్ని।యుత్తరంబున వేల్చుట యుత్తమంబు
క్షారవర్జిత మెప్పుడు నలుపవలయు। వైశ్వదేవంబు సేయక వలదు మెసవ. ౩౦౬

ఉ. చెన్నుగ వైశ్వదేవమునుఁ జేయక భోజన మాచరించినన్
దన్నుచుఁ గొంచుపోవుదురు ధర్ముని దూతలు భూసురాధమున్

వెన్నున బండలె త్తెదరు వీఁడఁగరా దధి పత్రమూలముల్
పన్నియునేనిఁ జేయఁదగు బ్రాహ్మణుఁడై జనియించువాఁ డిలన్. ౩౦౭

తే.గీ. వైశ్వదేవంబునకు మున్ను వచ్చి । భిక్ష యడిగెనేనియుఁ వైశ్వదేవార్థ మెత్తి
భిక్ష నిడి పంపుటయ లెస్స భిక్షుకుండు । వైశ్వదేవకృతాఘంబు వాపునండ్రు. ౩౦౮

తే.గీ. వైశ్వదేవకృతాఘంబు వాపు భిక్షువరుఁడు భిక్షుకృతాఘంబు వాపలేడు
వైశ్వదేవంబు కావున వైశ్వదేవ । భిక్షువుల తారతమ్యంబు పేర్మిగనుము. ౩౦౯

తే.గీ. బ్రహ్మచారియు యతియును బక్వభక్త । పతులు వారికి నెవ్వాఁడు మెతుకునిడఁడు
వాఁడు చాంద్రాయణము సేయవలయుఁజుమ్ము । కాకయుండిన దోషంబు పోకయుండు. ౩౧౦

వ. తదనంతరంబు గోగ్రాసంబు జరుపవలయు. దద్విధానంబు సెప్పెద వినుము. గోగ్రాసంబు
నకు ముందుగాఁ బూజసేయవలయు. అందు, ౩౧౧

తే.గీ. సురభి వైష్ణవి మాత విష్ణుపదగంత్రి । కదసి నేఁ జేయు గోగ్రాసకర్మ నిపు డ
నుగ్రహంబునఁ దానుఁ బ్రతిగ్రహించుఁ । గాత గోవులకును మ్రొక్కువైతు నిదియ. ౩౧౨

వ. ఇట్లు వచించి చేసిన గోగ్రాసంబున గోమాతయగు సురభి ప్రసన్నయగుఁ బిదప
గోదోహనమాత్రకాలంబు గృహాంగణంబున నిలచి యతిథికొఱకు నిరీక్షింపవలయు. ౩౧౩

తే.గీ. అతిథి భగ్నాశుఁడై యేగృహంబునుండి । వెడలిపోవును దద్గృహవిభుని పుణ్య
మెల్ల నాతండు గైకొని యొసఁగ నతని । దురితమును గృహపతి కిచ్చి సరగ నరుగు. ౩౧౪

తే.గీ. తల్లి తండ్రియు గురుఁడు భ్రాతయును బ్రజలు । దాసులు సమాశ్రితాభ్యాగతశిఖు లతిథి
పోష్యులని యండ్రు గృహికి నిభ్భువిఁ దలంప । సకలసంయమిజనపర్య సాధుచర్య. ౩౧౫

తే.గీ. సొమ్ముగలవారు సోమయజ్ఞమ్మువలనఁ । బొందు ఫలము దరిద్రుండు బొందుఁ బంచ
యజ్ఞములచేత నని చెప్పి రార్య లిద్ది । యెఱుఁగవలయు గృహస్థభూసుఁరుడు ధాత్రి. ౩౧౬

వ. మఱియుజన్మ మృత్యు జరా వినాశకంబై మోక్షప్రదంబగు ప్రాణాగ్నివిధానంబు దెలిపెద
వినుము. దీనివలన నిరుబదియొక్క కులంబుల నుద్ధరించు సామర్థ్యము సేకూరు.
హృత్పుండరీకం బరణియు. మనంబు మంథనంబు, వాయువు రజ్జువుగా నొనర్చి యగ్ని
మథించి చక్షువను నధ్వర్యుండు తర్జనీమధ్యమాంగుష్ఠంబులచేఁ బ్రాణంబునకు, మధ్య
మానామికాంగుష్ఠంబులచే నపానంబునకుఁ, గనిష్ఠానామికాంగుష్ఠంబులచే వ్యానంబునకు
గనిష్ఠాతర్జన్యంగుష్ఠంబులచే నుదానంబునకు, సర్వాంగుళులచే సమానంబునకు నాహుతు
లుగా నన్నంబు గొనవలయు. నివియ ప్రాణాహుతులు నాంబడు. ఆదిని ప్రణవంబు,
నంతంబున స్వాహాకారం బని కణంబులు బుచ్చికొనవలయుఁ, జతుర్థ్యంతంబులగు నామం
బులే మంత్రంబులగు. మఱియు నీ యజ్ఞంబునకు ముఖంబున నాహవనీయంబును, హృద
యంబున గార్హపత్యంబును, నాభిం దక్షిణాగ్నియు ధ్యానించునది. అసభ్యశు లిరుపురు
సభ్యులు. వాక్కు హోత, ప్రాణంబుద్గాత, చక్షు వధ్వర్యుండు, మనంబు బ్రహ్మ,

శ్రోత్ర మగ్నిహోత్రము, స్థానం బహంకారంబు. పశువు ప్రణవంబు, బుద్ధి విపత్ని, ఉరంబు వేది, రోమంబులు దర్భలు, కరంబులు స్రుక్స్రువంబులు, రుక్మవర్ణంబగు ప్రాణ మంత్రంబునకు ఋషి క్షుధాగ్నికుండు, ఆదిత్యుండు దేవత, గాయత్రి ఛందంబు, మంత్రం బుఁ ప్రాణాయ స్వాహా యనియు, "ఇద మాదిత్య దేవాయ న మమ" యనియుఁ గీర్తింప వలయు. గోక్షీరధవళాకృతియగు నపానమంత్రంబునకు శ్రద్ధాగ్ని ఋషి, సోముఁడు దేవత, ఛందం బనుష్టుప్పు, అపానాయ స్వాహా యనునది మంత్రంబు. "సోమాయేదం న మమ" యని కీర్తింపవలయు, బద్మవర్ణంబగు వ్యానమంత్రంబునకు హుతాశనుండు ఋషి, దేవత యగ్ని, ఛందం బనుష్టుప్పు, వ్యానాయ స్వాహా యనియు, "ఇద మగ్నయే న మమ" యనియుఁ గీర్తింపందగు. నింద్రగోపవర్ణంబగు నుదానమంత్రంబునకు అగ్ని ఋషి, వాయువు దేవత, ఛందంబు బృహతి, యుదానాయ స్వాహా యనియు. "వాయవేదం న మమ" యనియుఁ గీర్తింపవలయు. విద్యుద్వర్ణంబగు సమానమంత్రంబునకు అగ్ని ఋషి, పర్జన్యుండు దేవత, ఛందస్సు పంక్తి, సమానాయ స్వాహా యనియుఁ, "పర్జన్యాయేదం న మమ" యనియుఁ గీర్తింపవలయు. నిఁక నాఱవ మంత్రంబునకు వైశ్వానరుండు ఋషి, ఛందంబు గాయత్రి, స్వాత్మ దేవత, పరమాత్మనే స్వాహా అనియుఁ, "పరమాత్మన ఇదం న మమ" యనియుఁ గీర్తింపవలయు. నిది ప్రాణాగ్నిహోత్రవిధానంబు. సంగ్రహంబుగా నీకుం దెల్పితి నని చెప్పి నారాయణుండు వెండియు నిట్లనియె. ౩౧౭

## — పురశ్చర్యానియమములు :—

క. అమృతాపిధాన మనుచున్ । విమలోచ్చారణము సేసి వెలయఁగఁ బాత్రా
న్నమును విచక్షణుఁడగువాఁ । డమరఁగ నుచ్ఛిష్టభాక్కులకు నీవలయున్. ౩౧౮

ఆ.వె. అన్నకాంక్షులైనయట్టి మత్కులజాతు । లెంద ఱుందు రంద ఱింపుమీర
నే నొసంగునట్టిదాన భూతలమున । మిగులఁ దృప్తి నొంది మిండ్రుగాత ! ౩౧౯

తే.గీ. రౌరవమునందుఁ బుణ్యనిలయమునందు । నమరఁ బద్మార్బుదనివాసులైనయట్టి
యర్థులకు నే నొసంగినయట్టి మంచి । యంబు వలరంగ నక్షయ్య మగునుగాత ! ౩౨౦

వ. అని పవిత్రగ్రంథిని విప్పి మండలభువి నుంచవలయు. పాత్రంబున నుంచరాదు. ఉచ్ఛిష్టంబు శునకంబుచేఁగాని, శూద్రునిచేఁగాని ముట్టఁబడెనేని ద్విజుం డొకరాత్రి యుపోష్యంబు సేసి పంచగవ్యం బునం బరిశుద్ధుండగు. ననుచ్ఛిష్టునిచే ముట్టఁబడెనేని స్నానంబున శుద్ధుండగు. నేకాహుతిప్రదానంబుచేఁ గోటియజ్ఞఫలంబునుఁ, బంచాహుతులచేఁ బంచకోటి యజ్ఞఫలంబులునుం గలుగు. ప్రాణాగ్నిహోత్రంబున నన్నదానంబు సేయువాఁడును, నందు భోక్తయగువాఁడును నిద్దఱును స్వర్గలోకంబునం దుందురు. మఱియు, ౩౨౧

క. పూజాకాలత్రయమున । నా జపముం దర్పణంబు నా హోమం బ
య్యోజం బ్రాహ్మణభుక్తియు । రాజిల్లుచు నొప్పెడిం బురశ్చరణమనన్. ౩౨౨

సీ. నేల బండుచు జితేంద్రియుఁడయి క్రోధంబు మాని యిష్టముకొంచెమైన భోజ
నంబు సేయుచును శాంతత్వంబు గల్గియుఁ ద్రిషవణస్నాయియై స్త్రీలతోడ
పతిత శూ ద్రోచ్ఛిష్ట పాషండ చండాల జనులతో నెపుడు భాషణము మాని
పనుల దెందమున సంభాషణంబుల మైథునాలాపముల నెందు నంటనీక

తే.గీ. యుండవలయుఁజుము విచక్షణుండు ధాత్రి। నొగి నెఱుంగుము ప్రాణాగ్నిహోత్రదీక్ష
రమ్యతరమై పరగెడిఁ బురశ్చరణము। పద్మజకుమార గుణగణాపార ధీర। ౩౨౩

తే.గీ. శాంతవృత్తివి దా ఋతుస్నాతయైన। చానను సవర్ణ సంస్కృత సంగమింప
వలయురాత్రుల నిటులైన బ్రహ్మచర్య। మెడలదు ఋణత్రయముబాయుకొడుకులుంద్రు. ౩౨౪

తే.గీ. అగ్నిహోత్రాదికంబుల నలరఁడేని। జనుని జన్మ యజాగళ స్తనమువిధము
కావున ఋణత్రయప్రమోక్షణముకొఱకు। ద్విజుఁడు యత్నింపవలయును దేవమౌని। ౩౨౫

వ. ఋషుల బ్రహ్మచర్యంబువలనఁ బితృదేవతలం దిలోదకంబులవలన, దేవతల యజ్ఞంబు
లవలన నిజాశ్రమధర్మంబు లెఱిఁగి పురుషుండు తృప్తినొందించి ఋణత్రయవిముక్తుండు
గావలయు. ౩౨౬

ఆ.వె. పాలు ద్రావియైన ఫలములు దినియైన। నాకు నమలియైన నట హవిష్య
భక్షణముననైన బరగఁ జాంద్రాయణవ్రతము భిక్షనైన వలయుఁజేయ. ౩౨౭

సీ. లవణంబు క్షార మమ్లము గృంజనంబును కాంస్యపాత్రము వీనిఁ గనఁగరాదు
మత్తు దుష్టులతోడి పొత్తు ద్విభుక్తంబు నశ్రౌత మస్మార్త మరయరాదు
వ్యర్థంబుగాఁ గాలయాపనంబును జూదమును స్త్రీనిఁ బానంబు గొనఁగరాదు
తోడి దేవతాపూజ స్తోత్రాగమవిలోకనంబులచేఁ జేకొనంగవలయు

తే.గీ. వలయు భూశయ్య మౌనంబు బ్రహ్మచర్య। మనవరతము ద్రిషవణంబు లంఘ్రిజన్మ
కర్మవర్జనమును నిత్య కలితపూజ। నిత్యదానంబు లివి గణనీయవిధులు. ౩౨౮

సీ. సముచితానంద సంస్తవనంబు కీర్తనం బొనర నైమిత్తికార్చనము మఱియు
విశ్వాసమును గురు వృద్ధ దేవతలందు నర్కునుపస్థాన మతనిపూజ
స్నానంబు పూజయు జపమును ధ్యానంబు హోమంబు తర్పణం బొగి నడపఁగ
వలయును నిష్కామవర్తనంబును దేవతలయందు భక్తియు నలరవలయు

తే.గీ. నిట్టి సత్క్రియలందును హృదయశుద్ధి। నలుపుకొనునట్టిదే పురశ్చరణమయ్యె
నిదియ తపమందు రెఱుఁగంగ నిదియె భూరి। ఫలదమును సిద్ధిదము మోక్షఫలదమరయ. ౩౨౯

వ. స్వాధ్యాయాభ్యాసంబునకు మొదలఁ బ్రాజాపత్యంబు సేయవలయు నందుం గేశ శ్మశ్రు
లోమ నఖ వాపనంబు సేయించుకొని యహోరాత్రంబులు శుచియై యుండవలయు.
మౌనంబు పూనవలయు. వ్యాహృతులు జపించుచు, సత్యవాదియై యుండవలయు.
వ్యాహృతులకు నాదిం బ్రణవంబు గూర్పనగు. నాపోహిష్ఠ యను మంత్రంబునం

బూతుండు గాఁదగుఁ గర్మాదియందునుఁ గర్మాంతంబునందును పునంతీ, స్వస్థిమతీ, పావమాను లనునవి సర్వత్ర ప్రయోగింపందగినవి. మఱియు, ౩౩౦

క. వేయైనను నూరయిననుఁ । బాయక పదియైనఁ దుదకుఁ బరగు జపంబున్
జేయంగవలయుఁ బ్రణవసమాయుక్తముగాగ మఱియు వ్యాహృతు లలరన్. ౩౩౧

వ. మఱియు జలంబులచే నార్యులను, ఋషులను, ఛందంబులను, దేవతలనుం దృప్తినొందించవలయు. ననార్యంబుచే భాషింపరాదు. గర్హితులతో, శూద్రులతో, బహిష్కృతో, నంత్యజులతో, దేవ బ్రాహ్మణ దూషకులతో, నాచార్య గురు నిందకులతో, మాతృపితృద్వేషులతో సంభాషించుట నిందితంబు. కృచ్ఛ్రవిధు లివి యని యెఱుంగునది. ప్రాజాపత్యంబువకును, సాంతపనంబునకునుఁ బరాకంబునకునుఁ జాంద్రాయణంబునకునుఁ, బై విధులు పొసంగుచుండు. నైదిటివలన నెల్లపాపంబులనుఁ దొలంగించుకొని ద్విజుండు పరిశుద్ధుండగు. మూడు చాంద్రాయణంబులచే బ్రహ్మలోకంబు గలుగు, నెనిమిదింట దేవతలం జూచుఁ, బదింట సర్వకామంబులు లభించు. ౩౩౨

క. రేపకడ మూడునాళ్ళును । మాపుమొదలు మూడునాళ్ళు భక్తము దినుచున్
సొపడక మూడునా ప్రాజాపత్యము జరపవలయు సద్ద్విజుఁడు ధరన్. ౩౩౩

ఆ.వె. గోమూత్రము గోక్షీరము । గోమయ దధ్యాజ్యములనుఁ గుశనీరంబున్
దా మెసఁగిన సాంతపనం । బై మించెడి నేకరాత్ర మటు పస్తున్నన్. ౩౩౪

క. ఒకగ్రామంబున నొకనాఁ । డకలంకతఁ గుడుచుచుం ద్ర్యహంబులు గడపన్
బ్రకటితముగఁ బూర్వమువలె । నిఁక నతికృచ్ఛ్రమునఁ బస్తు లెన్నఁగ మూడౌ. ౩౩౫

ఆ.వె. ఒనర మూడురాత్రు లుపవసించిన మహా । సాంతపనముసుమ్ము సంయమీంద్ర
స్నాన మొక్కసారి జల దుగ్ధ ఘృత భుక్తి । దప్తకృచ్ఛ్రమునను దప్పమి యగు. ౩౩౬

వ. మఱియు, ౩౩౭

క. ప్రతి మూడునాళ్ళకును న । గ్గతి నుష్ణక్షీర ఘృతముఖంబులు గొన్నన్
మతి నెంచి తప్తకృచ్ఛ్ర । వ్రత మగునని బల్కుదురు ధరన్ విబుధేంద్రుల్, ౩౩౮

వ. నియతంబుగా జలంబులు పానంబుసేయుచు ద్వాదశాహంబు లుపవసించిన మహాప్రాజాపత్యం బగు, మఱియు, ౩౩౯

సీ. శుక్లపక్షంబున సొరిది నొక్కొకముద్ద నెక్కుడుసేయుచు మెక్కవలయుఁ
గృష్ణపక్షంబునఁ గెరలి యొక్కొకముద్ద దక్కువఁజేయుచు మెక్కవలయుఁ
ద్రిషవణస్నానంబు తీర్పంగవలయు నమావాస్య సాపాటు మానవలయుఁ
నిదియ చాంద్రాయణం బిందుచేఁ బాపంబు లడఁగుఁ బవిత్రత యావహిల్లు

తే.గీ. నాల్గు ముద్దలు ప్రొద్దుట నాల్గు మాపు । నారగింపఁగను శిశుచాంద్రాయణంబు
అష్టపిండంబు లెంచి మధ్యాహ్నమందు । నమలఁగా యతిచాంద్రాయణంబు సుమ్ము. ౩౪౦

వ. కావున మున్నుగా దేహసిద్ధియుఁ, బిదప గాయత్రీపురశ్చరణయుఁ గావించి వ్రతంబు సలుపుచు, జితేంద్రియుండై ద్విజుండు ప్రవర్తించెనేని సర్వఫలంబు లందునని చెప్పిన విని నారదుండు. ౩౪౧

## —: కామ్యకర్మాదివిధి :—

క. మునిసేవిత వనజేక్షణ । కనకాంబర నీలదేహ కారుణ్యనిధీ
జననియయిన గాయత్రిని । మనుకొని శాంతిప్రయోగములఁ దెల్పు మనన్. ౩౪౨

క. అడిగితి వతిగుహ్యము నిది । జడులకుఁ జెప్పంగరాదు సంయమివర్యా
నుడివెద వినుమీ దేవికిఁ । గడుభక్తి నమస్కరించి కామ్యక్రియలన్. ౩౪౩

వ. భూత, రోగ, గ్రహాదిశాంతికి, శమీసమిధులచే హోమంబు సేయవలయు. మఱియు నార్ద్రంబులగు క్షీరవృక్షసమిత్తులచే హోమంబుసేయ భూతంబులు తప్పక తొలంగు. జలంబుచే సూర్యతర్పణంబు సేయవలయు. నదిగాక జానుదఘ్నంబులగు జలంబులం జపియించిన దోషశమంబగుఁ, గంఠదఘ్నజలంబుల జపించినఁ బ్రాణాంతికంబగు భయంబు దొలంగు. శాంతివిధులం జలంబులం డిగ్గి మునింగి జపంబు సేయుటే సర్వ సమ్మతంబు. సౌవర్ణపాత్రంబుననేని, రాజతంబుననేని, దామ్రమయంబుననేని, క్షీరదారుమయంబులనేని మృణ్మయంబున నేనిఁ బంచగవ్యం బిడి సహస్రంబు జ్వలితానలంబున హోమంబు సేయవలయు. సహస్రంబు జపియింపవలయు. పాత్రస్థపంచగవ్యంబులచే మంత్రంబు సెప్పుచుఁ బ్రదేశంబు ప్రోక్షింపవలయు. సంతం బలిం జల్లి పరదేవత జపించి యభిచారంబు సేసెనేని తదుత్పన్నపాపంబు నశింపంజేయు. భూతపిశాచాదులు వశగతులగుదురు. గృహ గ్రామ రాష్ట్రాదులందు తద్బాధానివృత్తియగు మండలంబు వ్రాసి, దానియందు శూలంబు వ్రాసి, పూర్వోక్త క్రమంబునం జపంబు సహస్రంబు సేసి నిఖనంబు సేసిన నిఖిలపీడలుం దొలంగు. నింక నొక విధానంబు దెలిపెద వినుము. ౩౪౪

సీ. కాంచనమయమేనిఁ గలధౌతమయమేనిఁ దామ్రమయంబేనిఁ దనర నొక్క
మృణ్మయంబేని నెమ్మిని గ్రొత్తకలశంబు నవ్రణంబునుఁ దెచ్చి యందుఁ జుట్టు
సూత్రవేష్టనమును సొరిదినిఁ గావించి సైకతంబై యొప్పు స్థండిలమునఁ
బొసఁగించి జలములఁ బూరింపవలయును నాల్గుదిక్కుల జీవనమును దెచ్చి
తే.గీ. యేలకులు చందనము కర్పూర మెనయ జాజి । మల్లె కలిగొట్టుపూవులు నెల్ల వైచి
మారెడుదళంబులును బిల్వ మంచియవలు। పొసగు నావాలు పాలచివుళ్ళ నుంచి. ౩౪౫

సీ. అందుపై కుశకూర్చ మమరంగ నిల్పి సుస్నాతుఁడై చిత్తంబు చక్కఁజేసి
సౌరమంత్రంబుల సకలదిక్కుల ద్విజుల్ పఠియింపుచుండగాఁ బరగఁ గలశ
జలమును ద్రావఁ బోక్షణము సేయఁగ నభిషేకింప శుద్ధుడై చెలఁగి మృత్యు
ముఖమునుండి తొలంగు భూసురు లియ్యది తప్పగూడదు భీతిఁ దగిలినపుడు

తే.గీ. పెక్కులేడులు పృథివి జీవింపఁదలఁచు । రాజు ముఖ్యముగా నిట్టిక్రమము సేసి
దశవిధములైన దానముల్ తా నొసంగఁ।దగును నారదమునిచంద్ర సుగుణసాంద్ర. ౩౪౬

ఆ.వె. రావిచెట్టుమొదట భూవిబుధుఁడు శత । సంఖ్య జపముసేయ సకల భూత
రోగచయము దీరు నీగతుల నథర్వ । వేదచోదనంబు వెలయుచుండు. ౩౪౭

క. మఱియు గుడూచీసమిధలఁ । దెరకణుపులులేనిదాని దెచ్చి వయోక్త
స్ఫురణములఁ జేసి వేల్చిన । నురువుగ మృత్యుంజయాఖ్య హోమం బయ్యెన్. ౩౪౮

క. మామిడి చిగురులచేతన్ । హోమం బొనరించుచోఁ బయోక్తములైనన్
గామదమగు జ్వరశాంతినిఁ । దా మహిమము సూపు నారదా మునిచంద్రా ! ౩౪౯

సీ. వసఁ బయోక్తము సేసి వరల హోమ మొనర్ప క్షయరోగ మప్పుడే క్షయమునొందు
క్షితి మూడుమధువులచేఁ బయోక్తంబుగా నలర వేల్చిన రాజయక్ష్మ మెడలు
నర్కునకునుఁ బాయసాన్నంబును నివేదనము చేసి తినిన యక్ష్మము హరించుఁ
బర్వంబులను లతల్ పరఁగ విచ్ఛేదించి చంద్రునకును వేల్వ క్షయము పోవు
తే.గీ. కుసుమ శంఖద్రు సమిధల కుష్ఠు దీరు । నొగి నపామార్గతండుల హోమమునను
రూఢి గుదురు నపస్మార రోగవితతి । క్షీరసమిధలచే వెఱ్ఱి దీరు నంద్రు. ౩౫౦

సీ. ఔదుంబరంబుల నడఁగును మేహంబు త్రిమధువులను మసూరికలు దీరు
తేనె జెఱకుపాలఁ దీరు బ్రమేహంబు మఱ్ఱి రావియును నుదుంబరతరువుల
సమిధల వేల్చిన శమియించు గుల్మపుతెవు లింటిలో పుట్ట తివిరెనేని
జమ్మిచిగురులు నన్నమ్ము నేయియుఁ గూర్చి వేలిమిసేసిన మేలుగూర్చు
తే.గీ. పిడుగు భూకంపములు నుల్క లడరెనేని । నడవిప్రబ్బలి చిగురుల నలర వేల్వ
నేడురాత్రులలోన మే లెనసి యెల్ల । రాష్ట్రము సుఖంబునుం బొందు బ్రహ్మపుత్ర ! ౩౫౧

సీ. మనసులోన జపింప మహిమంబుగలుగును భూత రోగ విష ప్రపాతములకు
స్పర్శంబు గావింపఁ జక్కనౌ నభిమంత్రితంబైన జలమును ద్రావెనేని
నప్పుడే మానెడి నన్నివిషంబులు తలమీదను విభూతి నొలయ మంత్రి
తముసేసి చల్లిన దత్క్షణంబు గ్రహంబు పారిపోవును బహుదూరములకుఁ
తే.గీ. దాన యొనరింప శక్తుండు గానివాఁడు।దక్షిణ యొసంగి సేయింపదగును దొడ్డ
బ్రాహ్మణునిచేత శాంతిక ప్రకటకర్మ।మఖిలసంతోషకారి యీ యవని ననఘ ! ౩౫౨

వ. మఱియుఁ బుష్పంబులచే హోమంబుసేయ బుష్టియు, శ్రీయుం గలుగు. శ్రీకాముండు రక్తపద్మంబులచేతను, నూత్నంబులైన జాజిపూలచేతను, శాలితండులంబులచేతను, మారేడుసమిధలచేతను, తన్మూలంబులచేతను, పాయస సర్పులచేతను, శతశతప్రమాణంబులుగా నేడురాత్రులు హోమంబు సేయవలయు. త్రిమధురోపేతంబులగు లాజలచే హోమంబుచేసిరేని వివాహంబగు. సలక్షణయగు కన్యక సేకూరు. వెండియు, ౩౫౩

క. చెంగలువలచే హోమం । బుం గావింపంగ నూరు పౌరులేణ్ణాళ్లన్
వెంగలికైనను మేలిమి బంగారము గలుగునండ్రు పరమమునీంద్రుల్. ౩౫౪

క. అన్నము హోమముచేసిన । నన్నమునకు గొదవరా దటండ్రు మహాసం
పన్నుండు వ్రీహి వేల్చిన । నున్నతి వ్రీహియు లభించు నుర్వీస్థలిపై. ౩౫౫

ఆ.వె. కడఁగి దూడపేడ పిడకపొడిని వేల్వ । పశుసమృద్ధి యండ్రు పరమమునులు
పాలచితుకు వ్రేల్చి పరమాయువును గండ్రు । విమలతరవిచార విధికుమార ! ౩౫౬

తే.గీ. కొట్టిపాసెంబు సేసి యర్కునకు నిచ్చి । కొంతహోమంబు గావించి కొంత నీళ్ళ
లాడి శుద్ధయయిన భార్య కారగింపఁ । బెట్టెనేనియు నిల్లాలు పట్టిగాంచు. ౩౫౭

తే.గీ. మూడుమధురంబులనుగూర్చి మొనసి యార్ద్రార క్తములసప్రరోహంబులను నొనర్చి
వ్రీహిశతమును వేల్చిన వెలయు హేమ।మాయువును నండ్రు మంత్రవిదగ్రులిలను. ౩౫౮

క. సౌవర్ణకుట్మలంబుల । తో వేల్చిన నాయు వొదవు దూర్వలఁ దేనెన్
భావించి సేత నేణ్ణా । ళ్ళావిధమున శతము వేల్వ నపమృత్యు పశున్. ౩౫౯

తే.గీ. జమ్మిచితుకులు పాలతోఁ జెమ్మగించియేని నేతఁ దడిపియేని నెసగ నన్న
సహితముగఁ జేసి వేల్చిన నహిత మెడలి।పోవు నపమృత్యుదోషంబు పురుషునకును. ౩౬౦

తే.గీ, మఱ్ఱిసమిధలు పాయసమగ్నములుగఁ । జేసి హోమంబు గావింపఁ జెందు శుభము
నేడునాళులు పాల్దావి యిట్లు సేయఁ।దొలఁగు నపమృత్యుదోషంబు దూరములకు. ౩౬౧

ఆ.వె. తిండిమాని మూడు దినములు వాగ్యతుం।డగుచు జపముసేయ యమునివలన
నుండి తొలఁగు నీళ్ళనుండి జపించిన । నపుడె మృత్యుభీతి యడగిపోవు. ౩౬౨

క. మారెడువృక్షముక్రిందనుఁ । జేరి జపింపంగ రాజ్యసిద్ధిపొసంగున్
మారెడు సమూల ఫలమున్ । వారక వేల్వంగ రాజ్యవంతుండె యగున్. ౩౬౩

క. ఒక నెల పద్మశతము త । ప్పక దినదినహోమమునను బరగించినచో
సకలపదములును రాజ్యము । ప్రకటితమై వచ్చునండ్రు పరమవిధిజ్ఞుల్. ౩౬౪

తే.గీ. రావిసమిధల వేల్వ ఘోరతరయుద్ధ । మందు విజయంబు గను నందు రార్యజనులు
మఱియు జిల్లేడు సమిధల మహిత విజయ।మందు నిది యెఱుఁగుము ద్రుహిణాత్మజాత ! ౩౬౫

తే.గీ. అడవిప్రబ్బలి పూవుల నాకులనుఁ బ । యస్సులనుగూడఁ బాయసాన్నాంచితముగ
వేల్మి శతమును జేయంగ వృష్టిగురియు । సంయమికులేంద్ర సాధువిచారసాంద్ర ! ౩౬౬

తే.గీ. నాభిదఘ్నంబులగు జీవనంబులందు । నేడునాళులు జపియింప నెంతకఱవు
పట్టుననుఁ బర్జన్యుండు పరమదయను । వృష్టిగల్గించు లోకంబు పుష్టినొందు. ౩౬౭

తే.గీ. అంబువులలోన భస్మశతంబు హుతము । సేయఁ బెనువాన చెడునండ్రు సిద్ధమునులు
మోదుగ సమిత్తులను హోమమును నొనర్ప।బ్రహ్మవర్చస్సుగలుగును బ్రహ్మపుత్ర ! ౩౬౮

తే.గీ. మోదుగులపూల హోమంబు మొగి నొనర్ప। నిష్టసిద్ధి యగును బాల నెంతయేని
మేధ గలుగును నేతను మిగుల బుద్ధి।పొసఁగు నభిమంత్రితము గ్రోలఁబోలునంద్రు. ౩౧౯

తే.గీ. ఎట్టి రంగుల పుష్పంబు లట్టిబట్ట।లొదవు లవణ మధువులను నువిద వలచు
శ్రీసుమంబుల మధుపుతోఁ జెలఁగి వేల్చి।యనయ మంజలితోఁ జల్లుకొనఁగవలయు. ౩౨౦

క. దినమునకు వేయివంతున। ననువుగ నొక మాస మిట్టు లాత్మ జపింపన్
మనుజునకును దీర్ఘాయువు। తనరు ననుచుఁ బల్కి రఖిల ధర్మవిధిజ్ఞుల్. ౩౨౧

క. ఆయువు నారోగ్యంబును। బాయక గలుగంగఁగోరి మనుజుండు జపం
బేయెడ మాసద్వయమును। జేయంగావలయు నంద్రు సిద్ధమునీంద్రుల్. ౩౨౨

వ. మూడుమ్మాసంబులు సేసిన నాయురారోగ్యలక్ష్ములగు, నైదైనఁ బుత్రదారాద్యారోగ్యంబు గలుగు, విద్యయుం గలుగు, నేకపాదుండై యూర్ధ్వబాహుండై జపంబుసేసెనేని ఫల మధికంబగు. దినంబునకు మూడువందలుగా మాసంబు జపించెనేని గార్యసిద్ధియగు. ప్రాణాపానంబులు బంధించి శతత్రయంబు చొప్పున జపించెనేని కోరికలు సమకూరు, సహస్రంబు జపింప సర్వంబును గలుగు. మఱియు, ౩౨౩

ఆ.వె. ఒంటికాలిమీద నూర్ధ్వబాహుండయి। యనిలబంధనంబు నమరఁజేసి
దినము వందచొప్పునను జపియింపఁగాఁ। గాంక్షలిచ్చు ననియెఁ గౌశికుండు. ౩౨౪

ఆ.వె. ఒంటికాలిమీద నూర్ధ్వబాహుండయి। యనిలబంధనంబు నమరఁజేసి
దినము వేయిచొప్పునను జపియించిన। సర్వకాంక్షితములు చక్కఁబడును. ౩౨౫

ఆ.వె. నీటమునిఁగి జపము నెమ్మితోఁ జేసిన। వంద వేయి యిట్లు వరుస నెరిగి
పాద బాహు వాయు బంధంబుల నెఱింగి। యెంతఁజేయఁగల్గు నంత ఫలము. ౩౨౬

క. మనుజుఁడు రాత్రి హవిష్యము। దిని యేడు జపించెనేనిఁ దివిరి జగమునన్
ముని యగు రెండేండ్లయినన్। గన నాడిన దాట పాడినది పాట యగున్. ౩౨౭

క. వినుమా వత్సరముల మూ। టను జపియింప న్విశంకటస్థితి భూతం
బును వర్తమానము భా। విని దెలియు నటంద్రు లోకవిశ్రుతలీలన్. ౩౨౮

క. నాలుగు వత్సరములు దా। నోలిం జపియించెనేని నొగి భగవంతుం
డాలోన యుండి ప్రత్యక్ష। లంబం బిచ్చు దీని నరయు మునీంద్రా। ౩౨౯

ఆ.వె. ఐదువత్సరంబు లటు జపియించిన। నణిమ మున్నుగాఁగ నఖిలభూతు
లగును నాఱేఁటం గలుగుఁ గామరూపంబు। నేడిటన్ సురత్వ మెసఁగునంద్రు. ౩౩౦

ఆ.వె. తొమ్మిదేండ్లు సేయ నెమ్మితో మనువగు। పదిఁటనైన నింద్రపదవి గల్గుఁ
దనరఁ బదునొకొంట దాఁ బ్రజాపతి యగుఁ। బదియురెంట బ్రహ్మభావమూను. ౩౩౧

ఆ.వె. శాక మారగించి సలిపిరి కొందఱు। కంద నారగించి కొందఱలమి
నేయి చరువు సోమ మాయయిగతులను। జపము సల్పికాదె తపసులైరి. ౩౩౨

క. కొందఱు పక్షము దిందురు । కొందరు భైక్షంబు దింద్రు కోరి హవిష్యం
బుం దిందురు కొందరు భువి । యిందరు జపియించి తారు ఋషులై రిసుమీ. ౯౮౩

వ. త్రిసహస్రజపంబున రహస్యకృతపాపంబులు నశియించు, మాసంబున స్తేయదోషంబు దొలంగు, త్రిసహస్రంబు మాసంబు జపియించెనేని సురాపానపాతకం బెడలు, మాసంబు త్రిసహస్రంబు చేసెనేని గురుతల్పగ దోషంబు నివర్తించు, వనంబున బర్ణశాలయందు జేసెనేని బ్రహ్మహత్యయుం బోవు నండ్రు. మరియు, ౯౮౪

ఆ.వె. పదియురెండునాళ్లు నదిలోన మునిగి తా । విడువకను దినంబు వేయి జపము
సేసెనేని నెల్ల చెడుచైదములనుండి । యవనిసురుఁడు శుద్ధుఁడగు నటండ్రు. ౯౮౫

క. వేయి నియతి నొనరుచుఁ బ్రా । ణాయామంబులను బ్రహ్మహరతయునేనిన్
బాయక పవిత్రుఁడగుఁ బ్రా । ణాయామముకంటెఁ గలదె యధికము ధరలోన్. ౯౮౬

వ. ప్రాణాపానంబులం బంధించి యారేసిచొప్పున నభ్యసింపవలయు. నిది ప్రాణాయామం బనం బడు. నిట్టివి సహస్రంబు క్షత్రియుం డభ్యసించెనేని సర్వపాపంబులవలన విముక్తుండై పరిశుద్ధుండగు. ద్వాదశాహంబు త్రిసహస్రంబు జపించిన గోవధాదిక దోషనివృత్తి యగు. ప్రాణాయామశతంబు సర్వపాపహరంబు. ౯౮౭

ఆ.వె. సర్వపాపములకు సంకరం బొదవిన । వేయి వరుస నెలను జేయ నిత్య
జాపి యగును నడవి నోపిక వసియించి । నిత్యజాపి యగుట నిఖిలదంబు. ౯౮౮

క. తత్తను ఋక్కున నెంతయుఁ । జిత్తము రంజిల్ల జపము సేయఁగ మేలౌ
సత్తరము మూడువేలన్ । రిత్తలె సత్యంబులైన ఋషివాక్యంబుల్, ౯౮౯

వ. చతుర్వింశతిసహస్రం బభ్యసింపంబడెనేని కృచ్ఛ్రసంజ్ఞితయగుఁ జతుష్షష్టిసహస్రం బైనం జాంద్రాయణసమంబగు. నుభయసంధ్యలఁ బ్రాణాయామంబు సేసి నూరుసారు లభ్యసింపవలయు. దత్తనుఋచంబు సర్వపాపవినాశకంబు. నదీజలంబుల మునింగి జపించి సూర్యరూపయగు దేవిం ధ్యానించి సర్వపాపంబులనుండి విముక్తుండగు. నిట్లు కామ్యంబుల శాంతిక పౌష్టికంబుల తెఱంగెల్ల వివరించితి. నిత్య నైమిత్తిక కామ్యభేదంబు లెఱింగి ద్విజుం డాచరించెనేని దేవీప్రసాదంబు గలుగు. భుక్తి ముక్తులు లభించు. మఱియు, ౯౯౦

తే.గీ. అరయ నాచారమే ధర్మ మాదిఁ దలప । నట్టి యాచారమును బ్రోచు నాదిదేవి
దేవి యాచారపరులను దేరిజూచి । యైహికాముష్మికఫలంబు లందఁజేయు. ౯౯౧

క. ఆచారమె పూతత్వం । బాచారమె పరమసౌఖ్య మవనిఁ దలపగా
నాచారమె ధన్యత్వం । బాచారమె శాస్త్రఫక్కి నధికఫలమునూ. ౯౯౨

## —: కృ తి ప తి సం బో ధ న ము :—

శా. ప్రక్రుద్ధప్రతిపక్షసైనికమదప్రధ్వంసనాయత్తధీ
శక్రాపత్యసభక్తికవ్రతవిధాసంజాతసంతోషని
ర్వక్రప్రేమవితీర్ణ పాశుపతదివ్యస్ఫారఘోరాస్త్రస
మ్యక్రాంత్యద్భుతవర్తి కీర్తిపసరా అల్లూరి సోమేశ్వరా! ౩౯౩

స్రగ్విణీ. వారణాసీద్యుషద్వాహినీతీరసం। చారవిస్తారవిస్ఫారతేజోమయా
కార విశ్వేశ్వరాంకస్థిరాధార భూ। షోరుశృంగార యల్లూరి సోమేశ్వరా! ౩౯౪

గద్య. ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసువంశపయః పారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరితగోత్రాలంకార, కృష్ణామండలమండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీవీర ప్రతాప కోదండహంవీరరామచంద్రభూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధభాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదకనియోగభారవ్యవహార, శ్రీవేంకటేశ్వరవరప్రసాదసంభూతకవిత్వ విద్యావిశేష, బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేక గ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితిప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతంబగు శ్రీదేవీభాగవతంబను మహాపురాణంబునందు ఏకాదశస్కంధము.

స ం పూ ర్ణ ము.

★

శ్రీ ర స్తు

శ్రీ శా ర దాం బా యై న మః

# శ్రీ దేవీభాగవతము

## ద్వాదశస్కంధము

శ్రీధరకంధరవిజిత
శ్రీధరకంధరనవాతసీశిఖిగళ భా
మాధమ్మిల్లప్రాసన
శీధుపహారినీలకోశ శ్రీసోమేశా। ౧

వ. అవధరింపు మనంతరంబు. ౨

### —: గాయత్రికి ఋష్యాదులు :—

వ. నిఖిలతత్త్వవిశారదుండైన నారదుండు భక్తరక్షణపరాయణుండగు నారాయణునకు సవినయంబుగా నిట్లనియె. ౩

ఉ. వింటిని నీముఖంబున సువిస్తృతదేవికథామృతంబు నా
తొంటిభవంబునందయిన దోషసముచ్చయమెల్ల దూలిపో
గెంటితి దుఃఖసాధ్యములు కేవలనిష్కృతు లబ్జనాభ! నీ
బంట సుఖంబుగా దొసఁగుబాసెడిమార్గము సెప్పి బ్రోవవే. ౪

తే.గీ. సుఖముగాఁ జేయఁదగినది సుజనసమ్మ। తంబునైనది దేవికి దయనుగల్గఁ
జేయునదియైన క్రియ నొండు సెప్పి నన్నుఁ। గరుణఁ బాలింపఁగదవయ్య కమలనాభ! ౫

సీ. సత్కర్మరతులకు సాధుమార్గంబైన గాయత్రి కేదిముఖ్యంబు దేవ
తత్త్వసంఖ్యావర్ణ తతమైన గాయత్రి వర్ణంబులకు ఋషు ల్వారఁబడిరె
దేవత లెవ్వరు తెలుపుము ఛందంబు లెవ్వియో సర్వంబు నెఱుకసేయు
వినఁగ నా మదిలోన వేడుకయయ్యెడు ననిన నారాయణుం డతని జూచి

తే. గీ. వినుము నారద చెప్పెద విశ్వమందు । నొనర గాయత్రికంటె వేఱొండు లేదు
పాపనాశకమార్గంబు పట్టిచూడ । సులభసాధ్యం బనుష్ఠానకలనమునకు. ౬

తే. గీ. సంధ్యలం దర్ఘ్యదానంబు సలిపి భక్తి । తనర గాయత్రి మూఁడువేలను జపించు
నట్టి మానవు దేవేంద్రుఁడైన తనదు । గద్దె నిడి పూజసేయంగగలఁడుసుమ్ము. ౭

క. న్యాసంబు లన్నివేళలఁ । జేసినసుం జెల్లుఁ జెల్లుఁ జేయకయున్నన్
భూసురవర గాయత్ర్యా । భ్యాసంబున దేవి మెచ్చు నానందమిడున్. ౮

క. ఒక్కొక్కరంబు సిద్ధిం । జిక్కిన హరితోడ ద్రుహిణ శివ సూర్య సుధా
భుక్కులతోఁ బోరాడం । బెక్కువగలఁ గలుగుశక్తి పృథుగుణగణ్యా ! ౯

తే. గీ. వర్ణ ఋష్యాదికంబును పరస ఛంద । ములును జెప్పెద నింకఁ దన్మూల మెఱిఁగి
కొనుము నారద యిది మహాగుహ్య మరయ । దేవివలనను నే వింటి దీని మున్ను. ౧౦

వ. వామదేవుండును, అత్రియు, వశిష్ఠుండును, శుక్రుండును, గణ్వుండును, బరాశరుండును, విశ్వామిత్రుండును, గపిలుండును, శౌనకుండును, యాజ్ఞవల్క్యుఁ డును, భరద్వాజుండును, జమదగ్నియు, గౌతముండును, ముద్గలుండును, వేదవ్యాసుండును, లోమశుండును, నగస్త్యుండును, గౌశికుండును, వత్సుండును, బులస్త్యుండును, మాండూకుండును, దూర్వాసుండును, నీవును, గశ్యపుండును గ్రమంబుగా నిరుబదినాలుగు వర్ణంబులకు నిరుబదినలుగురు ఋషులైరి. ఇఁక ఛందోనామంబుల వివరించెద వినుము. గాయత్రి, యుష్ణిక్కును, అనుష్టప్పును, బృహతి పంక్తి, త్రిష్టుప్పు జగతి, అతిజగతి, శక్వరి, అతిశక్వరి, ధృతి, అతిధృతి, విరాట్టు, ప్రస్తారపంక్తి, కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అక్షరపంక్తి భువి, భువము, స్వర్గామకము, జ్యోతిష్మతి యివి యిరుబదినాలుగును ఛందంబులయ్యె. మఱియు దేవతలం దెలెపెద వినుము. మొదటిది యగ్నిదేవతాకము. రెండవది ప్రజాపతిదేవతాకము, మూడవది సోమదేవతాకము, నాల్గవది యీశానదేవతాకము, ఐదవది సవితృదేవతాకము, ఆఱవది యాదిత్యదేవతాకము, ఏడవది బృహస్పతిదేవతాకము, ఎనిమిదవది మిత్రావరుణదేవతాకము, తొమ్మిదవది భగదేవతాకము, పదియవది గణపతిదేవతాకము, పదునొకండవది యీశ్వరదేవతాకము, పండ్రెండవది త్వష్టృదేవతాకము, పదమూడవది పూషదేవతాకము, పదునాల్గవది యింద్రాగ్నిదేవతాకము, పదునైదవది వాయుదేవతాకము, పదియారవది వామదేవదేవతాకము, పదియేడవది మైత్రావరుణిదేవతాకము, పదునెన్మిదవది విశ్వేదేవదేవతాకము, పందొమ్మిదవది విష్ణుదేవతాకము, ఇరుబదియవది వసుదేవతాకము, ఇరుబదియొకండవది ధర్మదేవతాకము, ఇరుబదిరెండవది రుద్రదేవతాకము, ఇరుబదిమూడవది కుబేరదేవతాకము, ఇరువదినాల్గవయది యశ్వినీదేవతాకము. ఇట్లు ఋషి ఛందో దేవతా పరిగణనంబు సేయబడినది. మఱియు, ౧౧

## —: గాయత్రియొక్క శక్తివర్ణాదులు :—

వ. ఈ యిరువదినాలుగు వర్ణంబులకు శక్తులను వివరించెద వినుము. వామదేవియు, ప్రియయు సత్యయు, విశ్వయు, భద్రవిలాసినియు, ప్రభావతియు, జయయు, శాంతయుఁ, గాంతయు, దుర్గయు, సరస్వతియు, విద్రుమయు, విశాలేశియు, వ్యాపినియు, విమలయుఁ, దమోపహారిణియు, సూక్ష్మయు, విశ్వయోనియు, నిరయయు, వశయుఁ, పద్మాలయయు, పరాశోభయు, భద్రయు, త్రిపదయు నను నిరువదినాలుగు శక్తుల వివరించితిని. ఇక వర్ణంబుల వర్ణంబులు సెప్పెద వినుము. క్రమంబుగా సంపంగిపూవుచాయ, నల్లగసిపూ మెఱుఁగు, పగడంబుడంబు, స్ఫటికంబురంగు, కమలంబుతేట, బాలసూర్యునిడాలు, శంఖంబువన్నె, చిగురులేఁదామరాకు బెడంగు, పద్మరాగంబుపోడిమి, ఇంద్రనీలంబుమేలు, ముత్తియంబుతళుకు, కుంకుమంబుకాంతి, కాటుకనీటు, రక్తంబుపోలిక, వైడూర్యంబు చందంబు పసపుమిసిమి, మొల్లలమొల్లంబు, పాలభాతి, సూర్యతేజంబు, చిలుకతోక సొంపు, శతపత్త్రింబునందంబు, మొగిలిపూజిగి, మల్లెపూవు మురువంబు, గన్నేరు చెలువంబు, వెండియు వినుము పృథివియు, జలంబును, దేజంబును, వాయువును, ఆకాశంబును, గంధంబును, రసంబును, రూపంబును, స్పర్శంబును, శబ్దంబును, నుపస్థంబును, పాయువును, పాదంబును, పాణియు, వాక్కును, ఘ్రాణంబును, జిహ్వయుఁ, జక్షువులును, త్వక్కును, శ్రోత్రంబును, ప్రాణంబును, అపానంబును, వ్యానంబును, సమానంబును, నను నీ యిరువదినాలుగు తత్త్వంబు లయ్యె. నింకను వీనికిం గ్రమంబుగా ముద్రలు వివరింతు, వినుము. సుముఖంబును, సంపుటంబును, వితతంబును, విస్తృతంబును, ద్విముఖంబును, త్రిముఖంబును, చతుర్ముఖంబును, పంచముఖంబును, షణ్ముఖంబును, నధోముఖంబును, వ్యాపకంబును, అంజలికంబును, శకటంబును, యమపాశంబును, గ్రథితంబును, సమ్ముఖంబును, ఉన్ముఖంబును, ప్రలంబంబును, ముష్టికంబును, మత్స్యంబును, కూర్మంబును, వరాహకంబును, సింహాక్రాంతంబును, మహాక్రాంతంబును, ముద్గరంబును, పల్లవంబును నను నిరువదినాలుగు ముద్రలయ్యె, నారు మహాముద్రలు గల వవి యెవ్వి యనిన త్రిశూలంబును, యోనియు, సురభియు, నక్షమాలయు, లింగకంబును, నంబుజంబును, నేతాదృశంబగు గాయత్రీవర్ణప్రభావంబు సకల పాపహరంబగు నని సెప్పిన విని నారదుండు నారాయణున కిట్లనియె ౧౨

## —: గాయత్రీకవచము :—

ఆ.వె. సంశయంబు గలదు సకలేశ నాకు నె । ద్దానివలనఁ బాపతతి యడంగు
బ్రహ్మరూప మెట్లు ప్రాపించుఁ జెప్పుమా । కర్మతత్త్వమెల్ల నిర్మలాత్మ । ౧౩

కం. న్యాసము విధిపూర్వకముగ । భాసిలు ఛందంబు ఋషియుఁ బరదైవం బు
ల్లాసమయిన ధ్యానంబుల । వాసవనుత తెలుపుమయ్య వరుసను నాకున్. ౧౪

వ. అనిన నారాయణుండు. ౧౫

కం. గాయత్రీకవచంబున । నో యతివర దానిఁ జదువ నురుదోషంబుల్
పాయును గోరిక లొదవున్ । శ్రేయం బది దేవిరూపు నెందినకతనన్. ౧౬

వ. దానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఋషులు, ఋగ్యజుస్సామాథర్వణంబులు ఛందంబులు, బ్రహ్మరూపయగు గాయత్రిదేవత బీజంబు, భర్గ యనునది కీలకంబు, ధియో యనునది మోక్షార్థంబున వినియోగము. నాలుగువర్ణంబులచే హృదయంబును, నాలుగింట శిఖయు, మూడింట గవచంబును, నాలుగింట నేత్రంబులును, నాలుగింట నస్త్రకంబును మఱియు ధ్యానంబు వినుము. ౧౭

సీ. పరగ ముత్తెపుఛాయ పగడంపుఁ జాయయు హేమంబు చాయయు నింద్రనీల
ముల చాయయును మంచి తెలుపైన చాయయుఁ గల ముఖంబులు గల్గి వెలుగునెద్ది
వఱలెడి తత్త్వార్థ వర్ణరూపిణి యయి వరదాభయాంకుశ వరకశలను
మూడుకన్నులు గల్గి మొనసి చంద్రనిబద్ధ తతరత్నమకుటంబుఁ దాల్చునెద్ది
తే.గీ. శుభ్రమైన కపాలంబు శోభిత గద । శంఖ చక్రాబ్జయుగళముల్ చారులీల
మొనసిహస్తంబులనుదాల్చు మూర్తియెద్ది । యట్టి గాయత్రి భజియింతు ననుదినంబు. ౧౮

సీ. తూర్పును గాయత్రి తొడరి రక్షించును వెస దక్షిణమును సావిత్రి యేలు
బ్రహ్మసంధ్యాదేవి పాలించుఁ బడమర నొగి సరస్వతి యేలు నుత్తరంబు
పార్వతి కాపాడు పావకదిక్కును యాతుధాన భయద యాతుధాన
దిక్కును గన్పెట్టుఁ దివురుచు వాయువిలాసిని దా ననిలదిశఁ బ్రోచు
తే.గీ. జెలఁగి రుద్రాణి కాచును శివునిదిశను । నువరి బ్రహ్మాణి వైష్ణవి యొనరఁ గ్రింద
నన్నుఁ జూచుచునుందురు కన్నుఁగలిగి । సరవి నింకనుఁ దెలిపెద సంయమీంద్ర ! ౧౯

వ. మఱియుఁ దత్పదంబు పాదంబులను, సవితుః పదంబు జంఘలను, వరేణ్యంపదంబు కటిదేశంబును, భర్గఃపదంబు నాభిని, దేవస్యపదంబు హృదయంబును, ధీమహిపదంబు గల్లంబులను, ధియఃపదంబు నేత్రంబులను, యఃపదంబు లలాటంబును, నఃపథంబు మూర్ధంబును, ప్రచోదయాత్పదంబు శిఖను రక్షించుంగాక. పదంపడి తత్తు మూర్ధంబును, సకారంబు ఫాలంబును, వికారంబు చక్షువులను, తుకారంబు కపోలంబులను, ర్వకారంబు నాసాపుటంబులను, రేఫంబు ముఖంబును, ణికారం బూర్ధ్వోష్ఠంబును, యకారం బధరోష్ఠంబును, భకారంబు తన్మధ్యంబును, ర్గోకారంబు చుబుకంబును, దేకారంబు కంఠదేశంబును, వకారంబు స్కంధదేశంబును, స్యకారంబు దక్షిణహస్తంబును, ధీకారంబు వామహస్తంబును, మకారంబు హృదయంబును, హికారం బుదరంబును, ధికారంబు

నాభియు, యోకారంబు కటిని. ద్వితీయయోకారంబు గుహ్యంబును, నఃకారం బూరువలను, ప్రకారంబు జానువులను, చోకారంబు జంఘలను, దకారంబు గుల్ఫదేశంబును, యాకారంబు పదయుగ్మంబును, తకారంబు వ్యంజనంబును, బరిరక్షింతురుగాత! అను నియ్యది గాయత్రీకవచంబు. దీనిం బఠించినవాఁడు సర్వపాపవిముక్తుండై బ్రహ్మ నధిగమించు నని చెప్పిన విని నారదుండు. ౨౦

## —: గాయత్రీహృదయము :—

తే.గీ. భూతభవ్యభవత్ప్రభూ భూరిమహిమ । వింటి నీవల్ల గాయత్రి విధము కొంతఁ
దెలుపుమిఁక దాని హృదయంబు దేటపడఁగ । బాపములఁ దోలి పుణ్యంబువడయఁగలను. ౨౧

కం. నారద యిది యథర్వణ । సారము నీ వడిగితివి సుసాధంబుగ నేఁ
గూరిమి విన్పించెద సం । సారమహారణ్యపరశు సాధనముగదా! ౨౨

సీ. ఉరు విరాడ్రూప యయ్యును మహాదేవి యయ్యును వేదమాతయై తనరునట్టి
ఘనశుభకారిణి గాయత్రి ధ్యానించి సర్వాంగములయందు సరణిఁ దెలసి
దేవతలను వేడి భావింపవలయు బ్రహ్మాండ పిండాండము లైక్యమగుట
దేహంబులన్నియు దేవీమయంబులు నాదంబుచేతఁ దిన్నఁగ భజింప
తే.గీ. వలయు సంగంబులెల్ల దేవమయములగు । దానిఁ జెప్పెద వినుమయ్య తప్ప కీవు
పాపవిచ్ఛేది పుణ్యసంపాదకంబు । హిత మనంతంబు గాయత్రి హృదయమెన్న. ౨౩

వ. గాయత్రీహృదయంబున కహమ్మనునది ఋషి, గాయత్రి ఛందంబు, పరమేశ్వరి దేవత, అంగంబులారును పూర్వోక్తంబులై తగు. విజనదేశంబునం గూర్చుండి యేకాగ్రమానసుండై ధ్యానింపవలయు. దీని యర్థన్యాసంబు సెప్పెద. మూర్ధంబున స్వర్గంబు దైవంబు, దంతపఙ్క్తి యశ్వినులు, నోష్ఠంబుల నుభయసంధ్యలు, ముఖంబున నగ్ని, జిహ్వయందు సరస్వతి, కంఠంబున బృహస్పతి, స్తనంబులను అష్టవసువులు, బాహువుల మరుత్తులు, హృదయంబునం బర్జన్యుండు, ఉదరంబున నాకాశంబు, నూరువులఁ గైలాస మలయంబులు, విశ్వేదేవతలు జానువులందుఁ, గౌశికుండు జంఘలందు, గుహ్యంబున నయనంబులు, ఊరువులఁ బితరులు, పాదములం బృథివి, యంగుళుల వనస్పతులు, రోమంబుల ఋషులు నఖంబుల ముహూర్తంబులు, అస్థులు గ్రహంబులుగల్గి, అసృగ్మాంసంబులు ఋతువులునై, తెప్పుబ వత్సరంబులై, అహోరాత్రాదిత్యచంద్రస్వరూపిణియై, ప్రవరయై, దివ్యయై, సహస్రనేత్రయైన గాయత్రిం ధ్యానించెద నని వెండియు, తత్సవితృవరేణ్యుండును, తత్పూర్వాజయుండును, తత్ప్రాతరాదిత్యుండును, తత్ప్రాతరాదిత్యప్రతిష్ఠయునగు తేజంబునకు మ్రొక్కెద నని యిట్లు ప్రాతఃకాలంబున ధ్యానించి, రాత్రికృత పాపంబులం దొలగించుకొనునది.

సాయంకాలంబున ధ్యానించి, దినకృతపాపంబు లడంచి సాయంప్రాతఃకాలంబులం ధ్యానించి పాపంబులు లేనివాఁడగు, సర్వతీర్థంబుల స్నానంబుసేసినవాఁడగు, సర్వదేవతల నెఱింగినవాఁడగు. నవాచ్యవచనంబువలనను, అభక్ష్యభక్షణంబు వలనను, అచోష్యచోషణంబు వలనను, అభోజ్యభోజనంబువలనను, అసాధ్యసాధనంబువలనను గలిగిన దోషంబువలన నుండి పవిత్రుండగు. నింతియకాక దుష్ప్రతిగ్రహశతసహస్రంబునుండి పూతుండగు. సర్వప్రతిగ్రహదోషంబువలననుండి పూతుండగు. పఙ్క్తిదూషణంబువలననుండి పూతుండగు, ననృతవాదంబునుండి పవిత్రుఁడగు. బ్రహ్మచారి నియతాచారంబులు విడిచిన దోషంబునుండి శుద్ధుండగుఁ, గ్రతుసహస్రఫలంబగు,షష్టిశతసహస్రగాయత్రీజపంబువలనఁ గలుగు ఫలంబు లభించు; నెనమండ్రుబ్రాహ్మణుల సమ్యగ్రాహంబుసేయ దానిఫలంబు తప్పక సేకూరు. ప్రాతస్సాయంసమయంబుల గాయత్రీహృదయంబు జపించినవాఁడు పాపవిముక్తుండై బ్రహ్మలోకంబు నొందు నని శ్రీమన్నారాయణుండు చెప్పిన విని నారదుండు గాయత్రీస్తోత్రంబు సెలవిండని యడిగిన నారాయణుండు. ౨౪

## —: గాయత్రీస్తోత్రము :—

తే.గీ. ఆదిశక్తి జగన్మాత యఖిలభక్త। లోకపోషిణి సకలలోకైకకర్త్రి
నియుఁ ద్రిసంధ్య సదా నిన్ను నే భజింతు।నీకు మ్రొక్కెద గాయత్రి నిఖిలధాత్రి। ౨౫

తే.గీ. నీవ సంధ్యవు గాయత్రి వీవ మఱియు। రమ్య సావిత్రి వీవ సరస్వతివియు
బ్రాహ్మివియు వైష్ణవివియును రౌద్రి వీవ। తనర రక్తవు నీవ శ్వేతవును నీవ. ౨౬

క. ప్రొద్దుట బాల నడుపగటి। ప్రొద్దున యువతి మునుమాపు ప్రొద్దు ముసలివై
తద్దయు నొప్పెడి నిన్నుం। బ్రోద్దామతఁ గొల్తు రెల్ల మునులునుఁ దల్లీ! ౨౭

ఆ.వె. హంసమీఁదనుండి యా తార్క్ష్యుపై నెక్కి। యెద్దు నధిగమించి ఋక్ఛ్రుతంబు
చదువుకొనుచుఁ దోఁతు సంతోషమున ముని। ప్రవరులకును భువినిఁ బరమశక్తి! ౨౮

ఆ.వె. అంతరిక్షమందు న య్యజుర్వేదంబు। చదువుకొనుచుఁ దోఁతు సకలకళల
సర్వలోకములను సామగానముతోడఁ। దిరుగుచుందువమ్మ దివ్యశక్తి! ౨౯

ఆ.వె. రుద్రలోకమందు రూఢిగా నీ వుందు। విష్ణులోకమందు విడువ కుందు
బ్రహ్మలోకమందుఁ బాయక యుందువు। తల్లి నీవు మనుజతతినిఁ బ్రోవ. ౩౦

సీ. సప్తర్షులకు నీవు సంతోషజననివి బహువరంబుల నిచ్చి పరగఁ బ్రోతు
శివునకు శివకును జెన్నుమీఱఁగ నీవు కరయుగంబున దృగ్యుగంబునందు
ఘనతరాశ్రువులయందును స్వేదమందును జనియించితివి సునిశ్చలతమీఱ
నానందజననివి యా దుర్గవును బదివిధముల నొప్పెదు వెస వరేణ్య

తే.గీ. వెన్న వరదవును వరిష్ఠ వింకను వర । వర్ణినియు గరిష్ఠవు నరవరాహ
వును వరారోహవును నీలవును సుగంగవు దగుసంధ్యవు భోగమోక్షదవు తల్లి. ౩౧

సీ. మర్త్యలోకంబున మహిత భాగీరథి పాతాళమున భోగవతియు స్వర్గ
మునను మందాకిని మూడులోకంబులం బ్రవహించుదానవు భక్తజనని
భూలోకమున నీవు పొసఁగ ధరిత్రివై శోకదారిణివయి చొప్పడితివి
అలర భువోలోకమందు శక్తివయితి స్వర్గంబునను దేవసాంనిధివియు
నా మహర్లోకంబునందు మహాసిద్ధి జనలోకమందును జనని వగుదు
తే.గీ. వర తపోలోకమందుఁ దపస్వినివయి । సత్యమున సత్యవాక్కునఁ జాలకీర్తిఁ
దనరితివి-నిన్నుఁబోలిన దైవ మెద్ది । తల్లి గాయత్రి నిన్ను నేఁ దలఁతునమ్మ. ౩౨

ఉ. పత్త్రితురంగులోకమునఁ బద్మవు పద్మజులోకమందు గా
యత్రివి శంభులోకమున నద్రిజ వెన్నఁగ నీ చరిత్రముల్
చిత్రము ల య్యహంకృతికిఁ జేరె మహత్తునకుం బ్రధానసం
ధాత్రివి నిన్నుఁ గొల్చెదను తల్లి సమస్తము నీవ యెన్నఁగన్. ౩౩

క. సామ్యావస్థాత్మిక వతి । రమ్యవు నీ వెన్నఁగ శబలబ్రహ్మకళా
సౌమ్యస్వరూపిణివి స । ద్గమ్యవు పరశక్తి వఖిలధాత్రివి తల్లీ! ౩౪

వ. మఱియు నీ విచ్ఛాశక్తివి, విజ్ఞానశక్తివి. క్రియాశక్తివి గంగవు, యమునవు, విపాశవు, సరస్వతివి, సరయువవు, దేవికవు, సింధువవు, నర్మదవు, ఇరావతివి, గోదావరివి, శతద్రువవు, కావేరివి మందాకినివి, కౌశికివి చంద్రభాగవు, నితస్తవు. గండకివి, తపినివి, కృష్ణవు, గోమతివి, వేత్రవతివి, ఇడవు, పింగళవు, సుషుమ్నవు, గాంధారిని, హస్తిజిహ్వవు, పూషవు, అలంబవు, కుహూవవు, శంఖినివి, ప్రాణవాహినివి, శరీరస్థవైన నాదివి నీవ, హృత్పద్మస్థవగు ప్రాణశక్తివి నీవ, కంఠస్థవగు స్వప్ననాయికవు, తాలుస్థవగు సదాధారవు, బిందుస్థవగు బిందుమాలినివి నీవ, మూలంబైనఁ గుండలీశక్తివి నీవ, కేశమూలంబున వ్యాపినివి నీవ, శిఖా మధ్యంబున శేఖరవు నీవ, శిఖాగ్రంబున మనోన్మనివి నీవ, జగంబెల్ల నీవ తల్లీ! నీకు నమస్కరించెద నని గాయత్రీ స్తోత్రంబు సేసినవారికి బహుపుణ్యంబులు గలుగు, మహాపాపంబులు శమనంబులగు, అపుత్రకులు పుత్త్రివంతులగుదురు, దరిద్రులు ధనికులగుదురు, సర్వతీర్థగమన తపోదాన యజ్ఞ ఫలంబు గల్గు. భూలోకవిభవభోగానంతరంబున మోక్షంబు గలుగు. మఱియు. ౩౫

కం. ఈ గాయత్రీస్తవమును । బాగుగఁ గావించెనేని ఫల మెన్నఁదరం
బే గురుకామదమగుఁజూ । మీగతి మును లనిరి సత్యమిది సత్యమగున్. ౩౬

వ. అనిన విని పరమానందభరితాంతరంగుండై, ౩౭

తే.గీ. పతగరాజగమన శ్రుతి స్మృతి పురాణ। గోచరరహస్యము నెఱింగికొంటి ముదము
గంటి మోక్షైకహేతువుగాఁ దలిప్పు। పరమసాధన మింకొండుఁ బలుకు మనిన. ౩౮

## —: గాయత్రీ సహస్రనామములు :—

సీ. కలహభోజన విను కల దొక్కటి యఘౌఘనాశకం బమితపుణ్యప్రదంబు
నైన గాయత్రీమహానామకసహస్ర మది బ్రాహ్మణులకు ముఖ్యంబుసుమ్ము
ఋషి బ్రహ్మ ఛందంబు నెసఁగు ననుష్టుప్పు గాయత్రి దేవత గాఁ బొసంగు
హల్లులు బీజము, లచ్చులు శక్తులు, వ్యాసంబు లవి మాతృకాక్షరములు
తే.గీ. గాఁగ నొప్పెడి నది సర్వకామదంబు। నిక్క మిది నమ్ము మోక్షంబు దక్క నిందు
ధ్యానమార్గంబు సెప్పెద నాలకింపు। మాత్మ నత్యంతసంతోష మలర నీవు. ౩౯

సీ. రక్తాపదాతహిరణ్యనీలధవళవర్ణంబులునుగల్గి వన్నెకెక్కి
మూడునేత్రంబులు మొగి నొప్ప రక్తయై రక్తమాలికలతో రహి వహించు
మణిగణంబులతోడ మహిమయై సత్కుమారీరూపమును దాల్చి పేరుగల్గి
కరతలంబున గుండికయుఁ దమ్మిపూవును దనర నబ్జాసనస్థయయి మించి
తే.గీ. మంచిపేరులు మెడఁజుట్టి యంచనెక్కి। తిరుగు లోకైకధాత్రి సుదీర్ఘసౌఖ్య
రసవిధాత్రి నమిత కాంతిలసితగాత్రి। సాధుజనయిత్రి గాయత్రి సంస్మరింతు. ౪౦

| | | |
|---|---|---|
| అచింత్యగుణా | అజితి | అలక్ష్మి |
| అవ్యక్తా | అజపా | అంత్యజార్చితా |
| అర్థమాతా | అవిద్యా | ఆదిలక్ష్మి |
| అమృతార్ణవమధ్యస్థా | అరవిందనిభేక్షణా | ఆదిశక్తిః |
| అజితా | అంతర్బహిస్థితా | ఆకృతిః |
| అపరాజితా | అవిద్యాధ్వంసినీ | అయుతాననా |
| అణిమాదిగుణాధారా | అంతరాత్మికా | ఆదిత్యపదవీచారా |
| అర్కమండలసంస్థితా | అజ | ఆదిత్యపరిసేవితా |
| అజరాజా | అజముఖావాసా | ఆచార్యవర్తనా |
| అపరాధర్మా | అరవిందనిభాననా | ఆచారా |
| అక్షసూత్రధరా | అర్ధమాత్రా | ఆదిమూర్తినివాసినీ |
| అధరా | అర్థదా | ఆగ్నేయీ |
| అకారాదిక్షకారాంతా | అనిజ్ఞా | ఆమరీ |
| అరిషడ్వర్గభేదినీ | అరిమండలమర్దినీ | ఆద్యాచారా |
| అంజనాద్రిప్రతీకాశా | అసురఘ్ని | ఆద్యా |
| అంజనాద్రినివాసినీ | అమావాస్యా | ఆసనస్థితా |

ఆధారనిలయా
ఆధారా
ఆకాశాంతనివాసినీ
ఆద్యాక్షరసమాయుక్తా
ఆంతరాకాశరూపిణీ
ఆదిత్యమండలగతా
ఆంతరధ్వాంతనాశినీ
ఇందిరా
ఇష్టదా
ఇష్టా
ఇందీవరనిభేక్షణా
ఇరావతీ
ఇంద్రపదా
ఇంద్రాణీ
ఇంద్రరూపిణీ
ఇక్షుకోదండసంయుక్తా
ఇషుసంధానకారిణీ
ఇంద్రనీలసమాకారా
ఇళాపింగళరూపిణీ
ఇం దాక్షీ
ఈశ్వరీ
ఈహాత్రయవివర్జితా
ఉమా
ఉషా
ఉడునిభా
ఉర్వారుకఫలాననా
ఉడుప్రభా
ఉడుమతీ
ఉడుపా
ఉడుమధ్యగా
ఊర్ధ్వచారిణీ
ఊర్ధ్వకేశా
ఊర్ధ్వాధోగతిభేదినీ
ఊర్ధ్వబాహాంక్రియా
ఊర్మిమాలా వాగ్గ్రంథదాయినీ
ఋతా
ఋషిః
ఋతుమతీ
ఋషిదేవనమస్కృతా
ఋగ్వేదా
ఋణహర్త్రీ
ఋషిమండలచారిణీ
ఋద్ధితా
ఋజుమార్గస్థా
ఋజుధర్మా
ఋతుప్రదా
ఋగ్వేదనిలయా
ఋజ్వీ
ఌప్తధర్మప్రవర్తినీ
ౡతారివరసంభూతా
ౡతాదివిధహారిణీ
ఏకాక్షరా ౧౦౦
ఏకమాత్రా
ఏకా
ఏకైకనిష్ఠితా
ఐంద్రీ
ఐరావతారూఢా
ఐహికాముష్మికప్రదా
ఓంకారా
ఓషధీ
ఓతా
ఓతప్రోతనివాసినీ
ఔర్వా
ఔషధసంపన్నా
ఔపాసనఫలప్రదా
అండమధ్యస్థితా
అఃకారమనురూపిణీ
కాత్యాయనీ
కాళరాత్రీ
కామాక్షీ
కామసుందరీ
కమలా
కామినీ
కాంతా
కామదా
కలకంఠీ
కరికుంభ స్తనభరా
కరవీరసువాసినీ
కల్యాణీ
కు డలవతీ
కురుక్షేత్రనివాసినీ
కురువిందదళాకారా
తుండలీ
కుముదాలయా
కాలజిహ్వా
కరాళాస్యా
కాళికా
కాలరూపిణీ
కమనీయగుణా
కాంతిః
కళాధారా
కుముద్వతీ
కౌశికీ
కమలాకారా
కామచారప్రభంజినీ
కౌమారీ
కరుణాపాంగి
కకుబంతా
కరిప్రియా
కేసరీ
కేశవనుతా
కదంబకుసుమప్రియా
కాళిందీ

కాళికా
కాంచీ
కలశోద్భవసంస్థితా
కామమాతా
క్రతుమతీ
కామరూపా
కృపావతీ
కుమారీ
కుండనిలయా
కిరాతీ
కీరవాహనా
కైకేయీ
కోకిలాలాపా
కేతకీకుసుమప్రియా
కమండలుధరా
కాళీ
కర్మనిర్మూలకారిణీ
కలహంసగతిః
కక్షా
కృతకౌతుకమంగళా
కస్తూరితిలకా
కమ్రా
కరీంద్రగమనా
కుహూ
కర్పూరలేపనా
కృష్ణా
కపిలా
కుహరాశ్రయా
కూటస్థా
కుధరా
కుక్షిస్థాఖిలవిష్టపా
ఖడ్గఖేటకరా
ఖర్వా
ఖేచరీ
ఖగవాహనా
ఖట్వాంగధారిణీ
ఖ్యాతా
ఖగరాజోపరిస్థితా
ఖలఘ్నీ
ఖండితజరా
ఖడాఖ్యానప్రదాయినీ
ఖండేందుతిలకా
గంగా
గణేశగుహపూజితా
గాయత్రీ
గోమతీ
గీతా
గాంధారీ
గానలోలుపా ౨౦౦
గౌతమీ
గామినీ
గాధా
గంధర్వాప్సరసేవితా
గోవిందచరణాక్రాంతా
గుణత్రయవిభావితా
గంధర్వీ
గహ్వరీ
గోత్రా
గిరిశా
గహనా
గమీ
గుహావాసా
గుణవతీ
గురుపాపప్రణాశినీ
గుర్వీ
గుణవతీ
గుహ్యా
గోప్తవ్యా
గుణదాయినీ
గిరిజా
గుహ్యమాతంగి
గరుడధ్వజవల్లభా
గర్వాపహారిణీ
గోదా
గోకులస్థా
గదాధరా
గోకర్ణనిలయాసక్తా
గుహ్యమండలవర్తినీ
ఘర్మదా
ఘనదా
ఘంటా
ఘోరదానవమర్దినీ
ఘృణిమంత్రమయీ
ఘోషా
ఘనసంపత్తిదాయినీ
ఘంటారవప్రియా
ఘ్రాణా
ఘృణిసంతుష్టికారిణీ
ఘనారిమండలా
ఘూర్ణా
ఘృతాచీ
ఘనవేగినీ
జ్ఞానధాతుమయీ
చర్చా
చర్చితా
చారుహాసినీ
చటులా
చండికా
చిత్రా
చిత్రమాల్యవిభూషితా
చతుర్భుజా
చారుదంతా

చాతురీ
చరిత్రప్రియా
చూళికా
చిత్రవస్త్రాంతా
చంద్రమఃకర్ణకుండలా
చంద్రహాసా
చారుధాత్రీ
చకోరీ
చంద్రహాసినీ
చంద్రికా
చంద్రధాత్రీ
చారీ
చోరా
చండీ
చంచద్వాగ్వాదినీ
చంద్రచూడా
చోరవినాశినీ
చారుచందనలిప్తాంగీ
చంచచ్చామరవీజితా
చారుమధ్యా
చారుగతిః
చండిలా
చంద్రరూపిణీ
చారుహోమప్రియా
చార్వా
చరితా
చక్రబాహుకా
చంద్రమండలమధ్యస్థా
చంద్రమండలదర్పణా
చక్రవాకస్తనీ
చేష్టా
చిత్రా
చారువిలాసినీ
చిత్స్వరూపా
చంద్రమతీ

చందనప్రియా
చోదయిత్రీ
చిరప్రజ్ఞా
చాతకా
చారుహేతుకీ
ఛత్రయాత్రీ
ఛత్రధరా
ఛాయా
ఛందఃపరిచ్ఛదా
ఛాయాదేవీ
ఛిద్రనఖా
ఛన్నేంద్రియవిసర్పిణీ ౩౦౦
ఛందోనుష్టుప్ప్రతిష్ఠాంతా
ఛిద్రోపద్రవభేదినీ
ఛేదా
ఛత్రేశ్వరీ
ఛిన్నా
ఛురికా
ఛేదనప్రియా
జననీ
జన్మరహితా
జాతవేదా
జగన్మయీ
జాహ్నవీ
జటిలా
జేత్రీ
జరామరణవర్జితా
జంబూద్వీపవతీ
జ్వాలా
జయంతీ
జలశాలినీ
జితేంద్రియా
జితక్రోధా
జితామిత్రా

జగత్ప్రియా
జాతరూపమయా
జిహ్వా
జానకీ
జగతీ
జరా
జనిత్రీ
జహ్నుతనయా
జగత్త్రయహితైషిణీ
జ్వాలాముఖీ
జపవతీ
జ్వరఘ్నీ
జితవిష్టపా
జితాక్రాంతమయీ
జాగ్రతీ
జ్వరదేవతా
జ్వలంతీ
జలదా
జ్యేష్ఠా
జ్యాఘోషాస్ఫోటదిఙ్ముఖీ
జంభినీ
జృంభణా
జృంభా
జ్వలన్మాణిక్యకుండలా
ఝణనిర్ఘోషా
ఝంఝామారుతవేగినీ
ఝల్లకీవాద్యకుశలా
ఞరూపా
ఞభుజా
టంకబాణసమాయుక్తా
టంకినీ
టంకభేదినీ
టంకీగుణకృతాఘోషా
టంకనీయమహోరసా

టంకారకారిణీ
ఠఠశబ్దనినాదినీ
డామరీ
డాకినీ
డింభా
డుండుమారైకనిర్జితా
డామరీతంత్రమార్గస్థా
డమడ్డమరునాదినీ
డిండీరవసహా
డింభలసత్క్రీడాపరాయణా
ఢుండివిఘ్నేశజననీ
ఢక్కాహస్తా
ఢిలివ్రజా
నిత్యజ్ఞానా
నిరుపమా
నిర్గుణా
నర్మదా
నదీ
త్రిగుణా
త్రిపదా
తంత్రీ
తులసీ
తరుణా
తరుః
త్రివిక్రమపదాక్రాంతా
తురీయపదగామినీ
తరుణాదిత్యసంకాశా
తామసీ
తుహినా
తురా
త్రికాలజ్ఞానసంపన్నా
త్రివళీ
త్రిలోచనా
త్రిశక్తిః
త్రిపురా
తుంగా

తురంగవదనా
తిమింగిలగిలా
తీవ్రా
త్రిస్రోతా
తామసాదినీ
తంత్రమంత్రవిశేషజ్ఞా
తనుమధ్యా
త్రివిష్టపా ౪౦౦
త్రిసంధ్యా
త్రిస్తనీ
తోషాసంస్థా
తాలప్రతాపినీ
తాటంకినీ
తుషారాభా
తుహినాచలవాసినీ
తంతుజాలసమాయుక్తా
తారహారావళిప్రియా
తిలహోమప్రియా
తీర్థా
తమాలకుసుమాకృతీ
తారకా
త్రియుతా
తన్వీ
త్రిశంకుపరివారితా
తలోదరీ
తిరోభాషా
తాటంకప్రియవాదినీ
త్రిజటా
తిత్తిరీ
తృష్ణా
త్రివిధా
తరుణాకృతీ
తప్తకాంచనసంకాశా
తప్తకాంచనభూషణా

త్రియంబకా
త్రివర్గా
త్రికాలజ్ఞానదాయినీ
తర్పణా
తృప్తిదా
తృప్తా
తామసీ
తుంబురుస్తుతా
తార్క్ష్యస్థా
త్రిగుణాకారా
త్రిభంగీ
తనువల్లరీ
థాత్కారీ
థారవా
థాంతా
దోహినీ
దీనవత్సలా
దానవాంతకరీ
దుర్గా
దుర్గాసురనిబర్హిణీ
దేవరీతిః
దివారాత్రిః
ద్రౌపదీ
దుందుభిస్వనా
దేవయానీ
దురావాసా
దారిద్ర్యభేదినీ
దివా
దామోదరప్రియా
దీప్తా
దిగ్వాసా
దిగ్విమోహినీ
దండకారణ్యనిలయా
దండినీ

దేవపూజితా
దేవవంద్యా
దివిషదా
ద్వేషిణీ
దానవాకృతిః
దీనానాథనుతా
దీక్షా
దైవతాదిస్వరూపిణీ
దేవీ
ధాత్రీ
ధనుర్ధరా
ధేనుః
ధారిణీ
ధర్మచారిణీ
ధురంధరా
ధరాధరా
ధనదా
ధాన్యదోహినీ
ధర్మశీలా
ధనాధ్యక్షా
ధనుర్వేదవిశారదా
ధృతిః
ధన్యా
ధృతపదా
ధర్మరాజప్రియా
ధ్రువా
ధూమావతీ
ధూమకేశీ
ధర్మశాస్త్రప్రకాశినీ
నందా
నందనప్రియా
నిద్రా
నృనుతా
నందనాత్మికా

నర్మదా
నళినీ
నీలా
నీలకంఠ సమాశ్రయా
నారాయణప్రియా
నిత్యా ౨౦౦
నిర్మలా
నిధిః
నిరాధారా
నిత్యశుద్ధా
నిరంజనా
నాదబిందుకళాతీతా
నాదబిందుకళాత్మికా
నృసింహినీ
నగధరా
నృపనాగవిభూషితా
నరకక్లేశశమనీ
నారాయణపదోద్భవా
నిరవద్యా
నిరాకారా
నారదప్రియకారిణీ
నానాజ్యోతిస్సమాఖ్యాతాపరా
నిధిదా
నిర్మలాత్మికా
నవసూత్రధరా
నీతిః
నిరుపద్రవకారిణీ
నందజా
నవరత్నాఢ్యా
నైమిశారణ్యవాసినీ
నవనీతప్రియా
నారీ
నీలజీమూతనిస్వనా
నిమేషిణీ

నదీరూపా
నీలగ్రీవా
నిశీశ్వరీ
నామావళిః
నిశుంభఘ్నీ
నాగలోకనివాసినీ
నవజాంబూనదప్రఖ్యా
నాగలోకాధిదేవతా
నూపురాక్రాంతచరణా
నరచిత్తప్రమోదినీ
నిమగ్నారక్తనయనా
నిర్ఘాతసమనిస్వనా
నందనోద్యాననిలయా
నిర్వ్యూహోపరిచారిణీ
పార్వతీ
పరమోదారా
పరబ్రహ్మాత్మికా
పంచకోశవినిర్ముక్తా
పంచపాతకనాశినీ
పరచిత్తవిధానజ్ఞా
పంచికా
పంచరూపిణీ
పూర్ణిమా
పరమా
ప్రీతిః
పరతేజఃప్రకాశినీ
పురాణీ
పౌరుషీ
పుణ్యా
పుండరీకనిభేక్షణా
పాతాళతలనిర్మగ్నా
ప్రీతా
ప్రీతివివర్ధినీ
పావనీ
పాదసహితా

పేశలా
పవనాశినీ
ప్రజావతీ
పరిశ్రాంతా
పర్వతస్తనమండలా
పద్మప్రియా
పద్మసంస్థా
పద్మాక్షీ
పద్మసంభవా
పద్మపత్రా
పద్మపదా
పద్మినీ
ప్రియభాషిణీ
పశుపాశవినిర్ముక్తా
పురంధ్రీ
పురవాసినీ
పుష్కలా
పురుషా
పర్వా
పారిజాతసుమప్రియా
పతివ్రతా
పవిత్రాంగీ
పుష్పహాసా
పరాయణా
ప్రజ్ఞావతీసుతా
పౌత్రీ
పుత్రపూజ్యా
పయస్వినీ
పట్టధరా
పాశధరా
పంక్తిః
త్రిలోకప్రదాయినీ
పుణ్యశీలా
ప్రణతార్తివినాశినీ

ప్రద్యుమ్నజననీ
పుష్టా ౭౦౦
పితామహపరిగ్రహా
పుండరీకపురావాసా
పుండరీకసమాననా
పృధుజంఘా
పృధుభుజా
పృధుపాదా
పృధూదరీ
ప్రవాళశోభా
పింగాక్షీ
పీతవాసా
ప్రచాపలా
ప్రసవా
పుష్టిదా
ప్రతిష్ఠా
ప్రణవాగతిః
పంచవర్ణా
పంచవాణీ
పంజరస్థితా
పరమాయా
పరంజ్యోతిః
పరప్రీతిః
పరాగతిః
పరాకాష్ఠా
పరేశానీ
పావనీ
పావకద్యుతిః
పుణ్యభద్రా
పరిచ్ఛేద్యా
పుష్పహాసా
పీతాంగీ
పీతవసనా
పీతశయ్యా

పిశాచినీ
పీతక్రియా
పిశాచఘ్నీ
పాటలాక్షీ
పటుక్రియా
పంచభక్ష్య
ప్రియాచారా
పూతనాప్రాణఘాతినీ
పున్నాగవనమధ్యస్థా
పుణ్యతీర్థనిషేవితా
పంచాంగీ
పరాశక్తిః
పరమాహ్లాదకారిణీ
పుష్పకాండస్థితా
పూషా
పోషితాఖిలవిష్టపా
పానప్రియా
పంచశిఖా
పన్నగోపరిశాయినీ
పంచమాత్రాత్మికా
పృథ్వీ
పథికా
పృథుదోహినీ
పురాణన్యాయమీమాంసా
పాటలీపుష్పగంధినీ
పుణ్యప్రజా
పారదాత్రీ
పరమార్గైకగోచరా
పూర్ణాశా
ప్రణవా
పల్లవోదరీ
ఫలినీ
ఫలదా
ఫల్గు

పూత్కారీ
ఫలకాకృతిః
ఫణీంద్రభోగశయనా
ఫణిమండలమండితా
బాలబాలా
బహుమతా
బాలాతపనిభాంశుకా
బలభద్రప్రియా
బంద్యా
బడబా
బుద్ధిసంస్థితా
బందీదేవీ
బిలవతీ
బడిశఘ్ని
బలిప్రియా
బాంధవీ
బోధితా
బుద్ధిః
బంధూకకుసుమప్రియా
బాలభానుప్రభాకారా
బ్రాహ్మీ
బ్రాహ్మణదేవతా
బృహస్పతిస్తుతా
బృందా
బృందావనవిహారిణీ
బాలాకినీ
బిలాహారా
బిలవాసా
బహూదకా
బహునేత్రా
బహుపదా
బహుకర్ణావతంసికా
బహుబాహుయుతా
బీజరూపిణీ ౭౦౦
బహురూపిణీ
బిందునాదకళాతీతా
బిందునాదస్వరూపిణీ
బద్ధగోదాంగుళిత్రాణా
బదర్యాశ్రమవాసినీ
బృందారకా
బృహత్స్కంధా
బృహతీ
బాణపాతినీ
బృందాధ్యక్షా
బహునుతా
బనితా
బహువిక్రమా
బద్ధపద్మాసనాసీనా
బిల్వపత్రతలస్థితా
బోధిద్రుమనిజావాసా
బడిస్థా
బింబదర్పణా
బాలా
బాణాసనవతీ
బడబానలవేగినీ
బ్రహ్మాండబహిరంతస్థా
బ్రహ్మకంకణసూత్రిణీ
భవానీ
భీషణవతీ
భామినీ
భయహారిణీ
భద్రకాళీ
భుజంగాక్షీ
భారతీ
భారతాశయా
భైరవీ
భీషణాకారా
భూతిదా
భూతిమాలినీ
భామినీ
భోగనిరతా
భద్రదా
భూరివిక్రమా
భూతవాసా
భృగులతా
భార్గవీ
భూసురార్చితా
భాగీరథీ
భోగవతీ
భవనస్థా
భిషగ్వరా
భామినీ
భోగినీ
భాషా
భూరిదక్షిణా
భర్గాత్మికా
భీమవతీ
భవబంధవిమోచనీ
భజనీయా
భూతధాత్రీ
భువనేశ్వరీ
భుజంగవలయా
భీమా
భేరుండా
భాగధేయినీ
మాతా
మాయా
మధుమతీ
మధుజిహ్వా
మధుప్రియా
మహాదేవీ
మహాభాగా
మాలినీ
మీనలోచనా

మాయాతీతా
మధుమతీ
మధుమాంసా
మధుద్రవా
మానసీ
మధుసంభూతా
మిధిలాపురవాసినీ
మధుకైటభసంహర్త్రీ
మేదినీ
మేఘమాలినీ
మందోదరీ
మహామాయా
మైథిలీ
మసృణప్రియా
మహాలక్ష్మీ
మహాకాళీ
మహాకన్యా
మహేశ్వరీ
మహేంద్రీ
మేరుతనయా
మందారకుసుమార్చితా
మంజుమంజీరచరణా
మోక్షదా
మంజుభాషిణీ
మధురద్రావిణీ
ముద్రా
మలయా
మలయాన్వితా
మేధా
మరకతశ్యామా ౮౦౦
మాగధీ
మేనకాత్మజా
మహామారీ
మహావీరా
మహాశ్యామా
మనుస్తుతా
మాతృకా
మిహిరాభాసా
ముకుందపదవిక్రమా
మూలాధారస్థితా
ముగ్ధా
మణిపూరకవాసినీ
మృగాక్షీ
మహిషారూఢా
మహిషాసురమర్దినీ
యోగాసనా
యోగగమ్యా
యోగా
యౌవనాశ్రయా
యౌవనీ
యుద్ధమధ్యస్థా
యమునా
యుగధారిణీ
యక్షిణీ
యోగయుక్తా
యక్షరాజప్రసూదినీ
యాత్రా
యానవిధానజ్ఞా
యదువంశసముద్భవా
యకారాదిహకారాంతా
యజుషీ
యజ్ఞరూపిణీ
యామినీ
యోగనిరతా
యాతుధానభయంకరీ
రుక్మిణీ
రమా
రాధా
రేవతీ
రేణుకా
రతిః
రౌద్రీ
రౌద్రప్రియాకారా
రామమాతా
రతిప్రియా
రోహిణీ
రాజ్యదా
రేవా
రామా
రాజీవలోచనా
రాకేశీ
రూపసంపన్నా
రత్నసింహాసనస్థితా
రక్తమాల్యాంబరధరా
రక్తగంధానులేపనా
రాజహంససమారూఢా
రంభా
రంజితా
రక్తబలిప్రియా
రమణీయయుగాధారా
రాజితాఖిలభూతలా
రురుచర్మపరీధానా
రథినీ
రత్నమాలికా
రోగేశీ
రోగశమనీ

రావిణీ
రోమహర్షిణీ
రామచంద్రపరాక్రాంతా
రావణచ్ఛేదకారిణీ
రత్నవస్త్రపరిచ్ఛన్నా
రథస్థా
రుక్మభూషణా
లజ్జాధిదేవతా
లోలా
లలితా
లింగధారిణీ
లక్ష్మీ
లుప్తవిషా
లోకినీ
లోకవిశ్రుతా
లజ్జా
లంబోదరీ
లలనా
లోకధారిణీ
వరదా
వందితా
విద్యా
వైష్ణవీ
విమలాకృతిః
వారాహీ
విరజా
వర్షా
వరలక్ష్మీ
విలాసినీ
వినతా
వ్యోమమధ్యస్థా
వారిజాసనసంస్థితా
వారుణీ
వేణుసంభూతా ౯౦౦
వీతిహోత్రా
విరూపిణీ
వాయుమండలమధ్యస్థా
విష్ణురూపా
విధిప్రియా
విష్ణుపత్నీ
విష్ణుమతీ
విశాలాక్షీ
వసుంధరా
వామదేవప్రియా
వేళా
వజ్రిణీ
వసుదోహినీ
వేదాక్షరపరీతాంగి
వాజపేయఫలప్రదా
వాసవీ
వామజననీ
వైకుంఠనిలయా
వేదగర్భా
వరా
వ్యాసప్రియా
వర్మధరా
వాల్మీకిపరిసేవితా
శాంభవీ
శివా
శాంతా
శారదా
శరణాగతిః
శాతోదరీ
శుభాచారా
శుంభాసురవిమర్దనీ
శోభావతీ
శివాకారా
శంకరార్ధశరీరిణీ
శోణా
శుభాశయా
శుభ్రా
శిరస్సంధానకారిణీ
శరావతీ
శరానందా
శరజ్జ్యోత్స్నా
శుభాననా
శరభా
శూలినీ
శుద్ధా
శబరీ
శుకవాహనా
శ్రీమతీ
శ్రీధరానందా
శ్రవణానందదాయినీ
శర్వాణీ
శర్వరీ
షడ్భూషా
షడృతుప్రియా
షడాధారస్థితా
షణ్ముఖప్రియకారిణీ
షడంగరూపా
సుమతీ
సురాసురసమస్కృతా
సరస్వతీ
సదాధారా
సర్వమంగళకారిణీ

సామగానప్రియా
సూక్ష్మా
సావిత్రీ
సామసంభవా
సర్వావాసా
సదానందా
సుస్తనీ
సాగరాంబరా
సర్వైశ్వర్యప్రియా
సిద్ధిః
సాధుబంధుపరాక్రమా
సప్తర్షిమండలగతా
సోమమండలవాసినీ

సర్వజ్ఞా
సాంద్రకరుణా
సమానాధికవర్జితా
సర్వోత్తుంగా
సంగహీనా
సద్గుణా
సకలేష్టదా
సరఘా
సూర్యతనయా
సుకేశీ
సోమసంహతిః
హిరణ్యవర్ణా
హరిణీ

హ్రీంకారీ
హంసవాహినీ
క్షౌమవస్త్రపరీతాంగీ
క్షీరాబ్ధితనయా
క్షమా
సరస్వతీ
సావిత్రీ
పార్వతీ
వరారోహా
వరాంబికా
శ్రీగాయత్రీ ౧౦౦౦

వ. అను నివి వేయును గాయత్రీ సహస్రనామం బనంబడు. నిది పుణ్యదంబు, పాపఘ్నంబు, మహాసంపత్ప్రదాయకంబు, తుష్టిహేతుకంబు. ప్రతియష్టమియందును నిది తప్పక పఠించునవి. జపంబును, హోమ పూజా ధ్యానంబులును జేయఁదగినవి. సుభక్తుండగు శిష్యుని కిది సెప్పందగినది. ముముక్షువులకు మోక్షప్రదంబు, కాములకు గామదంబు. రోగులకు రోగహరి. బ్రహ్మహత్యా, సురాపాన, సువర్ణస్తేయ, గురుతల్పగమనాది మహాపాతకంబులనుండి తొలఁగించు నని చెప్పిన విని యత్యంతానందభరితుండై నారదుండు. ౪౨

## —: దీక్షావిధి :—

కం. వరమతివగు నీచే నరి । మురి గాయత్రీ సహస్రమును వింటిని నేఁ
బరమకృపాకర దీక్ష । విరచనమును దెలుపుమీ సవిస్తరభంగిన్. ౪౩

కం. భూమిసురులకు తేండ్లకు । గోమటులకు మఱియు స్త్రీలకును నియమవిధుల్
సామాన్యంబుగఁ దెలుపుము । నామీదం గరుణగల్గి నారాయణనన్. ౪౪

కం. దీక్షం దెల్పెద విను పా । పక్షయ మది దేవతార్యపావకపూజా
పేక్షకులకు నధికారము । సుక్షమమై యిచ్చుఁగాన సురమునివర్యా । ౪౫

కం. దివ్యజ్ఞానాఘక్షయ । భవ్యంబగుటం దలంచి పండితులగువా
రవ్యాజత దీక్ష యనెడి । సువ్యాహృతి యిడిరిసుమ్ము సురమునినాథా । ౪౬

కం. గురువును శిష్యుఁడు దీక్షా । పరులగుట శుభంబునిచ్చుఁ బరిశుద్ధతయుఁజా
బరగునుఁ గావున దీక్షఁజా । బరికింపఁగవలయు బరమపావన మనుచుఁజా. ౪౭

సీ. గురువు ప్రాతఃకృత్య పరిసమాప్తియొనర్చి స్నానసంధ్యాదిక మైనవెనుక
వరకమండలువును ధరియించి మౌనియై యేటియొడ్డుననుండి యింటికేగి
యాగమండపముపై నాసాదనముచేసి యొగి నాసనమునఁ గూర్చుండి పిదప
నాచమనము చేసి ప్రాణంబులను నాయమించి గంధ సుపుష్ప మిశ్రితముగ

తే.గీ. నేడుమార్లస్త్రమంత్రంబుతోడ జపము । చేసి నీళుల సాధించి యా సువారి
చేతఁ గలితాస్త్రమంత్రంబు చెప్పి యపలఁ । గలయ ద్వారంబు ప్రోక్షింపవలయు ననఘ. ౪౮

సీ. రమణ నూర్ధ్వోదుంబరమున గణేశుని శ్రీని భారతినిఁ బూజింపవలయు
వారి నామంబులు వరుసగా జపియించి ద్వారదక్షిణశాఖఁ గోరి గంగ
గణనాథునిం బూజ గావింపఁగానగు వామశాఖను క్షేత్రపాలు యమున
దేహళియం దస్త్రదేవతఁ దన్మంత్రమునఁ బూజసేసి సంమోదమలర

తే.గీ. దృశ్యమగుసర్వమును మహాదేవియనుచు । నస్త్రమంత్రంబుచే దేవతాంతరాయ
ములను గగనగమలబద్మములను భూమి । గములఁ దోలంగవలయుజుమ్మమలచిత్త । ౪౯

సీ. వామశాఖ స్పృశించి వరుసగా దక్షిణపాదంబుచేత లోపలికిఁ జొచ్చి
కలశంబు స్థాపించి కడఁగి యర్ఘ్యంబిచ్చి యర్ఘ్యజలంబుచే నసురుదిక్కు
నందు వాస్తువుతోడ నబ్జజు గంధపుష్పాక్షతంబులచేత నర్చఁజేసి
పంచగవ్యముచేత భవ్యార్ఘ్యజముచేతఁ దోరణ స్తంభంబు తొడరుదనుక

గీ. జేరి మండపప్రోక్షణ సేయవలయు । గురుఁడు మనమున జగమెల్ల పరమశక్తి
మయమని తలంచి మూలంబు నియతిఁ జదివి । దర్భమండపప్రోక్షణ దగునుజేయ. ౫౦

సీ. హుమ్మంత్రమునను నభ్యుక్షణంబును జేసి యంతరంబున ధూప మమరనిచ్చి
వికిరంబులను జల్లి వెలయంగ కుశమార్జనిని మార్జనముచేసి నీలకంఠు
దెస మార్జనముచేసి యెసఁగ దత్పుంజంబు స్థాపించి పుణ్యాహ తంత్రయుక్తి
మొదల దీనానాథులనుఁ దృప్తిబొందంగఁ జేసి మృద్వాసనఁ జేసి పిదప

తే.గీ. ప్రాఙ్ముఖుండయి దేశికప్రవరు ప్రమొక్కి । విధినెఱిఁగి సిద్ధమంత్రంబు విడువకోర్కి
మంత్రదేవత ధ్యానించి మఱియు భూత । శుద్ధి మొదలగునవి తొంటిదొప్పున నిడి. ౫౧

సీ. దేయమంత్రమునను న్యాయంబుమీర ఋష్యాదికన్యాసంబు నాచరించి
శిరమున ఋషి ముఖసీమను ఛందంబు నెదను దేవత గుహ్యపదమునందు
బీజంబు నడుగుల నౌజశక్తిని న్యాస మొనరించి యవ్వల నోర్పుగలిగి
తాలత్రయరవంబు దట్టి దిగ్బంధంబు ప్రకటింపవలయు ఛోటికల మూట

తే.గీ. ప్రాణములనాయమింపంగ వలయు మూలః మంత్రమున దేహమున న్యసింపఁదగు మాతృ
కలను బ్రణవంబు ప్రథమాచ్చు కలితబిందు । కంబుగా నమ యనుదానిఁ గలిపి వరుస
నెల్ల యవయవముల న్యసియింపవలయు ౫౨

సీ. మెుగి షడంగంబగు మూలమంత్రంబున నంగుష్ఠమాదిగ నంగుళులను
హృదయాదులను న్యసియించి నమఃపద స్వాహా వషట్పదసహిత హుం ప
దంబు వౌషట్పదంబును బ్రణవంబు గలిపి షణ్మంత్రంబు లెలమి జెప్పి
యవల షడంగంబు లంటియు మూలమంత్రంబునఁ గల్పోక్తధర్మ మెఱిఁగి

తే.గీ. వర్ణవిన్యాసములు సేయవలయునంద్రు । న్యాసవిధి యిది దీక్షకు ననఘమూర్తి
తన శరీరంబునందు నాసనము శుభము । దీక్షయం దొనరించుటఁ దెలిపెద నిఁక. ౫౩

వ. కుడిభుజంబున ధర్మంబు, వామభుజంబున జ్ఞానంబు, ఎడమతొడ వైరాగ్యంబు, కుడితొడ నైశ్వర్యంబు, ముఖంబున ధర్మంబు, మఱియు వామపార్శ్వంబునను, దక్షిణపార్శ్వంబునను పూర్వోక్తజ్ఞానాదికంబుల న్యసింపవలయు. పీఠకంబునకు ధర్మాదులు పాదంబులు, నధర్మంబులు గాత్రాదులు అని చెప్పబడినవి. మృదువగు నాసనస్థంబున హృదయస్థానంబు అనంతంబును, విమలంబును నగు. ప్రపంచపద్మంబున్యసించి దానియందుఁగళాయుతులగు సూర్యేంద్రపావకుల న్యసింపవలయు. మూలమంత్రంబు పఠించుచుఁ గళలను వ్రాయునద నియు మునులుసెప్పుదురు. సంక్షేపంబుగాఁ గళల వివరించెద. సూర్యునకుఁ బండ్రెండు, చంద్రునకుఁ బదియారు, వహ్నికిఁ బదునెనిమిది చెప్పంబడినవి. దానిమీద సత్త్వరజస్తమంబులన్యసించి, ఆత్మను, అంతరాత్మను, జ్ఞానాత్మను న్యసింపవలయు, నిది పీఠకల్పన క్రమంబు, ఆసనాయ నమః అను మంత్రంబుచేఁ బీఠంబొనర్పించి, కల్పోక్తక్రమంబున, దేయమంత్రక్రమంబున నంబికం ధ్యానించి, మానసికంబులగు నుపచారంబులచేఁ బూజించి, కల్పోక్తక్రమంబున ముద్రలు బ్రదర్శింపవలయునని చెప్పి వెండియు నారాయణుండు. ౫౪

సీ. అంతట వామభాగాగ్రంబునందు షట్కోణవర్తులమును రాణఁగూర్చి
చతురశ్రయుతమును జలిపి దానినడుమ మండలంబు లిఖించి మధ్యమునఁ ద్రి
కోణంబులిఖియించి కొమరుగా శంఖముద్రను జూపి షడ్గాత్రతతినిఁ బొసఁగ
షట్కోణములయందు నల్లతాంతంబులఁ బూజింపవలయును భూమిసురుఁడు

తే.గీ. అగ్నిముఖకోణములను షడంగపూజ । సలుపవలయును బిమ్మట శంఖపాత్ర
మును గొనుచు వస్త్రమంత్రంబునను గ్రమముగఁ ।
బ్రోక్షణముసేసి జపముసల్పుటపొసంగు. ౫౫

సీ. అర్ఘ్యపాత్రాధార మైన దేవికి నమస్కారంబు సేసెదఁగాక యనుచు
మం వహ్నిమండలమార్గాయ తుభ్యం నమస్తే దశకళాసుమహిత యంచు
విహితశంఖాధార విమలమంత్రము సెప్పి స్థాపనం బొనరించి యోపికదర
విహినిఁ బ్రదక్షిణ క్రమమున దశవహ్నికళలను బూజించి కాంక్షదనర

తే.గీ. మూలమున శంఖమును జల్లి మొనసి పాత్రఁ మీద స్థాపించి మదిలోన మోదమలర
నంత అం సూర్యమండలాయ యని మఱియుఁ ద్వాదశకళాత్మనే యని తనర గొల్వ
నముక దేవ్యర్ఘ్యపాత్రకాయ నమ యటంచు. ౨౬

వ. తదనంతరంబ, శం శంఖాయ నమ యని యుచ్చరించి, శంఖంబున సూర్యద్వాదశకళలం బూజించి విలోమమాతృకయగు మూలమంత్రంబు నుచ్చరించి, యథాక్రమంబుగా సూర్య కళలం బూజించి, శంఖంబు జలంబున నింపవలయు. ఉం సోమమండలాయ షోడశ కళాత్మనే యని, అముకార్ఘ్యామృతా యని, హుంమంత్రాంతఃబగు మంత్రంబు జపించి సృణీముద్రచే జలంబుం బూజించి తీర్థంబుల నావాహనంబు సేసి యచ్చటనే యెనిమిది మార్లు మూలమంత్రంబు జపించి, షడంగంబుల జలంబుల న్యసించి మత్స్య ముద్రచే మూలమంత్రంబువలన నెనిమిదిమార్లు జపించి. శంఖ దక్షిణపార్శ్వంబున న్యసించి, శంఖమధ్యస్థాంబువులఁ బూజాద్రవ్యశుద్ధికై చల్లవలయు నని చెప్పి మఱియు నారాయణుండు. ౨౭

సీ. అంతటఁ దనముందల నడుగుపై నతిరమ్య సర్వతోభద్రంబు చక్కవ్రాసి
దాని కర్ణికయందు దప్పక తెల్లని తండులంబులు పోసి దర్భకూర్చ
నవరించి యాధారశక్తి నారంభించి బీజమన్వంతంబు పేర్మి గొల్చి
తూటులేని కడవఁ దోతెచ్చి యస్త్రాది తతిమనువుల క్షాళితంబొనర్చి

తే.గీ. ముప్పిఱితొగరుదారంబు లొప్పజుట్టి । పోసఁగ నవరత్నములనుంచి భూరికూర్చ
యుతముగా గంధమాల్యాదులుంచి గురుఁడుఁ నుంచదగుదారమనువున మంచిపీట. ౨౮

వ. తదనంతరంబునఁ గుంభపీఠంబుల యైక్యంబు భావించి తీర్థంబులచేఁ బ్రతిలోమ మాతృకల జపించి కలశంబు పూజించి దేవతాబుద్ధిచే మూలంబు నుడివి జపించి రావి, పనస, మామిడి చివుళ్ళచేఁ గలశంబుగప్పి, చషకంబున గంధపుష్పాక్షతంబులిడి స్థాపించి మంత్రయుగ్మంబుచే వేష్టనంబు సేసి ప్రాణస్థాపన మంత్రంబుచే నది సేసి యావాహన ముద్రాదులచేఁ బరదేవతం ధ్యానించి కల్పోక్తక్రమంబున స్వాగత కుశలంబు లడిగి యర్ఘ్య పాద్యాచమనంబులిచ్చి మధుపర్కాభ్యంజనస్నానంబులు యథావిధి నెఱపి రక్త క్షౌమవస్త్ర యుగ్మంబిచ్చి నానావిధమణిభూషణంబులిడి వర్ణమాతృకల సంపుటించి దేవ్యంగంబులు న్యసించి చందనాగరు కర్పూర కాశ్మీర కస్తూరీసహితగంధం బలంది పుష్పంబులిచ్చి

ధూపంబువైచి దీపంబుసూపి కల్పోక్త విధానంబున నంగపూజ సేసి పిమ్మట వైశ్వదేవంబు సేయవలయు. దక్షిణభాగంబున స్థండిలంబు సేసి హుతాశనుం గ్రహించి మూర్తిస్థదేవత నావహించి యథాక్రమంబునం బూజసేయవలయు. తారమంత్రసహిత మూలమంత్రంబున నిరుబదియొక్కమారులు పాయసఘృతంబులచే హోమంబు సేసి గంధాదుల నర్చించి దేవినిఁ బీఠమధ్యమం దుంచవలయు. హవిస్సుచే నంతట బలిం జల్లందగు, పార్షదసహితయగు దేవతం గంధపుష్పాదుల నర్చించి, తాంబూల ఛత్ర చామరాదు లిచ్చి మంత్రంబు వేయిసార్లు జపించవలయు. జపానంతరంబున నీశాన్యదిగ్భాగంబున వికిరంబు సేయనొప్పు, పిమ్మట దుర్గ నావహించి కర్కరిని స్థాపించి రక్షరక్ష యని యుచ్చరించి యుదకంబులం జల్లి యస్త్రమంత్రంబుం జపించి ప్రదక్షిణంబుగాఁ దత్ప్రదేశంబున శుద్ధజలంబుఁ జల్లి గురునిం గూడి శిష్యుండు భుజింపవలయు. నా రేయి నా వేదియందు నిద్రించందగు నని చెప్పి వెండియు నారాయణుండు. ౫౯

సీ. కుండసంస్కారంబు స్థండిలసంస్కార మొనరంగఁ జెప్పెద వినుము నీవు
మూలమంత్రముచేత మొగి జూచి యస్త్రమంత్రముచేతఁ బ్రోక్షించి దానిచేత
తాడనం బొనరించి తగ గవచంబున నభ్యుక్షణము సేసి యవల మూడు
మూడుగాఁ బ్రాగగ్రముల నుదగగ్రంబులను గీసి ప్రణవంబునను దలిర్ప

తే.గీ. పీఠమభ్యుక్షణము సేసి ప్రీతిమీర । దేవి నర్చింపవలయును దివ్యలీల
మొనసి యాధారమంత్రంబు మొదలుపెట్టి । పీఠమంత్రావసానమై పేర్మినలర. ౬౦

వ. అందు గౌరీశంకరుల నావహించి, సమాహితుండై ధ్యానావాహనాది షోడశోపచారంబులం బూజించి, ఋతుస్నాతయై కామాతురయై చేరిన దేవిం జూచి శంకరుండు క్రీడించునట్లు కించిత్స్మయంబు చింతించి, పాత్రంబున నగ్నిం దెచ్చి ముందిడుకొని, రాక్షసాంశంబు విడిచి, పూర్వోక్తవీక్షణాదులచే సంస్కరించి, రంబీజము నుచ్చరించి, చైతన్యంబు యోజించి, ప్రణవంబున సప్తవారంబు లభిమంత్రించి, ముద్రం జూపి, దర్భచే రక్షితంబు సేసి, మూలమంత్రంబున ముసుఁగిడి, మూడుమార్లు ప్రదక్షిణంబు సేసి, మోకాళ్ళపైఁ గూర్చుండి, కుండంబుపై జేయిడి, తారంబుం జపింపవలయు, శివబీజబుద్ధిచే దేవి యోనిన్ వీతిహోత్రు నుంచి, యాచమనంబు చేసి. ౬౧

కం. దేవున్ జగదుత్పాదక । దేవిన్ జగదంబికన్ మదిన్నిలిపి, సుసం
భావన ధ్యానింపఁగఁదగు । నీ విశ్వమునెల్ల బ్రోచు నీశ్వరులనునున్. ౬౨

వ. అనంతరంబు చిత్పింగళహనదహపద యుగ్మంబున వహ్నిదీపనార్థంబు స్వాహాయుక్తంబుగఁ బ్రజ్వలింపఁజేయుచు. ౬౩

తే.గీ. జాతవేదు హుతాశను జాతరూప । వర్ణు నగ్ని సమిద్ధుఁ బ్రజ్వలితు నవలు
విశ్వతోముఖుఁ గొల్చెద విమలభక్తి।ననుచు మ్రొక్కంగవలయుఁ జూ యమివరేణ్య । ౬౪

తే.గీ. స్వస్తి పూర్ణసహస్రార్చి సప్తజిహ్వ । చాపధర పూర్ణ ధూమవిస్తారి యనుచు
నంగముల నారిటి వ్యసించి యవల ధ్యాన । మొనరఁ గావింపవలయును మునివరేణ్య । ౬౫

వ. షడంగంబులు జాత్యుక్తంబుగాఁ బూర్వసానంబుల న్యసించి హేమవర్ణుండును, త్రినేత్రుండును, పద్మసంస్థితుండును నగు వహ్నిం ధ్యానించి కుండమేఖలయుపరిభాగంబునఁ బరిషేచనంబు సేసి, దర్భలు పఱచి, పరిధి వ్రాసి, త్రికోణవృత్తంబును, షట్కోణవృత్తంబును, అష్టదళంబుగను న్యసించి, వహ్నియంత్రంబు చేసి యయ్యంత్రంబునడుమ వక్ష్యమాణయంత్రంబుచే వహ్నిం బూజించునది. వైశ్వానర యని ధ్యానంబును, జాతవేద యని యావాహనంబును, లోహితాక్ష యని కర్మంబుల సాధించునది. వహ్నిజాయాంతికమను మంత్రంబున వహ్నిం బూజించునది. షట్కోణంబులఁ గ్రమంబుగా హిరణ్యయు, గగనయు, రక్తయు, గృష్ణయు, బహురూపయు నను శక్తులం బూజించునది. సప్తజిహ్వలు కేసరంబులుగా నెంచి పూజించునది. శక్తి స్వస్తిక ధారిణులగు శక్తులం దళంబుల నర్చించి జాతవేదుండును, సప్తజిహ్వుండును, హవ్యవాహుండును, అశ్వోదరజుండును, వైశ్వానరుండును, కౌమారతేజుండును, విశ్వముఖుండును, దేవముఖుండును నను మూర్తులుగల తారాగ్నికి నమస్కరించి, వజ్రాద్యాయుధసహితులగు నింద్ర, యమ, వరుణ, కుబేరుల నర్చింపవలయు. మఱియుం బిదప స్రుక్స్రువసంస్కారంబును, ఆజ్యసంస్కారంబునుం జేయవలయు. స్రువంబుచే ఘృతంబు పూని హోమంబు దొరకొని దక్షిణభాగంబునుండి వీతిహోత్రుని, దక్షిణాంగంబున నగ్నయేస్వాహా యని వేల్చి, వామంబుననుండి ఘృతంబు గొని సోమాయస్వాహా యని వామాంబకంబున వేల్చి, మధ్యంబుననుండి ఘృతంబును గొని అగ్నీషోమాయస్వాహా యని మధ్యనేత్రంబున వేల్చవలయు. పిదప దక్షిణభాగంబునుండి ఘృతంబు గొని అగ్నయే స్విష్టకృతే స్వాహా యని ముఖంబున వేల్చవలయు. అనంతరంబ తారవ్యాహృతులచే హోమంబు చేసి తర్వాత నగ్నిమంత్రంబున వేల్చి పిదపఁ బ్రణవంబున నెనిమిది ఘృతాహుతు లిచ్చి వెండియు గర్భాధాన పుంసవన సీమంతోన్నయన జాతకర్మ నామకరణోపనిష్క్రమ ణాన్నప్రాశన చూడావ్రత మౌంజీబంధ మహావ్రతౌపనిషదీవ్రత గోదానోద్వాహకంబులను శ్రుతిచోదితంబులగు సంస్కారంబులు నెఱపి, శివుం బార్వతిం బూజించి విడువవలయు. మీఁదట సమిత్పంచకంబుచే వహ్నినుద్దేశించి వేల్చి యావరణంబున కైకాహుతు లిచ్చి స్రుక్కునందు నేయిడి హస్తంబున నుంచి స్రువంబుచే మూసి నిజాసనంబున నుండి గురుండు వౌషడంతంబగు మంత్రంబుచే వేల్చి మహాగణేశ యను మంత్రంబుచేఁ బదియాహుతు లిచ్చి పీఠంబు నర్చించి దేవ మంత్రదేవతను వహ్నియందు ధ్యానించి తన్ముఖంబున మూలమంత్రంబుచే నిరుబదియై దాహుతు లిచ్చి యుభయవక్త్రంబు లేకీభవింపంజేసి గురుండు తద్వైక్యంబు ధ్యానింపవలయు. పిమ్మట దేవతలకు షడంగాహుతులు విడివిడిగా నిచ్చి నాడీసంధానంబు సేయవలయు. అంతఁ గల్పోక్తక్రమంబున గజాంతక

సహస్రసకంబుతో మూలమంత్రంబుచేఁ దిలహోమంబు చేసి దేవీసంతుష్టిం భావించి యావృతీదేవీగణంబులను, వహ్న్యాదిదేవతలను తృప్తిఁబొందించి యనంతరంబ. ౭౬

క. తనశిష్యుని స్నాతునిఁగాఁ । గని సంధ్యాదికము దీర్చి కడునిర్మలవ
స్త్రునిఁ జేసి స్వర్ణభూషణు । నొనరిఁచి శుద్ధాంబుపాత్ర మొప్పించి తగన్. ౭౭

వ. పీఠస్థుండై యున్న సమయంబున శిష్యుండు. ౭౮

కం. గురునకు సభాసదులకుం । గర మర్థిని మ్రొక్కి వంశగతదేవతలన్
బరువడి నమస్కరించి సు । తరముగ విష్టరమునందుఁ డాఁ గూర్చుండన్. ౭౯

తే.గీ. గురుఁడు సదయత నీక్షించి కొమరుమిగుల । తనదు చైతన్య మాతని తనువునందు
సొరిది భావించి యధ్వసంశోధనంబు । సేయఁగాఁదగు హోమసంసిద్ధితనర. ౮౦

ఆ.వె. ఛాత్రుతనువునందు షట్పంథలనుఁ గ్రమం । బుగను దలఁచి ధ్యానమును నొనర్చి
కర్మ పూర్తిసేయఁగాఁదగు నెట్లన్న । వినుము తెలుపువాఁడ విస్తరించి. ౮౧

వ. పాదంబులఁ గళాధ్వంబును, సంధుల తత్త్వాధ్వంబును నాభిని భువనాధ్వంబును, హృదయంబున వర్ణాధ్వంబును, ఫాలంబున బదాధ్వంబును, మూర్ధంబున మంత్రాధ్వంబును భావించి, కూర్చచే శిష్యు స్పృశించి, తిలాజ్యపరిప్లుతంబగు ఘృతంబుచేఁ బ్రత్యధ్వంబును తారాఖ్యమంత్రప్రధానంబగు శోధయామ్యము మధ్వానుస్వాహా యని యుచ్చరించుచు నెనిమిదిమార్లు హోమంబు సేసి, షడధ్వంబులు బ్రహ్మయందు లీనంబు సేసి, తర్వాత బ్రహ్మనుండి సృష్టిమార్గంబున గురుండు నిజచైతన్యంబు శిష్యునందుఁ గల్పి పూర్ణాహుతి సేసి, వెండియుఁ బావకాంగాహుతి యొనర్చి, తనయందలి వహ్నిని గ్రమంబుగా శిష్యున కిచ్చి శిష్యునేత్రంబులు వస్త్రంబునం బంధించిన నతండు కుండసమీపంబునందుండ శిష్య హస్తంబులవలన దేవికిం బుష్పాంజలి యిప్పించి, నేత్రబంధంబు విప్పి, విష్టరంబునం గూర్చుండి యథోక్తక్రమంబున శిష్యదేహంబున భూతశుద్ధి నిల్పి, మంత్రోదితంబులగు న్యాసంబులను శిష్యుని దేహంబున నెఱపి యన్యంబగు మండలంబున శిష్యు నుండ నియమించి, కుంభస్థంబులగు పల్లవంబులు మాతృకం జపించుచు, శిష్యు శిరంబున నునిచి, కలశస్థజలంబుచే శిష్యుస్నానంబు సేయించి, రక్షార్థంబు వర్ధనీతిలసేకంబు సేయించిన, నంత శిష్యుండు లేచి వస్త్రంబులు గట్టి గృతభస్మావలేపుఁడై గురుసన్నిధిం బ్రవేశించిన నంత గురుండు దయార్ద్రహృదయుండై తన హృదయంబునందలి శక్తిని శిష్యు హృదయంబున నుండ భావించి యైక్యంబు చింతించుచు గంధపుష్పాక్షతలం బూజించి స్వహస్తంబు శిష్యు శిరంబున నుంచి దేవీమంత్రంబు శిష్యుని దక్షిణశ్రవణంబున ముమ్మా రుపదేశించిన శిష్యుం డష్టోత్తరశతంబు జపించి భూమిపై నొఱఁగి

గురువకు దండప్రణామంబు సేసి, తనకుఁ గల యర్థంబు గురువున కర్పించి, ఋత్విక్కులకు దక్షిణ లిచ్చి, బ్రాహ్మణులకు భోజనంబులు పెట్టి, సువాసినులఁ, గన్యల, బ్రహ్మచారుల, బాలుర, దీనుల, సనాథుల, దరిద్రుల విత్తశాఠ్యంబొనర్పక పూజించి కృతార్థుండై యను దినంబు మంత్రజపంబు సేయుచుండవలయు. ౨౨

క. అని యిట్టులు దీక్షావిధి । వినిపించితి మునివరేణ్య విప్రులకెల్లన్
ఘనధర్మంబగుదీక్షన్ । గొనియాడం దరమె దేవిఁ గొలువుమ నీవున్. ౨౩

వ. అనిన విని సంతుష్టాంతరంగుడై నారాయణునకు నమస్కరించి నారదుండు దేవీదర్శన లాలసుండై తపంబునకుం జనియె నని చెప్పిన విని వ్యాసుం జూచి జనమేజయుం డిట్లనియె. ౨౪

## —: కేనోపనిషదర్థవర్ణనము :—

చ. ద్విజులకు శక్త్యుపాస్తి శ్రుతివిశ్రుతమై తనరారుచుండఁగా
ద్విజు లది మాని యన్యమగు దేవతలం భజియింపఁజొచ్చి రో
సుజవరేణ్య చూడ నిది చోద్యము వైష్ణవ, చీన, జైన, బౌ
ద్ధజన, దిగంబరాదులగు శ్రౌతవివర్జితులైరి కంటివే. ౨౫

చ. మతిగలవారు వందితులు మాన్యులు తర్కవిచక్షణు ల్మహా
ప్రతిభులు వ్యాకృతిప్రముఖపారగులున్ ఘనయోగ సాంఖ్య వి
శ్రుతులును నయ్యు భూసురులు శ్రుత్యనువర్తన మాని రేలొకో
యతికులవర్య ! కారణము నారసి చెప్పుము సత్కృపామతిన్. ౨౬

వ. అదియుంగాక. ౨౭

ఆవె. మున్ను నీవు పొగడియున్న మణిద్వీప । సన్నుతప్రభావ సరణి నొప్పఁ
జెప్పుమయ్య నాకు శ్రీదేవిభక్తుండ । వినఁగ నిచ్ఛయింతు వీనులలర. ౨౮

వ. అనిన విని బాదరాయణుం డిట్లనియె. ౨౯

కం. సమయోచితముగ నడిగితి । విమలమతీ । శ్రద్ధతోడ విను తొల్లి మహా
సమరంబు ప్రవర్తించెను । నమరులకును రాక్షసులకు నవనీనాథా ! ౩౦

తే.గీ. దేవికృపచేత జయమాయె దేవతలకు । దనుజులెల్లను బాతాళమునకుఁ బోయి
యుండి రంతట మదమోహాయుక్తి గర్వ । మెనయ దమయంతవారు లేరనిరి సురలు. ౩౧

కం. కర్తలము భర్తలము సంహర్తలమును మేమె జగము నంతకు కీర్తి
స్ఫూర్తి గనుమమ్మ నాశర । మూర్తులు పోలుదురె పరమమూర్ఖులు వారల్. ౩౨

వ. అని పరాశక్తిప్రభావంబు మఱచి మోహావిష్టులైన సురల ననుగ్రహింపందలంచి జగదంబిక. ౭౩

సీ. కోటిసూర్యులతోడ దీటైన రుచిఁ గాంచి శతకోటిచంద్రుల సాటి నొప్పి
విద్యుదుద్యత్ప్రభావిస్ఫూర్తి నలరారి మగఱాల నిగరాల జగ వహించి
పద్మరాగప్రభాపటలిఁ దుటాయించి గారుత్మతప్రభాకలనఁ దనరి
కమనీయగోమేధికచ్ఛాయ నుంకించి నవనీలమణిరోచి నవఘళించి

తే.గీ. తళతళ త్తళితములైన తళుకు బెళుకు। నలర నలుదెస బలువిడి నలమికొనుచు
నెన్నఁ డెవ్వరు నెక్కడ నెఱుఁగనట్టి। పరమసుందరతేజ ముప్పతిలె నంత. ౭౪

సీ. అందఱు విస్మయంబంది యిదేమి చిత్రంబు దైత్యులచేష్టితంబొ కాక
మాయయో యొక మహామహుఁ డెవ్వఁడేనియు నిర్మించెనొక్కొ సందియముదోచు
నని యక్షుకడ కేగి యడుగుద మిది యంచు వీతిహోత్రుని జీరి విబుధవిభుఁడు
పొ మ్మిప్డు యక్షుని పొంతకు ని త్తేజ మెద్దియో యడిగి నీ వెఱిఁగిరమ్ము

తే.గీ. నావుఁడును యక్షునవిధంబునకు ననలుఁడు పోవ నీక్షించి యక్షుండు నీ వెవఁడవు
నీ బలం బెద్దినా వివి నిప్పువేల్ప। దహనుఁడను కద్దు నాకును దహనశక్తి, ౭౫

క. అనవుఁడు యక్షుఁడు పలికెన్। విను మీకున్ దహనశక్తి వెలయునయేనిన్
గను మీ తృణమును దగ్ధం। బొనరింపుము దీని ననిన నొయ్యన నతఁడున్. ౭౬

కం. తన సర్వావయవబలంబును। జూపియు నిప్పు దాని ముట్టి దహింపం
గ నశక్యంబయి లజ్జా। వనతుండై తెలిపెఁ దనదు వార్త సురలకున్. ౭౭

కం. అది విని యింద్రుఁడు వాయున్। గదియంగాఁ జీరి నీవు కడువేగమ స
మ్మదమునఁ జని యీ తేజం। బెదియో యక్షు నడిగి వెస నేతేరు మనన్. ౭౮

కం. తనయంతవాఁడు లేదని। మనమున నభిమానపరత మదమోహితుఁడై
చని గాలి యెదుట నిలువం। గని యక్షుఁడు పలికె నిట్లు గంభీరగతిన్. ౭౯

తే.గీ. ఎవ్వఁడవు నీవు శక్తి నీ కెయ్యది యన। మాతరిశ్వుండు పలికె నో మహితమూర్తి
యనిలుఁడను నేను జాలనమందు శక్తి। జగములన్నియు నాచేతఁ జలనమందు. ౮౦

కం. నావుఁడు యక్షుఁడు పలికెను। నీ వనిలుఁడవేని జగము నెల్లఁ గదల్పన్
జేవగలదేనిఁ దృణ మిదె। లేవంజేయుము మన నతఁడు లేచి కడంకన్. ౮౧

కం. తన శక్తికొలఁది కదుపీ। చినఁ దృణ మొక్కింత నెగయఁజేయఁగలే కొ
య్యన సిగ్గుపడి సురాళికి। వినుపించెను దాను జనిన వృత్తాంతంబున్. ౮౨

కం. అంతట దేవతలెల్లరు। చింతం బొక్కుచును బోయి చేమోడ్చి మరు
త్వంతుం గని చెప్పిన నతఁ। డెంతయు విస్మయము నొందె నిది యేమనుచున్. ౮౩

తే.గీ. ఏన పోయెద నని లేచి యింద్రుఁ డపుడు । యక్షరూపంబయిన తేజ మంతికంబు
సేర నంతర్హితంబౌట సేయునద్ది । కాన కాతండు లజ్జించి గర్వమేది. ౯౪

తే.గీ. ఇంత యెల్లిదమైన నే నెట్లు సభకు । బోఁగల నటంచుఁ బలుమారు పొక్కిపొక్కి
మాన మెడలిన పిమ్మటఁ బ్రాణ మేల । తనువు ద్యజియించుటొప్పదే తన కటంచు. ౯౫

క. ఈ నడతయెల్ల యెవ్వని । దైనెగడెఁడు వాఁడు శరణమయ్యెడు నాకుఁ
బూని భజించెద నిత్తఱి । నా నుడి విని బ్రోచుఁగాత నావుఁడు నంతన్. ౯౬

తే.గీ. తత్క్షణంబున హరిపదస్థలమునుండి । పలుకు వినఁబడె నో యింద్ర యళుకుదీరఁ
బరగ మాయాఖ్య బీజంబు స్మరణ మొనరఁ । జేయు మన విని యాతండు చిత్తమలర. ౯౭

వ. నిరాహారుండై నిమీలితనయనుండై మాయాబీజంబు లక్షవారంబులు జపింపఁ జైత్రశుద్ధ
నవమినాడు మధ్యాహ్నంబునఁ దొంటిప్రదేశంబున మునుపటియట్ల తేజంబుద్భవిల్లె.
నంత, ౯౮

సీ. విఱిసినదాసానివిరివంటి నెమ్మేను బాలార్కమండలిఁ బోలు వెలుఁగు
చిన్నివెన్నెలతేని చెన్నగు మకుటంబు బాగైన పచ్చల పైఠిణీయును
నాలుగుచేతుల నలువమీఱఁగ వర పాశాంకుశాభయ [illegible]కరణములు
నునుఁదీగెవంటి మెత్తని మేను మూడుకన్నులు మంచిమల్లెపూవులసరములు

తే.గీ. వివిధభూషణములు గల్గి వేదమూర్తి । అలర నాలుగుదిక్కుల నభినుతింప
దంతపంక్తుల కురువిందకాంతి నింపి । గౌరి కనుపట్టె జెంగావిచీరఁ గట్టి. ౯౯

వ. ఇట్లు ప్రత్యక్షంబైన గౌరిం గాంచి యింద్రుండు భక్తివినయంబులు పెనంగొన దండ
వత్ప్రణామంబుసేసి నిలువంబడి చేతులు జోడించుకొని 'యో తల్లీ ! ఈ తేజం బెయ్యది?'
యని యడిగినం గరుణార్ద్రహృదయయై హైమవతి యిట్లనియె. ౧౦౦

తరల. ఇది మదీయము బ్రహ్మరూపం బిది జగజ్జననాస్పదం
బిది నిరామయ మిది యనంతం బిది నిరాశ్రయమంచు నీ
మది నెఱుంగుము సర్వసాక్షి సమస్తకారణ మారయన్
దుదియు మొదలును లేదు దీనికిఁ దోచు జ్ఞానికి సర్వదా. ౧౦౧

తరల. ఎల్ల వేదము లెల్ల తపములు నెద్ది సెప్పుచునుండెడిన్
గల్ల గాదది బ్రహ్మచర్యముఖంబులం గుణవర్గణం
బెల్లెడన్ దగఁగోరుచుండెడి నీ జగంబున కెల్లనుం
దల్లియయ్యును దండ్రియయ్యును దనరె నియ్యది సెప్పెదన్. ౧౦౨

వ. బిందునాదయుతంబగు నంత్యోష్మంబుతోఁ గూడిన ప్రణవంబు బ్రహ్మనాఁబడు, నా
బీజంబులు రెండును మదీయంబులగు ముఖ్యమంత్రంబులని యెఱుంగుము. భాగద్వయ

వతినై బీజద్వయంబునుండి సకలజగంబు సృజించితి. అం దొకటి సచ్చిదానందనామకం బగు. రెండవది మాయాప్రకృతిసంజ్ఞికం బగు. నమ్మాయ పరాశక్తియనియు, శక్తియనియు, మహేశ్వరియనియుఁ బిలువంబడు. జంద్రునకుఁ జంద్రికయుంబోలె నా కవి భిన్నంబులు కావు. నాకును మాయకును సామ్యావస్థ యిదియ. ప్రళయంబున సర్వజగంబును మదభిన్నయై యుండు. ప్రాణికోటి తమ తమ కర్మపరిపాకవశమున పునఃపునర్జన్మవంతం బగు. నిర్విధంబుద వ్యక్తంబుగాని రూపంబు వ్యక్తంబగు. అంతర్ముఖస్థయైన యవస్థపేరే మాయ యనంబడు. బహిర్ముఖంబగు నమ్మాయ తమస్సనాంబడు, బహిర్ముఖంబగు మాయవలన సత్త్వంబు పుట్టు. సృష్టికాలంబున నదియ రజంబగు. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు గుణత్రయాత్మకులు. అందు రజోగుణాధికుఁడు బ్రహ్మనాంబడు, సత్త్వాధికుఁడు విష్ణుండు, తమోగుణాధికుండు రుద్రుండు. నీరు ముమ్వురు జగత్కారణరూపులు. మఱియు స్థూలదేహంబు బ్రహ్మ, లింగదేహంబు విష్ణుండు, కారణదేహంబు రుద్రుండు. ఏను నాలవదాననై యుందు. సామ్యావస్థ నంతర్యామిరూపిణి యంద్రు. దాని యూర్ధ్వంబున నా రూపంబు రూపవర్జితంబైన బ్రహ్మగా నుండు. నా రూపంబు సగుణంబనియు, నిర్గుణంబనియు ద్వివిధంబు. మాయారహితంబు నిర్గుణంబు, తత్సహితంబు సగుణంబు. నేన జగంబెల్ల సృజియించి యందుం బ్రవేశించి యనిశంబు యథాకర్మంబుగా జీవునిం బ్రేరేపించుదాన. సృష్టి స్థితి లయంబుల బ్రహ్మ విష్ణు మహేశ్వరులచే నేన చేయించెద. పవన సూర్యేంద్రాదుల వీజన ప్రకాశన వర్షణాదుల నేన ప్రేరేచెద. గావున సర్వోత్తమను నేన. కాష్ఠపుత్తళికలంబోలె మిమ్ము నేన నర్తింపజేసెద. నొకప్పుడు దైత్యుల, నొకప్పుడు దేవతల కేన జయంబు నిచ్చెద. నే స్వతంత్రను. స్వేచ్ఛచే సర్వంబుం జేయుచుందు. నన్ను సర్వాత్మికంగా నెఱింగి గర్వంబు విడువుండు. అహంకారావృతులై మోహంబునం బడంగలరని యనుగ్రహంబుచే నీ దేహంబునుండి వెడలిన యక్షతేజంబు నాయదియ. ఇంతటినుండి యెల్లవిధంబుల గర్వంబుడిగి సచ్చిదానందరూపిణినగు నన్ను శరణంబుగాఁ గొనుమని సెలవిచ్చి మహాదేవి యంతర్హిత యయ్యె. ౧౦౩

సీ. అంతట దేవత లాత్మగర్వంబుల నెడలించి దేవిని హృదయమందు
నారాధనము చేసి యతిభక్తియుక్తులై మూడుసంధ్యలయందు ముఖ్యమైన
గాయత్రి జపియించి కడునిష్ఠ యజ్ఞభాగంబుల దేవి నుత్కలికఁ గొలిచి
సత్యయుగంబున సకలదేవతలును మానవు ల్దానవుల్ మఱియు నెల్ల

తే.గీ. వారు నీరీతి జరిపిరి చారుమహిమ। తారహ్మల్లేఖికాజప తత్పరతను
నన్యమెఱుఁగరు కృతయుగమందు జనులు।మనుజకులనాథ నిరవద్య మహితబోధ। ౧౦౪

క. గాయత్రిని విడిచి రమ్మా। నాయకు గౌరీకళత్రు నానాగతులన్
ధ్యేయుఁలగా నెంచరు వా। రాయతమతు లేమిచెప్ప నవనీనాథా। ౧౦౫

తే.గీ. వేదవిహితంబు లగువాని విడిచి దేవ। పూజనంబులు చేసెడి బుద్ధిహీను
లెట్లు మోక్షంబునకుఁ బాత్రు లింద నందు। భ్రష్టులగుటయకాదె భూపాలచంద్ర। ౧౦౬

## —: బ్రాహ్మణులకు గౌతమ శాపము :—

సీ. భూతలేశ్వర యొకప్పుడు పంచదశవర్షములు కఱవొదవి యిబ్బువిని వర్ష
ములు లేక లెక్కింప నలవిగాని శవంబు లింటింట వెడలెను హేయవృత్తి
మనుజుల వధియించి మనుజులు మెక్కిరి తల్లులు బిడ్డల దుల్ల నడఁచి
తినిరి గుఱ్ఱంబులఁ దినిరి, కొందరు కుక్కమాంసంబులం దిని మనిరి నరులు

తే.గీ. నిట్టులుండంగ బ్రాహ్మణులెల్ల గూడి। గౌతముని జేరి తమ తమ గతులఁ దెల్ప
నతఁడు వారల నెక్కుడు నాదరించి। యచ్చటన యుండుడని పల్కి యశనము లిడి. ౧౦౭

క. గాయత్రీధ్యానం బ। త్యాయతగతిఁ జరిపె సద్దయార్ద్రహృదయుఁడై
యా యనఘుఁడు వారలతో। రేయుం బవలనక యొక్కరీతి నృపాలా। ౧౦౮

ఉ. దేవి నమోస్తుతే యనుచు తే చరణాబ్జయుగం భజామి వి
ద్యే వరదే శుభం చ మమ దేహి విలాసిని తూర్ణమంచు స్వా
హే విమలే స్వధే జగదధీశ్వరి యంచు, సమస్తలోక ర
క్షావిధి సుక్షమే సుగుణశాలిని మామవ యంచు భక్తితోఁ. ౧౦౯

వ. అని యిట్లు గౌతముం డత్యంతభక్తిసమేతుండై ప్రార్థించిన జగన్మాత ప్రత్యక్షయై పూర్ణ
పాత్రయిచ్చి యీపాత్రంబువలన మీ రెయ్యదికోరిన లభించునని సెలవిచ్చి మఱియు, ౧౧౦

తే.గీ. కాలకర్మంబు గతులఁ జక్కఁగ నెఱింగి। నన్నుఁ గొలువుడు మీకు నెన్నఁడును గీడు
గలుగ దీ పూర్ణపాత్రంబు గైకొనుండు। సర్వపోషణమగు నిది శాంతిదంబు, ౧౧౧

కం. అని పల్కి దేవి సనినన్। మునులకు బ్రాహ్మణుల కధికమోదంబొదవన్
జనియించె నన్నరాసులు। ఘనశైలములట్ల కూరగాయలతోడన్. ౧౧౨

ఉ. కమ్మని పొట్లకాయ సొరకాయయు బెండ యనంటి బీరయున్
గుమ్మడి వంగ దొండ పొడిగూరలు దప్పళ మప్పడాలు వ
ద్యమ్ములు నూరుఁగాయలు గుడాన్నము సూపము పాయసాన్నమున్
డిమ్ముగ మెక్కి త్రేవుమవి త్రేపిరి బ్రాహ్మణు లొక్కపెట్టునన్. ౧౧౩

కం. కుంచాల గింజఁ గొలువము। మంచా లెక్కితిమి పెద్ద మంటకఱవునన్
గంచాలు దూరమాయెను। బంచవిధాన్నములు నేడు భగవతి యిచ్చెన్. ౧౧౪

కం. గౌద్రమగు కఱవులోఁ దిన । నిద్రాణిం దిండిలేక నెట్టితి మిపు డా
గౌద్రాలు బిడ్డఁ గనియెన్ । షడ్రసభోజనము లబ్బె శాంభవికరుణన్. ౧౧౫

చ. కుసుమలు నారుకొట్టులును గొండమణీలును రాజనాలు ము
త్తెసరులు గాకిఱెక్కలును దెల్లలు మోదుగమాద పెద్దగు
మ్మసరులు లాల్పురీలు జిలమల్ బుడమల్ మొదలైన బియ్యముల్
దెసలలు రాసులై పొనరె దేవికృపామహిమంబు గంటిరే ! ౧౧౬

వ. ఇట్లు పలువిధంబులం బల్కికొనుచు శతయోజనవిస్తీర్ణంబగు న మ్మునియాశ్రమంబునం గల ఋషిస్తోమంబులును, నానాబ్రాహ్మణబృందంబులును, దేవీదత్తసమస్తవస్తు పరిపూర్తి గలిగి బహూయజ్ఞంబులు సేయ నెల్ల దేవతలు సంతుష్టులై గౌతమునిం గీర్తింప నింద్రసభ నతని యశం బతిశయిల్లె. నప్పుడు, ౧౧౭

ఉ. గౌతమ మౌని యీ కఱవుకాలమునన్ హవిరాదికంబులన్
జేతము లుల్లసిల్ల నవనిం గలిగించినఁగాదె బొజ్జలన్
నేతులఁ బాల మీఁగడల నించితి మింతటివాని నేడనేఁ
జూతుమె కల్పపాదపముసువ్వె యితండు జగంబుపాలిఁటన్. ౧౧౮

కం. అని యిట్లులు తెరగంటులు । గణియింపఁగ గౌతముండు గర్వము మదిలో
నునుపక త్రికాలములయం । దును దేవినిఁ గొల్చె భక్తి దులకింపంగన్. ౧౧౯

వ. ఇట్లు ప్రొద్దుట బాలను, మధ్యాహ్నంబున యువతిని, సాయంకాలంబున వృద్ధను పురశ్చరణక్రియాయోగంబునం బూజింపుచుండ నొక్కనాడు. ౧౨౦

ఆ.వె. వాయునిహతి వీణ మ్రోయంగ బంచమ । శ్రుతినిఁ బాడికొనుచు నతులభక్తి
శక్తిఁ దలచికొనుచుఁ జదలనుండి రణాశ । సుండు వచ్చె మౌను లుండుకడకు. ౧౨౧

తే.గీ. ఇట్లు వచ్చిన నారదు నెల్లమునులు । గారవము సేసి పూజింప గౌతమమునిఁ
గాంచి యాతని సద్గుణగణము నెంచి । యచ్చటచ్చటికథలచేఁ బుచ్చెబ్రొద్దు. ౧౨౨

వ. వెండియు నారదుండు. ౧౨౩

కం. ఇంద్రుడు సెప్పఁగ నో మునిచంద్రా ! నీకీర్తి వింటి సంతోషశ్రీ
సాంద్రుండనైతి మతి ని । స్తంద్రతఁ గాయత్రిసేవ సలిపితివికదా ! ౧౨౪

వ. అని గౌతమునితోఁగూడ గాయత్రీమందిరంబు ప్రవేశించి జగన్మాతం దర్శించి వందనంబులు సేసి చనియె. నంత గౌతమపోషితులగు బ్రాహ్మణు లమ్ముని యుత్కర్షం గాంచి యసూయాపరులయ్యు నిది తఱికాదు, కాలంబువచ్చినప్పుడు చూచెదమని లోలో నడఁచుకొనియుండి రంతం దిగంతంబులునిండ వర్షంబులు గురిసిన పృథివి సస్యసమృద్ధంబై దుర్భిక్షంబు దీరియున్న సమయంబున బ్రాహ్మణులెల్లరుం గూడి నిష్కా

రణంబ గౌతము శపింపం దలంచి యక్షిణీమహిమంబుచే మాయావృద్ధధేనువుం గల్పించి గౌతము పాకశాలం బ్రవేశింపంజేయ గౌతముండు హుంకారంబు సేసి తోలంబోవ నది యచ్చట పడి యీల్గెఁ, దన్మిషంబును గొని ద్విజులెల్ల శోకింపందొడంగి రయ్యవసరంబున ధ్యానయోగంబున నున్న యా సంయమీంద్రుండు కొంత సేపటికిఁ గనులు విప్పి తన యోగజ్ఞానంబున నదియంతయు విప్రకృతంబవి యెఱింగి క్రోధతామ్రాక్షుండై యచ్చటి యెల్ల మునుల నిట్లని శపియించె. ౧౨౫

ఆ.వె. వేదమాతయైన విమలగాయత్రిని। దాని ధ్యానయుక్తి దాని పుణ్య
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౨౬

ఆ.వె. వేదపాఠములను వేదార్థవిద్యను। వేదచోదిత క్రియాది పుణ్య
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౨౭

ఆ.వె. శివునియందు మఱియు శివమంత్రమందును। శివునిశాస్త్రమందు శివునిభక్తి
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౨౮

ఆ.వె. దేవియందు మఱియు దేవిమంత్రమునందు। దేవిశాస్త్రమందు దేవిభక్తి
విధులయందు మీడు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౨౯

ఆ.వె. ప్రకృతియందు మఱియు ప్రకృతిధ్యానమునందు। ప్రకృతికథలయందు పరమభక్తి
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౦

ఆ.వె. దేవియుత్సవమున దేవికీర్తనమున। దేవివందనమున దేవిపూజ
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౧

ఆ.వె. శివునిదర్శనమున శివునిధ్యానమ్మున। శివునివందనమున శివునిపూజ
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౨

ఆ.వె. బిల్వపత్త్రిపందు వివిధరుద్రాక్షలు। బాపహారి భస్మలేపనాది
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౩

ఆ.వె. శ్రౌతకర్మలందు స్మార్తకర్మలయందు। జ్ఞానమార్గమందు శాంతవృత్తి
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౪

ఆ.వె. ఐక్యభావమునను నద్వైతమందును। శమమునందు మఱియు దమముఖముల
విధులయందు మీరు విములౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౫

ఆ.వె. నిత్యకర్మలందు నిత్యాగ్నులందును। నిత్యజపములందు నియతమైన
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రహ్మబంధులార! ౧౩౬

ఆ.వె. ధేనుదానములఁ బితృశ్రాద్ధములయందు। వ్రతములందు నీతివర్తనముల
విధులయందు మీరు విముఖులౌదురుగాక। పాఱులార బ్రాహ్మబంధులార! ౧౩౭

ఆ.వె. సరణిఁదెలిసి కృచ్ఛ్రచాంద్రాయణమ్ముల । తీర్థసేవనాది ధీనియుక్తి
విధులయందు మీరు విముఖులౌదురుగాక । పాఱులార బ్రహ్మబంధులార. ౧౩౮

కం. దేవిని విడనాడి యితర । దేవతలఁ గొల్చి దుర్గతిం దపనాది
వ్యావృత్తుల పాతకులై । పోవుదురు ధరానురాధములు మీ రెల్లన్. ౧౩౯

కం. కాపాలికాదిమతగతు । లై పాషండ ప్రచారులై కడుదుష్ట
వ్యాపారంబులకును లో । నై పోవుదురెల్ల భూసురాధము లీరల్. ౧౪౦

కం. పితృ మాతృ సుత సహోదర । సుతలఁ విక్రయము సేసి సొమ్ములు గొని దు
ర్గతిపాలై మతిహీనతఁ । బతితులగుదు రీరలెల్ల బ్రాహ్మణనీచుల్. ౧౪౧

కం. వేదంబుల నమ్ముచు మ । ర్యాదల్వీడి తీర్థవృత్తు లమ్ముచు శ్రుతిసం
వాదంబు లమ్ముకొనుచుం । బోదురు పాపిష్ఠులగుచు భూసురనీచుల్. ౧౪౨

తే.గీ. పంచపాగమంబులఁ బాంచరాత్ర । పద్ధతులలోనఁ దగిలి విపత్తులంది
పాడిదప్పి చరింతురు పాఱులార । పాపులైపోదు రో బ్రహ్మబంధులార. ౧౪౩

కం. మాతల కన్యల భగినుల । నాతతకామోపశాంతికై కలయుదు ర
న్యాతత్పరులై చెడియెద । రాతంకములేక బ్రాహ్మణాధములారా. ౧౪౪

కం. మీవంశము మీపుత్రులు । మీవనితలు నెల్లవారు మీవలె మహా
పాపిష్ఠులగుచుఁ బుణ్యా । భావుల రయ్యెదరు బాడబాధములారా. ౧౪౫

వ. అని యిట్లు శపియించి గౌతమమహర్షి దేవీమందిరంబునకుం జని దర్శించిన బ్రాహ్మణ కృతియు, గౌతమశాపంబును నెఱింగి విస్మయంపడి గౌతమునుం జూచి మునివర్యా। నీవు బ్రాహ్మణులకుం జేసిన యుపకారంబు బూడిదెం బోసిన నేయివిధంబై, పామునకుం బాలు పోసిన విధంబున నెదురువచ్చె. వారి దుష్ప్రయత్నంబు వారలనె బాధించునదియు నయ్యె. వారు త్రవ్వుకొనిన గోతిలో వారె పడియెదరుకాని నీ వింతట నుపశమింపుమని చెప్పి యనిచిన గౌతముం డాశ్రమంబునకుం జనియె. నంత బ్రాహ్మణులు శాపానురూప వ్యాపారులై దుఃఖించి యెల్లరుంగూడి లజ్జావనతాంగులై గౌతమముని సమీపంబు సేరి కటాక్షింపుమని యనేకవిధంబులం బశ్చాత్తప్తులై వేడినఁ గరుణాపూర్ణహృదయుండగు న మ్మునిశ్రేష్ఠుండు వారలం జూచి నావాక్యంబు రిత్తవోదు, కృష్ణావతారపర్యంతంబు మీరు నియతధర్మప్రవర్తనల నలరియుండుఁడు, తదనంతరంబునఁ గలియుగంబు ప్రాప్తంబయ్యెడు. నప్పుడు మదీయ శాపక్రమంబు తప్పక మీకు లభించెడివి. నాశాపంబు వేడిమినడంచుకొను తలంపులు మీకుం గలవేని గాయత్రీదేవిపాదాబ్జంబులు సేవింపుడు. అని చెప్పిన విని బ్రాహ్మణులు శాంతినొంది చనిరి. వెండియుఁ గాలక్రమంబునం గలియుగంబు ప్రాప్తంబగుఁడు బ్రాహ్మణులు. ౧౪౬

కం. ఓపరు సంధ్యల వార్చుట । కేపారగ వేదభక్తి యింతయుఁ గన రా
శాపరు లగ్నుల విడుతురు । పాపులు కలియుగమునందుఁ బ్రాహ్మణు లధిపా. ౧౪౭

కం. శ్రీపరదేవిం గొలువరు । కాపాలికులగుచు జైన కాలికులు వృథా
లేపాంక శంఖ చక్రులు । పాపులు కలియుగమునందు బ్రాహ్మణు లధిపా. ౧౪౮

కం. కోపులు పరకీయా దు । ర్వ్యాపారులు నీచమతులు నల్పాయువు గుం
భీపాకమునం బడుదురు । పాపులు కలియుగమునందు బ్రాహ్మణు లధిపా. ౧౪౯

వ. కావున మానవేంద్రా ! నీకు సర్వదా దేవీధ్యానంబు కర్తవ్యం బని చెప్పి వ్యాసుండు
మరియు, ౧౫౦

## —: మ ణి ద్వీ ప వ ర్ణ న ము :—

వ క్ర గ తి ర గ డ.

బ్రహ్మలోకమునకు నూర్ధ్వభాగమందుఁ జెల్వుమీఱు
బ్రహ్మమైన సర్వవిష్టపంబు దానినే మణి
ద్వీప మంద్రు సర్వజగదతీతమహిమ నొప్పియుంట
లోప మెందు లేమి సర్వలోక నామ మిడిరి తొల్లి
దేవిచేత నద్ది నిర్మితి స్వహించి మించె నిచ్ఛ
దీవి నెన్నఁగలదె బ్రహ్మదేవుఁడైన శేషుఁడైన
నీ సమస్తదేశములు మహీతలంబు నింగి కై
లాసలోక మెన్న నవ్విలాసము ల్కనంగలే వ
కుంఠలీలఁ దనరు దాని గొప్పతనము సెప్ప నవ్వి
కుంఠమైనఁ బోలలేదు గోజగంబు పొగడనగునె
జగమునకును గొడుగువలెనె చల్లదనము నిచ్చుచుండు
నొగిఁ దలిర్చుచుండుఁ బెక్కుయోజనములు నిడివి గలిగి
పరగ దానిఁ జుట్టియుండుఁ బాలవెల్లి దట్టమగుచుఁ
దరగలందుఁ జల్లదనము దరుగకుండు నిరత మోలి
జరుగుచుండు లెక్కపెట్టఁజాల మెన్ని యోఢ లెపుడు
గురుతుమీఱు గొప్పరత్నకుజము తీరమందుఁ దనరు
కోట యేడు యోజనములఁ గొమరు మిగులు దాని యెత్తు
దాటనీరు వివిధశస్త్రధారులైన భటులు గాచి
మీరు నాల్గు ద్వారములను మెప్పుగాంచుచుండు దాని
ద్వారపాలకులును నచటఁ దప్పకుండ్రు నూర్వు రెలమి
వాసిమీఱ దేవభక్తవరులు వారు దేవిఁ జూడ

నాసతోడ వచ్చువారి సంపుచంద్రు దీవిజాడఁ
దత విమాన శతము నాదితంబు ఘంటికాయుతంబు
గతులయందుఁ జక్కదనము గలుగు హయము లెన్నియెన్ని
కెరలి వేత్రహస్తకోటి కిలకిలారవంబు లెన్ని
అరుగువారు వచ్చువారు నమరవరుల పంక్తు లెన్ని
కొలఁకు లెన్ని బావు లెన్ని గుంట లెన్ని చెరువు లెన్ని
అలవికాదు లెక్కసేయ నలరుఁదోట లెన్ని యెన్ని
గోపురంబు లెన్ని వృక్షకోటు లెన్ని పక్షు లెన్ని
పూఁప లెన్ని కాయ లెన్ని పూవు లెన్ని ఫలము లెన్ని
యెల్లశాల మొక్కరీతి నెలమి నందుఁ గల్గియుండుఁ
జల్లఁగాలి విసరుచుండు సర్వఋతువులందు నిండి
కమ్మతావు లెల్లయెడలఁ గలిగియుండు సంతతంబు
కొమ్మలందుఁ గోకిలములు గూయుచుండు మెండుగాను
నిమ్మ దబ్బ జేమ పనస నీప వకుళ లోధ్ర పాద
వమ్మ లామ్ర కర్ణికార పారిజాత పాటలంబు
లగరు దేవదారు కాంచ నాశ్వకర్ణ తాల కోల
భృగు తమాల నాగ కుంద బిల్వ పిప్ప లాబ్జ బంధు
జీవ కనక సప్తపర్ణ శింశుమార వృక్షసమితి
చేవమీఱఁ గనుల కింపు సేయుచుండు నెల్లయెడల. ౧౮౧

సీ. కోయెలల్ చిగురాకు కొమ్మలపై నెక్కి కూ కూ యనుచు వేడ్కఁ గూయుచుండఁ
బూవుఁదేనియ లాని పోతరించిన గండుతుమ్మెదల్ రొదసేసి జుమ్మనంగ
కమ్మగాయలు మెక్కి కడుపులు నించి రాచిల్క గుంపులు ముద్దు పల్కఁ బల్క
గుడిగూళ్ళలో నుండి గుబగుబలాడుచుఁ బారావతములు శబ్దముల నెఱప
తే గీ. కొలకులందును రాయంచ లుశిరొనర్పఁ। గోరువంకలు పొదలలో గుబ్బటిల్ల
చారుశబ్దప్రపంచంబు జనకమనఁగఁ। దేజరిల్లెడిఁజూమి మణిద్వీప మధిప. ౧౮౨

సీ. కొలఁకుల నెఱనీటి చలికి నెచ్చెలియైన తూఁడుగాడుపుసోకు తోడుపడఁగ
కల్పవృక్షమునీడ గదసి చందురురాతి కుదురుటోదియ యింపుగులికి వొలయ
మంచిగంధపుచెట్ల మఱఁగి సొంపుగ వీఁచు వలినాలితెమ్మెరల్ సొలసి తాక
పొదరిండ్లలో రాలు పుప్పొడి బుక్కాయిఁ గలసి క్రొవ్విరితిన్నె చలువలీన
తే.గీ. సరస సైకతములమీద జదురుసేయ।నచ్చరల ముత్తైనరులు శైత్యములు గుఱియ
స్పర్శసర్వస్వమున కిదే జనకమనఁగ। దేజరిల్లెడిఁజూమి మణిద్వీప మధిప. ౧౮౩

సీ. చెలఁగి కుంచెలువిప్పి జలదాధ్వమున నిక్కి బలిసి నెమళ్ళు పైపై నటింప
సమృతవాపితటవ్యాపి భాసుర రత్నసోపానశుభశోభ చౌకళింప
భూరి గారుత్మత ద్వారబంధంబుల బంగారుమేడలు పరిఢవిల్ల
నింద్రనీల స్తంభ చంద్రశాలాగ్ర సుందరమణికాయమానములు తవర

తే.గీ. చారుముక్తాఫలస్తోమ తోరణములు । స్ఫాటికోపలకుట్టిమస్థలులు బొనర
సకలరూపంబులకు నిదే జనకమనఁగ । దేజరిల్లెడిఁ జుమి మణిద్వీప మధిప. ౧౫౪

సీ. తియ్యమామిడికోనఁ దివురు పాలేటికాల్వల మీఁగడలతిన్నె మొలచినట్టి
చెఱకుగడలమీఁదఁ బెరిగిన ద్రాక్షపందిళ్ళచేరువఁ బూవుఁదేనెబోదె
గట్లఁదాచిన కలకండరాపొడి దుమారములెక్కి ఖర్జూరసమితి నాన్పు
నమృతవాపుల రసంబాను నచ్చరపూవుబోడుల వాతెర ల్పూని క్రోలు

తే.గీ. చారుశృంగారరసమార్గచారులైన । సూరివర్గంబు నందందఁ జూడ నొప్పి
సకలరసభావమున కిదే జనకమనఁగ । దేజరిల్లెడిఁ జుమి మణిద్వీప మధిప. ౧౫౫

సీ. స్రామాణిగోడలఁ జందనదారువుల్ సవరించిన మదుళ్ళ చక్కఁదనము
పునుఁగుబిల్లులమంద కనుఁగులై చెఱలాడు కస్తూరిమృగముల గముల సొంపు
విరిజాజిజొంపాల వెన్క ముందల్లిబిల్లిగ నున్న మల్లెచాల్తిన్నదనము
పొన్నమ్రాఁకులగుంపు బోదెర్రెక్కల నెఱపూఁత నింపెసలారు పొగడ సొగసు

తే.గీ. సంకఁగియును లవంగంబు జాజికాయ । మెసవి చనుఁదెంచుఁ గూనతెమ్మెరల సొబగు
జెనకి గంధంబులకునెల్ల జనకమనఁగఁ । దేజరిల్లెడిఁ జుమి మణిద్వీప మధిప. ౧౫౬

తే గీ. కంచుకోటకు నవ్వలఁ గడఁగి తామ్ర । సాల మలరారు నెన్న నీ సాలమునకు
నమర నేడయి తగు యోజనములయెత్తు । వినుము నడుమను జతురశ్ర పృథివి గలదు. ౧౫౭

వ. తామ్ర కాంస్య సాలంబులనడుమఁ గల్పవృక్షవాటిక గలదు. వాని పూవులును, బత్రంబులును బంగారువన్నె గలయవి. అందలి బీజంబులు రత్నంబులై యుండు. వాని వాసనలు దశయోజనపర్యంతంబు వ్యాపించు. నవ్వనంబు సురక్షితంబు. ఋతుసంబంధంబులేక యనిశంబు దేజరిల్లెడి. నందుఁ బుష్పసింహాసనాసీనుండై, పుష్పఛత్రవిరాజితుండై, పుష్పభూషణభూషితుండై, పుష్పాసవమత్తుండై, మధుశ్రీయు, మాధవశ్రీయు నను నిరువురు భార్యలం గూడి దివ్యగంధర్వాంగనాగానంబు లాలింపుచుఁ, గ్రీడించుచు వసంతు డవ్వనంబుఁ బరిపాలించుచుండు. న తామ్రసాలంబు గడవఁ బూర్వోక్తంబయిన యౌన్నత్యంబు గల్గి సీసప్రాకారంబు శోభితంబగు. తామ్ర సీస సాలంబుల నడుమ సంతానవృక్షవాటి కలదు. దాని పుష్పంబులు దశయోజనగంధిలంబులు, హిరణ్యాభంబులు, నిరంతర వికసితంబులు, వాని ఫలంబులు మధురంబులు, నమృతద్రవసంయుతంబులునై యుండు, శుక్రశ్రీయు, శుచిశ్రీయు నను నిరువురు భార్యలం గూడి గ్రీష్ముండు

పాలింపుచుండు. నతండు నానాసిద్ధపరివృతుండై, దేవసమన్వితుండై, విలాసినీబృంద వివిధోపచార వినోద విలసితుండై యుండు. అవ్వల నారకూటమాయావరణంబు గల దదియు నింతియ యౌన్నత్యంబుగలిగి చెలువొందు. పీసారకూట సాలంబుల నడుమ హరిచందన వృక్షవాటి గలదు. అందు విద్యుత్పింగళనేత్రుండును, జీమూతకవచుండును, మేఘవాహనుండును, వజ్రనిర్ఘోషముఖరుండును, ఇంద్రచాపధరుండును నై యనంతవారిధారలఁ గుఱియించుచు నభశ్శ్రీయు, నభస్యశ్రీయు, సురస్సయు, రస్సమాలినియు, అంబయుఁ, దులయు, నిరత్నియు, భ్రమంతియు, మేఘయంతియు, వర్షయంతియుఁ, జిపుణికయు, వారిధారయు నను పండ్రెండుగురు శక్తులతోఁ గ్రీడించుచు వర్షర్తునాయకుండు దానిం బాలించుచుండు. నిరంతర నవపల్లవ, నవలతికాన్వితంబులైన వృక్షంబులును నిచ్చలునుం బచ్చనిరంగుల విచ్చలవిడిం బెరుగు పచ్చికపట్టులును, విడువక పారు నదీ నద ప్రవాహంబులును, రాగిజనచిత్తంబులంబోలెఁ గలుషంబులైన యుదకంబులతో నొప్పు సరోవరంబులు పెక్కులు గలవు. మఱియు దేవికిం గర్మకారులగు దేవతలును, సిద్ధులును నందుఁ గలరు. దేవ్యర్థంబులయిన వాపీ, కూప, తటాకంబులుం గలవు. సుందరులగు నంగనాజనంబులుందురు. దానిం దాటి సన నంతియ యెత్తైన పంచలోహాత్మక సాలంబుఁ గలదు. ఆరకూట పంచలోహ సాలంబుల నడుమ మందారవాటిక కలదు. అది నానాపుష్పలతాకీర్ణంబును, నవపల్లవశోభితంబు నై యుండు. ఇష్టలక్ష్మియు, సూర్జలక్ష్మియు నను నిరువురు భార్యలతోఁ గూడి శరదృతునాయకుం డధిష్ఠాతయై వర్తిల్లు. భార్యలతోడ సిద్ధు లందు వసింతురు. పంచలోహావరణంబున కవల నంతియ యెత్తై దీప్యమానంబై మహాశృంగంబై రౌప్యసాలకంబు తేజరిల్లు; నందు సంతతప్రసూన స్తబకాన్వితంబై, దశయోజనగంధిల కుసుమాకీర్ణంబై, దేవీకర్మకారిగణసహితంబై పారిజాతవాటి వాటిల్లు. సహశ్రీ, సహస్యశ్రీ యను నిరువురు భార్యలతోఁ గ్రీడింపుచు హేమంతఋతునాయకుండు సాయుధుండై రాగిజనంబుల రంజిల్లంజేయుచు దానిం బాలించుచుండు. నందు దేవీవ్రతకారులగు సిద్ధులు వసింతురు, రౌప్యసాలానంతరంబున సౌవర్ణప్రాకారంబు భాసిల్లు. రౌప్య సౌవర్ణ ప్రాకారంబుల నడుమ నవపుష్పపల్లవశోభమానంబైన కదంబవాటి వర్తిల్లు, నందుఁ గాదంబరీ ధారలు గుఱియుచుండు. తదనుభవానందమగ్నులై యచ్చటివార లుందురు. తపశ్శ్రీ, తపస్యశ్రీ యను నిరువురు భార్యలతోఁ గ్రీడించుచు శిశిరర్తునాయనుండు దానిం బాలించుచుండు. దేవీ దాస్యకారులగు సిద్ధు లందు వసింతురు. తదుత్తరంబునఁ బుష్యరాగమయంబైన యావరణంబు గలదు. అది కుంకుమారుణవిగ్రహంబు. దానియందుఁ బుష్యరాగ

మయస్థలంబులును, బుష్యరాగమయవృక్షంబులును సమస్తంబు పుష్యరాగమయంబై యుండు. రత్నసాలాదులయందెల్ల నిట్టులనె యని భావించునది, ఆ సాలంబునందు. ౧౫౮

సీ. రాజితంబగు పుష్యరాగంపుఁగోటలో నఖిలసరోజగర్భాండములను
గల దిశాపతులు వర్తిలుదురుసుమి సమష్ట్యాత్మరూపులగుచు నతిముదమున
నందు నింద్రుం డుండు నామకంబునకు నెక్కుడై యొప్పు నైరావతాధిరూఢు
డై వజ్రహస్తుఁడై యమరసేనాపరివృతుఁడయి యా శతక్రతుడు పొల్చు

తే.గీ. అచ్చరలతోడ, శచితోడ నతనివలెనె । యంగనలఁగూడి వహ్నియు యముఁడు రాక్ష
సుండు వరుణుం డనిలుఁడు శ్రీదుండు శివుఁడు।నందు నుందురు భటులతో నవనినాథ ! ౧౫౯

వ. మఱియు నగ్ని యాగ్నేయంబున స్వాహా స్వధాయుక్తుండై, నిజవాహన భూషాఢ్యుండై, నిజదేవగణ పరివృత్తుడై యుండు. యముఁడు యామ్యదిశను దండధరుండై, స్వభటపరివేష్టితుండై, చిత్రగుప్త పురోగముండై, నిజశక్తితోఁ గూడి విహరించు. నిఋతి నైరృతి దిగ్భాగంబున రాక్షసపరివృతుండై, నిజశక్తియుతుండై వసియించు. వరుణుండు పాశధారియై మహామీనసమారూఢుండై, వారుణీమదవిహ్వలుండై, నిజశక్తి సమాయుక్తుండై, నిజయాదోగణాన్వితుండై, వరుణానీరతాకులుండై వారుణదిగ్భాగంబునం బ్రవర్తిల్లు. వాయుదేవుండు వాయవ్యకోణంబున వాయుసాధన సంసిద్ధులగు యోగులచేఁ బరివృతుండగుచు, ధ్వజహస్తుండై, విశాలాక్షుండై, మృగవాహనంబు నెక్కి మరుద్గణంబులు గొలువ భాసమానుండై యుండు. గుబేరుం డుత్తరంబున యక్షాధిపత్యంబు సేయుచు వృద్ధియు, బుద్ధియు నను శక్తులంగూడి నవనిధులతో నలరుచుఁ దుందిలుండై మణిభద్రుండునుఁ, బూర్ణభద్రుండును, మణిమంతుండును, మణికంధరుండును, మణిభూషణుండును, మణిమాలుండును, మణికార్ముకుండును మొదలుఁగాగల యక్షసేనాపతులం గూడి నిజశక్తియుతుండై క్రీడించు. రుద్రుం డీశానకోణంబున కధీశ్వరుండై నిజచాపశరధిబాణాన్వితుండై, శూలధరులును, వికృతాస్యులును, గరాళవదనులును, వమద్వహ్నిముఖులును, దశహస్తులును, శతపాణులును, సహస్రభుజులును, దశపాదులును, త్రినేత్రులు, నుగ్రమూర్తులును రుద్రాధ్యాయంబునం జెప్పఁబడిన భూచరులును, వియచ్చరులును నగు రుద్రులతోడం గూడి రుద్రాణీకోటిసహితుండై, భద్రకాళ్యాదిమాతృకలతో నానాశక్తి సమావిషడామర్యాది గణావృతుండై, వీరభద్రాది సమన్వితుండై, ముండమాలాధరుండై. నాగవలయుండై, నాగకంధరుండై, వ్యాఘ్రచర్మపరీధానుండై. గజచర్మోత్తరీయుండై, చితాభస్మలిప్తాంగుండై. ప్రమథాదిగణావృతుండై. డమరునాదంబు సేయుచు భూతసంఘసమావృతుండై భూతవాసుండై వర్తించుచుండు. మఱియు, ౧౬౦

ఆ.వె. పుష్యరాగసాలమునకు నవ్వలఁ బద్మ । రాగమణుల కోట రహి వహించు
దానియెత్తు సూడ దశయోజనంబులు । విమలరమ్యగోపురములు గలవు. ౧౬౧

సీ. పద్మరాగస్తంభ భాసితంబై యుండు మండపశతక సన్మండితంబు
విద్య లర్వదినాల్గు వీరలై నడుమను నానాభరణసాధనములఁ బూని
ప్రత్యేకవిష్టపపాలినులై పరిచారికలను గూడి స్వస్వలోక
జనులతో మరియు వాహనహేతిధనముతో వారిపేళ్ళను విను వరుస నధిప

తే.గీ. పింగళాక్షి విశాలాక్షి వృద్ధియును స । మృద్ధయును శ్రద్ధయును దాని నెసపి స్వాహా
స్వధయు మాయ వసుంధర సంజ్ఞ లోక । ధాత్రి సావిత్రి పిదప గాయత్రి మఱియు. ౧౬౨

సీ. ఒగి త్రిదశేశ్వరి యును రూప బహురూప సొరిది చస్కంద యచ్యుతయుఁ బ్రియయు
విమలయు వరుణియు నమలయు నారుణి ప్రకృతియు సృష్టియు వికృతియు స్థితి
సంహృతి సంధ్యయు సతి, హంసి, మర్దిక, వ్రజికయును నాకవాస మాత
భగవతి దేవకి పంకజాసనయును ద్రిముఖి యన్యయును సత్తముఖి యవల

తే.గీ. దేవతా పూర్వదేవ మర్దినియు నూర్ధ్వ । కేశి లంబోష్ఠి బహుశీర్ష గీతచరిత
యగు వృకోదరి రథరేఖ యబ్జరేఖ । గగనవేగయుఁ బవనవేగయును నంద్రు. ౧౬౩

సీ. పయిపయి మదనాతురయు ననంగయు నంగమథనయు నంగసుమయు ననంగ
మేఖలయును బేరుమించిన విశ్వరూపయు సురాదికయును క్షయకరియును
నక్షోభ్య సత్యవా గంచిత వివిధరూపయు శుచివ్రతయును వాగధీశ
యును నుదారయు నాఁగ లొప్పారుదురు వీరు జిహ్వాల నిప్పులు చెఱఁగుచుంద్రు

తే.గీ. ఏడుసంద్రంబులను ద్రావి యినుని మ్రింగి । గాలి స్తంభించి సకల జగంబు నమిలి
వైతు మనుదురు నరుణేక్షణాతతలయి । విహరణ మొనర్చుచుందు రుర్వీతలేశ ! ౧౬౪

వ. వీరలందఱును శరశరాసనధారిణులును, యుద్ధోత్సుకలును, దంష్ట్రికటకటారవబధిరీకృతదిఙ్ముఖులును, పింగోర్ధ్వగేశలును, అక్షౌహిణీ సేనాసమేతలు నై యుంద్రు. ఒక్కొక్కశక్తి లక్షబ్రహ్మాండంబుల నాశనంబుసేయు సామర్థ్యంబుగలియుంద్రు. శతాక్షౌహిణులసేనయు నంతియె సామర్థ్యంబు గలిగియుండు. రథ గజ తురంగంబులు లెక్కింప నలవికాదు. పద్మరాగసాలంబునకుఁ బిమ్మట గోమేధికమణినిర్మిత సాలంబు గలదు. దాని యెత్తు పదియోజనంబులు. ఈ రెండుకోటల నడిమి భూమి జపాపుష్పసన్నిభంబు. నిఖిల పక్షి వృక్ష కుడ్య స్తంభ సదన గోపురాదులు గోమేధికమయంబులు. అందుండు భగవతికి ముప్పదియిద్దరు శక్తులు గలరు. గోమేధికమయంబులగు శస్త్రంబులు ధరియింతురు. వారికిఁ బ్రత్యేకలోకంబులు గలవు. వారు పిశాచవదనలు. స్వలోకవాసులచే నిరంతరంబు పూజింపబడుచుందురు. భింది భింది, ఛింది ఛింది, దహ దహ యని పలుకుచుంద్రు.

నిరంతరయుద్ధోత్సుకలై యుందురు. ఒక్కొక్కశక్తికి పదేసియక్షౌహిణుల బలగం బుండు. ఒక్కొకశక్తికి లక్ష బ్రహ్మాండంబుల నశింపజేయు సామర్థ్యంబు గలిగియుండు. నచ్చటి రథ గజాశ్వాదు లగణ్యంబులు. వారి నామంబులు వివరించెద వినుము. విద్యయు, హ్రీయు, పుష్టియు, ప్రజ్ఞయు, శినీవాలియు, కుహూవును రుద్రయు, వీర్యయు, ప్రభయు, నందయు, పోషణియు, బుద్ధిదయు, శుభయు, కాళరాత్రియు, మహారాత్రియు, భద్ర కాళియు, కపర్దినియు, వికృతియు, దండినియు, ముండినియు, చంద్రఖండధారిణియు, శిఖండినియు, నిశుంభశుంభమథినియు, మహిషాసురమర్దినియు, నింద్రాణియు, రుద్రా ణియు, శంకరార్ధశరీరిణియు, నారాయణియు, త్రిశూలినియు, పాలినియు, నంబికయు, నాహ్లాదినియు నని చెప్పంబడుచుందురు. వీరికిం గోపంబు కలిగినప్పుడు బ్రహ్మాండనాశ నంబు గలుగు. వీరలకు బరాజయంబు లేదు. గోమేధికసాలంబున కవ్వల వజ్రమణిమయా వరణంబు గలదు. అది నవవృక్షసముజ్జ్వలంబు. అందుండు గృహారామక్షేత్ర వృక్షాల వాలాదులన్నియు వజ్రమయంబులు. అందు జగదంబ పరిచారికలు చరియింతురు. ఒక్కొక్క తెకు లక్ష దాసు లుందురు. కొందఱు వీవనల, గొందఱు బంగారుగిన్నెల, గొందఱు తాంబూలదళంబులఁ, గొందఱు ఛత్రంబులఁ, గొందఱు చామరంబులఁ, గొందఱు వస్త్రంబులఁ గొందఱు పుష్పంబులఁ, గొందఱు ముకురంబులఁ, గొందరు గుంకుమలేపం బులఁ, గొందరు కజ్జలపాత్రంబుల ధరించికొని కనిపెట్టియుందురు. కొందరు పాదసంవాహ నంబులునుఁ, గొంద అలంకారంబులం జేయుచుందురు. దేవీకృపావేశవశంబున వారు తుచ్ఛీకృతజగత్త్రియులై యుందురు. వారి పేళ్ళు క్రమంబున వివరించెద వినుము. అనంగరూప, అనంగమదన, సుందరి, మదనాతుర, భువనవేగ, భువనపాలిక, సర్వ శిశిర, అనంగవేదన. వీఱలందరును విద్యుద్వల్లీ సమానాంగులును, క్వణత్కాంచీగుణాన్వి తలును, రణన్మంజీరచరణలును, సర్వకార్యకుశలలును, వేత్రహస్తలును నై పరగు చుందురు. వీరు ప్రాకారబహిర్దేశంబు నెనిమిదిదిక్కుల నుందురు. వీరికి వజ్రమయ గృహంబులు గలవు. వజ్రప్రాకారంబు గడచిపోవ వైడూర్యసాలంబు గలదు. అందు వాపీ కూప తటాకాదులన్నియు వైడూర్యమయంబులు. బ్రాహ్మ్యాది నామంబుల నిజగణంబు లతో శక్తులు వసింతురు. బ్రాహ్మియు, మహేశ్వరియు, కౌమారియు, వైష్ణవియు, వారా హియు, నింద్రాణియు, జాముండయు, నెనిమిదవదై మహాలక్ష్మి. వీరు మాతలు, బ్రహ్మ రుద్రాది దేవతలకు సమాకారలై ప్రవర్తిల్లుదురు. వీరు స్వస్వసేనాసమావృతలై యుందురు వారికి గజ, తురగ, శిబికా, హంస, సింహ, గరుడ, మయూర, వృషభ, స్యందనాదులు కోటులతరబడి నుండు. బహుచిహ్నచిహ్నితంబులగు విమానంబు లనేకంబులు గలవు. వైడూర్యమణిసాలంబునకుం బిమ్మట దశయోజనోన్నతంబై యింద్రనీల

మణిసాలంబు గలదు. దాని నడుమ నన్నియు నింద్రనీలమయంబులు. మఱియు బహు యోజనవిస్తృతంబై, షోడశారంబై, దీప్యమానంబై, సుదర్శనసమంబై పద్మంబు దనరారు. దానియందు షోడశశక్తుల స్థానంబులు గలవు. అవి సర్వోపస్కరయుక్తంబులు. కరాళియు, కరాళినియు, సుమయు, సరస్వతియు, శ్రీయు, దుర్గయు, నుషయు, లక్ష్మియు, శ్రుతియు, స్మృతియు, ధృతియు, శ్రద్ధయు, మేధయు, మతియుఁ, గాంతియు, నార్యయు నను పదియార్వురు శక్తులు. నీలనీరదసంకాశలు, కరవాలహస్తలు, ఖేటకధారిణులు, యుద్ధోత్సాహసమేతలు. వీరు జగదంబ సేనానాయికలు. వీరలెల్లరు బ్రహ్మాండశక్తులం బాలించుచుందురు. నానావిధరథ సమారూఢలై, పరాక్రమవతులై, నానాశక్తులం గూడి వసింతురు. ఇంద్రనీలసాలంబున కవల దశయోజనోన్నతంబైన ముక్తాప్రాకారంబు గలదు. మధ్యప్రదేశంబు పూర్వోక్తనిధంబు. అందు జగద్వార్తాప్రబోధికలగు జగదంబమంత్రిణు లుందురు. వీరు దేవితో సమానంబులైన భోగంబులు గలవారు. ఇంగితజ్ఞలు, పండితలు, సర్వకార్యకుశలలు, స్వామికార్యపరాయణలు, చతురలు, అతిసుందరులు, నానాశక్తిసమాయుక్తలు నయి జ్ఞానశక్తిచే సర్వసమాచారంబులు గ్రహింతురు, అనంగకుసుమ, అనంగకుసుమాతుర, అనంగమదన, అనంగమదనాతుర, భువనపాలిని, గగనవేగ, శశిరేఖ, గగనరేఖ, పాశాంకుశ, పరాభయధారిణీ, అరుణవిగ్రహ అను నామంబులచే వర్తిల్లుదురు. ముక్తాసాలానంతరంబు మరకతసాలంబు వర్తిల్లు. దాని పొడవు దశయోజనప్రమాణంబు. అది షట్కోణయుతంబు, పూర్వకోణంబునఁ జతుర్వక్త్రుండై, గాయత్రీసహితుండై, కుండికాక్షపాశాభయదండాయుధధరుండై ధాతయు, గదాయుధధారిణియగు గాయత్రీదేవతయు, మూర్తిమంతంబులైన వేదశాస్త్రపురాణేతిహాసంబులును వానిం గొల్చుచుండు. రెండవదగు నిఋృతికోణంబున సావిత్రీసహితుండై మహావిష్ణుండుండు. మూడవకోణంబగు వాయుకోణంబున సరస్వతీసహితుండై రుద్రుం డుండు. రుద్రభేదంబులును, గౌరీభేదంబులును మూర్తిమంతంబులైన చతుష్షష్ట్యాగమంబులు నందుండు. నాల్గవదియగు నగ్నికోణంబున రత్నకుంభ మణికరండకంబులం బూని ధననాయకుండగు కుబేరుండు మహాలక్ష్మీసమేతుండై యుండు. నైదవదగు వారుణకోణంబున రతిసమేతుండై, పాశాంకుశధనుర్బాణసమేతుండై, శృంగారమూర్తియైన మన్మథుండుండు. ఆఱవదియగు నీశానకోణంబునఁ బుష్టిసమన్వితుండై, పాశాంకుశధరుండై, వీరుండై విఘ్నహర్తయైన గణేశుం డుండు. మరకతసాలంబు గడచిన నూరామడయెత్తు గల్గి కుంకుమారుణంబైన ప్రవాళసాలంబు వర్తిల్లు. నందు పంచభూతాధిదేవతలగు హృల్లేఖయు, గగనయు, రక్తయు, గరాళికయు, మహోచ్ఛుష్మయుఁ, బాశాంకుశవరాభయధారిణులై, మితభూషణలై, దేవీసమానవేషాఢ్యలై, నవయౌవనగర్వితలై వసియింతురు. ప్రవాళసాలంబు విడిచిచన బహుయోజనవిస్తీర్ణంబై నవరత్నమయసాలంబు వర్తిల్లు. నందు దేవ్యవతారంబు

లుంద్రు. వారు దేవీసమానప్రభలు, జ్ఞానరూపిణులు నై యుందురు. సప్తకోటి మహా మంత్ర దేవతలు నిచ్చటన యుందురు. నవరత్నమయసాలంబు దాటి పోవ, మహనీయ చింతామణిప్రాకారంబు వర్తిల్లు. నది యనుపమానంబు దాని వర్ణింప నెవ్వరితరంబు? అదియే దేవీసదనంబు. ౧౬౫

సీ. చింతామణులకోట యంతరంబున నాల్గు మండపంబులు మహామణియుతములు
కోటిసూర్యులతోడ దీప్తైన ప్రభలతోఁ జను సహస్ర స్తంభసంయుతములు
మహితమౌ శృంగారమండపం బొక్కటి నలుపైన ముక్తిమండపము నొకటి
మండిత సుజ్ఞానమండపం బొక్కటి యేకాంతమండపం బెసఁగ నొకటి

తే.గీ. మొఱయు వానికిఁజుట్టు గాశ్మీరవనిక । మల్లికాకుందవనికయు నుల్లసద్వి
తానపఙ్తియుఁ బుష్కలస్థానములును । వాని వర్ణింప వేనోళ్ళవావి తరమె? ౧౬౬

వ. మఱియుం గురువిందమణిసోపానశోభితములగు మహాపద్మాటవి సుధారససంపూర్ణంబై యుండు. హంస కారండవాది పక్షిసంకులంబు లక్షీణంబులై యుండు. శృంగారమండపంబున వివిధస్వరంబులతో దేవీసమూహంబులు గానంబు సేయుచుందురు. సభాసదులు దేవతలు. సభామధ్యంబునఁ జగదంబ కొలువు సేయుచుండు. ముక్తిమండపమధ్యంబున శివ, బ్రహ్మానందమయియై యుండు. జ్ఞానమండపంబున జ్ఞానోపదేశంబు సేయుచుండు. చతుర్థంబగు నేకాంతమండపంబున జగన్మాత మంత్రిణులతోగూడి జగద్రక్షాచింతనంబు సేయుచుండు. చింతామణిమయంబగు గృహంబున శక్తితత్త్వాత్మకంబులగు సోపానదశకంబుతో నలరు మంచకం బొక్కటి శోభిల్లు. బ్రహ్మయు, విష్ణుండు, రుద్రుండును, ఈశ్వరుండును మంచకంబునకు ఖురంబులుగా నుందురు. ఫలకంబు సదాశివుండు. దానిపై మహాదేవుండగు పరమపురుషుండు వర్తిల్లు. లీలార్థంబు శక్తియొక్కటియ స్త్రీపురుష దేహంబుల రాజిల్లునని తెలియునది. ఆ మహాదేవి నభినుతింప నెవ్వని తరంబు? ౧౬౭

సీ. శతకోటికందర్పసమసుందరాంగుండు ముక్కంటియును నైదు మోములాడు
రత్నభూషణుఁడు సారంగాభయపరశు వరముల బాహుల వరలువాఁడు
పదియునాఱైన యబ్దముల యీడగువాఁడు నఖిలలోకాధీశుఁ డైనవాఁడు
కోటిసూర్యులతోడ దీప్తైన ప్రభవాఁడు శీతాంశుశతకోటి శీతలుండు

తే.గీ. ననుపమాక్షస్ఫటికమూర్తి యెసవాఁడు । మోమునందునఁ జిఱునవ్వు మొలచువాఁడు
మేలువారలలోనెల్ల మేలువాఁడు । నైన పురుషు నెదమతోడ నంట కులుకు. ౧౬౮

సీ. నవనవరత్నగణప్రాంచితంబయి రాణ జెన్నొందు నొడ్డాణ మొప్ప
వైదూర్యమణివిభావ్యాప్తి దిగ్వలభులౌ నపరంజిభుజకీర్తు లవఘళింప

మెఱుఁగు చెక్కులకాంతు లొలసెడి శ్రీచక్ర తాటంకములు తళత్తళ యనంగ
నరచందమామయొయ్యారంబు దెగడు లలాటకాంతులు బలు నీటు చూప

ఆ.వె. మోవి దొండపండు మురువును హసియింప । నెమిలికంచెచూడ నిమిడి మెరయ
సొంపుమీఱు మృగమదంపునామము గుల్క । రవలుజెక్కుముక్కెరయు రహింప. ౧౬౯

సీ. గాటుచింతామణి గాఁగ సుప్పాణిముత్తెముగ్రేలెడి బులాకి దీప్తిగుల్క
కర్పూరమును మంచిగంధంబు కుంకుమ మలఁదిన చనుకట్టు చెలువుమీఱ
చిత్రచిత్రములైన చిన్నారిసగలతో దరసమంబైన గంధర దలిర్ప
దాడిమీఫలబీజ దంతపఙ్క్తి యొసంగ రత్నకిరీటశిరస్క యగుచు

తే.గీ. అబ్జగతభృంగసమవదనాలక యయి । శారదేందునిభాస్యయై జాహ్నవీన
దీజలావర్తనాభియై దివ్యరత్న । ముద్రికాంగుళియై జగన్మోహినియయి. ౧౭౦

సీ. వెలిదమ్మిరేకులవలె నున్న మూడుకన్నులతోడ మాలికావలులతోడ
మణికింకిణీయుక్త మణికంకణముతోడ మణిసరంబులతోడ మహిమతోడ
మణికంచుకముతోడ మల్లికామోదధమ్మిల్లంబుతోడ మైమెఱపుతోడ
వృత్తస్తనయుగ మహితకాంతితతులతో సర్వశృంగారవేషములతోడ

తే.గీ. ననుపమవరాభయేద్ధపాశాంకుశ విల । సద్భుజలతోడఁ గరుణారసంబుతోడఁ
జారు సుకుమారతనులతాస్ఫారకాంతి । పుంజములతోడ మహనీయ భూతితోడ. ౧౭౧

సీ. సల్లాపనిర్జిత వల్లకి యగుచు మహోల్లాసహాససంపుల్ల యగుచు
బహువయస్యలతోడఁ బరిచారికలతోడ సురభామినులతోడ సురలతోడ
సమధికేచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులతోడ లజ్జయును దుష్టి
పుష్టియుఁ గీర్తియు బుద్ధియుఁ గాంతియు దయయును క్షమయు మేధయును స్మృతియు

తే.గీ. మూర్తిమతులయి లక్ష్మియు మొగి జయయును । విజయ యజితాపరాజితల్ వినుము నిత్య
యును విలాసిని మంగళ యొనర దోగ్ధ్రి । ఘోరయును బీఠశక్తులై కొలుచుచుండ. ౧౭౨

సీ. ఇరుపార్శ్వములయందు నెలమి శంఖంబును బద్మంబునను నిధుల్ పరగుచుండ
సప్తధాతువులు కాంచనరసంబులు మణుల్ నిధులయందును బుట్టి నెమ్మి నేఱు
లగుచు సుధాంభోధియందుఁ బ్రవేశింప దేవీగృహంబు విస్తీర్ణమహిమఁ
దనరారు వేయియోజనములై యది యెల్ల చింతామణులతోడఁ జేయఁబడియె

తే.గీ. దాని కవ్వలఁ గోటలు తనరుచుండు । మును వచించినవానికి నినుమడించి
తగు వియత్పథమున నిరాధారమగుచు । విచ్చు ముడుచు సృజన లయ విధము లెఱిఁగి. ౧౭౩

వ. అయ్యాయి బ్రహ్మాండంబుల వర్తిల్లు. దేవ్యుపాసకు లంతంబునం జెందునది చింతామణి గృహంబు. అందు ఘృతకుల్యలును, దుగ్ధకుల్యలును, దధికుల్యలును, మధుకుల్యలును, నమృత ద్రాక్షా జంబూరస ప్రవాహంబులు, నామ్రేక్షురస ప్రవాహంబులునుం బ్రవ

హించుచుండు. మనోరథఫలదంబులగు వృక్షంబులును, బావులును, నూతులు యథేష్ట
పానఫలదంబులై యుండు. రోగంబును, ముసలితనంబును లేవు. చింతా మాత్సర్య
కామ క్రోధాదికంబు లెవ్వరాదు. ఎల్లరు సస్త్రీకులై, సహస్రాదిత్యవర్చస్కులై
యౌవనవంతులై యా చింతామణీగృహంబునం గొలువుండు భువనేశ్వరిం గొల్చు
చుందురు. కొందఱు సాలోక్యంబును, గొందఱు సామీప్యంబునుఁ, గొందఱు సారూ
ప్యంబును బొంది యుందురు. తక్కినవారు పార్శ్వగతులై యుందురు. సామ్యా
వస్థాత్మికయు, గారణబ్రహ్మరూపయు, మాయాశబలవిగ్రహయు నగు నా భువనే
శ్వరిం గొల్చుచు మూర్తిమంతంబులై సప్తకోటి మహామంత్రంబులు, మహావిద్యలు
నం దుండు. అది తేజోమయంబు. సూర్యచంద్రాగ్ని విద్యుత్తులు దాని తేజంబులోఁ
గోటివంతును లేవు. ఒక్కచో బగడంపుఁజాయ, యింకొకచో గరుడపచ్చవన్నె.
మఱియొకచో మెఱుపుడాలు, వేఱొకచో సూర్యకాంతి, ఒండొకచో నింద్రనీలమణి
ప్రభ, యన్యస్థలంబున వజ్రంపు డంబు, దావానల కాంచనశోభ లందంద పొడసూపు.
జంద్రోపల, సూర్యోపలోద్గారంబు లయ్యెయెడలఁ గన్పట్టు. సర్వంబును నచ్చట రత్న
మయంబై యుండు. సకలానందపరిపూర్ణంబు, సకలైశ్వర్యవిరాజితంబు, సమస్తసుఖ
ప్రదంబు నై యొప్పుచుండు. ౧౭౪

క. నరుఁడు మణిద్వీపంబును। స్మరియించినఁ బాప మడఁగుఁ బ్రాణోత్క్రాంతిన్
స్మరియింప నందు జేరును। గర మీ యధ్యాయ పంచకము శుభదంబౌ. ౧౭౫

కం. భూతప్రేతపిశాచ। వ్రాతంబులు దొలఁగు దీనిఁ బఠియించినచో
బ్రీతి నవాలయనిర్మితిఁ బూతంబగు వాస్తుయాగమునఁ జదువదగున్. ౧౭౬

వ. అని చెప్పి వ్యాసుండు మఱియు, ౧౭౭

## —: పు రా ణ ఫ ల ప్ర ద ర్శ న ము :—

కం. నారదునకు నారాయణుఁ। డేరీతినిఁ దెలిపె నట్టు లిది నీకు సువి
స్తారముగఁ జెప్పినాఁడను। చారుతరంబైన దేవిచారిత్రంబుల్. ౧౭౮

కం. దేవీమహిమము దెల్పెడు। నీ విస్తృతమగు పురాణ మిది భాగవతం
బో వసుధేశశిఖామణి! । ధీవిశదత విన్నయంతఁ దెలిపితి నీకున్. ౧౭౯

కం. అంబాయజ్ఞము తప్పక। సంబాళింపుము నృపాల। జనకు నరకతా
పంబుడుగును, దేవీమం। త్రంబుం గొని వేగమున యథావిధి నధిపా। ౧౮౦

వ. అని వ్యాసుండు జనమేజయునకుం జెప్పెనని చెప్పి సూతుండు శౌనకాదుల
కిట్లనియె. ౧౮౧

కం. జనమేజయుండు వ్యాసవ । చనమును విని యో మునీంద్ర జనని మనువు నా
కనువుగ నుపదేశింపవె । యన నాతం డట్ల సేసె నంతట నతఁడున్, ౧౮౨

కం. రావించెను ధౌమ్యాదుల । భూవిబుధుల లోకజనని పూజాక్రియలన్
గావించె యధావిధి నా । భావుక నవరాత్రసమయభావిత కృతులన్. ౧౮౩

కం. బాగుగ దేవ్యగ్రంబున । భాగవతపురాణ మోలిఁ బఠియింపించెన్
భూవిబుధకోటి కన్నము । బ్రేవుమనుచుఁ ద్రేపికొనఁగ బెట్టించె నొగిన్. ౧౮౪

కం. కన్నెలకు బ్రహ్మచారుల । కు న్నానానాథదీనకోటులకును దా
నన్నంబులు నర్థంబులు । పన్నుగ దానంబు సేసి పటుమోదమునన్. ౧౮౫

కం. జనమేజయుండు మందిర । మున నుండఁగ, బోరుతిండిముని తా గగనం
బుననుండి డిగ్గఁ గనుఁగొని । జననాథుఁడు పూజలెల్ల సలుపుచుఁ బల్కెన్. ౧౮౬

ఉ. ఎక్కడనుండి వచ్చితిరి యీరు; కృతార్థుఁడనైతి నేను, మీ
రిక్కడి కేగుదేరనగు హేతువు దెల్పుఁ డనంగ; భూప ! నా
కక్కజమయ్యెఁ జూచితి సురాలయమం దొక యద్భుతంబు, నే
నక్కథ దెల్పెదన్ భవదుదారమనోరథసిద్ధి యయ్యెఁజూ. ౧౮౭

కం. అది విన్నవించుటకు నీ । సదనమునకు నాదు రాక శమను నగరికిన్
జెదరి చనిన నీ జనకుఁడు । ముదమునఁ దా దివ్యరూపమునుఁ గైకొనుచున్. ౧౮౮

చ. ఘనుఁడయి దేవత ల్గొలువగా విబుధాంగన లాడి పాడఁగా
మునులు నుతించు స్తవంబు సేయ విధిముఖ్యులు చెంతల నిల్వ దివ్యకాం
చనసువిమానమెక్కి విలసద్గతితో రతనాలదీవికిన్
మునుగొని యేగె భాగవతము న్వినియుంటివి నీవు కావునన్. ౧౮౯

కం. నీ వంబాయజ్ఞంబును । గావించినవాఁడ వంతకం బెను గలదే
యీ విశ్వంబున ధన్యుఁడ । వై వెలసితి బ్రతుకు సఫలమాయెను నీకున్. ౧౯౦

కం. నీకీర్తి విశదమగుచున్ । లోకంబుల కెక్కె నీకు లోపముగలదే
నాకులు గీకులు నములే । యో కులభూషణ ! నిరాకులోజ్జ్వలకరణా ! ౧౯౧

కం. అని నారదుండు సెప్పిన । విని పరమానందమంది పృథివీశుఁడు దా
మునివరు పదాంబుజములకుఁ । బ్రణతుండై యమితమైన భక్తిస్ఫురణన్. ౧౯౨

ఆ.వె. నీ యనుగ్రహమున నేఁ గృతార్థుఁడనైతి । నీకు మారుమేలు నే నొనర్పఁ
దగినవాఁడఁగాను దండంబు పెట్టెదఁ । గనికరమునఁ బ్రోవు మునివరేణ్య ! ౧౯౩

వ. అవి పల్కిన పల్కుల కలరి నారదుండు పృథివీవల్లభునకు దీవన లిచ్చి చనియె. నంత బాదరాయణుండు జనమేజయుం జూచి, ౧౯౪

క. దేవీభాగవత పఠన । మేవేళను మరువఁబోకుమీ యజ్ఞంబున్
గావింపుచు నుండుము స । ద్భావంబున నీకు మోక్షపదవి లభించున్. ౧౯౫

క. ఈ దేవీభాగవతము । వేదంబులసారమనుచు వివిధగతుల న
య్యాదిప్రకృతియ సెప్పె నిఁ । కేదియు సరిగాదు దీని కిమ్మహిలోనన్. ౧౯౬

వ. అని చెప్పిన, జనమేజయుచే వందనంబుఁగొని యాశీర్వదించి వ్యాసుండు యథాస్థానంబునకుం జనియె. ధౌమ్యాదిమునులు తమ తమ నెలవులకుం జనిరి. ధరణీవల్లభుండు సంతుష్టమానసుండై రాజ్యంబు సేయుచుండె నని చెప్పి సూతుండు, మహామునులారా! ౧౯౭

## —: దేవీ భాగవత మహిమ :—

వ. ఈ దేవీభాగవతంబు వేదసిద్ధాంతబోధకంబని యర్ధశ్లోకాత్మకంబుగా వటపత్రశాయి యగు శ్రీమహావిష్ణునకు జగదంబ యుపదేశించె. నిది శతకోటివిస్తరంబుగా బ్రహ్మచేఁ దొల్లి చేయంబడియెఁ. నందు సారంబు గొని యష్టాదశసహస్ర సంఖ్యాకంబుగను, ద్వాదశ స్కంధసంయుతంబుగను వ్యాసుండు శుకునకుం జెప్పె. నిది యిప్పటికిం బహువిస్తీర్ణంబై బ్రహ్మలోకంబున నున్నయది. పాపనాశనహేతుకంబు. దీనివంటిది మఱియొండు లేదు. పఠనమాత్రంబున నశ్వమేధఫలంబు నిచ్చు. మఱియు. ౧౯౮

సీ. పౌరాణికునిఁ బిల్చి వస్త్రభూషల నిచ్చి వ్యాసమహర్షిగా వానిఁ దలఁచి
పూజలు గావించి పొలుపుగా నీ భాగవత మాలకింపంగవలయు మున్న
లిఖియించియేనియు లిఖియింపఁగాఁజేసి యేనియు భక్తినిఁ బూని యొక్క
ప్రౌష్ఠపదిని వచ్చు పౌర్ణమియందును బంగారుసింగంపుఁ బ్రతిమతోడఁ
బాడిమొదవుతోడఁ బరగ దక్షిణతోడఁ బౌరాణికునకు ని బ్భాగవతము

తే.గీ. పొనరఁ దుభ్యం దదామి యంచును నొసంగ । వలయు నధ్యాయసంఖ్యను బ్రాహ్మణుల
సువాసినులఁ గన్నియల మఱి వటువులను వి । శేషదానాదితృప్తుల జేయవలయు. ౧౯౯

వ. ఈ పురాణదానంబు భూదానతుల్యంబై మణిద్వీపవాసంబు గల్గించు. నిత్యంబు నిది విను వారికి దుర్లభంబు లేదు. అపుత్రుండు సపుత్రుండగు, నిర్ధనుండు సధనుండగు, నెవ్వని గేహంబున నీ పుస్తకంబు పూజింపంబడు వాని యిల్లు లక్ష్మీసరస్వతులకు నిలయం బగు. శాకినీ ఢాకినీ పిశాచ రాక్షసాదులు కన్నెత్తి చూడవు. మండలపఠనంబున జ్వరం బడంగు. శతావృత్తిపఠనంబున క్షయరోగాదు లడంగు. అనుదినంబు నొక యధ్యాయంబు

పఠించువారికి జ్ఞానంబు గలుగు. శకునంబు లీక్షింప మేలుకీళ్ళు దెలియు. శైవ, వైష్ణవ, గాణాపత్య, సౌరాదు లెల్లరు దీనిం బఠింప నర్హులు. స్త్రీ శూద్రులు తప్పక విన నర్హులు. ఇది వేదసారము. అని సూతుండు సెప్పిన విని యెల్లమునులు పరమానందభరితులై వందనంబు లాచరించిరి.

మాలిని. ఇతి స మునివరాణా మగ్రత శ్శ్రావయిత్వా
సకలనిగమగుహ్యాం దౌర్గ్య మేతత్పురాణమ్
నత మథ మునిసంఘం వర్ధయిత్వాశిషాంబా
వరణకమలభృంగో నిర్గగా మాథ సూతః. ౨౦౧

—: కృతిపతిసంబోధనము :—

శా. ఉద్యద్ద్యోతతటినీతటప్రరుహకల్పోధ్యాన సందేహ సం
పాద్యాత్మీయ జటాచ్ఛటాప్రవిలస ద్బాలేందు రేఖాలతాం
త ద్యుత్యాద్భుత పర్వతేంద్రతనయా ధమ్మిల్ల భృంగీవిలా
సాద్యత్యద్భుత సుందరాకృతిధరా । యల్లూరి సోమేశ్వరా । ౨౦౨

గద్య. ఇది శ్రీమదిష్టకామేశ్వరీపాదారవిందమకరందతుందిలమానసేందిందిర, దాసువంశపయః పారావారరాకాసుధాకర, కామాంబాకన్నయమంత్రీంద్రకుమార, పవిత్ర హరితగోత్రాలంకార, కృష్ణామండల మండనాయమానాల్లూరగ్రహార పూర్వార్జిత ధరావిరాజమాన, శ్రీవీర ప్రతాప కోదండహంవీర రామచంద్రభూమీశ్వరదత్త గోదావరీమండలస్థిత సీతారామపురార్ధ భాగ పరిపాలనాధీన, పూర్వోక్తోభయమండల న్యాయసభావాదక నియోగభారవ్యవహార, శ్రీవేంకటేశ్వరవరప్రసాదసంభూతకవిత్వవిద్యావిశేష, బాల్యాదిరచిత త్రింశత్ప్రత్యేక గ్రంథమతిసార, విబుధజనకరుణాసంపాదితోభయభాషాపరిచితిప్రచారనిత్య, శ్రీరామామాత్య ప్రణీతం బగు శ్రీదేవీభాగవతం బను మహాపురాణంబునందు ద్వాదస్కంధము.

కం. తగు భూకరగజశశిశక । మగునట్టి వికారి మకర మాదిగఁ గొని చే
యఁగ శార్వరి మిధునంబున । ముగిసెను శ్రీభాగవతము బుధసమ్మతమై.

సర్వము సంపూర్ణము.